8013/14



సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక



[సంపాదకుఁడు, ప్రకాశకుఁడు: ఆంధ్ర శేషగిరిరావు బి. ఏ.

సంపుటము : ౧. — జూన్, ౧౯33. — సంచిక : ౨.

ఆంధ్రభూమి ముద్రణాలయము—వేపేరి, మదరాసు.

ఆంధ్రభూమి.

సచిత్రాంధ్ర మాసపత్రిక.

ప్రతిమాసమున ౨౫-వ తేదిని ప్రచురింపబడును.

ఆశయములు.

సమగ్రమైన ఆంధ్రజాతీయైక్యమును పెంపొందించుటయు; ఆంధ్రకళ, ఆంధ్ర సాహిత్యము వీని విశేషాభ్యుదయమునకు పాటుపడుటయు 'ఆంధ్రభూమి' ప్రధానసంకల్పము. సర్వతోముఖమగు ఆధునికవిజ్ఞానమును, అర్వాచీననాగరికతను ప్రస్తరించు వ్యాసములు ఇందు ప్రముఖస్థానము నలంకరించును. ఆంధ్రుల ఆర్థికసాంఘికాద్యభివృద్ధులను పెంపొందించు ప్రబోధకవ్యాసములకును, ఆంధ్రక్షేమమునకైన సర్వవిషయములకును ఈ పత్రికయందు ప్రతిమాసము కొన్ని పుటలు ప్రత్యేకింపబడును.

భీమావ్యాపారమును గురించిన వ్యాసములు ఈనూతనాంధ్రమాసపత్రికయందొక విశేషాంశము. భారతరమణుల ఔన్నత్యమునకైన ఉద్యమాభివృద్ధికి సముచిత సరణిని కృషిశిల్పి మహిళల జీవితసమస్యలకు సంబంధించిన విషయములకు ప్రత్యేకవివరణ మిచ్చుట ఈపత్రికయొక్క ఆశయములలో నొకటి. కలసపోయిన ఆంధ్రుల స్థితిగతులనుగూర్చి రాష్ట్రమునందలి ఆంధ్రులకు వివరించుటయందును, భాషాప్రచారమునకు మూలభూతములైన గ్రంథాలయసంబంధమగు విషయములను క్రోడీకరించుట యందును, దేశాభ్యుదయమునకైన జమీందారుల విశేషకృషిని కీర్తించుట యందును 'ఆంధ్రభూమి' శ్రద్ధధానదైయుండును.

ఇట్టి విధములగు విశేషాశయములతో వెలువడుచున్న 'ఆంధ్రభూమి' ఆంధ్ర మహాజనుల ఆదరప్రోత్సాహములకు పాత్రమగుగాక!

చందా వివరము.

సంవత్సరమునకు	...	...	...	రు. ౩-౦-౦.
అర్ధసంవత్సరమునకు	...	...	...	రు. ౧-౮-౦.
నాలుగు మాసములకు	...	...	...	రు. ౧-౦-౦.
విడిసంచిక	...	...	...	రు. ౦-౪-౦.

9

6013/14

358/13

ఆంధ్రసాహిత్య పరిషత్తు
కాకినాడ
TELUGU ACADEMY, COCANADA

2437

1-6013/74

ఆంధ్ర సాహిత్య పరిషత్తు
TELUGU ACADEMY, COCANADA

విషయసూచిక



పి. కోదండరాంపిళ్లై

(శేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లైవారి కుమారులు)
1854-వ సంవత్సరమున స్థాపితము.
ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు
(పి. యస్. పొన్నుసామిపిళ్లై భవనములు)

మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మికమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39 అండ్ 44, ఎస్ప్లనేడ్ వెస్టు; మదరాసు.

డాక్టరు
"లిండాల్సు" టూత్-పేస్టు.



పండ్లను శుభ్రపఱచి
నోటిదుర్వాసనను తొలగించును.

వెల రు. 0—8—0.

సోల్ స్టాకిస్టులు:
జేమ్సు ఫెర్ ఫ్యార్మసీ కంపెనీ
35—37 తంబుచెట్టి వీథి, మదరాసు.

వ్యాపారస్థులకు ప్రత్యేకధరలు.



నిద్రాహీనత

మనుజులకు నిద్రాహీనత యనునది శరీరములయందు పటుత్వము తగ్గుటచేతను, దేహ మనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజులకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్ణి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలు పడి బలము విస్మృతమవగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను సంపాదించుట కేర్పడిన అనేక భారతీయ ఓషధులు చేరియుండిన కారణమున మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనము వల్లను దౌర్బల్యహేతుకము లగు సమస్తజాడ్యములను అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు వయోభేదము లేక సర్వకాలములయందు సేవింప తగినది శ్రేష్ఠ బలవర్ధకౌషధము.

జీవామృతము

(పూర్ణారోగ్యప్రదాయిని)

పెద్దసీసా రు. 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.

ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

ఆయుర్వేదాశ్రమము.

151, గోవిందప్పనాయకవీథి, తపాలుపెట్టె 287,
మదరాసు.

1-3
6013/74

విషయసూచిక

త్వరపడుడు. —: ఈశ్రావణమాసమున మిక్కిలి తగ్గింపువెలకు :— త్వరపడుడు.

కొండకోలఁకు-వికసితోత్పల-శీర్షక-కవికృతములు. [గీతికలు-వచనము-పద్యములు-ప్రహసనము]

పుస్తకము	అసలుధర	తగ్గింపుధర
1. జనపదములు	0-4-0	0-1-0
2 మాతృదేశసంకీర్తనము	0-4-0	0-1-0
3. కలరుతము	0-4-0	0-1-0
4. జంటలు	1-0-0	0-8-0
5. ఆగడపులు	0-8-0	0-3-0
6. చిట్టికైత	0-6-0	0-2-0
7. చదువులదుత్త	0-4-0	0-1-0
8. కోసేరు.	0-4-0	0-1-0
	రూ. 3-2-0	రూ. 1-2-0

ఎనిమిది పొత్తము లొకపరి తీసికొన్న వెల రూ. 1.0.0

[రూ. 1-0-0 మొత్తమువెల ముత్తరవుతో మనిఆర్డరు ముందుగచేసినవారు బుక్కుపోస్టు తపాల ఖర్చులు వేఱుగ భరింపనక్కఱలేదు.]

వలసినచో కృతికర్తలగు

మ-రా-శ్రీ. కవికొండల వేంకటరావుగారు

ఇన్నీసుపేట, రాజమండ్రి. అని వ్రాయనగు.

JUST ARRIVED! JUST ARRIVED!!

Excellently Designed "RATNA" Pens

14 CT. GOLD NIB. IRRIDIUM TIPPED.



Beautifully Set Clip

and Screw Capped

Guaranteed for Efficiency

and Durability

Thousands of College

Students like it

Officials of all types love it

Why not inspect and

Possess one for Yourself

SHOW ROOM:

K. RATNA & Co.,

(Studeuts' Favourite Home)

305, ESPLANADE, - MADRAS



1-4

పోటీబహుమానము : ఈసంచికలో పుట ౨౦౧ చూడుడు.

విషయసూచిక

గుండా సుబ్బారాయుడు

హార్డువేరు మర్చంటు బజారువీధి. డోరు, నెం 11-49 బెజవాడ.

అన్నిరకముల ఇనుపసామానులు, సీమసామానులు, రంగులు, వార్నీషులు, అవిశెనూనెలు: మరమేకులరకాలు, కవిళ్లరకాలు, ఇండ్లకు పనికివచ్చుబందులు వగైరాలు, బీరువాలకు పనికివచ్చు తాళపురేకులు, తలుపులకు పీటలకు పనికివచ్చు యిత్తడిపువ్వులరకాలు, యింజనులకు పనికివచ్చు ఆకురాళ్లు, నట్లు, వాచర్లు, రివెట్లు, ఇనుపరేకులు, యెమిరిపేపర్లు, మరియు అన్నిరకాల ఫిట్ వర్కుసామానులు మావద్ద దొరకును. ధరలకు వ్రాసుకొనుడు. ఆర్డర్లు వి. పి. ద్వారాపంపబడును. మంచిసరుకు, ధరలుసరసము.

ప్రకటనలు

[ఆంధ్రభూమి యందు ప్రకటించుటకు ఉంచబడిన రేట్లవివరము: ఒకేతూరికి పూర్తిపుటకు: రు. ౧౨-౦-౦; అరపుట : రు. ౭-౦-౦; పావుపుటకు: రు. ౪-౦-౦. ఈప్రకటన చార్జీలు ముందుగా ఈయనక్కఱలేదు. వోచరు కాపీతో పంపబడు బిల్లు అందుకొనిన అనంతరము పంపనగును. అర్థసంవత్సరము అంతకుపై బడిన కాలములకు కంట్రాక్టు తీసికొనినయెడల నూటికిపంట్రెండున్నరవంతున కమీషను ఈయబడును. ప్రత్యేకస్థలముల రేట్లు వలయువారు 'ఆంధ్రభూమి' కార్యాలయమునకు వ్రాయునది.]

నెం.	ప్రకటించినవారు.	ప్రకటించినవస్తువు.	పుట.
1.	దిడక్కన్ ఇన్సూర్యెన్సుకంపెనీవారు	డక్కన్ ఇన్సూర్యెన్సు	కవరుపుట 2
2.	కేమ్ఫెర్ ఫ్యాక్టరీకంపెనీవారు	"లిండాల్సు" టూత్ పేస్టు	1
3.	ఆయుర్వేదాశ్రమము	జీవామృతము	1
4.	ఆర్యరసాయనశాల	సువర్ణసుందరరసము, అభ్రకభస్మము	2
5.	లాల్జి గోధుఅండ్కంపెని	తేలు కృష్ణమార్కు, ఎల్జిమార్కు—ఇంగువ	3
6.	లక్ష్మీరతన్సు లిమిటెడ్	శానిటరీ ఇన్స్టలేషన్సు	3
7.	శ్రీ యఱ్ఱమిల్లి మంగయ్యపంతులుగారు	ఆంధ్ర ఇన్సూరెన్సు	4
8.	శ్రీగుండా సుబ్బారాయుడుగారు	హార్డువేరు సామగ్రి	5
9.	రత్నాఅండుకో	రత్నా ఫవుంటెన్ పెన్	7
10.	వెల్కమ్ స్టూడియో	ఫొటోగ్రాఫి	8
11.	కె. నాథముని అండ్సన్సు	రోల్డుగోల్డు, మేలైన ఆర్టిస్టిక్ బంగారునగలు.	8
12.	పి. కోదండరాం పిళ్లే	ఉత్తమతరగతి కర్రసామగ్రులు	9
13.	ది క్లిక్ అండుకో	లైన్, హాఫ్టోన్, పోస్టరు బ్లాకులు	9
14.	వేంకటరామ్ అండ్కో	పుస్తకములు	10
15.	యస్. సి. అప్పాసామిచెట్టి అండుకో	ట్రైకలర్ ప్రోసెస్ బ్లాకులు	10
16.	రాషిడ్ కేంపెడ్సన్సు అండ్కో	టి. టి. మిస్కి—ఇంగువ	11
17.	శ్రీయం. కె. శ్రీనివాసన్గారు	దియునైటెడ్ ఇండియాలైఫ్ అస్యూరెన్సు	11
18.	నరసింహా అండు కో	స్టాండర్డుపిరాలు	11
19.	శ్రీదత్తాత్రేయ అజీర్ణమాత్రల ఫార్మసీ	దత్తాత్రేయఅజీర్ణమాత్రలు	12
20.	గంధర్వఫార్మసీ.	గంధర్వకళ	12
21.	భారతభైషజ్యనిలయము	శిశుపోషణి	12
22.	భవానీ ఫార్మసీ	స్వర్ణమాలిని	12
23.	అమృతాంజనము డిపో	అమృతాంజనము	కవరుపుట 3
24.	డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారు	లివర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్	కవరుపుట 4

2-1

ఈ సంచికలో పోటీబహుమానము కలదు.

విషయసూచిక

గతమాసపు పోటీబహుమానములో జయముపొందినవారు.

1. మొదటి బహుమానమును బడసినవారు: శ్రీమతి ప్రభల మీనాక్షమ్మగారు,
ఘంటశాల, దివితాలూకా, కృష్ణాజిల్లా.

2. రెండవ బహుమానమును బడసినవారు: శ్రీయుత బి. సుబ్బయ్యగారు,
టీచరు బోర్డు హైస్కూలు, పుంగనూరు.

హిందూ దేశమునందంతట ప్రజామోదమునందినవి.

స్టాండర్డు సిరాలు



ఆంధ్ర దేశమునందు
అన్నిపట్టణములయందు
ఏజెంట్లు కావలయును.
వివరములకు ఈ ఎడ్రసుకు వ్రాయుడు:
నరసింహం అండు కో., లిమిటెడ్.
పోస్టుబాక్సు : 24, మద్రాసు.

ది యునైటెడ్ ఇండియా లైఫ్ అష్యూరెన్సు కంపెని

హెడ్ ఆఫీసు : మదరాసు. (లిమిటెడ్) 1906 లో స్థాపింపబడినది

ట్రస్టీ : మద్రాసుయొక్క అఫీషియల్ ట్రస్టీ.

అమలునందున్న పాలసీలు	రెండుకోట్ల రూపాయలను	మించినవి.
మొత్తపుఆస్తులు	ఏబదియైదులక్షల రూపాయలను	మించినవి.
సంవత్సరాదాయము	పండ్రెండులక్షల రూపాయలను	మించినది.

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ; క్లెయిముల సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పొదుపు; మంచిబోనస్సుతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనత కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ ఆఫీసునకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియా లైఫ్ అష్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి, మద్రాసు, 5 జూలై 1908

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగ డైరెక్టరు.

ఆంధ్రకీర్తిగ్రంథమాల: ౧:

ఆంధ్ర రమణీమణులు

(మొదటి భాగము.)

'ఆంధ్రభూమి' సంపాదకులు ఆండ్ర శేషగిరిరావుగారు (బి.యె.) వ్రాసినది. ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, రాగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రత్నమ్మ అను తొమ్మండుగురు తెనుగు తెఱవల జీవితములు తేటతెనుగున బాలికలకును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. శ్రీవిద్యాభిమాను లాదరింపదగిన గ్రంథము గ్లేజుకాగితములు, క్రౌనుసైజు. 96 పుటలు. చక్కని అచ్చు. ప్రతి ఒక్కంటికి 0—9—0 అణాలు.

చిరునామా:—ఆంధ్రభూమి కార్యాలయం: వేపేరి, మదరాసు.

ఈ సంచికలో పోటీబహుమానము కలదు.

విషయసూచిక

ఆంధ్రభూమి ప్రకటనలు

[రేట్లు వలయువారు 'ఆంధ్రభూమి' కార్యాలయమునకు వ్రాయునది.]



పి. కోదండరాంపిళ్లే

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లేవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీభవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ప్లనేడ్ వెస్టు: బెత్తాలంగడి వీధి, మద్రాసు.

2-3

విషయసూచిక

ఈ సంచికయందు ప్రచురింపబడిన 'కొమాళ్ళకన్న తల్లి! ఊపవె ఉయ్యాల.' అను చిత్రము శ్రీ శ్రీపాద దుర్గారావుగారు రచియించినది; 'నాగస్వరసాధన' అను చిత్రము శ్రీ పి.వి. రామారావుగారు చిత్రించినది.



పి. కోదండరాంపిళ్లే

(శేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీభవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ప్లనేడ్ వెస్టు: శెత్తాలంగడి వీధి. మద్రాసు.

* *

సిద్ధార్థుని విరక్తచిత్తతను బాపుటకై ఆతనితండ్రి శుద్ధోదనుడు చేసిన ప్రయత్నములకు లెక్కలేదు. వైరాగ్యవిముఖతకు వనితాబంధమును మించిన సాధనము మఱియొకటి కానరాదని ఆరాజచంద్రుడు నిశ్చయించి ఒకనాటిరాత్రి సిద్ధార్థుడు నాట్యాంగనలచే పరివేష్టితుడగునట్లు గావించెను.


శా. ఆసిద్ధార్థుఁడు తండ్రియానతిని శాంతాకార మేహార్మ్య మం
దా సింహాసనమందు సౌరలర నధ్యాసీనుఁడై యాడు క
న్యాసంఘంబులవంకఁ గన్గొనకయే.........

—తిరుపతివేంకటకవులు.

యుండెను. రాజాజ్ఞనుబట్టి ఆనాట్యాంగనలు పాడిరి, ఆడిరి. కాని రాకుమారుని చిత్రము వజ్రపంజరనిభమై యుండెను. రాత్రి అతిక్రమింపగా నిద్రాదేవతవారిని వశముగొనెను. ఆస్థితియందు సిద్ధార్థుడు కనులువిప్పి చూచునుగదా ఎక్కడివారక్కడ చెదరిన కురులతో, చెదరిన మడుగులతో, తొలగిన సౌందర్యముతో. తెఱచిననోళ్లతో అడ్డదిడ్డముగ పరుండియుండిరి. జాగ్రదవస్థయందుండి ఆనాట్యాంగనలు హావభావవిలాసములకు వశముగాకుండిన సిద్ధార్థుడు ఈవికృతరూపములయందు వారినిగాంచి మఱింత విరక్తచిత్తుడయ్యెను. తనకుమారుని చిత్తమును ప్రపంచవృత్తమునకు ఆయత్తము చేయదలచిన శుద్ధోదనుని ప్రయత్నము కుంపటియందు తామర మొలపించు యత్నము వంటిదయ్యెను.

* *
*

విషయసూచిక



పి. కోదండరాంపిళ్లే

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయమునుగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. సమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ప్లనేడ్ వెస్టు; బెత్తాలంగడివీధి, మద్రాసు.

బై ఇండియన్

మీ జీవితమును భీమా చేయదలచినచో

సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్స్యూరెన్సు సొసైటీ లిమిటెడ్

నందు భీమా చేయుడు.

సహకార పద్ధతులపై నడుపబడుచున్న ఆధునిక భీమాసంస్థ.

దక్షిణహిందూదేశమున సహకారభీమాసంస్థ ఇదియొక్కటియే.

భీమా చేయగోరు అన్నితరగతుల జనులకు ఆదర్శప్రాయముగా తీసుకొనదగిన సంస్థ

యువకులకు	...	...	పొదుపు
వర్తకులకు	...	...	రక్షణ
వితంతువులకు	...	...	ఉపాధి
గృహస్థులకు	...	...	సౌఖ్యము

తక్కువ ప్రీమియము రేట్లు! తక్కువ ఖర్చులు!

గొప్ప భావిలాభములు!

స్త్రీల జీవితములును భీమా చేయబడును.

రు. 100 నుండి రు. 5000 వరకును పోలసీలుగలవు. 83 బ్రాంచీలు స్థాపింపబడి సహకారసంఘములతో సంబంధము కలిగియున్నవి.

—: డైరక్టరులు :—

మ-రా-రా-శ్రీ, వి. రామదాసుపంతులుగారు, బి.ఏ., బి.ఎల్., అధ్యక్షులు.

,, రావుబహదూరు టి. ఏ. రామలింగంచెట్టియారుగారు, బి.ఏ, బి.ఎల్., (యం.ఎల్.సి.)

,, యస్. సత్యనారాయణగారు.

,, ఆర్. బి. షా గారు బి.కామ్., జి.డి.యె.ఎ.యస్.ఐ.ఏ., ఇన్ కార్పొరేటెడ్ ఎక్కౌంటెంటు, (లండన్)

,, వి వియ్యన్నగారు, అడ్వొకేట్.

,, సి. సుబ్బారావుగారు, బి.ఏ., యల్.టి; కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్, లిమిటెడ్, విశాఖపట్టణము.

,, వి. నాడిముత్తుపిళ్లే అవర్ ఘల్, యం.యల్.సి, తంజావూరు జిల్లాబోర్డు అధ్యక్షులు.

,, ప్రొఫెసర్ యస్. కె. యజ్ఞనారాయణ అయ్యర్, ఎం.ఏ.

,, రావుబహదూరు సి. గోపాలమీనన్.

పూర్తి వివరములకు ఈ క్రింది చిరునామాకు వ్రాయుడు:

పోస్టుబాక్సు: 182.
మదరాసు.

(సం.) వి. వెంకటచలం, ఎం.ఏ, బి.యల్.
కార్యదర్శి.

2—5

విషయసూచిక



పి. కోదండరాం పిళ్లే

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)
1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాలో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ప్లనేడ్ వెస్టు: బెత్తాలంగడవీధి, మద్రాసు.

ఆంధ్రభూమి

సంక్రాంతి సంచికకు సంభావనలు

౧

ఎడతెగని ఆంధ్రసేవారతుడును నిరాడంబరమూర్తి యునగు సంపాదకుని కృషికి ఫలమనందగు నీ పత్రిక దినదినాభివృద్ధినందుచున్నది. మానవజీవితమునకు వలయు వివిధవిషయములందు జోక్యముకలిగించుకొని సమర్థింప గల పత్రికలలో నాంధ్రభూమి స్థానము సంపాదింప గలిగినది. వ్యాసములందు "గుసగుసలు" నేటి మానవ ప్రపంచమున నిండియున్న కృత్రిమజీవితరహస్యములను వెల్లడింప జాలియుండుటయేకాక కళాసౌకుమార్యమును ప్రకటింపజాలి చదువరుల హృదయముల నాకర్షించు చున్నది. "శూరఖడ్గము"నందలి యుద్రేకము చదువు వారలహృదయము నాకర్షించుటయేకాక నూత్నపరిణామమును దేజాలియున్నది. "సర్ థామస్ లిప్టన్" టీ పశ్చ్యాల నాంధ్రులు విరివిగవాడుచున్నను ఆ కోటీశ్వరునిచరిత్రము చాలమంది యెరుగరు. నిరుద్యోగపిశాచ బాధాపీడితులై నిస్పృహనందుచున్న మన యువకుల కీచరిత్రము ధైర్యము నొసంగజాలదా? "గళ్ళచీర" కథుచుతనపు కారపువలపులతో యుందనమును మృదువుగ వెల్లడింపజాలియు నొక చక్కని ఆదర్శము నుద్బోధించుట సరసముగనున్నది. "ఈ సంక్రాంతికి" పద్యాలనడకయు భావాల సొగసులు సొంపునింపుటచే సంచిక నాంధ్రులు ఆదరించి తగు ప్రోత్సాహము నొసంగుదురని నమ్ముచున్నాము.

—సరస్వతి.

౨

నిన్న గాక, మొన్న పుట్టినా అప్పుడే, ఆంధ్రులచే ఔననిపించుకొంది ఆంధ్రవారి ఆంధ్రభూమి. ఇతర విధములైన యెటువంటిచోటును లేకపోయినా, మాన ముద్రవల్లకద్బ్యాతి లేకపోయినా ధైర్యంగా సాహసంగా ప్రారంభించారు పత్రికను. తమధైర్యం దుడుకుతనం కాదనీ, తమ సాహసం దుస్సాహసం కాదనీ నిరూపించారు లోకానికి. అదీ ఆంధ్రవారి ప్రతిభ అంటే! రసవంతమైన కథలతో, వాటికితగిన చిత్రాలతో, జ్ఞానదాయకమైన వ్యాసాలతో, వాటిమధ్య "సుభాషితాల"తో ఆంధ్రభూమిసంచిక యేదైనా కన్నులపండుగా—ముద్దులమువ్వగా—అలరారుతుంది. ఈ జనవరి (సంక్రాంతి) సంచిక మరింతశోభగావుంది. ఆంధ్రదేశపు అభిమానానికి ఆదరానికీ తగివుంది ఆంధ్రభూమి.

—చిత్రగుప్త.

3

పత్రిక యెప్పటివలెనే పీలయినన్నిరకాలవిషయములతో నిండియున్నది. తేయాకు దేవుడైన లిప్టన్ జీవిత చరిత్ర అమూలాగ్రముగా ప్రకటింపబడినది. ఇతడు మొదట బీదవాడై 'నిరపాయకరమగు మోసములో, నేరముచేసి భాగ్యవంతుడైనాడు. నేరగాండ్రకు ఇతడు ఆదర్శకపురుషుడు. వివిధపత్రికలలోని విషయముల నేరి ఒకచోట చేర్చి అందిచ్చుటచే నీపత్రిక ప్రశంసార్హము.

—విశ్వకర.

౪

శ్రీయుత క్రొవ్విడి లింగరాజుగారిచే రచింపబడిన శూరఖడ్గము, గోపాలరావుగారిచే రచింపబడిన తెలుగు సీమ, చిలుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదుగారిచే వ్రాయబడిన గుసగుసలు, ఇంకా మొదలగు వ్యాసరాజములే గాక పోతానిజయ్యరు 'గ్రామఫోను' మొదలగునవి చదివి తీరవలయును. పత్రిక సర్వాంగసుందరముగ ముద్రింపబడినది."

—ఐరావతి.

విషయసూచిక



పి. కోదండరాంపిళ్లే

(శేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)
1854-వ సంవత్సరమున స్థాపితము.
ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు
(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ప్లనేడ్ వెస్టు; బత్తాలంగడివీధి, మద్రాసు.



శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవసరములేదు. మీ గ్రామము పచారి షాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0-4-0 ధరకేదొరకును.

గంధర్వ.కళ

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు దివ్యమైన లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

సౌను రు. 3—0—0.

గంధర్వఫార్మసీ, రాజమండ్రి.

శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను పోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిపొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్షీరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సంవత్సరముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందులో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కు పిల్సు), హిమసాగరతైలము (కేశింగ్ అండ్ హైరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

కలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్ స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు.

భారతవైద్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను.

స్వర్ణమాలిని

ఇయ్యది క్షయరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను పోగొట్టి మిక్కిలి బలము నిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమునకో జాలమందు. రు 4-0-0.

బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు బలము నిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.


6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసీ.

320, తంబుశెట్టి వీధి, మదరాసు.

విషయసూచిక



పి. కోదండరాంపిళ్లే

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెని.

39-41, ఎస్ప్లనేడ్ వెస్టు; చెత్తాలంగడివీధి, మద్రాసు.



శ్రీ దత్తాత్రేయ అజీర్ణ మాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవసరములేదు. మీ గ్రామము పచారి షాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0-4 0 ధరకే దొరకును.

గంధర్వకళ

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు తియ్యని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

వెల రు. 3—0—0.

గంధర్వ ఫార్మసీ, రాజమండ్రి.

శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను పోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిపొందించును. దీనిని ప్రతినిత్యము వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు ఘోరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం|| ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణజీవతి (టానిక్కు పిల్సు), హిమసాగరతైలము (కూలింగ్ అండ్ హెయిరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్ స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు.

భారతవైద్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను

స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను పోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారముకోర్సుమందు, రు 4-0-0.

బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులు వెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసీ.

320, తంబుచెట్టి వీథి, మదరాసు.



కొమర్రాజు లక్ష్మణరావు

సీ. శృంగారవంశమౌ శ్రీరంగపట్టణ
జనపదరాజంబు జన్మభూమి,
సకలవేదజ్ఞానసంపన్నసత్తముం
గలభరద్వాజుండు కులగురుండు,
కవికొండలాన్వయార్ణవపూర్ణచంద్రుండు
నరసింహ మతియశోన్నతుఁడు దండ్రి,
గాడిచర్లకులాబ్ధిగర్భముక్తాఫలం
బమలసుగుణ శేషమాంబ తల్లి,
పేరు వేంకటరావు.

సమాగమము

అప్రయత్నమ్ముగా లభ్యమైన యట్టి
తావకసమాగమమ్ము సాధ్వసమునందు
లీన మగునేని, యుద్రిక్తమానసమ్ము
శాంతి గనజాలు టెట్టు లీసమయమందు?

ఇంతకాల మసాధ్యమై యీమనోజ్ఞ
పుష్యమాసప్రభాతముపుణ్యవేళ
సంఘటిల్లిన యేకాంతసమయమందు
పలుక వేటికి? ప్రియురాల! భయము వీడి.

ఒసగితివి పెక్కుసార్లు కర్ణోత్సవముగ
నాకు పూర్వము ప్రతివచనమ్ము, లిపుడు
సిగ్గుపడుచున్నదాన వో జీవితేశ్వ
రీ! నికటభూమి నన్నన్నిరీక్షణమున!

విదితమయ్యెను భవదీయహృదయనిహిత
దివ్యవిమలానురాగసందీప్తి నాకు,
ఇపుడు కన్నెత్తి నన్ను వీక్షింప వేని
మన్ముఖవికాస మకట! యేమాడ్కి నొదవు?

అన్యు లాకస్మికమ్ముగా నరుగుదెంతు
రేమొ ప్రాణప్రియా! ఒకయింత యనుము
పెదవి కదపక, ఉన్నది ప్రేమ మనెడు
సలలితోక్తులు మత్కర్ణజాహమందు.

ఎగిరి పోవుచు నున్నవి యీయమూల్య
భంగురాల్పక్షణంబులు! పలుక వేమి
భవదసంబద్ధమానమ్ము బాధపెట్టు
బాఢముగ, జీవితేశ్వరీ! భగ్నహృదయు.

కోపము వహింపబోకు! నీకోమలాంగ
మధురసంస్పర్శవశమున మామకీన
నిష్ఠురశరీర మిపుడు పునీతమయ్యె,
కోరకితమయ్యె, నయ్యెను కుసుమితంబు.

శ్రీశివశంకర శాస్త్రి

నిట్టూర్పులు

౧

ప్రకృతిమూర్తి నా ఉపాసనమూర్తి. ప్రకృతిలోని ప్రత్యణువు పవిత్రప్రణయంతో పులకించిపోతూ ఉంటుంది. ప్రతిబాధాక్షుభితహృదయాన్ని తనశీతలమృదులాంకములో నిముడ్చుకొని ఆశాగీతాలతో సమాశ్వాసిస్తుంది. ఆప్రకృతిమూర్తి ఎవరి కారాధ్యము కాదు?



౨

వజ్రవైడూర్యవైభవంకన్న గడ్డిపఱక నగ్నసౌందర్యమే నన్నాకర్షిస్తుంది. కాని ఆ సౌందర్యఖండాన్ని ఇనుపపాదాలతో మెట్టి రాచివేస్తారు మానవులు నిరసనాసూయలతో.

౩

సహజముగా మానవహృదయం సున్నితము. ఎంతగా హృదయాన్ని కఠోరత్వంతో పాదిమివేసికొన్న అంతగా జీవితోత్క్రమణపథ సుగమం అవుతుంది.

౪

ఆశ లేనిచో నిరాశ లేదు. ప్రేమార్ద్రము కానిచో హృదయము భావనావీథీవిటంకపాళుల పై స్వైరవిహారము చేయు లేదు.

౫

కాంక్షితాశయాల శుభాశుభములలోని ఆనందమాధుర్యాలు, విషాదశోకాలుకన్న ప్రతీక్షలో పరిమళించే ఆనందమాధుర్యాలు విషాదశోకాలలోనే మధురిస్తుంది స్వర్గీయసౌఖ్యం.

౬

నీలాంబరాన్ని మిలమిలా మెరసే అనంతకోటి నక్షత్రాలలో ఒకే నక్షత్రాన్ని లక్ష్యం చెదరకుండా దృష్టించి చూడడం అలవరచుకున్నాను. ఏప్రేమమూర్తి కన్నీటికణాలో ఆచుక్కలు స్థాయీభావము వహించాయి.

హనుమప్ప నాయఁడు

వెలిసేయు లేదు నీవీర్యసంపద మస్త
కంబుపై నిడికొన్న గడ్డిమోపు;
కలిగింప లేదు సంచలనంబుఁ గుడిహస్త
మున దిగిపోయిన యినుపమేకు;
దాఁచ లే దాంధ్రరక్తము మణిబంధమున్
పరికిన కొడవలి కరకుముండ్లు;
వెనుకపెట్టగ లేదు విజయమ్ము నేనికి
వడిదండమిడినట్టి యెడమచేయి;
స్వామికార్యనిర్వహణధూర్వహుఁడవగుచుఁ
బ్రాణములనైన ధారవోయంగ సిద్ధ
పడిన నీ యాంధ్రవీర్యసంపదకు వంద
నము లొనర్తుము హనుమప్పనాయకమణి!

[illegible]

‘గద్వాల’ సంస్థానమును రెండువందల సంవత్సరములనుఁ బూర్వము ‘సోమనాద్రిభూపాలుఁడు’ అను ఆంధ్రవీరవరేణ్యుఁడు పాలించుచుండెను. గద్వాలపట్టణమునకుఁ బదిమైళ్ల దూరమున ‘ఉప్పేడు’ అను నొకయూరు కలదు. అప్పటి కోటలో నాకాలమున ‘సయ్యదుదావూదుమియ్యా’ అను మహమ్మదీయుఁడు ప్రభుత్వము చేయుచుండెను. ఇరుగుపొరుగున రాజ్యము చేయుచుండిన సోమనాద్రికిని, సయ్యదుమియ్యాకును ప్రబలవిరోధ మేర్పడెను.

తనవిరోధియగు సోమనాద్రి నోడించి యవమానింప వలెనని సయ్యదుమియ్యా తలంచెను. అందుకని అతఁడు సేనలఁ గూర్చుకొని యుద్ధయాత్రకు బయలుదేరెను. సోమనాద్రిభూపాలునకీసంగతి తెలిసెను. తోడనే యాతఁడును అపరిమితసేనాసహితుఁడై జైత్రయాత్రకు వెడలెను. ఇరువాగుల సైన్యములు ‘అరగిద్ద’ యనుచోట తారసిలెను. కండడికయ్యము జరిగెను. తురకరాజు తెలుఁగువీరుని ధాటికి ఆఁగజాలక పోయెను. అప్పుడు బ్రతుకుపై నాశపెట్టి యాతఁడు పలాయనము చిత్తగించెను. ఏనుఁగు నెక్కి సయ్యదుమియ్యా ఉప్పేడు కోటమార్గము పట్టెను. తనసమరాశ్వము నెక్కి సోమనాద్రి అతనివెన్నఁడగెను.

మెఱపుఁదీఁగవలె నింతలో సోమనాద్రిగుఱ్ఱము సయ్యదుమియ్యా ఏనుగును అతిక్రమించెను. అప్పుడా గుఱ్ఱము తనముంగలి కాళ్లు రెంటిని ఎత్తి గజము కుంభస్థలమున నుంచెను. సోమనాద్రి శత్రుని తలనెగరఁగొట్టుటకుఁ గత్తి యెత్తెను. ప్రాణభయమునఁ దురకప్రభువు గడగడలాడి సోమనాద్రికి సలాములు చేసెను. “నీకుఁ గప్పము కట్టుచు నీ సామంతరాజునై యుండెదను. నన్ను ప్రాణములతో వదలిపెట్టుము” అని సయ్యదుమియ్యా ఆఁడుదానివలె వేడ్కొనుచు సోమనాద్రిని ప్రార్థించెను. అంతమీఁద, ఉదారశీలుఁడగు గద్వాలప్రభువు మనసు కరిగెను. తోడనే యాతఁడు ఎత్తినకత్తినిదించి సయ్యదుదావూదుమియ్యాతో నిట్లు చెప్పెను: “బ్రతికితివి, పొమ్ము. నాకు నీవు కప్పము నీయనక్కఱలేదు. సామంతుఁడవుగా నుండవలసిన పనియును లేదు. నీవోడిపోయినట్లు గుఱుతుగానుండుటకుఁ గాను నీవు యుద్ధమునకుఁ గొనివచ్చిన నగారా, పచ్చజెండా, ఏనుఁగును మాత్రము నాకిమ్ము.”

ఇందువలన మానము పోయినను ప్రాణములు నిలుచును గదా యని సంతోషించి సయ్యదుమియ్యా తన నగారా, పచ్చజెండా, ఏనుఁగును సోమనాద్రికిచ్చి ఉప్పేడుకోటకుఁ జేరుకొనెను. జయలక్ష్మితోఁ బాటు సయ్యదుదావూదు ఇచ్చిన విజయచిహ్నములను గ్రహించి సోమనాద్రి గద్వాల చేరెను. అచ్చట అతఁడు నగరమధ్యమున నాకాశమంటు జయస్తంభమును కట్టించెను; తురకరాజువద్దఁ గైకొన్న పచ్చజెండా

ధానిపైఁ బెట్టించెను. అది గాలికి రెపరెప కొట్టుకొనుచు సోమనాద్రివిజయమును కీర్తించుచున్నదో యనునట్లుండెను.

పరాభవదుఃఖమున గ్రస్తుఁడైన సయ్యదుమియ్యా కొన్నిదినములవఱకు బయటికి రాకుండెను. ఒకనాఁడాతఁడు తనకోటబురుజుపైనెక్కి యక్కడికిఁ బదిమైళ్ల దూరమునయున్న గద్వాలపై దృష్టిఁ బఱపెను. ఉన్నతోన్నతమగు జయస్తంభముపై వాయుసంచలితమగుచున్న తనపచ్చజెండా అతనికిఁ గనపించెను. మానుచున్నపుండు రేగినట్లు మఱుఁపునొందుచున్న పరాభవదుఃఖము మఱల ఉజ్జ్వలితమయ్యెను. సోమనాద్రి నెట్టులైన దుంపశుద్ధిగ నాశనము చేయవలెనని అతఁడు నిశ్చయించుకొనెను.

హైదరాబాదు పట్టణమున నిజాముఅలీ అనుమహమ్మదీయుఁ డాకాలమున రాజుగా నుండెను. ఆరాజు సాయమున సోమనాద్రినిమట్టుపెట్ట సయ్యదుతలంచెను. కావున నాతఁడు హైదరాబాదునకుఁ బ్రయాణమై పోయెను. రెండుమూఁడుదినముల కాపట్టణము చేరి యాతఁడు నిజాముఅలీకిఁ దనరాక నెఱింగించెను. మహమ్మదీయుల గురుపరంపరకుఁ జెందిన సయ్యదుజాతీయుఁడగు దావూదుమియ్యా సామాన్యునివలె వచ్చుట కబ్బురపడి నిజాముఅలీ వెంటనే యతనికి దర్శన మిచ్చెను. సయ్యదు నిజాముఅలీని దర్శించిన తోడనే వంగివంగి సలాములుచేసెను; ఒంటికాలిమీఁద నిలుచుండి యిట్లుప్రార్థించెను: "గద్వాలరాజు సోమనాద్రి నాపై నెత్తివచ్చి ననోడించినాఁడు. అవమానించినాఁడు. బలాత్కరించి నానౌబతు నగారాను, బావుటాను, ఏనుగును లాగుకొన్నాఁడు. తమరెత్తివచ్చి ఆతెలుఁగురాజును బంధించి నావీరచిహ్నములను నాకిప్పించవలెను. నాప్రార్థన మీరుత్రోసిపుచ్చిన నే నిచ్చటనే పొడుచుకొని చనిపోయెదను."

సయ్యదుమియ్యా తెగువచూచి తనకిష్టము లేకపోయినను నిజాముఅలీ సోమనాద్రిపై యుద్ధసన్నద్ధుఁడయ్యెను. సేనలఁ గూర్చుకొని యాతఁడు సయ్యదుదావూదును వెంటఁబెట్టుకొని పోయి కర్నూలు సమీపమున నున్న నిడుమూరుపెట్టలపై దండువిడిసెను. అతనికి మహమ్మదీయప్రభువులెందఱో సాయమువచ్చిరి. సోమనాద్రిభూపాలుఁ డిది తెలిసికొని యపరిమితసేనాసమేతుఁడై దండయాత్రకు వెడలెను. కలుగోట్లయను ప్రదేశమున నాతఁడు దండువిడిసెను. నిడుమూరు, కలుగోట్ల గ్రామములనడుమ తుంగభద్రానది ప్రవహించుచుండెను.

ముందు తెలుఁగుసైనికులు యుద్ధమును ప్రారంభించిరి. తుంగభద్రానదినిదాఁటి వారు తురకసైన్యమును చుట్టుముట్టిరి. సాయంకాలమువఱకు సమరము జరుగుచునేయుండెను. మహమ్మదీయసైనికులు వెన్నిచ్చిరి. నిజాముఅలీ భయపడి పాఱిపోయి కర్నూలుకోటలో దూరెను. సోమనాద్రి కర్నూలువఱకు శత్రుసైన్యమును తరిమికొనిపోయెను. ఇంతలోఁ బొద్దుక్రుంకెను. అప్పుడు సోమనాద్రి సేనలను మఱలించుకొని తుంగభద్రనుదాఁటి కలుగోట్లచేరెను.

సోమనాద్రి మఱలిపోయినవార్త విని నిజాముఅలీ కర్నూలుకోటనుండి తిరిగి నిడుమూరుగుట్టలపైకి వచ్చెను. ఆప్తవర్గమును చూచి యాతఁడిట్లు పలికెను: "సోమనాద్రి మనలను సైతానువలెఁ దగులుకొన్నాఁడు. వాఁడు కాలుపెట్టిన స్థలమంతయు నాశనము చేయుచున్నాఁడు. వాఁడందఱిని చంపుచున్నాఁడు కాని వానిని చంపఁగల్గినవాఁడు మనసైన్యమునందొక్కఁడును లేకపోయినాఁడు. చంపుటమాటయటుంచి తుదకు వానిని పట్టుకొనువాఁడైనను మనలో లేకపోయినాఁడు. ఇఁక నేమిగతి?"

ఆమాటలకు సయ్యదుమియ్యా ఇట్లుచెప్పెను. "సోమనాద్రి గుఱ్ఱముమీఁదనుండినంతకాలము వానిని పట్టుకొనుట కలలోనివార్త. ఆగుఱ్ఱము బహుచిత్రమైనది. జవసత్వములలో దానికి సాటియైన గుఱ్ఱ మీప్రాంతమున మఱియొకటిలేదు. తూఁకగలిగెనది సమరరంగము నందంతటను సంచరించును. అన్నిగుఱ్ఱములును ఏనుఁగులను చూచిన భయపడును. కాని యిది వానికి భయపడదు. సరికదా వానినెత్తిమీఁదఁ దనకాళ్లుంచును. అప్పుడు సోమనాద్రి ఏనుఁగుమీఁదనున్నశత్రువును

చిత్రవధచేయును. సోమనాద్రిబలమంతయు నాగుఱ్ఱముందేయున్నది. కావున ముందు మన మాగుఱ్ఱమునుపట్టి తెప్పించితిమేని పిమ్మట సోమనాద్రిని సులభముగ నోడింపవచ్చును.''

నిజాముఅలీ కిది నచ్చెను. అందుమీఁద నాతఁడు "సోమనాద్రిసమరాశ్వమును పట్టితెచ్చువానికి గొప్ప బహుమానమిత్తును" అని పలికెను. వీరాధివీరుఁడను సోమనాద్రిసమరాశ్వమును పట్టితెచ్చుట పులిమీసములనుపట్టి లాగుటయని వీరుడుమగలుకూడ నావనికి సాహసింపలేకపోయిరి. తుదకు నిజాముఅశ్వరక్షకుఁడు తా నాగుఱ్ఱమును తెల్లవాఱకమునుపే పట్టుకొని వచ్చెదనని పలికెను. వానికి నిజాముఅలీ యనుజ్ఞ నిచ్చెను. అప్పుడు వాఁడు నడుముకట్టులో గుఱ్ఱపుఁగళ్లెమునొక దానిని రహస్యముగనుంచుకొని వెడలిపోయెను.

అక్కడ కలుగోట్లలో సోమనాద్రి యాత్రకుఁ జేయవలసిన ఏర్పాటులనుచేసెను, శత్రుప్రదేశములనుండి వచ్చుదారులందంతటను నాతఁడు చారులనుంచెను. 'మావిళ్ళపాడు' అను గ్రామమార్గమున నిజాముఅలీ అశ్వరక్షకుఁడు కాలినడకను కలుగోట్లవైపునకుఁ బోవుచుండెను. అచ్చట కావలియున్న సోమనాద్రిచారులు వానినిచూచి యెవఁడో బాటసారి పోవుచున్నాఁడనుకొని యూరకుండిరి. వాఁడు సాగిపోయెను. సగము రాత్రివేళ వాఁడు సోమనాద్రిగుఱ్ఱపుశాలను సమీపించెను. పగలంతయు యుద్ధప్రశంసలోనుండి అలసియుండినవారగుటచే నచ్చటిభటులు గాఢనిద్రయందుండిరి. సర్వమును అనుకూలమై యుండినందుకు సంతసించి నిజాముఅలీగుఱ్ఱపువాఁడు రాజాశ్వమును సమీపించెను; దానిని కట్టినతాడు విప్పి బయటకుఁ దీసికొని వచ్చెను. తనవద్దనున్న కళ్లెము నాగుఱ్ఱమునకుఁ దగిలించెను. దానిపై వాఁడు స్వారియై తనశిబిరము త్రోవఁబట్టించి 'మావిళ్లపాడు' మార్గమునఁ బోవుచుండెను.

అచ్చటి కావలివారు వానిని చూచిరి. తమశిబిరము దిక్కునుండియే వాఁడు వచ్చుచుండుటచేఁ దమభటులలోఁ నెవఁడో వేఁగునకుఁబుటకు కర్నూలునకుఁబోవుచున్నాఁడని తలఁచి వారు వానిని అటకాయింపరైరి. వాఁడు నిరభ్యంతరముగ సాగిపోయెను. తెల్లవాఱకమునుపే తాను చెప్పినచొప్పున గుఱ్ఱమును తీసికొని పోయి వాఁడు నిజాముఅలీకి సమర్పించెను. అప్పు డా తురకప్రభువునకుఁ బట్టరాని సంతసము కలిగెను. ఇంతటి దుర్ఘటకార్యముచేసిన తనఅశ్వరక్షకునకు ఆ ప్రభువు బంగారుకడియములు బహుమానముచేసెను. పిమ్మట నతఁడు అశ్వమును శాలలోఁ గట్టించెను; ఇఁక సోమనాద్రిని పట్టుకొనుట సులభమని ప్రజ్ఞలు పలికెను.

తెల్లగఁ దెల్లవాఱెను. సోమనాద్రి శిబిరమున గుఱ్ఱపురౌతులు తమతమగుఱ్ఱములకు మేతవేయించుటకు అశ్వశాలకుఁ బోయిరి. అందు సోమనాద్రిగుఱ్ఱము కనుపించలేదు. వా రాసంగతి తమప్రభువున కెఱిఁగించిరి. అప్పుడు సోమనాద్రి వివిధప్రదేశములందుఁ దానునిలిపిన చారులను పిలిచి విచారించెను. మావిళ్ళపాడుదగ్గఱనుండిన చారులు తమప్రభువుతో "రాత్రి యొకరౌతు కర్నూలువైపునకు వేగమునఁ బోవుచుండుట మేము చూచితిమి. మనశిబిరము దిక్కునుండి వచ్చుటచే వాఁడు మనవాఁడే వేఁగునకు పుటకుఁ బోవుచున్నాఁడని భావించి యూరకుంటిమి" అని చెప్పిరి.

దానితోఁ దనగుఱ్ఱము శత్రుశిబిరమునకుఁ జేరిన సంగతి సోమనాద్రి కవగతమయ్యెను. అప్పటియాతని సంతాపమునకు మేరలేకుండెను. ఆ గుఱ్ఱములేకుండుట ఆతనికిఁ గుడిచేయిపోయినట్లయ్యెను. కావున ఆనాఁటి పోరులో సోమనాద్రి చాల నిరుత్సాహముగ వర్తించెను. ఎట్లో సాయంసమయమువఱకు యుద్ధముచేసి యతఁడు తనభటులను మఱలించుకొని తుంగభద్రను దాఁటి కలుగోట్లకుఁ జేరెను.

అప్పుడు సోమనాద్రి తనసహాయనాయకుల నొక్కచోఁ జేర్చి "తురకల కన్నుగప్పి యెవరైన నాగుఱ్ఱమును తీసికొనిరాఁగలరా?" అని ప్రశ్నించెను. సింహమున్న గుహలోఁ బ్రవేశించినట్లు యుద్ధప్రశంసలో మునిఁగియున్న శత్రుశిబిరములోఁ జొచ్చి

ఆగుర్రమును విడిపించుకొనివచ్చుట కందెవ్వరును సాహసింపలేకపోయిరి. రాజభక్తుఁడగు హనుమప్పనాయఁడు అను బోయవీరుఁ డప్పుడు తా నాగుర్రమును తెత్తునని చెప్పెను. సోమశాస్త్రి యనుజ్ఞనిచ్చెను. "తెల్లవారులోన ఈకేవసఁడు గుర్రమును తేఁగలిగినా సరియే. లేనిచో నిదియే వాఁడుచేయు తుది నమస్కారము" అని చెప్పి యాసందెచీఁకటివేళ హనుమప్పనాయఁడు బయలుదేరిపోయెను.

చేతిలోఁ గొడవలి, నెత్తిమీఁదఁ జొప్పమోపు పెట్టుకొని యామసకచీఁకటివేళ హనుమప్పనాయఁడు నిజాము దూరమిట్టలపైనున్న నిజాముడేరాలను సమీపించెను. ఒకతురకసిపాయి నాయనిచూచి "ఒరే! ఆమోపు ఎంత?" అని యడిగెను. "అయిదురూపాయిలు. గుడ్డిగవ్వతక్కువైన ఈయను." అని హనుమప్ప బదులు పలికెను. "అరె! అర్ధరూపాయకిచ్చే చొప్పమోపు అయిదురూపాయిలా? ఎవరికిఁ గావలెను?" అనుచు నాసిపాయి తనపనిమీఁదఁ బోయెను.

హనుమప్ప ముందు కడుగులు వైచెను. గుర్రపుశాల పదియడుగుల దూరముననుండెను. అప్పుడు మఱియొక మహమ్మదీయసైనికుఁడు ఆదారిని పోవుచుఁ జొప్ప మోపు ఖరీదు విచారించెను. హనుమప్ప మరల నయిదు రూపాయిలనెను. ఆసిపాయి దానికి వికటముగ నవ్వి "ఒరే! ఎక్కడలేనిఖరీదు చెప్పుచున్నావేమిరా?" అనెను. దానికి హనుమప్ప "సిపాయిగారూ! తమసేన లివ్వట దిగినప్పటినుండియుఁ బశువులపాలి కెక్కడలేని గిరాకీ తగిలినది." అని బదులు చెప్పెను. తప్పతాఁగి యున్న ఆసిపాయి మఱిమాటాడక ఇచ్చవచ్చినచోటికిఁ బోయెను.

హనుమప్పనాయఁడు గుర్రపుశాలను సమీపించెను. అతనికన్నులు గుర్రములమీఁదనే యుండెను. పరిశీలించి చూచి యతఁ డాచీఁకటిలోఁ గట్టమునమీఁద సోమ శాస్త్రిగుర్రమును కనుఁగొనెను. అప్పు డాతఁడు దాని చెంతకుఁబోయెను. ఆగుర్ర మదియమునుండియు గడ్డి ముట్టలేదు; నీళ్లు త్రాగలేదు. క్రొత్త మొగములు, క్రొత్త పదేశము. అగుటచే దానికి మేత, నీళ్ళు రుచింపలేదు. స్వస్థానమును గద్వాలమండివచ్చిన హనుమప్పను మాలు వేమఱువున్నను తెలిసిగల ఆగుర్రము సకిలింపఁబట్టెను. అప్పుడు దానికి వింతవానివలెనుండు తనవాఁడొకఁడు కనిపించినందులకుఁ జెట్టరాని సంతోషము కలిగెను. తనసూచకముగ నది సకిలించెను. అచ్చటనున్న భటులు హనుమప్పనెత్తిమీఁది చొప్పమోపును చూచిరి; గుర్రము సకిలించుట వినిరి.

అంతట భటులలో నొకఁడు మిగిలినవారితో "ఒరే! ఈ గుర్రము రెండుదినములలో దంటుపుల్లలు అని మెరిగినది. అగుటచేతనే చొప్పను చూచి సకిలించుచున్నది" అని చెప్పెను. మిగిలినభటు లది నిజమని చొప్ప ఖరీదుఅడిగిరి. ఇంతవఱకు హనుమప్పనాయఁడా చొప్ప మోపుకు పైద్ధ్యాటెల చెప్పుచుండెను. కాని యిప్పు డొకరూపాయియని చెప్పెను. ఆమూల్యమునకే బడి సిపాయిలు మోపుదింపించిరి. అచ్చటనున్న యొక తురకవానితో "దివాణములోఁ జెప్పి వీనికి కిరీదు ఇప్పింపుము" అని యాజ్ఞాపించి యాభటులు వెడలి పోయిరి. కొంతసేపటికి తురకవాఁడువచ్చి నాయనికి మూల్య మిచ్చి తనదారినిపోయెను.

చొప్పవిక్రయదారుఁడగు హనుమప్పనాయఁడు తనడబ్బులు చేతిలోఁబడినను అచ్చటినుండి కదలిపోలేదు; సోమశాస్త్రి గుర్రముదగ్గఱనే కూర్చుండియుండెను. అప్పు డొకతురకభటుఁడు ఆమార్గమునఁ బోవుచు నాయనినిచూచి "ఎవడునీవు?" అని ప్రశ్నించెను. "అయ్యా! నేను చొప్పయమ్మువాఁడను. నాదగ్గఱ చొప్పమోపు కొని యిచ్చటివారు ఖరీదిప్పించెదమని చెప్పి వెళ్ళినారు. వారింకను రాలేదు. వారి కొఱ కెదురుచూచుచున్నాను" అని హనుమప్పనాయఁడు బదులుచెప్పెను. "అచ్ఛా" అని గడ్డము నిమురుకొనుచు నాతురకసిపాయి తనదారిని పోయెను. మఱికొంతసేపటికి మఱియొకతురకసిపాయి వచ్చి హనుమప్పనుచూచి "ఎవడు నీవు?" అని యడిగెను. వీనికిఁ గూడ నాయఁడు మొదటిసిపాయికిఁ జెప్పినట్లే చెప్పెను. అందుమీఁద వాఁడును వెడలిపోయెను. కార్యసాఫల్యమునకైన కాలమునకై హనుమప్ప వేచియుండెను.


కొంతసేపటికి నిజాముఅలీ సేనానివేశమున సద్దణఁగెను. దగ్గఱ ఎవ్వరులేనిసమయమును కనిపెట్టి హనుమప్పనాయఁడు గుఱ్ఱపుశాలలోఁ బ్రవేశించెను. అందొకప్రక్క సోమనాద్రియశ్వముచెంత గడ్డి మోపుగా వేయఁబడియుండెను. నాయఁడా గడ్డికుప్పలో దూఱెను. ఎత్తుకనుపించకుండులాగునఁ గాలుసేతులు చాచికొని యతఁడాగడ్డివాములో బల్లపఱుపుగాఁ బడుండెను.

స్వస్థానస్థుఁడగు నాయఁడు తనచెంత కూర్చుండి యుండినఁ గారణమున సోమనాద్రియశ్వము సంతోషముతో మేఁత మేయుచుండెను. మేఁతమేయు తమకమున నది హనుమప్ప గడ్డిమోటిలో దూఱినసంగతి వెంటనే గమనింపలేదు. కొంతసేపటి కది తనదగ్గఱ నాయఁడు లేనిసంగతి గ్రహించెను. అప్పుడు దానికి కంగారుపుట్టెను. కాళ్ళతో నాగ్రమును సత్తువకొలఁది తన్నుకొనెను. అందుచేత దానికికట్టియున్న యినుపగూటము తాడుతోఁగూడ నూడివచ్చెను. ఆ గుఱ్ఱ మప్పుడటు నిటు తిరుగాడఁజొచ్చెను. తురకసిపాయియొకఁడు గుఱ్ఱము విప్పుకొన్నసంగతి గ్రహించెను. వెంటనేవచ్చి వాఁడు తాటితో నూగులాడుచున్న యినుపగూటమును పట్టుకొని వచ్చి హనుమప్ప దాగుకొనిన గడ్డిమోపు నందుచు భూమిలోఁ బాతఁదొడఁగెను. నాయఁడు చేతులు పొడుగుగాఁ జాచియుండిన కారణమున ఆగూట మాతని కుడియఱచేతపై మోపఁబడెను. పైన సమ్మెట ద్రెబ్బలు పడుచుండ నాయినుపగూట మతని అఱచేతిని చీల్చుకొనిపోయి భూమిలో దిగఁబడెను.


అట్లయినను హనుమప్ప కదలలేదు; మెదలలేదు. ఎంతబాధకలిగినను అతఁడు మూలుఁగలేదు; ముక్క-లేదు. ఊపిరి బిగఁబట్టి, ప్రాణము లుగ్గఁబట్టి యాతఁడు రాయివలెఁ బడియుండెను. కొంచ మలికిడియైనను గూట మువాతుమన్న సిపాయి హనుమప్పను కనుఁగొని యుండును. అప్పుడు హనుమప్ప ఖండింపఁబడియుండును; అందుతో నాతఁడు నిర్వహింపవలసిన రాజకార్యము మొదలంటఁ జెడియుండును. ప్రాణములకై ఆతని కంత చింతలేదు. కాని రాజకార్యము చెడుట కారాజభక్తుఁడు సుతరాము ఒప్పుకొనఁడు. కావున గూటము తనయఱచేతిని చీల్చుకొనిపోయినను అతఁడు మేను కదపక, మెదలింపక ఎటులో ఓర్చి యుండెను.

తిరిగి గుఱ్ఱ మాఁడఁజెలికకుండ మేకును లోతుగఁ బాతి సైనికుఁడు వెడలిపోయెను. రెండుజాముల రాత్రి యయ్యెను. స్కంధావారమున సందడి తగ్గిపోయెను. పగలంతయు సమరప్రశంసతో నలసియుండిన తురకభటులు గాఢనిద్రాముద్రితులైరి. అప్పుడు హనుమప్పనాయఁడు మెల్లగాఁ దనపైనున్న గడ్డిని ఒత్తిగించుకొని లేచికూర్చుండెను. ఆతనికుడియఱచేయి మేకుక్రిందనుండెను. ఎడమచేతితో గూటమును కదలించి పెకలించుట కాతనికి సాధ్యపడలేదు. జాగు చేయుచు నట్లుండిన శత్రువులు తన్ను చూడఁగలరు. కావున నాసాహసికుఁడు తనకొడవలితోఁ దన దక్షిణ మణిబంధమును నఱకుకొనెను. మునుపటికంటె రక్తమధికముగాఁ గారఁజొచ్చెను. కాని యారాజభక్తుఁడు దానికి లెక్క-చేయలేదు; వెంటనే గుఱ్ఱమును విప్పి బయటకుఁ దెచ్చెను; స్వారియై డేరాలనడుమ నేగుచుండెను. నిద్రమెలఁకువవచ్చిన తురకసిపాయి లొకరిద్దఱు తలలెత్తిచూచిరి. అర్ధరాత్రియనక, అపరరాత్రియనక అశ్వపాలకులు గుఱ్ఱములను చేరుకనున్నతుంగభద్రానదికి నీటికై తీసికొనిపోవుట ఆశిబిరమున నిత్యము జరుగువిషయమే. కావునఁ దమవాఁడే ఎవఁడో గుఱ్ఱమును ఏటికిఁదీసికొని పోవుచున్నాఁడని తలలెత్తి చూచిన తురకసిపాయి లనుకొనిరి. ఎట్టి యనుమానమును లేక వారు మఱల యథాప్రకారము తమతమ పక్క-లను గఱుచుకొని గుఱ్ఱుపట్టిరి.

రాజాజ్ఞ నెఱవేర్పఁగలిగితినన్న సంతోషమున హనుమప్ప చేతిబాధను మఱచిపోయెను. ఇంటి మొగముపట్టిన సంతోషమున గుఱ్ఱము పిట్టవలె నెగిరిపోవుచుండెను. కావున నతఁడు నిమిషములమీఁద నిజాము డేరాల నతిక్రమించెను; నిడుమూరుమిట్టలను వెనుకవైచెను; తుంగభద్రానదిని దాఁటెను; కలుగోట్ల సమీపించెను; సోమనాద్రిగుడారము చెంత నిలిచెను.



“......నా సాహసికుఁడు తనకొడవలితోఁ దన దక్షిణమణిబంధమును నఱకుకొనెను.”



"హనుమప్పనాయఁడు గుఱ్ఱమును దిగి యెడమచేతితో పోమనాద్రికి సలాము చేసెను."

అప్పటికే సోమనాద్రిలేచి సమరసన్నాహములు నడుపుచుండెను. హనుమప్పనాయఁడు గుఱ్ఱము నుండి దిగి యెడమచేతితో సోమనాద్రికి సలాముచేసెను. తన యశ్వరత్నమును చూచి రాజానందాతిశయమునఁ బరవశుఁడయ్యెను. పిమ్మట అతఁడు నాయఁడు ఎడమచేతితోఁ దనకు సలాముచేయుట కనుఁగొనెను. అప్పుడాతని మొగమున వచ్చిరాని కోపచిహ్నములు ముద్రితమయ్యెను. గుఱ్ఱమువచ్చినన్న సంతోషమున, నాయఁడు ఎడమచేతితో సలాముచేసెనన్న కోపమున నాందోళితుఁడైయున్న సోమనాద్రి కన్నులాసమయమున మొండిదైయున్న హనుమప్పకుడిచేతిపైఁబడెను. అప్పుడాతఁడు మిన్నుముట్టిన యాశ్చర్యముతో "మిత్రుఁడా! ఇదియేమి?" అని హనుమప్పను ప్రశ్నించెను. నాయఁడు జరిగినసంగతి నంతయు వినిపించెను. విషాదము, ఆశ్చర్యముకలిగి సోమనాద్రి హనుమప్పను కౌఁగలించుకొనెను. "నాయఁడా! ఏది అడిసఁగాని ప్రాణాధారమగు మెతుకులు నోటికిఁజేరవో అట్టి కుడిచేయి నాకొఱకు నఱకుకొన్నావు. నీ యీ ఋణము నేను వేయిజన్మములెత్తినను తీర్చుకొనఁజాలను. ప్రాణములకు తెగించిన నీవంటి వీరుఁడు; మనసిచ్చి మనసుపుచ్చుకొను నీవంటి స్నేహితుఁడు ఉండఁగా నేను నిజాము అలీ నేకాదు, అతనితలఁదన్నినవారినికూడ జయింపఁగలను" అని సోమనాద్రి హనుమప్పతోఁ జెప్పెను.

అంతట సూర్యోదయమయ్యెను. కమలములతోఁ బాటు గద్వాలసైనికుల ముఖములుకూడ విప్పారెను. సోమనాద్రి యుత్సాహమునకు మేరయే లేదు. అచ్చట నిజాముడేరాలో సోమనాద్రియశ్వము దాఁటిపోయినదని యందఱకుఁ దెలిసెను. ఇదితెలిసికొని నిజాము నిరుత్సాహుఁడయ్యెను. సోమనాద్రి మరల పైతానువలెఁ దమ్ముగారించునని తురకభటులు చింతాక్రాంతులైరి. అప్పుడు సోమనాద్రి నగారామ్రోయించెను. ఆమ్రోఁత వినినతోడనే నిరుద్యోగుమిట్టలపై నిజాముసైనికుల హృదయములు గద్వాలరణభేరివలెనే దడదడ కొట్టుకొన నారంభించెను. ఎట్లో మనసు కుదుటఁబెట్టుకొని నిజాముఅలీ, సయ్యదుమియ్యాలు తమసేనలను మొగ్గరము దిద్దుచుండిరి. ఇంతలో సోమనాద్రి తనసమరాశ్వము నెక్కి సేనాసమేతుఁడై వచ్చి తురకసైన్యమును చుట్టుముట్టెను. అప్పుడు సమరము తీవ్రతరమయ్యెను. తురకసేన తెనుఁగువీరుల కొఱకుఁ దాళఁజాలక కకావికలయ్యెను. చేయునదిలేక అప్పుడు నిజాముఅలీ, సయ్యదుమియ్యాలు సోమనాద్రితో సంధిమాటలు నడపిరి. ఉదారశీలుఁడగు సోమనాద్రిభూపాలుఁడు సంధి కంగీకరించెను. తామోడినందుకు గుఱుతుగా నామహమ్మదీయప్రభువు లొకగొప్పఫిరంగిని సోమనాద్రికి సమర్పించిరి.

దానిని స్వీకరించి సోమనాద్రి తనసేనలతో గద్వాలనగరమును చేరెను. పిమ్మట నాతఁ డొకపెద్దసభ కూర్చెను. సహాయముగా వచ్చి ప్రశంసాపాత్రముగా మొక్కవోని ధీరమున సమరముసల్పి తనకు జయలాభమొనగూర్చిన వీరుల కందఱకు నగలు, నాణెములు; మడులు, మాన్యములు ఇచ్చి సోమనాద్రి నిండుసభలో వారిని సత్కరించెను. అందు ముఖ్యముగ హనుమప్పనాయనిని పిలిచి సోమనాద్రి భూపాలుఁ డిట్లు చెప్పెను.

"మిత్రుఁడా! విజయప్రశంసాపాత్రమగు నీకథ నేఁ డిట్లిచ్చుట కొండంతకు పిలుకలిగించినవి నీధైర్యసాహసములు. ప్రాణాపాయమునకు శంకింపక శార్దూలవదనము వంటి శత్రుశిబిరమును చొచ్చినావు. అంగవికలత్వమునకుఁ గూడ సహించి సాహసమున నీవు పులినోటికండదైన నా అశ్వరత్నమును విడిపించుకొని వచ్చినావు. ఇంతటి మేటి యుపకృతిచేసిన నీకుఁదగిన ప్రత్యుపకృతి నేనేమిచేయఁగలను? నీవుచేసిన సాహసకృత్యము ధనములోఁగాని, భూమిలోఁగాని వెలఁబెట్టుటకు అతీతమై యున్నది. అయినను నీవు వెల్లడిచేసిన రాజభక్తికి మెచ్చినట్లేదేని నీకొసఁగి నా విశ్వాసమును ప్రకటించినఁగాని గద్వాలలో వెలసియున్న కేశవస్వామివారు నాపైఁగోపగింతురు. కావున నీస్వగ్రామమగు 'చెంగన్నపల్లి' నీకు సర్వాగ్రహారముగా ధారాదత్తము చేయుచున్నాను. నీవు నెఱపినసాహసమునకీ చిన్న గ్రామమిచ్చుట జీవరత్నమునకు బదులు చిల్లిపిరాయి యిచ్చుటయే యగును. ప్రత్యుపకృతి గాఁగాక నీయందు

గాసంగల విశ్వాసప్రకటనమునకుఁ గాను నీ కీ గ్రామ మిచ్చుచున్నాను. స్వీకరించి పుత్ర పౌత్ర పారంపర్యముగ సుఖాన అనుభవింపుము.''

ఇట్లు చెప్పి సోమనాద్రి దానశాసనము వ్రాయించి బొచ్చుంగన్నపల్లి హనుమప్పనాయనికిచ్చెను. ఆ రాజభక్తుని సంతతి వారు నేటికిని గంద్వాల సంస్థానమునందు ఆ బొచ్చుంగన్నపల్లి యగ్రహారమును సుఖాన ననుభవించుచున్నారు. ప్రపంచమునందలి వివిధదేశచరిత్రలలో ఏదేశచరిత్రమందును ఈ ఆంధ్రరాజభక్తుని చరిత్రవంటి చరిత్ర కానరాదు.

మును, రక్షోజనతావరీవృతమహీపుత్రిన్ విలోకించి యా
హనుమంతుం డొసరించినాడు విభుకార్యంబున్ వెసన్; శత్రురా
డ్జనమధ్యంబుననున్న నీప్రభునశ్వశ్రేష్ఠముం దెచ్చి తో
హనుమప్పా! మరువంగఁజాలరుగదయ్యా! తెన్గుబిడ్డల్ నినున్.
పాణిభ్రంశ వినిర్గళద్రుధిర సంపాతమ్మునన్ దావక
ప్రాణత్యాగ సమున్ముఖామల మనోభావమ్మునన్ నేఁటికిన్
రాణింపంగల స్వామికార్యపరతంత్రత్వంబు, సద్భక్తి పా
రీణత్వం బెరిఁగించు నాంధ్రజనయిత్రీ పుత్ర కీర్త్యున్నతుల్.

[illegible]

కోల్పడిన ప్రేమకు

కనులు విచ్చి నీదుసమాధి కాంచలేను
అట గులాబి తీయని దెంతయైన నేమి!
నా అడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతల వినుటె చాలు!

ఊరట వహింతునా? మహాదూరమున వ
సింతువేమొ జీవాత్మవై, ఎదో అగాధ
నీరవత ఆవరించగా తారకలకు
చుట్టు నెలకొను నిశ్శబ్ద మట్టిది నిను.
శీతలిని నీ వైతివి! ద్యోతలాన
నివసముందువు నీయంత నీవె, అచటి
అమితమతిమంతమైన నీహాయిలోన
పరిహృత విస్మృతహృదున్నత్తభావమెల్ల.
కాని యైన నొక్కొకవేళ కాంచెదీవు
కడచు నొక్క నిశ్వాసమ్ము, గాఢబాధ;
చకితనాడు తెరువంబడి స్వర్గమందు
ద్వారమొకడు వెన్వెంట మూతపడినట్లు.
సంచలింతు నీవింత ప్రశాంతములగు
ప్రార్థనాగీత లచ్చటి వాగిపోవు,
సగము స్మరియింతు వీవొక్క క్షణము నన్ను:
మరల నీశాంతిలోనికి మరిగిపోదు.

ఐన నయ్యయో! ఇకపై ననారతమ్ము
నీదు చూపు, నవ్వు, హాయలు, నీగళమ్ము,
వివిధతావకభూలోకవిభ్రమములు
పోవు నెన్నెన్నొ చినిచిన్ని ముచ్చటలవి.
కాన తావకీనసమాధి కాంచలేను
అట గులాబి తీయని దెంతయైన కాని,
నా అడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతలే వినగవలతు.

—స్టీఫెన్ ఫిల్లిప్స గీతముల కనువాదము.

శ్రీరంగం శ్రీనివాసరావు

సింహళద్వీపం కైఫియ్యతు

[మధుర ఆంధ్రనాయకరాజు సింహళద్వీపపురాజును జయించిన వృత్తాంతము.]

ఆదియందు పాండ్యదేశానకు రాజైన రాజా విశ్వనాథనాయనిగారి కొమారుడైన రాజా పెద్ద కృష్ణప్పనాయుడు రాజ్యపరిపాలనం చేస్తూవున్నప్పుడు వర్షసహస్రం గుర్రంకట్టి తుంబిచ్చినాయడని వ్యాకరిపాళెయప్పట్టు ఆతుంబిచ్చినాయడనేవాడు పరమగుడిలో కోటవేసుకుని ఆరాజ్యమంతా కట్టుకొని పాండ్యదేశం చోళదేశంలో కలిపోయినట్టు కొళ్లపెట్టి చిల్లర చేస్తుండగా పాండ్యదేశానికి రాజైనటువంటి పెద కృష్ణప్పనాయనివారు వీని దుర్మార్గములువిని జోరు తాకీతులుగా వ్రాశిపంపించినందున అది లక్ష్యంశాయక మరిన్ని గుర్రంపవుంజు అధికముగా శేఖరంచేసుకుని వీరిమీదను యెదరాళిగాను వీరితాలూకులున్న తావులలో వచ్చిపడి హతపరిచి మరిన్ని శీమయందు కొళ్ల పెట్టుకువున్నందుచాత రాజా పెద కృష్ణప్పనాయనివారు విని చాలా ఆగ్రహంతోకూడా తమ సైన్యానికి వ్రాసి రప్పించుకొని తమదళనాయకుడైన పెద్ద కేశవప్పనాయనివారికి వుత్తరవుయిచ్చి తుంబిచ్చినాయనిమీద రణభేరివేయించి దళనాయకుడైన పెద్దకేశవప్పనాయనివారిని దళంతోటట్టు ముందర సాగమని ఆజ్ఞాపించిన ప్రకారం యుద్ధసన్నాహముగా మానామధురలో తుంబిచ్చినాయనికోటమీద తాకి యుద్ధమైనందున తుంబిచ్చినాయడి తమ్ముడు చినవీరతుంబిచ్చినాయడున్ను పదివేలదళమున్ను, రెండువేలగుర్రమున్ను పరమగుడి నుంచి రాత్రిరెవచ్చి కోటలోపల చొచ్చి ముందరవున్న జనంతో రెండువేలజనం కూడా నుంచి ఆరాత్రె యీ దండుమీదవచ్చి తాకినందున పెద కేశవప్పనాయనివారు వుశారుకేసుకొని పాళయం నఖముఖాలకున్ను మస్తాపులువేయించి ఆరాత్రి ముస్తైదై బహుయుద్ధమై తుంబుచ్చినాయడిదండులో యేనూరు గుర్రమున్ను, రెండువేల కాలబలమున్ను ఛేదమై చినవీరతుంబిచ్చినాయనికిన్ని రెండుగాయములుతాకి అంతట విరిగి కోటకుపోయి చేరినాడు. పెద్దకేశవప్పనాయనివారి దండులో మున్నూరుగుర్రమున్ను, వేయిన్నేనూరు జనమున్ను ఛేదమయినది.

అది సడ్డశాయక నాడు పగలు ముస్తైదై కోటచుట్టుకొని జగడంచేశి ఆరాత్రే కోటకు నఖముఖాలా నాలుగు మోర్చాలువేసి ఫిరంగులు యెక్కించి కోటమీదనున్ను, కోటకులోకలనున్న గుండ్లప్రయోగం చేశినందున కోటలో చాలాజనులు ఛేదమైనయెడల ఆ తుంబిచ్చినాయడి బావమరుదులు పెదవీర బొమ్మనాయడనిన్ని, రణవీర బొమ్మనాయడనిన్ని, వీరిద్దరున్ను అనేకయుద్ధములలో జయించి రణశూరులని తుంబిచ్చినాయడివద్ద కితాపులు పుచ్చుకొన్నవారు గనక వారిద్దరున్ను వారిదళములో నాలుగువేలజనం వోఖవయసువారినిగా యేర్పరిచి రెండుచేతలుగా యిద్దరున్ను పంచుకొని రెండు మోర్చావులమీదవచ్చి పడి మోర్చావుల్లోవున్న జనమున్ను హతంజేసి మోర్చావులున్ను సాపుచేశి పిరంగులున్ను తీసుకుని కోటకుపోతూవుండగా పెద్ద కేశవప్పనాయడివద్దనుంచి యెలకోలు వీరప్పనాయడున్ను రెండువేలజనమున్ను అడ్డంతాకి బహుయుద్ధమై వుభయపక్షాల్లో జనఛ్ఛేదమయి రణశూర బొమ్మనాయడ్ని వోఖతోడ గుండుతాకి విరిగి ఆతణ్ని సమాళించి యెత్తుకుని హతశేషాన్ని, శేఖరించుకొని పట్టిన పిరంగులలో యెలగోలు వీరప్పనాయడు రెండు ఫిరంగులు అడ్డంతాకి తప్పుకొన్నదిపోగా కడమ నాలుగు ఫిరంగులున్ను, గాయకాళ్లనున్ను సమాళించి తీసుకొని పెదవీర బొమ్మనాయడు కోటలోపలికిపోయి చేరి బందుబస్తుచేసుకొని వున్నంతలో యీసమాచారం రాజావిని యింకా ఆకోటతియ్యక తామసంచేస్తువున్నాడా దళవాయి అని బహుకోపములో ప్రయాణసన్నాహమయి డైరై రెండు పాళయగాండ్లకున్ను తాకీదులు వ్రాశి వారివారి సయిన్యసహితముగా మానామధుర

పాళెం వచ్చి చేరుమని ఆజ్ఞాపించి బహుదళసమేతముగా తిరుగివసంవచ్చి అచ్చట పాళెందిగినారు.

ఆసమాచారం చినకేశవప్పనాయడు తండ్రికి వ్రాయగానే అకాలంతం పెద్దకేశవప్పనాయడు చదువుకొని బహుచింతాక్రాంతుడై యేలినస్వామివారే యీసమాసంలేని పాళెగాడిమీద యుద్ధానికి వచ్చినట్టయితే మనం సేనాధిపతిత్వంజేసి యిన్నిదినాలు అనేకయుద్ధములు చేసి జయించినదెల్లా వ్యర్థమాయనని అక్షణమే తిరుగా నాలుగుమోర్చాలు తయారుచేసి ఫిరంగులు రొక్కించి ఆమోర్చాల్లో తానేపోయివుండి గుండ్లచాత కోట బహుదూరం పడగొట్టి రొలకోలు వీరప్పనాయడిని వోఖపార్శ్వమున్ను తాను వోఖపార్శ్వమున్ను లగ్గయెక్కినందున పెద్దవీరబొమ్మినాయడు వోఖపార్శ్వమున్ను, చిన్న వీరతుంబిచ్చినాయడు వోఖ పార్శ్వమున్ను లగ్గయెక్కిన జనంమీదికితిరిగి లగ్గయెక్కనీయక అని పోట్లాడినందున రొలకోలు వీరప్పనాయడు లగ్గయెక్కిన పార్శ్వం పెదవీరబొమ్మినాయడు యెదురించి బహుజనాన్ని ఛేదపరిచి రొలకోలు వీరప్పనాయడు పెదవీరబొమ్మినాయడిచేత బరిచిపోటు దూశి అక్షణం మరణమాయెను.

అంతట ముందునిలిచిన సరదారుడు పడగానే జనం వెనక్కుతీశెను. అతనితమ్ముడు చినగురువప్పనాయడు అన్నపడ్డసమాచారమున్ను జనంతిరిగివచ్చేది జూచి వెలపటవుండే జనాన్ని తిరిగివచ్చేజనాన్ని సేకరించుకొని పెదవీరబొమ్మినాయడు నిలిచియుండేపార్శ్వం బోయి తగిలి బహుయుద్ధంచేసి బహుదళాన్ని ఛేదపరిచి అక్క పగదీర్చవలెనని పెదవీరబొమ్మినాయడున్ను చిన్నగురవప్పనాయడున్ను యెదురునిలిచి పోట్లాడినందున చిన్నగురవప్పనాయడు పట్టాసాము సాధనలో సమర్థుడు గనక యెదటిచాలాపోట్లు తప్పించి పట్టాతీసి నరికినందున వోఖభుజంతెగి కిందపడగానే ఆపెదవీరబొమ్మినాయణ్ణి తలకోసి కెందామీదకట్టి జయభేరివేశిన మాత్రమే యీతట్టుదళం విరగపడి చిన్నతుంబిచ్చినాయడిదళంతోను చేరి పెద్దకేశవప్పనాయడివారిమీద బహుశౌర్యయుద్ధము గానుచేసివచ్చుయడల రొలకోలు చిన్నగురవప్పనాయడున్ను జయభేరివేశిన దళమున్ను వెనక్కువచ్చి తాకి పెదకేశవప్పనాయడువారు వోఖపార్శ్వమున్ను చిన్నగురవప్పనాయడు ఒక పార్శ్వమున్ను నెగ్గి యుద్ధంచేశినందున చినవీరతుంబిచ్చినాయుడికిన్ని దళానికిన్ని నిర్వాహకంచేయలేక వకావకలై విరిగి జనమంతా పారిపోయిన్ని, చినతుంబిచ్చినాయడు మహాశూరుడు గనక మనశ్శేరు క్షాత్రం పోతున్నదేయని యీపైజనముతోను యెదిరించి మహాఘోరయుద్ధంచేశినందున పెద కేశవప్పనాయడువారు తమ సైన్యానికి తాకీదుచేశి చంపకుండా చెయిపట్టుగా పట్టితెమ్మని తాకీదుచేశినందున చెయిపట్టుకు తగలక మంచిమంచి పేరైన గరికాండ్లను ఛేదంచేశినందుచేత కొట్టివేయమని వుత్తరువైనందున నెగ్గియుద్ధంచేశి తలకాయకోశి యీతలకాయనున్ను కెందామీద కట్టివున్న పెదవీరబొమ్మినాయుడి తలకాయనున్ను యీ రెండు తలలున్ను జయపత్రికవ్రాశి త్రిభువనానకు యేలినవారి సముఖానకు పంపించి ఆకోటలో తగుజనాన్ని శాణీవుంచి తక్కిన దళసమేతముగా పరమగుడి కోటమీదికి సాగి కోట పరమగుడిన్ని, తోఖుచాత్తు నూరున్నగా దండుయీవత్తున్ను తిరిగి త్రిభువనముందుండే దండున్ను యేలినవారున్ను మానామధురకు యింకా కోటతియ్యలేదేయని వస్తూనుండగా యెదురుగానే యీ రెండు తలలున్ను జయపత్రికానున్ను వచ్చింది.

చూచి చాలాసంతోషపడి మానామధురలో వచ్చి దండుదిగి దళనాయకుడైన పెద కేశవప్పనాయడివారికి సంగరకిరీటియనే కితాబున్ను, రత్నభూషణాంబరములున్ను చిన్నగురువప్పనాయడికిన్ని కూడా యుద్ధంచేశిన సరుదార్లకున్ను భూషణాంబరములున్ను పంపించినందున పెదకేశవప్పనాయనివారి మొదలైన సరుదార్లు యెదురుకొనివచ్చి నగరిబహుమతులు శిరసావహించి ధరించుకొని మహాసంతోషముతోను వీరాధివీరులై పరమగుడిమీదికి యుద్ధానికి సకలదళసన్నాహములై పరమగుడిమీదికి పోయ్యేటప్పటికి పట్టమాయిర తుంబిచ్చినాయడు బహుఆక్రోశుడై మానామధురకోటనుతీసుకొని తమ్మణ్ణి భావమరిదిని చంపి ఆనేకదళ

ఛేదమున్నుచేసి యిచ్చటికి వచ్చిరేయని చాలాకోపం తోదట్టి పదివేలు మంచిశిపాయిలున్ను నాలుగువేల గుఱ్ఱమున్ను శేఖరించుకొని యెదురుగావచ్చి ఉదయం మొదలు అస్తమానంవరకు బహుయుద్ధమైనందున తుంబిచ్చినాయుడి దళమందు గొప్పజగడాలు చేశితిరిగ సరదార్లుగా పదిహేడు మనిషిన్ని, వారి బంధువుల్లో ప్రముఖులైన రఘునాథనాయుడు, సరణ లింగమనాయుడు, పాల మద్దినాయుడు, దొడ్డ చిక్కమనాయుడు, వీరపాండినాయుడు, జక్కమనాయుడు, తాడుపెట్టి వీరమనాయుడు, మోటు మల్లప్పనాయుడు, పులిపుత్త లక్కమనాయుడు యిట్లా గొమ్మిరిమనుషులున్ను మహాయుద్ధం చేశి అనేకులను చంపి తామున్ను చచ్చిపోయిరి. యిదిగాక వేయిగుఱ్ఱమున్ను, మూడువేల కాల్బలమున్ను హతమైనారు. పెదకేశవప్పనాయుడివారిదండులో గొప్పసరదార్లలో బంగారు నాగులనాయుడు, తారయూరు నారశింహ్మనాయుడు, మిట్టపాళెయం అయ్యప్పనాయుడు, గొజ్జంగి గోపలనాయుడు, అమరగంటి మద్దినాయుడు, పంది సుబ్బలనాయుడు, అమరం కొమరప్పనాయుడు, శేష్ బహు సామినాయుడు, గొంటుపురం ముద్దు సామినాయుడు, తుపాకుల రామకృష్ణమనాయుడు, వీరబాణం కస్తూరిరంగరాజున్ను, గొట్టిముక్కల తిమ్మరాజున్ను, కాకి అళగిరిరాజున్ను, పసుప్పావడ రంగరాజున్ను, గుయ్యాల వెంగమరాజున్ను, కొరివి కృష్ణమరాజున్ను, మందపాటి రాఘవరాజున్ను, అవులమంద కృష్ణరాజున్ను, వీరవల్లి రామరాజున్ను, మళ్లపురం గణపతిరాజున్ను, పూసపాటి కొండ్రాజున్ను, రావిళ్ళ రమణప్పనాయుడు, పెమ్మసాని రుద్రప్పనాయుడు, పచ్చా కస్తూరినాయుడు, నాదిళ్ళ నారణప్పనాయుడు, నారిగంటి సరసానాయుడు, సరావుల వెంకట్రామినాయుడు అంతు యిరువైయేడు సరదార్లున్ను, మూడువేల చావున్ను, వెయిజనం గాయములున్ను యీప్రకారం వుభయదళాలున్ను తప్తమై వుండేసమయమందలి మానామధురలో వచ్చి దిగివుండే యేలినస్వామివారి పెద్దదండులో యీ సమాచారం వినేటినే అంతట్లో కలుగు ఫోటూనుండగా రాజా పెదకృష్ణమనాయునివారు మనసైన్యమందు యింత జనమున్ను, పేరైన గొప్పసరదార్లు యిందరున్ను మృతిబొందిన్ని, యింకా తుంబిచ్చి సరిగ్గా అని పోట్లాడుతున్నాడుగదా అని బహుఆగ్రహముతో తనవద్దవున్న సయిన్యములో అర్ధభాగం తయారుచేసి అందునైన గొప్ప సరదార్లను సేనకంచేసి దళకర్త పెదకేశవప్పనాయునికి సహాయంగా అంపించినందున మానామధురకు పరమగుడి పదిఘడియలదూరం గనుక అస్తమానమైన జామున యీసైన్యంపోయి చేరగానే పెదకేశవప్పనాయునికిన్ని, ఆతనివద్ది సేవకులున్ను బహుధైర్యమున్ను, వుత్సాహమున్ను కలిగి పెదకేశవప్పనాయునివారి బాకిదళమున్ను, వచ్చినదళమున్ను రెండున్ను విజృంభించి రాత్రే వారిదండుమీదపోయి మూడుచేకులుగా పంచుకొని యుద్ధంచేశినందున తుంబిచ్చినాయుడు మందరమ అనేకభేదమై అనేకమెనగాండ్లుగా సరదారులు పోయినందువల్లనున్ను యిప్పుడు మూడుచేకులుగా పంచి యుద్ధంచేశినందున అనేక భేదమై సకావకలుగా విరగబడివేశింది చేశినట్లా పారి పరమగుడి కోటలోపల చొరబడిరి.

పెదకేశవప్పనాయుడున్ను, దండున్ను వాడు పారవేశిన ఆయుధములు, సామానులు యావత్తున్ను యెత్తుకొని కోటకు ముత్తిగవేశి సఖముఖాలామట్టుకొని దండంతాదిగి గాయకాండ్లకు గాయాలుకట్టి సావధానంగాయమునిన్ని సకముఖాలా మోర్జాలువేయమనిన్ని సరుదార్లనున్ను, కామాటిమున్ను నేమించి బత్తెరులలో ఫిరంగులు యెక్కించి కోటనిండగుండ్లు ప్రయోగించి వోఖపార్శ్వంకోట యిడగొట్టి లగ్గ యెక్కటప్పటికి తుంబిచ్చినాయుడున్ను వానివద్దనుండే సరుదారులున్ను మంచి మెనగజనమున్ను వచ్చి లగ్గ ముఖాన అని తుపాకులచాతనున్ను బల్యాలచేతనున్ను ముందర లగ్గయెక్కిన జనాన్ని బహుశా భేదపరచి లగ్గయెక్కిన జనాన్ని చచ్చినవారుపోగా కడమ దిగి పలాయనమయినందున దళకర్త పెదకేశవప్పనాయుడు బహు ఆగ్రహముతో దిగిన జనాన్ని శేఖరించుకొని మరిన్ని వుండేదగ్గ సరదార్లనున్ను వారి పార్శ్వంజనాన్నిన్ని

శేఖరించుకొని తానే లగ్గయెక్కేటప్పటికి తుంబిచ్చి నాయుడున్ను వారిజనమున్ను చేయికలిసి సంకులసమర మయినందున వుభయత్రా బహుజనమున్ను మంచి మంచి మొనగాండ్లున్ను పడిరి. అప్పుడు దళనాయకుడైన పెదకేశవప్పనాయుడికి ఒకతోపుగుండు రొమ్మున తాకి వీపునదుమ్ము వెళ్లినక్షణమే మృతిబొందినందుచేత దళం నిభాయించకూడక కొంతజనం విరిగి పారివచ్చేరు. కొంతమొనగాళ్లు పరుదార్లు అక్కడనే పడి మృతిబొందిన్ని గాయాలతో పడిరి. దళకర్త అల్లుడు మంగపతి నాయుడు మాత్రం వెయిజనముతో నిలచి గాయకాండ్లనున్ను దళవాయి పెదకేశవప్పనాయుణ్ణి ఎత్తించుకొని పారివచ్చేరి యీసమాచారం యేలినవారికిన్ని దళవాయి కొమారుడు చిన్నకేశవప్పనాయుడికిన్ని కాకితంత్రివారి అంపించి తాను యధాప్రకారం పాళెమున్ను, మోర్చాలును బందుబస్తు చేసుకొని భద్రముగావుండెను.

తుంబిచ్చినాయుడు అక్కడి గాయకాండ్లున్ను వారికిన్ని బహుఖేదము నక్కబడులు చేయుట శక్తిలేక కోటలోనేగా చేరుకొని వుండిరి. యీ వర్తమానము లం మానమధురలో చేరిన మాత్రమందు యేలినవారు బహు ఆగ్రహంతోడబ్బి తక్షణమున తామే సయసమయి యుద్ధసన్నద్ధులైన జనముతోను విదళకర్త ప్రధానులైన పెదకేశవప్పనాయనివారి కొమారుడు చిన్నకేశవప్పనాయుడు యేలినవారిసముఖమందు వచ్చి మా తండ్రినిచంపినపగనే తీర్చుకొంటానని యీపనులకు యేలినస్వామి బలం బలోకవలసినది యేమిటున్నది. తమ మాత్రమందు వానికోట ముట్టడించి పుత్రమిత్రాదులతోను హతంచేసి వస్తున్నానని ప్రతిజ్ఞచేసి గణపతి వేసుకొని బలాలు చేరేటప్పటికి ము పాళెమ్ము చుట్టి మంచి మొనకలిసిన జనములో ఆరువేలజనమున్ను పాళెగారులలో కత్తిం లింగమనాయుడు మధురపురి టూరి నాయుడు, కొమారవాడి లక్కినాయుడు, యిలుప్పూరి కామాక్షినాయుడు కరకట్టి బొమ్మినాయుడు, గెడువయిల్ ఆళగారినాయుడు, కొత్తకోట పల్లవరాయుడు కొత్తూరి అక్కాల్ రాజు, పెనువెకమ్మనాయుడు, తోగమల కసవప్పనాయుడు, రామగిరి సామినాయుడు, విల్లుముపలింగి ముద్దినాయుడు, కన్నివాడి అప్పనాయుడు యీపాళెగారులున్ను వారివెంగలో పదిహేనువేల జనమున్ను, ఆరుఫిరంగులున్ను తీసుకుని పరమగుడి పాళెమ్ముకు వచ్చి తండ్రిగారి దహనాదిపుత్రకృత్యాలు చేసి తోడుత దండుతయారుచేసి మోర్చాలమీద ముట్టి రెండు ఫిరంగులు యెక్కించి సకముఖాలా కోటను ఇదకొట్టి తాను తనవెంటవచ్చిన దండున్ను తూర్పు పార్శ్వమున్ను, ముందర, అచ్చట వుండినదండున్ను అల్లుడు మంగపతినాయుడు తూర్పుపార్శ్వమున్ను, పాళెయకాండ్లు రెండుపార్శ్వముల అందున్ను యీ ప్రకారముగా లగ్గయెక్కేటప్పటికి తుంబిచ్చినాయుడున్ను సకముఖాలా అని బహుయుద్ధం అయ్యేటప్పటికి పినకేశవప్పనాయుడి పార్శ్వం ముట్టించిన జనాన్ని కొట్టి లోచొచ్చిన మాత్రమే జయభేరి వేసినంతనే మూడు పార్శ్వాలయందున్ను లగ్గయెక్కి చేయికలిసి లోపల వున్న కార్యస్థులమున్ను తుంబిచ్చినాయుణ్ణిన్ని తలకాయలు కోసి దళమంతా అచ్చట నేనిలిపివేసి చినకేశవప్పనాయుడున్ను అల్లుడు మంగపతినాయుడున్ను, మరి కొన్ని కార్యస్థులున్ను తుంబిచ్చినాయుడి తలతీసుకుని మానామధురకోటకువచ్చి యేలినస్వామి సముఖమమందు భేటీచేసినమాత్రమే చాలా సంతోషపడి పినకేశవప్పనాయుడికి తండ్రివుద్యోగమున్ను యిచ్చి అనేక బిరుదులున్ను రత్నాభరణభూషణాంబరములున్ను యిచ్చి మంగపతినాయుడికిన్ని వస్త్రాభరణములు యిచ్చిరి. తోడుతోనే మానామధురలోవున్న దళమంతా శేఖరించుకొని పరమగుడికి వచ్చిచేరి కోట యావత్తు యిడియకొట్టిరి. అప్పుడు తుంబిచ్చినాయుడి పెద్ద బిడ్డలున్ను బిడ్డ బిడ్డలనిన్ని కాళ్లలో వేసి చాలాగా వంతపడ్డందువ యేలినవారిక్కడకువచ్చి వాండ్లకు పరమగుడి కావలిన్ని పాంబూరు గ్రామమున్ను యిచ్చి యిట్లావుండగా ఖండికేశంరాజు మనకు నిండా హితముగావున్న తుంబిచ్చినాయుణ్ణి వీరు కొట్టినరాయని బహు ఆక్రోశముగా మాటలు అత్యాసముగా మాట్లాడినాడని వర్తమానం వీరువిని ఖండికారిప్రస్తాపం మనంకాయకనే వుండుట మనప్రస్తాపం వీరు కాయకనిర్ధోమిటని యి

తరం యూరోపియనుపాళెయగాండ్లను శేఖరించి స్తోమశుద్ధి చేసుకొని రణభేరి వేయించి దండు సాగించుకొనిపోయి దర్భశయనం మొకలు నవపాషాణాలవరకు యేకముఖముగా దండుదించి కరకురలలో కలిగిన పడగలంతా నవపాషాణం రేవుకురపించి దళమంతా పడవలమీద యెక్కించి తాము పడవెక్కి ఖండికేశం కరతోరమన్నారు రేవులో పోయిదిగి అప్పటనుంచి ఖండిరాజుకర్ణ బ్రాహ్మణ సేవకబ్బు కొంచురమ్మనిన్ని, భేరీ రమ్మనిన్ని, రాసినందున ఖండిరాజు సేను సింహాసనాధిపతిని. కిరీటాధిపతిని సేను వకరికి సేవ బ్బు యిచ్చేది లేదని దండెత్తి వస్తున్నాడని విని రాజా పెదకృష్ణప్పనాయకువారు తమసేనలున్ను, పాళెగాండ్లున్ను రణభేరి వేసి యెదురెక్కి సాగిరి. ఉత్తరం కల్లో వారు వచ్చి దిగిరి.

—సశేషము.

గుడిలోని దైవమా!

గుడిలోని దైవమా! ఆలింపవోయి!
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!
నీపాదపూజకై
వెదకి తెచ్చినపూలు
నీపాదసేవకై
నింపి తెచ్చినసీళ్లు
పనికిరావంటారు
మైలపడెనంటారు.
గుడిలోని దైవమా! ఆలింపవోయి!
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!
మాలమెట్టిననేల
మాలముట్టిననీరు
మాలపాడినపాట
మాలలాడినమాట
మైలపడెనంటారు
పనికిరాదంటారు.
గుడిలోని దైవమా! ఆలింపవోయి!
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!
ఆర్యఋషిసంతాన
మంటరానిదియంట
నీవు చేసినసృష్టి
కీకలంకాలంట
నీకన్నకొడుకులము
నినుచేరరానీరు
పూజారులెవరోయి!
భూదేవులెవరోయి!
గుడిలోని దైవమా! ఆలింపవోయి!
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!
కట్టగుడ్డలేక
గాసిల్లమన్నారు
కుడువకూడూ లేక
కూలిపోమన్నారు
నీగుడికిరానీరు
నినువేడుకోనీరు
నిన్ను రాతిగజేసి
నిలుపుకున్నారు
గుడిలోని దైవమా! ఆలింపవోయి
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!

పురిపండా అప్పలస్వామి.

ఆంధ్ర భూమీ!

౧

ఆంధ్ర భూమీ!
పూలపండుగ
కందగించిన
నీ వినూత్నో
త్సాహసంపదచే
వసంతుని
స్వర్గరాజ్యములు.

౨

పూతగిల్లిన
నీతలంపే
లేతవలపై
శ్రీవసంతుని
కంఠమున ము
త్యాలసరమై
కళలు గాంచినదీ.

౩

తొలకరించిన
నీమనమ్మున
మొలకలెత్తిన
జీవరాగము
తెలుగుతోటకు
నిండువెలుగై
వలపు నిల్పినదీ.

౪

కాపుకన్నియ
తీగెకంఠము
కళలు రాగాం
బరము నింపుచు
నూర్జితమ్మగు
కావ్యలోకము
నూపివేసినదీ.

౫

తలపులన్నీ
నిత్యములుగా
పలుకులన్నీ
ముత్యములుగా
కర్షకుడు గొం
తెత్తిపాడెను
కావ్యలోకాన.

౬

ఆంధ్రవీరుల
పౌరుషమ్ముల
నందగిల్లిన
వీరగేయము
గౌతమీకృ
ష్ణా స్రవంతులు
కలిసిపాడినవీ.

౭

మాయమై లో
కాలుదిరిగే
తీయగా హృద
యాలగాంచీ
వాయుమండల
మద్భుతమ్మగు
వార్త దెల్పినదీ.

౮

కొండకోనల
నిల్చిపాడే
పండువలపుల
పల్లెపడుచే
జాతిగుండెలు
కరుగజాలే
రీతి జూపిందీ.

౯

కోలుపోయిన
ప్రణయజీవము
కోటికుం జీకటి
లో మునింగిన
రాగిణీహృద
యాన కరుణా
రసము పొంగిందీ.

౧౦

మేఘమాలిక
లందు వెలిగే
మెరుపుకన్నియ
నిత్యలీలా
ముగ్ధజీవుని
హృదయమున నిజ
ముద్ర వేసినదీ.

౧౧

సత్యమగు
ప్రేమమ్ముకోసము
నిత్యహృదయము
ధారవోసిన
భ్రమరజీవము
ఫలశ్రుతిలో
పసలు జూపినదీ.

౧౨

పండువెన్నెల
నిండువెలుగున
తాండవించే
ముగ్ధహృదయము
చందమామే
పొంగజాలు, ఫ
సందుజూపినదీ.

౧౩

గున్నమామిడి
కొమ్మనుండే
కోకిలము మృదు
గళముదీరిచి
ప్రకృతిపురుషుల
ప్రణయరూపము
పాడసాగినదీ.

౧౪

అమృతజీవని
మైనసుందరి
యరమరలు
లేనట్టివలపున
నీదజాలెను
భావవార్ధుల
నీశ్వరునితోడన్.

౧౫

తొలకరించిన
భూములందీ
తెలుగుతోటను
నాటగానే
వలపునేర్చిన
చిన్నికృష్ణుడు
వచ్చెనమ్మ వసంతుడై.

౧౬

చూడ లేమా
విశ్వరూపము!
పాడ లేమా
జీవగానము!
పాడిచూడం
గలము; తల్లీ!
భయము మనకేమి?

[illegible]

పెళ్ళికూతురు

౧

"ఎంత దారుణం! ఇంతకూ, పాపం, మూడో పెళ్లి గీతకూడా ఉంది కామల్లు," అన్నాడు రాఘవయ్య దీనంగా.

వెంకటేశ్వర్లుగారు చిరునవ్వు పెదవుల దీపంకొద్దిగా పెద్దదిచేసి బాల్యస్నేహితుడివంక చూస్తూ కూర్చున్నాడు.

రాఘవయ్య సూటిగా వెంకటేశ్వర్లుగారి మొహం వంక చూసి పదేళ్ళయింది. అంతక్రితం రాఘవయ్య, వెంకటేశ్వర్లుగారుకూడా కొంచెం అటూఇటూగా తన హోదాకు సమానమైన హోదాగలవాడేనన్నట్టు నటించాడు. కాని పదేళ్ల కిందట రాఘవయ్య కొన్ని పరిస్థితుల వల్ల దివాలాఎత్తటం, వెంకటేశ్వర్లుగారు కొక్కపట్టున మరో ఇరవై ఎకరాలు సుక్షేత్రమైన మాగాణీభూములు కొనటం జరిగింది. భగవంతుడు డింతపక్షపాతంతో ప్రవర్తించటం రాఘవయ్యకు చాలాఆగ్రహకారణమైంది. కాని వెంకటేశ్వర్లు తనబాల్యస్నేహితుడని నలుగురి చెవులా వేస్తూండటం చాలాఅవసరమనీ, ఆ నిక మీద ఆయనవంక తేరిచూడలేకపోవటంవల్ల తనకు కలిగే హాని ఏమీలేదనీ తీర్మానించుకున్నాడు రాఘవయ్య. ఆ పెద్దమనిషి ఇప్పుడు వ్యాపారకారణంగానే వెంకటేశ్వర్లుగారి దృష్టితప్పించి ఇల్లంతా కలియచూసి, "ఎట్లాగైనా ఇంటికిసంబంధం చిన్నకోడలి లేకపోయినతరవాత ఇల్లు కళావిహీనంగా ఉండటంలో ఆశ్చర్యం ఏమిటి? మళ్ళీ కొంతకాలం ఇట్లా—"

"తరవాత?" అన్నారు వెంకటేశ్వర్లుగారు.

తనధోరణిలో తను అనదలుచుకున్న ముక్క వెంకటేశ్వర్లుగారి ప్రశ్నకు సమాధానంగా అవాలంటే రాఘవయ్యకు ఒక్కక్షణం నోరుపట్టేసింది—పాడబోతున్నవాణ్ణి పాడమన్నట్టు; కాని చాలాధక్కాముక్కలు తిని చేవదేలినవుటం కాబట్టి తట్టుకున్నాడు.

"తరవాత ఏముంది? కళ్యాణం! అగుతుందా ఏమిటి?"

"నాకింకా ఆమాట తట్టలేదుసుమా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

ఆయనమాటలో ఎక్కిరింపు రాఘవయ్య గమనించలేదు.

"తట్టలేదూ! ఇంకా నీదగ్గిరికి ఎవరూ రాలేదేమిటి? నాతో ఈవిషయం నలుగురైదుగురు ప్రస్తావించారు. చిన్నవాడు, జమీందారు, బుద్ధిమంతుడు, మంచి పదవిలో ఉన్నవాడని శిఫార్సుచేశాను."

"ఎవరు చిన్నవాడు?"

"నువ్వే, మువ్వైఅయిదేళ్లవాడు ముసలివాడా ఏమిటి?"

"మనిద్దరికీ ఒక్కసారే అక్షరాభ్యాసమయింది. తెలుసునా? నీవయసెంత?"

రాఘవయ్య ఆశ్చర్యం నటించాడు. ఆయన వయస్సు నలభైఅయిదు కేమాత్రమో ఎక్కువేకాని తక్కువ కాదు.

"అయితేమాత్రం! డెబ్భైఏళ్లకు పునర్వివాహం చేసుకున్నవాళ్లున్నారు."

"ఇచ్చేవాళ్లుంటే"

"నీ కిచ్చేవాళ్ళే లేరా? ఎనభైమంది పిల్లలు కొరుకుతారు. అపూర్వానీ నాది. కాని అన్నివిధాలా అనువైనపిల్ల నేను చూసినంతట్లో—"

"ఇచ్చేవాళ్లు నన్ను చూస్తారా? నా ఆస్తి చూస్తారా?"

"అది చాలా కష్టమైనప్రశ్న. కాని నిన్నుచూసి ఇచ్చేవాళ్లు లేకపోలేదు."

"ఒక్కర్ని చెప్పు."

"నేను," రాఘవయ్య చిరునవ్వు నవ్వాడు.

వెంకటేశ్వర్లుగారు భావరహితమైన మొహంతో రాఘవయ్యవంక నిదానించి చూశారు. రాఘవయ్య సైన్యాన్నిగురించి ఆయన కేవిధమైన అనుమానం ఎన్నడూ లేదు.

"నేనూ మా శారదాంబకు ఎక్కడ తగినసంబంధం దొరుకుతుందాఅని చూస్తున్నాను, వెంకటేశ్వర్లూ! ఇదే ఇంకోళ్ళయితే తొందరపడి పెళ్లిచేసుకోమన్నా. కాని నాదగ్గిర నీకు అనుమానం ఎందుకు? చిన్నప్పటి నించీ పిల్లదాన్ని ఎరుగుదువుకదా! కాని అంద చందా లెరుగుదువుకదా! దాన్నింకొకరి కివ్వటానిక్కూడా నాకిష్టంగాలేదు."

వెంకటేశ్వర్లుగారు మాట్లాడలేదు. రాఘవయ్యకు కొద్దినిరుత్సాహం కలిగినా వెనక్కితియ్యలేదు, ఆ వేడిమీదనే మరికొన్ని దెబ్బలు కొట్టిచూద్దామను కున్నాడు.

"నీకెట్లాగో పెళ్లికావలసిఉంది. నాపిల్లకూ వివాహం కావాలి. నీతో సంబంధమంటే నా కెంతఉత్సాహంగా ఉందో నీకూ అంతఉత్సాహంగానే ఉందని అనుకుం టున్నాను. ఆలోచించుకో. కొత్తవాళ్ళతో సంబంధం చేసుకని పెళ్ళయిన మర్నాటినించీ సకలమైన నసా పడ్డంకంటె స్నేహితంలో బాంధవ్యం —"

వెంకటేశ్వర్లుగారు ఏసమాధానం చెప్పకుండా సరిగా అయిదునిమిషాలు కూర్చున్నా రాలోచిస్తూ.

"ఒక్కసారి మీపిల్లతో నేను మాట్లాడాలి!"

"అంతకన్నానా? ఇప్పుడే మాయింటికి పోదాం పద!"

రాఘవయ్య ఉత్సాహం చెప్పటానికి వీల్లేదు.

"రేపుదయం ఎనిమిదింటికి వస్తాను సరిగా."

రాఘవయ్య తనకుమార్తెవివాహం అయిపోయి నట్టే భావించుకొన్నాడు. ఇక తనకు డబ్బుకొరతలేదు. ఎస్టేటుకంతా తనే మేనేజరు. ఇంతఆస్తీ తనకూతురి సంతానానికే వస్తుంది. వెంకటేశ్వర్లుగారికి ప్రథమ కళత్రంవల్లకలిగిన కుమారుడు లక్ష్మీకాంతం ఉన్నాడు. మొదటినించీ శారదకు, ఆపిల్లవాడికీ స్నేహం. రాఘ వయ్యదృష్టి చాలాకాలం లక్ష్మీకాంతంమీద ఉంటూ వచ్చింది. తనకుమార్తె ఇంకా పసిపిల్లగా ఉన్న రోజు ల్లోనే "అదుగోనే బావ, బావను పెళ్లిచేసుకుంటా మ్మా?" అంటుండేవాడు రాఘవయ్య. కాని ఇప్పు డదంతాపోయింది. మూడేళ్ళకింద వెంకటేశ్వర్లుగారు కొడుకును ఇంట్లోనించి వెళ్లగొట్టాడు. మళ్లీ తండ్రీ కొడుకులు ఒకరిమొహం ఒకరు చూచుకోలేదు. ఈ వైరానికి-లక్ష్మీకాంతానికీ, సవతితల్లికీ ఏదో సంబంధం ఉన్నదని తప్ప మిగిలిన విశేషా లెవ్వరికీ తెలీలేదు. తండ్రీ కొడుకు లిద్దరూ ఆవిషయం ఎవరితోనూ ఎత్త లేదు. లక్ష్మీకాంతం నిర్దోషి అనుకోటానికైనా ఈమూ డేళ్లనించీ అతన్నిగురించి చాలాచెడ్డకబుర్లు వినపడుతూ వచ్చినై.

వెంకటేశ్వర్లుగారి రెండోభార్య పోయినతరవాత కూడా తండ్రి కొడుకులు కలవకపోవటం చూసి శార దకు ముసలాడు తప్పడనుకున్నాడు రాఘవయ్య. ఇక లక్ష్మీకాంతం పిత్రార్జితానికి బాహ్యుడే. పాపం రాఘ వయ్య ప్రయత్నాలకన్నీ అడ్డాకేఅయినై. చివరకు వెంక టేశ్వర్లున్ను మూడబోయ్యేటప్పుడుకూడా ఇంతా చేస్తే వెంకటేశ్వర్లు మళ్లీ పెళ్లిచేసుకుంటానంటాడో లేదో నని అనుమానమే. ఇంతకు భగవంతుడు తనయందుండ బట్టి—

తనస్నేహితుణ్ణి వసారాగదిలో కూర్చోబెట్టి రాఘ వయ్య అదివరకే పూర్తిగా అలంకరించి ఉన్న శారదను తెచ్చాడు.

"మేమిద్దరం కాస్సేపు రహస్యంగా మాటలాడుకో వాలి. నువ్వేదైనా పనిఉంటే చూసుకో," అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

రాఘవయ్య మనస్సులోనే "అంతకంటేనా?" అనుకుని బయటికి నిష్క్రమించాడు.

"ఫరవాలేదు, తలుపుతెరిచేఉండనీ," అన్నాడు వెంకటేశ్వర్లు. రాఘవయ్య తలుపవతలనించి సంభాషణ వినటాని కవకాశంలేనందువల్ల హతాశుడై తలుపుతెరిచి వెళ్లిపోయినాడు.

వెంకటేశ్వర్లు శారదనుచూసి "మాలక్ష్మి బతికుంటే ఈపాటి కీపిల్లవయస్సుది. ఇంతబాగుండేదేమోకూ డా," అనుకున్నాడు. శారదమాత్రం ఆయన్ని లక్ష్యం చెయ్యకుండా కొంచెంసేపు అటూఇటూ పచారుచేసి చివరకు అలమారుదగ్గిరికి పోయి తన ఒంటినిఉన్న

రెండుమూడుసగలలా తీసేసి అలమారులో పెట్టి తిరిగ్గా జడవిప్పుకోటం మొదలుపెట్టింది.

"అమ్మాయి నీకెన్నేళ్లు?" అన్నాడు వెంకటేశ్వర్లు గారు.

శారద కనుబొమలుముడేసి "మీకన్న నలభైఏళ్లు తక్కువ" అన్నది.

వెంకటేశ్వర్లుగారు నవ్వేడు. "ఆఁ! అంత అన్యాయంగా ఉండదు. పదేళ్ళయినా లేవా నీకు?"

"ఇంకా రెండేళ్లెక్కువే."

"జుట్టు విరబోసుకున్నా అందంగానే ఉన్నావు. పెళ్ళికూతుర్ని చేస్తే ఇంకా బాగుంటావు... నేను వచ్చిన పని తెలుసునా?"

"ఆ! నాకొంతుకోయ్యటానికి. నాకొంతంత సులభంగా తెగదు."

"ఏమంతమాటన్నావు? నీకు కళ్యాణం అయే యేర్పాటు చేద్దామనుకుంటున్నానే."

శారద ధైర్యంగా వెంకటేశ్వర్లుగారిని సమీపించి ఆయనవంకే చూస్తూ నిలబడ్డది. నడుముకు చేతులుపెట్టుకోటం ఒక్కటే తక్కువనుకున్నాడు వెంకటేశ్వర్లు గారు. ఆయన కప్పుడే ఆపిల్లనుచూస్తే భయంకూడా ప్రారంభమయింది.

"నన్ను మానాన్న మీకిచ్చిచేస్తే నూతిలో పడతాను. జ్ఞాపకముంచుకోండి. నే నాడపిల్లలందరిలాంటి దాన్ని కాదు. మా అమ్మ నన్నెప్పుడు, శక్తీ, అని పిలుస్తుంది." కిటికీలోనించి గాలివచ్చి ఆపిల్లజుట్టు అటూఇటూ తోస్తున్నది.

"దాదాపు అట్లాగేఉన్నావు. అయితే నన్నుచూస్తే నీ కంతమంచిఅభిప్రాయం కలగటానికి కారణం?"

"మీరు మనిషి కాదు. అయితే కాంతాన్ని, పెళ్ళాం మాటలువిన్ని ఇంట్లోనించి వెళ్ళగొడతారా?"

వెంకటేశ్వర్లుగారు కొంచెంసేపు జవాబుచెప్పలేదు.

"నువ్వందరితో ఇట్లాగే మాటలాడుతావా?"

"మాటలాడను."

"నాతో నేనా?"

"ఆ,"

కొంచెంసేపిద్దరూ మానంగా ఊరుకున్నారు.

"కాంతంవల్ల తప్పులేదని నీకేంనమ్మకం!"

"నాకు తెలుసు, నేను కాంతాన్ని ఇంతదాన్నప్పటి నించీ ఎరుగుదును."

"నే నెరగనా!"

"ఎరగరు..."

"ఇప్పుడు కాంతం ఎవరితో తిరుగుతున్నాడు తెలుసునా?"

"ఆ,"

"రౌడీలు, బోగంవాళ్లు."

"మీకన్నా, మీపెళ్లాంకన్నా మంచివాళ్ళే."

వెంకటేశ్వర్లుగారు దీనంగా నవ్వాడు.

"నీకెల్లా తెలుసు?"

"లేకపోతే కాంతంవాళ్ళతో ఇన్నాళ్ళు కలిసి ఉండడు."

"కాంతం ఉన్నచోట చెడుండదా?"

"ఉండదు."

"నీ కింతధైర్యంగా మాట్లాడటం ఎవరు నేర్పారు?"

"మీఅబ్బాయి."

శారదకు కాంతంస్నేహితంకాక శిష్యత్వంకూడా ఉందన్నమాట!

"కాంతం ప్రతిరోజూ ఇక్కడికి వస్తుంటాడా?"

"ఆ."

"నావిషయం ఏమన్నా అంటాడా?"

"అనడు. తననోటికెంట మీవిషయం ఎప్పుడన్నా మాట తూలిస్తే ఆరోజునించీ తనతో నన్ను మాటలాడవద్దన్నాడు."

వెంకటేశ్వర్లుగారు ఆశ్చర్యపడి "ఎందుకు?" అన్నాడు.

"తెలివిగలవాడు కనక."

"అయితే అటువంటి దేదైనాజరిగితే వాడితో మాటలాడటం మానేస్తావా?"

"మానను."

"ఏం!"

"మిమ్మల్ని తిట్టటానికి నాకేమీ అభ్యంతరం లేదు...."

"అంతరాడవాళ్లూ ఇట్లామాట్లాడటంనీకిష్టమేనా?"

"అందరికొడుకుల్లా కాంతం స్తితికి రావటం మీ కిష్టమా?"

"లేదు."

"నాకూ లేదు."

"అది కాంతం తప్పేమో."

"కాదు. అయితే ఇదీ నాతప్పే."

"అయితే వాడికోసం నువ్విట్లు మారిపోయినావా?"

"ఆ"

వెంకటేశ్వర్లునవ్వుతుంటూ "నిన్నింకా ఎంతసేపు పరీక్షచెయ్యను," అనుకున్నాడు బిగ్గరిగానే.

"ఇంతసేపు నన్ను పరీక్షచెయ్యండి అని మిమ్మల్ని బొట్టు కాటికపెట్టి నేను పిలవలేదు. బహుశా మా నాన్న నడిగితే తెలుస్తుంది—ఇంకా ఎంతసేపు పరీక్షచెయ్యాలో."...

"మాకాంతంవల్ల తప్పులేదని చాలాకాలంకిందటే నే కని పెట్టాను.

"మీరాకామాట అనటానికి నా మొహాకీలేదా? నిజం తెలిసినతక్షణం వెళ్ళి మీ అబ్బాయికాళ్లందుకు పట్టుకోలేదు!"

"నాచేతకాలేదు. తగినసమయంకోసం ఎదురుచూస్తున్నాను."

"మీ అబ్బాయే పొరపాటుపడితే తెలిసినవెంటనే పోయి కాళ్ళుపట్టుకుంటాడు."

"అవును వాడికి తల్లిమంచిగుణాలన్నీ వచ్చినై."

"అటువంటి భార్యపోతే పశువైతే తప్ప మరిరెండోపెళ్ళిచేసుకోడు."

"నీయిష్టంవచ్చినట్టను. నేను మొండెత్తుపోశాను. చాలాకాలంకిందనే నాగుండె రాయయిపోయింది ఇక అరిగిపోవలసిందేకాని కరగదు."

ఈమాట కేవలం నిజంకాదు. ఆమాట అంటుండగానే ఆయనకళ్ళు చెమ్మగిల్లినై.

శారద తనకు ప్రాజయం ప్రారంభమైందని కనుక్కుంది.

"ఇట్లారా అమ్మా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు. శారద మారుచెప్పకుండా మెల్లిగావచ్చి ఆయన పక్కనే నిలుచుంది.

"జపవేసుకోమ్మా. నిన్ను మాకాంతంకిచ్చి చేస్తాను. ఒకఆడది మమ్మల్నిద్దర్నీ వేరుచేసింది. మళ్ళీమమ్మల్నిద్దర్నీ కలపటం నీవంతు. శారద తలవంచుకుంది. ఆపిల్లకళ్ళనుంచి రెండుబొట్లు రాలటం వెంకటేశ్వర్లెరగడు. కాని ఆయనకళ్ళనించీ కారినబిందువులు తనతలమీదపడటం శారదగమనించి అవే అక్షింతలకింద గ్రహించింది.

కొడవటిగంటి కుటుంబరావు.

ఉగాది నాడు

ఈ మహజ్వాల లెందాకమండనీ
ఎన్ని లోకాలైన కాలనీ
ఈ యనంతాంభోధి భంగాలుపొంగనీ
ఎన్ని భవనాలైన కుంగనీ
ఈ జంఝానిలప్రవీచు లిందెల్ల వీవనీ
ఉర్వీతలంబెల్ల నఱ్ఱాశలూపనీ
ఈ వుగాది నవయుగాది
ఈ మహోదయ వేళ

శిథిలభారత వీణ జీవతంత్రులుగూర్చి
సర్వభావైతృత్వ సద్భావగీతి నేను
భారత జాతీయ ధర్మసౌధము నుండి
వాసంత పికమునై
మిన్నందు ఖగమునై
పైకెగిరి, పైకెగిరి, పాడకలను
ఆనందమయముగా నాదకలను.

పెమ్మరాజు రాజగోపాలము

ఆంధ్రభూమి

౧

రాజయోగీంద్రుడైన శ్రీరామచంద్రు
మంగళపదంబు లంటిన మహిమతోడ
కర్మయోగార్థమునుజాటు ధర్మమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౨

శాతవాహనవంశవిఖ్యాతనృపుల
పాలనంబున పరరాజవందనీయ
పదముప్రాప్తించిమించిన భవ్యమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౩

కాకతినృపాల చంద్రుల ఖడ్గధార
కరినృపాలురు వెరచి జోహారువెట్ట
దక్షిణార్ధంబునేలిన ధన్యమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౪

కృష్ణరాయనృపాలుని కీర్తికాంత
ఖండఖండాంతరముల స్వాగతముగాంచి
గళమునవరించి తనదు దిగ్జయముఁబాడ
నాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౫

భారతామ్నాయపరమార్థ సారమెల్ల
విశ్వమోహనసత్కళావిభవ మెసఁగ
నాంధ్రభూముల జల్లిన యమృతమూర్తి
తిక్కయజ్వను గన్నట్టి దివ్యమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౬

అఖిలదక్షిణ దేశ గాయకసమాజ
పూజితానల్పమాధురీపూర్ణమూర్తి
త్యాగరాజసమర్చిత యోగమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౭

జీర్ణ భారతధర్మ సంజీవి నగము
నిఖిలలోక సమారాధనీయ కీర్తి
గాంధిఋషిచంద్రు నుపదేశ కాంతులందు
స్నాన మొనరించుచున్న ప్రసన్నమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౮

అజాంతగుహాలలో నజరామరంబైన
శిల్పసౌభాగ్యంబు చెలువునిల్పి
త్యాగరాజమనోజ్ఞ రాగమాలికలలో
ప్రౌఢసంగీతంబుఁ బాడుకొల్పి
భారతామ్నాయవాగ్ధోరణీసంశ్రిత
కవితామరందంబుఁ గడలనించి
కరుణామయుండైన గాంధీమహాత్ముని
హరిజనోద్ధరణంబు ననుసరించి
ఉన్నతవికాసడోలిక నూగియూగి
నిత్యయౌవనమూర్తితో నృత్యమాడు
చిన్నయమనోజ్ఞహాసినీ! చేరికొలుతు
నాంధ్రమాతరో! వందన మందుకొనుము.

నంబూరి. బంగారయ్య

ఆసీస్సులు

౧

ఉదయభానుని బంగారునొజపు పిఁగులు
కిరణములు చేసుకై యాదికిటివిశాల
దంష్ట్ర లుత్తుంగ స్తంభతఁ దనరుధరణి
నుయ్యెలగనూచు మాతంగు నుజ్జ్వలోక్తి
ఆంధ్రభూమి కాలంబన మగుత ! సతము.

౨

ఉక్తివై చిత్రి కావ్యమా యొప్పు లొల్క-
భావమేదైన నేమని పల్కు-చిలుకు
ప్రవరసేనుని దివ్యప్రబంధగీతి
మాయువకదంబములలోన మలయుగాక !

౩

కవి మహర్షి యె, సర్వలోకాలనించు
చిత్రభావసుధాసాధసరణికతన ;
పుట్టపుట్టువు తార్కాణపాఅయునన్న
భట్టితోతోక్తియగుత మాపట్టులందు

౪

కర్త నున్నలు రెండైన, కర్మయొకట
నొప్పు నను సాహితీవీథినొజ్జల కివె
దండములటన్న బిల్హణు దారి మాకు
గ్రాంథికంనున్యులకు మ్రొక్కఁగాక్క యగుత.

౫

లలితమాధుర్యసూక్తి లాలాపనంబు
సేయనేర్తు నాకవితకి చిత్రసీమ
శిశువు కవియగు, కవి-కవిశేఖరుఁడగు
నన్నహరవిజయునోక్తి మాకాత్మతృప్తి

౬

క్రమకవితార్థయుక్తుల కావ్యశోధ
విప్పివెలయించు నన్నయ్యయొప్పు, తెన్గు
తేట నిగ్గులజాటిన తిక్కయజ్వ
తీయదనమును తమ్ములఁదీర్చుగాక.

౭

పదకవిత్వంపు బంగారుపసిమిమిసల
నెదల గుదిగ్రుచ్చు నారాధ్యు మృదులఫణితి
శ్రోత్రసీమల నడయాడు కుఱ్ఱవారి
హత్తికొని యంగరక్షగా నరయుఁగాక.

౮

సంస్కృతాంధ్రాల భేదంపు సరణి-తులసి
జాజిపూవుల వంటిది సరసులకును
అంచు నాంధ్రప్రశస్తి వచించునాటి
దండిమాట యైక్యమునకు దారినిడుత.

౯

తేనెసొనవోలె నొకవింతతీయదనము
సోకినంతనె గల్గించు సొగసుగలది
కావ్యమగు నన్న మొల్లమ్మకమ్మమాట
శ్రోత్రకవిశేఖరుల వాణి హత్తుగాక.

౧౦

పోతన పొలాన, శ్రీనాథు భూమి, కృష్ణ
రాయ నాస్థాని, నాయకరాజు నగరి
అల్లిబిల్లిగ నాటల నాడినట్టి
శారదాదేవి మాకౌత విశాలహృదయ.

౧౧

పూలతావులు, బంగరుపొంక, ముదధి
లోతు, వెన్నెలచల్వలు, పాతువిడని
యద్రిగాంభీర్యగరిమ, మాయాంధ్రభూమి
వెలసి కమ్మనితావుల-వీచుఁగాక.

వేంబాక్కం ఆదినారాయణ శాస్త్రి.



శిరముపై ధరించెడు. భూషణమును మకుటమందురు. కిరీటమకుటము, కరండమకుటము, జటామకుటము అని మకుటములు మూడువిధములు. వీనిలో కిరీటమకుటము దేవుళ్లలో విష్ణువునకును, రాజులలో చక్రవర్తులకును అర్హమైనదని చెప్పబడియున్నది. కిరీటమకుటము పెదురు మొలకనుగాని (శంఖాకర్ణ) పెదురులకునుగాని (?) పోలియుండవలెను. పక్షిగ్రుడ్డునుగాని, తాబేటి వెన్నునుగాని, గొడుగునుగాని, తెంచేలునుగాని కూడ కిరీటములు పోలియుండవచ్చునని శిల్పశాస్త్రగ్రంథము చెప్పుచున్నది. కిరీటమకుటమున చేర్చబడు ౮విధాలంకారనామములు ఇవి: పూరిత, తుంగతార, అగ్రపట్టి, త్రివేదిక, త్రిపత్రిక, పద్మ, పుష్పమాల, శిఖామణి. పూరిత అనబడు అలంకారమునకు సౌందర్యాధిక్యమునకై మకరములు ఉంచబడవలసియుండును. పూరితాలంకారముల యొక్క మధ్యభాగమునను, అగ్రభాగమునను రెండువైపులరాళ్లు పొదగబడవలసియుండును. మకరముల ముఖమునుండి లతాలంకారములుగాని, ముత్యాలసరాలుగాని వ్రేలాడుచుండవలయును. పూరితముయొక్క మిగిలిన భాగములన్నియు తీగెలతోడను, ఆకులతోడను చెక్కబడియుండవలయును. కిరీటముయొక్క నాలుగుప్రక్కలలో ప్రతిప్రక్కయందును ఒక్కొక్కపూరిత ముండవలయును. ఈపూరితమునుపోలి రాళ్లుపొదగబడు మరియొక అలంకారము పట్టబంధము. నుదుటికిపైభాగమున కిరీటమునకు చుట్టును తిరిగియుండు పట్టమునకు అంటియుండునదియే పట్టబంధము. కిరీటమకుటమునకు ఇతరభాగములందు




అలంకరింపబడియుండు ఆభరణములు పాళిబంధము, వల్లి (తీగ), ముక్తాహారము. కిరీటమకుటముయొక్క క్రిందిభాగము నుదుటిచెంత చంద్రవంకవలె వంకదేరియుండవలయును. చెవులకు సరిగా పైన ఆకులవంటి అలంకారికమండలములను కలిగియుండవలెను. వీనినే కర్ణపాత్రలందురు. ఈకిరీటముయొక్క క్రిందియంచున ముక్తాహారములపరంపర వ్రేలాడుచుండవలయును. చెవులకుపైన కర్ణపాత్రలదిగువను చెవి తలతో కలసియుండుప్రదేశమున కర్ణపుష్పములు ఉండవలయును. ఈకర్ణపుష్పములనుండి ముత్యాలహారములు, విలువగలరాళ్లపూసలు వ్రేలాడుచుండవలయును. కిరీటమకుటములోపల అంతయు మండలాకారమున నుండవలయునని చెప్పబడియున్నది. (౮, ౬ అంకెగలబొమ్మలను చూడుడు. గతమాసమున భూషణలక్షణములలో ప్రచురింపబడిన దేవతావిగ్రహముశిరముపైనున్న కిరీటమకుటమునుకూడ చూడుడు.)



భూషణల

కరండమునుపోలియుండు మకుటము కరండమకుటము. అది పొడుగై అనేకగానుండును. లేదా విశేషము ఎత్తులేక చిన్నపరిమాణముననుండును. ఈరెండవవిధమైన కరండమకుటములో ఒకదానిపైనమరొకటి పరిమాణము సక్రమముగతగ్గుచుండు కరండములతో కూడియుండును. ఈకరండములసంఖ్య ౩ కాని, ౫ కాని, ౭ కాని యుండవచ్చును. ఇతరవిధము లయిన మకుటములకు వలెనే ఈకరండమకుటము కూడ పూరితములు, పట్టములు, పట్టబంధములు, ము



మ కు

ంము




క్తాహారములు, చూడామణి వీనిచేత అలంకరింపబడును. ఈ కరండమకుటము దేవీవిగ్రహములకును, సామంతరాజులకును నిర్దేశింపబడినది.

[౩-౫-సంఖ్యగల బొమ్మలను చూడుడు.]

జటామకుటము అన్నిశైవాగమములయందును ప్రాశస్త్యముగా వర్ణింపబడియున్నది. జటామకుటమునుగూర్చిన ఈక్రిందివర్ణనము ఉత్తరకామికాగమములోనిది. జట అనగా అల్లినజడకట్టు అనిగాని, విరియబోసినజుట్టుఅనిగాని అర్థము. ప్రాక్తనకాలమున జుట్టువిరియబోయబడియే గాని మెలిపెట్టబడియుండలేదని చెప్పవచ్చును. మెలిపెట్టబడిన జటలతో పొడుగుపాటి కల్లాయిగా చేయబడినదానికే జటామకుటమనిపేరు. పాయలుగానున్న విడుజటలను తీసికొని మూడుఅంగుళములఎత్తుగానుండు మున్నుగా వైచి ఒకటి లేక మూడు ఉంగరముల చుట్టగా చుట్టి మిగిలినపాయలనుకట్టి సాగించుకొనిపోయి మకుటముయొక్క యిరుపార్శ్వములయందును వ్రేలాడునట్లు చేయవలయును. ఈరకపుమకుటము మకరకూటము, పత్రకూటము, రత్నకూటము, పూరితము అను అలంకారమండలములతో అలంకరింపబడవలయును. జటామకుటమునకు ముఖభాగమును అలంకరింపవలసిన మకరకూటముయొక్క మధ్యకేంద్రముచుట్టును ఏడు రంధ్రము లుండును. మిగిలిన మూడువైపులయందును ఒక్కొక్కపువ్వు నాలుగువైపులయందును- పూరితములు ఉండవచ్చును. లేదా కుడి ఎడమపార్శ్వములందు పూరితములును, ముఖభాగమున మకరకూటమును, వెనుకభాగమున పత్రకూటముగాని రత్నకూటముగాని ఉండవచ్చును. పూరితములపై పంద్రెండు అంగుళము లుండవలయును. ఈరీతి మకుటములటంగు వారు శిరములో సమమై యుండవలయును. ఈ మకుటము అగ్రభాగము యొక్క వెడల్పు మట్టుయొక్క వెడల్పులో ఏడవవంతు గాని, ఎనిమిదవవంతు గాని, తొమ్మిదవవంతు గాని ఉండవలయును. శివుని కుద్దేశింపబడిన జటామకుటమగుచో దానికి కుడిప్రక్కన ఉమ్మెత్తపూవులు, నాగము, గంగావిగ్రహమును; ఎడమప్రక్కన అర్ధచంద్రబింబమును ఉండవలయును. ప్రతిజటయు చిటికెనవ్రేలంత దళసరిని ఉండవలయును. (౧,౨ సంఖ్యగల చిత్రములను చూడుడు.)





౧. చూడామణి, ౨. కుట్మల, ౩. పద్మ, ౪. పూరిత, ౫. మకర, ౬. త్రిశోదిక, ౭. పట్టబంధ, ౮. కర్ణపాత్ర, ౯. త్రివేత్రక, ౧౦. పుష్పపట్ట, ౧౧. ముక్తాహార, ౧౨. పట్ట, ౧౩. కర్ణపుష్పము, ౧౪. రత్నహార.

ము ఖు



దివంగతుడు అప్పారావు.

“కోయి లొకసా రొచ్చి కూసి పోయింది,
పండొకటి చేతిలో బడి జారిపోయె,
మెఱుపొకటి మింటిపై మెఱసిపోయింది.”

శ్రీ బసవరాజు వేంకటఅప్పారావు మరణవార్త వినుటతోడనే అతడే వ్రాసిన పైపంక్తులు స్మృతిపథమున తట్టినవి. ఈ అకాలమరణముచే ఆంధ్రసారస్వతప్రపంచము నపుట్టిన విషాదము ఇంతటంతట పోవునది కాదు.

కవి, గేయకారుడు, విమర్శకుడు అయి అప్పారావు ఆంధ్రభాషాయోషను కైచేసినాడు. ఆవేశము ఆతనిసొమ్ము.

“నన్నెవ్వ రాపలే రీవేళా
  నాధాటి కోపలే రీవేళా
నోట పలికేదంత పాటగా మోగేను
కోటివరహా కత్తుకత్తుగా తూగేను
  నన్నెవ్వ రాపలే రీవేళా.”

అని చాటుచు ఆతడు 'కావ్యమే జీవము'గ గడుపుచు,

'కావ్యపానము చేసి కైపెక్కి నానే
దివ్యలోకాలన్ని తిరిగొచ్చినానే'

అని గానముచేయువాడు. 'దివ్యలోకాలన్ని తిరిగొచ్చినానే' అని గానముచేయుట కలవడినట్టి ఆకవి ఇపుడు ఆంధ్రభూమికి తిరిగిరాకుండగ దివ్యలోకమునకు పోయినాడు. నలుబదివత్సరముల నడివయస్సు

భార్యాభర్తల అన్యోన్యప్రేమ ప్రదర్శించు ఆతనిఖండకావ్యములందు అప్పారావు భావలాలిత్యమును మనము పసిపట్టవచ్చును. ఆతని 'పేరంటము' అను కావ్యమునందు భర్తభావములను, 'నోము' అను కావ్యమునందు భార్యభావములను ఎంతలలితముగ ప్రదర్శింపబడినవో చూడుడు.

“.................. వనిత గ్రీష్మ
తప్తగాత్రయయ్యెను, నాహితమ్ముగోరి
....
యట్లు 'పేరంటమునకేగు ......'”

అను 'పేరంటము' లోని భర్తయు;

“నేవి కారగింపు గనిష్ట లీయజాను
పంతు వైకొని ...... పంచెదన్నె,
రామచిలుకను దినిపించి, 'శ్యామ, విభుడు
చేతతోడ తెట్టకరూ భుజింపుచుంటి
గాదె ....”

అను 'నోము' లోని భార్యయు ఆదర్శప్రాయములైన పాత్రలు గదా!

ఈఖండకావ్యములవలన అప్పారావు కవియై జీవితమున లాలిత్యము గ్రసింపగలగినవాడుగా కనుపించుచున్నను ఆతనిజీవితము మాధుర్యమునకు నోచిపుట్టలేదు.

“బసవరాజు వేంకటఅప్పారావు బెజవాడలో న్యాయవాదమును పూనుకొనెను. ప్రకృతివైచిత్ర్యముల దిలకించుటకై పరుగులిడు భావోద్రేకతకలిగిన అప్పారావు తప్పుడుసాక్ష్యములను తీర్చి దిద్ది నేర్పుటకెట్లు హృదయమును వంచింపగలడు? న్యాయవాదవృత్తి అప్పారావును అర్ధాకలితో వంచబెట్టినది. ఉద్యోగముచేసియైన బ్రతుకుదమని బయలుదేరినాడు. అదియు గగనకుసుమమై ఆంధ్రావనిలో అందరానిదైపోయినది. ఇంతలో ఢిల్లీలో పత్రికాసంపాదకత్వమున కాహ్వానము రాగా పయనమై పోయినాడు. అక్కడికి వెళ్లుట

తోడనే ప్రాద్దనురైనది. ఉవ్విళ్లూరించిన ఉద్యోగము నకు ఉత్వాసనము వచ్చినది.''

—ప్రజామిత్ర; జూను, 14.

'కావ్యపానపు కైపులో' ఎక్కరాని కొండ లెక్కివచ్చిన ఆతని వెనుకటిగీతమును

'కత్తిపెట్టి పొడిచినావో 'యు' దేవా!

.... "

ఇక ఇప్పుడు సుభువుగ అర్థమగును.

"తలవాల్చి నాస్థితి తలచి కుంగేను,
కుళ్లికుళ్లి లోన కుమిలిపోయేను
రాజులలో కవిరాజు నే నౌను
పాకుగుహలో నేడు పారాడవాయే!
కోకిలలందు పుంస్కోకిల నేను
గొంతునొక్కకు మూల కూరదోవాయె!

అని ఆతడు పాడియున్నచో ఆశ్చర్య మేమి?

'అమృతహస్తా! చిల్కు మమృతబిందొకటి
గొంతెండిపోయిన కోయిల నోట!'

అని ఆతడు ప్రార్థించినాడు. ఆతని ప్రార్థనము అరణ్యరోదనమైనది. అగుట నాదుర దృష్టవంతుడు

'అమృతపాత్ర దొంగిలించావ్, దేవా!
అందులో విసము తాగించావ్, దేవా!'

అని ఆక్రోశించినాడు.

'అమృతపాత్ర' లో విసమును తాగినను ఆతని గేయములు అమృతనిష్యందినులై యున్నవి. 'బాపూజీ—మాబాప్', 'కొల్లాయి గట్టితేనేమి, మాగాంధి కోమటై పుట్టితేనేమి' అను ఆతని గేయములలోని అమృతమును నేటిఆంధ్రులు పలువురు ఉచ్చిష్ట మొనర్చియున్నారు.

అప్పారావు కవి, గేయకారుడుమాత్రమే కాడు; సాహిత్యవిమర్శకుడును. ప్రభవవత్సరపుఆంధ్రపత్రికఉగాదిసంచికలోని 'ఎంకిపాటలగాలిదుమారము' అనువిమర్శకవ్యాసమును, ౧౯౩౨ ఫిబ్రవరిమాసమునప్రచురింపబడిన 'ఆంధ్రకవిత్వచరిత్రము' ను ఆతనివిమర్శకశక్తికి మనము చూపగల ఉదాహరణములు. 'శక్తి' తొలిసంచికలో 'శబరి' పై అతడువ్రాసినకొలదిపంక్తులు ఆతనినిరంకుశవిమర్శనమునకు నిదర్శనములు.

అప్పారావు తనప్రకృతినిగూర్చి కొండొకచోట ఇట్లుచెప్పుకొన్నాడు:

"నేను మొత్తంమీద నిరంకుశుణ్ణి—జీవితంలోనూ, సాహిత్యవిమర్శనలోనూ, కవిత్వంలో కూడా. ఎవడికీ లొంగేదికాదీప్రకృతి. విశ్వామిత్రుడిగోత్రంలో పుట్టినవాడిని, ఒకణ్ణి జయించాలి, బ్రహ్మఋషిపట్టం అధిష్ఠించాలి. అందులో ప్లీడరీఒకటి వెలిగించామకదూ భారతీదేవితో జగడమాడి బెజవాడ వెళ్లిం తరవాత."

— భారతి; ఫిబ్రవరి, 33.

'ప్రజామిత్ర' చెప్పినటుల 'ఆంధ్రదేశము ఆతనిప్రతిభను గుర్తింపలేకపోయినది. ఆతని శక్తిని వినియోగించుకొనలేకపోయినది. అప్పారావుకు ఏబదిరూప్యముల జీతమొసంగకలిగిన నాథుని ఈ తెలుగు సీమ కలిగియున్నచో, ఇత డింతటి దుర్మరణమునకు పాలుగాకుండ నుండెడివాడు.''

'పెలతేనిమణిని కాజేసావ్, దేవా!'

అని విచారించుటతో కాలముద్రోయక ఈభాషాసేవకుని రచనములన్నియు ఈతని పూర్తిజీవితచరిత్రముతో చేర్చి ఒక్కసంపుటముగ ప్రచురించుటకు ప్రయత్నింపవలసిన బాధ్యత ఈతనిమిత్రులపై నిలచియున్నది. ఈప్రయత్నమున 'ఆంధ్రభూమి' యథాశక్తి ని తోడ్పడగలదు.

శ్రీఅప్పారావు పవిత్రాత్మకు భగవానుడు శాంతిని ప్రసాదించునుగాక!

చంద్రుడు

[illegible]

నెడనెడ త్రోసుకు
తొంగిచూచు ఆ
సాంత్వన కరుడగు
చంద్రుని జూడగ
నిజపీయూషము
దప్పిపోసెడు
జక్కవ కవలను
నవ్వుల నింపెడు
లోకమోహనుడై
స్ఫురియించున్,
లోకము మోహన
మనిపించున్.

ధూసరితంబౌ
జుట్టుచీల్చుకొని
కావిరి మెసవిన
రాగిమోముతో
దప్పి లభింపని

[illegible]

నొసటను రేగిన
పుండుబావితో
రక్తబాష్పములు
జలజల రాలగ
క్షామ నిపీడిత
కర్షకారు గతి
ఎరుపు మంటలే
ఊర్పు సెగలుగా
లోకము నింపెడు
చలువ చందురుడు
ఆర్తగీతితో
ఆక్రందనతో!
చంద్రుని కౌముది
గంగ గలిసెను.
లోకము జ్వాలా
క్రాంత మయ్యెను.

జనమంచి కామేశ్వరరావు.

ఆంధ్రభూమి

శ్రీముఖాబ్దము
సిరుల కిరవై
చిన్నినగవులు
చిలుకరించెడి
ఆంధ్ర తేజము వెల్లివిరియ
ఆంధ్రభూమి నలంకరింపర!
క్రొత్తచివురులు రేకెత్తగ
క్రొత్తసుమముల చెలువొలయగ
క్రొత్తతావులు దిశలబర్వగ
క్రొత్తపాటలు కోకిలాంగన
కుతుకను సవరించిపాడగ
క్రొత్తతలపులు కొనలసాచగ
త త్తరిల్లుముదీక్షితుడవై
జయమునీకగు జయమునీకగు
జయమునీకగు ఆంధ్రపుత్రుడ!

శ్రీముఖాబ్దము
చెలువుకొలువై
శీర్షమున నా
శీస్సులుంపగ
ఆంధ్ర తేజము వెల్లివిరియగ,
ఆంధ్రభూమి నలంకరింపర!

కందుకూరి రామ[illegible]

సంపాదకీయసమాలోచన

ప్రత్యేకకర్ణాటరాష్ట్రము:

లండనురాయబారము:—

బొంబాయిరాజధానియందును, చెన్నపురి రాజధానియందును, కూర్గుసంస్థానమునందును చెదరియున్న కన్నడజిల్లాలను నొకటిగా కలిపి నూతనసంస్కరణప్రణాళికయందు ప్రత్యేకరాష్ట్రముగా ఏర్పఱుప జాయింటు పార్లమెంటరీకమిటీ ఎదుట నివేదించుటకును, ప్రత్యేకకర్ణాటరాష్ట్రవిషయమై విచారణసలుపుటకు కమీషను నియమింప రాజప్రతినిధిని కోరుటకును-లండను మహాపట్టణమునకును, సిమ్లాకొండలకును-కర్ణాటకప్రముఖులు రాయబారము పోవుచున్నారు ఈ విషయమై కర్ణాటకసమ్మేళన సమావేశకార్యనిర్వాహకసంఘము వారు చూపుచున్నత్వర, ఉత్సాహము ఆంధ్రులకు అనుసరణీయములుగ నున్నవి. కాని-స్వయముగ తోచకపోయిన మానె-చూచియైన నేర్చుకొనుపాటిబుద్ధి ప్రత్యేకరాష్ట్రసంపాదనవిషయమున ఆంధ్రులకు కలుగకున్నది. ప్రత్యేకరాష్ట్రమును కాంక్షించిన వారిలో ఉత్కళులు, కన్నడులు, ఆంధ్రులు ముఖ్యులు. అందు ఉత్కళులు రాష్ట్రమును సంపాదించుకొనిరి. కన్నడులు సంపాదింప విశ్వప్రయత్నము లొనర్చుచున్నారు. ఆంధ్రుల పక్షమున ప్రయత్నలేశమైన లేదు ఆంధ్రదేశము మొత్తముమీద ఏపదుగురు వ్యక్తులో ఈ విషయమై కొంత ఆందోళన పడుచున్నారు. కొందఱు సముద్రముదాటి సీమకును పోయియున్నారు. కాని ఏమి లాభము? దేశము హుషారీయనిది వారికి కార్యాచరణమున ఎట్లుఉత్సాహముండును? ఈ విషయమై సీమకుపోయిన వారిప్రధానలక్ష్యము ప్రత్యేకాంధ్రరాష్ట్రసంపాదనమనుటకంటె ఆంధ్రప్రాంతములను ఉత్కళములో చేర్పకుండచూచుటయే అయియున్నదనుట సత్యసమీపము. ప్రత్యేకరాష్ట్రవిషయమున ఆంధ్రవిశ్వమునందు వ్యాపించియున్న ఈనిర్లిప్తతకు కారణమేమి?

పత్రికలలో వ్యాసములు, శాసన సభలో ప్రశ్నలు చాలవు:—

"రాజధానిపట్టణమగు చెన్నపట్టణము రాజధానికి మధ్యను లేదు. అది ఆంధ్రులకంటె తమిళులకు అనుకూలముగనున్నది. ఆంధ్రులకంటె తమిళులే ఎక్కువమంది ఉద్యోగములలోనుండుట కిదియొక కారణము. పాలకులదృష్టి ఆంధ్రులమీదకంటె వారిమీదనే ఎక్కువగ ప్రసరించుచుండును. తమిళులకున్న సౌకర్యములు ఆంధ్రులకు లేకుండుటచే ఆంధ్రదేశమునందు మెట్టూరు ప్రాజక్టువంటి ప్రాజక్టు, పైకారా విద్యుచ్ఛక్తి యేర్పాటువంటియేర్పాటు లేకున్నవి. ఇది ఆంధ్రుల కన్యాయమేగాని వేఱుకాదు" అని ఆంధ్రనాయకులు అద్దేపల్లి హరిశ్చంద్రుడుగారు ప్రత్యేకాంధ్రరాష్ట్రము వెంటనే యేర్పడవలసిన అవసరమును గూర్చి ఆంధ్రపత్రికలో వ్రాయుచు ప్రస్తావించిరి. ఉద్యోగముల విషయమున ఆంధ్రులకు జరుగుచున్న అన్యాయమును వారుగడచిన మదరాసు శాసనసభలో ప్రశ్నలువైచి బయటపెట్టిరి.

అయితే ఈ అన్యాయమునకు, ప్రత్యేకాంధ్రరాష్ట్రము నిర్మింపబడువఱకు వల్లకుండ వలసినదేనా? వల్లకుండరాదు. సగమునకు పైగా ఉద్యోగములు ఆంధ్రులపాలు కావలసియున్నది. ఈ ఉద్యోగములందు చాలి బాతి అనుభవము సంపాదించిన ఆంధ్రులు ప్రత్యేకాంధ్రరాష్ట్రముపుతొలిజట్టుఉద్యోగులు కావలసియుందురు. కావున ఈ అన్యాయమును తొలగించుట అత్యవసర కార్యము. అయితే ఇందుకు పత్రికలలో వ్యాసములు, శాసన సభలో ప్రశ్నలును చాలవు. తెరపియెఱుగని ఆందోళన జరిగినగాని మదరాసుప్రభుత్వమున పీటలు పెట్టుకొనియున్న అరవవానిప్రాబల్యమునకు సడలుపాటు, ఆంధ్రునిప్రాబల్యమునకు శుభారంభ ముజరుగదు. అట్టి తెరపియెఱుగని ఆందోళనకు శ్రీ హరిశ్చంద్రుడుగారివంటి సమర్థులగు నాయకులు పూనుకొని కార్యము తెలగిట్టిదని ఇతరుల కుపదేశింప వలసియున్నది.

స్వభాషాభిమాన మిట్లుండ వలయును:—

మారిస్ కెవాలియర్ ఫ్రెంచి దేశస్థుడు. ప్యారిసుపట్టణ మాతని జన్మస్థలము. సినీమాలో వేషములు వేయుట ఆతనివృత్తి. ఆత డీనడుమ 'లవ్ మి టునైటు' అను ఇంగ్లీషుటాకీలో నటించెను. ఆఫిలుమును ప్యారిసుపట్టణమున ప్రదర్శించుటకు తెచ్చిరి. ప్రదర్శనము ప్రారంభమయ్యెను తమజాతీయుడును, విశేషించి తమ పట్టణమున జనించినవాడును అగు కెవాలియర్ పరభాషయగు ఆంగ్లమున ముచ్చటించుచుండగా చూడజాలక వారు ఆఫిలుము ప్రదర్శనమును నిలిపివైవవలెనని పట్టుబట్టిరి. ఫిలుము చూడవలయునను కొండంతకుతూహలమును కూడ స్వభాషాభిమానమున వారుకడద్రోసి నిలిచిరి. స్వభాషాభిమాన మిట్లుగదా యుండవలయును? ఫ్రెంచివారి స్వభాషాభిమాన మట్లున్నది. మఱి మనఆంధ్రులదో? వారికి ఆంగ్లిభాషమీదను, హిందీభాషమీదను ఉన్నప్రేమ తెనుగుపై లేదు. వివాహమునకు ఆహ్వానపత్రికలుకూడ ఆంగ్లమున ముద్రించుటయే ఆచారమైయున్నది. శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు ఈ విషయమున ఆంధ్రు లున్నశోచనీయస్థితిని వారి 'జన్మభూమి' పత్రికలో వెల్లడించియే యున్నారు. అయినను ఆంధ్రులలో ఇంకను స్వభాషాభిమానము లేశ లేదనియే చెప్పవలసియున్నది. స్వభాషాభిమానవిషయమున మనకంటె మనపొరుగువారగు కర్ణాటకులు, తమిళులు మేలు. ఈ మాసమునకూడిన మైసూరుసంస్థాన శాసనసభ కార్యక్రమమంతయు కన్నడమునందే జరిగినదని వినుచున్నాము. శ్రీ రవీంద్రనాథటాగూరిగారి విశ్వభారతియందు ప్రార్థనాగీతములందు తమిళగీతములను కూడ చేర్పింప అచ్చటి తమిళులు ప్రయత్నించి కృతకృత్యులైరని మిత్రులొకరు చెప్పుచున్నారు. ఈ చిన్నియంశములు వారివారి స్వభాషాభిమానమును నిదర్శించుటకు చాలియున్నవి. నేటి ఆంధ్రప్రముఖనాయకులలో నొకరగు శ్రీ వేమవరపు రామదాసు పంతులుగారితో ఈరచయిత కొలదిదినములకుక్రితము మాట్లాడు సవసగమున శ్రీవారు తానీనడుమ సేలములో ఉపన్యసించినపుడు తెనుగునందే ఉపన్యసించితిమనియు, దానికి సేలమునందలి తెనుగువారు నిర్భరానందము పొందిరనియు సెలవిచ్చిరి. శ్రీ పంతులుగారివంటి నాయకులు ఇట్టి ఆదర్శమును చూపుటకు దీక్షవహించుచో తెనుగున మాట్లాడుట నామోషీయనుకొను మన ఆంగ్లమానసపుత్రుల భ్రమ తొలగిపోగలదు.

ఆంధ్రోత్కళసమస్య:

శ్రీగిడుగు సీతాపతిగారు:—

ఆంధ్రోత్కళసమస్యసందర్భమున ఉద్యోగమును గోల్పోయినవారు శ్రీ సీతాపతిగారొక్కరే. వీరి ఆంధ్రాభిమానమునకు కంటగిల్లి ఉత్కళులగు శ్రీ పర్లాకిమిడి రాజావారు తమకళాశాలనుండి సీతాపతిగారిని ఏవిధోసాకులుచూపి తొలగించిరి. ఈ తొలగింపు సీతాపతిగారి ప్రజాహితజీవితమునకు పట్టానిచ్చినది. పర్లాకిమిడి ఆంధ్రప్రజాలోకము శ్రీవారిని తమతాలూకాబోర్డు అధ్యక్షపదవితో సత్కరించినది. ఈ సత్కారమును పొందియు శ్రీవారు ఆంధ్రోత్కళసమస్యవిషయమున తమశ్రద్ధను సడలింపలేదు. ఊపిరి సలుపని ఆందోళనము సల్పిరి; సభలు చేసిరి; తీర్మానములు గావించిరి; నిద్రించినవారిని మేల్కొల్పిరి; మేల్కొనియున్నవారికి హుషారిచ్చిరి. ఇంత మాత్రముతో తృప్తినొందక వారీవిషయమై లండనుకుకూడ పోయియున్నారు. తాటాకుమంటవంటి ఉద్రేకమునకు మాత్రము పేరుమోసిన ఆంధ్రులలో నిట్టి కార్యదీక్ష అరుదనుటకు సందేహములేదు. దీక్షగలచోట జయము నిస్సంశయముకావున శ్రీవారి ప్రయత్నము సఫలమై తీరును.

వీరేశలింగవీరున కీర్తిపూజయా ? :—

ఆంధ్రదేశమునందలి హరిజనోద్యమమునుగూర్చి వ్రాయుచు ఈనడుమ 'హరిజన' పత్రిక "ఈ ఘనకార్యమునకు మొదట రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులుగారే పునాదినివేసిరి. అతడు బీదలు, వ్యాధిగ్రస్తులు, బాధితులు నగువారి నుద్ధరించుటకుచేసిన పనికంటె నధికప్రోత్సాహకమగునది ఆంధ్రదేశీయులకు మఱేదియునుండజాలదు" అని ముగించుచున్నది. ఇట్లు రాష్ట్రేతరులచే బహుముఖముల కీర్తింపబడుచున్న శ్రీవీరేశలింగముపంతులుగారిని మన మెట్లు గౌరవించుచున్నాము? వారికార్యదీక్షకు ప్రదర్శనభూమియైన రాజమహేంద్రవరమున వారిశిలావిగ్రహమును ప్రతిష్ఠింప కొంతప్రయత్నము జరిగినది. ఆంధ్రదేశము పేరుచెప్పి శిలావిగ్రహప్రతిష్ఠయే లేదు. అగుట పంతులుగారి ఈ శిలావిగ్రహప్రతిష్ఠ ఆంధ్రదేశమున తొలుతటిది కాగలదనియు, తనకు కీర్తి తెచ్చిన పౌరుని శిలావిగ్రహప్రతిష్ఠచే ప్రథమమున గౌరవించిన మాట రాజమహేంద్రవరమునకు దక్కుననియు తలంచితిమి. కాని వీరేశలింగముపంతులుగారు మరణించి పదునైదువత్సరములు కావచ్చుచున్నను ఈ విషయము కార్యరూపము దాల్చు సూచనలు కానరాకున్నవి. ఈ శిలావిగ్రహప్రతిష్ఠకొఱకు కొంతపని చేసియున్న రాజమహేంద్రవరపౌరులు శ్రీ కంచుమర్తి రామచంద్రరావుగారిప్పుడీలోకమున లేరు. వారియనంతరము ఈకార్యమునుగూర్చి శ్రద్ధవహించుచున్నవారును కానరారు. ఆంధ్రదేశపు రామమోహనరాయలు, ఆధునికయుగప్రవర్తయగు వీరేశలింగవీరుని మనమిట్టులనా పూజించునది?

సభలనైన చేయుడు:—

ప్రత్యేకాంధ్రరాష్ట్రసంపాదన విషయమై మనప్రస్తుతకర్తవ్యమునుగూర్చి ఆంధ్రపత్రికలో ప్రస్తావించుచు శ్రీ జయంతి వేంకటకిరీటరావుగారిట్లు వ్రాయుచున్నారు. "ఆంధ్ర మహాసభతరఫున వేంకటగిరికుమారరాజాగారును, బరంపురము పర్లాకిమిడి ప్రాంతములను ఉత్కళమునందు చేర్పరాదని విన్నవించుటకు సర్ కూర్మా వెంకటరెడ్డి

నాయుడుగారును ప్రస్తుతము లండనుపోయియున్నారు. వారచట చేయుకృషికి చేయూతగనుండునట్లు ఆంధ్రులు స్వదేశమున తఱుచుగ ప్రతిముఖ్యపట్టణమునందును పెద్దనాయకుల ఆధిపత్యమున బహిరంగసభలొనర్చి, ఒరిస్సారాష్ట్రముతోబాటు ప్రత్యేకాంధ్రరాష్ట్రమునుకూడ నిర్మింపవలెననియు, ఆంధ్రప్రాంతము లేవియు ఒరిస్సాలో చేర్పరాదనియు తీర్మానించి ఆతీర్మానములను ఇండియాప్రభుత్వమువారికి, లండను జాయింటుకమిటీకి పంపవలెను. '' నోరుగలవానిదే రాజ్యము. ఈయుగమున సభలు, తీరుమానములే ఒకనికి నోరుగలదని చెప్పుటకు సాధనములు. ఈ సాధనముల నుపయోగించుటలో దుర్భరమగువ్యయముకూడ కాదు. విశేషవ్యయమునకు అవసరము లేకుండియు విశేషఫల మీయగల ఈసాధనములనుపయోగించుటకుకూడ ఆంధ్రు లుత్సాహము చూపకుండుట విచిత్రముగనున్నది. ఈ విషయమున దేశమున ఒక్కసభకూడ కూడలేదనుటకు విషాదము కలుగుచున్నది. ఏలూరు యువకన్యాయవాదులలో వర్ధమానచంద్రులనదగిన శ్రీ అడవి రామారావుగారీ నడుమ పూనా, బొంబాయియందలి ఆంధ్రసభలలో ఉపన్యసించుచు ''ప్రత్యేకాంధ్రమహాసభ కధ్యక్షతవహించిన సర్ కూర్మా వేంకటరెడ్డినాయుడుగారు పర్లాకిమిడి, బరంపురము మొదలయిన ఆంధ్రప్రదేశములను ఉత్కళమున చేర్చుట అన్యాయమనియు, ఈ అన్యాయము తొలగనియెడల ఆంధ్రులు నూతనసంస్కరణములకు భంగముకలిగింతురనియు చెప్పియుండిరి. వారును, తదితరులును జాయింటుకమిటీకి నివేదింప లండను వెళ్లియున్నారు. కమిటీ వారికి మన అభిప్రాయము కూడ తీర్మానములద్వారా వెంటనే తెలియచేయుట అవసరము'' అని చెప్పియున్నారు. కాని ఆంధ్రులలో పెద్దతరమునాయకులీవిషయమున మూకీభావము వహించినట్లే కనిపించుచున్నది. కావున శ్రీయుతులు కిరీటరావు, రామారావు గార్లవంటి యువకులైన ఈ సమయమున నడుములుకట్టి ఆంధ్రదేశమునందలి ప్రతిమండలపట్టణమునకును పోయి తీవ్రతరప్రచారముచేయవలసినది ముఖ్యావసరమగుచున్నది.

శ్రీచల్లపల్లిరాజాగారి విజయము:—

ఒకజిల్లాయందలి ప్రజలు తమ ఆమోదమునందినవారికి చేయగల గౌరవములలో వారినిజిల్లాబోర్డుఅధ్యక్షులుగ ఎన్నుకొనుట నునది శిఖరముననిలుపదగినది. అట్టిగౌరవమును కృష్ణామండలప్రజాలోకము మొన్న శ్రీచల్లపల్లిరాజా శ్రీయార్లగడ్డ శివరామప్రసాదుబహదూరువారికి గావించెను. ఇది శ్రీరాజావారి ప్రజామిత్రత్వమునకు పట్టా. ఈ విషయమున శ్రీరాజావారికి గలిగిన విజయము యువకులవిజయముగ మేము భావింతుము. శ్రీవారు కళాశాలను విడనాడి పట్టాభిషిక్తులై పట్టుమని పదిసంవత్సరములైన కాలేదు. ఈ లోపుననే వారు తమ జిల్లాప్రజలచే పొందగల అఖండసన్మానము నందిరి. ఇది వారి శుభోదర్కమును సూచించుచున్నది. తమ జమీందారీపలుకుబడికి సుదూరమున నున్న కొండపల్లి ఫిర్కాలోకూడ శ్రీవారు విజయమును బడయుటచే వారు ప్రజాహృదయము నెంతగ అధిష్ఠించియున్నారో సులభముగ నిర్ణయింపవచ్చును. యువకులగు శ్రీరాజావారి హయామునందు కృష్ణాజిల్లాబోర్డు పరిపాలనము ఉత్సాహపటుత్వములకు పేరెక్కి జిల్లాప్రజల సాముదాయకసౌఖ్యమునకు తావలము కాగలదని నమ్ముచున్నాము.



మే, 1933.

౧౧:—తెనాలి. ఆంధ్రనటశేఖరులు శ్రీపిల్లలమఱ్ఱి సుందరరామయ్యగారు మరణించిరి.

౧౨:—బెజవాడ. శ్రీ అరిపిరాల సత్యనారాయణ మూర్తిగారు తమచే రచియింపబడిన 'గానకళా చంద్రిక'ను శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారికి మహాసభలో కృతిసమర్పించిరి.

౧౩:—శ్రీ బొబ్బిలి రాజావారి సోదరులగు శ్రీజనార్దన రంగారావుగారికి ప్రథమపుత్రికాజననము.

౧౯:—నెల్లూరు. 'రూరల్ ఇండియా' అనుపక్షపత్రికను ప్రచురింప జి. రాజరత్నముగారు జిల్లామేజస్ట్రేటు ఐద్ద డిక్లరేషను పొందిరి.

౨౩:—టెక్కలి. తాలూకాబోర్డుసభలో టెక్కలి తాలూకాను ఏర్పడబోవు ఉత్కళరాష్ట్రమున చేర్పరాదను తీర్మానము అధికసంఖ్యసభ్యులచే ఆమోదింపబడియు అధ్యక్షులచే నిరాకరింపబడెను.

:—గుడివాడ. శ్రీ అనుమోల అప్పయ్యచౌదరిగారు తాలూకాబోర్డుఅధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—కైకలూరు. శ్రీ గుడివాడ సూర్యనారాయణ నాయుడుగారు తాలూకాబోర్డు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—నందిగామ. శ్రీజయంతిపురము రాజాగారు తాలూకాబోర్డు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

౨౫:—బరంపురము. శ్రీగాది బలరామదాసు, ఎం. ఏ. రమణరావుగార్లు 'భారతీపత్రిక' అను క్రొత్త తెనుగువారపత్రికను ప్రచురించిరి.

౨౬:—ప్రత్యేకాంధ్రరాష్ట్రావశ్యకతనుగూర్చి లండను జాయింటు కమిటీయెదుట సాక్ష్యమిచ్చుటకు వెంకటగిరి కుమారరాజాగారు బొంబాయినుండి బయలుదేరిరి.

౨౭:—ఆంధ్రప్రతినిధులగు సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు లండను చేరిరి.

౨౯:—గాంధిమహాత్ముని ఉపవాసయజ్ఞసమాప్తి.

:—ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి ఆరవ వర్థంత్యుత్సవము.

:—ఉదకమండలము. తుంగభద్రప్రాజెక్టు రిపోర్టు విషయకమైన సాధకబాధకములను గూర్చి ఆలోచించుటకు జి. డబ్లియు. ప్రీస్ట్లి ఐ. సి. యస్. గారు నియమింపబడిరి.

౩౦:—పూనా. ఆంధ్రసభవారి యాజమాన్యమున రస్తాపేటలో ఆంధ్రసభాభవనమున ఏలూరు కాపురస్థులు రావుసాహెబు గారపాటి ఆంజనేయ చౌదరిగారు తాము క్షయరోగవిషయమై చేసిన పరిశోధనగురించి డా. మూర్తిగారి యాధిపత్యమున ఉపన్యసించిరి.

౩౧:—బందరు. కృష్ణాజిల్లాబోర్డుకు శ్రీచల్లపల్లిరాజాగారు అధ్యక్షులుగను, శ్రీగొల్లపల్లి రాజాగారు ఉపాధ్యక్షులుగను ఏకగ్రీవముగ ఎన్నుకొనబడిరి.

—:ఏలూరు. పాలకొల్లువారులు శ్రీయుత బోళ్ల వేంకటసుబ్బారావుగారు పశ్చిమగోదావరిజిల్లా బోర్డు ఉపాధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

జూను, 1933.

౧:—ఉదకమండలము. శ్రీ బండి శ్రీహరిరావునాయుడిగారికి దివానుబహదూరు బిరుదలాంఛనము గవర్నరుగారిచే నొసగబడెను.

౨:—రాజమండ్రి. 14-వ ఆంధ్రోదేశప్రకృతివైద్య మహాజనసభ. డాక్టరు ఓ. కే. రామారావు గారు అధ్యక్షులు.

:—కావలి. రా. సా. వెన్నెలకంటి కృష్ణస్వామి రావుగారు-కావలి తాలూకాబోర్డు అధ్యక్షులుగ నుండినవారు-మరణించిరి.

౩:—లండను. సర్. కె. వి. రెడ్డినాయుడుగారు ఆంధ్రోత్కళసమస్యనుగూర్చి ఇర్విను ప్రభువుగారితో సంభాషించిరి.

:—'దేవాంగజ్యోతి' నడపినవారును, 'ఆంధ్రప్రకాశిక'ను పునరుద్ధరించినవారును అగు శ్రీదొంతంశెట్టి నాగేశ్వరరావుగారు మదరాసునందు మరణించిరి.

:—బెజవాడ. మునగాలరాజాగారి పెద్దకుమారులు శ్రీరామకృష్ణారెడ్డి ఎం. ఏ గారు శ్రీకట్టమంచి కోళందరెడ్డిగారి పెద్దకుమార్తె శ్రీమతి కమలాదేవిగారిని వివాహమాడిరి.

౪:—బెజవాడ. 16-వ ఆర్యవైశ్యమహాసభ, ఆహ్వానసంఘాధ్యక్షులు: ఆలపాటి కుటుంబరావు గారు; సభాధ్యక్షులు సామి వెంకటాచలం శ్రేష్ఠిగారు.

:—బెజవాడ. మునగాలరాజాగారి రెండవకుమారులు శ్రీగోపాలకృష్ణారెడ్డి బి. ఏ., (క్యాంటబ్) గారు శ్రీ కట్టమంచి కోళందరెడ్డిగారి రెండవకుమార్తె శ్రీసరోజనీదేవిగారిని వివాహమాడిరి.

౫:—బెజవాడ. 9-వ వైశ్యమహిళాసభ. శ్రీమతి కొల్లూరి మహాలక్ష్మమ్మగారు అధ్యక్షురాలు.

:—ఉదకమండలము. గంజాంమండలమునందలి ఒకభాగమును ఉత్కళమున చేర్చనుండుటచే తెలుగుజిల్లాల కొన్నిటి సరిహద్దులు మారుటనుగూర్చి ప్రభుత్వమువారు చేయుచున్న ఆలోచనల సందర్భమున శాసనసభపూర్వపు అధ్యక్షులు శ్రీనరసింహరాజుగారు శాసనసభ్యునితో సంప్రదించిరి.

౭:—రేపల్లె తాలూకా గ్రంథాలయమహాసభ. మంతెనవారిపాలెము. అధ్యక్షులు శ్రీ ఉః. నం. శ్రేష్ఠి గారు.


౯:—ఆంధ్రవాఙ్మయసేవకులలో నొకరగు శ్రీ బసవరాజు వెంకటఅప్పారావుగారు బెజవాడకు సమీపమునందున్న కొమ్మమూరులో చనిపోయిరి.

౧౦:—కృష్ణానదినుండి మూలపాడుదగ్గర కాలువను నిర్మించు స్కీము సాధ్యపడదని ఇంజనీర్లు అభిప్రాయమిచ్చుటచే మదరాసు ప్రభుత్వము వారు దానిని విడిచిపెట్టుటకు ఉత్తరువు గావించిరి.

౧౨:—పర్లాకిమిడి తాలూకాబోర్డు అధ్యక్షులు శ్రీ గిడుగు సీతాపతిరావుగారు పర్లాకిమిడిని ఒరిస్సాలో చేర్చుటకు ఆంధ్రులు సమ్మతింపరని జాయింటుకమిటీ ఎదుట సాక్ష్యమీయ బొంబాయి మీదుగా లండనుకు పయనమైరి.

:—ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధ్యక్షులు సర్. యస్. రాధాకృష్ణన్ గారు జినీవాకు బొంబాయిమీదుగా ప్రయాణము.

౧౩:—సికింద్రాబాదు. వనపర్తిసంస్థానముకేసులో నైజాముగారి ఫర్మానా: మునగాల రాజాగారి మనుమడగు వనపర్తిమైనరురాజా రామేశ్వరరావుగారికి యుక్తవయస్సు రాగానే సంస్థానమువారి పరము చేయుటకును; అంతవరకు కోర్టు ఆఫ్ వార్డ్సువారి అధీనమున నుండుటకును; సంస్థాన వ్యవహారము చూచు వారికి రూపాయిలో నాలుగు అణాలు, రాజా రామేశ్వరరావుగారికిని, వారి ప్రతివాదియగు రామదేవరావుగారికిని చెరి ఆరు అణాలు పంచుకొనుటకును.



కీ. శే. శ్రీరాజా దామెర వెంకటసీతారామయ్య బహదూరువారు.

తూర్పుగోదావరిమండలమునందలి జమీందారీలలో కాట్రావులపల్లిపోస్టు జగ్గంపేటజమీందారి ఒకటి. ఆ జమీందారీని బాగుగ అభివృద్ధికి తెచ్చినవారిలో కొలదివత్సరములకు పూర్వము దివంగతులైన శ్రీరాజా దామెర వెంకటసీతారామయ్య బహదూరువారు ముఖ్యులు. వారు విశాఖపట్టణము జిల్లాయందలి లింగాలవలస గ్రామమున 1886-వ సంవత్సరమున జననము నొందిరి. వారివంశము కవులవంశము. వారి పూర్వులలో పెక్కురు కవిత్వాభిరుచి గలిగియుండిరి; కావ్యములను వ్రాసిరి. వానినెల్ల శ్రీదామెర వేంకటసీతారామయ్య బహదూరుగారు ప్రచురించియుండిరి.

శ్రీరాజావారు బొబ్బిలియందును, మద్రాసునందును విద్యనందిరి. 1902-వ సంవత్సరములో శ్రీవారు మద్రాసునందలి తమవిద్య పరిపూర్తినందినతోడనే కాట్రావులపల్లి వెళ్ళిరి. అప్పటికి జగ్గంపేట సంస్థానమునకు శ్రీరాజా చెలికాని అప్పారావు బహదూరు వారు ప్రభువులు. వారికి మగసంతతిలేదు. ఒక్క_స్త్రీయే కూతురు. ఆమెను శ్రీఅప్పారావుబహదూరువారు శ్రీ వేంకటసీతారామయ్య బహదూరువారి కిచ్చి వివాహము చేయ నిశ్చయించియుండిరి.

ఈ సందర్భమునందే శ్రీ వేంకటసీతారామయ్య బహదూరువారు మద్రాసున తమవిద్యాపరిపూర్తియైన వెంటనే కాట్రావులపల్లి చేరిరి. కాట్రావులపల్లికి వీరిరాక జగ్గంపేట సంస్థానమునకు శుభములరాక యయ్యెను. శ్రీ వేంకటసీతారామయ్య బహదూరువారు జగ్గంపేట చేరిన మరునాడే ప్రీవీకౌన్సిలులో సంస్థానమునుగూర్చి అదివరకు జరుగుచుండిన దావా శ్రీవారికాబోవుమామ గారగు శ్రీరాజా చెలికాని అప్పారావుబహదూరుగారి పక్షమున తీర్పుచెప్పబడుటయు, సంస్థానముపై వారికి పూర్ణమైనహక్కు ఏర్పడుటయు జరిగెను. కొలది వత్సరములకు పిమ్మట శ్రీవారి వివాహము జరిగెను. జగ్గంపేట సంస్థానము శ్రీవారికి వివాహకట్నముగా ఒసంగబడెను.

ఈవివాహము జరుగుటకు ఒక సంవత్సరమునకు పూర్వము శ్రీవారి మామగారు శ్రీరాజా చెలికాని అప్పారావు బహదూరుగారు చనిపోయిరి. అగుట శ్రీవారు సంస్థానమును అత్తగారగు శ్రీరాజా వెంకయ్యమ్మగారి పేర పరిపాలింపదొడగిరి. వీరిపరిపాలనము ప్రారంభమైనతోడనే సంస్థానము పెక్కురీతుల అభివృద్ధికి వచ్చెను. పాడతియున్న ఒక పెద్దచెఱువును శ్రీవారు బాగుచేయించి తమమామగారిపేర నెలయించిరి. సంస్థానమునకు ఏలేటివలన కలుగుచున్న జలాధారమునకు ఇదికూడ తోడై అచటిరైతుల అభ్యుదయమునకు కారణమయ్యెను. ఈబాగుచేయించిన చెఱువు చుట్టుపట్టుల నున్న ఐదుగ్రామములకు ముఖ్యజలాధారమైయున్నది. ప్రీవీకౌన్సిలువఱకు వెళ్ళిన దావాలమూలమున సంస్థానమునకైన ఋణములనన్నిటిని తీర్చివైచి శ్రీరాజావారు ధనమును నిలువచేసిరి.

శ్రీరాజా దామెర సీతారామయ్య బహదూరువారు ఉదారహృదయులు, దానప్రియులు. స్వజనమునకును, ఇతరులకును వారు చేతనైన సాయముచేయుచుండు వారు. ప్రీవీకౌన్సిలుతీర్పు వ్యతిరేకముగనున్నను శ్రీ

రాజావారు తమ అత్తగారితో చెప్పి తమమామగారి సోదరుల కుమార్తెలకు జగ్గంపేట సి. ఎస్టేటును ఇప్పించిరి. తమమామగారి సోదరియగు శ్రీపానుగంటి లక్ష్మీ వెంకాయమ్మగారు ఏబదివేలు కిమ్మతుగల తమ ఆస్తి వీరిచేతులలో సత్రమునిర్మింప ఈయగా శ్రీవారు ఆ ఆస్తికి ఉండిన అప్పులనన్నిటిని తీర్చి సుస్థితికి తెచ్చి కొత్రావులపల్లిలో ఆమెపేర నొకసత్రమును నెలకొల్పిరి. జగ్గంపేట సత్రమునకు ఉన్నభూముల విషయమున వచ్చిన దావాలో శ్రీవారు కలుగచేసికొని దావాను రాజీపఱచి సత్రముయొక్క పరిపాలనమును సక్రమస్థితికి తెచ్చి దాని ఆస్తిని పెంపొందించిరి. తమమామగారిపేర కుంటీవారలకును, గ్రుడ్డివారలకును ధర్మశాలను కట్టించి దాని క్రమనిర్వహణమునకు భూములను దానముచేసిరి. అత్తగారివాంఛను మన్నించి శ్రీవారు కొత్రావులపల్లియందు శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయమును దివ్యస్థలముగ నొనర్చి దానికి భూస్థితికల్పించిరి. జమీందారియందలి ఇతర దేవాలయములకుకూడ శ్రీవారు భూములు దానముచేసియుండిరి.



జగ్గంపేట జమీందారులు.

శ్రీవారు పరిపాలనాసామర్థ్యముకలవారు. అగుటచే వారి పాలనమున సంస్థానము మంచి ఉన్నతస్థితికివచ్చెను.

శ్రీవారు పుట్టినది కవిపండితవంశమని పైన చెప్పియున్నాము. కవిపండిత వంశమున పుట్టినవారగుట శ్రీవారికి సంస్కృతభాషయందు మంచి ప్రవేశముగలదు. రామాయణము మొదలగు హిందూపౌరాణికగ్రంథములను సవిమర్శకముగ పఠించుటలో శ్రీవారు కాలమును వెళ్ళబుచ్చువారు. వేదపండితులపై వారికి ప్రత్యేకాభిమానము. ఆపండితులకు వార్షికము లిచ్చుటలో శ్రీవారు ఉత్సాహము చూపువారు. తమ ప్రపితామహులగు శ్రీచిన్నవెంకటరాయుడుగారు రచియించిన 'శ్రీవేంకటాచలమాహాత్మ్యము'ను, తమ పితృదేవులగు శ్రీచిన్నవెంకట్రాయుడుగారు రచియించిన 'దశావతారనుతిశతకము'ను శ్రీవారు ప్రచురించిరి. శ్రీవారి పితృదేవులు ఈ 'దశావతారనుతిశతకము'ను గాక 'సూర్యప్రస్తుతి' యను మఱియొక కావ్యమునుకూడ రచియించిరి.

శ్రీరాజావారి సతీమణియగు జమీందారిణి శ్రీరాజా సుబ్బాయమ్మ బహద్దూరువారి గుణములను ప్రశంసనీయమైనవి. ఏడాదికి లక్షాయేబదివేలు రూప్యముల రాబడిగల ఆస్తి ఆమె సర్వాధికారములతో నుండియున్నను ఆమె పతిదేవునకు పూర్తి విధేయురాలు. పూజాతత్పరురాలును, మతగ్రంథపాఠకురాలును అయి ఆమె కాలముబుచ్చెను. తనకు సంతానప్రాప్తి లేకపోగా వంశాభివృద్ధికొఱకు ఆమె మగనికితిరిగి వివాహముచేసికొన పురికొల్పినది. శ్రీరాజావారు 1922-లో తిరిగి వివాహముచేసికొని ఇరువురుకొమారులను బడసిరి. ఈ బిడ్డలను శ్రీరాజా సుబ్బాయమ్మవారు తమబిడ్డలవలెనే ప్రేమించి పెద్దబిడ్డను తమతండ్రిగారివద్ద నుంచిరి. ఈ కొమరుల విద్యాభివృద్ధిచూడకుండనే శ్రీవారు మరణించిరి. జగ్గంపేటరాజ్ఞీమణి లిప్పుడు కొమరులవిద్యకై మద్రాసున నివసించుచున్నారు. వీరీనడుమ ఇచటి కళ్యాణిఆసుపత్రికి పదివేలరూప్యముల భూరిదానమిచ్చియుండిరి. ఈరాజకుమారులు పెద్దలై తండ్రిగారిపేరు నిలుపునట్లు సంస్థానమును దక్షతతో పరిపాలింప భగవానుడనుగ్రహించునుగాక!

గ్రంథాలయోద్యమము



"గ్రంథాలయములు దేశమునకు
ఊపిరితిత్తులు."

"ప్రస్తుతముహిందూదేశమునందు చదువుకొనినవారు నూటికి పదిమందికి తక్కువగనున్నారు. కాని ఇతరదేశములలో నూటికి నలుబదిమంది, అరువదిమంది యున్నారు. మనప్రక్కనున్న జపానుదేశములో నలుబదియేండ్లక్రితము చదువుకొనినవారు నూటికి నలుబదిమంది మాత్రము ఉండెడివారు. కాని నేడు ఆదేశమున నూటికి నూర్గురు చదువుకొనినవారే. ఒకానొకకాలమున ప్రపంచమున కంతకును గురుపీఠ మలంకరించి యుండిన మనహిందూదేశమున ఇప్పుడు నూటికి తొంబదిమంది చేవ్రాలైనచేయజాలని వారుగానున్నారు. ఇట్టిశోచనీయపరిస్థితులలోనున్న మనదేశమునందు విజ్ఞానమును వ్యాపింపజేయుటకు గ్రంథాలయములే ముఖ్యసాధనములు. మానవునకు ఊపిరితిత్తులు ఎంతఅవసరమో దేశమునకు గ్రంథాలయము లంత అవసరము. గ్రంథాలయములతరఫున రాత్రిపాఠశాలలు ఏర్పఱచియు, పురాణకాలక్షేపముల కొనసాగించియు విద్యావ్యాప్తి గావింపవచ్చును. మనగ్రామములలో రైతులు తమకాలమును పేకాటమొదలగు దుర్వ్యాపారములయందు వ్యర్థపఱచుచుందురు. రైతులనీవ్యర్థకాలక్షేపములనుండి తమదిక్కునకు మరలించు కొనగలుగునేని గ్రంథాలయములు దేశమునకు చేయుమేలు నిరుపమానమగును."

—మా గంటి బాపినీడు.

• • •

ఆంధ్రులు: గ్రంథాలయోద్యమము.

"భారతదేశమునందు గ్రంథాలయోద్యమవిషయమున బరోడా తరువాత ఆంధ్రదేశమే పేర్కొనదగినది. దేశభక్తి, సంఘసేవలను ఉద్దీపింపచేయుటయందును; ఉత్తమమైన సాంఘికజీవన మలవడజేయుటయందును ఆంధ్రదేశగ్రంథాలయోద్యమమొనర్చినకృషిపాటి కృషి భారతదేశమునందలి ఏఇతరభాగములోని గ్రంథాలయోద్యమమును చేసియుండలేదు. ఈవిషయమున ఆంధ్రగ్రంథాలయములు అగ్రస్థానమును అలంకరించుచున్నవనిన సత్యమునకు దూరముకాదు. బరోడాసంస్థానమునందలి గ్రంథాలయోద్యమము అచటిప్రభుత్వసహాయసంరక్షణలక్రింద వ్యాపించినది. మనఆంధ్రదేశమునందన్నో స్వార్థరహితులగు ఆంధ్రయువకుల కార్యదీక్షయు, ఆంధ్రమహాజనుల ఆదరభావములే గ్రంథాలయోద్యమవ్యాప్తికి పట్టుకొమ్మలైయున్నవి. అఖిలభారతగ్రంథాలయప్రథమమహాసభను ౧౯౧౯-లో మదరాసునందలి గోక్లేసుందిరమున జరుపుటకు పూనుకొని జయప్రదముగ జరిపినవారు ఆంధ్రదేశగ్రం

థాలయసంఘమువారే. నాలుగుసంవత్సరములకుపిమ్మట అఖిలభారతగ్రంథాలయద్వితీయమహాసభను ౧౯౨౩-లో కాకినాడయందు శ్రీ యం. ఆర్. జయకరుగారి అధ్యక్షతను జరిపినదియు నాంధ్రదేశగ్రంథాలయసంఘమువారే. ఆసభయందే అఖిలభారతగ్రంథాలయసంఘ మేర్పరుపబడి ఆసంఘనిర్వహణమునకు అవసరమగు నియమావళిగూడ ఏర్పరుపబడెను. అప్పటినుండియే అఖిలభారతగ్రంథాలయమహాసభ ప్రతిసంవత్సరము భారతదేశములో ఎచటనో యొక్కచోట జరుపబడుచున్నది. అప్పటినుండియే గ్రంథాలయోద్యమము అఖిలభారతీయోద్యమముగా పరిణమించినది. ఇది ఆంధ్రుడు గర్వింపదగిన విషయములలోనొకటి. ''


—అయ్యదేవర కాళేశ్వరరావు.

• • •

బరోడా: గ్రంథాలయోద్యమము.

''బరోడాలో పుస్తకభాండాగారోద్యమము 1910-లో ప్రారంభమయ్యెను. బరోడా రాజావారు ఈ ఉద్యమవ్యాప్తికి డబ్లియు. ఏ. బోర్డనుగారియు, న్యూటనుదత్తుగారియు తోడ్పాటునొందిరి. బరోడాలో కేంద్రభాండాగారమున్నది. గ్రామములందు, పట్టణములందును భాండాగారములున్నవి. కేంద్రభాండాగారము మాతృసంఘమయి వీనికి తోడ్పడుచుండును. అక్కడ ఉచితముగా పుస్తకములను ఇండ్లకుకూడ నిచ్చెదరు. ఇదిగాక దానికిచేరి పత్రికాపఠనమందిరము ఉండును. స్త్రీల యుపయోగార్థముకూడ అందుఏర్పాటుకలదు. పిల్లలకు క్రీడామందిరమొకటి యున్నది. అక్కడ బాలురు వినోదముగ కాలక్షేపము చేయుటకు తగిన యేర్పాటులున్నవి. చదువుకొనువారికి కేంద్రపుస్తకభాండాగారమునుండి చాలపుస్తకములు పంపుచుందురు. మన దేశములోని భాండాగారములలో నిది మూడవది. ఇందు 124,000 పుస్తకములున్నవి. గతసాలున 132,500 సంపుటములను చదువుకొనుటకిచ్చియుండిరి. పట్టణములకు, గ్రామములకు పుస్తకములు తీసికొనిపోయియు నక్కడకు పెట్టెలలో పంపించియు పుస్తకము లిచ్చుచుందురు. పుస్తకములు కోరిన పాఠశాలలకుగాని, గ్రంథాలయములకుగాని మరి ఇతరసంఘములకుగాని వారుచితముగ పుస్తకములు పంపించుచుందురు. భాండాగారశాఖవారే పంపుటకును, తిరిగితెప్పించుకొనుటకును అగు ఖర్చులను భరించుచుందురు. ఇట్లు నిరుడు 22000 సంపుటములను ప్రజలు చదువుకొనుటకు పంపించియుండిరి. గ్రామభాండాగారములకు సంస్థానమువారు ధనసహాయము చేయుదురు. 1906 నుండి ఇది జరుగుచున్నది. 1919 నుండి పుస్తకభాండాగారశాఖనొకటి నెలకొల్పిరి. గ్రామస్థులుగాని, పట్టణవాసులుగాని రు 100, రు. 300, రు. 700 లో ఛందా వేసికొనినప్పుడు అంతసొమ్మును భాండాగారశాఖవారిచ్చెదరు. జిల్లాబోర్డువారు కూడ నింతసొమ్ము నిచ్చెదరు. కొన్నిసమయములలో మునిసిపాలిటీలు కూడ సొమ్మిచ్చుచుండును. భాండాగారభవనమునకు ప్రజలు మూడవవంతు సొమ్మును పోగుచేసినయెడల తక్కిన సొమ్ములో చెరిసగమువంతున ప్రభుత్వమువారును, జిల్లాబోర్డువారును ఇచ్చెదరు. క్రొత్తగ గ్రామములలో భాండాగారములను ప్రారంభించినప్పుడు నూరురూపాయల గుజరాతీ పుస్తకములను పాతికరూపాయలకే గ్రామస్థులకిచ్చెదరు. తక్కిన ముప్పాతికరూపాయలను ప్రభుత్వమువారు భరింతురు.''

—డాక్టరు తంగల వెంకటశివరావ్ ఎం. ఏ.,



ఖరగపురాంధ్రుల కర్తవ్యములు

ఖరగపురమున నివసించు మన యాంధ్రుల స్థితిగతులంగూర్చి క్రిందటి సంచికలో వివరించియున్నాను. ఇపుడు వారికర్తవ్యాంశములనుగూర్చి యొకింత ముచ్చటించుట యప్రస్తుతము మాత్రము కాఁజాలదు.

విషయాంతరములయందు మనవారు మిగుల కృషిసల్పుచుఁ గృతార్థులగుచున్నను విద్యావిషయమున మాత్రము వెనుకబడి యున్నారను నంశ మిదివఱకే వివరింపఁబడి యున్నది. మన యాంధ్రజాతీయత - వ్యక్తిత్వము ప్రపంచమం దంతటను బ్రకటితమై యాంధ్రులకు గౌరవౌన్నత్యములు కలుగవలెనన్న భాషావాఙ్మయాభివృద్ధి యవశ్యకర్తవ్యము. ఆంధ్రులు కారణాంతరముల వలన విదేశములకు వలసపోయియున్నను స్వజాత్యభిమానము విడుచుట కష్టముగదా! మానవస్వాభావికమగు నామమత యెట్లున్నదో యట్లే పుట్టినదాదిగా సర్వవ్యవహారములకును మూలమైన తెలుఁగుతల్లియందు గూడ గౌరవముంచి యామెయెడఁగూడ మమత్వము కలిగియుండవలెను. తెలుఁగు భాష రమారమి రెండుకోట్ల యేఁబదిలక్షల జనుల ముఖములఁ దాండవమాడుచు భారతదేశమునందు మూఁడవదిగా నెన్నఁబడుచున్నది. అట్లయినను రాష్ట్రేతరవాసులగు నాంధ్రులు భాషాంతరములను గౌరవించినట్లు స్వభాషను గౌరవించుచుండలే దని తెలుపుటకు విచారము కలుగుచున్నది. తమయిండ్లలోఁ బసిబాలురకు వారువారు నివసించు రాష్ట్రభాషనే మక్కువతో నేర్పుచు, స్వభాష నుపేక్షించుట యిందుల కుదాహరణము. ఆపిల్లలు తమ పసితనము నుండియు నాంధ్రదేశరు లేమగుట దానికి ముఖ్యఫలమగుచున్నది. మనవారు తమ పిల్లల కితరభాషను నేర్పరాదని చెప్ప సాహసింపము గాని స్వభాషను విడుచుటమాత్రము కూడదని చెప్ప సాహసింతును.

ఖరగపురాంధ్రులకు భాషావాఙ్మయాభివృద్ధి కనుగుణములగు సౌకర్యములు చాలఁ గలవు. "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్"లోని గ్రంథాలయమునందుఁ దక్కిన గ్రంథముల కంటె నాంధ్రగ్రంథములే యధికముగ నున్నవి. కాన మనవారు ఆగ్రంథములను దగినయుపయోగమునకుఁ దీసికొని వచ్చి యాంధ్రగ్రంథముల సంఖ్యను గ్రంథాలయమున ఎప్పటికప్పుడు పెంచుచుండుటకు ప్రయత్నింపవలసియున్నది.

రైల్వేయుద్యోగుల పిల్లల విద్యాసౌకర్యమునుగూర్చి యాలోచించి రైల్వేశాఖవారు హిందూడున్నతపాఠశాలను స్థాపించియున్నారు. అందు విద్యనభ్యసించు నాంధ్రబాలురసంఖ్య యధికముగనున్నను హిందీ-బెంగాలీ మొదలగు నితరభాషలకున్న ప్రాముఖ్యము ఆంధ్రమునకు లేకపోయినది.

ఆంధ్రబాలురుకూడ నాంధ్రేతరులతోఁబాటు హిందీ మొదలగు భాషల నభ్యసించుచుఁ దమ మాతృభాషను మఱచిపోవు స్థితి యందున్నారు. ఖరగపురాంధ్రు లీవిషయమున నాందోళనములను సలుపుచున్నను కలకత్తానగరమున జరిగిన యాంధ్రమహాసభ వారాందోళనసల్పి (౧౯౨౭) యుండిరి. అపుడు వంగప్రభుత్వమువారు [వంగదేశప్రభుత్వపుకార్యదర్శి వ్రాసిన యుత్తరమున నీవిషయముకలదు. చూడుము - 'రాష్ట్రేతరాంధ్రులు' సంపుటము ౨ సంచిక 3. సెప్టెంబరు, ౧౯౩౯.] ఆంధ్రు లెక్కువగనున్నస్థలములందుఁగల విద్యాలయములలో నాంధ్రమునకుఁ బ్రాధాన్యముండుట తమకు సమ్మతమేయనియు, మెట్రిక్యులేషను పరీక్షలోనదియుఁ బరీక్షింపఁబడుననియు, నాంధ్రమునకుఁ బ్రత్యేకముగ నుపాధ్యాయుని నియమింపవచ్చుననియుఁ, దక్కిన వానికివలె దీనికిని ప్రభుత్వమువారు గ్రాంటునీయఁగలరనియుఁ దెల్పియున్నారు కాని ఖరగపురాంధ్రు లేలయుపేక్షించిరో తెలియకున్నది. పాఠశాలావిచారణసంఘమున సభ్యులైన యాంధ్రు లీవిషయమున నుపేక్షవహించుట మిక్కిలి యన్యాయము. ఇకనైనను మనవారందఱు నావిషయమునఁ బ్రయత్నించి కృతార్థులయ్యెదరుగాక!

ఆంధ్రజనసంఘమువారు ఆంధ్రవిద్యానిధికిఁ జందాలను వసూలుచేయుచు నాంధ్రవిద్యాభివృద్ధికిఁ బాటుపడియున్నారు. కాని యిప్పు డావిషయమేమైనదియు వివరముగఁ దెలియుటలేదు. పైసంఘము వారేనడపుచున్న పత్రిక నిలువఁబడిపోవుటకూడ నందుకుఁగారణము కావచ్చును కావున బాబ్మ యాభివృద్ధినిగోరు మనవారు తిరిగి పత్రికానిర్వహణమునకై పరిశ్రమించి ఆంధ్రవిద్యానిధినిగూర్చి తమకును, తమ్ముల నుబట్టి యాంధ్రావనికిని మహోపకారములఁ గూర్తురుగాక!

సంఘబలమున్నగాని మీఁదికార్యములు కొనసాగుట కష్టముకానఁ బైసంఘమువారు తగినశ్రద్ధతీసికొని వివిధస్థలములయందున్నరాష్ట్రేతరాంధ్రులనందఱిని బురికొల్పి తమసభ్యులుగఁ జేర్చుకొని సంఘబలము కూర్చుకొనుట ముఖ్యకర్తవ్యము. సంఘమునందలిసభ్యులు తమసభ్యత్వమును సార్థకము చేసికొనినచో నాంధ్రులకుఁ బైసాకర్యము లేకాక యభిలషితములగు పనులు- మిగిలియున్నవన్నియును సాఫల్యమునొందఁ గలుగుటనిక్కువము.

పూర్వము ఖరగపురమున నాటకకళయభివృద్ధిఁబొందినట్లును, ఇప్పుడు నామావశిష్టమైనట్లును ఇదివఱకే చెప్పఁబడినది. దేశాంతరకళాసంపర్కమువలన నిపు డాంధ్రనాటకరంగము నూతనకళల వెలయించుచు భారతనాటకరంగమున మేలుచేయి వడయుచున్నది. సుప్రసిద్ధులగు నితరరాష్ట్రవాసు లాంధ్రనటకులను వేనోళ్లఁ బొగడుచున్నారు. ఆంధ్రకీర్తికాంత యున్నతపదవి నొందుటకు నాటకకళ యొకమెట్టని చెప్పకతప్పదు. ఖరగపురాంధ్రు లీకళను బునరుద్ధరించినచోఁ దక్కిన రాష్ట్రేతరాంధ్రు లెల్లరును వీరిమార్గము ననుసరించుట నిక్కము. కావున నాంధ్రులకీర్తిప్రతిష్ఠలకుఁ బాటుపడు ఖరగపురాంధ్రులు నాటకకళంగూడ నుద్ధరింతురుగాక!

—బులుసు వేంకటరమణయ్య.

ఇన్స్యూరెన్సు విషయములు

౬. భీమా యొక్క ప్రాముఖ్యము:—

భీమాయొక్క ముఖ్యోద్దేశము సాంఘికసేవ. మానవుని స్వీయరక్షణమే పైకి గోచరించుచున్నను సాంఘిక బాంధవ్యము, పరోపకారచింతయు నిండియున్నవి. మానవుని జీవితపథమునుండి అనిశ్చయములను తొలగించి; కుటుంబపోషణకర్త అకాలమరణముచే సంభవించు యిక్కట్టులను, కేమిని పోగొట్టి సౌఖ్యమొనగూర్చుటలో భీమా సాటిలేనిది. ఇతరవిషయములలో నైతము భీమా అపాయముల నివారించి విధిని కొంతవరకు జయించుటకుపకరణమైనది. వ్యాపారమువలన లాభము కలుగవచ్చును, లేక నష్టము కలుగవచ్చును; పైరులు పండవచ్చును, లేక యెండవచ్చును; పడవ దరిచేరవచ్చును, లేక సముద్రమున మునుగవచ్చును; గృహము సురక్షితముగానుండవచ్చును, లేక అగ్నికాహుతిగావచ్చును; మానవుడు దేహసౌందర్యమును కాపాడుకొనవచ్చును, లేక అంగవైకల్యమును పొందవచ్చును; బ్రతుకు నూరేండ్లు కావచ్చును, లేక యింతలో మరణము సంభవింపవచ్చును; సేవకుడు విశ్వసనీయుడు కావచ్చును, విశ్వాసఘాతకుడును కావచ్చును; యజమానుడు గుమాస్తాలయెడ సానుభూతి చూపవచ్చును, లేక కష్టనష్టములకు లోనుగావింపవచ్చును; ద్రవ్యము సంరక్షింపబడవచ్చును, లేక చోరుల చేతికి చిక్కవచ్చును. అన్నియు బాగుగ నెరవేరుచు వచ్చిన మంచిదే. లేనిచో నష్టముకల్గును. అట్లు నష్టమురానీక ముందుజాగ్రత్తపడు రక్షణకే యిన్స్యూరెన్సు, లేక భీమాయనిపేరు. ఈవివిధరక్షణలకై మానవుడు తన బుద్ధిబలముచే వివిధభీమాపద్ధతులను కనుగొన్నాడు. భీమా ఈకష్టములబాపి రక్షణయొసగు పరమసాధనము. భీమాబాధ్యత ఒక్కమానవమాత్రునిమాత్రమే చెందక, సంఘమునకే చెందుచున్నది. పురములందు పాఠశాలల నేర్పరచి, బాటలలో దీపములువేయించు బాధ్యత పౌరులందరి మేలుకై జనులెల్లరు వహించుచున్నారో అట్లే భీమాబాధ్యతకూడను సమిష్టిబాధ్యతయే యగును. జీవితభీమా విలాసవస్తువుకాదు, అనవసరమైన సౌఖ్యము కాదు. కుటుంబరక్షణకు మిక్కిలి ఆవశ్యకమైనది. భీమాలాభములను గుర్తెరిగినవాడు తప్పక భీమాచేయ గోరును. భీమాచేయుటకు ముఖ్యముగ వలసినవి ఆరోగ్యము, ద్రవ్యము. ద్రవ్యముచే ఎట్టిరక్షణనైనను పొందవచ్చును గాన ద్రవ్యసముపార్జనము, దానిపోషణము భీమాసంస్థల ముఖ్యోద్దేశమును; అర్థశాస్త్రవేత్తల యాదేశమును అగుచున్నది. ఆరోగ్యమునందున్నపుడు ప్రతి మానవుడు తన్ను తనకుటుంబమును పోషించుకొనుటకవకాశము పొందుచున్నాడు. అట్టి సమయమున సులభముగ భీమాచేయుటకును శక్తిని పొందియున్నాడు. అట్లు భీమాచేయక తాను మరణించినచో దారాసుతాదులు రాబడిలేనందున కూటికి లేక మలమలమాడుచు, అనుదినమును కాయకష్టములుపడుచు జీవితమును దుఃఖముతో గడుపవలెను. లేదా బ్రతికియుండి ముసలితనము ప్రాప్తించినయెడల స్నేహితులపైగాని, బంధువులపైగాని, ఆధారపడవలసియుండును. తన సంసారమునకు తన అనంతరము జీవనోపాధి క్రమముగ జరుగుటకు తగిన యేర్పాట్లు చేయవలసినవిధి ప్రతిభర్తకు, తండ్రికి గలదు. ఈవిధిని వారు తీర్చవలసినదే. ఇందుకు భీమా వారి కెంతయు నుపయోగించును. భీమా ప్రేమచిహ్నము. ముదిమియందు తాను లాభముపొందుటయేగాక, తన కొకవేళ మరణము సంభవించిన తనభార్యాపుత్రులు పరిపీడి పాలుకావలసినపనియుండదను ధైర్యము గల్గినచో అతనిజీవిత మెంతసుఖవంతమగును! భీమాకై

వెచ్చింపబడు ద్రవ్యము యితరత్రా వెచ్చింపబడు ద్రవ్యముకంటె అధికలాభము లొనగూర్చును. భూసంపదకంటె మిన్నయైనది భీమాసంపద. కారుమబ్బులు క్రమ్మిన ఆకశమున భీమాయొక్క మెరుపువంటిది; తన కుటుంబముపై యింటియజమానుని ద్రవ్యరూపమున చూపు అభిమానమే భీమా. ధనమును వృద్ధిపఱచునది, గృహములను రక్షించునది, లేమిని దూరముగ తొలగించునది, ఎపుడుకోరిన అపుడు లభించునది, అవసరమును గడుపునది భీమాయని రూఢిగ చెప్పవచ్చును. నమ్మకమును, నిశ్చయమును అయినపెట్టుబడి యిదియే. భూమిలో పాతిపెట్టబడిన ద్రవ్యము చిరకాలము బ్రతుకు కాకివలె నిరుపయోగమైనది. జాగ్రత్తగ ఆధనమును తగువిధముల నుపయోగించుచో తాత్కాలికభారము తగ్గుటయేగాక, భావికాలమునకు సాయపడును. మానవహృదయతంత్రుల దాకి, కుటుంబపోషణను మరచిన వారికి వారివిధుల నెరుకపరచుటలో భీమా నిరుపమానమైనదగుచున్నది. జీవితమునందలి సంతోషమును పీల్చి పిప్పిచేయు తహతహలు, ఆలోచనలు భీమాచేసినవాని సంతగా బాధింపజాలవు. వానిజీవితము శాంతియుతముగ నేయుండును. గృహమే దేశగౌరవమును చాటుచున్నది. గృహమే సంఘమునకును, ప్రభుత్వమునకును పునాది. కుటుంబదార్ఢ్యముపైననే భావిజాతియుస్థిరత్వము ఆధారపడియున్నది. అట్టిగృహమును మంచిపునాదులపై నిలుపునది భీమా.

౯. హిందూదేశమున భీమావ్యాపారము:—

'ఇండియనుఫినాన్సుయియరుబుక్' (1932) ప్రకారము 1929-వ సంవత్సరమువరకు సగటున

అమెరికావారు	... రూ.	2318·2
కెనడావారు	... రూ.	1760·9
న్యూజిలాండువారు	... రూ.	934·5
ఆస్ట్రేలియావారు	... రూ.	750·7
బ్రిటనువారు	... రూ.	731·5
స్వీడనువారు	... రూ.	563·7
ఇటలీవారు	... రూ.	418·0
నార్వేవారు	... రూ.	376·7
నెదర్లాండువారు	... రూ.	333·2
ఇండియావారు	... రూ.	55

భీమాచేసియున్నారు. ఈ పట్టీవలన హిందూదేశస్థులీవిషయమున ఎంత వెనుకబడియున్నారో తెలియగలదు. ఒకదేశమున భీమావ్యాపారము ఉన్నతదశలో నున్నదనగా ఆదేశస్థులు అర్జనాతృష్ణగలవారనియు, ఆర్జించినధనమును జాగ్రత్తగ కాపాడగలవారనియు, పొదుపుయొక్క విలువ తెలిసినవారనియు సులభముగ నిర్ణయింపవచ్చును. భీమావ్యాపారాభివృద్ధి ఆదేశముయొక్క ఆర్థికసుస్థితికి దర్పణమైయుండుననుటలో సందేహములేదు. అనేకవిషయములందువలెనే భీమావ్యాపారమునందును మనము ప్రారంభదశయందు ఉన్నాము. హిందూదేశమున కోట్లకొలది జనులు భీమాచేయుంచుకొను శక్తిగలవారయ్యు భీమావలని రక్షణమును పొందుటకు సుముఖులుగాలేరు. దీనికి కారణము వారు భీమావలనిలాభములను ఇంకను పూర్తిగ అవగాహనము చేసికొనకపోవుటయే. అమెరికాసంయుక్తరాష్ట్రములయందు కుటుంబరక్షణకై భీమాచేయబడు ద్రవ్యము వందబిలియనుడాలర్ల పరిమితిని దాటినది. (బిలియను అనగా సహస్రకోటి. ఒకడాలరున సగటున 4 రూపాయిలగును). హిందూదేశమున భీమావ్యాపారవిషయమున 1912-వ సంవత్సరమునుండి కొంత యభివృద్ధికానవచ్చెను. ఆసంవత్సరమున ఈ దేశమున తొలుత భీమాచట్టమేర్పరుపబడెను. 1914-వ సంవత్సరమున ప్రారంభమై ప్రపంచమును కలగుండు వెట్టిన ఐరోపామహాసంగ్రామముగొనివచ్చిన అరిష్టముల ప్రాబల్యముచే మనదేశజులు కొంతవఱకు భీమాయొక్క ఆవశ్యకతను గుర్తించిరి. 1920-వ సంవత్సరమునుండి హిందూదేశమున భీమావ్యాపారము క్రమాభివృద్ధినంది 1929-వ సంవత్సరమున 82 కోట్లవ్యాపారమును, నేడు 150 కోట్లవ్యాపారమును సాగుచున్నది.

—ఆలూరు రామచంద్రయ్య, బి.ఏ.,

మహిళాలోకము

స్త్రీలకు వ్యాయామవిద్య:—

మదరాసుప్రభుత్వమువారు ౧౯౨౧-వ సంవత్సరమునుండి స్త్రీలకు వ్యాయామవిద్యాప్రదానవిషయమున శ్రద్ధ వహించుచున్నారు. ఆసంవత్సరముననే వారు వ్యాయామవిద్యాపారీణయగు స్త్రీని ఈవిషయమున పనిచేయ ప్రత్యేకముగ నియమించిరి. ప్రతివిద్యార్థినియు తనకుతగిన శరీరవ్యాయామమును పొందునట్లు చూచుటయే ప్రభుత్వమువారి యుద్దేశమైయుండెను. దీనికిగాను వారు కొందఱుస్త్రీలను వ్యాయామవిద్యయందు తరిబీదుచేసి ఉపాధ్యాయినులుగ నియమింపవలసిన అవసరమేర్పడెను. అగుట మదరాసుపట్టణమునందలి సెకండరీపాఠశాలలలోని ఉపాధ్యాయినులకు ప్రతిశనివారము ఉదయమున వ్యాయామవిద్యాశిక్షణమునకై తరగతులు ఏర్పాటుచేయబడుటయు, దానిపై చక్కని అజమాయిషీ ఉంచబడుటయుజరిగెను. పట్టణేతరప్రాంతమున వ్యాయామవిద్యాశిక్ష, పరీక్ష గావించుటకు వేఱుఏర్పాటు లొనరింపబడెను. ౧౯౨౫-వ సంవత్సరమున వ్యాయామవిద్యలో ఉపాధ్యాయినులకు సర్టిఫికెట్టునిచ్చు పరీక్షలు రద్దుగావింపబడి వ్యాయామవిద్యాశిక్షణమునకై తరగతి ప్రారంభింపబడెను. ఆతరగతిఏర్పాటు ఇపుడును అమలునందున్నది. వ్యాయామవిద్యయందు కొంపటికి ప్రత్యేకశిక్షణ మీయబడెను. పట్టభద్రలైనవారును, సెకండరీగ్రేడు ట్రెయిండుసర్టిఫికెట్టుగలవారును మాత్రమే ఈతరగతిలో చేర్చుకొనబడుదురు. వారైనను శారీరకముగ ఇందుకు తగినవారని డాక్టరువలన సర్టిఫికెట్టు పొందవలెను. కోర్సుముగిసిన తరువాత వారికి డిప్లమో ఒసంగబడును. డిప్లమోనుపొంది వారు వ్యాయామశాస్త్రోపాధ్యాయినులుగ నియమింపబడుటకు అర్హతనుపొందుదురు. రాజధానిమొత్తముమీద నలుబదిముగ్గురు వ్యాయామశాస్త్రోపాధ్యాయినులకు తావు ప్రత్యేకింపబడెను. ఇంతదనుక ఆనలుబదిమూడుస్థానములలో రెండుమాత్రమే నిండియున్నవి. ఇట్లగుట విద్యావతులగు మనస్త్రీలు వ్యాయామవిద్యాసముపార్జనమున శ్రద్ధపెట్టుటలేదని తేటతెల్లమగుచున్నది. చెన్ననగరమునందలి స్త్రీలపెద్దకళాశాలల మూడిటియందును వ్యాయామశాస్త్రోపాధ్యాయినులు గలరు. వ్యాయామవిద్యావిషయమున ప్రభుత్వమువారీరీతినిశ్రద్ధను చూపుచున్నదానికి సంతసమే; కాని ఈవిషయమున చేయవలసినపని, చూపవలసిన శ్రద్ధ ఇంకను ఎక్కువగనే ఉన్నది.

ఉపాదేయమైనవిషయము:—

గాంధిమహాత్ముని ఆదర్శముచే ఆంధ్రస్త్రీలలో కలిగిన సంస్కారావబోధము కొలదిఇడరానిదిగనున్నది. దేశసేవలో కారాగారములనుమెట్టుట వారికి పరిపాటియైనది. అస్పృశ్యులను వారు ఆత్మజులుగ జూడకలుగుచున్నారు. కాని వారు—కడుపునపుట్టినవారి మలమూత్రములను కుడియెడములులేక బాగుచేయుటకు అలవడియున్నవారైనను.. గాంధి ఆదర్శముచే చూపిన పాకీదొడ్డిని శుభ్రపఱచుపద్ధతినిమాత్రము గ్రహించుట

లో సంకోచింతురనుటనిశ్చయము. ఇట్టిసంకోచమును కట్టిపెట్టి గాంధిగారికి నిజమైన శిష్యురాలు అనిపించిన ఆంధ్రస్త్రీమొకతె గలదు. ఆమె తెనాలివాస్తవ్యురాలు. పేరు శ్రీమతి కొల్లా కనకవల్లితాయారమ్మ. ఆమె ఆత్మగృహమునందలి పాకీదొడ్డిని చాల మంది ఆశవారియెదుట శుభ్రపరచినది. గొప్ప యింటియందు పుట్టియు, గొప్పయింటిని మెట్టియు ఆమె ఈకార్యము నొనర్చి తనకుగల ఉత్కృష్టాదర్శమును వెల్లడించినది. స్త్రీలలో ఇంతటి ఉచితజ్ఞతప్రబలుచో జనపదములు శుచిదేవతకు విహారస్థలములు కాగలవు. ఉపాదేయమైన ఈవిషయముపై స్త్రీలోకము శ్రద్ధాదృష్టులను బఱపుదు గాక!

౧౯౩౧ జనాభా లెక్కలు: స్త్రీలు:—

మొన్నటి జనాభాలెక్కల ప్రకారము భారతీయులు నూటికి పదునొకండుగురు వంతున అభివృద్ధినొందిరి. సిక్కులు నూటికి ముప్పదిముగ్గురు వంతునను, క్రైస్తవులు నూటికి ౩౨.౭ వంతునను, ముహమ్మదీయులు నూటికి పదముగ్గురు వంతునను, హిందువులు నూటికి పదుగురు వంతునను అభివృద్ధినందిరి. భారతదేశపు మొత్తపుజనాభాలెక్కలను పరికించి చూడగా స్త్రీలకంటె పురుషులసంఖ్య హెచ్చుగానుండుట తెలియవచ్చును. హిందూదేశమున స్త్రీలకంటె పురుషులు పదునొకండు మిలియన్లు అనగా ఒకకోటి పదిలక్షల మంది ఎక్కువగానున్నారు. ఐరోపామహాఖండమున పశ్చిమభాగపుదేశములయందు పురుషులసంఖ్యకంటె స్త్రీలసంఖ్యతక్కువగానున్నది. దామూషాని నలుగురుపురుషులకు ఒక్కొక్కస్త్రీ చొప్పున ఉన్నారని ఆదేశములజనాభాలెక్కలు తెలుపుచున్నవి. సుప్రసిద్ధశాస్త్రవేత్తలు పలువురు ఏదేశమునందలిజనులు సారవంతమైన ఆహారమును తినుచున్నారో ఆదేశమునందలి జనుల సంఖ్యలో స్త్రీలు విశేషించి యుందురనియు, ఏదేశమునందలి జనులు నిస్సారమైన ఆహారముతినువారుగాగాని, లేక కడుపునిండని ఆహారముతో దినములు వెళ్లబుచ్చవలసినవారుగా కాని ఉందురో ఆదేశములందలి జనుల సంఖ్యలో పురుషులు విశేషించియుందురనియు చెప్పుచున్నారు. శేమ్యుబ్రూను మహాశయుడు సారవంతమైన ఆహారము తినుజాతులలో స్త్రీలసంఖ్య నిస్సందేహముగ హెచ్చియుండునని నిర్ధారించుచున్నాడు. జంతువుల విషయమున లింగభేదమును కనుగొనుటలో జీవితమును వెచ్చించుచున్న కావల్‌యూస్కికూడ ఇదే అభిప్రాయమును వెల్లడించియున్నాడు. తిను ఆహారమునందు శరీరపోషకపదార్థములు కొరవడియుండునెడల మగబిడ్డను, పోషకపదార్థములు నిండారియుండునెడల ఆడుబిడ్డను స్త్రీ కనునని అతడు పరీక్షచేసి చెప్పుచున్నాడు. ఈవిషయములను గమనించిన తరువాత మన దేశమున స్త్రీలకంటె పదునొకండుమిలియనుల పురుషులు హెచ్చుగా నున్నారనుటను చూచితిమేని ఆహారవిషయమున హిందూదేశపు స్త్రీలకు చాల అన్యాయము జరుగుచున్నదనుట ఆరూఢమగుచున్నది. భారతస్త్రీలు తినుతిండిలో శరీరపోషకపదార్థములు చాల కొరవడియున్నవనియు, ఈవిషయమై విశేషమగు ఆందోళనము జరిగి వారి ఆహారము సారవంతమగుటకు తగుపీట్లు కలిగింపనిచో పురుషసంఖ్యాధిక్యము దేశమునకు మఱికొన్ని క్రొత్తసమస్యలను గొనివచ్చుననియు తెలిసికొనవలసియున్నది.

ఆరోగ్యవిజ్ఞానము

౯. సీమవంకాయలు ఆహారపదార్థములలో ఉత్తమమైనవి.

సీమవంకాయలను ఆంగ్లమున టొమాటోలందురు. బెజవాడప్రాంతములందు వీనినే జనసామాన్యము 'రాములక్కాయలు' అని వ్యవహరించుచున్నది. తెలుగుదేశమున ఈకాయలు ఇంకను బాగుగా ప్రచారమునకు రాలేదనియే చెప్పవలసియున్నది. ఆహారపదార్థములలో ఉత్తమమైనవిగా పరిగణింపబడుచున్న ఈ సీమవంకాయలనుగూర్చి తెనుగువారింకను అజ్ఞానమున బడియుండుట శోచనీయము. ధనికులలో పలువురు వీనిని సీమవారు మాత్రమే తినదగినవానిగా పరిగణించుచున్నారు. శాస్త్రవేత్తలు ఈనడుమ తీవ్రపరిశోధనలు గావించి పండిన సీమవంకాయల రసమునందు ఎ. బి. సి విటమినులు మూడును కలవని కనుగొనియున్నారు. ఈ మూడు విటమినులును కలిసియున్న ఇతర ఆహారపదార్థములలో దుంపకూరలయందు కందని ఎఱ్ఱముల్లంగిదుంపలును, ఆకుకూరలలో కాబేజి, కాలిఫ్లవరు, లెట్యూసులును పేర్కొనదగినవి. కాని ఈ విటమినులు టొమాటోయందున్నంత శక్తిమంతములుగా వీనియందు లేవనుటకు ఎడమున్నది. విశేషప్రచారమునమంది బహుజనామోదము నందియున్న నారింజపండులో స్కర్వీవ్యాధిని కుదుర్చుటలో సమర్థమైయున్న ఒక్క సి. విటమినుమాత్రము విశేషించి యున్నది, నరములను యథాస్థితి నుంచుచు బి. విటమిను మిక్కిలికొద్దిగానున్నది. ఎ. విటమిను అసలే లేదనవచ్చును. ఎ. విటమిను శరీరమును లెస్సగా పెంచుటయేగాక ఆమాశయమును శుభ్రపఱచి దేహమును రోగకారకక్రిములకు దూరము చేయును. ఎ. విటమినునకు ఇట్టిశక్తికలదనుటను ఈ మధ్యనే శాస్త్రజ్ఞులు కనుగొనియున్నారు. పండిన టొమాటోరసములో ఈ ఎ. విటమిను బి. సి. విటమినులతో కలసి యుండుటను, ఈరసము రుచికరముగా నుండుటను, ఈ రసమున తెలిసీతెలియని పులుపు కలిసి యుండుటను, ఈరసము సీసాలకెత్తబడి ఎన్నినాళ్లయినను నిలవయుండుటకు వీలుగా చేయబడి బజారులయందు విక్రయింపబడుటను ఇది ఇక విరివిగా ప్రచారమునకు రాగలదని నమ్మవచ్చును. ఎ. బి. సి విటమినులు ప్రతివాని ఆహారమున-అందు ముఖ్యముగా శిశువులయు, పిల్లలయు ఆహారమున-ఉండి తీరవలసినవి. శాకసంబంధమైన ఆహారపదార్థములలో ఈమూడువిటమినులు సమగ్రముగా కలసియున్నది ఈ ఒక్క టొమాటోరసమునందే. కాచిన పాలలో పండినసీమవంకాయరసమును పిండి పాలు త్రాగు పసిపిల్లలకు నిరభ్యంతరముగా ఈయవచ్చును. దీని క్రమసేవనముచే పసిపిల్లలు బాగుగా కండపట్టి బొద్దుగా ఎదుగుదురు. ఈ విటమినులేగాక ఈ 'రాములక్కాయల'రసమునందు కాల్షియము, ఫోస్ఫేటు మొదలగు లోహసంబంధమైన లవణములు గలవు. ఈలవణములు రక్తమును తాజాస్థితియందుంచుటలో చాలఉపయోగకరములైనవి.

౬. గాలియే ప్రాణాధారము.

ప్రతిజీవియు నిముసమునకు ౧౬, ౧౮ సారులు ఊపిరి పీల్చును. ఎఱుగకయే ప్రతివ్యక్తియు సాధారణస్థితిలో దినమునకు ౨౩వేల సారులు ఊపిరిపీల్చును. ఒక్కొక్కనిశ్వాసముతోడను శరీరములోని శతాధికములగు కండరములు సంబంధించి యుండును. ప్రతినిశ్వాసమునకును ౨౫, ౩౦ అంగుళముల ఘనపరిమాణము

గల-అనగా దినమునకు ౩౨, ౩౪ పౌనుల-వాయువు కావలసియున్నది. ఒక్కొక్కనికి అతను గ్రహించు అన్నమునకును, నీటికిని ఏడురెట్లు ఎక్కువ గాలి ఒక్కొక్క దినమునకు అవశ్యకము. ఒక్కొక్క ఊపిరి ఊపిరితిత్తులలో ౧౫ చతురపుఅడుగుల ఆవరణకు సమమైన మేర రక్తశుద్ధిచేయుచు తిరుగును. రమారమి ౧౬౦ అంగుళముల ఘనపరిమాణముగల వాయువు ఎల్లవేళల ఊపిరితిత్తులలో నిలిచియుండును. ౨౫, ౩౦ అంగుళముల ఘనపరిమాణముగల గాలి ఊపిరి వదలబడును. జీవికి గాలి ఎంతముఖ్యమైనదో ఇందువలన తెలియును. అట్టి గాలి ఎంతపరిశుభ్రముగనున్న, జీవికి అంతమంచిది.

౬. పాదరక్షలు: దేహారోగ్యము.

శరీరము యొక్క స్వాస్థ్యమునకు పాదముల ఆరోగ్యస్థితి అతిముఖ్యమైనది. ఫాషనుల పేర మనవారు చిత్రవిచిత్రమైన ఆకారముగల జోళ్లను వాడి తమ పాదములకు శేనిరోగములను తెచ్చుకొనుచున్నారు. బూట్సులమడమ కొంతఎత్తుగనుండుట ఆరోగ్యశాస్త్రసమ్మతమేకాని నడకనే యొకకష్టకార్యముగ నొనరించు మిక్కిలి ఎత్తుమడమలుగల బూట్సుల ఉపయోగము తెగడతగినది. పాదములను నొక్కిపట్టి వానికి గాలితగులకుండజేయు కాలిజోడును శత్రువుగా పరిగణింపవలెను. మృదువైన చర్మములో చేయబడినవి, పాదమును నొక్కిపట్టక ధారాళముగ గాలిప్రసరించుటకు అవకాశము నిచ్చునవి, కాళ్లవ్రేళ్లయొక్క చెమ్మను ఎంతమాత్రము తగలనీయనివి అగు పాదరక్షలు ఆరోగ్యప్రవర్ధకములు. మానవుని ఒక్కొక్కపాదమున ఇరువదియారు ఎముకలు, పెక్కుకండరములు, అసంఖ్యాకములగు నరములు కలవు. వీనివీనికి నిర్ణీతములైన పనులనొనరించుటలో పాదరక్షలు అడ్డంకిగానుండవు సరిగదా మిక్కిలి తోడుపడును. పాదరక్షలు వాడుటచే రక్తచలనము తాజాస్థితి యందుండును, నరములు సౌమ్యస్థితి యందుండును; పాదములకు చెమతగులకుండును, రోగకారకక్రిములు పాదముల ద్వారా శరీరమున ప్రవేశించుటకు అవకాశములేకుండును, కన్ను, ముక్కు, శిరోజములు వీనిఆరోగ్యము చాలభాగము పాదముల ఆరోగ్యముపై ఆధారపడియుండు నను విషయము సర్వదా జ్ఞప్తియందుంచుకొనవలయును.

౭. తవుడు యొక్క విలువ:—

తవుడులో కాలరీలు మిక్కిలితక్కువ. కాని బి. విటమినులు హెచ్చు. ఒకపౌనుతవుడులో నలుబది రెండు యూనిట్ల బి. విటమినులు ఉన్నట్లు పరిశోధనల వలన కనుగొనబడినది. రక్తమును బాగుగా పెంపొందించు లోహములను శరీరమునకు కలిగించుటలో తవుడును మించిన పదార్థము మరియొకటిలేదు. పశువుల కాలేయము (బీఫ్‌లీవరు) భక్షణముచేకలుగు రక్తవృద్ధికరములగు లోహములకంటె తవుడులోని అలోహములు ప్రశస్తతరములు. బీఫ్‌లీవరు తినుటచే మనిషి పుష్టినొందుటకు తోడు ఆతనితూకమును హెచ్చును. కాని తవుడు తినుటచే మనిషి బాగుగా పుష్టి నొందుటయే గాని అనవసరముగ ఆతనితూకము హెచ్చదు. తూకము హెచ్చకుండ శరీరపుష్టికలిగించుకొనదలచిన వారికి తవుడుకు మించిన ఆహారపదార్థములేదు. శాకసంబంధమైన తవుడులోనే రక్తవృద్ధికరములగు లోహములు సమృద్ధిగనుండగా అలోహములకొఱకు జంతుసంబంధములగు బీఫ్‌లీవరుకై జంతుహింస చేయనేలయని ఒకపాశ్చాత్యవైద్యుడు తనజాతీయులను ప్రశ్నించుచున్నాడు. భారతీయులు బీఫ్‌లీవరుఉపయోగించుపాపమున కింకను ఒడిగట్టకున్నను తవుడుయొక్కవిలువను మాత్ర మింకనుగ్రహింపలేదని చెప్పవలసియున్నది. దంపుడుబియ్యము నాడినంతకాలము వారి ఆహారమున కొంతవఱకు తవుడు ఉండుటకు అవకాశముండినది. ఫ్యాక్టరీబియ్యము వచ్చినతరువాత వారిఆహారమున తవుడు ఎంతమాత్రమును లేదనియే చెప్పవలసియున్నది. ఫ్యాక్టరీబియ్యమునే ఉపయోగింపకతీరనివారు తమ ఆహారమున బి. విటమిను ఉండుటకుగాను అప్పుడప్పుడు తవుడుతో రొట్టెలుచేసికొని తినుచుండుట చాలమంచిది.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౩. భారత నీతులు

ఆంధ్రులకుఁ బరిచితపూర్వులగు శ్రీయుతులు వాజపేయయాజుల రామసుబ్బారాయఁడుగారి సతీమణిచే నిందలి పద్యములు గ్రథితములు. ఇందు వివిధములగు నీతులు చిన్నపద్యములలోఁ జెప్పఁబడుట నందఱకును సులభావగాహములు. పుస్తకాంతమునఁ గఠినపదముల కర్థములు సైతము వ్రాయఁబడినవి. ఇది పాఠశాలలలోఁ జదువుకొనువారి కెంతయుఁ బఠనీయము. నీత్యుపదేశమునకై శ్రీమతి వాజపేయయాజుల మహాలక్ష్మమ్మగారిచేఁ గూర్పఁబడిన యీ పుస్తకము నెల్లరు నాదరింతురు గాక! ఇది కొల్లాపురపు స్నేహలతాకవితాసంఘపక్షమునఁ బ్రకటింపఁబడినది. డెమ్మిసైజు. ౨౦ పుటలు. వెల ౦-౪-౦.

—సూ. కృ.

౪. ఆత్మోపదేశము

మీర్జాపురము రాణీగారి యాస్థానపండితురాలగు శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారిచే విరచితము. "మనమా! యేల వృథాశ్రమంబు! కనుమా మాయాపహారిన్ హారిన్" అని మకుటముగా నలుబదిపద్యము లిందుఁ గలవు. ఐహికవిషయములు నిస్సారములని నిరూపించుచుఁ బరాత్పరుని సేవింపుమని యుపదేశముచేయుటయే యీపద్యముల యాశయము. ఇందలి పద్యములలోఁగొన్ని పత్రికలలోఁ బ్రకటితపూర్వములు. పద్యములలోని ధార సరసముగనున్నది. వీ రీవఱకుఁ గొన్ని పుస్తకముల రచించినట్లుగ పీఠికావాలమునఁ దెలియుచున్నది. భాషాసేవ చేయుచున్న యీవిదుషీరత్నము ఇంకను బెక్కుపుస్తకములను రచించి యిలోధికముగు సారస్వతప్రచారము చేయునట్లు పరమేశ్వరుఁ డనుగ్రహించుఁగాక! ఇదియు స్నేహలతాకవితాసంఘముపక్షమునఁ బ్రకటితము. ౩౦ పుటలు. చిరునామా: శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు, గవర్నెస్, రాజభవనము, మీర్జాంపురము ఎస్టేటు, నూజివీడు.

—సూ. కృ.

౫. రామామృతము

శ్రీవాజపేయయాజుల రామసుబ్బారాయ విరచితము. మిత్రుల కోరికపై విలాపముగఁ జెప్పఁబడిన శ్రీరామచరితప్రవర్తకములగు ౪౮ పద్యము లిందుఁగలవు. ఆశువుగఁ జెప్పఁబడినను పద్యములు ధారాశుద్ధిగలిగి యున్నవి. ఈ గ్రంథకర్తృరచనలు పత్రికలమూలమున నాంధ్రలోకము చిరకాలమునుండి చూచుచున్నది. స్నేహలతాకవితాసంఘమున కధ్యక్షులైన వీరు ఈయాశుకృతిని తత్సంఘమునకే యంకితమొనర్చిరి. సారస్వతసేవాదీక్షితులగు వీరికి చిరాయురారోగ్యములను భగవంతుడు ప్రసాదించునుగాక! ౭ పుటలు. డెమ్మిచిన్నసైజు. చిరునామా: వాజపేయయాజుల రామసుబ్బారాయఁడుగారు, బి. ఏ. ప్రెసిడెంటు, స్నేహలతాకవితాసంఘము, కొల్లాపురము, జటప్రోలుసంస్థానము.

—సూ. కృ.

౬. స్నేహలతాకవితాసంఘము.

ఈ సంఘ మొనర్చుచున్న భాషాకృషిని బ్రశంసించుచుఁ బలువురు ప్రముఖు లిచ్చిన యభిప్రాయములన్నియు సంఘాధ్యక్షులచే నొకటిగాఁ గూర్పఁబడినవి. శ్రీపాద కృష్ణమూర్తిగారు, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు మొదలగు పండితప్రకాండు లీసంఘకృషిని మెచ్చుకొనిరి. దీనికి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు అను నొకవిదుషీమణి యుపాధ్యక్షురాలు. ఇంకను గొందఱు స్త్రీసభ్యురాండ్రు సైత మిందుఁ జేరి పనిచేయుచుండుట యీసంఘగౌరవమును జాటుచున్నది. వివిధరీతుల సారస్వతసేవచేయుచున్న వారి నిట్లు సంఘముగ నేర్పఱచి ఆంధ్రభాషామోదమును సేవించుచున్న శ్రీరామసుబ్బారాయుడు గారెంతయు ప్రశంసార్హులు. ఆంధ్రు లెల్ల

రిసంఘమునకుఁ దగిన చేయూతనిచ్చి యాదరింతురు గాక యని కోరెదను. —మా. కృ.

౭. నవ్వగలవా?

శ్రీయుతులు కాంచనపల్లి వేంకటరంగారావుగారిచే రచింపబడినది. నవ్వుపుట్టించురచనలు. వినోదైకప్రాధాన్యముగల రచనలు తెలుఁగుభాషయందుఁ దక్కువ. ఇట్టిరచనలు ఉత్కృష్టములగు హాస్యగ్రంథరచనమునకు ప్రోత్సహించుచో వీనిజనికి సార్థకముకాగలదు. ౧౩ పుటలు. వెల ౦-౦-౯. నైసలు. డెమ్మి చిన్నసైజు. చిరునామా: కాంచనపల్లి వేంకటరంగారావుగారు, బాపూరు, బరంపురము —మా. కృ.

౮. పెళ్లాన్ని యెలా పిలవడం?

ఇది యొకవినోదరచనము ఇదియును కాంచనపల్లి వేంకటరంగారావుగారిచేతనే రచియింపబడినది. భార్యనెట్లు పిలుచుట! యను వాలోచనాతరంగములలో నొక యువకుఁడు కొట్టుకుపోయి దారితెన్ను నెఱుఁగక పోయినాఁడు. కాలక్షేపమునకై చదువుకొనవచ్చును. ఐదు, ఆరు సంవత్సరములకు పూర్వము శ్రీతల్లాప్రగడ రామారావుగారిచే ప్రచురింపబడుచుండిన 'ఆంధ్రభారతి' మాసపత్రికలోని 'పెళ్లాన్ని ఎల్లా పిలవడం?' అను వ్యాసమున కిది కొంతవఱకు అనుకరణ మన నొప్పును. వెల ౦-౧-౦. ౧౮ పుటలు. బరంపురమునందలి వేగుఁజుక్క ముద్రణాలయమునందు ముద్రితము. చిరునామా పైదే. మా. కృ.


౯. శిశువుల యకృత్ ప్లీహ వ్యాధులు

శిశువుల యకృత్ప్లీహ (లివర్ అండ్ స్ప్లీన్) వ్యాధుల నిర్మూలనమునకు పరమహంసక్రియ యనఁదగు ఔషధరాజమును కనిపెట్టి దాని నర్హమగు విశేష ప్రచారమునకుఁగొనివచ్చి మానవసేవచేయుచున్న డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారిచే ఇది గ్రథితము. శిశువులే దేశసంపద. వారిమేలే దేశముమేలు. ఏదేశమున శిశుమరణములు విస్తరించియుండునో ఆదేశము అన్నివిషయములందును వెనుకబడియున్న దేశముగా పరిగణింపనగును. హిందూదేశమున శిశుమరణములు హెచ్చు అగుట సర్వజనసువిదితము. ఇచటి శిశుమరణములకు కారణమైన వ్యాధులలో యకృత్ప్లీహవ్యాధులు-ముఖ్యముగా మద్రాసు, వంగరాష్ట్రములందు-ప్రముఖస్థానము వహించుచున్నవి. అల్లోపతిక్ వైద్యమున ఈ వ్యాధులను నమ్మకముగా కుదర్చుగల మందులేదు. అగుట డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి లివర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్ నేటి ఆయుర్వేదవైద్యమునకు గొప్ప కీర్తి నార్జించునదిగా నున్నది. పాశ్చాత్యవైద్యశిఖామణులుకూడ పలువురు దీనిని ప్రశంసించియున్నారు. దేశమునందలి వివిధవ్యక్తులచే నిది పొందిన యోగ్యతాపత్రములకు లెక్కలేదు. అందు ముఖ్యమైన యోగ్యతాపత్రములు కొన్ని ఈ గ్రంథమున ముద్రితములు. యకృత్ప్లీహవ్యాధిగ్రస్తులైనప్పటియు, ఈ ఔషధము సేవించినతరువాత రోగవిముక్తులై నప్పటియు శిశువుల చిత్రము లీగ్రంథమున గలవు. పెక్కు ప్రదర్శనములలో ఈమందు అర్హసన్మానము నందియున్నది. నేటి ఆంధ్రులు ఆయుర్వేదమున తమ ప్రతిభను చూపుకొనుటకు కారణమైన మందులలో నొకటియగు ఈ లివర్ అండ్ స్ప్లీను స్పెసిఫిక్ నుగూర్చిన ఇంకను అనేకోపయోగవిషయము లిందు గలవు. కోరువారికి ఉచితముగ పంపబడును. గ్రంథమున డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి చిత్రముగలదు. గ్లేజు కాగితములమీద సుందరముగ ముద్రింపబడియున్నది. చిరునామా: 8, శాలైపేట, మైలాపూరు, మదరాసు.


౧౦. తర్కసంగ్రహము

తర్కశాస్త్రపారంగతుఁడగు అన్నంభట్టు విద్యార్థులకు సులభార్థబోధకముగ నుండునటుల ఆ శాస్త్రమును సంగ్రహపఱచి తర్కసంగ్రహమను గ్రంథమును సంస్కృతమున రచియించెను. దానికిపుడు ఆంధ్రతాత్పర్యమునురచియించి చరకశతదీపికాఖ్యాయుర్వేదమత వివరణములో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి యల్. ఐ. యమ్., హెచ్. పి. ఐ. యమ్. గారు వెలువరించియున్నారు. ఈ గ్రంథమును గూర్చి విపులవిమర్శనము పైమాసమున ప్రచురింతుము. ఈపుస్తకప్రకాశకులు: పండిత, ములుగు రామలింగయ్యగారి ఇండియన్ మెడికల్ స్టోర్సు, తెనాలి. ఫుల్‌స్కాప్ చిన్నసైజున ౯౨ పుటలు. వెల రు. ౧-౦-౦.


ఆంధ్రసాహిత్య పరిషత్తు
కాకినాడ
TELUGU ACADEMY, COCANADA



విజయవాడ కనకదుర్గాలయధ్వజస్తంభము.



ఇంద్రకీలాద్రి. — విజయేశ్వరాలయము. — కృష్ణకాలువ.



కృష్ణానదిపై సూర్యోదయము.

లోకము

❖

క్షీణప్రమోదజీవితాన్నిచూసి ఈ స్వార్థలోకము నవ్వుకొంటున్నది. నా నిట్టూరుపుల్లో శ్రమతీర్చుకొంటూ నాకన్నీటి చాలులో ఇంద్రధనస్సులుచూచుకొంటున్నది.

ఏమలినపథాల్లోనో మానవులపాదాల క్రింద రజోలేశాన్నయి నలిగిపోనున్న నాకోసం,

ఏ యెడారిసీమనో శిథిలతుషారమునై రూపుమాయనున్న నాకోసం,

ఇంత కల్లోలమా! ఇంత అసహనమా! ఇంత ప్రభంజనమా!

ఆమనినై మూగకోయిల గొంతులో చైతన్యరాగము నింపిననాడు, శరత్తునై మలిన శశాంకుని హైమచాయకు మెరుగు పెట్టిననాడు,

చుక్కలతో పాటిజగతికూడా తలపూపి తేరి చూడలేదా!

ముత్యాలనే భ్రాంతితో హిమకణాలకు దోయిలించాను. కాంచనమేయుని సంధ్యా కాంతికి చేతులు చాచాను.

సాగరనీలిమలో మృత్యుశైతల్యమున్నదని యూహించలేక పోయాను.

కుములుతున్న శ్మశానహృదయంలో ఇంత అంధకారమును దాచుకొన్న దీవిశ్వము.

మిణుగురికే చోటులేని ఈచీకటిలో మెరుపులకు తావెక్కడ!

❖

—పురిపండా అప్పలస్వామి.

గ్రామ పునర్నిర్మాణం

౧

ఇటువంటి విషయాలమీద ఎవరైనా వ్యాసాలు రాసినా ఉపన్యాసాలిచ్చినా నమ్మకండి. నేను బి. ఏ. చదువుతుండగా ఈ "విలేజ్ రీకన్‌స్ట్రక్షన్" అనే మాట మొదటిసారి విన్నప్పుడదేమిటో అర్థంకాలేదు. అది ఆరోజు హాస్టల్లో డిబేటుకు సబ్జక్టు. అయితే నేం? నలుగురూ అనుకుంటున్నదీ విని విషయం అర్థంచేసుకోవటమేకాక నేనుకూడా మాట్లాడటానికి తయారయి ఒక పదినిమిషాలపాటు ఊపిరిసలపకుండా ఉపన్యాసం ఇచ్చి, కనీసం అరడజను పర్యాయములైనా "హియర్! హియర్!" అనిపించుకుని మరీ ఇవతలపడ్డా.

చెప్పొచ్చిం దేమిటంటే ఉపన్యసించటం అంత సులభం. లాయరు గట్టివాడైతే అన్యాయాన్ని న్యాయంకన్న న్యాయంగా కనపరచగలిగినట్టుగానే కాస్త మాటకారయితే అడ్డమైనదాన్నిగురించీ మాట్లాడి మన జీవితం యావత్తూ దానితోనే ఉందని నిరూపించవచ్చు. ఈ గ్రామపునర్నిర్మాణం అనేదాన్ని గురించే ఎవరైనా మాట్లాడుతుంటే ఒక్కపర్యాయం వినండి! గాంధి మొదలైన లీడర్లంతా కడమవ్యాపకాలన్నీ కట్టిపెట్టి గ్రామాలసంగతి ఎందుకు చూడరా అనిపిస్తుంది. తెలీకడుగుతాను, ఇప్పుడు మనగ్రామాలకేం? పట్టణాల్లో ఉన్నట్టు మునిసిపల్ ఎన్నికలు, ఖూనీలు లేవు; వెర్రిఖర్చులేదు.

గ్రామాలకు బురదా, చవుడూ మొదలైన లోపాలు లేవనను. కాని పల్లెటూరివాళ్ళచేత అవి లోపాలని ఒప్పించండి చూస్తాం! పోనీ పల్లెటూరివాళ్ళకు వాళ్ళ కష్టసుఖాలే ఎరుకలేనంత దుస్థితి వచ్చిందని ఎవరన్నా దయదలిచి "గ్రామపునర్నిర్మాణ" నిర్వహణం పూనినా అది పూర్తిఅయేసరికి పొద్దుగూకి ప్రళయానికి వేళవుతుంది. వెధవది! — మా సూరాయివంటి మేధావికి పల్లెటూళ్లో బాడ్మింటనుక్లబ్బు ఏర్పాటుచేసేసరికి తల ప్రాణం తోకకొస్తే-క్షమించండి! పొరపాటున కథను చివర అందుకున్నాను.

౨

తమ అనుజ్ఞ అయితే ఇప్పుడు కథ సరిగా మొదలుపెడతా.

నేను బి. ఏ. చదివేరోజుల్లో అనేకరహస్యాలు గ్రహించా. ఒకదాన్నిగురించి ఇంతకుముందే మనవి చేశా. మరొకటేమిటంటే పల్లెటూరిపట్టులకు చెందిన సౌందర్యాన్నిగురించిన రహస్యం. పల్లెటూళ్ళ ననుసరించుకుని సౌందర్యం ఉంటూఉన్నదన్న విషయం నాకు తట్టకపోవటంలో నాతప్పేమీలేదు. అది నాకళ్ళ ఎన్నడూపళ్ళేదు. బురద, చవుడు మొదలైనవంటారా? అవైతే విరివిగానే చూశాను. ఎంత గుడ్డి కబోదైనా చూడకుండా ఉండలేడు. ఈ సౌందర్యం ఏదైతే ఉందో అది బొత్తిగా నామీద కితకన్నువేసి ఎన్నడూ నాకళ్ళబడ్డ పాపాన్నైనా పోయిందికాదు. పల్లెటూరి వాళ్లు బస్తీలను తిట్టి తమగ్రామాలనుగురించి మెచ్చుకుంటున్నప్పుడన్నా ఇందులో ఏదోఉందని పోలేదు నాబుద్ధికి. అదంతా పల్లెటూరివాళ్ల పక్షపాతబుద్ధికింద తోసేశాను. కాని షేక్స్పియర్ మొదలైన మహాకవుల నేం చెయ్యనూ? వాళ్లూ అనుకోక చెప్తుంటే ఇక నమ్మకపోవటం ఎట్లా? ఆ అనుభవం నేనుకూడా పొందుదామని అభిలాషకలిగి వేసవికాలపు శలవులకు సూరిగారిగ్రామం పోయినా.

సూరాయి నారాకకు చాలా సంతోషించాడు. అది—నారాక—తనకు ఒకవిధంగా చాలా సహాయకారి కాబోతున్నదన్నాడు. అదేమిటంటేని. నాకు సమాధానంచెప్పకుండా వాడు ఒక పెద్ద కొయ్యపెట్టెలోనుంచి నాలుగైదు పాతబాడ్మింటన్‌బాటులు తీశాడు.

"వీటి గట్ యావత్తూ ఊడదీసి మళ్లీ అల్లాలి. సాయంత్రంలోపుగా రెండుబాటులైనా సిద్ధం చెయ్యాలి" అన్నాడు సూరి.

"చేసి ?"

"సాయంత్రానికి ఆడుకోవచ్చు."

"ఎక్కడ ?".

"అదంతా ఏర్పాటుచేశాలేరా! పదిహేనురోజు ల్నించీ ప్రయత్నంచేస్తున్నా ఈ ఊరివాళ్ళచేత బాడ్మింటన్ ఆడించాలని. నా ఒక్కడివల్ల కాలేదు. కాస్త నువ్వుసహాయంచేస్తేనా, ఈఊళ్లో బాడ్మింటన్ టూర్నమెంటు పెట్టించకపోతే నాపేరు సూరాయికాదు."

సూరాయి నాసహాయం కోరినందుకు సంతోష మయింది.

"సరంజామా ఏది ?"

"ఏంకావాలి ?"

"నెట్"

"ఉంది." వాడు పెట్టెలోనించి ఒక పాతనెట్ బయటకి తీశాడు.

"ఎక్కడిదిరా ఇది ?"

"పిత్రార్జితం."

నాకప్పుడంతా జ్ఞాపకంవచ్చింది. మామేనమామ బెజవాడలో ఉద్యోగంచేస్తున్న రోజుల్లో ఇంట్లో బాడ్మింట నాడుతుండేవాడు స్నేహితులతో.

"ఏర్పాటంతా ఉన్నతరవాత ఎవరుపడితే వాళే ఆడతారు—చాటుపెట్టి పిలవాలా ఏమిటి ?"

"ఆడనాడరు! పల్లెటూరివాళ్ళకు కొత్తవిషయం వస్తే భయం. ప్రతివాడికీ ఆటంతా వర్ణించాను. ఒక్కరోజు ఆడిచూడమన్నాను. ఊఁహుఁ! మనిద్దరం రెండురోజులపాటు ఆడి వీళ్ళకు భయంపోగొట్టాలి."

"ఒక్క క్షణం ఉండరా, సూరీ! ఇది గ్రామపునర్నిర్మాణంకిందికి వస్తుందంటావా ?"

సూరాయి కాస్సేపు మొహంచిట్లించి "రావచ్చు. నాకెన్నడూ తట్టలేదు. కాని నువ్వు చెప్పింతరవాత—" అన్నాడు.

"అయితే నీప్రయత్నంమాను," అన్నా.

సూరి నిర్ఘాంతపోయి "ఏం ?" అన్నాడు.

"గ్రామపునర్నిర్మాణం జరగదు. అది కృతజ్ఞతారహితమైనపని. చివరకు నిన్ను వెలివేయిస్తారు. అనుభవంమీద చెబుతున్నాను విను."

"ఏమిటి నీఅనుభవం ?"

"అట్లాఅడుగు చెబుతాను. మొన్న డిసెంబరులో కాంతంగారి ఊరువెళ్ళబోతూ బజారులో చొక్కాలూ, అవీ తగిలించుకునే కొయ్యపదార్థాలుంటై చూశావు?—అది కట్టుకుపోయినా. కాంతం, బావా నన్ను చాలామెచ్చుకుని దాన్ని మేకులుపెట్టి గోడకుపరిచి—పల్లెటూరికి చీపాలు—ఒకబండెడుబట్టలు తగిలించారు. స్నానంచెయ్యబోతూ బావ చొక్కా దానికి తగిలించి తువాలుచుట్టుకుని బట్ట దానిమీద తగిలించబోయ్యేటప్పటికి చొక్కారాలింది. అది తీసి దానిమీద వెయ్యబోయ్యేటప్పటికి అదంతా బండెడుబట్టలతో సహా కదిలి బావనెత్తిమీదికి అవతరించింది. పైన ఏం చెప్పను? ఆరాత్రే అదివచ్చి దహనంపొందింది. నన్నటువంటి వస్తువులు తీసుకురావద్దని కాంతం శాసించటం! దాన్నెందుకు తిడతావే నీచవటిగోడను తిట్టక- అంటే, నీసున్నపుగోడ లేడిచినట్టే ఉన్నాయి లెమ్మంది. కనక ఎందుకు తలపెడతావు గ్రామపునర్—"

"అందుచేత మనంవెంటనే బాట్లల్లటానికి ఉపక్రమిద్దాం, ఎక్కువ వ్యవధానంలేదు. సాయంత్రానికి బాట్లు సిద్ధంకావాలి." అన్నాడు సూరి చాటంత మొహంతో.

3

మీకెప్పుడన్నా బాటు అల్లించుకోవలిసొస్తే నా సలహా తీసుకుని ఆరణాలు పారేసి చాతయిన వాళ్ళచేత చేయించుకోండి మధ్యాహ్నం భోజనంకాగానే ఇద్దరం చెరోబాటూ తీసుకుని అల్లటానికి ఉపక్రమించాం. మొదటినించీ సూరి నేను వెనకపడుతున్నానని సణుగుతునే ఉన్నాడు. ఎట్లాగోట్లా చేతులన్నీ చించుకుని అల్లటం పూర్తిచేస్తే బాటు పరీక్షచేసి ముళ్లు తప్పుస్థలాల్లో ఉన్నయ్యనీ, బాటు వదులయిందనీ, దాంతో ఆడేకన్న చక్కబాటుతో ఆడటం మంచిదనీ వ్యాఖ్యానం మొదలుపెట్టి కొప్పడేదాకా ఆగలేదు.

"ఒరే, నూరీ! బంతు లేవీ? చూశావా? నన్ను నమ్ముకుంటే బాగుపడవు. బంతుల్లేకుండా ఎట్లాఆడతాం?"

"అన్నీ ఉన్నై. నీ తెలివితేటలమీద ఆధారపడలేదు నేనూ. వాటిసంగతి నాకు బాగా తెలుసు."

వాడిమాటల్లో విస్తారం నేను వినిపించుకోదలచలేదు.

"బాగా నేఉంది కాని నాకీఆట బాగారాదే! నేను ఒకటిరెండుసార్లు ఆడాలని ప్రయత్నంచేస్తే బాటులోనుంచి బాలు దూరిపోవటంచూసి నాబాటుకు కంత లున్నాయని అందరూ కనుక్కున్నారు. నాతో ఏంపనవుతుంది?"

"నీతో నే అవుతుంది. చూస్తూ ఉండు."

అప్పటి కింకా నాలుగైదుగడియల పొద్దుంది. నా నెత్తిన బంతీ, బాటులూ, నెట్టూ పడేసి తాను రెండు బొంగులూ, ఒక తవ్వకోలా, చేపూ తీసుకుని నూరి దారితీశాడు. ఊరిబయట చింతలమధ్య కోర్టుకు సరిపోయే చక్కని సమప్రదేశం ఉంది. పది పదిహేను నిమిషాలకల్లా నూరి కోర్టు సిద్ధంచేశాడు. అవసరమైన గీతలూ అన్నీగీసి గుంటలుతవ్వి, గుంజలు పాతాం.

మొత్తానికి మా నూరి చాతయినమనిషి. అఖిలభారత గ్రామపునర్నిర్మాణమహాసభ ఒకటి ఏర్పాటుచేస్తే బాడ్మింటన్ బ్రాంచికి మానూరాయి అద్భుతమైన అధ్యక్షుడవుతాడు. ఒకగంటసేపు అది కట్టాబుట్టా నెత్తినేసుకుని ఇంటికివస్తుంటే నూరి "నీ ఆట, మాచ్చికి ఆస్టే చెప్పకు గాని, నాపనికి బాగా ఉపకరిస్తుంది" అని పైనచెప్పటం మరిచిపోయినాడు.

మర్నాడు మా ఆటకు ప్రేక్షకులు వచ్చారు! మా ఆట వాళ్ళకు చాలాసంతోషకారణమైనట్టు కనపడ్డది. దానికి కారణం ఆటలో నాకుగల నైపుణ్యమేనని నాకీనాటికీ కొద్దిగా అనుమానం ఉండనేఉంది. నన్ను చూసి నవ్వితే నవ్వారు కాని మావాడిప్రయత్నం కొన సాగుతున్నందుకు సంతోషించాను.

ఈవిధంగా రెండురోజులు గడిచింది. ప్రేక్షకులు వచ్చి చూసి సంతోషించినవాళ్ళేకాని ఆడేప్రయత్నం ఏమీ చెయ్యలేదు. నూరి ఎవ్వరినీ ఆడమని ఆహ్వానం చెయ్యనైనాలేదు. వాళ్లసలు ప్రేక్షకు లవటానికూడా నాకంత మనస్కరించటంలేదు. వాళ్ళలో ఒక భాగం గొల్లపిల్లలూ, ఇంకోభాగం సంసార్లపిల్లలూ, కొద్దిమంది ఆడపిల్లలూ, ఒకటిరెండు గొడ్లూ, ఒక కుక్కా—దానికి మా ఆటచూస్తే గౌరవంలేదు. వచ్చినట్టువచ్చి ఏదోపనిమీద పోతూండేది—కొన్ని కోళ్లూ అవీకూడా మధ్యమధ్య మాఆటచూసి నవ్వుతూ పురుగులేరుకుంటూ అటూ షికారు చేస్తుండేవి.

నే నీపరిస్థితులు నూరితో ముచ్చటించా.

"నువ్వు తొందరపడకు" అన్నాడు నూరి. "నేను వచ్చి ఆడమంటే చస్తేరారు, బెదిరిపోతారు. ఒకరిద్దరు తూగుతున్నారు. బహుశా రేపు ఎల్లుండిలోపల మనకోర్టు కిద్దరు ముగ్గురు మెంబర్లురావచ్చు. అప్పుడు మనంకాస్తా క్లబ్బయి ఊరుకుంటాం."

"వెనక బాడ్మింటు నాడటాని కింతభయమెందుకు, వెనకాడటం ఎందుకు?"

"మనభయాలు మనకులేవా? నువ్వు నీపెళ్లాంతో ఒక్కరోజు ఊరిబయటికి షికారుపోయిరా! పాపమా? తప్పా?"

"నవ్వరా?"

"ఇక్కడా అదేభయం."

మా ఉద్యమానికి మర్నాడు కాస్త జవంకలిగింది.

మామూలుప్రకారం మేమిద్దరం ఆడుతున్నాం. నేనుమాత్రం మామూలుఫారంలో లేకపోవటంచేత రెట్టింపు ఉత్సాహంతో బంతులు తప్పుతున్నా. ఇంతలో అనుకోకుండా ప్రేక్షకుల్లోనుంచి ఒకసంసారికుర్రవాడు కోర్టులో జొరబడి నాచేతులో బాటులాక్కుని నూరితో "రావయ్యా! ఆడు; ఒకచెయ్యచూస్తానూ!" అన్నాడు. మానూరి నన్నుకోర్టులోనుంచి బయటికి పొమ్మని సంజ్ఞచేశాడు.

ఆరోజునుంచి వారంలోపల కోర్టులో ఎనిమిదిమంది మెంబర్లమైనాం. అందులో ముగ్గురం బ్రాహ్మలం: నేనూ, నూరీ కలుపుకుని. ఒకరోజున నూరి అందరిని కూర్చోబెట్టి చిన్న ఉపన్యాసంఇచ్చాడు. "ఈఆట పదిమంది ఆడవచ్చు. ఇప్పు డెనిమిదిమందిమైనాం. మనకు మంచి

బాట్లులేవు. బంతులులేవు. నెలకు తలకో రొండణాలు కలిసిన మార్చనిమూరి నాకు చెప్పినప్పుడాశ్చర్యం చేసుకున్నా, మంచిబంతివస్తుంది. రూపాయా రూపాయి చేసింది.
న్నరో పెట్టితే మంచిబాటొస్తుంది. ఈఏర్పాటంతా కొద్దిరోజుల్లో మాకోర్టు కళకళలాడుతున్నది.

చేస్తే మీఆట ఇంకా బాగుంటుంది. మనం ఒకమనిషిని ఎన్నుకుని వాడిచేతికి మనచేదా చంతా ఇస్తే వాడే అవసరమైన సదుపాయాలు చేసి నెలాఖరుకు లెక్క చెప్తూతూంటాడు. కాబట్టి మనలోఒకణ్ణిఎన్ను కుందాం. ఏమంటారు? నేను చెప్పినదానికిష్టమైనవాళ్లు చేతులెత్తండి."

ఒకరితరవాత ఒకరు అంతా చేతులెత్తారు. అందరికన్న చివర చెయ్యెత్తినవాణ్ణిచూసి తరవాత నెలరోజులదాకా నవ్వుకుంటునే ఉన్నారు. పల్లెటూళ్ళలో ఇటువంటివి ఊరికేపోవు.

"అంతవరకు బాగానేఉంది. ఈపనికి ఎవరంటారు ?"

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. చివరకొక పాతికేళ్ళవాడు మొహం భయంకరంగా పెట్టుకులేచి "మాకదంతా తెలదండి. డబ్బంతా మీచేతికేయిత్తాం. మీకేంచేసినాసరే!"

ఆంధ్రభూమి

కన్నెఉంగనినాఁడు కాచిప్రోచితివి,
మేనెఉంగనినాఁడు మేలుకొల్పితివి,
పదములొట్రిలునాఁడు పట్టినిల్పితివి,
నేనెఉంగనఁటమ్మ ! నిన్నాంధ్రభూమి!
పసిపాపనగునాకుఁ బాలిచ్చిపెంచి,
అన్నదమ్ములతోడ నాటలాడించి,
మనసున్నవారితో మాటలాడించి,
నన్నెఉంగవఁటమ్మ! నాయాంధ్రభూమి!
సంపన్నిధివి నాకు, శక్తివి నాకు,
విమలకీర్తివి నాకు, విద్యవు నాకు,
సౌఖ్యమూర్తివి నాకు, జననివి నాకు
నేనెఉంగనఁటమ్మ! నిన్నాంధ్రభూమి!
తెలివిఁదెచ్చిననాఁడె దీవించినన్ను
నామనోరథముపై నాసీనవైతి,
భావహయంబులు పరువెత్తువేళ
నన్నెఉంగవఁటమ్మ! నాయాంధ్రభూమి!
గృహదేవతగనిన్నుఁ గీర్తింపఁగంటిఁ,
గులదేవతగనిన్నుఁ గొలువంగఁగంటి,
మాతృదేవతగ నిన్ మన్నింపఁగంటి
నేనెఉంగనఁటమ్మ! నిన్నాంధ్రభూమి!
అంతరంగము పత్ర, మాత్మ పుష్పంబు,
భవము ఫలం, బనుభవము తోయంబు,
అనుపమానందాప్తి నర్పింతు నిట్లు,
నన్నెఉంగవఁటమ్మ! నాయాంధ్రభూమి!

—ఆంధ్రపుత్రుఁడు.

కొత్తబాట్లు! కొత్తబంతులు! ప్రతిరోజూ ప్రేక్షకులు. పదముగ్గురు మెంబర్లు. అయిదుగురు బ్రాహ్మణులు, మిగిలినవారు శూద్రులు. మావాడిం కోమిటింగుపెట్టి మరిద్దరిని తనుపెట్టేఖర్చు అకూ వాటికీ సాక్ష్యంగా ఉండటానికి తీసుకుని క్లబ్బులో వాళ్ళకూడా పదవిఇచ్చాడు.

కోర్టుకు పేరువచ్చిందికాని కీర్తి రాలేదు. ఊళ్లోముఖ్యులంతా మాకోర్టును లక్ష్యంచేసినట్టు కనపడలేదు. కాని ప్రతిరోజూ సాయంతరంవేళ అరుగులమీద జరిగేమీటింగుల్లో మాకోర్టును గురించి చర్చవస్తున్నదని మాకు తెలుసు.

౪

ఒకరోజు రాత్రి నేనూ, నూరాయే భోంచేసి చల్లగాలికి అరుగులమీదచేరాం. కొంచెం సేపటికి ముగ్గురునలుగురు బ్రాహ్మణయువకులు

బ్బంతా మీచేతికేయిత్తాం. మీకేంచేసినాసరే!" వీధివెంటవచ్చి మేంకూర్చున్న అరుగులమీద తిష్ట ననికూర్చున్నాడు. అందరూ తలలూపారు. అథ వేశారు. ఎందుకంటే ఊరికేనన్నారు. మేం వాళ్లని యంతరాకారం ఒకవిధమైన సిగ్గువల్లా, జంకువల్లా లక్ష్యంచెయ్యకుండా మాధోరణిలోనే ఉండగా ఆ

సమూహంలో గుసగుసలు బయల్దేరినై. ఆ గుసగుసలు పెద్దవై నలుగురూ ఒక్కసారి బిగ్గరగా మాట్లాడటం మొదలుపెట్టి ఏవో కొంతసేపు వారికే వినపడక అంతా ఒక్కసారి చాలించారు. అంతా ఒక్కసారి నిశ్శబ్దం.

"ఏమిటీ గలభా?" అన్నాడు సూరి.

వాళ్లు తెలియచేసిన సంగతి. ఊళ్లో "కొందరు" మా బాడ్మింటన్ కోర్టులో చేరాలనే ఉద్దేశంతో ఉన్నారట, కాని ప్రస్తుతం అంతా శూద్రమేళంగా ఉందని అనుమానిస్తున్నారట, అది బ్రాహ్మణసంఘం అయితే ఏర్పాటుచేస్తే—

ఆలోచించి చెబుతానని సూరి వాళ్లను పంపేశాడు.

"మన క్లబ్బుకి బ్రాహ్మణ-బ్రాహ్మణేతరసమస్య కూడా ఎదురైనట్టుంది. ఏంచేస్తావు? ఉన్నశూద్ర పిల్లల్ని తీసేస్తావా?"

"దీన్లో శూద్రులున్నారన్న ఏకు ప్రకంటె వాళ్లు పదవుల్లో ఉన్నారని ఏడుపు—నిన్న ఇద్దర్ని ఎన్నుకున్నాం కాదూ? బ్రాహ్మడు సంభావన కోసం పరిగెత్తుతాడు. ఉద్యోగంకోసం పరిగెత్తుతాడు ఆంధ్రుల్లో వెయ్యి, రెండువేలమైళ్లదూరం వెళ్లి అక్కడ కీర్తి సంపాదించినవారు లేకపోలేదు. అంతా బ్రాహ్మణులే. "ఇంకా కొంతకాలంవరకూ ఈనాటి బాధలు రాక పోతే మనక్లబ్బులో మరినాలుగు గౌరవపదవులు సృష్టిద్దామని చూస్తున్నాను."

"అయితే బ్రాహ్మలు కోర్టులో ప్రవేశించి శూద్రులను వెళ్లగొట్టటం అన్యాయంకాదా?"

"అప్పుడుకాని గౌరవంరాదు కోర్టుకు. ఈ శూద్రులక్కూడా బ్రాహ్మణులు కోర్టులోచేరి తమను ఉన్న స్థానాలనించి వెళ్లగొట్టిన తరవాత కోర్టును చూస్తే గౌరవం హెచ్చుతుంది. అదీకాక ఇంకొకటిచూడు. కాలిదెబ్బకు, ముష్టిదెబ్బకు దొంగతనానికి తెగబడి జైలుకుపోయినవాడు అన్యాయమనుకుంటాడా, కర్మ అనుకుంటాడా? ఈ బ్రాహ్మణులు కోర్టులో చేరిన తరవాత శూద్రులకు ఊపిరాడదు. వాళ్లు బహుశా ఇంకో కోర్టు లేవదీస్తారు."

సూరి చెప్పిన ప్రతిలక్షణం నిజమైంది. నేనాఊరు వదిలివచ్చేటప్పటికి రెండుకోర్టులూ విజృంభిస్తున్నై. కొంతమంది జోరుగా ఆడుతున్నారు.

౫

తొమ్మిదినెల్లకాలం గడిచింది. తిరిగి ఏప్రిల్ మొదట్లో సూరి ఊరికొచ్చాను. తక్కిన విషయాలతోపాటు క్లబ్బును గురించికూడా అడిగాను.

అంటానంటే సూరాయికి క్లబ్బులో ఎక్కువ గౌరవం ఉన్నట్టు తోచలేదు. మొదట్లో ఇతరులకు దేన్ని గురించీ ఏమీ తెలీకపోవటంచేత సూరికి నిరంకుశాధికారం ఇచ్చారట. కాని తరవాత వాడి ఇష్టం వచ్చినట్టు చేస్తున్నాడని, ఇక తను చాలించుకుని మరొకడికి కాపదవి ఇవ్వాలని కడంవాళ్లకు పట్టింది. సూరాయికి ఒళ్ళుమండి క్లబ్బు తనది, తన ఇష్టం అన్నాడు. కొన్నాళ్లు క్లబ్బు మూసిపెట్టారు. సూరాయి అనుచరులమీద ఉపన్యాసాలిచ్చాడు. శూద్రులంతా రెండోకోర్టు అద్భుతంగా పనిచేయిస్తున్నారు. బ్రాహ్మణు లెప్పుడూ ఇంతేనని తిరిగి కోర్టుపరిపాలనం మొదలుపెట్టింది. జరిగిపోయింది. ఇప్పుడు సూరి ఇంకో ఎత్తువేశాట్ట. రెండువందల రూపాయి చందావేసుకుని నూతన కష్టాలు చేయించి పందాలు పెడతానన్నాడు. కొంతకాలం నించి సూరాయి ఏది చెప్పినా కాదనటం మొదలుపెట్టారు కొందరు మెంబర్లు. ఇప్పుడూ ఆమాటే అన్నారు. అయితే నేను సొంతంగా టూర్నమెంటు పెడతాను ఆడ దలుచుకున్నవాళ్ళు ఫీజు రెండు రూపాయల రుసుము చెల్లించి అప్లికేషను రిజిస్టరుచేయించుకోమన్నాడు. క్లబ్బుమెంబర్లనుంటే చెప్పటానికి వీలులేదు. మాకే పందాలు వద్దన్నారు.

"ఇనాళ్ళ కప్పాల కోర్టు తిరిగింది పాపం రెండో కోర్టువాళ్లంతా చెల్లించారుసుమా ఇరవై రూపాయిలు కనుక్కుంటే మనకోర్టువాడు ఒక్కడివ్వలేదు. రేపు సాయంత్రంలోపల ఇవ్వకపోతే ఎల్లుండి మాచెస్ లోకి రాడు."

"నువ్వింత స్ట్రిక్టుగా ఉండకపోతే ఏంగాని చేతి డబ్బెంత తగులుతుంది?"

"ఏమిటా తగాదా. అసలు కప్పలు మామా ఒక కతి రూపాయలతో వచ్చేవే. నే నొకటి గ్లేశంతో మూడు ముప్పైరూపాయల కొన్నదరుచేశా. అస లెందుకు? రేపు సాయంత్రంలోపల ఇంకో ఇరవై రూపాయలు రాలవూ?" అన్నాడు.

సాయంకాలానికి కప్పలు సిద్ధమైనై. రాత్రికి ఇద్దరం మూరిగారూరుచేరాం. తెల్లవారగానే ఊరంతా కప్పలువచ్చిన వార్త వ్యాపించింది. జనం గుంపులుగా వచ్చి కప్పలు చూసి పోయినారు. వచ్చిన ప్రతిప్రతి వాడితో మొదటికోర్టువాళ్ళు మూర్ఖించటాన్నిగురించి చెప్పాడు మూరి. అందరూ మూరికి ప్రతికక్షులే కాని కప్పలుచూడగానే ప్రతివాడిహృదయంలో కామం ప్రవేశించింది. కొందరు పెద్దలు మూరితో ఈవిషయం దీర్ఘంగా చర్చించి "మొదటికోర్టులో మేంచెప్పి ఒప్పిస్తాం. పందాలు ఇంకాకొండురోజు లకరలపెట్టి కొంతకాలం విప్పించ"మని కోరారు. "అది చెప్పటికీ జరగదు మాడుకప్పలూ కొండ్లోకోర్టుస పోలిసింకే" నన్నాడు.

నేను మూరిప్రయత్నం విఫలమౌతున్నదనిరూఢి పరుచుకున్నాను—ఈ పందాలతో వారికి నష్టం వస్తుందనికాదు. పందాలు రెండుకోర్టువాళ్ళలో జరగవనికాదు. మొదటికోర్టువాళ్ళుకూడా పందాలలో పాలుతీసుకోకపోతే మూరి గ్రామపునర్నిర్మాణం చేయక లేకపోయినట్టే వాని కదిమాధురిగాడదెబ్బ. కాని మూరెందుకు దెబ్బతింటాడు? ఆరో జయిదుగంటలకు నవ్వుగా హాసంగ్గా ఉన్న కిష్ణవాసు పోతూపోతూ వచ్చినట్టు లోపలికొచ్చాడు. కప్పలు చూశాడు. జేబులోనించి రెండువాపాయలుతీసి తన్ను కింకోర్ట్ను వెయ్యమన్నాడు. పోతూపోతూ ఈవిషయం మర్నాటిదాకా ఎవరితో చెప్పవద్దన్నాడు. కాబట్టి మూరాయి వచ్చిన ప్రతివాడితో చెప్పాడు. అరగంటలోగా తప్పు క్యూచూసి తీరాలి. మూరి డబ్బు రెండుచేతుల్తో వసూలుచేశాడంటే నమ్మండి. ఇక కోరుకు జరపవలయునమా! వాళ్ళకు ఒకరొకరికి నెట్టగానికి చెప్పలేదు ఎవ్వరూ మూరి "ఇక తీసుకోను" అంటాడేమో అనే భయం.

"టూర్నమెంటు" జయప్రదంగా జరిగింది.

—కొడవటిగంటి కుటుంబరావు.

విరహిణి

ఏమిటే చదివే చెలీ!
ఏమనున్నాడో
కరుణించి ఒకసారి
కంటికి కనపడడే!
తెలిమబ్బు తెరలెల్ల
తొలగించి మాచేటి
చందమామ వెలుగునో
జాడ లేమైన ...ఏమి.

కనురెప్పవాల్చకే
కాంతునకే కేమొల్ల
ఉమలు కన్నారేమొ
ఊహించనమ్మా! ....ఏమి.
దేశ దేశాలంట
దివ్యసౌధాలంటి
తిరిగేటిగాడ్పు కే
తెలియునో వార్త! ...ఏమి.

చిలుక వెన్నెలలోన
చెలువు వృక్షలో నేమొ
చెబుతున్న దీయేను
చెవియొగ్గి వినవే! ..ఏమి
మాకు వే ఓ చెలీ!
చూడవే! నలుయొన్న
తేలయూను మన్న దే
పలుకంగ లేక ....ఏమి.

కాంతుడే కనపడడు
కాంత కేమున్న దే?
అడవిగాసిన వెన్నె
లౌన నా బ్రదుకు. ....ఏమి.

—కందుకూరి రామభద్రరావు.

సందేశము

[ఈక్రిందిపద్యములు "శాకాథంగ" మను కావ్యములోనివి. నిర్జనద్వీపమున నేకాకియై ప్రవాసఖేద మనుభవించు కామార్తుఁడగు సుందరుని వాక్యములు.]

౧

తలిరుం బ్రాయపుఁ దీవజవ్వనులఁ జేతఃప్రీతి గాటంపుఁగా
గిళులం జేర్చి యెవో రహఃప్రణయవాగ్వృత్తాంతముల్ పల్కుచున్
వలపుల్ నేర్చిన పిల్లతెమ్మెర! నినుం బ్రార్థింతు, నా నెయ్యపున్
జెలియన్ జేరఁగఁబోయి తెల్పఁగదవే శీఘ్రంబ నావృత్తమున్.

౨

లలితలతావిలాసవతులన్ దరియంజని పల్లవాధరం
బుల నధికానురాగమున ముద్దిడి తీయని తేనె లాను నో
యళివర! ప్రేమశీలివిగదా, విహరింతువు స్వేచ్ఛఁ; గాన నా
చెలియకు నావిషాదకథఁ జెప్పవె యిప్పుడ పోయి ప్రేముడిన్.

౩

సరసాంతఃకరణుండవై ఘనుఁడవై సన్మార్గమందున్ నిరం
తర మిచ్ఛాకలనావిహారముల నానందింతువో యబ్దమా!
చిరకాలాత్తవియోగదుఃఖగళితాశేషాశ్రువుల్ గ్రోలి క్ర
మ్మఱ నా నెచ్చెలిచెంగటం గురిసి ప్రేమం దెల్పు మస్మత్కథన్.

౪

ఆ లేమామిడి యాకుజొంపములలో నాచిన్నచీఁకట్లలో
నాలీలన్ విరహవ్యథాజనితదైన్యస్ఫూర్తి శోకస్వనం
బాలాపించు పికంబ! యిమ్మధువుతో యానంబుఁగావించి నా
నీలన్ గన్గొని మచ్చరిత్రముఁ గృపన్ దెల్పంగదే యామెకున్ ?

౫

వేలాచుంబనసౌఖ్యసంపదలకై ప్రేమంబు పొంగారఁగా
లోలత్వంబున నేగుదెంచు నురుకల్లోలంబ! వైశంబ దూ
రాలన్ నాసఖియున్న తీరమును జేరంబోయి వాకొమ్ము శు
శ్కాలుష్యంబున నొప్పు నాచరితమున్ గంభీరఘోషంబునన్.

—వఝ్ఝుల వేంకటేశ్వరకవి.

మేనల్లునిక్కట్నం

రైలుబండి ఎంతకోలాహలంగా వుంటుందో అంత కోలాహలంగా వుంటుంది రైల్వేకుటుంబాలు కాపురముండే బస—సరిగా ఓ మొగుడూ ఓ పెళ్లాం పడుకోవడానికన్నా సరిపోతుందో లేదో అన్నంత పడుగ్గది, దాని పక్కనే సామానుపెట్టుకోవడానికీ భోజనాలు చేయడానికీ రెండింటికీకలిసి ఓ గది, ఆ గది కిసుకుంటూ వంటగది గజం గజన్నర చతురపుగది. ముందుకో చిన్న వసారా, వసారా కెదురు ఆనుకుంటూ ఓ నీళ్ళోసుకునే పెరడు,—అటువంటి బసలో టిక్కెట్టు కలక్టరుత్ర్యంబకంయొక్క కాపురం. మత్తో చుట్టంపక్కం వస్తే వసారా కో తెరేసి వసారాలో పడ్డించాలిసిందే. నిదర కింకోతావు స్టేషన్ విశ్రాంతిగదిలో కుర్చీలోనో, టిక్కెట్లు అమ్మేగదిలో బల్లమీదనో చూపించాలిసిందే.

త్ర్యంబకానికి శ్రీరామారావు మేనల్లుడు. ఒకనాడు శ్రీరామారావు త్ర్యంబకాన్ని చుట్టపుచూపుగా చూడ్డానికొచ్చి, రాత్రి భోంచేసి త్ర్యంబకంతో కూడా పిచ్చాపాటీ ఆడుకుంటూ స్టేషన్ ప్లాటుఫారంమీదికెక్కి మొగవాళ్ళ విశ్రాంతిగది ముందున్న వసారాలోకి ఒక పడకుర్చీ లాగించుకొని మంచికీలుగా కూర్చున్నాడు.

త్ర్యంబకం 'బుకింగుఆఫీసు' గదిలో తనపని చూచుకోవడానికెళ్లి తిరిగి పదినిమిషాల్లో వచ్చి "నీవు హాయిగా యీలోపల నిదరపోవచ్చును. నాకు రాత్రిడ్యూటీ లేదు. నేను పోయి పడుకుంటాను. తెల్లాత్రే తిరిగి కనిపిస్తాను" అని త్ర్యంబకంవెళ్లిపోయినాడు. శ్రీరామారావొకమారు అట్టే వెళ్ళిపోతూవున్న మేనమామకేసి చూచి తన యథాస్థాయి కొచ్చినాడు. అతని మనస్సులో ఒక ఆలోచన ఊతికే మామను అడుగుదామా అని అనుకుంటావుంటే మంచిదేమో వసీ ఊ పీకుతూవుంది. అడుగ లేకపోయినాడు.

త్ర్యంబకం వెళ్లిపోయి నాక అక్కడ 'లైసెన్సు' కూలీ వొకడగపడితే వాణ్ణిపిలిచి, "వోరేవ్ ఈకుర్చీ కొంచెం అరుబయటపెట్టు" అన్నాడు. శ్రీరామారావు. ఆకూలివాడు వెంటనే ఆకుర్చీ అరుబయటవేసినాడు. వెన్నెల కాస్తూవుంది. ప్లాటుఫారంమీద నాటిన క్రోటన్సు, కరువేరుచెట్లు అన్నీ అదో రీలగా అగపిస్తూన్నాయి. ఓమల్లెఅంటు మొగ్గతొడిగి ముదురు మొగ్గలు కొన్ని విడిచి పరిమళిస్తూంది. ఏ రైలూవచ్చే వేళకాదది. దీపాలు చాలాభాగం ఆరిపేసేరు. ఒకటో రెండో ముఖ్యంగా వుండవలసినవున్నాయి. గుండారుకట్టాయన స్టేషన్ మాష్టరు తాళాలాడుకుంటూ రెండుమూడు సార్లు తిరిగి 'ఒరేవు' అని మతో లైసెన్సుకూలీనిపిల్చి "ఆ కుర్చీ యిలావేయరా," అని ఒక పేముకుర్చీ శ్రీరామారావు ప్రక్కగా వేయించుకుని కూర్చున్నాడు.

శ్రీరామారావు ఊరుకోలేక—దొరలకైతే 'ఇంట్రడక్షన్' గాని హిందువులకెందుకనో ఏమో—"పంతులుగారూ! తమరేనాఅండీ ఇక్కడి స్టేషన్ మాష్టరు గారు?" అన్నాడు. 'అవునండీ' అన్నాడు ఆయన. అని ఊరుకోలేక "మీ రేబండీకెడతారండి" అన్నాడు. "ఏబండికీ వెళ్ళను. ఇక్కడకు మామామగారింటికివచ్చినాను. త్ర్యంబకంగారు నాకు మేనమామలు" అన్నాడు శ్రీరామారావు. "అలాగాఅండి! నిక్షేపంలాంటి మీలాంటోళ్లు మేనల్లుళ్ళు వుంటూండగా వారమ్మాయి పెళ్లి కోసరంగా అలా తల్లడిల్లి తల్లక్రిందులౌతారేమిటండీ మాత్ర్యంబకం. రేపుదయం కదిపిచూస్తాన్నేను." అన్నాడు చెట్టిగా స్టేషన్ మాష్టరు. "ఈయన కదిపిచూసేదేమిటి? నేనే కదిపి చేసుకుంటాను" అని లోపలనుకొని శ్రీ రామారావు పైకి "ఏం? మా మేనమామగారు వారమ్మాయి కీడుకు పెళ్ళిచేయడం తలంపుతో వున్నారాయేమి? చదువుకుంటూవుండని విన్నాను" అన్నాడు. "చదువుకుంటూంటే వివాహం చెయ్యకూడదాయేమి? త్ర్యంబకంగారికి తొందరగా వున్నా లేకపోయినా ఆయన మిత్రులం మేమంతానైన తొందరపెట్టి ఆయ నాపిల్ల నివరిలో యొకరి కేమైన

కన్యాదానం చేయించే యేర్పాటుచూడాలి'' అన్నాడు స్టేషన్‌మాస్టరు. ఎవరికని అడిగేడు శ్రీరామారావు. "ఎవరి కేమిటి మీకే'' నన్నాడు స్టేషన్‌మాస్టరు.

స్టేషన్‌మాస్టర్నింకా ఏమేమేవో అడగాలని యనుకున్నాడు శ్రీరామారావు, కాని అడగలేకపోయినాడు. అంతలో ప్రక్క స్టేషన్ నుంచి 'లైనుక్లియర్ టెలిఫోన్' గంట వినబడ్డది. స్టేషన్‌మాస్టరువెళ్లిపోయినాడు, 'గుడ్‌నైట్' అంటూ.......................

సరిగా రాత్రి 12 గంటలైంది. వాల్తేరు నుంచివచ్చే జనంగాడీ వచ్చి స్టేషన్‌లో ఆగింది. ఎక్కేజనం కిటకిట: దిగేజనం కిటకిట ; వెలిగించిన దీపాలుముందు వస్తువుల మిలమిల : ముఖాల కలకల:—— రెండవతరగతి బండిలోనుంచి ఓయువతి దిగింది. ముఖమ్మీదికో బురకా కప్పుకొనివుంది, ఆమెను పోల్చుట కెవరికీ శక్యం కాకుండా. 'లై సెన్సు' కూలీమట్టంకు 'కూలీకూలీ' అంటూ అప్పటిదాకా వెళ్ళి అక్కడాగి వెంటనే ఆమెపెట్టె నెత్తునని ఆమెను తిన్నగా ఆడవాళ్ళ విశ్రాంతిగదివద్దకు తీసికొనివచ్చి లోపలవిడియించి, పెట్టె తా నక్కడదించి, వెళ్లిపోయినాడు. ఆమెను టిక్కెట్టడిగినవారూ లేరు. ఆమె దిగినసంగతి కనుక్కొన్నవారూ లేరు.

దాన్నిబట్టి యోచిస్తే ఆమె అలావచ్చి యిక్కడ తలుచు దిగుతూవుండడం రివాజేమో అన్నట్లు తోచక మానదు—కొంచెం బుద్ధున్నవాళ్ళకు. రైలు వెళ్లిపోయింది. ప్లాటుఫారమ్మీద దీపా లారిపోయినాయి. మళ్లీ రైలు రాత్రివచ్చేరైలు రాత్రి పొద్దయ్యేరైలుకూడా లేవు కూలివానివద్దనుంచి స్టేషను మాస్టరు వఱకూ హాయిగా తలుపులు తాళాలువేసికొని యిళ్ళకుపోయి నిదరపోవచ్చును. పోవచ్చునేమిటి? పోయి నిదర పోతూవున్నారు.

శ్రీ రామారావు తన పడక్కుర్చీలో కూర్చుని తాన త్వరత్వలం జాగరూకత్తో అన్నీ పరికిస్తూ, ఒక్కమాటు కన్ను మూసుకున్నాడు. నిశ్శబ్దం, ఒంటరితనం మిక్కిలి ఎక్కువై నట్లొద్దీ ఆకన్ను మూతలో అన్నీ మాయమై పోయినయి. కాని యువతి రైలుదిగడం యువతి రైలుదిగి తిన్నగా ఆడవాళ్ళ విశ్రాంతిగదిలోకి వెళ్ళడం మాత్రం మాయంగాలే. అప్రదర్శన మాలాగ్గానే యుండిపోయింది కనుక ట్టల్లే.

ఎవరో నవాబుగారి కొమార్తె అని అనుకొన్నాడు. కన్నుతెఱచి ఆ గదివైపునకు చూచేడు. గదిలో దీపంవెలిగించుకొని ఆమె తన బురకా కూర్చానికి తగిలించి ఓ కుర్చీఅద్దానికెదురుగా తీసికొని తనకుదా తన చెదరిన ముంగురులు సరిగా దీసుకుంటూంది. ఆ అద్దంముందామె ఫస్తుదొరసానిలాగుంది. పగటిపూట ఆమెకేహాచ్ఛాయ బంగారు పసిమిగాఁదోఁచి నిజం దొరసానుల్లో నుంచి కేటాయింపబడితే కేటాయింపబడేదేమోగాని ఆరాత్రివేళ ఆదీపంకాంతిని ఆమె తొడిగికొన్న గౌనును బట్టి, కాలికేసికొన్న జోళ్లబట్టి, మేజోళ్లబట్టిచూస్తే

కృష్ణవేణమ్మకుఁ బూజ

వ. అది శ్రావణమాసము.

గీ. దాఁటె బెజవాడ యానకట్ట నీటిమట్ట
మిర్వ దడుగులకుం బయిఁ, గృష్ణవేణ్ణ
యుభయతటముల నిండారి యుబ్బిపొంగి
పొర్లి పార్వాఱుచుండె సముద్రమునకు.

గీ. అధికమౌ ప్రవాహ మప్పుడు కృష్ణకు
నధికమౌ ప్రభావ మంచు నప్పు
డరుగుదెంచుచుండి రిరుగూళ్ల నుండియు
నాఁడువారు స్నాన మాడువారు.

గీ. పసుపుకుంకుములతోడఁ బండ్లతోడఁ
బూలతోఁ గృష్ణవేణ్ణకుఁ బూజఁజేసి
మ్రొక్కుచుండిరి పసిపైరుచక్కఁబడఁగ
నత్తఱిని బుణ్యకాంతలు తత్తటముల.

— కదుపుటిపు.

జాతిదొరసానే అనుకోవాలి, ఆపెట్టెమీదనుంచి లేచి టకటకలేస్తా గచ్చుమీద నడిచివచ్చి గుమ్మంకమ్ముల రెండింటిమీద చెరోచెయిఆన్చి, ఓమాటు ప్లాట్ ఫారమంతా కలయజూచి వెనక్కువెళ్లింది. వెనక్కివెళ్ళి ఆ గౌనూ అవీ తీసి వేసికొని రాత్రి తొడుక్కునే వొదులుంవి వేసికొని తన కంబళి పేముమంచంమీద విప్పుకొని తిరిగి గుమ్మంవద్దకువచ్చి యిటూఅటూచూచి తలుపులు వేసికొని పండుకుంది.

శ్రీరామారావు, ఆమె గుమ్మందగ్గరకు వచ్చినప్పుడల్లా కళ్ళుమూసికొని, మతి తక్కినప్పుడల్లా కళ్ళుతెరచుకొని, ఆమెను గమనిస్తూవున్నాడు. 'ఆమె-టీబీ కాదు, ఎవరోదొరసాని' అని అనుకున్నాడు. ఆదే యూహతో నిదరోయేడు. టెలిగ్రాఫ్ గదిలోని గడియారం టంగుటంగున అయిదుకొట్టింది. సిగ్నలర్ వెంకటస్వామి బసముందలి కోళ్ళు కొక్కొ కోకో మనడం వినిపించింది. వేగుచుక్క వెలవెలబోతుంది.

''మంచు చాలాకురిసింది రాత్రి'' అని తన పడక్కుర్చీలోంచి ఒళ్ళు విరుచుకుంటూలేచి శ్రీరామారావు ఉత్తినే మల్లెపాదులోకివెళ్లి పువ్వులుకోస్తూవున్నాడు. గుప్పెడు కోసినాడు.

అప్పుడు ఆడవాళ్ళ విశ్రాంతిగదిలోనుంచి యువతి తనపెట్టె బేడా సర్దుకొని, చీర కట్టుకుని, జాకెట్టు తొడుక్కుని మామూలు హిందూయువతి వల్లే చిన్ని కుంకుంబొట్టుంచుకొని ఓపుస్తకం చేతోపుచ్చుకుని యీవలకువస్తూ తలుపు తాళంవేసి ఆ తాళపుగుత్తులు తన మెళ్లోగ్రుచ్చుకుని అలా ప్లాట్ ఫారంఅంట యీడా లాపంగా నడుస్తూంది. నడుస్తూ 'ఎవరా పువ్వులు కోశేది?' అని కేకేసింది. ''నేను త్ర్యంబకంగారి మేనల్లుణ్ణి, శ్రీరామారావుని'' అని శ్రీరామారావు వెనక్కితిరిగిచూచినాడు.

ఆయువతి తన మామకూతురని పోల్చుకున్నాడు. నిర్విణ్ణుడైపోతూ గబుక్కునలేతి ''ఎక్కణ్ణుంచిరాక సుందరమ్మా?'' అని యడిగేడు. ''నీ వెక్కణ్ణుంచి వచ్చేవు?'' అంది సుందరమ్మ. ''నేను రాతిరంతా యిక్కడే అపడక్కుర్చీలో పడున్నాను, మీయింటచోటే?'' అన్నాడు. ''మాయింటచోటుండదు. రాత్రి తండ్రికి నిదరభంగం కలుగచేయడ మెందుకు అని నేనూ రాత్రి ఒంటిగంటనుండి యిక్కడే ఆడవాళ్ళ విశ్రాంతిగదిలో పడున్నాను.'' అంది సుందరమ్మ. అని యింకా అంది ''అయితే శ్రీరామారావు! మీతండ్రి మాతండ్రికి కట్నం ౫౦౦౦ అడుగుతున్నాట్టగా.'' అని అడిగింది. ''అవునుస్మ ఏలా తేల్చడానికీ నాకు చేతకాకే యిక్కడకొచ్చిన్నీ నిన్నట్నుంచి కొట్టుమిట్టాడిపోతున్నాను.'' అన్నాడు శ్రీరామారావు.

''అయితే రా! ఎన్నిపువ్వులు కోసినావు మల్లెపువ్వులు? నాకోసమేనా'' అని అపువ్వులన్నీ అతగాని గుప్పెట్లోంచి ఊళ్లాక్కుని ''రాతిరల్లా నాకు సరిగా నిదరపట్టలే. ఆరుబయట నీవని తెలిస్తే నేనుకూడా ఓ పక్కే ఆరుబయటవేయించుకొని పడుండేదాన్నిసుమా'' అంది. ''నీవోమాటు టీబీలాగగనిపించేవు. ఓమారు దొరసానిలాగగనిపించేవు; పలకరిద్దామాఅంటే'' అన్నాడు శ్రీరామారావు. ''ఎవరూ పలకరించకుండా వుంటారనే రైల్లో టీబీవేషం వేసికొని వెయిటింగురూమ్సులో దొరసానులవేషంవేసికొని కూర్చుంటూ వుంటాను. హిందూయువతిగా కనిపిస్తే అంతా అడిగేవాళ్ళే 'పెళ్లైందా! పిల్లలెంతమందమ్మా? మీ అత్తారిళ్లా లేవ్వూరు? ఎవరమ్మాయివి? అని most irrelevant questions' అంది సుందరమ్మ. ''అయితే ఆ ప్రశ్నలు lovers lovers ని అడిగినా irrelevant ప్రశ్నలేనా!'' అన్నాడు శ్రీరామారావు. ''Lovers అడుక్కోనక్కర్లేదు వాళ్ళకన్యోన్యం అంతా looks వల్లనే తెలిసిపోతుంది. తెలియడంలే నీకు?'' అంది ఆమె. ''తెలియకేం. your looks make my father lose Rs. 5,000 and your father gain Rs. 5,000.'' అన్నాడు అతడు. "Why of fathers? Think of us. We are neither losers nor gainers. we are lovers.'' అంటూ శ్రీరామారావుతో చెట్టపట్టాలేసికొని అతణ్ణి ఇంటికితీసికొని వెళ్ళిందిఆమె.

కట్నంపుచ్చుకోకుండా చి. సౌ. సుందరమ్మను చి. శ్రీరామారావు వివాహమైనాడని కథపూర్తిచేస్తూఆనూ తనకథనూవరుల్ని దీవించడానికి సందేహం ఎందు కింక?

—కవికొండల వేంకటరావు.

గురుశిష్యసంవాదము

శిష్యుడు

నమస్కారములు! ఏదో వ్రాయుచున్నారు!

గురువు

వ్రాయుట యిప్పుడే అయినది. శ్రీవివేకానందస్వామివారు ఆయన స్నేహితుఁడగు బాబూ ప్రమదమిత్రుఁడుగారికి ౩౦-౧౧-౧౮౯౮ తేదీని వ్రాసిన కడపటి యాంగ్లలేఖ యొకటి నీవంటి ప్రియశిష్యుఁడే యొకఁడు యెత్తి వ్రాసి యెన్నాళ్ళక్రిందటనో నాకుఁ బంపినాఁడు.

శిష్యుడు

శ్రీ స్వామివారి ప్రసంగములు మూఁడో నాలుగో వెనుక మీరాకంపిన యాయనయేనా?

గురువు

ఔను!

శిష్యుడు

ఇదికూడ ఆంధ్రపరివర్తనార్థమే పంపినారా?

గురువు

"మీరు పరిశీలనదృష్టితోఁ జదువుటకు మాత్రమే"యని వ్రాసినాఁడుగాని, నేనది తెలిఁగించి యేపత్రికలోనో ప్రకటింపవలయునను నుద్దేశమే యతని కుండినట్లూహించినాను.

శిష్యుడు

ఆయన కీ లేఖ యెచట దొరికినది?

గురువు

'ప్రబుద్ధభారత' యను సుప్రసిద్ధాంగ్ల పత్రికలోఁ జూచినాఁడు.

శిష్యుడు

మహానుభావుఁడగు వివేకానందస్వామి వ్రాసినది లోకోపకారకముగా నుండకమానదని తలఁచెదను.

గురువు

నేను నట్లే యెంచుచున్నాను - కాని—

శిష్యుడు

"కాని"యని నీళ్లు నములుచున్నారేమి?

గురువు

బాబూ ప్రమదమిత్రుఁడుగారు శ్రీస్వామివారివలెనే యానాఁటి మహామేధావులలో నొకరఁట, స్వామితోపాటు ఆధ్యాత్మికకృషి చేసిన ప్రాణమిత్రుఁడఁట. ఉత్తరము తీరు చూచిన నుభయులకును అభిప్రాయభేదము విశేషముగా నున్నట్లు తోఁచుచున్నది.

శిష్యుడు

స్వామి తిట్టుచు వ్రాసినాఁడా యేమి?

గురువు


తిట్లు లేవుగాని తిట్లకంటెను తీవ్రముగా నుండు దెప్పుళ్లున్నవి. సన్న్యాసి యైనను స్వామివ్రాఁతలో రజోగుణప్రకోపమును, అభిమానాతిశయమును స్ఫుటముగాఁ గానిపించుచున్నవి.

శిష్యుడు


వివేకానందస్వామి యెప్పుడును పిడుగునోటివాఁడే!

గురువు

పిడుగుతోఁ బడు చల్లనివర్షము సస్యసమృద్ధి నిచ్చునట్లు ఆయన గాటుమాటలతో వెలువడు బోధామృతము చదువువారిని సత్వసంపన్నులుగను, దేశోపకర్తలుగను



బెజవాడ కనకదుర్గాలయము.



కృష్ణానది ఆనకట్టు — రైలువంతెన.



ఇంద్రకీలాద్రినుండి కృష్ణానదిదృశ్యము.

జేయును. భోజనవిషయమునను బూర్వాచార్యుల విషయమునను మాత్రము అభిప్రాయభేదము లుండక మానవు.

శిష్యుడు

అలాగుననా? ఏదీ? దయచేసి యాలేఖ చదువుడు.

గురువు

ఇదిగో! వినుము!

ఆల్మోరా,
౩౦, మే, ౧౯౨౯.

ప్రియమిత్రమా,

తప్పించుకొన శక్యముగాని గృహసంబంధమైన విపత్తేదో నీకు దటస్థించినదని నే విన్నాను. జ్ఞానవంతుడవగు నిన్నాకష్టమేమి చేయగలదు? అయినప్పటికిని సాపేక్షకమగు ఐహికజీవనమునకు స్నేహసంసర్గ సుఖము లానుషంగికములని తెలియుటచే, ఇందా మాట నే నెత్తుకొనవలసివచ్చినది. కాని యట్టి దుఃఖసమయములు తఱచుగా మంచి యాధ్యాత్మికానుభవమును గలిగించుచుండును. తాత్కాలికముగా తమోమేఘములు తొలగిపోయి సత్యాదిత్యుని దివ్యతేజస్సు దృగ్గోచరమగును. కొందఱకు సంసారబంధము సగపాలు సడలిపోవును. అన్ని బంధములలోను దృఢతమమైనది ప్రతిష్ఠాబంధము. భార్యతోడంగూడి మరణభీతికంటెను బలవత్తరమైనది; అయినను అట్టి యవసరములందీపాశముకూడ గొంచెము వదులయినట్లగపడును. మనుష్యాభిప్రాయములు వినుటకంటె మనలో వసియించియుండు పరమేశ్వరుని మాట వినుట కడు శ్రేయస్కరమని మనసున కా క్షణమందు బోధకట్టును. కాని మఱ్ఱంతలో మరల గ్రమ్ముకొనును— మాయ యనగా నిదియే!

చిరకాలమునుండి నేను నీకు సాక్షాత్తుగా ఉత్తరములు వ్రాయుట లేకపోయినను, నిన్ను గురించిన వార్తలన్నియు నితరులనుండి నాకు దెలియుచునే యున్నవి. కొంతకాలముక్రిందట భగవద్గీతానువాదపు ప్రతియొకటి దయతో నీవు నా కింగ్లండునకు బంపితివి. గ్రంథోపరితలమున నీవు వ్రాసిన యొక పంక్తియే కలదు. ఆ పుస్తక మందినట్లు నేను మూడు ముక్కలలో బ్రత్యుత్తరము వ్రాసి నీ కంపితిని; అందుచే నీపైనా కుండిన పూర్వానురాగ మిపుడున్నదో లేదోయను సందేహము నీకు గలిగినట్లు నాకు దెలిసినది.

ఆ యనుమానమున కాధారములేదు. కాని నాకంతటి ప్రత్యుత్తరమునకు మాత్రము సరియైన కారణములున్నవి:—

నాలుగైదేండ్లకు, ఆంగ్లపరివర్తనమందిన గీతాగ్రంథము దెక్కనిపైని నీ చేతితో వ్రాసిన ఆయొక్క పంక్తి మాత్రమే చూచు అదృష్టము నాకు బట్టినది. అంతకంటె నధికముగా వ్రాయుటకు నీ కవకాశము లేనప్పుడు, ఎక్కువగా వ్రాసిన యుత్తరము చదువుకొనుటకుమాత్రము నీకు దీఱికయుండునా! యను సంశయము నాకు దోచినది. ఇది ప్రథమకారణము.

హిందూమతప్రచారకులగు తెల్లతోలువారితో నీకు మిక్కిలి స్నేహము కుదిరినదనియు, తుంటరులగు మనదేశపు నల్లవాండ్రన్న నీ కసహ్యమనియు నాకు దెలియవచ్చినది. ఏతద్విషయకమైన భయము రెండవకారణము.

ఇక మూడవకారణ మేమనగా, నేను మ్లేచ్ఛశూద్రాదులలో జేరినవాడను, ఆహారనియమము లేకయన్నియు దినువాడను, వీరు వా రనక అందఱితో గలిసి యీదేశములోను, పై దేశములలోను బహిరంగముగా భుజించువాడను. అదియుగాక నా యభిప్రాయములుమాత్ర మహోవికృతములై నవి. నిర్గుణమును కేవలమును అగు బ్రహ్మపదార్థము నాకగపడి, యొకింత పడుచున్నది—అని చెప్పగలను; కొందఱు పురుషులలో ఆ మహాతత్త్వముయొక్క ఆవిష్కరణము అసాధారణముగా నాకు గాన్పట్టుచున్నది; అట్టి యవతారమూర్తులు భగవంతులని చెప్పినచో నా కదియును గ్రాహ్యమగుచున్నది. అంతేకాని కేవల బుద్ధిచే గల్పింపబడి స్వీకరింపబడుచున్న జగత్కర్త్రాదులపైకి నా మనసు ప్రసరింపదు.

నా జీవితములో అట్టి భగవదవతారపురుషుని జూచినాను, ఆయన యాదేశముల ననుసరించి ప్రవర్తించుటకే నేను బ్రతికియున్నాను. స్మృతికర్తలును

పురాణకర్తలును కించిద్‌జ్ఞులు, అవి భ్రమప్రమాద జన్యములును, జాతిద్వేషప్రేరితములును అగు వాక్యములతో నిండియున్నవి. విశాలహృదయమును ఔదార్యానురాగములను జూపు సందలి కొన్నిభాగములు మాత్రమే స్వీకరణార్హములై యున్నవి, తక్కినవి త్యాజ్యములు. ఉపనిషత్తులును గీతయునే యథార్థములైన ఆమ్నాయములు. రాముఁడు, కృష్ణుఁడు, బుద్ధుఁడు, చైతన్యుఁడు, నానక్కు, కబీరు మున్నగువారు నిజమైన అవతారపురుషులు. ఎందుచేత? వారి హృదయములు ఆకాశమంత విశాలములైనవి గనుక, అందు ముఖ్యుఁడు రామకృష్ణుఁడు. శంకరరామానుజాదులు సంకుచితహృదయులైన కేవలపండితులుగాఁ గనఁబడినారు. ఆ ప్రేమ యేది? ఇతరుల దుఃఖముచూచి పరితపించి కలకల యేడ్చు ఆ మృదులహృదయమేది! పట్టిచదువు! శుష్కపాండిత్యము! తన మోక్షముకై యే తహతహ! మితిలేని తొందర! కాని అయ్యో! అది సాధ్యమగునా? ఎప్పుడైనఁ బూర్వ మట్టి ముక్తి సిద్ధించినదా? ముందెన్నడైన సిద్ధింపఁగలదా? అణుమాత్రపు టహంభావశేషమైనను లోన నున్నంతకాలము అట్టిముక్తి లభించునా?

మఱియొక వైపరీత్యము! వర్ణరూపపృథగ్భావము సంఘమునుజీల్చి పాడుచేయు మహానర్థకరమైన భావము మాయామూలమును — అను విశ్వాసము నానాఁటికి పెరిఁగి నా మనసులో దృఢముగా నాటుకొనుచున్నది, పుట్టుకనుబట్టి కాని యోగ్యతను బట్టికాని యిచ్చు జాతిభేదమంతయు బంధకారణమే. “అదంతయు సత్యమే, ఆభావము లోపల నుంచుకొనవచ్చును గాని, పరస్పరసంబంధముగల బాహ్యప్రపంచమునమాత్రము జాతిభేదములవంటి భేదములు పాటింపకతప్పదు. అవి యత్యావశ్యకములు” అని కొందఱు మిత్రులు హితోపదేశము చేయుదురు. ప్రశాత్మైకభావరూపమైన పిఱికి పేడితనముతోఁ గూడిన యేకత్వభావము లోపల! పైని పరపీడారూపమైన నరకలోకపిశాచతాండవము! పరమదరిద్రులగు చండాలాదులకు మరణబాధ కలిగించుచు, ధనవంతుఁడైన మాలవానిని మాత్రము “శ్రీహరీ! ఈయన మతపోషకుఁడు.” అనిపొగడుట!

మఱియొకమాట, గ్రంథములు చదివిచూడఁగా మతసంబంధమైన శిక్షణాభ్యాసములు శూద్రునకుఁ గానట్టి నాకుఁ జూపట్టుచున్నవి; ఆహారమునుగూర్చి కాని విదేశయాత్రనుగూర్చికాని యతఁడు తనబుద్ధి నుపయోగించి వివేచించుకొను నెడల, నది యతనికి నిష్ప్రయోజనమగును, పడినశ్రమ యంతయు వృథాశ్రమయగును. నేను శూద్రుఁడను, మ్లేచ్ఛుఁడను, ఆ బాధలన్నిటితోను నా కేప్రశక్తియులేదు నాకు మాలకూడైననేమి? మ్లేచ్ఛభోజనమైన నేమి? జాతిసంబంధమైన పిచ్చిమాటలన్నియుఁ బురోహితులు రచించిన పుస్తకములలో నున్నవి గాని పరమేశ్వరప్రకటితములైన పుస్తకములలో లేవు. తమపూర్వులు గావించిన మహాకార్యముల ఫలములను పురోహితులనే యనుభవింపనీ! నేనుమాత్రము ఎందు నా శ్రేయస్సంతయునున్నదో యా భగవద్వాక్యము ననుసరించియే పోయెదను.

“పరోపకారమే పరమార్థము, తక్కిన నిత్యనైమిత్తిక బాహ్యకర్మములన్నియుఁ బిచ్చిచేష్టలు, కేవలస్వమోక్షసుఖాపేక్షకూడఁదప్పే!” అను నింకొక సత్యము నాకనుభవగోచరమైనది. సర్వమును ఇతరులకై త్యజించువానిదే మోక్షము. ఇఁక “నాకుముక్తి! నాకుముక్తి!” యని యహోరాత్రములు తలఁ బగులగొట్టుకొను తక్కినవారు తమ ప్రస్తుతక్షేమమునకును భావిశ్రేయస్సునకును గూడ భంగము గావించుకొని తిరుగులాడుచుందురు — ఇది స్వయముగా నేను పెక్కుపట్ల ననేకపర్యాయములు చూచినాను. ఈ సంగతులన్నియు నాలోచించుకొనఁగా నీకు జాబువ్రాయుటకు నాకు ధైర్యముచాలినదిగాదు. ఇన్ని విప్రతిపత్తులున్నప్పటికిని, నాయెడలఁగల నీమైత్రి చెడిపోకుండ నెప్పటియట్లే యున్నట్లు నీ కగపడుచో, నిజముగా అది నాకు మహానందకరమైన పర్యవసానమని నే భావించెదను.

భవదీయుఁడు,

వివేకానందుడు.

భాగస్వాములు

౧

ఆబాలగోపాలమ్ము ఊరిలో
ఆదరింపగ, వినయమ్ము చెలి
అనయమ్ము నూపగ పెంపెసంగెడి
రామన్న రామన్నే.

౨

ఇంటిలోపల పొలములోపల
విసుగు లేకను కసురుకోవకను
చెలువునితో మసీడగ నుండు తొయ్యలి
సీత సీతమ్మే.

౩

ముచ్చటాడుచు కూలిజనముతో
ముందుముందుగ మునుము నాటును
పాడుపాడుకు కుంటజలములు
భర్త పోయుచునుండగన్.

౪

తావుదొడ్లలో గొఱ్ఱెగుంపును
తడపతడవకు కదలదోలును
గూడబావను కప్పితోలుచు
కునికిపాట్లతోనైనగా.

౫

మిణుమిట్లుగొల్పగ తీగెమెఱపులు
మిన్నుగ్రమ్మిన కాఱుమొయిలుకు
మునురువానలు బట్టిలోకము
ముజ్జిడ్డుగానున్నన్.

౬

వడగాడ్పువీచ రేడి మండుటెండలో
వణకిపోయెడి శీతకట్టున
ప్రకృతిమార్పుల ప్రతిఘటించుచు
పాటుపడుదురు పొలములో.

౭

విలాసవస్తువు పేరుఒక్కటి
వినియెఱుంగరు సీతమ్మరాములు
ఉప్పు దీపపుచమురు తల
నూనె లనుకొనుచే తప్పగన్.

౮

చేనిపత్తిని గిలకపట్టును సాటి
చెలులతో నూలు తీయును సం
సారమునకు న్దగినబట్టలు
సాలుసరి నరిపోవగన్.

౯

తనచేనిధాన్యమె పొట్టనింపగ
తనచేడె సీతమ వడుకవస్త్రము
తనకన్నతల్లిగ ఉన్నఊరిలో
తాను సుఖియించున్.

౧౦

విదేశవస్తులజోలి ఎరుగరు
స్వదేశవస్తులె కాంక్ష చేతురు
మన్వంతరంబులనుండి రైతులు
మహాత్ము శిష్యులెగా.

౧౧

భాగవతరామాయణాదుల
భావబంధురఫణితితోడుత
భక్తిబోధముచేయు నాజ్ఞను
ప్రణుతు లిడుదురుగా.

౧౨

దినము నక్షత్రమ్ము తిథులను
తెలియచెప్పుచు హితవుకోరెడి
ఆచార్యవర్యుడు బ్రాహ్మణుండని
ఆదరింతురుగా.

౧౩

కోతవేతల సమయమందున
కూలిజనముతో కూడి రాముడు
అస్పృశ్యతను పాటింపడెప్పుడు
హరిజనులుకానన్.

౧౪

హాలము యోధుడు కాపుబిడ్డడు
కలమునా మే కరణమంచును
కులకట్ల బేధములే మెరుంగరు
క్రొత్తపాలెపు రయితులున్.

౧౫

అన్నయ్య వదినా బావ చెల్లీ
అనుచు తమలో తాము ఎప్పుడు
ప్రియము చిప్పిల వరుసపేర్లతో
పిలుచుకొందురుగా.

౧౬

కులవిచక్షత ధనవిచక్షత
గొడవలను పాటింపకుండగ
విశ్వమానవసోదరత్వము
విశదపరతురుగా.

౧౭

కవ్వమాడిన కదుఱుతిరిగిన
కఱువుకఱవా దేశమందున
కోటివిద్యలు లోకువేగద
కోండ్రునకు ఎల్లన్.

౧౮

పాడువాఱును దేశసంపద
బీడువాఱును నాగరికమున్
మేడిచే గీలింపకున్న ని
మేషమందుననే.

౧౯

భాగ్యసమెగద కాపుసంఘము
పూర్ణముగ పరితుష్టినింపగ
బీదసాదల దొరలదాతల
బేరసారములన్.

౨౦

తిరునాళ్ళందున మ్రొక్కుబళ్ళను
తీర్చుకొనుటకు పుణ్యక్షేత్రము
లప్పుడప్పుడుపోవు రాముడు
హర్షమున్న పొదలంగన్.

౨౧

ముడుపుగట్టిరి తిరుపతమ్మకు
ముందు ఏడాదికినటంచును
కుఱము గొఱ్ఱెను కోడిపుంజున్
కోర్కెలూరంగన్.

౨౨

కోరిదండాల్ పెట్టు సీతను
కోటిదేవళ్ళకును ఎప్పుడు
బిడ్డగొడ్డను చల్లచూడగ
ప్రేమమీరంగన్.

౨౩

ఆదుకోవోయ్! వెంకటేశుడ
చేదుకోవోయ్ కన్నతండ్రీ
ఏడుకొండలవాడ! నీవే
ఏడుగడవుమిన్నా.

౨౪

కనికరముతో కరుణచూడుము
కన్నబిడ్డలవంటి వాండ్లను
ఏలమందకోటయ! ఏల్నవాడా!
ఏమఱకు స్వామీ.

౨౫

సిలుగులను నొందించకే ప్రభు
చింతచీకులు బాపు దేవా!
భద్రాది సీతారామ! మము
భద్రములతో రక్షింపవా.

[illegible]

[illegible]

అమ్మమ్మ

౧

మాఆవిడ కొక అమ్మమ్మవున్నది; అంటే సయాం తల్లితల్లి. ఆమెముసలితనంలో అడుగుపెట్టిం దనవలసి వదే. కాని పనీ పాటా చక్కగా విసుగు కోకుండా శక్తితో చేస్తుంది. పూర్వకాలపు వాళ్ళకుండే లక్షణా లామెకద్ద కనుపించవు. ఆమె నడుస్తూంటే నడ్డిరం గినట్లుగా వుంటుంది. చేతులు కొంచెం పొట్టిగావుంటవి. కొత్తగా చూచేవాళ్ళ కామెముఖం చాలా గంభీరంగా వుంటుంది. ఏ రాజ్యానికో మంత్రిఅయితే ఈవిడ భూచక్రం గిరగిరా చిటికెనవ్రేలి యిరుసుమీద త్రిప్పి చేయగలదురా అని అభిప్రాయపడతా రామెను ఎరిగిన వాళ్ళు. ఆమె యెప్పుడూ తెల్లని ముల్లుపంచెలు కట్టుకుం టుంది. రాత్రి భోజనంచేయదు. ఆవిరితో ఉడికించిన మినపపిష్టం బెల్లంతో కలిపితింటుంది. ప్రతియేకాదశి వుపోష్యంవుంటుంది. కాఫీమాత్రం పుచ్చుకుంటుంది.

ఆమె, తనభర్త బ్రతికియున్నంత కాలమూ, పిఠా పురంలో వెలిగించిందికాపురం. భర్త్ర మరణానంత రం ఆమెకొడుకులు నైజాంరాష్ట్రంపోయి అక్కడ ఉద్యోగాలు సంపాదించుకుని జీవిస్తున్నారు. వాళ్ళ దగ్గిరేవుంటూంటుంది ఈమెకూడా. కాని అప్పుడప్పుడు కోడళ్ళతో పడకనో, కొడుకులను సాధించడానికో, మరి యేమికారణంవల్లో మనకు తెలియదుకాని—అప్పుడ ప్పుడు నెల్లూరులోవున్న మా మామగా రింటికి వస్తూవుం టుంది. మా మామగారిభార్య, అనగా మాఅత్తగారు, ఆమె కూతురేగా!

ఆమెరావడంతోనే ఇక మాఅత్తగారికి వళ్ళుతెలీదు. ఆసంతోషపారవశ్యంలో మొగుడూ మరెవ్వరూ ఆమెకు కనుపించరు. ఆ ముసలమ్మదగ్గిర ఎంత ఆకర్షణ శక్తియున్నదో నాకు తెలీదు.

వెంటనే ఆ తల్లీ, కూతురూ కలసి మా మామగా రిల్లు కేంద్రస్థానంగా ఏర్పరచుకుని, చుట్టుపట్లవున్న దగ్గిర బంధువులకు—స్త్రీ బంధువులకుమాత్రమే- వుత్త రాలు బనాయిస్తారు: ముసలమ్మ నైజాంనుంచి చాలా కాలంగా మనదేశం వచ్చిందికనుక వెంటనే బయలుదేరి రమ్మని. ప్రథమాహ్వానం రామచంద్రాపురంలో కాపు రంచేస్తున్న ముసలమ్మగారి రెండోకూతురికి. ఆవిడ ఈ ఆహ్వానపత్రం చూచుకున్న తక్షణమే ఆరునెలల కడుపుతోవచ్చి వ్రాలుతుంది నెల్లూరులో. ఆమె బాగా పాడుతుంది అంటారు. ఆమె వచ్చేటప్పుడు హార్మోని యంపెట్టె తెచ్చుట మరచిపోదు. గంపెడుసంతానం ఆమెతోగూడా వస్తుంది. ఏటా ఒకబిడ్డను కంటుంది ఆమె—ఇక రెండోఆహ్వానం నాభార్యకని వేరుగా చెప్ప నక్కరలేదు.

ఈవిధంగా నలుగురూ వచ్చిచేరుతారు మామామగా రింట్లో. ఇంకేం, మా మామగారికి దశ ఎత్తుకున్నదన్న మాట. గ్రహాలన్నీ కేంద్రస్థానంలో చేరుకున్నవి.

వీళ్లంతాకలిసి ఏమిచేస్తారో చెప్పనా! గంటగం టకూ కాఫీచేసికొనిత్రాగటం, ఫలహారాలు చేసికొని తినటం, లేకపోతే వూళ్లో స్త్రీ జనాన్నిపిలచి మీటిం గులుచేయటం. ఆ మీటింగులలో రామచంద్రాపురం నుంచి వచ్చిన గర్భిణి హార్మోనియంమీద పాటలు పాడి వినుపిస్తుంది; లేదా, ముసలావిడ తనవంశప్రాశ స్త్యము గురించీ,తన జనకుడు పూర్వం పెద్దవుద్యోగం చేసి ఇప్పుడు నూరురూపాయల "పెన్షను" పుచ్చుకుం టున్నాడనీ, తనకొడుకులు చాలా ప్రయోజకులనీ, చిన్న వుపన్యాసాలుచెప్పి సభను రంజింపజేస్తుంది.

ఇంత హడావుడీ యింట్లో జరుగుతూంటే మా మామగారు కచేరికిపోయి కూర్చుంటాడు. అక్కడ తనతోడి వుద్యోగస్థులతో బంధువులమూలాన్న తనకు చాలాడబ్బు ఖర్చౌతున్నదని, వచ్చినవాళ్ళు తనింట్లో రెండుమూడు నెలలు తిష్ఠవేసి పురుషూ, పుణ్యాలన్నీ వెళ్ళదీసుకొనిపోతుంటారనీ, అందుమూలాన్న వచ్చే జీతం తనకు చాలటములేదనీ చెప్పుకుంటాడు. ఇంట్లో మాత్రం ఆమాట అనడు మానవుడు. అన్నాడా తన

భార్య కోపదృష్టి సహింపగలడా?

అదిగో పాఠకుడా! చిరునవ్వు నవ్వుతున్నావు! "ఏమయ్యా! మీ మామగారి గుట్టంతా చెప్పుతున్నావు!" అని కాబోలు అడుగదలచావు. పరవాలేదు. మా మామగారికి కోపంవస్తుందని నాకు భయంలేదు. ఆయనకు లోపల కల్మషమున్నా పైకి చిరునవ్వే నవ్వుతాడు. అంతగా మానాభిమానాలు లెక్కచేసే వాడు కూడాకాదు. ఇక మాఅత్తగారిమాట! ఆవిడకు మాత్రం కోపంఎందుకు? ఆమెభర్తను అజ్ఞాపించి నౌకరులా వుపయోగించుకుంటుందని ఆమె ఆధిక్యతనేగా వుగ్గడించాను?

కథ సాగిస్తాను. మళ్ళీ ఈమధ్య ఆముసలమ్మ నెల్లూరు విజయంచేసిందట. అప్పుడే నాభార్యకు కబురుతెలిసింది. ఆహ్వానంకూడా వచ్చినట్లేవున్నది. లీల చెప్పకపోయినా నేను వూహిస్తున్నాను.

౨

సంవత్సరాదిపండుగ పదిరోజులున్నది. ఎందువల్లనో ఆనాడు పడకకుర్చీలో నిరుత్సాహంగా పడుకున్నాను. నేనేమో ఆలోచిస్తున్నాననికూడా చెప్పలేను; మందంగావున్నది మనస్సు. అప్రక్క ఎంతసేపటినుంచీ అలావచ్చి నిల్చునివున్నదో, లీల నాకు తెలియనే లేదు.

"ఏమండీ! ఎన్నిసార్లు పిల్చినా పలకరూ! కళ్ళుతెరచుకొనే నిద్రపోతున్నారులావుంది" అని లీల కొంచెం ఎచ్చుస్వరాన అనేసరికి మళ్ళీ ప్రపంచంలోకి వచ్చా.

"ఆ! ఏమిటివిశేషాలు."

"నేను పత్రికాసంపాదకురాలను కాదు సుమండీ!"

"మరి ఇన్యూస్సెర్వీస్కంపెనీ ఏజెంటువా! వాళ్లు పట్టుకుంటే వదలని....."

"మీ వెర్రి వేషాలు. ఇలాచూడండీ!"

"ఓహో! నీవా? ఎందుకొచ్చావు, లీలా!"

"ఏం రాకూడదా!"

"ఊరికే రావులే."

"మరెందుకొచ్చాను?"

"నాకు తెలుసు."

"తెలిస్తే చెప్పండి."

"చెప్పను."

"మీ కెప్పుడూ నవ్వులాటేనుసరేకానండీ; నెల్లూరునుండి వచ్చిందట మా అమ్మమ్మ."

"అలాగా! వెళ్లొచ్చేవేం మరి! వచ్చిందీ పాడుగు ముదావిడ!"

"ఆవిడ కెందుకులెండి చక్కదనం; ముసలావిడకు"

"మరి నీకు కావాలా వయసు సావిడకు?"

"అబ్బ! ఇలా ఎగతాళిసాగిస్తే నేను పోతానండీ"

"ఆ! పోవద్దులే; కూర్చో కుర్చీచేయిమీద — మరి రామచంద్రాపురంనుంచి వచ్చిందా మీ పిన్ని కూడా?"

"వచ్చిందిట."

"ఎన్నో నెలట?"

"ఆరు."

"హార్మోనియం పెట్టెకూడా తెచ్చిందటనా?"

"మళ్లీ మొదలు పరాచకం. ఆవిడపాట మీకు బాగుండకపోతే సరిపోయింది కాబోలు."

"ఎవరన్నారూ బాగా పాడదనీ?"

"మీకు మావాళ్ళంటే అంత ఎగతాళి. అల్లుడితనం పోనిచ్చారూ! 'అల్లుని మంచితనంబును" అని సుమతిశతకంలో..."

"ఆపద్యం హార్మోనియంమీద వాయించటము నేర్చుకో మీ పిన్నిదగ్గిర."

"అబ్బ! నేను పోతానండీ; మీ హాస్యానికి మితి లేదు."

"పోతా, పోతానని బెదరిస్తావెందుకూ.? నెల్లూరు ప్రయాణానికి సెలవు అడుగుతుండావని ఇక్కడనుండి పోవని నాకు తెలుసు."

లీల కొద్దిగా నవ్వుతూ నేనింకా ఏమో చెప్తానని ఎదురుచూస్తున్నది. నేనన్నాను. "అలా వెళ్ళటానికి వీల్లేదండి.! పోయినసంక్రాంతికి నీవు చేసినమోసం నేను మరచిపోలేదు. 'పండుగ నెలరోజులున్నదీ, మళ్లీ పోవచ్చును, వారం రోజుల్లో రమ్మ"నికదా! చెప్పి మీనాన్న వెంట పంపించాను. నామాట నిర్లక్ష్యంచేసి

అక్కడే పండుగకూడా వెళ్ళబీసికొని, నెలరోజుల వరకూ రాకపోయావు. నీ ఆవేశం నామనస్సులో వున్నంతవరకూ మళ్ళీ నీవు పుట్టింటికి పోవటానికి నా ఒప్పుదలలేదు."

"ఆడవాళ్ళను పుట్టింటికి పంపడమంటే ఎందుకో మొగాళ్ళ కంత కష్టమనిపిస్తుంది!"

"నావిషయంలో చెప్పేనుగా కారణం."

"మరి రాకరాక పుట్టింటికివచ్చిన ఆడపడుచులను వెంటనే పంపిస్తారాచెప్పండి!"

"నీవువస్తే వాళ్లు అడ్డగిస్తారా ఆలోచించండి".

"పోనీ, ఆ ఒక్క తప్పూ క్షమించేయకూడదూ. ఈసారి ఎక్కువరోజులుండను. ఇంకా పదిరోజులకు కదా ఉగాదిపండుగ. పదకొండోనాడల్లా ఇక్కడే హాజరౌతాను."

"ఇల్లా చెప్పి వెళ్లినదానవే అప్పుడుకూడా." అంటూ కుర్చీలోనుంచిలేచి టెన్నిసుహ్యాటు పుచ్చుకొని చెప్పులు తొడుక్కుంటున్నాను.

"అప్పుడే క్లబ్బుకు వేళ కాలేదు. కాస్త ఫలహారం చేసి వెళ్ళండి" అన్నది లీల.

నేను మౌనంతో గడపదాటేను. "ఏంచెప్పేరు చివరకూ" అని అడిగింది లీల గుమ్మందాకావచ్చి. నేను మాట్లాడకుండా వెళ్లిపోయాను.

మళ్ళీ సాయంత్రం చీకటిపడిన తరువాత నేను క్లబ్బునుంచి ఇంటికి చేరుకున్నాను. లీల వంటపనిలో వున్నది. నేను హాల్లో దీపంముందు తీరిగ్గాకూర్చుని కూనిరాగాలు తీస్తున్నాను. ఇంతలో మా మామగారి స్థూలశరీరం గుమ్మందగ్గర ప్రత్యక్షమైంది. ఆయన మా యింటికి ఎప్పుడువచ్చినా సాయంత్రంపూటే వస్తాడు. మళ్లీ తెల్లవారగానే వెళ్ళిపోవచ్చుగదా అని.

మా ఆవిడ తెచ్చియిచ్చిననీళ్ళతో కాళ్లూచేతులూ కడిగికొని లోపలకువచ్చాడు. వచ్చి హాల్లోవున్న బల్లమీద మేనువాల్చాడు. ఆకోసనున్న పరుపుచుట్టమీద తలవుంచి ఒత్తిగిలిపడుకున్నాడు. నల్లనిరూపం; పొట్టి శరీరం. అప్పటి ఆయన్నిచూస్తే సాక్షాత్తు శేషశాయి జ్ఞాపకంవస్తాడు. ఆయనచుట్టూ ఎవరన్నా నలుగురు కిన్నెరసానులు నాట్యంచేస్తూ, పాడుతూవుంటే బాగుండునురా! అనుకున్నాను. ఆయన మంచిరసికుడు. వయఃప్రాభవంలో ఆయన వారకాంతాలోలుడనివదంతి.

మేము క్షేమసమాచారాలు మాట్లాడుకుంటున్నాము. ఇంతలో మాపైయధికారినౌకరు వచ్చాడు "అయ్యా! అయ్యగారు రమ్మంటున్నరయ్యా! మిమ్మల్ని" అన్నాడు నన్నుచూచి.

వాడికి పుట్టెడుచెప్పడం· "వస్తున్నానని చెప్పరా, పో" అని గద్దరగా వాడిచెవిలో చెప్పేను. "సరిలెండి! సరిలెండయ్యా!" అని పోబోతూ వాడు మామామగారిని చూచి "వారెవరయ్యా! వారెవరు" అని అడిగేడు.

"ఎవరైతేనేం పోరా." అంది లీల.

"సావుకార్లా! సావుకార్లా!" అన్నాడు వాడు.

"కాదు మామగార్రా." అన్నాను నేను వచ్చేనవ్వు ఆపుకుంటూ.

"శాకీకోసం వచ్చిర్రా! సావుకార్లకు శాకీవుంటే కష్టం బాబయ్యా! ఇంటికొచ్చి పండుకుంటరు" అంటూ వాడు వెళ్ళిపోయాడు. లీల విరగబడి నవ్వుతున్నది వాళ్ళనాన్న చిన్నబోతాడనన్నా అనుకోకుండా. నానవ్వును బలవంతంగా అరికట్టేశాను. మా మామగారు ఇంచుమించుగా భేకోమటిలాగే వుంటాడు చెప్పొద్దూ.

మామామగా రిప్పు డాఒంటెమెడావిడచేత ప్రోత్సహించబడి లీలను తీసికొని పోవచ్చాడని నే నూహించలేకపోలేదు. ఆసంగతి భోజనాలైన తర్వాత చుట్టకాల్చుకుంటూ వెళ్ళబెట్టే డాయన. నేను కొంచెం ఆలోచించినట్లు నటించి, ఇంకా నాలుగైదురోజులలో మా ఆఫీసుకు సెలవులిస్తారనీ; అప్పుడు లీలా, నేనూ, బయలుదేరివస్తామనీ, నాకుకూడా మునలమ్మనుచూడాలని చాలావుందనీ ఒక చిన్న వుపన్యాసపూర్వకంగా చెప్పి ఆయనచేత "సరే" అనుపించాను.

ఇంతలో లీల అందుకున్నది.. "అన్నీ దొంగమాటలే నాన్నా! ఇందాక నన్ను నెల్లూరు పంపనంటే పంపనన్నారు."

"ఛీ! పెద్దమనుష్యులతోకూడా దొంగమాటలేనా!" అన్నాను.

"అయితే తప్పకుండా వస్తారా మీరుకూడా?"

"చెప్పేనుకాదూ."

"అయితే, నాన్నా! ఇద్దరమూ కలసివస్తాములే వారి ఆఫీసుకు సెలవులిచ్చాక."

"మీ అమ్మమ్మ నీకోసం ఎదురుచూస్తున్నదమ్మా!"

"ఇంతలోకే ఆమెకండ్లు కాయలుకాయవులెండి" అంటూ నేను మాపైయధికారిఇంటికి పోయాను. మర్నాడు ప్రొద్దున్నే మా మామగారు ఒక్కడే వెళ్ళిపోయాడు.

3

రేపే సంవత్సరాదిపండుగ. ఇన్నాళ్ళనుంచీ అమ్మమ్మకోసం కలవరిస్తూనేవున్నది లీల. నే నేవో మాటలు చెప్పి ఇంతవరకూ ప్రయాణం సాగకుండాచేశాను.

మామామగారు వచ్చిననాటిరాత్రి నాపైఅధికారి నన్ను ఊరికే పిలువలేదు. నాకొకపని నియమించాడు. ఆయన ఆజ్ఞానుసారంగా నేను సంవత్సరాదిపండుగనాడు సరిగ్గా మద్రాసులోవుండి కొన్నిపనులు చక్కబెట్టుకోవలసివున్నది.

రేపు పండుగ; నేను మద్రాసు వెళ్ళకతప్పదు. లీల నెల్లూరుపోవాలనిపట్టుపట్టింది. సరే, ఆరాత్రి "మెయిల్" కు బయలుదేరేము. నేను రెండుటిక్కెట్లు మద్రాసుకు కొని జేబులో పెట్టుకున్నాను. ఇద్దరమూ ఇంటరు క్లాసుబండిలో కూర్చున్నాము. బండి సాగింది.

తెనాలి 'స్టేషన్'లో మాపెట్టెలో జనమంతా దిగిపోయారు. మేమిద్దరమే ఆ పెట్టెలో మిగిలింది. ఇందాకటినుంచీ కునికిపాట్లు తీస్తున్న లీలకు ఇప్పుడు సందుదొరకగానే శుభ్రంగా ఆ "కుషన్ సీటు" మీద శరీరం వాల్చింది. "మీకూ నిద్రవస్తే నన్ను లేపండిసుమా! ఇద్దరమూ కన్నుమూస్తే నెల్లూరుస్టేషన్ దాటి మద్రాసువరకూ పోగలము" అని నాకు హెచ్చరికచెప్పి తాను నిశ్చింతగా నిద్రపోయింది.

నే నేదో ఒకనవల చదువుతున్నాను. రైలుబండి చాలవేగంగానే పోతున్నది. కొన్ని 'స్టేషన్ల'లో ఆగుతున్నది; కొన్ని 'స్టేషన్ల'లో ఆగటములేదు.

ఆనవల చదివిచదివి విసుగెత్తింది. ఒక్కసారి ఒళ్ళు విరిచి, ఆవలించి, తెచ్చుకున్న 'థర్మోఫ్లాస్కు'లో కాఫీ అంతా త్రాగేశాను. అప్పుడు నాచేతిగడియారంలో 'టైము'చూస్తే రెండుగంటలైంది. ఆ అమావాస్యచీకటిలో బండికిటికీలోంచి అవతలకుచూస్తే నాకంతా నల్లగా కనుపిస్తున్నది. బండిదగ్గరనుంచి భూమిమీద రెండుగజాల మేరవరకుమాత్రం లోపల వున్న దీపాలకాంతి కనుపిస్తున్నది. కొంచెము చలిగాలి వీస్తున్నది బండిలోకి. గంభీరమైన ఆనిశాసమయంలో బుసలుకొట్టుకుంటూపోయే త్రాచుపాములాగా రైలుబండి పరుగిడుతూంది.

నాకూ నిద్రవస్తున్నది. 'సూటుకేసు'మీద తలపెట్టి అలా కన్నుమూసి నిద్రపోయాను. నెల్లూరుస్టేషను దాటిపోతామేమో నన్నభయం నాకు లేదు.

ఆనిద్రలో ఒకకల. స్వప్నరంగము మద్రాసుమౌంటురోడ్డుమీద. నేనూ లీలాకలసి వెళ్తూంటే ఆ ముసలమ్మ ప్రత్యక్షమైంది. ఆవిడ కెవరో మద్రాసులో 'కూము'నది చాల పుణ్యనది అనిచెపితే సంవత్సరాదినాడు అందులో స్నానంచేసి శాస్త్రపుణ్యం మూటగట్టుకుపోదామని వచ్చిందట. ముక్కుమూసుకుని ఆనదిలో స్నానంచేసి కొంచెంవిభూతి—ఇంటివద్దనుంచి మూటగట్టి తెచ్చుకున్నది ఫాలభాగాన ధారణచేసి మాకెదురైంది. మమ్మల్ని సమీపించి అమాంతంగా లీలనుకౌగలించుకుని ఏడ్చింది. చివరకు కన్నీళ్ళుతుడుచుకుని ఒక మిఠాయిపొట్లం తీసిఇచ్చింది. లీల దాన్నివిప్పి కొంత మిఠాయితీసి నాకీయవచ్చింది. నాకెకంపు వస్తూంటే నాకొద్దన్నాను. నేను స్వీకరించకపోతే తన అమ్మమ్మ కవమానకరంగా వుంటుందని భావించిందేమో, బలవంతంగా నానోట్లో పెట్టవచ్చింది. నే నసహ్యపడుతూ దానిచేయి త్రోసేశాను.—ఆత్రోయడంలో నాతల క్రింది పెట్టె క్రిందపడి పెద్దమోతైంది. దానితో నానిద్ర భంగమైంది. లీలకూడా లేచింది. రైలు పొన్నేరుస్టేషన్‌లో ఆగివున్నది.

ఇప్పుడు లీలకు గాభరా ఎత్తుకున్నది నెల్లూరుదాటిపోయిందే అని. దానితోపాటు ఇంకోభయంకూడా

వున్నాగాని, ఎవరైనా టిక్కెట్లు తనిఖీచేసేవాడువచ్చి దబాయించాడురా అంటే మేము తెల్లమొగము వేయవలసి వస్తుందేమోనని. ఏమీ పాలుపోని మనస్సుతో నా ఆలోచన అడుగుతున్నట్లుగా నిరుత్సాహంగా నా కేసి చూసింది. నాజేబులోవున్న టిక్కెట్లు మద్రాసు దాకా అని ఆపిల్లకు తెలియదు.

ఎంత మోసంచేసినా మనదేశంలో పాపం స్త్రీ భర్తే దైవమనుకుని అతన్ని అనుసరించివుంటుంది. ఎంత తెలివితక్కువ పెద్దమ్మను చేసి ఆడిస్తున్నా సిగ్గుతో చిరునవ్వుచూపించి అతన్ని గౌరవిస్తుంది. అప్పటిస్థితిలో శీలను చూస్తే నాకు జాలివేసింది. అంత అమాయికత్వాన్ని మోసంచేస్తున్నానని తోచినప్పుడు నా కాఠిన్యానికి మేరలేదనితోచింది. శీలంటే నాకెందుకో ఒక విధమైన ప్రేమ. ఆమెలోనుంచి ఒక ఉత్సాహశక్తి ఎప్పుడూ నాహృదయంలోకి ప్రవహిస్తూంటుంది. ఆమె పలువరుస కొంచెమెత్తుగా వున్నా, అది భాగ్యచిహ్నమే అనుకున్నాను. తండ్రివలె మితిమీరి కాక కొంచెము బొద్దుగావున్నా తల్లికివలె శరీరచ్ఛాయ ఎరుపే. కన్నులుచేరడేసి లేవుగాని తేజస్సువున్నది వాటిల్లో. మొత్తముమీద కురూపికాదు; సౌందర్యరేఖలు ఆమెలో లేకపోలేదు. కాని నాప్రేమకూ, ఆమె చక్కదనానికీ సంబంధం లేదు. నేనామె నెందుకు ప్రేమిస్తున్నానో నాకే తెలీదు. ప్రేమించడము నా స్వభావమే అయిపోయింది.

బేసిన్ బ్రిడ్జిస్టేషన్ లో టిక్కెట్లు వసూలుచేసేవాడు రాగానే జేబులోనుంచి రెండు టిక్కెట్లూ తీసి ఇచ్చేశాను. వాడు వాటిని జేబులో వేసుకుని వెళ్ళిపోయాడు. అప్పటికి శీల మనస్సు కుదుటపడింది. టిక్కెట్లవాళ్లే మోసపుచ్చా ననుకుని నా తెలివిని చేట లుగ్గడించింది.

కృష్ణాస్రవంతి చెంతలయాళ్లన్

పరిమళించెడు తెల్లవిరి క్రొత్తమిరి చేల
యింపుఁజూచుచు సంచరింపఁగలిగె;
ఘృతదధిప్లుతముగా నతిరుచ్యముగ మిత్ర
గృహములఁ విందారగింపఁగలిగె,
తోఁకపైకెత్తి గంతులు అంకెలిడుచుండు
కోడెదూడలపిందు చూడఁగలిగె,
సెనగకాయలు మొక్కజొనకండె లూచకం
కులుగాల్చి చిటుఁదిండ్లు నలుపఁగలిగె.
హృదయమిచ్చి యాదరించు గృహస్థుల
నడుమఁగాఁపురం బొనర్పఁగలిగె
కేలుమోడ్పు నీకుఁ గృష్ణాతరంగిణీ
తీరశోభితాంధ్ర దేశ లక్ష్మీ!

చక్కెర యుక్కఅ లేనివి
చిక్కనిపాల్ గడ్డపెరుగు జిడ్డగు నేయున్
మిక్కిలి చవిగల కూరలు
చిక్కున్ కృష్ణాస్రవంతి చెంతలయాళ్లన్.

—కడుపుటీపు.

౪

మద్రాసులో నాపనులేవో చూచుకుని పట్నంలో విశేషాలు కొన్ని శీలకుగూడా చూపిద్దామని సాయంత్రంవేళ 'పీపుల్స్ పార్కు'కు తీసుకపోయాను. మెకలు ఒంటెలశాల చూచాము. మెడ నిక్కించి చూస్తూన్న ఒక ఒంటెను చూపించి 'అది చాలా బాగుందండీ' అన్నది శీల. "ఎరుగవా? అది మీ అమ్మమ్మే" నన్నాను. "పోదురూ. మీచమత్కారం, మీరూనూ" అన్నదామె. "చమత్కారంగానే భావిస్తున్నావా? ఆమెడచూచి పోల్చుకోవచ్చునే" అంటూ ఆమె చిరునవ్వు కొంత చూరగొన్నాను.

తరువాత ఎలుగుబంటునుచూపించి చిన్న ఉపన్యాసం ఇచ్చాను. "నల్లగా, స్థూలంగా, ఒంటినిండా బొచ్చుతోవున్న ఈ జంతువునుచూస్తే నాకు మీ నాన్న జ్ఞాపకంవస్తాడు. ఆయనకు లంచాలంటే ఎంత ప్రీతో ఈజంతువుకు తేనెపట్టంటే అంతఆపేక్ష. తేనె

తీగలు కట్టుతున్నా 'పట్టువదలదు" అన్నాను. విన్నీ, విననట్లుగా అలాగే చూస్తున్నది లీల ఆజంతువును.

పెద్దపులిని చూచినప్పుడుమాత్రం మాఆవిడ కొద్దిగా భయపడింది. "ఇది చాలా భయంకరమైన మృగం సుమండీ!" అన్నది.

"అవును మీ అమ్మకు మల్లేనే. భర్తమీద కోపం వచ్చినప్పుడు డీరూపాన్నే ధరిస్తుంది ఆమెకూడా. మీ నాన్నగారు రామెద్రుష్టిలో ఏమైనా తప్పుగా నడుచుకున్నట్లైతే ఆయనమీద ఆమె ఎలా జోరు చేసికొని అరుస్తుందో అలాగే గర్జిస్తుంది ఈజంతువుకూడా." ఈ నామాటలకు కొంచెంగా నవ్వినా లీలచూపుల్లో కొంచెం కోపంకూడా వ్యక్తమౌతున్నది.

ఇంతలో ఎక్కడనుంచో ఒకస్వరం బయల్దేరింది. "మీపిన్నిగారో లేచాయల పాటో్నియంపిరాద గానం చేస్తున్నట్లున్నది లీలా!" అన్నాను. ఆమె తలత్రిప్పి అక్కడ ఓండ్రపెట్టుతూన్న ఒక గాడిదను చూచింది.

కంగారుమృగాన్నిమాత్రం లీల చాలా సేపుచూచింది. "ఈజంతువు పేరేమంటారండీ." అని అడిగింది. "దానిపేరు కంగారు. అది మీచెల్లెలిలాగా చాలా అందంగావుంటుంది" అంటూ నవ్వేను.

మేము తిరిగివచ్చేటప్పుడు అక్కడ గొలుసులతో కట్టివేయబడివున్న రెండుకోతులు కిచకిచ మని అరుస్తూ మా ఆవిడ చీరకుచ్చెళ్ళు పట్టుకునిలాగినై. ఆగాభరాలో ఆమె తనచేతిలో ఇంతదనుకమంచీ ఒక్కొక్కటి తినగా మిగిలిన జీడిపప్పులు క్రిందికి జారవిడిచింది. ఆపప్పులు రెండుచేతులా ఏరుకుని తినడంమొదలెట్టినై కోతులు. "లీలా! భయపడకు. ఇల్లాంటి కోతిచేష్టలు రోజూ సీతమ్మకు రాముడు చేస్తూనే వుంటాడు; ఇది క్రొత్తకాదుగదా." అంటూ ఆమె భయముడిపి ఇంటికి దారితీశాను. దారిలో లీల మాట్లాడలేదు. తాను చూచినదంతా మళ్లీ మనస్సులో నెమరువేసుకుంటున్నట్లున్నది. ఇదివరకెన్నడూ మద్రాసు చూచివుండనందున ఆమెకు చాలావింతగా వున్నవి కొన్నివిషయాలు. ఇంకా పట్నంలో రెండుమూడు రోజులుండాలని కోరికగా కూడా వుందామెకు.

బసకు చేరుకుని సామానంతా సర్దమనీ మెయిల్‌కు వెళ్ళిపోదామనీ లీలను తొందరచేశాను. "ఇక్కడ ఇంకా రెండురోజులుండి పోదామండీ" అన్నది.

"ఐతే నెల్లూరులో దిగే ఆలోచన మానుకోవాలి. ఆలస్యమైతే నా ఉద్యోగం వూడిపోతుంది."

"సరే అలాగే ఏకాయికి వెళ్లిపోదాం ఇంటికి."

"మరి మీఅమ్మమ్మను చూడక్కరలేదూ! జంతుప్రదర్శనశాల చూడగానే మీవాళ్ళందర్నీ చూచినట్లుగానే తలస్తున్నావా?"

"మా అమ్మమ్మను మనవూరు రమ్మని వ్రాద్దాములెండి. ఆమెవచ్చి నాలుగురోజు లుండిపోతుంది" అంటూ గదిలో "ఎలెక్ట్రిక్ స్విచ్చి"నొక్కింది. ఆ విద్యుద్దీపకాంతిలో శరద్విభావరీజేబిలాగా నిల్చునివున్నది లీల. అమ్మమ్మకంటే విలువైన విషయాలు మద్రాసులోవున్నవిసుమా అనుకుంటూ నేను 'టిఫిన్ కారియర్' పుచ్చుకుని ఫ్రూటమాటింటికి భోజనం తెచ్చేనిమిత్తం త్వరత్వరగా వెళ్లిపోయాను.

నాలుగోనాడు సాయంత్రం మళ్ళీ మావూరువచ్చేశాం. మా మామగారు వ్రాసినవుత్తరం ఒకటి మా యింట్లో పడివుంది. పోస్టుజవాను కిటికీలోగుండా లోపలపడేసి పోయివుంటాడు. ఉత్తరమంతా మా ఆవిడే చదివింది. సంవత్సరాదిపండక్కు తనయింటికి మేమురానందుకు చాల నిష్ఠురవాక్యాలు వామీదికి విడువబడినై. చివరకు మాకోసం రెండురోజులుచూచి, చూచి ముసలమ్మ పండుగవెళ్ళిన రెండోనాడు సైజాం వెళ్ళిపోయిందని చదివింది. పీడావదలింది పో అన్నాను. లీలమాత్రం అమ్మమ్మకోసం నాలుగురోజులు దిగులుపడింది.

[illegible]

అశ్రుమాల

✠

౧

తీరనికోర్కె నే ననువదింపగ లేక తపించుచుండ సం
ధ్యారుధిరాశ్రువుల్ విడచు నాకస మీమలిసంజవేళ—ఏ
మోరగిలించు నాహృదయ మూరటసెందక సంచలింప—ఏ
కారుణికాశ్రువో కనుల గట్టును సర్వము శూన్యమేయగున్.

౨

తారలె ఈవిహాయసపథమ్ముల మిన్కుమటంచు నవ్వగా
నీరజనీవిలాసము సహింపఁగఁజాలక చూతు నేరహ
స్త్రీకములందొ నాకోరకుఁ దీరనికోరికఁ జూచుకన్నులన్
జారినరూపముల్ వెదుక, శ్యామమనోహరరూపశాలినీ!

౩

వ్రీలి కృశించు నాబ్రతుకు. రెక్కలుతాల్చి యనంతమైన దూ
రాల కగమ్యభావమధురస్మృతివీథులకున్ జరింపగా
జాలక; ఈనిశీథము మృషాపథమై కనుపట్టు నాకు, చిం
తాలసమైన నాకనులయందు గడున్ విరహాశ్రు లూరగా.

“ మ ధు వీ థి.”

✠

సింహాళ ద్వీపం కైఫియ్యతు


[మధుర ఆంధ్రనాయకరాజు సింహాళద్వీపపు రాజును జయించిన వృత్తాంతము.]

ఆమరునాడు దళవాయి చిన్న కేశవప్ప నాయడున్ను మరికొందరు పాళయగాండ్లున్ను యిరవై వేలజనముతో వల్లమంజిల్‌మందు పోతూవుండగా పుత్తళమునుంచి కండివారిజనం బహుజనంవచ్చి యెదురునిలిచి యుద్ధము చేయ్యేటప్పటికి కండిశీమజనం యెన్నడున్నూ యుద్ధంచేయనివారు గనుక అడివిగుంపుగనక యీపాళయగాండ్లున్ను నగరిజనమున్ను మోజోచ్చి పొడిచినందున కండిజనానికొంతజనం గాయాలలోనున్ను కొంత మృతి బొందింది. ఆసేనానాయకుడున్ను తోడవిరిగిబడెను. అంతట ఆజనం కొంత ఆయుధాలు ఫిరంగులు విడిచిపెట్టి పలాయనమై పారిపోయినారు. అదే దవుడుగా వచ్చి అకోట తీసుకొని తనరాజు పాళెంవచ్చి కేశవరకున్ను చిన్నకేశవప్పనాయడు అచ్చటనేయుండి ఆపాళెంవచ్చినసిమ్మట ఆ పాళెంనిన్ని యేలినవారినిన్ని అచ్చటనేనిలిపి తాను నోఖమజిలీముందుగా పోయ్యేటప్పటికి శింగళపురాజు మంత్రులు నలుగురున్ను యెనిమిది దేసలున్ను నలభైవేలజనముతో డట్టు అడ్డంతోకి బహుజగడం చేసేటప్పటికి యిచ్చటనున్ను అచ్చటనున్ను బహుభేదములై ఫిరంగీశబ్దములున్ను తుపాకిశబ్దములున్ను రాజా పెదకృష్ణప్పనాయడువారు బహుకా వినిన్ని అంచలనిరాడ తుణేఋణే కబుర్లువచ్చేది వినిన్ని సకలదళసమేతముతోను హావుదారెక్కి తమదండులో పోయి చేరి పాళెగాండ్లును యిరుపార్శ్వాలా రెండుచేతులుగానున్ను మధ్యదళవాయి చిన్నకేశవప్పనాయడు మొదలయిన దొరలనున్ను సాగించి తామున్ను హావుదాయేనుగను నడిపించుకొని బహుయుద్ధం చేస్తున్నవారి దండులోచొచ్చి చెయికలిశి యుద్ధంచేశినందున వారి మంత్రులు యిద్దరున్ను ముగ్గురు దేశనాయకులున్ను గాయాలలోపడిరి. మరిన్ని అనేకదళం కొట్టుపడిపోయిరి. బాకీ మంత్రులా యిద్దరినిన్ని దేశనాయకులు అయిదుగురున్ను చెయిపట్టుగా తగిలిరి. అంతట జయభేరివేయించి ఆగాయకాండ్లను యెత్తుకరమ్మని అచ్చట వల్ల మయిదానం జలసౌఖ్యంచూచి డేరాలువేయించి అచ్చట దిగి ఖండిమంత్రులక్కున్ను దిశానాదులక్కున్ను గాయాలతోపడిన మంత్రులు యిద్దరు దిశలు ముగ్గురికిన్ని వేరవేరే గుడారాలుయిప్పించి గాయాలుకట్టించి గాయాలులేని దిశలక్కున్ను మంత్రులక్కున్ను కావలసిన సామగ్రీలుయిప్పించి వారిక్కి పరిచారకుల సేవించి బహుమర్యాదగా నడిపించినందున వారిక్కి యీరాజు మహాధర్మిష్టుడు యితనికి శత్రువులై యెదిరించి జగడంచేసి వారి జనానపురుదారులున్ను అనేకజనాన్ని మనం ఛేదపరిచివుండిన్ని మనమైన యెత్తుపడి వారిలో మనం తగిలినందుకు మనల యేమిన్ని కాయక యింత మర్యాదగావుంచి రక్షించినందుకు మనం వీరికి ద్రోహం కాయక వారి చిత్తానువృత్తిగా నడుచుకోవలెననిన్ని యీరాజు శీమలో నోఖపాళియగాడు దుష్టకృత్యములు చేస్తూవుంటే వానితో మనరాజు స్నేహంచేశినది అనుచితం. అదిగాక వారిశీమలోవుండి శీమంతా నిపాతంచేస్తూవుండగా వాణ్ని శిక్షించవలశినది వారికి విహితమైవున్నది గనుక అందుకు మనరాజు ఆరాజును సభలో గర్వించి స్వతంత్రసమయిన మాటలాడినందుచేత మనకున్ను మనశింగళప్రజకున్ను మనదేశానికిన్ని యింత విపత్తువచ్చెను గనుక మనరాజుకున్ను వీరికిన్ని సఖ్యం చేశి వీరి మనోభీష్టప్రకారం నడుచుకోకుంటే యింకా వుండే శింగళప్రజ చచ్చి పలాయనమయి అందరు మునిగిపోయ్యేకాలం వచ్చిందిగాని మన శింగళప్రజ వీరితో సమానంగానిలిచి యుద్ధం కాయచాలరని వారందరు యెంచుకుని యేలినస్వామివారి సముఖానకువచ్చి కొన్నిసంగతులు మనవిచేసుకోవలెనని దళవాయి చిన కేశవప్పనాయన్కి చెప్పి అంపించిరి.

ఆ వర్తమానం అతడు ఆక్షణమే రాజుకద్ద యెరుకచేసి ఆక్షణమే గాయాలులేని యిద్దరుమంత్రులున్ను


ఉండవల్లిగుహాలు

మూడంతస్తులుగ నిర్మింపఁబడి జీర్ణదశలోనున్న ఉండవల్లిగుహాలు మనపురాతనాంధ్రుల శిల్పకళాచాతురికి చక్కని నిదర్శనములు. అచ్చట గోడలపైనను, స్తంభములమీదను నవరసములు చిప్పిలు అనేకచిత్రములు రచింపఁబడియున్నవి. ఒకమూల అనంతశయనుని విగ్రహము హృదయవిదారకముగ శిథిలమై పడియున్నది. రెడ్డిరాజులకాలమున ఈ గుహాలయము గొప్పవైభవ మనుభవించినట్లు తోచుచున్నది. ఒకప్పుడు కాటమరెడ్డియు, 14-వ శతాబ్దమున శ్రీకృష్ణదేవరాయలును ఈస్వామిని సందర్శించి కొన్నిమాన్యములు సమర్పించుకొన్నట్లు సౌత్ ఆర్కాటు జిల్లాలోని రికార్డువల్లను, లభించిన శాసనముల వలనను తెలియుచున్నది. కాని ఆనాటి వైభవచిహ్న మొక్కటియు నేడు గనుపించుటలేదు. 365 మంది అర్చకుల కాశ్రయముగనుండిన ఈఆలయములో నేడు అప్పుడప్పుడు ఒక్కొక్క పరిశోధకుని పాదచ్ఛాయలు మాత్రమే ధ్వనించుచున్నది. పందుముప్పత్తిలోఁ జేయఁబడిన వత్తులు వెలిగింపఁబడి శోభాయమానముగ నుండిన ఈ క్షేత్రమునకు నేడు గోడలమీది వర్షపునీటిచారలే అలంకారములైనవి. పూర్వము కమ్మని కర్పూరపు వాసనలు చిమ్మిన ప్రదేశమున ఇప్పుడు గబ్బిలపుకంపు. వేదరవములు మిన్నందినచోట కీచురాళ్లకంచు మ్రోత చెలరేగుచున్నది.



ఈజీర్ణగుహాలయమును మరల పునరుద్ధరించుటకుఁ బ్రయత్నించినవారిలో బెజవాడ వాస్తవ్యులు గొల్లపూడి రామచంద్రరావు గారు మాత్రమే స్మరణీయులు. వ్యయప్రయాసలకోర్చి, కొందరు ప్రభుత్వోద్యోగులవలని యవమానము గూడ సహించి, వారీక్షేత్రమును మనస్వాధీనములోనికి తీసికొనిరాగలిగినారు. ఆ తరువాత ఆకస్మికముగ వారి శరీరము వ్యాధిగ్రస్తమై నాలుగు మాసముల క్రితము వారు పరమపదించిరి. నాయకుని మరణానంతరము కథయు ఆశ్వాసాంతమైనది. ఆలయపునరుద్ధరణ కేర్పడిన "ఉండవల్లిగుహాలయకమిటీ" తనకర్తవ్యము మరచి నిద్రించుచున్నది. 'కమిటీ' సభ్యుల కిదే మేలుకొలుపు. మరల వారు జాగ్రదవస్థలోనికివచ్చి నడుముకట్టుకొని పనిచేసి భక్తులగు రామచంద్రరావుగారి యుద్యమము కొనసాగించి వారి పవిత్రాత్మకు శాంతి నెలకొల్పెదురు గాక! అందుకు ప్రతిఆంధ్రుఁడును తనశక్తికొలఁదిగ సాయముచేయఁ గలఁడని నమ్మకము.

—పురాణం కుమారరాఘవశాస్త్రి.



కృష్ణకాలునపై వంతెన, నీటికళింగు.

అయిదుగురు దేశలున్ను సముఖానకు రప్పించగానే వచ్చి పాదాక్రాంతులై నిలిచి స్వామి మారాజులుండున్న మాయందు నేరమెగాని స్వామివారియందు లేశమాత్రమయినా తప్పితంలేదు గనుక మాయందు కృపజేసి యుద్ధరంగాన మావారు అనేకులు చచ్చిన్ని గాయలతో పడివున్నారు. తమ గాయకాండ్లను అంతాయెత్తుకవచ్చి గాయాలుకట్టుతున్నారు, చచ్చినవారి నంతా యెత్తి దహనంచేస్తున్నారు గనుక ఆమేరకు మావారికిన్ని కబురిచ్చి యెత్తుకపొమ్మని ఆజ్ఞాపించవలెనని తిరుగా కాళ్లోపడి అడిగినప్రకారం దళవాయి చిన్నకేశవనాయునికి వుత్తరవిచ్చినారు. అందున పరుదారులుగా గాయాలుకట్టితే బ్రతుకుదురనియున్నవారినంతా వీరి మనుష్యులవిడిచి యెత్తించి డోలీలోవుంచి వుత్తరంకోటచేర్చి భద్రముగా వారికి కావలశిన సామగ్రీలు యిప్పించి తగిన మనుష్యుల వారిదగ్గిర నేమించి గాయాలు వాశిచాయమని అదేప్రకారం తమ దళములో పడ్డ గాయకాండ్లనంతా డోలీలో యెత్తించి వుత్తరానికి అంపించి గాయాలుకట్టమని వుత్తరానవార్కి వుంచివచ్చిన రామభద్రనాయునికిన్ని, పేష్కారు వీరభద్రయ్యకు తాకీదులువ్రాశి అంపించినారు. గాయాలవారిని చచ్చినవారిని యెత్తుకపొమ్మని వీరికవులు కాకితమున్ను సింగళవుమంత్రుల కాకితమున్నువ్రాశి హరకారులచేతయిచ్చి అప్పటికి అమడ పాడవున దిగివున్న కండిరాజుపాళెమున్ను యీయుద్ధాన హతశేషులున్నుపోయి దిగియున్నతావున వారి ముఖ్యప్రధానివద్ద యీకవులుకాకితము లిచ్చి వారిరాజుకు యెరుకచేసి అక్కడినుంచి డోలీలున్ను కొంతజనాన్నిన్ని అంపించి గాయకాండ్లనున్ను మృతిబొందిన జనాన్నిన్ని యెత్తించుక పోయినారు.

నాటియుద్ధాన కండివారి జనానముపై పరుదారీలున్ను రెండువేలజనమున్ను చావు, గాయాలు వెయ్యిన్నైనమున్నూటికి గాయకాండ్లున్ను మధురవారి జనాన వేయిజనమున్ను వద్దెనిమిది పరుదారులున్ను పాళెపట్టుదొరకొడుకు యెనిమిది మనిషిచావున్ను నూటయాభై యేరు జనమున్ను పదమూడు పరుదారులున్ను ఆరుపాళెపట్టుదొర కొడుకులకు గాయాలున్ను అయినందు నాత నాటిదినం మృతిబొందిన వారినంత దహనం చేయమని గాయకాండ్లనంత యెత్తుకపోయి గాయాలుకట్టించమని వుత్తరానికి పంపించి నాటిదినం పాళెం ముఖాముచేసి ఆ మరునాడు యీనియాస్నైరణభేరివేయించి కండిరాజు దిగివుండే పాళెంమీదికి పోవలెనని తయారు అయిన వర్తమానం అమంత్రులు విని తమ సముఖానకువొచ్చి వోఖమవి జేసుకోవలెనని చెప్పిపంపించిన ప్రకారంరమ్మని వుత్తరవై అమంత్రులు యిద్దరున్ను దేశలు అయిదుగురున్ను సాష్టాంగ నమస్కారంచేసి స్వామి వోఖమవి చిత్తగించవలెను అనగా మంచిది అట్లానే కానీ అని వుత్తరవియ్యగానే స్వామి రామరాజును మీభేటికి రప్పిస్తున్నారం మీరు ఆజ్ఞాపించినప్రకారంయిచ్చి నడుచుకోమచున్నారం మూడుదినాలుతుమాత్రం యీపాళెమున్ను మీరున్ను యిచ్చటనే వుండేటట్టుగా దయచేసినట్టైతే మాఏదుగురిలో వొఖరికిన్ని మీ హరకారుల్లో యిద్దరికిన్ని వుత్తరవిస్తే మేమున్నా కాకితములువ్రాసి మారాజుకున్ను అచ్చటవుండె మాపెద్దమంత్రి కిన్ని కాకితాలు వ్రాసి అన్ని వయినములు మాట్లాడుకరమ్మంటున్నారం అన్నందుకు అదేప్రకారం అంపించండి అయితే మీ రాజు మీరు వ్రాశినప్రకారం చూచి నడిపించకుంటే మిమ్మల యేమిచేశేదని అడిగిరి. అందుకు వారుచెప్పింది మామాట వినకుంటే మేమున్నూ మాతోచేరిన సింగళమున్ను మీతోచేరిపోతున్నారం మాకు మీరేరాజు కాని అతడు రాజు కాడని తోశివేస్తున్నారం మీరుజూచి యిచ్చటనే వుండమనిచెప్పితే యిచ్చటనే వుంటున్నారం లేక మీవెంబడికూడా రమ్మన్నట్టైతే వస్తున్నారమని చెప్పగానే అయితే మీమాట మేమెట్ల నిజమని యెంచేది అని రాజు అడగగానే అమంత్రులు ఆదేశలు తమ బుద్ధస్వామిమీద ఆనబెట్టియిచ్చిరి.

ఆమీద రాజు చాలా సంతోషపడి వారికి వస్త్రభూషణాలుయిచ్చి పారాంద్దనిఅందరికి పాలకీలుయిచ్చి యెక్కరమ్మని శెలవులుకా వారికి కావలశినంత యిమ్మని వొకమంత్రిని వొకదేశనుకూడా వారిరాజు

వద్దికి పోమ్మనమని వుత్తరవిచ్చి యిద్దరికిరెండుగుర్రాలు
సవారీకీయిచ్చి పంపించిరి. వారిరాజావున్న పాళ్యే
నకుపోయి పెద్దప్రధానిని కని అతనితో అన్నిసమాచా
రములు కలశి మాట్లాడుకుని ఆపెద్దమంత్రినికూడా
పిలుచుకొని వీరుయిద్దరుకూడాపోయి రాజువద్ద యీ
సంగతులన్నియు తెలియజెప్పినందున రాజువిని అర్థాం
గీకారముగా వీరికి ప్రత్యుత్తరము చెప్పకుండా వున్నం
దున వీరికి మనసున్నన వెగ్గలై రాజునుజూచి మేము మీ
క్షేమంకోరివుండే తగ్గవారం గనుక వారియుద్ధమున్ను
జూచి వెనకవచ్చిన దండున్ను ఆ పాళెగాండ్లున్ను
అందున వచ్చే సరదారులున్ను ఆజనంయొక్క మొన
జూచి మన సింగళప్రజ వారిముందునిలువ నేరదు. అందు
వల్ల మన రాజ్యానికి మోసంవచ్చును. యీప్రకారం
మాట్లాడుకవచ్చినారం. యీప్రకారం నడుచుకుంటే
అందరికి క్షేమంకలుగును. అనగానే రాజు కోపంజేసి
వారిమాటలువిని నీవుకూడా యెట్లా చెప్పుతున్నావు అని
పెద్దమంత్రిని కోపించుకుని నేను కిరీటసింహాసనాధిప
తిని. నేను ఒహారిదగ్గిరికివచ్చి చేటీతీసుకుని వారుచెప్పిన
ప్రకారం వినేరా రేపుతాకి యెల్లుండివస్తున్నాను వారి
ఛేటికి మీరేపోయి చెప్పండా అహంకారముగా చెప్పి
నందుచేత మంత్రులు ముగ్గురున్ను రాజుకుమ్రొక్కి
బైటికివచ్చి పెద్దమంత్రితో ఆలోచనచేసినందున పెద్ద
మంత్రి చెప్పినవయినం యీరాజుకు కాలసామాన్యం
చాత యీ దుర్బుద్ధిలోచినది కాబట్టి మీరు సత్యంజేసి
యిచ్చినవారుగదా! మీరు వారిదగ్గిరికి పోయి చేరండి.
నేను రాజునువిడిచివచ్చేది ధర్మంకాదుగదా. కడాపట
మీరు చెప్పినప్రకారం నడిచిపోను అని మీరుపోండు
అని వీరున్ను యీయిద్దరు హరకారులును పిలుచుకొని
పాళ్యెనకువచ్చి మంత్రి దేశలతో కలిసిమాట్లాడు
కొని వారండలు యీరాజువద్దకువచ్చి తాము పోయి
వచ్చిన సమాచారమంతా పలకరించి స్వామీ నేటిసుతా
తమవారము యీశిమలో సగంజనం మాతో చేరినజనం
వున్నది. స్వామి ఆజ్ఞాపించినప్రకారం నడుచుకొంచు
న్నాము అని మంత్రులు మనవిచేసుకున్నందుకు రాజు
నవ్వి మీరు పూరికివున్నండి రేపటిదినం మీరాజు మా
ఛేటికి వస్తున్నాడున్నాడు గదా వచ్చినపిమ్మట జయా
పజయములు జూచి ఆపిమ్మట మాట్లాడుకోవచ్చును
గాని అదివరకు మీరు మాదండువెనక నిలిచివున్నండి
అనేదిగా వారినిపంపించి మంగపతినాయునికి పిలిచి
దండు తయారుకావలెనని అందున పదివేలజనం మంచి
జనంగా యేర్పరచి పదిఫిరంగులు తీసుకొని యింకా
నాలుగు ఘడియలదూరంపోయి యుండుమని అక్కడ
మోర్చాలుంచి అందుమీద ఫిరంగులుంచి జనాన్ని ఛం
చలతీన తావులో భద్రముగావుండి రేపు వారువస్తే
యివతలికి విడవకుండా అని పోట్లాడుమని అంపించిన
ప్రకారం మంగపతినాయుడుపోయి మోర్చాలువేశి ఆ
పైని ఫిరంగుల లెక్కించి. జనాన్ని భద్రముగావుండమని
తయారుచేశెను.

రేపు ఖండిరాజు సైన్యంవస్తే విడువక అని పోట్లా
డుమని యేలినస్వామివారు ఆజ్ఞాపించివున్నారు గనక
మీరందరు అదేప్రకారం వుండమని జనానికి అంతవరి
చెప్పి అచ్చట డేరాలువేయించి దిగివుండగా మరునాడు
వుదయానే ఖండిరాజు తమసైన్యాన్ని తయారుజేసి రణ
భేరివేయించి సింగళం అరవై వేల జనమున్ను కాఫిరీలెల్లా
పదివేలజనమున్ను ఆరాజుకేవిశ్వాసాకీట హాజరుగ వుం
డేది ఫిరంగితోపుఖానావారిసార్వ్యం వుండేది వారితో
కూడా హావుదారొక్క ముందుగా వారున్ను తోపు
ఖానావున్ను వారికివెనుక ఖండిశిమలోను రావన్నిపన్ని
యుండు మొనలైన పాళెగాండ్లున్ను వారికివెనక పెద్దమం
త్రిన్ని, శింగళపుసరదారులున్ను వారికివెనుక రాజుహావు
దాన్ను, రాజబంధుప్రేలున్ను తక్కిన సైన్యమున్ను యుద్ధ
సన్నద్ధులైనడిచి మంగపతినాయుడి మోర్చాలమీద అఘా
డివచ్చిన కాఫరిజనం యెదురుతాకి ఫిరంగిజగడ మయ్యేట
ప్పుడు వారివెనుకవచ్చిన శింగళపుజనమున్ను పాళెగాం
డ్లవారి జనమున్ను పెద్దమంత్రివెంబడి జనమున్ను యిరు
వంకల మంగపతినాయుడి పాళ్యాన్ని చుట్టుకొని బహు
యుద్ధమయ్యేటప్పుడు మంగపతినాయుడు అయిదువేల
జనాన్ని తీసుకొని ముందెక్కి కాపరిజనంమీద తాకి
మోహరించి పాడిచేటప్పటికి యెదిరి బహుదళం గనక
రాజు హావుదారొక్క రేనుగను ముందునడిపించి

చెయిచూపి జనాన్ని పురికొలిపి మంగపతినాయుడిని చుట్టుకొని బహుయుద్ధమయ్యేటప్పటికి మంగపతినాయుడు నానాయుద్ధములు చేసి తీరినబంటు గనక తాను పట్టె ఖడ్గంతీసుకొని మూడువేలజనాన్ని రెండుచేతులు గాపంచి శింగళపాళెగాండ్లమీదవొకచెయ్యిన్ని, మంత్రిపార్శ్వం వొకచెయ్యిన్ని తనతో రెండువేలజనం తీసుకొని తోపుఖానామీద తాకి యుద్ధమయ్యేటప్పటికి కాఫిరిజనం మొనకలిగినజనం గనక ఫిరంగులచాతనున్ను తుపాకులచేతనున్ను ఆనికొట్టేటప్పటికి మంగపతినాయుడిజనాన వెయిజనం తార్కైనదిజూచి వెయిజనంతీసుకొని మంగపతినాయుడు మోహోచ్చిపోతుండగా యెదటివారిది బహుసేనం గనక రెండుచేతులు గాపంచినజనాన్ని, రెండువేలజనం గాయాలతోను మృతిబొంది పడ్డందుచేత కడమ వెయిజనం విరిగి మోర్జాకువచ్చిచేరి ఆజనంతో చేరుకొని ఆని పోట్లాడేటప్పటికి సింగళపుజనమున్ను వారి పాళెపట్టుజనమున్ను తాకి మోర్జాలుచుట్టుకొని రెండుమోర్జాలు తీసుకొని కడమ మూడుమోర్జాల్లో జగడముయ్యేటప్పటికి మోహోచ్చి యుద్ధంచేసే మంగపతినాయుడుతిరిగీజూచి రెండుమోర్జాలుతీసుకొన్నారు.

కడమ మూడుమోర్జాలు యెత్తుబడేట్టువున్నదని మోర్జాలపార్శ్వం తిరిగి వస్తూవుండగా కాఫీరీజనమున్ను రాజు పావుదాజాట్టుకవచ్చే జనమున్ను మంగపతినాయుడిమీదికి తాకి మోర్జాలకు పోనియ్యక నఖముఖాలాచుట్టుకొని తుపాకులచేతనున్ను ఫిరంగీలచేతనున్ను ప్రయోగంచేశేటప్పటికి మంగపతినాయుడి జనముతో యేనూరుజనంవరకు ఛేదమై కడమ యేనూరు జనముతో వొకపార్శ్వంబొచ్చి బలాఢ్యులచేత పొడుచుకొని పొయ్యేటప్పుడు శేఖరావన్నియడు యితణ్ని పోనియ్యకుండా యెదురుగవచ్చి అడ్డంతాకి—వచ్చినన్నియడి జనానికిన్ని మంగపతినాయుడి జనానికిన్ని చెయికలిశి వొడిపట్లు శిగపట్లుగా జగడంచేశిరి. ఆ సమయాన మంగపతినాయుడికిన్ని శేఖరావన్నియడికిన్ని రూపురూపున చెయికలశినప్పుడు అతనిచెయి నరుకు యితనిమీదనున్ను యితనిచెయినరుకు అతనిమీదనున్ను తాకినందున మంగపతినాయుడు లెస్సగా సాముచేశినవారు గనక రెండోనరుకు యెడపి వాడు నరికేటంతలో యీయన సమాళించి ఆనరకు తప్పించి పట్టాతీసి నరికేటప్పటికి వన్నియడికి వఖభుజం తెగి మరణమూర్ఛతో కిందపడెను.

అప్పు డావన్నియడిజనం సరదారుపడగానే ఆజనం విరిగిపోతూ వుండేటప్పటికి మంగపతినాయుడు ఆగాయాన్ని సడ్డకేయక అదివరలో మిగిలినజనాన్ని శేఖరంచేసుకొని అడ్డంతాకిన వారిని గదిమికొట్టుకొని పోతూవుండగా శేఖ శింగళపువాడు తుపాకీనివెయ్యగా అగుండుతాకి వొరిగి పడిపొయ్యేసమయాన వారిజనం మొనగాండ్లు అతణ్ని సమాళించి తీసుకొని మోర్జాల సమీపానికి పొయ్యేటప్పటికి ఆమోర్జాలలోవున్న వీరజనం యెదురుకొనివచ్చి వీరిని చుట్టుకొని వెంబడించి వచ్చిన శింగళపుజనాన్నిచొచ్చి కొట్టి మంగపతినాయుడిన్ని కూడావచ్చిన మిగతజనాన్నిన్ని మోర్జాలో పోయి చేరినారు. అదివరలో మంగపతినాయుడిజనాన చావు గాయం యీవగన అయిదువేలజనం ఛేదం. సరదారులు మొనగాండ్లులో ముప్ఫైరెండుమంది ఛేదం. ఖండిరాజుజనాన మూడువేలకు మృతమున్ను వెయ్యింటికి గాయమున్ను యిరువైనేడు సరదారులు చావున్ను పదియేను సరదారులు గాయమున్ను అయి అప్పటికి ఆరాజు బహుకోపముతోకూడా తన దళాన్ని పురికొలిపి బాకివున్న మూడుమోర్జాలమీద నఖముఖాలలో చుట్టుకొని ఫిరంగిజగడం అయ్యేటప్పటికి మరివఖమోర్జాలోవున్నజనాన్ని హతపరచి మోర్జాలను తీసుకుని కడమ రెండుమోర్జాలమీదనెగ్గి జగడంకాయగా యీ యుద్ధసంగరం ఫిరంగివేట్లున్ను చావు చంపులున్ను యిది యేవత్తున్న పెద్దదంపులో వినపడి రాజా పెదకృష్ణప్పనాయనిగారు బహుకోపంచేసి దండు యీవత్తున్న ప్రయాణభేరి వేయుమని కూచిచేసి డెబ్భైరెండు పాళెయగాండ్లు సమేతంగా ఏకముఖముగా దండు యీవత్తున్న బయలుదేరి తమ దండువచ్చిచేరి మోర్జాలు రెండులోనున్ను అనుకొని ఖండివారు తీశిన మోర్జా మూడున్ను కొట్టి లగ్గయెక్కి తీసుకొని మంగపతినాయుడివారు చేసిన సాహసములు విని చాలా సంతోష

పడి మంగపతినాయిన్ని, పుత్తళానికి యెత్తిపంపించి యిచ్చుట దండు తాను మూడుచేతులుగాపంచి దళవాయి చినకేశవప్పనాయుడువారు తమదండెట్లు యావత్తున్ను, వఖచెయ్యిన్ని దేశైభరండు పాళయగాండ్లున్ను వారిదండు యావత్తున్ను రెండుచేతులుగానున్ను, యీ ప్రకారం మూడుచేతులుగా దండురెయించి గుముసుచేసి తామున్ను అంబారియెక్కి దండుసాగించిరి.

కండివారున్ను దండుయావత్తున్నూమూడుచేతులుగా పంచి సెగ్గి ఫిరంగులుయెత్తికట్టి వీరున్ను, వారున్ను, ఫిరంగులచేత జగడంచేయగా ఖండివారికి ఫిరంగలు నిండా గనక వీరికిమట్టు గనుక వారి ఫిరంగిగుండ్లచాత వీరికి జానాభేదం వచ్చినందువల్ల రాజా పెదకృష్ణప్పనాయుడువారి దళవాయి చినకేశవప్పనాయిడి వారినిన్ని, కార్యస్తులనున్ను పాళయకాండ్లనున్ను చూచి కోపం చేసుకొని యుద్ధరంగమందు శౌర్యంచేశి మనుష్యుల చావనిచ్చేది విహితముకాదని కోపంచేశి అంబారిముందర నడిపించగా చినకేశప్పనాయిడివారున్ను పాళయకాండ్లున్ను ఏకముఖముగా వీరావేశులై ఫిరంగిగుండ్లు తాకి జనంభేదం అవుతున్నుండగానే గుండ్లలోచొచ్చి ఫిరంగులమీదవున్న జనాన్నికొట్టి వకావకలుచేయించి ఫిరంగులు చెయికరెంజేశుకొని దండులోచొచ్చి వీరికిన్ని, వారికిన్ని, పంతుల సమరమయ్యేటప్పటికి నాలుగుమంత్రులున్ను, అయిదుగురు శానానాధులున్ను వీరిదగ్గిర ముందరవచ్చి సత్యప్రమాణములు చేశియిచ్చి వీరుపంపించి తమ రాజాదగ్గిరికిపోయి పెద్దమంత్రితోకూడి ఖండిరాజాను అనేకవిధముగా చెప్పిన్ని వినకనే నిరాకరించి వుండెత్తిరి. గనక మంత్రిన్ని రాజాచేశేపని సమ్మతిలేదు గనక నలుగురుమంత్రులలో చేరినదండున్ను, దళానాధులలో చేరినదండున్ను, మరిన్ని అనేకదండు వారివారిపాటున తొలగి పలాయనముగా పారిపోయిరి గనక ఖండిరాజాన్ను, కాపురిమలు వచ్చి పోయినారు పోగా నిలచిన యెనిమిదివేలున్ను, శింగళపువాళ్ళలో పదివేలున్ను, పాళయకాండ్లలో పదివేలున్ను, అంత యిరవైయెనిమిదివేల జనమున్ను, నిలిచిరి. పెదమంత్రిన్ని, రాజా యెంత దుష్టుడుగావున్నప్పటికిన్ని, విడిచిపోరాదని నిలచెను. వార్కి వానబల మాయగనక వీరు సిగ్గిచుట్టుకొని యుండగా పెద్దమంత్రి ఆలోచించి రాజుకు యిప్పుడయినా బుద్ధివచ్చియుండీనియని రాజుదగ్గిరికిపోయి అనేకవిధములుగా యెదిరియొక్క క్షాత్రమున్ను, బలాబలమున్ను, తమయొక్క బలహీనమున్ను, శింగళపుసంగు మంత్రులతో దళానాధులతో చేరి తొలంగిపోయిన వివరమున్ను తెలియజెప్పినందున ఆరాజువినక నేను శింగళద్వీపమునకు రాజును కిరీటాధిపతిని నేను యింకొకరాజును లొంగి పిఘుకబిక్షి యిచ్చివుండేటివాణ్ని గనుక మీరు అందరున్ను వారితో కూడుకొని మామీదికివచ్చినా నేనొఖడైనిలచి ప్రాణత్యాగమైన చేశేదేగాని వొఖరికిలొంగి మాట యిచ్చేదిలేదు అని రాజుచెప్పినందున మంత్రిఅయితే మీమనస్సుకు సరిపోయినట్టని పెద్దమంత్రి చింతాక్రాంతుడై మనం యీదేశానికి పారంపర్యముగా సర్వాధికారంచేశి పేరైనవారం గనక మనమున్ను రాజునువిడిచి పోతే బహుకాలానికి అపకీర్తివచ్చుననివుండె దళాన్ని శేఖరించుకొని యుద్ధానికినిలిచినందున మధురవారి దళవాయిన్ని వారి సయిన్యమున్ను పాళ్యగారులున్ను సెగ్గిన నఖముఖాల్లోలోచొచ్చి తుపాకులచేతనున్ను కత్తులు బాణాల చేతనున్ను నుగ్గుచేస్తూ మహాయుద్ధమయినందున యెన్నటిదళాన అనేక సరదారులుచచ్చిన్ని, గాయాలతోనున్నుపడి వారిదళమందున్ను బహుభేదమయినందున నిరువాహకం చాయలేక వారి పాళయపట్టిజనమున్ను విరిగి పలాయనమై పొయ్యేటప్పటికి పెద్దమంత్రిన్ని, అతనికి కేవలం విహితమయిన శింగళం వారిలో రెండువేలజనమున్ను కాఫిరీవారిలో నాటియూఖాన సైన్యం రెండువేలజనంపోగా కడమ నిలచిన యెనిమిదివేల జనమున్ను ఆరాజుబంధువులలో యిరవై సరదారులున్ను రెండువేల జనమున్ను హావుదాచుట్టుకొని నిలచిరి.

—సశేషము.

కృష్ణాస్రవంతి

కృష్ణానదీమాహాత్మ్యము.

గీ. కలియుగమునందు శ్రీజహ్నుకన్యకాది
సకలపుణ్యమహానదీసంఘమందుఁ
దా వినుతిఁ గాంచెఁ గృష్ణాభిధానతటిని
యధికపుణ్యఫలప్రదం బౌటఁ జేసి.

సీ. ఈ కృష్ణవేణ్ణాఖ్య నేపారు నిమ్నగ
శ్రీకృష్ణభవయై ప్రసిద్ధిగనుట
స్వర్గలోకమునుంచి వసుధకుఁ గృష్ణచే
నానీతయై మహాఖ్యాతిగనుట
నీద్వీపవతి కమలేశుచే విధి కాత్మ
వలనఁబడి పుత్రిపదవుఁగనుట
కల్పాదినిఖిలలోకభయంకరమహౌఘ
భేదనంబైనట్టి బిరుదుగనుట

గీ. నదులకెల్లను మొదటిజన్మంబుగనుట
మానితంబైనయట్టి సన్మహిమగనుట
సకలపాతకవిసరకర్షణముగనుట
వలనఁ గృష్ణాఖ్య నీనది వన్నెకెక్కె.

ఉ. శ్రీకరసహ్యజాస్మరణచే నుతిచేతను
స్పర్శనంబుచేఁ
బ్రాకట తన్నదీసలిలపానముచేతను
మజ్జనంబుచే
లోకులు నైజపాతకవిలోపముఁ గొండ్ర
మనోజ్ఞసద్గతిన్
జేకొని దైవసంఘములచే నుతిఁ
గొందురు రబ్జసంభవా !

మ. ఒకసారెవ్వనిపాదపంకరుహసంయో
గంబుచే సత్కృపా
త్మకరఖ్యాతిని గాంచె జహ్నవి త్రిలో
కంబందు నత్యంత మా
సకలేశాచ్యుతమూర్తియై పరఁగు కృ
ష్ణాసింధు వెంచన్ గుమా
రక! విశ్వస్తుతి గాంచదెట్టులు సమగ్ర
ప్రాభవోజ్జృంభతన్.

మ. విలసన్నిర్మల కృష్ణవేణిజలముల్
విఖ్యాతపూజ్యంబుల్
యిలలో నే నరుఁడైనఁ ద్రావ తనదౌ
హీనోగ్రదుర్బుద్ధిఁ బెం
కలఁ బాయంగలఁ డామహామహుని
చెంతం జేరఁగా నెంచియున్
మలినాఘౌఘము పోవఁగా వెలుచు
మణ్మాసంబు లెంతేనియున్.

శా. సిష్ణానూత్కూట పాపహారక పదా
శ్వంజత్తటత్వంద్వరై
విష్ణు బ్రహ్మసురేంద్రవర్ణిత జగ
ద్విఖ్యాతచారిత్రరై
కృష్ణశ్రీకరదివ్యగాత్రభవరై
కీర్తిస్ఫురన్మూర్తిరై
కృష్ణాఖ్యాకనదీవతంసము చెలం
గన్ విశ్వసంస్తుత్యరై.

గీ. గుడమయంబైన వస్తువు గోరి మెసవ
మధుర మంతట వర్తించు మాడ్కి కృష్ణ
కృష్ణదేహంబు తానరై కరలంకతన
సమ్యగిష్టఫలంబుల సంఘటించు.

గీ. కామధేనువు గతి గాను గమలభవుఁడు
దానుసృజియించి కృష్ణను మానవులకుఁ
గ్రమముతో నిచ్చె వారికిఁ గామ్యఫలము
లొప్పవాటింపఁ గల్గించుచుండుకొఱకు.

శా. దూరస్థుండు దలంచె నేని మిగులం
దూలించుఁ బాపంబులన్
జేర న్వచ్చి కనుంగొనంగ నవుడే
చేకూర్చు నిష్టార్థముల్
నీరం బంటిన మోక్ష మిచ్చు ననఁగా
నిత్యంబు స్నానంబుచే

నీరూపంబు ఘటించునో యెఱుఁగరా
దెంతో విమర్శించినన్.

కృష్ణానదీ స్తోత్రము.

క. ఓ జననీ! భక్తులమై భవత్పాదదర్శనంబుఁగోరివచ్చిన మాకన్నుల కగపడి మమ్ములంబ్రోచుట దొడ్డతనంబు. జగద్ధితకరామృతస్వరూపిణివై ప్రత్యక్షంబుగానుండుదు వందువలన యుష్మదంఘ్రిపంకేజసేవకులగు మానవు లమరత్వంబు నొందియుండుదురు. శతానందుం డాదిత్యులకుఁ గలశంబుచేఁ దగుకోలఁది నమృతంబు నొసంగె. నీ వత్యంతకారుణ్యంబువలన మర్త్యులకొఱకు మహామృతవాహినివై కనుపట్టియున్నదానవు. సమస్తాశ్రమవాసులైన బుధసముదయంబులకును సర్వవర్ణంబులకును శరణంబై సర్వజీవశరణ్యవైన నిన్నుసేవింపక దర్శనంబునకు రాక యేమనుజులూరకుండుదురు? నిక్కలి జలంబవేక్షించి పరివృత్యమానహంసంబులు దూరారణ్యంబునుంచి శుద్ధోదకంబు మదింగోరి భవత్సన్నిధానంబున కరుగుదెంచుపగిది నో దేవీ! పరమహంసముఖ్యులు సుఖాదులయందు నిస్పృహులై మోక్షంబపేక్షించి తావకీనదర్శనంబునకుఁ జనుదెంచుచుండుదురు. మఱియు బ్రహ్మవర్చస్కాములగు బ్రాహ్మణులును, పరిపంథిజయాభిలాషులగు రాజులును, ధనధాన్యాద్యపేక్షచే వైశ్యులును, నన్యులగు సకలజనంబులును దమతమ కోరికలఫలియింపఁ జేసుకొనుటకై త్వత్సమీపంబునకు వచ్చుచుండుదురు. వెండియు దేవదైత్యాప్సరస్సిద్ధసంఘంబులును, నాగగంధర్వకిన్నరయూథంబులును స్వకీయకామ్యాభిసిద్ధికై జననీసమీపంబునకుఁ బుత్రులరుదెంచు చందంబున వచ్చుచుండుదురు. భూసమావలోకనేచ్ఛను సమాగతుండగు శేషుని మంగళప్రదంబగు తనువుభంగి దీర్ఘంబును, కుటిలంబును, ధవళంబునునై వెలుఁగొందు త్వదీయ దివ్యమూర్తిని దూరముననుండి కనుఁగొన్నను గిల్బిషము హరించునన్న స్నానపానాదులకు నీజలం బనవరతంబును వాడుకొనువారల విషయమై యేమిచెప్పవలెను?

క. శ్రీవిష్ణు శరీరజవై
యావిధినుతవై మునీంద్రుఁడగు కృష్ణునిచే
నీవసుమతిఁ జెందిన కృ
ష్ణావిమలద్విపవతికి నతులొనరింతున్.

శా. నీకల్లోలిని శుంభదూర్మికలచే
నింద్రాదికేశేశను
ల్లోకాత్యుత్తమ విష్టపాళికి లసత్సోపాన
పంక్తిక్రియన్
లోకాఘంబుచే నూహింపఁదగి యీ
లోకంబులో శోభిలెన్
నాకంకేతుఁడౌన కృష్ణకు నతుల్
హర్షంబునన్ జేసెదన్.

మ. మనుజవ్రాతములార! భీతిలక సన్మానం
బుతో మీరు నే
నమఁబూజింపుఁ డభీష్టసద్వరవితా
నంబిత్తు మీకేనటం
చను నేవిమ్మగ నీరపక్షిపటలీశుంభ
న్నినాదంబుచే
జనసంఘంబులఁ బిల్చునట్లలరుఁ
దత్సహ్యాద్రిజన్ గొల్చెదన్.

శా. పాలద్యోవిష్టసమస్తపుష్పఫలరాజత్సంఘ
సంయుక్తవై
వాలాయంబుగ మానవప్రకర సన్త్వాభీష్ట
సంధాత్రివై
చాలన్ శోభితయయ్యె నేతటినిఁ బ్రాంచత్క
ల్పవల్లీక్రియ
న్నాలావణ్యవతీశిరోమణిని నేనత్యంతమున్
గొల్చెదన్.

చ. భువనవిచిత్రసద్గుణసమూహమహత్త్వము
వల్ల నిక్కలిన్
బ్రవిమల సజ్జనంబునకుఁ బాపి కదంబమునున్
శరణ్యవై
భువి నెపు దేసరిద్వరము పొల్పగలారును
దన్మహోన్నతి

ప్రవరగఁ గృష్ణ సేవతివిభాసుర భక్తినిఁ
గేల్మొగిడ్చెదన్.

చ. ఇనుము రసంబు సోఁకఁ దనహీనపుకాంతి
తొలంగి పైడియై
కనుపడుమాడ్కి లోకమతిఁ గాంచిన
సహ్యసుతాంబుసంగమం
బున ఘనకిల్బిషం బపుడె పుణ్యతమంబగుఁ
గానలోకపా
వనతఁ జెలంగు కృష్ణ యనివారిత భక్తిని
నే నుతించెదన్.

ఉ. పావక సుప్రసన్నగతి
పావితలోకవిముక్తి జల
స్నానముఁ జేయువారలకు
శాశ్వతమై భవదివ్యశార్ఙ్గ భృ
త్స్నాన వెలుంగు భక్తిగల
ధన్యులు గొల్తురు పాపముక్తులౌ
మానవులెల్లరున్ నిను స
మంచితభక్తిని సహ్యనందనా!

గీ. నీదు సలిలంబు లత్యంతనిర్మలములు
ఘోరజన్మకృతాఘముం గూల్చివైచుఁ
జండతరభానుమాలి తేజశ్చయంబు
కటికచీకటులను బాపుగతిఁ దలంప.

గీ. దుష్ప్రతిగ్రహంబు దుర్భోజనంబును
దుర్వచః ప్రసక్తి దోషములను
దొలఁగఁజేసి మమ్ము గలకాలమును గావ
వినుతిఁజేతు కృష్ణవేణి! నిన్ను.

గీ. కృష్ణవేణితల్లి! విష్ణుదేహోద్భవ!
భక్తిగరిమతోడఁ బ్రణుతిఁజేసి
నిఖిలపాపహంత్రి! నీకర్ఘ్యమిచ్చెదఁ
జేకొనంగవలయుఁ జిత్తమలర.

వ. ఓజననీ! సర్వపాపఘ్నియును నారాయణియును నగు నీకు నమస్కరించెద. శరణాగతుండనగు నన్ను సంరక్షింపు, ఏనరుండు పరబ్రహ్మస్వరూపిణివగు నిన్ను. వినుతించుటకు సమర్థుండైయుండు, నన్ను దీయంబగు భక్తి నీయందు నిలుచుంగాక! మదీయస్తుతిచే సంతుష్టచిత్తవై మదపరాధంబులు సహింపవలయునని వేఁడెద, ఓజననీ! నీయందు మజ్జనంబుచే మర్త్యుండు విధూతపాపుండగుచు విష్ణుపదంబు నొందు నిది యథార్థంబని గాధినందనుండు వినుతించె.

కృష్ణా సాగర సంగమము.

శా. శక్రాశ్మప్రతిమానదేహయగు కృష్ణా
సింధు వీచీతతి లో
కక్రూరాఘనివారణంబు కొఱకై
కారుణ్యమేపార భూ
చక్రాలంకరణంబు సేయుచును విశ్వ
స్తోమదోషావళీ
నక్రత్వంబును మాన్పుచున్ గలసెఁ
బ్రాగ్వార్ధిన్ స్వనీరంబుచేన్.

మ. అనులోమంబుగఁ గృష్ణయుందరఁ దటి
న్యాస్యత్యుఁ డుత్సాహియై
ఘనవీచీమయబాహువుల్ చాఁచి
రంగల్లీల నాలింగనం
బనుమానింపకఁజేసె నచ్చటను జాయా
ప్రేమసమ్యక్క్రియా
జనితానందసుధామనోజ్ఞ ఝరిణీ
సంభోగచాతుర్యుఁడై.

ఫలశ్రుతి

మ. అమలాత్ముండగు కృష్ణమౌనివరుచే
నాసీతరై భూమిపై
విమలాంతఃపరిపూర్ణ నిర్ఘరముచే
వేద్యక్ ప్రవర్తిలు నీ
సుమహాద్వాహిని యొక్కవృత్తము ప
ఠించున్ లోకమం దెవ్వఁడు
త్తముఁడౌ వాఁడు గాంచుఁ దద్గతిని గా
త్రత్యాగియై యవ్వలన్.

—తాతంభట్ల గురుమూర్తిశాస్త్రి.

పుష్కర ప్రశంస

అహల్యాజారుడై శరీరము ఆపాదమస్తకము అసహ్యముగ నగునట్లు శప్తుడైన ఇంద్రుని పాపములు తొలగించుటకు బ్రహ్మచే నిర్మింపబడిన తీర్థరాజు పుష్కరుడు. ఆతడు సమస్తతీర్థములకును అధ్యక్షుడై ఎల్లవేళల స్వర్గలోకమునందలి మందాకినీనదియందు వసించియుండునట్లు బ్రహ్మదేవునిఆదేశము. అయినను పుష్కరుడు భూలోకమునుకూడ పునీతముచేయు ఉద్దేశముతో కొన్ని నియమితకాలములందు ఇచ్చటి నదులయందును ప్రవేశించి కొన్నిదినములుండుచుండును. తాను ఎల్లవేళల నివసించియుండు దేవలోకమునకంతటికిని గురువగు బృహస్పతి మేషాదిద్వాదశరాసులయందు ప్రవేశించుకాలమును పుష్కరుడు తాను భూలోకమునకు వచ్చు ముహూర్తముగ ఏర్పఱచుకొనెను. బృహస్పతి సంవత్సరమునకు ఒక్కొక్క రాశియందు ప్రవేశించుచుండును. అట్లు బృహస్పతి ఆయారాసులయందు ప్రవేశించిన తొలి పండ్రెండుదినములందును దేవలోకమునుండి పుష్కరుడువచ్చి భారతదేశమునందలి ఆయాపుణ్యనదులయందు నిలుచును. పుష్కరుడు తీర్థములకురాజుగదా! కావున అతడు ఏనదియందు ప్రవేశించునో అచ్చటికి మూడుకోట్లఏబదిలక్షల తీర్థములు; సమస్తసముద్రములు; సర్వనదులు; అఖిలనిధులు; అరణ్యములు; ఋషులు; దిక్పాలకులు; దేవతలు; వాణి, లక్ష్మి, గౌరి; విష్ణువు, మహేశ్వరుడు వత్తురు. పుష్కరుడు పండ్రెండుదినములుండి తిరిగి దివ్యలోకమునకు పోవును. మిగిలిన వారెల్లరు సంవత్సరపర్యంతము అచ్చటనుందురు. ఈపుష్కరయోగము అతిపవిత్రమైనది, పుణ్యప్రదమైనది. పుష్కరయోగముల నదులయందు స్నానమొనరించి శుచియై దానాదికర్మలాచరించుటవలన పాపములు పోవును, శుభములుకలుగును. పుష్కరయోగకాలమున సమస్తతీర్థములును ఆయానదులయందు సన్నివేశమై యుండును గావున అప్పటి ఆనదియందలి స్నానము సర్వతీర్థస్నానమగును; ఒక్కచోచేరిన సమస్తదేవతలను ఒక్కసారిగ సేవించినట్లగును. పుష్కరయోగపుణ్యకాలమున గావింపబడు దానముల ఫలములు కోటిగుణితములుగా నగును. ఈపర్వకాలమున తీర్థవిధులు పెట్టుటచేతను, పిండప్రదానములు చేయుటచేతను పితృదేవతలను తృప్తులచేయవచ్చును. ఇచ్చటి పిండదానములనంది పితృదేవతలు తృప్తులై ఉత్తమలోకములకు పోవుదురు.

గురుడు మేషరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు సార్ధత్రికోటితీర్థసహితుడయి యేతెంచి గంగానదియందు ప్రవేశించును. గురుడు వృషభరాశియందు ప్రవేశించిన సమయమున పుష్కరుడు నర్మదానదియందుప్రవేశించును. గురుడు మిథునరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు సరస్వతీనదియందు సమావిష్టుడగును. గురుడు కర్కాటకరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు యమునానదియందు ప్రవేశించును. గురుడు సింహరాశియందు ప్రవేశించిన తరుణమున పుష్కరుడు గోదావరీనదియందు ప్రవేశమునుగాంచును. గురుడు కన్యారాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు కృష్ణానదియందు ప్రవేశము నొందును. గురుడు తులారాశియందు ప్రవేశించిన తరుణమున పుష్కరుడు కావేరీనదియందు ప్రవేశించును. గురుడు వృశ్చికరాశియందు ప్రవేశించినప్పుడు పుష్కరుడు భీమానదియందుప్రవేశించును. గురుడు ధనూరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు రథ్యానదియందు ప్రవేశమొందును. గురుడు మకరరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు భద్రానదియందు ప్రవేశమొందును. గురుడు కుంభరాశియందు ప్రవేశించిన సమయమున పుష్కరుడు సింధునదియందు ప్రవేశించును. గురుడు మీనరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు ప్రణీతానదియందు ప్రవేశమునుగాంచును.

అలసములైన నీనడల నందము పొందిక గన్న, దూర్పుగా
ప్పులు బరువెక్కియున్ మధురముల్, నులివెచ్చనలయ్యె; కెంప
గ్గులవెల్గ గక్కు మోవి కొనకున్ వలుపబ్బిన మృత్తికావరీ
మళములమించె; గ్రొందళుకు మప్పుకొనెన్ సకలాంగముల్ స

అరవిరిదమ్మి సోయగమునందిన నీ తెలివాలు గన్నులే
పరిచితమాధురీమహితభావనలన్ గొనితెచ్చి మోవికిం
గరపినవో విలాసములు కార్కొను చిర్నగవుల్; హృదంతర
స్ఫురిత మహాప్రకాశపరిపూర్ణత చూడ్కికి పట్టియిచ్చెడిన్.

అలమిన పండువెన్నెలలయందు చెమర్చిన మంచు ముత్తెపుం
దళుకుల చల్వలందడిసి నానిన యీ తెలిమబ్బుదొంతరల్
నిలువున పుల్కరింప పయినించు సమీరునిలోనితావి నీ
అలతి పిసాళియూర్పులకు నంటిన దేమొ విలాసవల్లరీ !

ఇదివరదాక గంటి వికసించిన నీనయనాంత రేఖలం
దొదిగిన ప్రేమవెల్లి; ఇపుడో విమలమ్ము పవిత్రమై సుధా
స్పదమగు మాతృవత్సలత జాల్కొని నీ పరిశుద్ధమూర్తినిం
గదిసి మనోజ్ఞభావముల నాహృదయంబును ద్రిప్పునెచ్చెలీ!

చెదరి యలంతిగాడ్పులకు చెక్కులనట్టువ ద్రొక్కు ముంగురు
గుదురుగ ద్రోయునోపికయు గోల్పడి పాలిన మోమువాంచి
య్యది తలపోయుచుంటి వబలా ! ఒడినింపగలాడు కిల్కు తే
బెదవుల మొల్కలెత్త పసిబిడ్డడు నీహృదయమ్ము నంటుచు

తొలగినయావనంపు పసతో అడుగామడగా మనోహరుం
గలసియుగూడ, నిద్దపుజగాముసుగుంగను గోవలేర్పుసి
గ్గులసొగపొందుడెందమున కోమలి! కిం అనబోవు పీడు గో
చిలికెడు నవ్వుతో నడుగు చెప్పుము యుష్మదభీప్సితంబులన్

సొగసులనంది పుచ్చుకొని చొక్కపుకంఠము జుట్టివచ్చు ఆ
నగలగుపింపవేమి? లలనా! బరువయ్యెనె యివ్విగూడ! చి
ర్నగవులు నీలిచూపుల పరంపర రెండును నుండెనేని లో
టగునా కో నీనిసర్గహృదయంగమరాగరసైకమూర్తికిన్ ?

చూలాలు

కడుపున గ్రొత్తతేని తొనకంగ నిగారపు గమ్మతావులం
గడలుకు ద్రోయుచున్ ధవళకాంతుల నించుకవాడి, చూడ్కికిన్
బొడవడు మల్లికాముకుళమున్ సరిబోలు నవీనమూర్తి ని
వ్వొడు నినుగన్న ఊరకయేవో తలపుల్ గుములై తలిర్చెడిన్.

బడలికముంపులోన పనిపాటల నిచ్చయె లేక చిట్టముల్
గడుకొన లేతనిద్దురల గందొవలన్ మొగిడించి కుచ్చెళుల్
మడతలు నంతదప్పని విరామము గొంటివి; ముందుముందు ఎ
క్కడ గడసేపు తీరుబడి గాంచవులే పసిపాపసేవలో.

మిసమిసలాడు కుందనపు మేలిపసందుల జిందు చంపక
ప్రసవదళమ్ములట్టు లొనవారిన నిద్దపుగోళ్లు మీటులన్
మసలవు; పుట్టతేనియల నట్టు గళమ్మున లొంగిపోయి వె
క్కసముగ గానమాధురుల గ్రక్కదు వీణయు మూగనోములన్.

జిలుగు వెలుంగులందు నకిలీపనిసేసిన నల్లమబ్బుతు
నకల నెరసంజప్రొద్దు లొడికమ్ముగ దీరిచియారవైచె ని
ట్టులమంగ రంగుచీరలు మిటారి! యొయారపుచూడ్కు లెత్తి మి
న్నులగను మింక మోడుపుగనుంగవలో దిగబెట్టు మాంద్యమున్.

చికిలిమెరుంగుసూపుల పచేళిమసెందని ముద్దరాలి పో
లిక మనసిచ్చియున్ వయసు లేతదనమ్మున నున్న నీకు తీ
యక మును దాచియుంచుకొనినట్టి మహాసుకృతమ్ము పండి నే
డాక పసిపాపనిన్ మమతలూరునటుల్ దయసేయు శ్రీమతీ!

ఇవమునమున్ని జాజిపువుబెత్తులు హత్తిన మేలితావులన్
రవరవపింపు సొంపుల హొరంగు లెసంగ తురంగలించు వే
కువవలె వేర్పులేని మనకూరిమిలో మొలకెత్తునట్టి ఆ
చివురుబదాల హొంబతిమచే కులమెల్ల తరించు నోసతీ!

[illegible]

కమలముతోడ వేకువల కందెరపుల్లయి తోట నీశుభా
గమనముఁజూచు పూవులుసిగ్గన్ గయిసేయకమున్నవోలె అం
దములను వేల్పుగద్దియకు దార్చుచున్, తొలిచూలు లేతడెం
దముగదలించి ఎట్టిపరిణామ మలర్చెగదే ప్రియంవదా!

మతి కరిగించివైచి బ్రతిమాలిన మిన్నక వెచ్చనూర్చి సాం
ద్రతములు జాలిమాపులను బైకెగద్రోయుచు కేలుదమ్మి ను
న్నితముగఁజుట్టి మోము గమనించుచు కన్బొమన్ సమించు నీ
యతివినయప్రవృత్తి గనిపంతన ఆగదు నవ్వు మానినీ!

పెనకువసందిటం బొదువ బిట్టుచలింపక కౌనుఁదీవ మ
న్ననగొను మున్నె నే దతిఘనమ్మయి నీయెడగౌరవమ్ము న
మ్మనమున బెంచు ప్రేమరసమాధురిగ్రోలెడి ముద్దరాల పీ
వనఘము మాతృపీఠమున కర్హతగాంచుట జీవితేశ్వరీ!

చిబుకము నెత్తి ముద్దుగొన చెక్కులనంటిన పాండిమంబు పై
కుబికెఁ గళమ్ము గద్గదికనూగె; వికస్వరలోచనాంతముల్
ప్రబలె సితచ్ఛవిన్; పలుకువాసి చలించెను మోవి నేడు నీ
యుబుసు లవేమొ క్రొత్తలయి యుల్లము నెల్ల గరంచు ప్రేయసీ!

కుతుకమునిండుకొన్న కనుకోసల మూపలవోసి నవ్వు లీ
ప్సితములు దిద్ది తీర్చి సరిచేసిన గొబ్బెమువద్ద పాడుచో
మతివడి సౌమ్యఁ శ్రీ పెరిమఁగని "వాంఛితసిద్ధిరస్తు తే
సతతమ్" అటంచు దీవనలు పల్కినదేమొ మదేకజీవినీ!

ఇనువురి తేజ మీయెడద నేవు వహించెను, ప్రేమవల్లరిన్
మురువులు నూపనుండె తొలిపూవు, యెడందసుఖంచు ప్రొద్దులన్
బరిసిన నీవు వెన్నెలలదారుల పోలుచు తేలియాడుచుం
దిరిగెడి ప్రావృడబ్దమువిధిన్ నయనమ్ములు చల్లచేయగన్.

ఇదిగో! నీగర్భకోశమం దిమిడియున్న
ఒకమహాతేజ మీకులముద్ధరించి
నిలుపు సర్వసర్వంసహావలయమందు
మంచిముత్తైనరుల్ దలవంచు యశము!

కృష్ణవేణీ!

కలుపాపహారనిపుణే!
సదమలపీయూషధారసంభరితే!
ఆంధ్రైకభాగ్యనిలయే!
మాతః! కృష్ణే! నమామి తేంఘ్రియుగమ్.

ప్రాచీనాంధ్ర వికాసాన్
కలకలనినదైశ్చ శ్రావయ స్యస్మాన్,
తుంగతరంగోద్భూతైః
అపినోమాతః ప్రబోధయస్యధునా?

ప్రాచీనకాల జాతామ్
నౌకావాణిజ్య సంపదం మహతీమ్
ఆంధ్రప్రాభవకౌశల
విసారిణీం హృద్గతాం వీక్షే.

విశ్వైకమోహన;
మపారరసప్రచారమ్;
సంపూర్ణభావ పరి
శీలితదివ్యలక్ష్యమ్;
సంస్తుత్యవర్ణ పరి
రంజిత; మార్యగీతమ్;
తీరస్థితం; హృదయ
హారి; స్మరామి శిల్పమ్.

అపారసకలాగమ
ప్రచురపాండితీసంస్కృతైః
పురఃకలిత స్వాధిప
ప్రచురకీర్తి దిఙ్నాగకైః;
కలావితతిమూలకే,
మహితవిశ్వవిద్యాలయే,
కృతం హృదివిభావ
యామ్యతుల మాంధ్రవిజ్ఞానకమ్.

సమస్తజనపాల నా
కలితస్వీయచిత్తాంబుజా;
మహాకలుషహారిణీ;
నిఖిలభక్తహృత్తోషిణీ
వశీకృతసుభర్గకా;
ప్రథితస్వర్ణదుర్గాంబికా
శిరోమకుటరత్నకం;
భవసిధన్యభావాచత్వమ్.

సుధామధురి మా
కలితదివ్యసారస్వత
ప్రసారనిపుణాశ్చ;
యేకవనకర్ణమర్మస్పృశః;
ప్రభూతయశసోఽభవన్
భవదుదారతీరాశ్రితాః
రసేషుమహతీంఖలు
ప్రకటసిద్ధిమాప్తాశ్చయే.

పురాత్వత్తీరేఽభూత్
ప్రవిమలయశః ప్రాప్తిసుభగః
సుకావ్య స్వారస్యో
న్మదితచిత్తాబ్జనికరః;
ప్రవీరో; ధర్మాణాం
సహజనిలయః; శ్చార్ద్రహృదయః
మహారెడ్డ్యాఖ్యాకః,
ప్రథితవిభవః రాజనికరః,

పురాత్వత్తీరేఽభూత్
ప్రవిమలకలాస్థాననిచయః,
మహాప్రాజ్యం రాజ్యం;
భువనతిలకం పండితకులమ్,
ఇదానీంతత్స్థానే పరిగత
మభానంచకలయన్,
మనోరంగే దూయే జనని!
సతతం పుణ్యనిలయే!

ఇతి, శ్రీ వేంకటేశ్వరస్య.



జూన్, ౧౯౩౩.

౨౮:—పచ్చయప్ప ధర్మములబోర్డుయొక్క ప్రత్యేక సభయందు శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రి గారు బోర్డు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

౩౦:—కడప. శ్రీమతి రామసుబ్బమ్మగారు, కె. కోటిరెడ్డి బి.ఏ. బారు అటులా, ఎమ్. యల్.సి. గారి సతీమణి, కడపజిల్లా ఎడ్యుకేషనల్ కౌన్సిలుకు అధ్యక్షురాలుగా ఎన్నుకొనబడిరి.

:—నెల్లూరు. జిల్లావిద్యాసంఘమునకు రా. సా. ఎం. ఎ., అబ్బాయినాయుడుగారు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—అనారోగ్యకారణమున శ్రీమతి పొణకా కనకమ్మగారు శిక్షాకాలము పరిపూర్తికాకముందే వేలూరుజయిలునుండి విడుదలచేయబడిరి.

జూలై, ౧౯౩౩.

౧:—మదరాసు. వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రిగారు తిరువత్తూరు బెంచికోర్టు అధ్యక్షులుగ ప్రభుత్వమువారిచే మూడవసారి నియమింపబడిరి.

౩:—లండను. ఉత్కళప్రతినిధులు ఇండియా మంత్రిని సందర్శించిరి.

౪:—బరంపురము. గంజాం ఆంధ్రమండలి వి. వి. జోగయ్యపంతులుగారి అధ్యక్షతను సభజరిపి గంజాంజిల్లా రద్దుచేయ రాదనితీర్మానించిరి.

౫:—దొరతనమువారిచే రాజమండ్రి మునిసిపల్ సంఘమునకు కమీషనరుగా నియమింప బడిన ఉండేశ్వరస్వామిగారు చార్జితీసికొనిరి.

౬:—ఆంధ్రవిశ్వవిద్యాలయము ఇనస్పెక్షను కమిషనువారిరిపోర్టు ప్రచురింపబడెను.

౭:—సర్ అల్లాడి కృష్ణస్వామిఅయ్యగారు యూరపుయాత్ర ముగించి చెన్నపురికి తిరిగివచ్చిరి.

:—కే. కే. (అభినవాంధ్రకవితాపితామహ) మండపాక పార్వతీశ్వర కవిగారి శతవార్షికదినోత్సవము విశాఖపట్టణమున శ్రీపింగళి లక్ష్మీకాంతముగారి అధ్యక్షతను జరిగెను.

౯:—డి. బ. జె. వెంకటనారాయణనాయుడుగారు వెంకటగిరిసంస్థానమునకు దివానుగా నియమితులై చార్జిపుచ్చుకొనిరి.

:—చీరాల. ౧౭-వ ఆంధ్రరాష్ట్రీయవిశ్వబ్రాహ్మణమహాజనసభ బ్రహ్మశ్రీ పట్నాల గోపాల స్వామి ఆచార్యులుగారి అధ్యక్షతను జరిగెను.

౧౦:—పాలకొల్లు మునిసిపల్ చైర్మన్ శ్రీఅడ్డేపల్లి సత్యనారాయణమూర్తిగారిపైన కొనిరాబడిన విశ్వాసరాహిత్యతీర్మానము వీగిపోయెను

:—బెజవాడ న్యాయవాద ప్రముఖులలో నొకరగు కొండపల్లి శ్రీరామచంద్రరావుపంతులుగారు చెన్నపురి జనరల్ ఆసుపత్రిలో మరణించిరి.

:—ఒరిస్సా సరిహద్దుసమస్యావిచారణ. ఇండియామంత్రికి తెలుగువారిపక్షమున విజ్ఞాపనము. శ్రీయుతులు సర్ కూర్మ వెంకటరెడ్డి నాయుడు, ఉన్నవ రామలింగంపతులు, పి. నారాయణరావు, వి. వి. నారాయణరావు, సుబ్బారావు, సీతాపతిగార్లు విజ్ఞాపనము చేసిరి. శ్రీవెంకటగిరికుమారరాజాగారు జబ్బుగానుండుటవలన సభకు రాజాలకపోయిరి.

౧౧:—లండనువిశ్వవిద్యాలయములో ఉన్నతవిద్య ముగించివచ్చిన డా. బి. హెచ్. ఎస్. వి. రాఘవరావుగారు ఎం. ఎస్. సి., పి. హెచ్. డి (లండను) ఆంధ్రవిశ్వవిద్యాలయమున కెమిస్ట్రీలెక్చరరుగ నియమింపబడిరి.

౧౩:—చెన్నపురి. అంధ్రమహాసభపక్షమునజరుపబడిన సభలో డాక్టరు అంకసుందరముగారు మలయా, సయాం, ఇండోచైనాద్వీపములందలి భారతీయులస్థితినిగూర్చి ఉపన్యసించిరి.

సంపాదకీయ సమాలోచన

బసవరాజు అప్పారావు కావ్యములు :—

కీ. శే. బసవరాజు అప్పారావుగారి కావ్య పుష్పములన్నియు మాలగాగ్రుచ్చి ఆంధ్ర సరస్వతీదేవి పాదాంకములచెంత సమర్పించుటకు ప్రయత్నము జరుగుచున్నదని వినుట



బసవరాజు అప్పారావు

కెంతయు సంతసించుచున్నాము. అప్పారాయని కాపురపుకాణాచియగు బెజవాడ యందలి ఆతని న్యాయవాదమిత్రులీప్రయత్నమునకు ఆద్యబ్రహ్మలై యున్నారు. రసిక హృదయులును, 'ప్రజామిత్ర' సంపాదకులును అగు శ్రీయుత గూడవిల్లి రామబ్రహ్మము చౌదరిగారు; ఆధునికాంధ్రకవిపుంగవులలో నొకరును, ఆంధ్రవిశ్వవిద్యాలయ గ్రంథాలయపాలకులును అగు శ్రీయుత అబ్బూరి రామకృష్ణారావుగారు మున్నగువారీప్రయత్నమునకు సర్వవిధముల సాయపడనుండుట సముచితముగనున్నది. అచిర కాలముననే ఈప్రయత్నము సఫలమగుగాక యని కోరెదము.

నంద్యాలలో ఇటలీదేశపు పాతనాణెములు :-

టి వి. సుబ్బయ్య (బి ఏ., బి. యల్) గారు జూలై 12-వ తేది 'ఆంధ్రపత్రిక'లో నిట్లు వ్రాయుచున్నారు: "నంద్యాల యస్. పి. జి. మిషన్ కాంపౌండువద్ద సర్వే నెంబరు 5819లో రంపపుకోత నిమిత్తము భూమిని త్రవ్వుచుండగా కొన్ని బంగారునాణెములు దొరికినవి. ఈవిషయము తెలిసినవెంటనే నంద్యాల స్టేషనరీ సబ్ మేజస్ట్రీటు అచ్చటికి వెళ్లి విచారణసలిపి సుమారు ఏబదిరెండు నాణెములను స్వాధీనముచేసికొనిరి. ఒక్కొక్క నాణెము సవరన్ కంటె కొంచెము బరువుగను, మిక్కిలి శ్రేష్టమైన బంగారముతో చేయబడినదిగను ఉన్నది. క్రీ. వె. రోములో రాజ్య మేలుచుండిన నీరోసీసర్ ప్రతిమ కొన్నిటిపైనను, ఆదేశపురాణిప్రతిమ కొన్నిటిపైనను ఉన్నది. స్పష్టమైన లాటిన్ భాషతో పేరు వగైరాలు కనబడుచున్నవి. నాణెముల కిమ్మతు వేయిరూపాయిలు ఉండవచ్చును." ప్రాక్తనకాలమున ఆంధ్రులు ఖండాంతరదేశములతో వ్యాపారము సాగించియుండిరనుటకు ఇవఱకే కొన్ని నిదర్శనములు కనుగొనబడియున్నవి. ఆనిదర్శనములకు ఈ నాణెములుకూడ బలమొసంగగలవు.

సముద్రమునకు చాలదూరముననున్న సంద్యాలయందు ఇవిదొరకుటయు, ఇవి క్రీస్తుపూర్వపువి యగుటయు చారిత్రికముగ వీని విలువ హెచ్చుచున్నది. ఆంధ్ర దేశపు చరిత్రపరిశోధకులు ఈ నాణెములు ఆంధ్ర దేశమునందే యుంచుటకును, వీని పూర్తివివరములు వెంటనే పత్రికలయందు ప్రచురింపబడుటకును ప్రయత్నింపవలసియున్నది.

శ్రీరామమూర్తిపంతులుగారికి సన్మానము:-

శ్రీరావుసాహెబు గిడుగు రామమూర్తి పంతులుగారు నేటి ఆంధ్రదేశపు మేధావులలో నొకరు సుప్రసిద్ధ శాస్త్రవేత్తయగు థామస్ ఆల్వాఎడిసనుతో శ్రీరామమూర్తిపంతులుగారికి ఒక్క బధిరత్వవిషయముననేగాక దీక్ష, ప్రజ్ఞవిషయమున కూడ సాదృశ్యముగలదు. భాషాసౌలభ్యమునకై శ్రీవారు గావించినకృషి అనంతము. జాతీయమైన భాషకొఱకు వారు శోధించిన గ్రంథములకు, అవలోకించిన శాసనములకు లెక్కలేదు. తెనుగు, సవర భాషల నిఘంటువు వారిదీక్షాపరత్వమునకు అక్షరరూపము. అట్టివారి డెబ్బదవ జన్మదినోత్సవము ఈ సంవత్సరము నవంబరుమాసమున రాజమహేంద్రవరమునందు జరుపుటకు ఏర్పాటులు గావింపబడుచున్నవి. ఈ ఉత్సవము రాజమహేంద్రవరమున జరుపుటలో నొకవిశేషము గలదని మాకు తోచుచున్నది. రాజమహేంద్రవరము (తూర్పు గోదావరిమండల మనుట బాగు) సాంఘిక విషయములయందు ముందడుగును, భాషావిషయమున వెనుకడుగును వైచుటకు పేరుకెక్కియున్నది. తూర్పు గోదావరిమండలము గ్రాంథికభాషకు పెద్దప్రాపగు ఒకమహారాజావారిమండలము. ఆ మండలముయొక్క తిలకనగరమగు కాకినాడయందు ఆంధ్రసాహిత్యపరిషత్తువారి పీఠముగలదు. ఆమండలమునందలి రెండవనగరమగు రాజమహేంద్రవరమునుండియే శ్రీరామమూర్తిపంతులుగారి యుద్యమముపై వజ్రాయుధము లేచినది. అట్టి మండలమున ఇపుడు శ్రీరామమూర్తిపంతులుగారి డెబ్బదవ జన్మదినోత్సవము జరుపబడనున్నదనుట శ్రీవారి యుద్యమవిజయమును సూచించుచున్నది. ఆ ఉత్సవదినమునాటికి శ్రీపంతులుగారి వ్యాసములు, ఉపన్యాసములు చేర్చి ఒకసంపుటమును; 'ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజము,' 'బాలకవి శరణ్యము', 'గద్యచింతామణి' అను వారి గ్రంథములును అచ్చువేయించుటకు జన్మదినోత్సవనిర్వాహకసంఘమువారు తలపెట్టియున్నారు. ఈతలంపు పచేళిమమగుటకు రెండువేల అయిదువందల రూపాయిలు కావలెను. భాషాపోషకులు, ఉదారులు అగు ఆంధ్రధనికులు విరాళములిచ్చి శ్రీరామమూర్తిపంతులుగారి భాషాసేవకు కృతజ్ఞత చూపగలరని నమ్ముచున్నాము.

శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి షష్టిపూర్తి:-

శ్రీతిరుపతి వేంకటకవులు ఆధునికాంధ్ర సారస్వతప్రపంచమున చిరకీర్తి నార్జించిరి. వారి విద్యావివాదములు స్వభావముచే సారస్వతమునకు విముఖులుగానుండు యువకులను గూడ సారస్వతప్రియులనుగా నొనర్చినవి. వారు కొన్నితావుల విద్యావిజయములను గూడ పొందియున్నారు. కవితావేశులగు ఈ శతావధానులకు ఆంధ్రదేశమంతయు కవితావిహారముసల్పు బయలై యుండినది. శ్రీనాథుని తరువాత ఇట్టి నిరాఘాటకవితావిహారము సల్పినది వీరేయని చెప్పవచ్చును. వీరు శతావధానముల సందర్భమున ఆయా విషయములనుగూర్చి చెప్పిన పద్యములు

తెనుగున ఖండకావ్యరచనకు దారితీసినవని చెప్పుటకు ఎసమున్నది. ఈకవులలో నిపుడు సజీవులై యున్న శ్రీ వేంకటశాస్త్రిగారికి షష్టి



పూర్తి సందర్భమున గొప్పఉత్సవమును, వారిగ్రంథముల సమగ్రముద్రణమును సాగింపబడుచున్నవి. రాజమహేంద్రవరము చెంత గల కడియము శ్రీవారి జన్మస్థలమైనను వారు బందరుపురమున పలువత్సరములు ఆంధ్రోపాధ్యాయులై యుండి ఆప్రాంతమునందలి యువకులలో పలువురు కవితారాధకులను వెలికిదీసియుండుటచే ఈ ఉత్సవమునకు బందరుపురము కార్యక్షేత్రముగ చేయుట యెంతయు ఒప్పియున్నది. శ్రీ వేంకటశాస్త్రిగారింకను పలువత్సరములు జీవించి శ్రావ్యమగు తమ పద్యపఠనముచేత ఉత్తేజమును, మధురమగు తమ హాస్యభాషణములచేత రంజకత్వమును కల్గించుచు ఆంధ్రకవితాసుందరిని సేవింప పరమేశ్వరు డనుగ్రహించునుగాక!

<u>ఆంధ్రరాష్ట్రము : బొబ్బిలిరాజావారు:—</u>

నెహ్రూని వేదిక, సైమనుని వేదిక ఆంధ్ర రాష్ట్రనిర్మాణావశ్యకతను పేర్కొనినవి. కాని ఆపేర్కొనుటను ఆంధ్రు లందుకొని తగినంత ఆందోళనము సాగింపని కారణమున ఆంధ్రరాష్ట్రనిర్మాణప్రశంస వెనుకబడినది. మొదటి రౌండుటేబిలు సమావేశమునకు పోయియున్న ఆంధ్రప్రతినిధియైనను ఈ ప్రశంస యెత్తుకొనలేదు. రెండవరౌండు టేబిలుసభలో శ్రీ బొబ్బిలిరాజావారు ఆంధ్రరాష్ట్రప్రశంస తెచ్చిరి. లండనులో ఆ ప్రశంస అంత కార్యకారి గాకుండినను దేశమునందు ఆంధ్రులను మేలుకొల్పి రాష్ట్రవిషయమున కృషిసల్పుటకు ఉత్సాహము పుట్టించినది. నాటినుండియు పత్రికలయందు ఈ విషయమై కొంతచర్చ జరుగుచునేయున్నది. ఆ ఉత్సాహమునకును, ఈచర్చలకును శ్రీ బొబ్బిలిరాజావారి అప్పటి ప్రయత్నమే కారణమనుట మఱువరానిది. దేశమునకు వచ్చినతరువాత శ్రీరాజావారు మద్రాసు మంత్రాంగమున ప్రవేశించిరి. అప్పటినుండి శ్రీవారి మనము ఆంధ్రరాష్ట్రనిర్మాణవిషయమున ఏలనో విముఖముగా జొచ్చెను. ప్రత్యేకాంధ్రరాష్ట్రము కావలెను, కావలెను అనిన నోటితోడనే ఆంధ్రరాష్ట్రము వద్దు వద్దు అనివారనగలిగిరి. లండనులో ఆంధ్రరాష్ట్రము కావలెనని చెప్పి ఆంధ్రదేశమున రాష్ట్రవిషయమున ఎంతటి ఉత్సాహమును, దీక్షను పురికొల్పిరో శ్రీవారు ఊటీలో ఆంధ్రరాష్ట్రము వలదని చెప్పియు ఆంధ్రదేశమున రాష్ట్రవిషయమున అంతటి ఉత్సాహమును, దీక్షను పురికొల్పుచున్నారు. చూడుడు బొబ్బిలిరాజావారి ప్రకటనముపై దేశమున రేగిన అలజడిని! కావున శ్రీవారికి ఆంధ్రమహాప్రజాసంఘము చిరకృతజ్ఞతను చూపగలదు. నాయకత్వమువహించియో, ప్రతినాయకత్వమువహించియో వారు ఆంధ్రరాష్ట్రనిర్మాతలు కాగలరనుట నిక్కము. గత

వత్సరపు 'కావలెను' ఈవత్సరమున 'వద్దు' గా మారినది. పైవత్సరమున ఈ'వద్దు'తిరిగి 'కావలెను'గా మారగలదేమో! ఈ నెల ౧౭-వ తేదీనాటి వారి పెద్దస్టేటుమెంటులోని తుదిభాగము ఈ మాసం దేహమునకు బల మొసంగుచున్నది. రాజ్యాంగమున తగిలియున్నవారిమాట నీటిపైవ్రాలుకంటెను అస్థిరమైనదనుదానికి బొబ్బిలిరాజావారు మఱియొకనిదర్శనమునుజూపిరి. ఊటీకొండలనుండి వినవచ్చిన బొబ్బిలిరాజావారి 'ప్రత్యేకాంధ్రరాష్ట్రము వలదను ఈ కేకను రెండుకోట్లమంది ఆంధ్రులలో ఒక్కరైనను వినిపించుకొందురని చెప్పుట సాహసమేయగును.

యస్. టి. పి. యూనియను వార్షికోత్సవము :

నరసాపురము తాలూకా ప్రోగ్రెసివు యూనియనువారి ముప్పదిరెండవ వార్షికో



దేశోద్ధారక, విశ్వదాత
శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు

త్సవము ఈమాసము ౧౬ వ తేదీని నరసాపురమున 'దేశోద్ధారక,' 'విశ్వదాత' బిరుదాంకితులగు శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి ఆధిపత్యమున జయప్రదముగ జరిగినదని వినుటకు సంతసించుచున్నాము. ముప్పదిరెండువత్సరములుగ పనిచేయుచు హరిజనులయందును, స్త్రీలయందును విద్యాప్రబోధము కలిగించుటకుగాను పాఠశాలలు నిర్వహించియు; పోటీపరీక్షలు ఏర్పఱచి నడుపుచు; ఉచితపఠనమందిరమును, గ్రంథభాండాగారమును స్థాపించి జరుపుచు ఆంధ్రదేశమునందలి ప్రజాహిత జీవితాభివృద్ధికి యథాశక్తిని దోహద మొసంగుచున్న నరసాపురము తాలూకా ప్రోగ్రెసివు యూనియనువారు ఆంధ్రదేశమునందలి సమస్తసదుద్యమములకును ఆశీఃప్రదాతలై ఆంధ్రమాతను సేవించుచున్న శ్రీనాగేశ్వరరావుపంతులుగారి ఉపదేశబలమున ద్విగుణీకృతోత్సాహముతో దేశసేవ గావింతురుగాక!

"వీరేశలింగవీరున కీకీర్తి పూజయా?"

అను గతమాసపు 'ఆంధ్రభూమి' సంపాదకీయ సమాలోచనలోని పంక్తుల నుద్ధరించుచు 'ధర్మసాధని' ఇట్లు వ్రాయుచున్నది:—

"శ్రీ వీరేశలింగపండితుని స్మారకచిహ్నవిషయమును తెలుగుదేశమునకు మఱియొకసారి జ్ఞాపకముచేసినందులకు "ఆంధ్రభూమి" ప్రశంసింపదగియున్నది. ఈ నడుమ బెంగుళూరునకు వెళ్లినపుడు శ్రీ వీరేశలింగము పేరట నొక సుందరధర్మపఠనమందిరము నిర్మింపబడియుండుట గాంచి సంతోషమును, లజ్జనుపొందితిమి. ఇటీవల ఆంధ్రమహాజనులు కవీశ్వరులను సమ్మానించుటలో నధికమైన ఉత్సాహమును కనబఱచుచున్నారు. ఆంధ్రభాషారామమునకు వెనలేని సేవసలిపిన శ్రీ వీరేశలింగమును మఱచిపోవుట పాడియా? కండ్లయెదుట కనిపింపని మాత్రమున కర్తవ్యమును మానుట తగునా? రాబోవు వార్షికోత్సవము నాటికి వీరేశలింగార్యుని శిలావిగ్రహ ప్రతిష్ఠకు బూనుకొనుట యుక్తము."

"ANDHRA BHUMI."

An illustrated monthly journal in Telugu.

(Published on the 25th of every month)

ANDHRA BHUMI seeks to interpret the renaissance in Andhra Art and Literature in the light of History. The journal is intended to reflect, as far as possible, modern culture and civilization in all their manifold aspects A considerable part of it is devoted to the economic, social and political uplift of the Andhras, and generally to all matters affecting their welfare and happiness.

One of the objects of the journal is to help forward the movement in favour of the advancement of the economic and social status of Indian Womanhood, and bestow particular attention to all matters of special interest in woman's sphere of life.

Besides this, contributions relating to Banking and Insurance form a special feature of the ANDHRA BUHMI.

A journal like this, which necessarily includes regular literary contributions of much interest to the average reader,will not fail to draw his pointed attention to the technical but nonetheless important subjects. As such the journal would form the best medium for advertisement.

REGULAR FEATURES OF THE JOURNAL.

LITERARY CONTRIBUTIONS: Including Short Stories, Life Sketches, Humorous Writings, Articles on Modern Science & Historical Research, Essays in Criticism, Art and Poetry.
EDITORIAL COMMENTS.
THE WOMAN WORLD.
THE SCIENCE OF INDIAN ORNAMENTS.
INSURANCE TOPICS.
THE LANDED ARISTOCRACY.
LIBRARY MOVEMENT.
ANDHRAS ABROAD.
HEALTH NOTES.
BOOKS REVIEUED.
DIARY OF THE MONTH. (By an Andhra.)

Editor and Publisher :

Andra Seshagiri Rao. B.A.,
56, Mukathala Street,
Vepery, Madras.

OPINIONS.

"Andhra Bhumi" is a welcome addition to the ranks of illustrated magazines in our country. The Publication contains very attractive features and interesting articles. We are much impressed with the ideal that the magazine professes to serve, viz., the happy consummation of the idea of Andhra Province. In the first issue more than one article is devoted to the professed subject and is written in a manner calculated to serve as an active propaganda for the Andhra Province. We wish the journal a long lease of life and a career of great usefulness to the Telugu Public.

—*The New Times.*

"Andhra Bhumi" is an illustrated Telugu Monthly Journal. Among its many objects, the promotion of Andhra unity and culture occupies the first place. The contributions appearing in this, the first issue augur well for its future. Several beautiful Poems embellish the pages of this issue. One short story appearing in this issue (which is very modern both in its conception and development) reveals the inner workings of the bureaucratic mind of an Indian Excise Inspector, while at the sametime reproducing a page from "the Short and Simple annals of the poor" in India. Separate Sections in the journal have been devoted to 'Women', 'Insurance', 'Health', etc. The journal is a very welcome addition to those very few which are now "in the field". It is to be hoped that it will obtain from the Telugu-reading public the encouragement it deserves.

—*The Hindu.*

"Andhra Bhumi" is a valuable addition to the ranks of Telugu Journalism. A monthly devoted to art. culture and literature, it is bound to be popular in Andhra Desa. A journal which serves as a vehicle of independent thought has been a long felt necessity in Andhra Desa and "Andhra Bhumi" it is to be hoped will satisfy that want. Valuable articles on subjects of topical interest by well-known writers are published in it, and its special feature is the attention paid to Health, Insurance and Art. Mr. Andra Seshagiri Rao, B.A., ex-editor, "Griha lakmi", edits this journal, and that is assurance enough that the journal will be conducted on independent and honest lines, keeping up to a high standard of journalism. The get-up of the journal is attractive and the subscription comparatively low, Rs. 3 *Per annum.* We wish Mr. Seshagiri Row's enterprise all success, and hope the Andhra Public will extend to him the encouragement the venture deserves.

—The Sunday Chronicle.

"We are in receipt of "Andhra Bhumi" which contained our advertisement. We have to congratulate you for your success. The get-up of the book is nice. Since this magazine is touching the social, political, religions, commercial and such other present topics we believe that the same will be patroni sed by the Public at large and advertisers as the demand for the same will be promising."

JAGANMOHINI INSURANCE CO., LTD. *Vizagapatam.* — (sd.) V.A. GUPTA, Managing Agents.

హస్తసాముద్రికము

"శ్రీ"

భవిష్యత్తును తెలిసికొనవలయునను అభిలాష మానవునకు పుట్టుకతో వచ్చినది. ఈ అభిలాషను నెఱవేర్చుకొనుటకుగాను అతడు తన బుద్ధిబలము నుపయోగించి జ్యోతిషము, సాముద్రికము మున్నగు శాస్త్రములను పెంపొందించియున్నాడు. ఈజిప్టు, గ్రీసు, రోము దేశముల చరిత్రలయందు ఈ శాస్త్రములు సత్యసమ్మతములనుటకు ప్రమాణములుగలవు. ఇక హిందూదేశమో! ఈశాస్త్రములకు పుట్టినిల్లే. కాని ఈశాస్త్రము లిపుడు హిందూదేశమున విశేషపరిశోధనయందు లేవు.

పాశ్చాత్యదేశములందు హస్తసాముద్రికమును ఉన్నతికి గొనివచ్చినవారిలో ముఖ్యుడు డిబరొల్లిస్ అను ఫ్రెంచిజ్యోతిష్కుడు. ఇతడు క్రీ శ 1801 యందు ఫ్రాంసు దేశమునకు ముఖ్యపట్టణమగు పారిస్‌నందు జనించి 1886లో అచ్చటనే చనిపోయెను. అతని శిష్యులు ఇప్పుడు పెక్కురు యూరప్‌యందును, అమెరికాయందును గలరు. డిబరొల్లిస్ చిన్ననాటనుండియు సాముద్రికమునందత్యంతకుతూహలముతో అభినివేశము చూపుచు దాదాపు 50 సంవత్సరముల యనుభవమును పొందినపిమ్మట హస్తసాముద్రికముపై రెండు పుస్తకములను రచించెను. అందుండు పెక్కు విషయములను ప్రమాణములుగ ఈనాటి సాముద్రికులుకూడ గ్రహించుచున్నారు.



చిత్రము I.

కాని హస్తసాముద్రికము పాశ్చాత్యదేశభవ్యమని చెప్పుటకు వీలులేదు. ఇప్పటి పాశ్చాత్యసాముద్రికమున లోకప్రఖ్యాతిగాంచినకౌంటు లూయి హేమను తానేర్చిన విద్యయంతయు భారతదేశమునగల ప్రాచీనసాముద్రికశాస్త్రగ్రంథములలోనిదే అని నొక్కి చెప్పుచున్నాడు. భారతదేశమునకు వచ్చి తీసికొనివెళ్లిన ప్రాచీనగ్రంథములు ఇప్పుడుకూడ తనవద్ద గలవట. తనవద్ద 60,000 తక్కువకాని హస్తముల ముద్రణములున్నవనియు, తాజూచిన హస్తములు లెక్కకు మించినవనియు ఇతడు తనపుస్తకమునందొకచోట వ్రాసికొనియున్నాడు. యూరపునందలి పెక్కు దేశాధీశులు, సేనానాయకులు, మంత్రులు మొదలగువారి హస్తముల నీతడు పరీక్షించి [బొంబాయి] 'టైమ్సు ఆఫ్ ఇండియా' యందును, తానురచించిన పెక్కు పుస్తకములయందును ఈ హస్తములను గుఱించి వ్రాసియున్నాడు. ఇతడే "కైరో."

ఆంగ్లేయ ఫ్రెంచిభాషలందు సాముద్రికమును గురించి వ్రాసినపుస్తకములు పెక్కులుగలవు. హీరర్ అలర్, అలర్ లియో, సెయింట్ జర్మైన్ అనువారు జీవించియున్న సాముద్రికశాస్త్రగ్రంథకర్తలలో ముఖ్యులు. వీరుగాక ఇతరులువ్రాసిన పలు గ్రంథములను చదివియుండుటచేతను, దాదాపు పదమూడు వత్సరముల కెక్కువగ నా కీశాస్త్రమునందనుభవముండుటచేతను ఈ పత్రికాసంపాదకుల కోర్కెపై హస్తసాముద్రికమును గురించి కొన్ని వ్యాసములిందు వ్రాయబూనితిని.


౧

సాముద్రికశాస్త్రము రెండు భాగములుగ విభజింపబడినది. హస్తములు, వ్రేళ్లు, నఖములు వీని ఆకారమునుబట్టి వ్యక్తిస్వభావము గనుగొనునది మొదటిభాగము. వ్రేళ్ల లోభాగమునందు అరచేతియందుగల రేకలనుబట్టి మనుజుని స్వభావమేగాక, ఆతని జీవితమునందు జరిగినవియు, జరుగబోవునవియునగు ముఖ్యవిషయములను తెలుసుకొనునది రెండవ భాగము. ఈ రెండుభాగములు కలిపి చదివినగాని సాముద్రికజ్ఞానము సంపూర్ణము కాదు. ఒకేరేఖ రెండురకములకు జెందిన వేరువేరు హస్తములపై వేరు వేరు ఫలములనిచ్చుచున్నది.

సాముద్రికశాస్త్రమునందు రెండవభాగముగ పైన పేర్కొన్న రేఖాజ్ఞానభాగమునందలి ముఖ్యాంశములు ఈ సంచికయందు తెలుపబడును. ఇందు వ్రాసిన విషయములను చదువరులు చక్కగ గ్రహించినగాని ముందు వ్రాయబోవు విషయములు అర్థముగావు.

ఇందుగల చిత్రములో నెం 1. ముఖ్యముగు రేఖలు మాత్రము పేర్కొనబడినవి. 1-1. జీవ, 2-2. శిరో, 3-3. హృదయ, 4-4. అదృష్ట, 5-5. సూర్య, 6-6. కుజ, 7-7. ఆరోగ్య, 8-8. వివాహ, 9-9. శుక్రునివక్ర రేఖలు.

నెం 2. చిత్రము. అంకెలువేసి చుక్కలతో ఏర్పరుపబడిన స్థానములపేళ్ళు ఇవి:— 1. గురుస్థానము, 2. శనిస్థానము, 3. రవిస్థానము, 4. బుధస్థానము 5. చంద్రస్థానము 6. శుక్రస్థానము, 7. కుజుని లోస్థానము, 8. కుజుని పైస్థానము.




చిత్రము 2.

గురు, శని, రవి, బుధస్థానములను గనుగొను విధము.

హస్తములను సూక్ష్మదృష్టితో పరిశీలించినయెడల, అరచేతి చర్మమునందే ఇమిడియున్న నూలుపోగులవంటి అణురేఖలు కానగును. ఇవి అరచేతియందు అన్నివైపులకు వ్యాపించుచున్నవి. హృదయరేఖకు పైభాగమున ఈ అణురేఖలు మూడవచిత్రమును పోలియుండును. ఈ చిత్రమునందు అంకెలతో గుర్తుపెట్టిన స్థలములే గురు మొదలగుస్థానములు. (చిత్రము 3.) రెండవచిత్రమున చూపబడిన స్థానములందు ఈఅణురేఖలచే ఏర్పాటుపబడిన కేంద్రములు వ్యత్యస్తములై యుండుచుండును.

ఇట్టి వ్యత్యస్తమువలన వేరువేరుఫలములు వచ్చుచున్నవి. ఈ మూడవచిత్రమున గురుని కేంద్రము (1, చిత్రము 3) మాత్రము యథా స్థానమున నున్నది. ఇట్లుండుటవలన దాని యొక్క సుగుణములు పూర్తిగ పట్టియున్నవి. శని 2, రవి 3, బుధ 4, కేంద్రములు ఉండవలసిన స్థానములకంటె పైప్రదేశముల కెక్కియున్నవి. ఇట్లు యథాస్థానచ్యుతములగుటచే నివి ఫలవిషయమున బలహీనము లగుచున్నవి. ఈ చేతియందు శని రవి కేంద్రముల బలహైన్యమును పొందియున్నను వానికి యథోచితములైన అదృష్ట రేఖయు (౧), సూర్య రేఖయు (౨) స్ఫుటముగ నుండుటచే వారికి ధన సంపత్తియు, విద్యాసంపత్తియు కలిగించినవి. బుధ కేంద్రమున నిట్లు సహకారియగు రేఖాసంజ్ఞ యేమియు లేకపోవుటచే వీరు న్యాయవాదులై యుండియు వాగ్ధాటి లేనివారుగా నున్నారు. ఏదిఎట్లున్నను గురుని కేంద్రము యథాస్థానమున నుండుట వీరు అదృష్టవంతులై ప్రజాగౌరవమును బడయుటకు కారణమైనది.



చిత్రము 3.

ఈచేయి చెన్నపట్టణమునందు న్యాయవాదిగనుండి సాలునకు దాదాపు 15 వేలను ఎక్కువగ నార్జించువారి హస్తమునందలి అణురేఖలను చూపునది. ఈ రేఖలచే ఏర్పడుచున్న 1, 2, 3, 4 అను గుర్తులచే తెలియచేయబడినవి క్రమముగ గురు, శని, రవి, బుధస్థానములు. ౧ అదృష్టరేఖ యందలిభాగము. ౨ సూర్యరేఖ యందలి భాగము.

౨

ఒకవ్యక్తికి రెండుచేతులయందు గల రేఖలు, గ్రహస్థానములు, అందలి ఎత్తుపల్లములు ఒకవిధముగనుండవు. ఇట్టి వ్యత్యస్తమునకు సాముద్రికశాస్త్రమునందు వివరణముగలదు. ఎడముచేతియందుండు రేఖలు స్వతస్సిద్ధమైన గుణములను తెలియజేయునవి. కుడిచేతియందుండు రేఖలు వ్యక్తి యొక్క స్వయంకృషిచేతను: జీవితమునం దనుభవించిన కష్టసుఖములచేతను స్వభావమెంతవఱకు మార్పు చెందుచున్నదో వెల్లడిచేయునవి. రెండుచేతులందును రేఖలు ఒకేవిధముగనున్నచో వ్యక్తి చిన్ననాటను ఏగుణములు గల్గియుండెనో పెద్దవాడయినప్పుడు కూడ ఆగుణములే గల్గియున్నాడని తెలుసుకొనవలయును. ఎడమ చేతియందు జీవరేఖ బలహీనముగను, అస్ఫుటముగను ఉండి కుడి చేతియందు దిద్దినట్లున్న, ఆవ్యక్తి చిన్నతనమందు స్వభావసిద్ధముగ బలహీనుడనియు, పిమ్మట వ్యాయామాదికృషులచే తన దేహదార్ఢ్యమును చక్కబెట్టుకొనెననియు చెప్పవలయును. ఇట్లే ఎడమచేతియందు శిరోరేఖ (1-వ చిత్రమునందలి 2-2 రేఖవలె) ధనువునుపోలి వక్రాకారము దాల్చి చంద్రస్థానమునందంత మొందుచు, కుడిచేతియందు తిన్ననిదై చంద్రస్థానమునకు దిగకుండ కుజుని పై స్థానమునకు (రెండవపటమునందలి ౨-౨ వ రేఖవలె) వ్యాపించుచో అట్టివ్యక్తి విద్యాభ్యాసము ముగియువఱకు కవిత్వాలక్షణ

ములు గల్గి మానసికాభిలాషలు; చిత్రము, శిల్పము, మొదలగు లలితకళలయం దభిరుచిగల్గి జీవనోపాధికై ఈవిద్య లంతగ ఫలింపవని అనుభవమూలకముగ తెలిసికొని లోకవ్యాపారానుగుణమైన వడవడియు, ఉద్యోగమును పొందుచున్నాడు. అట్టివ్యక్తి కుడిచేతియందు అదృష్టరేఖ జీవరేఖతో ఎట్టి సంబంధము లేక (4-4 రేఖ నెంబరు 1 చిత్రము) మణికట్టునుండి రెండవ వ్రేలివరకు తిన్నగ వ్యాపించినయెడల అతడు ధనాదాయము ముఖ్యోద్దేశముగ చేసికొని తాత్కాలిక స్థితిగతుల కనువగుమార్గమరసి అందు కృతార్థుడగుటకు సందియ మెంతమాత్రము లేదు. ధనరేఖ ఎడమచేతియందు జీవరేఖనుండి గాని (౨ చిత్రములో రేఖ ౮-౮). శుక్రస్థానమందుండిగాని (౮-౯ రేఖ. రెండవచిత్రము) బయలువెడలుచు, కుడిచేతియందు మణికట్టునుండి బయలువెడలుచున్న యెడల అట్టి హస్తములు గల్గువ్యక్తి తన జీవితమునందు ప్రథమభాగమున గృహసంబంధమైన కట్టుబాట్లు తనజీవనమునకు ప్రతిబంధకములగుటయు, తనజీవితమున రెండవభాగమునందు అనగా 30 లేక 35 ఏండ్లువచ్చునప్పటికి గృహబంధనములనుండి విముక్తుడై స్వయంకృషివలన జీవించుచున్నాడు.

ఇట్లు రెండుచేతులయందు రేఖలు భేదములైనచో పై జెప్పినవిధమున వ్యక్తియొక్క జీవము గొప్పమార్పులను పొందుచున్నది. అట్లుగాక రెండు చేతులయందును ముఖ్యరేఖ లించుమించుగ నొకేవిధముగ నున్నయెడల అట్టివ్యక్తి జీవితమునందు మార్పులు లేక తానేస్వభావమును, స్థితిగతులు చిన్ననాడు కలిగియుండెనో అట్టిస్వభావముతోడనే అట్టిస్థితిగతులతోడనే అతడు మృతినొందుచున్నాడు. అతడేమియు గొప్పకార్యముల చేయులేడు. తన మిత్ర బంధువర్గములందు అందరితోపాటు ఒకడై యుండునేగాని కృషి చేసి తానుండు స్థితికంటె ఔన్నత్యమును పొందలేకుండును. అట్టివ్యక్తి హస్తములు మృదులములును మాంసలములును అయి యుండినయెడల అతడు బద్ధకస్థుడును సుఖాపేక్ష కలవాడును అయి కష్టపడనొల్లక వృథాకాలక్షేపము చేయుచు జీవి యగుచున్నాడు.

రెండుహస్తములందును రేఖ లెట్లున్న మంచిదో ఇచ్చట వివరించెదను. కుడిచేతియందు రేఖలు స్ఫుటముగనుండవలెను. జీవరేఖ ఖండముగాక యుండవలెను. (1-1 రేఖ చిత్రము 1) గురుస్థానమునకు దిగువను శిరోరేఖ జీవరేఖతో అంతగ నైక్యము కాకుండ నుండి ఎక్కువగ వంగక చంద్రస్థానమునకుపై భాగమునకుగాని (2-2 రేఖ చిత్రము-1) కుజుని పై స్థానమునకుగాని (౩-౩ రేఖ రెండవ చిత్రము) వ్యాపింపవలయును. హృదయరేఖ గురుస్థానము నుండిగాని (౧-౧ రేఖ చిత్రము రెండు), గురు శనిస్థానములమధ్య నుండిగాని (3-3 రేఖ చిత్రము-1), బయలుదేరి బుధునిస్థానమునకు క్రిందివఱకు వ్యాపింపవలయును. అదృష్టరేఖ మణికట్టునందు మొదలిడి శిరోహృదయరేఖల నతిక్రమించి విరుపులుమలికలు లేక శనిస్థానమువరకుగాని (4-4 రేఖ చిత్రము-1), గురు, రవి స్థానములకుగాని వ్యాపించియుండవలెను. అట్టిహస్తమునందు సూర్యరేఖ ఏమాత్రమున్నను (౬-౬ రేఖ రెండవపటము) ఆవ్యక్తి లోకఖ్యాతినిగడించును. ఇట్లుగాక ముఖ్యమగు ఈరేఖలు వ్యత్యస్తములైనను, భంగాది దుర్లక్షణములు కలిగియున్నను కానగు ఫలములు పై మాసపు సంచికలో వివరింపబడును.

విడ్డూరములు

౯. రెక్కలు గల పిల్లి.

ఆమ్స్టర్డ్యాంనందలి జంతుప్రదర్శనశాలకు ఈనడుమ ఒకపిల్లివచ్చెను. దానికి వెనుకటికాళ్ళదగ్గర ఇరుపార్శ్వముల చెంతయొక పక్షిరెక్కయు నుండెను. ఆరెక్కల యందు ఈకలు బాగుగనుండెను. ఒక్కొక్కరెక్క ఒకఅడుగుపొడుగు ఉండెను. ఆపిల్లి ఆరెక్కలను పక్షివలెనే అల్లల్లాడించుచుండును. ఈవింతజంతువు ఎవరిదో, ఎక్కడినుండివచ్చినదో తెలియరాదు.

౯. ముక్కు విలువ ఎనిమిది వేలరూపాయలు.

లావింకెల్సునందు ఒకస్త్రీ మోటారుప్రమాదము వలన తన ముక్కుయొక్క కాంతి చెడెననియు, దానికి పరిహారము ఇప్పింపవలసినదనియు కోర్టులో దావా తెచ్చెను. విచారించి ఆమెకు కోర్టువారు నాలుగువందల పౌనులు (సుమారు ఎనిమిదివేలరూపాయిలు) పరిహారమిప్పించిరి.

౯. ఒకచెట్టున ఎనిమిదిరకముల సీమరేగుపండ్లు.

చికాగోనగరమునకు చెంతగల ఓక్‌పార్కుగ్రామపు ఆరోగ్యశాఖాధికారియగు డాక్టరు ఫ్రాంకునీడ్ హాప్ గారి పెరటిలో నొకచెట్టుగలదు. ఇది ఇరువది సంవత్సరములకుపూర్వము నాటబడినది. నాటినుండియు డాక్టరుగారు ఆచెట్టుకు పలురకముల సీమరేగులను అంట్లుకట్టుచువచ్చెను. ఇప్పు డాచెట్టు ఎనిమిదిరకముల సీమరేగుపండ్లను కాయుచున్నది. శీతలనుబోలిన సీమరేగులు; కూరకు పనికివచ్చు సీమరేగులు; ఫలాహారములకై పనికివచ్చు పలురకముల సీమరేగులు ఆచెట్టున గలవు. శీతలనుబోలిన రకపు సీమరేగులను కాయుకొమ్మ ఈయేడు ఒకపక్షమునందే రెండుసారులు కాసినది. ఈ రెండవకాపంతకాపు ఇంతవఱకెప్పుడును కాయలేదు.

౯. తొంబదిరెండేండ్లవృద్ధ చచ్చిబ్రతుకుట.

టోకియోయందు ట్యూసర్ కిసోసతి అను తొంబది రెండేండ్లస్త్రీ చనిపోయెను. ఆమెశవమును పీనుగుపెట్టెయందుంచి బంధువులు అపరక్రియాకలాపమునకు గడంగిరి. కాని ఇంతలో పీనుగుపెట్టెనుండి ఒకవిధమైన శబ్దము వినవచ్చెను. అందుమీదపెట్టెమూతనుఎత్తిరి. ట్యూసర్ కిసోసతి నెమ్మదిగలేచి పెట్టెనుండి బయటకువచ్చి తన మరణసందర్భమున చేయబడుచున్న అపరక్రియాకలాపవశమున అక్కడి వేదికపై నుంచబడిన బియ్యపుఅట్లను తినుటకు ప్రారంభించెను.

౯. స్నానముచే తిరిగి యౌవనమునిచ్చు ఉష్ణజలగుండము.

ఏషియామైనరునందలి మైసియాదేశమునకు చెందిన పెర్గామస్ నగరము బహుప్రాచీనమైనది. అది క్రీస్తుపూర్వము ౨౮౩-వ సంవత్సరమున ఒక చిన్నరాష్ట్రమునకు రాజధానియైయుండెను. ఆనగరముచెంత ఇప్పుడొక ఉష్ణజలగుండము కనుగొనబడినది. ఆ ఉష్ణజలగుండమున స్నానముచేయువారు పోయిన యౌవనమును తిరిగి పొందగలరు; వారు సుందరశరీరులును అగుదురు. ఆ గుండమునందలి జలములకు ఇట్టి మహత్తరశక్తినిచ్చిన భౌతికరసాయనికపదార్థములం దేమిగలవో పరిశోధించి తెలిసికొనుటకు జర్మనుశాస్త్రజ్ఞులజట్టు అక్కడకు పోవుచున్నది.

౯. దినమునకు తొంబదిరెండు శిశుహత్యలు.

శిశుహత్యలు చీనాదేశమున నేడుకూడ విశేషముగ జరుగుచున్నవి. ౧౯౩౭-వ సంవత్సరమున ఒక్క హాంగో పట్టణమునందే దినమునకు సగటున హత్యచేయబడిన శిశువుల శవములు తొంబదిరెండు వీధులయందును, సందులయందును, ఉప్పుటేరులయందును కానబడెను.

మహిళాలోకము

సోవియట్ రష్యాలో స్త్రీలు

సోవియట్ సంఘమునందు స్త్రీల న్యాయసంబంధమైన హక్కుల విషయమునను, సాధారణానుభవముల విషయమునను బోల్షివిక్ విప్లవము గొప్పమార్పులను గొనివచ్చినది. జారు ప్రభుత్వకాలమున రష్యాదేశపుస్త్రీకి ఎట్టి హక్కుగాని లేకుండెను. వివాహమగువఱకు తండ్రియొక్క నిరంకుశాధికారముక్రింద, వివాహానంతరము భర్తయొక్క నిరంకుశాధికారముక్రిందనుండి అప్పటి రష్యాస్త్రీ ఇంటియందు దొకదాసియై యుండెను. భర్తలు భార్యలను కొట్టుటయనునది వింతవిషయముకాదు. తనపేర కుటుంబపుటాస్తిలోని ఒకభాగమైన ఉంచుకొనుటకు ఆమెకు హక్కులేదు. ప్రభుత్వకార్యాలయములందుగాని స్థానికప్రభుత్వసంస్థలయందుగాని నారి యుద్యోగము చేయుట చట్టసమ్మతముకాదు. వ్యాపారప్రపంచమున బాధ్యతతోకూడిన పదవియందు దేనియందును స్త్రీ ఉండియుండినదనుటకు నిదర్శనము ఒక్కటియైనను కానము.

బోల్షివిక్ విప్లవానంతరము సోవియట్ నారి నూత్నప్రపంచమున ప్రవేశించినట్లయ్యెను. ఆమెకు పూర్తి దాస్యవిమోచనమయ్యెను. రాజ్యాంగపునర్నిర్మాణమున, సాంఘికపునర్నిర్మాణమున ఈవఱకు మానవుడు త్రొక్కిచూడని క్రొత్తదారులవలంబించిన లెనిన్ మహాశయుడును, అతని సహకారులును సోవియట్ రష్యాలో స్త్రీకి క్రొత్తఅంతస్థు నిచ్చిరి. పురుషునకుగల సర్వమైన హక్కులును స్త్రీలకుగూడ ప్రసాదింపబడినవి.

కలిగినమార్పు సంపూర్ణమైనది. ప్రభుత్వమునందును, వ్యాపారమునందును కోరికగల ఏస్థానమునేని ఆమె ఇపుడు పొందగలదు. పొందగలదననేల? ప్రభుత్వమువారు నియమించు కమీషనులయందును, పెద్దపెద్ద వ్యాపారసంస్థలపాలకవర్గమునందును సోవియట్ స్త్రీలు బాధ్యతతోకూడిన ఉన్నతపదవులను పొందియేయున్నారు.

సోవియట్ రష్యాయందు భూమి అంతయు ప్రభుత్వమువారిది. ఆయాప్రదేశముల వ్యవసాయపు కార్యములను చక్కబెట్టుటకు ప్రత్యేకసంఘములు గలవు. అట్టి సంఘములలో సభ్యురాండ్రయియున్న స్త్రీలు నేడు సోవియట్ రష్యాయందు 150,000 మంది గలరు. ఆల్ యూనియన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీయందును నూట ఎనుబదియైదుగురు నారులు సభ్యురాండ్రుగ నున్నారు. కమ్యూనిస్టుపార్టీసభ్యులు మూడు మిలియన్లు. ఈమూడు మిలియన్లలో ఆరవవంతు స్త్రీలు. వ్యవసాయసంబంధమైన పనులకై నిర్దేశింపబడిన పెద్దపెద్ద మోటారుబండ్లను నడుపువారిలో ఇరువదియైదు వేలమంది స్త్రీలుగలరు. 1928-వ సంవత్సరములో ఫ్యాక్టరీలయందును, దుకాణములయందును 404,200 మంది స్త్రీలు పనిచేయుచుండువారు. 1931 సంవత్సరమునాటికి ఆసంఖ్య 1,720,700 వఱకు పెరిగినది. వివిధములైన

పరిశ్రమలన్నిటియందును స్త్రీలసంఖ్య త్వర క్రమమున పెరుగుచున్నది. యంత్రముల నిర్మించు కర్మాగారములయందును, బట్టల నేయు యంత్రశాలలయందును, లోహపరిశ్రామికశాలలయందును, రసాయనికశాలలయందును బొగ్గువేయుపని మొదలు ఇంజనునడుపు పనివఱకు—నారులు చేయుచున్నారు. పురుషులలోకంటె నారులయందు ఈ సాంకేతికవిద్యాపరిజ్ఞానము ఆదినమున కాదినము హెచ్చుచున్నది.

స్త్రీలలో ఈవృత్తివిద్యాపరిజ్ఞానము యొక్క హెచ్చుదలకు ప్రత్యేకకారణములు గలవు. జీవనోపాధిని కలిగించు ఈ వృత్తివిద్యాపరిజ్ఞానము స్త్రీలలో పెంపొందుటకై ప్రత్యేకావకాశములు కల్పింపబడినవి. ఐరోపామహాసంగ్రామకాలముదనుక రష్యాదేశమున వృత్తివిద్యాపాఠశాలలలో స్త్రీలకు ప్రవేశము లేకుండెను. యుద్ధానంతరము ఈ పాఠశాలలయందు పురుషులతోబాటు స్త్రీలకుగూడ ప్రవేశమొసంగబడెను. ఈ సదవకాశమును జారవిడువక స్త్రీలువృత్తివిద్యాశాలలయందు సంతోషపూర్వకముగ ప్రవేశించి క్రొత్త ఉద్యోగములను పొందుటకు యోగ్యతను సంపాదించిరి. ఈ సందర్భమున క్రింది అంకెలు గమనించుటకు ముచ్చటగ నుండును. 1925-వ సంవత్సరమున వృత్తివిద్యాపాఠశాలలలో ఒకరకపువానియందు 6,800 మంది విద్యార్థినులుండిరి. 1932-వ సంవత్సరమునకు ఈసంఖ్య 47,000 కు పెరిగెను. మఱియొకరకపు వృత్తి విద్యాపాఠశాలలలో 1925-వ సంవత్సరమున 71,600 మంది స్త్రీలుండిరి; 1932-వ సంవత్సరమున వారిసంఖ్య 272,800 దాటెను. వృత్తివిద్యావబోధమునకైన ఉన్నతపాఠశాలలయందు 1925-వ సంవత్సరమున 50,700 మంది విద్యార్థినులును, 1932-వ సంవత్సరమున 145,400 మంది విద్యార్థినులును ఉండిరి. సహకారసంఘములతోడను, ప్రతినిధిసభలతోడను విశేషసంబంధము కలిగియుండ నిర్వహింపబడుచున్న పౌరసత్వ విజ్ఞానపాఠములు క్రమముగా స్త్రీలోకము నాకర్షించుచున్నవి. కడచిన ఆరు వత్సరములలో పౌరసత్వవిజ్ఞాన పాఠ్యక్రమమున 10,000,000 మంది స్త్రీలు పాల్గొనియుందురని అంచనా వేయబడెను. 1932-వ సంవత్సరమున 8,000,000 మంది స్త్రీలు చదువను, వ్రాయను నేర్చుకొనిరని రష్యాదేశపు ప్రభుత్వపత్రికలు ప్రచురించుచున్నవి. ఇందు కొంత అతిశయోక్తి కలదని మనము ఒప్పుకొన్నను సోవిటు రష్యాయందు స్త్రీలు తమ దేశపు ప్రజాహితజీవితమునందును, పరిశ్రమలయందును, వ్యవసాయవృత్తియందును సముచితకార్యనిర్వహణమునకై తగుతరిఫీయతును పొందుటలో గొప్ప అభివృద్ధి గాంచిరని అంగీకరింపక తీరదు.

కమ్యూనిస్టు పార్టీకి అనుబంధముగ స్త్రీల కొరకు కేంద్రసంఘముగలదు. ఆకేంద్రసంఘమువారు నారుల హక్కులను పరిరక్షించుటలోనేమి, వానిని పెంపొందించుటలోనేమి మిక్కిలి శ్రద్ధకలిగియుండురు. నారుల క్షేమాభివృద్ధికరమగు విషయములను ప్రచురించుటకును, వారికి సంబంధించిన సమస్యలను చర్చించుటకును ఆ కేంద్రసంఘమువారు పలుపత్రికలను ప్రచురించుచున్నారు. 1933-వ సంవత్సరపు మార్చి ఎనిమిదవ తేదీని మాస్కోనగరమున జరుపబడిన అంతర్జాతీయ స్త్రీలదినముయొక్క ఇరువదియవ వార్షికోత్సవ సందర్భమున పంద్రెండుగురునారులకు ఆర్డర్ ఆఫ్ అరీన్; పదునేడుగురు నారులకు ఆర్డర్ ఆఫ్ ది రెడ్ బ్యానర్ ఆఫ్ లేబర్

అను ప్రశంసలును ఈయబడెను. 'రాబట్ నీట్సా' (ది వుమన్ వర్కర్) అను మాసపత్రికకుకూడ దిఆర్డర్ ఆఫ్ ది రెడ్ బ్యానర్ ఆఫ్ లేబర్ అను ప్రశంస ఒసంగబడెను.

గవర్నమెంటు ఉద్యోగములకు, వివిధ వృత్తులకు, వ్యాపారనిర్వహణమునకు తరిబీయతు చేయుటయేగాక సోవియట్ ప్రభుత్వమువారు నారులకు సైనికశిక్షణముకూడ నిచ్చుచున్నారు. అయితే ఈ సైనికశిక్షణము నిర్బంధముకాదు, ఐచ్ఛికము మాత్రమే. విశేషసంఖ్య స్త్రీలను ఈ సైనికశిక్షణము దిక్కునకు ఆకర్షించుటకుగాను ప్రభుత్వమువారు మంచి ప్రయత్న మొనరించుచున్నారు. స్త్రీలకొఱకైన సైనికశిక్షణశిబిరములయందు వారి శెలవుదినములను వెళ్లబుచ్చుటకు నారులను ప్రభుత్వమువారు ప్రోత్సహింతురు. ఆ శిబిరములయందు నారులకు మిలటరీ డ్రిల్లును, సైనికు లవలంబించు పద్ధతులయందలి యుక్తిప్రయుక్తులును నేర్పబడును. ఈ శిబిరములందుండుట కగు వ్యయము స్వల్పమాత్రము. రెండు వారముల ఉనికికగు వ్యయమంతయు ఒక డాలరు, ఏబదిసెంట్ల ధనముతో తుదముట్టును. ఈ శిబిరములందు యుద్ధవీరమునకు బీజావాపము జరుగును. ధనశక్తిని కొలుచు దేశములన్నియు సోవియట్ రష్యాపై ఎత్తివచ్చుటకు పన్నాగములు పన్నుచున్నవనుట పలుపారులు హెచ్చరింపబడుచుండును. ఈ శిబిరములందు సైనికశిక్షను పూర్తిచేసికొనిన వారు తమగ్రామములకు తిరిగి వెళ్లిపోయిన తరువాత ఈవృత్తాంత మచటివారలకు నివేదించుచుందురు.

ఈపైన చెప్పిన విషయముల నన్నిటిని పర్యాలోచించి చూచువారికి బోల్షివిక్ ప్రభుత్వమువారి యాజమాన్యమున నారులు గ్రహించు విద్యఅంతయు జీవనోపాధికి మాత్రమే ఉపకరించునదియని తేటతెల్లమగును. ఉజ్వలాదర్శములు ఈ విద్యయందు లేవు. కళ, కవిత్వము మొదలగునవి వారి జీవితమునసే లేవు మన్ను, ముద్ద అవిరెండే వారి మనస్సులందు ఎల్లవేళల తరళించుచుండును.

సోవియట్ నందు ప్రస్తుతము అమలునందున్న న్యాయముప్రకారము శిశువుపై తల్లిదండ్రులకంటె ప్రభుత్వమువారికే హెచ్చుహక్కు గలదు. చదువవేయనగు వయస్సు పొందుటకుపూర్వమే పిల్లలను ప్రభుత్వమువారు తమ అదుపాజ్ఞలక్రిందకు తెచ్చుకొందురు. ఏపిల్లలు ఎట్టివిద్య పొందవలయును అను విషయమై తుది నిర్ణయము ప్రభుత్వమువారియందే నిలిచియుండును.

1918-వ సంవత్సరపు రష్యాదేశపు వివాహస్మృతిప్రకారము వివాహమునకొక ప్రత్యేకపుతంతు ఉండుట నిర్బంధమై యుండెను. కాని 1927-వ సంవత్సరమున వివాహస్మృతి మార్చబడెను. వివాహమున కెట్టి ప్రత్యేకపు తంతును అవసరము లేదు. రిజిష్టర్డు వివాహమెంత చట్టసమ్మతమైనదో 1927-వ సంవత్సరమునుండియు రిజిష్టర్డుకాని వివాహము కూడ అంత చట్టసమ్మతమైనదే. వివాహములు రిజిష్టరు చేయించుకొనుటవలన ప్రభుత్వమువారి పనిమాత్రము కొంత సుకరమగును. ఈరిజిష్టర్డు వివాహపు దంపతులు అనంతరకాలమున విడివడుచో వారివారి పిల్లల పోషణమునకు ఒక్కొక్కరు ఎంతెంత సొమ్ము ఈయవలసియుండునో నిర్ణయించుటకు ప్రభుత్వమువారికి సులువగును. భార్యాభర్తలుగ రిజిష్టరుచేయించుకొనని దంపతులకు పుట్టిన సంతానముకూడ ఈ క్రొత్తవివాహస్మృతిప్రకారము శాస్త్రసమ్మతమైనదే.

ఇన్స్యూరెన్సు విషయములు

౬. జపాను దేశము : ఇన్స్యూరెన్సు విషయకవిద్య.

"జపాను దేశస్థులు జీవితభీమాపద్ధతిని గ్రహించి ఎన్నియోసంవత్సరములు కాలేదు కాని దాని ప్రాముఖ్యమును గుర్తించుటలో వారు అమెరికావారికికూడ అగ్రసరులై యున్నారు. మనదేశపు విద్యావిధానమున చేర్పబడిన దానికంటె ఎన్నియోమడుంగులు హెచ్చుగ జపాను దేశపువిద్యావిధానమున ఇన్స్యూరెన్సు విషయములు చేర్పబడియున్నవి. మనదేశపు వ్యాపారవిషయక పాఠశాలలయందును, కళాశాలలయందును, ఇన్స్యూరెన్సు విషయములు పఠనీయములుగ చేర్పబడుగాకయని నేను గాఢముగ కోరుచున్నాను. నేనిటీవల గావించిన జపానుయాత్రలో అచ్చట పాఠశాలలలో ఇన్స్యూరెన్సువిషయములు బోధింపబడు పద్ధతిగాంచి అద్భుతానందములకు లోనైతిని." అని అమెరికాయందలి పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయమునకుచెందిన డాక్టరు యస్. యస్. హ్యూబ్నెర్ గారు వక్కాణించుచున్నారు. జీవితభీమావ్యాపారాభివృద్ధియందు ప్రపంచమునందలి ఏదేశముగాని అమెరికాతో దొరయజాలదు అట్టి అమెరికాదేశమునకుచెందిన అభ్యాపకునిచే జపాను జీవితభీమావిషయమై ఇట్టి ప్రశంస అందినదానికి జపానుదేశము కెంతయు అభినందింపవలసియున్నది. ఈవిషయమున జపాను అమెరికాకే ఆదర్శప్రాయమై యున్నదనగా ఇక మన ఇండియాసంగతి చెప్పనేల? జపాను ప్రభుత్వమువారు ఇన్స్యూరెన్సువిషయములను పాఠశాలలలో బోధించుటకు తమముద్ర వైచియున్నారు. జపానునందలి విశ్వవిద్యాలయములును, కళాశాలలును ఇన్స్యూరెన్సు విషయములను నిర్బంధపఠనీయములుగ నొనర్చియున్నారు. కమ్మర్షియలు విషయములను బోధించు అన్ని ఉన్నతపాఠశాలలయందును ఇన్స్యూరెన్సు విషయకములగు పాఠములు నిర్బంధమొనర్పబడినవి. హిందూదేశమునందలి విశ్వవిద్యాలయములు తమదృష్టిని ఈవిషయముపై ఎప్పుడు బఱపునో?

—The Indian Insurance.

> **సుభాషితము**
>
> ౧
>
> "భీమా జాతియందు ఐక్యానుబంధమును పుట్టించునట్లే నాగరికసంఘము అను కట్టడమునకు పునాది యగుచున్నది. అంతర్జాతీయశాంతికి భీమా మంచి దోహదకారి."
>
> —శ్రీ బార్డి సార్వభౌముడు.

౭. హైందవకర్షకులు : జీవితభీమా.

హిందూదేశమున వ్యవసాయమే ముఖ్యవృత్తి అగుట హిందువులలో పలువురు పల్లెటిపట్టులందే నివసించుచున్నారు. పల్లెటిపట్టులలో బాగుగా కాన్వాసుచేయుటకు ఏజెంటు శ్రద్ధపెట్టుచో పట్టణములలోకంటె అచ్చట హెచ్చుభీమావ్యాపారము చేయవచ్చును. ఒక్కొక్క గ్రామమున జనసంఖ్య కొద్దిగనుండును. ఆకారణమున అచట ప్రతిఒక్కరినికలుసుకొని కాన్వాసింగుచేయుటకు అవకాశములు హెచ్చుగనుండును. గ్రామములందు సాధారణముగ ఒక కుటుంబము గాని ఒకవ్యక్తిగాని,ఇతరులకు మార్గదర్శియైయుండును. అట్టి కుటుంబముగాని, వ్యక్తిగాని జీవితభీమాయొక్క సుముఖతచూపుచో ఇతరులును సుకరముగ దానియొక్క సుముఖులు కాగలరు. అయితే గ్రామస్థులకు సహజముగనుండు క్రొత్తవానియొక్కభయము పోగొట్టుటకు

కడలేని ఓరిమి, విడువనిపట్టుదల ప్రారంభమున ఏజెంటు కడ హెచ్చుగనుండవలయును. వివిధములైన భీమా కంపెనీ ఏజెంట్లు తిరుగుచు వచ్చుచు వారికి జీవితభీమా తత్వమును బోధించుచుండుటచే వారు జీవితభీమా యెడ సుముఖులు కాగలరు. ఈ సుముఖత్వమును అందుకొని కార్యము నడుపుకొని వచ్చుచో పట్టణములందు కంటె పల్లెటిపట్టులందు భీమాఏజెంట్లు హెచ్చు వ్యాపారము చేయవచ్చును. పట్టణములందు ఒక్కరిచే భీమా చేయింప చేయుటకే వ్యాసంగులో వెచ్చించుకాలమును ఒక పీకిగ్రామమునందు వెచ్చించుచో పట్టణమునందు కంటె ఇచ్చట పదిరెట్లు ఎక్కువ వ్యాపారము సాగును.

భీమాయొక్క లాభములను ఒక్క వ్యవసాయదారుడు గ్రహించినచో అతడు దాని విషయమై తన పొరుగువారితోడను, చుట్టములతోడను, పాటివారితోడను చెప్పి వారుకూడ తమ జీవితములను భీమాచేయునట్లు చేయగలడు. ఒక క్లెయిమును భీమాకంపెనీ చెల్లించుచో గ్రామమున ఆ విషయము వెంటనే మంచి వెల్లడిలోకి వచ్చును. ఇరుగు పొరుగున నున్న వారీవిషయమునుగూర్చి వినుటతోడనే జీవితభీమా యొక్క లాభములను సుళువుగ నమ్మెదరు ఒక్కసారిగ అంత మొత్తము వచ్చుటవలన వారియందు గాఢముగ నమ్మక మేర్పడును. సాధారణముగ అచ్చటి వారికి ఇంటివైద్యుడుగనుండు గ్రామసీమలయందలి డాక్టరుయొక్క పలుకుబడి ఈవిషయమున కొంత కార్యకారిగనుండగలదు. ఆడాక్టరే భీమాకంపెనీ వారొప్పు అను వైద్యపరీక్షకుడుగకూడ నుండుచో వాతనికుండు పలుకుబడినిబట్టి మంచివ్యాపారము సాగగలదు. అవసర సమయములయందు వ్యవసాయదారులకు అప్పు లిచ్చుచుండు షాహుకార్లు పలుకుబడికూడ ఈవిషయమున చాలకార్యకారిగనుండగలదు. పోలసీలను అములునందు నిలిపియుంచుకొనుటకు నియమితదినమున ప్రీమియములను కట్టవలసినదిగా పాతపోలసీహోల్డరులను తెలుచు కలయుచు వారి కావిషయము జ్ఞాపకము చేయుచుండవలయును. పంటకారుతీరి వ్యవసాయదారులచేతిలో డబ్బు బాగుగాఆడుచుండు కాత్తిలోడనే ప్రీమియము చెల్లించవలసిన దినముకూడ కలసివచ్చునట్లు చూడవలయును. నాలుగుమాసములకు, అర్ధవత్సరమునకు ప్రీమియము విభజించుటకంటె ఏడాదికి ఒకేసారి ప్రీమియము చేకొను పద్ధతి పల్లెటిపట్టులందు బాగుగా పనిచేయును. వ్యవసాయదారులలో పలువురు ప్రాయకముగా త్వరనిశ్చయమునకురారు. కావున పలువిధములగు పలుకుబడిని, నొప్పింపని ఒత్తిడిని కలిగించుచు నెమ్మదిగ వారిని ఒప్పించుకొని రావలయును. ఒకసారి ఏజెంటుపై గురి కుదిరిన తరువాత వారాతనిని ఏజెంటుగా గాక కేవలము స్నేహితునిగా చూతురు.

—The Indian Policyholders' Review.

సుభాషితము

౨

"జీవితభీమా వ్యాపారప్రపంచమున నైతికభావమును పెంపొందించును. వ్యాపారమునకు స్థిరత్వమును కలిగించును. ప్రజాక్షేమమునకు ముఖ్యావసరములగు పొదుపు, కూడిక అనుగుణములు జీవితభీమావలననే పెంపొందును."

—శ్రీ థియోడర్ రూజువెల్టు.

౬. భీమా : ఆర్జనశక్తి.

'కనక్టికట్ మ్యూచ్యుయల్ లైఫ్' కంపెనీకిచెందిన జేమ్సులీలూమిస్ అనువారు రక్షణయను సామాన్యలాభముకంటె జీవిత భీమా వలని ఇతరమైన లాభములనుగూర్చి ఇట్లు చెప్పుచున్నారు: "వ్యాకులపాటునుండి కాపాడుటయే మానవునకు జీవిత భీమాచేయు గొప్ప సేవ. వ్యాకులపాటు ఒకానొకవిధమైన భయము. అని చెప్పవచ్చును. ఈభయము మానవుని మనశ్శక్తుల పూర్తి విజృంభణమునకు గొప్పప్రతిబంధకము. జీవిత భీమాచే మానవుని మనశ్శక్తుల పూర్తివిజృంభణమునకు గొప్ప ప్రతిబంధకమగు ఈ వ్యాకులపాటు తొలగిపోవును. అందుచే అతని మనశ్శక్తుల పూర్తివిజృంభణమునకు వీలుకలుగుటతోబాటు అతని ఆర్జనశక్తియు పెంపొందును. భావిసుఖస్థితినిగూర్చి ఆందోళనపరిస్థితులలో పడియుండ నక్కరలేనిమనస్సు నిర్దిష్టకార్యనిర్వహణమున శక్తిమంతమైయుండును. వ్యాకులపాటుచే

మనశ్శక్తులు చెదరినవాడు క్రమముగా ఒకరోజులో, ఒకమాసములో, ఒకసంవత్సరములో చేయగలిగిన దానికంటె వ్యాకులపాటు పొందజాలని మనశ్శక్తులు గలవాడు క్రమముగా ఒకరోజులో, ఒకమాసములో, ఒక సంవత్సరములో హెచ్చుపనిని చేయగలడు. ఎవడు తన కుటుంబమునకు జీవితభీమా అను రక్షణమునిచ్చుచున్నాడో ఆతడు తన్నుదా గౌరవముతో చూచుకొనగలడు. కుటుంబమునకిట్టి రక్షణమును కలిగింపజాలనివాడు తన్నుదా నిట్టి గౌరవముతో చూచుకొనజాలడు. జీవితమును భీమాచేసి తనకుటుంబమునకు తగిన రక్షణమును గల్పించినవాడు ప్రపంచమున తలయెత్తి తిరుగగలడు, ప్రజాలోకమును తేరిచూడగలడు; తన సోదరమానవునికంటె తానేవిధముగను లోచ్చుకాదని గ్రహించును. బాధ్యతలను గుర్తించినవాడగుట భీమాచేసినవాడు గౌరవమును పొందుచున్నాడు; వ్యాపారమునందును, పరిశ్రమలయందును, వృత్తులయందును నిర్వాహకుడగుచున్నాడు. తనకుటుంబముయొక్క భావిసుఖమునకు తాను బాధ్యతవహింపవలసిన అవసరముకలదని గుర్తించినవాడనుటకు నిదర్శనముగా జీతమును భీమాచేసిన కారణమున ఆతడు తాను బాధ్యతయను భారమును మోయగలుగుటను నిరూపించుచున్నాడు.

— National Underwriter.

సుభాషితము

౩

"కాలవశమున కలుగు ధనకష్టములకు తట్టుకొనుటకై స్త్రీపురుషులకు జీవితభీమా చక్కని అవకాశము కలిగించుచున్నది. అదియునుగాక జీవితభీమా ధనమును కూడబెట్టుటకును, పెట్టుబడిపెట్టుటకును అనుకూలమైనమార్గమగుచున్నది."

—శ్రీ హెర్బర్టు హూవర్.

౨. స్త్రీలు : జీవితభీమా.

బైబిలునందు ఒకకథగలదు. ఇసుకమీద నొకటియు, రాతిమీదనొకటియు రెండుఇండ్లు కట్టబడినవి. కొంతకాలమునకు పిమ్మట వరదవచ్చినది ఇసుకమీద కట్టబడినయిల్లు కొట్టుకొనిపోయినది. రాతిమీద కట్టబడినఇల్లు వరదకు ఎదురొడ్డినిలచినది. కుటుంబముయొక్క నిలుకడకూడ నిట్లేయుండును. దానికిబలమైన ఆధారము స్థిరపడవలసియుండుచో అది జీవితభీమా అను పునాదిని కలిగియుండవలయును. జీవితభీమా అను పునాదిపై నిలచియుండు కుటుంబము మృత్యుప్రవాహముయొక్క ధాటికి తాళగలుగును. జీవితభీమా అను పునాదికి నోచియుండని కుటుంబము పైనచెప్పిన ఇసుకమీద కట్టబడిన ఇంటివలెనే ప్రవాహమునకు కొట్టుకొనిపోవును. కావున గృహరాజ్ఞియగు స్త్రీ కుటుంబముయొక్క స్థిరత్వమునకు జీవితభీమాచే తగుమైనవేర్పాటులు గావించుటకు ఎంతమాత్రమును ఏమఱరాదు. జీవితభీమావలని ధనమే లభించనిచో ఒక్కొక్క పరిస్థితులలో పచ్చముపాలైయుండగల కుటుంబముల చరిత్రలు అసంఖ్యాకములుగ గలవు. తమజీవితమునకై ఇతరులపై ఆధారపడ నక్కఱలేకుండ జీవితభీమా ఒసంగు వార్షికమువలనగాని, పింఛను వలనగాని, లేక పూర్తి మొత్తమువలనగాని స్వతంత్రముగా జీవింపగలిగియుండుచో హిందూవితంతువులస్థితి ఇప్పటంత విషాదకరముగా నుండజాలదు. స్త్రీల ఆర్థికసాంఘికాభివృద్ధుల విషయమై కష్టించు దేశనాయకులు దేశమున జీవితభీమాతత్త్వము బాగుగా వ్యాప్తినందుచో నేటి మన మాతృశ్రీలయు, సోదరీమణులయు ఆర్థికపరాధీనత చాలవరకు తొలగిపోవునని గుర్తింపగలరు. పలువురు పేదవితంతువుల నైతికపతనమునకు కారణము వారి ఆర్థికపరాధీనతయే యని మనము నొక్కి చెప్పవచ్చును. కామాతురుడగు పురుషుని కాసులకై ఆ పేదవితంతువులయందు ప్రలోభము పుట్టుటవింతగాదు. జీవితభీమాయొక్క ఆవశ్యకత ఎంతవఱకుగలదో దీనివలన బోధపడగలదు. కూలిచేసుకొనువాడు హఠాత్తుగ చనిపోవుచు గంపెడుపిల్లలతో నిరాధారయైన వితంతువును సంఘమున విడనాడుచుండుట తఱుచు జరుగు సంఘటనమే. జీవితభీమారూపమున ఆధారము కల్పింపబడియుండుచో ఆవితంతువు జీవిత మెంతసుఖకరమగును! నా స్వానుభవముచే

జీవితభీమా స్త్రీకి ఎంత అవసరమైనదో నేను కనుగొంటిని. దయామయుడును, ఇప్పుడు కీర్తిశేషుడును నగు నా భర్త తనకుగల కొలదిలోనే జీవితభీమాచేసియుండెను. ఆజీవితభీమాలేకుండినచో నేటి నాస్థితి ఎట్లుండునో అని తలచుకొనినపుడెల్ల నా ఒడలు జలదరించుచుండును. కొలదికాలమునకు పూర్వమువఱకు పలుజీవితభీమా కంపెనీలు స్త్రీల జీవితములను భీమాచేయకుండినవి. ఇప్పుడు కొన్నికంపెనీలు స్త్రీల జీతములనుకూడ భీమా చేయ నంగీకరించినది సంతోషకరవిషయము. చేతిలో ఏమాత్రము ధనము కలిగియున్న స్త్రీలైనను ఈ శుభావకాశమునుగైకొని వెంటనే తమజీవితములను భీమాచేసికొనవలసియుండునని హెచ్చరించుచున్నాను. పెట్టుబడులలో ఉత్తమమైనది, లాభకరమైనది జీవితభీమాయే. అట్టి పెట్టుబడికి స్త్రీల కవకాశము దొరకినది గావున వా రీసదవకాశమును పూర్తిగ వినియోగించుకొనగలరని నమ్ముచున్నాను. హిందూదేశమున స్త్రీల వెనుకబాటునకు ముఖ్యహేతువు వారి ఆర్థికపరాధీనతయే. కొన్ని ప్రత్యేకపు రకముల జీవితభీమాలను చేకొనుటచేతను, నిర్ణీతకాలమున ధనమును పొందగలుగు పద్ధతిని చేకొనుటచేతను స్త్రీల ఆర్థికపరాధీనతను తొలగింపవచ్చును. జీవితభీమావ్యాపారము వృత్తిగాగొనుటనుకూడ స్త్రీల కెంతయు అనువైనది. చేత పైసా లేని పేదరాండ్రుకూడ జీవితభీమాఏజెంటువృత్తి నవలంబింపవచ్చును. ఎట్టి మూలధనముగాని వారి కీవృత్తి నవలంబించుటలో నక్కఱలేదు. ముఖ్యముగ కావలసినవి ఎదుటివారిని వశీకరించుకొనగలవాక్కు, మృదువర్తనమును. ఏమాత్రము చదువుకొనినను స్త్రీకడ ఈ గుణము లుండితీరును. జీవితభీమావృత్తి కేవలవ్యాపారమే కాదు. అది సాటిలేని సంఘసేవయు అగుచున్నది. జీవితభీమాను వృత్తిగాగొనినవారు ఆశాజ్యోతిని ప్రసాదించు ప్రవర్తలనియు, పేదవారిని ఆర్థికనాశనమునుండి కాపాడు దేవతలనియు గ్రహింపవలసియున్నది. ఇది ఒక్కవ్యక్తికేగాక ఆతని పరిసరమునకుగూడ శాంతిని, ఆనందమును కొనిరాగల దివ్యదూత. జీవితభీమా కాన్వాసింగు వృత్తికి విశేషకాయకష్టమవసరములేదు. అగుట స్త్రీల కిది ప్రత్యేకముగా అనుసరింపదగిన వృత్తియని చెప్పనక్కరలేదు. విశేషకాయకష్టములేకనే బయటతిరుగుచు పౌరసత్వపు బాధ్యతను నిర్వహించుటను స్త్రీకి అవకాశము కలిగించు వృత్తి ఇది యొక్కటియే. పనిలేక వృధాకాలక్షేపము చేయు మధ్యమతరగతి కుటుంబములలోని స్త్రీలు నిస్సంకోచముగ ఈవృత్తి నవలంబించి తమకుటుంబము యొక్క ఆర్థికసౌష్ఠవమునకు తోడ్పడగలుగునట్లు చూడవలసియున్నది. జీవితబీమా వ్యయశీలతను పోగొట్టును. బాధ్యత గుర్తింపజాలని పేదవారినుండి సయితము చిన్నచిన్న మొత్తములను కూడగట్టి పెద్ద ధనరాశినికూర్చి బీమాసంస్థలు జాతియొక్క ధనసంపదను పెంపొందించుచు దేశమునందు పెద్దపెద్ద పరిశ్రమాగారముల నిర్మాణమునకు దోహద మొనర్చుచున్నవి. జీవితబీమా పొదుపుచేయు గుణమును పెంపొందించును, ఆత్మగౌరవమును పెంచును, జీవనముయొక్క అంతస్థును హెచ్చించును. భూలోకముననే స్వర్గమును కల్పించవలయునను మానవుని చిరకాలకాంక్షితమగు ఆదర్శమును కొంతవఱకైన నెఱవేర్చగలుగుటకు మానవునకు తోడుపడునది జీవితబీమాయొక్కటియే మంచి సాధనమై యున్నదనుట సత్యము. కావున భారతదేశపు స్త్రీలీవిషయమై శ్రద్ధపెట్టుదురుగాక!

(శ్రీమతి ప్రియంవదాదేవి బి. ఏ.)

—Mrs. Priyamvada Devi, B. A.
(Insurance World.)

సుభాషితము

౪

"కొంతధనమును కూడబెట్టుటకు శక్తి కలిగియుండియు తన కుటుంబమునకు ఎట్టి ఆస్తియు కల్పింపక చనిపోవుట గొప్ప అధర్మమని నానిశ్చితాభిప్రాయము. సులభముగా కుటుంబమునకు ఆస్తిని కల్పించుటకు జీవితభీమాను మించినమార్గము మఱియొకటి లేదు."

—రివరెండు ఇ. జి. గాజ్.



కాశీనగరమునందలి యాంధ్రులు

భారతదేశమునఁ బ్రధానవిద్యాపీఠమగు కాశీనగరము విజ్ఞాననిలయమగుట సర్వజనవేద్యము. మనయాంధ్రులు వారాణసికి వలసపోవుటకుఁ గల ప్రధానకారణము విజ్ఞానార్జనమేయని చెప్పవలసియున్నది. నేఁడును చాలమంది యాంధ్రవిద్యార్థులు వారాణసీ హిందూవిశ్వవిద్యాలయమున విద్యనభ్యసించుచున్నారు. మనదేశమునఁగల సుప్రసిద్ధసంస్కృతపండితులలోఁ జాలమంది కాశీనగరమునందే విద్యనభ్యసించియున్నారు. కొందఱాంధ్రులు క్షేత్రపురోహితవృత్తి నవలంబించియు, మఱికొందఱుద్యోగధర్మమునను కాశీనగరమున నివసించుచున్నారు. అటకు జీవనముకొఱకు వలసపోయినవారిసంఖ్య తక్కువయనియు, విద్యకొఱకు వలసపోయినవారి సంఖ్యయే యధికమనియుమాత్రము చెప్పవలెను.

వలసపోవుటకుఁ కారణములు.

ఆంధ్రులు వారాణసి కెపుడు వలసపోయినదియు నిశ్చయముగఁ జెప్పనవకాశము లేదు. విద్యాసంపాదనార్థము కొన్ని సంవత్సరములచట నివసించిన వారినిగూడ రాష్ట్రేతరాంధ్రులలో లెక్కించినచో ననేకవందల సంవత్సరములక్రిందనే యానగరమాంధ్రనివాసస్థానమైనదని చెప్పనచ్చును. కొందఱు మహాత్ములు విద్యాసంపాదనార్థమై యచటకేఁగి యచటనే సుప్రతిష్ఠితులైనవారునుగలరు. అందు మానవల్లివారి కుటుంబము గణనీయమై యున్నది. శ్రీ గంగాధరశాస్త్రి మొదలగువారు జగదేకపండితులని కీర్తిగాంచిరి. వారివంశజులును ప్రసిద్ధపండితులై వందలకొలది వేతనముల గ్రహించుచుఁ గళాశాలలలో గీర్వాణవిద్యఁ గఱపుచున్నారు. వారి కుటుంబము కాశీనివాసమేర్పఱచుకొని నూఱుసంవత్సరములకుఁ బైగానయ్యెనని తెలుపుటకు తద్వంశీయులు మాతృభాషయగు నాంధ్రభాషను మఱచిపోవుటయే నిదర్శనము. క్షేత్రపురోహితులుగ నున్నవారిలోఁ జాలమందిమాత్రము చాలసంవత్సరములక్రిందటనే యచట స్థిరులైనను, ఆంధ్రభాషను మఱువకయేయున్నారు. అందులకుఁగల కారణము వారికాంధ్రులతోఁ దఱచుగఁ బరిచయము, సంబంధము కలిగియుండుటయే గావచ్చును.

ఆంధ్రులెపుడు వలసపోయిరి.

కాశీనివాసులగు నాంధ్రులవృత్తింగూర్చి యిదివఱకే వివరింపఁబడినది. విశ్వవిద్యాలయమునఁ గొంద ఱుపాధ్యాయులుగనున్నారు. రమారమి మూఁడువందలమంది విద్యార్థులు కాశీ హిందూవిశ్వవిద్యాలయమున చదువుకొనుచున్నారు. శ్రీ విజయనగరప్రభువుల కాశీసంస్థానమునఁ గొంద ఱుద్యోగులుగను, కొందఱు తీర్థపురోహితులుగను ఉన్నారు. కొందఱు, విద్వాంసులు కొన్నిమఠముల యాధిపత్యమును నిర్వహించుచున్నారు.

వృత్తి

వారాణసీనగరమునందు స్థిరనివాసము గల యాంధ్రులసంఖ్య చాల తక్కువయగుటచే బహుళజనసాధ్యమగు సంఘసంస్కరణము మొదలగు విషయములలో వారేరీతిని అభివృద్ధినిజూప నవకాశము లేకపోయినది. కాని ప్రధానములగు కొన్నివిషయములందు మాత్రము మనవారు వెనుదీయలేదు. అచట స్థిరనివాసము నేర్పఱచుకొనిన యాంధ్రు లాంధ్రేతరులగు మహారాష్ట్రులతోడను, కర్ణాటకులతోడను సంబంధబాంధవ్యములను జరుపుకొనుచున్నారు. కావున వారు శాఖాంతర వివాహములనేగాక అనాంధ్రులతోడి వివాహముల నామోదించుచున్నారని చెప్పవలెను. ఈయంశముమాత్ర మంత బహిరంగముకాదు. అట్లని యాక్షేపణీయమునుగాదు. విశ్వవిద్యాలయమునందలి యాంధ్రవిద్యార్థులు తక్కినవారి రీతినే యస్పృశ్యతాబహిష్కరణమునఁ బ్రచారమొనర్చుచున్నారు. మఱియు నచటి మనవారు దేశీయాంధ్రులరీతిని, (ఆంధ్రబ్రాహ్మణులరీతిని) భోజనాదిసమయములందు దృష్టిదోషమును బాటింపక, వంగీయులు మొదలగువారిరీతిని సర్వసమత నవలంబించియున్నారు.

సంఘ సంస్కరణము.

కాశీనగరమునం దాంధ్రసంఘము లేమియును లేవు; కాని విశ్వవిద్యాలయమునందలి యాంధ్రవిద్యార్థులు మాత్రము తక్కిన భారతీయ విద్యార్థులవలెనే సంఘమును స్థాపించియున్నారు. ఆంధ్రసంఘముయొక్క సభలు విశ్వవిద్యాలయమునందే పనిచేయుచున్న శ్రీ దర్భా సుబ్రహ్మణ్యముపంతులు ఎమ్. ఏ. గారియొక్కయుఁ, దక్కుంగల యాంధ్రులయొక్కయు నాధిపత్యమున జరుగుచున్నవి వాఙ్మయము, నాటకకళ—సంఘజీవనము—మొదలగు విషయము లీ సంఘపక్షమునఁ బురోఽభివృద్ధిఁగాంచుచున్నవి. ఆంధ్రవిద్యార్థులు ప్రదర్శించిన నాటకములు తక్కిన భారతీయుల నాటకములకంటె మిక్కిలి ప్రశంసాపాత్రములుగనున్నవని యాంధ్రేతరులే పొగడుచున్నారు. పదునైదు దినముల కొకసారి జరుగు ప్రతిసభయందును ఆంధ్రాంగ్లసారస్వతవిషయములు విమర్శింపఁబడుచుండును. నగరమునందలి యాంధ్రులు ప్రత్యేకసంఘమును గలిగియుండక పోయినను, "దక్షిణభారతసంఘము"నందు వారి కుచితమగు స్థానముకలదు. ఆసంఘముయొక్క గ్రంథాలయమునందుఁ గొన్ని యాంధ్రగ్రంథములుకలవు.

సంఘములు.

వారణసీనగరమునందు నివసించునాంధ్రులయెడ స్థానికభారతీయులకు గౌరవమధికము. ఇట్టి గౌరవమును ఆంధ్రుల కార్జించిన అచటి సుప్రసిద్ధాంధ్రుల కొందఱి నిచట పేర్కొనుట అప్రస్తుతముగాదు. శ్రీ విజయనగరప్రభువుల రాజ్యకార్యములను నిర్వహించువారును, దివాన్‌జీలునగు శ్రీ మద్దిరాల గోపాలరావుపంతులుగారును, ప్రధానలేఖలగు శ్రీ పులిగెడ్డ సుబ్బారావుపంతులుగారును, యతిప్రవరులలో శ్రీ బ్రహ్మానందస్వామిగారును, పండితులలో శ్రీ మానవల్లి గంగాధరశాస్త్రులవారి పుత్రులును, శ్రీ సీతారామస్వామిశాస్త్రులుగారును, శ్రీ వేంకటశాస్త్రులుగారును గణనీయులు. విశ్వవిద్యాలయోద్యోగులలో గ్రంథభాండాగారోపాధ్యక్షులు శ్రీ దర్భా సుబ్రహ్మణ్యం, ఎం. ఏ గారును, అసహాయోద్యమప్రచారకులైన శ్రీ స్వామి నమశ్శివాయగారును పేర్కొనదగినవారు.

ఆంధ్రప్రముఖులు

—బులుసు వేంకటరమణయ్య.

ఆరోగ్యవిజ్ఞానము

౬. చర్మము, దాని రక్షణము

కాంతివంతమైన చర్మము లావణ్యప్రదాయిని మాత్రమే కాదు శరీరమునందలి సర్వాంగకములను దుస్థితియందున్నవనుటకు చక్కని సూచన. కండరములు, ఎముకలు సరియైనస్థితిలో లేనిచో; శరీరమునందలి వివిధములైన అంగకములు వానివానికి నిర్దిష్టములైన పనులను సరిగా నిర్వహింపకుండుచో కాంతిహీనములగు నేత్రములు, చెంగలువరంగు లేని చెంపలు అను లోపములు మానవశరీరమును కోలపైని ఎగురజాలవు. మనచర్మము కేవలము అలంకారమునకే కాదు. తుదకు అది ప్రధానముగా అలంకారమునకే అని చెప్పుటకును వీలులేదు. చర్మము శరీరమున ఒక ప్రత్యేకాంగకము. దానికి నిర్దిష్టమైన ధర్మముగలదు. జాతిపారంపర్యమును నిలుపుట యను తన కార్యమునకై స్త్రీపురుషులకు యౌవనకాలమున ప్రకృతి ప్రసాదించు లావణ్యసామగ్రులలో కాంతివంతమైనచర్మము ప్రధానమైనదైనను బాగుగా కనుపించుట అనున దొక్కటియే చర్మముయొక్క ధర్మముగాదు. శరీరమునందలి మలిన పదార్థములను తొలగించివేయు అంగములలో నిదియొకటి. ఈత్వగింద్రియముచే గ్రహింపగలగుణము స్పర్శము. దానికి గల స్పర్శజ్ఞానముచేతను, శీతోష్ణముల అనుభవభావముచేతను వాతావరణముననుసరించి శరీరములను యథాస్థితియందు నిలుపు ప్రధానకార్యమును అది యొనరించుచున్నది. ఇట్టి పెక్కుకారణములచే చర్మమును జాగ్రత్తగ పరిరక్షించుకొనుట మనవిధియగుచున్నది. కాని ఈవిధిని మనము జాగ్రత్తగ నిర్వహించుచుంటిమనుటకు మాత్రము వీలుచాలదు. పలువురు చర్మముయొక్క జాగ్రత్త విషయమున ఎట్టి శ్రద్ధను తీసికొనకున్నారు. ధారాళమైన పరిశుభ్రవాయువును పొందుట చిరకాలానుభవమైన దాని హక్కు అనియు; బాగుగ పనిచేయుటకు ఇతర శరీరాంగముల వలె నదియు లెస్సగ పరిశ్రమను లోనుపడవలయు ననియు పలువురు మఱచిపోవుచున్నారు. ముల్లాగ్గా చెమటపట్టునట్లు దేహపరిశ్రమచేయుటయే చర్మమునకు తగినపరిశ్రమ కల్గించుపద్ధతులలో ఉత్తమమైనది. కాని త్వరజీవనులమగు మనకు ఇట్టి దేహపరిశ్రమకు సరియైనకాలము నిత్యక్రమమునదొరకుట బహుకష్టము. కావున ప్రతిఉదయమున శీతలజలస్నానము చేసిన వెంటనే చర్మమును పెట్టపుట్టునటుల బాగుగా తోక్కరాచుకొనవలెను. చన్నీళ్ళలో స్నానముచేయుటకు అలవాటులేనివారుగాని, పడనివారుగాని వేడినీళ్ళలో స్నానముచేసిన తరువాత ఒడలు బాగుగా తుడుచుకొని విసురుగా గాలివచ్చునట్లు కిటికీతలుపులు తెఱచుకొని శరీరమంతయు గాలిప్రసరించునట్లు చేసికొనవలయును. పిమ్మట ఒక ముతకతువ్వాలుతో శరీరమంతయు నొక్కరాచుకొనవలయును. ముఖమును తఱచు కడుగుకొనుచుండుటమంచిది సాధారణముగ సబ్బు, నీళ్ళు మంచివే. పెసరపిండి, నీళ్ళు ఉత్తమము. కొందఱి మొగములు సబ్బువాడుకచే పెళుసుబాఱును. పెసరపిండివలన అట్టి చెడుపులుండవు సరికదా చర్మమునకు నునుపు, కాంతి కలుగును. ఎల్లప్పుడు చెమరుగక్కుచుండు మొగములుగలవారు నీటిలో కొంచెము ద్రావకము కలుపుకొని మొగము కడుగుకొనుచో మంచిపనిచేయును. కాని కాంతివంతమైన చర్మము కలిగియుండు రహస్యమంతయు ఇట్టి బాహ్యక్రియలకంటె శరీరములోపలి శుచిని బట్టియే యుండునను మఱువరాదు. పరిశుభ్రమైన గాలి, నిత్యక్రమమైన దేహపరిశ్రమ, మితమైన భోజనము ఇవి మానవుని చర్మముయొక్క సౌందర్య

మును పెంపొందించు పరమహంసక్రియలు. వీటియన్నిటికంటెను ఉదయమున లేచుటతోడనే నిత్యము శీతల జలపానముచేయుట చర్మముయొక్క లావణ్యమును, ముఖముయొక్క వర్చస్సును పెంపొందించుటలో సమర్థమైనది. యౌవనప్రాదుర్భావకాలమున గలుగు పిటకలు ఈశీతలజలపానమువలన నివారణయగును.

౬. పరుండునపుడు గమనింపదగు మెలకువలు

అలసిపోయినట్లు ఏలయగుపడెదవు? ఆరోగ్యానందమును తిరిగిపొందగలవు. అట్లుపొందుటకు ప్రథమసాధనము నీ మనస్సును కలతపెట్టుచున్న భావములను ముఖముపై ప్రతిబింబింప చేయకుండుటయే. నీముఖమును మందహాసమునకు వలసమందిరము గావింపుము. గాఢమైననిద్ర, సకాలభోజనము, పరిశుద్ధమైనగాలి, క్రమమైన దేహపరిశ్రమ కలిగియుండునట్లు చూచుకొంటివేని జీవితమున నూత్నరుచి, బ్రతుకునందు క్రొత్తఅభిలాష కలుగును. సుందరమైన చూపులు, సుఖము, ఆరోగ్యము గాఢనిద్రవలననే కలుగును. మానవున కుండవలసిన యంత నిద్రలేనివాడు చిర్రుబుస్సులకు, అశాంతికి తావలమైయుండును; మందిరూపము, ఉబ్బుకన్నులు కలిగి వాడు ఎల్లవేళల అలసటచెందియుండునట్లు కనిపించును. నిద్రించునపుడు ఒకడు పరుండియుండు పద్ధతిమీదనే అతని ఆరోగ్యము, చూపులలోని సౌందర్యము, శిరముయొక్క సమస్థితి ఆధారపడియుండును. మానవునకు సాధారణముగ రోజుకు ఎనిమిదిగంటల నిద్ర ఆవశ్యకమైయుండును. ఈ ఎనిమిదిగంటలసేపు గాఢముగ నిద్రించువ్యక్తి నిద్రలో ఒకటి రెండుసార్లుమాత్రమే ఒత్తిగిలును. కాబట్టి నాలుగైదుగంటలు శిరము మొదలైన శరీరావయవములు ఒకేస్థితిలో నుండుచుండునన్నమాట. ఏస్థితిలో ఆనాలుగైదుగంటలుండుచుందునో ఆదేస్థితిలో ఇతరకాలములందుకూడ ఆ అవయవములుండుట కెక్కువ అవకాశముకలదనుట నిక్కము. కండరములు ఆదేస్థితిలోనుండుటకు అలవడును. సాధారణముగ పలువురు చెంపక్రింద ఒకచేయిపెట్టుకొని నిద్రించుచుందురు. ఈకారణమున వారిచెంపలు ఆకాలమునందే ముడతలుపడి ముఖముయొక్క అందమును కోలుపోవుచున్నవి. తలక్రింద మిక్కిలి ఎత్తైన తలగడపెట్టుకొనుటచే భుజములయందు వంపు ఏర్పడుట అసంభవముకాదు. ఎత్తైన తలగడపెట్టుకొని నిద్రించునంతకాలమును వెలకిలబరుండుటకు అలవాటుపడినవారు పగలు తమతలను సమస్థితిలో నిలుపుకొనియుండజాలరు. మఱి ఇక ఎత్తయిన తలగడపెట్టుకొని ఒత్తిగిలి పరుండువారి మెడనరములకు చెఱుపుకలుగును. తలగడపై వాలియున్న వైపు మెడనరములు పొడుగుగ సాగును; హెచ్చునలుగుపాటునొందును. రెండవవైపు మెడనరములు సంకుచితమగును. దీనివలన తల ఒకప్రక్కకు కొంచము వాలును. చలికాలమున ముచ్చుముడిగి పండుకొను పద్ధతి తెగడదగినది. సాధ్యమగునంతవఱకు కుడిప్రక్కకు తిరిగి పండుకొనుటకు ప్రయత్నించుచుండవలయును. కాళ్ళు, వెన్నెముక ఎంతసాపుగ చాచుకొనియుండిన అంతమంచిది. ధారాళముగ రక్తము ప్రవహించుటకును అందువలన మంచివీలు ఏర్పడును. ఒత్తిగిలి పరుండునపుడు క్రిందివైపుననుండు చేతిని సుఖకరమైన పద్ధతిని మడచుకొనవచ్చును. అయితే అది మొగమునకు ఎంతమాత్రమును అడ్డురాకుండునటుల చూచుకొనవలయును. ఎగుభాగమున నుండుచేయి శరీరముపై సాపుగా చాచుకొనవగును. విస్తారము ఎత్తులేక సమమెత్తగనుండు తలగడపై భుజములతో సమస్థితియందుండుచుపాటి ఎత్తున తలను పెట్టుకొని నిద్రించుచుండవలయును. పక్క సరియైనస్థితిలో నుండునట్లు చూచుకొనవలయును. ఉండఉండలు కట్టి వఱలుపైగాని గాలిరానిగదిలోగాని గాఢమైనది సుఆరోగ్యకరమైనదియు నగు నిద్రను పొందదలచుట వ్యర్థము. పడకగదిలో ఆగదియొక్క ఉపయోగమును, సౌఖ్యమును హెచ్చించువస్తువులనుమాత్రమే ఉంచవలయును. గూళ్ళనిమూయునవి, రోగకారకక్రిములనుచేర్చునవియగు వస్తువులను పడకగదిలో ఎంతమాత్రమును ఉండనీయరాదు. కిటికీనుండి ధారాళముగ గాలివచ్చు స్థలమున పడకఉండుటచే నిద్రించుసమయమున కావలసినగాలి లభించుచుండును. ఉదయభానుని కిరణములు సూటిగా మొగముపై బడురీతినిమాత్రము పడక ఎప్పుడును ఏర్పాటుచేసికొనరాదు. ఈ మెలకువలను జాగ్రత్తగ గమనించువారికి సుఖమగు గాఢనిద్ర లభించును.

[గుంటూరుమండల కేంద్రగ్రంథాలయమగు వేటపాలెమునందలి సారస్వతనికేతనసంస్థాపనాచార్యులును ; గుంటూరుమండలగ్రంథాలయసంఘాధ్యక్షులును మహాశయులును అగు శ్రీఊటుకూరు వేంకటసుబ్బరాయశ్రేష్ఠిగారి ఈవ్యాసము ఆంధ్రదేశగ్రంథాలయోద్యమాభిమానులెల్ల చదువదగినది.......సంపాదకుడు.]

గ్రంథాలయోద్యమము

గ్రంథాలయములు

పేరువలననే గ్రంథాలయములు ఆలయకోటిలో చేర్పదగినవని తెల్లమగుచున్నది. ఆలయములన ఆంధ్రులకేగాక భారతీయులెల్లర కెంత గౌరవప్రదములో, యెంతటి పవిత్రములో పాఠకులకుయెరుకయే. మన దేశీయులకు బహుప్రాచీనకాలమునుండియు నేటిదనుక గుళ్లు, గోపురములు కట్టించుట యనినను; వాపీకూపతటాకాదులను త్రవ్వించుట యనినను; సత్రములు, రామానుజకూటములు, యాగశాలలాదిగాగలవానిని నిర్మించుటయనినను, మిక్కిలి యానందకరములైన కార్యములు.

ప్రాచీనకాలమున ప్రతిదేవాలయాంతర్భాగముగ గ్రంథాలయశాఖయు లీనమై యుండుటచే గ్రంథాలయముల కొకానొకప్పుడు ప్రత్యేకత్వము కానరాకుండెను. దేవాలయనిర్మాణములోనే గ్రంథాలయనిర్మాణము, దేవాలయపోషణయందే గ్రంథాలయ పోషణయు అవినాభావసంబంధముగలిగి జరుగుచుండెడివి. అందుచే ప్రతిదేవాలయము లేక ప్రతిగ్రంథాలయము భుక్తి, భక్తి, ముక్తిదాయకమై, విజ్ఞాననిలయములై విలసిల్లుచుండెడివి. పరదేశరాజుల దండయాత్రల సందర్భమున జరిగిన బహువిషాదకరములగు దేవాలయాదుల దోపిడులలో అందుండు గ్రంథసముదాయములెల్ల, నిర్మూలింపబడినవి పోగా, కొఱవడినవి పరదేశములకు కొంపోబడెను. ఆకారణమున భారతవిజ్ఞానకోశమంతయు విదేశములపాలైనది. భారతవిజ్ఞానమునకు జన్మదేశమున కరవువాటిల్లినది. కరవేల పూర్తిగా నశింపే కలిగినది.

తదాది నిర్మింపబడినట్టిగాని, పునరుద్ధరింపబడినట్టిగాని దేవాలయములు గ్రంథాలయరహితములై, విజ్ఞానమును వెదజల్ల గలిగినవిగాక, కేవలము శిలావిగ్రహశాలలుగా మాత్రము రాణించుచున్నవి. భారతీయులు రిక్తభక్తిపారవశ్యముచేత అనేకదేవాలయములను నిర్మించుచుండుట గాంచుచున్నారము గాని యేకారణముననో గ్రంథాలయముల నిర్మాణమునకు గడంగరైరి. గ్రంథాలయములు వీరి దృష్టిపథమునుండి దూరములైనవి. గ్రంథాలయము లనిన సామాన్యభారతీయులు మరచిరనవచ్చును. ఆకారణమున భారతవాఙ్మయము చాలభాగము క్షీణించినది. భారతవిజ్ఞానము కృశిం

చినది. భారతదేశైశ్వర్య మడిగినది. పరిశ్రమలు పాడైనవి. పంటలడుగంటినవి. మానవుల తెలివితేటలు తగ్గినవి. దాస్యమునకు తావుదొరికినది. పరాధీనత ప్రబలినది. సర్వారిష్టము లావరించినవి.

విదేశీయులు తమకు లభించిన గ్రంథకోశము నండగాగొని, తమబుద్ధికుశలత విజృంభించిన కొలది తమ వాఙ్మయమును, తమ విజ్ఞానమును పెంపొందింప జేసికొని తమ దేశములలో గ్రంథాలయోద్యమమునకు ప్రత్యేకముగ ప్రధానస్థాన మొసంగి తోడి దేశములలో నగ్రస్థానముల నధిష్ఠించి సమస్తశాస్త్రవిద్యాపారంగతులై వెలలేని సిరిసంపదలతో తులదూగుచున్నారు. విదేశముల వైభవమంతయు యేబది లేక నూరు వత్సరముల కిటీవల దేననియు, అంతయు గ్రంథాలయోద్యమము వలననే వృద్ధిపొందిన దనియు, దాని యభివృద్ధిమీదనే ఆధారపడి యున్నవనియు చరిత్రలవలన మనము సత్యమును గ్రహింపగలుగుచున్నారము.

ఒకానొకప్పుడు భారతవర్షము వివిధవిదేశములకు గురుపీఠముగానుండి, నేడు వాఙ్మయమునందేమి, విజ్ఞానసంపదయందేమి, ఆర్థికవిషయములందేమి, పాడిపంటలయందేమి, పరిశ్రమలయందేమి, సర్వవిషయములయందును వెనుకజిక్కియున్నందుకు మనము తప్పక సిగ్గుజెందవలసియున్నది.

అన్నిటికిని మూలకారణమైన, సమస్తమునకు మూలాధారమైన గ్రంథాలయోద్యమమును మరల భారతదేశమున నూతనమార్గముల పునరుద్ధరింప నెంచి కొందరు బుద్ధిమంతులు కృషిచేయ నారంభించిరి. తదాది భారతవాఙ్మయము క్రమశః యభివృద్ధిజెందుచున్నది. విజ్ఞానము వృద్ధిగాంచుచున్నది. పండితులు, కవీశ్వరులు, పరిశోధకులు, శాస్త్రకారులు, చరిత్రకారులు, జ్యోతిష్కులు, సిద్ధాంతులు బయలుదేరుచున్నారు. గ్రంథముల వ్రాయుచున్నారు. కాని విదేశీయవాఙ్మయమునకు దాసులము కాక తప్పుటలేదు. విజాతీయభావము లమితముగ గ్రంథములలో నింపబడుచున్నవి. ఆ అన్యదేశగ్రంథముల నాశ్రయింపు తగ్గిననేగాని జాతీయమయిన స్వతంత్రవాఙ్మయము వృద్ధిజెంది మన దేశస్వభావములు, సంప్రదాయములు మొదలుగాగలవి గ్రంథములలో నెక్కవు శైశవావస్థ దాటవలయునుగదా.

బరోడా రాష్ట్రాధిపతి తనరాష్ట్రమునందు గ్రంథాలయోద్యమవ్యాప్తికి ప్రత్యేకస్థానమొసంగి, విరివిగ ధనమొసంగి, ప్రత్యేకశాఖ నొకదానిని నిర్మించి తోడ్పడినకతమున బరోడా దేశము తత్ఫలితములు ముందుగా అనుభవింపగలుగుచున్నది. బరోడా ప్రభువు ఈయుద్యమమునకు ప్రత్యేకగణ్యతనొసంగి తనప్రజలయొక్క విజ్ఞానాభ్యుదయమునకు తోడ్పడినందులకు మిగుల వందనపాత్రుడు. తనరాష్ట్రమునకు తాను సర్వస్వతంత్రాధికారియగుట తా నీయుద్యమమునకు ప్రత్యేకస్థాన మొసంగగలిగె.

ఆంధ్రదేశమున సైతము 1890 సంవత్సరప్రాంతమున ఆధునికగ్రంథాలయోద్యమము మొలకరించినది. తదాది నేటిదనుక యుద్యమము యథోచితాభివృద్ధితోడనే సాగుచున్నది. గ్రంథాలయోద్యమ మాంధ్రదేశమునకు గావించిన మేలు నిరాడంబరము, నిస్సందేహమును అయినది. గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమునకు గావించిన మహోపకారములలో గొన్నిటి నిట జేర్కొనెద.

ఆంధ్రులను నిద్రనుండి మేల్కొలిపినది. ఆంధ్రోద్యమమునకు దోహదమొసంగినది. ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణాపేక్షకతను పురికొల్పినది ఆంధ్రులను దేశసేవారాధకులనుగా జేసినది. ఆంధ్రులకు జాతీయాభిమానము కలిగించినది. మాతృభాషాసేవయందు దానశక్తిని కలిగించినది. ఆంధ్రవార్తాపత్రికల యుత్పత్తి కాకరమైనది. ఆంధ్రవిజ్ఞానమును వెదజల్లగలుగుచున్నది ఉన్నతోద్యోగపదవులను ఆంధ్రుల కిప్పింపగలిగినది. మనము నేడు గాంచుచున్న అన్నియభివృద్ధులు, అన్నిమార్పులు గ్రంథాలయోద్యమఫలితములే యనుట నిర్వివాదాంశము. గ్రంథాలయములు చేయజాలని పనులు గలవా? గ్రంథాలయములు సాధింపజాలని మార్పులుగలవా? గ్రంథాలయములు విజ్ఞాననిలయములేగాక మానవులను చక్కని మార్గములలో సంస్కరింప శక్తిగల సాధనాలయములు గ్రంథాలయములు నిశ్శబ్దముగ, నిరపాయకరముగ కావలసిన సాధనసంపత్తిని సమకూర్చుచు దేశమును, మతమును, జాతిని సంస్కరింపగలుగును. దేశౌన్నత్యము, దేశసౌభాగ్యము, జాతీయవికాసము, మానవుల ఆయురారోగ్యాభివృద్ధులు, మతసాంఘికాది సంస్కరణములు, యివి యవి యననేల? సమస్తము గ్రంథాలయోద్యమముపై నాధారపడియున్నవి.

గ్రంథాలయోద్యమము జీవించియుండునంతవరకు దేశము జీవించియుండును. జాతి జీవించియుండును. మతము జీవించియుండును. వాఙ్మయము జీవించియుండును. దానితోనే సర్వము, సర్వముతో నదియు.

మన మేయుద్యమమును కార్యాసక్తులమై సాగించినను గ్రంథాలయోద్యమము దోహదమొసంగనిది అది వ్యాప్తినొందనేరదు ప్రజలలో యుద్బోధన చేయజాలదు. కాన అన్నియుద్యమములకు గ్రంథాలయోద్యమము పునాది. గ్రంథాలయములే ఆయువుపట్టులు, లేక ఊపిరితిత్తులు.

కాన భారతీయులు తమ వర్తమానస్థితిగతులను గమనించి భవిష్యదభివృద్ధికి సాధనములైన గ్రంథాలయములను యూరూర స్థాపించి, భగవదాలయములతోపాటు దానధర్మముల నొసంగియు, మడిమాన్యము లొసంగియు పోషింప దీక్షవహింతురనియు; మాతృదేశమును, మాతృభాషాయోషను తొల్లింటివైభవస్థానము నలంకరింప జేయ బూనెదరనియు నభిలషించుచున్నాడ.

—ఊటుకూరు వేంకటసుబ్బరాయశ్రేష్ఠి.

* * *

అల్లరిమూకనుండి గ్రంథాలయమును కాపాడిన అధ్యాపకుడు:—

"ఈ భవనమున వెలలేని గ్రంథసంపుటములు వేలకొలదిగలవు. నేను వీనిని పరిరక్షించుటకు దీక్షవహించియున్నాను. మీరీపుస్తకభాండాగారమును పరశురామప్రీతి గావింపదలచినచో నా మృతశరీరము త్రొక్కి వెళ్లినగాని మీతలంపు నెఱవేరదు." ౧౯౩౧-వ సంవత్సరమున స్పెయిను దేశమునందు నడచిన రాజకీయవిక్రాంతిసమయమున అల్లరిమూక పెచ్చురేగి రాజధానీనగరమగు మాడ్రిడ్‌నందలి పుస్తకభాండాగారమును మూలముట్టముగకూల్పరాగా ఆ భాండాగారమున చదువుకొనుచున్న ఐరిషు దేశపు అధ్యాపకుడు డాక్టరు బెర్నార్డుమాల్లే పై వాక్యములను గర్జాగంభీరస్వరమున పలుకుచు వారిని నిరోధించెను. డాక్టరు మాల్లే అప్పటున చూపిన ధైర్యసాహసములకు అభినందనములు తెలుపుటకుగాను మాడ్రిడ్‌నందలి మతసంఘములు, సారస్వత

సమాజములు ఒకదినమును ప్రత్యేకించినవి. మాడ్రిడ్‌పట్టణమునకు కొలదిమైళ్ల దూరమున స్పెయినుదేశపు పూర్వరాజులలో నొకడగు రెండవ ఫిలిప్ చే నిర్మింపబడి నలుబదివేల పుస్తకసంపుటములతో నేడు విరాజిల్లుచున్న బ్రహ్మాండమైన ఆపుస్తకభాండాగారము ఈ ఒక్కవ్యక్తి ధైర్యసాహసములచే నిర్మూలనమునుండి నిరోధింపబడెను. పుస్తకభాండాగారమును తగులబెట్టు తలంపుతో కత్తులు, పెట్రోలు పట్టుకొని అల్లరిమూక అచ్చటికి చేరుసరికి అచ్చట ఒకయుద్ధభటుడుగాని, సివిల్ గార్డుగాని లేకుండెను. డాక్టరు బెర్నార్డుమార్లే లోన శాంతముగ చదువుకొనుచు అల్లరిమూకరాకను వారిగల్లంతునుబట్టి తెలిసికొనెను. ఎదురుగనున్న ఒకపెద్దకర్రనుమాత్రము కరమునకీలించి యాతడు వారి నెదిరించుటకై బయటకువచ్చెను. మేఘగంభీరస్వరమున ఉపన్యసించుచు, దీనికి ఆశ్చర్యచకితులై యున్న ఆఅల్లరిమూక నాయకులతలల పైభాగమున తనకరముననున్న కర్రనుత్రిప్పుచు ఆఐరిషు అధ్యాపకుడు ఆగ్రంథసముదాయమును పరిరక్షించెను. ఉద్రిక్తుడగు నా అధ్యాపకుని గంభీరోపన్యాసము అల్లరిమూకకు జ్ఞానమునురప్పించి వారిచేతిరుగు మొగముపట్టించినది. పోవుచు ఆమూకలోని పలువురు మార్లే ధైర్యసాహసములనుప్రశంసించిరి. మాడ్రిడ్‌నందలి వార్తాపత్రికలన్నియు డాక్టరు బెర్నార్డుమార్లేయొక్క చిత్రపటమును, జీవితకథను ప్రచురించి ఆతనిని బహువిధముల ప్రశంసించుచు సంపాదకీయములు వ్రాసినవి. ఇట్టివారు లోకారాధ్యులుగదా!

వార్తాపత్రికల భాండారము:—

ఆంగ్లదేశమున నేడు ప్రచురింపబడుచున్న పత్రికలకు లెక్కలేదు. అగుట బ్రిటీషు మ్యూజియమున ఆపత్రికల సంచికలనుఉంచుటకు స్థలసంకోచముకలిగినది. అందుచేత హెండన్ నందలి కోలిన్‌డేల్‌లోని క్రొత్త భవనమునకు బ్రిటీషుమ్యూజియమునందలి వార్తాపత్రికలశాఖను మార్చిరి. ౧౮౦౦ సంవత్సరము మొదలుకొని నేటిదనుక ప్రచురింపబడిన అన్నిబ్రిటీషుపత్రికలు, ఇతరదేశపు పత్రికలు సేకరింపబడి తారీఖులవారీగా అందు పేర్చబడియుండును. ఒక్కొక్కకాలము నాటి అభిరుచులను, భావనులను, ప్రజాభిప్రాయమును స్పష్టముగ తెలిసికొనుటలో సాంఘిక చరిత్రకారునకు వార్తాపత్రికలు తోడుపడునట్లు మఱియేవియు తోడుపడజాలవు. కాని ఈ నూటముప్పదివత్సరములుగ ప్రచురింపబడుచున్న వార్తాపత్రికల నన్నిటినిచదువ నభిలాషపడు సత్యప్రియుడగు చరిత్రకారుని కార్యముమాత్రము సుకరమైనదికాదు. ఏమన ఈవార్తాపత్రికలభాండారమున బైండుచేసినవి ౨౬౫,౦౦౦ సంపుటములుగలవు. వానితూకము ౨౦.౦౦౦ టన్నులను మించియున్నది. అసంఖ్యాకపత్రికాప్రచురణముగల బ్రిటనుదేశమునందు పత్రికలకొఱకు ప్రత్యేకభాండారముండగా వ్రేళ్లపై లెక్కింపగల పత్రికలకుమాత్రము నోచిపుట్టిన మన ఆంధ్రదేశమున పత్రికలకొకప్రత్యేకభాండారము లేదు సరిగదా మనసాధారణగ్రంథభాండాగారములందయినను పత్రికలను సంపుటములుగ కట్టి కాపాడుపద్ధతి విరివిగా అవలంబింపబడుచున్నట్లు కానము. ఇకనైన ఆంధ్రదేశమునందలి ప్రతిగ్రంథాలయమునందును అచ్చటికివచ్చు ప్రతిపత్రికయు సంపుటములకెక్కి జాగ్రత్తగ కాపాడబడునట్లు ఆంధ్రదేశమునందలి వివిధగ్రంథాలయపాలకులు విశేషమైన శ్రద్ధవహించుట వాంఛనీయము.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౧౦. తర్కసంగ్రహము

ఆయుర్వేదమునకు పదార్థవిజ్ఞానమును, పదసన్నిరూపణమును అత్యావశ్యకములు. అగుట పదసన్నిరూపకమును, పదార్థవిజ్ఞాననిరూపకమును అగు తర్కశాస్త్రము ఆయుర్వేదమునకు విడువరాని అండయైయున్నది. దీనివిలువ నారసిన మహాశయుడు గావుననే ప్రాచీనాయుర్వేదాచార్యులలో నతిప్రసిద్ధుడగు సుశ్రుతమహర్షి 'స్వతంత్రకుశలః అన్యతంత్రేష్వ బహిష్కృతః' అని నుడివియున్నాడు. ప్రాచీనాయుర్వేదాచార్యులలో మఱియొకడగు చరకాచార్యులును తన ఆయుర్వేదసంహితయందు ఈవిషయమును కూడ నెంత విపులముగ చర్చించియున్నాడు. అయితే కణాదగౌతమమహర్షులచే ప్రవర్తకమైన తర్కశాస్త్రము అపారమును, స్థూలబుద్ధులకు అగ్రాహ్యమును అయి ఉన్నది. అకారణమున తర్కశాస్త్రజ్ఞుడగు శ్రీఅన్నంభట్టపండితుడు విద్యార్థులకు సులభగ్రాహ్యముగ నుండునటుల తచ్ఛాస్త్రసారమును గ్రహించి క్లుప్తముగ తర్కసంగ్రహమనఁబడు గ్రంథమును వ్రాసియుండెను. మన ప్రస్తుతవిమర్శనమునకు పాల్పడిన గ్రంథము దానికి తెనుగుసేత. మూలగ్రంథశ్లోకములు, వానికి తెనుగుతాత్పర్యమును, అవసరమగు తావున విశేషవివరణమును ఈ తెలుగు తర్కసంగ్రహమున గలవు. ఆయుర్వేదానుబంధముతో వ్రాయబడిన ఈ ఆంధ్రతాత్పర్యము ఆంధ్రులగు ఆయుర్వేదవైద్య విద్యార్థుల కెంతయు నుపకరింపగలదనుట నిక్కము. ఈ గ్రంథరచయితలగు ములుగు విశ్వేశ్వరశాస్త్రిగారు సంస్కృతభాషాపండితులును, ఆయుర్వేదాచార్యులును నగుటచే నిందలి విషయములను సుఖబోధములగు నట్లు గావింపగలిగిరి. తర్కశిరోమణులగు శ్రీమాన్ వేదాల తిరువెంగళాచార్యులవారి తోడ్పాటును ఈ గ్రంథరచనమున శ్రీశాస్త్రిగారు పొందియుండుట లెస్సగనున్నది.

౧౧. ఆత్మజ్యోతి

ప్రకాశకులు:—ఆంధ్రసేవాకుటీరము, మేలుపాక, ఎలమంచిలిదగ్గఱ, (విశాఖపట్నముజిల్లా.) వెల 6 అణాలు. ఇది 136 పుటలు గల చిన్నపుస్తకము. కర్త: శ్రీముద్దా విశ్వనాథముగారు. టాల్‌స్టాయిమహర్షి విరచితమైన నీతికథలలో నొకదాని కిది స్వేచ్ఛానుకరణము. "టాల్‌స్టాయి మహానుభావుడే ఆంధ్రబాలబాలికలకు తేటతెనుగున నీకథ చెప్పుచున్నాడా" అన్నట్లు ఇది చక్కగా వ్రాయబడినది. ఇందు దీక్షితులను బ్రాహ్మణుడును, సుదర్శనమను బ్రాహ్మణేతరుడును తీర్థయాత్రలు సేవింప బయలుదేరిరి. ఉభయులును కలిసి కొంతకాలము నడచి కొన్ని యాత్రలు సేవించిరి. తరువాత వారొక కఱవుకొట్టు దేశము చేరిరి. అందొకగ్రామము చేరుసరికి సుదర్శనమునకు దాహమైనది. "దీక్షితులూ! నడుచుచుండుము. ఇప్పుడే మంచినీళ్ళు త్రాగివచ్చెద"నని సుదర్శన మారయూరిలో నొకయింటికివచ్చెను. ఆయింటివారందరును తినుట కన్నములేక, త్రాగుటకు గంజియైన లేక, మంచినీళ్ళైన తోడుకొనుటకు శక్తిలేక శల్యావశిష్టులై బల్లులవలె మంచములకో, చాపలకో, నేలకో అంటుకొనిపోయి, 'సర్వసేనామార్పుగా'పడి చావ సిద్ధముగానుండిరి. వారి గురవస్థచూచి సుదర్శనము చాలా జాలిపడెను. అట్టి వారలకు తాను ఓపినకొలది సేవచేయుటయే పరమార్థమనుకొని ఆ దయాపరుడు వారందరికి తనచేతనైన యుపచారములుచేసి, పునర్జీవితులగావించి, తాను దారి కర్చులకు తెచ్చుకొన్న ద్రవ్యముతో ఆకుటుంబస్థులు

షాహుకారునకీయవలసిన ఋణము కొంత తీర్చి వారి భూమి విడిపించి పరుల వారి కిప్పించి, కృశాంగులగు నాపేదల శరీరపోషణమునకు మంచి యాహారము, వ్యవసాయమునకు వలయు బండి, రెడ్లును కొని యిచ్చి కొన్ని నెలలకాలము అక్కడనే ఉండిపోయి, అటుపైని యాత్రలుచాలించి యింటికి మరలి వచ్చెను. దీక్షితులు హిందూదేశమునందు కల సమస్త పుణ్యక్షేత్రములు సేవించెను. ఇతడు ప్రవేశించిన ప్రతిపుణ్యక్షేత్రములోను, దేవాలయముల గర్భగుళ్ళలోను తనకంటె సుదర్శనమే ముందువచ్చి దైవమును సేవించుకొనుచున్నట్లు దీక్షితుని కనులకు పొడకట్టుచుండెను. కాని పిలిచి మాటాడుదమన్న దొరకకుండెను. "ఏమి యీ విచిత్రము"ని దీక్షితులు ఆశ్చర్యపడి పోవుచుండెను. తుద కింటికివెళ్లి మిత్రునికలసికొని, జరిగిన సంగతులం తెలిసికొని, ఇట్లు విలపించెను :—"కాళ్ళు రోళ్లగునట్లు దేశమంతయు తిరిగినాను. నేపడిన వ్యయప్రయాసములు దేవుడు మెచ్చినాడో లేదో తెలియదు. కాని సుదర్శనముసేవమాత్రము స్వీకరించుట నిశ్చయము. సుదర్శనమే దేవుడు. దేవుడే సుదర్శనము. ప్రేమమాత్రము ధరించిన ఆత్మజ్యోతి, అఖండజ్యోతి. మానవసేవయే మాధవసేవ. గోసేవయే గోవిందసేవ. సర్వాంతర్యామియైన భగవంతుడు పైనున్నాడని విశ్వమంతయు వెలుపల వెదకుచు వెఱ్ఱినైతిని." ఇది చదువువారందరకు ఈపరమార్థము చక్కగా బోధపడును. "స్వకర్మణామభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః" అని భగవద్గీతయు, 'Let thy service to Humanity be thy prayer to thy God' అని పాశ్చాత్యఋషిసత్తములును చెప్పు సత్యమున కీకథ చక్కని యుదాహరణము. భగవంతుడు సర్వాంతర్యామి యగుటచేత మానవసేవ భగవంతునిసేవయేకాని మరియొకటి కాదను గొప్పసత్యమునుగ్రహించి ఆచరణలోపెట్టుట సామాన్యమైన పనికాదు. స్వార్థమే సర్వమనియు, "మా కాయువ్యము - మా కారోగ్యము - మాకు ధనము - మీకు ఋణము" ననుటయే జీవిత పరమార్థమనియు ననుకొని పెడదారిని బోవుచున్న నేటి మానవకోటికి స్వార్థత్యాగమును, మానవసేవయు మోక్షసాధనములను సత్యమును బోధించు ఇట్టి కథలు అత్యావశ్యకములు. శ్రీ విశ్వనాథముగారు ఈకథారచనమును చక్కగా నిర్వహించినారు. కథావివరణసందర్భములలో నేమి, సంభాషణసందర్భములలో నేమి, రచనము చక్కని లోకోక్తులతో నిండి జాతీయమై యొప్పుచున్నది. ప్రత్యక్షములా అనిపించు వర్ణనలలోను, సమయోచితమైన హాస్యప్రసంగములలోను, సందర్భోచితములైన యుపమానములతోను కూడుకొని శైలి సులభమై రసవంతమైయున్నది. 'ఆంధ్రావళి మోదమునం బొరయు' న ట్లీకథ సొగసుగా వ్రాసి కృతకృత్యులైన శ్రీ విశ్వనాథముగారి నభినందించుచు, ఇట్టికథ లింకనువ్రాసి భాషాసేవచేయుమని కోరుచున్నాను.

—గొబ్బూరు వేంకటానందరాఘవరావు.

౧౨. వైజయంతి

శ్రీకొల్లాపురసన్మహాలశాకవితాసంఘమునుండి వెలువడిన వార్షికపత్రిక. సంపాదకురాలు: శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు, నూజవీడు. సంపాదకురాలు ఈసంచికనుగూర్చి 'స్వవిషయము'న నిట్లు తెలుపుచున్నది: "ఈ 'వైజయంతి' అనున దొకవార్షికపత్రికగా ప్రచురింపదలంచినారము; ఇదియె ప్రథమప్రయత్నము. ఆంగ్లమందును, హిందీభాషయందును, సంస్కృతమందును గూడ ఈ సంఘమువారు రూపించుకొలది కృషిచేయుటంజేసి యిందు తత్సంబంధమగు వ్యాసములు ప్రకటింపబడినవి. ఆంధ్రము ప్రధానముగ నుండును." ఇందుగల వ్యాసములలో రెండుమూడు తప్ప మిగిలినవన్నియు పద్యమయములు మూడు నాలుగు ఆంగ్లగద్యవ్యాసములును గలవు. అందు శ్రీజటప్రోలు సంస్థానాధీశ్వరులగు శ్రీరాజా సురభి వేంకటలక్ష్మణరావు బహదూరువారి జీవితము ముఖ్యమైనది. ఈఆంగ్లవ్యాసమును రాజావారి సంస్థానమునకు చెందిన భాషాసేవకులగు శ్రీవాజపేయయాజుల రామసుబ్బారాయుడు బి. ఏ., గారు వ్రాసినదగుట సత్యాంశములతో గూడియుండి రాజాగారి చరిత్ర చక్కగ తెలుపుచున్నది. కవిత్వమునుగూర్చి కొందరు ఆంగ్లకవులిచ్చిన

అభిప్రాయములు కొన్ని యస్. ఇ. రాజగోపాలరావు గారు సమీకరణముగావించి ఇందు చూపియున్నారు. ఇందలి మూడవ ఆంగ్లవ్యాసము 'శాస్త్రము, వేదాంతము, మతము' అనుదానిని గూర్చి. ఈ వ్యాసమును రచియించినది కె. వెంకటకృష్ణారావుగారు బి. ఏ. ప్రాక్పశ్చిమసిద్ధాంతము లిందు చర్చింపబడినవి. ఇక ఆంధ్ర గద్యవ్యాసములలో శ్రీచాగంటి విశ్వపతిశాస్త్రిగారు బి. ఏ. వ్రాసిన 'వ్యసనములు ఫలించునా?' అనునదియు, శ్రీ జంధ్యాల జానకీరామశర్మగారు వ్రాసిన 'యతులు, ప్రాసలు' అనునదియు ముఖ్యమైనవి. పాళీభాషనుంచి అనువదితమై ఇంకను ప్రచురితమైన 'జవశకున జాతకము' ఇందలి గద్యవ్యాసములకు శిరోభూషణము. పద్యవ్యాసములలో కొన్ని శ్రీయుత కేతవరపు వేంకటశాస్త్రి, కీ. శే. జనమంచి వేంకటరామయ్య, కీ. శే. ఆకొండి వ్యాసమూర్తిశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహము, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి మొదలగు ప్రఖ్యాతకవిపండితులచే వ్రాయబడినవి. డబుల్ క్రౌను సైజున ౭౨ పుటలు. కోరువారి కీపుస్తకము ఉచితముగ నొసంగబడును. వెలయువారు సంపాదకురాలిపేర వ్రాయవలయును. ఈసంచిక ప్రచురించుటకు ప్రధాన కారకులైన శ్రీవాజపేయయాజుల రామసుబ్బారాయుడుగారు అభినందనీయులు

౧౩. రసేంద్రసారసంగ్రహము

ఆయుర్వేదవైద్యము ఎడల ఇపుడు ఆంధ్రదేశమున మంచి అభిమాన మేర్పడియున్నది. అగుటచే ఇపు డాంధ్రదేశమున పెక్కు ఆయుర్వేదౌషధశాలల నిర్మాణము, కొన్ని ఆయుర్వేదగ్రంథప్రచురణముల ప్రారంభము జరుగుచున్నది. ఆయుర్వేదభిషక్, వైద్యవిద్వాన్, భూషణ, విశారద, భిషగ్రత్న బిరుదాంకితులు శ్రీ శ్రీపాద దేవీశంకరప్రసాదశర్మ (ఎ. ఆర్. ఎ. సి) గారు ఇప్పట్టున 'క్షీరసముద్రం ఆయుర్వేద ఫార్మసీ'యను పేర నొకఆయుర్వేదౌషధశాలను నిర్మించుటయేగాక ఆయుర్వేదగ్రంథప్రచురణమునకు గూడ గడంగినది కాలానుగుణ్యముగనున్నది. వీరుకొన్ని ఆయుర్వేదగ్రంథములను ప్రకటింపదలచి యుండి ఆ గ్రంథపరంపరకు ఆంధ్రాయుర్వేదగ్రంథమాల అని పేరిడిరి. మన ప్రస్తుతవిమర్శనకు పాల్పడిన 'రసేంద్రసారసంగ్రహము' ఆంధ్రాయుర్వేదగ్రంథమాలలో ప్రథమపుష్పము. ఈ 'రసేంద్రసారసంగ్రహము' సంస్కృతమున మహామహోపాధ్యాయ గోపాలకృష్ణ భట్టసూరి విరచితము. ఆంధ్రగీర్వాణభాషాకోవిదులును, కవులును అగు బ్రహ్మశ్రీ పండిత పామర్తి సూర్యప్రకాశశర్మగారి తోడ్పాటున శ్రీ శ్రీపాద దేవీ శంకరప్రసాదశర్మగా రీగ్రంథమునకు తెలుగున తాత్పర్యము వ్రాసియుండిరి. పూర్వఖండముమాత్రము ప్రస్తుతము ప్రచురితము. ఇందు రసాదులశుద్ధులు చక్కగ నిరూపితములు. ఆంధ్రదేశమున రసవైద్యము బహుళప్రచారమునను న్నది. 'దోషయుక్తమైన రసము విషము, శుద్ధమైన రసము అమృతము' అని గోపాలకృష్ణభట్టసూరి. విషముకంటి రసమును అమృతముగా చేసికొనజాలు పలుమార్గములను నిరూపించు ఆంధ్రతాత్పర్యసహితమగు ఈ 'రసేంద్రసారసంగ్రహము' ఆంధ్రులగు రసవైద్యులకు బాగుగా నుపకరింపజాలుననుట నిశ్చయము. ఈ ఉత్తమగ్రంథమునందలి ఇతర ఖండములనుగూడ సత్వరప్రచురణముగావించు అవకాశము శ్రీశర్మగారికి ఆంధ్రవైద్యవిద్వాంసులు కల్గింతురుగాక! గ్రంథము డెమ్మిసైజున గ్లేజుకాగితములమీద ముద్రితము. ౧౨౦ పుటలు. వెల రు ౧-౦-౦. ప్రకాశకుడు: శ్రీపాద దేవీ శంకరప్రసాదశర్మగారు, రాజమండ్రి.

౧౪. భాగవతావతరణము

'సంయమిప్రకరసంభావ్యానుభావుండు', 'విజ్ఞానసంపద్విఖ్యాతుండు', 'విద్వత్సంస్తవనీయభవ్యకవితావేశుండు' నగు వ్యాసుడు 'మానవుల కెల్ల మేలగునని భారతాఖ్యానంబు నేసియు భూతహితంబునందుఁ దన హృదయంబు సంతసింపకున్న' 'దుస్పంతాపాపహ' మగు సరస్వతీతటమున వికలచిత్తముతోనుండి ఈగ్రంథమునందు మనకు పరిచితుడగుచున్నాడు. రామాయణావతరణమునకును, భాగవతావతరణమునకును ఆయా ఉత్తమగ్రంథరచయితల చిత్తవిక్షేపములతో చాల సంబంధముకలదు. భాగవతావతరణమునకును, వ్యాసుని

చిత్తవిక్షేపమునకును గల సంబంధము ఇందు చూపబడినది. ఇది యొకపద్యనాటిక. కర్తలు సాహితీసమితి సభ్యులగు శ్రీయుత నోరి నరసింహశాస్త్రిగారు బి.ఏ., బి.యల్. హాస్యమాధుర్యములను కలంచిన విషయమిందు బాగుగా ప్రస్తరింపబడియున్నది. శైలి తెలియుటకై మూడుపద్యముల నెత్తిచూపెదము.

శా. శాంతం బీ బదరీవనాశ్రమ తరు
చ్ఛాయా నివాసంబు దు
ష్కాంతాపాపహ మీ సరస్వతీనదీ
స్రోవాహ్యవ్యాసారావ మే
కాంతం బీ మృదుశాద్వలస్థలము
నష్టైనస్ మనస్సీల య
శ్రాంతత్వుబ్ధ మహార్ణవంబుపగిదిన్
సంక్షోభమును కెందిడిన్ ?

ఉ. ఓ మహనీయ ధర్మ వినయోన్నత
చిత్త, అశేషవేద వే
త్తా, మునివంశ్యవృత్త, జనతా
ఘనసంస్తుతి తాపమార్పగా
నీమహి బుట్టినట్టి పరమేశ్వర
మూర్తివి జ్ఞానకీర్తి, చే
లా మది వ్యాకులంబయిన
దయ్య వదింపు పరాశరాత్మజా !

ఉ. నీ రసనాగ్రవర్తినియయి నిత్యము
నృత్యముచేయువాణి పం
కేరుహనాథనామగుణకీర్తనచే
మురవైరి సత్కథా
ధోరణిచేత భాగవతధూర్వహణంబున
వస్నెగాంచు, సం
సారమహాబ్ధిమగ్నజనసంతతికిన్
తరిదై వెలింగెడిన్.

ఈ సరసరచనము సుందరముద్రణమున నొప్పుచున్నది. డెమ్మి చిన్నసైజున ౬౦ పుటలు. ఖైదరువెయిటు కాగితములు. వలయువారు గ్రంథకర్తనేర గుంటూరు జిల్లా: రేపల్లె వ్రాయునది.

౧౫. బందిగములున్న వే దేశభక్తులకును ?

లార్డుబైరన్ గారి 'ప్రిజనర్ ఆఫ్ చిలాను'నుండి అనువదింపఁబడినది. గ్రంథకర్త జే. సుబ్బయ్యగారు. ప్రొద్దుటూరుపురవైశ్యప్రముఖులగు గాధంశెట్టి సుబ్రహ్మణ్యశ్రేష్ఠిగారి కీగ్రంథము అంకితము చేయబడినది. దేశభక్తి, కష్టసహనశీలము ఇందు కీర్తింపబడిన ముఖ్యగుణములు.

"స్వేచ్ఛచేకూరె మాకున్న యిచ్ఛలీలఁ
జచ్చియుఁ బ్రతుకువార మీజగతియందు
బందిగములున్న నే దేశభక్తులకును?"

క్రౌనుసైజున ౩౨ పుటల గ్రంథము. వెల రు. ౦-౪-౦. గ్రంథప్రతులు వలయువారు గ్రంథకర్తపేర కడపజిల్లా, ప్రొద్దుటూరుకు వ్రాయునగును.


౧౬. ఆటో మోటివ్ ఇంజనీరింగుస్కూలు

మద్రాసునందలి ఆటోమోటివ్ ఇంజనీరింగు స్కూలువారి విద్యాప్రణాళికను తెలుపు చిన్నగ్రంథము. మధురయందలి గవర్నమెంటువారి ఇండస్ట్రియల్ ఇన్‌స్టిట్యూటునందలి మోటారుసెక్షనుకు అసిస్టెంటు సూపరింటెండెంటుగ నుండిన వి. వేణుసామిఅయ్యంగారు ఎ. యమ్. ఎ. ఇ గారు ఈపాఠశాల నిర్వాహకులు. నిరుద్యోగసమస్య ప్రబలియున్న ఈ దినములలో ఇట్టి వృత్తివిద్యాపాఠశాలలెంతయు వాంఛనీయములు. ఈ గ్రంథము కోరువారికి ఉచితముగ పంపబడును.

౧౭. బాలభక్తులు

ఇది పాఠశాలల ఉపయోగార్థమై అవంత్స వెంకటరత్నముగారిచే రచింపఁబడెను. ఇందు ప్రహ్లాదుఁడు, ధ్రువుఁడు, మార్కండేయుఁడు, నందుఁడు అను నలుగురు పౌరాణికబాలభక్తుల కథలు గలవు. ఈ గ్రంథపు మొదటికూర్పుప్రతులు త్వరలోనే అమ్ముడుపోయియుండుట గ్రంథప్రచారమున గ్రంథకర్తగారి శ్రద్ధను సూచించుచున్నది. ఈగ్రంథము మూడవముద్రణమున ఈరెండవకూర్పుకంటె సుందరముగ అచ్చొత్తింపబడుట కోరదగినది. క్రౌనుసైజున ౯౨ పుటలు. వెల రు. ౦-౧౦-౦ పుస్తకములకై గ్రంథకర్తనేర పెద్దాపురము పోస్టు, ఆనూరు వ్రాయునది.

"ఆంధ్రభూమి"



పురిపండా అప్పలస్వామి.

ఆంధ్రుడా!

ఆంధ్రుడా! నీవు పరభూములందునున్న
సాగరముదాటి దూరదేశములనున్న
ఖండఖండాంతరంబులకడలనున్న
వలసదేశంబులందు నివాసమున్న
తెలుగుబిడ్డవె, నమ్మిది తెలిసికొనుము.
నీవు నీదేశమందు జన్మించకున్న
నీవు నీభాష పూర్తిగా నేర్వకున్న
నీవు పరమతపరధర్మనిరతినున్న
నీవు పరసంప్రదాయముల్ నెరపుచున్న
తెలుగుబిడ్డవె, నిజముగా తెలిసికొనుము.
నీవు పరవేషములువేసి నిగుడుచున్న
నీవు పరభాషలెన్ని జీర్ణించుకొన్న
నీవు నీభాష స్మృతియందు నిలుపకున్న
నీవు నీమత మెంత మన్నింపకున్న
తెలుగుబిడ్డవె, నిను నీవు తెలిసికొనుము.
నీవు నీభూమి విడువంగ నేర్తుగాక
నీవు నీభాష మరువంగ నేర్తుగాక
నీవు నీనడవడి మాననేర్తుగాక
నీవు నీజాతి నిరసింప నేర్తుగాక
నీవెటులు నాంధ్రుడవు గాకపోవు నమ్ము.
నీవు పరదేశములయందు నెలవుగాంచి
దొడ్డవాడను కీర్తినొందుదువుగాక
చెడ్డచేష్టల కలవడి చెడెదుగాక
కూలిపని చేసుకొని బ్రతుకుదువుగాక
బిచ్చమెత్తుక పొట్ట నింపెదవు గాక
భాగ్యవంతుడవై మిట్టిపడెదు గాక
భోగవంతుడవై పొంగిపోదుగాక
నిత్యసుఖశాలివగుచు రాణింతుగాక
ఘోరదారిద్ర్యమునకు జిక్కుదువుగాక
క్రూరరోగభయార్తి గ్రుక్కుదువుగాక
సంతతస్వేచ్ఛచే ప్రకాశింతుగాక
స్వేచ్ఛలేక కృశించి నశింతుగాక
నీవు గడియించుప్రఖ్యాతి నీదికాదు
నీవు పొందెడునిందలు నీవికావు
నీవు పడసెడుమన్ననల్ నీవికావు
నీవుపడుపాట్లు నిజముగా నీవికావు
నీ వనుభవించు సకలంబు నిన్నుగన్న
యాంధ్రజననివె నమ్మిది యరయుమయ్య.
పుట్టనే లేదు నేనాంధ్రభూమియందు
మెట్టనే లేదు నేనాంధ్ర మేదినిపయి
చూడనే లేదు నే నాంధ్రక్షోణి నెపుడు
వాడనే లేదు నే నాంధ్రభాష నెపుడు
పీల్వనే లేదు నే నాంధ్రవీథిగాలి
నిల్వనే లేదు నే తెల్గునేలమీద
త్రావనే లేదు నే నాంధ్రధరపయస్సు
పోవనే లేదు నే నాంధ్రభూమియందు
శైలశృంగారకాంతారజలధితీర
సైకతస్థలసారకాసారపుణ్య
నదనదీసాగరద్వీపనవ్యభవ్య
సస్యసుశ్యామలామలచారుచంద్ర
చంద్రికాసారపూరప్రశాంతదేశ
సంతతవిహారసౌఖ్యంబు చాయనైన
తెనుగుగానంబు విని చొక్కనెనయ లేదు
తెనుగుక్రీడల నేనాడు తనియ లేదు
తెనుగుతోటలపండిన తెనుగురుచుల
గేరు ఫలపుష్పముల రుచిసౌరభములు
నారసన నాదునాస లెన్నడునుగాని
యనుభవించి యెరుంగ వహోయటంచు

తెనుగుశిల్పంబుసిరికిని తెనుగుచిత్ర
నైపుణికి తెన్గుకైతవిన్నాణమునకు
భావమలరారి తన్మయత్వమున మ్రొక్క
భాగ్యమేనాడుగాని నే బడయలేదు
నేను కలనైన తెనుగుజెండాను జూచి
ముదము తళుకొత్త కోర్కులు మోసులెత్త
తనువు పులకింప చిత్తము త్తరింప
బత్తి చిగురెత్తగా చేతులెత్తి మ్రొక్కి
నాదుమానంబు పాదు ప్రాణాలబరణి
యిదియె నాయిలువేల్పు నాయేడుగడయు
నిదియె యనిపొంగి మురియలే దెపుడుగాని
తెలుగుసీమకు నాకును చెలిమి యేడ
ప్రేమ యెటుపుట్టు నాకాంధ్రభూమిమీద
అని వితర్కింపబోకోయి యాంధ్రతనయ !
తరతరంబులనుండి నీ తనువునందు
సోనలై పారునది యాంధ్రశోణితంబు
శోణితంబన నేల నీసుభగమైన
యాకృతిని శేష మాంధ్రతాభ్యంచితంబు
అంగవైఖరి యాంధ్రరేఖాంచితంబు
లపనమే ఆంధ్రలక్షణాలక్షితంబు
ఇదియదియనంగ నేల నీ యాశరీర
మక్షయంబైన యాంధ్రులభిక్షగాదె
ఏవసనగన్న మాతోడ నీవుగూడ
తెనుగువాడవె నీయాదిజననియైన
తెనుగుభూమికి ఋణపడితివి నిజంబు
తెనుగునేలను జననంబు గనకయున్న
తెనుగుతల్లిని కనులతో గనకయున్న
తెనుగుధాత్రి నిపుడు ప్రోదిగనకయున్న
తెనుగుతత్వంబు నీకేమి తెలియకున్న
తెనుగుముద్రతప్పదు నీకు తెలిసికొనుమయ్య.
జన్మదేశముమీద నీజాతిమీద
నీయుదాసీనతను మానివేయుమయ్య
తీరుతీయంబులకు సాటిదీటులేక
దేశభాషలలో లెస్స తెలుగటంచు
సకలజాతులచే పొగడికలుగన్న
తెనుగునుడికారముల సొంపు తెలియుమయ్య
తెనుగునడవడి నలవర్చుకొనగదయ్య
అవశతనునైన తెనుగన్న యమృతపునుడి
చెవికిసోకిన యంతనే చిత్తమలరి
తనువు పులకించునంతటి తమక మొదవు
నిరుపమానాభిమానాన నెగడుమయ్య;
అమితమమకారమున పాకులాడవయ్య.
తెనుగుభూమి తెనుగుజాతి తెనుగుబాస
తెనుగువేసంబు ప్రేమమై గనగదయ్య
తెనుగుసతులను యతులను తెనుగుకవుల
తెనుగురాజుల మంత్రుల తెనుగుభటుల
తెనుగునాయకమణుల కీర్తింపుమయ్య.
శీలసంపదచే శౌర్యశిఖలచేత
ప్రతిభచే ప్రభచేత ప్రభావగరిమ
చేత చౌషష్టి విద్యలచేత నిత్య
భూతిచే నీతిచేత విఖ్యాతిచేత
తెలుగుదేశంబు దీపించు తీరులెల్ల
తెలిసి వర్తించి పరుల బోధించుమయ్య
మించుతను ఫలసిద్ధి సాధించుమయ్య
ఖండఖండాంతరములందఖండలీల
తెనుగువిజయోత్సవంబులు తెరలకొనగ
తెనుగుమంగళతూర్యముల్ దిక్కరీంద్ర
కర్ణములను ప్రతిధ్వనుల్ గలుగ మ్రోగ
తెనుగుమయమయి గజమెల్ల తేజరిల్ల
తెనుగుజాతిపతాక దిగ్దిశల జెలగ
తెనుగుజ్యోతిని వెలిగించి తనరుమయ్య;
ఘనత నాంధ్రత్వమును నిల్పుకొనగదయ్య;
తెనుగుజనని మహాశీస్సులను రహించి
జననసార్థకముగ మని తనియుమయ్య.

మునిపూడి వెంకటేశ్వర్లు

పతిభక్తి

కథకులు
కొడవటిగంటి కుటుంబరావుగారు

చిత్రకారులు
శ్రీపాద దుర్గారావుగారు

౧

"ఇందులో నాతప్పేమున్నదో ఆలోచించి చెప్పండి. నిష్కారణంగా ఈ అపవాదుపడ్డం నాకెంతమాత్రం ఇష్టంలేదు. మొన్న మావురదలంకుటుంకు మామరదలన్నదా లేదా?...మా అక్కయ్య నీకు చాలబడి చేస్తున్నదిట, ఏమిటని. మొగుడూ పెళ్ళాలమధ్య లక్షగ్రంథం నడుస్తుందిగాక! అదంతా లోకం సాక్షియైపోయి ఈవిధంగా నన్ను బాధించడమనేదున్నదే, చాలా శోచనీయమే కాకుండా లజ్జిన ఏడవాలిసిన సంగతి. నే నంతకన్న ఎక్కువ చెప్పలేను."

నిజమే! నాకు ఆడవాళ్ళు భర్తలయందు భయభక్తులూ, వినయవిధేయతలూ కలిగి దాసానుదాసులై ఉంటే చూడాలని ఉంటుంది. అంతమాత్రంచేతనే నన్ను పసిపిల్ల బాలాదిపర్యంతం వ్రాసుపత్రికి పోతున్నవాణ్ణి చూసినట్లు చూడక్కర్లేదు. నాకూ ఈ కాలప్రకృత్తులు నచ్చకపోలేదు. క్రాపింగులు పెట్టుకోండి, మైలగుడ్డలతో భోజనంచెయ్యండి, శూద్రవాళ్ళతో కలిసి ఒకబంతినే భోజనాలఘోరించండి. నేనడగను. ఎట్లాగో కలికాలం ఈవిధంగా పరిణమించే ఉందిట. కాని ఆడవాళ్ళకు స్వేచ్ఛఇచ్చి కులకమనటానికి నా అంతరాత్మను నిలువునా చీల్చినా ఒప్పదు. వాళ్లను ఖైదీలకిందనుంచి ఒక కాలితో ఒత్తిపట్టకపోతే—అమ్మో! స్త్రీబుద్ధిః ప్రళయాంతకః అన్నవాడు వెర్రివాడా?

నాకెంతమాత్రం ఆలోచనే పెళ్ళిష్టమనుంటే పెళ్ళి చేసుకోకనేపోదును. కాని నాపెళ్లి నాకు చాలా చిన్నతనంలోనే అయిపోయింది. ఏంచెయ్యను? ఆభగవంతుడు నాయందు ఇంకనూ దయఉంచలేదు. నాభార్యకు ఇతరస్త్రీలందరికీ ఉన్న దుర్గుణాలన్నీ ఉన్నై. ఒకటి నవ్వటం. పురాణాల్లో పతివ్రతలను తీసుకోండి. వాళ్లెక్కడైనా నవ్వినట్టు నిదర్శనం ఉందేమో చూడండి. ఎందుకుంటుంది? ఆడది నవ్వితే నాకంతా ఇంతా మంటకాదు. చక్కగా, గంభీరంగా ఉండలేరూ? అసలు నవ్వే నాలుగందాల చెరుపని ఊరికే అన్నారా ఏమిటి? రెండో దుర్గుణం అతిగా మాట్లాడటం. పతివ్రతకు—అనగా సర్వకాల సర్వావస్థలయందూ మొగుడిసంగతి విచారించేదానికి— అంత మాట్లాడటానికి అవకాశం ఎక్కడుంటుంది! ఒకళ్ళతో ఒకళ్ళు ఎక్కువగా మాట్లాడుకోటం ఒకటి. మగవాళ్ళతో మాటకుమాట సమాధానంచెప్పటం ఒకటి. ఇటువంటి దుర్గుణాలు సామాన్యంగా ఆడవాళ్ళందరికీ ఉన్నై. నాదురదృష్టంచేత అన్నీ నాభార్యకూ అబ్బినై. ఏచింతా ఎరగని నాజన్మకిదో పెద్ద మనోవ్యాధి అయిపోయింది.

ఇవన్నీ బహిరంగంగా చెప్పవలసినవి కావు కాని ఉన్నసందర్భమంతా పూసగుచ్చినట్టు చెప్పకపోతే నావల్ల నేరం ఉన్నదీ లేందీ మీకెట్లా తెలుస్తుంది?

నాపెళ్లాం అందరాడవాళ్ళల్లే ఉండటమే కాకుండా వాళ్ళు వాళ్ళమొగుళ్ళను చూస్తున్నదానికన్న నన్ను చాలా చులకనగా చూసేది. నన్నన్నీ అసందర్భమైన ప్రశ్నలు వేసేది. త్వరగా వంటకానివ్వే అంటే మిమ్మల్ని వెనకనించి అట్లా తరుముతుంటే మీరాఫీసులో ఎన్నాళ్లు పనిచెయ్యగలరు! ప్రతిరోజూ మీచేత అట్లా అనిపించుకోవాలంటే చూడండి ప్రాణంఎట్లా ఉంటుందో అంటుంది. కావాలని ఎన్నిసంవత్సరాలైనా వంటచెయ్యొచ్చుగాని వంటచెయ్యకతప్పదు, విధి, అనుకుంటూ ఒక్కరోజుకూడా చెయ్యలేనమ్మా అంటుంది.

"ఏమండోయ్! ఇవాళ పొద్దున మీరిట్లా ఆఫీసుకు పోగానే మీబావగారొచ్చారు." (మామేనత్తకొడుకన్నమాట!)

"ఊఁ!"

"'వాడున్నాడా?' అన్నారు."

"నన్ను నువ్వు 'వాడు' అనవచ్చునా?"—నేను.

నా పెళ్లాం ముక్కుమీద వేలుపెట్టుకుని, "రామ! రామ! నేను మిమ్మల్ని వాడన్నానటండీ?"

"వాడున్నాడా అన్నాడంటివే?"

"అవును. ఆయనమాటలే అవి."

"అట్లా అనకూడదు."

"వారున్నారా అన్నారనాలా?"

నాకీపాటి కల్లా చిరాకువచ్చి నోరుమూసుకోమంటాను. నేను మాటాడలేక తిడుతున్నానంటుంది. మాటకుమాట చెప్పటం అసహ్యమైకాని ఇంతమాత్రానికే మాట్లాడలేక పోతామా? ఇదీ వరస.

పువ్వుపుట్టంగానే పరిమళిస్తుందిట. కాపరానికి వచ్చినరోజు లగాయతు దానిబుద్ధి ఎప్పుడు ఒక్క దిక్కుకే ఈడుస్తుంటే! తల్లో పిన్నులు కావాలి. పౌడర్లు కావాలి. మాసపత్రికలు కావాలి. ఒక్కటికూడా ఇచ్చావని కల్లోకూడా అనుకోకండి. నాకు జీతం తెలీకుండా మొగుడనైనా విచారించకుండా ఏకు డబ్బు ఖర్చవుతుందని భయంఆనటం పతివ్రతలక్షణమేనా?

దీన్ని ఏమిటిచెయ్యటం అని చాలా దిగులుకలిగింది నాకు. బాగా యోచించినమీదట నాకొక్కటే ఉపాయం కనపడ్డది. ప్రతిరోజూ దానికి పతివ్రతల కథలు చదివి వినిపించటం మొదలుపెట్టాను. నేనెప్పుడో మహాపతివ్రతలకథలని ఒకపుస్తకం కొన్నాను అది ఇప్పు డక్కరకొచ్చింది. తరవాత రామాయణం చదివాను.

ఒకరోజున నాభార్యకు పెద్దసందేహంవచ్చింది.

"ఏమండీ సీత మంచిపతివ్రతేనా!"

"అమ్మో! లోకంలో ముగ్గురు పతివ్రతల్లో ఒకత్తే."

"ఎవ రెవరండి?"

"అహల్యా ద్రౌపతీ సీతా—వీళ్లు ముగ్గురూ."

"అహల్యంటే ఇంద్రుడితో—?"

"అట్లాఅంటే కళ్లురెండూ పోతై."

"ద్రౌపతి పంచపాండవుల పెళ్లాంకదా?"

"అబ్బో నీపాతివ్రత్యానికి వీళ్ల నెక్కించవచ్చావే! సీత కేం వంకపెట్టావు?"

"అంతావంకే! అంతకన్న నేనే మంచిపతివ్రతను."

"ఎందువల్లో!"

"ఎందువల్లకాదో! ముందుసంగతసలు సీత రాముణ్ణి నువ్వంటుందేం? ఏమిరాఅనికూడా అన్నది."

ఈవాదన కేంచెప్పను! అప్పటిమట్టుకు కోప్పడి నోరుమూశాను. మర్నాడు మళ్లీ ఆసంగతే ఎత్తింది మాఇంటిది. ఆలోచించగా నాకే అంత బాగాలేదు సీత రాముణ్ణి గౌరవంగా పిలవకపోవటం. తరవాత నేను బాగా తెలిసిన పెద్దమనిషి నడిగా నీవిషయం. ఆయన చెప్పిందంతా అర్థంకాలేదు కాని ఉన్నసందర్భం ఇంచుమించుగా ఇది. సీతారాములూ వాళ్లూ వాడిన భాష తెలుగు కాదుట. అదిసంస్కృతం అన్నాడాయన. ఎందుచల్లంటే అది దేవభాష. కనక భగవంతుడి అవతారాల్లో అదే ఉపయోగించబడ్డదన్నాడు. అదుపరి సంస్కృతవ్యాకరణం మనతెలుగువ్యాకరణమల్లేకాక కొంతపట్టేస్తుందిట. దానిప్రకారం ఎదురుగా ఒక్క మనిషి ఉన్నప్పుడు ఆమనిషి దేముడయ్యేది రాజయ్యేది ఏకవచనం ప్రయోగించాలిసిందేట. కనీసం ముగ్గురన్నా ఎదురుగాలేంది బహువచనంమాట తలపెట్టకూడదుట. అందుచేత సీత సంస్కృతంలో రాముణ్ణి ఏకవచనంలోనే సంబోధించింది. తెలుగులో తర్జుమా చేసిన పెద్దమనుష్యులు ఆ ఏకవచనం ఏకవచనంగానే ఉంచారట. ఇదంతా నా పెళ్లానికి చెప్పినమీదట ఎవరితో అడిగి కనుక్కున్నానన్నది. తనకు కావలసింది ఏకవచనమా, నేను కనుక్కోటమా?

అయితేఏం? రాపాడగా రాపాడగా రాళ్లైన అరుగుతై. క్రమంగా నా పెళ్లానికి పాతివ్రత్యాన్ని చూస్తే గౌరవం ప్రారంభించింది. నన్ను పతివ్రతలక్షణాలు, పతివ్రతామహాత్మ్యం వీటినిగురించి అడగటం మొ

దలుపెట్టింది. చావుకుపెడితే లంఖణాలకు రాకపోతుందా అని నాబుద్ధికి తోచినవన్నీ చెప్పాను.

౨

అదే మొదలనుకోండి నాకష్టాలకూ, అపఖ్యాతికీ.

పాతివ్రత్యాన్నిగురించి నా అభిప్రాయం నలుసంతైనా మారిందనుకోకండి—నేనంత తేలిగ్గా అభిప్రాయాలు మార్చుకునేవాణ్ణికాను—కాని ఈ పాతివ్రత్యాన్ని శాస్త్రోక్తంగా ఆచరణలో పెట్టాలంటే కొంత ఇబ్బంది కలక్కపోదు.

ఒకరోజుఉదయం నేను నిద్రలేచి పక్క మీదినించి లేవబోతూండగా నాపెళ్లాంవచ్చి నన్ను లేచినుంచోమని వంగి కాళ్ళంటుకుని కళ్లకద్దుకుంది. ఈచర్య నాకు వెంటనే అర్థంకాలేదు. చప్పున నాకు సిగ్గూ అసహ్యమూ కలిగి ఏమిటీవేళాకోళం అనబోతుండగా జ్ఞాపకంవచ్చింది! ఆరోజు కంతటితో పోయింది. ప్రతిరోజూ ఈ విధంగానే చేస్తుందాఏమిట్రా భగవంతుడా అని భయంవేసింది. కాని మరిచిపోకపోతుందా అనుకున్నాను. మరిచిపోయింది నేను. మర్నాడు మళ్లీ ఈప్రకారమే జరిగింది. ఆమర్నాడు. ఆమర్నాడు. ఆపని పోనీ చెయ్యకపోతే ఏమందామని నోటిదాకావచ్చింది. కాని ఎట్లాఅనను? నేను చదివినకథలన్నీ ఇందుకేగా? ఈనమస్కారాలుచేయించుకోటం కాకపోయినా నా ప్రాణానికొచ్చింది.



ఒకరోజు జ్ఞాపకంపెట్టుకుని ఆది లేవకముందే లేచి బయటికివెళ్లి ఎనిమిదింటికొచ్చాను. అట్లాతప్పుతుందా? నేను కనబడగానే నన్ను నిలబెట్టి నాపాదాలు కళ్ళకద్దుకుంది. మర్నాడుకూడా చీకటితోనే లేచిపోయి అది మడిగట్టుకున్న తరవాత వచ్చాను. కాని తప్పలేదు. మళ్లీ మడిగట్టుకుంటానన్నది. ఆఫీసుకు శెలవరోజుగా చూసి ఒంటిగంట కింటికి వచ్చినా తప్పలేదు. ఇల్లు వదిలి దేశంమీదలేచి పోయేవాళ్ళ భార్యలందరూ చెడ్డవాళ్ళని చెప్పలేం!

ఇంకోమోసంకూడా జరిగింది. తెల్లవారుగట్ట గదిలో నమస్కారాలుచేయించుకుంటే ఎవరికీ తెలీదేమోకాని కొంతపొద్దెక్కిన తరవాత ఆరు బయట చేయించుకున్నారో, లోకమంతా తెలిసిందే! మీభార్య ఇతరులుచూసి ఏమనుకున్నా లెక్కచెయ్యని పతివ్రత అయితే అడగక్కర్లేదు.

దీనితోనే నాకు దాన్నిచూస్తే హడలయిపోతే, ఇది చాలక పూర్వం చేసుకునే షోకులన్నీమానేసి జుట్టు గోళ్ళతోనే దువ్వి కొప్పుపెట్టుకుంది,

పెద్దకుంకంబొట్టు పెట్టింది, నీరకాయ చీరలు కాశా పోసి కట్టి భీకరాకారందాల్చింది. రామరామ! మనిషిలో ఒక్క రవ్వయినా ఆకర్షణలేకుండాపోయింది. ఉక్కున పేనర్లే ఉండవలసిందేకాని ఉలకటానికీ పలకటానికీ వీలులేదు. అక్కడికీ మనసుపట్టలేక ఈ అవతారంలోనే అందంగా ఉండకూడదా అంటే, నవ్వి, "ఏంపిచ్చండీ మీకు? అందంగా ఉండాలంటే పోకులే చేసుకోవాలా ఏమిటి?" అంది అంతటితో నానోరుకట్టు.

కొద్దికాలమయిన తరవాత నాభార్య నేనుత్తి నమస్కారాలతో తృప్తిపడటంలేదనేమో, పూజానమస్కారాలు ప్రారంభించింది. ఉదయం నేను లేవగానే పూలతో తయారు. అవి నాకాళ్ళమీద పూజచెయ్యటం, ఆపూలు కొప్పులోపెట్టుకోటం.

"పూలన్నీ నాకే పూజచేస్తే దేముడికో?" అన్నా నొకనాడు.

"దేముడికి పూలెందుకు? లేను దేముడిపూజ మానేశాను."

నాగుండె ఝల్లుమంది. తరతరాలనించీ వస్తున్న దేముడిపూజ ఇప్పుడు మానేస్తే నెత్తి అడుస్తుంది!

పైమాసపు సంచికలో

'పతిభక్తి' యను ఈకథను వ్రాసిన

శ్రీయుత కొడవటిగంటి కుటుంబరావుగారి

బొమ్మల పెళ్ళిళ్ళు

అను కథ ప్రచురింపబడును. ఆకథ బోధించు సత్యమిది:

"తనపెళ్ళినిగురించి మాట్లాడటానికి సిగ్గుపడని పిల్ల ఉండదు. ఒకవేళ మాట్లాడిందా ఆసంబంధం తనకు ఇష్టంలేదన్నమాట. ఇష్టంఉంటే ఆసంబంధం అవుతుందని నమ్మకం ఏమీలేదన్నమాట.

స్త్రీ ఇంకొకరి రహస్యాలు భద్రంగా దాచలేకపోయినా తనరహస్యాలుసంబంధించినంతవరకూ ఇనప్పెట్టె.

మగవాడు ఒక్కసారి మందరంనించి తారానికి పోగలడు.

మగవాడు తనయిష్టంవచ్చినపిల్లను పెళ్ళిచేసుకోటానికి నీతి, మతం, సంఘం - వీటినిగురించి తనకున్న అభిప్రాయాలన్నీ మార్చుకోగలడు"

"ఎంత కురూ చేశావు?" అన్నాను గదమాయించి.

అది మహాదీనస్వరంతో "క్షమించండి, నాకా దేముడితో పనిలేదు. నాకాకాలింగాల్లో ఇత్తడిబొమ్మల్లో నమ్మకంపోయింది. జ్యోతిల్లే మీరు సాక్షాత్తూ నాకళ్ళక్కనపడుతుంటే—"

"ఏవేదాంతనా చేస్తున్నావా?"

"లేదు."

నాకు తక్షణం ఏక్కడికైనాపోయి ఏక్కడెక్కి దూకవాలనిపించింది.

దాన్నికోప్పడి ఏమీలాభంలేదు ఇప్పుడీధోరణిమారి ఇనకటి తోవలో పడితే నన్ను గడ్డిపరకకింద చూడదు. నేను పన్యసించవలసిన వాణ్ణే. దేవతాహ్వనమా వినప్పుడల్లా గుండెబద్దలవుతున్నది. ఎంతకాలంనేను ఈఆకార్యం ఓరుస్తాను? దానికేం? దాని పాతివ్రత్యం దాన్ని రక్షిస్తుంది. దెబ్బపడేది నాపెత్తిన.

ఈదుస్థితిలో ఒకనాడు నాపెళ్ళాం నాతో అద్భుతమంటిమాట ఒకటి అన్నది.

"ఏమండీ, ఇంట్లో పూజాపునస్కారాలులేకపోవటంనాకు బాగాలేదు."

"అద్భుతమైనమాట అన్నావు. నీబుద్ధి కింతమంచి



ఆలోచన ఈమధ్య ఎన్నడూవచ్చినట్టు నాకు గుర్తు లేదు! దేవతార్చనకు మామూలుప్రకారం పూజానివేదనలు చెయ్యి."

అది నాకు నచ్చుతుందేట్టు తలఅడ్డంగాతిప్పి "అది కాదు. ప్రతిరోజూ నాకే పూజచేస్తాను," అన్నది.

నావెంట్రుకలు ఒక్కసారి నిక్కపొడుచుకున్నై. భయంతో శరీరం యావత్తూ కంపరమెత్తింది. ఎట్లా వద్దనను?

నాచేత స్నానంచేయించింది. మా అత్తవారిచ్చిన బరంపురం పట్టుతాపితాలు తడిపిఎండేసి అవి నాచేత కట్టించింది. ఒకపీటమీద పసుపు రాచి ముగ్గుపెట్టి దానిమీద కూర్చోమంది. పట్టుబట్టలు చెడిపోగాఅంటే వెంకటపట్టు బట్టలు పాడైపోయినయ్యేంది కూర్చున్నాను. నెత్తినిండా పూలు అక్షింతలూ వేసింది నీళ్ళుచిలకరించింది. బట్టలన్నీ ధ్వంసమయినై, నేను సగంపైగా చచ్చిఉన్నాను.

ఈసమయంలో "దొడ్డమ్మా" అంటూ వచ్చాడు పశిపోయినట్టు మామరదలికొడుకు నాపాలిటి యమకింకరుడల్లే!

ఇంకా ఈవిధంగా జరుగుతునేఉంది. కాని నేను తగిన మనోబలంతెచ్చుకుని త్వరలో ఇది అంతమయ్యేటట్టు చేస్తాను. నన్ను కుక్కనుచూచినట్టు చూస్తే చూసింది, నాపెళ్లాం మళ్లీ నాదగ్గిరికి వాలుజడేసుకుని చక్కని చీరకట్టుకుని మొహాం నబ్బువాసనా, ఫేసు పౌడరు వాసనా కొట్టుతూ వస్తుందా అని అనుకున్నప్పుడల్లా గుండె నీరవుతున్నది.



అదీ ఉద్యోగం

ఒకరోజున ఒక ఆఫీసులోకి వెళ్ళాను.

నేను వెళ్ళాననడంలో అత్యవసరత్వం యిమిడి ఉందన్నమాట. అంత అవసరమే లేకపోతే ఏ ఆఫీసుకు, ఏ ఆఫీసరుదగ్గరకు వెళ్ళనేవెళ్ళను. వెళ్ళడమంటే భయంకూడానూ. ఈ పాతికసంవత్సరాలలోనూ ఒక్కసారి ఒక గెజెటెడ్ ఆఫీసరును చూద్దామని, నాఅంతట నేను వెళ్లి పగలు పన్నెండుగంటలలో ఏరెండుగంటలో ఉదయం కాలకృత్యాలకు భోజనానికి పోగా మిగిలిన పదిగంటలూ కాచుకొనిఉండి చూడడం తటస్థించకుండా వచ్చాను. మరొకసారి ఒక పెద్దమనిషిద్వారా ఒక డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటును చూశాను. ఇహ ఆఫీసరునే ఎరగను.

ఏ ఆఫీసుకూ నాఅంతట నేను ఒంటరిగా వెళ్లలేదన్నమాటే, ఆమధ్య తాలూకాఫీసులో పనిచేసిన నాలుగునెలలూ తప్ప. ఆఉద్యోగమయినా ఒకర్ని చూడవలసిన అవసరములేకుండా వచ్చింది గనుక చేశాను. లేకపోతే ఆఉద్యోగమూ దొరకదు. నేను చేయనూచేయను. అంతకు తరువాతగాని, అంతకు పూర్వంగాని, ఆఫీసుకు వెళ్లితే ఎవరితోనైనా స్నేహితులతో వెళ్లవలసిందే. లేకపోతే వాళ్లేమనుకుంటారో అని భయం.

ఇప్పుడూమాత్రం ఒంటరిగా వెళ్ళడం తప్పలేదు. ఆఫీసు గేటుముందరే ఒకకుక్క తయారుఅయింది. అది నన్నుచూసేచూడడంలోనే భొంయిమని లేచింది. అది నన్నేం కరుస్తుందని భయంవెయ్యలేదుగాని, అపశకునమేమో నని భయంవేసింది. సబ్‌ట్రెజరీ ఆఫీసరు త్వరగా రాడేమో, షరాబు భోజనంచేసి సిగరెట్టుకాల్చుకుంటూ వచ్చేసరికి ఏరెండుగంటలు దాటుతుందో. ఆరోజు చలానారసీదు యూనివర్శిటీకి పంపగల్గుదునో లేనో అని అనుమానంవేసింది. అయినా పిల్లికనబడితే అపశకునం పిల్లికి విరోధిఅయిన కుక్కకనపడితే మంచి శకునమే అని సరిపుచ్చుకొన్నాను. కాని ఈ కుక్క భోంయిమంటూ మీదికివచ్చింది! కుక్క కనబడడం మంచిదేకావచ్చు కుక్క అరవడమో? ఈవిషయమయి ఆట్టే ఆలోచించడానికిమట్టుకు నాకు వీలు చిక్కలేదు. శిరస్తాదారుగారు నాపైకం కట్టుకుంటే నేనువెళ్లి ఆరసీదు రిజిష్టరుకవరులో యూనివర్శిటీకి పంపాలి. ఎంత ఆలస్యమవుతుందో ఏమో? రెండు గంటలుదాటితే పోస్టాఫీసులో రిజిష్టరు చేయరు. ఆయనగారితో మాట్లాడం ఏలాగో! నేను పనిచేసిన తాలూకాఫీసులోఆయనలాగానే ఈయన కూడా అతి చాదస్తుడూ, ముక్కోపీ అయితే ఇహ నాపని చెప్పనక్కర్లేదు ఈ ఆలోచనలు నన్ను కలవరపెడుతూంటే మెల్లగా ఆఫీసువరాండా చేరాను.

షరాబుగారు కూర్చుండేచోటికి వెళ్లాను. అక్కడ షరాబులేడు. సబ్‌ట్రెజరీ ఆఫీసరూలేడు. సాధారణంగా ఆఫీసుకు గుమాస్తాలుగాని, ఆఫీసర్లుగాని ఒక గంట ఇటోఅటో - తెలుసుగా అదే - వస్తూంటారని నేను పదకొండున్నరకు మాయింటిదగ్గర బయలుదేరి పన్నెండింటికి ఆఫీసుకు వెళ్లాను. ఆఫీసులోమట్టుకు ఎవ్వరూ లేరు, ఒకరిద్దరుతప్ప. నేనేమైనా పొరపాటు పడ్డానేమోనని గడియారమువైపు చూశాను. అదీ పొరపాటుపడలేదు చివరకు తాలూకాఫీసు గడియారంకూడా పొరపాటుపడదే. అయినా తాలూకాఫీసు ఉద్యోగస్థులు ప్రపంచకానికి కొన్నిగంటలు వెనకాల ఉంటారని అప్పుడు నాకు జ్ఞాపకంవచ్చింది. ఒక్కొక్క తాహసీలుదారుకు సాయంత్రం ఆరుగంటలప్పుడు పదకొండుగంటలయి రాత్రి పదకొండు పన్నెండింటికిగాని అయిదుగంటలుగాదు. ముసలివాడై ఇంటిదగ్గర ఏమీ యావలేకపోతే పొద్దున్నే పదకొండుగంటలవుతుంది; అర్ధరాత్రి అయినా అయిదు గంటలుగాదు. చిన్నవాడై ప్రాపకంవల్ల తాసీల్దారయితే ఆఫీసుటయిము అయిదుగంటలూ అట్టే అయి

పోతవి వాళ్ళవేళకూ పత్రగ్రహించారానికీ సంబంధమే లేదు. వాళ్ళనుబట్టే మిగిలినవారూనూ.

సిరస్తాదారుగారు ఎంతసేపటికి వస్తారో కనుక్కుందామని అక్కడ ఒక జవానుంటే- అతను జవానే అనుకున్నా మెడలో డవాలు అదీవుంది- "సిరస్తదారుగారు ఎప్పుడు వస్తారయ్యా?" అన్నాను. అతనికి నామాటలు వినపడనేలేదు. వినపడలేదేమో పరధ్యాన్నంగా ఉండడంవల్ల పెద్దగా చెప్పుదామనుకున్నాను. అయినా "నాకు చెముడా" అని అతను అంటాడేమోనని మెల్లిగానే "సిరస్తాదారుగారు ఎప్పుడు వస్తారు" అన్నా. అతను నావైపు తిరిగి 'ఎవరికి తెలుసు' అని నిర్మొహమాటంగా జవాబుచెప్పాడు. కాలుగాలినపిల్లిలా అక్కణ్ణుంచి వెళ్ళాను.

మేజస్ట్రేటుగారు అవతల కోర్టులో కేసులు విచారిస్తున్నారు. అప్పటికే జనం బయట వరాండాలో కూర్చుని గుసగుసలాడుకుంటున్నారు. ప్రతివాళ్ళ వ్యవహారాలు ఆ కూర్చున్న కాసేపులోనే కావాలె. ఏమిటో ఒకటే మాట్లాడడము. చాలాసేపు ఊరుకున్నాడు ఆమేజస్ట్రేటుగారు. చివరకు కోపంవచ్చింది కాబోలు రామూమరి. ఊరికే, కారణంలేకుండా జవాన్లకు కోపంవస్తూంటే, ఆఫీసరుకు, అందులో క్రిమినల్ పా. రుచేతిలో ఉన్నాయనకు కారణం ఉన్నప్పుడు కోపంరావడం ఆశ్చర్యమేముంది- జవాన్ను పిలిచి "మాట్లాడేవాళ్లను అవతలికి వెళ్ళమను. ఏమిటా గోల" అన్నాడు. అసలు జవాన్లు చెలాయించే అధారిటీకి ఒకళ్ళు చెప్పనవసరమే లేదు. అందులోనూ పై అధికారుల ఆజ్ఞ లేకుంటే వాళ్ల తెలివితేటలన్నీ ఉపయోగించారన్నమాటే.

జవాను గబగబ బయటకువచ్చి "ఏమిటయ్యా! ఏమిటాగోల!! పెద్దవాళ్లుగూడానూ. మాట్లాడేవాళ్లు క్రిందికిదిగి మాట్లాడండి. లోపల కోప్పడుతున్నారు మమ్మల్ని." అని కేకలువేశాడు. అప్పుడే వచ్చాడు ఒకాయన రోజుకుంటూ. వచ్చి ఇంకోరితో ఏమిటో రహస్యంగా మాట్లాడుతున్నాడు. జవాను కాలర్ని రుద్రుడై "ఏమయ్యా! ఇప్పుడేగా నోరుదించుకొని చెప్పింది. జ్ఞానంలేదు. లే అక్కడ. అవతలికి పో!" అన్నాడు. ఆయన నిర్ఘాంతపోయి ఆజనంవైపూ, ఆజవానువైపూ బిత్తరిచూపులు చూస్తూ మొహం చిన్నపుచ్చుకున్నాడు.

"పీడిదుంపతెగా! ఎంతేసిమాటలన్నాడు. ఈ కాలపు స్కూళ్లలో విద్యార్థులమీద ఉపాధ్యాయులకు ఈ జవానుకున్నంత అధికారమున్నా స్కూళ్లు బాగుపడిపోను" అనుకున్నాను.

ఇంతలో సిరస్తాదారుగారు వచ్చారు. ఆయనరాగానే వెళ్ళినాలాభంలేదని కొంచెంసేపు అక్కడేఉండి తరువాత వెళ్లాను. నేవెళ్ళేసరికి నలుగు రయిదుగురు తాలూకాగుమాస్తాలు కాగితాలు చేత్తోబుచ్చుకుని ఆయనను చూపించడానికి నుంచున్నారు. వీళ్లందరూ మాట్లాడడం కావాలె. అప్పుడు ఆయన చలానాలు తీసుకోవాలె. ఆరోజున అప్లికేషను ఫారము రిజిస్టరు చేయకపోతే చాలాయిబ్బంది. ఆపనిఅయి ఆయన పిలిచేసరికి ఆలస్యంఅవుతుంది ఫారం యిచ్చివద్దామని లోపలికి వెళ్లానుమెల్లిగా.

సిరస్తాదారుగారు గుమస్తామీద ఏమిటో కేకలు వేస్తున్నారు. అప్పుడు చలానాయిచ్చే వీలేమీ కనపడలేదు. ఆయన కేకలు ఆపింతర్వాత యిద్దామని అట్లానుంచోని ఉన్నా. ఇంతలో ఏమూలనో పనిచేసుకుంటూన్న జవాను- ఇందాక నాకేంతెలుసు అన్నాతనే.- "ఏమయ్యా! ఎందుకొచ్చావు?" అన్నాడు. నేను నాచేతిలో ఫారం చూపించాను.

"ఎక్కడికి తీసుకువెళ్లుతున్నావు. ఇటుతే బుడబుడ లోపలికిరావడమే ప్రతివాళ్లూ. బయటనుంచి ఇవ్వలేవూ!" అన్నాడు.

"నీవు గేటుదగ్గరలేందే" అన్నాను మెల్లిగానే.

"నువ్వువచ్చావని తెలియలే. వచ్చిందాకా ఆగు" అన్నాడు. అతనితో నాకెందుకు అని ఫారం అతనికిచ్చి యివతలికి వచ్చాను.

ఎంతసేపు కూర్చున్నా అంతుపొంతు కనబడింది కాదు. ఎండకాస్తున్నది. నన్ను పైకంకట్టడానికి కేక

చేయలేదు. వాళంతట నేను లోపలికి వెళ్లితే ప్రతివె... మాట్లాడేవాడే. లోపలికి వెళ్లకపోతే ఆరోజు రిజిష్టరు చేసేవేళయిపోతున్నది. నాకు ఏమీ తోచలే.

కూర్చొని కూర్చొని కొంతసేపటికి మనసుపట్టలేక లోపలికి వెళ్ళాను. శిరస్తాదారు అగుమాస్తాలతో నే మాట్లాడుతున్నాడు- మాటలంటే కేకలలాంటివి. జవాను నావైపు చూశాడు. నేను ఎంతవరకయిందన్నాను. అవుతుందిలే. తొందరపడితేఅవుతుందీ. మేంపిలవమూ అయితే" అన్నాడు. నాకు తోచపడలేదు వాడిదర్జా. తిరిగి వరాండాలోకి వెళ్ళాను.

కొంతసేపటికి శిరస్తాదారు నాఫారం చేతులో పుచ్చుకుని "ఎవరయ్యా ఈయన ఇటురమ్మను" అన్నాడు అకప్పగొంతుతో. ఏమవుతుందో అని నేను జాగ్రత్తగా వింటున్నాను. వెంటనే దగ్గరకువెళ్ళాను. "ఏమయ్యా కదిపేను లేకఇరవయ్యి అనిఅంటే ఏవోబకటి కొట్టివేయకపోతే ఏలా తెలుస్తుందయ్యా మాకు? ఏంచదువులయ్యా! ఇవేంచదువులో - బియ్యేలూ, ఎమ్మేలూ వస్తారు ఏమీతెలియదు. మాకాలంలో ఇంత అన్యాయంలేదు" అంటూ ఒకచిన్నఉపన్యాసం ఇచ్చాడు.

అయన అభిప్రాయం ఆయనతెలివితేటలకు, గొప్పతనానికీ ఆయనకు అశిరస్తాదారు ఉద్యోగంఇచ్చారని- బియ్యేపరీక్ష అయినకూడా రిటైర్ కావచ్చే ఈడుకు శిరస్తాదారులో ఉన్నా.

నేను కొట్టివేయకపోవడము పొరపాటు, లేకపోతే అసంగతి తెలియకనా? అయినా ఆయనదగ్గర మన పని త్వరగా కావలసిఉండడంచేత, పనిఅయితే మాపర స్పరాధికార్యాలతోనూ, తెలివితేటలతోనూ అవసరం లేకపోవడంచేతా నేను ఆయనఅభిప్రాయంఆమోదించే, చూపులో ఆయన అధికార్యాన్ని ఒప్పుకున్నట్టు నటిస్తూ సందర్భంలేకపోయినా రిజిష్టరుటయిము అయిందని ఆయనకు తెలియాలెవని "రిజిష్టరు చేసే టయిము అయిందండీ, పొరపాటు" అని అది తీసుకుని ఒకటి కొట్టివేసి యిచ్చాను.

అక్కడే ఫరాబుకు పైకంఇవ్వడం. అందుకని ఆయన దగ్గిర్నుంచి ఫరాబువైపుకూ రెండుఅడుగులు వేశాను. అజవాను "అటురా, ఇటునుంచేనా?" అన్నాడు. "చిత్తం" అని పెద్దగాఅన్నాను. మొదట తెల్లబోయినాడు. తరువాత వేళాకోళానికి అన్నానని తెలుసుకున్నాడేమో తీక్షణంగా చూశాడు. కడుపులో అక్కసున్న బయటకు కనబరచినతర్వాత వాడెలా చూస్తే ఎవరికక్కరలేదు?

తీరా పనిచేసుకు నేసరికి రెండున్నరఅయింది. తొందరగా పోస్టాఫీసు కెళ్లుదామని నడుస్తుంటే గేటుదగ్గర కుక్క మళ్లీ భొంయిమన్నది. దీనికిగూడా తాలూకాఫీసులో ఉద్యోగంకాబోలు ననుకున్నాను. లేకపోతే వచ్చేవాళ్ళమీద వెళ్లేవాళ్ళమీద అధికారం చెయ్యడానికి దానికంత దర్జా ఎక్కడిదా అనుకుంటూ నాపనిమీద వెళ్ళాను.

మె. ఎస్. వెంకట సుబ్రహ్మణ్యశర్మ





నిరీక్షణము

ప్రేమరసభరిత హృదయపాత్రికను మరగి
పొరొడి విరహోగ్రదారుణమ్మునకు క్రాగి
నీకొరకు కోసి తెచ్చిన వీకలువలు,
పారిజాతసుమమ్ములు వాడుదేరె,
చలదనము తేరి; చిటిలి వెచ్చనజనించె;
ఇది నదీతీర మేకాంత మిది ప్రశీత
లమధురరమణీయమసృణవిమలచంద్రి

కాథవళిత విహారేయి, నా కనులు రెండు
విచ్చుకొనిపోయెడు దిశాంతవీథులంట
నీ నిరీక్షణమున, కాళ్లు పూవ లేక
నడకెడు త్వరావలోకసంభ్రమముగోరి.
నీప్రసన్నజ్యోతిస్సులు నిండుకొన్న
మధురదర్శనమునకె జన్మాలనెన్నొ
తాల్చితిని నాథ !...............

నల్లటిమనిషి

౧

తెనాలికి తొందరపనిమీద వెళ్ళవలసి రైలు బై ముకు కొంచెముముందుగనే స్టేషనుకు చేరాను. రైలు ఎక్కేముందు ఒక చివరనుండి ఇంకోచివరకు ప్లాటుఫారంమీద తమాషాగా పచారుచేయటం, ఏదైనా అందమైన ముఖం కనపడుతుందేమోనని చూడటం నాకూ అలవాటే చాలామందికి మల్లే.

ఒక పెట్టెలో మాత్రం ఒంటరిగా కూర్చున్న యువతి కనపించింది. ఆమెముఖం అంత అందమైనది కాదు కాని ముఖకవళికలలో ఏదో కొంతఆకర్షణమాత్రం ఉన్నది. ఆమె దేహచ్ఛాయ పసిమీగాదు. నలుపూగాదు. ఆహోరకం తమాషా చామనచాయ. కేశములుమాత్రం దీర్ఘంగాను దట్టంగాను ఉన్నాయి అనుకొంటూ, ఎందుకంటే, ఆమె వేసుకొన్న బర్మాముడి గుబురుగా గోముగా పెరిగిన గులాబిపొదలాగ ఉన్నది.

ఆమె నన్ను ఆకర్షించింది. రెండుసార్లు అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ తిరిగాను. ఆమె నావంకకు చూచినప్పుడల్లా నేను తలవంచుకొని నన్ను చూడనట్లు తోచినప్పుడల్లా ఆమెవంకచూడటం మొదలుపెట్టాను. ఇట్ల ఇంకా నాలుగుసార్లు తిరిగేసరికి ఆమె ఒంటరిగా ప్రయాణంచేస్తున్నదనీ ఆమెకెంట పెద్దవాళ్లెవ్వరూ లేరని నా కొకఊహకలిగింది. పరాయిస్త్రీయొక్క అందాన్నిచూడటానికి నాకు అదే మొదటిసారి అవకాశంకలగటం.

ఎందుచేతనంటే మా కాంతంలేకుండా ఒంటిరిగా నే నెప్పుడూ ప్రయాణంచేయలేదు. ఒంటిరిగా ఉన్నా, ఆవిడలేని రోజులలో పరకాంత, పనిచేసేమనిషైనా సరే చివరకు నాకళ్ళకు కనపడకుండా ఉండే ఏర్పాటులుచేసి వెళ్ళుతుంది కాంతం. తాను పుట్టినింటికి వెళ్ళేముందు పనిచేసేదాన్ని తీసివేసి రావద్దని కచ్చితంగా చెప్పి. పోట్లాడో పంపేస్తుంది. ఆవిడ లేనప్పుడు ఆడవాళ్ళు ఎవరూ మా ఇంటికి రాకగదా! కాలం అలా గడుస్తూఉండటంమూలాన పరకాంతల మొఖమైనా చూచే అవకాశం నాకెన్నడూ కలగక పోయినందున, ఆరోజున దొరికిన అవకాశాన్ని అపూర్వంగా అనుభవిద్దామనుకొని అట్లా ప్రవర్తించాను.

ఇంతలో రైలుగంట కొట్టారు. పచ్చజండా ఊపారు. నేనూ నాపెట్టెను ఆమనిషి ఉన్న పెట్టెలోనికి పెట్టి ఎక్కాను. పెట్టెను నాప్రక్కనే పెట్టుకొని ఆవిడకు ఎదురుగాఉన్న బల్లపైన కిటికీదగ్గరగా కూర్చోటం తటస్థించింది. ఇదంతా నేను చెయ్యాలని చెయ్యలేదు ఆసమయానికి అట్లా జరిగింది.

బండి కదిలింది నే నిప్పుడు ఆస్త్రీకి ఎదురుగా ఉన్నాను. ఆబండిలో ఇంకా ఇద్దరో ముగ్గురో మనుష్యులు ఉన్నారు. అవతలబెంచీమీద ఖాళీగాఉంది కాని, నే నెందుకు లేవటం, ఆవిడకు కష్టంగాఉంటే ఆవిడే లేచిపోతుంది అని అనుకొని అక్కడేకూర్చుని కొనుక్కున్న హిందూపత్రిక చదువుకుందామని మడతవిప్పాను. పేపరు ముఖానికి అడ్డంగా పెట్టుకొని చదవటం ప్రారంభించాను. వాంటెడ్ కాలమ్స్, ప్రకటనలు చదివేసరికి అవలింతవచ్చింది. ఆ సందర్భంలో పేపరు ముఖంమీదినుండి తొలగించుకొంటుంటే ఆవిడ ముఖానికి తగిలింది. ఆవిడ క్రిందకువంగి పేపరులో చివరపేజీలోనున్న విషయమేదో చదువుతున్నదని నాకేం తెలుసూ. అసలు ఇంగ్లీషువచ్చిన మనిషి అనే నేననుకోలేదు. ఆమె ముఖానికి పేపరుకొసలు తగలటం, వెంటనే ఆమెకురులు సవరించుకొంటూ, పవిట సర్దుకోటం చూచేసరికి నాకు నవ్వు వచ్చింది. అందుకని నవ్వుతూ ఎక్స్యూజ్ మి అన్నాను. ఆమె మాట్లాడలేదు. ఆవిడకూ నవ్వువచ్చిందికాని నేను ఏమనుకొంటానో అని కాబోలు నవ్వు ఆపుకొన్నది. కాని ఆ ఆపుకొన్న నవ్వు ముఖమంతా వ్యాపించి ఆమె చిరుపెదవులలోనుంచి కండ్లకొసలలోనుంచి తొంగిచూడటం ప్రారంభించింది.

మళ్లీ నేను పేపరుచదవాలని ప్రయత్నించాను. కాని అట్లా తొంగిచూచినవవ్వు నన్ను చక్కిలిగింత పెట్టటం మొదలుపెట్టింది. కళ్లింకా ఏదో తేలిపోతుంటున్నా చదువుతున్నది అర్థంకాకపోవటం! అదీ నాఅవస్థ. ఆగిలిగింత ఎంతోసేపు ఆపుకొన్నాను. కాని ఆవిడతో మాట్లాడాలనిపించింది. పరస్త్రీతో మాట్లాడటం తప్పు అనీ, మాట్లాడినంత మాత్రాన ఏతప్పూలేదనీ రెండు ఆలోచనలో ఒకదాన్నొకటి తరుముకుంటూ వచ్చినయి. అదీకాక ఆకళ్లు, నొసలూ, ఆ కెంపు పెదవులూ నన్ను అల్లా పలకరిస్తూఉంటే నేను మాట్లాడక ఊరుకోనా?

పేపరు ఇంతవరకూ మాఇద్దరిమధ్య తెరగాఉంది. దాన్నిమడిచి చేత్తోపట్టుకొని ఆవిడవంక ఒకమారు చూచి చప్పున మళ్ళీ కిటికీలోనుంచి ఆకాశంకేసి చూశాను. నాకెట్లా తెలిసిందో అట్లా చూపులను దొంగిలించాలని! నల్లనిమేఘాలు ఉన్నాయి ఒకవైపున. ఎదురుగా దిక్సతి తన కెంపు పెదవులతో అతనివైపు చూస్తున్నది. మేఘుడు ఊరుకొన్నాడా. ఆరక్తిమను గ్రహిస్తూనేఉన్నాడు. ఇంతలో ఆమె ఏంచేస్తున్నదో చూద్దామని బుద్ధిపుట్టి ఆమెవంక తిరిగిచూచాను. ఆమా ఆకాశాన్నిచూస్తున్నది.

నేను ఆమెను చూస్తున్నానని గ్రహించి ఆమె నావంక తిరిగింది. నేను నాచేతులోనున్న పేపరును ఆమెకు అందించాను. ఆమె మాట్లాడకుండా పుచ్చుకొని అటూఇటూ తిరగేసి ఏదో చదివినట్లేచదివి అయిదునిమిషాలలో మళ్ళా నాబల్లమీద పెట్టేసింది. పెదవి విప్పి ఒక్కపలుకైనా పలకలేదు. కాని ఆకళ్ళు, నొసలు నవ్వుతునే యున్నవి.

ఇంతలో గుడివాడస్టేషను సమీపించాము. బందరు నుండి బయలుదేరినబండి ఇంత త్వరలో గుడివాడ వస్తుందనుకోలేదు. ఇంకేముంది; ఇంక కాసేపట్లో బెజవాడ వస్తుంది. అటుతరువాత ఎవరిదారి వారిదేకదా అనిపించింది.

చల్లనిగాలి వీస్తున్నది. వెన్నెలరాత్రికూడాను. గాలి నాచెవులో రహస్యంగా "ఊరికే చూస్తూ కూచుంటావేం. మాట్లాడరాదా" అని చెప్పింది. ధైర్యంతో పెద్దమనిషి తరహాగానే అన్నాను. "అమ్మా మీరెంతవరకు ప్రయాణంచేస్తారు" అని. ఆమె నవ్వుతూ "మీరో" అన్నది. నేను తెనాలి వెళుతున్నానన్నాను. "నేనూ అటువైపే వస్తా" నన్నది. ఆమాటలు వినేసరికి నాకు ఏదో దేవగానం విన్నట్లు తోచిందిగాని ఎదుటనున్నస్త్రీ మాట్లాడినట్లుగాలేదు. బెజవాడలో కూడ ఆమెఎక్కిన పెట్టెలోనే నేనూ ఎక్కాలని అనుకొన్నాను. అదేమిటో ఆమె సామీప్యమే నాకంత ఆనందాన్ని ఇచ్చింది. అద్వైతులు దీన్నే కాబోలు సామీప్యం అంటారు!

౨

గుడివాడలో బండి ఆగినతరువాత ఆవిడ నన్ను ఉద్దేశించి "ఇక్కడ నీళ్ళకుళాయి ఎటువైపు ఉందండీ" అన్నది. ఇన్నిమాటలు ఒకేసారి వినేసరికి వెయ్యివీణెలను ఒక్కసారి మీటినట్లుంది. దూరాన ఎక్కడో పాడుతున్న మధురగానాన్ని హాయిగా వింటున్నట్లుంది. నేను, "ఇల్లా ఇవ్వండి నీరుతెచ్చిపెడతాను" అన్నాను. ఆమె చిరునవ్వుతో "మీకు శ్రమ" అన్నది. "ఫరవాలేదు ఇల్లా ఇవ్వండి" అని ఆ మరచెంబు ఆమెచేత్తోనుండి తీసుకొని నీళ్ళుండే తావుకు ఒక్కపరుగున వెళ్లాను. కుళాయిలోని నీళ్ళు పట్టానుగాని ఆనీళ్ళు వేడిగాఉన్నాయి. ఛీ ఈ వేడినీళ్ళు ఆవిడకు ఇయ్యటం ధీరలక్షణం కాదనుకొని, ఆ చెంబుతీసుకొని రైలులో సోడాఅమ్మే పెట్టెదగ్గరకు వెళ్ళాను. స్పెన్సరు సోడాఒకటి గ్లాసులో పోయించుకొని,అందులో కొంచెం తీపికలిపించి, కొంచెం మంచుగడ్డ వేయించి పట్టుకెళ్ళాను. అయిదు అణాలు చెల్లించాను అనుకోండి. అది వేరేవిషయం

ఆమెకు సోడాఇచ్చి "పుచ్చుకోండి నీరు వెచ్చగా ఉన్నయి. దాహంతీరదు" అన్నాను. "అయ్యో!చాలా శ్రమపడ్డారే" అని, సోడా తీసుకొన్నది. ఏదో పరోపకారంచేస్తున్నానని నాకు నేను సమాధానం చెప్పుకొని, "ఆ, ఏమిశ్రమలెండి" అన్నాను; ఏదో సామాన్యంగా అట్లా స్నేహితులతో, పరిచయులతో నిత్యం

సోడాలుఇచ్చే ధనవంతుడ్నిలాగ చూస్తూ. ఆమె ఆ గ్లాసులోని అమృతంలాంటి సోడాతాగి చేతిరుమాలుతో తుడుచుకొంటూ ఖాళీగ్లాసు నాకిచ్చింది. నేను ఆగ్లాసును సోడా విక్రయంచేసినవానికి ఇచ్చేశాను. నాకూ దాహం అవుతున్నది. కాని సోడాపుచ్చుకొంటే డబ్బు అయిపోతుందని ఆవేడినీళ్ళే కాసిని త్రాగి మళ్ళీ యథాస్థానంలో కూర్చున్నాను. బండి కదిలింది. ఆవిడతో పరిచయం కలిగినందుకు నాలోనేను సంతోషించాను. ఆవిడను ఎన్నో ప్రశ్నలు అడుగుదామనుకొన్నా. కాని ఆవిడ అడిగిన ప్రశ్నకల్లా క్లుప్తమైన జబాబు చెప్పటం, కొన్నిప్రశ్నలకు జబాబేచెప్పక చిరునవ్వు నవ్వి ఊరుకోవటం నా కంతప్రోత్సాహకరంగా ఉండలేదు. కాని ఆమెకళ్ళు మహాచెడ్డవి. అవి నన్ను లెక్కలేనన్ని ప్రశ్నలువేసినవి దారిపొడుగునా, నాకళ్ళు ఆ ప్రశ్నల కన్నింటికి సావధానంగా జబాబు చెప్పినవి. ఇంతలోకే బెజవాడ వచ్చాము.

స్టేషనులో రైలుదిగాము. తెనాలివెళ్ళే మెయిలుకు ఇంకా గంటన్నరటైముంది. అక్కడే కూర్చుందాం అన్నాను. ప్లాటుఫారంమీద కూర్చుంటే వచ్చిపొయ్యేవాళ్ళు ఎగాదిగా చూస్తారండీ. వెయిటింగురూములో నన్ను కూర్చోబెట్టండి అని ఆమె వినయంగా కోరింది. అట్లా స్త్రీ కోరుతుంటే ఎవ్వరు కాదనగలరు?

ఆవిడవద్ద రెండుపెట్టెలు ఒకపరుపుచుట్టా ఉన్నవి. అవి వెయిటింగురూముకు చేరాలి కూలీ మూడుపావలాలకు తక్కువైతే వాటిని ముట్టుకోనన్నాడు. అన్నావాడు చక్కాపోక అక్కడే నిలవబడి వచ్చినవాడితో నల్లా నేను మూడుపావలాలియ్యమన్నారా, అయ్యగారు సందేహిస్తున్నారు అనటం మొదలు పెట్టాడు, ఆకొత్తగావచ్చినవాడు ఇచ్చేసెయ్యండి బాబూ, అంతకు తక్కువ కెవ్వరూరారు అని సిఫార్సుచేసి పోవటం నాకేం తోచిందికాదు. ఇంతలో ఆవిడ ఒక పెట్టె నెత్తుకొని పెడదాంరండి అన్నది. మొగవాణ్ని దగ్గర ఉండి కూడా సుకుమారిచేత పెట్టెమోయించటం అనుచితము అనితోచి "మీరెందుకు? నే పట్టుకొస్తాను ఇల్లా ఇవ్వండి" అని, ఆవిడ రెండుపెట్టెలూ నాభుజానపెట్టుకొని నాపెట్టె చేత్తోపట్టుకొని ఫర్లాంగుదూరంలో ఉన్న వెయిటింగురూముచేరేసరికి బుజాలు పీక్కొనిపోయినాయి. నడుము కలకబారి నొప్పెట్టింది. ఎప్పుడూ ఒకచిన్న సూట్‌కేసయినా మోసిఎరగనివాడను. వెయిటింగురూములో ఆవిడను కూర్చోబెట్టాను. మూడవతరగతి ప్రయాణీకులు అక్కడ కూర్చోకూడదు. కాని అక్కడ ఉండే మనిషికి ఒక పావలాయిచ్చి సంతోషపరిచాను. వాలాఘనకార్యంచేశాను. ఇంతా కష్టపడ్డా, ఆవిడ వెయిటింగురూములోపల నేను బయటనా? అని కష్టమేసింది మనస్సులో.

నడుములు విరిగిపోతుంటే బయట ఒకతిన్నెలల పైన నడుమువాల్చి లోపలఆవిడ నేను చేసిన ఏర్పాటుకు ఫలితంగా సోఫాలో, ఎలక్ట్రిక్ ఫాన్‌క్రింద పడుకోటం చూశాను. నేను వెర్రివాడిని అయినానా ఏమిటి? ఎవరితో ఒక ఆవిడ పెట్టెలు మోయటమేమిటి! ఈకర్మం ఏమిటి! అని అనుకొన్నాను. ఇంతలో ఆమె నొసలూ, కళ్ళూ, పెదవులూ నా ఎదుట నిలువబడి, అల్లా అనుకోక. ఎంత సరదా! అన్నాయి. ఎట్లాయితేనేం మళ్ళీ ఆఊహే రాలేదు.

ఆకలి అవుతున్నది, హోటలుకు వెళ్ళి రెండు మెతుకులు తినకపోతే బ్రతికేటట్లులేదు. వెంటనేవెళ్ళి భోజనంచేశాను. నేను భోజనంచేసి ఆవిడకు తీసుకొనిపోకపోతే మర్యాదకాదని తోచింది అందుకని టిఫిన్ కారియర్‌లో భోజనంపెట్టించుకొని ఆవిడకోసం తీసికెళ్ళాను. ఆవిడ "అయ్యో, ఎంతశ్రమపడ్డారండీ" అని అంటూ కారియర్ అందుకొని అక్కడే పెట్టుకొని భోజనంచేసింది. కావలసినవన్నీ అవీ నేనే తెచ్చి ఇచ్చాను. అటుతరువాత ఆగిన్నెలుకడిగి హోటలువాడికి ఇచ్చేసినాను. నాకర్మంకాలితే ఎంగిలిగిన్నెలు కూడా కడిగాను! అయితే ఇదంతా రోమాన్సు గాలంత్రీ అనే పదాలలో శరణ్యంపుచ్చుకొని అంత అసహ్యం అనిపించవు.

భోజనానంతరం ఆవిడ ఏమిటో చేతిలోకి తీసికొని నావంకతిరిగి "ఇదిగో తీసికోండి" అనినట్లు సంజ్ఞ చేసింది. పోకచెక్కో ఏమిటో ఇయ్యవస్తున్నదనుకొని

ఆసులాబీరేకులవంటి మెత్తనిచేతులు తగలటంవల్ల కలిగే స్పర్శసౌఖ్యం ఊహించుకొని ఆనందంతో చెయ్యి జాపాను. ఆమె తనచేతిని నాచేతికి తాకనియ్యకుండా, తాకితే ఎలక్ట్రిక్ షాక్ తగిలి చచ్చిపోతాననుకొందో ఏమో పైకి ఎత్తి నాచేతిలో పడేసింది రాగిడబ్బు ఒకటి; "కిళ్ళీ కొనుక్కోరండి" అన్నది నవ్వుతూ! నాకు అరికాలుమంట నెత్తికెక్కింది. ఇందాకటినుంచీ పోషాకు, భోజనానికి డబ్బు కర్చుపెడుతూ అడ్డమైన చాకిరీచేస్తుంటే విశ్వాసంలేకుండా కిళ్ళీకని ఒకరాగిడబ్బు ఎత్తి చేతిలోవేస్తుందా! అదీ ఒక్కకిళ్ళీకా? అని ఉక్రోషంవచ్చింది.

నాముఖంలో ఉండే కవళికలు తెలియజేసే భావాలను ఆమె గ్రహించింది. ఒక్కనవ్వు నవ్వింది. మచ్చుమందు చల్లినట్లయింది! మళ్ళీ మాట్లాడకుండా, ఆ కానీ ఆమెచేతిలోకి గిరాటుపెట్టి, కిళ్ళీదుకాణం దగ్గరకెళ్ళి అర్ధణా, అర్ధణా కిళ్ళీలు మాంచి సుగంధవస్తువులతో వేసినవి రెండు కట్టించుకొనివచ్చి ఒకటి ఆమెకుచూపి ఇస్తాను రమ్మని పిలిచాను. ఆమె అక్కడికే గిరాటు వెయ్యమని సంజ్ఞచేసింది కోపంతో విసిరాను ఆమెపైకి. ఆమె నవ్వుతూనే, తీసుకొని ఊరుకొన్నది.

మళ్ళీ రైలుటైము అయింది. తెనాలిపైపునకు వెళ్ళే మెయిలు వచ్చింది. మళ్ళీ ఆవిడపెట్టెలను రైలుపెట్టెలోకి తోశాను. ఇద్దరం ఒకపెట్టెలోనే ఎక్కాము. ఆవిడప్రక్కనే కూర్చున్నాను. ఇంత అవస్థపడ్డందుకు ఆవిడ నామీద కృతజ్ఞురాలైయుంటుందనుకొని ఏమిటో మాట్లాడాలని ఆవిడకు దగ్గరగా జరిగాను. కుచ్చెళ్ళచెరుగులు దగ్గరకు లాక్కొని, ఒదుక్కొని "చూడండీ కొంచెందూరంగా కూర్చోండి" అన్నది మెల్లగాసన్ననిగొంతుకతో రెండోవాడికి వినపడకుండా. దానితో నాప్రాణాలు చల్లబడ్డవి. నేనెందుకు నాగౌరవాన్ని చంపుకొని ఈవిడకు అరవచాకిరీ చేస్తున్నానా అని విచారంకలిగింది.

తెనాలిస్టేషను వచ్చింది. నేనుదిగి నాపెట్టె దింపుకొని ఆమెకేసిచూస్తూ "దిగరేం" అన్నాను. "ఇక్కడకాదు లెండి నేను దిగటం" అన్నది. ఆమాట వినేసరికి నామీద పిడుగుపడ్డట్లయింది. తక్షణం నాపెట్టెను చేత్తోపట్టుకొని వెళ్ళిపోతూ ఆవిడవంక తిరిగి ఉక్రోషం పట్టలేక కసిఅంతా తీరేటట్లుగా వెక్కిరింతగా నానావికారపుచేష్టలూచేసి బైటకు వినపడకుండా తిట్టుకొన్నాను. ఆవిడ ఏమో అనొస్తుంటే వినిపించకోలేదు. ఆవిడ పకాపకా నవ్వింది.

డబ్బంతా ఖర్చు ఆయిపోయింది. పెట్టెను మోయటానికి కూలీని పెట్టుకొందామన్నా దమ్మిడీలేదు. బండి కట్టించుకోటానికి అసలే లేదుగదా! పోనీ ఇంటివద్ద మావాళ్ళనుఅడిగి ఇయ్యకూడదా అను కొంటే వెళ్ళేది అత్తవారింటికి. వెళ్ళటం వెళ్ళటం అర్ధణా డబ్బులు అప్పు అడగటంకంటె చండాలపుపని ఇంకేముంది. ఆపెట్టె నెత్తికేసుకొన్నాను. ఇంటిదారిపట్టాను.

బెజవాడ స్టేషనులో పెట్టెను మోయటంచేత, భుజాలు, నడుమూ పీక్కునిపోతున్నది. శ్రీరామమూర్తి జ్ఞాపకానికి వచ్చాడు. రామస్మరణ చేయాలనుకొన్నాను. కాని ఆ నొసలూ, ఆకళ్ళూ, ఆఎర్రని పెదిమలూ తొంగిచూస్తున్న నవ్వూ, నాఎదుట ప్రత్యక్షమై నన్ను చూచి వెక్కిరించటం మొదలు పెట్టినవి. రామస్మరణ ఎట్లా సాగుతుంది?

మునిమాణిక్యం నరసింహారావు



చాందు రాణి

౧

ఎల్లపుడు పతిని ప్రేమించుట, సేవచేయుట, తన ఇచ్చను వానికోరిక ననుకూలముగ మార్చుకొనుటయే స్త్రీల ముఖ్యస్వభావమని సేటు దేవీచరణుడు తెలిసికొనియుండెను. అతను ముగ్గురిని వివాహమాడియుండెను. వారివలన యీసిద్ధాంతమును కనిపెట్టియుండెను. కాని అతను ఎపుడు నాల్గవవివాహము చేసికొనెనో, చాందురాణి యెపుడు వీనిగృహప్రవేశ మొనరించెనో, అపుడు స్త్రీస్వభావము అగాధసముద్రమనియు, దాని అంతుచేరుట ఎవరికిని సాధ్యముకాదనియు తెలిసికొనెను.

చాందురాణి సార్థకనామధేయయు, ప్రసన్నవదనయు, స్వచ్ఛందయు, చంచలయునై యుండెను. హాస్యమందు చంద్రప్రకాశము, సంభాషణమందు మాధుర్యము, క్రీకంటివీక్షణముల శీతలమును ఘనీభవించి యుండెను. ఆమె వైపెవరు చూచెదరో వారు చూచుచునే యుండెదరు. చిరకాల పరిచయముగలదానివలె అందరితో కలిసి మెలిసియుండును. ఈ గుణములచే దేవీచరణుడు ఆమెకు వశుడైనపిమ్మట తనఇంటి కామెను తీసికొనివచ్చుట సులభముగా నుండెను. అతను కోటీశ్వరుడు. తలచినది చేయకలడు.

సేటుగారి ముగ్గురిభార్యలతో చాందురాణి పరిచయముకలదానివలె మాట్లాడుటకు ప్రారంభించెను.

"అక్కా! నీవుండగా వారు రెండవవివాహము ఎందుకు చేసికొనిరి?" అని మొదటిభార్య నడిగెను.

"నాకు బిడ్డలులేరు."

"అసత్యము. పురుషులు సంతానమునకై వివాహమాడుటలేదు."

పెద్దభార్య యీవిషయము పలుమారు చెప్పతలంచెను. కాని చెప్పజాలకుండెను. రాణిమాటలయందు మాధుర్యమేగాక సత్యముకూడ కలదని ఆమె యనుభవమూలన తెలిసికొనెను. ఆమె బదులుపల్కలేదు. చాందువైపు దీనముగా చూచుచుండెను.

"అక్కా! నీవు సుందరివి, మంచిదానవు. సేటుగారిని రెండవ పెండ్లాడుటకు నిరోధము కలిగించలేదా?" అని రాణిఅడిగెను.

పెద్దభార్య హృదయము పొంగిపొరలెను. "ఎవరి బలముపై నాపెదను. నంటిబిడ్డకూడ లేకపోయెనే." అని ఆమెకంఠమునుండి మొదటిసారి వినబడెను.

"అక్కా! నీ అపరాధము క్షమించరానిదికాదు. పెద్దక్కయుండగా నీ వీవైపేల తొంగిచూచితివి?" అని చాందు రెండవభార్య నడిగెను.

"నేను బీదింటిదానను. నాకేమియు లేదు."

"మంచిది, కాని కాపురమునకు వచ్చినపిమ్మట, పెద్దక్కయ్యతోచేరి, చీటికి మాటికిచేయు యీదుర్వ్యాపారమునుండి సేటుగారిని ఎందులకు మరల్చలేదు?"

"నేను బీదింటపుట్టితిని. నాయందేకొంచెము లావణ్యము కలదో, అదిఅంతయు భగవానుని వలన కలిగియుండెను. భగవంతుని సౌందర్యమునకును, మనుష్యుడిచ్చిన సౌందర్యమునకును, మిక్కిలి తారతమ్యము కలదని యిపుడు చూచుచున్నాను. బీదింటిబిడ్డకు శృంగారము, హావభావము లెట్లు అబ్బును? నాతలిదండ్రులు కపటపునవ్వును, ఏడ్పును నేర్పించియుండలేదు."

చాందురాణి నవ్వుచు చెప్పెను. "దివ్యముగ చెప్పితివి. చిన్నక్కా! యీయిద్దరి అబలల కపటమునకు ముసలమువలె నేల దాపరించితివి? నీకన్ననో భగవంతుడన్నియు నిచ్చియుండెను తల్లిదండ్రు లన్నియునిచ్చిరి. ఇటుల చదువను, వ్రాయను నేర్చిన నవనారీమణివి, యీవలయంబేల చిక్కితివి"

చిన్న పెండ్లాము పరిభవింపబడిన దానివలె కృత్రిమమగు చిరునగవుతో చెప్పెను:—"ప్రేమచే వారు నన్ను ప్రేమభిక్షకోరిరి. కోటీశ్వరుడు బిచ్చగానివలె నావద్ద హస్తము చాచెను. నాకు జాలి కలిగినది.

గౌరవముగ దయ గలిగినది. నేను నవలలను అధికముగా చదివి యుంటిని, ప్రేమబాధ యెట్టిదో, నవలల వలన నేను తెలిసికొని యుంటిని స్త్రీప్రేమను పురుషుడు సహింపగలడు కాడో, అతడేప్రకారము పనికి మాలిన వాడైపోవునో, వందలకొలది యుదాహరణములు నా కు జ్ఞప్తికలవు. మరి, ఇంతటిగొప్పవాడు స్వల్పవిష యమునకై ఏల చెడిపోవలయునని, నేను యోచించితి ని. తల్లిదండ్రులును తెలియజెప్పియుండిరి."

"రావణుని కథ చదివితివా? అతను గూడ సీతను ప్రేమభిక్షకోరియుండెను." అని చాందురాణి అడిగెను.

చిన్నభార్య:—అవును, అతను కోరతగియుండెను. ఒక్కొకడు స్త్రీలను ప్రేమభిక్షకోరతగియున్నాడు. ఇప్పటివరకు నవలలు చదువుచు, యీ సారాంశమును నే ను గ్రహింపగలిగితిని నవలల యుద్దేశమిదియే.

"అయ్యో! నవలాపాఠకులారా! ఎవరైన యిటువచ్చి, నీతో, సుందరీ! సేటుగారిని వదలి నాతో లేచివచ్చెదవా! అని యడిగినపుడు, నీవు లేచి పోయెదవా?" అని పెద్దభార్య అడిగెను.

"మరి అతని ప్రేమ యందంతశక్తియుండినచో, —నేనవగ నెంత, పతివ్రతయగు సావిత్రి గూడ ఆకర్షింపబడును."

రెండవభార్య:—అట్లయిన సీతతప్పుచేసియుండెను కదా?

చిన్నభార్య:—రామాయణమందలి ఆకథాఘట్టమును చదువునపుడంతయూ, అవశ్యము, సీత రావణుని కనికరించి యుండవలసినదని, యోచించుచుండును.

చాందురాణి—(నవ్వుచు) ఆహా! ఎక్కడి విషయము యెక్కడికి వచ్చెను.

"చిన్నక్కా! అతను వాస్తవముగ ప్రేమించినవాడు కాడు. దుష్టుడు. స్త్రీతనసత్యప్రియుని (ప్రాణనాథుని) గుర్తింపవలసి యుండును."

చిన్నభార్య:—(కొంచెము విరక్తితో) ఛేఛీ! బాగుగా చెప్పితివి, చెల్లెలా! విచారించనిది, తెలిసికొననిది, పురుషుని మాటలయందు చిక్కినదానికి, గొప్పఅవమానమును భరించవలసి యుండును. సీతయుగమందు నవలలు లేవని తోచుచున్నవి. అందువలన ఆమె రావణుని బారినుండి రక్షింపబడినది. పునీతులగు పురుషులు తమనవలాతరంగములమూలమున స్త్రీ హృదయమందలి దృఢాశయములను ఛేదించి, యిసుకగా చేసినైచిరి. ఇపుడు సామాన్యమగు తరంగము సైతము దానిని గ్రహించి ఎచటనో ఒకచోట విసిరి వేయగలదు.

చాందు:—చిన్నక్కా! ఇపుడేమిచేసెదవు?

చిన్న:—ఇపుడు నాలోననేమి యున్నది. నీవు నాగర్వమును పెనుగాలిని చూర్ణము చేసితివి.

చాందు:—సేటుగారు నీ యందేలోపమును చూచి నాల్గవవివాహ మాడెను?

చిన్న:—నాకు తెలియదు.

కొంతసే పందరు ఊరకుండిరి. మరల చిన్నభార్య:

"చెల్లెలా! ఇంత తెలిసియు నీవిచటి కేల వచ్చితివి? మరియు అయిదవదానిని తెచ్చిన నీ వేమిచేసెదవు?"

చాందురాణి బిగ్గరగా నవ్వెను. "అహా - మీరందరు నన్నిప్రశ్న వేయుదురని నాకు తెలియును. వ్యర్థముగా ఈకార్యము చేయుటకు నాకు ఎట్లు సాహసింపకుండును, అటుల సేటుగారి చక్కబెట్టుటకు వచ్చియున్నాను. ఇందరి స్త్రీలను కష్టపెట్టినందులకు వారిని నేను తగినట్లుల దండించుటకు నిశ్చయించితిని. చెప్పుడు మాత్రము. మీరందరు నాకు సాయముచేసెదరా?"

వారందరు ఆశ్చర్యచకితులై ఆమెవంక చూడసాగిరి. "తప్పు, తప్పు, ఇప్పుడేమంటివి? భర్తవిషయమై ఇట్టి పదప్రయోగమా?" అని పెద్దభార్య అరచెను.

"ఏమియు నక్కరలేదు నే నంతయు ఒంటిరిగా చేసెదను" అని చాందురాణి చిరునవ్వుతో ననెను.

౨

దేవీచరణుడు తనగదిలో వార్తాపత్రిక చదువుచుండెను. క్రిందలిఖించిన "వివాహవిజ్ఞాపన" పై ఆకస్మికముగా నతనిదృష్టి ప్రసరించెను.

"సజ్జనులారా!

నాభర్త నాల్గు వివాహము లాడెను. కాని యెవరియందును సంతానము కలుగలేదు. నేను వారినాల్గవ భార్యను. నాభర్తయందే ఏదోలోప ముండినకారణమున నా కందరికి సంతానము కలుగ లేదని నాకనుమానము గ న్నది, ఇందుకొఱకే, నేను రెండవవివాహము కో

సికొనుటకు శాంధించుచున్నాను. సంతానమునకై ఎన్ని పాట్లయినను పడవచ్చును. పర తింటిని. నూతనస్త్రీ యొకతె నాగృహమందుండవలయును, మరియు నన్ను నా యిప్పటి భర్తనుండి విడదీయరాదు. సాహసులగు సజ్జనులు దీనిని గమనించెదరు గాక!—చాందురాణి."

విజ్ఞాపనచదువగనె సేటుగారు భయముచే వణకుచుండిరి. వాని చేతినుండి వార్తాపత్రిక జారి పడెను. అతడు తన అంతఃపురము వంకకు నడువ సాగెను. అతని నూతనముఖభావములను చూచి దాసీలు, దాసులు ఏమియు నడుగజాలకుండిరి. దేవీచరణుడును వారి నేమియు పలుకరించలేదు. అతనుతిన్నగా చాందురాణి గదికి వెళ్లెను. ఆమె అక్కడ లేకుండెను. అప్పుడతను తనఇతరభార్యలగదులకు వెళ్లెను. కాని యెవరిజాడయు తెలియరాదాయెను. దుఃఖితుడై, క్రోధముతో తిరిగి తిరిగి వారి అంతఃపురవాటిక చేరెను. నలుగురు భార్యలు బెంచీమీద కూర్చుండి వర్షాకాలమందలి ప్రభాతాతపసుఖము నానందించుచుండిరి. వెనక ప్రక్కగా వచ్చుటచే సేటుగారిని చూడక నలుగురు భార్యలును ఏదోమాటపై చిరునగవు నవ్వుచుండిరి. నలుగురు ఎడమవైపు వరుసగా కూర్చుండిరి

"చెల్లెలారా! మీకు ఈనవ్వు మంచిదికాదు." అను సేటుగారిపెద్దభార్యవాక్య మాకస్మికముగా వినబడెను.

"పరిహాసమేల! పెద్దక్కా! నేను నిజమే చెప్పుచున్నాను. నలుగురుకాదు. పదునైదుగురు రానిమ్ము. సేటుగారు పుట్టించదలచిన ఒక చిట్టెలుక గూడ పుట్టదు దీనికి బలముకావలయును. తపస్సుకావలయును." అని చాందురాణి చెప్పెను.

మధ్య:—ప్రపంచమున అందరు బలవంతులు కారు, తపస్వులందరు కారు.

చాందు:—అందరును నాల్గు వివాహము లాడి యుండలేదు.

చిన్న:—వారుసంతానమునకుగా వివాహమాడలేదు.

"అట్లయిన నిష్కపటముగ నేల చెప్పకూడదు, పుణ్యాత్ముడు, సచ్చరిత్రుడుగా నుండుటను యాకపట నాట్య మెందులకు" అని చాందురాణి లేచి పలికెను.

పెద్ద:—పురుషు డన్యాయము చేయగలడు. కాని స్త్రీ అన్యాయము చేయుటకు స్వాధీనురాలు కాదు. చేసినను శోభించదు.

చాందు:—ఏమైన కానిమ్ము. నేను రెండవ వివాహ మాడెదను. మాయనుమతి వలన నాకు సంతానము తప్పక కలుగునని విశ్వాసమున్నది.

సేటుగారు నిలువజాలకపోయెను. ముందునకు వచ్చి చెప్పెను: "ఇటుల మాట్లాడుట కిచట కేలవచ్చితివి. కోరినదంతయు వెలుపలనుండియే చేయవచ్చునుగదా?"

"నీవు నన్నిచటి కేల తెచ్చితివి? అక్కా! సంతానము కొఱకు మీరు నాల్గువివాహము లాడవచ్చును, కాని నే నొకటియు చేసికొనకూడదా?" అని చాందురాణి తల విదల్చుచు ఒయ్యారముగ పలికెను. మిగతభార్యలకు నవ్వు వచ్చెను. సేటుగారే నవ్వుచు "మంచిది. చేసికొనుము. ఎవనిని వివాహమాడెదవు?"

చాందురాణి జేబులోనుండి కాగితములను తీసి చెప్పెను. "నా విజ్ఞాపనకు ప్రత్యుత్తరముగ నూరుత్తరములువచ్చినవి. వాని నుండి నేను పదుగురి నేర్పరచితిని. వీరిలో ఒకరిని వరింపవలయును. మీయందరి అభిప్రాయమును గైకొని వరించుట మంచిదని నిర్ణయించితిని. మీ రాలోచించి చెప్పుడు, చూతము."

సేటుగారు చాందురాణిచేతినుండి కాగితములను లాగివైచి, వానిని చూచెను. వానిశరీరము కుపితమగుచు వణికెను.—క్రుద్ధుడై రెండుబొటనవ్రేళ్లతో కాగితములను ముక్కలు ముక్కలు చేసి వైచెను. కులటా! పిశాచీ! నాయింటనుండి వెళ్లుము." అని పెద్దగా పలికెను.

చాందురాణి దృఢముగ జవాబిచ్చెను: "దుష్టుడా! [illegible]! నాయింటి నుండి వెళ్ళుము."

స్త్రీముఖమునుండి ఇట్టిమాటలు వినుటకు సేటు అలవడి యుండలేదు. క్రోధాతిశయమువలన అతను చాందురాణిని చెంపపెట్టు పెట్టెను.

చాందురాణియు మారు చపేటిక నిచ్చెను. ఇంకను ఇద్దరకు పోరాట మగుచుండెను. మధ్యభార్యయు, చిన్నభార్యయు భయముచే నచటనుండి తొలగిరి. "పరుగెత్తుడు; పరుగెత్తుడు; సేటుగారి ప్రాణములను తీయుటకు ప్రయత్నించుచున్నది. ఈ పర్యాయము మృత్యువును వివాహమాడెను." అని పెద్దభార్య అరచుట ప్రారంభించెను.

౩

చాందురాణిని బుజ్జగించుటకు, ఆమెకు తెలియచెప్పుటకు సేటు ఆమెతల్లిదండ్రులను పిలిపించెను కాని వారిమాటలు విని యువతి యనె-"తల్లిదండ్రులయాజ్ఞ పాలించుట యందును హద్దుకలదు. మీఆజ్ఞ హద్దుమీరినదని నేను తలచుచున్నాను. సేటు దేవీచరణునికి నన్నిచ్చి వివాహము చేసిన పిమ్మట మీరు వారికి ఋణగ్రస్తులు కారు. మీరు నాకు చదువను, వ్రాయను నేర్పించితిరి. ఆలోచించుటకు, తెలిసికొనుటకు బుద్ధినిచ్చితిరి. ఇందులకు మీకు నేను కృతజ్ఞురాలను ఇపుడు నాదారి నన్ను చూచుకొననిండు. లోకాపవాదవిషయమటుంచుడు. నేను దానిని లక్ష్యపెట్టుటలేదు, నాల్గు వివాహము లాడిన సేటుగారి నేమియు చేయజాలని లోకాచారము నన్నేమి చేయగలదు? నేను ద్వితీయ వివాహ మాడనిది యుండజాలను ఎవరైనను సాహసముగా సిద్ధపడవలయును ఇదియే కోరిక."

చాందురాణి తల్లిదండ్రులు చేయునదిలేక తిరిగి వెళ్లిరి. మెల్లమెల్లగా ఈవివాహవార్త చాలదూరము ప్రాకెను. చాందుపక్షమును సమర్థించువారును చాల మంది లభించిరి. ఇట్టి పరిస్థితులలో స్త్రీ పునర్వివాహ మాడవచ్చునని కొందరు శాస్త్రప్రమాణములగూడ నుల్లేఖించిరి. చివరకు దేవీచరణుడు రాణిని ఒకగదియందు బంధించెను. కష్టపెట్ట సాగెను. కాని ఆమెలావణ్యము దృష్టిప్రేమను కలుగజేయుశక్తియుండుటచేత నేసేటు చాలకాల మిటుల చేయజాలకపోయెను. ఒక దినము మెల్లగా చాందురాణి గదికి ఒంటరిగావెళ్లి "చాందు!...నామీద దయయుంచుము" అనియెను.

చాందు:—మీకేల నామీద కొంచము దయయుంచ కూడదు. అహో! పురుషజాతి! పుచ్చుకొనుటకు తెలియును, కాని యిచ్చుట కేమియు తెలియదు.

దేవీ:—నీ మూర్ఖపుపట్టుదలమూలమున నా గౌరవ మెటుల మంటకలియుచున్నదో, మర్యాద సన్నగిల్లుచున్నదో తెలియునా?

"అబ్బా! మీకును మంచిచెడ్డల ధ్యానము కలదా?"

"చాందు! నీ వేమి కోరెదవు?"

"ఇంకొక పెండ్లి చేసికొని మీకు సంతానసుఖము నిచ్చెదను."

"ఇట్టి సంతానసుఖమును నేను కోరుటలేదు. దీనికి నేను ప్రబలశత్రువును."

సేటుగారి ముగ్గురు భార్యలు అచటి కేతెంచిరి.

పెద్ద:—పెండ్లి చేసికొనుము.

మిగతయిద్దరు:—పెండ్లి చేసికొనుము.

చాందు:—లేదు, మీరిపుడు పెండ్లి యాడవలదు, మమ్ములను చేసికొననిండు.

ఈవ్యంగ్యోపదేశమునువిని దేవీచరణుడు కాగడి పాలవలె పొంగెను. అంతట తన తలను దబదబ బాదుకొనసాగెను.

పెద్దభార్య అతని చేతిని పట్టుకొనెను. నడిమిభార్య తనవస్త్రముతో అతనిముఖమును తుడచెను.

చిన్న:—సేటుగారు నేనే మీరుగానుండిన, ఇంతటి వ్యాకులమునకు మారు ఈమెను ద్వితీయవివాహమునకు పురికొల్పియుండెడి దానను.

దేవీచరణుడు లేచి కచ్చేరిచావడివైపు వెళ్లెను. మొదటిభార్య లిద్దరు అతని ననుసరించిరి.

చిన్న:—చాందు! అయిన దేమో అయినది. హఠమును వదలుము. నీ మాటలను వారు ఎంతవరకు సహించుచున్నారో, చూచుము. ఇటుల నన్నెవరైన పరాభవించిన నా ప్రాణములు విడచియుందును.

చాందు:—నేనేమి అనుచితము లాడుచున్నాను? దేనికొరకు వారు నాల్గువివాహములాడిరో, దానికే నేనును పెండ్లిచేసి కొనెదను ఆ విషయమున వారెంత స్వతంత్రులో, నే నంతటి స్వతంత్రురాలను.

చిన్నభార్య బాధకసాధకములను తెలియచెప్పెను. వ్యాజ్యపుగొడవలు త్రవ్వెను పురుషునికిని స్త్రీకిని గల భేదమును చూపెను. పతి యిష్టప్రకారము ప్రవర్తించని భార్యను యింటినుండి తరిమివేయగలడు. రక్షకశాఖవారిసాయమున ఇట్టిపెండ్లిని ఆపగలడు. అతనికి సర్వాధికారముకలదు. కాని స్త్రీ కట్టిఅధికారములు లేవనియు చూపెను.

"లేదు. కాని, అక్కా! ఏ పురుషుడు తనస్వేచ్ఛకొలది వర్తించునో, వాడు పత్నీప్రేమకు పూర్ణపాత్రుడు కాడు. నాసంబంధము నిశ్చయమైనది. మఱియొక స్వజనుని ప్రేమసూత్రము నాహృదయమును బంధించివైచెను. ఈ పుష్పము మఱియొకవిగ్రహమున కర్పింపబడినది. అప్పటినుండి పతనమైనది. లేదు పతితమైనదిగా చేయబడినది. ధనబలముచే లాగివేయబడినది. అయినను ఇపుడు చక్కగా నెందులకు అలంకరింపరాదు. ఇంతకాల మెందులకు పడియుండవలయును.- మఱియు నాప్రియుడు వచ్చియున్నాడు నాతో కష్టసుఖములను భరించుటకు అతను సిద్ధముగా నున్నాడు. ఈహృదయము అతనికి సమర్పింపబడును. ఇక, శరీరమా? దీనిని సేటుగారు కొనియుండెను. ఈకారణముచే నీశరీరము, దీనినుండి ఏవి యుత్పన్నమగునో అవియు సేటుగారివని పిలువబడును." అని చాందురాణి స్వాభావికమైన నవ్వుతో చెప్పెను.

చిన్నభార్య చాల నవలలు చదివి యుండెను. కాని ఈసమస్యవిషయమై ఆమె ఎప్పుడును ఆలోచిం యుండలేదు.

౪

రెండుసంవత్సరముల పిమ్మట చాందురాణి పురిటిపాపను తీసుకొని వచ్చి నిశ్శబ్దముగా సేటు కేవీనరణుని ముందునిలిచెను. తల్లిచేతులనుండి వేరుపడుట వలన బిడ్డ కావు కావు అని గోలపెట్టసాగెను. సేటుగారి మిగతభార్యలు రోదనమును విని, అచటికి వచ్చిరి. చాందురాణి ప్రసవించినదని ఇచట కొన్నిదినములు మంచి పుకారుగానుండెను. కాని, జాడ దెలియదాయెను. ఇపుడు ఆకస్మికముగా ఈ దృశ్యమును చూచిన వారు చాందురాణి సాహసమునకు మితిలేని ఆశ్చర్యమును పొందిరి. చాందురాణిని చెప్పినవంతయు చేసి చూపుటకు శక్తిచాలనిదానిగ తలచుచుండిరి. కాని, యీసమ్మేళనముతో వారిభ్రమ తొలగిపోయెను.

చిన్న:—పిచ్చిదానా! మాకుగూడ నీ విషయమును దాచితివేల? వారు కోపించిన బిడ్డనెత్తివేసి నట్లయినచో

చాందు:—[illegible]గూడ తగినది, వారు బిడ్డను పారవైచెడి పక్షమున, సంతానమునకు వివాహమేద లేదని రుజువగును.

సేటు పటపట పండ్లు కొఱుకుచు కోపముతో "చాందు! ఇది నీకు కళంకము." అనియెను.

చాందు — కళంక మెవరియందును లేదు. మీకు నేను కళంకురాలను, మీరు నాకు కళంకులు. ఈసృష్టియందు సర్వథా కళంకమే శోభగా నున్నది. ఎవడు కళంకరహితముగ జీవితమును గడుప యత్నించునో, వాడు రెండుగుడ్డిగవ్వలకు గూడ కొరగాడు.

కేవీ:—దీనిని తీసికొని వెళ్ళుము. నేను మూఢ జాలను. కోపముతో పరవశుడను కావచ్చును. అట్టిసంఘటనము రానివ్వకుము. దీనియెడల అనర్థము తన శక్తినంతను చూపగలను.

చాందు:—నేను ముందువెనుక లాలోచించితిని. ఎంతకైనను సంసిద్ధురాలనె.

కేవీచందుడు చాలసేపటునిటుచూచెను. పండ్లుకొఱుకుచు, వణకుచున్న హస్తములతో ఏడ్చుచున్న బిడ్డనెత్తుకొని "ముక్కుపచ్చలారని బిడ్డా నిన్ను నాక్రోధమునకుబలిగా నెందులకు చేయవలయును పెద్దవాడవైన పిమ్మట నీ వంశము వినుట, తెలిసికొనుట, తటస్థింపవచ్చును. నీవు బ్రతికి అవమానాగ్నియందు భస్మమగుటయే నీ వ్రాతఫలము... చాందు నేను మూడు వివాహములాడువరకు ప్రపంచము స్వప్నానముగనుండెను. ఏదినము నేను నాల్గవ వివాహమాడితినో, ఆదినమే భూగోళము ఆదిశేషుని పడగలనుండి తొలగి మఱెచ్చటనో పడుచున్నదని తెలిసికొంటిని. కాలము మారినదనియు స్త్రీలు దానితోపాటుమారిరనియు తెలిసికొనగలిగితిని. మధ్యాహ్న మంటకలసినది. మఱియుం కేమిపోవును! అంతయు భరించెదను. ఇక పెండ్లి ఆడనే ఆడను."

చాందు—పెండ్లిచేసి కోనని ప్రతిజ్ఞ చేసెదరా!

కేవీ:—ముమ్మాటికిని.

"మంచిది. ధ్యానముతో కొంచెము చూడుడు. బిడ్డ కాదు-బొమ్మ! పరుండబెట్టిన రేడ్చును. కూర్చుండబెట్టిన నవ్వును

(అనువాదము.)



దమయంతి : కిరాతుడు

(ఆంధ్రచిత్రకళకు వ్యక్తిత్వము గొనివచ్చిన త్రిమూర్తులలో నొకరగు శ్రీ వరదా వేంకటరత్నముగారి త్రివర్ణచిత్రమునుండి ఎత్తబడినది.)

దమయంతి : కిరాతుడు

"మహారణ్యమధ్యమున నిట్టి విపత్సముద్రమునఁ గూలఁబడిన అసూర్యంపశ్యయగు దమయంతి యవస్థ నెవరు వర్ణింపగలరు? ఆమె ధైర్యముఁ గోలుపోయి 'మహారాజా, ఏల యిట్టిపనిఁ జేసితివి? నేను నీకేమి భారమైతిని? నీవు ఏకాకి వగుదువని తోడుపడ నీతో వచ్చితిని. ఆఁకలిగొన్నపుడు ఏకందమూలములో, ఏఫలములో తెచ్చిపెట్టుటకు వెంటవచ్చితిని. పిపాసయైనపుడు ఎట్లో జలము తెచ్చియిచ్చుటకు వచ్చితిని. నడచినడచి అలసియున్నపుడు పాదములొత్తి శ్రమతీర్చుటకును, మనస్సుకలఁగి తొట్రుపడునపుడు తీయని మాటలుచెప్పి వినోదపెట్టుటకును నీవెంటవచ్చితిని; గాని నిన్నుకష్టపెట్టుటకు రాలేదు.

'ఇప్పుడు నను విడిచి యేలపోయితివి?
వచ్చిన శోకచోటఁ జావమే మనము?
కలఁకటి నొకభంగిఁ గాలంబు గడపి
మెలఁగమే యడవుల మేదినీనాథ!
గ్రహవేధ లనియెట్టి గతుల వచ్చినను
గృహిణిఁ బ్రోచుట నీకుఁ గృత్యమే నాథ!
ఇది నాకు నొంటిగా నిప్పుడు దోఁచె,
ఇది నాకు నడవిగా నిప్పుడు దోఁచె.
ఎక్కడి కేఁగుదు నేమి సేయుదును?
దిక్కెవ్వ రిటమీఁద దెలఁగనేది నాకు?'

అని యనేకవిధముల దుఃఖించుచు

విడువక వెదకుచు విపినంబులోనఁ
గుందుచు దమయంతి కొంతదూరంబు
సందుగొందులఁ జూడఁ జనుచున్నపుడు
కదపడి యాసమీపంబున నొక్క-
పాదరింటిలో నున్న పుట్టలోనుండి
తన తలయెత్తి యాతన్వి నీక్షించి
పెనుఁబాము చెలఁగుచు బిరబిరవచ్చి
రోఁజుచుఁ గన్నుల రోషాగ్నులదర
రాజిల్లువిషముబు రోఁజుచుండుచును
పూనియప్పుడు పాము భూమీశుజేవి
పదములఁబట్టి తప్పక మ్రింగుచుండె.
తనుమ్రింగు నాఘోరదందశూకంబుఁ
గనుఁగొని శోకాగ్నిఁ గ్రాఁగుచుఁబలికె:
'అక్కటా! యీఘన కాఘోరమైతి
ఇక్కడ నాకింక నెవ్వరుదిక్కు?
పామును విడిపించు బలవంతు లేరు?
నామేను మ్రింగుచున్నది యంతకంత.
ఇడుమలఁబడి జీవితేశు నిఁబాసి
కడపటవచ్చి యీకాలాహిచేతఁ
బడుటకు నాప్రాఁతఫల మిట్టులుండె.
అడలంగ నిపుడు నాయాపదమాన్ప
వడి నిట కెవ్వరు వత్తురో యింక!
పుడమి శ్రీ దేవటికిఁ బోయెనో యొంటిగ.
ఈవేళ నిందున్న నీపాముచేఁ
జావనిచ్చునె దీనిసాధించుఁ గాక
దైవమా! యిట్టిబాధలకు లోఁజేయ
నీకేమి నీకు నేనేమిసేసితిని?'

అని యనేకవిధముల నేడ్చెను. ఈయేడ్పువిని మృగములను వేఁటాడుటకువచ్చి యాప్రాంతమునందే సంచరించుచున్న యొక

'బోయవాఁ డరుదెంచి బోరన నపుడు
పాయక తనచేతఁ బట్టినపెద్ద
గత్తిచే నాపాము కంఠంబుఁద్రుంచి
యెత్తి యావలవైచి యెలనాఁగఁ గాచె.'

—చక్రపురి రాఘవాచారి.

అంత దమయంతియుం రాహువు నోటనుండి వెలువడి వచ్చిన పూర్ణిమాచంద్రునివోలె నఖగరముఖంబు వలన వెలుఁగకి వెలుంగుచుండెను."

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

సింహళ ద్వీపం కైఫీయ్యతు

[మధుర ఆంధ్రనాయకరాజు సింహళద్వీపపు రాజును జయించిన వృత్తాంతము.]

ఎదటిబలం కేవలహీనదశ పొందినందుచేత వీరిదళవాయిన్ని పాళెయగారులున్ను లోజొచ్చి పరుకులాడేటప్పటికి పెద్దమంత్రితో నిలచిన రెండువేలజనాన వెయిజనంచచ్చిన్ని, గాయాలతోనున్ను పడ్డందుచేత వీరు కడమజనానిన్ని, ఆమంత్రినిన్ని చుట్టుకొన్నప్పుడు యేలినవారు అంబారిమీదినుంచి చూచి ఆమంత్రిమీద దోషంలేదు, ఆరాజు ఆతనిమాట వినవందుచేత మానానికిన్ని, అపకీర్తికిన్ని వెరిచి ఆరాజుతో కూడా చావుకు యేర్పడి నిలిచినాడు. కనుక ఆతణ్ని చంపక చెయిపట్టుగా పట్టుకొనిరమ్మని ఉత్తరవయినందుచేత పట్టవలెనని లోచొచ్చినంతలో రౌటాయిరావుణ్యఅందు కొండాచన్నియదున్ను పూర్తుమనై మరుప్పతెవకును వారి పుభయత్రవాలుగువేల జనమున్ను వఖపక్క నిలచి తుపాకిజగడం చేస్తావున్నవారు వారుపున్నపార్శ్వం వారున్ను లోచొచ్చిపోతావుండగా అందు కొండాచన్నియడికి తుపాకిగుండుతాకి తొడవిరిగి గుర్రంమీదనుండి క్రిందపడపొయ్యేటప్పటికి పరిజనంపోయి పడకుండపట్టుకొని పాలకీలోనుంచి అతణ్ని అవతలకు పంపించి తమయజమానుడు గుండుతాకి పడ్డకోపంచేత వారంతరు యేకీభవించి మంత్రిమీద నడిచినప్పుడు ఆపార్శ్వగాండ్లచేతి తుపాకిగుండుతాకి ఒఖచెయి విరిగి గుంపుమీదినుంచి కిందపడగానే అతనితో నిలచివున్న సింగళపుజనంవిరిగి పలాయనమ్మయి పారిపోయినారు.

ఆక్షణమె దళవాయి కేశవప్పనాయుడామంత్రిని తనచెయివశంచేసుకొని మంత్రిని డోలీలోవుంచి తమ రాజువద్దకి అంపించగానే రాజుచూచి ఆమంత్రిని బహుసంతోష పడవేశి పాలకీతెమ్మని అందులోవుంచి యాన్తైగుర్రమున్ను వెయిజనమున్ను వఖసరుదారును కూర్చి ముందరతగిలివుండె మంత్రులు దేశానాధులుతో కూడావుంచి గాయాలుకట్టించి అతన్ని బహుమర్యాదగా అతని గొప్పకు తగ్గట్టు పరిచారకులున్ను నేకుగింది కావలశినపదార్థములు యిమ్మని అంపించినారు. ఆ మంత్రిన్ని ముందరతగిలిన మంత్రులకైనా అధికంగా ఈరాజు మహాధర్మిష్టుడు శత్రుపక్షంగా వున్న మనల యింతమరియాదగా వుంచి సంరక్షించినందువల్ల ఆయన ఆజ్ఞాపించిన ప్రకారం నడుచుకోవలెనని ఆమంత్రులున్ను దేశానాధాలున్ను కలిశిమాట్లాడుకొని వుండిరి.

ఇచ్చట రాజబంధువులున్ను కాఫరిజనమున్ను రాజు నేమగమ్మటుకొని నిలచిరి. అప్పుడున్ను ఆరాజు ధైర్యం విడకపోయింది పోగా నిలిచినబంధువులకున్ను ఆకాఫీరీలకున్ను ధైర్యంచెప్పి జెయిస్తే రాజ్యము భోగభాగ్యము అనుభవించేము. యుద్ధమందు వెనక్కితీయక నిలచి మరణమైతే బహుకాలానికి కీర్తిన్ని వీరస్వర్గమున్ను కల్గుతుంది అని నిలచిన బంధువులకున్ను జనానికిన్ని ధయిర్యంచెప్పి అప్పటికేలజనాన్ని శేఖరించుకొని అంబారివిడిచి దిగి గుర్రాన్ని తెమ్మని యెక్కితానున్ను నిలిచిన జనాన్ని తీసుకుని వీరదళానజొచ్చి చెయికలిశినప్పుడు దళవాయి చిన్నకేశవప్పనాయుడున్ను హరికట్టు దళమున్ను దళనాయకులున్ను పాళ్యగారులున్ను అట్టహాసంచేశి ముందరవచ్చిన కాఫిరీవారలకున్ను మహాయుద్ధంచేసి కాఫిరీవారిజనాన అయిదువేలకు మృతిపొంది రెండువేలకు గాయములచేతనున్ను హతమయి పడిరి. కొంచం మిగిలిన కాఫిరిజనం విరిగి వెనక్కిపోయిరి. అప్పుడు ఆరాజున్ను రాజబంధువులున్ను గుర్రాలెక్కివున్నవారు తెప్పున రాజు గుర్రాన్ని వేయగానే తక్కిన దొరలందరు వెంబడే గుర్రాలువేశినప్పుడు ఆరాజును చంపవద్దు చెయిపట్టుగా పట్టుకొనిరమ్మని యేలీన వారు ఉత్తరువు చేశినారు. ఆమేరకు రాజుమీద తుపాకులు వేయవద్దని దళానికి తాకీదు

చేత వీరిశైన్యములో యుండే దొరకొడుకులు పాళయ
గార్లు మరివుండె సరుదారులు అందరు గుర్రాలుయెక్కి
వున్నవారు అందరు వారిమీద గుర్రాలువేశి నరుకు
లాట అయ్యేటప్పటికి వెనకపార్శ్వం పాళయగారుల
జనం చుట్టుకొని బల్యాలతో పొడుచుకునొచ్చినారు.
అట్లావుండి ధయిర్యంవిడవక మధురవారి జనాన అనే
కజనానికి ఛేదంచేశి వీరిచేత వారున్న హతమై రాజు
మాత్రం పదిగుర్రాలనిలిచి యేలినవారి అవుదామాచి
చెయకరుచుకొని అంబారిపార్శ్వం యీపదిగుర్రా
లున్ను కండిరాజున్ను గుర్రాలునడిపించి యెదటనిలచి
వుండే జనాన్ని నరుకుతూ వచ్చేటప్పటికి దళవాయి కేళ
వప్పనాయఁడు తనగుర్రాన్ని అడ్డంవేశినప్పుడు అతని
వెంబడి గుర్రాలుయెక్కివుండిన సరుదారులుఅయన
వెంబడిగుర్రాలువేశి కండివారు పదిగుర్రాలమున్ను చుట్టు
కొనిరి.

ఆరాజుమాత్రం అడ్డగించినవారిని నరుకుతూ
దళవాయి కేళవప్పనాయుడిమీద గుర్రాన్నివేశి నరి
కేటప్పటికి కడయాన నరుకుపట్టుకొని చంపవద్దని రాజు
వుత్తరవుగనక చంపక పట్టవలెనని చుట్టుకొనినందున
అతడు మహాశూరుడు గనుక జనాన్ని దెగ్గిర చారనియ్య
కుండా నరుకుతూ తిరుగా ఆకేళవప్పనాయని పార్శ్వం
గుర్రాన్నిదాటించి కత్తిచేతనరికేటప్పటికి కడయా
సమాళించి పట్టేటంతలో రాజు చెయిమించి కేళవప్ప
నాయనిముంకేత నరుకుపడిన తక్షణం మహాకోపంతో
గుర్రాన్నితిప్పి రాజు అంబారిమీదకిపోయి ఖండిరా
జును చంపవద్దు చేపట్టుగాపట్టుమని అజ్ఞాపిస్తిరి.
అతడు మహాశూరుడు. మహాశూరుడు ప్రాణములో వ
ఖరి చేతతగిలేవాడు కాడు.అతనిచేత నరుకు నాచేతచూ
డండి అని అన్నివుత్తర్వులిస్తే కొట్టివేస్తున్నాను అని చె
ప్పుతూవుండగానే ఖండిరాజును యెవరూ నరకవద్దని
పాళయాన్నిచే చేబట్టగా పట్టుమని రాజు అజ్ఞాపించినం
దుచేత సయిన్యమంతా రాజు అజ్ఞకు వెరచి తుపాకులు
గాని ఆయుధములు గాని అతనిమీద ప్రయోగించక
ఆ రాజును కని తొలుగుతూ వచ్చిరి. అసమయాన ఈ
ఘనరాజు పార్శ్వంగుర్రాన్ని దాటించి అడ్డంవచ్చినవా
రిని నరుకుతూ గుర్రాన్ని గుప్పుని దాటించి రాజువుండె
అంబారి యేనుగమీద నరికేటప్పటికి యేనుగు తొండం
అరదిట్టంతెగి కిర్రనికూతవేసి యేనుగ వెనుకతీశేటప్పటికి
యేలిన వారికి బహుకోపంవచ్చి అవుదాలో వుంచివున్న
పిండ్లంబులు యెత్తి ఖండిరొమ్ముజూచి లక్షించి ప్రయో
గించేటప్పటికి ఆయంపవట్యం కండిరాజు రొమ్మున తా
కి వెన్నుపార్శ్వంగూశివందున ఆఖండిరాజు మరణ మూ
ర్ఛతో కిందపడగానే యేలినవారు అంబారి విడిచి దిగి
ఖండిరాజును యెత్తమని చూచే పట్ల మరణమయి వుండె
ను. గనకసమాధానంగా తొలిగిపోక మూర్ఛపట్టుగా
వుండి రాజ్యములున్ను ప్రాణములున్ను విడిచెను. కిరీట
సింహాసనాధిపతి సింగళద్వీపమంతా యేకచక్రంగా యే
లుతూవున్న మహారాజు గనక యితనికి వీరస్వర్గం కద్దని
బహునిండా వెసనపడి ఆ రాజుయెక్కివచ్చిన అంబారి
యేనుగ తెమ్మని ఆ యేనుగను పండబెట్టి ఈ రాజును
యెత్తి అంబారిలో వుంచి ప్రేతంకనక యీపార్శ్వం
ఆపార్శ్వం వొరిగిపడకుండ దిండుతలగడలు ఆనికగా
యిచ్చి యిద్దరు మనుష్యులనునియమించి యిరుపార్శ్వా
లా వొరగకుండా పట్టుకొనిరమ్మని శ్వేతఛత్రం వుభ
య చామరం కుంచలు మొహార్చెలు కల్కికలు మొదల
యిన ఆ రాజాంగానికి కలిగిన బిరుదులు అన్నియుపట్టిం
చి తనబిరుదులు కూడా ఆయనముందర నడిపించి జయ
భేరి మొదలయిన అష్టాదశ వాద్యములున్ను అతని అవు
దా ముందర నడిపించి వారివెంబడి వచ్చిన నగారానవ
బత్తులున్ను తనవెంబడిగా యేనుగులు వొంటెల మీద
వచ్చిన నవబత్తునగారాలున్ను అతనిఅంబారి వెంబడి వా
యిద్యం చేస్తూరమ్మని అప్పటికి సూర్యఅస్తమానమా
యెను గనుక అనేకదీవట్లున్ను మత్తాపులు పగలొత్తులు
యెప్పటికన్నా నాలుగుయింతలు అధికంగా వేయించి
అతని అవుదాముందర యిరుపార్శ్వములో చంద్రజో
తులుసహితముగా అతని అవుదాముంధరనడిపించి తన
సయిన్యమున్ను అందులో వుండ తగ్గ దొరకొడుకులు స
రుదారులు పాళయగారులు అందరినిన్ని వారివారి వా
హనాలలోకూడ తనఅవుదాముందు వెనకపక్క పార్శ్వ
ములో వారువారు వచ్చేటటువంటి తారతమ్యముల

ప్రకారం అతని అవుదావెంబడి రమ్మని తనవెంబడివచ్చేటటువంటి దంటునశీపులు ఛత్రీరాజులు మొదలయిన వారలంత కండిరాజు అవుదాముందర నిలిచి వారి బిరుదావళియాలు యెత్తిసాగదుతూరమ్మని ఆ ఖండిరాజుదిగివున్నపాళేన వుండేయిపువంటి యేనుగులు గుఱ్ఱాలు ఫిరంగులు తుపాకులు మందుగుండు డేరాలు మొదలయినటువంటి యేమేమిసామానులు ఉన్నవో అవి అన్నియు యెత్తించుక రమ్మని తనమనుష్యుల సేమించి ఖండిరాజు అంబారిముందుగానున్న తన అంబారి వెనుకానున్న యీప్రకారం తాను దిగివున్న పాళ్యానికి పొయ్యేటప్పటికి ఆ పాళెములో వుండేటటువంటి ప్రజలున్ను ఆ రాజామంత్రులు దళావాయులు యెదురుకొని వచ్చి కండిరాజు అంబారిలో వచ్చే వైభోగం చూచి ఆశ్చర్యపడి యీ బిరుదున రాజును సమాధానమై యీ రాజు మనరాజును బహుమరియాదతో తమదండును పిలుచుక వస్తున్నారని బహుసంతోషముతో వఖరికిమ్మురు సంతోషముతో వేడుకచూస్తువుండగా యీదళమున్ను యీ రాజులున్ను ఆ పాళెంచేరి రాజునగరి డేరాలవాకిట తన అవుదాదిగి ఖండిరాజుప్రధాన్ని కిందదించమని ఆ మంత్రులున్ను దళావాయులున్ను రప్పించవమని మా రాజు యెన్నివిధాలలో చెప్పినా వినక అతి మూర్ఖత్వంచేత యీదశ పొందెను.అయితే యేకాగ్రచిత్తుడై ధైర్యమున్ను శౌర్యమున్ను నిలిపి యుద్ధమందు బహుసాహసంచేసి మూడశవాయునిన్ని మాపట్టపుయేనుగమున్ను నరికి గాయపరిచి మాచేత అంపకట్టిర న్యుత్తాని చూసి అక్షణం ప్రాణం విడిచి వీరస్వర్గాన్ని పొందెను. కనుక స్వర్గలోకమందు యింతకైనా అధికమయినటువంటి దేవతాస్త్రీలతోకూడి భోగభాగ్యము అనుభవిస్తూ యింద్రలోకాన మహాసామ్రాజ్యవంతుడై యింద్రసభలో వాసంచేస్తూవుండును గనుక యితనికి మీరు విసనపడవద్దని వారికి సకలవిధములోనున్న తెలియచెప్పి మీ మతాచార ప్రకారం మంటిరాజులకు యేయేప్రకారం దానధర్మములున్ను వుత్తరక్రియలున్ను నడిపించుమని అందుకు సామగ్రియలున్ను కావలసిన ద్రవ్యలున్ను యిచ్చి గంధపుచెక్కలచేత కాష్టం తయారుచెయ్యనియీరాజు ప్రేతాన్ని పల్లకీలోవుంచి పుష్పాలచేతఅలంకరించమని తానువోకరు బినా తక్కిన సరుదారులు అందరినిన్ని పాళెగారులు మొదలయిన సకలమైనవారినిన్ని సకలబిరుదులు సకలవాద్యములతో కూడా అందరినిన్నికూడా పోయి దహనంకాయమని చిన్నకేశవనాయడికి చేతిగాయంకట్టించి అతనిడేరాకుపంపించి తాను స్నానంచేసిఆరాజునిమిత్తం తానవుపవాసంవుండి మరునాడు అతనికి సంచయనంచేసి అంపరు వచ్చిన పిమ్మట తాను స్నానంచేసి నిత్యపూజ నిత్యదానములు చేసిగాయాలుపడ్డ మంత్రులనున్ను తక్కినమంత్రులనున్ను దళావాయులనున్నురప్పించి వారికంతా నగరిలోనే భోజనాలు పెట్టించి వారికి రత్నభూషణాదులున్ను బహుమానం యిచ్చి యిఖమీదనడవవలసిన పనులు యేమిఅని ఆమంత్రులను అడిగి ఆలోచన చేసేటప్పటికి వారుచెప్పింది: స్వామీ మారాజును యీప్రకారం మృతిబొందేకాలం వచ్చెగనుక మావుత్తరవుప్రకారం మేము పోయి సకలవిధాలతో తెలియచెప్పినన్ని వినక అతిమూర్ఖత్వముచేతచచ్చితీరను.

అదిన్ని తనకు సమానమయినటువంటి రాజుచేత మృతిబొంది స్వర్గస్తుడాయను గనుక శత్రువనియెంచక అతనికి సకలవిభవములతో కూడా తెచ్చిదహనం చేయిస్తిరి. శత్రువపక్షమయిన మమ్మును సకలమరియాదలతో కూడావుంచి మాకు ప్రాణదానమిచ్చి రక్షించితిరి మఱియు మారాజుకు సంతతిలేదు. వారిబంధువులు జ్ఞాతులు మొదలయినవారలందరు యుద్ధాన మరణమయిరి. కనుక నగరిలో స్త్రీ బాలలుమాత్రం వున్నారు. కనుక పురుషప్రజలేదుగనుక స్వామివారు ఖండిపట్నం విజయం చేసి సింహాసనారూఢులై యీ శింగళద్వీపానకు పట్టాభిషిక్తులై మమ్ముల సంరక్షిస్తూవుండవలెనని వీరందరు పాదాక్రాంతులై రాజును ప్రార్థించినందుచేత అన్నిటికిన్ని మీసన్నిధానకు వచ్చినపిమ్మట చెప్పుతున్నామని ప్రయాణభేరివేయించి యుద్ధములో గాయాలు పడ్డవారిని మాత్రం నిలిపి గాయాలుస్వస్తంచేయమని అందుకుతగిన కార్యస్థులను అచ్చటవుంచి పెద్దమంత్రి చిన్నమంత్రి యిద్దరికిన్ని పాలకీలుయిచ్చి గాయాలు కదలకుండా సావధానంగా తమవెంబడి రమ్మని కడమ యిద్దరు

మంత్రులున్ను అయిదుగురు దళానాధులున్ను ముందుగా అంపించి తానున్ను ప్రయాణం పోగివారు ఆమంత్రులు దళలుపోకూవుండగానే సీమకంతా జాబులు వ్రాశి శీమవారినంతా ఖండికివచ్చి రాజఘట్టికి రమ్మని దోవకడవల్లో మకరతోరణాలు కట్టి కండిపట్టణమంతా అలంకరించి ముందటి రాజస్త్రీలు బంధువుల నగరిలో వుండే స్త్రీలు సంకరిస్సి గెవకెనపాలకీలో యెక్కించుకొని తత్పూర్వంవున్న రాజులు ప్రత్యేకముగా కలగచేశియున్న అంవరంగాయక పట్నానికి పంపించి అచ్చటినగరిలో వుండమని శేమించి వారివారి మనవర్తులకు అక్కడనే యిమ్మని కలగచేశి ఆయానగళ్ళు కావలశిన తగుమనుష్యులను చేసుకంచేశి ఖండిపట్టాన రాజుకున్ను దళవాయి మెంకలయిన దొరలకు తగినట్టుగా నగరు శింగారించి పట్ణం అగరు సాంబ్రాణి ధూపములచేత అలంకరించి శీమలకంతా పులపసామగ్రిలున్ను పాళ్యానికి కావలశిన వస్తు రసవర్గములున్ను యథేష్టముగా రప్పించి రాజున్ను పాళ్యమున్ను వచ్చిదిగి మజిలీ మజిలీకి విడుదులున్ను నగళ్ళున్ను శృంగారించి అక్కడి కక్కడ వులఫలస్తు సామగ్రిలున్ను తయారుజేసి ఆ శింగళపుదేశములో కలిగిన కార్యస్తులను పిలుచుక ఆమంత్రులు దిశానాధులున్ను యీరాజును యెదురుగా వచ్చి కనిపించుకొని పట్ణానికి పిలుచుకొని పోయి పాళ్యమంతా గంగకిగట్టుపదించి యీరాజు వెంబడి కార్యస్తులున్ను దొరలున్ను కొంత దళమున్ను మాత్రం పట్ణానకువచ్చి నగరు ప్రవేశించేటప్పుడు ఆ శింగళమంత్రి ప్రధానులు దిశానాధులయొక్క స్త్రీలు కొమార్తెలు సకలాభరణభూషితులైన బంగారుగిన్నెలో ముత్యాలఆరతులున్ను రత్నాలహారతులున్ను రాజుకు యెదుటనిలిచి యెత్తిరి.

అప్పుడు ఆ మహారాజా చూచి సంతోషపడి ఆస్త్రీలకు అనేక రత్నభూషణములున్ను దివ్యాంబరములున్ను ఆకంచములనిండా వరహాలున్ను తాంబూలమున్ను వారికిచ్చి అంపించి ఆస్తానమంటపాన ఆరాజు కొలువుండే రత్నసింహాసనాన కూర్చుండి ఆసింగళదేశమందుకల మంత్రులు అధికారులు దెశానాధులు మరిన్ని వుండదగ్గవారందరు నజరుకాణికలు వారివారి యోగ్యతకు తగ్గట్టు కొంచువచ్చివుంచి రాజును కనుగొని అనేకవిధాల్లో స్తోత్రంచేశిరి. రాజు వారిని జూచి సంతోషపడి వారివారి యోగ్యతకు తగ్గట్టు వస్త్రభూషణాదులున్ను తాంబూలాలున్ను యిప్పించి అచ్చట రామస్వామిగుడికిన్ని కృష్ణస్వామి గుడికి పోయి దరిశనంచేశి స్వాములకు అభిషేక నయివేద్యములున్ను పీతాంబరములున్ను రత్నభూషణాదులు యిప్పించి మూడుదినాలు వుండి ఆమీద కదురికామానికి పోయి కదిరేశ్వరుని దరిశించి తిరుగా పట్ణానికివచ్చి తన బంధువులందరిని సముఖానకురప్పించి చూచి అందులో యోగ్యుడున్ను బుద్ధిమంతుడున్ను మహాపరాక్రమశాలిన్ని ఆకారరేఖా మహారాజలక్షణవంతుడైన తన భావమరిది విజయగోపాలనాయని పిలిచి నీ శింగళద్వీపానికి రాజుగావుండమని పురోహితుల రప్పించి మంచిదినమున్ను లగ్నమున్ను సుమూహుర్తమున్ను చూచి ఆదినమందు అచ్చటి గంగాజలమున్ను అనేకమందుకల పుణ్యనదుల తీర్థములున్ను తెమ్మని అతనికి అభిషేకంచేశి స్వర్ణపట్నంమీద వ్రాయించి లలాటమున ధరియించి సకలాభరణభూషితునిజేసి గంధపుష్పమాల్యాంబరములు ధరియించి సకలదళమున్ను సింగళపు మంత్రులు ప్రధానులు దిశానాధులున్ను వారి సయిన్యమున్ను రథగజతురగపదాతులున్ను వుభయత్రల పాళయగారులున్ను చుట్టు పరివేష్టించి రాగా పట్ణంవీధులు అలంకరించి పట్టపుయేనుగు రత్నాల ఆభరణములతో శృంగారించి నవరత్నఖచితమయిన హావుదా అంబారివుంచి అంబారిలో విజయగోపాలరాజున్ను సవారిగమ్మని శింగళరాజుకు కలిగిన బిరుదులున్ను పాండ్యదేశాధిపతికి కలిగిన బిరుదులున్ను రెండు వరుసలుగా యేనుగమందర నడవగా శ్వేతఛత్రం వుభయచామరాలు మెంచ్ఛలు కుంచలు వెటపావడలో హావుదామీద వెనకతట్టునవుండి కొంకరు వేస్తూరాగా నాటకశాల స్త్రీలుముందర నాట్యమాడుతున్ను భట్ల కటికాలు యిరువంకల పొగుడుతూరాగా శింగళపుకవులు ఆ రాజు ప్రతాపబిరుదావళులు చూర్ణికలుగా పొగుడుతూ

రాగా పురస్త్రీలు ముత్యాల రత్నాల హారతులు ఆయా వీథుల్లో నిలిచి యెత్తుతూరాగా బంగారు బెత్తాలు వెండిబెత్తాలువారు ముందర రెండువరుసలుగా నందడి తొలిగిస్తూరాగా భూలోక దేవేంద్రునివలె పట్టప్రవేశం రాగా రాజా పెదకృష్ణప్పనాయడువారు మైసజ్జమీద ఉండి చూచి సంతోషముతో ఉండగా సవారి చుట్టి వచ్చి హజారంముందరదిగి ఆస్థానమంటపానకు వచ్చినప్పుడు మధురరాజు యెదురుగావచ్చి చెయిపట్టి పిలుచుకొనిపోయి తనచేతులార రత్నకిరీటంధరియించి చేపట్టి రత్నసింహాసనమందు కూర్చుండబెట్టి ఆశింగళపు వారు నజరు కానికెలువుంచి సాష్టాంగులై నిలిచియుండగా వారివారికి ఆశింగళ దేశంరాజులు పట్టానికి వచ్చినప్పుడు నడచు బహుమతులకు యిప్పుడు ద్విగుణం అధికంగా నడిపించి గంధపుష్పతాంబూలాలు వారికందరికీ యిప్పించి సంగీతసాహిత్యములతో నూతనపట్టం రాజుకు పాండ్యదేశాధిపతి శింగళద్వీప మహారాజనిన్ని ప్రతాప లంకేశ్వరుడనిన్ని రెండు ఖితాబు లిచ్చి ఆ నలుగురు అతనిపార్శ్వం విడిచిపెట్టి తాను తన డేరాలోవచ్చి దిగినప్పుడు ఆ ప్రధాని మంత్రులు దిశలు మొదలైనవారం దరున్నువొచ్చి సాష్టాంగులై నిలిచి వొక మనవి అడిగినారు.

ఏమంటె సనాతనముగా రాజున్ను యీదేశం సకలప్రజలున్ను వొక బౌద్ధమతమేకాని రెండో మతములేదు గనుక ఆట్లాగంటిదేశమున్ను ప్రజలున్ను పురమాసీమంతా రాజె దయివమని యెంచివున్నారు గనక దయివమంతా వొకటి కాబట్టి అయినప్పటికిన్ని దేశాచారప్రకారం రాజున్ను వుండేటట్టు ఆజ్ఞాపించవలసింది యని దేశంవాళ్లు యావత్తువచ్చి మనవిచేసుకోంగా అదేప్రకారం నడుచుకొమ్మని వుత్తరవుయిచ్చి పంరెండు ఘటాలు యేనుగలున్ను నగరి బొక్కసాంనుంచి రత్నభూషణములు కొన్నిన్ని వెండిపాత్రలున్ను బంగారుపాత్రలున్ను దివ్యాంబరములున్ను దండుశలవుకని యాభై యొక్క లక్షవరాలున్ను కొన్ని యేనుగదంతములున్ను కొన్ని ముత్యాలసరములున్ను నాటకశాలలైన యోగ్యం గల చిన్నపడుచులుగా సౌందర్యంకలవారుగా సర్వాభరణములు అలంకరించి నాటకశాలకు యిప్పించి సంవత్సరానికి కప్పం రెండుయేనుగలున్ను పన్నెండు లక్షల రూపాయిలున్ను తీరుమానంచేసి మన్నారు ముత్యాలసలాభమున్ను యీ మూడున్ను వ్రాసి రాజుచేతిశిఖాను శింగళపుమంత్రులు ప్రధానులు కార్యస్తులచేత వ్రాలున్ను వ్రాసి యిప్పించిరి.

ఆటుతరువాత పట్టపురాజుకున్ను ప్రధానులు మంత్రులు కార్యస్థులు యావత్తునున్ను రప్పించి రాజుకున్ను రత్నభూషణాంబరములు యిప్పించి యితరంవార్లకు వారివారి తరంచొప్పున భూషణాంబరములు యిప్పించి దండుకూచిశాయమని అప్పట ఆ రాజు నూతనం గనుక ఆరువేలజనమున్ను అందుకు తగిన సరుదారులునున్ను ఆ రాజుకు ఆత్మసంరక్షణార్థముగా దేవిడీవారికి నేమకంజేసి ఆ రాజుకు కేవలం స్వకీయ్యులుగావుండే బంధువులలో అరవై యిండ్లవారు ఖండిలో రాజువద్దవుండమనిన్ని శేఖ సంవత్సరానికి వెనుక ఆ రాజున్ను ఆ బంధువుల సంసారం చిన్నా చిరుతలు రప్పించుకొమ్మని ఆజ్ఞాపించి ప్రయాణభేరి వేయించి మంచిలగ్నమందు బైలుదేరి గంగకు యీగొట్టున పెద్దపాళ్యం వచ్చిచేరి నాటిదినం అప్పట మొఖామిచేసినందున ఆశింగళమంత్రి ప్రధానులున్ను కొత్త రాజున్ను వెంబడిగావచ్చి దళవాయి చినకేశవప్పనాయినికిన్ని మరిన్ని యేలినస్వామి వెంబడివచ్చిన రాజబంధువులు అనేక సరుదారులు సామాజికులు కార్యస్థులు పాళ్యపట్టు దొరకొడుకులు వారి వెంబడి చేరువకాండ్లు వారి బంధువులు వారికార్యస్థులు సహితం సకలమయిన వారికిన్ని వారివారి యోగ్యత వారివారి గొప్పతనానికి తగినట్టుగా వస్త్రభూషణాలు యిప్పించి అందరికి విందులు చేయించిరి.

—సశేషము.

సోదరికి

వఝ్ఝుల వేంకటేశ్వరకవి

రసనాంచలమున సరస్వతీనాట్యంబు
　　వెలయింపఁజాలు కవిత్వశక్తి
కత్తిఁబూనిన చేతఁ గదన నైపుణ్యంబుఁ
　　జూపింపనేర్చు ప్రతాపశక్తి
దేశోపకారైకదీక్షఁ గైకొని రాజ్య
　　తంత్రముల్ నడిపించు మంత్రశక్తి
ఆచారకాలుష్య మడఁగించి సంఘసం
　　స్కారంబుఁ జేయు విజ్ఞానశక్తి
అఖిలశక్తులు నీహృదయంబునందె
యిముడియున్నవి మేల్కొల్పు మింక వాని
నున్నతికిఁ బాటుపడుచున్న సోదరులకు
సోదరీ! తోడుపడుము చేయూతనిమ్ము.

నీదృష్టి వేడిక్రొన్నిప్పుకల్ రాల్చునా
　　కలుషసంతానంబు కాలిపోదె?
నీచూపు చలువవెన్నెల తేట లీనునా
　　గాఢాంధకారంబు కదలిపోదె?
నీవీక్ష యమృతధారావృష్టిఁ గురియునా
　　విషవృత్తి దూరమై వెడలిపోదె?
నీకనుల్ దుఃఖాశ్రునిచయంబుఁ గార్చునా
　　కఠినపాషాణంబు కరఁగిపోదె?
ఎంతకాలంబు గడచెనో యిప్పటికిని
నీవు నిదురించుచున్నావు, నేఁటికైనఁ
దెలివిగాంచుము, నాలుగుదెసల గనుము,
సోదరీ! తోడుపడుము మాయుద్యమముల.



స్వాగతము

౧

ప్రత్యూషామలసమీరములు పైకొను వేళ
సరసిజము కనువిచ్చి చిరునవ్వు కొను వేళ
ఉదయసంధ్యా రేఖ లుదయమ్ము గొను వేళ
బాలభాస్కరమూర్తి ప్రభవమ్ము గను వేళ
అవతరించితి భూమి
స్వాగతము తనయా!

౨

స్వర్గభూములలోన పయనించి వచ్చావు
క్రొత్తసంగతు లేమి కొనివచ్చితివి వెంట
చివురుకెమ్మోవిలో పవడాలు రాలంగ
వినిపింపగదవోయి! వినిపింపగదవోయి!
అందరెరుగని బాస.—
స్వాగతము తనయా!

౩

కాచుకొనియున్నాము కలలలో మెలకువల
నినుగాంచ నీపల్కులను నాలకింపంగ
ఒడిచేర్చి ముద్దాడి వెడగు నవ్వులలోన
మైమరచి ఆనందమాధుర్యమును గ్రోల.
వచ్చినావా నేడు
స్వాగతము తనయా!

ఆంధ్రసాహిత్య పరిషత్తు
TELUGU ACADEMY, COCANADA

౪

చిన్నారిజాబిల్లి చిరుమోముసోయగము
తళుకునిద్దంపుకన్నుల చక్కదనములు
అల్లాడుపెదవులం దందాలు తలపోసి
వాత్సల్యరసము పెంపారుచుండె నెడంద.
చలువవెన్నెలరేక
స్వాగతము తనయా!

౫

జగములమెప్పించు చల్లందనమ్ముతో
సంతోషమొనగూర్చు చందమామ వితాన
పదునారుకళల శుభ్రఖ్యాతి నలరారు
పండువెన్నెలనింపు నిండుపున్నమనాడు
జననమ్ము గనినావు
స్వాగతము తనయా!

౬

మునుజన్మమున దాచుకొనిన పున్నెపుపంట
వలపులతీవ తావులు జల్లు విరిమొగ్గ
బోసినవ్వులజూపి మురిపించు నెలపాప
క్రొత్తగా నిల మొలకెత్తు పుత్తడిబొమ్మ
అమృతంపుబుగ్గ వు
స్వాగతము తనయా!





జూలై, ౧౯33.

౧౫:—ఏలూరు. ప్రత్యేకాంధ్రరాష్ట్ర మత్యవసరమని పశ్చిమగోదావరిజిల్లాబోర్డువారు తీర్మానించిరి.

౧౬:—రాజమండ్రి. శ్రీదామెర్ల రామారావు ఆర్టు సొసైటీ సహాయార్థము శ్రీస్థానం నరసింహారావు, సి. యస్. ఆర్ ఆంజనేయులుగార్లు సారంగధరనాటకము ప్రదర్శించిరి.

౨౦:—కానూపూరు. ఆంధ్రనాయకులగు సి. వై. చింతామణిగారికి కానూపూరు మునిసిపల్ బోర్డువారు వినతిపత్రమును సమర్పించి.

౨౧:—నెల్లూరు. తాలూకాబోర్డువారు ప్రత్యేకాంధ్ర రాష్ట్రమును కోరుచు తీర్మానించిరి.

౨౩:—బారువ. గంజాంమండల చాతుర్వర్ణ్యసభ. కావ్యతీర్థ బంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారు అధ్యక్షులు.

౨౪:—పార్వతీపురము. శ్రీసన్మహోపాధ్యాయ ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మగారు అకస్మాత్తుగ గుండెజబ్బువలన మరణించిరి.

౨౫:—అనకాపల్లి. పురపాలకసంఘాధ్యక్షునిపై విశ్వాసరాహిత్యతీర్మాన మామోదింపబడెను.

౨౬:—బెజవాడ. పురప్రముఖులు, శ్రీమంతులునగు పాటిబండ వేంకటరమణయ్యపంతులు గారు తమ 83 వ ఏట మరణించిరి.

౨౮:—తాడేపల్లిగూడెం. తాలూకాబోర్డుసభలో ఆంధ్రరాష్ట్ర తీర్మాన మామోదింపబడెను.

౩౧:—ఎలమంచిలి. అనకాపల్లి తాలూకాబోర్డు సమావేశములో ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణమును గూర్చి తీర్మానింపబడెను.

ఆగష్టు, ౧౯33.

౧:—చెన్నపురి శాసనసభలో ప్రత్యేకాంధ్రరాష్ట్ర తీర్మానముపై చర్చముగియక పూర్వమే విరమింపబడెను.

:—విజయవాడ. భారతవాణిజ్యమహామండలిఅధ్యక్షులు శ్రీయుత నలినీరంజనసర్కారుగారు కృష్ణాపుష్కరప్రదర్శన ప్రారంభోత్సవము జరిపిరి.

౨:—కాకినాడ. తూర్పుగోదావరిజిల్లాబోర్డు సభలో ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణతీర్మానము ఆమోదింపబడెను.

౪:—విశాఖపట్టణము. సర్ రాధాకృష్ణన్ గారు ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధ్యక్షులు యూరపు సంచారమును ముగించి తిరిగివచ్చిరి.

౫:—ఆంధ్రోత్కళరాష్ట్ర పుసరిహద్దుల విషయమున లండను పోయియుండిన ఉన్నవ రామలింగముపంతులుగారు బరంపురము చేరిరి.

:—సారవకోట. పర్లాకిమిడి తాలూకారైతుసంఘ కార్యదర్శి శ్రీబోయిన అప్పలస్వామిగారి అధ్యక్షతను జరిగినసభలో ప్రత్యేకాంధ్రరాష్ట్ర విషయమై తీర్మానింపబడెను.

౬:—ఒంగోలు. గ్రంథకర్తలు, ఉభయభాషాప్రవీణులు, స్థానికమునిసిపలు హైస్కూలు సంస్కృతాంధ్రోపాధ్యాయులు అయిన బొమ్మరాజు జానకిరామకవిగారి మరణము.

:—ఏలూరు. తాలూకాబోర్డు అధ్యక్షులగు శ్రీయుత మోతే కృష్ణారావుజమీందారుగారిపై విశ్వాసరాహిత్య తీర్మాన మామోదింపబడెను.

౧౦:—బెజవాడ. 15-వ ఆంధ్రదేశగ్రంథాలయ మహాసభ. శ్రీయుత నడింపల్లి వేంకటలక్ష్మీనరసింహారావుపంతులుగారి అధ్యక్షతను.

౧౧:—విశాఖపట్టణము. ఆంధ్రవిశ్వకలాపరిషత్తుకళాశాలవిద్యార్థి బృందప్రారంభోపన్యాసము సర్ అల్లాడి కృష్ణస్వామయ్యగారు గావించిరి.

౧౪:—రాజమండ్రి. ఆంధ్రపేపరుమిల్సువాటాదారుల సభలో మేనేజింగు ఏజెన్సీ శ్రీ ఎం. కే. శ్రీనివాసను గారికి, వారిమిత్రులకు ఒసంగుటకు ఏకగ్రీవముగ ఆమోదింపబడెను.

౧౫:—ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణమును గురించి ప్రొఫెసర్ గోగినేని రంగనాయకులుగారు చెన్నపురి ఆంధ్రమహాసభాభవనమున ఉపన్యసించిరి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు అధ్యక్షతవహించిరి.

ఉండ్రాళ్లతద్ది

ఉ. అమ్మరో! నేడు తద్దిసుమి
యాటలనాడుకొనంగఁ బోదు నే
నమ్మగ లేపగావలెను
గారవమొప్పఁగఁ గన్నెలెల్లరున్
రమ్మని పిల్చినారె నను
రాతిరి నిద్దురపోను-పోవుచో-
నెమ్మెయి నీవు లేపవొకొ
యెంతకులేపిన నేను లేవనో!

ఉ. తప్పక లేపు వేళ యటు
దాటకపూర్వమె లేపకున్న ని
న్నెప్పుడు నమ్మజాల నిఁక
నెన్నియొయాటల నాడుకొందమే
తప్పక రమ్మటంచును బ
దంపడి చెప్పిరి తోడివారు నే
నొప్పుగఁ బోవకుండు నెడ
నొల్లరె యాటలఁ జేర్చుకొండనన్.

గీ. ఇంద్రజాలినితీరున నేరికినగపడ
కల్లడాగురుమూఁతలాడవలయు;
గగనమునఁజరించు గంధర్విణియనంగ
నుయ్యాలల నుఱ్ఱూత లూగవలయు;
జగమెల్లఁద్రిప్పంగఁ జాలుదునోయనఁ
గరమువానాలప్రతిరుగవలయు;
కంకణంబులఁ బ్రమోయఁ గారె యచ్చటలనఁ
జెమ్మచెక్కాటలఁ దేలఁగవలయు

ఇంకఁ జెప్పంగ నేటికి నింపుగులుక
గచ్చకాయలు గవ్వలు కాళ్ళగజ్జె
చిన్నిచిన్ని త్రొక్కుడుబిళ్ళయున్నగాఁగ
నాటలెన్నియొ మేమింక నాడవలయు.

మ. మఱియున్ సుందరమైన యిందుప్రతి
బింబంబున్ జలంబందు నేఁ
దరయన్ మానిని యేరొయిడన్ ముసలి
యయ్యన్ గాక ప్రాణేశుగన్
దరుణప్రాయుని నందునంచు మన
పెద్దల్ సెప్పఁగా విందు న
మ్మరో నే నిందునిభాస్యపెట్టగన
నమ్మాడిక్కన్ గనన్ గోరెదన్.

క. ఈయుఱచేతన్ జూచితె,
యేయేడునఁగాని యింతయొఱ్ఱగ గోరిం
టో యమ్మ! పట్టినదె? చూ
డీయేడున నాదుభాగ్యమేమనవచ్చున్.

గీ. కావునను నేకువనె లేపి నూవుపొడుము,
పులుసు పెఱుగుపోసి చలిదికెలమిఁ బెట్టి
యాడుకో వెళ్ళుమాయంచు వీడుకొలిపి
నన్ను వేగిరింపఁగదమ్మ మున్న-తల్లి!

క. రావచ్చును మేమాడెడు,
తావునకును, నెంతయును ముదంబున జూడం
గావచ్చును మాయాటల
నీవు కినియకు మిఁక నేను నిద్దురఁబోదున్.

కవికొండల వేంకటరావు



గణేశ స్తవము

సీ. కలితశుండాదండ గండూషితోన్ముక్త సప్తసాగరమహా జలధరములు
వప్రక్రియాకేళి విశదదీర్ణ సువర్ణ వేదీధరరత్న మేఖలములు
పక్వజంబూఫల ప్రకటసంభావనా చుంబితభూభృత్కదంబకములు
వికటకండూలగండక దేహమండలీ ఘట్టితబ్రహ్మాండ కర్పరములు
శాంభవీశంభులోచనోత్సవకరములు
వాసవాద్యమృతాశనవందితములు
విఘ్నరాజమదోల్లాసవిభ్రమములు
మించి విఘ్నోపశాంతి గావించుఁగాత.

(హరవిలాసము)

ఉ. ఒండురదంబు పోవిడిచి యుక్కునఁ జక్కని మొక్కలీఁ డనన్
రెండవకొమ్ము తొండమున జేర్చిన మాటి మతంగశృంగవే
దండములన్ గ్రహించి తన దాసుల కీఁ బరికించి హస్తిక
ర్తృం డయి మాయబోయదొరతం గొడుకై తగు వేల్పుఁ గొల్చెదన్.

(పాంచాలీపరిణయము)

శా. సర్గస్థిత్యుపహారకర్మనవదీక్షావేళ బ్రహ్మాచ్యుతా
భర్గుల్ విఘ్నము లేక సాగుటకునై ప్రార్థింపఁగాఁ దత్క్రియా
దౌర్గత్యంబు వదల్చి మాస్మరణమాత్రప్రాప్తిఁ గావించున
ద్దీర్ఘచ్ఛత్రకరుణాకదంబులఁ గొలంతుల్ నిత్యంబు హేరంబునిన్.

(కాళహస్తిమాహాత్మ్యము)

సీ. చంద్రఖండకలాపుఁ జారుహాసరూపుఁ గలితచంచలకర్ణుఁ గనకవర్ణు
మోదకోజ్జ్వలహస్తు మూషికోత్తమవాహు భద్రేభవదను సద్భక్తసదను
సన్నుతిస్తుతిపాత్రు శైలసంభవపుత్రు ననుదినామోదు విద్యాప్రసాదుఁ
బరశువరాభ్యాసు బాశాంకుశోల్లాసు సురుచిరఖ్యాతు నాగోపవీతు
లోకసన్నుతగుణవంతు నేకదంతు, నమితహేరంబు సత్కారుణావలంబు
విమలరవికోటితేజు శ్రీవిఘ్నరాజుఁ, బ్రథితవాక్ప్రౌఢి కెప్పుడుఁ బ్రస్తుతింతు.

(మొల్లరామాయణము)

చ. కరముఁడు కంధరస్థలము పై నిడి వేడుక ముద్దు లాడఁగాఁ
గరమున మౌళిగంగయుదకంబులు మెల్లన బీల్చి యావిషీ
కరములు భూషణేందునకు గారవతారకకేళిఁ జేయుచు
త్కరివదనుండు మత్కృతికిఁ దాను ముఖస్థితితోడఁ దోడగున్.

(అమరేశ్వరుని విక్రమసేనము)

ఉ. అల్లనఁ దుండ మెత్తి శివునౌదలయేటిజలంబు పీల్చి సం
ఫుల్లతఁ బాదపీఠమునపొంతన యున్నసహస్రనేత్రు పైఁ
జల్లి శివార్చనాకమలసంహతిఁ బ్రోక్షణసేయునట్టురా
గిల్లుగజాననుండు మదభీప్సితసిద్ధికరుండు గావుతన్.

(తిక్కనసోమయాజి విజయసేనము)

చ. ఎలుకలరాజతేజినెఱయెక్కుఁడుగాఁ డపరంజిమైఁడిని
గ్గులుగలమేనిపెన్వడుగు క్రొన్నెలదాలుపుముద్దుపట్టి కొ
మ్ములు గలవేల్పు విఘ్నతరుమూలములం బెకలించుబల్లిదుం
డలగణభర్త యప్ప సదివాగ్రణి కీవుత నీప్సితార్థముల్.

(రాజశేఖరచరిత్రము)

చ. తను వసితాంబురంబు సితదంతయుగం బచిరాంశు లాత్మగ
ర్జన మురుభర్జనంబు గరసద్రుచి శక్రశరాసనంబు నై
చన మదవారివృష్టి హితసస్యసమృద్ధిగ నభ్రవేల నాఁ
జనుగణనాథుఁ గొల్తు ననిశంబు నభీష్టఫలప్రదాత గాన్.

(నన్నెచోడుని కుమారసంభవము)



సంపాదకీయ సమాలోచన

గోదావరీమండలముల పరిహద్దుల మార్పు:-

నూతనముగ నేర్పడబోవు ఉత్కళరాష్ట్రము గంజాముమండలములో చాల భాగమును కబళింపనుండుటచే గంజాము, విశాఖపట్టణము, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిహద్దులయందు కొన్నిమార్పులు కావింపబడనున్నవని వినవచ్చుచున్నది. ఈ విషయమును గూర్చి ఆయా మండలములందు అప్పుడే అలజడి ప్రారంభమైనది. తూర్పుగోదావరి మండలమునకు చెందిన కోనసీమ—అమలాపురము, రాజోలు తాలూకాలు—పశ్చిమగోదావరిమండలమున చేర్పబడు సూచనయొకటి ప్రభుత్వమువారిపర్యాలోచనమున నున్నదని తెలియవచ్చుచున్నది. కోనసీమ ప్రజలకు ఈ సూచన మనస్కరించియుండ లేదనుటకు అచ్చట జరిగిన సభలు, దినపత్రికలలోని వ్యాసములు ప్రబలనిదర్శనములు. తూర్పుగోదావరిజిల్లా కలక్టరు ఉండు కాకినాడకుగాని, జిల్లాజడ్జి ఉండు రాజమండ్రికిగాని కోనసీమప్రజలు తక్కువ ఖర్చుతో పోవగలరు. పశ్చిమగోదావరి తిలకనగరమగు ఏలూరుకు పోవలయునన్నచో వారికి ప్రయాణసౌకర్యము లేదు. ప్రయాణసౌకర్యముల విషయముననేగాక పరిపాలనాసౌకర్యముల విషయమునగూడ క్రొత్తగ తలపెట్టిన ఈ మార్పు తలపెట్టరానిదిగా నున్నది. తూర్పుగోదావరినాయకమణులలో నొకరగు శ్రీదుగ్గిరాల వేంకటసూర్యప్రకాశరావుగారు ఇది యెట్లు తలపెట్టరానిదో ఇట్లు తెలుపుచున్నారు. "పశ్చిమగోదావరిజిల్లాకు రాజోలు అమలాపురము తాలూకాలను చేర్చినయెడల నాజిల్లా ల్యాండురివిన్యూ 68 లక్షల రూపాయలగును. అప్పుడు పశ్చిమగోదావరిజిల్లా తంజావూరుజిల్లా తరువాత మనరాజధానిలో నెక్కువ ల్యాండురివిన్యూగల జిల్లాయగును. 1901-వ సంవత్సరమున నేయిబ్బందుల నివారణమునకు గోదావరి కృష్ణాజిల్లాలను గోదావరి కృష్ణా గుంటూరుజిల్లాలుగా విడదీసిరో, తిరిగి 1925-వ సంవత్సరమున ఏయిబ్బందుల నివారణకొరకు కృష్ణాజిల్లాను పశ్చిమగోదావరి కృష్ణాజిల్లాలుగా విభజించుట తప్పనిసరియని తలపోసిరో ఆపరిస్థితులనే అమలాపురము, రాజోలు తాలూకాలను పశ్చిమగోదావరిజిల్లాలో చేర్చుటవలన తిరిగి తెచ్చిపెట్టుకొందురు."

శ్రీ సి. వై. చింతామణిగారికిసన్మానము:—

రాష్ట్రేతరాంధ్రులలో శ్రీ చిర్రావూరి యజ్ఞేశ్వరచింతామణిగారార్జించినంతటికీర్తిని మఱియెవరును ఆర్జింపలేరనుట సత్యదూరము కాదు. గతమాసమున కాన్పూరు మునిసిపల్ బోర్డువారు శ్రీవారికి వినతిపత్రము సమర్పించుచు వారినిట్లు ప్రశంసించిరి. "మీ వాగ్ధోరణి, రచనావైదగ్ధ్యము, శాసనసభాసభ్యచతురత్వము, పత్రికానిర్వహణప్రతిభ, అసమానదేశభక్తి, అనదృశత్యాగము, స్థిరసంకల్పము మిమ్ములను భారతదేశమున ప్రసిద్ధపురుషులలో ప్రసిద్ధులుగా నొనర్చినవి." ఇది ఆంధ్రశక్తికి, ఆంధ్రప్రతిభకు సాటిభారతీయులిచ్చిన ప్రశంసాపత్రముగ మేము భావింతుము. ఆంధ్రున కిట్టి ప్రశంసాపత్రము

నార్జించిన శ్రీచింతామణిగారికి ఆంధ్రలోకము హెచ్చుగ ఋణపడియున్నది.

శ్రీరామారావు ఆర్టుసొసైటీ:—

ఆంధ్రచిత్రకళకు ప్రత్యేకత గొనివచ్చి పూవప్రాయముననే పుణ్యలోకమునకు పోయిన శ్రీదామెర్ల రామారావుగారి పేర వారి జన్మస్థలమగు రాజమహేంద్రవరమున ఈ నడుమ నొక ఆర్టు సొసైటి నెలకొల్పబడినదని తెలియఁవచ్చుచున్నది. శ్రీరామారావుగారి ప్రాణస్నేహితులలో నొకరును, సుప్రసిద్ధాంధ్రచిత్రకారులును అగు శ్రీవరదా వేంకటరత్నముగారు ఈసంఘమునకు ప్రాణము. యువకులలో చిత్రకళాభిరుచిని పెంపొందించి రామారావుగారి చిత్రకళకు అర్హప్రచారమును, ప్రాబల్యమునుగొనివచ్చుటకీసంఘమువారు సంకల్పించియున్నారు. సంఘమునకు ధనము కూర్చువిషయమున నాట్యకళోపాసకులగు శ్రీస్థానం నరసింహారావుగారు అభయహస్తమిచ్చియున్నారని వినుటకానందమగుచున్నది. ఆంధ్రులెల్లరును ఈసంస్థకు విరివిగ ధనసాహాయ్యముచేసి ఆంధ్రచిత్రకళకు ఉత్తేజముకలిగింతురని నమ్మెదము.

ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ

ఏడవ వార్షికనివేదిక:—

ఆంధ్రుని నిర్వహణసామర్థ్యమునకు అమోఘనిదర్శనమై వెలుఁగొందుచున్న సంస్థలలో ఆంధ్ర ఇన్సూరెన్సుకంపెనీ ప్రథమమున పేర్కొనదగినది. 1932-వ సంవత్సరము డిసెంబరు 31-వ తేదీతో అంతమయ్యెడి ఆంధ్ర ఇన్సూరెన్సుకంపెనీ వారియొక్క ఏడవవార్షికసంచిక విమర్శనార్థము మాకార్యాలయమునకు పంపబడినది. 1928-వ సంవత్సరమున అమెరికను బ్యాంకుల విచ్ఛిత్తితో ప్రారంభమైన ఆర్థికమాంద్యము ప్రపంచమునంతను ముంచెత్తిన ఈ నాలుగు సంవత్సరములందును అనేకవ్యాపారములకువలె ఇన్సూరెన్సు వ్యాపారమునకుగూడ మందకొడిపడినది. అయినను ఆంధ్రఇన్సూరెన్సు కంపెనీవారి 1930, 1931, 1932-వ సంవత్సరముల తాలూకు క్రొత్తవ్యాపారము చూచితిమేని వారు గావించిన వ్యాపారము ప్రోత్సాహకరముగనుండి వారి దీక్షాపరత్వమును చాటుచున్నది. 1930-వ సంవత్సరమున 13,76,000 రూపాయిలకు 892 పాలసీలును; 1931-వ సంవత్సరమున 14,33,000 రూపాయిలకు 1018 పోలసీలును; 1932-వ సంవత్సరమున 14.80,000 రూపాయిలకు 1286 పోలసీలును వీరు కొనిరాగలుగుట నిజముగ ప్రశంసనీయమగు విషయము, మఱియు 1930-వ సంవత్సరమున నూటికి ముప్పదితొమ్మిదివఱకు ఉండిన వ్యయమును 1932-వసంవత్సరమున నూటికిముప్పదివరకు తగ్గింపబడుట ప్రశంసనీయము. 1929-వ సంవత్సరమునకంటె నివేదితవత్సరమున కంపెనీవారి పెట్టుబడులు నూటికి నలుఁబదివంతున అభివృద్ధిగాంచుట గమనింపదగినది. చెన్నరాజధానియందు సమర్థతతో నిర్వహింపబడుచున్న సహకారసంఘములలో నొకటియగు ఆలమూరు సహకారసంఘమునకు అప్పుఇచ్చుట మూలముగా ఈ కంపెనీవారు ప్రజాహితజీవితమునందు తమకుగల అభిమానాదరములను ప్రకటించిరి. క్లెయిముల నొసంగుటలో ఈ పెనీకంవారు చురుకుగ పనిచేయుచుండిరని తెలిసికొనుట కానందమగుచున్నది. పదునాఱు అణాల ఆంధ్రసంస్థ యనదగిన ఈ కంపెనీ పురోభివృద్ధికి ఆంధ్రమహాశయులు ఇంకను ఎక్కువగ తోడ్పడుదురుగాక యని కోరెదము.

శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారికి సన్మానము :-

మామిత్రులు శ్రీయుత వావిలాల గోపాలకృష్ణయ్యగారీమధ్య ఆంధ్రపత్రికలో శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారికి సన్మానము గావింప ఆంధ్రులను హెచ్చరించియున్నారు. ఆంధ్రగ్రంథవిక్రేతలలో వావిళ్లవారితో దొరయుపాటివారు తెలుగుమాగాణియందు మఱియెవ్వరును లేరనుట స్వభావోక్తియే. ఆంధ్రగ్రంథములకు గుజలీముద్రణస్థితిని తొలగించి మేలైన కాగితములమీద మేలితరపు ముద్రణము గలిగించినకీర్తి ఆంధ్రగ్రంథవిక్రేతలలో శ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రిగారి కొక్కరికే తొలుత దక్కినదనుట సత్యదూరము కాదు. కవి యొకడిట్లు చెప్పినాడు:

……………గ్రంథసముదాయము
దైన్యమునొందఁ గాంచి "యాహా! యని, ముద్రణాదులుగదా! యిఁక
ది"క్కని వావిళాబ్ధి ప్ర
తేయకరుండు ముద్రణబలిష్ఠత
నెంతయుఁ జూపె…… …

బహుళాంధ్రగ్రంథముల సుందరముద్రణముచే ఆంధ్రభాషాపోషకులైయున్న వావిళ్లవారికి ఆంధ్రప్రపంచము ఎక్కువగ ఋణపడియున్నది. ఆఋణమొకభంగిని తీర్చుకొనుటకై ఈసన్మానము గావించుటెంతయు సముచితముగనుండును. శ్రీ వావిళ్ల రామస్వామిగారు దివంగతులైనపిదప వారికుమారులు శ్రీ వేంకటేశ్వర శాస్త్రిగారు పితృదేవులువైచిన రాచబాటనే సాగిపోవుచుఁ గ్రంథప్రకటనాదులు యథారీతిని జరుపుచుఁ మదరాసునందలి ఆంధ్రప్రజాహిత జీవితమున హెచ్చుగ పాల్గొనుచు; 'త్రిలింగ' యను తెనుగువారపత్రికను, 'ఫెడరేటెడ్ ఇండియా' యను ఆంగ్లవారపత్రికను ప్రచురించుచు దేశసేవసల్పుచున్నారు. కావున శ్రీ వారిని సన్మానించుటకు సంఘమేర్పడి సముచితకార్యనిర్వహణమునకు గడంగును గాకయని అభిలషింతుము.

కీ. శే. ఆచంట సాంఖ్యాయనశర్మగారు:—

శ్రీమన్మహోపాధ్యాయ ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారు జూలై 24-వ తేదీని రాత్రి పదనొకండుగంటలకు పార్వతీపురమునందలి వారిగృహమున హృద్రోగమువలన అకస్మాత్తుగ దివంగతులైరని తెలుపుటకెంతయు చింతించుచున్నాము. ఆంధ్రదేశమున ఆధునికయుగమునందు జంగమ విజ్ఞానసర్వస్వములనదగిన ఇరువురి ముగ్గురులలో వీరొకరు. వీరు గొప్ప మేధావులు. ఒక సంస్థానమునకు దివానులుగానుండిరి. న్యాయవాదులై వెలుఁగొందిరి. గ్రంథకర్తలై గణనకెక్కిరి. పత్రికానిర్వాహకులై ప్రఖ్యాతిగాంచిరి. వీరి 'కల్పలత' పత్రికాముఖమున ప్రచురింపబడిన 'శ్రీధరశాస్త్రి ఉపన్యాసము' వీరి హాస్యప్రియత్వమును చక్కగ వెల్లడించుచున్నది. ఆపత్రికయందలి దేయగు 'ఆర్యగృహము' అను శ్రీవారి వ్యాసము ప్రాచీనార్యగృహనిర్మాణాది విషయములను లెస్సగ చర్చించుచున్నది. 1880 మొదలు 1883 వఱకు వీరు ప్రచురించిన 'సుజన ప్రమోదిని' అను పత్రికలో విశేషమేమియు లేకున్నను 1903 లో వీరిచే నడుపబడిన 'కల్పలత' విశేషవిషయములతో నొప్పుచు నేటి ఆంధ్రమాసపత్రికల సంపాదకులుకూడ అనుకరింపదగిన పెక్కునూతనపద్ధతులను గలిగియున్నది. తనపాండిత్యమును పలుముఖముల తొరించిన ఈమహోపాధ్యాయుని మరణముచే ఆంధ్రభూమికి గలిగిననష్టము అవధిలేనిది. శ్రీ వారి పవిత్రాత్మకు శాంతిగలుగు గాకయని కోరెదము.

హస్తసాముద్రికము


“ శ్రీ ”

౨

వివిధస్థానములబట్టి స్వభావనిరూపణము.

మానవజీవితమునందలి వివిధపరివర్తనములు వారి స్వభావమును బట్టియుండును. స్వభావనిరూపణమున హస్తమునందలి గురు, శని మొదలైన వివిధస్థానములు సహకారములైయుండును. ఒకనిచేతియందు ఉన్నతమై గాని; రేఖాంకితమైగాని; ఉన్నతమును, రేఖాంకితమును అయిగాని ఉన్నస్థానము అతని స్వభావమునందలి ముఖ్యాంశములను తెలుపును. నిమ్నమైయున్న స్థానములు ఉన్నతమైయున్నస్థానములు సూచించుగుణగణాదులను ఎదిగి గోరుగలదానిమొదటికట్టు (అంగుళాగ్రశిఖ) పొడుగుగను, వెడల్పుగను ఉండును. అంగుష్ఠముయొక్క ఈభాగమునే మనోద్రఢిమను సూచించుకట్టుగ శాస్త్రజ్ఞులు చెప్పుదురు. వేళ్ళు వంకటింకరలేక అరచేయి దళసరిగాను, బలిష్ఠముగాను ఉండును. హృదయరేఖ భంగములేక, వంకరలేక గురుస్థానమునుండి ప్రారంభమై ఉండును. దానికి చీలిరేఖలు బుధస్థానమునకు దిగువను ఇరుప్రక్కలయందును ఉండును. ఈపైవిధమున చెప్పిన లక్షణములుగలిగి యున్నహస్తమును సుహస్తమని చెప్పనగును.

చిత్రము 1.



వివిధసంజ్ఞలు: వానినామములు


1. నక్షత్రము.
2. క్రాసుగుర్తులు
3. చతురములు
4. ద్వీపములు
5. గ్రిల్లు
6. త్రికోణము
7. బిందువు
8. వలయము.

సవరించి మిళితపరచుచున్నవి. కాని ఈస్థానములు ఇచ్చుఫలములు హస్తముయొక్క సాముదాయకమైన మంచి చెడ్డలను బట్టియుండును. అనగా హస్తము సులక్షణయుతమైయున్నచో మంచిఫలములను, దుర్లక్షణోపేతమై యున్నచో చెడుఫలములను ఇచ్చును. కనుక హస్తము మంచిదియో, చెడ్డదియో తొలుత చూడవలసియుండును. సుహస్తమునందు శిరోరేఖ వంకరలేక, భంగములులేక సాఫుగానుండును; బొట్టనవేలు బొద్దుగ

౧. గురునిస్థానము

సుహస్తమునందు గురునిస్థానము ఉన్నతమైయున్నను, లేక వేలువిధమైన సుసంజ్ఞలు కలిగియున్నను ఆవ్యక్తి స్వతస్సిద్ధముగ మంచిస్వభావముగలవాడయ్యేయుండును; అమితమైన ఆత్మవిశ్వాసము, నైష్ఠికవర్తనము, అధికారవాంఛ, ఉత్సాహము కలిగియుండును. జీవిత ప్రారంభదశయందే ఈతడు శేమినిఅతిక్రమించి వ్యక్తిత్వమునందును. ప్రజానాయకుల హస్తములందు ఈస్థా

నము తప్పక ఉన్నతమైగాని సుసంజ్ఞలు గలిగిగాని ఉండి తీరును. స్పష్టమైన నిడివిరేఖ కలిగియుండుట ఈస్థానపు సుసంజ్ఞలలో నొకటియై ఆవ్యక్తిజీవితము జయవంతమైయుండుటను సూచించును. చీకిలి మాకిలి గానుండు రేఖలుగానిలేకగ్రిల్లుగాని(చిత్రము 1, నెం 5) ఉండుచో వ్యతిరేఖఫలమును సూచించును. క్రాసు(చిత్రము 1, నెం 2) ఉన్నచో దాంపత్య సుఖమును చూపును. నక్షత్రసంజ్ఞ (చిత్రము 1 నెం 1) ఉండుచో ఆవ్యక్తి ఎంతటిగొప్పకోరికలున్నను సఫలమనోరథుడగును. పినిమానటీలోకమున



హస్తమునందలి వివిధస్థానములను
సూచించు చిత్రము.

చుక్కలతో ఏర్పరుపబడి 1, 2, 3 మొదలుగా నెంబర్లు ఈయబడినవి వివిధస్థానములు. ఆస్థానముల నామ వివరము:

1. గురుస్థానము.	2 శనిస్థానము.
3. రవిస్థానము.	4. బుధస్థానము.
5. చంద్రస్థానము.	6. శుక్రస్థానము.
7. కుజునిలోస్థానము.	8. కుజునిపైస్థానము.

లోకప్రఖ్యాతిగాంచిన మేరీఫిక్ ఫర్డు చేతియందు ఈనక్షత్రసంజ్ఞ ఉండుట కైరోవలన తెలియుచున్నది. త్రికోణమున్న(చిత్రము 1 నెం 6)జనవశీకరణశక్తిగలనాయకుడగును. వలయమున్నచో(చిత్రము 1 నెం 8) ఇట్టిఫలము నే సూచించును. బిందువుకాని ద్వీపముకాని(చిత్రము 1 నెం 7, నెం 4) ఉన్నచో స్థానపతనమును సూచించును. చతురమున్నచో(చిత్రము 1 నెం 3) ఈస్థానము సూచించు దుర్గుణముల ఉద్ధతిని చాలవరకు తగ్గించును. చెడు హస్తమునందును, ఈస్థానము ఉన్నతమైయున్నను లేక వేఱువిధమైన చెడుసంజ్ఞలు కలిగియున్నను ఆవ్యక్తి గర్విష్ఠి, వ్యయశీలి, మర్యాదనెఱుగనివాడు, డంభగుణముకలవాడు అయిఉండును. హస్తమునందు ఈస్థానము ఉన్నతమైగాని, సంజ్ఞలుగలిగిగాని లేకపున్నచో ఆవ్యక్తియందు పైనపేర్కొనిన గుణములేవియు కానబడవు.

౨. శనిస్థానము

సుహస్తమునందు శనిస్థానము ఉన్నతమైయున్నను, సుసంజ్ఞలు గలిగియున్నను ఆవ్యక్తి మంచివిధానమును పొడిమిని, కలిగి విద్యార్జనాదులయందు అభిరుచిగలవాడైయుండునేగాని ప్రజాసంఘమున ప్రవేశింపనిచ్చగింపకుండును. చెడుహస్తమునందు శనిస్థానము ఉన్నతమైయున్నను దుర్లక్షణములు కలిగియున్నను ఆవ్యక్తి దురదృష్టవంతుడు, లోభి, మానవద్వేషి, స్వార్థపరుడుఅయి ఉండును. ఈస్థానమున ఒకేనిడుపుగీత అదృష్టసూచకము. చతురమునకు, త్రికోణమునకు ఇతరమైన సంజ్ఞల -ముఖ్యముగా నక్షత్రపుగుర్తు, క్రాసుగుర్తు- ఉనికి దుస్సంఘటనమును కలిగించుచున్నది. మఱియొకసంజ్ఞతో గాని, విడిగాగాని చతురముండుచో ఆవ్యక్తి అట్టిదుస్సంఘటనములనుండి రక్షింపబడుట సూచించును.

3. రవిస్థానము

సుహస్తమునందు రవిస్థానము ఉన్నతమైయున్నను, సుసంజ్ఞలు కలిగియున్నను శరీరారోగ్యమును, భావిస్థితియందు నమ్మకమును, అన్నివిషయములందును మితము; వివిధవిద్యలయందు నేర్పు; సనాతనధర్మమునందు, ప్రజ్ఞావిశేషమునందు,వ్యవహారమునందు కుశలప్రవేశము; కీర్తి, సిరిని ఆవ్యక్తికి కలుగచేయుచున్నది. కాని గురుస్థానమునందు క్రాసుసంజ్ఞ ఉండకుండినచో ఈవ్యక్తి సంసారసంబంధమైన సుఖమునకు దూరుడగును. రవిస్థానము అతిప్రాముఖ్యమైయున్నను, చెడుహస్తమునందు ఈ

న్నతమైయున్నను ఆవ్యక్తికి కుతర్కము, తృణీకారభావము, అసూయగలదని తెలుపును. ఈస్థానము ఉన్నతముగ లేకున్నను, సుసంస్కారహితమైయున్నను ఆవ్యక్తియొక్క జీవితము ఆదర్శరహితమైయుండును. క్రాసు, ద్వీపము, బిందువు వీనికి ఇతరమైన సంజ్ఞలు ఏవియున్నను ఈస్థానమున సులక్షణములే. ఈస్థానమున నక్షత్రసంజ్ఞయుండుచో సంఘమున ఉన్నతస్థానమును అధికధనసంపత్తిని సూచించును గాని ఆవ్యక్తి సుఖమునుమాత్రము బడయనేరడు. ఈస్థానమున తిన్ననై స్పష్టమైన ఒకగీత కీర్తిని, సిరిని తెలుపును. అతను అజన్మము ఒకేవృత్తి నవలంబించియుండును. రెండుగీతలున్నచో రెండువృత్తులను సూచించును. అంతకు మించిన గీతలున్నచో వివిధ వృత్తుల అవలంబనమును, కారణముగా అపజయమును తెలుపును.

౪. బుధస్థానము

ఈస్థానమున ఏసంజ్ఞలున్నను శుభహస్తమునందు మంచిఫలమును, చెడుహస్తమునందు చెడ్డఫలమును ఇచ్చును. శుభహస్తమునందు ఈస్థానము నిశితప్రతిభను, వాగ్ధాటిని, వ్యాపారనైపుణ్యమును, క్రీడలయందు నేర్పరితనమును తెలుపును. వీరు ఉపాధ్యాయులుగను, న్యాయవాదులుగను, వైద్యులుగను ఉన్నచో ప్రఖ్యాతి నార్జింతురు. చెడ్డచేతియందుగాని అత్యున్నతమైయున్నగాని ఈస్థానము మోసము, ద్రోహము, ఛేసజము సూచించును. ఏమాత్రము ఔన్నత్యములేక సంస్కారహితమైయున్నచో ఆవ్యక్తికి వ్యాపారమునందుగాని శాస్త్రపాండిత్యమునందుగాని ప్రవేశముండదు ఇట్టివారు చిత్రలేఖనము, కవిత్వము, సంగీతము మొదలగు లలితకళలను అభ్యసించుట ఉచితము. ఈస్థానమున నక్షత్రసంజ్ఞయున్నచో వక్తృత్వము, శాస్త్రపాండిత్యము, వ్యాపారనిపుణత్వము తెలుపును. త్రికోణసంజ్ఞ వ్యాపారవిజయమును సూచించును. రెండుగాని, రెండుకుమించిన నిడివిగీతలు లేక గ్రిల్లు ఈస్థానమున సుప్రసిద్ధవైద్యుల హస్తములందుండుచుండును. క్రాసు, బిందువు, వలయము, ద్వీపము ఇవి అన్నియు అంతగ సులక్షణములని చెప్పుటకు వీలులేదు.

౫. చంద్రస్థానము

శుభహస్తమునందు ఈస్థానము ఉన్నతమైయున్నచో ప్రకృతియెడ ప్రియత్వమును, ప్రయాణములందు అభిలాషయు, అలంకారయుక్తమగు కవిత్వమునందు ప్రీతియు కలిగియుండుటను సూచించును. ఎట్టి చేతియందైనను ఈస్థానము ఉన్నతమైయుండుచో ఆవ్యక్తి చంచలస్వభావముకలవాడై, తన శక్తియందు విశ్వాసములేనివాడైయుండును. వీరికి వాగ్ధాటియుండదు. వీరు నూతనప్రియులును, చంచలస్వభావులును అయిఉండుటచే ఆదర్శభర్తలు కాజాలరు. ఈస్థానముయొక్క అతిప్రాముఖ్యము చంచలస్వభావమును, ముక్కోపితనమును దుఃఖశీలమును తెలియబఱచును. మెత్తనిచేతియందు ఈస్థానము ప్రముఖమైయున్నచో అనారోగ్యమును, సోమరితనమును సూచించును. చెడు హస్తమునందు ఈస్థానముయొక్క ఉన్నతి సిగ్గులెఱుగని స్వార్థపరత్వమును తెలుపును. ఔన్నత్యములేని ఈస్థానము ఊహాపోహలులేని జీవితమును సూచించును. ఈస్థానమున ఏసంజ్ఞయున్నను ప్రయాణమునుగాని, ప్రయాణావసరమునందలి ప్రమాదములనుగాని సూచించును గావున దీని విషయమై ప్రత్యేకప్రకరణమున వివరింతుము.

౬. శుక్రస్థానము

శుభహస్తమునందు ఈస్థానము ఉన్నతమైయుండుచో వారు దయార్ద్రహృదయులు, ప్రేమికులు, దాతృత్వబుద్ధిగలవారు, ఇతరులను ఎల్లప్పుడు సంతోషపఱుప నిచ్ఛగించువారు అయియుందురు. కలహమనిన ఏమాత్రము ఇష్టములేక శాంతిప్రియజీవనులై యుందురు. సాహసోపేతులు కాజాలరు. చక్కని సంగీతపాఠకులు, నటకులు అయి ఉందురు. ఈస్థానము ఉన్నతమైయున్నవారు ఏ ఒడుదొడుకులున్నను సంసారజీవనమును ఇచ్ఛగింతురు. ఈస్థానముయొక్క అతిప్రాముఖ్యము ఈపై చెప్పిన గుణములను ద్విగుణీకృతమొనర్చును. ఈస్థానము ఉన్నతినందకుండి చేయి కఠినమైనదగుచో ఆవ్యక్తి సంసారజీవితము నేమాత్రము నొల్లకుండును. ఈస్థానమునందలి సంజ్ఞలు ఈవ్యక్తిపై ఒత్తిగల వారి ప్రవర్తనమాత్రము చెందినవి గావున వేఱొక

ప్రకరణమున వివరింపబడును. హస్తము చెడ్డదైనను మంచిదైనను శుక్రస్థానము ఉన్నతమైయున్నచో మగవారిపట్ల ఆడువారును, ఆడువారిపట్ల మగవారును ఎక్కువ ఒడ్డీ, చల్లబడి కలిగియుందురు. సుహస్తమైనచో ఇట్టి ఒడ్డీ దుర్వ్యసనములకు లోనుగాదు. చెడుహస్తమునందిది వారు తమ నైతికశీలమును కాపాడుకోజాలకపోవుటను సూచించును.

౭, ౮. కుజునిస్థానములు

కుజునిలోస్థానము కార్యసాహసమును, కుజుని పైస్థానము నిరోధకశక్తిని సూచించును. ఇంతియగాక కుజుని పైస్థానము ఆత్మనిగ్రహమును, మనోనిశ్చలతను త్యాగబుద్ధిని, సహనము పొందలగువానిని సూచించును. ఈ రెండు స్థానములు అత్యున్నతములైగాని, చెడుహస్తమునందుగాని యుండుచో కలహశీలత్వము, దౌర్జన్యకరత్వమును సూచించును. ఈ రెండు స్థానములును ప్రాప్తిగ నిమ్నములైయుండుచో దానికితోడు వానిచేయి మృదువైనది కూడనైన—అట్టివ్యక్తి నిస్సందేహముగ పిరికిపందయగును. ఈ స్థానమునందు ఒక నిడివిరేఖ ధైర్యమును తెలుపును. కుజుని లోస్థానమున నక్షత్రసంజ్ఞ వీరజీవితమున కీర్తి సమార్జనమును తెలుపును. త్రికోణసంజ్ఞ కష్టకాలమున మనోధైర్యమును, చతురము కలహములయందలి ఆపత్తునుండి రక్షించుటను సూచించును. ఇతరసంజ్ఞలు మంచిని సూచింపవు.

షరా:—నక్షత్రము, క్రాసు, చతురము, ద్వీపము, త్రికోణము, వలయము ఏర్పడుగీతలు వానివాని గీతలు సమమైన దట్టముగ నుండవలయును. చతురము ఏస్థానముమీదనైనను, ఏరేఖమీదనైనను ఉన్నచో ఆస్థానమునకుగాని రేఖకుగానిగల దుష్ఫలితములను పోగొట్టును. ఏగుణముయొక్క తీవ్రతనైనను, ఘాతినైనను మితపఱచును. ద్వీపము ఏస్థానమునందుగాని, రేఖమీదగాని కనిపించినను చెడుపును సూచించును.


చిన్ననాటి చెలిమి

నరహరిశెట్టి శేషగిరిరావుగారు

విరులతావుల నియ్యమందుచు
ఎందివెన్నెల వెల్లి విరియగ
తలిరుప్రాయపు చెలిమినిగ్గులు
తలపునకు బారెన్.
ఆటపాటల నణగిపోయిన
హృదయమెరుగని ప్రేమకాంతుల
పసుదుకాలపు వలపుగాలికి
జ్వలియింప జేసెన్.
నిండురమునిగిన జొత్తుపావని
పెదవి చివురుల సొగయునవ్వుల
వెలిగిపోయెడు కన్నె ప్రేమను
చెలిమి చిగురొత్తెన్.
తేనెసోనల స్నానమాడీ
మేనుమరచిన భ్రమరుపోలిక
ఏమెరుంగని నాటిరోజుల
బ్రదుకె బుచ్చితిన్.
కాలకుంతల నీలకాంతుల
మరగిపోయిన మబ్బుపట్టుల
భయదచండిమ పాదఘట్టన
ఎదనొరసి కొనియెన్.
సెగలగ్రక్కుచు నెగయుమృత్యువు
కంటిఎరుపుల మంటకాల్వలు
తుదిసిశీధిని బ్రదుకుదారుల
ప్రసరియించి పోయెన్.
మలయబాలకు బలిమికౌగిలి
మలయకుండగ మున్నగవిసిన
కన్నెపూవలెన్ల చిన్నతనంపు
చెలిమి నశియించెన్.
స్వచ్ఛసరసి నిగారమట్టుల
మిసిమివెన్నెల కొసరు ప్రేమ
జీవితమ్మున సారెసారెకు
సెగలుగ్రక్కుచుండున్.
కనలుదీపిక కునుకువారెను
ప్రణయరాగము పదటుగవిసెను
నునుతలంపుల మునుకలెత్తిన
మనసొకటి మిగిలెన్.

పోటీ బహుమానము

"ANDHRABHUMI"
ఆంధ్రభూమి.
ILLUSTRATED TELUGU MONTHLY,
(Published on 25th of Every Month.)
VEPERY. MADRAS.



గురుజాడవారి	'కన్యాశుల్కము'
ధర్మవరమువారి	'చిత్రనళీయము'
చిలకమర్తివారి	'గయోపాఖ్యానము'
కాళ్లకూరివారి	'చింతామణి'
వేదమువారి	'ప్రతాపరుద్రీయము'
శ్రీపాదవారి	'బొబ్బిలియుద్ధం'
బలిజేపల్లివారి	'హరిశ్చంద్ర'

ఈ నాటకము లేడింటిలో మీ మొదటి, రెండవ మూడవ, నాలుగవ, ఐదవ, ఆఱవ, ఏడవ, వోటును క్రమముగా దేనికి దేనికి ఇచ్చుటకు నిర్ణయించుకొని, ఆవోటు నెంబర్లు పైన వ్రాయబడియున్న ఆయా నాటకనామముల కెదురుగా వైచి; పూర్తినామములఖాళీపై నెదురుగ తమ నామము, చిరునామా వ్రాసి; ఈ కాగితమును కవరులో పెట్టి రెండుఅణాల స్టాంపుబిళ్ళలతో సహా, సెప్టెంబరు 10-వ తేదీలోపల మా కార్యాలయమునకు పంపవలెను. తరతమభేదమున ఏయేనాటకమునకు ఏవోట్లు హెచ్చుగవచ్చినవో లెక్కించి మొత్తముమీద ఈ గణనకు సరిపోవునట్లుగాని సమీపించునట్లుగాని వోటువైచి పంపినవారలలో మొదటి ఇరువురకును చెరియొక రత్నా ఫవుంటెన్ పెన్ను బహుమానముగ ఈయబడును. ఒక్కొక్క కలము విలువ సుమారు నాలుగురూపాయిలు. ఇందు పలువురి గణనము ఒకేమాదిరిగా నుండుచో చీట్లువేసి బహుమానార్హుల నిరూపణ చేతుము. ఈకాగితముపై ఆంధ్రభూమిరబ్బరుస్టాంపు, నెంబరు, మేనేజరుసంతకము లేనిది పోటీపరీక్షలో నిది పర్యాలోచింపబడదు. ఇందు బహుమానార్హులుగ నిర్ణయింపబడిన వారి నామములు మైమాసపు ఆంధ్రభూమిలో ప్రచురించి అనంతరము వారిబహుమానములు వారికి పంపుదుము. ఈ విషయమై ఎట్టి ఉత్తరప్రత్యుత్తరములును జరుపబడవు.

ఆంధ్రభూమి కార్యాలయము, వేపేరి, మదరాసు.

ఆంధ్రభూమి

ప్రతిమాసమున ౧౫-వ తేదిని ప్రచురింపబడు సచిత్రాంధ్రమాసపత్రిక.

సమగ్రమైన ఆంధ్రజాతీయైక్యమును పెంపొందించుటయు; ఆంధ్రకళ, ఆంధ్రసాహిత్యము వీని విశేషాభ్యుదయమునకు పాటుపడుటయు 'ఆంధ్రభూమి' ప్రధానసంకల్పము. సర్వతోముఖమగు ఆధునికవిజ్ఞానమును, అర్వాచీననాగరికతను ప్రస్తరించు వ్యాసములు ఇందు ప్రముఖస్థానము నలంకరించును- ఆంధ్రుల ఆర్థికసాంఘికాద్యభివృద్ధులను పెంపొందించు ప్రబోధకవ్యాసములకును, ఆంధ్రక్షేమమునకైన సర్వవిషయములకును ఈ పత్రికయందు ప్రతిమాసము కొన్నిపుటలు ప్రత్యేకింపబడును. భీమావ్యాపారమును గురించిన వ్యాసములు ఈనూతనాంధ్రమాసపత్రికయం దొకవిశేషాంశము. భారతరమణుల ఔన్నత్యమునకైన ఉద్యమాభివృద్ధికి సముచితసరణిని కృషిసల్పి మహిళలజీవితసమస్యలకు సంబంధించిన విషయములకు ప్రత్యేకవివరణమిచ్చుట ఈపత్రికయొక్క ఆశయములలో నొకటి. కలసపోయిన ఆంధ్రుల స్థితిగతులనుగూర్చి రాష్ట్రమునందలి ఆంధ్రులకు వివరించుటయందును, భాషాప్రచారమునకు మూలభూతములైన గ్రంథాలయసంబంధమగు విషయములను క్రోడీకరించుట యందును, దేశాభ్యుదయమునకైన జమీందారుల విశేషకృషిని కీర్తించుటయందును 'ఆంధ్రభూమి' శ్రద్ధధానయైయుండును.

చందా వివరము.

సంవత్సరమునకు	రు. ౩-౦-౦.	నాలుగు మాసములకు	రు. ౧-౦-౦.
అర్థసంవత్సరమునకు	రు. ౧-౮-౦.	విడిసంచిక	రు. ౦-౪-౦.

పుష్కరసంచికకు ప్రశంసలు

......పుష్కరసంచిక సుందరముగనుండి, అన్వర్థనామము వహించుచున్నదనుటలో అతిశయోక్తి లేదు...
—పానువేదం జానకీరామశర్మ.

......ఇది ప్రస్తుతము వెలువడిన మాసపత్రికలన్నిటికంటెగాక నూతనకళలతో, నవీనభావసంభావనలతో, నూత్నాలంకారప్రకారప్రచయములతో నలరారుచున్నది. సంపాదకులు చిరకాలము 'గృహలక్ష్మి' పత్రికాసంపాదకులుగానుండి యాంధ్రభాషామాతకు అమూల్యరత్నములను యేర్చి కూర్చిన సుప్రసిద్ధకవి విమర్శకభాషాసౌందర్యముగ్ధుడు .....
—కల్యాణి. (రాలై)

......మూడవసంచిక సాంతముగా చదివితిని. పత్రిక సర్వజనాకర్షణీయముగానున్నది........
—మంగిపూడి వేంకటశర్మ.

...మీ ఆంధ్రభూమి నిన్న చేరినది. పుష్కరసంచిక యనుట కన్నివిధములఁ దగియున్నది...
—గాడపల్లి రామబ్రహ్మం.

...ఆంధ్రసారస్వతక్షేత్రమున నూత్నకుసుమగుచ్ఛముల ప్రసవింపఁజేయు 'ఆంధ్రభూమి' పాఠకులకు తనివితీఱని తతితేపులను పంచియిచ్చి ఆనందింపఁజేయుచున్నది...
—నా. వెంకటేశ్వరులు.

"ANDHRA BHUMI."

An illustrated monthly journal in Telugu.

(Published on the 25th of every month)

ANDHRA BHUMI seeks to interpret the renaissance in Andhra Art and Literature in the light of History. The journal is intended to reflect, as far as possible, modern culture and civilization in all their manifold aspects. A considerable part of it is devoted to the economic, social and political uplift of the Andhras, and generally to all matters affecting their welfare and happiness.

One of the objects of the journal is to help forward the movement in favour of the advancement of the economic and social status of Indian Womanhood, and bestow particular attention to all matters of special interest in woman's sphere of life.

Besides this, contributions relating to Banking and Insurance form a special feature of the ANDHRA BUHMI.

A journal like this, which necessarily includes regular literary contributions of much interest to the average reader, will not fail to draw his pointed attention to the technical but nonetheless important subjects. As such the journal would form the best medium for advertisement.

REGULAR FEATURES OF

THE JOURNAL.

LITERARY CONTRIBUTIONS:
Including Short Stories, Life Sketches, Humorous Writings, Articles on Modern Science & Historical Research, Essays in Criticism, Art and Poetry.
EDITORIAL COMMENTS.
THE WOMAN WORLD.
THE SCIENCE OF INDIAN ORNAMENTS.
INSURANCE TOPICS.
THE LANDED ARISTOCRACY.
LIBRARY MOVEMENT.
ANDHRAS ABROAD.
HEALTH NOTES.
BOOKS REVIEWED.
DIARY OF THE MONTH.
(By an Andhra.)

Editor and Publisher :
Andra Seshagiri Rao B.A.,
26, Mukathala Street,
Vepery, Madras.



OPINIONS.

" Andhra Bhumi " is a welcome addition to the ranks of illustrated magazines in our country. The Publication contains very attractive features and interesting articles. We are much impressed with the ideal that the magazine professes to serve, viz., the happy consummation of the idea of Andhra Province. In the first issue more than one article is devoted to the professed subject and is written in a manner calculated to serve as an active propaganda for the Andhra Province. We wish the journal a long lease of life and a career of great usefulness to the Telugu Public.

—The New Times.

" Andhra Bhumi " is an illustrated Telugu Monthly Journal. Among its many objects, the promotion of Andhra unity and culture occupies the first place. The contributions appearing in this, the first issue augur well for its future. Several beautiful Poems embellish the pages of this issue. One short story appearing in this issue (which is very modern both in its conception and development) reveals the inner workings of the bureaucratic mind of an Indian Excise Inspector, while at the sametime reproducing a page from "the Short and Simple annals of the poor" in India. Separate Sections in the journal have been devoted to 'Women', 'Insurance', 'Health', etc. The journal is a very welcome addition to those very few which are now " in the field ". It is to be hoped that it will obtain from the Telugu-reading public the encouragement it deserves.

—The Hindu.

" Andhra Bhumi " is a valuable addition to the ranks of Telugu Journalism. A monthly devoted to art, culture and literature, it is bound to be popular in Andhra Desa. A journal which serves as a vehicle of independent thought has been a long felt necessity in Andhra Desa and "Andhra Bhumi " it is to be hoped will satisfy that want. Valuable articles on subjects of topical interest by well-known writers are published in it, and its special feature is the attention paid to Health, Insurance and Art. Mr. Andra Seshagiri Rao, B.A., ex-editor, " Griha lakmi", edits this journal, and that is assurance enough that the journal will be conducted on independent and honest lines, keeping up to a high standard of journalism. The get-up of the journal is attractive and the subscription compatatively low, Rs. 3 *Per annum*. We wish Mr. Seshagiri Row's enterprise all success, and hope the Andhra Public will extend to him the encouragement the venture deserves.

—The Sunday Chronicle.

" We are in receipt of "Andhra Bhumi " which contained our advertisement We have to congratulate you for your success. The get-up of the book is nice. Since this magazine is touching the social, political, religions, commercial and such other present topics we believe that the same will be patronised by the Public at large and advertisers as the demand for the same will be promising."

JAGANMOHINI INSURANCE CO., LTD. *Vizagapatam.* } (sd.) V.A. GUPTA, Managing Agents.



కాశీనగరాంధ్రుల కర్తవ్యములు

కాశీనగరమునందును, అచటి హిందూవిశ్వవిద్యాలయమునందును నివసించు నాంధ్రులసంఖ్య తక్కువకాదు. కాని యీసంఖ్యనుఁదగినరీతిని ఆంధ్రభాషావాఙ్మయములయొక్కగాని, తదితరవిషయములయొక్కగాని యభివృద్ధి కానరాకున్నది.

విశ్వవిద్యాలయము స్థాపింపఁబడిన తొలికాలములలో నాంధ్రులు తక్కిన భారతీయులకంటె బాగుగఁ బరీక్షలలో నెగ్గి మొదటితరగతులలో నుత్తీర్ణులగుచు మాళవీయమహోదయుల యాదరాభిమానములకుఁ బాత్రులై యచటనే యున్నతస్థానముల నలంకరించెడివారు. కాని ప్రస్తుతము మనవారికిని కృషిచేసి మొదటి తరగతులను సంపాదింపలేకున్నారు. హిందూవిశ్వవిద్యాలయపరీక్షలు చాలసులభమార్గమున నుండునని బ్రమసి వారుపేక్షచేయుట దానికొక కారణము. కళావిభాగమునున్న విద్యార్థులు స్వభాషయందుఁ గూడ నుచితమగు జ్ఞానమును సంపాదింపక తప్పదని యొకనియమముకలదు. దాని ననుసరించి యాంధ్రులు కొన్ని యాంధ్రప్రబంధములను, లక్షణములను జదువవలసియున్నది. వానిని విద్యార్థులకు బోధించు నుపాధ్యాయుఁడు మాత్రము విశ్వవిద్యాలయమున నియమింపఁబడలేదు. హిందీ-బెంగాలీ-గుజరాతీ-మరాఠీ-మొదలగు దేశభాషలను బోధించు నుపాధ్యాయులను నియమించి విశ్వవిద్యాలయ మాంధ్రవిషయమున నుపేక్షవహించుట కడుంగడు శోచనీయము. ఆంధ్రవిద్యార్థుల సంఖ్య మీఁది గుజరాతీవిద్యార్థుల సంఖ్యకును, మహారాష్ట్ర విద్యార్థుల సంఖ్యకును దీసిపోవునదికాదు. ఆంధ్రవిద్యార్థులు స్వతంత్రముగనే వానింజదువుకొని ప్రశ్నపత్రములకుఁ బ్రత్యుత్తరముల నొసంగవలెనఁట. ఇది యప్రధానమని యెంచవీలులేదు. తెలుఁగులో విద్యార్థి తప్పినను, అతఁడు పైతరగతికిఁ బోవ వీలులేదు. ఒకయుదారస్వభావుఁడగు నాంధ్రమహాశయుఁడు పైహిందూవిశ్వవిద్యాలయమునం దాంధ్రమును బోధించునిమిత్తము సంవత్సరమునకుఁ గొంతధనము (రమారమి 300. రూపాయిలు) నొసగుచున్నట్లు వివరములు తెలియవచ్చుచున్నవి. హిందూదేశభాషలన్నింటియందును సమానగౌరవముగల కాశీవిశ్వవిద్యాలయ మాధనము నింతవఱకు నేరీతిని వినియోగించుచున్నదో ?

ఆంధ్రప్రబంధములు లక్షణములు స్వతంత్రముగఁ జదివి యర్థము చేసికొనఁదగినవి కావు. విద్యార్థులు స్వతంత్రముగఁ జదువుకొనినఁ గల్గు నాంధ్రవాఙ్మయజ్ఞానము చాలతక్కువ. కావున వారు తెలుఁగు పేపరులో మార్కులు తక్కువగ సంపాదించుటలో వింతలేదు. తక్కిన పేపర్లలో నెక్కువగ మార్కులను సంపాదించినను, తెలుఁగున నుత్తీర్ణులు కాని విద్యార్థుల శ్రమ వ్యర్థమగుచున్నది. అట్టివారు చాలమంది కలరనుట నిస్సందేహము. కావున నాంధ్రవిద్యార్థులీవిషయమును గమనించి తక్కిన భాషలను గౌరవించుచున్నట్లే హిందూవిశ్వవిద్యాలయ మాంధ్రభాషను గౌరవించునట్లు చేయ, తమశక్తివంచనలేక యాందోళనము సలుపవలెను.

సంస్కృతవిభాగమునకుఁ జెందినవారి సంగతియుఁ జాల శోచనీయముగ నున్నది. విశ్వవిద్యాలయమునందలి సంస్కృతాధ్యాపకులు ఎం. ఏ. లు అగుటచే వారాంగ్లమునందే సంస్కృతగ్రంథములను బోధింతురు. ఏదియైన సందేహము కలిగినపుడు దానిని దిద్దిచెప్పుటకు వారు దేశభాషయగు హిందీనే యుపయోగింతురు. మనయాంధ్రవిద్యార్థులకు దానివలనఁగూడఁ బ్రయో

జనము కానరాదు. దేశభాషయగు నాంధ్రమున వానిని బోధించినచో విద్యార్థులు సంస్కృతము నభిమాన భాషగాఁ దీసికొనుట ప్రయోజనకరంతము కాఁగలదు. లేనిచో నవర్థకము. కావున నీ విషయమునుబట్టి కూడ కాశీనగరవిశ్వవిద్యాలయాంధ్రవిద్యార్థు లాందోళనము సల్పు టుచితము.

ఆంధ్రవిద్యార్థులకు విశ్వవిద్యాలయమువా రొనర్చు భోజనపుటేర్పాటులెంతయు ననుకూలములై యున్నవి. ఉత్తరహిందూస్థానమున గోధుమరొట్టెలను తిను నలవాటేకలదు. వరిఅన్నమును భుజించు మనవారి కాభోజనము సరిపడదు. ఉత్తరహిందూస్థానవాసులు చేయు భోజనపదార్థములు రుచ్యములై యుండవు. ఉప్పు-కారము-పులుపు-లకలవాటుపడిన యాంధ్రుఁడు అభోజనమున కలవాటుపడుటకు అధమము కొన్ని నెలలైన పట్టును. ఇన్నికారణములచే నేదియో దీని పొట్టనింపుకొను విద్యార్థి ఒకప్రక్క-నుండిన పొట్టకల్గి-విద్యాభ్యాసమున నెట్లు దీక్షవహింపఁగలఁడో తెలియరాకున్నది. తమిళసోదరులు స్వదేశీయులను నియమించికొనినట్లు ఆంధ్రులుకూడఁ దమయాంధ్రుని నియమించుకొనుట లేదు. సంఘబలముతప్పక ఆంధ్రశాఖయందే చూపట్టుచుండుటచే వారట్లుచేయ సాహసింపలేనపుడు విశ్వవిద్యాలయమునకుఁ దమకష్టసుఖములను దెలియపఱచి తగినసాహాయ్యముఁ బడయుటకైనఁ బ్రయత్నింపవలెను. మఱియు సదుపాయము లున్న నేగాని యాంధ్రు లికమీఁద కాశీవిశ్వవిద్యాలయమున విద్య నభ్యసించుట దుర్ఘటము.

కాశీనగరమున నివసించు ప్రసిద్ధపండితులకడ సంస్కృతవిద్య నభ్యసింప నేఁగిన యాంధ్రవిద్యార్థులు కూడఁ జాల నిస్సహాయస్థితియందున్నారు. వారచట నిలుచుటకుఁ దావును, పుత్రవాత్సల్యమునఁ గోరిన శాస్త్రము నుపదేశించు గురుశ్రేణ్యులను సంపాదించుకొని యున్నను, భోజనవిషయమునను, ఆరోగ్యవిషయమునను దగిన సదుపాయములను గలుగఁజేసికొనఁజాలకున్నారు. వారికి సత్రములందు భోజనసదుపాయమే జరుగకున్నది. జరిగినను ఒక్క-పూటమాత్రమే. పూర్వకాలమునఁ జాలసదుపాయము లుండుటంబట్టియే పెక్కు-రువచ్చి విద్యనభ్యసించి గొప్పవిద్వాంసులై యుండిరి. కొందఱు ప్రత్యేకముగ విద్యార్థుల యారోగ్యమును బరీక్షించుచు వలయుసౌకర్యములఁ గూర్చుచుండెడివారు- ఇప్పు డెవరును విద్యార్థి బాధపడినను-దానిని మాన్పుకొన ప్రదేశమునకు కావలసినదే కాని లేదు. కావున నద్యుటఁగలయుదారులు శ్రీవిజయనగరమహారాజావారివంటి ప్రభువు లీవిషయమున దయతలఁచి తమసత్రములలో విద్యార్థులకు రెండుపూటల భోజనపు టేర్పాట్లుచేసి వారి యారోగ్యవిషయముల నారయుచుండిన విద్యార్థులు నిర్విచారులై విద్యనభ్యసించి తొంటిరీతిని ప్రఖ్యాతవిద్వాంసులు కాఁగలరనుటలో సందేహము లేదు. సదుపాయములు లేకుండుటంబట్టియే యిపు డాంధ్రులు గీర్వాణము నభ్యసింపఁ గాశీకిఁ బోజాలకున్నారని చెప్పుట తప్పు కాజాలదు.

తీర్థయాత్రలను సేవింపఁ గాశీకిఁబోవు ఆంధ్రులు చాలమంది యనాంధ్రులగు తీర్థపురోహితుల యిండ్లలో బస చేయుచుండుట చాలమంది కెఱుక. అందులకుఁ గల కారణ మాంధ్రక్షేత్రపురోహితులు వారి కుచితములగు సదుపాయములు చేయకపోవుటయుఁ, జేసినను, ఈపేరు, ఆపేరు చెప్పి ధనము వ్యయపఱచునట్లు నిర్బంధించుటయుఁ గారణములై యున్నవి. తమ యాంధ్రులు తమ్ము విడిచి మైథిలములకుఁ బోవుట తమకెలవంపనియు, ధననష్టమనియు, తెలిసి యింకనైన నాంధ్రపురోహితు లాంధ్రులను సముచితరీతిని గౌరవించి వలయుసదుపాయముల నొసఁగుట.

మఱియుఁ గాశీనగరాంధ్రు లందఱు నొకగుమిగఁ గూడుచుఁ దమకష్టసుఖములను విమర్శించుకొనుచు వలయు సౌకర్యముల గలిగించుకొనుటకు సాధనమగు "ఆంధ్రజనసంఘమును" స్థాపింతురు గాక!

—బులుసు వేంకటరమణయ్య.

విడ్డూరములు

§. మనిషి కడుపున పాముపుట్టుట.

అలహాబాదునందలి లేడీ డఫరిన్ ఆసుపత్రిలో నీళ్లాడుటకు నొక పేదరాలు వచ్చెను. ఆమె ఇద్దరు ఆడుపిల్లలను, ఒకపామును ప్రసవించెను. మొదటిశిశువు డాక్టరుచే బయటకు తీయబడినపుడు ఆశిశువు ముఖమున కంటుకొని ఒకపాము ఉండెను. ఆపాము ఒకఅడుగు నిడివియుండెను. పిల్లయు, పామును చచ్చియున్నవి. ఆమె తరువాత మరియొక ఆడుపిల్లను ప్రసవించెను. ఈ పిల్ల జీవించియున్నది.

§. వార్తాపత్రికలకు దినమున కొక్కొక్క రంగు కాగితము.

ఒక్కొక్కదినమున కొక్కొక్క రంగు హితమైయుండునని సయాముదేశపు ప్రజలనమ్మకము. హిందూదేశమున పూర్వకాలమున ఒక్కొక్కవారమునకు ఒక్కొక్కరంగు హితమైయుండునను నమ్మకము ఉండెడిది అని 'ఏడువారములనగలు' అనుపదముచే మనము ఊహింపవచ్చును. కాని సయామున ఇట్టి నమ్మకముగల వారగుటచే ఆదేశమువారు ఏదినమునకు హితమైనరంగుగల బట్టలను ఆదినమున ధరింతురు. ఆదేశపు వార్తాపత్రికలు ప్రజలచిత్తము నాకర్షించుటకుగాను ఆయాదినములందు ఆయారంగుకాగితములపై ముద్రింపబడును. సోమవారములందు పసుపుపచ్చ కాగితముల మీద, గురువారములందు ఆకుపచ్చకాగితముల మీద, ఆదివారములందు గులాబిరంగు కాగితములమీద, ఇతరవారములందు తెల్లకాగితములమీద సయాము వార్తాపత్రికలు ముద్రింపబడును. ఈ కాగితము నంతయును సయాము విదేశములనుండియే దిగుమతిచేసికొనవలసియున్నది.

§. ఒకవింత స్వరూపము: మోటారువలె నడచును, విమానమువలె ఎగురును.

ఒకజర్మనుఇంజనీరు మోటారువలె భూమిపై నడచునదియు, విమానమువలె గాలిలో ఎగురునదియునగు నొకయంత్రమును కనుగొనినాడు. మామూలు విమానములవలె భూమిపైకి దిగుటకుగాని, ఆకాశముమీదికి ఎగురుటకుగాని దీనికి విశేషస్థలము అవసరములేదు. ఎగురునపుడు దీనియందురెక్కలు భూమిపైనడచునపుడు ముడుచుకొనుటకు వీలుకలదు. మామూలు మోటారులవలె దీనికి నాలుగుచక్రములుగాక మూడేచక్రములున్నవి. ఇందు నలుగురు మనుష్యులు వారిసామానులతో సావకాశముగ కూర్చుండుటకు తావుకలదు.

§. చాకలివాని అవసరము లేకుండచేయు చెఱువు.

చాకలివానితో జగడాలుపడలేక సిరిగల కృష్ణమూర్తి పట్టుచీరకట్టెననియు; పేదవాడగు శివుడు పులితోలు కట్టెననియు; భైరవస్వామి దిగంబరుడయ్యెనని మనవారలు హాస్యముగా చెప్పుచుందురు. నాలుం బట్టకట్టియు మనలు చాకలివాని అవసరములేకుండ ఉండగల చెఱువొకటి ఈనడుమ కనుగొనబడినది. అది శెవక్లీయరుద్వీపమున గలదు. ఎంతమాసినబట్టనైన అందొకసారి తడిపినచాలును. సబ్బు, సోడాపెట్టి ఉడికపెట్టి ఉతికినప్పటికంటె హెచ్చుశుభ్రమగును. ఆచెఱువు నీటియందుగల క్షారద్రవ్యముల కారణమున నిది జరుగుచున్నదని శాస్త్రజ్ఞుల అభిప్రాయము.

§. ఇపుడు భీమసేనుడైనాడు.

జపానునందలి టోకియో నగరమున ఏకిరొ హీరాయి అను నొకవ్యక్తి నివసించుచుండెను. అతడు సైనిక

వృత్తినవలంబింపతలచి అధికారులను సందర్శించెను. అధికారులాతనిని పరీక్షించి మిక్కిలి సన్నముగాను, బలహీనముగాను ఉన్నాడని సైనికవృత్తి నవలంబించుటకు అనర్హుడుగా నిర్ణయించిరి. అందుపై ఏకిరో కొండ అడవికిపోయి సాముసాగించెను. ఐదుసంవత్సరములు సాముసాగించి అతడిపుడు కీమజలు వెయ్యెను. ఇప్పుడాతడు అరఅంగుళము దళసరి రెండుగజముల నిడివిగల ఇనుపకడ్డీలను వంచి తాడుమాదిరిగా చేతులకు చుట్టుకొనగలుగుచున్నాడు; ముప్పదిమంది పిల్లలు కూర్చుండియున్న దానికి తాడుకట్టి ఆతాడును తన పండ్లసందున ఇరికించి బిగబట్టి దానిని లాగగలుగుచున్నాడు. ఏకిరో వయస్సు ముప్పదిరెండుసంవత్సరములు. అతను నదమూడున్నర గుండ్లఎత్తు తూగుచున్నాడు; అయిదుజడుగుల నాలుగుఅంగుళముల పొడగున్నాడు.

§. పురుషుల అంతఃపురము.

మనదేశపురాజులును ఇతరదేశపురాజులును తమ అంతఃపురములందు అనేకస్త్రీల నుంచికొనియుండుటను మనము వినియున్నాము. కాని స్త్రీ అనేకపురుషులను తన అంతఃపురమున నుంచుకొనియుండుటను గూర్చి వినియుండలేదు. నేడట్టివార్త వినవచ్చుచున్నది. మలేషియాలో నొకజాతియందు అధికారమంతయు స్త్రీలచేతులయందే గలదు. ఆస్త్రీలలో ధనవంతురాండ్రగు స్త్రీలు అంతఃపురములలో ఒక్కొక్క దానియందు పెక్కుపురుషుల నుంచుకొనియుందురు.

§. పుస్తకములను చదువు యంత్రము.

లెనిన్‌గ్రాడ్ విద్యార్థి యొకడు విద్యుచ్ఛక్తి సాయమున పుస్తకములను చదువు యంత్రము నొకదానిని కనుగొనినట్లు తెలియుచున్నది. అచ్చుపడినవిగాని, టైపుకొట్టబడినవిగాని, వ్రాయబడినవిగాని యగు కాగితములను ఆయంత్రము అచ్చముగ మనుష్యకంఠముతో చదువగలదు. గ్రుడ్డివారు చదువుటకును, టెలిఫోనుపిలుపులకు సమాధానమిచ్చుటకును, సందర్శకుల రాకను తెలుపుటకును, నాటకములందు నటకులకు ప్రాంప్టింగు చేయుటకును ఇంకను ఇట్టి పనులకును ఇది ఉద్దేశింపబడి నిర్మింపబడినది.

§. ఒక ఎద్దుకడుపులో నలుబదిరెండు మేకులు.

న్యూసౌత్‌వేల్సుకు చెందిన కాశినోయందు నరుకబడిన ఒకఎద్దుకడుపులో నలుబదిరెండుమేకులు, ఎనిమిదిబోల్టులు, సీసపుగుండ్లు రెండు, ఒకచిన్నరాయి, గచ్చుతీయుటకై ఉపయోగింపబడు ఒకమూడుమూలల పెన్సిలనాగెము ఒకటి ఉండెను.

§. కల నిజమైనది

బెల్‌గ్రేడ్ నగరపు డాంకొరొకిచ్ అనుకన్య ఒకనాటి ఉదయమున తనతల్లితో గతరాత్రి తానొకటియు నిద్రలో తాను పిడుగుపాటువలన మరణించినట్లు కలలు గంటినని చెప్పెను. ఆనాటి మధ్యాహ్నము ఆమెయు, ఆమెతల్లియు తమయింటిచెంతగల పొలములో పని చేయుచుండిరి అప్పుడొక గాలివాన వచ్చెను. డాంకొరొకిచ్ ఆసమయమున నొకచెట్టుక్రిందికి చేరి నిలచెను. ఆ చెట్టుపై పిడుగుపడుటయు, ఆమె వెంటనే మరణించుటయు జరిగెను.

§. ఏబది తోకచుక్కలు.

బృహస్పతి గ్రహముచుట్టును ఏబదితోకచుక్కలు ఎల్లవేళల తిరుగుచుండునని కనుగొనబడినది.

§. కొండచిలువకడుపులో మేక.

మలయాదేశమున నివసించినయొకడు సింగపూరు వెంట తనమేకను పోగొట్టుకొనెను. తప్పిపోయిన తన మేకకొరకు అతడు నదీతీరమున వెదుకుచుండగా ఒక పెద్ద కొండచిలువ కనిపించెను. అది ఇరువదిరెండు అడుగుల పొడవుండెను. దాని నాతడు తుపాకిగుండుతో చంపెను. ఆచిలువ కడుపులో నాతడు తనమేకను కనుగొనెను.

ఇన్స్యూరెన్సు విషయములు

౧. ఇన్సూరెన్సు ప్రారంభము.

ఇన్సూరెన్సు నేటికాలమున లోకఖ్యాతిని గడించి మానవజీవితమందలి ప్రతిశాఖకును సంబంధము కల్గియున్నది. ఇన్సూరెన్సు యిటీవలనే అభివృద్ధిచెందుచువచ్చినను, వ్యాపార మెంతకాలమునుండి సాగింపబడుచున్నదో అప్పటినుండి గలదని చెప్పవచ్చును. వ్యాపారబాంధవ్యము మానవులలో ఎప్పు డారంభమైనదో చెప్పజాలము. కాని ఒకానొక కాలమున, మన ప్రాచీనులు తమ సంచారజీవితమువదలి, ఒక్కెడ నిలుకడగజేరి, వ్యవసాయముచే జీవనముసలుప గడంగిరని మనకు తెలియును. ఇట్టిస్థిరనివాసము మొట్టమొదట తూర్పుమెడిటరేనియను కనుమలలో ప్రారంభమైనది. మానవులు మొట్టమొదట ఈజిప్టు, టైగ్రిస్-యూఫ్రటీస్ కనుములలో స్థిరనివాస మేర్పరచుకొని, చేతిపరిశ్రమ లలవరచుకొని, కర్షకజీవితమును గొని, నిశ్చలవిధానమున ప్రభుత్వమేర్పరచుకొని సుఖించిరనుటకు నిదర్శనములు గలవు. కాలక్రమముగ వ్యాపారము ఆరంభమై భూమిమీదను, సముద్రముమీదను సాగింపబడుచుండెను. ప్రాచీన నాగరకతలు పుట్టి, పెరిగి, మరణించినను, వాటిచర్యలగూర్చి మనకు నిదర్శనములు లేకపోలేదు. క్రీస్తుశకమునకు 3000, 4000 ల ఏండ్లకు పూర్వము జీవించియుండిన బాబిలోనియను చరిత్రకారులు, యిన్సూరెన్సువిధానము వా రెరిగియుండిరని తెలుపుచున్నారు. ఆకాలమున వస్తువులను తయారుచేయువారు తమవస్తువులను వ్యాపారులకు అప్పగించి సహాయము చేయుచుండిరి. వ్యాపారులు ఆవస్తువులను దూరదేశములకు గొంపోయి విక్రయించుచుండిరి. వారి ప్రయాణము చాలదూర మగుటయే గాక, దొంగల భయము కల్గియుండుటచే వీరిలో ఒకతీర్మానము గావింపబడెను. అదేదనగా, వ్యాపారుల పొరపాటుచే గాక, చోరులవలన వస్తువులు అపహరింపబడినచో వారు, అప్పుతీర్చ పనిలేదు: అట్లుగాక క్షేమముగ వ్యాపారముచేసి తిరిగి వచ్చినచో అప్పుతీర్చి యిచ్చుటయేగాక కొంత వడ్డీయు నీయవలెను. ఈవడ్డీలో కొంత మొత్తమే నిజమైనవడ్డీ. మిగత యిన్సూరెన్సు కిస్తీ. ఇప్పటికి చాలకాలమైనను, యీపద్ధతి కొద్దిమార్పులతో నావికాసంబంధమైన యిన్సూరెన్సులో (మెరయిన్ ఇన్సూరెన్సు) ఇప్పటికినిగలదు. ఆదికాలపు ఫినీషియను వర్తకులు, హిందువులు గ్రీకులు, రోమనులు, అందరును, యీ యిన్సూరెన్సు పద్ధతి నెరిగి, సముద్రమార్గమున, నేల మార్గమున జరుపు వ్యాపారసంబంధమైన అపాయములకు యిన్సూరెన్సుసహాయమును పొందుచుండిరి. ఈ ఆదికాలపు వణిక్సంఘములలో సైతము 'సాధారణ సామరస్యపద్ధతి' (ప్రిన్సిపల్ ఆఫ్ జనరల్ యావరేజి) అవరణలో ఉండినది. ఈపద్ధతిప్రకారము- అందరి మేలునకుగాను- వహించిన నష్టభారమును సమముగ అం

సుభాషితము

స్థిరముగ ప్రతిష్ఠితమైన జీవిత భీమా సంస్థ ఇచ్చురక్షణములో సరిసమానమైన రక్షణమిచ్చునది వ్యాపారప్రపంచమున మరియొకటి లేదు. కంట్రాక్టు చేసిన మొత్తము విషయమై నిశ్చితము గలదు. వర్తకము, సాహసిక వ్యాపారము ఇంతకంటె హెచ్చులాభమునే కొనిరావచ్చును; కాని ఒక్కొక్కప్పుడు సర్వనాశనమునుకూడ కొనిరావచ్చును.

—ప్రొఫెసర్ డి మార్గన్.

వరకును రంపుకొందురు. కాలముగడచినకొలది మానవుని విజ్ఞాన మభివృద్ధియైనది; అతడు నూతనదేశములను కనిపెట్టినాడు; జయించినాడు: అందువలన వ్యాపారము వేయిరెట్లు అధికమైనది. వ్యాపారవసతులును ఏర్పడెను. కాని యిన్సూరెన్సువిషయములో ఈ కాలమంతయు అంధకారమయము. అగ్ని, వెల్లువలు, యిట్టి యితరవిపత్తులనుండి రక్షణపొందుటకై యూరోపియను సంఘములును, 11-వ శతాబ్దమున, ఆంగ్లో-సాక్సను వర్తకసంఘములును, పరస్పర భీమాచేసుకొనుచుండినవి. ఇన్సూరెన్సును శాస్త్రీయపద్ధతులలో స్థాపించినది లాంబర్డీ వారు. 14-వ శతాబ్దమున వీరు దండనాయకులచే తరుమబడి తమదేశము వదలి, పశ్చిమయిరోపా నంతయు నాక్రమించిరి. కొందరు యింగ్లండుచేరి, వ్యాపారమునందు నిపుణులగుటచే, శీఘ్రముగ వర్తకము సాగించి, నావికాసంబంధమగు యిన్సూరెన్సు యిప్పటిపద్ధతిలో స్థాపించిరి.

1666 లో లండనుమహానగరము అగ్నిచే దహింపబడెను. అప్పుడు అగ్నియిన్సూరెన్సు అవశ్యకత గుర్తింపబడెను 18-వ శతాబ్దియందు అగ్ని, నావికాసంబంధమైన యిన్సూరెన్సు ప్రబలెను.

> ## సుభాషితము
>
> ౬
>
> జీవితము ఇన్సూరుచేయని వానికి తన కొమార్తెనిచ్చి వివాహముచేయు తండ్రి బహుభయంకరమైన విచారమును, కష్టమును కలిగించు నొకఘోర ప్రమాదమునకు కర్త యగుచున్నాడు.
>
> —ఛార్లెసు డికెన్సు.

ఈ శతాబ్దిలో కర్మాగారములు స్థాపింపబడెను. యంత్రములు కనుగొనబడెను. ఆవిరిశక్తి కనుగొనబడెను. వేనవేలు జనులు కర్మాగారములందు పనిచేయుచుండిరి. యంత్రముల వలన అపాయములు జరుగ నారంభించెను. అప్పుడు ఆకస్మికప్రమాదసంబంధమైన యిన్సూరెన్సు కనుగొనబడెను.

1781 సంవత్సరమున నార్తాంప్టన్ మోర్టాలిటీ టేబిల్ ప్రచురింపబడువరకు జీవితభీమా అస్థిరముగ సాగింపబడుచువచ్చి, అప్పటినుండి స్థిరత్వము పొందగల్గెను. 16-17 శతాబ్దులలో ఎలిజబెత్తురాణి కాలమున జీవిత భీమాపోలసీ లివ్వబడినట్లు తెలియుచున్నది. కంట్రాక్టులు, 'అండర్ రైటర్స్' అనువారిచే ఒక సంవత్సర పరిమితివరకు మాత్రమే యివ్వబడుచు వచ్చెను. 18-వ శతాబ్దమున సంఘము లేర్పడి జీవితభీమా లిచ్చుచుండెను. జీవితములపై స్పెక్యులేషనులు బయలుదేరినవి. ప్రసిద్ధికెక్కిన పురుషులకు, వారివారి ఆరోగ్యము ననుసరించి కిస్తీలు వసూలుచేయుచు, పాలిసీలిచ్చుచుండిరి. ఇట్టి సందిగ్ధములగు యోచనలపై ఆధారపడిన చెడు ఫలితములను పోగొట్టుటకై 1774 సం॥న లైఫ్ అస్యూరెన్సు ఆక్టు లేక గాంబ్లింగు ఆక్టు ప్రకటింపబడెను. ఈ చట్టము ననుసరించి భీమాజీవితముపై పాలిసీదారుకి ద్రవ్యలాభముండవలెను. భార్యకును, భర్తకును గల భీమాసంబంధము మారీడ్ వుమెన్సు ప్రోపర్టీ ఆక్టు 1870, 1882- మారీడ్ వుమెన్సు పోలసీస్ ఆఫ్ అస్యూరెన్సు (స్కాట్లండు) 1880 చట్టములవల్ల నిర్ణయింపబడెను. 19-వ శతాబ్దారంభమున అనేక జీవిత భీమాకంపెనీలు స్థాపింపబడినవి. ఇవన్నియు క్రమముగ యిన్సూరెన్సు వ్యాపారము కొనసాగింపనందున, వీటిలో కలయికలు కలిగినవి. ఈ కలయికలు అజాగ్రత్తగ జరుగుటచేతను, కంపెనీలను బాగుగ పరిపాలింపక పోవుటచేతను అనేకమగు కంపెనీలు నష్టముల పాలయ్యెను. తత్ఫలితముగ 1870 లో లైఫు అస్యూరెన్సు కంపెనీల ఆక్టు అమలులోనికి వచ్చినది. ప్రతి కంపెనీయు దాని ఆర్థికస్థిరత్వమును ప్రకటించి నిరూపించవలెను. అందుచే జనులు మంచిచెడ్డ లాలోచించి భీమాచేసుకొనుటకు అవకాశము కల్గెను. 1909 లో ప్రచురింపబడిన అస్యూరెన్సు కంపెనీల ఆక్టు, యీక్రింది భీమాల కన్నిటికిని చెందినది. (1) జీవితభీమా (2) అగ్నిప్రమాదమునకు సంబంధించిన భీమా, (3) సాధారణ ప్రమాదములకు సంబంధించిన భీమా. (4) యజమానుల బాధ్యతభీమా (ఎంప్లాయర్సు లైబిలిటీ అస్యూరెన్సు.) (5) పెట్టుబడులకు సంబంధించిన భీమా. (బాండ్ ఇన్

నెష్టుమెంటు అష్యూరెన్సు) ఆధునికవ్యాపారలోకమున యిన్సూరెన్సు గొప్పస్థానమును పొందియున్నది.

—అలూరు రామచంద్రయ్య, బి. ఏ.

౯. భీమా : ఇహం, పరం.

హిందువులశాస్త్రములు పరలోకగతులనుగూర్చి తగుజాగ్రత్తగా ఉండుమని ముఖ్యముగా హెచ్చరిస్తూయుంటవి. ఇతరులు ఆపదలో ఉన్నప్పుడు వారికి సహాయముచేసి కష్టములు పోయేటట్లు చేస్తే, వాడు ఎన్నోవేల సంవత్సరాలు స్వర్గలోకములో హాయిగా ఉంటాడని మనధర్మశాస్త్రములు ఘోషిస్తున్నవి. ఈ లోకంలో ఉన్నంతవరకు, "నిత్యం సన్నిహితో మృత్యుః" అను నీతివాక్యమును జ్ఞాపకముంచుకొని జ్ఞానముగల ప్రతిపురుషుడు ధనం న్యాయమార్గమున సంపాదించి కుటుంబపోషణముచేయుచూ, తను వృద్ధాప్యములో అనుభవించుటకును, సంతానముయొక్క విద్యకూను కొంత ధనమును కూడబెట్టుకొనుట తప్పనిసరి. తను అకాలములోనే మృత్యువువాతబడుచో, తనమీద ఆధారపడియున్న భార్యకు, బిడ్డలకు గ్రాసమునకు వసతిచూపించినగాని పురుషుడు తనవిధిని, బాధ్యతలను సరిగా నిర్వహించినవాడనుటకు వీలులేదు. ఈ బాధ్యత నిర్వహించుటకు భీమాసంస్థలు మంచిసహాయకారులు. అవి యితరదేశాలలో బాగు గాపనిచేసి కుటుంబాలను రక్షిస్తున్నాయి. అమెరికావారు భీమావలని లాభములు అందరికంటె ఎక్కువగా పొందుతున్నారు. మనదేశమునకూడ ఈనడుమ భీమాకంపెనీలు మంచి వ్యాపారమును సాగించుచున్నవి.

సుభాషితము

౭

విదేశీయ భీమాకంపెనీలు మనదేశమునుండి ఏటేటకొనిపోవు ధనము మనదేశముయొక్క ఆదాయసంపత్తికి గొప్పనష్టము కలిగించుచున్నదనుట నిస్సంశయము. ఈధనప్రవాహమును అరికట్టి సాధ్యమైనంతవరకు ఇన్సూరెన్సువ్యాపారమునంతను హస్తగతమొనర్చుకొనుట హైందవుల విధికృత్యము. ఏడాదికి 10 కోట్ల రూపాయిలు మనదేశమున వివిధములైన ఇన్సూరెన్సువ్యాపారమును సాగించుచున్న విదేశీయభీమాసంస్థలు ప్రీమియముల రూపమున గొనిపోవుచున్న వనుట అతిశయోక్తికాదని తెలియుచున్నది.

—లాలా లజపతిరాయి.

భీమాచేసిన వ్యక్తి ఒప్పుకొన్నకాలపరిమితి రాగానే భీమామొత్తమును యింకాలాభమునుపొంది వృద్ధాప్యములో అనుభవిస్తాడు. దానిని బిడ్డలవిద్య మొదలగువానికిని వినియోగించవచ్చును. భీమాచేయుటవల్ల సంపాదనమీద శ్రద్ధగలవాడయి ఉంటాడు. కుటుంబభారము తలచుకొని విచారపడవలసిన అవసరముండదు. ఏదైనజబ్బుచేసినప్పుడు తనవెనుకవాళ్ల సంగతినిగురించి తహతహపడనవసరములేదు. అకాలమరణముసంభవించేయెడల అతనికుటుంబానికి భీమాకంపెనీవారు ఒప్పుదల మొత్తమును యిచ్చేస్తారు. అందువల్ల ఇహలోకంలో తనబాధ్యతలు నిర్వర్తించి కుటుంబగౌరవమును కాపాడినవాడవుతాడు. అలా భీమాచేయుటవల్లనే పరలోకసౌఖ్యముకూడా అనుభవిస్తాడు. భీమాదారుడు సాలీనా చెల్లించే మొత్తములో కొంతభాగము భీమానిధిలో చేరుతుంది. ఇతర పట్టాదారు నిర్ణీత వాయిదాలన్నియు చెల్లించకపూర్వమే మరణించుచో అతని కుటుంబపు భీమామొత్తమును యీ భీమానిధినుండి చెల్లింతురు అందువల్ల ఆవిపత్కుటుంబమునకు చెల్లించిన మొత్తములో ప్రతిపట్టాదారుని డబ్బు కొంత భాగముంది గనుక ప్రతిపట్టాదారుడు ధర్మముచేసినవాడవుతాడు. ఆధర్మఫలితమువల్ల పరలోకసుఖం పొందుతాడు. భీమాచేయుటవలన ప్రతి వ్యక్తియు తన్నుతాను రక్షించుకోటమేగాక తోడు సంఘములోని ఆపదలోవున్నకుటుంబాలను రక్షించినవాడగుచున్నాడు. అందుకనే జ్ఞానవంతులును, సంఘశ్రేయస్కాములును అగు మహనీయులు భీమాసంస్థలను గురించి ప్రోత్సహించుచున్నారు. "జీవితాన్ని భీమాచేయటమంటే ఒక్క కుటుంబముయొక్క విపద్భారమును అనేకవేల కుటుంబాలమీద పంచిపెట్టి, ఏకుటుంబానికికూడా కష్టములేకుండా, ఏస్వల్పభారమో తగిలేటట్టు చేయడమే"

అని ఒకరున్నూ, "పాతకాలమునందే ప్రతియింటి ద్వారబంధంమీద భీమాఅనేమాట వ్రాయుస్తారు" అని చర్చిల్ గారున్నూ, "భీమావలన ప్రతివారికిని మానవసంఘమునకు క్షేమకరమైన, విశ్వాసము, పొదుపు, మెలకువ వంటి అభ్యాసములు పట్టుబడును" అని అమెరికా ప్రెసిడెంటుగారగు రూజువెల్టుగారును, "భీమాభివృద్ధికి సూచనమని" జార్జిసార్వభౌముడును అభిప్రాయాలు ఇచ్చారు.

—వల్లభదాసు రాజగోపాలరావు, బి.ఏ.

౬. ఇన్సూరెన్సుయొక్క ప్రధానలాభ మేమి?

ఇన్సూరెన్సు నష్టమును సమముగ పంచిపెట్టుచున్నది. నష్టము కొందరికిమాత్రము పీడించి నశింపజేయక, అందరికి సమానముగ పంచిపెట్టబడుటచే, కష్టమనిపించదు.

మనజీవితములో మనమెన్నియో అపాయములకు లోనగుచున్నాము. అందువలన నష్టములు కల్గును. వాటిలో కొన్ని ప్రకృతిసంబంధమైనవి. (అగ్ని, సముద్రము, భూకంపము మొ॥) మరికొన్ని మన పరిసరముల ననుసరించినవి. భూకంపము మొదలగు ప్రమాదములవలని నష్టములను మనము తప్పింపలేము, కాని సదా మెలకువతో ప్రవర్తించి, యెట్టిపనియు లేక ఊరకుండినచో నితరవిధానముల నష్టము కలుగకుండ చేసుకొనవచ్చును కాని మానవప్రకృతి ఊరక జడత్వము వహించియుండుట అస్వాభావికము. తన ప్రాణమును, ద్రవ్యమును, ఏదో ఒక పనికై వినియోగించి మానవుడు వృద్ధిపొందజూచుచున్నాడు. ఇట్టి పరిశ్రమ వల్లనే సంఘాభివృద్ధియగుట. మానవునికి జ్ఞానముండుటచే మంచిచెబ్బర లెరిగి అతను వ్యవహరింపగలడు తన మేలును, సంఘపు మేలును తలచి చేయు కార్యమునందు ఒకవేళ నష్టములెల్ల నేమోయను భయ మాతని పీడింపవచ్చును. ఈభయము తొలగినచో నిజమైన అభివృద్ధి నే.

తప్పింపతరమైనదియు, తప్పింపతరముకానిదియునైన యీనష్టభారములో గొప్పభాగములు ఇన్సూరెన్సు చాలకాలమునుండి వహించినది. ఇన్సూరెన్సుచేయు గొప్పమేలు అపాయభారమును మోయుట. ఇన్సూరెన్సు సహాయములేనిచో మన నాగరికత యిప్పటిట్టి మార్పులొందెడిదో. ఇన్సూరెన్సు మానవుని అన్నిప్రమాదములనుండి తొలగింపజాలదు. దీనిపరిమితి, కొంత 'నిశ్చయాత్వము' అను సాధనముతో కొలతయిడబడు అపాయములకు మాత్రమే చెందుచున్నది. భీమానిధిని పోషించు యిన్సూరెన్సు కంపెనీలు అపాయముగ్గి. తక్కువకిస్తీలు చెల్లించి రక్షణపొందగోరువారివద్ద, ప్రీమియములు పొందును. ఈ ప్రీమియములు అపాయముయొక్క తీవ్రత ననుసరించియుండును. ఈ ద్రవ్యమంతయు భీమానిధిని వృద్ధిపరచును. ఇందుండి నష్టములకు లోనగువారు రక్షణను పొందుదురు. ఈ విధముగ భీమాకంపెనీ రక్షణయొసంగుసంస్థ. ఈ రక్షణలాభమునకై ధీమంతులు ద్రవ్యము వ్యయపరచ కొనుచున్నారు నిజమునకు దీనిని వ్యయమనుటకు ఏమాత్రమును వీలులేదు, పారమార్థిక చింతతో దానము చేయు సమయములందు మానవ హృదయమున ఎంతటి సమున్నతభావములు, విశాలాశయములు కలుగునో ఇట్టి రక్షణ ప్రసాదింప బడునపుడును అంతటి సమున్నతభావములును, విశాలాశయములును కలుగును.

—ఆలూరు రామచంద్రయ్య, బి.ఏ.

సుభాషితము

౮

ప్రతిసాధారణవ్యక్తి జీవితమున అతడు త్వరగను, సులభముగను ధనమును కూర్చగల వత్సరములు కొన్ని వచ్చుచుండును. ఒక్కొక్కప్పుడు ఇట్టి వత్సరములు జీవిత కాలమున ప్రారంభముననే, ఒక్కొక్కప్పుడు ఆలస్యముగను వచ్చును. అవచ్చినపుడు ప్రతివ్యక్తి చేయవలసినది కొంతధనమును మిగుల్చుటయే.

—డబ్ల్యు. జి. సిబ్లీ.

[బరోడాసంస్థాన గ్రంథాలయశాఖాధ్యక్షమహాశయులగు శ్రీ న్యూటన్ మోహనదత్తుగారి ఆంగ్లవ్యాసమున కిది తెలుగుసేత.]

గ్రంథాలయోద్యమము.

హిందూమహాయుగము: గ్రంథాలయములు

౧. హిందూదేశమున ప్రాక్తనకాలమున గ్రంథభాండారములు లేవు

మిక్కిలి పురాతనకాలముపై మనదృష్టిని బఱపితిమేని అప్పుడు హిందూదేశమున గ్రంథ భాండాగారములులేవని చెప్పుటకు ఏడమగుపించును. విద్యాధనమే ధనమని కీర్తింపబడిన ఈదేశమున - విద్యావంతమైన కులమునకు అన్నికులములకంటె అధికగౌరవముగల ఈదేశమున ప్రాక్తనకాలమున గ్రంథాలయములు లేవన్నచో వింతగ నుండకమానదు. ప్రాక్తనకాలమున ఈదేశమునందు వ్రాతపద్ధతిలేదనుటకు వీలు చాలదు. అశోకుని శిలాశాసనములు - క్రీస్తుపూర్వము మూడవ శతాబ్దిని చెక్కబడినవి- హిందూదేశమునందంతటను చెదరియున్నవి. క్రీస్తు పూర్వము రెండువేల ఐదువందల సంవత్సరము లప్పుడు గూడ హిందూదేశమున వ్రాతపద్ధతి అమలునందుండియున్నదనుటకు ఇటీవల సింధునదిలోయయందును, బెలూచిస్థానమునందును దొరకిన అక్షరములుగల సీళ్ళనుబట్టియు, తదితర ఆధారములను బట్టియు నిర్ణయింపనగును. వ్రాతపద్ధతి అతిప్రాచీనకాలమునుండియు అమలులోనున్న మన ఈదేశమున అప్పుడు గ్రంథాలయములు లేకుండుటకు కారణమేమి?

౨. విద్యయంతయు కంఠస్థమైయుండునది.

ప్రాక్తనకాలమున మనదేశమున వ్రాతపద్ధతి రాజశాసనములకు, ఆస్తికి సంబంధించిన దస్తావేజులు మొదలగు వానికి, తదితర వ్యాపారములకు మాత్రము ఉపయోగింపబడునది. ఆకాలమున విద్యయనగా వేదవిద్యయే. అది ప్రత్యేక మొకకులము వారిసొత్తుఅయి యుండెను. దానిని లిఖితమొనర్చుచో అది పరులదృష్టిని బడుట కవకాశముండునని వారు దానిని కంఠమునందే నిలిపియుంచుకొనిరి. పశ్చిమఖండములందలి పురాతనగ్రంథ భాండాగారముల చరిత్రను రచియించిన డాక్టరు బి.సి. రిచ్చర్డుసన్ గారు ఈ పద్ధతి నుద్దేశించి వీరిని 'మానసిక గ్రంథాలయములు' అని పేర్కొనియున్నారు. ఈవేద పండితులు సజీవ, జంగమ గ్రంథాలయములై దేశమునకు వెలుగు నిచ్చుచుండిరి. ఈవేదపండితులుగాక రాజాస్థానముల నాశ్రయించుకొని బట్టుకవులుండుచువచ్చిరి. వారు తమపోషకుల వంశప్రతిష్ఠను, కీర్తిని గానము చేయుచుండువారు. అనంతరకాలమున ఈవీరగీతముల నన్నిటిని మహాభారతము లోగొనినది. సమగ్రమైన భారతగీతము తొలుత తక్షశిలవిశ్వవిద్యాలయమున పాడబడియున్నదని మనకు తెలియవచ్చుచున్నది. బౌద్ధయుగమునగూడ ఈ విద్య లిఖితరూపమునందలేదు. బుద్ధుడు తన ఉపదేశములను లిఖితమొనర్చియుండెననుట కాధారము లేమాత్రమును లేవు. బుద్ధుడు నిర్యాణమొందినపిదపనే అతని ఉపదేశములను త్రిపిటకములుగా-సూత్రములు, వినయములు, అభిధర్మములు - ఏర్చి కూర్చి ఏకపద్ధతిని కంఠస్థ మొనర్చుట ఏర్పడుప

బడెను. ఈపద్ధతియే పలుశతాబ్దములు ఆచారమై యుండెను. క్రీస్తుపూర్వము 88-వ సంవత్సరమున సింహళద్వీపమున బౌద్ధభిక్షుకుల సమావేశమొకటి జరిగెను. కంఠస్థములు మాత్రమైయుండుటచే ఈ త్రిపిటకములు ఆయాదేశములందు కొంతమార్పునకు లోనగుచున్నవనియు, కొంతవఱకు నాశనముగూడ అగుచున్నవనియు తెలిసికొని వీని నన్నిటిని లిఖిత మొనర్పఁ బూనుకొనిరి. జైనులమతధర్మముల విషయమున గూడ నిట్లే జరిగెను. జైనతీర్థంకరుడగు మహావీరుని మరణానంతరము 980 సంవత్సరములకుగాని జైనుల మతగ్రంథములు లిఖితరూపము నొందలేదు.

౯. పుస్తకభాండాగారముల ప్రారంభము.

క్రమముగా వ్రాతపద్ధతియొక్క విద్యావంతులకుండిన విముఖత విచ్చిపోయెను. నాశనదేశతనుండి గ్రంథములను కాపాడుటకు వాగ్రూపముకంటె లిఖితరూపము మేలైన దనుభావము పాదుకొనెను. పండితులు తమకు కంఠస్థమైయున్నవానినెల్ల లిఖిత మొనర్చుటకు ప్రారంభించిరి. ఒకసారి ప్రారంభము జరిగినతరువాత ఆపద్ధతి సర్వాభివృద్ధిగాంచెను. ప్రతి హిందూదేవాలయమును, ప్రతి బౌద్ధ విహారమును ఇట్టి గ్రంథములను సేకరించి జాగ్రత్తపెట్టుటయందు అతికుతూహలమును జూపెను. ఇందులో భారతదేశమున గ్రంథాలయోద్యమము ప్రారంభమైన దనవచ్చును. రాజులును, ధనవంతులును ఒక్కొక్క గ్రంథమునకు బహుప్రతులు వ్రాయించి వానిని పరిరక్షించుటకు పూనుకొనిరి. పూనుకొనుటయే గాదు. అట్లు ఒక్కొక్క గ్రంథమునకు బహుప్రతులు వ్రాయించుట తమధర్మముగగూడ భావించిరి. పశ్చిమహిందూదేశమునకు చెందిన వల్లభిరాజొకని క్రీస్తుశకము 565 నాటి శిలాశాసనమొకటి ఈవిషయమునే తెలుపుచున్నది. ఈ ఆచారమును నేటికిగూడ జైనమహాంశులు నిర్వహించుచునే యున్నారు.


౯. బౌద్ధయాత్రికులు: హిందూవిశ్వవిద్యాలయములు.

అదినుండియు బౌద్ధమతము మిషనరీపద్ధతులపై నడుపబడినది. కావుననే అది టిబెట్టు, నేపాళము, చీనా మొదలగు దేశములకు సత్వరముగ వ్యాపించెను. బౌద్ధమతధర్మరహస్యములను ఆకళించుటకై ఆయాదేశముల నుండి పలువురుయాత్రికులు పథశ్రమమునకోర్చి హిందూదేశమునకు వచ్చుచుండిరి. క్రీస్తుశకము అయిదు ఏడుశతాబ్దులనడుమ హిందూదేశమునకువచ్చిన బౌద్ధయాత్రికులలో ఫాహియన్, హూయన్ త్సాంగు, ఈత్సింగు ముఖ్యులు. వీరు తమ యాత్రాచరిత్రములను రచియించియుండిరి. ఈచరిత్రలు మన కానాటి హిందూదేశమునందలి విద్యాపద్ధతులను లెస్సగ తెలుపుచున్నవి. ఈబౌద్ధయాత్రికులు హిందూదేశమున పలువత్సరములుండి, హిందూదేశమంతయు చుట్టుచు, ఇచ్చట లెక్కకుమీరి దేశమంతయు వెల్లివిరిసియున్న దేవాలయములు-బౌద్ధవిహారములు సందర్శించుచు, ఇచ్చటి విద్యావంతుల స్థితిగతులను విచారించుచు, సుప్రసిద్ధ గ్రంథములకు ప్రతులువ్రాసికొనుచు వచ్చిరి. దేవాలయములందును, విహారములందును, విశ్వవిద్యాలయములందును అనంతమైన గ్రంథభాండాగారముండెను. అధ్యాపకులు వేలకొలది విద్యార్థులకు ఉపన్యసించుచుండిరి. ఈవిదేశయాత్రికుల వ్రాతలనుబట్టి ఆనాటి హిందూదేశపు విశ్వవిద్యాలయములలో అతిప్రఖ్యాతి గాంచిన తక్షశిల, పాటలీపుత్రము, కాశి, ఉద్దండపురము, విక్రమశిల మున్నగు వానినిగూర్చి పలువిషయములు తెలియుచున్నవి. తక్షశిలావిశ్వవిద్యాలయమున వివిధవిషయకములగు పదునాలుగుకళలు ఆయాకళలయందు పరినిష్ఠులైన అధ్యాపకులచే చర్చింపబడుచుండెను. నలందావిశ్వవిద్యాలయమునకూడ బ్రహ్మాండమగు గ్రంథభాండాగారమును; మూడువందలగదులుగల తొమ్మిది అంతస్థుల భవనమును ఉండెను. నలందావిశ్వవిద్యాలయమునకు సమీపమునగల ఉద్దండపురివిహారమున ఇంతకంటె పెద్దదియగు గ్రంథసంచయము ఉండెనదనియు, అది పలువత్సరములు-క్రీస్తుశకము 1202 వఱకును-విలసిల్లినదనియు తెలియుచున్నది. 1202 లో ఈ విద్యాలయముపై తురకలుదండెత్తివచ్చిరి. భాక్తియార్ ఖిల్జీ సేనానాయకుడగు మహమ్మద్ బిన్ శిబ్ అనువా డీవిశ్వవిద్యాలయమును పట్టుకొని అందలి

బౌద్ధభిక్షువుల నందఱిని వధింపజేసెను. అచ్చటగల విశేష గ్రంథసముదాయమునకు అచ్చెరువంది ఊరిలోని జనమును రప్పించి వానియందలి విషయములను వివరింప గోరెను. చదువనేర్చినవారి నందఱిని వాతను మట్టు పెట్టియుండుటచే తామేమియు నందలి విషయములనుగూర్చి వివరింపజాలమని చెప్పిరి. దానిపై ఆసేనానాయకునకు కోపమువచ్చి ఆతఁదృష్టిలో ఆగ్రంథములన్నియు కాఫరులకు చెందినవగుట నాశనముగావించెను. మహమ్మదీయులదాడికి గుఱియైన ప్రతిబౌద్ధవిహారమును ఇట్లే నాశనదేవతకు విహారమందిరమయ్యెను. ఆదినములలో హిందూదేశమున నాశనముచేయబడిన గ్రంథసముదాయములకు లెక్కలేదు. ఏకమాతృకాధారములగు ఎన్ని అమూల్యగ్రంథములు అప్పుడు నశించిపోయినవో.

౬. పురాతనభాండాగారవర్ణనము.

భాస్కరసంహితయను ఒకానొక పుస్తకమునందు పురాతనగ్రంథాలయము లెట్లు పరిపాలింపబడుచుండినవో కొంత వర్ణనముగలదు. చక్కని రాళ్ళతో కట్టబడిన గృహమున భాండాగారము ఉంచబడునది. పుస్తకములు ఒక్కొక్క గుడ్డతో చుట్టబడి చక్కని దారములతో కట్టబడునవి. ఇనుముతో చేయబడిన అరలయందాపుస్తకములు భద్రపఱుపబడునవి. ఈగ్రంథాలయమంతయు నొకపాలకుని అధికారమునకు లోబడియుండునది. ఆతడు గ్రంథములను పరిరక్షించుటకు తోడు విద్యార్థులకు పలుశాస్త్రములయందు విశేషవిషయములను ఉపన్యసింపజాలి యుండువాడు. ఆగ్రంథాలయమునందు విద్యార్థులందరును బ్రహ్మచారులై యుండుట నియమము. బ్రిటీషుమ్యూజియమునందలి పత్రికాపఠనమందిరమును నిర్మించిన సుప్రసిద్ధగ్రంథాలయపాలకుడగు సర్ ఆంథొని పానిజ్జి పుస్తకములకు లోహమయమైన అరలను కనుగొనబడినవాడుగా కీర్తింపబడుచున్నాడు. కాని మనదేశమున పుస్తకముల పరిరక్షణమునకు లోహమయమైన అరల ఉపయోగము అతిప్రాచీనకాలముననే కనుగొనబడియుండుట నేడు మనకు చాల ఆశ్చర్యమును కలిగింపకమానదు. ఇట్టి వర్ణనము మఱియొకటి మనకు దొరుకుచున్నది. హైదరాబాదు శాసనపరిశోధకసంఘమువారి ప్రచురణపరంపరలలో ఎనిమిదవదానియందుగల ఒకానొక కన్నడశిలాశాసనము గ్రంథాలయనిర్మాణము నొకదానిని కీర్తించుచున్నది. క్రీస్తుశకము పదునొకండవశతాబ్దికి చెందిన రాయనారాయణుడను చాళుక్యరాజువద్ద మంత్రిగను, దండనాయకుడుగను ఉండిన మధుసూదనుడను మహాశయుడు నాడి పట్టణమునకు చెంతగల నాగైయను గ్రామమునగల పెద్దదేవాలయమున నొకగ్రంథాలయమును నెలకొల్పెను. ఆరుగురు గ్రంథాలయపాలకులకు, ఆరుగురు అధ్యాపకులకు, రెండువందల ఏబదిఇద్దరు విద్యార్థులకు ఈకళాశాలయందు వసతి ఏర్పఱుపబడియుండెను. విద్యార్థుల ఉపయోగార్థ మంతమంది గ్రంథాలయపాలకులు కావలసియుండిరనియు; ఈగ్రంథాలయపాలకుల జీతములు అధ్యాపకులజీతములతో సమమైయుండెననియు తెలిసికొనుటకు ముచ్చటగనున్నది. విశ్వవిద్యాలయమునకు చెందిన గ్రంథాలయమును పరిపాలించు వానికి ఒకానొక విషయమును బోధింపనియమింపబడు మహామహోపాధ్యాయుని జీతములో సమమైన జీతమును, కళాశాలకుచెందిన గ్రంథాలయమును పరిపాలించు వానికి కళాశాలాధ్యాపకునిజీతములో సమమైన జీతమును, మునిసిపాలిటీలకు చెందిన గ్రంథాలయమును, పరిపాలించువానికి మునిసిపలు ఆరోగ్యశాఖాధికారి, విద్యాశాఖాధికారి మున్నగువారి జీతములో సమమైన జీతమును ఇచ్చుట అమెరికాయందు నేడు ఆచారసిద్ధమైయున్నది. నాగైయందలి కళాశాలనిర్మాతయగు మధుసూదనమహాశయుడును గ్రంథాలయపాలకులవిషయమున అమెరికాయందు నేడుగల గౌరవాతిశయములనే ఆనాడు కలిగియుండెనని తెలిసికొనుట కెంతయో ఆనందముగుచున్నది.



ఆరోగ్యవిజ్ఞానము

౬. మలబద్ధము.

"శుభ్రమైన గాలి, శుచియైన ఆహారము, ప్రశాంతమైన వాతావరణము—రోగములకు దూరముగా నుండదలచిన వ్యక్తి వైద్యుడు విధించిన నియమములను గూర్చియు అత్యంత జాగ్రత్త వహింపవలయును. మలబద్ధము సకలరోగములకు స్వాగతోపచారములు సల్పు ఘోరరాక్షసి. రక్తము అపరిశుద్ధమగుటకు మలబద్ధమే మూలకారణము. నీరసము, మనోవైకల్యము, చింత, కోపము, శక్తిహీనత మొదలగునవి మలబద్ధముచే కలుగు దుర్లక్షణములే. మన దేశపుస్త్రీలు నడికట్టు చాల బిగించుకొందురు. దానిచే మొలగజ్జి మొదలగు చర్మరోగములు కలుగుట, చర్మము నల్లబారుట సంభవించుటయేగాక జీర్ణకోశమునందలి అవయవములు బిగింపునొంది వానికర్మము నవి సరిగ చేయలేకపోవును. సంకోచవ్యాకోచములకు ఎడము లేకపోవుటచే అన్నము సరిగ జీర్ణముకాదు. క్రమముగ అజీర్ణమేర్పడి మలబద్ధము కలుగును. కావున స్త్రీలు నడికట్టు విషయమున మెలకువ వహింపవలసియున్నది." అని తాంబరము శానిటోరియమునకు చెందిన డాక్టరు ముత్తుగారు మద్రాసునందలి క్వీన్ మేరీసు కాలేజీలో విద్యార్థినుల కొసంగిన ఆరోగ్యవిషయకమైన ఉపదేశమునందు చెప్పియున్నారు.

౬. ప్రశాంతవాతావరణము: ఆరోగ్యము.

విశ్రాంతికి నోచని త్వర జీవనముల యుగమిది. ప్రశాంతభావములకు, శాంతిజీవనమునకు తావులేదు. ప్రశాంతవాతావరణము ఆరోగ్యసంపదల కెంతటిసహకారియో మన ఋషిపుంగవులు గ్రహించినవారుగావుననే వారు ఏకాంతవనవాసమునకు గడంగియుండిరి. చప్పుడు, తొందర, ఉద్రేకము మానవుని మనస్సీమకు కలతలెట్టును; నరములందు అదురుపాటును బుట్టించును; జీర్ణకోశమునందలి అవయవముల విధ్యుక్తధర్మమునకు నిరోధము కలిగించును; శరీరమునంతను ఒకవిధమగు ఉడుకులో పడవైచును. ప్రకృతిని పరికింపుడు: ఆప్రకృతిమాత తనపనినంతయు నిశ్శబ్దనిశాసమయమునందే గావించును. మంచు పడు సమయమునదియే. వృక్షములు ఎదుగుకాల మదియే. పూమొగ్గలు తమ రేకులను విప్పు పవిత్రకాల మదియే. రాత్రియను తెర ప్రపంచరంగము పైపడుటతోడనే నిద్రయను దేవకన్య శాంతముగ రెక్కలుకట్టుకొనివచ్చి పరిశ్రమచే అలసములైన మననేత్రములయొక్క రెప్పలపై వ్రాలును. దివమునందు పనిని సంతృప్తికరముగ నిర్వహించుట [illegible] రాత్రిభాగమున మీరు ఎనిమిదిగంటల కాలము గాఢముగ నిద్రింపవలయును. ఉద్రిక్తభావములు సద్దు, సవ్వడి క్షయ మొదలగు రోగములను కలిగింపజాలినవి. ప్రశాంతవాతావరణమును, శాంతిమయజీవితమును రోగనిరోధకశక్తిని పెంపొందించి ఆరోగ్యాభివృద్ధికి దోహదప్రాయములై యుండును.

౬. దంతములు: వాని ఆరోగ్యము.

ప్రొఫెసర్ మెలాన్బీసాయమున అతని భార్య దంతముల ఆరోగ్యమునకు, మనము తిను ఆహారమునకు ఎట్టి సంబంధముగలదో చర్చించుచు నొకకరపత్రమును వ్రాసిరి. ఆకరపత్రమును బ్రిటీషుమెడికల్ రిసెర్చికౌన్సిలు వారు ప్రచురించిరి. మెలాన్బీసతి శైశవపు ఆహారపదార్థములకు శరీరనిర్మాణమునకు, ఆరోగ్యమునకుగల సంబంధమును గూర్చి పెక్కు నూతనవిషయములను పరిశోధించి ప్రచురించియున్నది. దంతములయొక్క ఆకారమును, వానియందలి సున్నపుపాలును, తెల్లందనమును మనము తిను ఆహారములోనుండు ఎ., డి. విటమినులపై

ప్రధానముగా ఆధారపడియుండునని శ్రీమెలాన్బీసతి చెప్పుచున్నది. ఎ. విటమినుదంతములయొక్క ఆకారముతో ఎక్కువసంబంధించియుండుటయు; డి. విటమిను వానియందలి సున్నపుపాలు, తెల్లంకనములతో ఎక్కువసంబంధించియుండుటయు ఆమెపరిశోధనల మూలమున కనుగొన్నది అగుటచే దంతములు గొగ్గులుదేరియున్న యెడ ఆహారమున ఎ. విటమినులోపించినదనియు, దంతములధావళ్యము తగ్గియున్నఎడ ఆహారమున డి. విటమిను కొఱవడినదనియు నిశ్చయించుకొనవచ్చును. ఈరెండింటిలో ఏయొక్కటికొఱవడినను దంతముల ఆరోగ్యము చెడిపోదనియు, వానిధర్మము నవితృప్తికరమున నిర్వహించుటలేదనియు తెలిసికొనవలయును. జంతుసంబంధమైన కొవ్వునందే ఎ. విటమిను విస్తారముగ కలదని ఇంతవఱకు మనకు తెలిసియున్నది. కాని మెలాన్బీమొదలగు పరిశోధకుల పరిశోధనాఫలితములవలన పెక్కుశాకములందు ఎ. విటమినులు కలవనుట కనుగొనబడినది. ఎ. విటమినులు హెచ్చుగనిచ్చు శాకములలో కారెటు దుంపలు ముఖ్యమైనవి. ఈదుంపలయందు ఎ. విటమిను ప్రత్యక్షముగలేదు. పచనమైనపదపడి అది జీర్ణకోశమున నుండగా దానియందు ఎ. విటమిను ఉత్పత్తియగును ప్రత్యక్షముగలేక జీర్ణమగుస్థితిలోమాత్రము ఎ. విటమిను ఉత్పత్తిచేయుగలిగినదగుట పచనావసరమున ఆ విటమినుల నాశనమునకు ఏవిధమైన అవకాశమునులేదు. కావున మానవశరీరమునకు ఎ. విటమిను సఫరా చేయుటలో కారెటుదుంపలు అద్వితీయమైన వగుచున్నవి. కారెటుదుంపలు, కాబేజిమొదలగు శాకములు తఱచుభుజించుచుండుటచే శరీరమునకు కావలసిన ఎ. విటమినులభించి దంతముల ఆరోగ్యము సుస్థితియందుండును. గ్రుడ్డులోని పచ్చసొనయందు డి. విటమినుగలదు. కాడ్‌లీవరుఅయిలునందిది హెచ్చుగగలదనుట ఎల్లరకు తెలిసినవిషయమే. పాలు, వెన్నమొదలగు వానియందును డి. విటమినుగలదు. ఆహారపదార్థములలో కారెటుదుంపలు, ఆకుకూరలు, గ్రుడ్లు, పాలు, వెన్న విశేషముగ చేర్చుకొనుచో దంతముల ఆరోగ్యము బాగుగనుండును; రోగనిరోధకశక్తికూడ పెంపొందును.

౯. చంటిబిడ్డల దేహపరిశ్రమ కనువైనపద్ధతి.

ప్రాకులాడనేర్చిన శిశువులకు ఆప్రాకులాటయే ఒకవిధమైన దేహపరిశ్రమయగుచున్నది. అంతకంటె చిన్నవారలకు దేహపరిశ్రమయేది? మనదేశమున ఉగ్గుపెట్టిన తరువాత ఉదయమునం దొకసారియు, సాయంకాలమునం దొకసారియు శిశువుల కాలుసేతులకు కొంతపరిశ్రమ కల్పించుట ఆచారమైయున్నది. అయితే ఈపరిశ్రమ వారికి సరిపోవునని చెప్పజాలము. ఇంకను కొంత పరిశ్రమకల్పింపవలసియున్నది. సాధారణముగ శిశువులు వెల్లకిలపరుండి కాలుసేతులు అల్లార్చుచుందురు. అదియు నొకవిధమైన దేహపరిశ్రమయే. ఒక్కొక్కప్పుడు శిశువులు మిక్కిలి బద్ధకముగనుండి ఆవులించుచుందురు. అట్టిసమయములందు వారి అరిపాదములందు నెమ్మదిగ చక్కిలిగింత పెట్టవలయును దీనితో శిశువుల ముఖములకు వికాసముగలుగును, ఆవులింతలు ఆగిపోవును. ఈ చక్కిలిగింత వారికి ఆనందమును గూర్చుటయేగాక చక్కని దేహపరిశ్రమకూడ అగుచున్నది. మొదటవ్రేలితో చక్కిలిగింత పెట్టవలయును. శిశువు కాలిని పైకి, క్రిందకు, కుడిప్రక్కకు, ఎడమప్రక్కకు పలుసారులు చాచుచు సంకోచింపచేసికొనును. కొంతసేపు ఇట్లు వ్రేలితో చక్కిలిగింతపెట్టుటతో దీనికి పరిచితినొంది శిశువు కాలు విశేషముగ కదుపుటతగ్గించును. బద్ధకము పూర్తిగపోయినట్లును, ఆవులింతలు ఆగిపోయినట్లును శిశువు కనబడుచో చక్కిలిగింతలు పెట్టుట మానివేయనగును. బద్ధకము, ఆవులింతలు ప్రోదోలుటకు ఇంకను కొంత దేహపరిశ్రమ అవసరమని తోచుచో ఈసారి వ్రేలిగోరుతో చక్కిలిగింత పెట్టవలయును. వ్రేలితో కంటె వ్రేలిగోరుతోనైన చక్కిలిగింత నిశితముగానుండును గావున శిశువు వెనుకటికంటె చురుకుగా కాళ్లు అల్లార్చును. ఆవయసున మఱియొకవిధముగా శిశువులచే నిట్లు దేహపరిశ్రమచేయించుటకు వీలులేదు. ఇక ఏవిధముచేతగాని శిశువుల కండరములు ఇంతటి చురుకైనచలనమునకురావు. ఇది శిశువులకు మంచిఆరోగ్యము కలిగింపజాలినదియని ఫిలాడెల్ఫియాయందలి కాంటీమెడికలు సొసైటీకిచెందిన ఒకసుప్రసిద్ధడాక్టరు చెప్పుచున్నాడు.



స్త్రీలు
ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.



మహిళాలోకము

పరాసుదేశపుస్త్రీలు

౯. ఎట్టి హక్కులును లేవు.

ఆధునికయుగమున ప్రజాస్వామికప్రభుత్వములు ఏర్పఱచు విషయమునందు ముందడుగువైచిన దేశములలో తొలుత పేర్కొనదగినదియు- మానవస్వత్వములు ఎలుగెత్తిచాటుటలో ప్రారంభమునందలి పలుదేశములకు మార్గదర్శినియైనట్టిదియునగు ఫ్రాంసుదేశమున నేటికి కూడ స్త్రీలకు ఎట్టిస్వాతంత్ర్యముగాని, ఎట్టిహక్కుగాని లేవనుచో వింతగ నుండక మానదు. కాని నిజమట్టిది. రాజకీయముగా వారికి స్వాతంత్ర్యలేశమైనలేదు- ఓటింగుహక్కు-కూడ వారికి లేదు. న్యాయవిధానము అనేకవిషయములలో వారికి చాల ప్రతికూలముగనున్నది. న్యాయవిధానమున ఫ్రాంసుదేశపుస్త్రీ శిశువులు, అపరాధులు, మతిహీనులు మున్నగువారివర్గమున పరిగణింపబడును. వివాహమగుటతో నామె మగని సంరక్షణాధికారమునకు అప్పగింపబడును. మగని అనుమతి లేనిది ఆమె ఎట్టివృత్తిగాని అవలంబింపరాదు. తన సొంత ఆస్తి నిర్వాహణమునకు చేతులకట్టే యుండవలయును. వరకు ఆమె పెండ్లికాంట్రాక్టులో నిర్ణయించుకొననిచో ఆ ఆస్తి యాజమాన్యము ఆమె కుండజాలదు. ఆమె ప్రత్యేకముగ బ్యాంకు ఎక్కవుంటు పెట్టుకొనరాదు. న్యాయవిధానము ఆమెకు వరిముల్లవారియైన బాధ్యత నీయకున్నది. కావున ఆమె స్వతంత్రించి ఏవిధమైన కంట్రాక్టును గాని చేయుటకు అసమర్థయై యున్నది. ప్రభుత్వమువారి చట్టములనుబట్టిచూచినను, న్యాయవిధానమును బట్టి చూచినను, ఫ్రాంసుదేశపు నేటిస్త్రీలస్థితి మిక్కిలి శోచనీయముగ నున్నదనుట సునిశ్చయముగను.

౯. కాని అధికారమంతయు స్త్రీలది.

కాని నిదానించి ఫ్రెంచివారి నిత్యజీవనవిధానమును పరీక్షించువారికి ఫ్రెంచిస్త్రీలు తమబాధ్యతలను బాగుగ గుర్తించిరనియు, సంపదాయముచే వారికి అనంతమైన పలుకుబడి యున్నదనియు సులభముగనే తెలియును. ఏదైన నొక ఫ్రెంచిగృహమున కాలుపెట్టినతోడనే మన కీవిషయము తెలిసివచ్చును. నిదర్శనమునకై ఒక విషయము చూడుము. ఒకదుకాణమునకు పోయినగాని వర్తకుని, కమ్మరి మొదలగు పనివాండ్రను కుదుర్చుకొనదలచినగాని ఒకానొకపని చేయుటకు ఎంతకాలము పట్టునది, దానికి ఎంతసామగ్రి కావలసియుండునది, ఆ పని ఎట్లు నిర్వహింపవలెనది మొదలగువిషయములు సమస్తమును పనివాడే సంతోషపూర్వకముగ చెప్పును. కూలినిర్ణయము వచ్చునప్పటికి తనభార్యయిష్టమనును. తాను చేయవలసినపనికి పెరటిలోనున్న తనభార్య విలువ మదింపు చేయవలసియున్నది. తుదినిర్ణయ మామెది. దీనినిబట్టి ఫ్రాంసుదేశపుస్త్రీలఅధికారము సూక్ష్మముగ పోల్చుకొనవచ్చును.

౯ ఫ్రెంచిస్త్రీలు: వ్యాపారవృత్తి.

కిరాణాకొట్లు ఉమ్మడి చిల్లరదుకాణముల ప్రతిదాని యందును క్యాష్పెట్టెదగ్గర తెలుచుగా దుకాణదారుని భార్యగాని ఒక్కొక్కప్పుడు అతనికూతురుగాని కూర్చుండియుండును. సూర్యోదయము మొదలు చుక్కపొద్దువేళ అతిక్రమించి బాగుగా రాత్రియగువఱకును ఆమె అక్కడనే యుండును. గొప్ప అధికారిణివలె పనివాండ్ర నదమాయించుచుండును; కాతాదారులకు

స్వాగతమిచ్చుచుండును; తనదుకాణమున బల్లకును సరకు తావులేకుండ ఆమె గంభీరస్వరమున సకలము చక్కబెట్టుచుండును; కార్యదీక్షయందు ప్రమత్తురాలగుచుండు పనిని సయుగము ఆమె ప్రబోధించుచుండును. కుటుంబపుటాస్తి అను సకలవస్తువుయొక్క పరిరక్షణము, భావిసంతతులవారి సుఖజీవనముయొక్క సాముదాయక సౌఖ్యము కనిపెట్టిన తనచేతులయందే గలదను పూర్ణమైన నమ్మకముతో ఆస్త్రీలు వ్యవహరింతురు. కుటుంబపుటాదాయమంతయు ఆమెచేతులలో నుండును; పనివాళ్ళకు బత్తెము, గుమాస్తాలకు జీతము ఆమెయే ఇచ్చుచుండును. అమెరికాదేశమున కుటుంబపుటాదాయములో నూటికి ఎనుబదిపాళ్ళు స్త్రీలచేతులం దుండునని లెక్కలవలన తెలియుచున్నది. ఫ్రాంసుదేశమునమాత్రము ఇంతకంటె ఎక్కువపాళ్లధనమే స్త్రీలచేతులందుండు ననుట నిశ్చయము. ఫ్రాంసుదేశపుస్త్రీలు కుటుంబముయొక్క వ్యయమును తమచేతులయందు నిలుపుకొనుటయే గాక కుటుంబముయొక్క మొత్తపు ఆస్తినంతను తమ యాజమాన్యముననే యుంచుకొందురు. కుటుంబముయొక్క భవిష్యత్తుఅంతయు వారిపరిశీలనమైననే ఆధారపడియుండును.

౭. ఈ కష్టమంతయు వృద్ధాప్యమున సుఖించుటకు.

ఫ్రెంచిస్త్రీలు దివారాత్రములిట్లుకష్టపడుట, పైకము విషయమున ఇంతటిజాగ్రత్తగనుండుట వృద్ధాప్యమున పని, లేమి లేకుండ సుఖింపజాలు స్థితి నందుటకే. ఈ స్థితినందుటకుగాను వారు జీవితప్రారంభదశలో మిక్కిలి పొదుపుగ జీవింతురు. ఒకనాడు పల్లెటిపట్టులందు స్వగృహము సంపాదించుటకై ఈనాడు వారొకచిన్న అద్దెయింట అటుపాటింతురు. ఒకనాడు ఎట్టిపనియు చేయనక్కఱలేకుండుటకుగాను ఈనాడు వారు అన్నిపనులు తామే చేసికొందురు. అగుటచే ఫ్రాంసుదేశమున స్టాండర్డు ఆఫ్ లైఫ్ ఇతర ఐరోపియనుదేశములందుకంటె మిక్కిలితక్కువగానున్నది. పైనచెప్పిన విషయములనుబట్టి ప్రతిపరాసుకుటుంబమునను రెండుస్పష్టమైన దశలను మనముపోల్చవచ్చును. మొదటిదశ మిక్కిలి కష్టపడి నిలువచేయుదశ; రెండవదశ లెస్సగా సుఖించుదశ.

౮. పరాసు ఐశ్వర్యమునకు పరాసుకడతులే కారణము.

దుకాణములందు గల్లాపెట్టిదగ్గర కూర్చుండియు; వస్తువుల నమ్ముటకు పూనుకొనియు పరాసుకడతులు చూపునైపుణ్యమే, చూపుశ్రద్ధయే వారివారిభర్తలయైశ్వర్యలాభమునకు మూలకారణమనుట సత్యసమీపవిషయము. పారిస్ నగరమున నేడు పలుశాఖలుగ చీలియున్న బోగ్నాక్ గారి ఆహారపదార్థముల విక్రయశాలల మొదట బోగ్నాక్ దంపతులచే ప్రారంభింపబడిన చిల్లరదుకాణమునకు ప్రవర్ధమానరూపమే. ఫ్రాంసుదేశపు నేటికోటీశ్వరులలో బోగ్నాక్ యొక్కడు. తొలుత నాతడు, నాతనిభార్యయు కలసి చిన్నజనపదసరకుల అంగడిని పెట్టిరి. ఆ అంగడిలో బోగ్నాక్ భార్య వస్తువిక్రయదారురాలును, ఖజానాదారురాలునుఅయి యుండెను. బోగ్నాక్ దంపతుల నిరంతరకార్యదీక్ష, నిలుకడయైన పోడిమి, నిశిదారు జాగ్రత్త వారి యిప్పటి ప్రవర్ధమానమైన సంపదకు పునాదులు. పారిసుపట్టణమున దుకాణములుగల వీధులవెంబడిని మనమొకసారి పోయిచూచిన నడిరేయియగు వేళనుగూడ గల్లాపెట్టెలదగ్గర ఆయా దుకాణములయజమానురాండ్రు కూర్చుండియుండుటను చూడగలము. ఎదురుగా ఖాతాదారుడైన రాగలడను భావముతో నామె గల్లాపెట్టెకడ శ్రమచే బడలిన ముఖముతో కనిపెట్టుకొనియుండును.

౯. రాజ్యాంగమున వారిపలుకుబడి.

ఓటింగుహక్కులేకుండినను రాజ్యాంగము ఫ్రెంచిస్త్రీలయొక్క పలుకుబడి కొలదియైనదికాదు. ఫ్రాంసుదేశపు పూర్వచరిత్రను పరికించినచో ఆదేశపురాజులపైగూడ స్త్రీ పెత్తనపలుకుబడిని గలిగియుండిరో తెలియనగును. ఫ్రాంసుదేశపు ఇప్పటిచరిత్రయందుగూడ స్త్రీల ఈపలుకుబడి డిందుపాటునొందలేదు. తక్కువతరగతులపుకుటుంబములలో స్త్రీలు వ్యాపారమునందును, గృహకార్యనిర్వాహణమునందును అధిక్యమువహించియుండ ధనవంతమైన కుటుంబమునందలిస్త్రీల పలుకుబడి రాజకీయవిషయములందును, కళాసారస్వతవిషయములందును పరుగులు వారుచుండును. తక్కువతరగతులపుకుటుంబముల

లో ధనము, ధనవంతమైన కుటుంబములలో పలుకుబడి స్త్రీల చేతులందుండును. ఆదేశమున మంత్రివర్గపు చేర్పాటులయందుగూడ స్త్రీలబాధ్యత, పలుకుబడి పలుముఖములైయుండునను సత్యదూరము కాదు.

౯. ఫ్రెంచి సారస్వతము : పరాసుస్త్రీలు.

ఫ్రెంచిసారస్వతమున స్త్రీలకు ఎట్టి గౌరవస్థానము ఈయబడలేదు. పరాసుదేశపు నవలలో వారు కేవలము సుఖమునే కోరువారుగను, చంచలచిత్తలుగను చిత్రింపబడిరి. ఫ్రెంచినాటకములందు వారు కులటలుగ ప్రదర్శింపబడిరి. అయితే ఈవర్ణనము సత్యసమ్మతమనుటకు వీలులేదు. పరాసుస్త్రీలలో అల్పాదల్పమగు వేశ్యాకభాగముతప్ప మిగిలినవారిని గూర్చి ఇట్టి వర్ణనముచేయుట అనుచితము. వివాహమునుగూర్చియు, కుటుంబజీవితమును గూర్చియు ప్రజాభిప్రాయము ఒడుదొడుకులకు లోనగుచున్న ఈ దినములలోగూడ ఫ్రాంసుదేశమున కుటుంబజీవనమర్యాద ఎంతమాత్రమును మారలేదని చెప్పవచ్చును. స్థూలదృష్టికి అసలు మారనేలేనట్లు కనిపించును. పడుచుతనపు తరములలోనున్నవారికి స్వాతంత్ర్యము, భార్యాభర్తలకు వ్యక్తిస్వాతంత్ర్యము నేడు పలుదేశములందు గానవచ్చుచున్నవి. ఫ్రాంసుదేశమున—రాజధానీనగరమగు ప్యారిసునందే—అట్టిస్వాతంత్ర్యము కానరాదు.

౯. ఫ్రెంచిపార్లమెంటు : స్త్రీలు.

ప్రపంచమునందలి వివిధదేశముల శాసనసభలయందు స్త్రీలసభ్యత్వమునకు నోచిపుట్టనివానిలో ఫ్రెంచిపార్లమెంటు ఒకటి. అయితే ఆసభకు మంత్రులభార్యలును, స్నేహితురాండ్రును వచ్చి గవర్నమెంటు బెంచీలపైగూర్చుందురు. వారామాత్రాంగ వేర్పడియుండుటకు విశేషముగ పాటుపడియుందురు. పార్లమెంటుసభ్యురాండ్రగుటకు స్త్రీలకు హక్కుగలదేశములందలి స్త్రీలకంటె హెచ్చుగనే పరాసుస్త్రీలు తమదేశపురాజ్యాంగమున పలుకుబడిని కలిగియున్నారు. కాని విదేశీయులెవరైన ఫ్రెంచిపార్లమెంటుభవనమునకు పోయి అచట మందహాసాంచితవదనములతో కూర్చుండియున్న స్త్రీలనుచూచి రాజ్యాంగమున వారి కింతటిపలుకుబడి గలదని ఒక్కనాటికిగూడ అనుకొనరు. పైగా రాజ్యాంగవిషయములందు జోక్యముకలిగించు కొనవలయునను కాంక్ష ఆస్త్రీలకడనున్నట్లును చూపట్టదు.

౯. ఫ్రెంచి స్త్రీల గుణాతిశయములు.

రాజ్యాంగవేత్తలు ఆమెకు వోటునీయ నంగీకరింపరు; గ్రంథకర్తలు ఆమెయెడ ఎట్టిసానుభూతిని చూపకుందురు. అయినను రాజ్యాంగవేత్తలును, గ్రంథకర్తలును ఆదేశపుస్త్రీల పలుకుబడికి లోగియేయుందురు. స్త్రీపురుషులకు సమానస్వత్వముగల దేశములందలి పురుషులకంటె పరాసుదేశమునందలి పురుషులు స్త్రీలను తమతో సమానముగా చూచుట కిదియే కారణమని చెప్పవచ్చును. ఎవరేమి చెప్పినను పరాసువనిత శ్రద్ధగ వినును. సంభాషణావసరమున ఆమెప్రజ్ఞ, ఉపజ్ఞ వెల్లడియగును. ప్రపంచమున కలుగుచుండు నెట్టి విషయములన్నియు తన భార్యకు చెప్పుటలో పరాసుభర్త కుతూహలుడైయుండును. వివిధదేశముల రాజ్యాంగవిషయములు, అచ్చటి పార్టీపద్ధతులు, వానియందలి రహస్యములు ఆమె బాగుగ ఆకళించుకొనును. కాని తమదేశపురాజ్యాంగమున ప్రత్యేకప్రవేశముగాంచవలయునను అభిలాషమాత్రము ఫ్రెంచిస్త్రీకి తీవ్రతరమైలేదు. ఏమన ఆమెకు హక్కులులేకున్నను అధికారమున్నది; వోటులేకపోయినను పలుకుబడిఉన్నది. స్త్రీలకు రాజ్యాంగమున ప్రత్యేకపుప్రవేశముగల దేశములందు స్త్రీ రాజ్యాంగమున నొకఅంగము మాత్రమే. ఫ్రాంసుదేశమున రాజ్యాంగమంతయు స్త్రీలచేతులయందే ఉన్నది. దీనికి కారణము ఫ్రాంసుస్త్రీల నిశితప్రతిభయే. అంతులేని సామర్థ్యము అసదృశమైన శక్తి, అవధిఎఱుగని ఓర్పు, లోభిత్వమనుటకు వీలుచాలని పొదిమి, కీర్తియెడల కాంక్ష, ఆత్మశక్తియందు నమ్మకముగలిగియు పరాసుస్త్రీ రాజ్యాంగమున ప్రవేశముగాందకుండుటచే ప్రపంచమువారిదృష్టిలో ఆమె పురుషుని ఆకర్షించు విగ్రహముగను, స్త్రీత్వమునకు రాణిగను, పురుషునకు కష్టముగాని సుఖముగాని కల్పింప సృష్టింపబడిన ఉపకరణముగను ఉండిపోయినది. "ఇతరదేశమునందలి నాసోదరీమణులకు వోటుండనిమ్ము. నాకు అధికారముగలదు." అని పరాసువనిత నిరభ్యంతరముగ ఎంచుకొనవచ్చును.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౧౮. పిచ్చి పిల్ల

సరస్వతీగ్రంథమాలలోని ౩౧-వ కుసుమము. ధరణీప్రగడ వెంకటశ్రీరామమూర్తిగారు రచయిత. తెలుగు భాషలోని అనూదితములుకాని స్వతంత్రనిరూపక రచనలలో నిదియొకటి. ఈవఱలో బంగాళీభాషలోని సుప్రసిద్ధ నవలారచనలను తెలుగుచేయు నాచారము ప్రచారమునందున్నది. తరువాత తరువాత తెలుగువారు సైతము తాదృశరచనలను స్వతంత్రముగఁ జేయఁబూనుట ముదావహము. కొన్నికొన్ని నిరూపకరచనల యందు ముందుముందుగనే కొన్ని యధ్యాయములఁ జదివినచోఁ బాఠకులకు హంతకుఁ డెవ్వఁడో తెలిసిపోవును. ఇం దట్లుగాక కథావస్తువు నిగూఢముగను, ఆశ్చర్యకరముగను నున్నది. కొన్నిఘట్టములందు మిగుల భయానకముగ నుండుటయేగాక చదువువారికిఁ గథావిధానమున చింతరుచిని గల్గించుచున్నది ఇందు పిచ్చి పిల్లను ప్రవేశపెట్టుట యెంతయు నొప్పియున్నది. ఈమె పరిశోధనాధికారిభార్యయే యయ్యు గ్రంథాంతమునఁగాని యేరికిని దెలియదు. కథావిధానము చమత్కృతిజనకము. అటనటఁ గొన్ని యధ్యాయముల ప్రారంభమున నీతిబోధకములగు పద్యములు చేర్పఁబడినవి. విద్యాశాఖాధికారు లిట్టి పుస్తకములను పాఠశాలాదుల యందుఁ బ్రవేశపెట్టి రచయితలకుఁ దగుప్రోత్సాహము నిత్తురుగాక! ౧౩౨ పుటలు. డెమ్మీసైజు. వెల ఒక రూపాయి. వలయువారు సంపాదకుఁడు, సరస్వతీగ్రంథమాల, కాకరపఱ్ఱు, తణుకుతాలూకా అని వ్రాయవలెను.

—నూ. కృ.

౧౯. కథావళి

ఇదియు సరస్వతీగ్రంథమాలాసంపాదితము. సుప్రసిద్ధగ్రంథకారులగు శ్రీ పోడూరు రామచంద్రరావు బి.ఏ.,బి.ఎల్ గారు దీని రచించిరి. ఇం దెనిమిది కథలు గలవు. కథారచనములందు నూతనములగు పోకడలంతగ లేకున్నను పాత్రపోషణాదులు ప్రశంసనీయములు. కథావస్తు వంతగ స్వాభావికముగాకున్నను చమత్కృతిజనకము తుదికథయగు "కథకుఁడు" అను దానియందు నవ్యత కొంతవఱకు గోచరించుచున్నది. ప్రఖ్యాతలేఖకులగు కవికొండలవారి పీఠికయు నిందుఁ గలదు. ౧౩౪ పుటలు, డెమ్మీసైజు వెల ౦-౧౨-౦. వలయువారు సరస్వతీగ్రంథమాల, కాకరపఱ్ఱు అని వ్రాయవలయును.

—నూ. కృ.

౨౦. వ్యాకరణబోధిని

(౧, ౨, ౩ భాగములు)

ఉభయభాషాప్రవీణ ప్రతాప రామకోటయ్యగారిచే పాఠశాలలయందు నూతనముగ నియమింపఁబడిన ప్రవేశపరీక్షాప్రణాళికకు సోపానప్రాయముగ నుండునటుల వ్రాయఁబడినవి. ఈ వ్యాకరణములు ౧, ౨, ౩ ఫారములలోఁ జదివెడి బాలబాలికల యుపయోగార్థము లిఖింపఁబడినవి. ౧-వ భాగము వర్ణములు, అందలి అజ్ఝల్విభాగములతోఁ బ్రారంభింపఁబడి వాక్యపరిచ్ఛేదము దనుక విస్తరింపఁబడినది. విశేషించి రేఫము అను శీర్షికక్రింద సాధుశకటరేఫల వ్యత్యాసాదులు ఉదాహరణపూర్వకముగ బాగుగ వివరింపఁబడుట యభినందనీయము. వాక్యపరిచ్ఛేదమునందు వు, వూ, వో, వోలతోడి పదప్రారంభముల విషయమైన దోషములు స్పష్టముగఁ జెప్పఁబడినవి. ౨-వ భాగమునందు సమాసములు, కళాద్రుతప్రకృతికములు, సంధులు వివరింపఁబడినవి. ఇందలి సూత్రములు విశేషించి బాలవ్యాకరణానుసృతములే యయ్యు నటువలె జటిలములు గాక తేలికగ బోధపడుచున్నవి. ధాతుప్రకరణమునందుఁ బ్రేరణార్థకములు, తద్ధర్మాదికాలములు

విశేషముగ వ్రాయఁబడియున్నవి. 3-వ భాగమునందు దత్సమము తేర్పడు విధము సంస్కృతాంధ్రసంధివివరణములు, ధాతువులలోని యకారమునకు వకారము వచ్చుట యిత్యాదులు స్పష్టపఱుపఁబడినవి. అన్ని విషయములు నీమూడుభాగములందును స్పష్టపఱచుటయె గాక అభ్యాసము అను శీర్షికక్రింద నాయా ప్రకరణములయందలి విషయములు బాలబాలికలచేఁ దిరుగఁ జెప్పించునట్లు సిద్ధపఱచియుంచుట యీవ్యాకరణము నం దొకక్రొత్తవిషయము. ఏతద్గ్రంథరచయిత లీవఱలో నున్నతపాఠశాలావిద్యార్థులకుఁ గ్రొత్త ప్రణాళిక ననుసరించి యొక వ్యాకరణము వ్రాసిరి. అది విద్యార్థుల కెంతయు నుపయోగకరమై ప్రసిద్ధినందినది. ఇపుడు తక్కినతరగతులవారి కందుబడిలోనుండు నట్టిభాగముల రచించి చాలవఱకు సంపూర్ణవ్యాకరణమును రచించినవారైరి. ఇంకను ఎలిమెంటరీతరగతులకు తగు సుబోధకవ్యాకరణమునుగూడ నొక దానిని రచియించి తమకుఁగల నిరంతరవిద్యాభిరుచిని సాహితీగరిమను జూపి యితోధకమగు ప్రశంసాపాత్రులగుదురుగాక! తాము హైస్కూలునం దాంధ్రోపాధ్యాయులుగ నుండుటచే బాలకుల కెట్టిదియగు వ్యాకరణజ్ఞాన మవసరమో దాని నెఱింగి విశేషానుభవముగడించి యనేకపూర్వవ్యాకరణగ్రంథములఁ బరిశీలించి శ్రమపడి వ్రాసిన యీ వ్యాకరణబోధనలను విద్యాశాఖాధికారులు పాఠశాలలం దుపయోగించునట్లనుగ్రహించి యేతద్గ్రంథకర్తను ప్రోత్సాహపఱతురుగాక. ఒక్కొక్కభాగము వెల ౦-౪-౦ అణాలు. క్రౌనుసైజు. వలయువారు సుందరరాం అండు సన్సు, తెనాలి అని వ్రాయవలెను. —మా. కృ.

౨౧. భక్తాగ్రేసరుఁడు

ధ్రువునిచరిత్రమే యీపేరున వచనరూపమున సులభమగుశైలిలో శ్రీయుత నూకల సూర్యనారాయణమూర్తిగారిచే వ్రాయఁబడినది. వీరు వయసునఁ జిన్నయయ్యు విద్యాభ్యాసముచేయుచు నాంధ్రభాషాయోషపై మక్కువగల్గి తద్భాషాసేవచేయుచుండుట ముదావహము. ఈ పుస్తకముపై పలువురుపండితులు మంచియభిప్రాయముల నిచ్చిరి. ఇం దాఱు ప్రకరణములుగలవు. ధ్రువుని తపోనిష్ఠ మొదలగు ఘట్టములయందుఁ గండ్లకుఁ గన్పడురీతిని వర్ణింపఁబడినవి. డెమ్మీసైజు ౪౮ పుటలు. వెల ౦-౮-౦ అణాలు. వలయువారు గ్రంథకర్తపేర రామారావుపేట, పెద్దాపురము వ్రాసినఁ బడయఁగలరు. —మా. కృ.

౨౨. శ్రీకృష్ణస్తవరాజము

శ్రీయామిజాల పద్మనాభస్వామిగారిచే రచియింపబడినది. శ్రీరామగ్రంథమాలలో తొలిప్రచురణము. ఇందలిపద్యములు భక్తిభరితములుగా నున్నవి. ఈగ్రంథము శ్రీయుత శొమ్మనమంచి జోగయ్యశర్మగారిచే సంస్కరింపబడినది. విజయనగరమహారాజసంస్కృతకళాశాల ప్రధానాంధ్రపండితులగు బ్రహ్మశ్రీ ఆకుండి వేంకటశాస్త్రిగారీగ్రంథమునకు పరిచయవాక్యములు వ్రాయుచు నిట్లు తెలుపుచున్నారు: 'ఈగ్రంథకర్త కవితయందును, వయసునందును బ్రారంభావస్థలో నున్నవాఁడయ్యు గణితోత్సాహ మెంతయుఁగలిగి కొంతవఱకు ధారాళముగను నిర్దుష్టముగను వ్రాసినందుల కెంతయు సంతసింపఁదగియున్నది'' పదియు నెనిమిదేండ్ల యువకుఁడగు ఈకవి భావిరచనములు రసోదంచితములై వెలయఁగలవని నమ్ముచున్నాము. శైలి తెలియుటకై 'శ్రీకృష్ణస్తవరాజము' నుండి ఒకపద్యము నిచ్చుట నుదాహరించుచున్నాము.

ఉ. బంగరుగిన్నెలోఁ బెరుఁగు పాలును
బువ్వయుఁ బెట్టగాఁ యశో
దాంగనగాను, కౌగిటుల నర్పణ
సేయఁగ రాధఁగాను, ని
న్నుంగని యాటలాడుటకు నోచిన
దేవకిఁగాను నన్ను నె
ట్లుం గరుణింపవో కద, జనుండను
నందకుమారశేఖరా!

డెమ్మీసైజున ౨౦ పుటలు. గ్రంథకర్తపేర విజయనగరమునకు వ్రాసినబడయుగలరు.

౨౩. మహేశా

విశాఖపట్టణమునందలి వేంకటవీరరాజకవులచే రచియింపబడిన కందపద్యముల శతకము. 'వైశాఖపురనివేశ! మహేశా!' అనుమకుటము. చిన్నసైజున ౨౨ పుటలు. వెల ఒకఅణా. ప్రతులకు శ్రీయుత పూసర్ల నారాయణమూర్తిగారు, కొత్తపేట, విశాఖపట్టణము అని వ్రాయవలెను. మచ్చునకొకపద్యము.

క. నినుఁబోలిన పరమాత్ముఁడు
  కనరాఁగ నినుఁబోలు దీనుఁడెందునులే రా
  ఘువతగని ప్రోవుమంటిని
  వినవే, వైశాఖపురనివేశ! మహేశా

౨౪. మల్లికార్జునరాయశతావళి

కృష్ణాజిల్లా అంగలూరు వాస్తవ్యులగు బాలకవి కోగంటి దుర్గామల్లికార్జునరావుగారిచే రచియింపబడినది. వేమన, చౌడప్పపద్యములవలె 'మల్లికార్జునరాయ' అనుపదము అంతమునవచ్చునట్లు చెప్పిన కందపద్యములు. చిన్నసైజున ౮ పుటలు వెల రు ౦-౧-౩. మచ్చునకొక పద్యము.

క. కలిమిబిహీనుని కాఁదని
  తలకొనగా నడుమునట్టి తిగినసహోదరుం
  బలవలదని చుట్టములు
  గలిగినఫలమేమి మల్లికార్జునరాయ!

౨౫. శాకాహారప్రయోజనము

మదరాసు శాకాహారసంఘమువారు ఆంగ్లమున ప్రచురించిన గ్రంథమునకు ఇది అనువాదము. అనువాదకర్తలు శ్రీమండా వేంకటనరసింహారావుగారు. ఆదిమ మానవులు శాకాహారులనియు, శాకాహారము శరీరబలకారకమనియు; మాంసాహారము రోగకారకమనియు నిరూపించుచు ఇందు ప్రవీణుల అభిప్రాయములు క్రోడీకరింపబడినవి. శాకగూరలనుగూర్చి విశేషవివరణముగల ఇందలిపుటలు ప్రత్యేకముగ చదువదగినవి. శైలి సులభము. ఆరోగ్యకాములగు వారెల్లరును చదువవగు గ్రంథము. డెమ్మిసైజున ౫౬ పుటలు. వెల రు ౦-౪-౦. పుస్తకములు దొరకుచోటు: రావుసాహేబ్ యం. వి. అప్పారావు పంతులుగారు, వెంకటేశ్వరస్వామి గుడివీథి; బరంపురము, గంజాంజిల్లా.

౨౬. గుంటూరుజిల్లా ఖద్దరుసంఘపు వేదిక

శ్రీగౌతమాసత్యాగ్రహాశ్రమసంస్థాపకాచార్యులగు డాక్టరు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యముగారి అధ్యక్షతను ౨౧-౮-౧౯౩౩ న జరిగిన గుంటూరుజిల్లా ఖద్దరుసంఘము ప్రథమవార్షికోత్సవమున సమర్పించిన నివేదికము ౧౯౩౧-వ సంవత్సరము ౨-వ అక్టోబరుకు సరియైన ప్రజోత్పత్తినామసంవత్సర భాద్రపదబహుళ పంచమి శుక్రవారము మహాత్ముని జన్మదినమున జనన మొందిన గుంటూరుజిల్లా ఖద్దరుసంఘమువారి క్రమాభివృద్ధిని ఈ నివేదిక తెలుపుచున్నది. ఖద్దరుధరలు తగ్గించుటలో ఈ సంఘమువారుచూపినశ్రద్ధ ప్రత్యేకముగ ప్రశంసింపదగినదియున్నది గ్రామాదులలోనుండు ప్రజలు ఖద్దరు తమంతటతామే తయారుచేయించి కావలసినంతవఱకు తాముంచుకొని మిగిలినదానిని బస్తీలనిమిత్తము పంపునట్లు చేయుట; ధనికులగు మధ్యవర్తి యొక్క పెట్టుబడిలో నిమిత్తములేకుండ నూలువడుకువారును, నూలువడుకువారును, నేతనేయువారును తామే భాగస్వాములై ఈ పరిశ్రమను నడుపునట్లుచేయుట ఈ సంఘమువారి ఇతరాశయములు: దేశసేవకరోద్యమములయందు గుంటూరుమండలము ఆంధ్రమండలములలో చిరకాలముగా పురోగాములైయున్నది. ఈఖద్దరు సంఘము గుంటూరుమండలముయొక్క ఇట్టి కీర్తిని పెంచుచున్నది.

౨౭. హరిజనసమస్య

నేటితెలుగుభాషలో-ఆర్థిక, సాంఘిక, రాజకీయ, చారిత్రక, శాస్త్రామికవిజ్ఞానము అభివృద్ధిగావించు-ఉత్తమగ్రంథములు ప్రచురించు ఉత్కృష్టాదర్శముతో ప్రారంభింపబడిన జాతీయగ్రంథమాలలో నిది మూడవ కుసుమము. నేడు భారతప్రపంచమును కలుగుండు వెట్టుచున్న హరిజనసమస్యనుగూర్చిన గ్రంథమగుట నిది వెంటనే విశేషప్రచారముచెందునని నమ్ముచున్నాము. రచయిత: శ్రీనండూరి వేంకటకృష్ణమాచార్యులుగారు, బి. ఏ. హరిజనుల పుట్టుపూర్వోత్తరములు; భారతదేశ


మునందలి వివిధభాగములందలి వారిస్థితి; కాంగ్రెసు: హరిజనులు; హరిజనులనుగూర్చి మహాత్ముని యంగ్ ఇండియావ్యాసములు; వారికొఱకు మహాత్ముని ప్రథమ ప్రాయోపవేశదీక్ష; రెండవయుపవాసము; ఈయుపవాసముల ఫలితములు ఈగ్రంథమున విపులముగ వివరింపబడినవి. మంచిప్రబోధమును పుట్టింపజాలిన గ్రంథము. ఆంధ్రనాయకమణియు, సుప్రసిద్ధవక్తయు, హరిజనోద్యమప్రచారదీక్షాబద్ధకంకణులునగు శ్రీచెరుకువాడ వేంకటనరసింహముగారు ఈగ్రంథమునకు పీఠిక వ్రాసియున్నారు. పలుగ్రంథముల సాయమున రచియింపబడి నాయకమహాశయుల పలువురి ఉపదేశకవాక్యములతో కూడియున్న ఈ పుస్తకమువలన బోధలాభమును ఆత్మరాస్యులగు ఆంధ్రులెల్ల పొందుదురుగాకయని కోరెదము. క్రౌనుసైజున ౩౭౬ పుటలు. వెల రూ ౧-౦-౦. చిరునామా: భారతీనికేతనము: కాకినాడ.

౨౭. మానవస్వత్వములు

సుప్రసిద్ధస్వాతంత్ర్యవాదియగు థామస్ పెయిన్ రచియించిన గ్రంథములలోనికెల్ల ఉత్కృష్టమైనదగు 'రైట్సుఆఫ్ మెన్' అనుదానికిది అనువాదము. మూలగ్రంథము ౧౭౯౧ లో రచియింపబడెను. అత్యల్పకాలముననే ఈగ్రంథముయొక్క ప్రతులు లక్షలకొలది అమ్ముడుపోయెను. ఇది యూరపునందలి వివిధములగు భాషలలోనికి అనువదింపబడియుండెను. దేశస్వాతంత్ర్యమునకై తపస్సుజరుగుచున్న ఈ దీక్షాదినములలో స్వాతంత్ర్యప్రియుడగు థామసుపెయిన్‌యొక్క ఈ సుప్రసిద్ధగ్రంథము తెనగునారి కందియబడుట యెంతయు మెచ్చుకొనదగినది. ఈగ్రంథముయొక్క అనువాదకులు వడ్లమూడి గోపాలకృష్ణమూర్తిగారు సంఘము-నాగరకత; ప్రకృతిరప్రభుత్వములు-వానిపుట్టుక; ప్రజాప్రభుత్వములు- అప్రజాప్రభుత్వములు; రాజ్యనిర్మాణములు ఇందువర్ణితములు. శైలి సులభసుందరముగనుండుటచే పుస్తకము కథవలె చదువనైయున్నది. చిన్నచిన్న వాక్యములు. మిక్కిలి పటుత్వముగలిగియున్నవి. చూడుడు: "ప్రభుత్వము నెల్లపుడును పరిణతదశయందుంచును. దానికి పసితనములేదు. ముదుకందనమురాదు. ఊయెలలనది దిగద్రొక్కినది. పోటికట్టెలగతి దానికంట్టదు. నిత్యనూతనయౌవనమున వన్నెమీఱుచుండును. విజ్ఞానమును అధికారమును చీలదీయదు. వ్యక్తిలోపములకందావులేదు." వ్యక్తిత్వముగల ఇట్టిశైలితో గూడియున్న గ్రంథములు తెలుగున మిక్కిలియరుదు. ఆంధ్రవిశ్వవిద్యాలయాధికారు లిట్టిగ్రంథములను పాఠ్యగ్రంథములుగానుంచి ఆంధ్రవిద్యార్థులకు ఇందలి క్రొత్తశైలి యొక్కపద్ధతులను పరిచయము చేయవలసియున్నది. గ్రంథముద్రణము సుందరముగనున్నది. క్రౌనుసైజున ౬౦ పుటలు వెల రు. ౦-౪-౦ మాత్రమే. వలయువారు గ్రంథకర్తపేర తెనాలి వ్రాయునది. జిగిగల శైలికి నోచిపుట్టిన శ్రీగోపాలకృష్ణమూర్తిగారు మఱికొన్నిగ్రంథములను రచియించి తెనుగుతల్లికి కానుకలర్పింతురుగాకయని కోరెదము. త్యాగధనులగు దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుగారికీ ఉత్తమగ్రంథము కృతినందుట పేర్కొనదగియున్నది.

౨౮. నాప్రభువు

శ్రీగౌరాంగుని అపరావతారమగు శ్రీ హరినాథబాబాజీ పవిత్రచరిత్రమును 'నాప్రభువు' అను శీర్షికతో ఈగ్రంథమున సోదరి సౌభాగ్యవతి వీరపనేని సత్యవతమ్మగారు ప్రదర్శించిరి. ఆస్తిక్యభావసంపన్నులును, ఆంధ్రపత్రిక సహాయసంపాదకులునగు శ్రీవెదురుమూడి శేషగిరిరావుపంతులుగారీగ్రంథమునకు విపులమగు పీఠిక వ్రాసియున్నారు. శ్రీహరనాథుని దివ్యలీలలిందు చక్కగ వర్ణింపబడినవి. 'ప్రేమమూర్తి' అను ప్రకరణము ప్రత్యేకము పఠింపదగినది. ప్రభువచనములు, ప్రభుప్రసంగములు, ప్రభువు ఉపదేశములు అను తుది మూడుప్రకరణములును చదువువారికిహృదభారయుమెంతయోతగ్గి నూతనోత్తేజము కలుగుననుట సత్యము. ఈ చిన్నపొత్తము వలన కలుగు ఆదాయమంతయు ప్రభుసమాధిమందిరనిర్మాణమునకు గ్రంథకర్త్రి యర్పింప సంకల్పించినది. గ్రంథము క్రౌనుసైజున 100 పుటలు, వెల రూ ౦-౪-౦ దొరుకుచోటు: పి. ఆర్. దాస్ గారు, శ్రీహరనాథతత్వప్రచారిణీసభ, ఆంధ్రశాఖ, సూర్యారావుపేట, కాకినాడ.



దుర్గాలయమున

[శ్రీ వరదా వేంకటరత్నముగారి త్రివర్ణ చిత్రమునుండి ఎత్తబడినది.]

ఆంధ్రభూమి

✤


ఎందరెందరో ఘనసుధాస్యంది లేఖ
నుల తెనుగుసీమ ధనధాన్యనిలయమనుచు
వ్రాసిరేకాని; నే డది వ్యర్థమయ్యె!
కడుపు కాలెడివారల గాంచుకతన.

ఎందరెందరో రుధిరనిష్యంది లేఖ
నుల తెనుగుసీమ యోధసంకలితమనుచు
వ్రాసిరేకాని; నే డది వ్యర్థమయ్యె!
వీరు డొకడును కలుగని కారణమున.

ఎందరెందరో వరమధుస్యంది లేఖ
నుల తెనుగుసీమ ప్రణయమండలమటంచు
వ్రాసిరేకాని; నే డదివ్యర్థమయ్యె!
ప్రణయతత్వమెన్న తెలియని ప్రకృతియగుట.

✤

—స్థానాపతి రుక్మిణమ్మ.



వలపు

పుస్తకాలలో ఉన్న నాయికానాయకులకేగాక, మెదడు, శరీరావయవాలు సవ్యంగాఉన్న ప్రతి మనిషికీ యీడువచ్చిన పిమ్మట వలపంటే యేమిటో కొంతవరకు అనుభవమవుతుంది. మహాకవుల నాయికలవలె ప్రతీఆడదీ విరహవేదనలో మన్మథుణ్ణీ, చంద్రుణ్ణీ, గాలినీ, పిట్టల్నీ నోరుతిరగని సమాసాలతో తిట్టి, చెలికత్తెలను కొట్టి, జుట్టుపీకుకొని, ఒళ్లు రక్కుకొని, మెడలోనిహారాలు తెంచేసుకొని, కాంభోజీరాగంలో వెక్కి-వెక్కి యేడవకపోవచ్చు; ఉద్యానవనాలలో ఉండే లతలతో ఉరిపోసుకోకపోవచ్చు. ప్రతీమగవాడూ కథలలోని రాజులవలె నిద్రాహారాలు మానివేసి, కలలో కనిపించిన కన్యాలలామకోసం మహారణ్యాలకుపోయి తపస్సులుచేయలేకపోవచ్చు; వలపు తీవ్రత కోర్వలేక కత్తితో కంఠంకోసుకొనో, విషం త్రాగో, చావడానికి సాహసించలేకపోవచ్చు. కాని ప్రతీమనిషికీ ప్రేమతత్వం ఏదోవిధంగా తెలియరాక మానదు.

అయితే లోకంలో చాలామందికి తమ అనుభవాలెట్లాఉన్నా, వలపునుగూర్చి అభిప్రాయాలుమాత్రం మహావిపరీతంగా ఉండడానికి కారణం బహుశః కవుల తలతిక్క వ్రాతలేనేమో ! దేనినైనా సరే, మసిపూసి మారడికాయ చేయగల సమర్థులు కవులు. జంతువులు, పిట్టలు, కీటకాలు సహితం అనుభవించి తెలుసుకోగల చెప్పప్రేమను మహా అపురూపమైన వస్తువుగావర్ణించి దానికి తమ ఊహాశక్తివలన లేనిపెన్నో అర్థాలుకల్పించి, లోకంతో సంబంధంలేక ఏకాండగుహలోనో ముక్కు-మూసుకొని మూడవనేత్రంతో సర్వమూ తిలకించగల మహాఋషులకును, కల్పితకథలద్వారా నిజాన్ని అబద్ధంగాను అబద్ధాన్ని నిజంగాను చెయ్యగల ఊహాజ్ఞానసంపన్నులను కవిపుంగవులకును తప్ప, సామాన్యులకది యెంతమాత్రమూ తెలియరాని రహస్యమని బోధిస్తూవుంటారు !

చెప్పు ప్రభావంవలన స్త్రీపురుషులకు ఒండొరుల యెడల జనించే అనురాగమే వలపు. దీనినే ప్రేమ, మోహం, మనసుల కలయిక, కామం, మన్మథవికారం, మమత యిత్యాది పేర్లతో వ్యవహరిస్తారు జనులు. వలపులో సుఖం దుఃఖం, అభిమానం యీర్ష్య, పశుత్వం దేవత్వం, స్వార్థం స్వార్థత్యాగం, మంచి చెడ్డ- అన్నీ లీనమైఉంటాయి. తెల్లని సూర్యకాంతిలో యింద్రధనస్సు రంగులన్నీ యిమిడియున్నట్లు వలపులో దయ, ద్వేషం, భక్తి, భయం మొదలైన గుణాలెన్నో బీరడపడుతూ ఉంటాయి, పరిస్థితులను బట్టి.

ప్రేమ అనేమాటకు వాడుకలో అనేక అర్థాలు ఉంటున్నాయి. మాతృప్రేమ, బంధుప్రేమ, దేశప్రేమ

దైవప్రేమ మొదలైనవి పెళ్ళితో సంబంధంలేనివి. ఇక పెళ్ళితో సంబంధంఉన్న ప్రేమలోకూడా ముఖ్యంగా రెండురకాలు ఉన్నాయి. శరీరసంపర్కవాంఛ ప్రధానంగాగల ప్రేమ ఒకరకం. దీనినే కామమనీ, పశుప్రేమమనీ అంటారు. శరీరభోగాలతో జోక్యంలేని ప్రేమ రెండోరకం. ఇది కేవలం మానసికమనీన్నీ, మిక్కిలి పవిత్రమైనదనీన్నీ చెప్తారు. వలపులో నిజంగా యీరెండురకాల ప్రేమలూ విడదీయడానికి వీలులేకుండా ఐక్యమైఉంటాయి.

ప్లేటోనిక్ ప్రేమ అనేది కథలలో సహజంగానే కనిపించవచ్చును గాని మానవప్రకృతికి విరుద్ధమేమో అనిపిస్తుంది. వలపుగలచోట శరీరసౌఖ్యాపేక్ష ఉండక తప్పదు. అయితే, ప్రేమించుకునే వాళ్ళకందరికీ అట్టి సౌఖ్యాలు లభించక పోవచ్చును; కోర్కెలు తీర్చుకుందుకు తగిన అవకాశాలు లేకపోవచ్చును; కోర్కెలు, అవకాశాలుకూడా గలవారు యింద్రియనిగ్రహంవలన తమ శరీరవాంఛల నణచుకోవచ్చును. కాని, ఇంద్రియసుఖవాంఛారహితమైన వలపుమాత్రం అసహజం!

అట్లే శరీరసంబంధం ఉన్నచోట వల్లా తప్పకుండా ప్రేమ ఉండితీరాలని తలచడంతప్పు. స్త్రీపురుషులిద్దరు ఎట్టిప్రేమయూ లేకనే శరీరసంపర్కం కలిగిఉండవచ్చును; బిడ్డలనుకూడ కనవచ్చును. ఇట్టినడత కడు హీనమైనదే అయినా, అస్వాభావికంమాత్రం కాదనడానికి మానవసంఘంలోగల వేశ్యావృత్తి ఒక గట్టి నిదర్శనం.

స్త్రీపురుషు లిద్దరికీ శరీరసంబంధమాత్రమైన ఐకమత్యం యేర్పడినప్పు డది తుచ్ఛమగు కామమనీన్నీ, మనసుల కలయికమాత్రం సంభవించినప్పు డది పవిత్రమగు స్నేహమనీన్నీ, మనోతనువుల రెండిటి బాంధవ్యమూ చేకూరినప్పు డది ప్రేమమనీన్నీ చెప్పుకుంటారు, సాధారణంగా. కాని తరుచుగా కామంలో స్నేహం, స్నేహంలో ప్రేమ, ప్రేమలో కామం కలసి పొడగడుతూ ఉంటాయేకాని, వేని కది విడిగా విశదపడదు. కాబట్టే ప్రియులచేష్టలు యితరుల కప్పుడప్పుడు ఏమీ అర్థం కాకుండా, విపరీతంగా కనబడతాయి.

స్త్రీపురుషులిరువురికి అన్యోన్యానురాగం కలగడానికి నిజమైనకారణం నిర్ణయించడం పైవాళ్లకు సులభసాధ్యమగుపనికాదు. ఒక్కొక్కప్పు డాప్రియులకే తెలియదు, తామెందుకు ప్రేమించు కొంటున్నారో. సాధారణంగా మన ప్రబంధాలలో ఉదహరింపబడే ప్రేమ 'తొలిచూపువలపు'. నాయికానాయకులలో నూటికి తొంభైమంది ఒండొరుల రూపలావణ్యాలు చూసుకొని మోహించుకున్నవాళ్ళే! అతని తనూవిభవం చూసి ఆమె, ఆమె సొగసుందనంచూసి అతడు, వలచుకుంటారు. రూపా లెట్లాఉన్నా, కొంత పరిచయంపైని ఒకరి గుణాలు చేష్టలు ఒకరు అర్థం చేసుకొని ప్రేమించుకున్నవాళ్లుకూడా ఉన్నారు. —ఒథెల్లో, డెస్డిమోనా వంటివాళ్లు. ఇక రూపం, గుణం, నడవడిక, ఏదీ చూసుకో నవసరంలేకుండా వలచుకో గలవాళ్లు లేకపోలేరు—హంసదంపతులవంటి అమాయకులు!

ఇతరకారణా లింకా ఎన్నిఉన్నా, ముఖ్యంగా రూపం, యౌవనం వలపును పుట్టించడానికి బలమైన హేతువులని చెప్పకతప్పదు. అందుకనే కవులు తాము చిత్రించే నాయికానాయకులలో ఎవరినీ అందహీనులగాను, వయసుమీరిన వారిగాను చేయరు. శృంగారమనేది యౌవనంలోఉన్న సుందరాంగులకే వర్తిస్తుంది కాబోలన్నట్లుంటాయి, పుస్తకాలలో కథలు!

పెళ్ళి ఆకర్షణకు నిజంగా రూపం ఎంతసహాకారో, క్రొత్తదనంకూడా అంతసహాకారి. క్రొత్తవాళ్ళను చూసినప్పుడు మనసు చలించినట్లు చిన్ననాటి పరిచయులనుచూసినప్పుడు చలించదు. ముఖ్యంగా రక్తసంబంధంగల దగ్గిర చుట్టాల పట్ల కామేచ్ఛ బొత్తిగా ఉండదు. పక్షులలోను, మచ్చికజంతువులలోను కూడా యీచిత్రమే పొడగడుతుంది. చిన్నప్పటినుండీ ఒక్క గూట్లోనే పెరిగిన పావురాలు ఎన్నడూ కలియవు. తేనెటీగ తమనివసించే పట్టులోని యీగల కొరకు దేవులాడక, పైచోట్లకు ఎగిరి సంబంధం కుదుర్చుకుంటుంది. ఒకేపుట్టలో ఉన్న రెక్కచీమలు వాటిలో అవి వలచుకోక, దూరంగా నివసించే చీమలగుంపుతో పరిచయం చేసుకుందుకు ప్రయాణాలు చేస్తాయి.

అమెరికా, యూరప్ వంటి దేశాలలో ఒకేతరగతిలో కలిసి చదువుకునే బాలురు, బాలికలు సాధారణంగా పెండ్లాడుకునేందుకు యిష్టపడరట. సగోత్రీకులకు వివాహబాంధవ్యాలు నిషేధించిన హిందూధర్మశాస్త్రవేత్తలకు యీరహస్యం తెలుసు!

వెలుతురు, వేడిమి, విద్యుచ్ఛక్తి మొదలైనవాటి వలె వలపొక బాహ్యశక్తికాదు. ఆకలి, తలనొప్పి వంటి శరీరబాధయూ కాదు. ఇంద్రియానుభవాల వలన మొదట జనించి, పిదప మనసులో స్థిరపడి, క్రమంగా మెదడునుకూడ వశపరచుకోగల దారుణమహిమ కలది, అది. పంచేంద్రియాలలోను చూపు మిక్కిలి చురుకైనది కనుక, ప్రేమ నంకురింపజేయుటలో దానికి గల సామర్థ్యాలు మరిదేనికీ లేవు. కళ్ళకుగల యీ దారుణశక్తికి వెరచి కాబోలు మానవసంఘంలో కొందరు ఘోషాపద్ధతిని విధించుకున్నారు తమస్త్రీలకు! హిందూవిధవకు సంఘంవిధించిన పాడుముస్తాబుకూడా పురుషదృష్టికి వెరచియే నేమో!

మొదట చక్షుప్రభావంవలన ఉద్భవించిన వలపును మిగతా యింద్రియాలు కొంతవరకు బలపరచగలవు. కాబట్టే ప్రియులు కంటికింపగు ముస్తాబు చేసికొనుటతో తృప్తిపడరు. పువ్వులు, పరిమళద్రవ్యములు విరివిగా వాడతారు. కమ్మని మిఠాయిలు భుజిస్తారు. జిలిబిలి పలుకులతో సంభాషించుకుంటారు. పాడుకుంటారు. నృత్యంచేస్తారు. ముద్దులాడుకుంటారు. కౌగలించుకుంటారు. కరుచుకుంటారు. పిచ్చిపిచ్చి పనులెన్నో చేస్తారు. పంచేంద్రియాలకూ పరవశత్వం వస్తేనేగాని వాళ్ళకు తనివి తీరదు.

వలపును జనింపజేయుటలోను, జనించిన వలపును వృద్ధిపొందించుటలోను, ఒక్కొక్కప్పు డొక్కొక్క యింద్రియం ప్రాముఖ్యత వహిస్తుంది. ప్రియురాలి అనుగ్రహం సంపాదించడానికి ఆమెనిద్రించే గది కిటికీవద్ద చేరి, ఫిడేలో వీణో వాయిస్తూ పాడేవాడట, పూర్వకాలపు ఐరోపాప్రియుడు! పిల్లనగ్రోవి ఊది గొల్లకడుచులను వశపరచుకునేవాడట శ్రీకృష్ణుడు. గానం, వాయిద్యం, సంభాషణ, ఏడుపు, నవ్వు మొదలైనవి కర్ణేంద్రియాన్ని రంజింపజేసే సాధనాలు. ఇక ఘ్రాణేంద్రియాన్ని మెప్పించి, ప్రేమను పెంపొందచేయగలవి పువ్వులు, మంచిగంధం, పన్నీరు, అత్తరు, కస్తూరి మొదలైనవి. ప్రియుల నొక్కొక్కప్పుడు కొన్ని కొన్ని వాసనలు ఉర్రెత్తించగలవు! యోజనగంధిని ఆమె ఘుమఘుమకు వలచినాడట శంతనమహారాజు! అట్లే తియ్యని మిఠాయిలు, కమ్మనిపిండివంటలు, పండ్లు, పాలు, తేనె, సారాయిలు జిహ్వేంద్రియం ద్వారా మోహోద్రేకాన్ని స్ఫురింపజేసి వృద్ధిచేయగలవు. వలపును సాధించడంలో ఒక్కొక్కప్పుడు స్పర్శేంద్రియం చక్షువుకంటె తీక్ష్ణంగా పనిచేస్తుంది. అయితే తనప్రతాపం చూపెట్టుకుందుకు కంటికిగల అవకాశాలు స్పర్శకు లభించవు, కలసి నాట్యంచేసుకునే సందర్భంలో ఒండొరుల మెడలితాకుడుకు మోహోద్రేకులై దంపతులైన పాశ్చాత్యయువతీయువకు లెందరో ఉన్నారట! తనమొగంతీరుకూ, పాటనేర్పుకూ, మాటతీపికీ, దేనికీ సాధ్యుడుకాక కొయ్యబొమ్మవలె నిల్చున్న ప్రవరుణ్ణి చూసి, కుదకు

"పాంచద్భాణబాణ మూలరుచిలోఁ
బాలిండ్లు పొంగారఁగా
యంచుల్ మోవఁ గౌఁగిలించి యధరంబాసింప-"

సాహసించిందట వరూధిని. ఉగ్గుపాలతో కామశాస్త్రమర్మాలన్నీ నేర్చుకున్న ఆప్రౌఢకు, అతగాడిని లొంగదీయడానికి స్పర్శేంద్రియమే అంత్యసాధనమని తోచింది!

ఇంద్రియసుఖాలు వలపుకెంత అవసరములైనా, కేవలం వాటిపోషణమీదనే ఆధారపడి ఉండదది. అందుకనే ప్రేమకు చంచలస్వభావం ఆరోపించారు పెద్దలు. శరీరం, మనసు, మెదడు ఏకీభవించి కాపాడితేనే గాని నిలవదు వలపు! స్త్రీపురుషు లిద్దరికి ఒకసారి నిజమైన వలపు కుదిరినప్పుడు, ఆప్రేమ స్థిరంగా నిలుస్తుందనీ, ఎన్నిఒడుదుడుకులు వచ్చినా చలించదనీ, వాదిస్తారు కొందరు—విడాకులు, ద్వితీయవివాహాలు, ప్రియులకలహాలు మానవసంఘంలో అరుదైనట్లు! పుట్టుక, పెరుగుట, చావుగల జీవ

ప్రేమకు స్థిరత్వం ఆరోపించడం వెర్రి కాని, ఇంద్రియాల ప్రేరేపణకు లెక్కచేయక, హృదయాన్ని లొంగదీసుకొని, బుద్ధిబలంవలన స్థిరంగా ఒక్కరినే ప్రేమించగలుగుట మానవునికి అసాధ్యంకాదు. పతివ్రతలు, ఏకపత్నీవ్రతులు అట్టి మనోబలంగల ఘనులు.

వలపువిషయంలో అవకతవకగా ప్రవర్తించే వాళ్ళందరూ మెదడుతక్కువవాళ్ళే అని రూఢిపరచగలరు నేటిశాస్త్రజ్ఞులు. మెదడుశక్తిఅంటే పుస్తకాలు చదువుతున్న జ్ఞానమనికాదు. బడిచదువు, పరీక్షలు, శాస్త్రజ్ఞానం—వీటితో సంబంధంలేక, ప్రతిమనిషికీ పుట్టుకతోనే భగవంతు డనుగ్రహించే శక్తి అది! సమానమైన అవకాశాలతో, ఒకేగురువుదగ్గర శిక్ష నభ్యసించిన విద్యార్థులందరూ ఒకేమోస్తరు తెలివితేటలుగల వాళ్ళుగా ఉండకపోవడానికి యిదే కారణం. మనిషికీమనిషికీ, జంతువుకూ మనిషికీగల భేదాలను యేర్పరిచేది యీజ్ఞానశక్తే! వలపు నిలకడలేనిదే అయినా, దానిని వశపరచుకొని, స్థిరంగా ఒకరిమీదనే నిలచేటట్లు చేసుకోవడం మానవునిప్రజ్ఞ. అది వానిమేధాశక్తిని నిరూపిస్తుంది. సంఘానికి కొంత మేలుచేస్తుంది. వానిజీవితానికి శాంతినిస్తుంది.

వలపుకు చంచలస్వభావం ఉండడమే కొంతవరకు మానవుడికి ఉపకరిస్తూఉంది. లేకపోతే, జోళ్ళుకుట్టుకునేవాడు రాజుకూతుర్ని చూసి మోహించి, మనసు మరల్చుకోలేక గుండెపొడుచుకొని చావవలసినదే. వలచినవారిని పొందలేని మనిషికి మరి జీవితంలో ఆనందమనేది ఉండదన్నమాట. దాంపత్యమనేది అర్థంలేని బాంధవ్యమవుతుంది. కలిగినవలపును నిలుపుకుందుకు గాని, మరల్చుకుందుకు గాని మానవుడికి సాధ్యమవుతూ ఉంది గనుకనే, సంఘానికి కొంతగౌరవం, ప్రత్యేకవ్యక్తులకు కొంతచిత్తశాంతి లభిస్తున్నాయి.

కొన్నికొన్ని పరిస్థితులందు కంటికి నచ్చినవాళ్ళను చూసినప్పుడుగాని, పరిచయంగల వాళ్ళతో ముచ్చటించేటప్పుడుగాని, ప్రతిమనిషికీ హృదయంలో అర్థంలేని వెర్రివెర్రికోర్కెలు రగలడం సహజం. అయితే, కొంతఆలోచనాశక్తి, మెదడు అనేవి ఉంటాయి కనుక, కలిగిన ప్రతికోర్కెకూ దాసుడు కానక్కరలేదు మనిషి. వలపును తన చెప్పుచేతలలో ఉంచుకోలేని మనిషిది దుర్బలమైన మెదడన్నమాట!

తెలివితక్కువవాళ్ళను ముప్పుతిప్పలూ పెట్టి, యీడుచెరువుల నీళ్ళుత్రాగిస్తూ ఉంటుంది వలపు. అది మన దేవుళ్ళను, ఋషులనుకూడా కొందరిని పరాభవించి సకలబాధలూ పెట్టింది. ఇంద్రుడు, శంకరుడు, శ్రీకృష్ణుడు, విశ్వామిత్రుడు, పరాశరుడు—వీళ్ళందరూ దానికి లొంగిపోయిన మహానుభావులే! ఇక అల్పప్రజ్ఞావంతులగు సామాన్యజనులు దానిప్రభకు దాసోహమనడంలో అట్టే వింతలేదు. మళ్ళీ జీవరాసులలో కల్లా జ్ఞానవంతుడనని గర్విస్తాడు నరుడు; తుద కిట్లాంటివాటిలో వెర్రికుక్కవలె ప్రవర్తిస్తూఉంటాడు. వలపుమూలాన మానవసంఘంలో నిత్యమూ ఎన్నో ఘోరాలు, అసందర్భాలు జరుగుతూనే ఉంటాయి—ఆత్మహత్యలు, ఖూనీలు, దెబ్బలాటలు, మోసాలు, దొంగతనాలు, యుద్ధాలు, బలవంతంపెళ్లిళ్లు- యిత్యాదులు. అందుకనే, వలపు గ్రుడ్డిదనీ, వలపులోఉన్న వాళ్ళు పిచ్చివాళ్ళకంటె అసందర్భంగా ప్రవర్తిస్తారనీ చెప్తారు పెద్దలు. ఒక్కొక్కప్పుడు దెయ్యంపట్టినట్లు మనిషి నావేశించి, పీడించి, పశువును చేయగలదు వలపు; మహామారివ్యాధివలె బాధించి, ప్రాణాలుతీయగలదు.

అట్లే నరున కిహలోకమందే స్వర్గమిచ్చి, సకలసౌఖ్యాలూకూర్చి, వానిచేత ఘనకార్యాలు చెయ్యడానికి పురికొల్పి, బిచ్చగాని సహితం సింహాసనమెక్కించి, వానిజీవితాన్ని ఆనందమయంగా చెయ్యగలదు వలపు. అల్పుని ఘనునిగాను, లోభిని త్యాగిగాను, వృద్ధుని పడుచువానిగాను, పిరికివానిని ధైర్యవంతునిగాను, బలహీనుని శక్తివంతునిగాను మార్చగలదు. మానవహృదయంలోగల ఔన్నత్యాన్ని పైకితెచ్చి, చెడునడతగల వారిని బాగుపరచి, సంఘానికి ఐకమత్యం, గృహానికి శాంతి నెలకొల్పగలదు. బంధుత్వాలు, స్నేహాలు, వివాహాలు, సంతానాలు వలపుమీదనే ఆధారపడి ఉంటున్నాయి. ప్రేమకొరకు నరుడు తనప్రాణాలనైనా ధారపోయగల త్యాగశీలుడౌతాడు. వలపు అతనిజీవితానికి వెలుగునిచ్చే దివ్యజ్యోతి; ఆత్మకు శాంతినొసగే తారకమంత్రం!

వలపులో మంచి, చెడుగు, రెండూ ఉన్నాయన్న సంగతి గుర్తెరిగి, సాధ్యమైనంతవరకు ఆమంచే సామాన్యుడికి లభ్యమయేటట్లు చెయ్యడానికి యత్నించారు, మన శాస్త్రకారులు. సంఘనియమాలు, వివాహాచారాలు, నీతులు, మతబోధ, అన్నీ యిట్టి సదుద్దేశం గలవే. అనుభవం, పరిశోధనాశక్తి, ఊహాజ్ఞానం మెండుగాగల మహానుభావులు అన్నిదేశాలలోను, అన్నియుగాలలోను యిట్టి సిద్ధాంతాలు నిర్మిస్తునేఉంటారు. అది, అంతము లేని పరిశ్రమ వారిది! ఏమంటే, నేటి జనులకు నిన్నటి శాస్త్రాలు మనస్కరించవు; రేపటి జనులకు నేటి సిద్ధాంతాలు సరిపడవు............

వలపువిషయంలో ధర్మశాస్త్రవేత్తలు విధించిన యేనియమాలూగా తమకు తృప్తికరంగా లేకపోవుటవలన, నేటి రష్యాలో కొందరు "స్వేచ్ఛాప్రేమ"ను అనుసరిస్తున్నారు. అంటే, ప్రకృతిలోగల మృగపక్ష్యాది స్వేచ్ఛాజీవులవలె యిచ్ఛానుసారంగా జనులు వావివరుసలనుకూడ గణించక వలపుసుఖముల ననుభవించుట! ఇది ప్రత్యేకవ్యక్తుల కొక్కొక్కప్పుడు కొంత సదుపాయంగా ఉన్నట్లు కనిపించినా, సంఘానికీ, సంతానానికీ బాధకరంగా ఉంటుందని తోచదు. ఉత్తమజాతి పక్షులు, జంతువులు, సహితం కొన్ని నియమాల ననుసరించి మరీ ప్రవర్తిస్తాయి. చక్రవాకాలు, పావురాలు మనిషికి బుద్ధిచెప్పేటంత నీతితో మెలగుతాయట, తమజోడుపిట్టలపట్ల. ఏకట్టుబాట్లూలేని స్వేచ్ఛాప్రేమ మానవునికి సౌఖ్యప్రదం కాకపోవడమేగాక, యీర్ష్యగుణం మెండుగాగల వాని ప్రకృతికి జాతిగా సరిపడదు. నేటి సాంఘికాచారములలో లోటుపాట్లు పెక్కులుండవచ్చును; ఆచరణలోఉన్న శాస్త్రనియమాలు నవీననాగరికతకు అనుగుణ్యములుగా లేకపోవచ్చును; దేశకాలపరిస్థితుల ననుసరించి సంఘాన్ని సంస్కరించుకొని, మానవుడు తన జీవితాన్ని సవరించుకోవలసినదేకాని, కట్టుబాట్లు లెక్కచెయ్యక, సంఘాన్ని ధిక్కరించి, కళ్ళెంలేని గుర్రంవలె వెర్రిగా పరుగెత్తదలచుట తెలివితక్కువ.

—తాత కృష్ణమూర్తి.

గంగమ్మ

పొంగుతూ వచ్చిందిరా!
గంగమ్మ
రంగుతో మెరసిందిరా!
తరగహస్తాలపై
నురగభూషలు వెల్ల
ఆటలే ఆడిందిరా!
మధురముగ
పాటలే పాడిందిరా!...
కనులపండువు సేయు
కలమకంబళముపై
పగలబడి నవ్విందిరా!
తొలిసంజ
పసిడిలో మెరసిందిరా!...
నువ్వుపువ్వుల చెలువు
నవ్వులో గలియంగ
పూలన్ని కోసిందిరా!
వగలతో
చేలన్ని తిరిగిందిరా!...
అత్తింటి కనిపోవు
ఆడుపడుచును బోలి
పసుపుకుంకుమ లందెరా!
సిగ్గుతో
మిసిమినవ్వులు నవ్వెరా!...
పడుచుప్రాయపుపొంగు
పట్టలే కెదలోన
పరువెత్తి పోయిందిరా!
జలధితో
ప్రణయైక్యమందిందిరా!...

—కందుకూరి రామభద్రరావు.

బొమ్మల పెళ్ళిళ్ళు

౧

ఆరోజు సరోజినికి పర్వదినం. అసిల్లకళ్ళకు సమస్తం ఆనందమయంగా తోచింది. వాళ్ళబావ భైరవమూర్తి గారి మేడ టాజిమహల్లాగుంది. ఇంటిపక్క తోట నందనవనంలాగుంది. తనతో తోటలో షికారు చెయ్యటానికి వచ్చిన సావిత్రి సాక్షాత్తూ దేవకన్యకలాగుంది. ఆరోజున సరోజినికి సావిత్రినిచూస్తే అనురాగంపొంగి పొర్లటం మొదలు పెట్టింది. ఈ ప్రేమావేశం తాత్కాలికమేననీ, పూర్వం ఉన్నదికాదనీ, ముందుండబోదనీ ఆ ఉత్సాహంమీద సరోజినికి తోచటం అసంభవం. దీనికంతా కారణం అప్పుడే ప్రవేశిస్తున్న వసంతఋతువు కాదు, ఆనాడు భైరవమూర్తిగారి శిశువు అన్నప్రాశన.

మీరు సావిత్రినికాని సరోజినినికాని ఇద్దరినీకాని బాగా ఎరిగుండకపోతే ఇద్దరూ కవలపిల్లలని చెప్పినా నమ్ముతారు. నిజానికిమటుకు సరోజిని సావిత్రికి పినతల్లి. సావిత్రి సరోజినికన్న ఏమాత్రమైనా పెద్దదీ, సరోజినికన్న మితభాషికూడా కావటంచేత చూడగానే ఇద్దరిలో కనపడేభేదమేమిటంటే సావిత్రి పినతల్లికంటె గంభీరంగా ఉండేది. అంతకుమించి ఇద్దరిలోనూ ఎక్కువ తారతమ్యంలేదు.

సరోజిని సావిత్రిని తోటంతా తిప్పి ఆఖరుకు తన ప్రాణానికి మంచి పొదరిల్లంటిది కనపడ్డచోటు చూపి ఇక్కడ కాసేపు కూర్చుందామన్నది. ఇద్దరూ ఆకుల కింద కూర్చున్నారు. కొంతసేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూచెప్పి సరోజిని అసలు సంగతి కొచ్చింది.

"అయితే, సావిత్రీ బావ నీపెళ్ళిచేస్తాడుట నిజమేనా?"

సావిత్రి సమాధానంగా పినతల్లినిచూసి నవ్వింది.

"అంతా నిశ్చయమయిందా?"

"అదే నిశ్చయం. ఇంకా తాంబూలా లిచ్చుకో లేదు."

"నీ కాబోయ్యే మొగుడెవరే?"

సావిత్రి చాలా నేర్పరి. ఎటువంటిప్రశ్న కటువంటి సమాధానం.

"ఎరగవుటే? మామయ్య ఇక్కడ చదువుకునేటప్పుడు వస్తూండేవాడే—రాధాకృష్ణమూర్తిని!"

"నాకు బాగా జ్ఞాపకంలేదు...అయితే నీకీసంబంధం ఇష్టమేనా?"

"ఎందు కిష్టంకాదు?"

సరోజిని తనావిషయం మాట్లాడదలుచుకున్నది అయిపోయినట్టు సన్నగొంతుతో ఏదో మంగళహారతి ఎత్తిచప్పున ఆపి "ఇప్పు డీసంబంధం కాకుండాపోతే?" అన్నది.

"ఏమిటి?"

"నిన్ను—ఆ అబ్బాయికిచ్చి—ఆయన పేరేమిటి?—ఆయనకిచ్చి చెయ్యరనుకో."

"పోనీ!...అయినా ఎందుకు చెయ్యరు?"

"ఇంకొకరి కిచ్చిచేస్తే?"

"ఇంకో రెవరు?"

"అన్నయ్యకిస్తే?"

సావిత్రి నవ్వి "తాతయ్య కిష్టంలేదుగా?" అంది.

"తాతయ్యసంగతి కాదిప్పుడు! నీసంగతి చెప్పు!"

"ఏమో! నాకంత యిష్టంలేదు సుమా. మామయ్య ఎప్పుడూ మేనకోడలిని చేసుకోటం నీతికాదంటుంటాడు. అయినా ఇప్పుడెందు కాఆలోచన?"

సరోజిని సావిత్రి చెయ్యితీసుకుని వేళ్ళుసాగదీస్తూ "ఇవాళ మానాన్న మీనాన్న నడగబోతున్నాడు నిన్ను అన్నయ్య కియ్యమని. నీకింకా తెలీదేమో?" అని సావిత్రి మొహం వంక చూసింది. సరోజిని అనుకున్నట్టు సావిత్రి మొహాన ఏభావం కనపళ్ళేదు. ఇంత రహస్యం చెప్పినా సావిత్రి చలించకపోవటంచూసి సరోజినికి ఉత్సాహభంగమైంది. ఇద్దరూ కొంతకాలం మౌనంగా కూర్చున్నతరువాత సరోజిని పోదామంటూ లేచింది.

"కాస్సేపు కూర్చోవే అబ్బ! ఇంట్లో ఏముంది?" అన్నది సావిత్రి.

"ఇంకా అడుగూ బొడుగూ కాఫీ ఉందేమో తాగి ఇప్పుడేవస్తా. లేకపోతే మంచినీళ్లైనా తాగుతా. ఏం చేస్తాం!" అంటూ చెయ్యివదలించుకుని సరోజిని ఇంటివైపు పరిగెత్తింది.

సరోజి వెళ్లింది, సుందరం ఇటొచ్చాడు. అతను వెనకనించి సావిత్రిని సమీపించి "ఇక్కడున్నావుటే అమ్మాయీ? అమ్మ నీకోసం వెతుకుతూంటేను...ఓసీ! నువ్వేటే! కోడలా" అంటూ సావిత్రి పక్కనే కూలబడి ఒకచేత్తో సావిత్రిని దగ్గిరికి తీసుకున్నాడు.

"నీపెళ్లైప్పుడే, పెళ్లికూతురా! రాధాయి కంట కడుతున్నా సూ నిన్ను! మంచివెధవ. నీకు మాంచిమొగుడవుతాడు. అలుసుమాత్రం ఇచ్చేవుసుమా! ఒక చెంపనించి తొక్కిపెడితే కాని మాటవినడు. జాగ్రత్త."

"ఏమ్మాటలు, మామయ్యా!"

"ఓసి! నీకెంతసిగ్గే! ఒక్కత్తెవు కూర్చుని మొగుడి విషయం ఆలోచిస్తున్నావేమోనని మంచీ చెడ్డా అడిగితే తప్పా? నే పోతున్నానే!"

"ఉండు! ఉండు! అట్లా అయితే నేనూ పెళ్లివిషయమే మాట్లాడతాను ఒకటి చెప్పు. మేనమామను పెళ్లి చేసుకోవచ్చునా?"

"తప్పు!"

"నేను మరి నిన్ను చేసుకోబోతున్నానే!"

సుందరం సావిత్రి చెంపమీద ఒక్కటిపెట్టి "ఈసారి ఆమాటంటే నీతో మాట్లాడను," అన్నాడు.

సావిత్రి చెంపరుద్దుకుంటూ నవ్వి, "ఈ మాట మీ నాన్న అన్నా ఇదేనా శిక్ష?" అన్నది.

సుందరం ఆశ్చర్యంతో మేనకోడలి వంక చూసి, "నాకింకా తెలీదే! నీతో ఎవరన్నారు?" అని అడిగాడు.

"సరోజిని."

"దాని కన్నీ తెలుసు!...హూఁ! ఆ అయిదువేల కట్నం నాన్నగారి మతిచెడగొడుతున్నది. సంవత్సరం కిందట ఈ విషయం వచ్చినప్పుడు అయినవాళ్లలో కట్నంరాదని చాలయిన వంకలన్నీచెప్పి మనిద్దరికీ ముడిపడకుండా చేశాడు. ఈసారి కాల ఎట్లా తప్పించుకుంటాడు? ఇంకో వెయ్యి ఇస్తామంటే సగోత్రీకుల పిల్లనైనా చేసుకుంటారు నాన్నగారు. ఒక్కపాఠం నేర్చుకో, పిల్లా! నీకెప్పటికైనా పిల్లలుపుడితే విశ్వప్రయత్నంచేసి వాళ్లకు పెద్దవాళ్ళ నెదిరించటంనేర్పు. నాకిన్నేళ్లువచ్చినై, ఇంతచదువు చదివాను! నాన్నగారు రేపు కొండముచ్చును పెళ్ళిచేసుకోమంటే కాదనేటందుకు నాకు ధైర్యంలేదు...మీనాన్న నీకు చనువిచ్చాడుగా! రాధాయినే చేసుకుంటానని పోట్లాడు."

"నేను పోట్లాడను. నాన్న పెళ్ళివిషయం నన్నడగడు, నేను సిగ్గుపడతానని ఆయన నమ్మకం, నేను సిగ్గులేనట్టు ఆయనకెట్లా తెలియచెయ్యటం?

"అహా! ఏం లోకం! ఎవరి పిల్లల మనసు వాళ్ళకు తెలీదు!"

౨

మర్నాడు సావిత్రి పెళ్ళికి ముహూర్తం ఏర్పాటు చేశారు. తాంబూలాలు పుచ్చుకున్నారు. ముహూర్తం ఇరవైరోజుల్లో ఉంది.

ఆసాయంకాలం సుందరం, రాధాకృష్ణమూర్తి కృష్ణ ఒడ్డున ఇసకలో కూర్చున్నారు.

"రాధా! నాపెళ్ళికితప్పక రావాలిసుమా. చెల్లెలిని చేసుకుంటున్న వాడి పెళ్ళి నీకెక్కడ కటస్తపడుతుంది?" అన్నాడు సుందరం దీనంగా.

"అర్థంలేకుండా మాట్లాడతావేంరా, సుందరం? అప్పకూతుర్ని చేసుకుంటున్నవాడివి నువ్వేనేం లోకంలో? నీకుమల్లే అటువంటి పిల్లవస్తుందీ?"

"అటువంటిపిల్ల మాసరోజాం ఒకతె ఉందిగా!"

"ఛీ! అప్రాచ్యుడా! వాళ్ళిద్దరూ ఒకటిగా ఉంటారను కుంటున్నావుకాని, నక్కకూ—ఇద్దరికీ ఎంతో భేదం ఉంది. నాకు సంబంధమే కనపడదు."

"ఇంకేం? నాకు భేదమే కనపడదు. నిన్నా ఇవాళ

లో 'ఎల వందసార్లు సావిత్రని సరోజిని' పేరుపెట్టి పిలిచాను. అది పలకదు!”

“సిగ్గు!”

“ఛీ మొహం! దానికోపం, కళ్ళుమంట, ఎందుకుండదూ? చిత్రంచూడు. ప్రకృతి మనల్ని వెక్కిరించటానికిట్లాచేసిందికాని వాళ్ళిద్దరిలో గల కనపడ్డభేదం నాకు కనపడి ఏ కొంభేదం కనపడకుండా ఉంటే ఎంత బాగుండేది. నేను సావిత్రని కొంతవరకు నిశ్చింతగా పెళ్ళిచేసుకునేవాణ్ణి. సరోజాం నీకు కుదిరేది.”

ఇక్కడ రాధాకృష్ణమూర్తి ఈకుసమించిన మాటన్నాడు.

“ఎందుకు దిగులుపడతావురా? పెళ్ళయిన మరుక్షణంనించీ ప్రయత్నంచేసినా ఇద్దరికీ సంబంధం కనపడదు.”

“నీద తుకల్ల అట్లా అయినా బాగుండును.”

“నాన్నకోపం వచ్చింది మీబావగారిమీద.”

“నిన్ను వదులుకున్నందుకా?”

“పెద్దకష్టం పోయిందే అని.”

“సామెత చెప్పినట్టుంది.”

పూర్తిగా పొద్దుకూకకుండానే ఇద్దరూ ఇంటిదారి పట్టారు. భైరమూర్తిగారి మేడముందు రాధాకృష్ణమూర్తి గుడ్ నైటన్నాడు.

సుందరం రాధాకృష్ణమూర్తి చెయ్యిపట్టుకున్నాడు.

“ఒక కప్ కాఫీ తాగిన తరువాత.”

“కాఫీ! అవశ్యం”

ఇద్దరూ మూలగదిలో చేరారు. సుందరం లోపలికి వెళ్లాడు, సరోజినితో రెండు కప్పులు కాఫీ తయారు చెయ్యమన్నాడు. అందుకని సరోజిని మూడు కప్పుల కాఫీచేసి తనకోకప్పు దాచుకుని మిగిలిన కాఫీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది. తరవాత కొంచెం ఎడంగానుంచుని రాధాకృష్ణమూర్తిని పరీక్ష చెయ్యటం మొదలు పెట్టింది.

రాధాకృష్ణమూర్తి కాఫీకాస్త రుచి చూచి కప్పుబల్ల మీదపెట్టి “ఫైన్” అన్నాడు.

సుందరంకూడా కొంచెం తాగి మొహం చిట్లించి, “నాకు కాఫీ రుచితెలీదురా ఖర్మం!” అన్నాడు

“సావిత్రికీ అంతే, అన్నయ్యా. దానివన్నీ నీగుణాలే” అన్నది సరోజిని నవ్వుతూ. రాధాకృష్ణమూర్తి కొంచెంసేపు సరోజిని వంకచూసి, తలగోక్కుని కాఫీతాగటం సాగించాడు.

“ఈ కాఫీమాత్రం ధుమాగా ఉందిరా. ఘుమగా ఉందనుకో! అద్భుతంగా ఉందంటేనమ్ము. ఎందుకూ? తెంగరంఅయ్యరు కాఫీకి నకలు. అసలుకు సరియయిన నకలు.”

సరోజిని తల ఒకపక్కకు ఒరగేసి రాధాకృష్ణమూర్తిని చూస్తూ “పాపం, సావిత్రికి మంచి మొగుడరయే వాడు!” అనుకుంది.

“నేను పోతున్నాను. మీకింకేం కావాలి?”

“నీళ్ళు”—సుందరం.

“తాగటానికేనా?”—రాధాకృష్ణమూర్తి.

“తప్పకుండా! లేకపోతే ఈచేదుఇట్లాగే ఉండనీమంటావా ఏమిటి?”

సరోజిని బిగ్గిరిగానవ్వుతూ పరిగెత్తిపోయింది.

రెండునిమిషాలపాటు స్నేహితులిద్దరూ మౌనంగా కూర్చున్నారు. చివరకు రాధాకృష్ణమూర్తికి మాట్లాడ బుద్ధయింది.

“మీచెల్లెలికీ మీమేనకోడలికీ భేదంలేదంటావేంరా సుందరం?”

“ఆఁ?” అన్నాడు సుందరం పరధ్యానంగా.

“ఇద్దరికీ లక్షభేదం ఉంది.”

“ఎవరు?”

“మీచెల్లెలికీ. మీ-మీ-సావిత్రికీ—”

“ఏమిటి?”

“భేదం—లక్షభేదం—”

“ఏంభేదం?”

“ఉంది.”

“ఎందుకుంది.”

“ఎందుకు లేదు.”

ఇప్పుడు సుందరం దోవకొచ్చాడు.

“నాఆలోచనంతా పాడుచేశావు! ఏమిట్రా నువ్వు మాట్లాడుతున్నది?”

రాధాకృష్ణమూర్తి మళ్ళీ వెనక్కి రాదలుచుకోలేదు.

"సావిత్రి ఇంత ఉత్సాహంగా ఉండదు."

స్నేహితు డేంమాట్లాడుతున్నాడో తెలీక సుందరం "ఆఁ?" అన్నాడు.

"ఇంత మాట్లాడదు."

"ఎవరు?"

"సావిత్రి."

"సావిత్రంటే? ఓహో సావిత్రా? ఇంకా సావిత్రేమో ననుకున్నా!"

"ఇంత నవ్వ దసలు."

"ఎవరు? సావిత్రేనా!"

"ఆ! అంటే సావిత్రి కాదు? సావిత్రి!"

"సావిత్రి నవ్వదా?"

"నవ్వదు."

"ఎందుకు నవ్వాలి? నవ్వు నాలుగందాలచేటు."

రాధాకృష్ణమూర్తి తలగోక్కుని అకస్మాత్తుగా లేచి "గుడ్ నైట్" అని వెళ్లిపోయినాడు.

3

జరిగిన సంగతేమిటంటే రాధాకృష్ణమూర్తి మొదట సావిత్రికోసం ఉబలాటపడ్డప్పుడు తనమనస్సును ఆపిల్ల కర్పించుకున్నాడు. ఒకపిల్ల తనఅనుజ్ఞ లేకుండా తన మనసును ఎత్తుకుపోవటం అతనికి కొత్తఅనుభవం. అనుభవంలేనివాడు కనకనే పనిపెట్టుకొచ్చి సరోజిని తన మనస్సు ఆకర్షిస్తుంటే చూస్తూ ఊరుకున్నాడు. దానికి అతనికివ్వబడ్డ శిక్షేమిటంటే సరోజిని!

రాధాకృష్ణమూర్తి మాట్లాడుతున్నది వినిపించుకోకుండా సుందరం ఆలోచిస్తున్నదేమిటంటే తనచెల్లెలికీ సావిత్రికీ ఏంసంబంధంఉందా అని. దానికొక కారణం ఉంది. అతను సావిత్రిని సరిగాచూసింది కిందటిరోజు ఉదయం, చెల్లెలిని సరిగా చూసిందంతకు పూర్వమే! మగవాడికి పెళ్లియావ లేనంతకాలం ఆడపిల్లలంతా ఒకటిగానే ఉంటారు. వాళ్ళిద్దరికీ కొంతపోలికకూడా ఉంటే చెప్పేదేమిటి?

అన్నిటికన్న ముఖ్యమైనవిషయం మొదటినించీ సావిత్రికి దిగులు తన్ను తనమామ కియ్యరనే.

—కొడవటిగంటి కుటుంబరావు.

నిట్టూర్పులు

లోకములో ఇతరులకోసము స్వార్థమును త్యాగము చేయువా రపురూపము.... ఔదాసీన్యము మానవసహజము. లోకమునకు ప్రేమతో నిమిత్తము లేదు. దానికి కాలక్షేపము జీవాతువు సద్విచారముతో, కృత్రిమమో, హాలాహలమో, ఏదో ఒక సంతృప్తికోసము సంఘముతో కొట్టుమిట్టాడుచు యంత్రమువోలె వ్యక్తి ఖేలనమాడుచుండును. సుఖాకాంక్ష స్వప్నప్రాయము కావడమే కాకుండ నిరంతరము దురంతదుఃఖాల చివుకజేసే ఈ ప్రేమ నెవరు కాంక్షించెదరు........ నేను క్షణికమయినా ఆనందమొసగే విషాదసౌందర్యమూర్తినా........ లోకములో గానమాలించు నంతవరకు రసాస్వాదమున ఆనందించి, తలలూపి తరువాత కాటువేసే సర్పాలుఉన్నవని గ్రహించ లేనందులకు.... మాటలతో మనసును జోకొట్టు మానవులున్నారని గ్రహించలేనందులకు ... ఎవ్వరిని దూషించవలెను. జీవిత మొకసాహసగీతి జీవిత మొక నైతికసూత్రము ఒకటి హృదయము నుద్విగ్నముచేసి శోకానందమున ముంచెత్తివేయును. వేరొకటి జీవితరహస్యసత్యగ్రంథిని హస్తగతము చేయును. ప్రణయనిదానాన్నికన్న ప్రణయవిశ్వాసమునే విశేష మారాధింప నలవరచుకొందును. ప్రతిఫలములేని యానిశ్శ్వారాధనములోనే జీవితాంత విశ్రాంతస్వర్గీయానందము విరిసికొనును.

—సహదేవ సూర్యప్రకాశరావు.

విగతదేహి

౧

నా దెయటందు దేహమున నాలుగుకీళ్ళు చలించునాళ్ళలో
నేదొ పృథాతికామ్యము నె యెంచుచు, రేయిబవళ్ళు గాలి నా
చ్ఛాద మొనర్తు మేడలను; సర్వము నీసవిలాసరూపమై
నీదెయటన్న నామమును నేడు వహించెను వింతవింతగా.

౨

కారణజీవినై యుగయుగాల బరిభ్రమణమ్ము జెందగా
నేరిచియుంట, నాతనువు నే ప్రతిజన్మములోన నూహకుం
దూరని స్వర్గసౌఖ్యములతో మెలివెట్టడలంచుచుందు—ఆ
తీరెపునర్భవంబునకు దీయునో! స న్నొక వెఱ్ఱిజేయుచున్.

౩

సర్వముఁవీడి లౌక్యపదసంగతి కావలనుందు. నాదరిన్
దుర్విషయానుభోగము లధోగతినొందు. అనీహబుద్ధి నీ
యుర్విబొనర్తు సత్క్రియల నొక్కెడ మిన్నగనంచు నెంచు నన్
ఖర్వకొనర్చె దృష్ణయధికంబగుచున్, దనవాని జేయుచున్.

౪

ఏమి గడించుకొంటి ధరియించి అనేకవిచిత్రపాత్ర లే
నీమహి? ఎంతపూనికవహించిన ఆ యమృతంపుపాత్ర నా
కేమిలభింపనీవయితి విట్లె మదాత్మ భ్రమించుచుంట యే
నీమననేమొ! నిన్నెఱుగనేర విచిత్రకళాకలాపునిన్.

—సామవేదం జానకీరామశర్మ.



హస్తోదకము

౧

రామవరము బ్రాహ్మణాగ్రహారము. ఆ గ్రామములో రామసోమయాజులగారి కుమారుడు గోపాలము మంచి తెలివితేటలు కలవాడు. చిన్నప్పటినుంచి కూడా తనయీడుకుఱ్ఱవాళ్ళకు మొనగాడు. అయిదేండ్లు చెన్నపట్టణములో ఉండి, హోటలులలో భోజనము చేసి బి. ఏ. అనర్సుప్యాసయి ఇంటికి రావడమువల్ల ఇప్పుడాయనకు ఊళ్ళో మాటాపలుకుబడీ ఎక్కువయింది.

సోమయాజులుగారు మంచిశ్రోత్రియుడు. కొంచెము భూవసతికలవాడు. ఆఊళ్ళో హైస్కూలు పెట్టించవలెనని యత్నముచేసేటప్పుడు నడుముకట్టిన వారిలో మొదటివాడు. "ఏమండీ బ్రాహ్మణాగ్రహారములో ఇంగ్లీషుబడి ఎందుకండీ! ఏ వేదపాఠశాలో, సంస్కృతకళాశాలో పెట్టించక మీవంటివారు ఈ ప్రయత్నము చేయడమేమిటి?" అని ఎవరో ప్రశ్నిస్తే ఆయన "నాయనా! నాలుగుబోల్లేరుఇంగ్లీషు ముక్కలువస్తేగాని బ్రదుకుతెరువులేని రోజులివి. ఏదో పెద్దలుసంపాదించి ఇచ్చినమాన్యాలుగాక, వేదాలూ శాస్త్రాలూచదువుకొని మేము ఆర్జించింది చిల్లిదమ్మిడీ కూడాలేదు. వర్ణాశ్రమధర్మాలు మారిపోయినవి. దేశకాలపాత్రాల ననుసరించి పోతుంటే ముందడుగు వేయడము మనతరమా?" అని అన్నాడు. ఏలాగయితేనేమి గ్రామములో హైస్కూలుసాగింది. ఆయనకొడుకు దానిలోనే స్కూలుఫైనలు ప్యాసయి ఇప్పుడింతవాడైనాడు. అనర్సుప్యాసయివచ్చినా ఆతనికి ఇంకా ఉద్యోగము దొరకలేదు.

గోపాలం సహపాఠు లందరూ, హైస్కూలుచదువుతోపాటు, బ్రాహ్మణ్యముకూడా పూర్తిచేసి ముందరిజుట్లతో, సిగరెట్లు బీడీలతో తయారైనారు. పట్టణవాసముచేసి బి. ఏ. ఆనర్సుప్యాసయివచ్చిన గోపాలుడి తలమీద గోష్పాదమంతజుట్టుచూచి పిల్లకాయలేకాక వాళ్ళతలిదండ్రులుకూడా ఆశ్చర్యపడ్డారు.

చెన్నపట్టణమువంటి మహానగరములో అయిదేండ్లుండి, మహామహుల ఉపన్యాసాలు విని, సభలలో సమితులలో మెంబరై, క్రొత్తక్రొత్తపుస్తకాలు చదివి సనాతనహిందూధర్మరహస్యములను సమగ్రముగా గ్రహించి ఇల్లు చేరాడు, గోపాలము. తనఉద్యోగము మాట ఎలాఉన్నా, తనసహపాఠులను మంచిమార్గాన పెట్టడమునకు తగినయత్నము చేయాలనుకొన్నాడు. తానుగ్రహించిన సనాతనహిందూధర్మరహస్యములను తోడివాళ్ళలో ప్రచారముచేయ మొదలుపెట్టాడు. హిందూమతము ఎంతసనాతనమయిందో; ఈదేశాన ఎన్నోక్రొత్తమతములు మహాప్రవాహమువలె ప్రబలవేగముతో ముంచివేయడానికి వచ్చినప్పటికీ, ఇది తన ప్రత్యేకతను నిలుపుకొని, వాటిధాటిని ఏరీతిగా అతిక్రమించగలిగిందో, ఈమతమందున్న విజ్ఞానమేమిటో, అది ఏరీతిగా ఆచరణయోగ్యమయిందో, జుట్టుముడి వలన, దేహమునకు ఏరీతిగా విద్యుచ్ఛక్తి కలుగుతున్నదో, బిళ్ళగోచీవల్ల లాభమేమిటో కందమూలఫలాదుల భక్షించడమువల్ల ఏరీతిగా మానసికశక్తి పెరుగుతుందో, ఋషులు మొదలైనవారికి మహత్వము ఎలాకలిగిందో మొదలైన సంగతులలో, గొంతెత్తి ఉపన్యాసాలు సాగించడముతోనే ఆఊళ్లో అబాలగోపా

లమూ విస్మితులైపోయినారు. అనతికాలములోనే ఆ ఉపన్యాసాలు పనిచేసినవి. కుఱ్ఱవాళ్ళలో జుట్టు పెంచుకొని త్రికాలసంధ్యావందనమువరకూ జరగవలసిన మార్పుజరగడము ఆరంభమయింది. కుఱ్ఱవాళ్ళల్లోనే గాక ఆడపిల్లల్లోకూడా స్నానాలు, ఏకాదశి ఉపవాసాలు ఆరంభమైనవి. ఇంగ్లీషు చదివినవాళ్ళు రెండో మదనమోహనమాలవ్యా అని, మామూలు పూర్వాచారపరాయణుల మనుకొనేవాళ్ళు రెండో ఉమామహేశ్వరపండితులనీ గోపాలాన్ని పొగడడము మొదలుపెట్టారు.

'హిందూధర్మపునరుద్ధరణమే దేశోద్ధరణము' అనే మాటతో యువకులలో వేడిపుట్టింది. అందరూ గోపాలము శిష్యులై స్వదేశమునూ, స్వధర్మమునూ ఉద్ధరించడానికి స్థిరసంకల్పులైనారు. పెద్దలందరూ గోపాలము చేస్తున్నపనిచూచి "సోమయాజులు యజ్ఞపురుషుడిటువంటివాడు. లక్ష్మీదేవమ్మగారు చల్లనితల్లి. ఆదంపతుల పురాకృతసుకృతము ఫలించి నేటికి పుత్రరూపేణా మూర్తీభవించింది. లేకుంటే ఈ పాడుకలికాలములో, పడుచువాడూ, ఇంగ్లీషుచదువుకొనికూడా ఇంతధర్మబుద్ధీ, ఇంతఆచారపరాయణతా కలిగి ఉండడము ఎక్కడైనా ఉన్నదా," అని గోపాలము తలిదండ్రులనూ, అతని వంశమునూ, అతనినీ, స్తుతించడము మొదలుపెట్టారు. గోపాలమంటే ఆచుట్టుపట్ల సాక్షాత్తు గీత ఉపదేశించిన గోపాలుడైనాడు. హిందూధర్మ ప్రచారిణి, ధూమపాననివారిణి, పూర్వాచారసంజీవిని మొదలైన సంఘాలు చాలా వెలసినవి. కోటిధాటికి కాపులూ, కూలివాలిచేసి బ్రతికేవాళ్ళుకూడా బెదిరిపోయారు. ఒకవాడు మేదరిసుబ్బడు కల్లుతాగి ఇంటికి వచ్చి పెళ్ళాన్నికొట్టాడని వినగానే ఈసంఘసభ్యులలో కొందరు వాడింటికి వెళ్ళి ఏమిశిక్షవిధించారో తెలియదుగాని, మరువాడు ప్రొద్దుపొడవకుండానే ఆయిల్లాలు తనకర్తనుతీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. వెంకటస్వామి మిరపతోట కాపలాకువెళ్ళి సాయంత్రము తిరిగివస్తూ దారిలో గంజాయి కాగా పీల్చి మత్తెక్కి చంద్రమ్మవెంకయ్యపదము పాడుకుంటూ బ్రాహ్మణవీధిని వెళ్ళుతూ ఈసంఘసభ్యులలో ఒకడి కళ్ళబడ్డాడు. పాపము వాడి ముక్కూనా, నోటా, వారమురోజులదాకా నెత్తురుపడుతూనే ఉంది. వెంకటశాస్త్రిగారి కొడుకు బీడీకాలుస్తూ స్కూలుకువస్తుంటే గోపాలము చూచి అబీడీ ఆరిపోయేదాకా వాడిపెదవి మీద చురకలువేశాడు. ఈవిధముగా వైసంఘాలు గారడివాడి మామిడిచెట్టులాగు పుట్టీపుట్టకముందే, పూచి, పండి, గ్రామమంతా వ్యాపించినవి.

ఈసారి గోపాలముదృష్టి మరొకవైపు ప్రసరించింది. గ్రామవాసులకు మానసికముగా తగిన ఉన్నతి లభించడానికి, తానుఉద్యోగరీత్యా వెళ్ళిపొయ్యేలోగా, ఏదైనా శాశ్వతమైన నిర్మాణము ఏర్పాటుచేయాలని అతను తలపెట్టాడు. ఒకదివ్యగ్రంథాలయము ఏర్పాటుచేస్తే, పదిమందీకూడుకుంటారు; పత్రికలూ, పుస్తకాలూ, చదువుతారు; సభలు, ఉపన్యాసాలూ, జరుగుతవి. ఆరీతిగా ప్రపంచస్థితిగతులూ, మతవిషయములూ, విజ్ఞానవిషయములూ జనులలో వ్యాపించుతవి, అని అతనిమనసుకు తోచింది. ఇది మంచిసంకల్పమని అతని సహచరులుకూడా ప్రోత్సహించారు.

ఆ హైస్కూలులో గ్రంథాలయమనే పేర ఒక పగిలిన అద్దాలబీరువా ఉన్నది. అందులో ఉన్నపుస్తకాలు, బుక్సెల్లర్సు హెడ్మాష్టరుగారికి స్పెసిమెన్ కాపీలుగా పంపిన వాచకాలూ, భూగోళశాస్త్రములూ, అట్టలుఊడి, పేజీలుచినిగి పాడైపోయిన వీరేశలింగంపంతులుగారి గ్రంథాలు కొన్ని, ఆంధ్రప్రచారిణీ వారినవలలుకొన్ని, తప్ప మరేమీలేవు. వివేకానందస్వామి, రామకృష్ణపరమహంస, రవీంద్రనాథఠాకూరు బొమ్మలు చెదతినగా మిగిలినభాగాలుకూడా అందులో పడిఉన్నవి. దీనిని బాగుచేయడము మంచిదని గోపాలము యత్నముసాగించాడు. కావలసినంతమంది వెనకహంగుదారులు సిద్ధమైనారు. డొనేషన్సులిస్టు, పుస్తకాలపట్టీ, చందాలజాబితా తయారుకావడానికి ఆలస్యమేమీ జరగలేదు.

డబ్బుఖర్చులేని పనిగనక హిందూధర్మపునరుద్ధరణమునుగూర్చి యువకులుచేసే ప్రచారాన్ని పెద్దలందరూ

ఆశీర్వదించి ప్రోత్సహించారు. కాని గ్రంథాలయమంటే డబ్బులేనిదే సాగనిపని గనక, ఈచందాల జాబితానుగూర్చిమాత్రము పెద్దలసానుభూతిగాని, తోడ్పాటుగాని శూన్యమై పోయింది. రెండుమూడురోజులలోనే ఈ చందాగోల అవూళ్లో పెద్దలకు, చేతిలో పుస్తకమున్న యువకుడు వీధినికనబడితే, తలుపులు వేసుకొనేంత భయానకమై పోయింది. తనబుద్ధికుశలతలు గాని, తనపాండిత్యప్రకర్ష గాని, చేసే ప్రయత్నము గొప్పతనముగాని అవసరమూ పనిచేయనప్పుడు ఏమిచేయడమా అని గోపాలమునకు సందిగ్ధావస్థవచ్చింది. అతని శిష్యులలో ప్రముఖుడైన విశ్వనాథము కొంచెముసేపు ఊహించినట్లు ఊహించి "చూడు గోపాలమూ గ్రంథాలయానికి ఒకఇల్లు ముఖ్యము. పదిమందిచేరడానికి సంసారులెవ్వరూ ఇల్లు ఇయ్యరు. ముందు ఇల్లు కుదిరితేగాని మనమేమీ చేయడమునకు వీలులేదు. హైస్కూలుదగ్గర ఒకఇల్లుఉన్నది, చూశావా! ఆఇంట్లో కాపురముండే వారెవరూ లేరు. చాలాకాలమునుంచి పాడుబడిఉన్నది. అది లక్ష్మీనారాయణగారిది. ఆయనసంగతి నీకూ తెలుసును. ఈ ఊళ్లో మనబ్రాహ్మలంతా కట్టుగట్టి ఆయనను వెలివేశారు. ఆయన వసంతవరప్పాడులో ఉన్నాడు. వడ్డీ వ్యాపారమువల్ల పైసాకొంచెము గడించాడు. మనము సామదానభేదోపాయములు ఉపయోగించి ఆయనదగ్గరనుంచి ఆఇంటిని లాగగలిగితే తర్వాత పని సులువవుతుంది" అనిగోపాలానికి దారిచూపించాడు.

ఈమాటలువిని గోపాలము "విశ్వనాథం! ఇది చాలాసులువైనమార్గము. మనప్రయత్నసాఫల్యము అనతిదూరములోనే నాకు కన్పిస్తున్నది. లక్ష్మీనారాయణ పిసినిగొట్టు. అయినా బహిష్కారాయుధములో మనకు వశముకాకతప్పదు ఇల్లు ఇచ్చినాసరే. ఇంటికయ్యేడబ్బు ఇచ్చినాసరే. ఈరెండువిధాలా దారికిరాకపోతేడా, అధికారికరణము మాచెల్లెలి పినమామగారే. చెప్పేదేమిటిక! చాకలి బందు, మంగలి రాడు, దుకాణముమీద సరుకు దొరకదు." అని పట్టరానిసంతోషముతో విశ్వనాథము వీపుమీద తట్టినాడు.

విశ్వనాథము చూపినదారి మంచిదే, కాని అందులో ఒకరహస్యమున్నది. ఆరహస్యము దూరానస్ఫురిస్తూ ఉన్న స్వార్థపరత్వము. లక్ష్మీనారాయణగారి ఇంటి వెనకనే విశ్వనాథముగారి మామిడితోటఉన్నది. లక్ష్మీనారాయణ ఆఊరు విడిచిపెట్టినతర్వాత ఆయిల్లు కొనవలెనని విశ్వనాథముతండ్రి తలపెట్టాడు. లక్ష్మీనారాయణను ఆఊళ్లోనుంచి వెళ్ళగొట్టడానికికూడా ఈసంకల్పమే ప్రబలకారణముగా విశ్వనాథముతండ్రి పని చేశాడని కొందరంటారుగాని నిజము దేవుడికి తెలియవలె. తర్వాతమాత్రము ఇల్లుకొనడానికి ఒకటిరెండు సార్లు లక్ష్మీనారాయణగారి దగ్గరికివెళ్ళిమాట్లాడడము కూడా తటస్థించింది. లక్ష్మీనారాయణ చిరునవ్వు నవ్వుతూ "మీరు మంచిశ్రోత్రియులు. పల్లెటూరియింటి కోసము మీదగ్గరడబ్బుతీసుకోవడము నాకు సుతరామూ ఇష్టము లేదు." అని సవినయముగా చెప్పాడు. ఈ మాటతో విశ్వనాథముతండ్రికి ఆశతోపాటు, లక్ష్మీనారాయణకు తనయందున్నభక్తిశ్రద్ధలపైని విశ్వాసము కూడా ఎక్కువయింది. తోటలో రకరకాలచెట్లు నాటించి మంచియేర్పాట్లుచేశాడు. ఇల్లుకట్టడానికి తోటలో జాగాలేదు, ఈఇల్లుకలిస్తే తోటా వృద్ధిచేయవచ్చును. కట్టినయిల్లు శ్రమలేకుండా ఏర్పడుతుంది అని ఆయనసంకల్పము. కాని రెండోసారి మాట్లాడినప్పుడు లక్ష్మీనారాయణగారు "ఆయిల్లు నిన్నటిదీ మొన్నటిదీ కాదు. తరతరాలనుంచి ఉన్నది. ఇప్పుడు దానిని అమ్మవలసిన అవసరమూ కన్పించడములేదు. అదీగాక మాతండ్రిగారు పరమపదించేటప్పుడు నాతో "నాయనా! ఎన్నికష్టాలు వచ్చినా అఇల్లుమాత్రము పరులపాలు చేయకు. అది మనకు తరతరాలనుంచి వస్తున్న కాణాచి." అని చెప్పాడు. ఆయిల్లువదలిపెట్టడము నాశక్తికిమించినపని. మీరు ఇంకేమిచెప్పినా నేను చేతులుకట్టుకొని నిర్వహిస్తాను. ఈమాటమాత్రము ఇక చెప్పకండి." అని ఖచితముగాచెప్పాడు. ఈమాటలను విశ్వనాథముతండ్రి మనసులో ద్వేషముఉన్నా, పైకి ఏమీ అనలేకపోయినాడు. ఆయన అనంతరము కొడుకు విశ్వనాథము తండ్రిగారి సంకల్పము ఈడేర్పవలెనని ప్రయత్నించాడు కాని లక్ష్మీనారాయణను లొంగదీసే సాధనముదొరక

లేను. ఇప్పుడు గోపాలము సహాయముతో ఈపని సాధించవలెనని తలంచి ఈదారి త్రొక్కాడు. గోపాలానికి ఇదంతా తెలియదు. పనిపాటలతో కాలక్షేపము చేసుకొనే పల్లెటూరివాళ్ళకు గ్రంథాలయపు మోజు మూర్ఖాళ్య ముచ్చటే నని విశ్వనాథము తలంపు. గోపాలము ఉద్యోగముకోసము ఊరువిడిచి వెళ్ళక తప్పదు. తర్వాత "నంకో రాజా భవిష్యతి" మాతాయ మనతోట సంగతి, అనే పద్ధతిమీద ఉన్న విశ్వనాథము గోపాలముతో "ఈలైబ్రెరీ అధ్యక్షపదవుల్లో సగము లక్ష్మీనారాయణగారి పేర వ్రాసేమన్సలిస్టులో చేర్పించి. ఎలా ఇవ్వరో చూస్తాను. లేకుంటే ఈఊళ్ళో ఇల్లువాకిలి దక్కనిస్తామా?" అన్నాడు. గోపాలమూ సరే నన్నాడు. ఇక యువకులమాట చెప్పేదేమిటి? అందరూ కలసి వసంతవరప్పాడు వెళ్ళడానికి నిశ్చయించారు.

౨

వసంతవరప్పాటికి మరోపేరు వసంతారము. అది చాలా చిన్న గ్రామము. బ్రాహ్మణులయిండ్లు రెండో మూడో ఉన్నవి. ధనవంతులైన సంసారులుకూడా లేరు. అలగాజనము ఎక్కువ. ఊరికి కానుకొనే మాలగూడెము ఉన్నది. ఆఊళ్ళో లక్ష్మీనారాయణగారే కొంచెము పెద్దసంసారి. కరణముగారియిల్లు ఊరిమధ్య పెరుమాళ్ళ స్తంభముదగ్గర ఉన్నది ఇంకో వ్యాపారులఇల్లు ఉన్నది. ఆయన లక్ష్మీనారాయణగారిదగ్గర గుమస్తా.

లక్ష్మీనారాయణగారిది పూరిల్లు. పేడతో అలికి ముగ్గుపెట్టి పరిశుభ్రముగా ఉన్నది. ఇంటిముందు రెండు వీధి అరుగులు ఉన్నవి. ఇంటిచుట్టు కొణిదెకొయ్యపాతి కంచెకట్టారు. ఇంటికానుకొనే ఉత్తరపువైపున ఒక పాక ఉన్నది. అందులో పశువులుఉంటవి.

లక్ష్మీనారాయణగారు ఆచుట్టుపట్లఉన్న సంసారులకూ, కూలివాళ్ళకూ అప్పులిస్తాడు. పెద్దపెద్దపట్టణాలలో మార్వాడీలు చేసేపనే ఆయన ఆపల్లెటూళ్ళో చేస్తున్నాడు. రూపాయికి నెలకు ఒకఅణా వడ్డీచొప్పున పదిరూపాయలకన్న ఎక్కువ ఎవరికీఇయ్యడు. అలగా జనముదగ్గర ఏనెలకు ఆనెలవడ్డీ తప్పకుండా పుచ్చుకుంటాడు. తీపివేళలుగాని, కొట్టివేతలుగాని ఏవీ ఉండవు. అయినవడ్డీ నిక్కచ్చిగా రావలసిందే. ఆయన దగ్గర అప్పులంటేభయమేగాని, ఆప్రాంతాల అంత కన్నాదిక్కులేదు. కాబట్టి పాటకజనము ఆయనదయ కోసము పాకులాడుతుంటారు.

లక్ష్మీనారాయణగారి వయస్సు షష్ఠిపూర్తిఅయింది. చర్మముకప్పిన అస్థిపంజరములాగు రక్తమాంసహీనమైన ఆయన శుష్కశరీరముచూస్తే ఈబ్రాహ్మడు కడుపునిండా తిండికూడా తినడానేమోనని తోస్తుంది. ఆశరీరానికితోడు మెడలో రుద్రాక్షలతావళమూ, పెరిగినగడ్డమూ, బట్టతలా, ముడిపిలో జీవరసము గాని, దయాదాక్షిణ్యాలుగాని లేవనేఊహను దృఢపరుస్తవి. గానుగలోపడి నలిగినలిగి తనలోని రసాన్ని వెలువరించి నుసినుసై, చివరకు తానేవంటచెఱుకై అరసాన్ని కాచి శుష్కముచేసే చెఱుకువంటిది ఆయనబ్రదుకు. డబ్బు కోసము తనదగ్గరకు వచ్చేమానవులను పీల్చిపిప్పిచేయడానికి తనలోని మానవత్వమునూ, మార్దవమునూ పిండి ఇచ్చివేసి సాహుకారుతనము సంపాదించాడు. అందుచేత ఆయనవ్యాపారము ఆయన రూపురేఖలలో కూడా మూర్తిభవించింది. ఆయనవాలకముచూస్తే, మానవసమాజములోని కారుణ్యమును నాశనముచేయడానికి అభిచారహోమముద్వారా తయారైన బుణపిశాచమును కాబోలునని తోస్తుంది. అయినా ఆయనలో దయలేకపోలేదు. అది ఇతరులకు దుర్లభముగా ధనపిశాచి కౌగిటిలో ఉక్కిరిబిక్కిరౌతున్నది.

వేసవికాలము. అప్పుడే ప్రొద్దుపొడిచింది. లక్ష్మీనారాయణగారు దంతధావనాదికము నిర్వర్తించుకొని, పైఅంగవస్త్రముతో, వచ్చి వీధిఅరుగు చాపమీద కూర్చున్నాడు. ఆయనముందు ఒకసందుగాపెట్టె ఉన్నది. అంతలోనే గుమాస్తావచ్చి తనయొటవాలు వ్రాతబల్లదగ్గరకూర్చుని, ఏవోఖాతాబుక్కులు, పక్కనున్న జాజిచెక్కల బీరువానుంచితీసి బయటపడవేసి సులోచనాలు తుడుస్తూ భక్తచింతామణిలోని పద్యాలు మెల్లగా గొణుగుకొంటున్నాడు.

అప్పుడే జనముకూడా కొంతమంది వచ్చారు. కొందరు మాలవాళ్ళు అరుగులపక్కనా, నడవలోనూ ఉన్నారు.

కొంతనుంచివడ్డీ కొంత తీసివేయవలసిందని బలవంతపెట్టడముకోసమూ, కొంతమంది తమకున్న యిబ్బందులు చెప్పుకోవడానికీ వచ్చినట్లు కనబడుతుందిగాని, వాళ్ళ వాలకము పట్టిచూస్తే ఋణము తీర్చడానికి ఒక్కడూ వచ్చినట్లు కనబడదు.

లక్ష్మీనారాయణ ఏదో ఖాతాబుక్కు తీసి చూస్తున్నాడు. గోపాలము తనగుంపుతో అక్కడికి సిద్ధమైనాడు. అపరిచితులైన యువకులగుంపు రావడముచూసి లక్ష్మీనారాయణ కొంచెము చిడిముడిపడ్డాడు. గుమాస్తా మాత్రము 'రండి దయచేయండి' అని ఆహ్వానించాడు.

వచ్చినవారందరూ ఆయిదారుగురున్నారు. వచ్చి అరుగుమీదకూర్చున్న లక్ష్మీనారాయణగారికి నమస్కారము చేశారు. ఆయనముఖము ఎందువల్లనో నల్లబడిపోయింది. అయినా మనస్సులోనిపికరు బయటపడకుండా మర్యాదకు "రండి కూర్చోండి" అన్నాడు.

అందరూ అరుగుమీద సర్దుకొనికూర్చున్నారు.

"ఏవూరి నుంచి వస్తున్నారు?" అని అడిగాడు గుమాస్తా.

"రామవరమునుంచి."

గుమాస్తా మళ్ళీ ఒకసారి తనసులోచనాలు తుడుస్తూ "ఏమిపనిమీద?" అని ప్రశ్నించాడు.

గోపాలము గుమాస్తావైపుచూస్తూ జనుల అజ్ఞానమూ, గ్రంథాలయముల అవసరమూ, ఉపయోగమూ, తాము చేయదలచుకొన్న కార్యము జనులకు ఏవిధముగా విజ్ఞానసాధనమవుతుందో, మొదలైన సంగతులలో కొంచెం ఉపోద్ఘాతముసాగించి డొనేషన్లిస్టు లక్ష్మీనారాయణగారిముందు పడవేయడానికి ఇటు తిరిగాడు. ఇంతవరకూ గుమాస్తాతో మాట్లాడుతూఉన్నా, తనమాటలు లక్ష్మీనారాయణను ఉద్దేశించే అని, అతగాడు తన ఉపన్యాసములో లొంగిపోతాడని గోపాలముతలంపు. కాని ఉపన్యాసము దానిపాలేన అది జరుగుతునే ఉన్నది. లక్ష్మీనారాయణమాత్రము పెడమొగముపెట్టి ప్రక్కన ఉన్నముసలిదానితో మాట్లాడుతున్నాడు. గోపాలము చందాలిస్టు ఇటుపడవేయడానికి తిరిగేటప్పటికి లక్ష్మీనారాయణ ఆముసలిదానితో "చూడు నన్నుచంపకు. ఏదో కొంతఇచ్చిమాట్లాడడము మంచిదిగాని మొదటనే బేరమా? అసలు ఫాయిదాలతో నీబాకీ ఏడురూపాయల రెండణాలయింది ఆరెండణాలుకాదుగదా ఒకదమ్మిడీ కూడా వచ్చినాసరే నేను తగ్గించను." అంటున్నాడు.

గోపాలము ఏమీమాట్లాడలేదు. రెండణాలు తీసివేయడమునుగూర్చి ముసలిదానికి లక్ష్మీనారాయణకు హోరాహోరి వాగ్వాదముజరిగింది. వారిద్దరూ స్థిరసంకల్పముతో నేఉన్నారు. ముసలిది తగ్గించకపోతే వీలులేదంటుంది. లక్ష్మీనారాయణ ససేమిరాఅంటాడు. ఈ వాగ్వాదములో తనపని ఆలస్యమవడముచూచి గోపాలము ఇక ఊరకుండలేక 'మాసంగతి' అని రెండుమూడుసార్లుఅన్నాడు. అన్నప్పుడల్ల ముఖము ఇటుత్రిప్పి సరే ఇదిగో—అనిఎవరితోనో సంభాషణకు దిగేవాడు.

గోపాలానికి అసహ్యంతోపాటు కోపము కూడా కలుగుతున్నది. అవసరముగనుక ఏమీఅనలేక పోయినాడు. అదీగాక వచ్చేది స్వల్పముకాదు. తనప్రయత్నమంతా దీనిమీద ఆధారపడిఉన్నది. అందువల్ల లేని సహనము తెచ్చుకొని ఏదో 'మమ' అనిపించుకొని వెళ్ళుదామని చూస్తున్నాడు. లక్ష్మీనారాయణ ముఖము ఇటుకేసిత్రిప్పకుండా అలవానుకొని కూర్చున్న మాలలచ్చిగాణ్ణి చూచి "ఏమిరా! నీదుంపతెగ, నన్ను ఏమి తిప్పలు పెడుతున్నావురా! తీసుకొన్న రెండురూపాయిలూ ఇవ్వకపోవడము అలాఉండగా వడ్డీకూడా జమలేదు. పైగా మళ్ళీ డబ్బు ఇమ్మని వచ్చావా?" అన్నాడు.

లచ్చిగాడు వెంటనే "వడ్డీలేకుండా వస్తానా?" అంటూ బట్టకొంగుముడివిప్పి మూడణాలుతీసి అక్కడ పెట్టాడు.

"మూడు నెలలవడ్డీ ఏది?" అన్నాడు లక్ష్మీనారాయణ ఆడబ్బులుతీసి లెక్కపెట్టి పెట్టిలో వేసుకొంటూ.

"కామందులోరు రచ్చించాలి. ఈమూడణాలైనా వారమురోజులనుంచి తిరిగి తిరిగి బతిమాలితే ఆయన కడుపుచల్లగుండ ఏలాగో ఈవాళ ఇచ్చాడు."

"అల్లాగే తక్కినడబ్బులుకూడా లేకపోయావా మరి?"

"కామందులోరిదగ్గర మాటబడనాయీ పడతానా! చూశాను బాబయ్యా! ఏంచేసినా లాభం లేకపోయింది. ఈ నాళ కూటికి గింజలుకూడాలేవు. పిల్లలు మలమలమాడుతున్నారు. తమరేదైనా దయచేస్తేఉంది. లేకపోతే నాతిప్పలు పెరుమాళ్ళకెఱుక."

"అబద్ధమాడతావేమిరా? అదిగో ఆవైపున ఒక ముడిఉన్నది. విప్పు." అని తలకోపుతూ కళ్ళెఱ్ఱచేసి అన్నాడు లక్ష్మీనారాయణ.

రెండోముడి ఇంటికి గింజలు తీసుకొని వెళ్లడానికని ఉంచుకొన్నడబ్బులు లక్ష్మీనారాయణ అప్పుఇస్తాడనే నమ్మకము అంతగాలేక మరోచోట అప్పుతెచ్చిన ఆరణాలలో మూడణాలు దాచాడానిరుపేద. అది యీ పిసినిగొట్టు కంటబడకుండా ఉండలేకపోయింది. రెండోముడి కనబడకుండా ఉంచలేకపోయిన తనశక్తిహీనతకు లచ్చిగాడు కొంచెము అభిమానపడుతూ "కామందులోరు అల్లా సెలవిస్తే గరీబువాళ్ళము బతికేదెల్లా బాబయ్యా" అంటూ ఆముడి రొంటిన దోపడానికి యత్నించాడు.

"అయితే నీవు చాలాఘరానామనిషి వన్నమాట!" అని లక్ష్మీనారాయణ బజారువైపుచూచాడు. పశువులను అదిలికోలి అప్పుడేపకీరు గుమ్మములోకి వచ్చాడు. లక్ష్మీనారాయణ "ఒరే, పకీరూ! ఇల్లా ఒకసారి వచ్చి ఈలచ్చిగాడి రొంటిన ఉన్న డబ్బులమూట విప్పి చూడరా" అని పిలిచాడు.

పకీరువచ్చి లచ్చిగాడిని ముట్టుకొని డబ్బులమూట విప్పిమూడణాలు తీసి కామందుచేతి కిచ్చాడు. తుక్కైన పేనైపోయి లచ్చిగాడు మరిమాట్లాలేదు.

పకీరు పల్లెటూరితురక. అంటే పేరుతప్ప హిందువుడికీ వాడికీ భేదమేమీ లేదు. వాడే లక్ష్మీనారాయణగారి నమ్మినబంటు, పశువులకు మేతవేయడమూ, గదిలో ఉన్న పొట్టూతవుడూ జాగ్రత్తగాతీసి వాటికి పెట్టడమూ, పాలుతీయడమూ, మొదలైన పనులన్నీ వాడేచేస్తుంటాడు. కాని బాకీలు వసూలుచేయడమే ప్రధానమైనపని. వాడు మహమ్మదీయుడు గనక మాల వాణ్ణి ముట్టుకోవడానికి సందేహించలేదు. మాల వాణ్ణి ముట్టుకొన్నా వాడు మహమ్మదీయుడుగనుక ఇంట్లో నౌకరీ చేయించుకోవడానికి బ్రాహ్మడికి ఏమీ సంశయము కలగలేదు. నౌకరీకి కావలసింది నమ్మకము గాని మతముకాదుగదా!

పకీరిచ్చిన డబ్బులు పెట్టెలోవేసుకొని లక్ష్మీనారాయణ గుమాస్తాతో "చూడండి లచ్చిగాడి ఖాతాకు వడ్డీ జమకట్టండి" అనిచెప్పి "మళ్లా డబ్బుకావాలని చంపుతున్నావే. ఏమి కావాలేమిటి?" అని లచ్చిగాడిని అడిగాడు.

లచ్చిగాడు నుదుటచేతులు జోడించి మొక్కుతూ "ఒకరూపాయి యిప్పించండి బాబూ? మీకాళ్ళకు మొక్కుతాను" అన్నాడు.

"ఎందుకురా! డబ్బంటే తాగాలని బుద్ధిపుడుతుంది. అవసరమా ఏడపా! అడిగినప్పుడల్లా ఇస్తుంటే—"

"అవసరములేకుంటే వస్తానా బాబూ?"

"సరే అర్ధరూపాయి తీసుకొనివెళ్ళు"

దీనినిగూర్చి కావలసినంత హంగామా జరిగింది. తన యిబ్బందులన్నీ చెప్పుకొని ఒట్లుపెట్టుకొని సాక్ష్యముకూడా చెప్పించి చివరకు పన్నెండణాలు తీసుకోవడానికి లచ్చిగాడు ఒప్పుకొన్నాడు.

అప్పటికి పదిగంటలు దాటింది. గోపాలము కొంచెము చికాకుపడుతూ, చందాలబుక్కు తీసి ఎదుటఉంచి "చూడండి, చాలా పొద్దెక్కినది. మేము మళ్ళా అపుడ నడచి ఎండలో వెళ్ళాలి. ఏదో మాసంగతి తెలిస్తే దారి సాగుతాము మరి!" అన్నాడు.

ఆపుస్తకము తీసికొని క్రిందికీమీదికీ రెండు మూడు సార్లు పారజూచి తిరిగి ఇచ్చివేసి ఒక నిట్టూర్పు విడిచి "చూడండి. పెద్దవాళ్లము మేమేమిస్తాము చెప్పండి" అన్నాడు లక్ష్మీనారాయణ.

"పెద్దవాళ్ళు ఇవ్వకపోతే పిల్లవాళ్ళు ఇస్తారా? ఇవ్వడానికి వాళ్ళదగ్గర డబ్బుఎక్కడిది?" అన్నాడు గోపాలం.

"అదికాదు ఇన్నాళ్ళదాకా లేనిదీ గ్రంథాలయము అవసరము ఇప్పుడేమివచ్చింది? ఏవిజ్ఞానములేకపోయినా

చేపుడం చేత భక్తి, పాపమంటే భీతి పల్లెటూళ్ల జవానికి లేకపోలేదు. పత్రికలూ, పుస్తకాలూ చదివితే నేగాని జీవనము గడవదా! మనతాతముత్తాతలు ఏగ్రంథాల యాలుపెట్టి ఏపత్రికలు చదివారు? అదీగాక ఎవళ్ళ కో చదువుకొనేవాళ్ళకుగాని ఈకాదరబందీ అంతా మాకెందుకు?"

"చదువుకొనే వాళ్ళకోసమే. రోజూ మీవంటి వాళ్ళువచ్చి చదువుకోక తప్పదనే నిర్బంధమేమీ ఉండదు. లెండి."

"నేను చదువుకోవడముకాదు. పిల్లా మేకా లేని వాణ్ణి నేను దీనికి ఏమిస్తానుచెప్పండి?"

"పిల్లా మేకా ఉన్నవాళ్ళు చూశారా మేమే మీయగలము? అంటారు. లేనివాళ్ళు మేమెందుకు ఈయడమంటారు. ఎలా చెప్పండి?"

"సరే. ఇప్పు డదంతాఎందుకు! ఏదో అంత దూరా న్నుంచి వచ్చారు గనుక ఏదో వేయక తప్పుతుందా! ఒకపావలా వేస్తున్నాను. మళ్ళీ ఒకసారి మీరువచ్చినా సరే లేకుంటే వెనకనుంచి నేనే పిలుచూచి పంపు తాను."

గోపాలానికి గొంతువరకు కోపము వచ్చింది. నోటమాట రాలేదు. విశ్వనాథము "ఈపావలాడబ్బుల కోసమేనా మేమింతదూరము కాళ్ళీడ్చు కుంటూ వచ్చింది?" అని అన్నాడు.

"పావలాఅంటే అంతతక్కువలోలేదు. చూచారా అరణాలు రాబట్టడానికి మీరొదుటనే ఎంతహంగామా జరిగిందో ఇందాకట" అన్నాడు లక్ష్మీనారాయణ.

గోపాల మిక ఊరుకుండలేక "ఏపాపమెరగని ప్రజ లను పీల్చిపిప్పిచేసి సంపాదించేడబ్బులో కొంతభాగము ఆపాపప్రాయశ్చిత్తానికి ఇవ్వడముమంచిది" అన్నాడు.

"ప్రజలను పీల్చిపిప్పి చేయడమేకాదు. చేసినపాపా లింకా ఎన్నోఉన్నవి. లేకుంటే ఒకఊరినుంచి మరో ఊరికి కాపురము మార్చడ మెందుకు వస్తుంది?" అని విశ్వనాథము కొంచెము దురుసుగా అన్నాడు.

"కాపురము మార్చడమేమిటి?" అన్నాడు వెలవెల పోతూ లక్ష్మీనారాయణ.

"మీసంగతి ఎవరికీ తెలియదను కుంటున్నారు. కాబోలు?" అన్నాడు విశ్వనాథం.

"ఏదో చందాకువచ్చారు మీరు. తక్కిన గొడవ లన్నీ ఎందు కిప్పుడు?" అన్నాడు లక్ష్మీనారాయణ.

"మనిషినిబట్టి గొడవలువస్తవి. రామవరపు భాగవ తము వసంతవరములో కూడా జరిగితేనేగాని మాసం గతి నీకు తెలిసిరాదు. ఈ ఊరికరణము మాచెల్లెలి పిన మామగారే. తెలిసిందా! నీసంగతి మాకు తెలుసుగాని మాసంగతి నీకు తెలియదుగనక చెప్పాము. పేదవాళ్ళ నెత్తికొట్టి కూడబెట్టిన డబ్బు వడ్డీతో సహా కక్కిన దాకా విడిచిపెట్టడమంటూ ఉండదు." అన్నాడు గోపాలం.

లచ్చిగాడు అక్కడనే ఉన్నాడు. తనదగ్గరనుంచి ఈబ్రాహ్మణుడు బలవంతముగా డబ్బులు లాగుకొన్నా డనేకోపము వాడిమనసులో ఇంకాచల్లారలేదు. వాడు కొంచెము మెల్లగా "నిజమే. పేదవాళ్ళ నెత్తుయపీల్చి ఈయన ఇంతవాడైనాడు. వాడగ్గర కూటికిలేదు బాబో అంటుంటే మిగిలిన చిల్లర ఎల్లాలాగుకొన్నాడో కనబడ లేదూ?" అంటూ తక్కినవాళ్ళకేసి చూచాడు. వాళ్ళు కూడా సైగలమూలకంగా తమసమ్మతి వెల్లడించారు. ఇది చూచి విశ్వనాథము మరింత ఉత్సాహముతో "నీవు మరచిపోయినా నేమో రామవరములో నిన్ను వెలివేసిన సంగతి! ఒకసారి ఆచరిత్ర అంతా జ్ఞాపకము చేయమం టావా?" అన్నాడు.

అకారణముగా ఈ యువకు లింతకోపము తెచ్చు కోడానికి కారణము తెలియక లక్ష్మీనారాయణ కొం చెము కలవరపడ్డాడు. అనుకోని ఈసంఘటన అతనిమన సులో బెదరు పుట్టించింది.

లక్ష్మీనారాయణ వెలిసంగతి ఇక్కడ కొంచెము చెప్పడము మంచిది. ఆయనకు ఒక్కతే చెల్లెలు. దైవ వశమువలన చిన్నప్పుడే వశముతప్పి ఆమె అత్తవారింటి లో పోషించేదిక్కు లేక అన్నగారిల్లుపట్టింది. పిల్ల కొం చెము కన్నుముక్కు తీరైనది. అందులో ప్రథమయౌ వనము. ఆయౌవనప్రవాహమునకు ఆచారనియమాదులు అడ్డు నిలువలేకపోయినవి. పదునుదనవుడుడుకు ఆమెను గృహత్యాగినిగా జేసింది.

ఆ మీతప్ప లక్ష్మీనారాయణకు మరెవ్వరూ 'నా అన్నవారు' లేరు. అదీగాక పసితనమునుంచి ఎంతో గారాబముగా చేతులార పెంచి పెద్దదాన్నిచేసి పెండ్లి చేశాడు. దైవయోగము! యావజ్జీవమూ ఆపిల్లకు అన్నగారిల్లే దిక్కయింది. కన్నమమతకన్నా పెంచిన మమత పెద్ద. ఎంతోకష్టపడి తిరిగి తిరిగి వెదికి వెదికి చెల్లెలిని తీసికొనివచ్చి ఇంటిలో పెట్టుకొన్నాడు.

పల్లెటూళ్ళో ఏసంగతీ దాగదు. అందులో ఇతరుల కలితి వెల్లడిచేయడానికి వేలకొలది సంజయులు బయలుదేరుతారు. అసలుసంగతి ఏమైనా చిలవలతో పలవలతో లక్ష్మీనారాయణదుర్యశోలత లోకవ్యాప్తమయింది. కొందరు దానికి దోహదము చేశారు. కొందరు దానికింద ఆటలుసాగించారు. కొందరు అసహ్యపడ్డారు. కొందరు కోపగించారు. కొందరు ఆశ్చర్యపడ్డారు. పిల్లాజెల్లా కలవాళ్ళు అయ్యోపాపమన్నారు. గడుగ్గాయలు ఛీఛీ అన్నారు. ధర్మమూర్తులమనుకొనేవాళ్ళు ప్రాయశ్చిత్తమో ప్రాయశ్చిత్తమన్నారు.

లక్ష్మీనారాయణ మొదట కంగారుపడ్డాడు. వయసువచ్చినదాక పెళ్ళిచేయకుంటే ఆడపిల్లలు అదుపు తప్పుతారట! అందుకని ముక్కుపచ్చలారనప్పుడే ఒళ్ళో కూర్చోపెట్టుకొని తల్లిగారే తలంబ్రాలు పోస్తుంది. కాని చిన్నప్పుడు భర్తపోతే ఆపసిపిల్ల యావజ్జీవమూ నియమముగా తనబ్రతుకు బండలుచేసుకోవాలట! ఆహా! ఏమిధర్మము! ఏమిసంఘము!! ఏదో పొరపాటున వయసువచ్చినపిల్ల ఒకమాటు తప్పుచేస్తే "నీ యావజ్జీవమూ తప్పులుచేస్తూఉండు" అని వదిలిపెట్టడము ఏమిన్యాయమో! అసలు నిజానికి హిందూ సంఘము దురాచారాలచేత, పురోహితుల స్వార్థపరత్వముచేతా లోలోపల కుళ్ళిపోయింది. తప్పతాగి రోడ్డుమీద పడిపోతే, ఆయన ఏశ్రీమంతుడో, ఏఅధికారో అయితే ఎవ్వడూ నోరెత్తలేడు. ప్రస్తుతము సంఘమును పాలిస్తున్నది ధనపిశాచిగాని శ్రుతులుగావు, స్మృతులుగావు, ధర్మముకాదు. నేటి మానవస్వభావములో త్యాగదాక్షిణ్యములు చాలావరకు రూపుమాసిపోయినవి. ఎవరో మహానుభావులు ఇంత విశాలజగత్తులో ఉండకపోరు. కాని మానవుడు స్వార్థపరుడైనప్పుడూ, జాతీయతను చంపి ఆచారపిశాచి తాండవమాడసాగినప్పుడూ, సంఘధర్మమనేది ఇతరుల సంబంధములోనే తనసంబంధములో కాదని మానవుడనుకొనడము వింతకాదు. ప్రస్తుతము కలిలో ధర్మగోవుకు ఒక్కటేకాలు ఉన్నదట. కాని ఉన్న ఆ ఒక్కకాలితో పేదవాడి మెడమీద తన్నుతూ, ఆధర్మగోవు తన వాడికొమ్ములతో ధనవంతుల యినపపెట్టెలకు కాపలా కాస్తున్నది. మిరపతోటలోని 'దిష్టిబొమ్మలు'లాగు దేవుడూ, మతమూ, ధర్మమూ అనేవి దుర్బలులను పడగొట్టడానికి తెలివిగల శ్రీమంతుల అధికారమును నిలపడానికి ఉపయోగపడుతున్నవి. తోడి మానవుణ్ణి చూస్తే జాలీ, కనికరమూ, విశ్వాసమూ పుట్టడానికి బదులు అసూయా, ద్వేషమూ, మోసమూ కలుగుతున్నప్పుడు ధర్మశాస్త్రగ్రంథాలు చింపి వాటి పేజీలతో రూపాయిలు పొట్లాలు కట్టుతున్నారంటే ఆశ్చర్యములేదు. కోపమురావడానికి కారణము లేదు. మతపిశాచి కాళ్ళక్రింద నలిగిపోతూఉన్న జాతీయత నెత్తిమీద కోట్లకొలది భగవద్గీతలూ, ఉపనిషత్తులూ వేసి లాభమేముంటుంది? ప్రపంచము నాగరికతలో కొట్టుకొని పోతున్నది. ఈప్రవాహము ముందు ప్రాతదన్నది ఆగడములేదు. మనకు సంబంధములేదని దూరముగా ఉండడానికికూడా దేనికీ బలము చాలదు. ఇటువంటప్పుడు స్వభావమూ మారాలి. ధర్మమూ మారాలి. లక్ష్మీనారాయణ మనస్సులో ఈ ఊహలు కలిగినవో లేవో చెప్పడముకష్టము. కాని అతగాడు సంఘపుగోలను మాత్రము లెక్కపెట్టలేదు. "ఈ సంఘమువల్ల వచ్చేదేమిటి, పోయేదేమిటి? సంఘముకోసము చెల్లెలిని విడిచిపెట్టితే మూర్తీభవించిన స్వార్థపిశాచములాగున్న ఈ సంఘము తనకష్టములకు అక్కరకు వస్తుందా? అదీగాక చెల్లెలిని విడిచిపెట్టిన మాత్రాన వచ్చినవాదు పోతుందా? పిల్లపోయినా పురిటివాసన పోదు. బాగుచేయాలంటే పరిత్యాగముకన్న ప్రేమే ఎక్కువ మంచిసాధనము." అని అనుకొని ఉంటాడు. పొరపాటున తప్పటడుగు వేసిన ఒకవ్యక్తిని క్షమించడముకోసము ఆయన ఎంతో శ్రమపడవలసివచ్చింది.

సంఘము ధిక్కరించినందుకు వెలివచ్చిపడ్డది. ఏదో పెద్దతలకాయ అన్నవాళ్ళను మంచి చేసుకోవడానికి కూడా లక్ష్మీనారాయణ యత్నించలేదు. పల్లెటూళ్ళలో పట్టుదల లెక్కువ. చాకలి బట్ట లుతకడమునకు రాలేదు. మంగలి ముఖము తప్పించాడు. సరుకులమ్మేదుకాణ దారు ఇంట్లోఉండే లేదనిపించాడు. పిలిచినా ఎవరూ పలికే వారు లేకపోయారు. నిప్పూ నీళ్ళూకూడా కరువయ్యే స్థితి వచ్చింది. ధనముపారవేస్తే ధర్మదేవతకూడా దాస్యముచేస్తుంది. కాని లక్ష్మీనారాయణ అంతగా ఉన్నవాడు కాదు. చివర కతగాడు ఈ బాధపడలేక ఆ ఊళ్ళో కాపురముఎత్తివేసి వసంతపురము ప్రవేశించాడు.

పాపము! లక్ష్మీనారాయణ ఈ అవస్థపడడము తన కోసము. అందరికీ తెలిసినదైనా ఒకళ్ళగూర్చిననింద మరొకరినోట వెలువడుతున్నపుడు కలిగే ఆనందాన్ని అందరూ కోరుతారు. జరిగిన పొరపాటువల్ల అయిన గాయమును ఏనిమిషమున ఎవరువచ్చి గెలుకుతారో అనే ఆవేదనవాళ్ళగుండెలు యావజ్జీవమూ భయకంపితములు కావలసివచ్చింది. ఈసంగతి ఎవరైనా తలపెట్టితే చాలు లక్ష్మీనారాయణప్రాణము కంఠగత మవుతుంది. అయ్యో! అమాయకురాలు తనచెల్లెలు ఏమి బాధపడుతుందో అని. "యథా స్త్రీణాం తథా వాచాం సాధుత్వే దుర్జనో జనః" అని చెప్పిన భర్తృహరి ఎంత సత్యవాది!

ఈ గందరగోళము చూచి లక్ష్మీనారాయణ నిర్విణ్ణుడవడమునకు కారణమిది. అందువల్ల అతడు ఏమీ మాట్లాడలేక కళ్ళువప్పగించి నిలుచున్నాడు. అతని చూపులలోని కనికరమూ, పీరసత్క్షమాగుణమూ ఒక్క గోపాలముమాత్రము కనిపెట్టాడు. అతనిమనస్సుకూడా చివుక్కుమన్నది.

విశ్వనాథము "నాలుగుకోసులు నడచి మేము నీదగ్గరికి ముష్టికి వచ్చామనుకొన్నావా? ఏమి ధర్మబుద్ధి!! లోకుల ఇళ్ళుగుల్లచేసి పెద్దవై ——"అని ఏమో అనబోయినాడు.

గోపాలము అడ్డమువచ్చి ఊరుకోఅన్నాడు.

రెండుజాములు కావచ్చింది. ఎండలోనడచిరావడము వల్ల గోపాలానికి చాలా దాహముచేసింది. ఈ వాగ్వాదానికిముందే "కొంచెము మంచినీళ్ళు ఇవ్వండి" అని అడిగాడు. బ్రాహ్మణుడు మంచినీళ్ళు అడిగాడుగదా అని కంచుచెంబులో నీళ్ళుపట్టుకొని లక్ష్మీనారాయణ చెల్లెలు గౌరమ్మగారువచ్చి తలుపుదగ్గర నిలుచున్నది. రెండుమూడుసార్లు 'ఎవరికీ మంచినీళ్ళు' అని ఆమె అడిగిందికాని గోపాలానికి వినబడలేదు. ఈ మాటలు ముగియగానే ఇవ్వవచ్చునని ఆమె నీళ్ళచెంబులో అక్కడనే నిల్చుండి పోయింది. ఆమెకు 24, 28 ఏండ్లకన్న ఎక్కువ యీడుఉండదు. అప్పుడే స్నానము చేసింది కాబోలు తడిజుట్టు జారుముడివేసుకొన్నది. బరంపురం పట్టుపంచ కట్టుకొన్నది. గోపాలము 'ఊరుకో' అని కసరడముతోనే విశ్వనాథము అటూఇటూ చూచాడు. గౌరమ్మగారు అతనికంట బడ్డది. వెంటనే అతడు ఆ వైపుచూచి "పట్టుబట్ట కట్టుకొనివచ్చినంత మాత్రాన నీచేతినీళ్ళు మేముతాగుతామా! గోపాలం! ఆమే కథానాయిక. నీకోసము నీళ్ళుతెచ్చింది" అన్నాడు.

ఈమాట వినడముతోనే ఆమెచేతిలోని చెంబు గభాలున క్రిందబడిపోయింది. ఆమె తిరిగిచూడకుండా గిరుక్కున లోపలికి వెళ్ళుతూ మెల్లగా "అన్నయ్యా! వాళ్ళెందుకు వచ్చారో కనుక్కొని పంపించు" అని అన్నది.

ఇంతవరకూ విహ్వలుడైఉన్న లక్ష్మీనారాయణ చెల్లెలిమాటవిని ఉలికిపడి మరింత కంగారుతో "ఆఁ ఇదిగో చూస్తున్నాను" అన్నాడు.

గోపాలము మనస్సులో గౌరమ్మగారు వెళ్ళుతూ అన్నమాట కొంతజాలిని, సహనమునూ కలిగించింది. ఈ గందరగోళములో తనకూ భాగమున్నదని తెలిసి కూడా ఆదది ఎంతసహనము వహించింది!

గోపాలము పట్టణవాసముచేసి కొంత నాగరికతా, మర్యాదా, నేర్చుకొన్నాడు. అందులో చదివినది ఇంగ్లీషు. విశ్వనాథం పట్టిమోటుమనిషి. మర్యాదామన్నా తెలిసినవాడు కాదు. కలహమువస్తే స్త్రీపురుషభేదము పరిగణించనంత పట్టుదల అతనికి సహజము. అతని

మనస్సుకూడా అంత కఠినమైనదే. వివాహములో వీరు పురుషాకారము. ఈపౌరుష్యముచూచే గోపాలం కొంచెము కనుకుకొంటూ "ఏమి టీకొంపచేష్టలు! మంచీ చెడ్డా అక్కరలేదా?" అన్నాడు.

తనమాటలు ఏసంబంధమూలేని ఒకస్త్రీకి ఎంత మనోవ్యథ కలిగిస్తవో ఊహించేస్థితి ఎన్నడూ ఎరగని విశ్వనాథము, గోపాలముమాటలో మరీ నిష్ఠురత వహించి కళ్ళెఱ్ఱచేసి పైగా "ఏం. అబద్ధమాడానా? అధర్మముచేశానా? ఎంత సాహసమో చూడు గురుగింజలాగు నీళ్ళచెంబులో తయారయింది. తనముచ్చ ఎవరికీ తెలియ దనుకుంటున్నది. మొగవాళ్ళ ఎదుటికి రావడానికి సిగ్గుకూడాలేదు." అని స్త్రీచేయదగని మరొకద్రోహమును ఉద్ఘాటిస్తూ అన్నాడు.

మరి మాట్లాడడమువల్ల అవమానము ఎక్కువ కావడమేగాని లాభములేదని తలచి గోపాలము "మంచివాళ్ళు చేసే తమ్మన్నాను. అనవసరముగా జగడమెందుకు? మనము వెళ్ళిపోదాము, రా," అని గోపాలము విశ్వనాథము చెయ్యిపట్టుకొని లాగాడు.

లక్ష్మీనారాయణ "ఇదిగో చూచారా! అనవసరమైన గోల ఎందుకు? నావిషయములో పావలాకూడా గొప్ప మొత్తమే. ఇదిగో అరణాలు వేస్తున్నాను, ఇప్పుడే ఇస్తాను. చూడు పంతులూ, ఖర్చువ్రాసి అరణాలు మీరకియ్య" అని అన్నాడు.

విశ్వనాథము ఏకో పెంకెజవాబు ఇవ్వడానికి తయారుకానడముచూచి గోపాలము ఇంత గందరగోళము జరిగినాక ఈ అరణాలడబ్బుల సంగతి తనకు ఎంతో నీచముగా కాన్పించినా, మనసులోని అసహ్యము అణచుకొని "మీరివ్వనక్కరలేదు లెండి" అన్నాడు.

ఈమాట కోపముతో అన్నదేననితలంచి లక్ష్మీనారాయణ గోపాలము కేసి చూచి ఒకనిట్టూర్పు విడిచాడు. అతనివేదనచూచి గోపాలానికి నవ్వువచ్చింది. వడ్డీవ్యాపారముతో జీవించే అతనిదృష్టిలో పావలాకూ అరణాలకూ ఎంతభేదమున్నదో మనసులోనే ఊహించుకొని గోపాలము మెల్లగా నవ్వుతూ "మేము నిజముగా పావలాకు అరణాలకు రాలేదు. వెళ్ళిపోతాము" అన్నాడు. అతనిమనసు నిజముగా క్షోభించింది. తన మనసులో "వీళ్ళు వట్టిక్షుద్రులు. అరణాలకన్న ఎక్కువదానము చేయుటేమి వీళ్ళ తరముకాదు. వీళ్ళకు డబ్బేప్రాణము డబ్బే పరమావధి. వీళ్ళకేవ్వరికీకూడా డబ్బే పీతము" అని అనుకొన్నాడు.

3

ఇంటికి వెళ్ళిపోవడానికి విశ్వనాథము చేయిపట్టుకొని గోపాలము వెనకకుతిరిగి అటూఇటూ చూచాడు. ఆ అరుగుమూల కూర్చున్న ఒక కుర్రవాడిమీద పడింది అతనిదృష్టి.

ఆ కుర్రవాడికి పదేండ్లు ఉంటవి. పసుపు పచ్చ గాలంచా కట్టుకొన్నాడు. పసుపుకే ఒక ఉత్తరీయము పైనవేసుకొన్నాడు. గోష్పాదమంత సిలకతప్ప తల అంతా నున్నగా క్షౌరము చేయించుకొన్నాడు. చూస్తే ఆకుర్రవాడివాళ్ళు ఎవరో కాలముచేసినట్లు తోస్తుంది. ఎక్కడనో చూచినట్లు ఉండి గోపాలము "ఇక్కడికెందుకు వచ్చావు నీవు?" అని ప్రశ్నించాడు.

వ్రేలితో చూపిస్తూ ఆపిల్లవాడు "మా అమ్మ వచ్చింది లోపలఉన్నది మాడబ్బు ఈయనదగ్గర ఉందట" అని లక్ష్మీనారాయణను చూపించాడు.

డబ్బున్నదని వినగానే గోపాలము ఈ సంగతి ఏమిటో చూడాలని అనుకున్నాడు. వెంటనే దాహముపుచ్చుకున్నా విశ్వనాథమును ఆపి అరుగుమీద కూర్చున్నాడు. లక్ష్మీనారాయణ గోపాలము కూర్చుండడము చూచి ఏమనుకొన్నాడోఏమో "మీ ఇల్లెక్కడ?" అని ఆపిల్లవాణ్ణి ప్రశ్నించాడు.

"మావూరు రామవరం. నాపేరు నరసింహం" అని ఆపిల్లవాడు చెప్పాడు.

"మీనాన్నగారి పేరేమిటి?" అన్నాడు లక్ష్మీనారాయణ.

విశ్వనాథము "ఓహో నీవురా?" అంటూ లక్ష్మీనారాయణకేసి తిరిగి "వాళ్ళనాయన భైరవమూర్తి పోయి చాలారోజులయింది. కొడుకుపోయిన విచారమువల్ల విరాగిఅయి తాతగారైన అవధానిగారు సం

పొలము విడిచిపెట్టి దేశాలమీదికి లేచిపోయాడు. ఏడేండ్లకు మళ్ళా తిరిగి మొన్ననే వచ్చాడు. ఆయన వచ్చిన రెండుమూడు రోజులలోనే వాళ్ళఇల్లు కాలిపోయింది. నిప్పు ఆర్పడానికి యత్నించి ఆముసలాయన కూడా నిప్పుసెగసోకి చచ్చిపోయాడు. ఆయన కెవరూలేరు. ఈ కుర్రవాడే దినవారాలు చేయవలసి వచ్చింది.'' అని ఆపిల్లవాడిపక్షాన తాను చెప్పాడు.

ఒక్క లక్ష్మీనారాయణతప్ప తక్కిన అందరూ ఈ వృత్తాంతమువిని విచారముతో నిట్టూర్పు విడిచారు.

లక్ష్మీనారాయణ ఏదో జ్ఞాపకము తెచ్చుకోవడానికి యత్నిస్తున్నట్లు కొంచెము తలఎత్తి ఒక కన్ను మూసి యోచించి "డబ్బు వాళ్ళిచ్చినట్లు చేతి ఉత్తరము గాని, రశీదు గాని ఉన్నదా? మీ అమ్మను అడుగు." అన్నాడు.

పిల్లవాడు తల్లిని అడిగాడు. ఆమె ఏడుస్తూ "ఏమీ లేదు. అన్నీ ఇంటితోపాటు కాలిపోయినవి." అన్నది.

"ఎన్నిరూపాయలు?"

ఈ ప్రశ్నతో ఆవితంతువు ముందుకువచ్చి "మా మామగారు చావడానికి ముందు వాళ్ళతో మీదగ్గర అయిదువందలుంచి తాను తీర్థయాత్రకు వెళ్ళినట్లు చెప్పారు. మేము గర్భదరిద్రులము. కొంపకాలిపోయింది. పెద్దదిక్కు మమ్మలిని విడిచిపెట్టిపోయింది. తినడానికి తిండికూడాలేదు. ఏదో మీరు ఊరికే ధర్మానికి ఇచ్చినట్లు తలుస్తాము. దయచేసి ఏదో భిక్షపెట్టండి" అంటూ కళ్ళు అద్దుకొన్నది.

ఇంతవరకూ ఏదోవ్రాస్తూన్న గుమాస్తా ఆమెఏడుపు చూచి "పోనీ ఎవరైనా సాక్ష్యమున్నారా?" అని అడిగాడు.

తల అడ్డముగా ఊపుతూ ఆ ముసలివితంతువు "లేరు బాబూ! మొన్న మామామగారు చెప్పేవరకూ ఈసంగతి మాకూ తెలియదు." అని కొంచెము పెద్దగా ఏడ్వసాగింది.

మెల్లగా నవ్వుతూ గుమాస్తా "ఏడ్చినంతమాత్రాన వచ్చేది ఏమీలేదు. ఇది డబ్బుతోపని. సాక్ష్యమూ లేదూ, పట్టుబండలూలేదు. ఇంత రశీదుముక్కైనా లేదు. ఎల్లా చెప్పండి." అన్నాడు.

వితంతువు ఏడుపు కొంచెము పెంచింది. ఏడ్చి లాభములేదన్న సంగతి అందరికీ తెలుసును. ఆమెకూ తెలుసును. కాని గౌరమ్మగారు గుమాస్తామాటవిని లోపలినుంచి "రసీదులేదు, సాక్ష్యమూలేదు అని పాతిబ్రాహ్మలసొమ్ము గంగలో కలుస్తుందా! ఏడేండ్లక్రితమని ఆమె చెప్పుతూనే ఉంది వెనకటి ఖాతాలన్నీ తిరగవేస్తేసరి" అనిఅన్నది.

గోపాలం ఆశ్చర్యపడ్డాడు. దిక్కులేనివాళ్ళ విషయమై ఈసానుభూతి చూపించేవాళ్ళెవరా అని గుమ్మముకేసి లోపలికి చూచాడు. ఎవరూ కనబడలేదు. లక్ష్మీనారాయణకు చెల్లెలంటే ప్రాణము. ఆమె మాట అన్నదంటే కాదనిచెప్పడము అతనితరముకాదు. గుమాస్తాకు ఈసంగతి తెలుసు. అందువల్ల అతడు విసుక్కొంటూ "నాచావుకోసము వచ్చిందీమె. ఎంత ప్రొద్దెక్కిందో చూడండి" అంటూ బీరువాలోపలి ఖాతాబుక్కులన్నిటిని క్రిందపడవేశాడు.

"మీరు చూడలేకుంటే ఇలాఇవ్వండి నేను చూస్తాను. ఏడేండ్లక్రితపు ఖాతాచూస్తేసరి." అని లోపలినుంచి గౌరమ్మగారన్నది.

"ఖాతాచూస్తే తెలుస్తుందని నాకూతెలుసును. కానీ ఏసంవత్సరమూ, ఎవరిచ్చారూ తెలియకుంటే ఎన్ని ఖాతాలని వెదకడము? పుస్తకము పుస్తకమూ పేజీలు తిరగవేస్తూ ప్రతిపద్దూ చూడడము తేలికపనికాదు. ప్రొద్దుకూడా చాలాఎక్కింది. నిజముగా జమయిచ్చి ఉంటే పద్దు ఎక్కడికీపోదు. తప్పకుండా నీడబ్బు నీకు ముట్టితీరుతుంది. రేపొకసారి నీవు మాయింటికివస్తే అడిగి తెలుసుకోవలసిన సంగతులు తెలుసుకొని పద్దు చేతికి ఉంచుతాను" అన్నాడు గుమాస్తా.

డబ్బు ఎవరిచ్చారో ఎప్పుడిచ్చారో గుమాస్తాకు తెలియక కాదు. అతనికి అన్నీ తెలుసును. తలుచుకుంటే నిముసములో అపద్దు బయటపడవేయగలడు. అయినా రేపు తనయింటికి ఆవితంతువును ఎందుకురమ్మన్నాడో గుమాస్తా, ఆరహస్యము అందరూ గ్రహించారు. సంగతులు తెలుసుకోవడమనేది వట్టి నెపము. ఇటువంటివే నిజాయితీకిందా, పరోపకారముకిందా, పెద్దమనిషితరహాకిందా దేశములో చెలామణి అవుతున్నది. ఇది అవి

తంతువులు తెలియును. ఆమె కేవొకసారి నాలుగుకోసులూనడిచి వ్యాపారివంతులయింటికి రావడానికి సమ్మతించింది. ఆమె నిరుపేదతనమూ, అవసరమూ ఆమెను సమ్మతించేటట్లు చేసినవి. గోపాలము ఏదో అనవలెననుకొన్నాడు గాని అసలు వ్యవహారమే చెడుతుందేమోనని ఊరుకొన్నాడు. గుమాస్తా అన్నమాటలు గౌరమ్మగారు విన్నది. వెంటనే ఆమె ఆ నిరుపేదరాలి అసహాయతకు కనికరము వహించి "అన్నయ్యా! గుమాస్తాగారు చూపలేకుంటే ఏడేండ్లఖాతాపుస్తకాలూ లోపలికి పంపించు. నేను చూస్తాను. పెద్దయింటి ఆడమనిషి. నాలుగుకోసులు నడిచివచ్చింది. రేపు మళ్ళీ కాళ్ళీడ్చుకొంటూ వస్తుందా! ఏడేండ్లక్రితమని తెలుస్తానేఉంది. ఒకసారి చూస్తే జమఉన్నదీ లేనిదీ తేలుతుంది. ఆడమనిషి అబద్ధమాడుతుందా," అని అన్నది.

గౌరమ్మగారి సద్బుద్ధికి గోపాలము లోలోపల సంతోషించాడు. లక్ష్మీనారాయణ "ఎక్కిన పొద్దు ఎక్కనే ఎక్కింది. చూడండి ఖాతా. ఎవరో అయిదువందలు జమయిచ్చినట్లు నాకూ కొంచెము జ్ఞాపకమున్నట్లున్నది." అని గుమాస్తాకేసిచూచి అన్నాడు.

గుమాస్తా మారు మాటాడలేక కొంచెముసేపు ఖాతాలు అటూఇటూ చూస్తున్నట్లు త్రిప్పి ఏదో ఒక పుస్తకము తీసి ఒకనిట్టూర్పువిడిచి "అమ్మా! దొరికింది. సరిగా ఏడేండ్లక్రితమే. గౌరమ్మగారిది సూక్ష్మబుద్ధి. బంగారుతల్లి సరిగాచెప్పింది." అన్నాడు.

"సరే, ఎనిమిదేండ్లకూ ఎన్నినెలలు తక్కువో చూచి వడ్డీకూడా త్వరగాకట్టండి. పెద్దఇల్లాలు రావడం పోవడం కష్టంగాదూ!" అన్నాడు లక్ష్మీనారాయణ.

గుమాస్తా ధుమధుమలాడుతూ, ముఖముచిట్లించి "వడ్డీకట్టడముకూడా ఎందుకు?" అన్నాడు.

"బాగుందివరస! ఇన్నేండ్లూ ఆసొమ్ము మనదగ్గర కూర్చున్నదా? వడ్డీకి తిరగడములేదూ! మనకువడ్డీవచ్చినప్పుడు వాళ్ళకు ఇవ్వవద్దూ? సరిగా ఆబ్రాహ్మణుడిపేర ఎప్పుడెప్పుడెంతమొత్తము జమఉన్నదో చూడండి." అన్నాడు లక్ష్మీనారాయణ.

ఇక తప్పదుగదా అని గుమాస్తా ముక్కుతూ మూల్గుతూ లెక్కతయారుచేసి "అంతా ఏడువందల ఏభై రూపాయిలయింది" అన్నాడు.

లక్ష్మీనారాయణ "అమ్మా ఇనపపెట్టెతీసి సొరుగులోఉన్న నోట్లకట్ట ఇలాకంపించూ" అని గౌరమ్మగారితోచెప్పి ఆముసలివితంతువును చూచి "డబ్బంతా ఇప్పుడేతీసుకొని వెళ్ళుతారా? కొంత మొత్తమేకావాలా?" అని అడిగాడు.

ఈమాటతో ఆముసలమ్మకు కలిగిన ఆనందము దైవానికి తెలియాలి. గోపాలము మనసులో ఒక సంగ్రామము జరుగుతున్నది. అతనుగాని విశ్వనాథముగాని జరుగుతున్న సంగతికి కళ్ళువప్పగించి చూస్తున్నారు. పెదవి విప్పడానికి సమయముగాని అవసరముగాని కాన్పించలేదు. ఆముసలమ్మ కళ్ళుతుడుచుకొంటూ "లేదు నాయనా. డబ్బంతా నాకు అవసరములేదు. అయిదువందలిస్తే చాలును." అన్నది. "అయితేసరే," అని లక్ష్మీనారాయణ గుమాస్తాకేసి చూచి అయిదువందలూ ఖర్చు వ్రాయండి. మిగతా డబ్బుకు ఆమెకు ఉత్తరము వ్రాసిఇవ్వండి. వ్రాయడము పూర్తిఅయినతర్వాత అప్పుడు ఒకసారి నాకిస్తే క్రిందసంతకము చేస్తాను" అన్నాడు.

ముఖము చిట్లిస్తూ గుమాస్తా "మీరెందుకూ సంతకము. నేను చేస్తాను లెండి" అన్నాడు.

గుమాస్తా గొంతు నులిమివేయవలెనేంతకోపము వచ్చింది గోపాలానికి. కాని దేశమంతటా నిండిఉన్న ఈ రకపు పెద్దమనుష్యులలో ఈ గుమాస్తాఒకడు.

"వద్దు వద్దు. వాళ్ళతో పద్దుచూచి సంతకము చేస్తాను నేనే" అని ఆపుస్తకము తీసుకొని ఒకనిమిషము పేజీ పైనుంచి క్రిందికి ఒకసారిచూచి "చూడండి ఆ బ్రాహ్మణుడిపేర జమఉన్న ఈ మొత్తము పద్దులో చేర్చలేదు. నేను తెలుసుకోగలనా అనుకున్నారు కాబోలు గుమాస్తాగారు అన్నప్పుడూ ప్రతిపద్దూకళ్ళలో చూస్తుంటాము! అందుకనే నేను సంతకము చేస్తానన్నాను" అని లక్ష్మీనారాయణ నవ్వాడు. అంతమందిలో అన్న ఆ మాటలకు గుమాస్తాముఖము నల్లబడ్డది.

గోపాలము తనబలగముతో ఇంటికి వెళ్ళడానికి లేచాడు. జరిగిన సందర్భాన్నిబట్టి వాళ్ళను భోజనానికి ఉండమనడానికి లక్ష్మీనారాయణకు సాహసము లేకపోయింది. గుమ్మము వరకూ వెళ్ళి గోపాలము ఒకసారి వెనకకు తిరిగి చూచాడు. గౌరమ్మగారు పళ్ళెములో బత్తాయిపండ్లు ఒలిచి తొనలు తీసి ఉంచి ప్రేలితో గోపాలముకేసి చూపుతూ అన్నగారితో ఏదో చెప్పుతూ కాన్పించినది. అతడు దోకనిట్టూర్పు విడిచి వీధిలోకి వెళ్ళిపోయాడు.

ఎండ మండిపోతున్నది. పైన నెత్తి, కింద కాళ్లూ కాలిపోతున్నవి. ఆమడదూరము నడవవలసి ఉన్నది. పోనీ ఎవరింటికైనా వెళ్ళుదామా అంటే ఒకరా! ఇద్దరా! గోపాలానికి దాహబాధ ఎక్కువయింది. వాళ్ళవెంటనే వెళ్ళుతూ గుమాస్తా గోపాలము దగ్గర సావచ్చి "పొద్దు చాలా ఎక్కింది. ఏదో కొంచెము దాహము పుచ్చుకొని వెళ్ళుదురుగాని మాయింటికి దయచేయండి. నేను మీనాన్నగారు సోమయాజులగారిని బాగా ఎరుగుదును. చదువుసంధ్యలకోసము పొరుగూళ్ళలో ఉండడమువల్ల మీరంటే అంతగా పరిచయములేదుగాని" అన్నాడు. గోపాలము మాట్లాడలేదు. అందరూ నడుస్తున్నారు. గుమాస్తాకు లక్ష్మీనారాయణ చేసిన అవమానానికి ఒళ్ళు కాలుతున్నది. వీళ్ళందరూ తన్నుగురించి ఏమి ఉద్దేశపడ్డారో అని అతని మనస్సు [illegible]ంచగాఉన్నది. అందువల్ల తన మంచితనమూ, లక్ష్మీనారాయణ నైచ్యమూ కొంచెము వెల్లడించి వాళ్ళమనస్సులు సుముఖములు చేసుకోవడమునకు ఆయన గోపాలముకేసిచూచి "మీవంటి వాళ్ళ ఇంటికిరావడము పెద్దలు తరించారన్నమాట. దుర్మార్గుడు మీకు అరణాలు ముష్టిఇవ్వవచ్చాడు. నాకు చాలా అసహ్యము వేసింది. తనకు తోచిందేకాని మనము చెప్పినమాట వింటాడా!" అన్నాడు.

గోపాలము మాట్లాడలేదు. విశ్వనాథము "సరేలెండి. రెండురోజులలో చూడండి. దీనికి తగిన ప్రాయశ్చిత్తము చేయకపోతే నేను బ్రాహ్మణుడనేకాను. ఈఊరి కరణము మావాడే. మీమనసులో ఉంచండి" అన్నాడు.

గుమాస్తా అవకాశము దొరికిందిగదా అని "మావాళ్ళూ చాలాగొప్పగా బతికినవాళ్ళేకాని దుర్మార్గుడి దగ్గర చాకిరీచేయక పూటగడవనిస్థితి వచ్చిందిప్పుడు. నేనూ ముప్పూటా సంధ్యావందనమూ దేవతార్చనా చేయకుండా భోజనముచెయ్యను. అందులో వ్యాపారులమారాము. మీరు తెలిమాటలెచ్చారు కాబట్టి చెపుతున్నాను. ఎంతగడుసుదనుకున్నారామె. దయాదాక్షిణ్యాలు ఏకోశానా లేవండీ లోపలినుంచి అజ్ఞాపిస్తుంది. అంతా ఆమెమాటప్రకారము జరిగితీరాలి. ప్రొద్దుటినుంచి భోజనములేకుండా ఉన్నాడు బ్రాహ్మడనే మాటేలేదు. ఎంతచాకిరీచేసినా ఫలమేమిటి? కృతఘ్నులు. నలుగురినుంచూ ఎల్లా పోషణచేశారో చూశారా? మీరుకాబట్టి సరిపోయింది. ఇంకెవరైనా అయితే ఏమనుకుంటారు నన్నుగురించి చెప్పండి. సిగ్గులేక మీకు మంచినీళ్ళు తెచ్చిందామె. ఏమిపోకలు పోతుందనుకున్నారు? పద్దు చూచిందాకా నాఎముకలు కొరికిందిగాని బ్రతకనిచ్చిందా?" అన్నాడు.

ఇంతవరకూ మాట్లాడకుండా నడుస్తూఉన్న గోపాలము హఠాత్తుగా ఆగి "నాకు చాలాదాహం వస్తున్నది. వెనకకువెళ్ళుతాను". అన్నాడు. గుమాస్తా నివ్వెరపోయి "వెనకకు ఎక్కడికి వెళ్ళుతారూ? ఆకనబడేదే మాయిల్లు" అన్నాడు.

"నేను మీయింటికిరాను. వీళ్ళనుతీసుకొని వెళ్ళండి. నేను లక్ష్మీనారాయణగారింటికివెళ్ళి మంచినీళ్ళు తాగుతాను."

అరె. ఆదుర్మార్గురాలి చేతినీళ్ళు!! అపతితురాలి చేతినీళ్ళు త్రాగడము?!! అందరూ కళ్లు పెద్దవిచేశారు.

విశ్వనాథము గోపాలము చేయిపట్టుకొని "నడివీధిలో ఏమిటీ భాగవతము! నీవు అంతవాడవు కావనా? నేనెరుగుదును. నీవు ఆపతితురాలి చేతినీళ్ళుత్రాగుతావా?" అన్నాడు.

గోపాలం చెయ్యిగుంజుకొని "అవును. ఆమె మహానుభావురాలు. పొరపాటును పురస్కరించుకొని మూర్తీభవించిన మంచితనాన్ని నిరసించడము పాపము. మనసంకుచితహృదయాల అసూయా ద్వేషాలకన్న



మాతృప్రేమ

—చిత్రకారుడు: శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్టు సొసైటి.

ఆమె పొరపాటే చాలాగొప్పది. తప్పుచేయని వారెవ్వరు? ఆడదాని చరిత్రలో ఉన్న త్యాగమూ, దయాదాక్షిణ్యములూ, నిష్కళంకానురాగమూ పరిగణించకుండా అజ్ఞానమువల్ల కలిగిన దోషమునుమాత్రమే ఉద్ఘాటించడము మన కిప్పటిదికాదు. రామాయణము నుండి వస్తున్నది? ఆమెదోషానికి సంఘానిదేగాని ఆమెదికాదు బాధ్యత. 'బలవానింద్రియ గ్రామో విద్వాంస మపికర్షతి' అని ఆర్యోక్తి. ఆచారముకన్నా స్వభావము బలవత్తరము. పతితులకు పావనతా, రోగులకు ఆరోగ్యమూ, ఆపన్నులకు సాహాయ్యమూ, దరిద్రులకు అన్నమూ, కల్పించలేని ధర్మము ధర్మముగాదు. సంఘము సంఘముగాదు. పక్షవిరహితము చేసి పక్షి అథఃపతిత మవుతున్నదనడము ధర్మదేవతకళ్లు పొడిచివేయడమే; ధర్మము సనాతనమే. కాని, దేశకాలస్థితులవలన దానికి రూపమేర్పడుతుంది. ఈరూపము పరిణామ శీలము. పరిణామమంటే ఏదో విప్లవముగా ఊహించుతాడు మానవుడు. దానికి కారణము ఆచారదాస్యము. ఆచారదృష్టిలో లోకమునకు ఈమెపతితురాలు. కాని ఆచారపిశాచి మానవత్వాన్ని చంపగలిగినపుడే పాతిత్యము. నిజానికి మనకంటె ఆమెలో మానవత్వమూ, హృదయమూ ఎక్కువ సజీవముగా ఉన్నవి. ఆమె చేతినీళ్లు త్రాగినంతమాత్రాన నాబ్రాహ్మణ్యము పోయేటట్లయితే నేను బ్రాహ్మణుడ ననడమునకు తగను." అని గిత్రున వెనకకు తిరిగినాడు.

"అయితే వాళ్ళకూ నీకూ ఒకమాటే ప్రాయశ్చిత్తము!"

"వెఱ్ఱివాడా తెలిసి చేసినదానికి ప్రాయశ్చిత్తముంటూలేదు. అదీగాక పశ్చాత్తాపాగ్నికన్న నాలుగు మంత్రాలముక్కలు పావనత్వ మివ్వగలవా?"

"అయితే నీకూ గ్రంథాలకౌద్యమానికి——"

"ఆఁ. హాస్తోదకమే."

అని గోపాలము లక్ష్మినారాయణ ఇంటికేసి సాగినాడు.

—వేదుల సత్యనారాయణశాస్త్రి.
(సాహితీసమితి)

జినదేవ

౧

ఆతని మోవి కెంపు తడియారని
నిద్దపునవ్వులే యుషో
ద్ఘాతము లతీరప్రణయ
కావ్యవిభూతికి; విశ్వమోహన
జ్యోతు లకృత్రిమప్రకృతి
సుందరముల్ నయనద్వయంబు; అనా
ఘ్రాతలతాంత మా కరుదుగట్టిన
సాత్వికదివ్యమూర్తియున్!

౨

ముద్దులమూటగా కరిగిపోసిన
యాతని పాలబుగ్గలం
దద్దిన బాలభాస్కర
నవారుణదీప్తులు; తమ్మిమొగ్గలం
దిద్దెడి మేలివత్రువలు
దేరినగడ్డము, లౌకికమ్ములో
బుద్ధికి పందరాని తలపుల్
గొనివచ్చు ప్రశాంతి నిచ్చుచున్.

౩

ఆ మహనీయ మోహన
ముఖాబ్జమునన్ దొలుకాడుచున్న ని
ష్కామపవిత్ర తేజ మవికల్పక
నిత్యసమాధినిష్ఠ హిం
సామలిన ప్రవిష్టు లిహసంగులు
ధమ్మపదమ్ము పట్టి స్వ
శ్రీమధురాత్ములై హితము
జెందగ మీదికి లేవనెత్తెడిన్.

—బొడ్డు బాపిరాజు.



గర్భాధానము

౧

ఆనాడు శివావధాన్లగారింట్లో కార్యం.

పెళ్ళివారు నాలుగుబళ్ళమీదవచ్చారు. పెళ్ళికుమారుడు—అంటే గర్భాధానపుపెళ్ళికుమారుడి బంధువులంతావచ్చారు బావగారు తప్ప. అక్కగార్నిమాత్రం పంపాడాయన. ఆవిడ రాంగానే "రాజీ! మీ ఆయన రాలేదేమే" అని అంతా మూయబట్టుకున్నారు. "కార్యానికి మగవాళ్ళుకూడా ఎందుకమ్మా? ఆయన రానన్నారు" అని రాజ్యలక్ష్మి అంది నవ్వుతూనూ. "ఆడవాళ్ళుమాత్రం వచ్చేం చేస్తారేమిటి! అమ్మణ్ణీ" అని ఆమెతల్లివైపు పెదతాతగారు ఎనభయిఏళ్ళ ఆయన మనుమరాలివరసచేసుకుని, ముసలితనంచేత పళ్ళూడిపోయిన బోసినోటితో చిన్ననవ్వుతో పరిహాసికం చేశాడు.

కార్యానికి సన్నాహంచేసేటప్పుడు ఎవళ్ళెవళ్ళు బసలుచేరడమని ప్రశ్నవచ్చింది. "ఏమిటి! అంతా వెళ్ళవలసిందే. అందరమూ పిల్లా మేకా గణగణలాడుతూ నాలుగుబళ్ళతో వెళ్ళితే బాగుంటుంది." అని స్పష్టమైన అభిప్రాయం పెళ్ళికుమారుడితల్లి సీతమ్మగారు వెళ్ళబుచ్చింది. తాతగారు—నారాయణశాస్త్రిగారు—నిజమే నన్నారు.

"చాలామందివెళ్ళితే పెళ్ళికివచ్చినంతమంది వచ్చారమ్మా అని అమ్మలక్కలంతా అనుకుంటారు" అని సందేహం కనపర్చాడు వరదాత రామశాస్త్రి.

"ఎందు కంటారేమిటి? ముచ్చటగా ఒక్కగాను ఒక్కపిల్లాడికార్యం చేసుకుంటూ బంధువులందర్నీ తీసుకుపోక పోవడమేమిటండీ? డబ్బు ఖర్చవుతుందని మీకు ఈలాంటి అనుమానాలు, ఆలోచనలూ వస్తూనేఉంటవి లెండి. ముందర బంధువులందరికీ వెంటరమ్మని ఉత్తరాలు వ్రాయించండి."

ఆదే తీర్మానమయింది. బంధువులు రావలసినవాళ్లంతా వచ్చారు.

పెళ్లివారికి విడిదిచూపించారు. విడిదికి ఏర్పరచిన ఇల్లు ఏమంత పెద్దదిగాదు. ఆరుంకాలికభవంతి. అందులో అసలు ఇంటివారికితోడు పెళ్లివారు ఇల్లు ఏమి చాలలేదు. చాలకపోతేమాత్రం చేసేదేముంది? ముందర అక్కడ ప్రవేశించవలసిందీ, నెమ్మదిమీద సాయంత్రమో ఎప్పుడో ఎరిగినవాళ్లవళ్లన్నా ఉంటే దోవచూచుకుండేదిన్ని.

పెళ్లికుమారుడికి ఇవ్వేమీపట్టలేదు. అతను తనలో తను ఏమిటో ఆలోచించుకుంటున్నాడు. పెద్దవాళ్లు, చిన్నవాళ్లు అతన్ని చాలాగౌరవంగా చూస్తున్నారు. రాజ్యలక్ష్మివచ్చి "తమ్ముడూ మంగళస్నానాలు చేసే వేళవుతోంది. శిరాబ్ధిపట్టుబట్టలుతీయనా కట్టుకుందువుగాని?" అంది. తన ఆలోచనాపరంపర అక్కగారేమన్నా గుర్తుపట్టిందేమోనని తలపైకెత్తి చిరునవ్వునవ్వి భాస్కరరావు "నీయిష్టంవచ్చినవితీయి, అక్కాయి" అన్నాడు.

౨

భాస్కరరావు బి.ఎ., ప్యాసయి ఇప్పుడు లా మొదటిసంవత్సరము చదువుతున్నాడు. అతనికి ఇంట

మీడియేటు చదివేటప్పుడు వివాహమయింది. వివాహం నిశ్చయించుకునేముందు అతని తాతగారు, అతనూ కూడా, రామశాస్త్రి నారాయణశాస్త్రిగార్లతో పాటు పెళ్లికూతుర్ని చూడడానికి వచ్చారు. చివర ఇద్దరు సంబంధం యొక్క సాంప్రదాయాన్నీ, వాళ్లిచ్చే కట్నం, వీళ్లు పెట్టవలసినసొమ్ము వగైరాలు తెలుసుకోవడానికీ; మొదటి ఇద్దరు పెళ్లికూతురుసౌందర్యం, చదువులను పరీక్షించడానికీన్నీ ఏర్పాట్లు. మొదటైతే పెద్దలిద్దరు పెళ్లికుమారుణ్ణి తీసుకువెళ్లడానికి సుతరామూ ఒప్పుకోలేదు. అసలు అభిప్రాయం వాళ్లిద్దరికే పెళ్లి మాట్లాడిరావాలనని కాని సీతమ్మగారుమాత్రం అల్లుడు తప్పక వెళ్లవలెనని పట్టుపట్టింది. అల్లుడు చిన్నవాడు, ఈకాలపువాడుగావడంచేత పిల్ల కనుముక్కుతీరు, సౌందర్యం, కళ, ఇవ్వన్నీ చూసిరాగలడని ఆవిడ అభిప్రాయం, తాతగారు పెళ్లికుమారుడుగాంధి కదలనన్నాడు. నగచ్ఛేద్బ్రాహ్మణత్రయం కాబట్టి సరిపోతుందని సరేనంటే సరేనన్నారు.

ఏకమిటీవారు చెయ్యవలసినపనులు వాళ్లుచేసింతర్వాత ప్రత్యేకంగా కమిటీరిపోర్టులు తయారుచేశారు. సౌందర్యం, చదువు సబుకమిటీవారు సాకులను బాగా విచారించారు. పిల్లను అలంకారంచేసి తీసుకువచ్చారు. పైగా పెట్టుకొన్నసొమ్ములు, చీర, సౌందర్యాన్ని ఇనుమడింపచేస్తవనే విషయంలోనే మొదట భేదాభిప్రాయం కలిగింది కమిటీసభ్యులలో. కనుక ఆవిషయం విని వాళ్ళు ఆపిల్ల సౌందర్యం విలోకించి, సొమ్ములు అవీలేకపోయినా సౌందర్యవతేనని నిర్ణయించుకున్నారు మనస్సులోనే. చదువువిషయమై ప్రశ్నలువేశారు. ఆపిల్లనూ, తండ్రినీకూడా పరీక్షించారు. తేలిన పర్యవసానమిది. ఆపిల్ల ఆవూళ్లో గరల్సుస్కూలులో 6-వ తరగతి చదువుతోంది. సంగీతం మేష్టర్నికూడా వేశారు రెండేళ్ళక్రింద. అది కొంచెంవచ్చు. ఆస్కూల్లోను మాత్రం ఇంగ్లీషు చెపుతారు. అంతవరకూ ఇంగ్లీషు కూడాను.

అవసరమైతే ఇహముందుకూడా సంగీతం, ఇంగ్లీషు చెప్పించడానికి ఒప్పుకుంటారా అనికూడా వాళ్ళు ప్రశ్నవేశారు. శివావధాన్లగారి కీవిషయమై యేమీ బాగా తెలియదు. ఏదో ఊళ్లో బడే ఉందిగదా అని పంపుతున్నారు అంతే. "మనపిల్లలకు అలాచెప్పించడానికి వీలవుతుందా?" అని సంశయం వెలిబుచ్చారాయన. "తప్పకుండావీలవుతుంది. అలామీరు చేయించకలిగితే కొంతసదికినట్టే" అని పెళ్లికుమారుడి తాతగారు చెప్పారు.

ఇదంతా వింటూనేఉన్నా, రామశాస్త్రి నారాయణశాస్త్రిగార్లతో తన అభిప్రాయం వెలిబుచ్చాడు ప్రకాశరావు "తను అభ్యంతరం ఏమీచెప్పడని" తాత మరిచితరవు వకాల్తాపుచ్చుకుని. అన్నికుదరడంవల్ల ఆ సంబంధమే నిశ్చయమయింది.

వివాహమయినప్పటినుంచీ, భాస్కరరావు, ప్రకాశరావుగారూకూడా శివావధాన్లగారితో ఒకటే చెప్పడం పిల్ల చదువునుగురించి. వీలుగాఉంటే తమకు తెలిసినంతవరకూ భారతభాగవతాలుకూడా చదివించి అర్థాలు చెబుతూ ఉండమనికూడా చెప్పారు. శివావధాన్లగార్కి వీటియందు యిష్టంగాని, అయిష్టంగానిలేదు. కాని ప్రకాశరావుగారు, బి.యల్., ప్యాసయి ప్లీడరీ చేస్తున్నాయన అపేక్షనిగా అన్నిసార్లు చెప్పినతర్వాత, అందులోనూ అల్లుడుకూడా రెండు మూడు సార్లు—సిగ్గుపడుతూనే—చెప్పింతర్వాత అలాచేయకపోతే ఏమితంటోఅని, బాగుండదేమోనని ఆయన వాళ్లుచెప్పినవన్నీ చేశాడు.

ఇప్పుడు సత్యవతికి భారతభాగవతాలు అర్థంచేసుకునే జ్ఞానం ఉంది. అత్తవారు క్రాణిపట్టెకియిచ్చిన హార్మోనియముమీద స్కూల్లో చదువు మానేసిన తర్వాత కూడా పాడడం నేర్పించుకుంది.

భాస్కరరావుకు తనభార్య చదువులో అభివృద్ధి ఎప్పటికప్పుడే తెలుస్తున్నది. రాజ్యలక్ష్మి కలిసినప్పుడల్లా సత్యవతిచేత చదివిస్తూఉండేది. మొదటి రోజులలో కొంచెంసిగ్గుపడ్డది ఆడబిడ్డఎదట చదవడానికి. కాని రాజ్యలక్ష్మి చనువుచేసుకుని ఫరవాలేదన్న తరువాత కొంచెం సిగ్గుతగ్గింది. ఒకసారి రాజ్యలక్ష్మి తమ్ముడికి మరదలు చదువు వినిపించాలెనని ఏర్పాటుచేసింది.

ప్రక్కనగదిలో భాస్కరుడున్నాడని సత్యవతికి తెలియదు. చదవడానికి కొంచెం వెనకాముందాడింది అప్పటికీని. రాజ్యలక్ష్మి బజారుకెళ్లేదుకే భాస్కరం చదువు అని పోరాడింది. సత్యవతి చదివింది. ఆపద్యాలధోరణి వింటే తనామాత్రం చదవగలనా అని సంశయమువేసింది భాస్కరుడికి. చాలాసంతోషించాడు. పిదప హార్మోనీ సహితగానప్రదర్శనమూ, ఆంగ్ల భాషాప్రదర్శనమూ అయింతర్వాత "తమ్ముడూ! విన్నావా? వేధిస్తుంటివి" అన్నది రాజ్యలక్ష్మి. వల్లమాలినసిగ్గుతో పరుగెత్తింది సత్యవతి.

ఇది రెండునెల్లక్రిందట రాజ్యలక్ష్మికి సీమంతంచేస్తే సత్యవతివచ్చినప్పుడు జరిగినసంగతి. తనభార్య చక్కదనానికితోడు ఆమె చదువునుగురించి ఆలోచించుకుంటున్నాడు భాస్కరుడు. ఆమె తనకు సంతోషదాయిని కాగలదని అతని విశ్వాసం. తనెలా ఆమెభాషాభివృద్ధికీ సౌఖ్యమునకూ ఏర్పాట్లుచేయవలసింది, ఆమె ఏవిధంగా ప్రవర్తించేది ఆలోచించుకుంటాడు ఎప్పుడూ. తాను కవి. పద్యాలు వ్రాస్తాడు. ఆమెకు వినిపిస్తాడు. ఆమె బాగున్నాయంటుంది. తాను కథకుడు. చక్కని కథలు వ్రాస్తాడు. అందులో కొన్ని ఆమెమీదకూడాను. ఆమె విని సిగ్గుపడుతుంది. ప్రపంచకంలో మరొకరు అతను వ్రాసినవి బాగున్నవనకపోయినాసరే తనభార్య చదివి బాగున్నవంటేచాలు. తనజీవితపథంలో ఆమె తనకో గొప్పచుక్కాని అవుతుందని అతని కోసంతోషం.

3

పెళ్ళివారు వచ్చేటప్పటికే ప్రొద్దెక్కింది. "మంగళస్నానాలుచేసి తొందరగా కూర్చుంటేనేగాని మళ్ళీ భోజనాలకు ప్రొద్దుపోతుంది. రాజ్యలక్ష్మి మవ్వన్నా కొంచెంతొందరచేసి స్నానాలయ్యేట్టుచూడ్డూ" అని పెళ్ళివారితోవచ్చిన పౌరోహితుడు అరుస్తున్నాడు. ఎంతతొందరచేసినా కావలసిన ఆలస్యంకానే అయింది. పీటలమీద కూర్చుండేసరికి పదిగంటలు కావచ్చింది.

పెళ్ళికుమారుడు తలంటిపోసుకుని పెళ్ళిలో అత్తవారుపెట్టిన పట్టుబట్టలు కట్టుకునివచ్చి కూర్చున్నాడు. "పెళ్ళికూతుర్నికూడా తీసుకురండమ్మా. శే, రాజ్యలక్ష్మి! శే." అని పౌరోహితుడు కేకవేశాడు. రాజ్యలక్ష్మి లోపలికివెళ్ళింది. పెళ్ళికుమార్తె ముస్తాబయి తల్లిప్రక్కనుంచొని ఉంది. తల్లి రమ్మంటోంది. "తలుపుసాటుకుని ఎంతసేపటికి బయలుదేరదేమిటమ్మా" అని రాజ్యలక్ష్మినిచూసి వెంకాయమ్మగారు (పెళ్ళికుమార్తెతల్లి) అన్నది. "సరేలే. సిగ్గులన్నీ తర్వాత. తొందరగా. ఆలస్యం అవుతోందిట" అని రాజ్యలక్ష్మి నవ్వుతూ బుజ్జగించింది. సత్యవతికి దోవకూడా కనపించడంలేదు. రాజ్యలక్ష్మి చెయ్యిపట్టుకుని దోవజూపించి పీటమీద కూచోబెట్టి ప్రక్కనే కూర్చుంది.

భాస్కరుడికి ఈసిగ్గేమి అర్థంగావడంలేదు. ఓరకంటితో ప్రక్కకు చూశాడు. తలవంచుకుని కాలిగోళ్ళతో నేలమీద రాస్తున్నది సత్యవతి. "ఇదివరకెన్నిసారులు ఒకయింట్లో ఉన్నాము మాట్లాడలేదన్నమాటగాని. తను ఉన్నప్పుడు ఇతరులతో మాట్లాడడానికి మొదట మొదట కొంచెం సిగ్గుపడినా తర్వాత బాగానే మాట్లాడుతూ ఉండేదిగాదూ, తనకు ఎన్నిసారులు బయటినించిపిలిస్తే తలుపుతీసిందికాదు. అయినా ఇంతమందిలో ఈలాకూర్చోవడం సిగ్గుగాదూ. ఈ ప్రదర్శన మేమిటి? వీరంతా ఈ చూడరావడ మేమిటి?" అని ఆలోచించుకున్నాడు అతను.

హాల్లో ముత్తైదువలుకూడా చాలామంది వచ్చారు. సత్యవతి స్నేహితురాండ్రు చాలామంది ఉన్నారు. వాళ్లకు ఆవోముచ్చట. వాళ్ళు ఎవళ్లతోనూ ఈలాజరిగింది అని చెప్పలేరుగాని వాళ్ళలోవాళ్ళు ఏమో ఆనందపడతారు. పసిపిల్లలుకూడా అక్కడ చాలామంది కూర్చున్నారు. వాళ్ళకు అక్కడ జరిగేదేమీ అర్థంగాదు. వాళ్ళకల్లా ఆరోజున ఆయింట్లో భోజనాలు.

భాస్కరుడు తనమనస్సులో ఏదో ఆలోచించుకుంటున్నాడు. ఆ ఆలోచన కంతూపొంతూలేదు. సత్యవతి ప్రతిరోజూకన్న అతనికి అందంగా కనపడుతున్నది. అతను తన అదృష్టాన్ని అభినందించుకుంటూ రాబోయే సౌఖ్యాలు ఆలోచించుకుంటున్నాడు. కళశం ఎత్తి నీళ్ళుపోస్తున్నాడు. పౌరోహితుడు చెప్పినవన్నీ చేస్తున్నాడు కాని మనస్సుమాత్రం పరుగెత్తుతోంది. ఫల

ప్రదానాల వేళయింది. పళ్లెంలో తాంబూలాలు, ఖర్జూరపండ్లు పెట్టించి "ఇద్దరూ పుచ్చుకోండి" అన్నాడు పురోహితుడు. భాస్కరుడు పుచ్చుకున్నాడు. "నీవు కూడానమ్మా" అన్నాడాయన. సత్యవతి అతికష్టం మీద చెయ్యితీసి పళ్ళెన్ని తాకింది. ఇంతలో ఒక ముసలాయన "అలా కాదండి. శాస్త్రం ఏమిటంటే పిల్లనడుంమీదుగా చెయ్యివేసి పట్టుకోవాలె పళ్లెం ఇద్దరూ కలని" అన్నాడు. నిజమేనని కళ్ళుకూడా కనపడని మరొక ముసలాయన బలపరిచాడు.

"ఏలాగయినా ఫరవాలేదండి" అన్నాడు పురోహితుడు. పెద్దవాడయినా చిన్నవాళ్ళ అభిప్రాయాలు తెలిసినవాడు.

"అలా కాదు. అలా చేయకపోతే తప్పుకూడానూ" అని మొదటి ముసలాయన.

"నిజమే, అందాకా ఎందుకు? మా నాయనగారు ఒకసారి దీనివిషయమై చర్చవచ్చినప్పుడు చెప్పారు అలాచేయకపోతే తప్పని. ధర్మశాస్త్రంలో అలాఉన్నప్పుడు అలా చెయ్యకపోతే దోషం."

ఈవిషయమై పెళ్ళికుమారుడు, పెళ్ళికుమార్తెల అభిప్రాయం పుచ్చుకుంటేనో?

"సరే, అలాగే కానీయండి" అని పురోహితుడు భాస్కరుడితో "మీదిగా చెయ్యివేసి చెయ్యి ఇటు రానిచ్చి పళ్లెంపుచ్చుకో, నీవుకూడా పట్టుకోఅమ్మా" అన్నాడు. భాస్కరుడు మనస్సులో ఏలాఉన్నా తొందరగా చెయ్యలేకపోయినాడు.

"ఊఁ. ఆలస్యంచేస్తే గాదు. వేళమించిపోతోంది, పన్నెండుదాటింది చూశావా!" అని పురోహితుడు అదిలించాడు.

తప్పని సరిఅయింది భాస్కరుడికి. మీదిగా చెయ్యి వేస్తుంటే ఒళ్ళుగరిపొడిచింది. అంతమందిలో అలా చేస్తుంటే తనకే ఏమిటో చాలాకష్టంగానుంది. కార్యం అంటూ ఒక తతంగంజరపడం, ఊళ్ళోవాళ్ళు యావన్మందీరావడం, వాళ్ళందరిమధ్యా తాను భార్యనడుము మీద చెయ్యివేయడం అతని కేమీ బాగుండలే. అసంతుప్తిగా తోంచనికాదు. భార్య సిగ్గులోవంచుకున్న మొహం అతనికి కనపడ్డది. ఆమె ఎక్కువసిగ్గుపడుతున్నదని అనుకున్నాడు. అందులోనూ వాళ్ళందరూ అలాకావనీ, ఈలాకావనీ సిద్ధాంతాలు, రాద్ధాంతాలున్నూ. "నే నాపని చెయ్యనండీ" అని నిర్మొహమాటంగా అనాలనిపించింది. కాని అనలేకపోయినాడు. అంటే ఏమౌతుందో ఆలోచించుకున్నాడు ముందరనే. వాళ్ళ నాన్న వస్తాడు "నాయనా, చెప్పినమాటవినా, పెద్దలంతా చెప్పుతుంటేనూ" అంటాడు. అమ్మవచ్చి "ఏమిట్రా భాస్కరం! అకేమిటి ఎందుకూ మగవాడికి నీకుగూడా అసిగ్గా?" అంటుంది. అక్కగారుకూడా వస్తుందేమో. వచ్చి "తమ్ముడూ తొందరగా కానీ. ఆలస్యమయిపోతుంది అన్నానికి ఆకలి అవుతోంది" అంటుందేమో. అతని కేమీ తోచలేదు. ఒకవేళ తనుగూడా పెళ్ళికుమారుడిగా గాక ఆ సభాజనంమధ్య ఉన్నట్టయితే అందరిమాదిరిగా సంతోషించేవాడే నేమో అని తోచింది.

చివరకు నడుముమీదిగా చెయ్యివేసి పళ్లెంపట్టుకున్నాడు. ఆమెకూడా పళ్లెం మెల్లగా తాకింది. నడుము మీదిగా చెయ్యివేసిం తర్వాత చుట్టుప్రక్కలవాళ్ళు ఏమనుకుంటున్నారో అనే ఆలోచనబలమయింది. కాని తలఎత్తి ఇటుఅటు చూడలేకపోయినాడు.

ఆడవాళ్ళల్లో పన్నెండేళ్ళఅమ్మాయి వీళ్ళవైపు చూసి అమితంగా సంతోషిస్తోంది మనస్సులో. ముసిముసినవ్వులు నవ్వుతోంది. ఏదో పరమానందం అనుభవిస్తోంది. ప్రక్కనున్న ఆపిల్ల ముత్తవతల్లి చూసి "ఏమే ఎందుకు అంత ఉబలాటం రేపు నీ మొగుడూ ఇంతేలే" అన్నది. ఆపిల్ల "చాలులేకూ" అని చాలాసిగ్గుపడి మొహం చిన్నబుచ్చుకున్నది.

ఆసమయంలో తను అటువైపు చూడనట్టునటిస్తూ దొంగతనంగా ఈదంపతులవైపు చూస్తున్నాడు సంభావనకువచ్చిన ఒక సంస్కృతవిద్యార్థి. ఒక ముసలాయన ఆ దొంగతనం కనుక్కొని "ఏం చూస్తావురా శేరయ్యా! రేపు నీవూ ఇంతేలే" అన్నాడు. శేరభొట్లు చిరునవ్వునవ్వుతూ తలవంచుకొని సిగ్గుపడ్డాడు.

వాళ్ళింటికివచ్చి ఎప్పుడూ ఆడుతుండే ఓ అమ్మాయి పదేళ్ళదివచ్చి "సత్యవతీ" అని పిలిచింది. సత్యవతి తలన్నా ఎత్తి చూసిందికాదు సిగ్గుతో.

కొంతసేపయిన తర్వాత భాస్కరుడు అంతా ఏమనుకుంటున్నారో చూద్దామని అనిపించి తలఎత్తి అటూ ఇటూ పరకాయించి చూశాడు. అతనిచూపులున్నూ, అక్కగారిచూపులున్నూ కలుసుకున్నయి. ఆమె చిరునవ్వు నవ్వింది. అతనికి సిగ్గువచ్చి తలవంచుకున్నాడు.

ఫలప్రదానాలు అయిపోవడంతోటే తతంగం కానిచ్చి తొందరగా పీటలమీదనించి లేవతీసేటప్పటికి ఒంటిగంటయింది. పెళ్ళివారు విడిదికి వెళ్ళివచ్చి భోజనాలయ్యేటప్పటికి మూడుదాటింది.

౪

రాత్రి తతంగంకూడా అయింతర్వాత భోజనాలూ పిదప పాన్పూ అదీను.

ఆ రాత్రి భోజనాలముందర కొంచెం గందరగోళమయింది. పెళ్ళివారి ఆడవారికి ప్రత్యేకం ఒక చిన్న గదిలో భోజనాలు ఏర్పాటుచేశారు. పెళ్ళివారి ఆడవాళ్ళు సంగరూ కూర్చుండేసరికి ఆ గదిలో చోటు చాలిందికాదు. వాళ్ళు అలాగే ఒత్తుకొనికూర్చున్నారు. విస్తళ్ళువేయడానికివచ్చినాయన విస్తళ్ళుసరిగా పడక పోవడంచూసి ఆ గదిలోనే ఒకమూల చిన్నగంపలు ఆపేసివేయించడానికి ఏర్పాటు చేయుత్తున్నాడు. ఇంతలోకే పెళ్ళికుమార్తెతల్లి వెంకాయమ్మగారు పచ్చడి వడ్డిస్తూవచ్చింది. చోటుకూడా అప్పుడే ఖాళీఅయింది. సర్దుకొంటూ ఒకావిడ అన్నది "సర్దుకోండర్రా. విశాలంగా కూర్చోండి, పెళ్ళివారింట్లో కూచోటానికన్నా చోటులేదనుకుంటారేమో" అని వరసచేసుకుని.

వెంకాయమ్మగారు ముక్కోపి. స్వాతిశయం తోడయింది. ఇదివరలోనే ఆమెకు వియ్యపురాలు సీతమ్మగారికీ మాటమాట జరగడం, తగాదాలు పెరగడం అయింది. వెంకాయమ్మగారు చాలా గడసరికూడానూ. ఏమాత్రం సరిపెట్టుకుపోదు. 'ఎందుకు పోవాలె' అని ఒకధీమసా.

ఆమె ఆమాటవినడంతోటే అందుకున్నది "పెళ్ళివారింట్లో చోటు ఎక్కడినించివస్తుంది" అని ఆ గదిలోనించి ఇవతలకాలుపెడి "పెళ్లికివచ్చినంతగుంపు కార్యానికివస్తే పెళ్లివారింట్లో చోటు ఎక్కడినించివస్తుందీ. ఇంతమందివస్తారని పందిళ్లూపాకలూ వేయించలే" అని వాదించుకుంటూ వెళ్లిపోయింది.

పెళ్లివారి ఆడవారిలో గోలపుట్టింది. సీతమ్మగారికి తలవంపులయింది. అందర్నీ తీసుకువచ్చింది తను. అందరికీ మర్యాద జరుగవలసినబాధ్యత ఆమెది. ఏమి అనకుండా ఊరుకుంటే తన బంధువులకు కోపంవస్తుంది. అవమానంగానూ ఉంది. అందులోనూ వియ్యపురాలు మహాగడుసు అని ఇదివరకే తెలుసు. పెళ్ళిలో ప్రతివిషయంలో గిల్లి ఖజ్జాపెట్టుకుంది. ఏమి అనకుండా ఊరుకుంటే ఆమె మరీమాటలు మీరుతుంది. కోపం వచ్చింది. అసలే ఆడది. నామర్దామాటలు వినేటప్పటికి కోపంపెరిగింది. "లేవండర్రా! పెళ్ళివారిగుంపుకు ఈవిడ దేమిపెట్టక్కర్లేదు. పెళ్ళివారెవరూ ఈవిడ సత్రంలో జారిపడడానికి రాలేదు తేరగా వచ్చిందిగదా అని. లేవండి!! చాలు ఈ మర్యాదా అదీను." అని లేచింది అంతటితో అంతా లేచారు.

ఈగోల నిముసంలో మధ్యహాలులోనూ, అరుగుల మీద కూర్చున్న మగవాళ్ళచెవిని పడ్డది. అంతా లోపలికి వచ్చారు సర్దడానికి.

ఇంతట్లోనే లోపలినించి వెంకాయమ్మగారు అంటున్నది - ఎవరో చెప్పారుకాబోలు - "వెళ్ళితే వెళ్ళనీ. ఇంతమంది వస్తే చోటు ఏంచాలుతుంది అన్నానూ. చాలాగొప్ప తప్పే. పోనీ వెళ్ళి వండుకు తింటారు. ఇంతమంది వచ్చినప్పుడు వండుకుతినలేరూ!" అని. అందరూ వింటున్నారు. మగవారుకూడా తయారు అవుతున్నారు వెళ్ళిపోవడానికి. రాజ్యలక్ష్మిమాత్రం తల్లి ఏమో అనబోతుంటే ఊరుకోవమ్మా అని అణచి పెట్టుతున్నది.

వీళ్ళు అందరూ తయారవడం చూసి శివావధాన్లుగారు లోపలినించివచ్చి "బాబూ ఊరుకోండి. వెళ్ళిపోకండి. మాయింట్లోదానిబుద్ధి తక్కువయింది. నేను

కేకలువేసివచ్చా రెండి. నామాటవినండి. అక్కగారూ భోజనంచేసి మరీ మీయిష్టంవచ్చినట్టు కానివ్వండి." అని చాలా బ్రతిమాలుతున్నాడు. ఊళ్ళో పెద్దలు కూడా "అలాగే కానీయండి" అని కలహోయిస్తూ "ఆబ్రాహ్మడు మంచివాడు" అని సర్దారు. అప్పటికు భోజనాలేలాగయితేనేం అయిపోయినయి. భోజనాలయ్యేసరికి బ్రహ్మప్రళయమయింది.

భోజనాలయి పెళ్ళివారు విడిదికి వెళ్ళుతుంటే శివావధాన్లగారుకూడా వెంబడించారు. అందరూ విడిది చేరినతర్వాత అవధాన్లగారు క్షమించవలసిందనీ, ఈ లాంటిపని జరిగినందులకు చాలా విచారిస్తున్నాననీ, తనయింటిది ఏదో తెలివితక్కువగా అన్నదనీ చెప్తూ ఉంటున్నాడు. ఇంతలోనే ఇంటిలో ఆడవాళ్ళల్లో గుసగుసలు బయలుదేరినయి. ఈపూట ఏమైనాసరే బయలు దేరాలిసిందేనని. మనిషి కొకమాట మాట్లాడుతున్నారు ఆడవాళ్ళు. "ఆడదిగదా! మగవాళ్ళు ఉన్నారేన యినా చూడకుండా యిష్టంవచ్చినట్టు గుంపువచ్చా రని అంటుందా? ఏమయినా పనిపట్టాలిసిందే. ఈవిడ తేరతిండి తినడానికి వచ్చామా మనమంతా పెట్టేదాత వచ్చిందిగదా ఒకరోజు గడిచినా గడిచినట్టేనని. ఈ పూటనే బయలుదేరండర్రా. ప్రయాణాలు కాండి" అని నోటికొకమాట.

"ఏమిటర్రా అకేకలు" అని రామశాస్త్రిగారన్నారు.

"ఇంతగోలచేసేంతర్వాత నామర్దాగా మనవాళ్ళు ఉండరట" అని లోపలినించి జవాబు

వెంటనే శివావధాన్లగారు అందుకుని రామశాస్త్రి గారిచేతులు పట్టుకుని "క్షమించండి. ఇప్పుడు ఎటు గాని వేళ వెళ్లకండి. ఇవ్వి చేతులుకాళ్ళు కాళ్ళనుకోండి. మనవాళ్ళతోగూడా చెప్పుతాను" అని లోపలికివెళ్ళి. "అమ్మా పొరపాటయింది. ఈమాటుకు క్షమించండి. దానిసంగతి ఇదివరకే తెలుసుగదా. నన్నుచూసి అయినా ఊరుకోండి" అన్నారు.

"అన్నగారూ! మిమ్మల్నిచూసి అవిడ అంటుంటే చేతగానట్లు ఉండమన్నారూ?"

"పడమంటంకాదు. మామర్యాద కాపాడండి. ఈ కాస్తపని అయింతర్వాత మీయిష్టం" అని సర్దుబాటు మాటలు చెప్తున్నాడు. వెళ్ళవలసిందే అని ఆడవాళ్ళ పట్టుదలమాత్రం ఎక్కువ అవుతున్నది.

భాస్కరరావు అక్కగారిదగ్గరకు వెళ్ళి "అక్కాయి. ఎందుకీగోల. ఎందుకు వచ్చిన అప్రతిష్ఠ. వాళ్ళింటికి వచ్చాం గనుక అవిడ యిష్టంవచ్చినట్టు అన్నది. ఆసంగతి తరువాత చూచుకోవచ్చుగాని ఇప్పుడేమిటాపట్టు. ఆయనతో ఎందుకు? అమ్మతో చెప్పు." అన్నాడు.

రాజ్యలక్ష్మి అమ్మదగ్గరకు వెళ్ళి "ఏమిటే అమ్మా! ఇప్పుడీగోల. ఈరాత్రి కానిమ్మనోని సత్యవతినికూడా తీసుకువెళ్ళి ఇవాపంపకు. అది బాగుంటుంది. ఇప్పుడా గోల పెట్టాలిసిందీ" అని చెప్పి నాన్నగారిదగ్గరకు వెళ్ళి పెళ్ళివారింటికి వెళ్ళప్రయత్నంచేసింది.

పెళ్ళివారు తనయింటికి బయలుదేరే ప్రయత్నంలో ఉండడంచూచి శివావధాన్లు క్షమించమని మరోమాటు కోరుదామని ఇంటికివెళ్లాడు. వెళ్ళగానే పెళ్లాన్ని "నీదుంప తెగా! నీతో నాకు చావనిచావు, బతకనిబతుకూ అయింది. వెధవముండవు చావనా చావ్వవుగావు. గత్తరవచ్చి నాకోసమే బతికావు. వెధవవాగుడు వాగి ప్రతిచోట నాకు తలవంపులే. నీకేం పోయేరోగం వచ్చింది? మర్యాదా మంచీ అక్కర్లేదు. వాళ్ళని బ్రతిమాలుకునేటప్పటికి బ్రహ్మదేవుడు దిగివచ్చాడు. వెళ్లిపోతామని కూర్చుంటే గడ్డంపట్టుకుని బ్రతిమాలుకున్నాను. వెధవకుంటిమాట అని అకొంపా చెడగొడతావు. వెధవవంశం ఎక్కడ దాపరమయిందో చంపుకు తింటున్నావు. ఈపూటకైనా ఊరుకో. వాళ్ళను గుమ్మం దాటనీ" అని కోపంకాకుండా బ్రతిమాలడం కాకుండా ఆయనతిప్పలు ఆయనపడ్డాడు. అవిడ జన్మంలో మొగుడిమాటకు సమాధానం చెప్పకుండా ఉండలే. అదే మొదటిసారి. చాలామంది కొత్తవాళ్లు ఉన్నారనో మరిదేనికో.

పెళ్లివారు వెళ్లుతామన్నమాట అవిడ్కి ములుకులా తాకింది.

౫

పెళ్లివారు మళ్లీవచ్చారు పాన్పువేసే ప్రయత్నంలో ఉన్నారు. దంపతులందర్నీ విడిదిలో ఉండకుండా రామశాస్త్రిగారు తీసుకువచ్చారు. వీళ్లపనిలో వీరున్నారు. ముసలిదంపతులు తాంబూలాలు తొందరగా తీసుకొని పోయినారు. నూతనదంపతులదగ్గరనే వచ్చిందిచిక్కు. వాళ్ళు సిగ్గుపడడంచూసి అమితంగా నవ్వుతూ, వాళ్ళు సిగ్గుపడినకొద్దీ భర్తలచేత భార్యలచేతులలో తాంబూలాలు పెట్టించుతున్నారు. అదిఅంతా ఆనందవీథిలాగా కనుపట్టుతున్నది.

ఇద్దర్నీ గదిలోకి పంపారు.

ఈసమయం వెంకాయమ్మగారు వృథాగా పోగొట్టుకోలేదు. వాళ్ళు వెళ్ళిపోవాలె ననుకున్నారన్న సంగతి ఆమెకు చాలా కోపం తెప్పించింది. దాని విషయమై చాలాసేపటినించి ఆలోచిస్తున్నది ఆమె. కోపంపట్టజాలక చివరకు "వెళ్ళుతాం, వెళ్ళుతాం, అని బెదరింపుమాటలు కామాలు. వెళ్ళకుండా ఊరుకున్నారేం! బెదిరిస్తే ఎవరు బెదురుతారేమిటి? తెలివిగలవాళ్ళయితే వెళ్ళాలి." అని కోపంకాస్త వెళ్ళబుచ్చింది. అందరూ విన్నారు.

రామశాస్త్రిగారికి చాలాకోపంవచ్చింది. సీతమ్మగారుకూడా కోపగించుకున్నది. ఇద్దరూ ఒకచోట చేరారు. మిగిలినవాళ్ళు వారిచుట్టూ చేరారు. తలా ఒక మాటా చెపుతున్నారు. రామశాస్త్రిగారు వెంటనే బయలుదేరే ప్రయత్నం చెయ్యమన్నారు. ఆ కోపంలో రాత్రి ప్రయాణంసాగించడం కష్టమనేమాటే వారికి తోచలేదు.

అందరికీ వెళ్ళిపోవాలెనని మాత్రం గట్టిగా ఉంది. తెల్లవారుజామునైనా ప్రయాణం తప్పదని ఆలోచింతుకుంటున్నారు. కాని అప్పుడు జరిగిన అవమానానికి ప్రతీకారంమాట? ఎవరికీ తోచలేదు. రాజ్యలక్ష్మి అన్నది "ఇప్పుడు మనమేమీ మాట్లాడవద్దు. మాట్లాడి అనవసరంగా చెడ్డపేరు తెచ్చుకుంటాం. వాళ్ళన్నవి ఎవరికీ తెలియదు. మనంవెళ్ళడం వెల్లడవుతుంది. ఇందాకా వచ్చింతర్వాత అన్నీ ఇబ్బందులే. తెల్లవారిందాకా ఓర్చుకొని తెల్లవారుజామునే ప్రయాణం చేద్దాము. పిల్లను వాళ్ళు పంపుతారా పంపుతారు. లేకపోతే తరువాతసంగతి చూడవచ్చు." అని అందరూ సరేనంటే సరేనన్నారు.

భాస్కరరావుకు ఈజరిగిన విషయాలు మనస్కరించలేదు. తాను సంతోషంగా ఉన్నప్పుడు ఈలాంటివి జరగడం ఉత్సాహభంగంగా ఉంది.

అతను ఈ జరిగిన విషయం ఎంత మరిచిపో ప్రయత్నించినా అతని సంతోషసుధాకరుడికి ఈ కళంకం తప్పిందిగాదు. సుధాకరుడి ప్రకాశం ఎక్కువైన కొద్దీ కళంకం తగ్గింది ఏమాత్రమైనా.

* * *

తెల్లవారుజామున్నే లేచి పెళ్ళివారు వెళ్ళే ప్రయత్నాలు చేశారు. తాము వెళ్లవలసిఉందనీ, నిద్రలేవగానే కొడుకును కోడల్ని పంపవలసిందనీ రామశాస్త్రిగారు కన్యాదాతగారింటికి కబురుచేశారు. శివావధాన్లుగారు తిరిగి వాళ్ళ బేరానికి తయారయినారు. కాని ఎవరూ కూడా ఈతడవ కనికరించలేదు. రామశాస్త్రిగారు బాగానే పట్టుపట్టారు. "పెళ్లివారంగదా? గడ్డిపోచ మాత్రమయినా విలువచేసినట్టు మాట్లాడకపోతే! మేం యిహ ఉండమండీ, ఇష్టమయితే మీకుమార్తెను పంపండి లేకపోతే మానేయండి." అని రామశాస్త్రిగారు నిర్మొహమాటంగా చెప్పారు. పాపం! శివావధాన్లుగారు ఇంటివద్ద భార్యకూ చెప్పలేదు. ఇక్కడ వీళ్ళకూ చెప్పలేదు.

శివావధాన్లుగారు యింటికి వచ్చి పెళ్ళాంమీద కేకలులాంటివి వేస్తున్నాడు. ఆమె వీటిని వింటున్నట్టే లేదు. ముందు ఏం జరుగుతుంది? అల్లుడు వెళ్ళుతాడా? ఇవ్వే ఆలోచనలు, ఇంతలో తెల్లవారింది. రామశాస్త్రిగారు మనిషిని పంపాడు. అతను వచ్చేసరికి భాస్కరరావు లేచి మొహంకడుక్కుంటున్నాడు. నాన్నగారు బయలుదేరి రమ్మన్నారని వినగానే మొహంకడుక్కోవడం పూర్తిగానిచ్చి భాస్కరరావు బయలుదేరాడు. ప్రస్తుతం జరుగుతున్నరగడలో తనువెళ్ళడం అత్తమామలు మెచ్చరు గనక అతనికి వాళ్ళతో చెప్పడానికి

మనస్కరించలేదు. భాస్కరుడు బయలుదేరుతుండగా మనిషివాడు "అమ్మాయిగార్నికూడా తీసుకురమ్మన్నారండి తమర్ని" అని శివావధాన్లుగారితో చెప్పాడు. ఆయన ఏమీ మాట్లాడలేదు.

అల్లుడు బయలుదేరుతోంటే వెంకాయమ్మగారికి ఒళ్ళు మండుకుపోతోంది. అతన్ని చాలామాటలు అనాలెనని అనుకుంది. అనలేదుగాని ఏగుణానఉందో. కూతుర్ని పంపుమని అనేసరికి కోపజ్వాల ప్రజ్వరిల్లి 'మా అమ్మాయిరాదు. మేం పంపమని చెప్పు. బెదిరించి వెళ్ళుతున్నారుగా, వెళ్ళనీ. ఆయనకు పెళ్ళాంకావలెనని వచ్చినప్పుడే ఆరొను" అన్నది.

భాస్కరరావుకు ఈమాటలు వినేసరికి అమితకోపం వచ్చింది. ఈమె ఒక్కర్తె మూలకంగా కాకపోతే కార్యం యథావత్తా సలక్షణంగా జరిగేదని అతనికి తెలుసు. ఎప్పుడూ ఆవిడయింతే మొట్టమొదటినుంచి. ఆవిడను సమాధానం యివ్వడంకూడా సామర్ధ్యా అని అతను మాట్లాడకుండా వెళ్ళాడు. కాని అల్లుడనైనా విచారించకుండా అన్న ఈమాటమాత్రం హృదయం తొలిచేసింది.

ఆమనిషి ఆ మాటలు రామశాస్త్రిగారికి చెప్పాడు. వాళ్ళకోపాగ్నికి ఇంధనం వేసినట్లయింది. "పంపకపోతే మాని. వచ్చినప్పుడే వస్తుంది" అని ప్రయాణాలు సాగిస్తున్నారు.

౬

సత్యవతికూడా జరిగినసంగతంతా వినకుండా ఉండలేదు. తప్పుకూడా తల్లిదేనని తెలుసు. ఇదేమామూలు ఇంటిదగ్గర ఎప్పుడూ ఆవిడ అభిప్రాయమే ఇంట్లో అందరికీ ఆజ్ఞ. ఇంట్లో అందరికీ భావదాస్యమే. సత్యవతిగాని మిగిలినవాళ్ళుగాని ఇవి మాకు బాగుంటాయి అనడానికి వీల్లేదు. ఆమె బాగున్నదంటే అందరికీ బాగుండితీరవలె. బాగుండలేదంటే ఆ ఇంట్లో పురుగుకూడా ఆవైపు చూడకూడదు. సత్యవతికి తల్లిని ధిక్కరించవలెనని అభిప్రాయం ఉండేది. కాని భయపడేది. ఇప్పుడు జరిగింది అందరికీ నామర్దాఅయినదిన్నీ, కష్టాలు పెంచేదీని అయినవిషయం.

సత్యవతికి ఆలోచించుకోవడానికి కావలసిన సమయమైనాలేదు. కాని కొంచెంసేపటిలోనే తల్లికి ఇష్టం లేకపోయినా వెళ్ళిపోవడమేవిధి అని నిశ్చయించుకుంది. తండ్రి ధైర్యంచేసి తీసుకువెళ్ళేట్టు కనబడడంలేదు. తానైతాను తల్లితండ్రులతో ఆవిషయం చెప్పడమేలాగు? వాళ్ళు ఒప్పుకోవడమెట్లా? ఆమెకు ఏమీతోచింది కాదు. రెండు మూడుసార్లు తండ్రిదగ్గరకు బయలుదేరి సగందూరంవెళ్లి మానేసింది. కాని వేళ ఎక్కువలేదు. వాళ్లు బయలుదేరబోతున్నారో, తీరా బయలుదేరరో.

నిమిషాలమీద జరగవలసినపని చివరకు ధైర్యంచేసి తండ్రిదగ్గరకువెళ్లి ప్రక్కన కూర్చున్నది. రెండుసార్లు చెప్పవలెనని ప్రయత్నంచేసికూడా చెప్పలేకపోయింది. చివరకు "నాన్నా! ఏమిటీపోట్లాట. అప్రతిష్ఠ కాదూ నలుగురిలో." అన్నది.

"అవునమ్మా! అవును. ఏంచెయ్యను చెప్పు తల్లి మీఅమ్మ రాక్షసి. చెప్పినమాట వినదు. పదిమందిలో నాకు తలవంపులు."

ఆమాటంతట ఆయన తనవెళ్ళడంమాట ఎత్తలేదే మౌనమున్న సత్యవతికి ఆశాభంగం అయింది. పునః ప్రయత్నముచేసి "నాన్నా, నన్నుపంపకపోతే మరికొంపకష్టుందేమో" అన్నది.

"రాదమ్మా మరి. వాళ్ళతప్పేంఉంది. ప్రతిదానికి మనరాక్షసే కారణం. కోపమేవస్తుంది. ఏంచెయ్యమన్నావు? చెప్పు."

"నాను బయలుదేరేముందు అక్కడ దిగవిడ్చి వస్తేనో."

"ఆమాటఅంటే మీఅమ్మ నన్నూ, నిన్నూ విరుచుకు తింటుంది."

"ఏవిధంగానూ ఆవివాళ్లు తప్పవు ఎప్పుడో ఒకప్పుడు. నన్నుతీసుకువెళ్లి దిగడిస్తే అప్రతిష్ఠ తప్పుతుంది నాన్నా. లేకపోతే చాలా అప్రతిష్ఠ. ఆజన్మాంతం విరోధం."

"నిజమే నేనూ అదే ఆలోచిస్తున్నా తల్లీ, నీ కన్న

బుద్ధి మీ అమ్మకుంటేనా" అని కూర్చుని గాలించుకున్నాడు. కళ్ళవెంబ నీళ్ళు కారినయి. అవి తుడుచుకుని లేచి ఆయనే పెట్టె పట్టుకుని కూర్చుని వెంటవీథుబడి బయలుదేరాడు. భార్య చూసింది. ఈ ద్రోహం ఆమెకు ఏమీ అర్థంకాలేదు. అంత ధైర్యంగా భర్తబయలుదేరుతాడని ఆమె జన్మలో అనుకోలేదు. తీరా అక్కడికేవని ధృఢమైనతర్వాత గబగబ బయటకివచ్చి, "వల్లకాదు తీసుకుపోవడానికి" అని పెట్టెలాక్కున్నది. సత్యవతి తండ్రిప్రక్కనచేరి రహస్యంగా "పెట్టెలేకపోతే మానె నా నాన్నా. ఆలస్యమవుతుంది." అన్నది. అంతట ఇద్దరూ మాట్లాడకుండా నడిచి వెళ్ళారు. వెంకాయమ్మగారు నిర్ఘాంతపోయి చూస్తున్నది నుంచుని.

శివావధాన్లు రామశాస్త్రిగారిని క్షమించుమని పదే పదే కోరి, తన శక్తికిమించినపని జరిగిందనీ, కుమార్తె పెట్టెకూడా తీసుకురావడానికి వీలయిందికాదనీ, పర్యాయతీసంపుతానని, జరిగినది మనస్సులో పెట్టుకోక సత్యవతిని కుమార్తెవలె చూడుకోమనీ, రామశాస్త్రిగారితోనూ, సీతమ్మగారితోనూ, రాజ్యలక్ష్మితోనూ చెప్పి వెనక్కు తిరిగాడు.

—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ.



ఒకడు

౧

చేదయిన జీవితమ్ము నాశించినాడు
మొసలిగొంతుల హుంకరింపులకు దలకి
దిగులుపడినాడు నవనవేందీవరార్ద్ర
హృదయ సుకుమారనేత్రాల కొదిగినాడు.

దద్దరిల్లును కులపర్వతాలు; కెరలి
ఘూర్ణిమైపోవు సప్తమహార్ణవములు
పిరుచుకొని పడ్డజీవన విషమభరము
జాలిగా ఆమెకన్నుల వ్రాలినంత

గ్రుడ్ల నెత్తుటిపొంగు క్రుక్కుకొనినాడు
సానుభూతిని హృదయమ్ము చాచినాడు
గుసగుసలు పోయినారు ముక్కోటిజనులు
తొలగిపోలేదు. హృదయమందు కొనలేదు.

✤

౨

బుసలుకొట్టిన చంద్రికావిసరమందు
పసుపుకొని రేకురేకు ఆశీర్వమున్న
క్రక్కె యొకుగని దామె మౌగ్ధ్యమున నవ్వు
మల్లెపూదండ యగునె? ఈ తెల్లరాచ

ఏటిగాలికి పొంగిన పాటతీసి
కరచుకొన్నది యామెరక్తంపుపెదను
పచ్చివెన్నెల కన్నుల పరువమరసి
పాటలకు నోచుకోని నిర్భాగ్యగళము.

౩

ఒకరిజూచిన నొకరు నవ్వుకొనినారు
ఎదతెరచి యాతిథేయ మందిచ్చెనతడు
పేదకన్నుల సుధపోసి పిలిచె నామె
పిడుగు పడినది--ఇరువురు వడికినారు.

౪

పగులదన్నుము వజ్రకవాటములను
ఆవులించి గాండ్రించు సింహాల నదిమి
బొబ్బలెత్తింపు కృతసటాస్ఫోటనమున
యువక! నీస్నిగ్ధహృదయమ్ము ఉడికెనేని.

—ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి.



సింహళద్వీపం కైఫియ్యతు

[మధుర ఆంధ్రనాయకరాజు సింహళద్వీపపు రాజును జయించిన వృత్తాంతము.]

ఆ మధురనాయకుడు సకలదళసమేతముగా పోళపార్శ్వం ప్రయాణభేరిన్ని పోళపార్శ్వం జయభేరిన్ని శత్రువుగా నున్న ఖండిరాజును యుద్ధమందు కొట్టితీసిన సింహళద్వీపమేశము మరిన్ని అష్టాదశవాయిద్యములతో కూడా సకలబిరుదులతో హవుదాయెక్కి తమను ముఖ్యమున్న సింగళప్రజలున్ను సముద్రం పొంగినట్టు రోకప్రళయముగా హవుదాచుట్టున్ను ముందు వెనకాల రెండు ఆమడదూరానికి పృథక్కుపయినవ్యమున్ను నూతన ఖండిరాజు హవుదాచుట్టుకొని దారిసైన్యమున్ను వారిమంత్రులు ప్రధానులు దిశానాధులున్ను యీప్రకారం పోగి వచ్చి మన్నారుకోవిలి మాకునాత్రులు అచ్చట వేసియుంది సకలదళం వచ్చిచేరినపిమ్మట ఖండివారి దేశాల్లోవుండె వస్తువులున్ను ఆకట్టు తమసీమలోవుండే సడవలన్నియు రప్పించుకొని తమదళం పాళెమునాకులజనం అందరినిన్ని ఓడంగలు మొదలయిన దండు సామానులు సకలమున్ను వోడలెక్కించి జేవీపట్నం రేవున దిగివుండేమని పంపించి ఖండిరాజువారి శేఖరం ప్రధాని మంత్రులు దళవా అందరికిన్ని బుద్ధిమతులు చెప్పి వారివారి యెదస్థానానకు పొమ్మని అంపించి తాను దళవాయి కేశవప్పనాయుడు రాజబంధువులు మొదలయిన కార్యకర్తలు తనను ప్రియముగావుండే పాళెయపట్టు దొరకొడుకులు వారివారి పరివారకులతో మాత్రం రమ్మని మితజనముతో వోడలెక్కి రామేశ్వరానికివచ్చి సేతుస్నానంజేసి సేతువులో గజదాన అశ్వదానం సహస్ర గోదానం భూదానం సహస్రకన్యకాదానం ద్విసహస్ర ఘుఘనసువదానం అనేక భూరి మొదలయిన దానములు బ్రాహ్మలకిచ్చి రామనాధస్వామి దర్శనం అచ్చటి తీర్థములన్నిటికిపోయి స్నానతర్పతీర్థశ్రార్ధములన్నియుంజేసి నగరికట్టడ కలగజేసి అందుకు అనేక గ్రామములు దానంచేసి రామనాథ పండారాన్ని నగరికట్టడకున్ను ఆస్థలానికిన్ని అధికారం యెన్నటికిన్ని మిరాశిగావుండేమని నియమించి రెండులక్షల వరహాలు పండారంచేతికి యిచ్చి ఆస్వామికి మంటపగోపురప్రాకారాలకున్ను నగరికట్టడ గొప్పగా కట్టమనిన్ని అందుకు బంగారు వెండిపాత్రలు తక్కిన సామానులన్నియు చేయించుకొమ్మని వరహాలు దానపూర్వకముగా యిచ్చి పండారానికి పాలకీ మొదలయిన బహుమతులిచ్చి వారి మఠానికి పాలకీ సెల్వుకు ప్రత్యేకం గ్రామాలు యిచ్చి అనేకరత్నభూషణదివ్యాంబరములు స్వామికియిచ్చి ప్రయాణమై రామసేతుదాటి దర్భశయనానకువచ్చి అచ్చట సేతుస్నానం చక్రతీర్థస్నానం తర్పణంజేసి సకలదానములున్ను విస్తారముగా చేసి స్వామిదర్శనంచేసి స్వామికి అనేకఅభిషేకనయివేద్యము చేయించి అనేకరత్నభూషణపీతాంబరములు స్వర్ణరజితపాత్రలున్ను గ్రామాలున్ను విశేష గోపురప్రాకారమంటపాదులు కట్టించమని కొంతద్రవ్యమున్ను యిచ్చి అచ్చటనుంచి తిరువుత్తరకోశమంగకువచ్చి అచ్చటి తీర్థములలో స్నానంచేసి స్వామిదర్శనంచేసి అనేకరత్నభూషణములున్ను గ్రామాలున్ను గోపురప్రాకారమంటపాలు విశేషముగా కట్టమని కొంతద్రవ్యమున్ను యిచ్చి అచ్చటికి దేవీపట్నాన దిగివున్న సౌన్యమంతా రప్పించుకొని అదె ప్రయాణ

ముగా తిన్నకావల్లికివచ్చి పాళ్యం తాంబ్రపర్ణి తీర్థవర్ణ తోక మొదలు తూర్పు కృష్ణాపురంవరకు దిగింది. ఖండి రాజును తనచేత చంపించినందుచేతనున్ను వారిజనం బహుళా మృతిబొందినారు గనుక ఆదోషపరిహారార్థంగా కడయూ కృష్ణాపురంగ్రామాలు అగ్రహారంచేశి తామ్రపర్ణి పుణ్యనదిలో స్నానంచేశి బ్రాహ్మలుకు స్నానం చేశి తూర్పుపాళ్యం దిగివున్నతావున కృష్ణాపురమని తన పేరిట విష్ణుగుడి శివునిగుడిన్ని తెప్పగుంటమంటపం అగ్రహారం పట్టముున్నుకట్టించి తిన్నకావల్లి ఆలోవారు తిరునగరి శ్రీవైకుంఠం తోమ్మిది తిరుపతులున్ను తిరుచ్చెందూరు వానమామలై తిరుక్కోణంగుడి మొదలయిన దివ్యదేశములన్ని సేవించి ఆ స్థలాలకంతా గ్రామాలు రత్నభూషణాలు పీతాంబరాలున్ను గోపురప్రాకారాలు మంటపాలు విశేషముగాకట్టమని ద్రవ్యములిచ్చి అందుకంతా తగుమనుష్యులనేమించి ప్రయాణభేరి వేయించి దక్షిణాభిముఖంగా పాళ్యంసాగించుకొని కన్యాకుమారికి వచ్చి దర్శనంచేసుకొని అమ్మవారికి కావలశిన భూషణాదులున్ను దివ్యాంబరాలున్ను తిరుపణికి ద్రవ్యమున్ను గ్రామాలున్ను యిచ్చి సుచీంద్రానకు వచ్చి స్వామిదర్శనంచేశి ఆ స్థలానికిన్ని కావలశిన వస్త్రభూషణములున్ను యిప్పించి అచ్చటనుండి మలయాళం రామరాజును జయించి కప్పంతీసుకొని అచ్చటనుండి కొచ్చిమీదికి పోయి ఆ రాజును జయించి కప్పంతీసుకొని అచ్చటనుండి కొల్లాటుకు పోయి ఆరాజును జయించి కప్పంతీసుకొని అచ్చటినుండి పాలకాటిచేరికివచ్చి ఆరాజును జయించి కప్పంతీసుకొని అచ్చటనుండి కోయంపుత్తూరికివచ్చి మయిశూరివారికిన్ని పిరికిన్ని వోడంబడికలు

ఉషః

౧

నిశ్శబ్దః పర్వతతుంగశృంగభాగః
నీరాగం వ్యోమ నిశ్చలాభూమిః
నిస్తబ్ధః పాదపరాజిరేవ సాంద్రః
సంధ్యాకాలః కిమద్య సర్వేషాం?

౨

మధుర మధురానుగీతాః
ప్రాణిహృదానందజాతసంగీతాః
కిమివ మహనీయ తేజః
సూచిత మావిర్భవిష్య తీత్యాభిః!

౩

లలితమంగళ సువర్ణవృష్టిభిః
లలితలౌకికతమోవిజృంభణః
అవిరతప్రకటితేశ్వరాకృతీ
రవిరుదేతి పరమార్థ దేశికః:

—నుంచర్ల సీతారామయ్య.

తీర్చి కట్టించింది సరిహద్దు వ్యాజ్యములన్నియున్ను తీర్చుకొని జయస్తంభంవేశి దండుసాగించుకొని కనమకింద పద్దెనిమిదిగళ్లున్ను కట్టి ముక్తిపురాయమని తగుమనుష్యులను నేమకంచేసి రాణాలకున్ను సరుదార్లను నిశ్చయించి రాజధానియయిన మధురకు విజయంచేసి మీనాక్షిసుందరేశ్వరుల దర్శనమున్ను చేశి సంతోషచిత్తులై రాజ్యపరిపాలనం చేస్తావుండిరి. తర్వాత మధురదిరుతనాపల్యసముత్థానంపుండె పర్యంతరం ఖరారు చేస్తున ఖండిదేశంవారున్ను మలయాళ రామరాజున్ను పేరతస్పక వదుస్తావచ్చిరి. సముస్థానం యొత్తసడ్డనిమ్మట శివగంగములో వచ్చాదిక గ్రామములో నాకు నగరున్ను కట్టించి రామనాథపురంవారున్ను శివగంగవారున్ను గ్రామములున్నుయిచ్చి మాకు కావలశినదిన్నియిచ్చి నడిపించిరి గనుక యిట్లావుండగా ఖండిదేశంలో యిప్పటి రాజుకు ముందటి రాజుకు ముందటి రాజు మాతాతగారిదినాల్లో కొన్ని వస్త్రభూషణములున్ను అక్కడి అపూర్వపదార్థములున్ను యిచ్చి వారికార్యకర్తలను పంపించి వారిని పూర్వాచారప్రకారం మరియాదలు తప్పకుండా వచ్చుచుకొమ్మని చెప్పిపంపించి వార్లు అచ్చటికి వచ్చి కన్యకార్థముగా మనవి చేసుకొన్నప్పుడు మాతాత విజయరఘునాథముద్దు తిరుమలనాయనయ్యగారుచెప్పింది మీరాజు యిచ్చటికి వచ్చేదిలేదు. మేము అచ్చటికి వచ్చేదిలేదు గనక వివాహం పెట్లానడుచును సరిపడదు పొమ్మని వార్లుతెచ్చిన పదార్థములు పొప్పుకొనక పంపించి విడిచిరి. అటుతర్వాత రుధిరోద్గారి సంవత్సరం యేసగలసంఘటన సాయిపురామనాథపురానికి వచ్చివున్నప్పుడు యిప్పుడువుండేరాజు తనమామ అప్ప

పామినాయుడున్ను వెంకటపెరుమాళ్ళనాయణ్ణిన్ని పంపించి వారివశాన కొంత వస్త్రభూషణములున్ను కొంతద్రవ్యమున్ను యిచ్చి పంపించి నజరుగాపెట్టి కనుక్కొమ్మనిన్ని ఆపించినందున వారువచ్చి తోండమానుకి శీమలోనుంచి మారాజు తను సముఖానకు కన్యకార్థముగానున్ను తేను ఖేటీకి కొంతనజరుసామగ్రియున్ను యిచ్చి పంపించినారు. మేము సముఖానకు వచ్చేయందుకు ఉత్తరవుపంపించవలెనని వారి మనుష్యులను అంపించినయడల మాకు అన్నిసంగతులున్ను తెలిసిన పెద్దిన మీనాక్షినాయుడు రామనాథపురానికి పోయివున్నారు గనుక వారికి వ్రాశిపంపించి బదులు రప్పించుకొని మీకు చెప్పిపంపిస్తున్నామని వ్రాసి పంపితిమి. యీ వర్తమానములన్నియు మీనాక్షినాయుడికి వ్రాశి పంపించినందున అతడు కుంపిణీవారికి విహితుడో సేరస్తుడో కలక్టరును గురైనగనాయకులయును అని ఈవర్తమానములన్నియు పార్శ్వలో కాకితంవ్రాశి సంగటకాసాయిపుకు యిచ్చి వారి చనువుకొని కిరిని రప్పించి ముందు వెనక నడుచుసంగతులు యావత్తు విచారించి తెలుసుకొని రక్షింపగొమ్మని వుత్తరవిచ్చి ఆమేరకు తోండమానుడి శీమలో వచ్చివున్న ఖండి రాజామాపులను రమ్మని వ్రాశి పంపించిన ప్రకారం వారు తెచ్చిన పదార్థములన్నియున్ను యొత్తించుకొని మాఘ మాసం అయిదుఘడియలమీరం గోవానాల్లో వచ్చినది. మేము తమ సముఖానికివచ్చి ఖేటీకిసుకు సేటప్పటికి మేము నడుచుకోగల మరియాదలు యేప్రకారం నడిచి వస్తున్నదో ఆప్రకారం నడవదగ్గ సంగతులకు వ్రాశి పంపించమని స్థానా ...   — ముగిసినది.

[సింహళద్వీపముపై ఆంధ్రులదైన ఈ దాడి మధుర ఆంధ్రనాయకసంస్థాపనాచార్యుడగు విశ్వనాథనాయని కుమారుడు కృష్ణప్పనాయకుని కాలమున జరిగెను. ఇది బహుశః 1564-వ సంవత్సరమునకు పూర్వము జరిగియుండునని ఫాదరు హీరాసు అభిప్రాయము. ఆకాలమున ఆంధ్రశౌర్యము సముద్రముల నతిక్రమించినది. ఈసింహళద్వీపవిజయము ఆంధ్రులు గర్వపడదగిన విషయములలో నొకటి. కృష్ణప్పనాయకుడు విజేత; చినకేశవప్పనాయకుడు సేనాని; విజయగోపాలనాయకుడు రాజప్రతినిధి. వీరు ముగ్గురును కలసి ఆ దినములలో తెనుగుబావుటచే సింహళద్వీపపు గాలిలో రెపరెపలు పుట్టించిరి. వీరు ఆంధ్రులకు చిరస్మరణీయులు.]

ప్రకృతిగానము

౧

సృష్టిని గుణించి పాటాలపించుకొనుచు
నాయనుఁగుదాఁడి ప్రకృతికాంతాలలామ
తోడుగా వచ్చినది నాకు, వాడవాడ
లందు నిర్భయత్వం దిరుగాడినాను

౨

పాటలో నర్థమేమొ నాభావమునకుఁ
దోచనే లేదు. కాని యేదో అనూన
నిశ్చలానంద మనుభవించితిని నేను
తోణుకులేని యాగానమాధురిమలోన.

3

కోకిలకంఠాన కొనకొనరి పిల్వ
  మోహనరాగంబు మొదలుపెట్టి
ఉల్లముప్పొంగిపోఁ జల్లఁగా మెల్లగా
  ఆలపించెను పైరగాలివోలె
జలజలప్రవహించు సెలయేటినృత్యమా
  రోహావరోహాలలో తెమల్చె
ఎండిపోయిన మ్రోడుటెడదలు చివురింప
  జల్లుగురిసె సుధాస్వాదువృష్టి
ఆరఁబూచిన చిరుపూలసౌరభమయి
ప్రత్యణువునందు గానంబు వ్యాపృతంబు
ఆప్రకృతిగానమే నేను ననుకరింపఁ
దలచిపాడెద నొక్కొక్క కళయె తరచు.

— పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.ఏ.

[బరోడాసంస్థానగ్రంథాలయశాఖాధ్యక్షులు మహాశయులగు శ్రీ న్యూటన్ మోహనదత్తుగారి ఆంగ్లవ్యాసమున కిది తెలుగుసేత]

గ్రంథాలయోద్యమము.

మహమ్మదీయ మహాయుగము: గ్రంథాలయములు

§. భోజరాజు గ్రంథాలయము.

క్రీస్తుశకము పండ్రెండవశతాబ్దికి చెందిన కవిపోషకుడగు భోజరాజు గ్రంథభాండారమే రాజనిర్మితభాండాగారములలో మనకు తెలిసినవానిలో మొదటిది. కవిపోషకుడగుటయేగాక ఈ మహారాజు స్వయము కవి; పండితుడు. ఎంజనీరింగు, అర్కిటెక్చరు మున్నగు కళలను గూర్చినదగు "సమరాంగణ"మనుపుస్తకము ఆతని రచనము గైక్వాడువారి ఓరియంటల్ సీరీసులో కొలది వత్సరములకు పూర్వము ప్రచురించుభాగ్యము నాకు కలిగెను. సిద్ధరాజను పేరుగల చాళుక్యరాజు ఈభోజరాజు రాజ్యమునుజయించి ఈతని గ్రంథాలయమునుతన రాజధానీనగరమగు అన్హిల్ వాడునకు గొనిపోయి తన గ్రంథభాండాగారమున కలుపుకొనెను. ఈ అన్హిల్ వాడు నేడు పేటన్ అను నామమున శ్రీగైక్వాడ్ మహారాజావారి సంస్థానమున ఒకనగరమైయున్నది.

§. మహమ్మదీయుల దండయాత్రలు.

గజనీమహమ్మదు దండయాత్రలతో హిందూదేశ చరిత్రమున హిందూమహాయుగమునకు అత్యాపాంతమైన దనవచ్చును. గజనీమహమ్మదు దేవాలయములను నాశనముచేసెను, అర్చకులను తన క్రూరఖడ్గమునకు బలియిచ్చెను. అట్టిస్థితిలో అర్చకులు, పండితులు తమకు సాధ్యమైనన్ని గ్రంథములను గైకొనిటిబెట్టు, నేపాళము మొదలగు దూరదేశములకును, ఎడారినడుమనుండి దుర్గమమైన కెసల్ మియరు మొదలగు తావులకును, తదితర ప్రదేశములకు పారిపోయిరి.

ఇక మహమ్మదీయయుగమునందలి భారతదేశగ్రంథాలయముల చరిత్రనుగూర్చి తెలిసికొనవలసియున్నది.

§. మహమ్మదీయులు:

హిందూసాహిత్యవిజ్ఞానము.

దండెత్తివచ్చిన మహమ్మదీయులు క్రమముగ దేశపాలకులుగ నిక్కట నిలిచిపోయిరి. పాలకులుగ పాదుకొనినపిదప వారికి సాహిత్యవిజ్ఞానాభివృద్ధివిషయమున శ్రద్ధవహించుటకు సావకాశము సమకూడెను. అపుడు వారు మసీదులను కట్టించిరి; మహమ్మదీయమతవ్యాపకమునకై పాఠశాలలు పెట్టించిరి; మహమ్మదీయవిజ్ఞానప్రచారపరిశోధనలకై కళాశాలల నిర్మించిరి. కాలక్రమమున వారిదృష్టి హిందువుల మతగ్రంథములపైగూడ ప్రసరింప నారంభించెను. హిందువుల ధర్మగ్రంథములు వారియాజమాన్యమున పారశీకభాషలోనికి అనువదింపబడుటకు శుభారంభము జరిగెను.

§. ఢిల్లీనగరము.

బానిసరాజులకాలమున ఢిల్లీనగరము విద్యాశాలలకు విఖ్యాతినందెను. పలువురు విద్యాంసులానగరమునకు చేరిరి. బానిసరాజులు విద్యాగోష్ఠియందు బహుప్రీతిని చూపిరి. కవులు, పండితులు తాము రచియించిన నూతనకావ్యములను, గ్రంథములను చదువుచుండ వినుటను ఆరాజులును, ప్రధానులును ఘనకార్యముగ భావించిరి. ఖిల్జీరాజ్యసంస్థాపనాచార్యుడగు జలాలుద్దీన్ పండిత

రత్నమును, కవిరాజును అను అమీర్ ఖుస్రు అనువాని రాజభాండారపాలకునిగ నియమించి అతనికి కొరాన్ పరిరక్షకుడు అను బిరుదమిచ్చి అతని యుద్యోగమునకు మంచివేతనమును ఏర్పఱచెను. గ్రంథభాండారపాలకులలో ఈ అమీర్ ఖుస్రుకు జరిగినంత గౌరవము మఱి యెవరికిని జరిగి యుండలేదనుట అతిశయోక్తిగాదు.

§. చక్రవర్తి ఫిరోజ్ టూగ్లక్.

మొగలాయి చక్రవర్తులకు పూర్వులైన మహమ్మదీయచక్రవర్తులలో ఫిరోజ్ టూగ్లక్ నామము భారతదేశగ్రంథాలయోద్యమచరిత్రకారులకు పూజనీయమైనది. ఫిరోజ్ స్వయము పండితుడు; విశేషించి పండితపోషకుడు. విదేశములనుండి పండితులను రప్పించి వారిలో సద్గోష్ఠిసలుపుటకు అతడు ముచ్చటపడువాడు. అట్లు వచ్చిన పండితుల ఆవాసమునకుగాను అతడు రాజభవనము నొకదానిని ప్రత్యేకించెను. విద్యావంతుడగు ఈ ప్రభువు హైందవపండితులను రాజసేవలో నియమించెను. హిందువుల సారస్వతముతో పరిచయము సంపాదింప తన మతస్థులను హెచ్చరించెను. నాగర్కోట్ నందలి దేవాలయమున ఒక చక్కని సంస్కృత గ్రంథభాండాగారముండుటను అతడు తెలిసికొని పారశీకభాష నేర్చిన హిందూపండితుల పలు కార్యస్థులుగ నియమించి అచ్చటి అపూర్వగ్రంథములను కొన్నిటిని పారశీకభాషలోనికి అనువదింపజేసెను. అతని మరణానంతరము భారతదేశగ్రంథాలయోద్యమము కొంతకాలము కుంటుపడినదని చెప్పవచ్చును. ఈ కాలమున తైమూరు హిందూదేశముపై ఎత్తివచ్చి ఢిల్లీనగరమును కొల్లగొట్టెను.

§ మఱికొన్ని చిన్నరాజ్యములు.

మొగలులకాలమునాటి భారతదేశగ్రంథాలయోద్యమచరిత్రను వివరించుటకు పూర్వము ఈ కాలమునాటి మఱికొన్ని చిన్నరాజ్యములు గ్రంథాలయోద్యమవిషయమున ఎట్లు కృషిచేసినవో తెలిసికొనవలసియున్నది. అహమద్ నగరమున బహమనీరాజులు ఒక చక్కని గ్రంథభాండారమును నిర్మించి క్రమముగ నిర్వహించిరని తెలిసికొనుట కానందముగ నున్నది. ఆ రాజులు దీనికి ఒసగిన పోషణము అనంతమును, అత్యంతశ్లాఘాపాత్రమును అయినదే అయినను పదునేనవశతాబ్దిలో వారికడ మంత్రిగనుండిన మహమ్మదు గవాను చేసినదానము ముందు అది దిందుపాటు నొందుచున్నది. దక్కనునందలి భాండాగారములందు అక్కడక్కడ అతని పద్యమాలికలు నేటికిగూడ మనకు దొరకుచున్నవి. అతడు కోటీశ్వరుడగ ఎత్తినధనవంతుడేయయ్యు చేతికి ఎముకలేని సెలదాతయగుటచే మరణకాలమునాటికి అతని బొక్కసమున లెక్కకాసులుమాత్ర ముండెను. ఉన్నతభావములుగల పోడిమి జీవితమున అతడు ఋషివలె దినములు గడపెను. అతని ధనవ్యయము మసీదులు కట్టుటకు, పండితులను పోషించుటకు, గ్రంథభాండాగారములను నిర్మించుటకు వ్యయపఱుపబడెను. బీజపురమున ఆదిల్ షాహీ వంశపురాజులుగూడ నొకచక్కని భాండాగారమును నిర్వహించిరి. ఆ గ్రంథాలయమునందలి పలుగ్రంథములను ఔరంగజేబు ఢిల్లీనగరమునకు గొనిపోయినను పందొమ్మిదవశతాబ్దిని ఆగ్రంథాలయమును సందర్శించిన డాక్టరు ఫెర్గుసన్ దాని మంచిదినములలో ఆ గ్రంథాలయము బ్రహ్మాండమైనదై యుండవలెనని అభిప్రాయపడినాడు. వంగదేశమును పరిపాలించిన తొలిజట్టు మహమ్మదీయప్రభువులలో క్రీస్తుశకము 1282 మొదలు 1325 వఱకు పరిపాలనము సాగించిన నాదిర్ షా భారతదేశగ్రంథాలయోద్యమచరిత్రకారుల యెల్లరచే స్మరింపదగినవాడు. వంగభాషలోనికి మహాభారతము ప్రథమమున భాషాంతరీకరింపబడుటకు అతనిఆజ్ఞయే కారణము.

§. మొగలాయి చక్రవర్తులకాలము.

మొగలాయి చక్రవర్తులకాలమున భారతదేశగ్రంథాలయోద్యమము హుటాహుటినడలతో కొనలు సాగినదని చెప్పవచ్చును. మొగలాయి చక్రవర్తులు, రాణులు, రాజకుమారులు కళాసాహిత్యములందు మంచి అభిరుచిని, అభినివేశమును చూపిరి. మొగలాయీల మూలపురుషుడగు తైమూరు రచియించిన స్వీయచరిత్ర నేడును ఉపలబ్ధమగుచున్నది. ఈ తైమూరువలె నీతని వంశీయులును స్వయము గ్రంథకర్తలై విలసిల్లిరి. మొగలాయి రాజవంశసంస్థాపకుడగు బాబరు గొప్ప విద్వాంసుడు. 'బాబర్ నామా' అను పేరుతో అతని స్వీయ

చరిత్ర ఆతరగతివాఙ్మయములో ఎన్నదగినదై నేటికిని ప్రకాశించుచున్నది. పుస్తకములలో చిత్రములను రచియించు ఆచారమునకు బేబరు ఆద్యపురుషుడన వచ్చును. పుస్తకములు సచిత్రముగ ప్రచురించుపద్ధతి కనుగొనినది మొగలులను కీర్తిదెచ్చిన విషయముగా నేటికిని మనము చెప్పుకొనుచున్నాము. బేబరు తన గ్రంథములయం దన్నిటియందును చిత్రములను చేర్చు వాడు. బేబరు అనంతరము మొగలాయిసామ్రాజ్యము నకు నియంతయైన అతని తనయుడు హుమాయూను తాను జైత్రయాత్రలకుపోవు సమయమునగూడ కూడ నొకపుస్తకభాండాగారమును తరలించుకొని పోవు వాడు. చరిత్రకు అందిన ప్రథమసంచారగ్రంథాలయము మిదియే యని నిస్సంశయముగ చెప్పుకొనవచ్చును. ఈ సందర్భమున నెపోలియనునుగూర్చిన ఒకసంగతి పాశ్చాత్యనిబంధనమున జ్ఞప్తికి వచ్చుచున్నది. నెపోలియను పుస్తకములనిన చెవికోసికొనువాడు. మంచి పుస్తకముల నెంచి అతడు అందు ఒక్కొక్కగ్రంథమును జేబునం దిముడు చిన్నసైజున ముద్రింపించి సుందరముగ బైండు చేయించియుంచుకొని ఈ గ్రంథసంచయమును తాను ఎచ్చటికిపోయిన అచ్చటకు గొనిపోవువాడు. హుమాయూను గ్రంథాలయాభిమానము మిక్కిలి మెచ్చదగి నది. అతడు తన విలాసమందిరమును ఒక గ్రంథాల యముగ మార్చివైచెను. గ్రంథాలయప్రియుడగు ఈ రాజొకసారి గ్రంథాలయమునందుండగా కాలుజారి మేడ మెట్లమీదనుండిపడి అప్పుడు తగిలినదెబ్బలు కారణముగా మరణించెను. హుమాయూన్ తనయుడు అక్బరు పాదుషా ఒక గొప్పగ్రంథభాండాగారమును కూర్చెను. తాను జయించిన ఒక గుజరాతుదేశపురాజుయొక్క గ్రంథభాండాగారమునుగూడ నీతడు తన స్వాధీనము లోనికి తెచ్చికొనెను. తనకడ మంత్రిత్వమువహించి యున్న ఫైయిజీ అనువాని గ్రంథసముదాయమును సయితము అక్బరు తన సొంతగ్రంథసముచ్చయమున చేర్చికొనెను. ఈ పుస్తకములన్నియు మూడుభాగ ములుగ విభజింపబడెను. పద్యము, వైద్యము, జ్యోతిషము, సంగీతము అను విషయములకుచెందిన గ్రంథము లన్నియు మొదటివిభాగమున చేర్పబడెను. భాషాతత్త్వము, వేదాంతము, మతము, భూగోళశాస్త్రము, రేఖాగణితము అను విషయములకు చెందిన గ్రంథము లన్నియు రెండవవిభాగమున చేర్పబడెను. వ్యాఖ్యానములు, వంశచరిత్రలు, న్యాయశాస్త్రము అను విషయము లకుచెందిన పుస్తకములన్నియు మూడవవిభాగమున చేర్పబడెను. పుస్తకములలో చిత్రములనుచేర్చు ఆచారము ఈతనికాలమున బాగుగ పెంపొందెను. పుస్తకములను సుందరముగ బైండింగుచేయు విషయమున ఈచక్రవర్తి హయాములో అతిశ్రద్ధ చూపబడెను. మొగలాయిచక్రవర్తులు స్వయముగా గ్రంథములను ప్రోవుచేయుటయందు అత్యుత్సాహమును చూపుటయే గాక తమపూర్వులు ఏర్పఱచిన గ్రంథభాండారములను కంటవత్తికుకొని పరిరక్షించుటయందును విశేషాభిమానముచూపిరి. ఇంతటిదీక్షతో, ఇంతటిశ్రద్ధతో మొగలాయిచక్రవర్తులు సంతరించిన గ్రంథసముదాయ మంతయు క్రీస్తుశకము 1739-వ సంవత్సరమున ఢిల్లీనగరముపై ఎత్తివచ్చి దానిని కొల్లగొట్టిన పారశీకుడు నాదిర్షా చేతులలో బడెను.

౬. ఇతరరాజుల గ్రంథభాండాగారములు.

దక్షిణభారతదేశపు సుప్రసిద్ధులగు రాజులలో నొకడగు టిప్పుసుల్తాను బహుళగ్రంథములను సేకరించెను. 1799-వ సంవత్సరమున శ్రీరంగపట్టణము పట్టు కొనబడినపుడు ఈగ్రంథసముచ్చయమంతయు నాశనము చేయబడెను. లక్నోపట్టణము పట్టుకొనబడినపుడు 1884-వ సంవత్సరమున అయోధ్యనవాబు గ్రంథాలయముకూడ నిశ్శేషమయ్యెను. కాని పలువురురాజుల భాండాగారములు కాలపురుషుని నాశనఖడ్గమునకు ఎదురొడ్డి నిలచినవి. నేపాళము, కాశ్మీరము, మైసూరు, జయపురము, జోధపురము, భోపాల్, ఆళ్వారు రాజ్యములందు పురాతనగ్రంథభాండాగారములు నేటికిని సుస్థితియందున్నవి. ఆయాభాండాగారము లందలి గ్రంథములకు నేడు మంచిమంచి కేటలాగులు తయారు చేయబడియున్నవి. తంజావూరుప్రభువుల గ్రంథభాండారము మదరాసుప్రభుత్వమువారి పరిరక్షణమునంది ప్రజోపయోగకరమైన సంస్థయై ప్రకాశించుచున్నది.



దిగ్విజయీభవ

—చిత్రకారుడు: శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్ట్సు సొసైటి.



దుర్గపూజ

—చిత్రకారుడు : శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్ట్సు సొసైటి.



శ్రీ

౧

ఓ! ప్రణయినీ!
నిత్య
సీమంతినీ!
విశ్వమోహనజీవ
వేణుగానప్రభూ
తానందడోలాను
కూలయోగధారిణీ!
త్వామ్ శరణ్యం
దేవ
దేవి! రాధే!

౨

ఓ! గాయనీ!
నవ, ర
సోపాసినీ!
వివిధస్వరూపనం
వేద్యసత్యస్నిగ్ధ
కావ్యగీతాప్రపం
చవ్యక్తరూపిణీ!
త్వామ్ శరణ్యం
కలా
దాత్రి రాధే!

౩

ఓ! భామినీ!
నిత్య
నవయువ్వనీ!
ప్రణయప్రపంచమ్ము
రన్నంజావల్లకీ
నాదప్రసిద్ధతా
నామృతాస్వాదినీ!
త్వామ్ శరణ్యం
అమృత
దాత్రి రాధే!

౪

ఓ! సుందరీ!
సర్వ
శోభాకరీ!
ఆత్మరాగ స్థలా
యత్తనాటకళా
సౌందర్య భానికే
చ్ఛాయారూపధారిణీ!
త్వామ్ శరణ్యమ్
జగ
ద్ధాత్రి రాధే!

౫

ఓ! మోహినీ!
మహా
మాయావినీ!
కాలానలోజ్వలా
ఖీలదృజ్జ్వాలావి
దారితానేకమి
థ్యాభేదభావినీ!

౬

త్వామ్ శరణ్యమ్
మహా
దేవి! రాధే!

౬

ఓ! ప్రాకృతీ!
స్వీయ
భావాకృతీ!
నిర్మలస్నేహాను
స్నిగ్ధ జీవితలతా
ప్రసవదళ నిభృతమధు
పరిమళా మోదినీ!
త్వామ్ శరణ్యమ్
రూప
దాత్రి! రాధే!

౭

ఓ! ధీమతీ!
దివ్య
సారస్వతీ!
శ్రీ వసంతోద్యాన
సీమా విహంగో
కిల కలామాధుర్య
పులకితాంచిమతీ!
త్వామ్ శరణ్యమ్
జీవ
దాత్రి! రాధే!


౮

ఓ! శ్రీమతీ!
జగ
ద్భాగ్యాకృతీ
స్వీయ హావ ప్రభా
స్నిగ్ధసౌందర్యలీ
లాముగ్ధ యోగాభి
రామనుమనోరతీ!
త్వామ్ శరణ్యం
యోగ
దాత్రి! రాధే!


౯

ఓ! రసవతీ!
పురుష
రాగాకృతీ!
రూప పాపాతీత
ధీపరీతాత్మక
లావణ్యయోగైకవే
ద్యానందరూపిణీ
త్వామ్ శరణ్యం
జగ
ద్దేవి! రాధే!

—తురగా వేంకటరామయ్య.







మహిళాలోకము

స్త్రీలు వారి స్థానము

[పందొమ్మిదవ శతాబ్దమునబుట్టిన గొప్ప సంఘసంస్కర్తలలో జాన్ రస్కిన్ యొకడు. ఈతడు ఇంగ్లాండులో జన్మించెను. విద్యావిధానములో ననేకసంస్కరణములు గావించెను. స్త్రీవిద్యనుగురించియు, స్త్రీస్థానమును గురించియు నీ మహనీయుడు వెలిబుచ్చిన ఉపన్యాసము పాశ్చాత్యవిద్యాలోకము నాకర్షించినది. అట్టి యుపన్యాససారాంశములను సంక్షిప్తముగా నాంధ్రలోకమున కర్పించినచో ఆంధ్రస్త్రీసంఘమునకు ప్రయోజనకారి యగునని తలంచి యీ వ్యాసము వ్రాయుచున్నాను.]

రాజరికమననేమి? బహుయోజనవిస్తీర్ణమయిన భూమినేలుటగాదు, రత్నఖచితమైన సింహాసన మెక్కుటయుగాదు. సత్యాన్వేషియై, విద్యనభ్యసించి తత్ఫలితముగా నీతివంతుడై, ఇతరులనుకూడ ధర్మవర్తనులుగా చేయుటయే పవిత్రమయిన రాజరికము--స్థిరమయిన రాజరికము. అట్టిరాజరికమును స్థాపింపగలిగినప్పుడే విద్య విద్యయనిపించుకొనును. అది సత్యవిద్య. పురుషునితోబాటు స్త్రీకూడ నిట్టి విద్యవలన కలిగెడు సత్యరాజ్యములో నెంతవరకు భాగస్థురాలు కావచ్చును?

ప్రస్తుతము స్త్రీలయొక్క హక్కు బాధ్యతల విషయమై పెక్కుభిన్నాభిప్రాయములు గలవు. అందు రెండుముఖ్యముగ గమనింపదగినవి. (1) స్త్రీ సంపూర్ణస్వాంతత్ర్యము గలిగియుండవలెను. అన్నిహక్కులు పొందవలెను. పురుషునియెడ నెట్టిబాధ్యతనుగలిగియుండరాదు. (2) స్త్రీ, పురుషునికి కేవలము దాసిగా నుండవలెను. ఆమెకుగల వ్యక్తిత్వమును నశింపు జేసుకోవలయును.

ఈ రెండభిప్రాయములును తప్పుడు త్రోవద్రొక్కినవి. సంఘములో స్త్రీయుండవలసిన నిజస్థానమును, పదవిని, హక్కులు తెల్పవలెనంటే మహనీయు లేమిచెప్పిరో చూడవలెను. మహనీయులనగా జ్ఞానవంతులును, అనుభవవేత్తలును, పండితులును అగువారు. వారు రచియించిన మహాగ్రంథములు మనకు సాక్ష్యములు. వారి సాక్ష్యములను గైకొని వాటినాధారముగ జేసికొని నిర్ణయించవలెను.

గ్రంథకర్తలగు మహనీయుల సాక్ష్యములు:— షేక్స్పియరు మహాకవి రచియించిన గ్రంథములలో వీరపురుషులు లేనేలేరు. అందరు వీరవనితలే. అయిదవహెన్రీ, వాలెంటైన్, ఒథెలో వీరు ముగ్గురు మాత్రమే వీరపురుషపదవికి సమీపమున నున్నవారు. హామ్లెట్ శుష్కవేదాంతి. జూలియటును వరించిన రోమియో ఓర్పులేనికుర్రవాడు. సీజరు, ఆంటోనీ, కారియోలీనసు వీరు డంబముచే నశించిరి. షేక్స్పి

యరు రచియించిన కావ్యములలో, ధైర్యము, పట్టుదల, స్థితప్రజ్ఞత, సమయానుకూల జ్ఞానముగల వీరవనిత లేని కావ్యమొక్కటయిన లేదు. కార్డీలియా, డెస్‌డెమోనా ఇసబెల్లా, హెర్మియోన్‌రాణి, కాథరిన్, రాణి, పర్డితా సిల్వియా, వయోలా, రోజలిండ్, హెలీనా ఈనారీమణులందరు వీరవనితలు, ఉత్తమతరగతికి చెందినవారు. అసమానప్రజ్ఞాధురంధరలు. కార్యశౌర్యముగల వారలు. వీరు తమపురుషుల నడవడి మాంద్యముచేతను, అవివేకముచేతను గలిగిన యుపద్రవములను, క్లిష్టపరిస్థితులను తమ కుశాగ్రబుద్ధిచేతను, నేర్పరితనము వల్లను గడవగల్గి భర్తలనుకూడ రక్షించగల్గిరి. ఆకావ్యములన్నిటిని శ్రద్ధగా చదివినచో తెలియగలదు. షేక్స్పియరుయొక్క స్త్రీలు విశ్వాసమునకు పెట్టినదిపేరు. సలహానిచ్చుటలో చాణక్యునిమించిన మంత్రులు. కుశాగ్రబుద్ధిగలవారు. ఓర్పునకు పుట్టినిండ్లు. స్కాటు మహాకవికూడా పైవారివలెనే స్త్రీలయౌన్నత్యమును చాటినాడు. డేంటి - యిటలీ దేశపుమహాత్ముడు - మహాకవి. స్త్రీలకు దైవత్వమొసంగినాడు. ఇటులే రాసెట్టీ, స్పెన్సరుకవి, దాసరు మహాకవులు స్త్రీల యౌన్నత్యమును ప్రశంసించిరి. మోసెస్‌ను గొప్ప ప్రవక్తగా చేసినది యీజిప్టురాణి యొసగినవిద్యయే. నాగరకతలో పేరు బొందిన యీజిప్టువారు జ్ఞానదేవతను స్త్రీరూపమున బూజింతురు. పైదృష్టాంతములు, మహనీయులనుభవముచే చిత్రించిన కావ్యములు, స్త్రీలవిషయమయి పై నుదాహరించిన రెండుఅభిప్రాయములకు దూరములు. మనకోటి సామాన్యుల యభిప్రాయములకు వ్యతిరేకములు. మహనీయులు పొరబడిరా లేక మనము తప్పుత్రోవను పోవుచున్నామా? మనమే తెలియక తప్పుగా భావించుచున్నాము. మహాత్ములు కాలమును దుర్వినియోగము చేయరు. సత్యమును, అనుభవమును ప్రపంచమునకు జాటుదురు. జనులనడవడి యాచారములను కావ్యములద్వారా చిత్రింతురు. అట్టివారి గ్రంథములు మన కాధారములు గాక మరియేవి యగును! పై వారిసాక్ష్యమువలన, పురుషజ్ఞానముకంటె స్త్రీజ్ఞానమే యుత్తమ మని బోధపడుచున్నది. కనుక వానిఆధారమున స్త్రీకుండవలసిన అధికార స్థానములను నిర్ణయించవలెను.

స్త్రీకంటె పురుషుడెక్కువయనిగాని, పురుషునికంటె స్త్రీయెక్కువయనిగాని తలచుట గొప్పతప్పిదము. స్త్రీకున్నగుణములు పురుషునకు లేవు. పురుషునకుగలగుణములు స్త్రీలకు లేవు. కనుక హెచ్చుతగ్గు లెట్లుపోల్చగలము. ఒకేగుణములో నెచ్చుతగ్గులు పోల్చగలము. భిన్నగుణములలో పొసగదు. ఏ రిరువురిగుణములు భేదములయ్యును అన్యోన్యసహాయకారులు. స్త్రీవిధులు, పురుషునివిధులును కలసి అన్యోన్యసౌఖ్యమునకు, పరిపూర్ణతకు పనిచేయును.

కార్యశూరత, అభివృద్ధి, రక్షణ ఈ మూడును పురుషుడు నిర్వహించవలసిన ధర్మములు. స్త్రీ నిరక్షించుటయు, కర్మవీరుడగుటయు నతనివిధి. అతని శక్తిసామర్థ్యములు యుద్ధముచేయుటకు, జయము బొందుటకును. స్త్రీయొక్క అధికారము, తెలివితేటలు గృహమును విమర్శగా పరిపాలించుచూ సౌఖ్యమున కునికిపట్టుగా మార్చుటకు వినియోగించవలెను. ఆమెను, గృహమునకు వెలుపల జరిగెడు విపత్తులనుండియు భయములనుండి తొలగించుట పురుషులవిధి. నిజ

గృహము శాంతి మయమయియుండవలెను. విచారమునకు తావుండరాదు. భయమునకు స్థానముండరాదు. గృహమనగా, విశేష జ్ఞానముగల స్త్రీచే కాపాడబడుచూ ఆప దలలో నున్నవారి కాశ్రయమొసగి రక్షించునది. ఎచ్చట సత్యమయిన భార్యయుండునో అచ్చట ఆదర్శప్రాయమయిన గృహముండును. ఆమె గృహమునకు అధికారిణి, రాణి. అది ఆమెకుండవలసిన స్థానము. ఈస్థానమును నిర్వహించుట కామె సుగుణముల రాణియై యుండవలెను. ఆత్మాభివృద్ధికిని, త్యాగమునకును, జ్ఞానమునకును అధిదేవతయై యుండవలెను. ఆమె జ్ఞానమే సదా భర్తకు మంత్రియైయుండవలెను. ఆమె కార్యదర్శిని. ఇది ఆమెఅధికారము, స్థానము.

[రస్కిన్ ఈవిధముగా స్త్రీకుండవలసిన బాధ్యతలు, అధికారమును. స్థానమును నిర్ణయించినాడు. తదుపరి స్త్రీవిద్యావిధానమును గూర్చియు, రాజకీయములలో స్త్రీలకెట్టి హక్కు లుండవలసినవియు నిర్ణయించినాడు.]

—వల్లభదాసు రాజగోపాలరావు. బి. ఏ.



మంచితలపులు.

కొలదియు గొప్పయుఁ - గూర్మిఁ బ్రేమించు
వాఁడెపో యీశ్వరో - పాసనాపరుడు;
మనలఁ బ్రేమించెడి - ఘనుఁడీశ్వరుండె
నిఖిలంబు సృష్టించి - నెనరుతోఁ జూచు.

పరుషవాక్యంబుల - దొరయగానీక
పేదవారలతోడఁ - బ్రియముతోఁ బలుకు,
నిర్దయవాక్యముల్ - నెగడకయున్నఁ
గడగండ్లువారికిఁ - గలవెన్నొ యోర్వ.

ఇతరులశ్రేయంబు - నింపుతోఁ గాంచి,
పెరవారి దుఃఖాలఁ - గరఁగి నీరగుచు
శక్తివంచన లేక - సాయంబు చేయు
వానిగనను దిద్ది - వరమిమ్ము దేవ!

వేరొక్క దినమిదె - వేగుచునుండె
తలపుమ! ఊరక - దరలిపోనిత్తె ?

విడ్డూరములు

§ పుట్టుటతోడనే నడచినబిడ్డ.

మెస్సినాలో ఒకస్త్రీ స్త్రీశిశువును ప్రసవించెను. ఆ ఆడబిడ్డకు పుట్టుసరికే దంతములు వచ్చియుండెను. పుట్టినతోడనే ఆశిశువు నడుచుటకు ఆరంభించెను. ఆశిశువుయొక్క కాళ్ళును, చేతులును బాగుగ ఎదిగియుండెను. తల్లి ఆరోగ్యముగనున్నది. ఇది ఆమెకు మూడవకాన్పు. తొలి రెండుకాన్పులబిడ్డలును పుట్టినతోడనే చనిపోయిరి.

§ ఒకేకాన్పున అయిదుగురు బిడ్డలు.

ఢిల్లీచెంతగల నర్వానా అను గ్రామమున ఒకస్త్రీ ఒకేకాన్పున అయిదుగురుబిడ్డలను ప్రసవించెను. ఈ అయిదుగురుబిడ్డలలో ముగ్గురు మగబిడ్డలు, ఇద్దరు ఆడుబిడ్డలు. మాతా శిశువులు సురక్షితముగా నున్నారు.

§ భగవద్గీతవినుచు అదృశ్యమైనపాము.

టైమ్సు ఆఫ్ ఇండియాపత్రిక ఈ వార్తను ప్రచురించుచున్నది. "గాల్వియార్ సంస్థానమునకు చెందిన షోలాపూరుజిల్లాయందలి చతుర్భుజదాసు - దేవాలయములోనికి ఈనడుమ ఒకబ్రహ్మాండమైన పామువచ్చెను. దాని నిడివి 15 అడుగులుండెను. దాని టంగువాలు ఒక అడుగుండెను. ఈ కాలసర్పము రాకనుచూచి గుడిలోనివారందఱును తాకకుండ నిలువబడి కంగారుపడిరి. ఆదేవాలయమున నివసించుచున్న జనార్దనపంత్ అను సన్యాసి అపుడు సర్పమును కొద్దిగసమీపించి 'స్వామీ! భగవద్గీత వినదలచితిరేని స్వాస్థ్యమున చుట్టచుట్టుకొని ఆశీనులుగండు. మీకోఱకుగాను మీ యీ సేవకుడు భగవద్గీతను బిగ్గరగచదువును' అని చెప్పెను. అందుమీద దీనికి అంగీకరించినట్లుగ ఆపాము నెమ్మదిగ చుట్టచుట్టుకొనెను. జనార్దనపంతుగీతాపఠనము ప్రారంభించెను. నాలుగు అధ్యాయములు చదువునప్పటికి సర్పము అట్లేయుండెను. కాని ఇంతలో ఉన్నట్లుండి అది అదృశ్యమయ్యెను. ఆ గుడిపూజారియు ఇతరులును ఆపాముకొఱకు ఆగుడిఅంతయును గాలించిరి. కాని పాము జాడ ఎచ్చటను లెచ్చి గానరాదయ్యెను.

§ ఒక గ్రుక్కలో ఇరువదియైదుమాటలు

శాస్త్రవేత్తలు పరిశోధనలుసాగించి పురుషులఊపిరితిత్తులకంటె స్త్రీలఊపిరితిత్తులు బాగుగ పెద్దవైయుండునని కనుగొనియున్నారు. ఒకేగ్రుక్కలో స్త్రీ ఇరువదియైదుమాటలు పలుకగలదు, పురుషుడు ఎనిమిదిమాటలు మాత్రము పలుకగలడు.

§ చంద్రలోకమునకు ప్రయాణము.

అమెరికాసంయుక్తరాష్ట్రముల నేవల్ ఎకాడమీయందు గణితశాస్త్రోపాధ్యాయుడుగనున్న డబ్ల్యు. ఎ. కాక్ రాడ్ అనునతడు ఒకపెద్ద ఆకాశబాణము (రాకెట్) లో మానవుడు చంద్రలోకమునకు పోవచ్చునని తెలుపుచున్నాడు. ఒక ప్రయాణమునకు సుమారు రెండుకోట్లపౌనులు అగునని అంచనా వేయుచున్నాడు. అతడింకను ఇట్లు చెప్పుచున్నాడు. "ఫ్యూయల్ సమస్యయే దీనికి ప్రబలప్రతిరోధము. ఇచ్చటనుండి చంద్రలోకమునకు పదిటన్నులతూకముగల ప్రయాణీకులతో గూడిన ఒక రాకెట్టుపోవుటకు ఆరువేలటన్నుల జలవాయువు ప్రాణవాయువుగాని, సాదాయి ప్రాణవాయువుగాని కావలసియుండును. ఇవిగాక చిన్నవియగు మఱికొన్ని ప్రతిరోధములుకూడ గలవు. ప్రయాణించు రాకెట్టు పతనమునొందుచుండెడు నక్షత్రములను తప్పించుకొనవలసియుండును; ఆకాశగంగలో దారితప్పకుండ నుండవలయును. భూమినివదలిన మొదటి నూటఇరువదియైదు మైళ్ళను ప్రయాణముచేయుటయే కష్టతరముగా నుండును. ఇట్లు రాకెట్టులో వెడలిన ప్రయాణీకులు చంద్రలోకమునుచేరి అచట అటునిటు తిరిగికొన్ని ఫోటోలనెత్తికొని తిరుగుప్రయాణముమునుగావింప వచ్చును.




ఆంధ్రము మాతృభాషగాగల వారిసంఖ్య 2,19,67,860. మదరాసురాష్ట్రమునందలి గంజాము, విశాఖపట్టణము, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురము, చిత్తూరుజిల్లాలను; హైదరాబాదునందలి తెలింగానాభాగమును ఆంధ్రుల స్వరాష్ట్రమనవచ్చును. మిగిలిన ప్రదేశములందున్న వారిని రాష్ట్రేతరాంధ్రులుగనే భావింపవలసివచ్చును. స్వరాష్ట్రమునందు నివసించు ఆంధ్రులసంఖ్య 1,86,75,886. రాష్ట్రేతరాంధ్రులసంఖ్య 20,16,974. వివిధరాష్ట్రములయందు వలస వెడలిన ఆంధ్రులనుగూర్చిన వివరములను సంఖ్యలు సర్ జార్జి గ్రియర్‌సన్ గారు లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియాలో ఇచ్చియున్నారు. వాని నిట నుదహరించుచున్నాము.

ఆస్సాము	...	5,259
అండమాను నికోబారుదీవులు	...	212
బెలూచిస్థానము	...	36
(అమరావతి, అకోల, ఎల్లిచ్పూర్, బేసిం, బుల్డానాగల) బిరారు	...	28,000
బొంబాయిరాజధాని	...	1,09,908
బర్మా	...	6,60,601
మధ్యపరగణాలు	...	22,654
కూర్గు (కొడగు)	...	2,974
పశ్చిమోత్తరపరగణాలు	...	212
పంజాబు	...	7
సంయుక్తపరగణాలు	...	640
బరోడా	...	362
మధ్యఇండియా	...	777
రాజపుత్రస్థానము	...	61
మదరాసు రాజధానియందలి ఇతరజిల్లాలలో అనగా చెంగల్పట్టు, ఉత్తరఆర్కాటు, మదరాసు, కోయంబత్తూరు, నీలగిరి, దక్షిణఆర్కాటు, తంజావూరు, సేలము, తిరుచినాపల్లి, మలబారు, దక్షిణకనడా, పుదుక్కోట, కొచ్చిన్, తిరువాన్కూరు మొదలగు తావులయందు		1,76,036

ఈ ప్రదేశములందుగాక మధ్యపరగణాలయందలి చాందా, బస్తరుజిల్లాలయందును; ఒరిస్సాయందలి జగన్నాథము, కటకము జిల్లాయందును; బంగనపల్లి, పాండూరుసంస్థానములందును ఆంధ్రులు విశేషించియున్నారు.

ఇంతవరకు భారతదేశమున రాష్ట్రేతరభాగములందుగల వారిసంఖ్యమాత్రము తెలుపబడినది. ఆంధ్రులు ఖండాంతరములందును నివసించుచున్నారు. ఇట్లు ఖండాంతరములయందు నివసించు ఆంధ్రులలో విద్య మొదలగు తాత్కాలికమైన అవసరములకే గాక స్థిరముగ నివాసము ఏర్పరచుకొనినవారునుగలరు. తూర్పు ఆఫ్రికా, దక్షిణ ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఫిజీ, ఫిలిప్పైన్ దీవులు, ఇంగ్లాండు, జర్మనీ, గియానా, అమెరికా మున్నగు విదేశములందును ఆంధ్రులుగలరు.



ఇన్స్యూరెన్సు విషయములు

ఇన్స్యూరెన్సు విధానము

ప్రజా ప్రభుత్వము ఆదర్శముగగొన్న యీకాలమున మనమెచట జూచినను 'ఆర్థిక' కారణములు, 'ఆర్థిక' తలంపులు, 'ఆర్థిక' సూచనలగూర్చి విను చున్నాము. ఆర్థికవిధానమన నేమి, ఆర్థికవిధానమునకును యిన్స్యూరెన్సునకును గల సంబంధబాంధవ్యము లేవి, ఆర్థికపద్ధతులు చక్కగ నిర్వహింపబడుటకు యిన్స్యూరెన్సు వ్యాపారమెట్లు సహాకారి యగుచున్నది అను విషయములాలోచింపదగినవి.

ఆర్థికమను పదమునకు సరియగు అర్థము తీయ లేము. ఈపదమును వినగానే కొందరు నాణెములను తలంతురు; కొందరు బ్యాంకులెక్కలను జ్ఞాపకమునకు దెచ్చుకొందురు; కొందరు పాడిపంటలను స్ఫురణకు దెచ్చుకొందురు. ద్రవ్యమునకు సంబంధించిన మానవ కర్తనకు ఆర్థికశాస్త్రమను పేరిడుటకు సాహసింప వచ్చును. మానవుడేవిధముగ ద్రవ్యమార్జించి వెచ్చిం చుచున్నాడను విషయమును ఆర్థికశాస్త్రము చర్చిం చును.

మానవుడు తోడిమానవులకు సహాకారిదై జీవించు చున్నాడు. ఆధునికయుగమున యీ సహకారము సర్వవ్యాపకము. తనకు కావలసినవట్టుకొనాక యిత రుల ఉపయోగమునకుసైతము మానవుడు వస్తువులను తయారుచేయుచున్నాడు. ఇతడు నిర్మాత; యితను నిర్మించువస్తువులు, చేయుసహాకారము విశ్వర్యము లేక ద్రవ్యమనబడును.

ఆర్థికవిధానము చాల కష్టమైనది. వస్త్రముల నుదా హరణముగ తీసికొందము. ప్రత్తియొకచోట పెరుగును. దానిని తీసి, విత్తులనుండి వేరుచేసి, యితరదేశములకు పంపుదురు. అచటివారు, నూలుబడికి, యంత్రసహాయ మున చక్కని వస్త్రములనేసి, రైళ్ళు, ఓడలు, కదితర మార్గముల, దేశదేశములకు రొుగుమతిచేయుదురు. తుది కవి దుకాణములకు అమ్మకమునకువచ్చును. ఎవరైనను ఆవస్త్రములనుచూచి, వారివద్దనుండు కాసులకంటెను వస్త్రములవిలువయే హెచ్చని గ్రహించి వాటినికొన వలెను. వస్త్రములను తయారుచేయుటలో కాలవ్యవ ధియు, వేలకొలది పనివారు నియమింపబడుటయు, లక్షలకొలది పెట్టుబడితో కర్మాగారముల నిర్మించుట యు, యంత్రముల స్థాపనచేయుటయు, అందరికి బత్తె ములిచ్చుటయు, సర్వమును సక్రమముగ జరుగుచున్నదా లేదా అని గమనించుటకొక అధికారియు గణనీయాం శములు. ఇందువలన ఆర్థికవిధాన మెంతకష్టమైనదో గ్రహింపవచ్చును.

ఆర్థికవిధానమున నాలుగు అంశము లిమిడియున్నవి. ఈ నాలుగు అంశములును పరస్పర సంబంధముగలవిగ నున్నది. అవి (1) వస్తునిర్మాణము, (2) మార్పుకోలు, (3) విభాగము (4) వినియోగము. వస్తువులను తయారు చేయుట నిర్మాణము. నిర్మింపబడిన వస్తువులను యితర వస్తువులకు బదులుగనిచ్చుట మార్పుకోలు. ఈమార్పు కోలు వ్యాపారమూలకముగ, ద్రవ్యరూపమున, ఒక మానవుడు మరొకమానవుడితోను, ఒకదేశము మరొక దేశముతోను సాగించుచున్నది. మానవుడు తనకుకావ లసిన వస్తువులన్నిటిని తానే చేయుటలేదు కాని, కావ లసిన యితరవస్తువులకు బదులు తనవస్తువుల నిచ్చు చున్నాడు. మానవుడుచేయు కృషికి రెంతద్రవ్యము లాభకరముగ పొందవచ్చునను శాస్త్రీయసూత్రములను

చర్చించునది విభాగము. మనకోర్కెలను దీర్చుకొనుటకు మనముపయోగించు ద్రవ్యము వినియోగము సబడును.

ఐశ్వర్యనిర్మాణము:—

మార్చుకొనుటకు యోగ్యములైన వస్తువులను సంపాదించుటచేతను, యితరులకు సహాయముచేయుటచేతను, మానవుడు తనకోర్కెలను దీర్చుకొనుచున్నాడు. వీటికే ఆశయముగగొని స్త్రీపురుషులు కృషిసల్పుచున్నారు. ఇదియే నిర్మాణము. వస్తువుల రూపుమార్చి క్రొత్తవిలువను కల్గించుటయే ఐశ్వర్యనిర్మాణమగును. వస్తువును మానవుడు నిర్మింపజాలడు. మనవస్త్రమే యిందుల కుదాహరణము. ఇతరులకు మానవులుచేయు సహాకారమువలన లాభముపొందినచో అదియు ఐశ్వర్యనిర్మాణముక్రింద పరిగణింపబడును. ఉదాహరణము వైద్యులు, వకీళ్ళు. వస్తునిర్మాణమున వేనకువేలు ప్రజలు పనిచేసెదరు. కార్మికసంస్థలు స్థాపింపబడుచున్నవి; ప్రయాణవసతులు ఏర్పడుచున్నవి; మూలధనమపారముగ కావలెను; ప్రభుత్వము జోక్యము కలుగజేసుకొనుటయు గలదు. ఇవన్నియు వుత్పత్తియొక్క వైశాల్యమును, కాలవ్యవధియు సూచించుచున్నవి.

వస్తునిర్మాణమునకు వుపకరణములు నాలుగు:— ప్రకృతిసహాయము, కృషి, లేకపని, మూలధనము, వ్యవస్థాపన. ప్రకృతి మనకెన్నో అమూల్యములగు వస్తువులను, శక్తులను ప్రసాదించుచున్నది. అడవులలో, గనులలో, పొలములలో, సముద్రములో దొరకువస్తువులు; పనిచేయుటకు, కార్మికాగారములు స్థాపించుటకు నేల, ఆవిరి, నీరు, విద్యుచ్ఛక్తి, స్వాభావికమైన వాయువులు, శీతోష్ణస్థితులు, నదులు, రేవులు, మొదలగునవి ఉదాహరణములు. ఈ సదుపాయములన్నియు ప్రజాసౌకర్యమునకు వినియోగపరచుటకు మానవుడు తనబుద్ధి బలమువలన వాటిసహాయమును పూర్తిగ ఉపయోగింపవలెను. అపుడపుడు నూతనముగ కనిపెట్టబడువస్తుసముచయమును చేయూతగగొని రెట్టింపు నుత్సాహముతో కృషిసల్పినగాని మానవుడు పొందులాభములు వృద్ధికానేరవు. ఆర్థికవిధానవిూవిధముగ మారుచుండును.

ప్రకృతి ప్రసాదించుశక్తులను, వస్తువులను మానవుడు గుర్తించివాటిని వాడినగాని ఫలితముపొందలేడు. ఇట్లు చేయు పరిశ్రమలేక కృషి, మానసికమైనను సరె శరీరసంబంధమైననుసరే - పనియగును. ఈ పని లాభము పొందు నుద్దేశముతో చేయబడును. కూలిగడించువారు మాత్రమేగాక, వ్యాపారము, ప్రజాసేవ, ఉద్యోగము, శాస్త్రపరిశోధన, విద్యాశాఖలందు పనిచేయువారు సైతము కార్మికులక్రింద పరిగణింపబడుదురు.

పనిఅనగానే పనిచేయువాడును జ్ఞాపకమువచ్చును. ఈ రెంటిని వేరుపరచజాలము. కాబట్టి కార్మికవృత్తికి సంబంధించిన విషయములను చర్చించునపుడు, కార్మికులక్షేమములను సైతము విచారింపవలసియున్నది. కాబట్టి కార్మికుల మనోవికాసమునకును, సంఘపరిస్థితులను చక్కబరచుటకును, వారి జీవితము చక్కనిమార్గముల నడుపుటకును తగుచర్య తీసుకొనవలెను. వారి పరిసరములు బాగుండవలెను. యజమానులకు పనివారికి ఐకమత్యముండవలెను. పనివారికి యొక్కవ వ్యవధియుండవలెను. అట్లున్నగాని వారు చేయుపని ఉత్కృష్టముగనుండజాలదు.

వస్తునిర్మాణమునకు మూలధన మత్యావశ్యకము. పెట్టుబడిచేతనే మానవుడు లాభమునుపొందగలడు. మూలధనము, తోడనే మనసౌకర్యార్థము ఖర్చుపెట్టక, ఐశ్వర్యమును పెంపొందించుటకు వినియోగించుచున్నాము. ఈ కూడబెట్టబడుద్రవ్యము, బ్యాంకులు, ఆర్థికసంస్థలమూలకముగ ఆర్థికసంపత్తికి తోడ్పడుచున్నది. నూతనముగ కార్మికాగారముల స్థాపించి, యంత్రములనుగొని, కార్మికుల నియమించి, మంచి లాభములు పొందుటకు శక్తిగలధీమంతులు, బ్యాంకులకు నచ్చజెప్పి ద్రవ్యసహాయముపొందవచ్చును. సంఘము ఆర్థికముగ అభివృద్ధిపొందవలెనన్న మూలధనమును వృద్ధిచేయవలెను. ఇది ద్రవ్యమునుకూడబెట్టుటవలననే జరుగును. వ్యయముకంటె యుత్పత్తి హెచ్చుగ నుండవలెను వ్యాపారము, కార్మికసంస్థలు వృద్ధియగుటకు, త్వరితముగ, చౌకగ, వస్తువులనుపంపుటకు వసతులుండవలెను. వాయువిమానములు, ఓడలు, రైళ్ళు వీటికిసహాకారులైనవి.

ఆదికాలమున మానవుడు స్వంతద్రవ్యమును వెచ్చించి, వస్తువులను తయారుచేసి, తనయూరనే అమ్ముచుండెడి వాడు. ఇప్పుడన్ననో, వస్తునిర్మాతలు, వాటిని తమ ఉపయోగమునకుమాత్రమే గాక లోకములోని ప్రజల అందరి ఉపయోగార్థముసైతము తయారుచేసి, యితర దేశములకు ఆ వస్తువులను యెగుమతిచేయుచున్నారు. అదే వస్తువులను యితరులెవరైనను తయారుచేసియున్నచో వారితో పోటీలు పడెదరు. ప్రజల అవసరము బట్టి వస్తువులను తయారుచేయుదురు. వేనవేలు పని వాండ్రనియమించి, లక్షలకొలది మూలధనము ప్రోగు చేసి, కర్మాగారములస్థాపించి, యంత్రసహాయమును, ప్రకృతిసహాయమును గొన్ని పనులను నిరాటంకముగ జరుపుచున్నారు. ఇంతటి బాధ్యతనువహించుట సామాన్యముకాదు. ఇందువలన నష్టమును హానియు కలుగ వచ్చును. కాబట్టి దూరదృష్టి, ధైర్యస్థైర్యములు, కుశాగ్రబుద్ధిగల వ్యవస్థాపకులే వీటిని సమర్థింపగలరు. ఈ నాలుగు ఉపకరణసహాయమును సమముగ ఉపయోగించువాడే వ్యవస్థాపకుడగును.

ప్రకృతిసహాయమును సరియైనమార్గమున పొందుట మొదటిపని. రెండవదిమానవకృషి. మానవుడు జీవింపవలెనన్న ఏదో ఒకపనిచేయవలెను. లేదా పస్తుండవలెను. కాబట్టి స్వలాభమునకైనను మానవుడు పనిచేయును. కుశాగ్రబుద్ధులగువారు, వారు చేయుపనులందు నిపుణత్వము సంపాదించి, తమ క్లిష్టమైన పనులను చేయుచు, సరియగు వేతనములను సంపాదించుచు, స్వలాభమును పొందు యెన్నికతో, తమకును, యితరులకును కావలసిన వస్తుసామగ్రిని సృష్టించుచున్నారు. ఇట్టిపనివారికి వారిని నియమించు యజమానులకు కంట్రాక్టులుగలవు. ఈవిధముగ కార్మికసంస్థలు కార్మికులసహాయముపొందుచున్నవి. నూతన కార్మికసంస్థలస్థాపించుటకు, అదివరకేవుండు వాటిని విశాలముచేయుటకు కావలసిన మూలధనము, ప్రజలచే నిలువచేయుంచబడి, బ్యాంకులమూలకముగ, ఆర్థికసంస్థలమూలకముగ పొందనగును. ఆర్థికసంస్థలు శాశ్వతసహాయమును, బ్యాంకులు తాత్కాలికసహాయమును చేయును. ఒకవస్తువు తయారుచేయుటకు, అది అమ్ముడుపోవుటకు చాలకాలముపట్టును. అంతవరకు జీతములు, యితర ఖర్చులు బ్యాంకులిచ్చును. ప్రజలు నిలువయుంచిన ధనమునంతయు ఒక్కసారిగ బ్యాంకులనుండి తీసికొనరు కాబట్టి కొద్దిరొక్కముతో, పలుకుబడితో బ్యాంకులు నడువగలవు.

ఆధునిక కార్మికసంస్థలభావములారు:—

(1) ఆస్తులు వారివారి అధీనములోనేయుండు హక్కు. సోవియటు రష్యాలో ఆస్తిఅంతయు సంఘముది. నష్టమువచ్చినను సంఘముదే. కాబట్టి రష్యాకు యిన్సూరెన్సు సహాయమక్కరలేదు.

(2) ప్రతివాడును ఏ వస్తువునో ఒకదానినిగాని, ఆ వస్తువులో ఒకభాగముగాని తయారుచేయుటలో ప్రత్యేకపరిశ్రమవలన నైపుణ్యము సంపాదించుచున్నాడు. ఇందువలన పని విభాగింపబడి చక్కగ జరుగును.

(3) యంత్రములు విరివిగ నుపయోగింపబడుటచే, వస్తువు లొక్కతీరుగను, ఖరీదు తక్కువగను, హెచ్చుగ తయారగుటకును వసతులేర్పడుచున్నవి.

(4) ఆయా దేశములందుగల ప్రకృతిలాభములు, వ్యాపారవసతులు, శీతోష్ణస్థితుల ననుసరించి కార్మికసంస్థలేర్పడును.

(5) ఒకేవిధమగు వస్తువులను తయారుచేయు సంస్థలన్నియు, ఒకరి యాజమాన్యముక్రిందనే పరస్పరసంబంధములుగల్గి వృద్ధిపొందుట. ఇందువలన ఉత్పత్తి పెరుగును; వెలతగ్గును.

(6) వస్తువులను తయారుచేయువారే, ఆవస్తువులకు కావలసిన పరికరములను తయారుచేయుట. వస్త్రములు తయారుచేయువారే ప్రత్తిపెరుగు నేలలుగాని, ప్రత్తినివిడదీసి, నూలువడికి, వస్త్రములు యంత్రసహాయమున నేసి, ఎగుమతికలసిన రైళ్ళు, ఓడలు మొదలగు పరికరములను స్వాధీనమునందుంచుకొనవచ్చును. హెన్రీఫోర్డు యిందుల కుదాహరణము.

ప్రతివాడును ఒక్కవస్తువు తయారుచేయునుగాన, దాని నితరులకిచ్చి వారివద్దనుండి తనకు తన కుటుంబమునకు కావలసిన యితరపరికరములను పొందవలెను. దీనికిగాను వ్యాపారస్థలములేర్పడెను. ఇచట సరకులు అమ్మువారు,

కొనువారు గుమిగూడి, ద్రవ్యరూపమున మార్పుకోలు జరిగించుచున్నారు. పల్లెటూళ్లలో సంతలుయిప్పటికిని కలవు. సామానులు ఒకదేశమునుండి మరొకదేశమున కతిసులభముగపోవుటకు వీలున్నదిగాన, వ్యాపారము వృద్ధియై లోకమంతటను వ్యాపించినది. ఇందువలన వస్తువుల విలువ స్థిరస్వభావముపొందుట కవకాశము కల్గినది.

వస్తువిక్రేత ఒక్కడే ఆవస్తువును తయారుచేయలేదు గాన, అమ్మగా వచ్చినసైకమును, ఆ వస్తునిర్మాణము నకు తోడ్పడినవారందరికి క్రమముగ పంచిపెట్టవలెను. భూస్వామికి బాడుగయు, పనివానికిజీతమును, ధన సహాయముచేసినవానికి వడ్డీయు, కార్యనిర్వాహకునకు లాభమును యివ్వవలెను. లాభములు పంచిపెట్టుతీరు అందరికి నచ్చకపోవచ్చును. అందువలననే వ్యాపార ఐకమత్యసంఘములును, యజమానుల సంఘములును, మధ్యస్థసంఘములును యేర్పడినవి.

వస్తునిర్మాత తనభాగమునొని, తన కుటుంబసౌకర్యార్థము తన వసతులకును, ఆ ద్రవ్యమునంతటిని ఖర్చు పెట్టినను పెట్టవచ్చును; లేక ఒకింతకూడబెట్టినను పెట్టవచ్చును. ఈ విధముగమాత్రమే అతడు వస్తునిర్మాణ పోకడను అరికట్టగలడు.

ప్రభుత్వము పన్నులు విధించి ఆర్థికవిధానమునకు తోడ్పడుచున్నది. పన్నులచే రాబడినధనము, ప్రజాసౌకర్యార్థము వినియోగింపబడుచున్నది. పోస్టాఫీసు, విద్యుచ్ఛక్తి, రోడ్లు, వంతెనలు మొదలగునవి ఉదాహరణములు. ప్రభుత్వమునకు రెండు బాధ్యతలుగలవు. (1) ప్రజల హక్కులను కాపాడుట; అందులకుగాను చట్టములనేర్పరచి, ఉద్యోగుల నియమించి, దేశమందు శాంతి నెలకొల్పుట. (2) వ్యాపారాభివృద్ధికిగాను, ధనమునకు స్థిరమైనవిలువను కల్గించుట. ఆర్థికవిధానమున కెంతో వివరింపబడినది. ఆర్థికవిధానమున ప్రతిశాఖలోను యిన్స్యూరెన్సుకు సంబంధముకల్గియున్నది. ఈవిషయము గమనింపదగినది.

—ఆలూరు రామచంద్రయ్య, బి. ఏ.

భీమా—రైతు.

భారతదేశపుభాగ్యము వ్యవసాయదారుని క్షేమము మీదనే ఆధారపడియున్నది. వ్యవసాయదారుని క్షేమ మాలోచించినప్పుడనే ఎవరిక్షేమమయినను ఆలోచింపవలెను. ప్రస్తుతమున్న, భీమాశేల్లు, భీమాపద్ధతులు రైతునకు లాభకరముగాలేవని చెప్పుటకు ఎడమున్నది. నా ఎఱిగినంతవఱకు నూతనముగా స్థాపింపబడిన దక్కన్ ఇన్సూరెన్సు కంపెనీలో రు 511 లకు, రు 1000 లకు ఎక్కువ మొత్తాలకు భీమాచేసికొను పద్ధతిగలదు. ఇది రైతులకు మిక్కిలి అందుబాటులో నున్నది. రైతులకు అన్నిఖర్చులుపోను నికరాదాయము బహు స్వల్పముగానే వుంటుంది. ఆ స్వల్పాదాయమయినను మోతుబరీ రైతులకేగాని, సామాన్య రైతులకులేదు. సాధారణముగా భీమాకంపెనీల దృష్టిలో కేవలము, ఉద్యోగస్థులు, ప్లీడర్లు, డాక్టర్లు, వర్తకులుమాత్రమే కనుబడుతున్నారుగాని, రైతుబొత్తిగా కనుబడుటలేదు. రైతు స్థితిగతులనుగురించి కంపెనీ డైరెక్టర్లు ఏమీ ఆలోచించుటలేదు. పెద్దమొత్తానికి, భీమాచేయుటకు రైతుకు శక్తిలేదు. భీమాకంపెనీలు, ఈ విషయమును గమనించి రైతునకు ప్రత్యేకసౌకర్యాలు కల్పించాలి. తక్కువ మొత్తాలకు, రు 200 లు, రు 300, రు 400, రు 500, రు 600, రు 800 లకు భీమాచేసికొన్నచో రైతునకు క్షేమకరముగా నుండును. ప్రస్తుతము రష్యావారు తమ నూతనపరిపాలనావిధానములో, కార్మికులకు కృషీవలులకు, ఏర్పరిచిన భీమాసౌకర్యములను గమనించినచో, మన భారతదేశపు భీమాకంపెనీలు తద్విషయమై సహాప్రాంతములు వెనుకబడియున్నవని చెప్పకతప్పదు. మన దేశపు భీమాకంపెనీలు ఈవిషయమై తగినంతశ్రద్ధ చూపవలసియున్నది.

—వల్లభదాసు రాజగోపాలరావు, బి. ఏ.



ఆగస్టు, 33.

౨౦:—ఏలూరు. తాలూకాబోర్డునకు శ్రీ, వేగుంటపుల్లయ్యగారు తాత్కాలికాధ్యక్షులుగ నియమింపబడిరి.

:—శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారి 14-వ వర్ధంతి.

౨౨:—తెనాలి. తాలూకాబోర్డు సమావేశము. ప్రత్యేకఆంధ్రరాష్ట్ర తీర్మానము ఆమోదింపబడుట.

౨౩:—బరంపురము. ఇండియా సెక్రటరీగారి సమక్షమున ఒరిస్సాసరిహద్దుల విషయమై బరంపురము మ్యునిసిపాలిటీ తరఫునసాక్ష్యము ఇచ్చుటకువెళ్ళి మూడునెలలపైగా ఉండిపోవుటవలన పురపాలక సంఘోపాధ్యక్ష పదవిని గోలుపోయిన శ్రీ పాకనాటి నారాయణరావుగారే తిరిగి ఏకగ్రీవముగా ఉపాధ్యక్షులుగ ఎన్నుకోబడిరి.

:—బెజవాడ. గురుమహంతు అప్పలస్వామి శాస్త్రులుగారి మరణము.

౨౪:—వాల్తేరు. ఆంధ్రవిశ్వకళా పరిషత్తు కళాశాల ౪-వ హానర్సు విద్యార్థి శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు అష్టావధాన మొనర్చిరి.

౨౫:—ఒరిస్సా సరిహద్దుల విషయమున పర్లాకిమిడి ఆంధ్రుల తరఫునలండను జాయింటు కమిటీ వారికి విన్నవించుటకు వెడలిన శ్రీగిడుగు సీతాపతిగారు బొంబాయిలో ఓడదిగుట.

౨౬:—ఏలూరు. ద్వితీయ పశ్చిమగోదావరిజిల్లా జమీందారీరైతు మహాసభ. శ్రీయుతకటికనేని వేంకటరామారావుగారు అధ్యక్షులు.

:—తెనాలి. సుప్రసిద్ధాంధ్ర నటులలో నొకరగు తాళ్ళూరి నరసింగరావుగారు మరణించిరి.

౨౮:—ఏలూరు. ద్వితీయ ఆంధ్రరాష్ట్ర జమీందారీ రైతుమహాజనసభ శ్రీఆచార్యగోగినేని రంగనాయకులుగారి అధ్యక్షతను జరుపబడుట. ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణమును కోరుచు తీర్మానించుట.

:—ఏలూరు. పురపాలకసంఘ సమావేశమున ప్రత్యేకాంధ్రరాష్ట్ర తీర్మానము ఏకగ్రీవముగా ఆమోదింపబడుట.

3౦:—రంగూను. రంగూను ఆంధ్రులలో పెద్దలు, బ్రహ్మశాసనసభ్యులు, గౌరవ మేజస్ట్రేటు కార్మిక కంట్రాక్టరు దొమ్మేటి వేంకటస్వామిగారు చనిపోయిరి.

3౧:—జమ్షెడ్పూరు. ఆంధ్రులు ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణమునుగూర్చియు, గంజాం ఆంధ్రప్రాంతములను ఒరిస్సాలో చేర్పరాదనియు తీర్మానించిరి.

సెప్టెంబరు, 33.

౧:—సేలం. విక్టోరియా మార్కెట్టు మైదానమునందు భారతఖద్దరు స్వదేశప్రదర్శన ప్రారంభోత్సవమును బొబ్బిలిరాజాగారు జరిపిరి.

౨:—ముట్నూరు కృష్ణరావుగారు (కృష్ణాపత్రికా సంపాదకులు) వేలూరుజయిలునుండి విడుదలయి మదరాసుచేరిరి.

౪:—పూనా. శ్రీ ప్రకాశంపంతులుగారు గాంధిమహాత్ముని గలసికొని చాలసేపు వారితో సంప్రదించిరి.

:—పర్లాకిమిడి. పర్లాకిమిడి ఆంధ్రుల తరఫున లండను పోయివచ్చిన శ్రీ గిడుగు సీతాపతి గారికి గొప్పసన్మానము.

౫:—ఆంధ్రవిశ్వవిద్యాలయ సిండికేటు సమావేశము నందు ఒరిస్సారాష్ట్రమునగల కాలేజీలన్నియు ఆంధ్ర విశ్వవిద్యాలయమునందు చేర్చుకొనవలె నను సూచన అంగీకరింపబడెను.

౬:—గోదావరి, కృష్ణాడెల్టాలలో కందపైరునకు నీటి పన్నుతీసి వేయబడినట్లు ప్రభుత్వప్రకటన.

౮:—మచిలీపట్నం. చల్లపల్లిరాజాగారు బందరుశా స్త్రపాలిటెను క్లబ్బునకు రూ. 5000-లు దాన మిచ్చిరి.

:—ఏలూరు. పశ్చిమగోదావరిజిల్లా ఎడ్యుకేషనల్ కౌన్సిలుకు శ్రీ కలిదిండి రామరాజు వేంకటరావు గారు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—తాడేపల్లిగూడెం. తాలూకా హరిజనమహాసభ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారి అధ్యక్షతను జరిగెను.

౯:—మద్రాసు. వెంకటగిరి క్రొత్తదివానుగా నియ మింపబడిన దీ. బ. కె. వెంకటనారాయణ నా యుడుగారి గౌరవార్థము భారతచిత్రకళా సంఘము వారు విందుగావించిరి.

౧౦:—కాకినాడ బాంబుకేసు ముద్దాయి అయిన శ్రీ భయంకరాచారి 6 మాసములనుండి పరారి అయియుండి ఖాజీపేటలో సి. ఐ. డి పోలీసు వారిచే అరెస్టుచేయబడెను.

:—జంషెడ్‌పూర్. ఎల్ టవునులో మహారాజశ్రీ కూకూరు రామారావు పంతులుగారి ఇంటిలో బ్రహ్మశ్రీ వడ్డాది సీతారామాంజనేయులు గారు అష్టావధాన మొనర్చిరి.

౧౧:—కాకినాడ. తూర్పుగోదావరిజిల్లా ఎడ్యుకేష నల్ కౌన్సిలు అధ్యక్షులుగా పెద్దాపురము హైస్కూలు హెడ్ మాస్టరు వి. సి. హెచ్ జాన్ బి. ఏ. యల్. టి గారు ఎన్నుకొనబడిరి.

:—తాడేపల్లి గూడెము. విదేశవస్త్ర విక్రయనిరోధ ప్రచారనేరమునకు శ్రీవింతల వీరభద్రరావు గారికి 6 మాసముల కఠినశిక్ష.

౧౨:—ఒంగోలు. ప్రొఫెసరు కె. అంజనేయ సిద్ధాంతి రత్నగారి సంపాదకత్వమున 'త్యాగభూమి' అను నామమున నూతనాంధ్రవారపత్రిక వెలు వడెను.


౧౪:—నంద్యాల విదేశవస్త్రదు కాణములవద్ద పికె టింగుచేయుచుండిన స్వామి నారాయణా నందుగారు అరెస్టుచేయబడిరి.

౧౫:—వేలూరు. డాక్టరు పట్టాభిసీతారామయ్యగారి. విడుదల.

:—బెజవాడ. కృష్ణాజిల్లా బోర్డులో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర తీర్మానము ఆమోదింపబడెను.

:—గుంటూరు. శ్రీవడ్లమూడి వేంకటలక్ష్మి నర సింహారావు పంతులుగారి అధ్యక్షతను జరిగిన పురపాలక సంఘసభలో ప్రత్యేకాంధ్రరాష్ట్ర తీర్మానము ఆమోదింపబడెను.

౧౬:—ఏలూరు. శ్రీమతి ముల్పూరి సుబ్బమ్మ, పత్తి రాజు రామమూర్తిగారు, వారిభార్య బహి ష్కార కరపత్రములను పంచిపెట్టుచుండగా అరెస్టుచేయబడుట.



సంపాదకీయ సమాలోచన

ఆంధ్రరాష్ట్రనిర్మాణము: రాయలసీమ:—

మదనపల్లి వాస్తవ్యులును, ఆంధ్రరాష్ట్ర నిర్మాణవిషయమున శ్రద్ధపెట్టుచున్న రాయలసీమ నాయకులలో నొకరును అగు శ్రీయుత పి. యస్. వాసుదేవరావు(ఎం.ఏ.) గారు పుంగనూరు పౌరుల బహిరంగసభలో ప్రత్యేకాంధ్రరాష్ట్రావశ్యకతనుగురించి విపులముగ నుపన్యసించుచు నిట్లు చెప్పిరి: "ప్రత్యేకాంధ్రరాష్ట్రమునకుగల ఆక్షేపణలు అంత గణనీయములు కావు. రాయలసీమవారికిని, సర్కారులవారికిని ఎన్నియాంతరంగిక భేదములున్నను రాష్ట్రముపట్లమాత్రము ఏకీభవించి యాందోళనచేయవలయును." ఈ హెచ్చరికకు పుంగనూరు పురప్రముఖులు సమాధానమిచ్చుచు ఆంధ్రరాష్ట్రనిర్మాణముపట్ల సుముఖతను చూపిరి. దీనినిబట్టి తగు ప్రచారమునల్పుచో రాయలసీమవారుకూడ ఆంధ్రరాష్ట్రనిర్మాణమునకై సర్కారు ఆంధ్రులతో కూడిరాగలరని సులభముగ నిర్ణయింపవచ్చును. బాధ్యతగల నాయకులు పూని రాయలసీమయందు సంచారమునల్పి అర్హమగు ప్రచారముగావించి అచటి ఆంధ్రుల మనములందుగల అనుమానమేఘములను దవ్వగఁజోపుట అత్యవసరకర్తవ్యము.

శ్రీ వేంకటగిరి కుమారరాజావారు:

ఆంధ్రరాష్ట్రము.

శ్రీ బొబ్బిలిరాజావారు ప్రాతికూల్యము వహించుటతో, వారు నాయకులైన జస్టిసుపక్షమునందలి ఇతర ఆంధ్రసభ్యులుకూడ ఆంధ్రరాష్ట్రమువిషయమై ప్రతికూలము చూపుదురని భయపడితిమి. ఈ భయమునకు కారణములేదని చెప్పగలుగుటకు ఆనందమగుచున్నది. జస్టిసుపక్షప్రముఖులలో నొకరగు శ్రీ వేంకటగిరి కుమారరాజాగారు మొన్న ఆంధ్రరాష్ట్రవిషయమై ఇట్లు చెప్పిరి. "ఆంధ్రప్రముఖులు వెంటనే సమావేశమై ఆంధ్రరాష్ట్రమునుగూర్చి చర్చించి అనుకూల నిర్ణయముగావించి దానిని జాయింటుకమిటీవారికి తెలుపుటభావ్యము. ఇపుడు దీనివిషయమై శ్రద్ధపెట్టనిచో ఈప్రశ్నను చర్చించుటకు అమూల్యావకాశము తొలగును." లండనునందు మొన్నను ఆంధ్రసభ్యులు రాయబారమునకు వెడలినపుడు శ్రీ రాజావారు లండనునందుండియు అనారోగ్యకారణమున ఆంధ్ర రాయబారవర్గమువారితో చేతులుకలిపి కృషిసల్పజాలకపోయిరి. దేశమునకు తిరిగివచ్చినపిమ్మటనైనను శ్రీ వారు తమదృష్టిని ఆంధ్రరాష్ట్ర నిర్మాణ విషయమై ప్రసరింపజేయుట కొంతవఱకు మన యదృష్టమే. నెల్లూరు పట్టణమున కూడునని ప్రచురింపబడిన అవసరాంధ్రమహాసభ శ్రీ జోగయ్య పంతులుగారి ఫర్మానావలన వాయిదాపడినది. వాయిదాపడియు చాలరోజులయినది. ఆసభను కూర్చు ప్రయత్నములిపుడైనను చేయబడుచున్నట్లు వినము. శ్రీ వేంకటగిరి కుమారరాజావారి హెచ్చరిక ఆలించినపిమ్మటనైన ఆంధ్రులు సభాసమావేశము విషయమై శ్రద్ధవహింపక అలసత్వమునసుండుచో క్షమింపరాని అపరాధము గావించినవారగుదురు. అనుకున్న సభకు వాయిదా వేయుచు తాఖీదుపంపిన శ్రీ జోగయ్య పంతులుగారిపై ఇపుడు సభకూడు

నటులు గావింపవలసిన బాధ్యత హెచ్చుగ నిలచియున్నది. ఆంధ్రసమస్య విషయమున లండను గూడబోవుటకు వెనుకాడకుండిన శ్రీ జోగయ్యపంతులుగారీ విషయమున తమ బాధ్యతను గుర్తించి మెలంగెదరని నమ్ముచున్నాము.

రాజమండ్రి కళాశాల: స్థలసంకోచము :—

ప్రపంచావృతమైన ఆర్థిక మాంద్యము వలన ఇతర దేశములందువలెనే ఆంధ్ర దేశమునందును కళాశాల విద్యార్థుల సంఖ్యలో తగ్గుదల చూపట్టెను. పలువత్సరములుగ రాజమహేంద్రవర కళాశాలను స్థలసంకోచ సమస్య పీడించుచున్నది. పలు కళాశాలలలో విద్యార్థుల సంఖ్యలో తగ్గుదల చూపట్టిన ఈ వత్సరమునగూడ రాజమండ్రి కళాశాలకు స్థలసంకోచపీడ వదలలేదని కళాశాల నివేదిక తెలుపుచున్నది. దీనిచే కళాశాలను విశాలపఱుపవలసిన అవసరము ఎంత అత్యవసరమైనదో సువిదితమగుచున్నది. ఈ కళాశాలను ఎత్తివేయుటకే లోగడ ప్రయత్నములు సాగినవి ఆగండ మెట్లో తప్పినది. కళాశాలను నిలుపుకొనుటకు తరుణమున ఆంధ్రులు తగిన ఆందోళనము జరిపిరి. కృతకృత్యులైరి. నిలుపుకొనిన కళాశాలవలన పూర్తి ఉపయోగమును పొందవలెననిన దానికి ఇప్పట్టునగల స్థల సంకోచపీడను సత్వరముగ తొలగించుకొనవలెను. శాసన సభయందలి ఆంధ్రసభ్యులు. అందు ముఖ్యముగ తూర్పుగోదావరి మండల ప్రతినిధులు ప్రత్యేకశ్రద్ధను చూపవలసియున్నది.

ఆంధ్ర విశ్వవిద్యాలయములో

అనాంధ్రము ఘనీభవించుచున్నది:—

ఆంధ్ర విశ్వవిద్యాలయము ఏర్పడిన పిమ్మట ఉన్నతవిద్య ఆంధ్రభాషలో గఱుపబడునని ఉవ్విళ్లూరిన వారుగలరు. ఆఉవ్విళ్లూరుట చందమాను ఘుటికలగుట ఆంధ్ర విశ్వవిద్యాలయ మేర్పడిన కొలదిగడియలలోనే జరిగెను. ప్రాచ్యభాషా బిరుద పరీక్షలలో మాత్రము ఆంధ్రమునకు ప్రాధాన్యమిచ్చు చు నొకశాఖను విశ్వవిద్యాలయమువారు ఏర్పఱచిరి. ఆ ఏర్పాటును సయితము ఇపుడు విచ్ఛేదించుటకు ప్రయత్నములు సాగుచున్నవి. ఆంధ్రసాహిత్య పరిషత్తును స్థాపించి ఆంధ్రభాషకు మహోపకారము గావించిన శ్రీజయంతి రామయ్యపంతులు గారు ఈ ప్రయత్నమున చేతులు గలుపుటను వినుటకు వింతగ నున్నది. ఉత్తర రామచరిత మును ఆంధ్రీకరించినపిమ్మట పంతులుగారికి గీర్వాణముపై క్రొత్త మోజు కుదిరిన దేమో! ఆంధ్రవిశ్వవిద్యాలయము సామాన్య విద్యా విధానమున ఆంధ్రభాష ప్రాధాన్యమును అంగీకరింపకున్నను ప్రాచ్య పరీక్షలలో నొక శాఖలోనైన ఇంతవఱకు కొంత ప్రాధాన్యమిచ్చి ఇపుడు దానినికూడ తొలగింప తలపెట్టి తల్లికిక్కొట్టరా వసంతెము అను మోటు సామెతను జ్ఞప్తికి తెచ్చుచున్నది. ఆంధ్రవిశ్వవిద్యాలయాభిదానము ' నేతిబీరకాయయు బోలె నయథార్థగాఢదాల్పు చూచుట పాడి గాదని విశ్వవిద్యాలయాధికారులు గుర్తించుట లెస్స మదరాసు విశ్వవిద్యాలయము తెనుగుభాషయెడ సవతితల్లి ప్రేమనైన చూపుచున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయము ఆమాత్రమైన చూపుట లేదని వ్రాయవలసి వచ్చినందుకు విచారమగుచున్నది. లోగడ ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు ఆంధ్రమున కొన్ని తాళపత్ర గ్రంథములను సేకరించి యున్నారు. వాని పరిరక్షణమునకు ప్రత్యేకమొక ఉద్యోగిని నియమించుపాటి ఆంధ్రాభిమానమునకైన ఆంధ్రవిశ్వవిద్యాలయము

నోచుకొనదని తెలియుచున్నది. ఏమన గలము?


ఆంధ్ర దేశము: దేశీయపరిశ్రమలు:—

శ్రీ దిగుమర్తి రామారావుగారు ఇట్లు వ్రాయుచున్నారు: "ఇప్పుడు మన దేశములో స్వదేశీ ప్రచారము బాగాజరుగుచున్నది. సాధారణముగా రోజువాడుకొనే స్టేషనరీ సామానులు, టాయిలెటు సరుకులు మొదలగునవి హిందూ దేశమునందే తయారగుచున్నవి. కాని అదేమి ఆశ్చర్యమోకాని ఇన్నిసరకులలోను ఆంధ్ర దేశములో తయారైంది ఒకటీ కనిపించదు. మనదురదృష్టం ఏమిటోకాని మనకుచెప్పుకోదగ్గ పరిశ్రమ ఒకటీ లేదు. రాజమండ్రీపేపరు మిల్లైకాదు, బెజవాడ బట్టలమిల్లు, బందరు పంచదార మిల్లు, రాజమండ్రి నబ్బుపరిశ్రమ అన్నీ కూడ ఒక లేవిషాదమైనకథ చెపుతాయి. ఇవన్నీ నాణ్యమైనసరకు చవుకధరలో తయారుచేసినవే. వీటిలో బెజవాడ బట్టల మిల్లు, రాజమండ్రి పేపరుమిల్లు ఆంధ్రుల చెయిదాటి వెళ్లిపోయినవి. మిగిలిన వైనా మనకట్టే ఉపకరింపలేదు. ఇవికాక కెమికల్ వర్కున్నూ, టాయిలెటువర్కున్ను దేశంలో అమితంగా బయలుదేరుతున్నాయి కాని ఆంధ్ర రాష్ట్రంమాత్రం ఈ విషయంలో బొత్తిగా వెనకబడి పోయింది. అంటే ప్రతిచిన్నవస్తువుకీ బొంబాయి, కలకత్తాలమీద ఆధారపడడమే కాకుండా ఆవస్తువు విలువకంటె మూడునాలుగు రెట్లు అధికముగానే డబ్బు కూడా వాళ్లకి పంపేస్తున్నామన్నమాట. ఇదే విధంగా ఒక్కటైనా ఫిలుముస్టూడియో ఆంధ్ర దేశములో లేకపోవడాన్ని తెలుగుఫిలుము తయారైనపుడల్లా అమితంగా డబ్బు ఆయాప్రాంతాల ఫిలుము స్టూడియో స్థాపకులకు పోతుందన్నమాట." పరిశ్రమల విషయమున ఆంధ్రులెంతటి శోచనీయస్థితి యందున్నారో పైపంక్తులు విశదము చేయుచున్నవి. ఇకనైన మననాయకులు మేల్కొని ఆంధ్రపరిశ్రమల స్థాపనమునకు, క్రమనిర్వహణమునకు పూనుకొందురు గాక!

రాష్ట్రేతరాంధ్రులు: ఆంధ్రభాషాసేవ:—

రాష్ట్రేతరాంధ్రులలో ఖరగపురమున వలసనెలకొనినవారు ఆంధ్రభాషాసేవ చేయుటలో ఆదర్శప్రాయులై యున్నారు. మూడు సంవత్సరములు రాష్ట్రేతరాంధ్రులు' అను నామమున ఒకమాసపత్రికను నడపి రాష్ట్రేతరాంధ్రులలో ఐక్యతను పెంపొందించిరి. కారణాంతరములచే ఆపత్రిక ఇపుడు నిలచిపోయినది. ప్రస్తుతము ఖరగపురమున శ్రీయుత దువ్వూరి వేంకట నారాయణగారి ప్రోత్సాహమువలన ఆధునికాంధ్రకవివిరచిత అముద్రితాంధ్ర గ్రంథములను ప్రచురించు సంకల్పముతో ఆంధ్రగ్రంథమాలయను సంస్థను స్థాపించిరి. ఉదరపోషణార్థము దేశమును విడచినను భాషను మఱువనొల్లని ఈ ఉచితజ్ఞుల ఈపవిత్రప్రయత్నము జయమునందుగాకయని మనఃపూర్వకముగ గోరెదము.





'నాగస్వరం పట్టితే నాగులకు ఆట'

—చిత్రకారుడు : శ్రీపాద దుర్గారావు గారు, రామారావు ఆర్ట్సు సొసైటి.

రాలినపూవులు

కవికుమారుఁడు కల్యాణగీతము లాలపించుచుండ నాసందర్భంబున మల్లీకుమారి పులకాంకితయై నేలకు రాలిపోయినది. రాలినపూరేకులఁ దీసి యశ్రుమాలికాకలితాత్ముఁడగు నాకుమారప్రణయమూర్తి గాటముగ నదిమి కౌఁగిలించుకొనెను. ఆకుమారుని నిర్మలప్రేమగీతామరందబిందువులు తదీయరహఃకంఠస్థలంబుల నిక్షేపింపఁబడినవి.

♦ ♦ ♦

"మల్లెపూలమ్మా మల్లెపూలు!" అని యతఁడు చీఁకటిలో నడచుచుండెను. అప్పుడే మల్లెపూలు కొనుమని పంతముపట్టిన తన రెండేండ్లతనయను వీథిలోఁ బెట్టి యొకగృహస్థుతలుపు గడవైచెను. అట్టె యేడుపుమాని యాపసిపిల్ల పువ్వులదెస కంటినీరుతో చూచుచు "నాకు పువ్వులిస్తా?" అనెను. స్మృతికందని పరిచయకంఠము విన్నవానివలె నాతఁడన్నిదండలను ఆమె చేతఁ బెట్టెను. తలుపువారనుండి యిదిచూచిన యజమాని చరచర వీథిలోనికివచ్చి "ఛీదొంగా! పిల్లను మంచిచేసి వస్తువులు దొంగిలింప యత్నించుచుంటివా?" యనుచు నాదండలు పిల్లచేతినుండి లాగి విసరివైచెను.

—వఝ్ఝుల కాళిదాసు.



పెళ్ళినాడిచ్చిన కట్నం

నేను మొదటినించీ ఇట్లా లేను. మొన్న 1920లో గ్రాంధీమహాత్ముడు ఆసహాయోద్యమం మొదలుపెట్టాడు చూడండి! అప్పుడు నా కొకవిధమైన ఆవేశం బయల్దేరింది. ఎవరికీ బయల్దేరదుకనక! ఈ రాజ్యతంత్ర మేమిటి? ఈలోకం ఏమిటి? ఈజీవిత మేమిటికదా అని ఆలోచించటం మొదలుపెట్టాను. చూశారో లేదో! ఈసమాసాలు చాలాపుట్టివి. వీటినిగురించి తవ్వినకొద్దీ ఉంది. ఆలోచించినకొద్దీ ఉంది. మనం జీవితంలో ఎంత అన్యాయంచేస్తున్నామో ఆలోచించండి. మన కింత ఉపకారంచేస్తున్న బ్రిటీషుగవర్నమెంటుమీదనే గ్రాంధీమహాత్ములు సహాయనిరాకరణం ప్రయోగిస్తున్నప్పుడు—అంటే చూశారో లేదో! గ్రాంధీగారి కెదురుచెప్పటానికి నే నేపాటివాణ్ణికాని, బ్రిటీషువారు మనకు చేసినలాభాలు ఒకటీరెండు కావు! పోస్టాఫీసులు పెట్టారా? ఉద్యోగా లిస్తున్నారా? కాలవలు తవ్వారా? అన్నిటి కన్నా ముఖ్యం, రైళ్ళు వేశారా?- రైళ్ళంటే చెబుతా! నాపెళ్ళయినకొత్తలో మామామ గారూరు పోవాలంటే అయిదుకోసులు రెండెడ్లబళ్ళు కట్టించుకొని తెల్లవారటాని కింకాపదిఘడియలుపొద్దుండగా బయలుదేరితేకాని తెల్లవారి చేరేవాళ్ళం కాము. ఇప్పుడో గబగబా నాలుగుమెతుకులు నోట్లో వేసుకుని బయల్దేరితే స్టేషను ఒకమైలు. ఆస్టేషనులోనే ఒకగంట నడుం వాలిస్తే రైలొస్తుంది. లేదా టిక్కెట్టు కొన్నుకూని కన్ను తెరిచే టప్పటికి అవతలస్టేషను చేరుతాం. అవతల మామామగారిఊరు కాలవకట్టనేపోతే రెండుకోసులు. ఆడుతూపాడుతూ పోవచ్చు. ఎంత ఉసులో చూడండి. ఈరైలు వేసేటప్పు డింకోచిత్రం జరిగింది. మామామగారిభూమిలో అయిదెకరాలు మాన్యం రైలుకింద పడ్డది. దానికోసరం అర్జీలు పెట్టుకుంటే గవర్నమెంటువారు అయిదువందల రూపాయలు అక్షరాలా ఇప్పించారు. "మీకోసం వేసినరైలైతేకదా, ఏదోపొలం దానికింద పడదా? మే మేమీఇయ్యం" అంటే మామామగా రేంచెయ్యగలడు? చెప్పండి!— ఇన్నిచేసిన బ్రిటీషుగవర్నమెంటుపై గ్రాంధీమహాత్ముడు ఆసహాయోద్యమం చేస్తుంటే, మామామగారిదగ్గిరనించి నేను పెళ్ళినాడు అయిదువందలు కట్నరూపేణా తీసుకోటం ఎంతఅన్యాయం! అందులో ఆయనతోలాటి అయిదెకరాలు రైలుకింద పడికూడా పోయినప్పుడు. నావి అయిదెకరా లేమైనా ఆయన రైలుకింద పడ్డాయి కనకనా!

ఆయనా ఎక్కువ స్థితిలో ఉన్నవాడేం కాదు. రైలుకిందపడ్డ అయిదెకరాలూ కూతురిపెళ్ళికి అమ్మిన రెండెకరాలూ పోగా మిగిలిన నాలుగెకరాలచిల్లరా మామామగారు కోర్టులవెంట తిరిగి ఖర్చుచేసేవాడు. అయితే ఏం! ఆయనకు వ్రతంచెడ్డా ఫలందక్కింది. వాళ్ళఊళ్ళో ఆయనంత ప్రయివేటు లేదన్నారా లేదా? మాబావమరిదేమో చదువుకొంత డబ్బుతగలేసి తగలేసి చివరకు ఉద్యోగమైనాచెయ్యక జేబులో ఉత్తమనీ పాత్సు వేసుకుని కాఫీహోటళ్ళచుట్టూ తిరుగుచున్నాడు. ఇటువంటి స్థితుల్లో నేను కట్నంబాపతుడబ్బు మామగారికి తిరిగిఇవ్వటం న్యాయమేకాక ధర్మంగా కూడాకనపడ్డది.

ఇప్పు డింకొకచిక్కు వచ్చిపడ్డది. ఆవ 1917 వ 7 జనేవరితారీఖును నాపెళ్ళయిం దనుకోండి. ఆనాడు

నాకు వెండిచెంబులూ పట్టుతాపితాలూ వగయిరాల కింద మిగిలినది రొక్కంగాను యిచ్చిన మొత్తం వెరసి అక్షరాలా అయిదువంద లనుకోండి. యిందుక్కవడ్డీ నెల 1-కి? వడ్డీ కట్టవద్దా? 16-సంవత్సరాలకింద తీసుకున్న అయిదువందలు ఇప్పుడింకా అయిదువందలుగానే ఉండవుగా! మనుష్యులూ, పశుపక్ష్యాదులూ, చివరకు గోళ్ళూ, జుట్టూ కూడా పెరుగుతున్నప్పుడు —వెధవది గడ్డంకంటిది పెరుగుతున్నప్పుడు—డబ్బు పెరగదంటే ఎవడు నమ్ముతాడు? అయితే ఏరేటున వడ్డీ కట్టాలి. మూడురూపాయలవేడా మార్వాడీ వడ్డీ దగ్గిరనించి పావలా బ్యాంకీవడ్డీవరకూ ఉండుకున్నది వడ్డీరేటు. నే నందులో ఏరేటు తీసుకోవాలి? మా మామగారు ఈడబ్బు ఏవిధంగా ఉపయోగించి ఉండేవాడు? వడ్డీకిచ్చాడనుకుందాం. ఈయనదగ్గిర మూడురూపాయలవేడాకు ఎవ డప్పు తీసుకుంటాడు? పెళ్ళాంపుస్తె తాకట్టన్నాపెట్టి మార్వాడీల దగ్గిరే తీసుకొంటారుకాని? ఆడబ్బాయన బ్యాంకీలో వేసి ఉండేవా డనుకుని తక్కువవడ్డీ ఇవ్వటంకూడా న్యాయంకాదు. పైగా అంతవరకూ ఊహించుచున్న తరవాత ఆబ్యాంకి దివాలా ఎత్తింనుకోటంకూడా చాలా తేలికవుతుంది. ఛస్! ఇది బాగాలేదు. అదీకాక ఈడబ్బు మామామగారికిస్తే శతవిధాల జరిగే దేమిటంటే ఆకాస్తా మాబావమరిది తనఖాలీమః పాన్సులో వేసుకుని కాఫీహోటళ్ళచుట్టూ తిరగటానికి బదులు కాఫీహోటళ్ళనే ఇంటికి పిలిపిస్తాడు. ఇదంతా ఎందుకు? మనకు కంపెనీరేటు ఉండనేఉంది. నెల 1-కి నూటికి ఒకరూపాయి. మనకూ చాలా తేలికగా ఉంటుంది. వినేవాళ్ళకూ చాలా సౌమ్యంగా ఉంటుంది అనుకున్నాను.

కాని లెక్కవేసి చూసినమీదట మనసు తేలికగా ఉంటుందన్నభ్రమ వదిలింది. నేను నాఏకాంతాన లెక్కచూసుకోగా నేను మామామగార్కి ఇవ్వ వల్సి బాకీ ఒక్కదమ్మిడీ తక్కువ లేకుండా రెండుసంచులు! నాగుండె బద్దలయింది. ఇదెట్లాగురా భగవంతుడా! నేను మామామగారి ఋణాన పోవలసిందేనా అనుకుంటుండగా ఇంకోవిషయంకూడా జ్ఞాపకం వచ్చింది. నేను కట్టింది బారువడ్డీ. మూడుసంవత్సరాల కొకసారి తిరగరాస్తేకాని చెల్లి చావదాయె! దేవుడాఅంటూ మూడేళ్ళ కోసారి తిరగరాతలతో లెక్కచూశాను. అసలు నోటేదంటారేమో? న్యాయానికి బద్ధకంకణం కట్టుకున్నవాడికి నోటుతో ఏంపని? ఈసారి నే నివ్వవలసిన మొత్తం వంకో రెండొంకలో తక్కువగా నాలుగువేలయింది!

ఇం కొకడైతే ఇక్కడ వెనక్కుతిరిగిపోవలసిందే! నే నట్లా చెయ్యలేదు. సావిత్రి యముడివెంటపోతూ ముళ్ళకు భయపడ్డదా? నా తెలివితేటలన్నీ ఉపయోగించి న్యాయానికి భంగంలేకుండా ఈమొత్తాన్ని తగ్గించే ఉపాయం ఏదాఅని ఆలోచించాను.

నామనసులో వడ్డీ న్యాయశాస్త్రంలో చెప్పబడలేదేమో అని ఒకఆశ ఉంటూవచ్చింది. అందువల్ల అది కాస్తా తేల్చుకుందామని ఒకప్లీడరుగారిని వెళ్ళి అడిగాను. ఆయన నావంక చిత్రంగా చూసి, "వడ్డీ ఇవ్వటం న్యాయమూఅని అడుగుతున్నారూ? న్యాయశాస్త్రంలో అత్రిమహాముని చెప్పినప్రకారం వడ్డీయిస్తే ఒక్కక్షణంలో మనం దివాలా ఎత్తిపోముటండీ?" అన్నాడు. అస లందాకా ఎందుకు? వడ్డీ ఇవ్వటం తీసుకోటం అన్యాయమే అయితే ఇంతమంది ప్రతిరోజూ నోట్లు రాసి చివరకు "యిది సమ్మతిన్ని వ్రాసి యిచ్చిన ప్రాంశరీనోటు" అని ఎందుకంటున్నారు?

ఇప్పు డేంచెయ్యాలి? ఇంతలో ఒకశ్రేష్ఠమయిన ఆలోచన తట్టింది. మేధావి కేదీ అసంభవం కాదనుకోండి! పెళ్ళి కిచ్చినమొత్తంలో లాంఛనాలకింద రెండువందలయాభై దాకా పోయినై. రొక్కం రెండొందలయాభై మాత్రమే. లాంఛనాలు బాకీ ఎట్లా అవుతై? అల్లుడుగదా అని ఇచ్చినవస్తువులు బాకీకింద రావని రూఢిచేసుకున్నాను. ఎటుపోయి ఎటువచ్చినా అడిగి కనుక్కుందామని నాభార్యను కదిలించాను.

"మీరు గొంతుమీదకూర్చుంటే ఇచ్చాడు కాని ఆయిన కొక్కకానీ ఇవ్వటం ఇష్టంలేదు. మా నాన్న

పట్టుబట్టల దగ్గిర్నుంచీ మీ బలవంతంమీదే ఇచ్చాడు" అంది నాభార్య.

దానిమాటలకేంగాని లాంఛనాలు బాకీకింద రావు. పోగానే నిచ్చతేలిన అసలు రెండువందలరూపాయలై. అందుకు వడ్డీ! బారువడ్డీఅయితే కొంత తేలికగా పోను. ఎంతో ఆలోచించినమీదట ఒకఉపాయం తోచింది. మూడేళ్ళ గడువు దాటుతున్నదనంగా నోటుమీద ఓ అయిదురూపాయలు చెల్లువేస్తే నోటుప్రాణం నిలుస్తుంది. నేనుకూడా అయిదయిదులు చెల్లువేస్తే బారువడ్డీతో సరిపోతుంది. ఈఉపాయం చాలాబాగుంది. ఈప్రకారం లెక్కవేసి బాకీ పాతికతక్కువ వెయ్యి రూపాయలకు దించాను. ఇంతవరకు నాన్యాయదీక్షకు భంగంలేదు. కాని ఈకరువుకాలం వెయ్యిరూపాయలెక్కడదొరుకుతై? దీనిక్కూడా ఒక్కటేఉపాయం ఉంది. ఈమొత్తం అయిదారుకిస్తీలుగా కడితేసరి.

అయితే ఇప్పుడు రెండువందలరూపాయలు కావాలి. అంతమొత్తం ఏట్లా పుట్టిద్దామా అని ఆలోచన చేశాను. వచ్చేసంవత్సరంనించీ పంటలోనించి ఇవ్వవచ్చును. ప్రస్తుతం ఇల్లాలిమెళ్ళో నగ ఏదైనా అమ్మి ఇప్పటికి సరిపెడదామనుకున్నాను. అందుకని నాభార్యను మెళ్ళోకంటె ఇయ్యమన్నాను. వాళ్ళనాన్న బాకీ తీర్చటానికేగనక తప్పకుండా ఇస్తుందనుకున్నాను. కాని ఇవ్వనంది. ఎట్లాగన్నాను. పోదడగమంది. నాకు మండి- మర్నాడు నగలుతీసి పెట్టెలో పెట్టి ఆవిడ దొడ్లో తలంటిపోసుకుంటున్నసమయంలో కంటెకాస్తా తీసి ఒకకంసాలిదగ్గిరికి తీసికెళ్ళి అమ్మజూపాను. వాడు దాన్ని అన్నిపరీక్షలూచేసి నూటయాభై ఇస్తానన్నాడు. మూడొందలుపెట్టి చేయించిన గట్టికంటెను నూటయాభైఏమిటి? నే నమ్మనన్నాను. పోలీసునుపిలవనా అన్నాడు. ఇప్పుడు పోలీసును పిలిస్తే ఈసంగతికాస్తా వాడు నాభార్యకు తెలియచేస్తాడేమో, అమ్మినతరవాత ఎవరేంచేసేదిలేదులే అని నూటయాభై తీసుకుని ఈసారి కింతే మనియార్డరు చేద్దామని ఆ డబ్బుపట్టుకుని పోస్టాఫీసుకువెళ్ళి చాతయినవాళ్ళచేత అదిమామగారికి టపాచేయించి ఆరోజునే ఈవిధంగా ఉత్తరంరాశాను. ఆయన పెద్ద వైరి వేటుకవక సంతోషిస్తాడని నాలుగువ్యవహారముక్కలుకూడా విసిరాను.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శంకరయ్యమామగారి దివ్యసముఖమునకు మీ అల్లుడు పదివేలనమస్కారములు చేసి వ్రాసుకున్న ఉత్తరం. లోగడ నేను మీవద్ద ఆన 1917 ది 7 జనేవరితారీఖున్న మూజానాటీగా అప్పు పుచ్చుకున్న రొక్కం రు 250 లు అక్షరాల రెండువందల యాభైరూపాయలు ఇందుకువడ్డీ నెల 1 కి నూటికి ఒకరూపాయిచొప్పున చెల్లలు. పాతికరూపాయలుపోను ఈనాటికి నేను మీకు ఇవ్వతేలినబాకీ యావత్తూ కలిసి నెరశిమొత్తం రు 975 లు అక్షరాల తొమ్మిదివందల డెబ్బైఅయిదు రూపాయలు అయిదు సంవత్సరాలమీద దఫాలుగా ఇవ్వడానికి ఒప్పుకున్నాను గనుక యీదఫాకు దామాషాగా రు 150 లు మింజుమలె ఈరోజున నేను మీపేర మనియార్డరు చేయించినాను గనుక అది అందినసంగతి వెంటనే తెలియచేయవలెనని ప్రార్థించుచున్నాను. ఇంతే సంగతులు. ఇక్కడ అంతా క్షేమం మీక్షేమం. తరుచు వ్రాయించగలందులకు ప్రార్థించుచూ యున్నాను. మీఅమ్మాయి క్షేమముగానే యున్నది. అత్తగారిని అడిగినానని చెప్పవలెను. ఇట్లు, విధేయుడు..."

మూడోరోజున మామగారిదగ్గిరనించి ఉత్తరం వచ్చింది. దాన్లో డబ్బందినట్లు రాయలేదుకాని తనకు నేను బాకీఉన్నమొత్తం 1500 అన్నట్లు జ్ఞాపకం అనిమాత్రం రాశాడు మరి ఆయన ఏలెక్కప్రకారం వేశాడో!

ఈలోపల — ఈలోప లేమిటి! ఆరోజునే — నా భార్య నగసంగతి కనుక్కున్నది. వాళ్ళనాన్నకు ఉత్తరం రాశిందికాబోలు, నాలుగోరోజున ఆయన మళ్ళీ ఇంకోఉత్తరం రాశాడు. ఈసారి మాటలు చాలాఘాటుగా దొర్లినై. "ఇదేమి టయ్యా! సీనుంపలెగ! మాపిల్లకంటె కాస్తా అమ్మేశావుట. అకంటె వెంటనే కక్కతావా? నీమీద దావా వెయ్యమన్నావా?"

నాకు దావాలంటే భయమేకదా! ఏంచెయ్యను. ఒకవడ్డీ వ్యాపారంచేసే ఆయనదగ్గిరికిపోయి నూట యాభైరూపాయ లప్పియ్య మన్నాను. ఇందుకు వడ్డీ నెల 1 కి అనేచోట రూపాయి తొమ్మిదణాలు ఇయ్య మన్నాడు. ఆశ్చర్యపడి ఎందుకన్నాను. నెలకు రూపాయికి కానీ అన్నాడు. సరేకదా అని ఆప్రకారమే రానీ రూపాయలుతీసుకుని కంసాలిదగ్గిరికి వెళ్ళాను. వాడు కంటె అప్పుడే పోయిందన్నాడు. నాకు కళ్ళనీళ్ళపర్యంతమైంది. వాడు జాలిపడి రొండొందలిస్తే ఇస్తానన్నాడు. లేకపోతే పోలీసుకు చెబుతాడని నేనే గ్రహించుకుని మళ్ళీ అప్పిచ్చినాయనదగ్గిరికి పరిగెత్తాను. ఇంకో యాభై రూపాయ లియ్యమన్నాను. నోటు రాయమన్నాడు. వడ్డీ ఈసారి రూపాయి పద్నాలుగణాలన్నాడు. ఏ లెక్కప్రకారం అన్నాను. ఆయన నవ్వి రోజుకు నూటికి అణా అన్నాడు. సరే తెమ్మన్నాను. ఆడబ్బుకూడాతీసుకుని కంసాలిదగ్గిరికి పోయినాను. వాడాడబ్బు జాగ్రత్తగా లెక్కపెట్టి దాచి నాచేతికి కంటె ఇచ్చాడు. అనగ చూడగానే నాదుఃఖం ఆగలేదు. బంగారమంటికంటె పదిముక్కలై ఉంది!

—కొడవటిగంటి కుటుంబరావు.



అంతరము

విగతమోహాోజ్జ్వలన్నలి వీధియందు
దృష్టి నిగుడించి కాంచ యత్నించు నీదు
లలితతేజఃప్రభావ సంకలితమూర్తి
నాటికిని నేటి కెంతయంతరము కలదొ!

* * *

ప్రవిమలొామన్నుకంటెను బ్రవిమలమ్ము
మాతృవాత్సల్యమునకంటె మాన్యతరము
అచలధ్రువతారకంటెను నచలమైన
యామహాోమూర్తితో సామ్యమగునె నీకు ?

* * *

అఖిల రాజన్యమూర్ధ విన్యస్త పాద
పంకజోద్యద్యశో మోదభరితదిక్కి
చయుఁడవగు నీకు నీకృష్టవ్యవస్థ
సంభవించుట మిగుల లజ్జాప్రదమ్ము

* * *

దవ్వుదవ్వుల నుత్కృష్టతరవికాస
భానురంబైన దివ్యవిభాప్రతతికి
దోసిలి ఘటించి యొక్క కదుష్ణబాష్ప
కణము విడిచిన ధన్యతఁ గాంచఁగలవు.

* * *

ఆమహార్చిన్నునుండియే ఆంధ్రపుత్ర!
కిరణమొక్కటి నీపై వికీర్ణమగును
గాన నీ వొకవ్యక్తివై కానుపింతు
వింతకును నీయుపజ్ఞ యావంత లేదు.

—అయినంపూడి గురునాధరావు.
(ఉభయభాషాప్రవీణ)

చుక్క

౧

తాలిమిపట్టుదప్పి పరదాలయి గప్పిన నీలిమబ్బు బం
దాలను ద్రోచివచ్చి యెడదన్ బెనవైచిన రాగదీప్తులం
గ్రోలిన నీకటాక్షములలో తళుకుల్ గురిపింతు, వీ యనం
తాలయవీధి వ్యర్థమిది ఆతడు లేని యమానచీకటిన్ !

౨

కాటుక పుక్కిలించి మనకల్ మునుగుల్ గొనియున్నయీనభో
వాటిక ప్రాణముల్ కనులబట్టి నిరీక్షణలోన; ఆతడే
పాటునదగ్గరించి చెలువల్ విదిలించెడి మొల్కనవ్వు వ
న్నీట గరంచునంచు గమనించితి ? ఎంతటి ముద్దరాలవే !

౩

తెలియవుగానినీవు ; పలుతెన్నుల నాతని గాచియున్న, క
ల్వలపయి మోజు మిక్కుటము వానికి; చక్కనివాడె, మైననున్
నెలనెల గండ మట్టిమగనిన్ బడిమాటికి దేవురించినం
గలదె ఫలమ్ము ? నీమనసువచ్చినవాని వరింపు మన్యునిన్ !

౪

వలపు నిండిన యెడద మబ్బులమరుంగు
జిక్కుకొననేల ? చక్కని చుక్కవవని
నెందరెందరొ కలరు ప్రేమించువారు
ప్రకృతి లలితసౌందర్యలాలసులు కవులు !



—బొడ్డు బాపిరాజు.

ఒలింపియస్

౧

"నాయనా, అలెగ్జాండర్, నీతండ్రి నేటికి తిరిగి ఇంటికివచ్చినాడు. నానాదేశములను జయించి, ధనమును దోచుకుని కీర్తిచంద్రికలు త్రోవజూప పురప్రవేశముగావించినాడు. అలెగ్జాండర్, సంతోషించుచుంటివా? ఎంతటివెర్రివాడవోయి! తండ్రి దిగ్విజయములను విని సంతోషించుచుంటివి. కాని అతని విజయములు నీమరణ చిహ్నములని నీవు తెలిసికొనలేకున్నావు."

"తల్లీ అదెట్లు? యుద్ధముచేయుట వీరపురుషోచితము. నాతండ్రి వీరుడు. యుద్ధములందు గెలుపొంది జయలక్ష్మినిగైకొని వచ్చుచున్నాడు."

"నాచిట్టి తండ్రీ, ఎంతటి అమాయకుడవు! కనుకనే నీతండ్రినిన్నింత సులభముగ నాశనముచేయదలచినాడు. అలెగ్జాండర్, నీవింకను పసివాడవుకాదు. కండ్లువిప్పి చూడుము. నీతండ్రి దేశదేశములను జయించుచున్నాడని విర్రవీగుచున్నావు. దేశములన్నియు జయింపబడినపిదప నీవు రాజువై ఏమిచేసెదవు? నీవు దండెత్తుటకు దేశములుండవు. జయించుటకు రాజ్యములుండవు. ధైర్యస్థైర్యములను చూపుటకు యుద్ధములుండవు. చేతులు ముడుచుకొని అబలలాగు రాజ్యము చేయనెంచితివా? కుమారా; కన్నకడుపగుటచేత ఇంతగ చెప్పుచుంటిని. నీతండ్రి నిన్నేమిచేయుచున్నాడో నీవు తెలిసికొనలేకున్నావు. నిన్నతడు అరిస్టాటిలు వద్ద నుంచుంచిన దెందుకో తెలిసికొంటివా? ఒక శుష్కపండితునిగ తయారుచేసి రాజ్యానర్హునిగచేసి మూల కూర్చుండబెట్టుటకు. క్లియోపాత్రా కుమారుడైన ఆ చంటివెధవకు రాజ్యమును ధారపోసి ఒలింపియస్ కుమారునిట్లు చేసితినిగదాయని కులుకుటకు. ఈమాత్రము గ్రహించలేవా? నీవు ఒలింపియస్ కుమారుడవు కాదా?"

"తల్లీ చెప్పుము, చెప్పుము. మేఘములు విచ్చిపోవుచున్నవి. నాతండ్రి దురంతములు నాకిప్పుడు గోచరించుచున్నవి."

"గోచరించి లాభమేమి. ముందు నీతండ్రి జయప్రవాహము నాపవలెను. లేనియెడల నీజీవితమే వ్యర్థమగును సుమా."

"తల్లీ బాలుడను. ప్రబలసైన్యసమేతుడయిన ఫిలిప్పు కాలి కొనగోటికైన తాకగలనా? ఏమిచేయువాడ!"

"కుమారా సామాన్యునివలె మాటలాడుచుంటివి. నీవు ఒలింపియస్ కుమారుడవుసుమా. ఏమిచేయగలవా? నీకు నీతల్లిబాసటరైయు నిలువ నీవేమి చేయలేవు? అలెగ్జాండర్, నీతండ్రి నన్నెన్ని యిడుముల గుడువజేసెనో నీవెరుగవు. వివాహమయినదిమొదలింతవరకును ఇంటిపట్టున పట్టుమని పదినాళ్ళయిన ఉండియెరుగడు. ప్రథమావస్థయందు తనరాజ్యాభివృద్ధికై కాలముగడిపెను. ఇప్పుడితర రాజ్యముల నాక్రమించుకొనుటలో గడుపుచున్నాడు. ఈ జయించుటయందున్న సంతోషమేమిరా! ఇల్లనిలేదు; వాకిలనిలేదు; భార్యయనిలేదు; బిడ్డలనిలేదు. చీమచిటుక్కుమన్న దండయాత్రకు తయారు. తిరిగి రే నాలుగయిదు సంవత్సరములకో పునర్దర్శనము కుటుంబమను మాటయే తలపునకురాదు. కుమారా, అధికారతృష్ణగల మనిషిని చెట్టుబట్టుట శోకదేవత నాలింగనము చేసికొనుటయే! నీతండ్రిని వివాహమాడి నాజీవితమును దుర్భరతరదుఃఖ సాగరముగ జేసికొంటిని ఎందులకీదాంపత్యము? ఏమిటి దీనివలన నే పొందెడిసుఖము? కాని నన్నిట్లు కష్టపెట్టుచున్న యీ దుర్మార్గుడు ప్రతిఫలము అనుభవించక పోరాదు. ఈ స్త్రీ తనసుఖము నితరులకొరకు ధారపోయునంతటి పిచ్చిదికాదు. తనజీవిత తంత్రులను తెగగొట్టినక్రూరుని క్షమించునంతటివెర్రిదికాదు. నాహృదయమునందు చెలరేగుచున్న యీ భయంకరాగ్ని జ్వాలలు నీతండ్రిని దహించకమానవు."

"తల్లీ, తల్లీ, యేమనుచుంటివి! ఔను, ఔను. ఎంతటిదుర్మార్గుడు నాతండ్రి! మనలిద్దర నొకే శాఖను గురిచేయుచున్నాడు. చూడుము తల్లీ, నన్ను, అరిస్టాటిలు బానిసపడవేసి తనదారిని తానుపోయెను. ఇతడు నాపాలిట యమదూతవోలె ప్రవర్తించుచున్న వాడు. కాలుకదుపుటకు వీలులేదు. పుస్తకములమధ్య బుర్ర బద్దల గొట్టుకొనుచు కూర్చుండవలెను. సైనికుల మధ్య కూర్చుండి, వారికోలాహలములను వినుచు, ఆనందించవచ్చును గానిఈ మూగపుస్తకములమధ్య మూగనై నే కూర్చుండలేను. కాని కూర్చుండకతప్పదు. తల్లీ, నాతండ్రియుద్దేశము నన్నొక కుపక్కపండితునిగ చేయవలయుననిగదా! నాకర్మను నిర్ణయించుట కితడెవ్వడు? నాపాలిట దైవమా? మృత్యువా? చూచెదనుగాక!" అలెగ్జాండరు ఆవేశము నాపుకొనలేక గుప్పిళ్ళను బిగబట్టి మాటాడజొచ్చెను. ఇనుము ఎఱ్ఱగ కాలినప్పుడే సమ్మెటవ్రేటు పడవలయునని నిశ్చయించి ఒలింపియస్ యిట్లనెను.

"తండ్రీ శాంతివహించుము. జయాభిలాషులు శాంతియుతులై యుండవలెను. త్వరపడినవారికి జయము లభించనేరదు. కాని మనము సమయమునకై వేచియుండవలెను. నాకు సహాయముచేయుటకు నీవు సదా సంసిద్ధుడవై యుండుము. యశస్కాముడవైనచో ప్రథమమున నీదారినుండి నీతండ్రిని తొలగించుకొనుము. లేకేని నీకు భావిభాగ్యోదయముసున్న. సూర్యుడు తేజోమయుడై వెలుగుచున్నంతవరకు నక్షత్రములు ప్రకాశింపనేరవు. సూర్యుడస్తమించి నప్పుడు గదా వాటి విలువతెలిసెడిది."

తల్లీ నాకంతయు విశదమైనది. నాతండ్రి నన్ను సింహాసనమునుండి పడద్రోయుటకై చేయుచున్న ప్రయత్నములన్నియు నాకన్నులకుకట్టి నట్లగపడు చున్నవి. అతడు నాకుతండ్రికాడు. నీకుభర్తగాడు. మృత్యువే మనుష్యరూపమున మనలనుపట్టుకొని వేధించుచున్నది. తల్లీ నేను సిద్ధముగనున్నాను. అన్నిటికిని సిద్ధము. ఆజ్ఞనిమ్ము. "ఎందుకు", అని ప్రశ్నించకుండ నెరవేర్చెదను."

"కుమారా, అట్లుండవలెను. తండ్రిని నమ్మి చెడిన వారుందురు కాని తల్లిని నమ్మి చెడినవారెందరయిన గలరా? నీకు నేటికిబాగుపడు లక్షణములబ్బినవి. నేను తలపన్నెదను. నీవు నాకు బాసటగా నిలువుము, పిట్ట చిక్కక యేమవునో చూచెదనుగాక!"

ఫిలిప్పు మాసడోనియా దేశపురాజు. పేరెన్నికగన్న రాజులలో కెల్ల శ్రేష్ఠుడు. అరిస్టాటిలుతో చెలిమిచేసి అతనిని తనకొలువు నందుంచుకొని అతని సలహాలపై తన రాజ్యాంగ నిర్మాణమును గావించినాడు, హీన మానవ సంవాసితమైన మాసడోనియా దేశమును పైకి తీసుకొనివచ్చి పేరుపెంచినవాడు ఫిలిప్పు. ఇతడు తన రాజ్యాంగ విషయమేగాక తన కుమారుడును, తన తరువాత సింహాసనమధిష్ఠింపవలసిన వాడునైన అలెగ్జాండరు విషయముకూడ కడుశ్రద్ధ వహించియుండెను. అరిస్టాటిలువంటి మేధావులచే అతనికి చదువు చెప్పించెను. అతనికి 16-సంవత్సరములు వచ్చునప్పటికే చిన్న చిన్న సైనికదళము కధిపతినిగాజేసి, యుద్ధపరిచయము గావించినాడు.

ఇట్టివాడైన ఫిలిప్పునకు సహితము దుర్గుణములు లేక పోలేదు. అతడు త్రాగుబోతు వీలుచిక్కినపుడెల్ల త్రాగి తందనాలాడెడివాడు. ఒకానొక త్రాగుబోతు పార్టీ యందు తనస్నేహితుని దూషించిన అలెగ్జాండరుపైకి కత్తిదూసి, సారాయిమత్తువలన నిలువలేక తూలిపడిన తండ్రినిగాంచి, అలెగ్జాండరు యిట్లువక్కరినాడు. "ఛీ మాసడోనియదేశస్థులారా? యూరోపునుండి ఆసియా వరకు తనజయదుందుభిని మ్రోగింప జూచుచున్న వీరాసర్దారు నాయకుడడుగో? చూడుడు. ఒకమనుష్యుని దగ్గరనుండి మరియొక మనుష్యునికడకు ప్రయాణము చేయలేక క్రిందపడి మన్ను తినుచున్నవాడు."

౨

ఫిలిప్పు భార్యయైన ఒలింపియస్ రాజప్రాసాదము లోని తనగదియందు కూర్చుండి దీర్ఘముగ నాలోచించుచుండెను. ఆమె ఇపిరస్ దేశపురాజు కుమార్తె. ఆమె మాంత్రికురాలు. ఆమెచుట్టును పెంపుడు పాముల నేకములు బుసలుగొట్టుచు తిరుగుచుండెను. వైరగ

క్రా ఆనాగములు ఆయెలనాగను తన రెండు రెండు నాలుకలతో మాటిమాటికి ముద్దిడుకొనుచున్నవి. ఆమెయు, తనయెద్రని పెదిమలపై చిరునవ్వు చిందులాడ ఆపాములను తనచేతులతో నిమిరి ముచ్చటలాడుచుండెను. ఇట్టి దృశ్యములను చూచియే ఫిలిప్పు ఒలింపియస్‌ని యేవగించుకొనుచుండెడివాడు. అతడా దైదములంచూచి భయకంపితగాత్రుడై, ఆమె దగ్గరకు పోవుటకే కంపించిపోవుచుండెను. అతడేకాదు. అతని ప్రజలయందెక్కు-వభాగము ఒలింపియస్ పేరుచెప్పినంతనే హడలిపోవుచుండిరి. ఆమాంత్రికురాలు మాసిడోనియా దేశస్థులపాలిట మృత్యువై తమరాజును పట్టుకొని తీర్చి పిచ్చిచేయుచున్నదని వారిభయము. ఆమె సర్పములరాణియనియు, రాత్రులయందామె సర్పవేషధారిణియై సర్పములతో సయ్యాటములు సల్పుననియు, వారుకట్టుకథలను కల్పించి చెప్పుకొనుచుండిరి.

ఈ కట్టుకథలుకూడ ఫిలిప్పుచెవులను సోకినవి. అతనికామె కాలసర్పమువోలె కనబడజొచ్చెను. తనప్రాసాదమంతయును పాముల మయమైనట్టును, అవి తన్ను చుట్టుముట్టి కాటువేయకాచుకొని యున్నట్టును అతడు కలలను గాంచుచుండెను. శత్రుబలములను గడగడలాడించగల్గిన యీవీరుడు తనభార్యపేరు విన్నంతనే వడకి పోవుచుండెను. చాటుమాటుగ ఆమెనుమాపించినను యెదుటబడి యేకార్యమును చేయజాలకుండెను. ఆమెకోరిన ప్రతికోర్కెను నెరవేర్ప అతడుసంసిద్ధుడగుచుండెను. కాని అతని హృదయము నందొకశక్తి మాత్రము ఒలింపియస్‌నుండి తొలగిపొమ్మని బలవంతపెట్టుచున్నది. అందుచేతనే అతడు క్లియోపాత్రాయనునామెను వివాహమాడెను. అప్పటినుండి యీ భార్యభర్తలమధ్య విరోధము మరింత ప్రబలమాయెను.

ఫిలిప్పు తనను ప్రేమించుటలేదని తెలిసికొనినప్పుడే ఒలింపియస్ తనకు పనికిరాని భర్త నీలోకమునుండి పొగనంప సమకట్టెను. అతనిమీద లేనిపోని కొండెములను అలెగ్జాండరుతో చెప్పి ఆతనిమనస్సును విరుగదీసి తన స్వాధీనము చేసుకొనెను. ఫిలిప్పు దేశాంతరగతుడైనప్పుడు ప్రజల కతనిమీదనున్న గాఢవిశ్వాసమును పోగొట్టుటకై నానావిధ ప్రయత్నములను చేసెను. చాటుమాటుగ యింటిగుట్టంతయు తన కన్నవారింటికి పంపి వారిని తనభర్తప్రాణములను హరింప ప్రేరేచెను. పూర్ణజయాభిలాషుడైతిరుగు ఫిలిప్పు యీ కుట్రలను కనిపెట్ట లేకపోయెను.

3

"ఒలింపియస్, నీకింకను యీపాములగోల వదలలేదుగదా! నామాటలు వినవుగా? ఎందుకు నీకీపాములతో?" సుఖాసీనయైయున్న ఒలింపియస్ యెదురుగనున్న కుర్చీపై ఆసీనుడగుచు అనెను ఫిలిప్పు. ఒలింపియస్ తన తీవ్రకోపమును మరుగుపరచుటకై మందస్మితయగుచు ఇట్లనెను.

"ఫిలిప్, నీకీయుద్ధములగోల యెప్పుడువదలునో నాకీ పాములగోల అప్పుడు వదలును. గదియందడుగుపెట్టితివో లేదో అప్పుడే నాపాములనాడి పోసుకొనుచుంటివి! అవి నిన్నేమిచేసినవి? నీజోలికి రాలేదే! నీ పైనైన పడగెత్తలేదే."

"కాని అవి భయంకరములైనవి."

"నీ ఆయుధములకంటెనా? తోటి మానవునిరక్తమునకై నాలుకలు బారలుజాచు నీయాయుధములకంటెనా? నాథా, యుద్ధరంగమున ధరించవలసిన యీ యాయుధములు భార్యదగ్గరకు వచ్చునప్పుడైన తీసి దూరమునుంచి రాగూడదా? వాటిని నాముందు ప్రదర్శింపవచ్చితివా, లేక నాతో యుద్ధమాడ వచ్చితివా? అహా! ఎంతనిర్దయ." కన్నులనిండ నీరుంచి గద్గదస్వరముతో మాట్లాడెను. ఫిలిప్పు అదిచూచెను గాని అతనికి దయయుద్భవింపలేదు. అతడిట్లనెను.

"తన్వీ, కాలయాపనమగుచున్నది. నేనిప్పుడు సైన్యసమేతముగ గ్రీసుదేశమునకు దండెత్తిపోవుచుంటిని. ఒకగంట ఆలస్యమగుచో నాశలపులన్నియు వ్యర్థము కాను. నేనింతవరకు చేసినపనులన్నియు నాశనమౌను. నీవేల కబురంపితివో త్వరగ చెప్పిన వినిపోయెదను. సత్వరముగ తెలియజెప్పుము."

ఒలింపియస్ కోపమువహించుచు కనుబొమ్మలు బిగించి యిట్లనెను.

"నాథా, నీకేకాదు నాకును తొందరపనులున్నవి. నాపాపములు నాకొరకై యెట్లు నిరీక్షించుచున్నవో చూడుము. అట్లు నన్నురమ్మని మాటిమాటికి నాలుకలుచాచి పిలుచుచున్నవో! నేను చెప్పదలచినది మూడు మాటలలో ముగించెదను. ఏమ్మట నీదారిని నీవు పోయెదవుగాని; నాదారిని నేను పోయెదను. మరణమున కెన్నిదారులున్నవో కాలమును వెళ్ళబుచ్చుటకు నాకన్ని దారులున్నవి."

ఫిలిప్పు భయకంపిత గాత్రుడై సర్పములను తదేక ధ్యానముతో జూచుచు నిలబడెను. యుద్ధరంగమున శత్రుసేనలమధ్య ప్రళయ తాండవమాడు వీరుడీ వనితయందు నీరవుడై, నిశ్చేష్టుడై, నిలబడెను. ఒలింపియస్ అతని నోరగంటగాంచి తన సంభాషణమును సాగించెను.

"ఫిలిప్పు, నే జెప్పబోవునది నీకంత అవసరమైనది కాదు. అదియునుగాక నేనీ సంగతి యిదివరకే నీతోడ ముచ్చటించియుంటిని. మనకుమార్తెను నాతమ్మునకీయ నిశ్చయించుకొంటిమిగదా! అతడిప్పుడు నన్ను త్వరపెట్టుచున్నాడు. అతడు వీరుడు. అతని పేరు విన్నంతనే మాదేశమంతయు గడగడలాడిపోవును. అట్టి వానికి—"

"ఒలింపియస్, దీనికింతయుపోద్ఘాతమేల? నేను నీతమ్ముని, నీకుటుంబమును ఎరుగనివాడనుగాను. నీ మాట కడ్డుచెప్పువాడను కాను. ఈసంబంధము నాకు పూర్తిగా యిష్టము. ఈసంగతి చెప్పుటకేగదా నీవు నన్ను పిలిపించినది? సరే మంచిది. నాకిప్పుడు తొందర పనులున్నవని చెప్పితినిగదా! నీవు సుముహూర్తము నిశ్చయించి కబురంపుము. నేనానాటికి వచ్చెదను." ఫిలిప్పు ఆమెకౌగిలినుండి తొలగిపోవ నుద్యుక్తుడాయెను.

"అదియే నేకోరునది. మిగిలిన సంభారములన్నియు నేను చేసుకొనియెదను. ఆనాటికిమాత్రము నీవు తప్పక రావలెను. మరువవలదు. ఆనాడు రాక, యేవో సాకులు చెప్పబూనిన నేను సహింపను తెలిసెనా!" ఆమె చూపులు దుర్మార్గమును వెల్లడించెను. మాటలు పౌరుషరస ప్రధానముగ నుండెను. ముఖము తీవ్రరూపమును దాల్చెను. ఫిలిప్పు ఇట్లనెను.

"తప్పక వచ్చెదను. లక్షపనులుండుగాక, రాక తప్పను! కాని నేనిక్కడ పెక్కుదినములుండ వీలులేదు. వివాహమయిన మరునాడే తిరిగి పోయెదను. గ్రీసు దేశమునందలి నాపనులన్నియు అప్పటికి పూర్తిగావు."

"అటులనే; వివాహదినమునం దిచటనున్న చాలును. తరువాత నీయిష్టము. ఎల్లప్పుడును యిల్లుకనిపెట్టుకొని యుండుమని అడుగునంతటి చాదస్తురాలను గాదు నేను."

"సరే, నేను వెళ్లుచుంటిని. సైన్యములు నాకొరకై వేచియుండును."

"మాటతప్పుట మాయింటావందు లేదని నీవు విఱ్ఱవీగుచుందువు. ప్రజలందరు మీకుటుంబమునందు నీవు సత్యసంధుడవని చెప్పుకొనుచుందురు."

"అవును, నేను మాసదోనియా దేశపురాజును."

"చూచెదము గదా!"

పులిబోనినుండి బయటపడిన లేడివలె అతడా గదినుండి బయటపడెను. వెనుదిరిగి చూడక ఆ ప్రాసాదమును విడిచిపోయెను.

వెంటనే ఒలింపియస్ తనకుమారుడైన అలెగ్జాండరు కొరకు కబురంపెను. దీర్ఘముగ నాలోచించుచున్న ఆమెదరికి సర్పములు పోవెరచి దూరమునుండియే గ్రుక్కిళ్లు మ్రింగుచు ఆమెవైపు చూచుచుండెను. పదిపదిహేను నిమిషములకు అలెగ్జాండరు వచ్చెను. అతనిపదముల చప్పుడువిని ఆమె మేల్కాంచి ఇట్లాదరించెను

"అలెగ్జాండర్, ఇటురమ్ము; ఇటుకూర్చుండుము. సంతోషవార్త యొకటిచెప్పెద వినుము. ఏర్పాటులన్నియు సక్రమముగా జేసితిని. నీసోదరి వివాహమునకు ముహూర్తము నిశ్చయించుటయే మిగిలియున్నది. ఆనాడే ఆముహూర్తమునకూడ, ఆనాడు తప్పక వచ్చెదనని నీతండ్రి బాసచేసిపోయెను. అతడాడిన మాట తప్పడు. ఆనాటి సందడిసమయమున మనము మనపనిని నిర్వర్తించవలెను. ఈసంగతి యీదినమే మీ సేనాముఖులకు కబురంపవలెను. వారితో అన్నియు నిదివరకే విశదముగ చెప్పియుంచితిని. నీవు సిద్ధముగ నుండుము. తీరా సమయమునకు తండ్రిగదాయని దయచూపవుగదా!"

"తండ్రియా? ఎవ్వడునాతండ్రి? తనకై నన్ను

నాతల్లిని నాశనముచేయువాడా నాతండ్రి? తన సుఖమునకై నన్ను దుర్భరదుఃఖమున ముంచువాడా నా తండ్రి? నా భుజబలమును చూప వీలులేకుండ అన్ని దేశములను జయింపదలచినవాడా నాతండ్రి? కాదు; కాదు; ముమ్మాటికిని కాదు. అతడు నాతండ్రి కానేరడు. అతని నాశనమునకై నేనెట్టిపనినైన చేయబూనెదను. తల్లీ ఆజ్ఞ నిమ్ము. నీయాజ్ఞను తలదాల్చి నెరవేర్చెదను. నాకీప్రపంచమున నీకంటె కావలసినవారెవ్వరున్నారు?"

"నాయనా, నన్నుద్ధరించుటకు పుట్టుకొని వచ్చిన బంగారపుకొండవు. అవును. నీతండ్రి తనసుఖమునకు నిన్నాహుతి చేయ ననుమానించడిప్పుడు నీసుఖమునకైనీ వాతనిని మట్టుపెట్ట జూచుటకు పిరికిపందవా? నీకు మాత్రము మానాభిమానములులేవా? నీకుమాత్రము అధికారతృష్ణ, జయాభిలాష, లేదా? నీలో ప్రవహించు రక్తముమాత్రము అతనిలో ప్రవహించురక్తము కాదా? ఆమాత్రము, ఆమనిషి ఆలోచించుకొనలేడా?"

"తల్లీ, అవును. నాశరీరము భగ్గుభగ్గున మండుచున్నది. నేనిది భరించలేను. నీయాజ్ఞకై వేచియున్నవాడను, ఏమిచేయుటకైనను సంసిద్ధుడను."

"నాయనా, అలెగ్జాండర్, నేటికి నేను వీరమాతనైతిని. నేటికి నాజన్మసార్థకమైనది. నీవు తక్షణము పోయి నీ మేనమామలను కలుసుకొనుము. పెండ్లి ఇక పదిహేనురోజులకనుము. పెండ్లినాటిముందు రాత్రి యుద్ధసన్నద్ధులై నగరమున ప్రవేశింపుమనుము. మిగిలిన కార్యమును నెరవేర్చుటకు నేనుంటినిగదా! ఆరాత్రియే మనము విషయనిర్ధారణ చేసికొందము. నీవు తక్షణము పోవలయును."

"శలవు. నీయాజ్ఞను శిరసావహించెదను. నన్ను నీయిష్టము వచ్చినట్లుపయోగించుకొనుము."

"నాయనా యెంతమాట! నేపడు యీకష్టములన్నియు నీకొరకేగదా" మేను నిమిరెను.

అలెగ్జాండరు నిష్క్రమించెను. ఆ నారీపిశాచి వికటాట్టహాసముచేసెను. సర్పములన్నియు బిరాన అరుగుదెంచి తమస్నేహితురాలను చుట్టుముట్టినవి. "కార్యము గట్టెక్కినదా? విషము తలకెక్కినదా," యని ప్రశ్నించుచున్నవి కాబోలు!

౪

వివాహము అతివైభవముగ జరిగెను. మద్యపానమునందు మునిగితేలుచు, చుట్టపక్కములుగా రోజులుగడపిరి. ఫిలిప్పు ఆనాడు తనభార్యయొక్క దివ్యమంగళసుందర విగ్రహమునుజూచి అమితానందమును బొందెను. "అమె ఫిలిప్పుగారిభార్య," అని చెప్పుకొను వారినిగాంచి అతి యున్మత్తుడయ్యెను. కాని అతని కాదినమునందొక సారైనను అలెగ్జాండరు అగుపడలేదు. కుమారుని కొరకు రాజుగారు రెండుమూడు పర్యాయములు కబురంపెను. "అలెగ్జాండరేమయినాడ"ని, అరిస్టాటిలు నడిగెను. అతడు, "రాజా, కొద్దిరోజులనుండి నీకుమారుడు మతిభ్రమించినట్లు తిరుగుచున్నాడు," అని చెప్పెను. తండ్రి, "పిల్లవానికి తిరుగుడెక్కువయినది" ని మనస్సునందనుకొనెను.

ఫిలిప్పు ఆనాటిరాత్రి నాటకశాలకు వెళ్ళదలచెనని క్లియోపాత్రాతో చెప్పెను. ఈమాటలకామె యుల్లము తల్లడిల్ల, యిట్లనెను. "నాథా, నేడు నేను చెడుకలలను గంటిని. నన్ను, మిమ్ములను, మనవంటివానిని శత్రువులు చంపివేసిరి. ఆదృశ్యమునకు నామనస్సు చెదిరిపోయినది. ఈరాత్రి మీరెక్కడికిని పోవలదని నేను కోరుచున్నాను. వివాహమైనదాది మిమ్ముల నెట్టి కోర్కెయును కోరియుండను. ఈ నాకోర్కె, పిచ్చిదో మంచిదో, నెరవేర్చరా?" భార్యమాటలను త్రోసివేయజాలక అతడా నాటికేయి యింటివద్దనే గడుప నిశ్చయించుకొనెను. అదిమొదలు, అచట నేయున్న ఒలింపియస్ యిట్లనెను. "క్లియోపాత్రా నీవంతయు విపరీతము నాటకశాలకు పోయివచ్చునప్పటికి నీభర్తగారికిపోదురు కాబోలు! లేక యీలోపుగనే ఆయనను శత్రుసైన్యములు ముట్టడించునారేమి? నీకెంతభయముగనున్న ఆయనవెంటనే జని ఆపాయములనుండి కాపాడెదను లెమ్ము సరియేనా?" అనిభయనప్పుడోడ, సంతోషమును పురికొల్పురీతిని, మాటలాడెను. "క్లియోపాత్రా, యీసంగతి ప్రజలువిన్న ఫిలిప్పు పిరికి

పండ; భార్యమాటలను విని బైటకు రావెరచినాడు. ఈ వీరాగ్రేసరుడా, మా రాజ్యము నభివృద్ధిచేయునది అని హేళనచేతురా! అదియును గాక యిపుడు ఫిలిప్పునకు రాగల ఆపదయేది? ఆయనను పాదగాంచినంతనె ప్రతివాడును భయభక్తులతో మోకరించును. అట్టి యెడ యెవరాయనకు కీడొనర్పతల పెట్టెదరు? ఒకవేళ అట్టిది సంభవించిన ఫిలిప్పు చేతగానివాడా, యెవ్వరో యేమో చేయుదురని వెరచుటకు? ఇంతకు నాకుమాత్రె వివాహముమాని ఆనునసంతోషించుట నీకిష్టములేదు."

క్లియోపాత్రా మరుమాట నుడువనేరక మౌనము వహించెను. కన్నులనిండ నీరుంచి ఒలింపియస్ ఫిలిప్పునకు వినబడునట్లు యిట్లు Soliloquy మొదలిడెను. "ఫిలిప్పూ, జగదేకవీరుడవు! ప్రపంచమునంతె నుజ్జుగాతాపగల శక్తి సామర్థ్యములుగలవాడవు. ఒక్క స్త్రీ చేతులయందుపడి యెట్టివాడవైనావు! ఆహా, స్త్రీలబలలని వ్రాసినవారెట్టిమూర్ఖులు!" ఒలింపియస్ మాటలకు సిగ్గుపడి ఫిలిప్పు, "ఫిలిప్పు భయపడినాడు; భార్యమాటలను వినినాడు," అని తన్నుతాను నిందించుకొని నాటకశాలకు పోవ నుద్యుక్తుడాయెను.

సుఖసల్లాపములతో కాలము గడపుచున్న అతడు తనకు రాబోవు కీడును పసికట్టలేకపోయెను. మిత్రులతోను, అనుచరులతోను, నాటకశాలకు పోవు సమయమున రాణిచే ప్రేరేపించబడిన సైనికుడొక డతనిని పొడిచివైచెను. అతడు నేలగూలుచు "అలెగ్జాండర్" అని కేకవేసెను. ప్రక్కనే పొంచియున్న అలెగ్జాండరు, "ఇచ్చటనే యున్నాను; సమయమునకై వేచియున్నాన"ని చెప్పి తనతండ్రిని తానొక పోటుపొడచెను. "నీవుకూడనా—?" అని ఫిలిప్పు ఆశ్చర్యమును వెలిబుచ్చెను. మరుక్షణమున అతని శరీరమునందు ఇరువది మువ్వది బాకులు దిగెను. విప్లవకారులు "స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, నిరంకుశ ప్రభుత్వము నశించినది," యని కేకలువేసిరి. అప్పుడట సమావేశమైన ప్రజలకు అలెగ్జాండర్ యిట్లుపన్యసించెను. "మాసిడోనియా దేశస్థులారా, నేటితో మీకంటకములు గట్టెక్కినవి. మీ కొరకై నేను నాతండ్రిని బలి గావించితిని, నేటితో మీ పాలిటి మృత్యుదేవతయైన ఫిలిప్పు అంతరించెను. మీకు సంపూర్ణ స్వాతంత్ర్యము చేకూరినది. అలెగ్జాండరు ప్రజాహితాభిలాషి. మీరునన్ను చూచి పారిపోకుడు. నేనీపని మీకొరకే చేసితినని చెప్పితినిగదా!"

అప్పుడచటకు ఒలింపియస్ ప్రవేశించెను. ఆమె వెనుక, ఆమెయనుచరులు క్లియోపాత్రాను, ఆమెచంటిబిడ్డతోడ యీడ్చుకొని వచ్చుచుండిరి. చంకనున్న చంటిబిడ్డ నొక పోటుసైనికుడు గుంజుచుండ, త్వరగ రమ్మని వేరొకసైనికుడు "విడివడి వ్రేలాడుచున్న" కేశములను బట్టి యీడ్చుచుండ, ఘోరఘోరన విలపించు క్లియోపాత్రావిగ్రహము గుండెలను చెదరగొట్టుచుండెను. అట్టియామెను ప్రజలకు చూపి, ఒలింపియస్ యిట్లునుడివెను. "ప్రజలారా, మిమ్ములను నానా కష్టములకు గురిచేసిన ఫిలిప్పును సాగనంపితిమి. అతని నీదుర్మార్గమునకు పురికొల్పిన యీనారీపిశాచమీ భువినుండ మీకు మనశ్శాంతి కలుగబోదు. కాన యీదుర్మార్గురాలను, దుష్టుడైన ఫిలిప్పుయొక్క చిహ్నమైన యీబిడ్డతోడ, మట్టుబెట్ట నేను నాసైనికుల నాజ్ఞాపించుచున్నాను. (ప్రజలయందు కోలాహలముద్భవించును) ఓప్రజలారా, మేమీ పనులన్నియు చేయునది మీకొరకేయని మీరు విశ్వసింపవలయును. నేను నా భర్తను, నాకుమారు డతనితండ్రిని, పోగొట్టుకొన్నది మీకొరకేయని మరియొకసారి చెప్పుచున్నాను. మీరు నాయాజ్ఞలకులోనై, ప్రవర్తించిన సుఖములు పడయగల్గుదురు. లేనియెడల మీరుకూడ నాక్రోధాగ్నికి గురికాగలరు. ఒలింపియస్ అన్న సామాన్యురాలని తలంచుచున్నారు కాబోలు! చూచితిరా, నాప్రబలసైన్యమును నాకు కావలసిన యిట్టి సైన్యములను లక్షలకొలది సృష్టించగలను. ఒక్కత్రుటిలో మిమ్ములను, మీపట్టణమును, భస్మీపటలము గావించగలను. జాగ్రత్త." ప్రజలకు ఆమె మాంత్రికురాలన్నమాట జ్ఞప్తికివచ్చెను. వారు నిశ్చేష్టులై నిలబడిరి; మిన్నకుండి వినుచుండిరి.

—త్రిపురనేని గోపీచందు, బి. ఏ.



డాక్టరు ఆనిబిసెంటు

మిగలముగ్గిన పండు, బిసెంటుదొరసాని జర్జరిత దేహం విడిచిపెట్టింది. ఆమె అస్థికలను డి. కె. తెలాంగుగారు కాశీలో గంగలో కలిపారు. ఆ భౌతిక దేహం యొక్క శేషం యిక లేశమైనా లేదు.

జీవన్ముక్తులే వొకరిద్దరో తప్ప తతిమ్మా గిట్టినవారంతా మళ్లీ పుట్టవలసిందే; కాని వారికి కాలనిర్ణయం చెయ్యలేము. అప్పుడే కావచ్చు. కొంచెం నిడివి మీద కావచ్చు. వేల యేళ్లకు కావచ్చు. బిసెంటు మాత్రం యిప్పటికే యే భాగ్యవతి గర్భంలోనో ప్రవేశించి వుంటుంది. ఎంచేతనంటే? క్షణక్షణమూ ఆమె చెయ్యవలసిన పని చాలా వుంది. ఆ పని ఆమే చెయ్యాలి; గాని మరి వొకరివల్ల కాదు. ప్రవర్ధమానమైన మరో దేహం సంపాదించుకోడానికే ఆమె యీ బడుగు మేను విడిచిపెట్టింది; కాని మోక్షం కోసం కాదు. యముడికి లొంగిపోయి కూడా కాదు.

ఇంగ్లండులో పుట్టడం యిండియాలో గిట్టడం పుణ్యం వల్లనో, పాపం వల్లనో పాశ్చాత్యులకు అనేకులకు తటస్థించవచ్చు; కాని బిసెంటు మాత్రం యిండియాలో గిట్టడానికే యింగ్లండులో పుటింది. ఆ పుట్టడం కూడా యిక్కడే కాగూడదా అంటే అవడం వస్తే యిలా జరగడం తటస్థించకే పోవును. ఏమంటే? ఇప్పటి హైందవ రక్తంలో పాశ్చాత్య రక్తంలో వున్నంత దార్ఢ్యమూ, పెంకితనమూ, కార్యదీక్షా, ఏకాగ్రతా లేవు. అవి వుంటేగాని యిప్పట్లో యిక్కడ కార్యక్రమం జరగదు.

1916 దాకా మనవారనేకులు రాజకీయోద్యమం సాగించారు. అయితే: విద్యాధికులు మాత్రమే ఏకొద్దిమందో అందులో చేరారు; కాని బిసెంటు రాజకీయరంగంలో ప్రవేశించి హోమ్‌రూలు మూవ్మెంటు లేవనెత్తింది. దానితో సేతువు మొదలు శీతాచలం దాకా పల్లెపల్లెకూ ఉప్పొందింది. దృఢమైన ఆ పునాది వుంది కనకనే తరవాత తప్పుదారిలోనైనా గాంధిగారు వొక అంతస్థు వెయ్యగలిగారు.

బిసెంటు కాశీలో వేసిన సెంట్రలు హిందూకాలేజీ పునాది మీద మాళవీయ పండితుడు బ్రహ్మాండమైన హిందూయూనివర్సిటీని లేవనెత్తినాడు. ఆమె మన మదనపల్లెలో కూడా అలాంటి కాలేజీ నెలకొల్పింది. అయితే: దాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయంగా తయారు చేసుకోలేకపోవడం అలా వుండగా ఆ రూపంలో నేనా మనం దానికి వికాసం కలిగించలేక పోయాం.

బిసెంటు ఉత్తర దేశంలో స్థిరపడి వుంటే జొత్తరాహు లామె చేయూత మీద ఇంకా ఎంతెంతపను లేనా చేసి వుండుదు. నిజానికి దాక్షిణాత్యులు ఆమెకి తగిన అనుచరులు కారు.

అయితే, ఆమె మద్రాసులో యెందుకు స్థిరపడిందీ అంటే ఆమె స్థిరపడింది కనకనే మద్రాసు యీస్థితికేనా రాగలిగింది. ఆమే యిక్కడ వుండకపోతే ప్రపంచకంలో అన్ని ఖండాలలోనూ, అన్ని దేశాలలోనూ వున్న గొప్పగొప్ప విద్వాంసుల దృష్టీ, సాధకుల ఆశలూ ప్రసరించడానికి మద్రాసులో యేం విశేషం వుందీ?


పోనీ: బిసెంటు సాహచర్యం వల్ల మద్రాసులో ముందుకు వచ్చిం దెవరు? మొదటి మనల నెవరూ వెనక్కి పడగెంట లేదు. ప్రత్యేకంగా బొట్టుపెట్టి ఆమె కూడా యెవర్నీ పిలవలేదు; కాని సహజమైన ప్రగమనశీలతవల్ల అనవా లామె చాపిన చెయ్యి పట్టుకొని ప్రయోజకులైనారు. ఎక్కణ్ణుంచో వచ్చి మహారాష్ట్రులు కూడా అడయారులో ఉత్కర్ష పొందారు; కాని మన కేమీ అంట లేదు.

అయితే, వొకటుంది. మద్రాసు ప్రభుత్వం తనకి ప్రవాసశిక్ష విధించినపుడు న్యూయిండియాపత్రిక నడపడానికి అరవలలో ఆమెకి అర్హుడు కనపడ లేదు. ఇందుకోసం ఆమె డి. కె. తెలాంగు గారిని పనిబూని బొంబయినుంచి రప్పించింది.

అందులో ఆమె విశ్వాసం అపాత్రన్యస్తం కాలేదు. తెలాంగుగారి సంపాదకత్వంలో న్యూయిండియాకి పాఠకవలయం పెద్ద దయింది. పదవి అతిశయించింది. గౌరవం హెచ్చింది; కాని యే లోటూ రాలేదు. చూశారు కాదూ, గాంధిగారి చేతిలో వున్నప్పుడు యాభై వేల చందాదార్లున్న యంగిండియాపత్రిక రాజగోపాలాచారిగారి చేతిలో పడి నాలుగు వేల చందాదార్లలోకి తగ్గి కుండలోకి వచ్చిందీ?

మనలో ముందుజన్మలో ఇంగ్లండులో పుట్టతగ్గవారు కొందరున్నారు; కాని వారి వల్ల యింగ్లండు కేమీ మేలుకలగదు. సంఖ్య మాత్రం పెరుగుతుంది. అంతే. అయితే బిసెంటు సంగతి అలాంటిది కాదు. ఆమె తత్వానికి హిందూదేశం సరిపడినట్లు పాశ్చాత్య దేశాలు సరిపడవు. కనక ఆమె యిక్కడే పుడుతుంది. హిందూ దేశానికి ఆమె వల్ల మాత్రమే కలిగే ఉన్నతి యింకా చాలా వుంది.

నిజానికి బిసెంటు జీవితం వొక మహాసముద్రం. అందులో భీమకాంతాలైన యాదోరత్నాలు పుష్కలంగా వున్నాయి. అంచేత అది అధృష్యమూ, అభిగమ్యమూ కూడానూ.



సుశీల

౧

"సుశీలా!"

—"ఆఁ."

"నన్ను క్షమింపుము" అనుచు భువనేశబాబు తన వ్యథిత నేత్రదృష్టిని సుశీలముఖమున బరపెను— తన దుర్బలహస్తముల నామెచేతి నందుంచి పట్టుకొనెను. సుశీల తనముఖము శోకమై పుడు త్రిప్పికొని చేతిలను తిన్నతిన్నగా విడిపించికొని విసనకఱ్ఱతో విసరుచు "మీ రూరకుండుడు కొంచెము శాంతముగా నిద్రించుటకు ప్రయత్నించుడు" అనెను.

"సుశీలా! శాంతముగా నుండజాలకున్నాను" అని భువనేశబాబు దీర్ఘనిశ్వాసము విడిచెను.

"మీరు మాట్లాడుటయేకూడదని డాక్టరుగారు చెప్పిరిగదా!"

"మనస్సు శాంతముగనుండు నా తిట్టలేకున్నారు. రెండు నోటిమాటలు—"

"ఊరకుండుడు— తల మరల వేడియెక్కును." అని యొకచేతితో తొందరగా విసరుచూ, సుశీల తన రెండవచేతిని భువనేశబాబుతలయం దుంచెను.

స్నిగ్ధకోమలహస్తస్పర్శచే భువనేశబాబునకు మధురసుఖానుభవము కలిగెను.

"ఇప్పుడు కొంచెము నిద్ర పొండి" అని సుశీల పలికెను.

"నిద్రించుటయా! ఇంకెట మనస్సున శాంతకరము. చెప్పు—నన్ను క్షమించెదవా?"

సుశీలనేత్రములందు నీరునిండెను. నిక్కిలికష్టముతో ఆమె తనదుఃఖము నాపుకొని "మీ రేమి యపరాధము చేసితిరి? —నేను దేనిని క్షమించుట?" అనెను.

"ఈవయస్సునందు— జీర్ణశరీరుడనయ్యు, రూపముగ్ధుడనై, నిన్ను వివాహమాడితిని—"

"అయినను పెండ్లిచేసినది నాతండ్రిగారు గదా!"

"అవును—నాకంటెను వారియపరాధ మధికము— చాల నధికము! కాని నేనే— కోరియుంటిని—గొప్ప మొత్త మిచ్చుటచే వారు నిన్ను నాకు కట్టిపెట్టిరి—"

"ఊరకుండుడు. ఇప్పు డావిషయమేల! అదంతయు నాలోచింపకుడు. మిక్కిలి అస్వస్థత గలుగును."

అస్వస్థత! — అధిక మింకేమిగలుగగలదు? నేను పోవుచున్నాను. ఒకటిరెండురోజుల ముందుగనో వెనుకనో— ఇందువలన నేమగును!"

"లేదు, లేదు. మీరు బాగగుదురు—" —

"బాగగుదునా! లేదు ఇక స్వస్థతగలుగదు—ఎవరును నన్ను బాగుచేయజాలరు—పోవుటకుముందు మనస్సుయొక్క పరితాపమును కొంచెము నివారించుకొని పోగోరుచున్నాను."

కడపటిమాటలు నోటినుండి మెల్లగా వెలువడెను. రెండుకండ్లును మూతపడెను. ఈ ఉద్రేకపూరితసంభాషణవలన భువనేశబాబుకు స్మృతితప్పెను. సుశీల అతని శిరస్సున నీరు జల్లి తొందరగా విసరదొడగెను. కొంచెము సేపటివిధముగా భువనేశుడు పడియుండెను. శ్వాస క్షీణముగా నుండినను నియమితరూపముననే జరుగుచుండెను. శిథిలదృష్టితో నాతడొకసారి కన్నెత్తి చూచెను. అతడు క్షీణకంఠముతో "అబ్బా. కొంచెము నీరు." అనెను.

సుశీల కొన్నిగరిటెల నీరు బాబునోటిలో బోసెను. తర్వాత గడియారమువైపు చూచి "మందుపుచ్చుకొను సమయమైనది, పుచ్చుకొందురా!" అనెను.

"ఇమ్ము"

సుశీల లేచి మందుదెచ్చి, రోగినోటిలో కొంచెము కొంచెముగా బోసెను. జలపాన, ఔషధసేవలవలన భువనేశబాబునకు కొంచెము బలముగలిగినట్లు తోచెను. కొంచెముసేపు నిశ్శబ్దముగా నుండి శక్తితెచ్చుకొని యిట్లుచెప్పదొడగెను: "అవును, నీతండ్రిది గొప్ప అపరాధము."

"ఊరకుండుడు, దేహమున కొంచెము స్వస్థత యగుపడుచున్నట్లున్నది."

"అవును, అందువలననే కొంచెము మాట్లాడవలయు నని కోరిక పుట్టినది! ఇక నింతకన్న బాగుగాదు! —వలదు, అడ్డగించవలదు, నిషేధించవలదు, సుశీలా! ఇప్పుడు—"

మాట్లాడుచుండగనే హఠాత్తుగ మాటనిలిచిపోయెను. కొంచెము సేపటికితర్వాత "అబ్బా! కొంచెముగూడ మాట్లాడనియ్యవా? కాలుడా! —తీసికొనిపొమ్ము— తీసికొనిపొమ్ము—ఇప్పుడే. మనస్సు చాలభారముగ నున్నది—కొంచెము తేలికచేసికొననియ్యవా?—"

తలమీదనీళ్ళుచల్లి సుశీల తొందరతొందరగా విసర జొచ్చెను—హఠాత్తుగా భువనేశబాబు కండ్లుతెఱచి చూచెను,—చేయియెత్తి సుశీలచేతినందుంచెను,—"ఊరకుండుము, మాట్లాడవద్దు,— ఆటంకపరచవలదు,—నన్నుమాట్లాడనిమ్ము. నీతండ్రిది చాలయపరాధము. అతడు చాల తప్పులు చేసియుండెను— అంతేయు పోయియుండును, తాను జైలుకు పోయియుండును— కాని యీవిధముగా జీర్ణశరీరుడనగు, నాకు,—లంపటుడనగు, నాకు—నిన్ను ముడిపెట్టుటకు నాతని కధికారమునులేదు."

సుశీల నేత్రములనుండి అశ్రుకణములు రాలెను. ఆమె తనముఖమును మరలించికొని "నే నేమియు ఆటంకపరుపలేదు."

"అది నీమహాత్వగుణము! నిర్దయుడగు నీతండ్రి స్వార్థపరుడై, దేవలోకబాలికవగు నిన్ను, నాకు బలి యొనర్చినాడు. ఏలనో నే నాబలికి కారణభూతుడనైతిని— నేడో, రేపో నే నన్నియు విడిచి వెళ్లిపోవుచున్నాను— ధనమును, భోగమును, అన్నిటిని!— నేను తీసికొనిపోవునది— అబ్బా! చెప్పజాలను, చెప్పలేను, అనేకపాపముల జేసితిని— అన్నిటిని—, ఆలోచించలేను! కాని అంత్యమునగూడ ఈమహాపాతకమును.—"

"నేత్రముల మూసికొని భగవంతుని ధ్యానింపుడు— అతడు శాంతినొసగును."

"ఒసగునా!—ఒసగగలడా? సుశీలా! నీవు చెప్పుచున్నావుగాని శాంతినొసగగలడా? అబ్బా!"

మాట్లాడుచుండగనే భువనేశబాబునకు మరల మైకముగ్రమ్మినట్లాయెను. కొంచెము కాలము గడచెను. అతడు మరల కండ్లుతెఱచెను. "అబ్బా", అనెను,— సుశీల అతనినోటిలో పాలుపోయ దొడగెను. భువనేశబాబు తలకదలించెను; సుశీల నీరుపోసెను,—అతడు కొన్నిగరిటెలనీరు త్రాగెను. అతని కనుకొనసంతటి బలము గలిగినట్లాయెను. మెల్లగా సుశీల అతనిని "మీ బిడ్డలకు జెప్పి పంపుదునా?" అని ప్రశ్నించెను.

"వలదు"

"పంపించిననే బాగుండును."

"ఇప్పుడు వలదు."

"అయిన నెప్పుడు?"

"తర్వాత.— వారు వచ్చినయెడల మంచిదే, లేని పక్షమున, కొంచెము నిప్పును— నీవే అంటించుము."

"వారిని చూడవలయుననుకోరిక లేదా?"

రెండునేత్రములనుండి రెండు అశ్రుకణములు రాలెను. సుశీల తనకోమలహస్తములతో వాటిని తుడిచెను. మరల నశ్రువులు రాలెను. మరల ఆమె తుడిచివైచెను. మరల రాలెను!

"ఎవరు వలదనిరి? వారికి సమాచార మంపించెదను. వారు వచ్చిచేరుదురు." అని సుశీల తెలిపెను.

"వద్దు, యీముఖమును వారికి చూపింపను! చూపింపజాలను!"

"ఏల? ఏమైనబాధ యుండినయెడల తీర్చివైచికొనుడు. ఇంకను సమయమున్నది."

"సమయ మేమోయున్నదికాని అధికారము లేదు. నేను ప్రతిజ్ఞాబద్ధుడను. వలదు, ఇప్పు డామాటలన్నియు వలదు. సుశీలా! వలదు. ఇం కేయానందము నవలదు. శాంతి! శాంతి! కొంచెము శాంతియే!—

అతడు మరల మైకముగ్రమ్మినట్లు పడిపోయెను. కొంచెముసేపు సుశీల అతనివైపు దృష్టినిలిపి చూచుచుండెను. హఠాత్తుగా నామె కెందులకో భయము దోచెను. ఆమె మెల్లగాలేచి ప్రక్క—వైపుననుండు ఒ.

తలుపును తెఱచెను. డాక్టరును మరిముగ్గురు మనుష్యులును వచ్చుట కూర్చొనియుండిరి. సంజ్ఞచేసి సుశీల డాక్టరుగారిని పిలచెను. మునివ్రేళ్ళమీద నడచుచు నతడు గృహమధ్యమున బ్రవేశించెను. రోగిముఖమును వీక్షించెను. శ్వాసను, నాడిని, శరీరోష్ణమును నతడు పరీక్షించెను. అతనిలలాటమున బొమముడివడెను. క్షిప్రచరణక్షేపములతో మరల నతడు ప్రక్కగదిని ప్రవేశించెను. కొన్నిసీసాలను బైటికితీసి ఒకమందును తయారుచేసి తీసికొనివచ్చెను. మందు నందుకొని సుశీల మెల్లమెల్లగా రోగినోటిలో బోసెను.

ఆపైని రోగికి కొంచెము స్వస్థత అగుపడెను. ద్వారపు నెలుపలివైపున రఘునాధుడనునొక పురాతన భృత్యుడు వేచియుండెను. వానిని రోగిదగ్గఱనిలబడి విసరుమని సంజ్ఞచేసి సుశీల ప్రక్కగదిని ప్రవేశించెను.

౨

"డాక్టరుగారూ!"

"మీ రలా కూర్చొనుడు. మీరు భయపడనవసరము లేదు. కాని— చాలరాత్రి అయినది. ఇంకెంతసే పుండగలరు! పోయి మీరు కొంచెము విశ్రమింపుడు. ఇం కెవరైనను రోగివద్ద కూర్చొందురు!—'

సుశీల తలవాడించి "లేదు, నాకు కొంచెముకూడ దుఃఖములేదు— వారు మేల్కొనినప్పుడు నన్నే పిలచెదరు!"

"అది సరే— అది సరే—అయినను—"

"వారిస్థితి యిప్పు డెట్లున్నది?"

"స్థితికేమి— మీరు భయపడవలదు. రాత్రియంతయు బాగుగనే గడచిపోవును—"

"ఏమైన ననుమానమున్నదా?"

డాక్టరు సందేహముతో "అదంతయు భగవదాధీనము" అనెను.

"నే నీసమాచారము వారిసంతానమునకు తెలియజేయవలయునని కోరుచున్నాను.—"

సమీపముననే నొకపురుషు డాసీనుడైయుండెను. అతనిపేరు ప్రఫుల్లచంద్రబాబు. అత డాగృహకార్యనిర్వాహకుడై యుండెను. "అమ్మా! సమాచార మంపుట వారి కిష్టములేదా?" అని యత డనెను.

"అట్లే యగుపడుచున్నది. అయినను వారికి సమాచార మంపవలయునని నా యిష్టము."

"తమరు చెప్పినయెడల—"

"అవును. మీ రిప్పుడే వారి కీసమాచార మంపుడు. జబ్బుసంగతికూడ వారికి తెలియదు. ఇప్పుడే యొక జాబు వ్రాయుడు. 'వారు మృతప్రాయులుగా నున్నారు. తక్షణమే ప్రయాణమగుడు' అని వ్రాయుడు. మోటారు సంసిద్ధముగా నున్నది. ఇప్పుడే ఎవరికైన జాబు తీసికొనిపొమ్మనుడు."

ప్రఫుల్లచంద్రబాబు అచ్చటినుండి లేచి వెళ్ళి, జాబు వ్రాయుటకై కూర్చొనెను. కాగితము, పేనా తీసికొని వెనుకకు తిరిగి "తమతండ్రిగారికిగూడ జాబు వ్రాయుదునా?" అని యడిగెను.

"వలదు"

"వా రేమందురు?"

"వలదు, అవసరము లేదు, వారికి జాబు వ్రాయవలదు." సుశీలముఖమునుండి ఉత్తేజపూరితమగు నొక వేడినిట్టూర్పు వెలువడెను. ఆమె దానినణచి ధీరముగా "వలదు, ఇం కెవరికిని సమాచార మంపనవసరము లేదు. కేవలము వారిబిడ్డల కిప్పుడే సమాచారమంపుడు."

ఇట్లుచెప్పి సుశీల మరల రోగియుండుగదిలో బ్రవేశించెను. ఆమె భృత్యునిచేతినుండి విసనకఱ్ఱను తీసికొనెను. రఘునాథు డటుతొలగి నిలుచుండెను.

ఒకగంటకాలము గడచిపోయెను. బైట వరాండాలోనికి ఘుయ్‌ఘుయ్ శబ్దములతో కొన్ని మోటారులు రాదొడగెను. సుశీల శరీరమంతయు గడగడ వణక జొచ్చెను. ఆమె మిక్కిలిప్రయత్నముచేసి మనస్సు శాంతపరచుకొని శక్తితెచ్చుకొని నిలబడెను! రఘునాథుడు, కండ్లనిండుగ నీరుదెచ్చుకొని రోదనారంభించెను.

మెట్లమీద చాలపాదధ్వనులు వినబడెను. వచ్చినవారందఱు ప్రక్కగదిని ప్రవేశించిరి. సుశీలయు తలుపు తెఱచి వారికెదురుగా బోయి నిలబడెను. ఇల్లు నిండిపోయెను,— ఇద్దఱు పుత్త్రులు, ఇద్దఱు కోడండ్రు, ఒక

కూతురు, మనుమడు, మనుమరాళ్ళతో ఇల్లు ఒకేసారి నిండిపోయెను. సుశీల వారి నొకసారి కన్నెత్తిచూచెను. ఆమె దుఃఖముతోడను, సిగ్గుతోడను, తలను వంచు కొనెను.

అహా! ఏమి ఏలోభమున నామె వాని వాత్ర యించియుండును. వీరిమధ్య నామెయే అపరా ధినివలె నగపడుచుండెను. ఆమె ఒకసారి కన్నె త్తిచూచి తలవంచుకొనెను. మరల ఆమె కన్నెత్తి చూడజాలకపోయెను. ఆగంతకులు నిశ్శబ్దముగా సుశీల ముఖమువైపు చూచుచుండిరి. ఈ మోహినియే యాతని కింద్రజాలముగదా!—కాదు. ఈమె మోహినిగాదు, ఈమె మహామహిమాదేవి! సామాన్యమనుష్యస్త్రీ యగుపక్షమున, అబ్బా! ఇంతటి దురదృష్టవంతురాల గునా? ప్రేమ, కరుణ కలసిన దృష్టితో నందఱును నామె ముఖమువైపు చూచుచుండిరి. ఇప్పటివఱకును నీమెపేరు వినినంతనే లెక్కలేని శాపముల బెట్టుచుం డెడివారు!

సుశీల వంచినముఖముతో డాక్టరువద్దకు వెళ్ళి "వీరిప్పు డాయింటిలోనికి వెళ్ళవచ్చునా?" అని యడిగెను.

డాక్టరు తలను ఊపి సమ్మతిని తెలియపరచెను.

తలుపుతెఱచి సుశీల ప్రక్కకు జరిగి నిలుచుండెను. నిశ్శబ్దముగా నందఱు గృహమధ్యమున ప్రవేశించిరి. అందఱును శయ్యాగతుడైన రోగికి నాల్గువైపుల నిలు చుండిరి.

పదునైదునిముషములు గడచియుండును. ఇంతలో భువనేశబాబు కదలెను. క్షీణకంఠముతో మెల్లగా "మీ రెవరు? అందఱువచ్చిరి! అబ్బా!" అనెను.

సుశీల కొంచెము దగ్గఱకువచ్చి తలవంచి "కన్నెత్తి ఒకసారి వీరిని చూడుడు" అనెను.

భువనేశబాబు కండ్లుతెఱచి చూచెను. అతని ముఖమునం దొకసారి ఆనందదీప్తి వెలిగెను. తక్షణమే నిష్ప్రభకాంతి పాండువర్ణము బొందెను. అతని శిథిల నయనములు రెండును మూతపడెను. రెండుకన్నీటిబొట్లు పైలుజారెను. ఈ వ్యథితవిభ్రాంతజీవికి ఉత్తరలోక మునవైన శాంతి సంప్రాప్తించియుండునా!— ఆవిష యము మాలోకాధిష్ఠాతయు, కర్మఫలధాతయు నగు ధర్ముని కే తెలియవలయు!

3

"తమరు మమ్ముల బిలచితిరా?"

"అవును, కూర్చుండు—" సంభ్రమముతో, సుశీల లేచి, భువనేశబాబుకుమారులగు నరేంద్రబాబు, ధీరేంద్రబాబులకు కూర్చుండుటకై స్థానమిచ్చెను.— వారు నిశ్శబ్దముగా కూర్చుండిరి.

"సరి— మమ్ముల నేలపిలచితిరి?"

"వారు చాలసంపత్తి నుంచిపోయిరి" అని సుశీల మిక్కిలి నిర్లిప్తభావముతో నుడివెను.

"వింటిమి, అంతియేనా?"

"వారి వీలునామాసంగతిగూడ వింటిరా?"

"వింటిమి, ఆస్తినంతయు తమ కిచ్చి పోయిరి గదా?"

"వివాహసమయమునందు మాతండ్రిగారివద్ద యీ విధముగు ప్రతిజ్ఞయే వారు చేసియుండిరి—"

"మావద్ద ఆవిషయములగురించి ఆలోచించుట కేమైనఅవసర మున్నదా?"

"వా రీప్రపంచమునువిడిచి వెళ్ళిపోయిరి. ఏమైనను సరే మీ రాఆస్తివిషయమై ఆలోచింపవలయును."

"తమయాస్తివిషయమైగదా! దానిని తమరు మీ యిష్టమువచ్చినట్లు చేసికొనవచ్చును. ఈఉపదేశ మిచ్చుటకొఱకేనా మమ్ముల బిలుచుట?" అని ధీరేంద్ర బాబు పలికెను.

"కాదు, ఆ ఆస్తివిషయమై నా కేమియధికారము న్నది? కాని నాకొఱకై వారు తలచిన అంత్యకర్తవ్య మునువారు చేసిపోయిరి. ఇప్పుడు నేను నాకర్తవ్య మును చేయవలసియున్నది. ఇది వారివీలునామా" అని ఆమె ఆవీలునామాను ఆసవతిబిడ్డల యెదుటపెట్టుట పడవైచెను.

"సరే, దానినిచూచి మే మిప్పుడు చేయునదేమి?" అని నరేంద్రబాబు వాక్రుచ్చెను.

సుశీల ఆవీలునామాను మరల యెత్తుకొనెను,—

రెండుభాగములుగా చించి, అగ్గిపుల్లను వెలిగించి వాటి కంటించెను. భగ్, భగ్ మనుచు వ్రాసియుంచినకాగిత ముక్కలు మండజొచ్చెను. చూచుచుండగనే అవి భస్మీభూతము లాయెను.

"వీలునామా— అదిగో మండిపోయినది,— మీతండ్రిసొత్తునకు వారసు-దారులు మీరలే!"

ఇద్దరు సోదరులును విస్మయము జెంది ఆమెనే చూచుచుండిరి. కడపట "తమ రిప్పు డేమిపనిచేసితిరి?" అని నరేంద్రబాబు పలికెను.

"మంచిపనియే చేసితిని మీరు వారివంశజులు— వారిసంపత్తికి మీరు వారసు-దారులు!— ఈవిపుల సంపత్తిని స్వాధీనపరచుకొనుటకు నే నెవతెను?"

"తమరు వారిపత్నులుగదా!"

"ఏమైననుసరే, నా కెట్టియధికారమున్నదని నే దలంచను."

"ఏల తలచరు? స్వతంత్రముగానే తమరు జీవింప గలరు. ఎట్లైనను దీనికి కడపట అధికారులంతమరే— వీలునామాను తమరు కాల్చివేసితిరి, అయినను యింకొకటైన వ్రాతమూలకముగా నుండిన—"

"నాకు తెలియదు. తెలిసికొనవలసిన అవసరము నాకు లేదు. అధికారిని! వలదు, అధికారి వనుమాట లింక చెప్పవలదు.— అధికారము కావలయునని నేను కోరలేదు. నేను కోరను. నాకు నగలు చాల యిచ్చియున్నారు. వాటిని యీనాకోడండ్ర కిచ్చివేయుదును. వారుధరించిన నేను సంతోషించెదను.—" చెప్పుచుండగనే ఆమె నోటిమాట నిలచిపోయెను.

నరేంద్రబాబు "అయిన తమజీవనము—"

"జీవనము! నే నొకయాడుదానను— విధవను. రెండుపిడికెళ్ళబియ్యము, రెండుగుడ్డలు— ఇందుల కేమిఖర్చగును? మాతండ్రి నన్ను చదివించుటలో లోప ముంచలేదని మీకు తెలియునుగదా!—"

"తమరు సుశిక్షితులని నాకుతెలియును;— తమ కీదుర్భాగ్యము ఘటించెను. ఏమైననుగానీ తమరు విద్యాలాభముబొందియున్నారు. ఆవిద్యచే సార్జించిన ధనముచే తమ కొక్కరికేకాదు యింక నలుగురినిగూడ పోషింపగలుగుదురు. కాని తమరిట్లుచేయవలయును. తండ్రిగారిసంపత్తిని తమరు కొంచెముగూడ స్వప్రయోజనమునకై యుంచుకొనుటలేదు. కాన తల్లీ! నీవు మా తల్లివి! మేము మీబిడ్డలము మాఅధికారిణివి—"

సుశీల యేడ్చుచు తనరెండుచేతులతో ముఖమును గప్పికొనెను. నరేంద్రబాబు నోటిలోనిమాటలు హఠాత్తుగా నిలబడిపోయెను. కొంచెముసేపటితర్వాత వాని స్నేహకోమలకంఠమున "తల్లీ!" అనిపిలుపువెడలెను.

వృద్ధప్రాయమున "బిడ్డా" అని సుశీలకంఠమున వెలువడెను.

"బిడ్డల ప్రార్థన నుపేక్షించి వెళ్ళిపోయెదవా తల్లీ!"

సుశీల బిగ్గరగానేడ్చుచు "తల్లీ! తల్లీ! నేను తల్లినా? మీరు మీసంతానాధికారమును గోరుచున్నారా!"

"అవును. తమరు తల్లులు, మేము బిడ్డలము— బిడ్డల అధికారమునే మేము తమరి నడుగుచున్నాము. తల్లివలె, దేవివలె, తమరు తమబిడ్డలసంసారమునందే యుండుదురుగాక"—

"ఉండెదను— అట్లైన నుండెదను. నేను చాల చిన్నదానను, —తల్లియగు టెట్లో నాకుతెలియదు. కూతురువలె మీవద్దనుండెదను,— మీరు తండ్రులరు— పుత్రికవలె మీలో నా కొకస్నేహస్థాన మిండు— నే కృతార్థురాల నయ్యెదను!" (అనువాదము).

—తిరుమూరు రంగారెడ్డి.



క్షమార్పణ

తారకాగణమువలె వికసించింది. ఆమాలతీపుష్పపరిమళ మిళితవాతపరంపరలు నన్ను తమవంకకు త్రిప్పుకోఁగలిగాయి. అది మొదలు ప్రతిమునిమాపున దానిదరిఁ జేరి తచ్ఛాయల విహరింపుచు దానిసౌరభము నాఘ్రాణింపుచు ఆనందవార్నిధిమగ్నుడనై ప్రకృతి సర్వస్వమును మఱచునంతటితన్మయత్వము పొందేవాణ్ని. కొన్నాళ్ల దాక నా కదే భూలోకనాకమైపోయింది. అలా యెంతకాలం గడచిందో నాకే తెలియదు.

అభ్యంగనానంతరమున సఘటిత కేశయగు విలాసినివలెఁ గన్పట్టు నామాలతీలత, శిరోముండనముఁ గావించుకొన్న సన్న్యాసివలెఁ గన్పట్టిం దొకనాడు. నాహృదయము బ్రద్దలైంది. ఇంటిమీది పెంకులు అదరునంతటి ఆర్తనాదముఁ గావించాను. దాని కదరి భయకంపిత స్వాంతముతో మాచిట్టి నామ్రోల ప్రత్యక్షమైనాడు.

"నాన్నా? భయపడకు, దీ న్నిలాపాఁడుచేసిం దెవరురా?" అని అడిగాను.

"నేనేనే. మంచిపూలని కఱ్ఱతో కోసుకోబోతే యిరిగిపోయిందే". అన్నాడు అవ్యక్తమధురకంఠధ్వనితో మాచిట్టి.

"నాన్నా? మంచిపూలని యిలా పాఁడుచేయవచ్చునా? మంచి వస్తువులను యిలా పాఁడుచేస్తే ప్రకృతిఅంతా స్మశానముగా మారదా?" అన్నాను నేను.

శోకపూరితనయనాలతో నాచిట్టి "నాకు తెల్లేదే. నమిం చాలి." అని అన్నాడు.

ఆపలుకులకు నా కనుకంపావిషాదము లొక్కుమ్మడి పెనవైచి ముగ్ధునిఁ జేసివైచాయి. నాటితో నామాలతీలతకు నాశనము, మాచిట్టి సత్యవృత్తమునకు బీజప్రదానము.

—కొత్త సూర్యనారాయణచౌదరి.



భిక్షుక బాలుడు

[ఆకాశాన్నిఅంటే మేడ. వీధిద్వారంమాత్రం ఎంచేతో బూజుపట్టిఉంది. లోపల మనుష్యులసందడి అట్టే ఉన్నట్టు కనబడదు. వాలకంబట్టిచూస్తే ఆయింట్లో ఇద్దరు ముగ్గురుకన్న యెక్కువఉన్నట్టు కనపడదు. పెరటి ద్వారంలోంచి ఎంగిలివిస్తరాకులు పట్టుకొనివచ్చి ఆవతల గిరవాటేసి ఎక్కణ్ణుంచో 'అమ్మా' అను పిలుపు వినబడడంచే గుమ్మంలోనే నిలబడింది ఆమె. సుమారు ముప్ఫయిసంవత్సరముల వయస్సు. ముఖంలో మార్దవరసం ప్రవహిస్తోన్నట్టు కనుపిస్తుంది. చూపుల్లో కరుణ వరదలై పారుతోంది. మొత్తంమీద పరిమళహృదయమే. పట్టుచీర కట్టుకుంది. అలా నిలబడి చూస్తుంటే కరడుకట్టిన కరుణామూర్తిలాఉంది ఇంతలో చిల్లిపింగాణీకంచం నెత్తిమీద బోర్లించుకొని వచ్చాడో పిల్లాడు. మెళ్ళో నాలుగువరుసల వేరుపూసల దండలు, తైలసంస్కారం లేకపోవడంచేత మొహం మీదికి పడే ఎర్రనిముంగురులు, చేతులకి రాగిమురుగులు, జబ్బలదగ్గర వేరుపూసలకడియాలు, కోలనిముక్క, చిన్నగోచీ పెట్టుకున్నాడు. వెనకపక్కకు ఒదిలిన గోచీ కొంగు పీలికలై ఉంది వాలకంబట్టి చూస్తే వాడో భిక్షుకకుటుంబానికి చెందిన పిల్లాడని తెలుస్తుంది. ముష్టి అడగడంతెలియదు. ప్రపంచాన్నిమాత్రం స్వాతంత్ర్య దృష్టితో చూస్తున్నాడు. ప్రపంచకంఅంతా ఒకఇల్లు. అది తనదీ అని వాడిభావన. ఆకలేసేసమయాన్కి ఏ ఇల్లాలినిఅడిగినా తల్లిలా ఆదరించి ఇంతఅన్నం పెట్టుతుందని వాడిభావం. తనగుడిసెలోఉండే తల్లిదండ్రులంటెంత ప్రేమో తనకి లోకంలోఉండే స్త్రీపురుషులందుకూడా అంతే ప్రేమ. తనగుడిసెలోతనకి ఎంత స్వాతంత్ర్యమో ఇతరులఇంట్లోకూడా తనకి అంతేస్వాతంత్ర్యంఉందని వా డనుకునేవాడు. తనతల్లి తనని ఎల్లా చూస్తోందో లోకంకూడా అల్లా చూస్తుందని వాడి [illegible] ఉద్దేశం. ఇంకా లేతమనస్సుకాబట్టి కలుషప్రపంచకంలో ఉండే దుర్గంధం వీడి కేంతెలుసు? గబగబా పరుగెత్తుకొనివెళ్ళి కంచం కిందపడేసి కాళ్ళు చాపుకొని కూచుని 'అమ్మా నా కాకలేస్తోందే' అన్నాడు.]

ఆమె—(జాలిగా వాడికేసి చూసి) ఎవరమ్మా నువ్వు?

బాలుడు—నేను.

ఆమె—నీపే రేఁరమ్మా?

బాలుడు—నా పేరు పొవ?

ఆమె—మీయింటి పేరు?

బాలుడు—మాయిల్లు కొబ్బరాకులది.

ఆమె—అదికా దమ్మా! మీయింటి పేరు?

బాలుడు—ఆహా! అదా!! బిచ్చమెత్తుకొనే ఇల్లు.

ఆమె—అయ్యో! పాప! నీ కెన్నేళ్ళుంటాయి! నీకు సరిగ్గా మాటలు రావూ, నాయనా?

బాలుడు—ఆఁ! నేచెప్పను. నాకు ముందన్నం పెట్టు. నా కాక లేస్తోంది.

ఆమె—పోనీలే అన్నంతిన్నాక చెబుదుగానిలే. ఇక్కడే కూచో. అన్నం పట్టుకొస్తా. [లోపలికి వెళ్లుతోంది].

బాలుడు—[స్వతంత్రంగా ఆమె వెనకాలే వెళ్ళి ఆమెకొంగు పట్టుకొని వెనకాల నడుస్తున్నాడు.

పాపం వాళ్ళు బ్రాహ్మలనీ ఆమెది అంటచెయ్యికాబట్టి ముట్టుకోకూడదనీ తెలీదు] అమ్మా! ఏంవేసి పెడతావు అన్నంలో?

ఆమె—[చటుక్కున వెనక్కి తిరిగి చూసి] అయ్యో! పాప! ముట్టుకున్నావా? పోనీ స్నానం చేస్తాలే. నిన్ను వాకట్లో ఉండమంటే ఇలావచ్చావేం? [శాంతంగా] వాకట్లో ఉండు. అన్నం పట్టుకొస్తా.

బాలుడు—ఏం ముట్టుకుంటేను?

ఆమె—మేం బ్రాహ్మలం. నాది అంటచెయ్యి...

బాలుడు—బ్రాహ్మలంటే? ఏం ఆచెయ్యి ఆ బట్టలో తుడుచుకోకూడదు?

ఆమె—అబ్బే! పాప! అల్లా తుడుచుకోకూడదు. కడుక్కోవాలి.

బాలుడు—అయితే మాఅమ్మ బట్టతో తుడుచుకొంటుందేం రోజూను.

[లోపల్నుంచి "ఎవరితోనే ఆవెధవకబుర్లు" అంటూ ఓ ఏభైఏళ్ళమనిషి వచ్చాడు. కళ్ళు చాలా క్రూరంగా ఉన్నాయి. ముఖంలోంచి ఒకవల్లనిరాక్షసకళ పైకి అప్రయత్నంగా చిమ్ముకొస్తుంది.] ఆముష్టివెధవ ఎవరు?

ఆమె—.........

ఆతడు—ఆవెధవ ఎవరే లోపలి కొచ్చేస్తున్నాడు?

ఆమె—వాడు ముష్టివాడే. అన్నంలేక కడకొట్టి వీధిలోపడిపోతే తీసుకొచ్చాను గుప్పెడుఅన్నం పెడదామని.

బాలుడు—[కంచం నెత్తిమీద బోర్లించుకొని రెండుచేతులతోటి నొక్కుకొంటూ ఆవెర్రికేకలకి నవ్వుతో అతనికేసి ఆమెకేసి దీనంగా చూస్తూంటాడు.]

ఆతడు—ఎక్కడుంది అన్నం. అంతమిగిలేట్లా వండావేమిటి?

ఆమె—అబ్బే! లేదు. నే నింకా భోంచెయ్యలేదు కామా దాల్లోది కొంచెం పెడదామని.

ఆతడు—ఇల్లాటి వెధవపనులు ఎప్పుడూ చెయ్యకు. ఆవెధవని వీధిలోకి గెంటి తలుపేసి రా.

బాలుడు—ఆఁ! నేవెళ్ళను. నిన్నే గెంటేస్తా.

ఆతడు—ఓరి వెధవా! [అని కోపంతో గభీల్న దగ్గరకి వస్తాడు కొట్టటానికి.

[కుర్రాడు ఆమెవెనక్కాలికివెళ్ళి ఆమెకొంగు నెత్తిమీద ముసుకేసుకొని] 'అమ్మా! మా డొల్లాకొడుకున్నాడో? అన్నాడు.]

ఆతడు—ఓరివెధవా దాన్ని ముట్టుకొని తగలేశావు కళ్ళు పీకేస్తాను వెధవా.

ఆమె—అబ్బా మీ కెందుకండి ఇన్నిగొడవలు. [శాంతంగా.] చిన్నపిల్లవాడు. కడుపుమండులోందని ఏడుస్తుంటే ఇంతఅన్నం పెట్టొద్దంటారు. నాదాంట్లోది పెడతానంటే మీకేం?

ఆతడు—నోరుమూసి ఆవెధవని వీథిలో పారేసి తలుపేసిరా. తరవాత నీసంగతి చెబుతా. ఇల్లా దెబ్బలాటలు వస్తాయనే వీథితలుపు వాడకం మానిపించేను. పెరటిదారిని ఈవెధవవ్రతకం ప్రారంభించావూ? ఓసీ......

ఆమె—మనింటివీథితలుపు వాడకం మానేశాక యీయివారబ్రాహ్మడేనా రానటం మానేశాడు కదా? ఎప్పుడో వచ్చిన ఈకుర్రాడికి ఇంతఅన్నం పెడితేనేం? కుర్రాడు. తెలీదు. పెరటిదారిని వచ్చాడు.

ఆతడు—ఛీ! ఇంక ఇల్లాకాదు. ఒరేయి వెధవా—

బాలుడు—నీతో మాట్లాడను ఫో.

ఆతడు—ఓరి కొంటివెధవా అవతలికి పోతావా పోవా.........

బాలుడు—[కంచం కింద పారేసి కిందపడి దొల్లుతూ] నా కాకలేస్తుందోయి. నాకడుపుమండిపోతోందోయి. [అని ఏడ్చును]

ఆతడు—ఒక్క లెంపకాయ కొడతా వెధవా? దొంగఏడుపు ఏడిచావంటే.

బాలుడు—[ఏడ్చును].........

ఆతడు—పోనీ ఆ అంటుగిన్నెలు తోముతావా? ఇంతగంజి పోస్తాం?

బాలుడు—[కోపంతో] నే తోమను ఫో.......

ఆతడు—[ఆచిన్నబుగ్గమీద లెంపకాయ కొట్టును]

ఆమె—పెట్టకపోతే అవతలికి పంపించేయండి. కుర్రాణ్ణి బుగ్గమీద కొడతా రేమిటి! [అని ముఖం

అటులిప్పుకొని కొంగుతో కన్నీళ్ళు తుడుచుకొనును.]

బాలుడు—బాబో... అయ్యో... ఆకలి...

అతడు—అంటగిన్నెలు తోముతావా? పోతావా?

బాలుడు—[ఏడుస్తూ] గిన్నెలు తోముతే నాచేతులు రక్తం వొస్తుంది. [అయ్యో ఆకలి అని దొల్లును]

అతడు—[పిల్లవాడిచెవిపట్టుకొని లేవతీసి] కొంటె వెధవా ఏమి టీతెగపొగరు [రెండు లెంపకాయలుకొట్టి] [గుమ్మంమీంచి క్రిందకి తోసేసి అటుకేసి చూడకుండా తలుపువేసేసి వెనకచాటుచే వచ్చి 'దొంగముండా! ముష్టివెధవల్ని లోపలికి తీసుకొనివచ్చి అదీ ఇదీ పెడుతున్నావా' అని నడ్డిమీద ఒక్కతన్ను తన్నును.]

[ఆమె అయ్యో అని ఎదటి పడిమీద పడిపోవును.]

* * *

[పెరటిగుమ్మందగ్గర రెండుబండలమీంది మరాకీ వాళ్ళు నిలబడిఉన్నారు విచ్చుకత్తుల్తో. వాళ్ళమధ్యని పిల్లవాడొకడు స్మృతిలేకుండా పడుంటాడు. ఏమిటో ఏదో భాషలో పెద్దగందరగోళం జరుగుతోంది. మేడమీంచి చూస్తున్నాడు మన 'అతడు' అనేవాడు. ఒళ్ళంతా కంపజ్వరములుదేరింది. గాభరా అయిపోతున్నాడు. వాళ్ళంతా ఒక్కమాటు నిశ్శబ్దంగా ఆగిపోయారు. పెద్దగడ్డంగల ఓమనిషి బహుశః వాళ్ళ గూడెంపెద్ద అయివుండవచ్చు ఎదటికివచ్చి వాళ్ళ భాషలో ఏదో వాళ్ళమతాచారాన్ని చెప్పి చివర్ని తెనుగులోమాత్రం "సంపి రండి" అని ఆడవాళ్ళని తీసుకొని వెళ్ళిపోయారు. మేడమీద నిల్చున్న అతడు ఈ 'సంపి రండి' అనే ముక్కవిని క్రిందికి గబగబా పరుగెత్తుకు వచ్చాడు. కళ్ళు జిగేలు మనే దృశ్యం భయంకరంగా ఉంది. ఎదుట భార్య చచ్చి పడినట్లుంది. పక్కనిసాన. దానిప్రక్కని ముత్యాలహారం. ముత్యాలహారంలో ఉండే వజ్రము పగలరిగి పొడిఅయిపోయి ఉంది. ఇంతట్లోకి పెరటిగోడ పెకిల్చి విరిగి పడిపోతుంది. బిలబిల మరాకీలు లోపల ప్రవేశిస్తారు.

అతడు బిక్కముకంవేసుకొని నిల్చుని ధైర్యంగా 'పోలీసు, పోలీసు' అని కేకవేసి 'ఒరే రిచార్డ్సు ఇల్లా పట్రా' అంటాడు అంతే నడినెత్తిమీద ముప్ఫయి కర్రదెబ్బ లొక్కమాటు పడతాయి.

పుత్రాణ్ణి గూడాన్ని తీసుకుపోయి వాళ్ళమతాను సారంగా చెయ్యవలసిన అంత్యకర్మలుచేసి పాతిపెట్టి దానిపైన పెద్దగోరీ కట్టించారు.

—కర్రా చంద్రశేఖరము.

అశ్రుగీతి

గుబురుకొన్న వేసటతోడఁ గుములుచున్న
నన్ను వీక్షింప దొకప్రేమనయన మేని;
నావిషాదతుఃఖాక్రందనమ్ము వినియుఁ,
గురియు దురుబాష్ప మొకజాలిగుండెయేని!

తమమె నెలకొను నాజీవితమ్ములోన
తేవలపుదుమారము గుబాళింపఁబోదు;
సురవిలాసనుషమరేఖ సాగయఁబోదు;
ఇంత వలవంతబ్రతుకు సాగించు టెట్లు?

ప్రేమభిక్షకై శర్వరీవీథులఁబడి
దీనగళమెత్తి విలపించినాను కాని—
తెరువలేదు కవాట మొక్కటను గూడ
ఘాతిక క్లేశ కృపణ ప్రపంచమందు.

క్రమసౌఖ్యదమ్మంచు లోకమ్ము కనుల
నీడ నాసించి యిటు వచ్చి నిలచినాఁడ;
ప్రజ్వలోన్నమ హాలహలప్రవృద్ధ
నృత్తధూమం బటంచు నూహింపలేక.

దివ్యపిచ్ఛిల పరిమళదీపితంబు
మామకీన జీవితకుసుమమ్మునందు
ప్రబల నిశ్వాస విమవహ్ని రగులుకొలిపి
నవ్వుచున్నది జగము రంగైన మోవి!

—ఓలేటి సీతారామమూర్తి.

ఆశ

✤

భావోద్రేకమున పొంగిపొరలుచున్న ఆలోచనా సంద్రమున కంతులేదా? ఇందుద్భవించుచున్న చిరుతరంగము లేవిధముననైన లోకకల్యాణమునకు సాయపడునా?— ఈ చిరుతరంగములే పొంగి పొరలి లోకమునకపకార మొనరించునేమొ!— ఇది రత్నగర్భ యందువా! పరాత్పరా! ఇందును తిమింగిలములున్నవి!— అవి కార్య రూపమును దాల్చిన లోకమున కమంగళము చేకూర్చును.

కట్టుబాట్లనియెడి గట్లనొరసికొని ప్రవహించుచున్న దీప్రవాహము. ఈగట్టు తెగెనా! దీని ప్రతాప మనివార్యము, దుస్సహము.— ఈయుద్రేకము నణచివేయుము, ఇందున్న తిమింగిలముల నాశన మొనరింపుము....అలలమాటున, అడుగుభాగము నందణగియున్నవి, రత్నములు; బయల్పరపుము; సహజకాంతుల వెలిజిమ్మునట్లు వానిని శుభ్రపరచుము.— లోకము వానిని శిరమునదాల్చును; వానికై లోకముపరితపించును, అట్టివానిని తానును సముకూర్ప నుద్యమించును. నీవు మిన్నకుండినచో ఈజల మగాధకూపములలో బడిపోవును. ఇందలిరత్నములు కాలమహాస్రవంతిలోనికి కొట్టుకొనిపోవును..........మిగిలి యుండునవి తిమింగిలములే....క్రూరములగు తిమింగిలములె! సర్వవ్యాపీ! విజ్ఞానచంద్రు డెప్పుడుదయించును? ఈసాగర మాతని వెలుగున త్రుళ్ళిపడున దెప్పుడు? ఈయజ్ఞానమేఘముల గములుతొలగిపోవా? చంద్రుని దర్శన మేనాటికైన చేకూరకుండునా? ఈసాగర మేనాటికైన రత్నముల వెలువరింపదా? తిమింగిలములు నాశనమైపోవా?

—చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి. ఏ.



ఆకాశదీపము

—చిత్రకారుడు: శ్రీవాడ దుర్గారావుగారు, రామారావు ఆర్టు సొసైటి.



ఆడబిడ్డ మగబిడ్డగుట

కాఫీహోటల్లు మరగినవానికి పంచభక్ష్య పరమాన్నాలు పెట్టినా వాడు కాఫీహోటలుకు వెళ్లడం మానడు; సానులమరగినవానికి స్వర్గలోకంనుండి చక్కని చుక్కను తీసుకునివచ్చి పెండ్లిచేసినా వాడు సానివీధులు తిరక్క మానడు. ప్రకాశరావుకు ఎట్లా సంపర్క మయిందో 'జాము' అనే సానిపొందు. ఎప్పుడైతే దళ్ళేదారు పుల్లయ్య, 'ఇడ్డీన' కూతురు 'జాము' సానివాడలలో కెల్ల చక్కనిచుక్కని చెప్పాడో, నాటినుంచి అతని బుద్ధి అపోహలసానిపై పోయింది. చూడట మేమిటి, చూచినవెంటనే ప్రేమించడ మేమిటి, ఒక్కసారి తటస్థించింది. నిప్పురవ్వ తాటాకింటిపైబడి ఎంతక్షణములో ప్రజ్వరిల్లుతుందో, అంతక్షణములో ప్రజ్వరిల్లింది అతని ప్రేమ సానులలో ప్రసిద్ధికెక్కిన 'జాము'ను సానిపై. మొదట దొంగతనముగా సానింటి కెళ్లడములవాటు పడ్డాడు. దొంగతనము దొరతన మయింది. ఇప్పుడు ప్రకాశరావు భార్యఎవరయ్యా అంటే గుడిసిద్ధిలో రంగులమేడలో నున్న జామంటారు కాని, అతడు అగ్నిసాక్షిగ పెండ్లాడిన సత్యకాలపు సరళని అనరు. సరళ ఎంతచక్కగావుంటేనేమి, ప్రకాశరావు మోహమంత యిప్పుడు జాముపైవుంది. పిండిమొలుగులు, ప్రాపింగు ముంగురులు, కనుకిటుకులు, తీపిమాటలు గల సానిముందు, సహజలావణ్యము, పవిత్రత, వినయవిధేయతనుగల వనితలు మెఱుపుతీగెలవలెనున్న రుచించరు, పన్నజాతిలాగవున్నా ఫలిశురు. గాజురాళ్లను దాచి వజ్రాలను విసర్జించేవాళ్ళెంతమంది వున్నారు కారు. కాఫీకుండను అమృతభాండములో పోల్చేవాళ్ళెంతమందివున్నారు కారు. అందులో మన ప్రకాశరావొకడు. మెఱుంగులసాని మెఱుపుతీగనమించిన తన భార్యకన్న మేయి కెక్కువనుకున్నాడు.

ఇట్లా కొంతకాలము గడిచింది. అతనికేమి, 'గువ్వ గూడెక్కె, రాజు మేడెక్కె' అన్నట్టు అతడు సాని మేడలోనే సర్వసుఖాలు అనుభవిస్తున్నాడు. కాని నది పొంగి వూరును ముంచేసినట్టు, సర్వకష్టాలు అతని భార్యయగు సరళను చుట్టుకున్నాయి.

ఒకరోజున విశాల సరళయింటికి వచ్చింది. విశాల ఎవరంటారేమో. ఆవిడ ప్రకాశరావుకు పినతండ్రి కూతురు. అన్నను చూసి పోదామువచ్చానని యీ వూరొచ్చింది. వచ్చి మూడురోజులయింది. కాని అన్నెక్కడ సానిల్లే స్వర్గమని దానియింటనే పగలు రాత్రుళ్లు గడుపుతున్నాడు.

విశాల:—వదినా! యీ పోకడ లెంతకాలముబట్టి?

సరళ:—సుమారొక సంవత్సరము బట్టి.

విశాల:—అబ్బా. ఇంతకాలంబట్టి వూరుకున్నారూ!

సరళ:—మరేమి చెయ్యమంటారు ? ఎంతకాలమో అంతకాలం అనుభవించాలె.

విశాల:—నాకొక మార్గం కనబడ్తా వుంది.

సరళ:—ఏమిటి?

విశాల:—సాహసముంటే అది కొనసాగవచ్చు. ఆలోచిస్తాము.

౨

ప్రపంచకములోని జనులు నాటికి తొంభైతొమ్మిది పాళ్ళు వేషంబట్టి భ్రమసిపోతున్నారు. కుచ్చులు వచ్చేలాగ జరీపాగా చుట్టుకుని, చెమికీకోటు వేసుకుని, మీసాలు దువ్వుకుంటూ గారయ్యన్న సరె డాబుగా పోతూవుంటే, ఏ మహారాజు బిడ్డో అని మనము అడలి తప్పుకుంటాము. కాకీరంగు సాన్సుతో, కాకీరంగు సార్టుతో, కాకీరంగు వర్టుతో ముస్తాబయి, ఒక తోలుపటకా పొట్టకడ్డంగా బిగించుకుని, మరిరెండు తోలుపటకాలు, బెత్తెడు వెడల్పువి, యజ్ఞోపవీతంలాగ ఒకటి యీమూలనుంచి, ఒకటి ఆ మూలనుంచి ధరించుకుని, ఫ్రెంచికట్టు మీసాలతో ఎవడన్నా, టకటకలాడుతూ, వస్తూవుంటే, వాడ్ని ఏ సార్జెంటుఅన్నకొడుకో అనుకుని అమడ దూరానికిపోయి బెదురుతూచూస్తాము. అనుకరణాలుంటే వేషాలెంతలో వెయ్యరలె. చూస్తూచూస్తూ వుండగనే సంజీవరావు సావిత్రి పూరుకునేవాడు. బిగ్గపెట్టుకుని, కోకకట్టుకుని క్షణంలో నాటకరంగమున పురుషులు స్త్రీలకింద మారిపోతున్నారు. భ్రమింపజేయడానికి వేషాలెంత సార్థకమనుకున్నారు. ఇక స్త్రీ, క్షణంలో, పురుషుడుగా మారిపోగలదు. అంటే కపాజలక్షణాలలో కాదు. వేషంలోమారెడు తోకగల కుచ్చులపాగా పెట్టుకుని, బందోబస్తయి సిల్కుచొక్కా తొడిగి, పర్షకాలాయిజారుతో స్త్రీతయారయిందా ఒక జమీందారుని ముద్దులకొడుకులాగ తయారవుతుంది. విశాల కీసూత్రం తెలుసు.

ఊరిలో ఒకవదంతి ప్రాకిపోయింది. అది అందరికీ తెలుసునో తెలియదోకాని అసలువారికి మాత్రం తెలియదు. దఫేదారు పుల్లయ్యమట్టుకు సాని చెవిలో అరహాస్యం వూదాడు. అదేదో కొంచము నేపటిలో బోధపడుతుంది.

కొంచము చీకటి పడుతుంది. ప్రకాశరావు, అతని సాని మేడమీద హాలులోని వుయ్యాల పలకమీద కులాసాగా వూగుతూ కపురులు చెప్పుకుంటున్నారు. వారి ప్రసంగ మీక్రింది విధముగాజరిగింది.

జామ:—సానిదేమిచెప్పినా బూటకము సాని దెంతనిజాయితీగా వున్న నాటకము.

ప్రకా:—ఇప్పుడేమొచ్చింది?

జామ:—ఏమీలేదు. సానిదంటే లోకువ. సాని మాట బూటకం. ఎంతనిజాయితీగా వుంటేనేమి? ఎంత మనసిచ్చి తిరిగితేనేమి? సానిది విషసర్పమని, సాని బుద్ధి కార్చిచ్చని, సానిపొందు ప్రాణాంతకమని, యిలా లేనిపోనివి కల్పించి, మమ్ముల్ని గడ్డిపరకలక్రింద తృణీకరిస్తున్నారు.

ప్రకా:—ఎవరు? సానుల సారమెఱుగని చవటలు.

జామ:—సంసారి దేమిచెప్పినా నిజమవుతుంది. అవిఎన్ని పోకడలుపోయినా మంచివే అవుతవి.

ప్రకా:—ఎందు కీదండకము!

జామ:—ఎందుకూలేదు. అక్కే. మీకుమట్టుకు తెలియదా ఏమిటి?

ప్రకా:—నాకేమి తెలియదు.

జామ:—(ఊయలనాపి) తెలియదూ?

ప్రకా:—తెలియదు.

జామ:—నిజంగా!!

ప్రకా:—నిజంగానే.

జామ:—అయితే పోనీలెండి.

ప్రకా:—(ఆత్రముతో) అదేదో చెప్పవు.

జామ:—అక్కే ఏమీలేదు.

ప్రకా:—చెప్పకపోతే వొట్టు.

జామ:—ఒట్టూలేదు గిట్టూలేదు.

ప్రకా:—(కొంచము కోపముతో) అయితే చెప్ప వన్నమాట.

జామ:—చెప్పడానికేముంది.

ప్రకా:—చెప్పెదవా? చెప్పవా? రెండేమాటలు.

జాను:—(ఆశ్చర్యమును సూచించుచు) మీకు తెలియదా! తెలియనే తెలియదా !! నిజంగా నేనా !!

ప్రకా:—అస్సే తెలియదు. ఒట్టేసరి.

జాను:—ఒట్టే!

ప్రకా:—ఒట్టే (ఒట్టు వేయును).

జాను:—అయితే యిలారండి. (చెవిలో) మీఆవిడ ఎవరితోనో...

హృదయంలో యీమాటలు తేలుకొండై కుట్టేటప్పటికి ఒక్కగంతు వేసి దిగాడు ప్రకాశరావు వుయ్యాలపలకనుండి. కోపముతో వణికిపోయాడతను. ఒక్క నిమిష మేమి కనుపించలేదు. అతని వైఖరి చూసి సానిది భయపడి ఎటులకూర్చున్నది అటులనే కూర్చుంది.

జాను కాసేపటికి తెంపుచేసుకుని "ఏమిటీ అర్భాటం?" మన్నది.

ప్రకా:—అర్భాటములేదు గీర్భాటములేదు. నిజమేనా యీసంగతి?

జాను:—నిజమో అబద్ధమో నాకు తెలియదు. నేను విన్నసంగతది.

ప్రకాశరావు మారు మాట్లాడలేదు. చరచర మెట్లు దిగి యింటిమొహం పట్టాడు.

ఆతడు మెట్లుదిగిన వుత్తరక్షణాన్నే డఫేదారు పుల్లయ్య ఎవ్వరినో వెంటబెట్టుకుని హాలులోనికి ప్రత్యక్షమయాడు.

3

సర్వసుఖాలు సానితోటే వుందనుకునే వాళ్ళకు ప్రపంచకమంతా అంధకారమయి వుంటుంది. ఎందుకంత ప్రకాశరావు రయ్యిమని వస్తున్నాడనుకున్నారు: సరళ కనుబడినవెంటనే ఆవిడకు ప్రాయశ్చిత్తము చేసి మనోశాంతి పొందుదామని. మనోవైకల్యాని కంత కారణమేమో! సరళను అతనుఎటువంటిదా ఇట్టే సానిది చెప్పగనే నమ్మడమే! అవును. ప్రపంచక ధర్మమే అంత: ఎవ రేమిచెప్పిన ముందు నమ్మి వూరుకోవడం. ఇక సానిదిచెబితే మరింత.

ప్రకాశరావు యింటికి వచ్చి తలుపుకొట్టేటప్పటికి ఒక ముసలిదాసి తలుపుతీసి, 'బాబు! జాగ్రత్త ఇంట్లో ఎవడో మగవాడున్నాడని" చిరునవ్వు నవ్వింది. 'నాకు తెల్సునులే' అని ప్రకాశరావు దాన్ని ఒక త్రోపుత్రోసి లోపలజొరబడ్డాడు. హాలుతలుపులు తీసివున్నాయి. ఒక్కగంతున హాలులోనికి జొరబడ్డాడతడు. హాలులో చూసేటప్పటికి, తిరిగిన మీసాలతోటి, తీక్ష్ణనపాగాతోటి కోటుతోటి మిరమిరలాడ్తూ మగవాడొకడు కనుపించాడు. సరళ అతని చెంత సరసోక్తులాడుతూ వున్నట్టు కనుపించింది. మగవానికి యింతకన్న క్రోధాయుక్తమగు దృష్టి యింకొకటిలేదు. తానెన్ని సానిండ్లనన్న తిరుగవచ్చును కాని, తనభార్యమాత్రం పరపురుషుని కంటబడకూడదు.

నాడు హిరణ్యకశిపు సంహారసమయమందు నరసింహస్వామికి వచ్చినవుగ్రహమే వుగ్రహం, నేడీ మగబిడ్డను చంపుటకు ప్రకాశరావుకు వచ్చినఆగ్రహమే ఆగ్రహము. క్రోధమావేశమయితే సామాన్య పురుషుడైన రుద్రున్ని మించివుంటాడు. ఇక్కడ ప్రకాశరావుకు చెప్పరానంత కోపము వచ్చింది. ఆవేశ మెక్కువయి పోయింది. కండ్లు నిప్పులు చిమ్ముతున్నాయి. తలవెంట్రుకలు నిక్కబొడుచుకుని ఏదు పందిముండ్లలాగ నిలబడినవి.

కాని మగబిడ్డ జంకూగొంకూ లేకుండా మీసాల నదుముకుంటూ తీక్ష్ణంగా ప్రకాశరావును చూస్తూనే వుంది. సరళ కొకప్రక్క భయం, ఒకప్రక్క నవ్వు.

రెండుపెద్దపులులు ఎదుర్కుంటే గాండ్రింపులు వినబడుతవి; రెండుసింహాలు తారసిల్లితే గర్జనలు వెలువడుతవి. కాని యిద్దరు మనుష్యులు ఢీకొంటే సకిలింపులు ముందు బయలుదేరుతవి.

ప్రకా:—(సకిలించి గట్టిగా) ఎవరు నీవు?

మగ:—(తిరుగ సకిలించి నిర్లక్ష్యముగా) నేను మనుష్యుడ్ని.

ప్రకా:—మనిషివా పశువువా?

మగ:—మనిషి పశుదేమో. పశువు మనిషి కాదు.

ప్రకా:—ఇక్కడి కెందుకొచ్చావు?

మగ:—నీ వెందుకొచ్చావు!

ప్రకా:—ఇది నా యిల్లు.

మగ:—ఇది మా వారియిల్లు.

ప్రకా:—ఏమిటి వెధవ పేలాపన. ఇంటిలో కాలుపెట్టడానికి ఎన్నివేల గుండెలున్నాయి. అది నా భార్యని తెలియదా.

మగ:—నీ భార్య రంగులమేడలోని సాని. ఇది నాభార్య (అనిసరళను దగ్గరకు తీసుకొనును.)

ఇక ప్రకాశరావు చూచి వూరుకోలేక పోయాడు. అంగీలో దాచిన బాకు పైకితీసి, విశ్వరూపమెత్తి వాళ్ళవైపు వురికాడు. అతనికిబడిసి, గాలికి విరగబడ్డ చెట్టుకొమ్మలాగ సరళ స్పృహతప్పి నేలకొరిగింది. విశాలకూ భయముపుట్టింది. ఏమిచేయుటకు ఆమెకు కాళ్ళాడలేదు చేతులాడలేదు. బాకు పరశురాముని గొడ్డలివలె తనప్రాణములను హరింపనున్నదని ఆవిడ గ్రహించింది. అయినను ఆవిడలో నోరులేదు చేవలేదు.

కాని మనలో ఒక సహజగుణమున్నది. కంటిలో ఏదన్నా నలుసు పడబోతే గబుక్కుని కన్నుమూసుకుంటాము. తేలు మనప్రక్కన దడదడ ప్రాకుతూవుంటే ఒక్క గంతువేసి అమడదూరంలోపడ్తాము. ఇక్కడ విశాలా అంతే. బాకు తనమీద పడబోయేటప్పటికి ఆవిడకంగి ప్రక్కకుతప్పుకొని మూలకు పరుగెత్తింది. కాని బాకు మాత్రం పౌరుషంతో బీరువాచెక్కతలుపుకు గ్రుచ్చుకుంది. ప్రకాశరావు బాకును లాగ ప్రయత్నిస్తున్నాడు. ఇవతల విశాల జరుగుతున్నదాగా నదుముకోలేక, "ఆడువారపైన నీ ప్రతాపమున్నది." "నీవుకూడ ఆడుదానవా" అని ప్రకాశరావు తెల్లబోయిజూచాడు. ఇప్పటికావిడ తలపాగా జారి నల్లని పొడుగాటి వెండ్రుకలు ఆవిడ భుజముపై ప్రకాశిస్తున్నాయి. 'అవునని' ఆవిడ అంటించుకున్న మీసములను తీసివైచినది. ప్రకాశరావామెను గుర్తించి "విశాలా! విశాలా! ..." అన్నాడు.

ప్రకా:—విశాలా! ఎంతసాహసము...ఆ బాకే గ్రుచ్చుకొన్నచో సమసియుందువే.

విశా:—(సరళను సేద తీర్చుచు) నీ చేష్టలే ఈవిడ హృదయమును బాకులై గ్రుచ్చుకొన్నవి. ఈ బాకు గ్రుచ్చుకొన్న నాకెంత...

సరళ:—(లేచి విశాల నుద్దేశించి) వదినా విశా

కవిసాధన

౧

తెగిన మాటకు
తడవు కొంటూ
ఎంతసేపో
యతుల కొఱకై
అతుకు కుదరక
ఆలకించి
వెదకుకొను నోయి!—

౨

ప్రాస కొఱకై
ధ్యాన పాటక
గొంతు కందున
గొణగు కొంటూ
ఎంతసేపో ఆలకించి
పంతమున—దా
నంతు కనుగొనును—

—కొడాలి వేంకటరాజారావు.

కేవిరాదు దెబ్బతగుల లేదుకదా.

ప్రకా:—స్త్రీలు ఆడబిడ్డలను మగబిడ్డలుగ జేయగలరు.

విశా:—పురుషులు సానులను సంసారుల క్రింద భావింపగలరు.

ప్రకా:—మా సాని అందరి వంటిది కాదు.

విశా:—కుమ్మరామమున యిత్తడి ముంతలుండునా?

ప్రకా:—దాని సంగతిసందర్భములు తెలియక అట్లనుచున్నావు.

విశా:— అలాగా ఆవిడను నేనొకసారి చూడవలెనని వున్నది. తీసుకుని వెళ్లెదవా?

ప్రకా:—అవశ్యం. ఎప్పుడు?

విశా:—ఇప్పుడే.

౪

ప్రపంచకములో అన్ని వస్తువులు అందరకు గనబడవు. దూరములోని వస్తువులు కనుబడువారికి దగ్గిరలోని వస్తువులు కనబడవు. దగ్గిరవస్తువులు కనబడువారికి దూరములోని వస్తువులు కనబడవు. ఇటువంటి మాంద్యమే మనస్సుకుకూడా వుంది. అదేదంటే మంచి వస్తువులను చెడుగు క్రింద భావించడం; చెడుగువస్తువులను మంచి క్రింద గణించడం. ఈ మాంద్యములో సుగుణవతి దుర్గుణవతివలె కనుపిస్తుంది; దుర్గుణి సుగుణవలె కనుపిస్తుంది. దీనికంతా కారణం భ్రమ. ఎఱ్ఱద్దం పెట్టిచూస్తే ప్రపంచకమంతా ఎఱ్ఱగా కనిపిస్తుంది. పచ్చద్దంపెట్టి చూస్తే ప్రపంచకమంతా పచ్చగా కనుపిస్తుంది. ఇట్లానే భ్రమఅనే తెరగుండ చూచిన ఏవస్తువన్నా మరలుకొల్పుతవి. మన ప్రకాశరావుకు సానిపై భ్రమ వుండడంవల్ల ఆవిడ అతనికి సాక్షాత్తు అరుంధతివలె కనుపిస్తూవుంది. ఎందుచేతననగా 'తిరిగగాని లోతు తెలియదను' తత్వం అతనికింకా బోధపడకపోవడంవల్ల.

విశాల ప్రకాశరావులు సాని యింటికివచ్చారు. 'ఇదే యిల్లన్నాడు' ప్రకాశరావు. 'అయితే దొడ్డిత్రోవ తియ్యమంది విశాల. రహస్యార్థమువచ్చేవారు ధారాళముగా రారు. దొడ్డిత్రోవనో, గోడగెంతో వస్తావుంటారు. ప్రకాశరావు గోడగెంతి దొడ్డితలుపు తీసాడు. ఇద్దరు లోపలప్రవేశించారు. సద్దుచేయక మేడఎక్కారు. ఒకగదిలో ఒకరు మంచముకడ్డముగా పడున్నాడు. బ్రాందిబుడ్లు గ్లాసులు అతనిముందు, మేజాపై ప్రకాశిస్తూ, 'యిది మా మాహాత్మ్యమ'ని, చెబుతూవున్నట్టుగా వున్నవి.

విశా:—ఇత డెవరు?

ప్రకా:—ఏమో! నాకు తెలియదు.

విశా:—ఇంతేనా అన్నది.

ప్రకా:—..............

హాలులో నడుస్తూవుంటే వీళ్ల అడుగుల చప్పుడుకు క్రిందనుంచి యొక ధ్వనివచ్చినది.

ధ్వని:—(మెల్లిగా) పంపించనా.

ప్రకా:—ఎవరిని.

విశా:—(ప్రకాశరావును ఆపి) కేకవెయ్యకు.

ప్రకా:—(విశాలతో మెల్లిగా) దానిఅర్థమేమిటి.

విశా:—(ప్రకాశరావుతో) ఇంకొకరిని...(ధ్వనిని వుద్దేశించి మెల్లిగా) వద్దు.

ప్రకా:—చాలా ఆశ్చర్యముగావుందే.

విశా:—మరేమనుకున్నావు?

హాలునడచి యివతల పడకగదివద్దకు వారుచేరారు. తలుపు లోపలగడియ వేసివున్నది. ప్రకాశరావు తలుపుసందులగుండ చూసి విభ్రాంతిలో వెనుకకు అడుగు పెట్టును.

విశా:—తప్పెవరిదనితోచింది?

ప్రకా:—ఎవరిది. వికటచరిత్ర. కపట పతివ్రత. దానిదే ఆ సానిదే. బొల్లిమాటలుచెప్పి బొల్లునమ్మికొను జాతికీబుద్ధికాక మరి యేబుద్ధివచ్చును.

విశా:—పూరకే వారినేల దూషించెదవు. వేయగతిలేక వారీవృత్తి నవలంబించిరికాని వారికిమాత్ర మీవృత్తివల్ల సుఖమా?

ప్రకా:—అవును వారి నననేల? సర్వమెలెంగియు సానివలలోజిక్కి సంసారమును చెడగొట్టుకొనుచున్న మూఢుడను. తప్పునాది కాక యింకెవరిది?

విశా:—ఇప్పటికైనను తెలిసినదా?

ప్రకా:—ఆహా! నేటి కీవిధముగ నీవు తెలియజేయుకున్న యింకయూ నఘాతముగబడి, ఎంగిలికూటి కాసించు కుక్కవిధముగ దీని యింటిచుట్టు నింకను తిరుగుచుండెడివాడను.

విశా:—సర్వము విశదమయినదా. ఇక పోవుదమా?

ప్రకా:—ఆహా! ఇక నొక అరనిమిషమైన నుండజాలను.

ఇప్పటికి ప్రకాశరావుకు తెలిసివచ్చింది: గాజురాయికి వజ్రానికి గలభేదము; కాఫీహోటలులోని సరకులకు యింటిలోచేసిన పంచభక్ష్య పరమాన్నాలకు ఆరోగ్యములో గలతేడా; సానికి సంసారికి గలతారతమ్యము. పరాయి మగవానితో తనస్త్రీ సంచరించుచున్నదన మగవాని కెంత ఆందోళనుండునో, అంతకు పదిరెట్లఆందోళన తనభర్త పరస్త్రీల కాధీనమైన నుండునని గ్రహించాడతడు.

ఒకనాటిరాత్రి వెన్నెలలో ప్రకాశరావు మేడమీదను కూర్చుని నిండుచంద్రున్ని వినోదంగా చూస్తూ వున్నాడు. ప్రక్కనే సరళ కూర్చునివుంది. వారికి చెంతనున్న నీటితొట్టిలో చంద్రుని ప్రతిబింబము కదులుతూవుంది. ప్రకాశరావు ఆ రెండిటిని పరికాయించి చూస్తూ వున్నాడు.

సరళ:—ఏమిటంత తీక్షణంగాచూస్తున్నా రన్నది.

ప్రకా:—చంద్రునికి, నీటితొట్టిలోని చంద్రునికి గలతేడా.

సరళ:—ఏమిటాతేడా?

ప్రకా:—శాశ్వతమైనది చంద్రబింబము. చలించునది చంద్రుని ప్రతిబింబము. ఏదీ కదుపు నీటితొట్టిని.


సరళ:—(తొట్టిని కదుపును. చంద్రుని ప్రతిబింబము మాయమగును.)

ప్రకా:—చూసితివా! మాయమైనది. భార్య మనుజునకు శాశ్వతమయినది. సాని చలించునది.

సరళ:—ఎప్పటినుంచి యీనీతి.

ప్రకా:—ఆనబిడ్డ మగబిడ్డయిన నాటినుంచి.

—నాయని శేషాచలరావు.



" వెన్నెలలో ప్రకాశరావు మేడమీదను కూర్చుని నిండుచంద్రున్ని వినోదంగా చూస్తూవున్నాడు. ప్రక్కనే సరళ కూర్చునివుంది. "

ఆంధ్రసాహిత్య పరిషత్తు
కాకినాడ
TELUGU ACADEMY, COCANADA

రైతు పాట

౧

ఆగునా జీవాలు
సాగునా లోకాలు
రాజుగా మనమెంచి
రైతు చూడకపోతే
దేశాలు తలలెత్తునా—
దాస్యపున్—పాశాలు తావీడునా.

౨

ఆవు లంబాయంచు
అరచు రైతులఇండ్ల
కల్యాణలక్ష్మిన్
కనులజూడని నాడు
సౌభాగ్య మేతెంచునా—
దేశపున్—సౌందర్య మేనిల్చునా.

౩

పిల్ల పైరులమీద
చల్లతెమ్మెర వీవ
గాంచి యానందించు
ఘనుని గాంచకపోతె
సృష్టినైజము తేలునా—
ప్రకృతిని—భ్రష్టాలై పోకుందుమా.

౪

పొలములో రైతుండి
పొలికేక బెట్టగాన్
జయభేరి మ్రోతలై
జగతి నిండకపోతె
వీరరక్తము పారునా—
నిలువెల్ల—ధీరత్వ మడుగంటదా.

౫

రైతు చేదంశంబు
రాణింప కోదండ
పాణియని భావించి
ప్రార్థింపకుంటేను
భక్తియే మనకబ్బునా—
నిర్వాణ—ముక్తియే లభియించునా.

౬

అధికారి యాతనల్
అంతలోన సెమ్రింగి
ఆదరించెడి రైతు
నాదరించకపోతె
భూతదయయె గల్గునా—
సౌభ్రాత్ర—బుద్ధియే మనకబ్బునా.


౭

పగలు రాతిరి యనక
పాటుబడునా రైతు
కడగండ్లలన్ గాంచి
కన్నీరు కార్పమి
ఇల పరిశ్రమ లంతమై—
వాణిజ్య—మేమూలో యడుగంటదా.

౮

రైతె దేవుడు మనకు
దేవుడూ ఒకరైతె
రైతుదేవుడు మనల
రక్షింపకుంటేను
ప్రళయమే రాకుండునా—
భూదేవి—భగ్నమై పోకుండునా.

—శెట్టిపల్లి వెంకటరత్నంచౌదరి.
—శ్రీగిరిరాజు రామారావు.



కోడికూఁత

౧

అద్ది మాపద్మవెల్మశౌర్యానలంపు
చిటచిటార్భటితో కొంత చెలిమి చేసి
యాంధ్రదేశపరిశ్రుతమైన దకట
తెల్గు లీనాటివారు గుర్తింపలేరు.

౨

విజయలక్ష్మీపరీరంభవిధికి నేగు
వెలమదొరల సమగ్రదోర్వీర్యమునకు
కర్పూరపుటారతుల నెత్తి కన్నెపడుచు
కంఠనినదంబుతో శ్రుతి కల్పబడియె.

౩

కత్తులన్ జూచి మీసలు గడిపి కంటి
కొలకులన్ వెల్లలెఱసంజ వలచునాడు
మింతుకెక్కిన యీకూఁతమహిమ నేడు
తలఁపునకునైన రాదెంత దైన్యమొక్కొ.

౪

అది గతప్రాణవీరభటాత్మకైన
స్వస్తివాక్కట, భీతివిహ్వలవధూటి
నీవిధాతల కంటకక్షేపంబు
అద్ది నాచెవిబడి యప్రయత్నరచిత
హృద్యకవనంబువలెనెంతొ యింపుగూర్చె
మన్ననోవృత్తి కెట్టిసంబంధమొక్కొ
ఏపురాజన్మలో దీని నెఱిగినానొ
యోపికంబట్టివిందు నింకొక్కమాటు.

— కొండపల్లి గోపాలరావు,
— హరి రామలింగశాస్త్రి.



నోబెల్ వాఙ్మయ బహుమానములు

నోబెల్ వాఙ్మయ బహూకరణముచే గౌరవింపబడిన విజ్ఞాని నేడు అంతర్జాతీయసారస్వతవియత్తలమున నిండుకళలతో వెలుగుచున్నాడు.

బహుమతుల ఆది.

వాఙ్మయరాజ్యాభిషేకమా అను నట్లున్న యీ నోబెల్ బహుమతులు ౧౯౦౧లో స్వీడను దేశమున పుట్టువొందినవి. శాంతికేళి ఆరాధకులు, ఉదారాశయులు ఆల్‌ఫ్రెడ్ బెర్నహార్డ నోబెల్ గారు దీనికి జనకులు. వీరు స్వార్జితధనము నంతయు ఈ బహుమతులనిధికిగా ఇచ్చివేసినారు. నోబెల్ సంతతికి ధన మొసంగి, వారిని నిష్క్రియాజీవులుగా చేయరాదను విశ్వాసముగలవారు; అందుచే తనధనమును సద్వినియోగపరుపవలయునని నైతికావేదనము పొందినారు. ఈ ఉన్నతభావమును ప్యారిస్‌నగరమందున్న స్నేహితురాలైన ఒకప్రభ్వికి (బ్యారనెస్ బెర్తా వాన్ సట్‌నర్) వ్రాసినలేఖయందు ౧౮౯౩ సంవత్సరము జనవరి ౭ తేదీ సూచింపబడినది. ఇదేవిధముగ ౧౮౯౫ నవంబరు ౨౭ తేదీ మరణశాసనమువ్రాసి ౧౮౯౬ డిసెంబరు ౧౦ తేదీ 'సాన్ రెమో' నగరమున స్వర్గస్థులైనారు.

భవాశాపీడితులైన బంధువులుకొందరు యీఘన పరార్థిమతమును భగ్నముచేయ యత్నించిరి కాని, నోబెల్ కుటుంబీకుడు ఎమాన్యుయల్ గారి నిరోధముచే తీవ్రక్లేశానంతరము యీమహాభావనిసంకల్పము రూపమునొంది నేడు మహాగౌరవసంస్థగా ఎన్నబడుచున్నది. తరువాత న్యాయశాస్త్రానుగుణ్యమైన కొన్నిసవరణలతో ౧౯౦౦ జూను ౨౯ తేదీ స్వీడనురాజుచే అంగీకరింపబడినది. నోబెల్ గారిఆస్తి నంతయు ధనముగా మార్చి దానిపైవచ్చు వడ్డీని వారి యిచ్ఛానుసారముగనే ఆయాసంవత్సరములలో "మానవజాతికి సుస్థిరమైన గొప్పమేలునుగూర్చిన వారికి" ఒసంగుటకు నిర్ణయించిరి. బహుమతుల నొసంగుటయందు జాతిమతవివక్షతల పాటింపరాదని నోబెల్ తన 'విల్'నందు స్పష్టముగ శాసించిరి.

బహుమతుల వివరము.

ఐదుశాఖలందు బహుమతుల నేటేటా ఒసంగవలయునని నోబెల్ గారే నిర్ణయించిరి. బహూకరణములకు నిర్ణయింపబడినశాఖలు:—

౧. ఫిజిక్సు—అత్యంతప్రధానపరిశోధనమును గావించినవానికి

౨. రసాయనశాస్త్రము (కెమిస్ట్రీ)—

౩. శరీరశాస్త్రము, వైద్యశాస్త్రములు మానవజాతికి మేలుగూర్చగలిగిన నూతనాంశమును కనుగొనిన వానికి

౪. వాఙ్మయము—మహోదారాశయపూర్ణకృతిని సృజించినవానికి

౫. దేశముల సౌభ్రాతృత్వముల పెంపొందజేసిన వానికి; సమరశక్తుల తగ్గించ పాటుబడి శాంతిస్థాపనకై పాటుబడినవానికి

ఒకశాఖయందే యిద్దరుఅభ్యర్థులు అర్హులని తలంచబడిన ఆశాఖధనము యిద్దరికిని సమముగ పంచిపెట్టబడును. బహుమతి సుమారు లక్షరూపాయ లుండును. అభ్యర్థులు ఫిబ్రవరిమాసమున దరఖాస్తులను, తమకృతులను స్వీడనునందలి పరీక్షాధికారులకు పంపవలయును. బహుమతిబడసినవారిపేర్లు నవంబరులోనే తెలియుచున్నవి కాని, డిసెంబరు ౧౦ తేదీ—దాతవర్ధంతినాడు బహుమతులాంఛనములు—ఒకబంగారుపతకము, అధికారపత్రము ఒసంగబడును.

బహుమతులబడసినవారు ఆరుమాసములలోపల ఆయావిషయములనుగూర్చి స్టాక్‌హోమందు ఉపన్యసింపవలయును; శాంతిబహుమతివారు మాత్రము ఆస్లోనందు నుపన్యసింపవలయు. ఫిజిక్సు, కెమిస్ట్రీలకు- స్టాక్‌హోమందలి "స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సు" వారును; శరీరశాస్త్రము, వైద్యములకు- "కరోలైన్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్" వారును; వాఙ్మయమునకు- "స్వీడిష్ అకాడమీ" వారును; శాంతికి-"నార్వే

"జియన్ స్టార్‌ఫింగ్" వారిచే నిర్ణయింపబడిన ఐదుగురి ఉపసంఘమువారును నిర్ధారణ గావింతురు.

నోబెల్ గారి జీవితాంశములు.

దాతతండ్రి ఎమాన్యుయల్ స్టాక్‌హోమ్‌నందు సైన్య అధ్యక్షులు మొదట వీరు ప్రేలుడువస్తువులు మొదలగు మారణశక్తులందు పరిశోధనలు గావించుచుండి, శస్త్రచికిత్సలందు బాధలను తగ్గించు కొన్ని పరికరముల సృష్టించెను. కొద్దికాలము ఇటలీయందు నౌకానిర్మాణము నడపిరి. వీరిపుత్రులుకూడ శాస్త్రపరిశోధకులే! ఎమాన్యుయల్ పెద్దకొమారుడు ఇంజనీరు. ౧౮౬౪లో పరిశోధనల సందర్భమున జరిగిన ఒక ప్రేలుడు ప్రమాదమున కనిష్ఠపుత్రుడు మృతిజెందినాడు, తండ్రి వికలాంగుడైనాడు.

ఈబహుముఖజనకుడు ఆల్‌ఫ్రెడ్ బెరన్‌హార్డ నోబెల్ స్టాక్‌హోమ్‌నందు ౧౮౩౩లో జననమందినాడు. శరీరారోగ్యములేక మరణపర్యంతము తలనొప్పితో బాధపడుచు, సదా 'బ్యాండేజీలు' తలకు కట్టుకొనియే పరిశోధనలు గావించుచుండినాడు. తల్లి క్యారలైన్ ఎరియట్ చాల అనురాగముతో పెంచినది: పెద్దపెద్ద పుస్తకములను చదివి కుమారునకు వినిపించుచుండినది. 'ఆల్‌ఫ్రెడ్ చాలగొప్పవాడగును' అని విశ్వాసముతో పలుకుచుండెడిది. తరుణవయస్కున్న ఆల్‌ఫ్రెడ్ ఒకర్తును ప్రేమించుచుండ ఆమె మరణించినది, అంతె వైవాహికవైరాగ్యము గలిగి, పెండ్లిమానినాడు.

మొదటినుండియు కెమిస్ట్రీ, ఫిజిక్సు, మెకానికల్ ఇంజనీరింగు నందు అభిరుచిని జూపుచుండినాడు. ౧౭-వ ఏట నౌకానిర్మాణము నభ్యసింప అమెరికాకు వెడలినాడు. సూర్యకిరణములచే నడచునట్లు తనతండ్రి కనిపెట్టినయంత్రమును అభివృద్ధిగావించినాడు. ౧౮౫౯లో ఆల్‌ఫ్రెడ్ దగ్గర ౧౫౦ డాలర్లుమాత్రముండినవి ఆసంవత్సరాంతమునకు ౨౦౦౦ డాలర్ల సంచయమునకు గలిగినాడు. రెండేండ్లలో ఇది ౭౫౦౦౦ అయినది. తాను నిర్మించినవాటి 'పేటెంటు'లను చాలమందికి అమ్మినాడు. దీనితోగూడ ఈయనకీర్తి స్వదేశము స్వీడనుకు ప్రాకి రాజు అభినందనములబడసినాడు.

పరహితేచ్ఛకు బీజము.

౧౮౬౩లో తానునిర్మించిన పడవను పరీక్షించుచుండ అది మునిగిపోయి ఐదులక్షలడాలర్ల నష్టము కలిగినది. దీనికి బంకిపోక మరలప్రయత్నించి కృతసంకల్పుడైనాడు.

ఈసంఘటనము— విఫలపరిశోధకులైన శాస్త్రజ్ఞుల మానసిక వైకల్యమునుండి రక్షించి, ప్రోత్సహించుటకు ఒకనిధిని నెలకొల్పవలయునను శుభసంకల్పమును ఈయనయందు మొలకెత్తించినది. తరువాత స్వదేశమున తండ్రినిచేరబోయినాడు. ౧౮౬౬-౬౭లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పరిశోధనలుసలుపుచుండ అకస్మాత్తుగా 'డైనమైట్' అను ఒక ప్రేలుడువస్తువును అనుషంగికముగ కనుగొనినాడు. ఇది దేశదేశములకు వ్యాపించి, ఫ్రాంసురాజు మూడవనెపోలియను ధనసహాయమును కూడ పొందినది. మరల అమెరికాకు పోయి, తండ్రి మిత్రుడు— డాక్టర్ బ్యాడ్‌మ్యాన్ గారి సహకారముతో లాస్‌ఏంజిల్సునందు డైనామైట్‌కర్మాగారమును నెలకొల్పినాడు అచిరకాలములోనే యూరపునందు వివిధదేశములందు యిట్టికర్మాగారముల నిర్మించినాడు. చరమదశయందు సాన్‌రిమొనందు పరిశోధనాతత్పరుడై స్వర్గస్థుడైనాడు.

మొదటిశాంతిబహుమానము నోబెలుగారి ప్రైవేటుసెక్రటరిగా చాలకాలముపనిచేసిన బ్యారన్ వాన్ సట్నర్ అను నామెకు 'మీ ఆయుధముల విసర్జింపుడు' అను పుస్తకమునకు ఇయ్యబడినది. "నాగరికదేశములన్నియు తుదకు ఆయుధ విసర్జనము గావించు" నని ఆయన నమ్ముచుండినాడు. మానవజాతి అభివృద్ధిసహాయములకు గావలసిన ధనమంతయు వినియోగముచేసినాడు. ఈయన సహృదయుడు, బహుభాషావేది, తత్త్వవేత్త, మనోజ్ఞమైన ప్రాసంగికుడు, అభిరుచిగల కథల చెప్పనేర్పరి, అన్నార్తహృదయముల లనుమానస్కుల ఏరుటయందుదిట్టడు

(బహుమతులబడసిన వారిపేర్లు, వారిగ్రంథములను గూర్చిన కొద్దివివరములు వైమాసపుసంచికలో తెలుపుదుము.)

—మరుపూరు కోదండరామరెడ్డి.

హిట్లరు

(నేటి జర్మను దేశపు నియంత)

"జర్మనుల జర్మనీ" అను మాటలలోనే నేటి జర్మను దేశపు నియంత యగు హిట్లరు ముఖ్యోద్దేశము ఇమిడియున్నది. హిట్లరు మహావక్త. ఈతడు మిత్రులతో సంభాషించునపుడును, తనగృహమున మాట్లాడునపుడును ఏదో యొక మహాసభాస్థలిని ఉపన్యసించుచున్నట్లు బిగ్గరగాను ఆవేశముతోను మాట్లాడును. నెమ్మదిగా మాట్లాడుటకు ప్రారంభము చేసినప్పటికిని పోనుపోను ఉగ్రముగా మాట్లాడుచు ఏదో సమయాలలో లేక ఇంటికప్పుపైకి చూచును; బల్ల గుద్దును; కేకలు వేయును.

ఈతడు నలుబదిమూడు సంవత్సరముల క్రిందట ఆస్ట్రియా దేశమున జన్మించెను. నల్లని వెంట్రుకలు; నీలి వర్ణయుతములయి నిప్పువలె వెలిగక్కుచుండు నయనములు; ఆకారము వికృతము; అయినను ఆస్ట్రియా దేశపుసాంప్రదాయముల ననుసరించి సుందరుడనియే చెప్పవలయును. అత్యద్భుతనటనాధురీణుడగు నటుని ముఖలక్షణమువలె ఎప్పుడును ఈతనిముఖము ఆవేశపూరితమై కన్పట్టుచుండును.

ఈతనితండ్రి సుంకముల శాఖోద్యోగి. హిట్లరును గూడ నేదో యొక యుద్యోగమున ప్రవేశపెట్టవలయునని యాతడుద్దేశించెను. హిట్లరున కది బొత్తిగా నిష్టము లేకపోయెను. ఈతడు చిత్రకారునిగనో లేక శిల్పిగనో జీవయాత్ర సాగింప నిచ్చగించి ప్రారంభమున నందుకొఱకై కృషి సల్పుచుండెను.

ఇట్టి తనబీదరికపుదశను తలచికొనినప్పుడెల్ల ఈతడు చాలా విచారించుచుండును. అట్టిస్థితిలో తనకై నలుమల మాడి, తననోటికమికెడన్నమునుగూడ పుత్రుడగుతనకె పెట్టి పెంచిన తనతల్లిపై ఈతని కపారమగు ప్రేమ యుండుటలో నాశ్చర్యమేమి? బహువిధకష్టపరంపర నెదుర్కొని యున్నతపదవికి వచ్చెగనుకనే నాటి ఆదర్శములు నేటికిని ఈతని వివిధరంగములందలి ప్రవర్తనమున కన్పట్టుచుండును. మధ్యమతరగతివారనిన ఈతనికి యభిమానము. వారి ఆర్భాటము, దర్పము ఈతనియందును కానవచ్చును. హీనస్థితియందున్నవారినిగాని హీనమైన ఆదర్శములుగలిగి హీనపుపనులుచేయువారినిగాని జూచిన ఈతనికి పరమాసహ్యము. అట్టివారిని జర్మనీలో ఉండనీయరాదని ఈతని యభిప్రాయము.

ఇతడాస్ట్రియనుడైనప్పటికిని, ఆస్ట్రియా సైన్యమున గాక బవేరియా సైన్యమున సైనికుడుగ చేరెను. చాల ధైర్యశాలి. అనేకయుద్ధరంగములందు పాల్గొనెను. ఒకసారి గాయపడెను. మఱియొకసారి విషవాయువుచే తాత్కాలిక నేత్రాంధకారమునకు గుఱియయ్యెను. ఇప్పటికిని [illegible]ప్పుడెల్ల ఈతనివక్షస్స్థలమున క్రాసుగుర్తు మెఱయుచునే యుండును. ఈతడు నిలుచున్నను కూర్చుండియున్నను సుశిక్షితుడగు జర్మను సైనికుడని గ్రహించుట సులభము.

పశుబలమే బలము. ఆత్మశక్తి గొప్పదియే కాని ఆచరణాంశమునమాత్రము పశుబలమునకున్న ప్రచారము ఆత్మశక్తికిలేదు" అని ఈతడనును. గొప్ప పారిశ్రామికులతోగాని, వణిక్సంఘములతోగాని పరిచయము ఈతనికి తక్కువ. సామాన్యజనులు, డబ్బులేని ప్రజలు, వర్తకములేని వర్తకులు, పనిలేనియువకులు, ఋణములచే క్రుంగియున్నకృషీవలులు- వీరందఱును ఈతని మిత్రబృందము. ఈతడు రోమనుకాథలిక మతావలంబి. మతావేశము మెండు. ఇందులకు తల్లిశిక్షణమే కారణమని ఈతడొప్పుకొనును.

ఈతడు మ్యూనిచినగరమున నివసించును. ఈతనిని చూచుటకెవ్వరైనను ఈతనిఇంటికిపోయి పిలిచిన స్వయముగా వచ్చి ద్వారముతెఱచి లోనికిగొంపోవును. అది యొకగది. జర్మను సాంప్రదాయానుసారముగ నుండును. నేలపైకంబళ్ళు పఱుపబడియుండును. గోడలపై వివిధములగు చిత్తరువులు. చిత్రకళ

ఈతనికి ప్రాణప్రదమైనది. ఆచిత్తరువులలో చాల భాగము ప్రకృతిదృశ్యములే. వానిని తిలకించుచు, తాను గూడ చిత్రకారుడను కాలేకపోయితినిగదా యని విచారించును. అది యొకలోపముగ భావించుకొనుచుండును.

ఈతనిది నిష్కళంకమైనజీవితము. చుట్ట, త్రాగుడు మొదలగుదురభ్యాసము లేమియు లేవు. ఈతనికి వ్యాహరణయందు బాగాసువాసనగూడ యుండదు. మితభోజి. శాఖాహారి. ఆహారవిషయమున ఎంతనియతముగ నుండునో, దుస్తులవిషయమునగూడ నీత డంతనిరాడంబరముగ నేయుండును. బయటకు బోవునప్పుడును అధికారరీత్యా ప్రవర్తించునపుడును ఈతడు ఊదారంగు కోటును ధరించుచుండును.

హిట్లరు బ్రహ్మచారి. ఇంతవఱకు వివాహమాడని కారణమున స్త్రీజాతియనిన ఈతనికి ద్వేషమని తలంపరాదు. వారికి సంబంధించిన వివిధసమస్యలను బహుజాగరూకతతో నీతడు విమర్శించుచుండును.

విరామసమయములం దీతడు సాధారణముగా చదువుచు నేయుండును. పుస్తకములనిన ఈతనికి ప్రాణము. వాటిని చాలజాగ్రత్తగ నుంచును. తఱచు జర్మనుఫిలాసఫీగ్రంథములను, కార్లైలుసుపహోకేయుని గ్రంథములను ఈతడు చదువును. కావున నవి యాతనిబల్లపై నెప్పుడును నుండును.

చుఱుకుదనమున కీతడు పెట్టినది పేరు. యంత్రమువలె నొకదానివెంట నొకపనిని క్రమముతప్పక చేయును. అట్లుచేయుటయే ఈతనికి చాలయిష్టము. తనమోటారులో కూర్చొని మ్యూనిచిప్రాంతముల దిరుగుచుండును. సాధారణముగ నొంటరిగ బోవుచుండును. మోటారునకేదేని స్వల్పపుమరామత్తు అవసరమైనపుడు స్వయముగనే బాగుచేసికొనును. ఈయంత్రముల పరిజ్ఞానమున దనకుగల నిపుణతనుగూర్చి ఈతడనేకసారులు చెప్పుచుండును.

సంగీతమునం దితనికి యభిరుచి మెండు. సినిమా ప్రదర్శనములనుగూడ బోవుచుండును. మేన్నరు సినిమాలకు తఱచు బోవుచుండును. భావగర్భితములై భాషాసౌష్ఠవముగల వ్రాత లితనికి మిగులయిష్టము. తనబీదరికపుదినములలో సయితమీతడు వియన్నానగరములోని సినిమాలకు పోవుచుండెడివాడు. శరీరసౌఖ్యమునకై అంతలక్ష్యము చేయుచుండెడివాడు కాదు. ఈతని కేపనియు లేనప్పుడు బవేరియాకొండలలో తిరుగుచుండును. ఆనిమ్నోన్నతమగు కొండశిఖరములు, ఆశిఖరప్రాంతమందలి ప్రకృతిసౌందర్యము ఇతనికి చాల ఆకర్షణీయమైయుండును. తఱచుగా నీతడు తనవ్రాతబల్లయొద్దనే పనిచేయుచుండును. లేదా చిత్తరువులు వ్రాయుచుండును. లేక గవాక్షద్వారముగుండ ప్రకృతిసౌందర్యమును తిలకించి ఆనందించుచుండును.

ఈతనికి స్వాభిమానము మెండు. దేశములోని వార్తాపత్రికల నన్నింటిని తనయదుపునం దుంచుకొనవలెనని ఈతనియుద్దేశ్యము. జర్మనీయుద్ధరణమునకుసంబంధించిన మంత్రాంగము లేవియుగూడ ప్రచురణమొనర్పగూడదని ఈతనియభిప్రాయము. విదేశీయులు ఎవరిచ్చవచ్చినట్లువారు తనను గూర్చి యభిప్రాయములిచ్చుట ఇతని కిష్టముండదు.

మిత్రులనిన ఇతనికి విశ్వాసము చాలకలదు. ఎరుకగల మిత్రు లెందరో యుండవచ్చును. కాని వారి నందఱ లెక్కసేయడు. ఈతని నెఱిగినవారంద ఱీతడు ధృఢమనస్కుడనియే చెప్పుదురు. ఈతనిని లెక్కచేయని శత్రువులును పలువురుగలరు. కాని నిజముగ నీతడంతధృఢమనస్కుడును గాడు, అంతచులకన చేయదగినవాడును గాడు.

ఈతనిహృదయము పాషాణమువంటిది గాదు. ఈతడు చూచినవారి నందఱిని వలలో వైచికొనునంతటి స్ఫురద్రూపియు గాడు. ఈతడు గొప్పదేశాభిమాని. ఈతనికిగల ఆత్మవిశ్వాసమే ఈతనియందుగల యద్భుతమైన ఆకర్షణశక్తి.

ఇట్టి మహావ్యక్తి ప్రజ్ఞావంతుడు, ధీశాలి హిట్లరు జర్మనీదేశపు ఛాన్సలరుగనుండి ఆదేశపు పునరుద్ధరణకు బూనికొనియున్నాడు.

— ధేరం వేంకటనాథశాస్త్రి, బి ఏ.

ఇన్స్యూరెన్సు విషయములు

సుధీంద్రలాల్ రాయ్ గారు, ఎం. ఏ.

గతపదివత్సరములనుండియు హైందవభీమాకంపెనీలు భారతీయుల దేశభక్తిని రేకెత్తించి హైందవభీమాసంస్థలలో తమజీవితములను భీమాచేయించుకొనవలసిన ఆవశ్యకతను బాగుగా నిరూపింపగలిగినవి. అందుచే దేశమున సాగుచున్న జీవితభీమావ్యాపారములో విశేషభాగమును హైందవభీమాకంపెనీలు పొందగలిగినవి. అనగా హైందవ ప్రజాసామాన్యము తనకర్తవ్యమును నిర్వహింపగలుగుచున్నదన్నమాట. అయితే ఇపు డొక ప్రశ్నకలుగుచున్నది. హైందవభీమాకంపెనీలయందు తాము పట్టాలు గైకొనుచుండుటవలన తామిదివఱకుకంటె ప్రస్తుతము హెచ్చు సేవాఫలమును వీనినుండి పొందుచుండుటను ప్రజలకు ఈ కంపెనీలు ప్రదర్శింపగలుగుచున్నవా? జీవితభీమా అనగా సేవ. చూపవలసినసేవను ప్రధానాదర్శముగ గొననిచో భీమాకంపెని ప్రజాభిమానమును గోలుపోవుటయే గాక ఇతరకంపెనీలకు అపకారముకూడ ఘటించును. ఒక భీమాకంపెనీ ఇన్సూరెన్సును గూర్చి బాగుగా ప్రకటించుటచే తనకు తాను మేలుచేసికొనుటయే గాక ఇతరకంపెనీలవ్యాపారాభివృద్ధికిగూడ ఎట్లు తోడుపడునో అట్లే ఒక భీమాకంపెనీ చేయు చెడ్డకార్యముచే తనకు తాను హానిచేసికొనుటయేగాక ఇతరకంపెనీల కీర్తికి గూడ భంగము వాటిల్లజేయును. జీవితభీమాలకంపెనీసంఘములు ఇన్సూరెన్సుఇన్‌స్టిట్యూట్సు ఇప్పుడు ఏర్పడి కార్యక్రమము నిర్వహించుటకు తొడంగుచున్నవి. వివిధములగు భీమాకంపెనీలు తమతమపట్టాదారులకు చేయగలంత సేవయు చేయుచున్నవో లేదో కనుగొనుటలో వెంటనే ఈసంఘములు ప్రవేశింపవలయును.

మనదేశమున ప్రభుత్వపుశాఖలన్నియు —పోలీసు, పోస్టలు, రైల్వే—ప్రజాసేవ చేయుటకు ఏర్పడినవే. కాని అవి యిప్పుడు నిర్వహింపబడుచున్నపద్ధతిని గమనించితిమేని అవి ప్రజలకు సేవచేయుటకు గాక ఏదియో గొప్పఉపకారము చేయుటకు ఏర్పడినట్లు పొడగట్టును. ఏదైన ఒకపోస్టు ఆఫీసునకు గాని, రైల్వేఆఫీసునకుగాని పొమ్ము. నీవు భారతీయుడవైనచో — ప్రాయికముగా నీకట్టిమర్యాదయు జరుగదు; అగౌరవముగా చూడబడుటయు అరుదుకాదు. విజాతీయప్రభుత్వమునకు గురియైన దేశమున ఇట్టిది సహజమే. భీమాకంపెనీ మాత్రము ఈ రీతిప్రజాసేవాసంస్థ కాజాలదు. జీవితభీమావ్యాపారమున అమ్మువానికిని కొనువానికిని గలసంబంధము సన్నిహితమైనదై, తరుచుగా జీవితపర్యంతముండుచుండును. ఇచ్చట కొనువాడనగా పట్టాదారు తాను కొనినవస్తువుయొక్క గుణగణాదులనుగూర్చిన జ్ఞానమునకు ప్రాయికముగా దూరస్థుడును, ఈ కొనుగోలుచే తనకు గలిగిన హక్కులు బాధ్యతలు తెలియనివాడునగు పట్టాదారు ఉండుచున్నాడు.

సుభాషితము

౬

కొద్దిరాబడిగల సామాన్యసంసారులు తమకుటుంబములను లేమినుండి కాపాడుటకుగాను కొంతఆస్తిని కూడబెట్టుటకైన ఒకఅమోఘసాధనముగ జీవితభీమా ఇపుడు గుర్తింపబడుచున్నది. ఉత్తమమైన రక్షణగా జీవితభీమాకుగల ప్రాముఖ్యమును నేటి ప్రపంచమును కలగుండుపెట్టుచున్న దుర్భరదారిద్ర్యదినములు నూటిగా నిరూపించుచున్నవి.

—ది హానరబిల్ కల్నల్,
జె సి హారింగ్టన్.

హోదాగల గవర్నమెంటుఉద్యోగమునందున్న ఒకానొకపెద్దమనుష్యుడు నాతో చెప్పిన ఒక వృత్తాంతము వలన నేను పైసంగతులను చెప్పగలవాడనైతిని. నేను పేర్కొనిన పెద్దమనుష్యునకు బ్రిటీషు భీమా కంపెనీలో ఒకదానియందును, కెనడాదేశపు భీమా కంపెనీయందొకదానియందును, ఇండియన్ భీమాకంపెనీయందొకదానియందును పట్టాలుగలవు. అతడు తనకూతురు వివాహమును నిశ్చయించుకొని కలకత్తాకువచ్చెను. భీమాకంపెనీలలో తనకు గల పట్టాలపై అప్పుతీసికొని ఆడబ్బులో పెండ్లికవలసిన పరకరులు కలకత్తాలో కొని పట్టుకొని వెళ్ళవలెనని అతనియుద్దేశము. తొలుత నాతడు బ్రిటీషుభీమాకంపెనీకి పోయెను. మేనేజరుని కలసి మాట్లాడెను. ఆమేనేజరు మంచివాడును, నేర్పరియు, ఉదారుడును అయి ఉండెను. వెంటనే మేనేజరు తనక్రింది ఉద్యోగస్థునొకనినిపిలచి అతనికి వెంటనే అప్పు ఈయవలసినదని చెప్పెను. ఐడెంటిఫికేషనులేనిది సొమ్ము ఇచ్చుటకు క్రిందిఉద్యోగస్థుడు నిరాకరించెను. అందుమీద అతడు తిరిగి మేనేజరుకడకుపోయి ఆవిషయము చెప్పెను. మేనేజరు అపుడు అతనిపట్టాను, అందుకుసంబంధించిన కాగితములను తెప్పించి చూచెను. వైద్యపరీక్షకునిపత్రమున పేర్కొనబడియున్న అతనితొడపైనిగలమచ్చను తానుచూచి తనక్రిందిఉద్యోగస్థునిపిలచి 'నేను ఇతనిని గుర్తుపట్టితిని. వెంటనే ఋణధనమును ఇచ్చివేయుము' అని చెప్పెను. ఖాతాదారుని ఈరీతిని తృప్తిపఱచు పద్ధతిని ఎందరు మేనేజర్లు, బ్రాంచిమేనేజర్లు, కార్యదర్శులు తలపెట్టియుందురో నాకు తెలియదు. ఆపెద్దమనిషి ఆమేనేజరుచేసినదానికి అత్యంతసంతృప్తి నందెను. ఆ ఆఫీసును వదలులోపుగా నాతడు పదివేలకు ఆకంపెనీలో తిరిగి ప్రపోజల్ చేసెను.

భీమాకంపెనీ ఉద్యోగస్థులును, ఏజెంట్లును, గుమాస్తాలును తమకంపెనీపట్టాదారులను సౌహార్దముతోడను ఓరిమితోడను చూడవలయును. కాన్వాసరు చెప్పినదానిని నమ్మిన పిమ్మట పట్టాదారుడు తానొకధర్మమును నిర్వహించుచుంటినట్లు భావించుచు ప్రీమియములు చెల్లించుచుండును. పట్టాదారైన వాడను చనువకు అగుబడే తనకు గల బాధ్యతలను గాని హక్కుసత్త్వములను గాని అతడు తెలిసికొనజాలడు. ఇట్లు తెలిసికొనజాలకపోవుటచే అతడు అపుడపుడు కంపెనీనుండి అసంబద్ధములగు డిమాండ్లను చేయుచుండును. అట్టి సమయములయందు కంపెనీ అధికారులు మిక్కిలి మెలకువతోడను, మంచినేర్పుతోడను వ్యవహరింపవలయును. కాని తఱుచుగా ఇట్టిసమయములయందు పట్టాదారులకు విసుగుపుట్టించు ప్రత్యుత్తరములే ఒసగబడుచుండుట బహుళమని చెప్పవలసియున్నందులకు చింతించుచున్నాను. ఇందుతో ఈవిషయము మెప్పునను పట్టాదారునిపక్షమున బాగరితమగుచునే యుండెను.

హైందవ భీమాకంపెనీలు— గణనకెక్కినవియు, క్రొత్తగస్థాపింపబడినవియు— అన్నియు ఈవిషయమున దోషమొనర్చునవియే అని చెప్పవలసియున్నది. ఈవిషయమున సవరణ ఎంతత్వరలో చేయబడిన అంత మంచిది. చిన్నఇన్‌సూరెన్సుకంపెనీయొకటి దానిపట్టాదారులలో నొకనికి కొన్నిఉత్తరములు వ్రాయవలసి వచ్చుట నాకు తెలియును. పట్టాదారునకు గ్రాహ్యత

సుభాషితము

౧౦

కొద్దికాలమునకుపూర్వమునను పలువురు జీవితభీమాసొమ్మును దినవారపుఖర్చులకు సరిపోవుదానిగా తలంచిరి. దరిమిలాను ఈతలంపు మారిపోయినది. జీవితభీమాతో తమతమభార్యలకు, సంతానమునకు రక్షణ ఎంతసులభముగ నీయవచ్చునో వారు గ్రహించిరి. రక్షణకొఱకుగాను జీవితభీమా స్వీకరింపబడినది. నేటిపరిస్థితులు జీవితభీమాకు క్రొత్తవిలువను కొనివచ్చినవి. ఇతరవిధములైన పెట్టుబడులు ఇచ్చు అన్నిరకముల సౌకర్యములను కలిగించుటతోడు జీవితభీమా ఒకవేళ తాము మరణించుచో తమకుటుంబములకు పూర్తిరక్షణ యొసంగగలదనుట తెలిసికొనబడినది. జీవితభీమా వారిగృహమును పరిరక్షించును, వారిసంతానముయొక్క విద్యాసౌకర్యములకు హామీనిచ్చును, వారుజీవించియుండుచో విశ్రాంతిదశయగువృద్ధాప్యమున అమరగు ఆదాయమును కల్పించును.

—ఇండియన్
పాలసీహోల్డర్సు రెవ్యూ.

కోఅబడినందులకు హెడ్డాఫీసువారు ఉద్రిక్తులై ఇట్లు వ్రాసిరి: "పట్టాలోని నియమములను గాని, మాపలు లేఖలయందలి అంశములను గాని అవగతముచేసికొనుపాటి తెలివి గాని, అవగతముచేసికొనవలయుననుఇచ్ఛ గాని వీరికి ఉండినట్లు గనుపించదు. మాటాడక మేము చెప్పినట్లు చేయుట మంచిది." గ్రాహ్యతకోఅబడిన ఈపట్టాదారు ఎవరు? రంగపురమునందలి ఆసుపత్రికి అధికారి!

పట్టాదారుల అజ్ఞానమునకు కాన్వాసరే ముఖ్యముగా బాధ్యుడై యున్నాడు. త్వరగ ఈకేసు కాన్వాసుచేసికొని మరియొకకేసునకై పోవ అతడు ఆతురత చూపుచుండును. ప్రస్తుతమున్న ఏజన్సీపద్ధతులలో ఇది తప్పని సరియగుచున్నది. విద్యావంతులు పలువురు భీమాఏజెంటువృత్తి నవలంభించుచో క్రమముగా ఈదుస్థితి తొలగిపోయి పట్టాదారులలో గల అజ్ఞానము నశింపగలదు.

ది ఇన్‌సూరెన్సు అండ్ ఫైనాన్సు రెవ్యూ.

౯. భీమాకంపెనీలు : ప్రకటనప్రచారము.

ఈపుటలయందు గతవత్సరమున భీమావిషయకపత్రికలయందు భీమావ్యాపారసంస్థల ప్రకటనలవలని లాభములను గూర్చియు, ఉపయోగములను గూర్చియు చర్చించియుంటిమి. భీమా విషయక పత్రికలయందు ప్రకటించుటకై వెచ్చించిన పెట్టుబడికి తగినలాభము ఉండునని కొన్ని అమెరికను ఇన్‌సూరెన్సుఆఫీసులు తమ స్వానుభవముచే కూర్పగలిగినఅంకెలను ప్రచురించియున్నవి. నాటినుండియు మనదేశమునందలి పలుఇన్‌సూరెన్సుఆఫీసులు ప్రకటనలపూర్వకముగ పెద్దప్రచారమునకు గడంగినవి. కాని ఆర్థికమాంద్యకారణమున తమప్రకటనల బడ్జెట్లను తగ్గించుటకు కంపెనీలు ఆతురతచూపుచుండుట అరుదు కాదు. ఈసందర్భమున స్టేట్సుమెన్‌పత్రికలో ప్రచురింపబడిన క్రిందిస్టేటుమెంటు పరిశీలించుట విజ్ఞానదాయకమై యుండగలదు.

"1981-వ సంవత్సరమున వార్తాపత్రికలయందు తమ కంపెనీ ప్రకటనలను యథాస్థితిని సాగించినవియు, హెచ్చించినవియు నగు ఇరువదిరెండు భీమాకంపెనీల వ్యాపారమును—ఆవత్సరమున వార్తాపత్రికలయందు తమతమ కంపెనీ ప్రకటనలను తగ్గించినవియగు మఱి ఇరువదిరెండు భీమాకంపెనీల వ్యాపారముతో పోల్చిచూచినచో ప్రకటనసాగించిన కంపెనీల వ్యాపారము 1980 కంటె 1981 లో నూటికి ఏడువంతులుమాత్రము తగ్గించిన కంపెనీలవ్యాపారము 1980 కంటె 1981 లో నూటికి డెబ్బదిమూడువంతులు తగ్గిపోయినదని రుజువైనది. అమెరికనువార్తాపత్రికా ప్రకటనకర్తలసంఘమువారి ప్రచారకశాఖవారీ లెక్కలను తయారుచేసిరి."

అమెరికనుకంపెనీలకు గలిగిన ఈ అనుభవమునుండి తగినపాఠమును గ్రహించి హైందవభీమాకంపెనీలు ప్రకటనప్రచారోద్యమమును నిర్వహింతురని మే మాశించుచున్నాము. డబ్బు ధారాళముగ ఆడుదినములలో తనంతటతాను రానగలవన్నప్పుడే డబ్బుకు నిక్కచ్చిగల దినములలో

సుభాషితము

౧౧

తనజీవితమును భీమాచేయుచుకొంటయొకపాతకమని ఒకానొక సెత్తిపలుకుచుండగా నేను వినియున్నాను. ఈపలుకులను ఉచ్చరించినది ఎవరైనను అవి మహావాక్యములగుట మున్మాటికిని సత్యము. అవి సుభాషితములు. అవి సత్యసమ్మతములని నానమ్మకము. ఏమన: భీమా అనగా సహకారము. దానికలన చిత్తశాంతిగలుగును; ఒకనికష్టమును వానితోడి వారుపంచుకొనుటయే దానితత్త్వము. ఇట్టిఉత్తమఫలముల చేకూర్చుటకు సాయపడుసంస్థను మనమన్నివిధముల ప్రోత్సహింపవలసినదే. కాని ఆప్రోత్సాహము ఎల్లవేళలను కారాదు. విజాతీయుల మేలునకై విజాతీయులచే చేయబడినపుడు — అనేకములగు మంచి సంస్థలిట్టివే— ఇదియుతనమంచిలో సగభాగమును కోల్పోవుచున్నది. దేశసంపద ఈడబోవుటకు కారణమగుచున్నది; వర్తకమునకుగల సౌకర్యములను తగ్గించుచున్నది; జాతియొక్క ఆత్మగౌరవమునకు భంగము కల్గించుచున్నది. ఈసత్యమును తనజాతీయులు గుర్తింపప్రయత్నము చేయువాడు తనదేశమునకు గొప్పసేవచేసినవాడగుచున్నాడు.

—శరశ్చంద్రచటర్జీ


నచ్చచెప్పినమీదగాని మానవుడు కొనజాలడని వేఱె వచింపనక్కఱలేదు. నచ్చచెప్పుటకే ప్రకటన ప్రచారము కావలసియున్నది. ఆర్థికమాంద్యము ప్రబలియుండుటచే ఈదినములలో వ్యాపారమును యథాస్థితియందు నిలుపుటకు వ్యాపారసంస్థలు తమతమ ప్రకటనప్రచారములను తీవ్రతరముగ సాగింపవలయుట అత్యావశ్యకమగుచున్నది. మన దేశపు భీమాకంపెనీలలో కొన్ని దేశావ్యాప్తమైన ఆర్థికమాంద్యము వర్తించియుండి మంచి వ్యాపారము చేయగలుగుటకు కారణము అవి సాగించిన తీవ్రతరప్రకటనప్రచారమే. ప్రముఖస్థానమునందున్న భీమాకంపెనీల చరిత్రలను పరికించితిమేని తీవ్రతర ప్రకటన ప్రచారమును గావించినదినములయందే అవి హెచ్చువ్యాపారమును చేసియుండుట కనుగొనవచ్చును. పత్రికలకు ప్రకటనలను కాన్వాసుచేయువాడొకడు ఒకానొక ఇన్సూరెన్సుకంపెనీమేనేజరును సందర్శింపగా తనకంపెనీ అర్థశతాబ్దినాటిదనియు, దేశమునకు బాగుగ ఎఱుకపడియుండుటచే ఎట్టిప్రకటనము అవసరములేదనియు చెప్పెను. దానికి బదులుగా కాన్వాసరు అచ్చటగల చర్చి నూఱేండ్లనాటిదనియు అయినను అందు ప్రతి ఆదివారము ఉదయము గంట మ్రోగింపబడుచున్నదనియు చెప్పెను. ఎన్నివత్సరములనాటిదైనను, ఎంతగ దేశమున ఎఱుకపడియున్నను దాని నామము ఎల్లవేళల ప్రజలమనములనుండి జారిపోకుండుటకై నిరంతర ప్రకటనము వలయును. ఇన్సూరెన్సుపత్రికలు ప్రకటించినకంపెనీకి అర్థప్రచారమిచ్చుటయేగాక ఇన్సూరెన్సు శాఖలలో పనిచేయుచున్నవారికిని, జనసామాన్యమునకును భీమానుగూర్చిన విజ్ఞానమును పెంపొందించుచుండుటచే ఇన్సూరెన్సుకంపెనీలకలన హెచ్చుపోషణము మెండుగనియున్నది. ఇతరవ్యాపారస్థులుకూడ ఇన్సూరెన్సు పత్రికలయందు తమవస్తువులను ప్రచురించుట మంచిది. ఏమన ఇన్సూరెన్సు పత్రికలను చదువువారు సాధారణముగా అజ్ఞానపరులును, ధనవంతులు అయియుండుటచే వారికొనుగోలుశక్తియును, వ్యయముచేయుశక్తియు హెచ్చుగనుండును.

— ఇన్సూరెన్సువరిల్డు.

సుభాషితము

స్వశక్తిభీమాకంపెనీల అభివృద్ధికై మనమెప్పుడును ప్రభుత్వమువారి సహాయసంపత్తిని అపేక్షింపకూడదు. స్వప్రయత్నములమీదనే మనము ఆధారపడవలెను. హిందూదేశజులు ప్రతిసంవత్సరమును విదేశీభీమాకంపెనీలలో ప్రసుమ్మరించుచున్నధనరాశిని ప్రజలే స్వబుద్ధిచేతను, స్వప్రయత్నముచేతను అరికట్టవలెను

— లాలా లజపతిరాయి.





కార్తిక పౌర్ణమి నాడు

—చిత్రకారుడు: శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్టు సొసైటి.

ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.





మహిళాలోకము

వివేకానందుడు: స్త్రీ సమస్యలు

§ ఆర్యమతమున గృహిణికి గల స్థానము

సంఘమున స్త్రీకిగల స్థానమువిషయమై ఆర్యజాతికిని, ఆర్యేతరజాతికిని ఎన్నడును ఏకాభిప్రాయము లేదు. ఆర్యేతరజాతులు ప్రార్థనావసరమున ప్రక్కను స్త్రీయుండుట ఏకాగ్రతకు భంగము కలిగించునని గాఢముగ నమ్మిరి; వారిదృష్టిలో స్త్రీమతసంబంధమైన ఎట్టికర్మ చేయుటకును అధికారములేదు. ఆర్యజాతులవారిదృష్టిలో పార్శ్వమున భార్యలేకుండ గృహమేధి మతసంబంధమైన ఎట్టికర్మయు చేయజాలడు. నేడు దేశమున వ్యాప్తమైయున్న మతము పౌరాణికకాలమునాటిది అనగా బౌద్ధయుగమునకు తరువాతిది. వేదోక్తమగు నిత్యాగ్నిహోత్ర కర్మాచరణమునకు భార్యపార్శ్వముననుండుట అవసరమైయుండ పురాణోక్తమగు సాలగ్రామపూజావసరమున భార్య సాలగ్రామమును ముట్టనైన అవసరములేకుండవచ్చినదని స్వామి దయానందసరస్వతి పేర్కొనియున్నాడు. కావుననే బౌద్ధయుగమునకు అనంతరకాలముననే సంఘమున స్త్రీ పురుషునితో తనకుగల సమానస్థానమును గోలుపోయినదని చెప్పవచ్చును. అయితే అంతమాత్రమున భారతస్త్రీ పతనమునొందినదను పాశ్చాత్యవిమర్శకుల వ్రాతలను మనము చేకొనరాదు. స్త్రీలను పురుషులు రక్షింపవలసినపరిస్థితులు పలుశతాబ్దులు హిందూదేశమున కలిగియుండినవి. స్త్రీలవెనుకబాటున కిదికారణము గాని వారి తెలివితక్కువ కారణముగాదు. భారతస్త్రీ భర్తకు అర్ధాంగి. నిత్యవ్యవహారమున వైదికుడగు హైందవుడు పలుకర్మలాచరింపవలసియుండును. భార్య పార్శ్వమునలేనిది అందొక్కటిగూడ నాతడు చేయరాదు. పురోహితులు భార్యాభర్తల ఉత్తరీయములకొంగులు ముడివైతురు; ఆదంపతులు దేవాలయమును ప్రదక్షిణము చేతురు; అట్లే వారు కలసి ప్రతి ప్రసిద్ధతీర్థయాత్రయు గావింతురు.

§ అమెరికనుస్త్రీలకు హైందవస్త్రీలకునుగల అంతరము.

అమెరికనుఅతివలారా! మాహిందూదేశపుస్త్రీలు మీకుగల విజ్ఞానమును కలిగియుండుటను నే నెంతయు వాంఛింతును. అయితే అట్టివిజ్ఞానము నీతిచ్యుతిచే కలుగునదగుచో మాత్రము మాకు వలదు. మీవిజ్ఞానమునకు నేను మిమ్ముల నెంతయు నభినందింతును కాని చెడ్డతనమును గులాబీలచే కప్పివైచి దానిని మంచిగా రూపించు మీపద్ధతిని నే నెంతయు గర్హింతును. విజ్ఞానమొక్కటియే శ్రేష్ఠతమమైనదిగాదు. నైతికజీవితము, పారమార్థికబుద్ధి ఇవి మాప్రధానకాంక్షితములు. మాదేశపుస్త్రీలు మీయంత విజ్ఞానవతులు కారు, కాని మీకంటె పవిత్రశీలలు. తనభర్తకు ఇతరుడైన ప్రతిపురుషుని స్త్రీ పుత్రునివలెగా చూడవలెను. తన భార్యకు ఇతరమైన ప్రతిస్త్రీని పురుషుడు మాతృదేవిగా తిలకింపవలెను. నే నీపరిసరమును గాంచి గాలంట్రీ (స్త్రీవిషయమున పురుషుడు చూపు ఉదాత్తత) అని మీరు పేర్కొనువిషయమును గమనించినతోడనే నాకు అసహ్యము కలుగుచున్నది. లింగభేదమును మఱచి సమానభావముతో సమానాంతరములో మీరు మీపురుషులచే చూడబడనంతవఱకు మీకు నిశ్చయముగ అభివృద్ధి కలుగజాలదు. అట్టిఅభివృద్ధి కలుగువఱకు వారు ఆటవస్తువులే కాని ఇతరము గాదు. ఇదియంతయు విడా

కులపద్ధతియొక్క ప్రతిఫలము. మీపురుషులు మీకు వినమితు లగుదురు, తాము నిలబడియైన మీకు ఆసన మిత్తురు. కాని మరుక్షణముననే ప్రియోక్తులకు ప్రారంభింతురు. 'ఉవిదా! నీ నేత్రము లెంతసుందరములుగ నున్నవి!' అని వారు పలుకుదురు. ఇట్లు పలుకుటకు వారి కేమిహక్కు గలదు? ఇట్టి ప్రశ్న వైచుటకు వారి కెంతటి ధైర్య ముండవలెను? మీ రిట్టి ఆచరణకు ఎట్లు అనుమతింపగలరు? ఇట్టివిషయములు మానవుని ఉన్నతాదర్శరహితములగు గుణములను రేకెత్తించుటయేగాక ఉన్నతభావముల ప్రవర్ధనమునకు మార్గము లేకుండగూడ చేయును.

౩ అతిబాల్య వివాహములు

ఈ అమెరికాదేశమున పడుచుప్రాయమునున్న పలువురుస్త్రీలనేకములు ఇచ్చటిమంచుగడ్డవలెనే ధవళములును, శుభ్రములును అయి ఉండును. కాని అదే ప్రాయమున మాదేశపుబాలికలు మాతృత్వము వహింతురు. దేవా! నే నద్దాని నంతయు నిప్పుడు చూచుచున్నాను. 'ఎచట స్త్రీలు పూజింపబడుదురో అచట దేవతలు క్రీడింతురు' అని పూజ్యుడు మనువు చెప్పినాడు. కాని ఈవిషయమున మేము ఘోరపాతకులము. నారులను నరకకూపమునకు సోపానములుగా పరిగణింప నే మెప్పుడు ప్రారంభించితిమో అప్పుడే మా పతనము ప్రారంభమైనది. వంగదేశమున విద్యావంతమైన కుటుంబములలో బాలురకు చిన్నటనాటనే వివాహముగావించు ఆచారము క్రమముగా తగ్గుచున్నది. ఇపుడు బాలికలవిషయమున ఒకటిరెండేండ్లు మీరిన గాని వివాహప్రయత్నములు సాగింపబడుటలేదు. ఇట్లు సాగింపబడకుండుటకు ఆర్థికసమస్యయే కారణము. కారణ మేదైన యగుగాక, బాలికల వివాహోచిత వయస్సు ఇంకను హెచ్చింపబడవలయును.

౪. విధవా వివాహములు

నాఅభిప్రాయమున ప్రతిదేశమునందలిసంఘమును అచటివ్యవస్థతో రూపసిద్ధినొందుచుండును. కాబట్టి తరుణమురానిదే అతిబాల్యవివాహములనిరోధము, స్త్రీపునర్వివాహములప్రచారము మున్నగు సంస్కరణముల విషయమై మనము తొందరపడ నవసరములేదు. సంఘమునగల ప్రతిపురుషునకును, ప్రతిస్త్రీకిని నిజమైన విద్యాప్రదానము గావించుటయే మన విధ్యుక్తధర్మము. అట్టి విద్యాప్రదానమునందిన వ్యక్తులు తమకు తామే మంచిచెడ్డలను నిర్ణయించుకొని మంచిని చేకొని చెడ్డను విడనాడగలరు. అప్పుడు నిర్బంధముచే సంఘమునుండి ఒక ఆచారమును తొలగించుటకుగాని, బలవంతముచే సంఘములోనికి ఒక ఆచారమును గొనిచ్చుటకుగాని అవసరము లేకుండును. నిదర్శనముగా మనదేశము నందలి విధవావివాహప్రతిషేధమును గమనింపుడు. ఋషులు నిర్దయులై విధవావివాహములను నిషేధించుచు ధర్మశాస్త్రములను వ్రాసిరని భావింపకుడు. తమఅధికారముక్రింద స్త్రీలను అదిమిపెట్టియుంచవలయునను వాంఛ పురుషులకు ఎంత గాఢముగ నుండినను సంఘమున ఇట్టి నియమము లేర్పఱచుటకు అవకాశ ముండియుండినగాని వా రీ ధర్మశాస్త్రములను ప్రవేశపెట్టజాలియుండరు. విధవావివాహముల ఆచారవిషయమై రెండు ముఖ్య గమనింపులు: (1) తక్కువజాతులలో విధవావివాహములు; (2) పైజాతులలో పురుషులసంఖ్యకంటె స్త్రీలసంఖ్య హెచ్చుగా నుండుట. ఈకారణమున ఈపైజాతులలో ఒక్కొక్కబాలికకు ఒక్కొక్కభర్తను సంపాదించుటయే కష్టమైయుండగా ఒక్కొక్కరికి ఇరువురు ముగ్గురు భర్తలను గొనివచ్చుట యెట్లు! కావున సంఘము విధవలపై ఒకనష్టమును రుద్దుచున్నది. ఆమెను తిరిగి వివాహము గావించుకొననిచ్చుటలేదు. కావించుకొననిచ్చినచో ఒక్కవివాహమైన లేకుండ కొందఱు బాలికలు ఉండిపోవలసివచ్చును. స్త్రీలసంఖ్యకంటె పురుషులసంఖ్య అధికముగానున్న జాతులయందు విధవా వివాహములు ఆచారములై యున్నవి. ప్రతిబంధము ఇచ్చట లేదు గావున పశ్చిమదేశములందు అవివాహితలగుబాలికలకు భర్తలు దొరకుట క్రమముగా చాలకష్టమగుచున్నది. (స్త్రీసమస్యపై వివేకానందుని గ్రంథములనుండి క్రోడీకరించి 'ప్రబుద్ధభారత' పత్రిక ప్రచురించిన వ్యాసశకలముల కిది తెనుగుసేత.)

ఆరోగ్య విజ్ఞానము

§ జనసామాన్యమునకు కొన్ని "వద్దు"లు

1. వీధులలోనూ, సందులలోనూ, బజారులలోనూ ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేయవద్దు.

2. నీ ప్రక్కనున్న వారి సహ్యాసహ్యములు గమనించకుండా వీధులలో దగ్గి ఉమ్మి వేయవద్దు, చీమిడి చీదవద్దు.

3. కొద్దిగా మరుగుగా ఉంటవని వీధులచివర, కాలవకట్టలమీద, సన్ననిగొందులలోనూ అల్పాచమనము చేయవద్దు.

4. పిల్లలను వీధులలో బాహ్యమునకు పోనీయవద్దు.

5. చెత్త చెదారములను బజారులలో వేయవద్దు.

6. రోడ్డుమీది దుమ్ములో పిల్లలను ఆడుకోనీయవద్దు.

7. వీధులలో నడచుచు ఏమియు తినవద్దు.

8. రోడ్లమీద నడచునప్పుడు కార్లవల్ల కలిగినదుమ్ము అణగినదాకా ముక్కులు, నోరు మూసికొనుట మరచిపోవద్దు.

9. రోడ్లప్రక్కనఉండు దుకాణములలో కొని తినవద్దు.

10. కాఫీహోటళ్ళలో కరుచుకొని త్రాగవద్దు.

11. కాఫీహోటళ్ళలో ఆకులకు బదులు పళ్లెముల నుపయోగింపవద్దు.

12. తిరునాళ్ళలో అందిననీరు త్రాగవద్దు.

13. అడుక్కొనువాళ్ళకైనను చెడిపోయిన ఆహారము ఇవ్వవద్దు.

14. అంటువ్యాధులను దాచవద్దు.

15. రైలుస్టేషనులలోఉండు మూడవతరగతి ప్రయాణీకులశాలను పాకీదొడ్డికంటె కనాకష్టముగా ఉపయోగించవద్దు.

16. రైలుపెట్టెలో కిటికీవద్దకూర్చుండికూడ, లోపల ఉమ్మివేయుటే గొప్పయని, నాగరికతయని తలచవద్దు.

17. నలుగురుగలచోట చుట్ట కాల్చవద్దు.

(వీనిలో చాలావరకు ఆర్. నారాయణస్వామి యమ్.ఎ. గారు ఇండియన్ ఎక్స్‌ప్రెసులో వ్రాసినవి)

—మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ.

§. పురీషస్థానముపై చూపు అశ్రద్ధయే అనారోగ్యమునకు మూలము.

మలమును వెడలించు పెద్దపేగు శరీరమునందలి మురుగును గొనిపోవుకాలువ అని చెప్పనొప్పును. ఈ మురుగుకాలువవిషయమై విశేషముగు శ్రద్ధను చూపనిచో అది మలినపదార్థములను నిలువచేయు కుప్పగుంటయగును. మలద్వారము శుచిగానుండుచో అతడు ఆరోగ్యవంతుడును, ఉల్లాసవంతుడును అయిఉండును. మలినపదార్థము అందు నిలువయుండువో అతడు నీరసించిపోవుటకు కారణభూతములగు విషములను అది పుట్టించును; రక్తమును పులియజేసి కుళ్ళజేయును మనస్సును, దానినిబట్టి నరములను నది విషపూరిత మొనర్చును. కారణముగా నతడు మానసికోత్సాహమును గోలుపోయి విచారగ్రస్తుడు, కోపదారి, వ్యాకులుడు అగును. హృదయకోశము నది చెరచును. ఫలముగా నాతడు నీరసించి ఏవిషయమునుగూర్చియు జాగ్రత్త చూపజాలనివాడగును. దానిధర్మము నది చేయనుడిచిన పురీషస్థానము అచిరకాలముననే ఊపిరితిత్తులను

పాడుచేయును. ఊపిరితిత్తులు చెడుటచే కోటియందు భరింపరాని దుర్వాసన బయలుపెడలును. అశుచిగా నుండు మలద్వారము జీర్ణకోశమును విషపూరిత మొనరించును. కారణముగా శరీరము లావుపారును, కడుపు ఉబ్బరించును, అజీర్ణసంబంధమైననొప్పులు కలుగును. సుతిగిన మలద్వారము రక్తమును విషపూరిత మొనర్చును. ఫలితము: చర్మము కొంచము పచ్చబాఱుటయో, పాలిపోవుటయో జరుగును; శరీరమంతయు చెమటకాయలు, మచ్చలు పుట్టును పురీషస్థానము యొక్క అపరిశుద్ధస్థితిచే శరీరమునందలి ప్రతి అవయవమును దూషితమగును; అకాలముననే ముదిరూపము ఏర్పడును; కీళ్ళయందు నొప్పులు పుట్టును. చప్పిదవడలు, గుంటలుపడిన కండ్లుఏర్పడును. మానసికోత్సాహము నశించుటచే ఏపనిచేయుటకును యోగ్యత గలుగకుండును. జీవితమునందు ఎట్టిమాధుర్యమును లేకుండును.

—ఫిజికల్ కల్చర్.

౬. ఇట్టి అభ్యంజనమువలని లాభమునందుడు.

నీళ్ళతో పిసికిన నల్లరేవడిమట్టి తలకు పట్టించి పది నిముసము లుంచవలెను. తరువాత ఆలురడతో తలను బాగుగా రుద్దుకొనిన మురికిఅంతయు పోవును. సీకాయ, మెంతులు కలిపి ఉడకబెట్టి రుబ్బి దానితో రెండవసారి తలరుద్దుకొనిన తలకు నునుగువచ్చును. ఇది మేహశాంతికరము. ఈరీతి అభ్యంజనముచే వెంట్రుకలు మెత్తపడును; కుదుళ్ళు గట్టిపడును; చుండ్రు, పేలు, మట్టి ఇడిపోయి దృష్టి నిర్మలమగును. శరీరమునకు కొబ్బరినూనె లేక ఆవునేతి నుపయోగించవలెను. తలంటు కుపయోగించునీళ్ళు సాధ్యమైనంత తక్కువ వేడిగల విగా నుండవలెను:

—నాగులపాటి వేంకటసుబ్బారావు.

౭. కూరగాయలచే రోగోపశమనము గావించుకొనుము.

కాశీయము (లీవరు) మందముగనుండినట్లు అనుమానము కలిగినచో ఆహారపదార్థములందు నీరుసంకాయలను చేర్చుకొనుము. అజీర్తిచేగాక మఱియెట్టికారణముచేగాని రాత్రులయందు నిద్రపట్టకుండుచో రాత్రి భోజనమున నీరుల్లిపాయలకూర ప్రధానద్రవ్యముగా నొనర్చుకొనుము. రక్తహీనతచే బాధపడుచుండువారు బచ్చలిఆకుతో కూరచేసి పుచ్చుకొనుము. బచ్చలి ఆకులో ఇనుము ఎక్కువగ నున్నదని జ్ఞప్తియందుంచుకొనుము. శరీరమునందలి దుష్టపదార్థములను తొలగించి దానిని శుభ్రపఱచుటలో కాబేజికూరకు మించినది మఱియొకటి లేదని జ్ఞాపక ముంచుకొనుము. జ్ఞాపకశక్తి తగ్గుచుండుచో బొద్దికూర తఱచు తినుచుండుము. 'బొద్దికూర తినినవాడు బుద్ధిమంతుడగును' అను పెద్దల వాక్యమును మనమున నిలుపుకొనుము. మలబద్ధమును తొలగించుటకు ఆకుకూరలలో తోటకూర సాటిలేనిది. అది మహాశాకము గదా! సుఖవిరేచనము గావించుకొనుటకు చుక్కకూరకు మించినదిలేదు. జీర్ణశక్తి కొఱవడినచో బీటురూటు అను దుంపకూరను మధ్యాహ్న భోజనములో తీసికొనుము. నరములందు అమితమైన వేడి చేరినచో కారటుదుంపలకూర తినుము. గోగుకూరలో రాగి మున్నదని తెలిసికొనుము.

౮. కాకరయొక్క ఉపయోగము

కాకరాకును, గాకరకాయలును చెక్కుతెలుగుల ననుభవింపదగును. శరీరమునకు శైత్యశాంతిని గలిగించును. ఎముకలమూలుగులకు బటుత్వమును గలుగజేయు శక్తి కాకరయందు మిక్కిలిగా గలదు. (మఱియును దినదినము నయిదేసి కాకరాకులను గొంచెము ఉప్పుతో గలిపి ముద్దచేసి ప్రాతఃకాలమున దంతధావనము కాగానే వరుసగా నేడుదినములు తిన్నయెడల శరీరమందే వ్యాధియు బుట్టనేరదు. కాకరాకుల నెండబెట్టి చూర్ణముచేసి యుంచుకొని శరీరమున శైత్య మధికమగునప్పుడు పచ్చడిచేసి గాని, పులుసు వండుకొని గాని తిన్నయెడల శైత్యశాంతి యగును. ముదిరిన కాకర తీగముక్క నొకదానిని ప్రయాణములో గాని, కూరగాయలు లభించుట దుష్కరముగానుండు వేసవికాలములో గాని చారులో వేసినయెడల, బనసపండువాసనవంటి గమగమలాడు సువాసనను గలిగించును.

—ఆ. వెం. సాంఖ్యాయనశర్మ.

[శ్రీసుబ్బారావు శ్రేష్ఠిగారు గ్రంథాలయోద్యమమునకు జీవమును ప్రసాదించు ఒక ముఖ్య విషయమును ఈవ్యాసమున సూచించియున్నారు. దీనినిగూర్చి పాఠకులు తమ అభిప్రాయములను పంపినచో పైమాసపు ఆంధ్రభూమిలో ప్రచురింతుము. —సంపాదకుడు]



గ్రంథాలయోద్యమము.

గ్రంథాలయోద్యమము - పతాకము

భారతవర్షమున గ్రంథాలయోద్యమము అతి ప్రాచీనమైనదనియు, అతి పవిత్రవంతమైనదనియు, మిగుల ఫలవంతమైనదనియు, సమస్తోద్యమములకు సోపానమనియు ఎల్లరకు విదితము. దేశకాల పరిస్థితుల ననుసరించి భిన్నభిన్న కాలములందు భిన్నభిన్న రూపములతో ఈ యుద్యమము సాగుచుండినది. కాని యేకాలమందును, ఏరాజులు పాలించుచుండినను, గ్రంథాలయోద్యమము మీ దేశమున మొదలంట నశించియుండలేదని చరిత్రలు విదితపరచుచున్నవి. ప్రభుత్వాదరణ యున్నకాలదియు, ప్రజాపోషణ లభించినకాలదియు, భాషాసేవకులు చూపెట్టు ఆదరణాభిమానములను బట్టియు, యుద్యమముచ్చ నీచస్థితు లందుచువచ్చెను. మన దేశ గ్రంథ భాండాగారము లితర దేశీయుల విజ్ఞానౌన్నత్యమునకు, సిరిసంపదలకు, సర్వతోముఖాభ్యుదయమునకు, గోలక్రలైనవని చరిత్రలు చాటుచుండుట పాఠకుల కెఱుకయే.

మన దేశ, మతసంప్రదాయములను బట్టి భాషకధి దేవత సరస్వతి, సరస్వతి సృష్టికర్తయగు బ్రహ్మదేవుని యర్ధాంగి, పార్వతీ పరమేశ్వరులవలె, లక్ష్మీనారాయణులవలె, సరస్వతీ బ్రహ్మదేవులుకూడ పూజనీయులే. గ్రంథాలయములు సరస్వతీదేవి ఆలయములనియు, గ్రంథాలయములు దేవాలయ కోటిలో చేర్పదగినవనియు "ఆంధ్రభూమి" పాఠకుల కీవరకే విన్నవించి యున్నాను.

దేవీనవరాత్రులందు సరస్వతీ వ్రతాచరణము మన పండితుల సంప్రదాయమై నేటికిని యొప్పుచున్నది. గ్రంథకర్తలు, కవీశ్వరులు, పండితశ్రేష్ఠులు, సనాతన ధర్మపరులు, సరస్వతీ ఆరాధన, సరస్వతీ స్తవము, పూజార్చనాధికములు చేయుచుండుట గాంచుచున్నారము.

మన దేశమున శివకేశవులకు ఆలయములు గలవు. పార్వతికి ఆలయములున్నవి. లక్ష్మీదేవికి ఆలయములున్నవి. కులదేవతలకు ఆలయములున్నవి. గ్రామదేవతల కాలయము

లున్నవి. ఈ ఆలయములన్నిటియందును విగ్రహప్రతిష్ఠలు, విగ్రహారాధనలు విధిగా జరుగుచుండుట గాంచుచున్నారము. విగ్రహప్రతిష్ఠ విగ్రహారాధనగల సరస్వతీదేవి ఆలయములు లేకుండుటకు కారణము దురూహ్యముగ నున్నది.

మన భారతదేశ సంపదలతో చేర్పదగిన, మన హిందూ దేవాలయ కోటిలో చేర్పదగిన గ్రంథాలయములందుగల గ్రంథసముదాయమే సరస్వతీదేవియొక్క యాకారము. వేదోపనిషదేతిహాస, పురాణ, మహాకావ్య, నవలా, ప్రబంధాదుల వాగ్రహితగానమే యానలువరాణి వీణానాదము. గ్రంథపాఠకులే సరస్వతీదేవి నారాధించు భక్తులు, గ్రంథాలయోపద్రష్టకుడే సరస్వతీదేవి యర్చకుడు. సరస్వతీదేవి ప్రసన్న కటాక్ష వీక్షణజ్యోత్స్నామాత్రమున యజ్ఞానాంధకారము భేదింపబడును. ఆవిద్యాప్రదాయినీ సందర్శనా ఫలితమే జ్ఞానోదయము.

గ్రంథస్వరూపిణియగు సరస్వతీదేవికి ఆలయములై యొప్పుచున్న పవిత్ర గ్రంథాలయములకుకూడా, శివకేశవాలయములకున్న రీతిగా, ధ్వజప్రతిష్ఠ జరుగుటెంతయు యొప్పియుండునని నావినీతాభిప్రాయము.

గ్రంథాలయోద్యమాభిలాషులగు వేటపాలెమునందలి నాయకులలో ఈ సంకల్పముదయింప నీ ఆశ్వయుజ శు ౯ లు మహార్నవమీ పుణ్యదినమున సారస్వత సంకేతన పంచాదశ వార్షికోత్సవ సందర్భమున త్రయాహ్నికముగ ఆచరింపబడుచుండిన సరస్వతీదేవి పూజాదికములతో పాటు సరస్వతీ ధ్వజారోహణము జరుపబడెను. గ్రంథాలయోద్యమ పతాక చిహ్నము లెటులయుండవలయునను సమస్యపై పండితాభిప్రాయములను, నాయకులయభిప్రాయములను గైకొని నిర్ధారించుటకు వ్యవధి లేని కారణమున, తాత్కాలికముగ సరస్వతీప్రతిమ సహిత పతాకమును ప్రతిష్ఠింపజేసితిమి.

ఇయ్యది సమంజసమగునో కాదో? పతాకముపై సరస్వతీ విగ్రహముండిన చాలునా? మరేమైన చిహ్నములుండనోపునా? సరస్వతీవిగ్రహముగాక, అన్ని మతముల వారికిని అన్నిభాషల వారికిని ఆమోదకరముగా నుండునటుల యేయే చిహ్నములు పతాకముపై యుండదగునో, ఉద్యమశ్రేయోభిలాషులు, నాయకశ్రేష్ఠులు తమయభిప్రాయములను పత్రికాముఖంబున వెల్లడింప గోరుదును. చిత్రకారులు తమ సూచనల గావింప గోరుదును.

ప్రపంచమునగల సమస్తరాజ్యముల వారికిని, సమస్త మతములవారికిని, సమస్తసంఘములవారికిని, సమస్తోద్యమములకును పతాకములుండుట గాంచుచున్నారము. అట్టితరి ప్రాచీనమై, పవిత్రవంతమై, పునాదియై యొప్పుచుండు గ్రంథాలయోద్యమమునకు కూడ పతాకముండుట శుభావహమని యెంచుచున్నాను. కనుక పెద్దలైన విద్వద్వరేణ్యులు ఈవిషయమై తమతమ యమూల్యాభిప్రాయముల ప్రకటించెదరు గాత.

—ఊటుకూరు వేంకటసుబ్బారావు శ్రేష్ఠి.

విడ్డూరములు

౧. మగవాడు ఆడదిగ మారుట.

జెరాల్డ్సు అనుపుస్తకవిక్రేతలు ఈనడుమ నీల్సు హోయర్ అనువారిచే రచియింపబడిన 'మాన్ ఇన్ టు వుమెన్' అను గ్రంథమును ప్రచురించిరి. అగ్రంథమున ఈక్రింది సత్యవృత్తాంతము విపులముగ వర్ణింపబడినది. ఎల్నర్ వెగ్నర్ అను మారుపేరుగల ఆండ్రీస్ పారీ అనువాడు డెన్మార్కు దేశపు పెయింటరు. పెయింటింగునందు అతడు ప్రపంచప్రఖ్యాతి నందెను. అతడు గత శతాబ్దియందు తుదిభాగమున జననమందెను. ఇరువది వత్సరముల వయసున అతడు వివాహముచేసికొనెను. భర్తయైన అతడు మానసికముగను, కాయికముగను తనధర్మమును తృప్తికరముగ నిర్వహించెను. ఇట్లుండ కొంతకాలమునకు అతడు తనశరీరమున నొకవింతమార్పు కలుగుచుండుట కనిపెట్టెను. తనశరీరమున నొకస్త్రీ వ్యక్తి పొడగట్టుచున్నటుల తోచెను. శరీరమున క్రమముగా ఆస్త్రీవ్యక్తి హెచ్చుపాలు గొననారంభించెను. దీనికి వింతపడి ఆండ్రీస్ డాక్టరులచే పరీక్ష చేయించుకొనెను. వారిది ఫలానారోగమని కాని, మార్పుఅని గాని చెప్పజాలకపోయిరి. తుదకు అతడు డ్రెస్‌డన్ నందలి ఒకసుప్రసిద్ధ జర్మనుడాక్టరుచెంతకు బోయెను. ఆతడు నిశితముగా పరీక్షలు గావించి ఆండ్రీస్ ఆడదిగా మారుచుండుటను నిరూపించెను. కొన్ని ఆపరేషనులను కొనసాగించి అతడు ఆండ్రీస్ స్త్రీత్వమునకు పూర్ణత్వమిచ్చెను; పురుషత్వము పూర్తిగ నాశనమయ్యెను. డేనిష్‌ప్రభుత్వమువారు ఆండ్రీస్‌ను స్త్రీగా చేకొని లిల్లీ ఎల్బ్ అను నామముతో క్రొత్తపాస్‌పోర్టును ఇచ్చిరి. డెన్మార్కు రాజు ఆండ్రీస్‌యొక్క పూర్వాశ్రమపువివాహమును రద్దుచేయుచు ప్రకటన గావించెను. ఆండ్రీస్ తనవెనుకటిభార్యను తన స్నేహితుడగు నొకనితో రోమునగరమున వివాహము గావించుకొన ప్రోత్సహించెను. పురుషుడుగానుండినప్పుడు ఆండ్రీస్ స్నేహితుడైయుండిన ఒక ఫ్రెంచిపెయింటరు ఇపుడు స్త్రీయైన తనస్నేహితుని వలచి వివాహము చేసికొనెను. లిల్లీ గృహిణియై మాతృత్వము వహింపగలుగుటకు గాను డ్రెస్‌డన్ నందలి జర్మను డాక్టరు మరికొన్ని ఆపరేషనులు కావించెను. కాని లిల్లీ బిడ్డలను కనుటకు నోచుకొనలేదు. డ్రెస్‌డన్ నందే ఆమె హృద్రోగమువలన మరణించెను.

౨ ఒక నెలలో ఆడది మగవాడగుట.

లండనునుండి ప్రచురింపబడు 'పీపుల్' అను పత్రిక ఈవృత్తాంతమును ప్రకటించుచున్నది. మేరీవుడ్సు అని ఒక ఇంగ్లీషుస్త్రీ. ఆమెవయస్సు ఇరువదియెనిమిదివత్సరములు. మోసపునేరమునకై ఆమె అరెస్టుచేయబడి ఒకమాసపుజయిలుశిక్షకు గురియయ్యెను. జయిలులో ఆమె మగవాడగుటకు ప్రారంభమయ్యెను. ఆమె ఇట్లు చెప్పెను. "నేను రిమాండులో నుండగా నా దేహమున జరుగుచున్నమార్పును గుర్తింపగలిగితిని. జయిలుఅధికారులతో నేను స్త్రీల ఖైదుకు వెళ్లుటయా, వెళ్ళకుండుటయా అని నాకుగల సందేహమును వెల్లడించితిని. వైద్యపరీక్ష నాసందేహమును బలపరచెను. నన్ను ఇపుడు స్త్రీ అనుటకంటె పురుషు డనుటకు కారణములు హెచ్చుగనున్నవి. నే నిపుడు స్త్రీలచెఱసాలలో నిర్బంధింపబడిన పురుషుడనై యున్నాను. నన్ను పరీక్షచేసిన కారాగారపు వైద్యుడు నన్ను పురుషుల కుచితమైన దుస్తులను ధరింపవలసినదిగా సలహా నొసగియున్నాడు." మేరీవుడ్సు అవివాహిత. జయిలులో స్త్రీ పురుషుడుగా మారిన ఈకథ చాలవిచిత్రముగ నున్నది. స్త్రీ పురుషునుగాను, పురుషుడుస్త్రీగాను మారిన వృత్తాంతములు మనము ఈ నడుమ తఱుచుగా వినుచున్నాము. అయితే ఆయా

మార్పులు జరుగుటకు చాలకాలము పట్టుచున్నది. కాని ఒక నెలలో లింగభేదము కలుగుట మిక్కిలి విచిత్రమైనది. కారాగారపు వైద్యుఁడీవిషయమునకు సాక్షీభూతుఁడై యున్నాడు. గావున ఇదికట్టుకథయని త్రోసివేయుట కెంతమాత్రమును వీలులేదు.

§. నాలుగు రెక్కల కోడి.

అమెరికా సంయుక్తరాష్ట్రముల రాజధానినగరమగు న్యూయార్కు నంటియున్న ఒకవ్యవసాయక్షేత్రపాలకునికడ క్రొత్తరకపు కోడి యొకటి కలదు. ఆకోడికి అన్నిటికివలె రెండురెక్కలుగాక నాలుగురెక్కలు ఉన్నవి. నాలుగురెక్కలు విప్పుకొని యెగురునపుడు అది చిన్న గాలియోడవలె నుండును.

§. గ్రంథాలయమున వలసినగ్రంథమును తెచ్చియిచ్చు యంత్రము.


లండనునందలి ఆర్థశాస్త్రకళాశాలకు చెందిన పుస్తకభాండాగారమున నొకక్రొత్తయంత్రము నెలకొల్పబడినది. కావలసిన పుస్తకమును పేర్కొనినచో ఆయంత్రము బీరువాఅరలనుండి ఆగ్రంథమును గొనివచ్చిఇచ్చును.

§. విద్యార్థికి పడగతో నీడనిచ్చిన త్రాచుపాము.

ఈ వృత్తాంతము పశ్చిమగోదావరిజిల్లా గునుపూడి భీమవరమున వాస్తవముగ జరిగినది. ఒకానొక క్రైస్తవ కుటుంబమునకు చెందిన జార్జియు, అతని సోదరుడును స్కూలుఫైనలుపరీక్షకు చదువుచుండిరి. మార్చి 7-వ తేదీ సాయంకాలము నాలుగున్నరగంటలకు సోదరులిరువురును ఒకతోటలో చెట్టునీడను కూర్చుండి లెక్కలు చేయుటలో మునిగియుండిరి. అట్టి సమయములో సుమారు రెండుగజములు పొడవుగల త్రాచుపాము వచ్చి కాళ్ళప్రక్కను ముడుచుకొని తలవంచుకొని లెక్కలుచేసికొనుచున్న జార్జిని సమీపించి పడగను బాగుగా విప్పి మూరెడు పైకి లేచి అతనితలమీదుగా ఎడమప్రక్కను ఆడుచుండెను. అది అట్లు ఎంతసేపు ఆడుచుండెనో జార్జి కనిపెట్టలేదు. కొంతసేపటికి జార్జి సోదరుడు తలయెత్తి పామును చూచుట తటస్థించెను. అతడు తెలివైనవాడగుటచే గత్తరబిత్తరచేయక నెమ్మదిగ శబ్దముచేసి సోదరునిదృష్టిఆకర్షించి పామున్న దిక్కునకు కనుసైగ చేసెను. జార్జి అదిచూచి చిత్తమున బెదరియు ఎట్లో ధైర్యము చిక్కబట్టి నెలవాటుగా రాయివలె దొర్లుచుపోయి సమీపమునున్న పాడుగోతిలో దుమికెను. అందుమీద ఆసర్పము తన తలను పడగతో రెండుసారులు నేలకు కొట్టుకొని నెమ్మదిగా వెనుకకు సాగి దగ్గరలోనున్న రెండుతాటిచెట్ల మొదళ్లలో దాగెను. తోటలోనివారు పరుగెత్తుకొని అచ్చటకు వచ్చుసరికి ఆపాము అదృశ్యమయ్యెను. ఈవిచిత్రవృత్తాంతము రెండుదినములకు జరుగుననగా తొండయొకటి జార్జిసిరముమీదనుండి పాదములపైకి ముమ్మారు దుమికెను. దానిని చంపబోవునంతలో నది పారిపోయి చెట్టెక్కెను.

§. గుండెకాయ కుడితట్టున ఉన్నది.

జీవికి ఊపిరితిత్తులు కుడితట్టున, గుండెకాయ ఎడమతట్టున ఉండును. ఇందుకువిరుద్ధముగా ఆ నడుమ విదేశములందు ఒకనికి గుండెకాయ కుడితట్టున ఉన్నదని వార్తాపత్రికలయందు చదివి ఆశ్చర్యపడియున్నాము. అట్టి ఆశ్చర్యమునకు తావలమైన కుడితట్టున గుండెకాయగలవ్యక్తి భారతదేశమునందును నేడు ఒకడు ఉన్నాడనుట తెలియవచ్చుచున్నది. అంబాలాయందు నాజిర్ దిన్ అని పదమూడు వత్సరముల బాలుడు స్ప్లీన్ వ్యాధినివారణకై అతడు డాక్టరు రామకిషోర్ ఖోశల అనువానికడకు గొనిరాబడెను. రోగియొక్క స్ప్లీన్, గుండెకాయ కుడితట్టునను, లివరు ఎడమతట్టునను ఉండుటకనుగొని ఆడాక్టరు అబ్బురపడెను. పరీక్షార్థము అతని నాడాక్టరు మరికొందఱు వైద్యుల కడకుపంపెను. వారును ఖోశలుని అభిప్రాయముతో నేకీభవించి ఈవిడ్డూరమున కెంతయు ఆశ్చర్యపడిరి. ఈవిషయమున తప్ప నాజిర్ దిన్ కడమ అన్నివిషయములందును సామాన్యమానవుని పోలియున్నాడు. సామాన్యమానవునివలె నాబాలుడు పనిచేయును, నడుచును, పరుగెత్తును, భుజించును, నిద్రించును. వానిని పట్టి పీడించుచున్న విడువనిజ్వరముచేతనే అతనిస్ప్లీన్ పెరిగియుండునని డాక్టరులు నిరూపించిరి.



అరవదేశమునందలి యాంధ్రులు

కర్ణాటాంధ్ర సామ్రాజ్యనియంతయైన కృష్ణదేవరాయల కాలముకొట్టి ఆంధ్రులు అరవదేశమున వలస నెలకొనుటను ప్రారంభముచేసి రనవచ్చును. ఇపుడు రంగూను, ఖరగపురము మొదలగు ప్రదేశములకు వలస పోవుచున్న ఆంధ్రులవలె అప్పటిఆంధ్రులు అరవదేశమునకు జీవనాధారములను వెదుకుకొనుచు వెళ్ళియుండలేదు. అరవదేశమును పరిపాలించుటకే వారు వెడలియుండిరనుట సత్యదూరము కాదు.

తంజావూరు, మధుర మొదలగు పట్టణములను రాజధానులుగ చేసికొని అప్పటి ఆంధ్రులు అరవదేశమును నిర్వక్రపరాక్రమమున లాలించిపాలించిరి. అరవదేశము మధ్యనున్నను వారు ఆంధ్రభాషను ఏమఱలేదు. తాము వేయించిన శాసనములను ప్రాయికముగా ఆంధ్రమునందే వెలయించిరి. ఆంధ్రపండితులను, ఆంధ్రకవులను, ఆంధ్రగాయకులను పోషించిరి. ఆకాలమున స్వదేశమునకంటె ఇచ్చటనే హెచ్చుగ ఆంధ్రవాఙ్మయాభివృద్ధి జరిగినది. తంజావూరునాయకులు యక్షగానములను, మధురనాయకులు వచనకావ్యములను ప్రోత్సహించి ఆయాశాఖల సారస్వతమునకు పరిపుష్టినొసంగిరి. చేమకూర వెంకటపతివంటి కవిని, త్యాగరాజువంటి గాయకుని వారు మనకు ప్రసాదించిరి. సాటిలేనిభాషాభిమానముకలిగి వారు పుదుక్కోటరాజవంశమును ఆంధ్రసరోవరమున తెప్పలు తేలించిరి. తంజావూరు మహారాష్ట్రులుకూడ స్వభాషను విడనాడి తెనుగును రాజభాషగా స్వీకరించిరి.

కాని అది వెనుకటిసంగతి. ఒకప్పుడు రాజభాషగానుండిన ఆంధ్రభాష ఇపుడాదేశమున కోర్టుభాషగనైనలేదు. సేలముజిల్లా హోసూరుప్రాంతములందును, తదితరప్రదేశములందును అరవదేశమున ప్రస్తుతము ముప్పదియారులక్షలమందికిపైగా ఆంధ్రులు ఉన్నారు. ఉన్నదేశమునుబట్టియు, చేయువ్యవహారమును బట్టియు వారుక్రమముగా స్వభాషను మఱచిపోవుచున్నారు. పరిస్థితులలో కొంతమార్పుజరిగి మనవారి దృష్టితిరిగి మాతృభాషపై ప్రసరింపనిచో ఒకటిరెండుతరములలో అరవదేశమునందలి ఆంధ్రులు అరవలలో కలసిపోయి తమ జాతీయతను పూర్తిగ గోల్పోవగలరు.

ఇట్టిశోచనీయ పరిస్థితి కలుగకుండుటకును, అరవదేశమునందలి ఆంధ్రులు తమజాతీయతను గోల్పోవకుండ చూచుటకును మదరాసునందు ఐదు, ఆరుసంవత్సరములకు పూర్వము కొంతప్రయత్నము నడచినది. ఈప్రయత్నమునకు శ్రీ సాధు వరదరాజంపంతులుగారు నాయకత్వమును వహించిరి. వారొకచో ఈసమస్య విషయమై నిట్లువ్రాసిరి:


"దాక్షిణాత్యాంధ్రులు నివసించుచుండు రాష్ట్రము ద్రవిడదేశమగుటచేత ఆంధ్రభాష అరవశబ్దములచే నలంకృతమయ్యెను. 'ముందే దుష్ఫలం దానిలో గర్భిణి' అను సామెతవలె అపలక్షణించుచున్న ఆంధ్రభాషపై ఆంగ్లేయ పాఠశాలలు వచ్చినవెనుక పూర్తిగా అభిమానము తొలగిపోయెను. ఇచ్చటి ఆంధ్రులు తెలుగుఅక్షరముల స్వరూపములనే మఱచిరి. కనుక వీరికి ఒండొరులతో ఉత్తరప్రత్యుత్తరములు జరుపుకొనుటకు అరవ అక్షరములే శరణ్యములయ్యెను. స్వభాషనుమఱచి జాతీయాభిమానమును మొదలంట నిర్మూలము చేసికొని తమ దుస్థితిని తెలిసికొనజాలక యుండుచున్నారు. ఆంధ్రజాతి

యాచార వ్యవహార సాంప్రదాయములు మొదలైనవి వీరికి తెలియకుండనే నశించుచున్నవి. దక్షిణమునకు పోను పోను తాము తెలుగువారమని తెలియనివారును చాలమందిగలరు. సోదరులారా! మాతృభాష క్షీణించినమాత్రాన మన దాక్షిణాత్యాంధ్రసోదరులకు ఎట్టి దురవస్థ చేకూరినది? ఇట్టి విపత్తును ఆంధ్రసోదరులందరు గమనింతురుగాక! ముప్పదియారులక్షల జనసంఖ్యగల దాక్షిణాత్యాంధ్ర సోదరసోదరీ మణులు ఇట్టి దురవస్థకు పాలగుట ఆంధ్రులకు గౌరవమా! శ్రీత్యాగరాజాది ఉత్తమపురుషులు బయలుదేరిన దాక్షిణాత్యాంధ్రుల గతి దుర్గతికావలసినదేనా? యక్షగానములు పాడి జనులను రంజిల్లజేసిన దాక్షిణాత్యాంధ్రశాఖ ఇట్టి దుస్థితిపాలయి క్షీణించుట ఆంధ్రదేశీయులకు గౌరవప్రదము కాదు. ఇట్టి దుస్థితిని తప్పించుకొని తొల్లిటి యౌన్నత్యమును బడయుటకు దాక్షిణాత్యాంధ్రులు మాతృభాషను, తమజాతీయతను సంరక్షించుకొనవలయును, ఇప్పుడే వారు ఇందుకొఱకు తీవ్రముగ కృషిచేయవలయును. ఇట్టి మహాకార్యమునకు ఆంధ్రదేశీయులుకూడ ఎక్కువగ తోడ్పడవలెను. దాక్షిణాత్యాంధ్రులకు చేయూత ఈయవలసిన బాధ్యత వారిపైగూడగలదు."

దాక్షిణాత్యాంధ్రులకు చేయూత ఈయవలసిన బాధ్యత దేశీయాంధ్రులపై గూడగలదను వరదరాజంపంతులుగారి వాక్యమెంతయు సమ్మానార్హమైయున్నది. జనసంఖ్యవిషయమున ఇప్పుడాంధ్రభాష భారతదేశీయ భాషలలో తృతీయస్థాన మాక్రమించుచున్నది. ఆంధ్రభాష వారికి ఇట్టి సంఖ్యాబలమును కూర్చుచున్నవారిలో అరవదేశమునందలి ఆంధ్రులుకూడగలరనుట మనము మఱువరాదు. అయితే తరుణమున మేల్కాని కృషిసల్పి అరవదేశమున తెనుగు నిలుపుటకు తీవ్రప్రయత్నములు సాగింపమేని అచటిఆంధ్రులు ఆంధ్రమును మఱచి ఆరవలలో లీనమై ఆంధ్రభాషవాడువారి సంఖ్యాబలమునకు డిందుపాటు కలిగింపగలరు. కావున ఈసమస్యవిషయమై అత్యవసరముగా ప్రత్యేకశ్రద్ధను దేశీయాంధ్ర నాయకులు చూపవలసియున్నది.

ఏటేట రామేశ్వరయాత్రకని దేశమునుండి పలువురు ఆంధ్రులు అరవదేశమునకు పోవుచుందురు. వారు తమయాత్రా సందర్భమున ఆంధ్రులు ఎక్కువగనున్న తంజావూరు, హోసూరు, రాజుపాలెము, సేలము, మధురమున్నగు ప్రదేశములనుగూడ సందర్శించి అచట వలస నిలకొనియున్న ఆంధ్రులతో కలసిమెలసి ఒకటి రెండురోజులుండుచుండుటచే అచటి ఆంధ్రులు మఱచిపోవుచున్న ఆంధ్రసంప్రదాయములు తిరిగి వారిజ్ఞప్తికి వచ్చుచు విస్మృతి గహనము పాలుగాకుండనుండును. అచటి ప్రాథమిక విద్యావిధానమున ఆందోళనముసల్పి తెనుగునకుకూడ అగ్రస్థానమిప్పించుట అరవదేశమున ఆంధ్రతాముద్రకు స్థిరత్వము కల్గించు సాధనములలో నొకటి ఆంధ్రులు విశేషముగాగల తావులయందు గ్రంథాలయములు స్థాపించి అందు ఆంధ్రపత్రికలు, ఆంధ్రగ్రంథములు ఉంచి ఆంధ్రవిద్యావ్యాప్తి గావించుట అట్టిసాధనములలో మఱియొకటి. సాధ్యమైనంతతఱచుగా దేశీయాంధ్రనాయకులు అప్రాంతములకు పోవుచు ఆంధ్రమున ఉపన్యసించుచు ఆంధ్రకీర్తిని పునశ్చరణము చేయుచుండుట కూడ చాల కార్యకారిగానుండగలదు.

ఈవిషయమై ఏమాత్రము ప్రయత్నము జరిగినను మంచిఫలము వెంటనే కలుగగలదు. ఏనుండురా! ఆంధ్రమహాశయుడు త్యాగరాజస్వామి తన అక్షరరమ్యగీతలతో నచ్చట యింటింట పాడుకొనియున్నాడు. మన మీవిషయమైచేయు గోరంతప్రయత్నము కొండంతగా అతడు చేయగలడు.



"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౩౦. నిరుద్ధ భారతము

దేశమును వలువని కవులకదగిన శ్రీ మంగిపూడి వేంకటశర్మగారిచే నిది రచియింపబడినది. ఆంధ్రగ్రంథములలో ఒకకూర్పునకు మించిన గ్రంథములు మిక్కిలి తక్కువ. స్థితియిట్టిదికాగా 'నిరుద్ధభారతము' అను ఈ పద్యకావ్యమునకిది మూడవకూర్పు అనుటచే ప్రజాబాహుళ్యమున నీగ్రంథమునకుగల ప్రచారమును సులభముగ నూహింపవచ్చును. ఆంధ్రదేశమున హరిజనోద్ధరణోద్యమమును ఉత్సాహపుటడుగులతో నడిపించుచున్న దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారీ మూడవకూర్పును ఉచితముగ ముద్రించి ఇచ్చుటయేగాక గ్రంథమునకు ప్రశస్తతరమగు పీఠికను గూడ వ్రాసియున్నారు. వారి పీఠికనుండి కావ్యమును గూర్చి కొన్నివాక్యములనిట నుద్ధరించుచున్నాము: 'ఆంధ్రావనియందు హరిజనోద్యమవ్యాపనమునందు శ్రీయుత మంగిపూడి వేంకటశర్మగారి కృతి నిరుద్ధభారతము హరిజనసమస్యయందు పండిత పామరహృదయములను లగ్నముచేసిన విధమునను గ్రంథమునకు గలిగిన గౌరవవ్యాపకములు ప్రమాణములు. వేంకటశర్మగారు నిరుద్ధభారతమునందు హరిజనుల పరివేదనమును, సవర్ణుల యపరాధములను, ఉభయుల ధర్మనిర్వహణమార్గమును రసవంతముగ వర్ణించిన పద్యావళి రసానందమును గలుగజేయుచున్నది. శర్మగారి శీలమువలెను కావ్యశైలియును మృదువుగను, సరళముగను, సరసముగను నున్నది. ప్రతిపద్యమును భావగర్భితమైన దైన్యదృశ్యమో, భక్తిదృశ్యమో, కరుణాదృశ్యమో, మహత్త్వదృశ్యమో సాంగోపాంగముగ చిత్రించినటులు కల్పింపబడి భావప్రపంచమునందు సంభ్రమమును గలుగజేయుచున్నది.' తెనుగున ప్రబోధక కవిత్వమును దారితీసినవారిలో మంగిపూడి వేంకటశర్మగారొకరు. ఈకావ్యమునందలి పలుపద్యములు చాటుధారలై దేశమున వ్యాపించియుండుట గ్రంథము ప్రజాహృదయమున పాతుకొన్నవిషయమును వ్యక్తీకరించుచున్నది. ఆంధ్రులకు చిరపరిచితమైయున్న ఈగ్రంథమునుగురించి విశేషము వ్రాయుట అనవసరము. ఈ మూడవకూర్పు ముద్రణము సుందరముగనున్నది. క్రౌను సైజున 82 పుటలు. వెల రూ ౦-౫-౦ మాత్రమే. కావలయువారు గ్రంథకర్తచేర పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు వ్రాయునది.

౩౧. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము

శ్రీయుత చేకుమళ్ల అచ్యుతరావు (ఎమ్. ఏ., ఎల్. టి.) గారు విజయనగర సామ్రాజ్యమునందలి ఆంధ్రవాఙ్మయ చరిత్రమును మూడుభాగములుగా వ్రాయదొరకొని ప్రస్తుతము ప్రథమభాగమును ప్రచురించిరి. విజయనగర సామ్రాజ్యమందలి 1380—1500 సంవత్సరముల నడుమగల ఆంధ్రవాఙ్మయ చరిత్రము ఈప్రథమ భాగమున విపులముగ వివరింపబడినది. విజయనగర రాజ్యారంభమునకు పూర్వపు ఆంధ్రవాఙ్మయస్థితిని ప్రత్యేక మొక ప్రకరణమున చర్చించి అచ్యుతరావుగారు ఆసామ్రాజ్యమునకు చెందిన కవులగు నాచనసోమనాథుడు; పేరంరాజు జక్కనకవి; వినుకొండవల్లభరాయడు; దూబగుంట నారాయణ కవి; దగ్గుబల్లి దుగ్గనకవి; పిల్లలమర్రి పినవీరభద్రకవి; నంది మల్లయ్య, ఘంట సింగయ్య; మనుమంచి భట్టులను పరామర్శించిరి. ఈపరామర్శించుటలో రావుగారొక నూతనమార్గము త్రొక్కిరి. ఇదివఱలో ఆంధ్రకవుల చరిత్రములను రచియించి గురుజాడ శ్రీ రామమూర్తిగారును, కందుకూరి వీరేశలింగము పంతులుగారును ఆయా కవుల దేశకాల నిర్ణయముల విషయమై విశేషశ్రద్ధను చూపిరేగాని ఆయాకవుల 'కవితారీతులు, భావభావనా

శక్తులు, నిమ్నోన్నతావస్థలు, కథాసంధాన చిత్రీకరణములు, ఇత్యాది కావ్యహృదయ పరిస్పందనముల స్ఫురింపక యట్టె విడిచిపెట్టిరి.' రావుగారు క్రొత్తపద్ధతి నవలంబించి 'కవికావ్యహృదయమర్మములను' వెలార్చు నుద్దేశముతో 'కథానిరూపణము, శైలీనిర్ణయము, శీల ప్రతిష్ఠాపనము, రసపోషణసంవిధానము, భావభావనాశక్త్యాది విమర్శనము' కూడినంత విపులముగ విమర్శించిరి. ఆంగ్లవాఙ్మయమునందలి జాన్సను కవిపద్ధతి నవలంబించిరనవచ్చును. ఈగ్రంథమునందలి మఱియొక విశేషమేమన ఇందు విమర్శింపబడిన కవులలో వారి వారికి సమకాలికులును గ్రంథనిర్మాణమున సాదృశ్య, సాధర్మ్యములను బొందిన యితరాంధ్రకవులతోఁ జాల వఱకు పరిపోల్చి తారతమ్యములు నిరూపింపబడుటయే. ఈరీతి వాఙ్మయ విమర్శనమునకు విశేషముగ కావలసి యున్నది. శ్రీరావుగారీపద్ధతికి ప్రారంభముగావించినందుల కెంతయు అభినందింపవలసి యున్నది. ఈగ్రంథముయొక్క రెండుమూడు భాగములనుకూడ శ్రీరావుగారు త్వరలో ప్రచురించి ఆంధ్రవిమర్శక వాఙ్మయమును పరిపుష్టి నొందింతురుగాక! గ్రంథము డెమ్మీసైజున 308 పుటలు. గ్లేజుకాగితము. వెల రూ ౨-౦-౦ విద్యార్థులకు రూ ౧-౮-౦ మాత్రమే. దొరుకుచోటు. యస్. రామారావుగారు, బి. ఏ., ఇన్నీసుపేట, రాజమండ్రి.

32. అన్నపూర్ణాదేవి లేఖలు

'నన్ను మరచినను దేశమును మరువవలదు. నేనుస్థిరముగాదు' అని దేవీస్వరూపమున మనకిని దివ్య సందేశమిచ్చిన మాగంటి అన్నపూర్ణాదేవి రాజకీయ జీవితము నెఱిగినంతమంది ఆమె సారస్వత జీవితము నెఱుంగరు. కాని ఆమె గ్రంథములలోనికెల్ల ప్రస్తుతము మనము పరామర్శించుచున్న లేఖలే ఆమె సారస్వత జీవితమును లోకమున కెఱింగించుటలో హెచ్చుగ తోడ్పడగలవు. ప్రసిద్ధపురుషుల లేఖలను ప్రత్యేకమొక వాఙ్మయశాఖగా ఆంగ్లవిమర్శకులు చేకొనియున్నారు. కౌపరు, లేడీవర్ట్లీమాంటేగ్యూ మొదలగువారి లేఖలు ఆంగ్ల సారస్వతమున అనంతగౌరవమునందుచున్నవి. లేఖల సారస్వతము ఆంధ్రమున నింకను ప్రారంభదశయందే యున్నది. అందుచే ఈగ్రంథము ముఖ్యముగా పఠనీయమైనది. దేవిగారి ఆదర్శ జీవితమును వెల్లడించు ఈ లేఖలు ఆంధ్రస్త్రీలెల్లరును చదువవలసినవి. సాహసముచేసి వీనిని ప్రచురించి ఆంధ్రమున లేఖల వాఙ్మయమునకు ప్రారంభముచేసిన శ్రీబాపినీడుగారి నెంతయు కొనియాడుచున్నాము. గ్రంథముద్రణము సుందరముగనున్నది. క్రౌనుసైజు. 250 పుటలు. వెల రు 1-0-0 ఈ పుస్తకము ప్రతులు కావలసినవారు మాగంటి బాపినీడు గారు' ఏలూరు అని వ్రాయవలయును.

33. కృపాంభోనిధి

ఆధునికాంధ్రకవిగ్రామణులగు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిచే 'కృపాంభోనిధీ!' అను మకుటముతో రచియింపబడిన భగవత్ప్రార్థనాత్మకములగు 218 పద్యముల సంపుటము. భక్తిరస ప్రధానములై పద్యములు ధారావేగము గలిగియున్నవి. సర్వకాలములందును, సర్వప్రాంతములందును సత్యములై ప్రకాశింపగల ఉపనిషద్వాక్యములు కొన్ని ఇందు పద్యరూపమునొంది పొంపారుచున్నవి. శ్రీరాజా రామమోహనరాయలువారి నిర్యాణశతాబ్దికోత్సవ సందర్భమున ఈ గ్రంథము ప్రచురింపబడుట ఎంతయు ఉచితముగా నున్నది. 'భక్తచింతామణి' వలెనిదియు విశేష ప్రచారమునకు రాగలదని నమ్మెదము. 'అనుఁగై యొప్పఁగదుం దోడునీడయయి కష్టైకచేయూతయై ప్రాణమై నను సేవించెననేక వర్షములు' అనుచు కవిగారు దివంగతురాలైన తనభార్యనుగూర్చి వ్రాసిన రెండు మూడు పద్యములు హృదయమును కలంచునవిగా నున్నవి. శైలి తెలియుటకై మూడు పద్యములను ఉదాహరించుచున్నాము.

శా. ఆకుంబచ్చల పల్లెరంబులఁ బ్రవా
ళాలిన్ నివాళుల్ దగన్
నీకర్పించి, విహంగనాద మనుమే
గీతంబులంబాడి, తా
మే కాలంబునఁబూలు కాన్కలిడి తం
డ్రీ! భక్తి వృక్షాంగనల్

నీకార్యము కృతజ్ఞతం దెలిపెదున్
నేర్మిన్ గృపాంభోనిధీ!

మ. ఫలకంబన్నదిలేదు, తూలికయు లో
పంబయ్యెడిన్, లేదు రం
గులపజ్జెయిన, నిరాశ్రయంబు నభో
గోళంబునన్ వర్ణసం
కలనంబుం దెసు నింద్రచాపమును జో
కంబూని చిత్రించి లో
కులమెప్పించెడి చిత్రకారుని నినుం
గొల్తున్ కృపాంభోనిధీ!

శా. విశుద్ధగ్రంథములన్ రచించితివి గా
యాపఃపురాణంబు భూ
వేదంబున్ గగనేతిహాసము మఱుద్ది
వ్యప్రబంధము నా
మీఁదన్వాచకనామకాగమము స్వా
మీ! యీ ప్రబంధంబులం
దేదానిం గనినన్ భవన్మహిమగా
కే సత్కృపాంభోనిధీ!

క్రౌనుసైజున ముప్పదియాఱుపుటలు. వెలయువారు గ్రంథకర్తపేర రాజమండ్రి వ్రాయునది.

౩౮. గృహలక్ష్మి దసరాసంచిక

ఆంధ్రస్త్రీల ఆయురారోగ్య సౌభాగ్యములను పెంపొందుట కేర్పడిన పవిత్రాంధ్రమాసపత్రికయగు గృహలక్ష్మి ఆఱవ దసరాసంచికను కృతజ్ఞతా పూర్వకముగ నందుకొంటిమి. గత ఐదు దసరాసంచికలవలెనే ఇదియు పుటలయందును, పటములయందును విస్తృతమును, వినూత్నమును అయి విరాజిల్లుచున్నది. ముఖచిత్రము మనోజ్ఞముగను, లోపలి త్రివర్ణచిత్రములు ఆకర్షణీయములుగను ఉండి సంచికయొక్క విలువను హెచ్చించుచున్నవి. స్త్రీయొక్క శక్తిస్వరూపమునకు ఆధునికయుగమున సమగ్ర నిదర్శనమనునట్లుమని దివంగతురాలైన అనిబిసెంట్ చిత్రము శక్తిపూజాకై ఏర్పడిన దసరాలో ప్రచురింపబడు గృహలక్ష్మియందు చేర్చుట యెంతయు సముచితముగ నున్నది. స్పెయిన్ నారీమణుల నాట్యవిశేషమును చూపు చిత్రము అద్భుతముగనుండి ఆంధ్రస్త్రీల విదేశీయాచార విజ్ఞానమును పెంపొందింప జాలియున్నది. విదేశీయాచారములను పరిచయముచేయు ఇట్టి చిత్రములు స్త్రీలయందు నూతనోత్సాహమును పుట్టించుటయే గాక వారి లోకజ్ఞానమునకు దోహదప్రాయములుగ నుండును. స్త్రీలకొఱకు ప్రత్యేకముగ ఆంధ్రమున పలుపత్రికలు నడుపబడినవి. పుల్లాడి వేంకటరత్నముగారిచే ప్రారంభింపబడి రాయసము వేంకటశివుడుగారిచే నిర్వహింపబడిన జనానా పత్రిక, వీరేశలింగము పంతులుగారి సతీహితబోధిని, పర్లాకిమిడినుండి ప్రచురింపబడిన బాలిక, పులుగుర్త లక్ష్మీనరసమాంబగారి సావిత్రి, వింజమూరి వేంకటరత్నమ్మగారి అనసూయ, నందిరాజు చలపతిరావుగారి గృహలక్ష్మి, కళ్ళేపల్లి వేంకటరమణమ్మగారి ఆంధ్రలక్ష్మి, బాలాంత్రపు శేషమ్మగారి హిందూసుందరి అట్టివానిలో కొన్ని. వాని యన్నిటికంటె ప్రశస్తరీతిని ఆంధ్రరమణీలోకమును సేవించుచున్న గృహలక్ష్మి నేడు ఆంధ్రగృహములకు లక్ష్మియై యొప్పారుచుండుట వింత గాదు. గృహలక్ష్మీజ్యోతిచే అజ్ఞానాంధకారమును లోధ్రాదీపముచే ఆమయాంధకారమును దవ్వుగ ద్రోసి తమ్ము అభ్యుద్ధరించుచున్న శ్రీ డాక్టరు కే. యన్. కేసరిగారికి ఆంధ్రస్త్రీలోక మెంతయు ఋణపడియున్నదనుట నిశ్చయము. ఆంధ్రమహిళలు గృహలక్ష్మికి ఇంకను ఎక్కువగ పోషణ ప్రోత్సాహముల నొసగి దానివలని ఉపయోగమును బహుళ మొనర్తురుగాకయని కోరెదము.

౩౯. ఆత్మచరిత్రము

శ్రీ రాయసము వెంకటశివుడు, యం. ఏ., యల్. టి, గారి ఆత్మచరిత్రము. ఈ చరిత్రమును గూర్చిన విమర్శనము ఒక్కింత విపులముగ పైమాసపు సంచికలో ప్రత్యేకవ్యాసముగ ప్రచురింపబడగలదు. క్రౌనుసైజున ౭౫౦ పుటలు. వెల రూ ౧-౦-౦ మాత్రమే. ప్రతులకై గ్రంథకర్తపేర గుంటూరు వ్రాయునది.



సెప్టెంబరు, ౩౮.

౧౭:—సంగం జాగర్లమూడి. ఉన్నతవిద్య గరచుటకై లండను కేగుచున్న శ్రోత్రియ రఘురామయ్య చౌదరి యం. ఏ. యల్. యల్. బి గారికి వీడ్కోలు విందు.

౧౮:—బందరు. కృష్ణాజిల్లా పంచాయితీ ఎన్నికలు జరుపగౌరవోద్యోగిగ నియమింపబడిన శ్రీచల్లపల్లి రాజాగారి ఆహ్వానము తొలగించినట్లు ప్రభుత్వమువారు ప్రకటించిరి.

:—నంద్యాల గ్రామములో పికెటింగుచేసినందులకు గాను అరెస్టుచేయబడిన నారాయణానంద స్వామిగారిని ఔకుగ్రామము మకాములో జాయింటు మేజిస్ట్రేటు విచారించి ఆరుసెలలు కఠినశిక్ష, డెబ్బదియైదు రూపాయలజూర్మానా, జూర్మానా చెల్లింపనిచో ఏడున్నర నెలల అదనపుశిక్ష విధించిరి. స్వామిగారు జూర్మానా చెల్లింప నిరాకరించిరి.

౧౯:—నెల్లూరుజిల్లా సంగం గ్రామములో ఈయబడిన టీపార్టీ సందర్భము వెంకటగిరి కుమార రాజావారు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణా వశ్యకతను వివరించిరి.

౨౦:—మదరాసు. డాక్టరు అనిబిసెంటు సాయం కాలము 4 గంటలకు చనిపోయెను.

౨౧:—మదరాసు. ఆంధ్రపత్రిక పంచవింశతి వార్షికోత్సవము. రజతోత్సవసందికా ప్రచురణము.

:—గుంటూరు. జిల్లాబోర్డు మీటింగులో ప్రత్యేకాంధ్రరాష్ట్ర తీర్మానము ఆమోదింపబడెను.

౨౨:—ఒంగోలు శారదామహిళాసంఘము స్థాపింపబడెను.

౨౩:—తుని. గోదావరీమండల మహిళామహాసభ. శ్రీమతి పి. ఇందిరాబాయి బి.ఏ గారు ఆహ్వాన సంఘాధ్యక్షురాలు. సారంగు సీతాదేవిగారు అధ్యక్షురాలు.

:—అంగలూరు. ఉదయము తొమ్మిదిగంటలకు శ్రీయుత యొర్నేని సుబ్రహ్మణ్యముగారిని అరెస్టు చేసి పోలీసువారు గుడివాడకు తీసికొనివెళ్లి విడుదలచేసిరి.

:—ఏలూరు. శ్రీయుత పత్తిరాజు రామమూర్తి గారికి ఒక సంవత్సరము విడికైదు విధింపబడెను.

౨౪:—కూచిపూడి. శ్రీ సరస్వతీనిలయ వార్షికోత్సవము శ్రీకోటుకూరి వేంకటసుబ్బరాయ శ్రేష్ఠి గారి ఆధిపత్యమున జరిగెను.

౨౫:—గుంటూరు. జిల్లా ఎడ్యుకేషనల్ కౌన్సిల్ ప్రెసిడెంటుగా పి. వి. కృష్ణయ్యచౌదరిగారు ఎన్నుకొనబడిరి.

:—నరసాపురము. భరతశాస్త్ర ప్రవీణురాలు, వైణికురాలు, సంఘసంస్కర్త్రి, భక్తురాలు మద్దుల పర్వతవర్ధని మరణము.

౨౬:—బెజవాడ. 20 మాసములనుండి సర్కారువారి ఆధీనములో నుండి తలుపులు తాళములు వేయబడిన కొత్తగడ్డ మధుసూదనరావుగారి ఇల్లు తిరిగి వారికి మొగల్రాజపురమునందు స్వాధీనము చేయబడినది.

:—చేటపాలెము. గుంటూరుమండల గ్రంథాలయ సంఘమువారి యాజమాన్యమున సారస్వత నికేతన భవనమున గ్రంథాలయ ప్రదర్శనోత్సవమును శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారు జరిపిరి.

౨౮:—బెజవాడ. ఆంధ్రప్రాంతీయ హిందీ మహా విద్యాలయ ప్రారంభోత్సవము నందిగామ తాలూకాబోర్డు అధ్యక్షులును, జయంతిపురం జమీందారులును అగు శ్రీరాజా వాసిరెడ్డి సదాశివేశ్వర ప్రసాద్ బహద్దరు వారిచే జరుప బడెను.

:—ఆంధ్ర పేపరుమిల్సు మేనేజింగు ఏజంట్సు అయిన బి. పి. లిమిటెడ్ ఫరంవారు డైరె క్టరు బోర్డు సమక్షమున మిల్సు మేనేజిమెం టును ఒప్పగించుకొనిరి.

౨౯:—శృంగేరి, శంకరాచార్య స్వాములవారు దర్శన మియ్యనందులకు అంకరాజు సుబ్బరాయశర్మ గారు నిరశనదీక్ష వహించిరి.

:—కాకినాడ సర్పవరము దేవస్థానపు ట్రస్టీలు, వైశ్యప్రముఖులు గుడిమెట్ల రామచంద్రమూర్తి గారి మరణము.

30:—బందరు శతావధాని చల్లపల్లి వేంకటశాస్త్రి గారి షష్టిపూర్తి ఉత్సవప్రారంభము.

:—వేలూరు. శ్రీయుత బులుసు సాంబమూర్తిగారు విడుదల నొందిరి.

:—కడలూరు. శ్రీయుత పారుపూడి సత్యనారా యణగారి విడుదల.

:—విశాఖపట్టణము. మ్యునిసిపలు సంఘమువారు ప్రత్యేకాంధ్రరాష్ట్రమునుగూర్చి తీర్మానించిరి.

:—బరంపురము గంజాంవరదల బాధ నివారణకు గాను ప్రభుత్వమువారు రూ 1000 ఇచ్చిరి.

:—నూజవీడు. కృష్ణామండల మహిళాసభ. శ్రీమతి యం. శ్రీ విజయలక్ష్మమ్మ రావు బహద్దరు ఈయుర్యారు రాణిగారు ఆహ్వాన సంఘాధ్య క్షురాలు. శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మ గారు అధ్యక్షురాలు.

అక్టోబరు, 33.

౧:—విశాఖపట్టణము. శ్రీయుత వెంకటసత్యనారా యణగారి సంపాదకత్వము క్రింద 'సరస్వతీ పత్రిక' యను ప్రతి ఆదివారము ప్రచురింప బడు వారపత్రిక వెలువడెను.

౨:—ఏలూరు స్వర్గీయ మాగంటి అన్నపూర్ణాదేవి వర్ధంతి వార్షికోత్సవము శ్రీబాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారి అధ్యక్షతను జరిగెను.

:—ప్రొద్దుటూరు. సిటికాలేయాలు ఏర్పాట్లు పూర్తియై ప్రజలకు విడువబడెను.

3:—గుడివాడ. శ్రీ అయినంపూడి శ్రీనివాసులు గారు అయినంపూడి గ్రామములో అరెస్టు చేయబడిరి.

:—రేమిడిచర్ల. (నైజాము) పిడుగుపడి నాలుగిండ్లు కాలిపోయెను.

౫:—రాజమండ్రి. కోటచుర్లు ఎస్టేటు మైనరు ప్రొప్రయిటరు శ్రీరాజా చింతలపాటి వేంకట సింహాద్రి రాజుగారికి మేనమామయగు శ్రీ పూసపాటి సూర్యనారాయణ వేంకటకృష్ణం రాజుగారిని గార్డియనుగా నియమించిరి.

:—ఒరిస్సా కమిటీ సభ్యులు బరంపురము చేరిరి.

౬:—మచిలీపట్నము. కృష్ణాజిల్లా విద్యాసంఘాధ్య క్షులుగ ఆడుసుమల్లి హరిసీదుచౌదరిగారు ఎన్నుకోబడిరి.

:—డోకిపర్రు. శ్రీసేనుగుప్త గ్రంథాలయ ప్రారం భోత్సవమును దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు జరిపిరి.

:—నెల్లూరు. శ్రీయుత మన్నెపల్లి రామకృష్ణా రావు పంతులుగారి సంపాదకత్వమున ప్రతి శుక్రవారము ప్రచురింపబడు నూతనాంధ్రవార పత్రిక వెలువడెను.

౮:—విశాఖపట్టణము. హార్బరులోనికి మొట్టమొదటి ఓడ 'జలదుర్గ' అను పేరుగలది తీసికొని రా బడెను. ఈ ఓడ సింధియా నావిగేషను కం పెనీవారిది.

౭:—గుంటూరు 'భక్తిప్రబోధిని' వార్షికోత్సవము దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులుగారి అధ్యక్షతను జరిగెను.

సంపాదకీయసమాలోచన

ధరలు ఎట్లు పెరుగును ?

1873-75 సంవత్సరములలో తెలుగు దేశమును పీడించిన కాటకమునందు కూడ ఇప్పటి విషమపరిస్థితులు లేకుండినవని ఆధాత సంవత్సరపు కఱవులో తేగలుమాత్రము తిని దేహధారణముచేసికొనినవారు చెప్పుచున్నారు. 1893-96 సంవత్సరములలో ఇప్పటివలె ఆఆర్థికమాంద్యముకూడ లోకావృతమైనదే. కాని అది అప్పుడు మూడు సంవత్సరములలో తీరిపోయినది. నాలుగవ సంవత్సరమునుండియు ధరలు క్రమముగా పెరగనారంభించి ప్రజాహృదయమునుండి భయమేఘములను చెదరగొట్ట దొడంగినవి. 1929 లో ప్రారంభమైన ఈ ఆర్థికమాంద్యము ఇప్పటికి నాలుగుసంవత్సరములనాటిదైనను ఇంతలో వదలునట్లు కనిపించదు. ఇతరదేశముల మాట మనము చెప్పజాలము కాని హిందూదేశమును మాత్ర మది ఇంతట అంతట వదలునట్లు లేదు. ఇతరదేశములందు ప్రభుత్వమువారు ప్రజాలోకమునకండయై ధరల పెరుగుదలకు విశ్వప్రయత్నము లొనర్చుచున్నారు. మన ప్రభుత్వము వారి పక్షమున అట్టి ప్రయత్నలేశమైన కానము. మీదు మిక్కిలి పడిపోయినధరలు హెచ్చకుండజేయు పరిస్థితులను కల్పించినారు. ఒట్టవాప్యాక్టును హిందూదేశము తలపై రుద్దినారు. ఆప్యాక్టువలన ఈదేశము తనకుమాలినధర్మమును చేయవలసిన దగుచున్నది. ఆంగ్లసామ్రాజ్య క్షేమమునకై మనము జపాను, ఫ్రాన్సుమొదలగు దేశములనుండి దిగుమతిచేయువస్తువులపై హెచ్చు సుంకములను విధించితిమి. ఫ్రాంసుదేశమునుండివచ్చు బట్టలపై నూటికి డెబ్బదియైదు వంతునను, జలతారుపై నూటికి అరువదిరెండున్నరవంతునను, మోటారుకారులు, రసాయనికవస్తువులు, లోహములు మొదలగువానిపై హెచ్చు సుంకములను ఇచట విధించుటచే హిందూదేశమునుండి పోవు వస్తువులపై ఆదేశమును హెచ్చు సుంకములను ఏర్పఱచినది. ఈదేశమునందలి ముఖ్యమగుపంటలలో నొకటియగు వేరుశెనగను ఫ్రాంసుదేశము ఇదివఱకు విశేషముగా కొనుచుండునది. ఒక్క మద్రాసు హార్బరునుండి 1932-వ సంవత్సరమున ఒక్క సెప్టెంబరుమాసముననే ఫ్రాంసుదేశము 140 లక్షలు విలువగల 14000 టన్నుల వేరుశెనగను కొనియున్నది. కాని ఈసంవత్సరము ఆగష్టుమాసమధ్యమున వేరుశెనగపై ఫ్రాంసుదేశమున సుంకము విధింపబడుటచే ఇపుడు వేరుశెనగరవాణా నిలిచిపోయినది. తనవస్త్రములపై హెచ్చుపన్నును విధించుటచే జపాను ఇదివఱకు మనదేశమున కొనుచున్న పత్తిని కొన నిరాకరించినది. కొస్తారవాణా లేక పండినపంటకు విడుదల ఎట్లుండును? విడుదలకే నోచనివస్తువుల ధరలకు గిరాకి ఎట్లు కలుగును? శమ ఉద్యోగుల జీతములు తగ్గించినట్లే తగ్గించి వెనువెంటనే హెచ్చించి రైతులవద్దనుంచి పన్నుమాత్రము యథారీతిని వసూలుచేయుచు మన ప్రభుత్వము వారు ప్రజాక్షేమమునకై పాటుపడుచున్నారు!

ఉత్తర సర్కారులలో వరి, చెఱుకుపంటలు :

ఉత్తరసర్కారుల భాగ్యమునకు చాలవఱకు కారణభూతమైనవి వరి, చెఱుకు పంటలు. మదరాసురాజధానియందు గత వత్సరము 1,17,100 ఎకరములలో చెఱుకు సాగు చేయబడియుండగా ఈ వత్సరము 1,13,500 ఎకరములలో మాత్రమే సాగు చేయఁబడియున్నది. అనగా నిరుటికంటె ఈయేడు చెఱుకుపొలము నూటికి మూడువంతులు తగ్గినది. రాజధాని మొత్తముమీద చెఱుకుపొలము తగ్గగా ఉత్తరసర్కారులలో మాత్రము నూటికి పదివంతులు హెచ్చినది. గతవత్సరమున సర్కారులలో 45,390 ఎకరములుమాత్రమే చెఱుకుకు ప్రత్యేకింపబడగా ఈవత్సరమున 49,800 ఎకరములు ప్రత్యేకింపబడినవి. ఇచట పంచదార ఫ్యాక్టరీలు ఏర్పడగలవను నమ్మకమే ఈహెచ్చుదలకు కారణమైయుండునని వ్యవసాయశాఖానివేదిక తెలుపుచున్నది. ఇకవరిపంట విషయము మదరాసు రాజధానియందు గడచినసాలలో 76,18,000 ఎకరములలోను ఈసాలున 74,79,000 ఎకరములలోను వరి సాగు చేయబడినది. అనగా నూటికి సుమారు రెండువంతులు తగ్గుదల కన్పించుచున్నది. ఈతగ్గుదల ముఖ్యముగ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలయందే కలదని నివేదికలో గలదు. ఏపంటయైనను ఇపుడన్నిటికిని ధరలు ఒకరీతిగనే యున్నవి. కావున రైతునకు కలుగగల లాభములో తారతమ్యము విశేషముకాని వరిపంటతగ్గుటచే రైతునకు ఒక నష్టము కలుగుట నిశ్చయము. పశువులకు ప్రధానమైన గ్రాసమగు వట్టిగడ్డియొక్క సరఫరా వరిపంటయొక్క తగ్గుదలతోబాటు తగ్గిపోగలదు. పంచదారఫ్యాక్టరీలు నిర్మింపబడుటచే చెఱుకుపంటలాభించునని నమ్మిన రైతునకు ఆవిషయమునకలుగు ఆశాభంగమునకు పశుగ్రాసము కొఱవడుటచే కలుగు బెంగ తోడుపడి ఆతనిస్థితిని మఱింత శోచనీయము నొనర్పగలదు.

విశాఖపట్న నౌకాశ్రయము :—

ప్రకృతిమాత ఆంధ్రునకనుగ్రహించిన వరప్రసాదములలో విశాఖపట్ననౌకాశ్రయ మొకటి. అయితే దాని నాతడింతవఱకు పూర్తిగ నుపయోగించుకొనలేక పోయినాడు. సిపాయికలహముల సంవత్సరమగు 1857-వ సంవత్సరముననే విశాఖపట్నమున నౌకాశ్రయమును నిర్మింప ఆలోచనలు సాగినవి. కాని కొనసాగలేదు. 1889-లో తిరిగి ఈ ఆలోచనలు తీవ్రములైనవి. కాని అప్పుడును ఆంధ్రుని రేఖ బయలుపడలేదు. ముప్పదియాఱు సంవత్సరములకు తరువాత అనగా మూడు పుష్కరములకు పిమ్మట 1915 లో భారతశాసనసభలో విశాఖపట్న నౌకాశ్రయ నిర్మాణవిషయమై తీర్మానింపబడెను. 1925, 1926 సంవత్సరములు ఆంధ్రుని జాతకములో ఉచ్చమైనవి, ఏమన 1925 లో విశాఖపట్న నౌకాశ్రయ నిర్మాణప్రారంభమును, 1926 ఆంధ్రవిశ్వవిద్యాలయ సంస్థాపనమును జరిగినవి. ఆంధ్రవిశ్వవిద్యాలయము రాజమండ్రిలో పుట్టదలచి బెజవాడలో పుట్టి విశాఖపట్నము చేరుకొన్నది. అందుతో విశాఖపట్నము ఆంధ్రమహానగరమగుట సునిశ్చితమైనది. కలకత్తా, మదరాసుల మధ్యనుండి మాంగనీసు అవిసెగింజలు, వేరుశనగ, జనపనార మొదలగు సరకుల రహానాకు హెచ్చువీళ్లను కల్పించి ఈ ఆంధ్రనగరి అచిరకాలముననే ఒక పెద్ద పట్నమై ప్రపంచమునకు ఆంధ్రత్వమును చాటు బూరగొమ్మునయి వెలయగలదు. కలకత్తావలన వంగదేశస్థులును,

బొంబాయివలన మహారాష్ట్రులును, కరాచీ వలన సింధుదేశీయులును పొందిన, పొందు చున్న అభివృద్ధిని విశాఖపట్నమువలన ఆంధ్రులు పొంది తోడి జాతీయులలో అగ్ర స్థానము నందగలరు. విశాఖపట్న నౌకాశ్రయము తెఱువబడిన ఈ అక్టోబరు 7-వ తేది ఆంధ్రులచరిత్రలో నొకముఖ్యదినమై తర తరములకు వెలయగలదు. నౌకాశ్రయమును సంపాదించుకొనిన ఆంధ్రుడిక ఉన్నతన్యాయ స్థానమును, రాష్ట్రమును సంపాదింప సత్వర ముగ ప్రయత్నించి కృతకృత్యుడగునుగాక !

ఆంధ్రపత్రిక రజతోత్సవము:—

పత్రికల రుద్రభూమియును ప్రఖ్యాతి నార్జించిన ఆంధ్రదేశమున ఆంధ్రపత్రిక నిండాఱు ఇరువదియైదువత్సరములు నిష్క టిల్లి నెగడుచుండెననుట యొకయద్భుతవిష యమే. అయితే ఈ అద్భుతవిషయమునకు కారణము ఆంధ్రులాపత్రిక కొసగిన పోషణ ప్రోత్సాహములుగాక ఆపత్రికాధిపతి అకుం ఠితదీక్షయు, అపూర్వత్యాగమును. నాగేశ్వ రరావు నిజముగా తెలుగుదేశపు నార్త్ క్లిఫ్. మంచిని పొగడుటకాని, చెడును తెగడుట కాని, యెఱుగని విచిత్రదేశము తెలుగు దేశమునగాక ఆతడు మఱి యేదేశమునపుట్టి యుండినను ఇంతకంటెహెచ్చు యశోగౌరవ ముల నందియుండును. గృహవిశ్వవిద్యా లయమై ఇరువదియైదువత్సరములుగ తమ్ము సేవించుచున్న ఆంధ్రపత్రికయొక్కయు, దా నియధిపతియగు దేశోద్ధారకుని యొక్కయు ఆయురారోగ్యములకై నిత్యము భగవంతుని ప్రార్థించుచుండుట రెండున్నరకోట్ల ఆంధ్రు లయొక్కయు విధికృత్యమై యున్నది.

రాయలసీమ: పత్రికలు:—

బళ్లారియందలి శ్రీకృష్ణదేవరాయ గ్రం థమాలావార్షికోత్సవసందర్భమున ఉపన్య సించుచు శ్రీగాడిచెర్ల హరిసర్వోత్తమ రావుగారు 'రాయలసీమ: పత్రికలు' అను విషయమునుగూర్చి ఇట్లుచెప్పిరి: "వాఙ్మ యసంబంధమగు విషయము మఱియొకటి కలదు. అది పత్రికాప్రకటనము. రాయల సీమకు బయటజరుగు పత్రికోద్యమమున మనవారు కొందఱు పాల్గొనినారనుట వా స్తవమే. ఆంధ్రదేశమును కొన్నివారము లుఱ్ఱూతలూగించిన స్వరాజ్యపత్రిక కీర్తినిజ ముగ రాయలసీమకు చెందదగినదే ఆంధ్ర మున మొదటిపత్రికయగు 'యక్షిణీపత్రిక' బళ్లారిపురమున వెలువడినదని మాకవి మిత్రులు పప్పూరు రామాచార్యుల వారు ప్రకటించినారు. కాని పత్రికానిర్వహణము నందుమాత్రము రాయలసీమ గర్వపడదగిన ప్రతిభను చూపుటకుకాలేదు. 'ఆంధ్ర చంద్రిక', మాతృసేవ', 'పినాకిని', 'సాధన', 'ఇంద్రావతి' మున్నగుపత్రికలు తమశక్తి కొలదిపనిచేసినవి. ప్రోత్సాహము కొఱవడు టనుజేసి నిలిచిపోయినవి. ఏతద్విషయమున రాయలసీమ పూనికతోపనిచేసి ఆంధ్రలోక మును తృప్తిచెందింపదగియున్నది." అనేక విషయములందు రాయలసీమ వ్యక్తిత్వ మును కాపాడుటకు ఈతరుణమున ఒకవార పత్రికయొక్క ఆవశ్యకత యెంతేనిగలదు. రాజకీయ వాతావరణము ఇపుడొకింతచల్ల బడినదిగావున అనంతపురమునుండి వెలు వడుచు రాజకీయకారణమున ఆగిపోయిన 'సాధన' పత్రికను పునరుద్ధరింపనగును. చరి త్రగల రాయలసీమ పత్రికలలో 'సాధన' ఎన్నదగినది. సమర్థతతో నిర్వహింపబడి అది మంచిపలుకుబడిని సంపాదించినది. అట్టిపత్రి క పునరుద్ధరణమునకు రాయలసీమ ప్రజలు వ్యగ్రోత్సాహమున పనిచేయుదురని నమ్ము చున్నాము.



సిద్ధార్థుని నిర్వికారత

—చిత్రకారిణి : శ్రీమతి దామెర్ల సత్యవాణిగారు, రామారావు ఆర్టు సొసైటి.

తెనుఁగుగేస్తురాలా!

ప్రాణవిభుదృక్ప్రవృత్తిలో వాసన మొందు
సమ్మదపునీతభావసంచయము లెల్లఁ
బ్రీతిమై గ్రహియించి వర్తించు శక్తి
తెనుఁగుగేస్తురాలా! వరించినది నిన్ను.

ప్రబలభవసంభవార్తివిఘాతచలిత
పురుషహృద్వల్లిఁ బ్రేమసంఫుల్లఫలిని
బ్రాపు నొసఁగుచు జీవితప్రథితమోద
మాంధ్రగృహలక్ష్మి! సృష్టింతువమ్మ! నీవు.

కప్పురము తావిఁబోలె, రాగార్ద్రమాన
మంగళశ్రీని జీరువాఱంగఁ జేసి
దయితు చొక్కంపుజీవితధామ మందు
నవ్యకళలీని సొగయుచున్నావు సాధ్వి!

ప్రణయతత్త్వరహస్యసూత్రప్రబోధ
మధువు లురలించు గేహినీమణులఁగాంచి
ఎలమిఁ బ్రేమైకమండలమేనటంచు
తెనుఁగుసీమ గర్వించి వర్ధిల్లగలదు!

—శ్రీమతి నిత్యకళ్యాణమ్మ,
—శ్రీ సీతారామమూర్తి.



దేశభక్త సన్‌యట్‌సేన్

(చీనా స్వాతంత్ర్యోద్యమనాయకుని చరిత్ర)

చీనాదేశము 19-వ శతాబ్దియందు మంచూరియా రాజకుటుంబముచే పాలింపబడుచుండెను. ప్రజలకు స్వాతంత్ర్యములేదు. విద్యావ్యాప్తి సున్న. నాగరికత నెఱుగరు. మూఢాచారములకు దాసులై పశుతుల్యులుగ ప్రవర్తించుచుండిరి. రాజేమిచెప్పిననదియే వారికి శాసనము. రాజులో ప్రజాక్షేమమునకు పాటుబడరు. భోగలాలసులై దేశక్షేమమునే మఱచిరి, ఆతరుణమున దేశభావిభాగ్యవిధాత, త్యాగమూర్తి, నిష్కళంక దేశాభిమానియగు సన్‌యట్‌సేన్ 1866-వ సంవత్సరమున, కాంటన్‌నగరసమీపమున కుగ్రామమున నొక కృషీవలుని కుటీరమునందు జన్మించెను. తల్లిదండ్రులు కడుగారాబమున తనముద్దులపట్టిని పెంచి, పెద్దవానినిజేసి విద్యాభ్యాసమునకై విద్యాలయమున కంపిరి. సామాన్యబీదకుటుంబమున జన్మించిన ఈబాలుడు తన మాతృదేశదుస్థితినిగాంచి, పిరికిపందవలె పరితాపపడక, వీరునివలె దేశదాస్యశృంఖలముల ద్రెంప నడుముకట్టి చరితార్థుడాయెను. రాజులు దేశమును నిరంకుశముగ పాలించుచుండిరి. ప్రజలు వివేకహీనులై తమహక్కులను గమనింపక సర్వవిధముల పతితులై బానిసలుగ మెలంగుచుండిరి. అంధకారమున మునిగి యున్నవీరిని మేల్కొల్పి, తమధర్మముల నెఱుంగ జేసి, పారతంత్ర్యమును పారద్రోలి, చీనాదేశమును స్వతంత్రముగజేసిన సన్‌యట్‌సేన్ సామాన్య ప్రజ్ఞాధురీణుడా? ఆతేజోమూర్తి చీనాయందు బయలుదేరదీసిన స్వాతంత్ర్యోద్యమము అజ్ఞాననిద్రాముద్రితమైన ఆసియాఖండమును మేల్కొల్పినది. సన్‌యట్‌సేన్ మహాశయుని పవిత్రనామమును ఆసియావాసులెల్లరు జపించుచున్నారు.

ఈయన బాల్యమునుండియు చురుకుతనముగల వాడు. బాలక్రీడలలో సహితము తనసహచరులలో మిన్న. విద్యాభ్యాసమున తనతరగతిలో ప్రథముడు. ఎన్నడును ఏవిషయమునను వెనుకంజ నెఱుగడు. తన 21-వ సంవత్సరమున వైద్యపరీక్షయందు ఉత్తీర్ణుడై డిగ్రీని పొందెను. కాంటన్‌నగరమున వైద్యవృత్తి నవలంబించి, సమర్థుడనిపించుకొని ప్రసిద్ధికెక్కిన డాక్టరాయెను. తన వృత్తితోను, ధనసంపాదనతోను మాత్రము తృప్తి నొందక దేశహితైక కార్యములందు పాల్గొనుచుండెను. చీనాయువజనసంఘమును స్థాపించి దేశమంతయు విసుగువిరామములేక సంచారముచేసి, దేశాభిమానపూరితములగు ఉపన్యాసముల నొసగి వేలకొలది యువకులను దేశసేవానిరతులుగ జేసెను. వీరు దేశమున స్వాతంత్ర్యకాంక్ష ప్రబలజేసిరి. స్వాతంత్ర్యోద్యమము దినదినాభివృద్ధిగాంచుచుండెను. ఇంతలో 1894-95 సంవత్సరములలో చీనా-జపాను దేశములకు యుద్ధము సాగెను. ఈసమయమున మనకథానాయకుడు వైస్రాయియగు లీహాంగుచంగుతో ప్రజలకు స్వాతంత్ర్యమొసగ వాగ్దానముచేసిన తనయువజనసంఘము యుద్ధమున పాల్గొనునని చెప్పెను. కాని యీయనకోరికను వైస్రాయి తిరస్కరించెను. దీనికి ప్రజలు భిన్నులైరి. కర్తవ్యమేమని తమనాయకుని ప్రశ్నించిరి. అప్పుడా

యోధుడు "మనము కృతనిశ్చయులమైనచో స్వాతంత్ర్యము పొందుట కష్టముగాదు. మనస్వాతంత్ర్యము మనచేతిలోనున్నది. స్వాతంత్ర్యముపొంద నిచ్ఛగలవారు మానప్రాణములు పోయినను సంగ్రామమునుండి వెనుకంజవేయమని శపథముచేయుడని తనసహచరుల హెచ్చరించెను. వెంటనే వేలకొలదివీరులు స్వాతంత్ర్యదేవిపదకమలములకడ తమప్రాణము లర్పింప దీక్షగైకొనిరి. తనదేశజుల ఆత్మశక్తి, దృఢవిశ్వాసము, అకుంఠితదేశభక్తి గాంచి సన్ యట్ సేన్ సంతసించెను. అప్పటినుండియు అధికోత్సాహముతో ఆమహానుభావుడు తనయుద్యమవ్యాప్తికొఱకు దేశమునంగల పట్టణములు, పల్లెలు విరామములేక సంచారముచేసెను. పలుమారులు ఆహారపానీయములుకూడ లభింపలేదు. దేశవిముక్తికై అష్టకష్టములుపడెను. నిర్మలప్రేమతో నిరీక్షించు ప్రియపత్నివదనారవిందము గాంచ నుత్సహించడు. తనరాకకు చిందులుద్రొక్కు పసిపాపల నొకపరి ముద్దాడ నభిలషింపడు. ఆత్యాగమూర్తి దేశాభిమాన మగణ్యముగదా! అధీరుని నిరంతరకృషివలన దేశమున వేలకొలది స్వాతంత్ర్యయోధులు సమకూడిరి. వారికి సైనికశిక్ష నొసగి మాతృదేశపుపిలుపురాగనే రణరంగమున కుఱుక సిద్ధముచేసెను. మారుమూలలలో నున్న కుగ్రామములలో సైతము స్వాతంత్ర్యకాంక్ష ప్రబలెను. ఫిరంగులను, తుపాకులను, ఆహారసామగ్రిని సిద్ధముచేసెను. దక్షిణచీనాదేశమును ముట్టడించుటకు కృతనిశ్చయులైరి. అన్నిప్రాంతములలో సైన్యశక్తుల నేర్పఱచి రాత్రియనక, పగలనక మనకథానాయకుడు సంచారము చేయుచుండెను. కాంటన్ నగరము స్వాధీనముగానున్నది. ఇట్టి యమూల్యసమయమున నొక దేశద్రోహి రాజునకులోబడి వీరిభావికార్యక్రమమును తెలియజేసెను. వీరియాశయములు భగ్నములాయెను. ప్రభుత్వమువారు పలువురబంధించిరి. కొందఱిని కొరడాలతో గొట్టిరి. మరికొందఱిని పలువిధముల బాధించిరి. ప్రధాననాయకులను ఉరిదీసిరి. కాని చీనాదేశభాగ్యవశమున మనకథానాయకుడు తప్పించుకొనెను. అతనిని పట్టుకొనుటకుగాను అనేకగూఢచారులు వెంబడించిరి. గ్రామములలోను, కుటీరములలోను, నావలలోను, కొండలలోను, కాననములలోను తలదాచుకొనుచు నాతడు వీరికి దొరకలేదు. ఆయోధుడెట్టకేలకు తప్పించుకొని పరదేశముల కేగెను. ప్రభుత్వమువారు భగీరథప్రయత్నములుచేసియు పట్టుకొనలేక పోయిరి.

ఈ యోధు డింతటితో తన మనోనిశ్చయమునకు తిలాంజలి నొసగలేదు. విదేశములలోనున్న చీనావారి యందు దేశాభిమానము రగుల్కొల్పెను. వారినందఱి స్వదేశముపైపు దృష్టిమరలజేసెను. వారందఱు నొకచో సమావేశమై తమదేశబంధవిముక్తికై పాటుపడ సంకల్పించుకొనిరి. దానికివలయు సర్వసన్నాహములు చేయుచుండిరి. చీనాయందును స్వాతంత్ర్యోద్యమము నానాటికానాడు పెంపొందుచుండెను. బాలురు, బాలికలు, స్త్రీలు, పురుషులు, వీరువారననేల దేశమునంగల ప్రజలందరు ఉద్యమమునజేరిరి. దేశమునవ్యాపించుచున్న స్వాతంత్ర్యోద్యమమును చూచి మంచూరియా రాజులు గజగజలాడుచుండిరి. జీవచ్ఛవములవలెనున్న ప్రజలు జీవముగలవారైరి. దేశమునందెచ్చట గాంచినను స్వాతంత్ర్యసంరంభమే. ఈసమయమున [illegible] సన్ యట్ సేనుని పట్టించువారికి లక్షలకొలది ధనమొసగుదుమని ప్రభుత్వమువారు ప్రకటించిరి. గూఢచారులు, ధనలోభులగుప్రజలు పట్టుకొనుటకు ప్రయత్నించి విఫలులైరి. వందలకొలది గూఢచారులు వెంబడించుచున్నను బిచ్చగానివలె, కూలివానివలె, కూరలమ్మువానివలె, పిచ్చివానివలె మారువేసములు ధరించి వారి కనులలో దుమ్ముగొట్టి అతిరహస్యముగ సన్ యట్ సేన్ ప్రచారముచేయుచుండెను. శ్మశానములలోను, పాడుబడిన కోటలలోను అర్ధరాత్రివేళ సభలుచేయుచుండెను. ఈధీశాలి నిరంతరకృషి వర్ణనాతీతము.

సన్ యట్ సేన్ 1896-వ సంవత్సరమున అమెరికాదేశమునుండి లండనుపట్టణమునకువచ్చెను. అచటిచీనా గూఢచారి మనదేశభక్తునితో కపటస్నేహముచేసి మంచి మాటలతో తనదేశపురాయబారివద్దకు తీసికొనిపోయెను. అయన వెంటనే మనకథానాయకుని నొక చీకటి

కొట్టునందు బంధించెను. ఈ నిర్బంధవార్త నతిరహస్యముగనుంచిరి. ఈయనను గూఢముగ చీనాదేశముపంప ప్రయత్నించుచుండిరి. ఇదిగమనించి సన్ యట్ సేన్ నగరమునందున్న తన యాంగ్లోపాధ్యాయునికి నొకలేఖ వ్రాసి తనస్థితిని దెల్పెను. ఈలేఖను అధికారులుచూచి ఆయనను మరింతబాధించగడంగిరి. కాని ధీరుడగు మన దేశభక్తుడు చలించలేదు. తనసద్గుణమున్న ధనముతో కావలివారిని లోబరచుకొని మఱియొకలేఖ తనగురుప్రవరునకందజేసెను. పూజనీయుడగు ఆగురూత్తముడు ఆంగ్లేయుడైనను, తనశిష్యునియెడనున్న వాత్సల్యముతో రాయబారి యక్రమవర్తనమును పత్రికలలో ప్రకటనజేసియు, ప్రభుత్వమువారి కెఱిగించియు, రాయబారిని మందలింపజేసియు దేశభక్తాగ్రమణిని బంధవిముక్తునిగ జేసి చీనాదేశవాసుల మన్ననలకు పాత్రుడాయెను.

సన్ యట్ సేన్ విదేశములలోనున్నను సూర్యాస్తమయమైనపిదప తనజన్మభూమికి జేరుచు ప్రధానానుచరులకు సలహాలొసంగుచు తెల్లవారునప్పటికి విదేశముల కేగుచుండెను. స్వాతంత్ర్యోద్యమము దినదినాభివృద్ధిగాంచుచుండెను. తటస్థులుగనున్నవారుసైతము స్వాతంత్ర్యోద్యమమున జేరుచుండిరి. దేశమునంగల ఆబాలగోపాలము ఏకాభిప్రాయులై దేశస్వాతంత్ర్యోద్యమమున నడుములుకట్టి ఏకదీక్షతో పోరాడిరి. రణరంగమున పలువురు వీరస్వర్గమున కరిగిరి. ఎందరో కన్నెరుగని లలనామణులు సహితము సంగ్రామరంగమున కదలి కాళికాదేవిమూర్తులై శత్రుసైన్యనివహముల చీల్చి చెండాడిరి.

కడరానిపాట్లుపడి పిదప క్రీ. శ. 1911-వ సంవత్సరమున జయముగలిగెను. రాజులు ప్రజాధీనులైరి. స్వాతంత్ర్యజయధ్వనులు మిన్నుముట్టెను. ప్రజలలో చెప్పనలవికాని యుత్తేజము, ఉత్సాహము పొంగి స్వాతంత్ర్యదేవికి హారతులొసంగిరి. ఈశుభవార్త లండనులోనున్న సన్ యట్ సేన్ విని ఆనందసాగరమున నోలలాడెను. ప్రజానాయకులు లండనులోనున్న తమ నాయకమణిని తోడ్కొనివచ్చిరి. ఈత్యాగమూర్తి దేశమున కాలిడినతోడనే ప్రజ లాయనపైన పుష్పవృష్టి కురిపించిరి. కర్పూరహారతులొసగిరి. భక్తితో ప్రణమిల్లిరి. 1912-వ సంవత్సరము జనవరి 1-వ తేదీన ఈ నిర్మలదేశభక్తుని స్వతంత్రచీనాదేశ ప్రథమాధ్యక్షునిగ నేకగ్రీవముగ నెన్నుకొని సింహాసనమెక్కించిరి. దేశమునందంతట నతివైభవముగ స్వాతంత్ర్యోత్సవము జరిపిరి.

సన్ యట్ సేనవంటి స్థిరసంకల్పుల, కార్యదీక్షాపరుల, నిరంతరకృషివలననే దేశములకు కల్యాణము గలుగును. వారిత్యాగమే ప్రపంచమునకు మార్గదర్శి. 1917-వ సంవత్సరమున జ్వరపీడితుడై యీ దేశసేవాదురంధరుడు స్వర్గమునకరిగెను. ఆమహాపురుషుని పవిత్ర నామము ప్రపంచచారిత్రమున సువర్ణాక్షరములతో లిఖింపబడినది.

—శరణు రామస్వామి చౌదరి.

రురుడు

నామనోహర్మ్యతలమున నాట్యమాడు
ప్రణయినీగాఢపరిరంభరతుడనయ్యు
క్రూరశతకోటినినదసంక్షుభితభయద
ప్రళయజీమూతపటలమార్గాల కెగసి
చలితశంపాలతాదీప్తి కులికి యులికి
ప్రవివినీలవలాహకాతతుల నరసి
అరసి కనలేక దైవోపహతి దురంత
మీ మహాధ్వాంత సంవృతారామవాటి
నిమిష నిమిషమ్ము కనుల బాష్పములుగ్రమ్మ
ప్రకృతి సర్వమ్ము నస్పష్ట వికృతిదోప
పక్షములు రాలిపోయిన పక్షివోలె
తరులతామూలముల బడి దైన్యవృత్తి
వెదకుచున్నాడ నేలొకో వెర్రినగుచు.

—స్థానాపతి సత్యనారాయణశాస్త్రి.

ఆమె యేడుపు

నిలుపుకొనంగరాక తరుణీ! హృదయంబునఁ బొంగివచ్చు న
గ్గలపు దుఃఖమెట్టులొ కంఠములో దిగమ్రింగికొంచుఁ గ
న్గొలుకులనుండి యశ్రువులు గాఢముగా స్రవియింపఁ జేయుచున్
మలిన మొనర్చె దేమిటికి మాటికి స్నిగ్ధకపోలసీమలన్ ?

నా యెదపై శిరస్సునిచి నామెడచుట్టు లతామనోజ్ఞ బా
హాయుగళంబు సేర్చి చెలియా! నునుఁ గెంజిగురాకువా తెఱల్
పాయని వేడియూర్పులకు వాడఁగ నీకనుదోయినుండి యే
లా యిటు లశ్రువారికణములన్ వెడలించెద వేకధారగా ?

ఒక్కొకటై ధారగా వెడలుచుండిన నీ నయనాశ్రుమాలకున్
డక్కిన నా యురస్సు, శయనస్థలమున్, మసృణంబులైన నీ
చెక్కులుఁ, జెల్వముం దొఱఁగి సిక్తములైనవి; యేమికారణం
బక్కట యీ నిశాంతరరహస్యవిషణ్ణతకున్ మనోహరీ ?

నీ హృదయంబునం దెపుడొ నీ చిననాఁటస్మరించుకొన్న యే
యూహలో నేఁటికిన్ ఫలమునొందక భగ్నము లయ్యెనో, ప్రియ
స్నేహము లెల్ల నిర్దయత నీయెడఁ బూనెనొ, దుఃఖబాష్పసం
దోహములన్ వెలార్చెదు కనుంగవనుండి యిదేమి నెచ్చెలీ ?

గాటపుఁ జీఁకటిన్ జగతి గన్నులు మూసిన యీ విభావరీ
వాటికలో రహస్యమగు వైఖరిఁ గాల్వలు గట్టు నీదు క
న్నీటికి నర్థమున్ దెలియనేరని నా హృదయాంతరంబు ని
ట్లేటికి రాయిడించెదు చెలీ! తుదిఁగానని తీవ్రవేదనన్ ?

బిగిసినవంతలో, గళము పీడని దట్టపుటెక్కులోఁ, గనుల్
మొగుడుపుఁ జెందఁగా, నోడ లెఱుంగని వ్యాప్తికవృత్తిలో, భుజా
యుగళమునన్ మదీయతను పూని కవుంగిట రాపువెట్టి నా
లుగు పెదవుల్ చెలీ! క్షణములో నొకటన్ గదియించె దేటికిన్ ?

ప్రోవులువడ్డ యశ్రువులలోఁ బ్రతిబింబితమైనయట్టి యీ
నీవలవంతలోఁ బ్రణయినీ! వలపే పులకించునో, తలం
పే విలపించునో హృదయమే పలవించునొ, భగ్నవాంఛలన్
జీవితమే కుమారిలునొ చెప్పఁగఁజాలనిరీతి నక్కటా !

—వఝ్ఝుల వేంకటేశ్వరకవి.



విధినిర్వహణం

[పాదుషా హిందువులను చాలా వేధిస్తున్నాడు. హిందువులు ఏమతసంబంధమైన పనిచేసినా ఓర్చేవాడుకాడు. పరవడిరోజుల్లోనూ, పుణ్యదినములందూ హిందువులు దేవాలయములలోకి వెళ్లడం అతనికి కంటగింపు.]

రంగము 1.

(రాచమంటపముమీద పరివేష్ఠుతై పాదుషా ఆయన అంతరంగికమంత్రి మహమ్మద్ ఖాన్ వజీరు ప్రవేశం.)

పాదుషా

మహమ్మద్ ఖాన్! విశేషాలేమిటి?

మహమ్మద్ ఖాన్

సామ్రాట్! నేడు కాఫరులకు చాలాగొప్పపుణ్య దినము.

పాదుషా

ఏం విశేషంగా చెబుతున్నావు? నాకాసంగతిది వరకే తెలుసు.

మహమ్మద్ ఖాన్

జహాపనాహ్! కాఫరుల పండుగరోజులన్నీ ఏలిన వారికి కంటకంగదా!

పాదుషా

అందులకు నన్ను నీవు పొగడవలసిన పనిలేదు. హిందువులు మతకార్యాలు చేస్తున్నారంటే నాశరీరం దహించుకుపోతూంటుంది. ప్రవర్తమతాన్ని గురించి వాళ్ళకింతవరకు తెలియకపోయినందుకు నాకు వాళ్ళను చూస్తే అసహ్యం.

మహమ్మద్ ఖాన్

జహాపనాహ్! వారికి అభిమానగర్వాలుకూడా ఎక్కువ. వాళ్లు.........

పాదుషా

ప్రస్తుతం మనకది అనవసరం. నేటికిగాను క్రొత్త పన్నాగమేమయిన పన్నావా?

మహమ్మద్ ఖాన్

చిత్తం. దిలేరుఖానుణ్ణి తగిన సైన్యంతో పోయి మల్లిఖార్జునస్వామి ఆలయాన్ని చుట్టవేయుమని, మనిషి పురుగును లోనికి రానీయవలదని ఆజ్ఞాపించాను.

పాదుషా

మంచిపనిచేశావు. ఎన్నిచేసినాకాని ఈపరమ మూర్ఖులు మనవశం కావడంలేదు. సామభేదోపాయాలు పూర్తిగా వర్జించి దండోపాయం అవలంబించాలి.

మహమ్మద్ ఖాన్

చిత్తం. ఆలాగని తమ ఈ సేవకుడు ప్రభువువారితో ఇదివరలోనే అనేకమాట్లు మనవిచేసుకున్నాడు.

పాదుషా

అవును. అవసరంవచ్చినప్పుడు నీచేతనే ఆఉపాయం అవలంబింపచేస్తాను. ఆదెబ్బతో హిందూకీటకం నారాజ్యంలో ఉండకూడదు. అల్లా ఆరోజు ఎప్పటికి ప్రసాదిస్తాడో!

మహమ్మద్ ఖాన్

జహాఁపనాహ్! తమ అనుగ్రహం ఉండాలిగాని ఆరోజు అల్లా త్వరలోనే......

పాదుషా

ఈపాటికి దిలేర్‌ఖాన్ దేవాలయ ప్రాకారాన్ని చుట్టి ఉంటాడా?

మహమ్మద్ ఖాన్

చిత్తం.

పాదుషా

కనక ఒక్క మానవుడైనా నేడా దేవాలయ ప్రవేశం చేయలేదన్నమాట! ఇకముందు వీలే లేదు.

మహమ్మద్ ఖాన్

చిత్తం.

(ప్రవేశం సేవకుడు సలాంచేస్తూ)

సేవకుడు

జహాఁపనాహ్! వజీరు మయిస్తఖాన్ సాహెబు తమదర్శనాన్ని కోరుతున్నారు.

పాదుషా

రమ్మను.

మయిస్తఖాన్

(ప్రవేశించి) సలాం ఆలేఖుం....

(వంగి సలాంచేస్తాడు.)

పాదుషా

(సలాం అందుకుని) వచ్చినపని?

మయిస్తఖాన్

ప్రభూ! నేడు హిందువులకు పరవశిరోజు. మహాశివరాత్రి.

పాదుషా

అవును. తెలుసును నా కాసంగతి.

మయిస్తఖాన్

దేవా! మల్లికార్జునస్వామి ఆలయములోకి హిందువులను మనసిపాయీలు రానివ్వడంలేదని గోలపెట్టుతున్నారు హిందువులు. అట్లని...

పాదుషా

అట్లని మాఆజ్ఞ. నీవెవ్వడవు దానిని ప్రశ్నించడానికి?

మయిస్తఖాన్

తమ పాదసేవకుడను. కాని ప్రశ్నించరాలేదు. సామ్రాజ్యక్షేమము......

పాదుషా

కాఫర్! అనవసర ప్రసంగం చేయక.

మయిస్తఖాన్

మహాప్రభూ! హిందువులు మీ పుత్రులవంటివారు. వారు మీకు ఎడమకన్నులు వారిసౌభాగ్యమే మీసౌభాగ్యము

పాదుషా

ఏమిటి? నాసేనలో మహమ్మదీయసామ్రాజ్య ద్రోహులున్నారని నాకు ఇంతవరకు తెలియలేదు.

మయిస్తఖాన్

స్వామి నేను ద్రోహినికాను. మహమ్మదీయ సామ్రాజ్యంకోసం నారక్తం ధారపోస్తాను. ద్రోహమనేమాట నాచెవుల వినలేను.

పాదుషా

హిందువులపక్షం మాట్లాడడానికి నీవు కాఫరువా?

మయిస్తఖాన్

స్వామీ! కాదు. తమ ఈసేవకుడిపూర్వులు మహమ్మదీయులై చాలారోజులయింది.

మహమ్మద్ ఖాన్

జహాఁపనాహ్! ఈ మతావలంబికి కాఫర్ వాసన వదలలేదు.

మయిస్తఖాన్

స్వామీ కాదు ఆమతవిషయసంబంధమేమియు నారక్తమందులేదు. మహమ్మద్ ఖాన్ వజీరు పూర్వులు మహమ్మదీయులు కాకమునుపెప్పుడో నాపూర్వులు ముసల్మానులయినారు. కాని ప్రస్తుతం హిందువులక్షేమం విచారిస్తేనే సామ్రాజ్యానికి క్షేమమని నా అభిప్రాయం.

పాదుషా

కాఫర్! నీవు ద్రోహివి. మహమ్మద్ ఖాన్! ఈ ద్రోహి శిరచ్ఛేదంచేయించు.

మహమ్మద్ ఖాన్

చిత్తం.

మయిస్తఖాన్

స్వామీ! ఈ సేవకునికి ఆశీస్సుఅవసరం. తమ ఆజ్ఞానువర్తియై నడువగలవాడు. అభిప్రాయంమాత్రం మనవిచేసుకున్నాడు. తమయాజ్ఞకై వేచియున్నాడు.

పాదుషా

ఆ! జ్ఞాపకంవచ్చింది. మహమ్మద్ ఖాన్! ఈ మయిస్తఖాన్ నేవెళ్లి ఆదేవాలయప్రాకారందగ్గర కాపలా కాయవలెను. ఆపనులలో తిరిగేవాడే కాని కాఫరుల యందు అభిమానముపోదు.

మహమ్మద్ ఖాన్

జహాపనాహ్! మీఆజ్ఞ నిర్వర్తింపబడుతుంది. కాని నావిన్నపం ఈకులద్రోహి విధి సరిగా నిర్వర్తిస్తాడాఅని?

పాదుషా

మూర్ఖుడా! నాభుజపరాక్రమముముందు నాఆజ్ఞ జవదాటినవాడికిగతి ఏమవుతుందో ప్రపంచంలో అందరికీ తెలుసు. ఆమరుక్షణం వాడి మెడమీద తలఉండదు.

మహమ్మద్ ఖాన్

చిత్తం. మీఆజ్ఞ అనుల్లంఘనీయమే. కాని కాఫరు అభిమాని......

పాదుషా

మయిస్తఖాన్! వెళ్లు. దేవాలయందగ్గర కాపలా కాయి. మానవకీటకం దేవాలయప్రవేశంచేసిందంటే నీప్రాణం నీదికాదు. మహమ్మదీయుడు దేవాలయప్రవేశం చేయడు. చేయకూడదు. హిందువులు అక్కడకు రాకూడదు. తెలిసిందా? ఈఆజ్ఞ మీరినవాడికి, కత్తివేటే ఫలితం. నిర్వహణములో ఏమాత్రం లోటుకలిగినా నీప్రాణాలమీద ఆశవదులుకోవలసిందే.

మయిస్తఖాన్

చిత్తం. ఈసేవకుడు యజమాని ఆజ్ఞ ఉల్లంఘించడమనేది ఎరుగడు. ఇహముందు ఆపని జీవాలలో చేయలేను. ఎవ్వరూ లోపలికిపోకూడదని ఆజ్ఞ.

పాదుషా

అవును. ఆదేవాలయం. పో, ప్రయత్నిస్తే నీకత్తి కెర చేయవచ్చు.

మయిస్తఖాన్

చిత్తం. (సలాంచేసి వెళ్లిపోవును)

రంగము 2.

(దేవాలయప్రాకారసమీపప్రదేశం. ప్రొద్దున 8 గంటలప్పుడు)

(ప్రవేశం మయిస్తఖాన్ గేటుకాపలా కాస్తూ. పలువురు బ్రాహ్మణులు నీరుకావిధోవతులు, తడి కొల్లాయిగుడ్డలు, విభూతి పెండెకట్లతో)

ఒకటవ బ్రాహ్మణుడు

మమ్మల్ని లోపలికి పోనిస్తావురా?

మయిస్తఖాన్

చిత్తం. పోనీయకూడదని పాదుషావారి హుకుం.

రెండవ బ్రాహ్మణుడు

అవును. పాదుషాకు అంత్యకాలము సమీపించింది. చెట్టు చెడేకాలానికి కుక్కమూతి పిందెలంట.

మయిస్తఖాన్

మీరు బ్రాహ్మలు. రాజద్రోహమయిన మాటలు మీరు మాట్లాడకూడదు. నేను వినకూడదు.

మూడవ బ్రాహ్మణుడు

ఆనీచు డింతకింత అనుభవించడా!

మయిస్తఖాన్

మీరలాఅంటే నేను ఊరుకోను. మళ్లీ పాదుషాను ఏమన్నాఅంటే నాకత్తి తీయవలసి వస్తుంది. మీకు మాటలేవద్దు తప్పుకాని, ఒప్పుకాని పాదుషాఆజ్ఞ నిర్వర్తించకతప్పదు. మీరు పాదుషాను నాఎదుట తిట్టినా, ఈలోపల అడుగు పెట్టినా మీప్రాణాల మీద ఆశ వదలుకోవాలె.

నాల్గవబ్రాహ్మణుడు

మహమ్మదీయత్వం మూర్తీభవించినట్లుందే. పోదాం పదండిరా లోపలికి. ఏంచేస్తాడో?

మయిస్తఖాన్

స్వాములు. మూర్ఖించవద్దు. ఆపైన పశ్చాత్తాపపడి లాభంలేదు. బ్రాహ్మలుకనుక చెబుతున్నా. ఏమాత్రం అఘాయిత్యంచేసినా లాభంలేదు.

రెండవ బ్రాహ్మణుడు

మేం వెళ్ళితే లోపలికి.

మయిస్తఖాన్

కేవాలతో వెళ్ళరు.

మూడవ బ్రాహ్మణుడు

అంతసాగరా! శరీరబలముందని.

మయిస్తఖాన్

వృధా వాక్కలహము స్వామి! ఈదారినే రావద్దు. ఆచుట్టుప్రక్కల వచ్చినవాళ్ళనే కేవాలలో ఉండనీయకూడదని పాదుషావారి హుకుం. ఇక్కడ ఇంత మందినిచూస్తే నాఆకోరుదక్కదు. మంచిగా చెబుతున్నాను. వెళ్ళండి.

మొదటిబ్రాహ్మణుడు

మంచిసాయిబురా! మరోసాయిబయితే మనం ఈపాటికి ఎక్కడ ఉండేవాళ్ళమో. మనయిళ్ళల్లోనే పూజచేసుకుందాం. భగవంతుడంటూవుంటే న్యాయం కలగక పోతుంది. రండి. (అంతాకలసి వెళ్ళుతారు)

మయిస్తఖాన్

(స్వగతం.) మా పూర్వులు హిందూమతంలో ఎప్పుడుఉన్నారో? వీళ్ళావాళ్ళా ఏమాత్రం పోట్లాడుతున్నా నే కోర్చలేను. ఇదీ నాదురదృష్టమే. ఈ రోజు నా నెత్తికి నేనే తెచ్చుకున్నాను, మంచికిపోయి ఈకాపలా. పాదుషాకుతోడు ఈమంత్రులుకూడాను. సగం వీళ్ళు చెడగొడుతున్నారు హిందూమహమ్మదీయ సామరస్యాన్ని. అక్బరుషాగారి తెలివితేటలు వీళ్ళకెవళ్ళకీ లేవు. పాదుషా మనస్సుకు మనమాటలు రుచిస్తవీ? (అంటూ కాపలా కాస్తున్నాడు)

రంగము 3.

(పాదుషా ప్రాసాదం. పాదుషా హుక్కా పీలుస్తూ కూచుంటాడు.)

ప్రవేశం మహమ్మద్ ఖాన్.

మహమ్మద్ ఖాన్

జహాపనాహ్! సలాం అలేఖుం (సలాంచేస్తాడు)

పాదుషా

మంచిది. విశేషాలు?

మహమ్మద్ ఖాన్

ఈసేవకుడు ఉదయమే మనవిచేసుకున్నాడు మయిస్తఖాన్ సరిగా ఆజ్ఞ నిర్వహిస్తాడో లేదో అని.

పాదుషా

(కోపంనూదించే నేత్రాలతో) ఏం! ఇప్పుడేం జరిగింది?

మహమ్మద్ ఖాన్

కొంతమంది కాఫర్లను అతను లోనికి పోనిస్తున్నాడని చెప్పుకుంటున్నారు. కొంతమంది బ్రాహ్మలు అతని చుట్టూ మూగి మాట్లాడుతూండగా నాసేవకుడు కళ్ళారా చూశాడు.

పాదుషా

ద్రోహి. పరమనీచుడు. పాదుషాఆజ్ఞనే మీరడమా? అంతధైర్యమా ఒకసామాన్యవజీరు మాత్రునకా? వాణ్ణి చిత్రవధ కావింపవలసిందే. అందలి నిజానిజములు తెలిసి తగినపనిచెయ్యి, వెళ్లు.

మహమ్మద్ ఖాన్

ఏంచెయ్యమని సెలవు?

పాదుషా

ముందు నిజానిజములు తెలుసుకో. పో. వెళ్ళు ముందు నాసుంకోనుంచి. నీయిష్టంవచ్చినట్టు చెయ్యి తర్వాత.

మహమ్మద్ ఖాన్

చిత్తం. (సలాంచేసి సగర్వంగావెళ్ళుతాడు).

రంగము 4.

(కోజల్లా ప్రాకారందగ్గరకు వెళ్ళవచ్చే బ్రాహ్మణులే. బ్రాహ్మణులుకొందరు ప్రాకారం దగ్గర నుంచి తిరిగివస్తుంటారు. మధ్యాహ్నం రెండుగంటలు కావస్తుంది. మహమ్మద్ ఖాన్ మయిస్తఖాన్ మీదికి కాపలాకు వెళ్ళుతుంటాడు)

ఒక బ్రాహ్మణుడు

కాపలాసాయిబుగారు చాలమంచివాడల్లె ఉంది సుమా.

మరియొక బ్రాహ్మణుడు

మెల్లిగా అంటావేం! ఎవళ్ళోగాని అటువంటి వాళ్ళు ఉండడం అసహజం.

(మహమ్మద్‌ఖాన్ విన్నాడు. తలఊగిస్తూ లోం దరగా ప్రాకారందగ్గరకు నడుస్తున్నాడు)

వయిస్తఖాన్

(స్వగతం) ఎందుకు చెప్తా మహమ్మద్‌ఖాన్ వజీరు వస్తున్నాడు? నామీద కాపలాకాబోలు. పాదుషా ఆంతరంగికంగాఉండి, చేసేదంతా వీడే. నేను కాఫరు నన్నాడు. వీడితాతలుగాదూ మహమ్మదీయమతంలో కలిసింది? వీడి పూర్వులెరుగరు మానాళ్ళప్పుడు కాఫర్లయిందిన్నీ. మనం మనం సఖ్యంగాపోవడం మంచి దంటే నాకు కాఫర్లంటే అభిమానమని అర్థమా? వాళ్ళవీళ్ళ తలకాయలుపగలుగొట్టుకొని చావవల సిందేనంటే నిగ్గుదేలిన మహమ్మదీయుణ్ణా. వీడు ఊరికేరాడు. ఏదో ఎత్తుగడే (పెద్దగా) వజీరు సాహెబు! సలాం.

మహమ్మద్‌ఖాన్

లోపలినించి బ్రాహ్మలు వస్తున్నారు. వాళ్ళను లోపలికి పోనిచ్చావు?

వయిస్తఖాన్

(కోపంవచ్చి ఎఱ్ఱనయిన కళ్ళతో) అవునా! నీవు చెప్పినవాళ్ళు అబద్ధీకులు.

మహమ్మద్‌ఖాన్

బ్రాహ్మలు అనుకున్నమాటలు నేనే విన్నాను.

వయిస్తఖాన్

(కోపంతో) ఏమని......? ఇదివరలోనే చెప్పాను నేను ద్రోహినికానని. పాదుషా ఆజ్ఞలను ఎదిరించ గలిగిన సాహసం నాకులేదు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు నటించడం మావంశంలో ఎక్కడాలేదు.

మహమ్మద్‌ఖాన్

అనవసరప్రసంగం చేస్తున్నావు. తలుచుకుంటే నిన్నేమైన చేయగలను. లోపలికి బ్రాహ్మలను పంపి మాటలతో మోసంచేయడానికి చూస్తున్నావు.

వయిస్తఖాన్

నీకు జవాబుచెప్పవలసిన బాధ్యత నాకు లేదు. పాదుషావారి హుకుంప్రకారని ఇక్కడున్నాను. ఆజ్ఞ నిర్వర్తిస్తున్నాను.

మహమ్మద్‌ఖాన్

నీయింకా నిలబడి మాట్లాడడం నాదేతప్పు. నీవు లోపలికి బ్రాహ్మలను పోనిచ్చావు. దీనికి సమాధాన మేమిటి?

వయిస్తఖాన్

పాదుషావారికే నాసమాధానం.

మహమ్మద్‌ఖాన్

అల్లాకు గూడానూ. ఇంకా లోపల బ్రాహ్మలు గూడా ఉంటారు. నేను లోపలికివెళ్ళిచూడాలి.

వయిస్తఖాన్

వద్దు. మానవుణ్ణి లోపలికి పోనీయవద్దని పాదుషా వారి హుకుం అక్షరాలా జరిగితీరవలసిందే.

మహమ్మద్‌ఖాన్

కండకావరం! పాదుషావారే నన్నువెళ్ళి నీచర్యపరి శీలించమన్నారు.

వయిస్తఖాన్

వారిహుకుం?

మహమ్మద్‌ఖాన్

పాదుషావారి హుకుం నాకక్కర్లేదని నీకూ తెలును.

వయిస్తఖాన్

పాదుషావారిహుకుం నాకుమాత్రం కావలె. లేక పోతే కదలడానికి వీలులేదు.

మహమ్మద్‌ఖాన్

నీతో వాగ్వివాదం అనవసరం. నీ ఈకారుకూతలు చూస్తే నీవు అనుమానించవలసినమనిషివే. లోపల బ్రాహ్మలే ఉన్నారేమో!

(అని రెండు అడుగులు లోపలికి వేస్తాడు)

మయిస్తఖాన్

అవును. "మరో మతద్రోహి" అని ఎవరైనా చూపి ఇంకా బహుమతులు పొందాలని ఇది నీ స్వప్రయత్నమే నాకు తెలుసు. కదిలావా బ్రతుకుమీద ఆశ వదలుకోవలసిందే.

మహమ్మద్ ఖాన్

(కళ్ళు ఉరుముతూ) ఆ! ఏంచేస్తావు?

మయిస్తఖాన్

మరోమాటు చెబుతున్నాను. మానవకీలకం ఈ హద్దుదాటి పోకూడదు. పాదుషా వారిహుకుం అది. నీ విదివరకే రెండడుగులు వేశావు. ఇంకో అడుగువేస్తే నీప్రాణం నీది కాదు. తరువాత అనుకొని లాభంలేదు.

మహమ్మద్ ఖాన్

(మరో అడుగు వేస్తాడు)

మయిస్తఖాన్

పో! వెనక్కు.

మహమ్మద్ ఖాన్

(మరో అడుగు వేస్తాడు)

మయిస్తఖాన్

పో!! వెనక్కు.

మహమ్మద్ ఖాన్


(మరొకఅడుగు వేస్తూ) నేను వెళ్ళను.

మయిస్తఖాన్

(కత్తి ఎత్తి మహమ్మద్ ఖాన్‌ను రెండుతుండాలుగా నరుకుతాడు).

— తెరవాలుతుంది.

— మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ.



జానకి

సుందరాంగుల నెందరజూచియున్న
జానకీ! ఆత్మనిల్చు నీమానసంబె!
చోద్యముగ మింట నలరారు చుక్కలున్న
చందమామయె మదికెక్కు చందమునను!
చిత్తసీమ జీకటిరీతి చింతగప్ప
వలపు వెన్నెల బచరించి తొలగజేతు,
వాకసంబును దలపులు తాకుచుండ
హృదయ ముప్పొంగు జలనిధియేచులీల!
చెలియ! నీయాత్మ నలరారువలపుకలిమి
లలితమౌ పూలవాసనవలె చెలంగు;
సంతసమొసంగు చంద్రుని కాంతియట్లు
చల్లనై హాయిగలిగించు నుల్లమునకు!
పక్షిపలుకులు తెలుపు నీపలుకుతీపి,
జిగివసంతంబు తెల్పు నీసొగసుతెరగు,
వెన్నెలలు తెల్పు నీయెదనున్న కరుణ,
పరిమళము తెల్పు చెలియ! నీవలపుపొలుపు!
కడుమనోహరమగునట్టి కథలయందు,
తనువుమసవంగజేయు సందములయందు
విమలమాధురీకలితగానములయందు,
మానినీ! తోచుచుందువు మానసమున!
అలఘుసుఖమిడు నీపైని కలుగుతలపు,
నిర్మలంబగు నీయందు నిలచువలపు,
చెలియ! నినుగూర్చి గలిగెడు తెలివికలలు
అతిపవిత్రము లతిమనోహరము లగును!
తరుణి! నాచిత్తమనియెడు దర్పణమున
బింబితంబగు నీముఖబింబ మెపుడు,
తలపులేవేళ యెన్ను నీవలపుకలిమి,
చేడరో! నీదు ప్రేమయే జీవనంబు!
మదిని నిను నిల్ప శోకంబుమాయమగును,
స్వాంతమున నిండు నొకవింతసంతసంబు,
పొడము నుత్సాహ, మవ్వేళ పూని సేతు
గొప్పకార్యంబులను సానుకూలముగను!

—అధికార్ల సూర్యనారాయణరావు, బి.ఎల్.

జోన్ ఆఫ్ ఆర్క్

౧

ఫ్రాన్సుదేశంబు పుణ్యంబు పండెఁ, ఆ
రాజకంబయి దేశ మాంగ్లప్రభుత్వ
వదనగహ్వరాన గుటకపడెడి వేళ
నడ్డు పడగ 'జోనాఫార్క్' అవతరించె.

ఈయిల ఆమెయే అవతరించకపోయిననాడు ఫ్రాన్సుదే
శీయులు దాస్యశృంఖలలె హిందువులట్లు వహించియుందు వా
రేయనిపించుఁ దేశమననేమొ, తదీయస్వతంత్రతాపదం
బేయదిరో, బిరాన చవి యిచ్చెఁ దామె సహోదరాళికిన్.

వలువ ధరించి బీరపువ్వువంటిది పచ్చికబైళ్ల గొఱ్ఱె గుం
పులు మరలించు బాలిక ప్రబోధితయైనది యీశ్వరాజ్ఞచే
"నిలువుము దేశరక్షణకు నీయనుజన్ములతో" యటంచు మే
ల్కొలుపు ధ్వనించె నామెయెదలో ఒక దైవికవాణి యేదిరో.

బారెడు పొగవెండ్రుకలపాయలు వీలుగ కత్తిరించి శృం
గారవిరక్తబాలకుడునా తనవేసముదిద్ది తీర్చి తా
నే, రణసీమ సేన నడిపించెనటే, మగవాని గుండెలో
నీరసమైన రక్తము ఘనీభవమై ధృతిపెంపు శోభిలన్.

అలవికిమీరిపోయిన తదద్భుతశౌర్యముతో నెదుర్కొనన్
దలకి, అసూయచేత ప్రమదామణి 'దయ్య' మటంచు తచ్చరి
త్రల విరచించుకొన్న అరిరాజుల యాలఘుచిత్తవృత్తులే
వెలువడెఁగాక, ఇంత కొదవే! రమణీకమనీయకీర్తికిన్.

మాతృదేశాభిమానంబు మంటఁ గలిపి పరులఁగలసిన 'గాస్కానీ' ప్రజలు గూడ
ఆ శుభాంగిని ప్రస్ఫుటాస్యంబుఁ జూచి నవుడు మొగమెత్తలేక సిగ్గుపడలేదె?
పసితనపుసౌకుమార్యంబు వదలనట్టి మొగ్గవయసున మానవస్మృతిపథాల
వ్రాసికొన్నది పేరు కీర్త్యక్షరముల నువిద, కాలాన మాసిపోకుండు నట్లు.

౨

అట్టి తేజస్వినీకోమలాంగకములు
కాలి, మసియయ్యె, నాంగ్లుల కరకుచేయి
పేర్చిపెట్టిన చితిమీద; వీరయువతి
కెట్టి దుర్మరణంబు ప్రాపించె నకట!

బ్రతికిన నాల్గురోజులును వైరులగుండెలలోని బల్లెమ
ట్ల తపరినట్టి వీరనవలామణి, ఈశ్వరునాజ్ఞగాఁ దలం

చి, తనదు మాతృదేశమును సేవయొనర్చిన భక్తురాలు, ఆ
చితిపయిఁ బ్రాణసంపుటి త్యజింపఁగ నున్నది ధైర్యమూర్తియై.

వైరుల యీర్ష్యచే రగులఁబడ్డది యా చితిమీఁది నిప్పుఁ జ
ల్లారుప లేదు జాలి కనులన్ స్రవియించిన అశ్రుధారలై
నా, రమణీ తనూవిలసితాచ్ఛమనోహరమార్దవంబు నిం
డారు కవుంగిటన్ పొదివినట్టివిపో అరుణాగ్నికీలికల్.

ఇంచుక, కాలు, చేయిఁ గదలించుటకైనను వీలుగాక, బం
ధించినఁగూడ, నిప్పు సెగ కెట్టిమనఃపరితాపఖేదముల్
గాంచదమేమి! యాలలితగాత్రి విలోకనమందు దేశసే
వాంచితదివ్యతైజసముహాసము తెల్లముగాఁ బ్రకాశిలున్.

అతిక్రూరంబయి రేగి పైకొనెడి యాయగ్నిచ్ఛటల్ క్రమ్ముకో
న్నంతరిన్, బాలిక తమిన్నపూవుటాడిలోనన్; నవ్వుమోమెత్తి సు
స్థితయై నిల్చెడి ధైర్యసంతృప్తయన మించెన్, దేశభక్తిప్రభో
ధిత నేత్రద్వితయంబు శాంతరసనందీప్తంబులై శోభిలన్.

ఆచితినుండి వ్యోమముఖమై యెగఁబ్రాకిన ధూమరేఖల
న్నీ, చిరుమబ్బులై నలువునిండినవై, అనిశంబు ముక్తకం
ఠోచితవాక్యముల్ చదువుచున్నవి వైరుల దుర్యశంబు, ఆ
నీచతమప్రవృత్తి యవనిన్ చిరకాలము నిల్చిపోవఁగా.

3

ఫ్రాన్సుదేశాన నొకచిన్న పల్లెటూరు
ఆ లతాంగి జన్మస్థానమయి వెలుంగు;
ఆమె చిరుపాదములయచ్చు లచటి మేలి
పొలములును తమ గర్భసీమలనె దాచు

కొని పులకరించు వర్షాలు గురిసినపుడు; ప్రతివసంతసమోదయావసరమందు
నాతితోఁగల తమచిన్ననాటి చెలిమి నచటి యారామతరులెల్ల అడవిపూలు
రాల్చుచున్నవి ఆమోదరసము చింద; అచట నొకక్రేవ లోయలో, అలసగతిని
పారుచున్నట్టి 'మ్యూను' నదీరవాలు తరుణివీరప్రశంసాకథానకములు—

మరుగు పడలేదు మానినీమహితసత్క్రి
యాకలాపంబు నేటికి నచటి నిర్మ
లప్రశాంతవాయుతరంగలాస్యములనె
వ్యక్తమగుచున్న దామె ధైర్యప్రశస్తి.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

మేక పాలు

పాల బీదతనము : శిశుమరణములు.

హిందూదేశము నందలి ప్రసూతివైద్యశాలలలోని లెక్కలను పరిశీలించితిమేని ఈదేశపు శిశువు జన్మకాలమున పొడుగులోకాని, తూనికలోకాని ప్రపంచము నందలి మఱి యేదేశపుశిశువులకును తీసిపోకుండుట తెలియవచ్చుచున్నది. స్థితి ఇట్టిదికాగా హిందూదేశమున శిశుమరణముల సగటుసంఖ్య ఇతరదేశములందలి సంఖ్యకంటె మిక్కిలి హెచ్చుగానుండుటకు కారణమేమి? పాలిచ్చుటమాని అన్నముపెట్టుటకు ప్రారంభించు కాలముననే మనదేశమున శిశువులు విశేషముగా మృత్యుదేవత పాలబడుచుండుట లెక్కలు చెప్పుచున్నవి. అన్నప్రాశముచేసి శిశువులకు తల్లిదండ్రులు తిను ముతకఆహారమునే పెట్టుటతో వారిజీర్ణకోశము పూర్తిగ పాడై వారు రోగములపాలగుచున్నారు. పాలనే ఆహారముగ మఱికొంతకాలము శిశువులకు ఇచ్చియుండుచో వారిట్లు అకాలమున మరణింపకుందురు. పాలే ఆహారముగ మఱికొంతకాలము ఏల శిశువులకు ఈయలేదని మనము హిందూదేశపు మాతలను ప్రశ్నించుచో వారు పాలుదొరకుట కష్టమగుటయే ఇందుకుకారణమని చెప్పుదురు. పాలకుగల గిరాకీచే సామాన్యసంసారులు తమశిశువులను సాధ్యమైనంత త్వరలో పాల ఆహారమునుండి తప్పించి వారికి అన్నప్రాశనము గావించుచున్నారు.

మేక 'పేదవాని ఆవు'

అసలు క్షీరవిషయము ఇపుడు భారతదేశమున నొక పెద్ద సమస్యగానున్నదని ఒప్పుకొనకతీరదు. పాలు సమగ్రమైన ఆహారము. ఇట్టి సమగ్రమైన ఆహార సంపాదనార్థము భారతీయులు ప్రస్తుతకాలమున ప్రత్యేకశ్రద్ధనుచూపి గోసంరక్షణకు గడంగవలసియున్నదని మాలవ్యాపండితులు మొదలగు నాయకమహాశయులు పత్రికలలో చేయుచున్న హితబోధ ఎంతయు ఆచరణీయమై యున్నది. పాలకొఱకు ఆవును పెంచుటకంటె మేకనుపెంచుట ఎక్కువ లాభకరమని ఎ. ఇ. స్లేటరు మొదలగు మహాశయులు చెప్పుచున్నారు. హిందూదేశము నేడు పేదతనమున మ్రగ్గుచున్నది. పేదవారికి ఆవును పెంచుటకంటె మేకను పెంచుట సులభము. మేకను 'పేదవాని ఆవు' అని పిలుచుటయు గలదు. మాంటిగోమరీ, సింధియా, ఒంగోలు మొదలగు జాతి ఆవులు-పుష్కలముగ పాలిచ్చుభారీజాతివి - వరణీయములే. కాని వానిని పెంచుటలో విశేషధనవ్యయమగును. ధనికులగువారికిగాని అవి సామాన్యులకు అందుబాటున నుండవు. అవి దినమునకు ఇచ్చు పది, పన్నెండు సేర్ల పాలును సామాన్య సంసారముల అక్కరకు మించును. దినమునకు మూడు, నాలుగు సేర్లపాలు ఉండిన సామాన్యసంసారములకు చక్కగ సరిపోవును. సాధారణజాతి ఆవు దినమునకు ఈమాత్రపుపాలను ఈయగలదు. మంచిజాతి మేక కూడ దినమునకు ఈమాత్రపుపాలను ఈయగలదు. కాని రెండింటిని మేపుటలో ఆవువిషయమునకంటె మేక విషయమున కష్టము, ఖర్చు తక్కువ. ఆవు ముట్టని పెక్కు ఆకుఅలములను మేకతినును; కనుక మేపుటలో మేకవిషయమున ఖర్చుతక్కువ. పచ్చిమేతకు తోడు పాలిచ్చుదినములలో మేకకు దినమునకు సేరువంతున పప్పు, తౌడు మొదలగునవి ఇచ్చిన చాలును. ఒక్క ఆవును మేపుటలో అగు ఖర్చుతో ఐదుమేకలను మేపవచ్చునని ఎ. ఇ. స్లేటరుమహాశయుడు చెప్పుచున్నాడు. మేకలను పెంచుటకు పచ్చికబయళ్లుకూడ అవసరము లేదు. ఫ్రాన్సు, బెల్జియము, డెన్మార్కు మొదలగు దేశములందు ప్రతి యంగుళస్థలమును వ్యవసాయభూమియై యున్నది; అచ్చటి పొలములు మనదేశములందువలెనే ప్రాయికముగా ఖండఖండములై యుండును. అచ్చట విశాలములైన పచ్చికబయళ్లు లేనేలేవు. కాని ఆదేశములందు మేకల పెంపకము హెచ్చు. అచ్చటి మేకలు ఏడాదిపొడుగునను దొడ్లలోనే ఉండును.

వానికి ఆహారమంతయు అక్కడనే ఇత్తురు. మేకలై బయటకు పోనేపోవు. ఇట్టి పరిస్థితులలోకూడ అచటి మేకలు పాలబీదపడవు; వాని ఆరోగ్యమును చెడదు. ఎదిగెడుచెట్లను, చిట్టియడవులను నాశనముచేయుమారిగా మేకనుచూచువారు మనదేశమున కొందరుగలరు. వారు డెన్మార్కు, బెల్జియము మున్నగు దేశములందలి మేకలపరిస్థితులు గమనించిరేని మేక ఎదిగెడుచెట్లను, చిట్టియడవులను నాశనముచేయు మారిగానుండ చేయనగుటను అంగీకరింపగలరు.

కొన్ని మేకజాతులు

హిందూదేశమునందు శ్రేష్ఠమైన మేకజాతులు కొన్నిగలవు. వాని విలువను ప్రజాలోకముగుర్తించియున్నది. సంయుక్తపరగణాలయందు 'జమ్నా పారి' యని పిలువబడు ఒకజాతి మేకలుగలవు. ఆజాతి మేకలలో మంచివి దినమునకు నాలుగు మొదలు నాలుగున్నరసేర్లవఱకును పాలిచ్చును. ఆ పరగణాలయందే 'బార్బరి'యను మఱియొకజాతి మేకలుగలవు. బుఱ్ఱి ఆవులవలె ఈజాతిమేకలు చిక్కాలి పొట్టిగనుండును. ఈజాతి మేకలలో మంచివి రోజుకు నాలుగుసేర్లపాలు ఇచ్చును. బొంబాయి రాజధానియందు 'సుర్తి' యని పిలువబడు మఱియొక ప్రశస్తమైన మేకజాతిగలదు. జమ్నాపారిజాతిమేకల ప్రాశస్త్యము భారతదేశమునకు బయటనుగూడ వెల్లడియైయున్నది. సంయుక్తపరగణాలయందలి వెటినరీశాఖవారీవడుము జావాద్వీపమునకు ఈజాతిమేకలను రెండు పెద్ద ఓడలయందు ఎగుమతి చేసియున్నారు. 'జమ్నాపారి'జాతి మేకపోతులు లోగడ హిందూదేశమునుండి ఇంగ్లాండుదేశమునకు ఎగుమతిచేయబడినవి. అవి ఆదేశమున క్రొత్తజాతిమేకల ఉత్పత్తికి కారణభూతులైనవి. ఈక్రొత్త జాతికి 'యాంగ్లో-నూబియన్' జాతియనిపేరు ఉంచబడినది.

అమెరికాదేశమున ఆవుపాలకంటె మేకపాలకు వెలహెచ్చు

గుణవిషయమున ఆవుపాలను, మేకపాలనుపోల్చి పరిశీలించితిమేని కొన్నిమంచిసంగతులు వెల్లడికావచ్చును. మేకపాలనిన మనము ప్రియముపడము. కారణము గుణవిశేషమున ఆవుపాలకు మేకపాలుతీసిపోవునను దురభిప్రాయము మనలో ప్రబలియుండుటయు, మేకపాలు ఒకవిధమైన గొల్లవాసనయు వింతరుచియు కలిగియుండుటయును. మేకపాలకు ఇట్లు గొల్లవాసనయు, వింతరుచియు కలుగుటకు కారణము మనము మేకలను పెంచుటలో అవలంబించు విధానమునందలి లోపములే అని క్లేటనుమహాశయుడు చెప్పుచున్నాడు. ఇంకను అతడిట్లు చెప్పుచున్నాడు: "ఎట్టి గొల్లవాసనయు లేకుండునట్లు మేకపాలను నేను తయారుచేసి స్నేహితులకు త్రాగుటకు ఇచ్చితిని. వారు వానిని ఆవుపాలు కావని గుర్తింపలేకపోయిరి. మేకపాలలోనుండు వింతరుచికి కారణము మేకలు చేదుగనుండు వేప ఆకులు మొదలైనవి తినుటయే అయియుండునని నా అభిప్రాయము. పాలిచ్చు మేకలమందలో పోతుమేకలను ఉంచనీయకుండినచో మేకపాలకు ఎట్టి గొల్లవాసనయు ఉండదు; అప్పుడు మేకలు వేపమొదలగు ఆకులు తినినను వానిపాలకు వింతరుచికలుగదు. ఇది స్వానుభవముచే చెప్పునదికాని అన్యముగాదు. పలుకారణములచే ఆవుపాలకంటె మేకపాలు శ్రేష్ఠమైనవి. ఈవిషయమును గూర్చి తమనాయకమహాశయుడగు గాంధీమహాత్ముని అడిగితెలిసికొనవలసినదిగా హిందూసోదరులను కోరుచున్నాను. అమెరికాసంయుక్తరాష్ట్రములందలి న్యూయార్కు, చికాగో మొదలగు పెద్దపెద్దపట్టణములందు మేకపాలు ఆవుపాలకంటె రెట్టింపు హెచ్చువెలకు అమ్ముడుపోవును. ఆదేశమున ఆసుపత్రులయందును, ఆతురాలయములయందును ఆవుపాలకంటె మేకపాలకు గిరాకీ హెచ్చు."

ఆవుపాలకంటె మేకపాలు మంచివి అనుటకు ఏడు కారణములు:

(1) ఏటేట హెచ్చుసంఖ్య మానవులమరణమునకు కారణభూతమైన వ్యాధులలో క్షయరోగమొకటి. ఆవులకుకూడ క్షయరోగము తగులుటకలదు. అట్టి ఆవులపాలు క్షయరోగమును కలిగింపగలవు. క్షయరోగకారకక్రిములు ఇంతవరకు మేకపాలలో ఉండిన

నిదర్శనములు శాస్త్రజ్ఞులకు దొరకలేదు. క్షయరోగ కారకక్రిములను నాశనముచేయుటలో మేకలు, వాని పాలు సమర్థములని ఆయుర్వేదము చెప్పుచున్నది.

(2) జీర్ణస్థితిలో ఆవుపాలు పుల్లటిగుణమును, మేకపాలు క్షారగుణమును పొందును. జీర్ణకోశము సరిగా లేనివారికి, మందాగ్నిగలవారికి పుల్లటిగుణముగల ఆవుపాలు ఆరోగ్యప్రదములు కాజాలవు.

(3) ఆవుపాలు జీర్ణమగుటకు రెండుగంటలకాలము పట్టును; మేకపాలు అరగంటలో జీర్ణమగును. అనగా మేకపాలను అరగించుటకు ఆవుపాలను అరగించుటకంటె జీర్ణకోశము నాలుగింట మూడుభాగముల తక్కువపనిని చేయవలసియుండును. జఠరాగ్ని మందగించియుండు రోగస్థితియందు మేకపాలు ఎంతగ వరణీయములో ఇందువలన సులభముగా నిర్ణయించుకొనవచ్చును.

(4) ఆవు, మేక, స్త్రీల పాలను శాస్త్రయుక్తముగా పరిశోధించినవారు ఈమూడు రకములపాలయందును పండ్రెండు విధములైన లోహసంబంధములగు లవణములుకలవని కనుగొనియున్నారు. ఈమూడు రకముల పాలలో ఏ ఒక్కదానియందును ఈ పండ్రెండు రకముల లవణములును లేవు. స్త్రీలపాలయందు ఏడురకముల లవణములు. ఆవుపాలయందు ఆరురకముల లవణములు మాత్రము ఉన్నవి. మేకపాలయందు తొమ్మిది రకముల లవణములు ఉన్నవి.

(5) ఆవుపాలలో ఇనుము అసలు లేదనియే చెప్పవచ్చును. మేకపాలలో అది కొంతవరకుగలదు. పలువురు వైద్యశిఖామణు లిట్లు చెప్పియున్నారు: "ఆవుపాలలో మరికొంచము ఇనుము ఉండియుండినచో అవి నూటికి నూరుపాళ్లుగల సమగ్రమైన ఆహారపదార్థమైయుండును."

(6) ఎముకల ఆరోగ్యస్థితికి ఫాస్ఫేటులు కావలసియుండుట అందరు ఎఱిగినదే. ఏడురకములైన ఫాస్ఫేటులవణములలో ఆవుపాలయందు 0.508 భాగములును; ఆవుకంటె మిక్కిలి చిన్నజంతువగు మేకయొక్క పాలయందు 0.319 భాగములును; స్త్రీలపాలయందు 0.096 భాగములునుమాత్రము ఉన్నవి.


(7) పొటాసియముగల లవణముల విషయమున గమనించితిమేని మిక్కిలి చిన్నజంతువగు మేకయొక్క పాలలో 0.483 భాగములు ఉన్నవి. ఆవుపాలలో 0.282 భాగములుమాత్రమే గలవు. వెబ్‌స్టరు భిషగ్వరుడు ఇట్లు చెప్పుచున్నాడు: "అన్నిపదార్థములకంటెను పొటాసియమునకు ప్రాణవాయువుతో బలమైన సంబంధముకలదు. కావున అది ఇతరపదార్థములనుండి ప్రాణవాయువును గ్రహించుటలో గొప్పశక్తిగలది. ఆవుపాలకంటె మేకపాలలో ఇనుముభాగమును, ప్రాణవాయువును అధికముగ గ్రహింపగల పొటాసియము భాగమును హెచ్చుగనుండుటచే ఇవి అన్నిపాలకంటె శ్రేష్ఠములైనవగుచున్నవి."

ఈ విధముగా రసాయనికశాస్త్రము 'పేదవానిఆవు' బలము, శక్తిగలిగి అన్నివాతావరణములకు ఎట్లు తాళగలుగుచున్నదో రూపించుచున్నది. మేకపాలు ఆరోగ్యమును కలిగించు శ్రేష్ఠమైన ఆహారమని ప్రపంచమునందలి వైద్యమహాశయులెల్లరు అంగీకరించియున్నారు.

మేకలవిషయమున మనదేశముకూడ ఇప్పుడు కొంతశ్రద్ధ చూపుచున్నది. వ్యవసాయవిచారణసంఘమువారు (లిన్‌లిత్‌గో కమీషను) హిందూదేశమున మేకల ఉపయోగమునుగూర్చి విపులముగ వివరించియున్నారు. పూనా, ఈటా మొదలగు తావులయందు మంచి జాతిమేకల ఉత్పత్తికై ప్రభుత్వపరిశోధనలు సాగుచున్నవి. హిందూప్రజలలో మేకపాల యెడగల విముఖత్వము తొలగిపోవుటతో భారతదేశమున క్షీరసమస్యయు తొలగిపోగలదు.

ఆవును పెంచుటకంటె మేకను పెంచుట సులభమగుటయు, ఆవుపాలకంటె మేకపాలు సర్వవిధముల శ్రేష్ఠములైయుండుటయు గమనించి భారతీయులు మేకలపెంపకమునకు గడంగి తమ ఆరోగ్యసంపదను పెంపొందించుకొందురుగాక యని స్లేటరు మహాశయుడు హెచ్చరించుచున్నాడు.

—ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.




కొమాళ్లకన్నతల్లి! ఊపవే ఉయ్యాల.

ప్రవాసి

తల్లిరెక్కలపొత్తిళ్ల దాగి మణగి
శాశ్వతానందనిద్రాప్రశాంతయోగ
మున కనులువిప్పి ప్రకృతిసమ్మోహనమున
కలరి కేరింతలాడు దివ్యావకాశ
మకట! నిను శత్రువుని గూటియందు దార్చె
తల్లియె విసమ్ము ద్రావించి తరలిపోయె
పికకుమారక! నీవిధిప్రేరణమున.
వాయసమె తల్లి సోదరుల్ వాయసములె
నీకు నీనిర్మలానందనిబిడమైన
మానసపథాంతరమ్ముల మలసిపోయె
అతివినిశ్చితమైన ప్రేమార్ద్రదృష్టి
చివురుగొమ్మల కంఠమ్ము జీరవోని
విశ్వమోహనమైన, నీవిమలమైన
ఆచిరుతపాట జగమెల్ల నాక్రమించె.
ఈయనంతప్రకృతి పులకరించిపోయె
కాకిగూటికి ఏంతభాగ్యమ్ము కలిగె!
కాకములమూకలెల్ల సంఘముగ జేరి
ఇది విజాతీయమనుచు గర్హించి కాళ్ల
రెక్కలను ముక్కుకొనల కేరించిపొడువ
సంధిసంధియు వ్రయ్యలై చావుదొరగి
ఆసలే లేని విశ్వగాయకుడవయ్యొ
ఆయగమ్యనిశానిబిడాంధఘోర
గహనములబట్టిపోయితే కాలవికృతి.

— ఊటుకూరి సత్యనారాయణరావుబహద్దరు.



టిరనీ

గోవిందరావును ఒక్కసారిగా నిరుత్సాహం, నిరాశ, నిస్పృహా ముంచేసినై. కుర్రవాడు పేకముక్కలతో ఎంతో కష్టపడి నాలుగంతస్తుల మేడకట్టి దాన్ని చూసి మురవటం పూర్తిచెయ్యకమునుపే చిన్నగాలి కొట్టి అదంతా నేలమట్టమయితే వాడిమనస్సెంత ఖేదిస్తుందో, గోవిందరావు మనస్సంత ఖేదించటం మొదలుపెట్టింది. ఆ పెంకెపిల్లమీద—ఆ అనాకారికోతిమీద—ఎంత ఆపేక్ష తెచ్చిపెట్టుకున్నాడు! ఎంత ప్రయాసయింది! గగనసౌధాలన్నీ ఒక్కపిల్లగాలికి గుభిల్లునకూలినై. అతని మనోనేత్రం ఎటుతిప్పినా కనపడుతున్నది ఆకాశమే. ఒక మనస్సులోనే కాకుండా శరీరంలోపలకూడా డొల్లగా ఉన్నట్లనుమానం తట్టింది అతనికి. ఈశరీరంలోపల డొల్లగా ఉండటమనేది గోవిందరావు చిన్నతనంలో ఒకసారి కాబోలు అనుభవించాడు—ఒక స్నేహితుడి సలహామీద బీడీకాలుస్తూ బడిపంతులు కళ్ళపడ్డప్పుడు. ఇదంతా ఇట్లా ఉంటుండగా అంతరాత్మఎదట ఎట్లా పడదామా అని అతని కొకపెద్ద బెంగ.

ఈ చివరముక్క అందరికీ సులభంగా అర్థం కాగ లందులకు—

బానిసత్వం అనేకరకాలుగా ఉంటున్నది. ఒక దేశానికి మరొకదేశం దాస్యంచెయ్యటం అనేది అట్లా ఉంచి—లోకాభిప్రాయానికి దాసులుకొందరు, బంధుకోటికి దాసులుకొందరు, గట్టిగా మాట్లాడగల వాళ్ళకట్లా దాసులుకొందరు, భార్యలకు దాసులుకొందరు, మతాచారాలకు దాసులుకొందరు—వ్యక్తులు రకరకాల దాస్యంచేస్తున్నారు. కాని అన్నిరకాల్లోకీ చిత్రమైన రకం అంతరాత్మకు దాసులు. ఈ బానిసత్వంలో ఉన్న విశేషమేమిటంటే, ఇది ఇతర దాస్యాలమోస్తరుగా చప్పున బయటపడదు. ఈవ్యక్తులనమ్మకం అంతరాత్మ చెప్పిందల్లా వేదవాక్యమనే! అంతరాత్మ పొరపాటు పడదనే! అంతరాత్మకు దాస్యంచేస్తూ వీళ్ళు చాలా గర్వపడతారు. వీళ్ళబుర్రల్లోకి తర్కంఎక్కదు. వీళ్ళకెంతచెప్పి లాభంలేదు. భారతంలో ధృతరాష్ట్రు డిదే మచ్చు. 1933 లో గోవిందరా విదేరకం.

ఇతరులకు కైంకర్యం చెయ్యటంలోనూ అంతరాత్మకు చెయ్యటంలోనూ ఇంకో తేడా కూడా ఉంది. ఇతరుడు పొరపాటుచేసి యజమాని కంటపడకుండా తప్పించుకు పారిపోవచ్చు. అంతరాత్మకు చేతులుజోడించినవాడి కాఅదృష్టంలేదు. కనక గోవిందరావు వెధవ మొహంవేసుకుని అంతరాత్మవినేటట్టు, "నాపెళ్ళాం హనుమంతరావుతో పోతున్నది. నేనేంచెయ్యను?—ఎట్లా యేడవను!" అన్నాడు. (ఎట్లా యేడవననేది అంతరాత్మకు కనికరం కలిగేటందుకు!) ఛెళ్ళంకొట్టిన

రాయక్లే అంతరాత్మ నోరు తెరవలేదు. (అనేగుర్తు నోరు చేసుకుంటే ఒకంతట వదిలిపెట్టదని.)

హెచ్. ఎమ్. నుంచి ఆర్డర్సుకోసం ఎదురుచూసి, విసిగి, గోవిందరావు ఆలోచనలోపడి కాస్సేపు ఆశ్చర్య రసం అనుభవించాడు. తన పెళ్ళాంలో హనుమంతాయి ఏంచూసినట్టు! అందచందాలవిషయం ఆక్టేపెట్టుదలలేని తనకే తనపెళ్ళాం మరీ ఇంత కురూపెందుకా—వాలని పిస్తుంటే—

"ఆడగొరిల్లాకూడా బాగుంటుంది,నీ పెళ్ళాం కాక పోతేసరి!" అని గొణిగింది అంతరాత్మ.

"నాకు వాళ్లిద్దర్నీ చూస్తే చాలా జాలేస్తుంది" అన్నాడు గోవిందరావు, పాపం, తెలీక. దాంతో కుహాను బద్ద లయింది.

"ఎవళ్లిద్దర్నీ చూస్తే జాలి? ఛీ! బృహన్నలకొడవా! సిగ్గు లేక జాలంటున్నావా?"

"ఎందుకట్లా తిడతావు?"

"తిట్టానా? నిన్ను, నరికితే పాపంఉందా?"

"నేనేం చేశాను?"

"ఏం చెయ్యలేదు కనకనే! పెళ్ళాం ఎవడితోనో పోతూంటే ఏం చెయ్యకుండా ఊరుకున్న ఆడకుంకవు నువ్వుతప్ప ఇంకెవరూ ఉండరు"

"ఇంకోడైతేమాత్రం చేసేదేముంది?"

"నువ్వు ఆరుసంవత్సరాలకింద పున్నయ్య విషయం లో ఏమన్నావు?"

"నాకు జ్ఞాపకంలేదు."

"అయితే నాకు జ్ఞాపకం ఉంది! చెబుతా విను. 'ఎప్పుడైతే ఆడముండ పైవాడితో యిలాకా పెట్టుకుం టుందో అప్పుడు మగవాడైనవాడు దాన్ని, వాణ్ణీ చెరోపోటూ పొడిచి నాలుపక్కలా గొయ్యితీసి పూడ్చి పెట్టి చేతులు కడుక్కోవాలసిందే! మరో ఉపాయం ఆలోచించటం గొల్లభామమార్కు పాలడబ్బాలను ప్రత్యామ్నాయం అన్వేషించటమే. ఇదే నలుగురూ లోక్కు నడాకి, అందరికి తెలిసినక్రియ, వైరాగీ చిటిక,

అమృతాంజనం వద్దు' అంటూ తడుముకోకుండా ఉపన్య సిస్తివే."

"అప్పుడు తప్పకుండా పొరపాటుపడే ఉంటాను."

"నేను పొరపాటుపడనిస్తానా ఏమిటి? ఇప్పుడే పెధవ వప్పుతున్నావు."

"అయితే నన్నిప్పుడు వాళ్ళిద్దర్నీ చంపమంటావా ఏమిటి? ఊరుకో! పుణ్యానికి! నా మెడమీద తలనిలిచే ఏర్పాటు చేసేటట్టు కనపడ్డదు నువ్వు"

"ఓరి నపుంసకుడా! పానిపీనుగా! ముదనష్టపు కుంకా! మానంపోయినతరువాత ప్రాణంమెందుకురా?"

పోయింది నాపెళ్ళాంమానంకాని నాదికాదండా మనుకున్నాడు గోవిందరావు. కాని ధైర్యం చాల్లేదు.

"అయితే నన్నేం చెయ్యమంటావు?"

"నే చెప్పినట్టు వింటావా?"

"అహా! యావజ్జీవం హో ప్యాని! నీ కెందు కను మానం?"

"అయితే ఈ రాత్రే నీపెళ్ళానికి ఉప్పుపాతర్లో ఊరెయ్యి ముందు."

గోవిందం నిర్ఘాంతపోయినాడు.

"ఆడదానిమీదనా చెయ్యి చేసుకోటం? ఆలో చించు, సవాతనిష్టు లేమంటారో!"

ఇది నిజంగా ఆలోచించవలిసిన విషయమే.

"పోనీ దాన్నివదిలిపెట్టేస్తావుగాని మరి హనుమంత రావు గొంతెప్పుడు కోస్తావు?" (గోవిందరావు తలగో క్కున్నాడు.) "ఏమిట్రా ఆలోచన! నీ మొహం ఆలో చన!"

"అంటే—నాకు వాణ్ణిచూస్తే అంతకోపం రావటం లేదే మరి!"

"ఎంతకోపం?"

"చంపేటంత కోపం!"

"నువ్వు పుట్టుకుంకవని నాకు మొదణ్ణించీ తెలు సును. నువ్వు నిజమైనక్షాత్రం—మగసిరి—కలవాడివే అయితే—(నేను బాగ్యాణ్ణికదా అందామనుకొని

మా నేస్తుడు గోవిందరావు.)—హనుమంతరావును పెరికి చిత్రవధచేసేటంత కోపంవచ్చేదే నీకు! భీముడూ వాళ్లూ చూడు! ఎహ రెండోపక్షం, కోపం తెచ్చుకోవటం! ఇప్పటికైనా కోపం తెచ్చుకోరా! చచ్చు వెధవా!"

"తెచ్చుకుంటాను. వెధవని నరికేస్తాను."

"అట్లా!...ఏం పెట్టి నరుకుతావు?"

"ఏమో."

"ఓయి తెలివితక్కువ దద్దమ్మా! ఏమోనంటావేం? నీ పెనసలు చెక్కుకునే కత్తిలేదూ? మంగలికత్తిలేదూ?"

"ఉన్నది."

"ఇంకేం?"

"అయితే నా రేజరుతీసుకుని చీకట్లో వెనకనించి వాడిమీదపడి అమాంతం గొంతు కోసేస్తాను. ఏం?"

"నీకు సంగతేర్చుకునేటందుకు అపూర్వుడు పద్ధతులు కూడా తెలీవేం? నువ్వు వాణ్ణి చంపేటప్పుడు వాడికి తెలియాలి ఫలానిపని కిదిశిక్ష అని. లేకపోతే నీ నెత్తురు చల్లారగూడదు!"

"ఎందుకు చల్లారదు? నువ్వు మాట్లాడుతుంటేనే నాశరీరం మంచుకుండల్లే అవుతుంటే!"

"ఓరి నిర్భాగ్యదామోదర—"

"చెప్పు! చెప్పు."

"చల్లారుతుందా? చల్లారదా?"

"ఆ."

"కనక నువ్వేం చెయ్యాలి? హనుమంతరావును రాత్రి పదిగంటల కింటికి పిలిపించటం, వాడితో ఉన్న సంగతి చెప్పెయ్యటం, తరవాత వాణ్ణి కాస్తా—, వెంటనే దొడ్లో అరడుగుల లోతుగుంటతీసి వాణ్ణి పాతెయ్యటం, ఆపైన తోటకూరమడి వెయ్యటం! అంతా గంటపని."

గోవిందరావు బాగా యోచించాడు.

"నువ్వు చెప్పింది చాలా అద్వితీయంగానే ఉంది కాని కొద్ది అనుమానాలున్నై."

"ఏమిటవి?"

"ఒకటి—హనుమంతరావు రాకపోతే? రెండు—ఇంకోళ్ళ వెంటపెట్టుకొస్తే? మూడు—నేను మాట్లాడుతుండగానే సంగతి గ్రహించి వాడు లేచిపోతే? నాలుగు—నాచేత వాడు నిశ్శబ్దంగా చావటాని కొప్పుకోక కేకలుపెడితే? అయిదు—వాడే నన్ను చంపితే? ఆరు—"

"చాపు! నీ సంగతి నాకక్కర్లేదు. నిన్ను నేనీ క్షణంనించీ వెలేస్తున్నాను."

గోవిందరావుకు పెద్దచిక్కు వచ్చిపడ్డది. పెళ్ళాలు ఇంకోళ్ళతో లేచిపోవటంలో మొగుళ్ళనెత్తిన ఇంత బాధ్యతపడుతుందని అతను కల్లోకూడా అనుకోలేదు. అతనిప్పుడు చెయ్యవలిసిన కర్మకాండంతా చూస్తే, అంతకన్న వరసను నూరుమంది ఆడపిల్లల పెళ్లిళ్లు చెయ్యటం వెయ్యిరెట్లు సులభంగా ఉంది. పైగా, భార్యచేతయినా వెధవగా చూడబడుతూ జీవించి ఉండవచ్చును గాని, అంతరాత్మ వెలివేసింతరవాత ఒక్కక్షణం మనశ్శాంతి ఉంటుందా?

గోవిందరావు ఒక్కటే అనుకున్నాడు. "చాటు వ్యవహారమెందుకు? మగతనానికి భంగంరాకుండా పట్టపగలే, నలుగురూ చూస్తుండగానే హనుమంతరావును చంపటానికి ప్రయత్నంచేద్దాం! పట్టుకుని జైలులో పెడతారూ? సెసేంచేస్తాను! వాడు తప్పించుకుపోయినందుకు కష్టంగానే ఉంటుంది! కాని, ఏంచేస్తాను? మనుష్యప్రయత్నంలో లోపంఉండదు!"

గోవిందరావు లేచి కోటుతొడుక్కుని, కోటులోపలిజేబులో నష్టంచేసుకునే రేజరు పెట్టుకుని హనుమంతరావింటికి బయలుదేరాడు. ఆయుధజేబి అయినా అతనికి ఉద్రేకంపుట్టలేదు. గుండె ఎర్రగీతదాటి పని చేస్తూనే ఉంది.

హనుమంతరావింట్లోలేడు. గుంటూరు పోతానని చెప్పి బయలుదేరాడట. గోవిందరావు గడియారం చూశాడు. గుర్రబ్బండీ చేసుకుంటే తనకు గుంటూరు బండి అందుతుంది. దారానపోతున్న బండిని పిలిచాడు గోవిందరావు.

ప్లాట్‌ఫారంమీద హనుమంతరావు కనపడి, "ఏమిరోయ్, ఎక్కడిదాకా!" అన్నాడు.

"ఏమండి గుంటూరు బయల్దేరామురా! నువ్వు?"

"నేనూ గుంటూరేరా! ఖాళీపెట్టచూడు. కూర్చుందాం."

రైలు కదలబోతున్నది. ఇంకెవ్వరూ పెట్టెలో ఎక్కలేమోనని గోవిందరావు భయంపడటం మొదలు పెట్టాడు. కూచిపూడిభాగవతంలో నరసింహమూర్తిని నలుగురైదుగురు తాళ్ళతో లాగిపట్టినట్లు, తను హనుమంతరావును చంపబోతుండగా అడ్డపడేవాళ్ళెంతమంది ఉంటే అంత మంచిది. రైలుకదిలింది! ఒక పోలీసు తలుపు తెరుచుకుని లోపలప్రవేశించి, హనుమంతరావ్ను చూడగానే చక్కని మిలిటరీ శాల్యూటొకటికొట్టాడు. పోలీసూ హనుమంతరావూ సంభాషణలో పడ్డారు. ఇద్దరికంకా చూస్తూ చాలా సేపు గోవిందం కత్తి దుయ్యటం మరిచిపోయినాడు. జ్ఞాపకం వచ్చినప్పుడేమో హనుమంతరావును ఒంటరిగా చిక్కించుకుని చంపటమే చాలాక్షేమమనీ తనకు నిజంగా వాణ్ణిచంపాలని ఉన్నప్పుడు చూస్తూ చూస్తూ పోలీసెదట కత్తి తియ్యటం కేవలం తెలివితక్కువనీ తోచింది. అంగలకుదురులో పోలీసు దిగిపోయినాడు.

రైలు కదిలింది. హనుమంతరావు ఒంటరిగా దొరికాడు. ఏం చెయ్యాల్లా అని ఆలోచించటం మొదలు పెట్టాడు గోవిందం. రెండు నిమిషాలు గడిచినై.

"ఈజల్మ మిక దుర్లబమురా!"

గోవిందం కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు. ఆగుడ్డివాడూ ఆ పిల్లా ఎప్పుడెక్కారో ఎట్లా ఎక్కారో తెలీదుకాని వాడిమాటమాత్రం అతనికి కొంతసహాయం చేసింది.

"ఇంత దుర్లభమైనజన్మ హనుమంతరావుకు మనం ఎందుకంతం చెయ్యాలి?" అన్నాడతను అంతరాత్మతో.

"ఏడిశావులే!" అంది అంతరాత్మ.

గుడ్డివాడు కాసేపుపాడి "బాబుల్లాలా! తండ్లాలా." అంటూ హనుమంతరావువేపు చెయ్యి చాచాడు.

హనుమంతరావు వాడిమీద కాట్లుకుక్కల్లేపడి, "ఫుండాకోర్! ఎవడ్రా నువ్వు? మొద్దల్లే ఉన్నావు! కూలిచేసుకోలేవూ? గుడ్డివాడివైతే ఎట్లా కనపడుతున్నాను?" అన్నాడు.

"మసగ్గా కనపడుద్ది, బాబా!" అన్నాడు గుడ్డి.

హనుమంతరావు ధుమధుమ లాడుతూనే వాడిచేతులో ఒక అణా పడేసి "ఫో." అన్నాడు.

"పాపం! వాడు చాలా మంచివాడే! వాణ్ణెందుకు చంపటం? మాన్ ఇజ్ బ్లాక్ అని చదవలా?" అన్నాడు దీనంగా గోవిందం.

"నీకు పిచ్చలేదుటోయ్? నువ్వెరిగ్గావా? నిన్ను—"

"నీయిష్టం వచ్చినట్టేడు! నాకేమీ అభ్యంతరం లేదు. న్యాయం చెప్పావు. వినలేదు. పోనీ! వేశెండ్ల లోపల నీకు చచ్చినవాడే!"

"అట్లా అను ఇంకా—"

"చాల్లే!"

సంగంజాగర్లమూడిలో రైలాగకమునుపే గుడ్డివాడు మాయమైనాడు. హనుమంతరావు ఒకబల్లమీద కాళ్ళుచాచుకుని పడుకున్నాడు. ఈసారైనా ఇద్దరూ ఒంటరిగా ప్రయాణించేసే యోగ్యత కలగలేదు. ఒక పల్లెటూరి కుర్రవాడు ఆపెట్టెలో ఎక్కి తలుపు తెరచి మెట్టకాలుస్తూ నిలబడ్డాడు. రైలుసాగింది.

అయిదునిమిషాలకాలం గడిచింది. పల్లెటూరి కుర్రవాడు చుట్ట అంతలపారేసి, హనుమంతరావు దగ్గిరకొచ్చి "లెగవయ్యా! పగ లేంపడక?" అన్నాడు.

"నన్నుచూస్తే నీకెందుకంత ఆపేక్ష?" అన్నాడు హనుమంతరావు.

"ఇంకెవ్వరూ కూకోక్కల్లేదం! లెగో?"

"అట్లా కూర్చుందూ!"


"నేను కిటికీకాడ కూకోవాలి."

"అయితే నేను కిటికీకాడ తొంగోవాలి."

"సాల్లే. లెగు."

"నే లెగవలేను."

"లెక్కపోతే లెగదీత్తాను!" అంటూ ఆ కుర్రవాడు హనుమంతరావు చెయ్యిపట్టుకున్నాడు. మరుక్షణంలో



ఏం జరిగిందో వివరంగా గోవిందరావు చూడలేదు. దభాలున చప్పుడయింది. పల్లెటూరి కుర్రవాడు విసురుగావెళ్ళి ఒకమూల దభాలున పడ్డాడు. చొక్కా చేతులు క్రిందికి దింపుకున్నట్లు నటించి హనుమంతరావు మళ్ళీ నడుంవాల్చాడు.

మూలనించి ఏదో శబ్దం వినపడ్డది.

"ఈసారి నా సూసత్తికే అనుపత్రేగతి!" అంతా నిశ్శబ్దం, గుంటూరుబండి హోరుతప్ప.

వేకెండ్ల స్టేషనులో కుర్రవాడు ఇంకో పెట్టె చూసుకున్నాడు. గోవిందం హనుమంతరావూ ఉన్న పెట్టెలో ఇంకో రెక్కకుండానే బండిసాగింది.

"ఇదే సమయం!" అంది అంతరాత్మ.

గోవిందరావు ధైర్యం యావత్తూ చిక్కబట్టి, "రీలు పడకు!" అన్నాడు.

"ఏమిటీ?" అన్న దంతరాత్మ నిర్ఘాంతపోయి.

"వల్లకాదు!"

"కిరికిరి—"

"నో రూ మ్!"

* * *

"అన్నట్టు, ఉదయం మీయింటికి వొచ్చానురా! అసహ్యమైన పనుండి నీ భార్య ఉన్నది చూడక గదిలోకి వెళ్ళాను. ఆవిణ్ణి చూడగానే గాభరాపడి బయటపడ్డాను."

గోవిందరావు కొక్కసారిగా ఎగరటం చాతయినట్టయింది. తక్షణమే హనుమంతరావు మెడమీదపడి అతని గొంతు చెంపలూ ఎందుకు ముద్దుపెట్టుకోలేదో గోవిందరావు ఇప్పటికీ చెప్పలేడు.

"అట్లాగటరా? ఏది? నువ్వొచ్చిన పనేదో చెప్పుకురా!"

ఇంకొకసారి అంతరాత్మ చెప్పినమాటలు వింటే దండాలుల్లే ననుకున్నాడు గోవిందం.

—కొడవటిగంటి కుటుంబరావు.

కార్తిక స్నాత

ఇట సౌందర్యపురేఖఁ బెంచికొని తల్లీ? కార్తికస్నానసం
ఘటకోత్పుంజితశీతకంబు ముడుకల్ గల్గింప నీరంధ్రమై
కుటిలాలోలపరీమళత్ భ్రమరముల్ గోరాడు విస్తారపుఁ
నిటలం బాంధ్రవతీ గ్రైకపతిపత్నీదీక్షకుఁ దానమై.

జిలుగుఁ బ్రుముగ్గులలోని యల్లిక లవిచ్ఛిన్నంబులై సూటిరే
ఖలకుంబోలె మదక్షీయుగ్మమునకుం గల్గించు సొంపెట్టి వే
శిలనుంగల్లదు వేయికంబముల శాలానిర్మితిం బూను శి
ల్పుల కాచార్యత సేయు నీకు పెరతల్లుల్ తుల్యలే యమ్మరో?

పసుపుంబిష్టము మున్నుగాఁగలుగు సంబారమ్మునన్ బత్తి పెం
పెసఁగన్ దీర్చిన రంగవల్లికలలో నీవుంచుదీపంబు లాం
ధ్రవతీ! తన్నరకాసురప్రథనసత్యాజ్ఞాపితానీకపా
లనముద్భాసితశూరతానలశిఖారాజిన్ దలంపించెడిన్.

ఒకనాడు జానకి యుభయవంశంబులు తనరారుటకు నోచికొనిన నోము
ఒకనాడు ద్రుపదజ ప్రకటాత్మరాజ్యంబు నార్జించుటకు మ్రొక్కినట్టి మ్రొక్కు
ఒకనాడు సావిత్రి యూర్జితపతిభక్తి యలరించుటకు జేసినట్టి సేవ
ఒకనాడు రుక్మిణి యకలంకకీర్తిఁ గైకొనుటకై పెల్లు వాకొనిన నుతులు
నీదువ్రతదీక్షలోన జీర్ణించి తల్లి! తత్ఫలావాప్తి హస్తగతంబు సేయ
నెదురుకొలిచ్చువిధము నీవెరుగవేమొ, కాంచుదుఁ నేను కన్నులఁగట్టినట్లు

ఆరాధనస్థలం బఘవర్జితమ్ముగా నలవరించిన ప్రవాహంబువలన
నుఘుపురాతనమైన నుతికినై శృతిగల్పు, శరళాంబుగతనినాదంబువలన
పూజావిధికి తగ్గిపోఁజూచి నిండించు నుతీ స్తబిందునముత్కరమున
నీకోడునలకల నారుచు వడిగాలి నడనాపు చల్లదనంబువలన
నాకు తెలిసెపో నీకు కృష్ణాస్రవంతి కట్టిదో నే నెరుంగని చుట్టఱికము
కలదులే పూర్వజన్మానుగతపువలపు ఎంతచరితార్థ కృష్ణాస్రవంతి, తల్లి?

తెలినారచీరచెంగులు పసందుగదిద్దు, నారవుబిగింపు సొంపాదవ జేయు
చిలుకపచ్చనిపట్టు జిలుగుకూర్పాసకం, బంనమందున పనలలర జేయు
పసరుంబనువు నిగ్గుబాయని నెమ్మోము కుంకుమబొట్టునన్ గులకరింప
పసిడిచెక్కడపు పావడదోయి మించులగమి పదంబులనంటి కొమరు పెంప
కేల నొకపూలపాత్రను లీలదాల్చి కనకదుర్గాలయంపుమార్గమున నేగు
నీదుపావనమూర్తి నేనొనర్తు వినతశతములఁ గొనుమమ్మ తెనుగుతల్లి!

—కొండపల్లి గోపాలరావు, హరి రామలింగశాస్త్రి.

అధ్యక్షుడు పటేలు: కొన్ని కతలు

జమాదారుడా? అధ్యక్షుడా?

అవి పటేలు మహాశయుడు అసెంబ్లీసభకు అధ్యక్షుడుగా నున్నదినములు. అమెరికనుదంపతులు అసెంబ్లీసభామందిరమును చూడవచ్చిరి. ఆదంపతుల విజిటింగుకార్డును ఒకానొకరు తెచ్చి పటేలున కిచ్చిరి. వెంటనే పటేలు ఆదరపూర్వకముగ ఆదంపతులను వెంటగొని సభామందిరము నలుమూలలు వారికి చూపెను. అధ్యక్షపీఠమున వారిని కూర్చుండనిచ్చెను. వారా పీఠమున కూర్చుండియుండ తాను వినయపూర్వకముగ వారికి సలాముచేసెను. అందుమీద ఆ అమెరికనుదంపతులు అధ్యక్షుడగు పటేలును సాధారణుడగు జమాదారుగ భావించి అతనికి ఇనామునుక్రింద కొన్ని చిల్లరనాణెముల నీయబోయిరి. కాని పటేలు స్వీకరింపలేదు. ప్రక్కనున్న స్నేహితుని వారికి మిగిలిన తావులుచూపి తన ఛేంబరులోనికి తీసికొనివచ్చునట్లు ఆదేశించి పటేలు అచటనుండి నిష్క్రమించెను. తిరిగి అమెరికనుదంపతులువచ్చి తాము జమాదారు అనుకొన్న ఆతడు ఉన్నతాసనమధిష్ఠించియుండుటకు ఆశ్చర్యచకితులై తామతనికి చిల్లరనాణెము లీయబోయిన అవజ్ఞతకు మన్నింపవలసినదిగా పరిపరివిధముల ప్రార్థించిరి.

ఈశ్వరాదేశముకోరిన అధ్యక్షుడు

భగవత్సింగుబాంబు అసెంబ్లీసభలో పడినదినములు. అధ్యక్షుని హక్కులనుగూర్చి ప్రభుత్వమునకును, పటేలునకును అభిప్రాయభేదములుపుట్టి రవరవలుగా నుండెను. చరిత్రప్రసిద్ధిపొందిన పటేలు ఉపన్యాసమునకు పూర్వదినము. పలువురునాయకులు ఆతనిని సందర్శించి తమరు ఏవిధమున వర్తింతురని ప్రశ్నించిరి. అప్పటికంతయు తయారుగనే యుండెను. కాని పటేలు "నాకు తెలియదు. అంతయును భగవంతునిపై భారమువైచియున్నాను. ఆతడు నాకు మార్గము చూపునుగాక!" అని బదులిడెను.

గుజరాతీలో మాటలాడినపుడు:

పటేలు అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చి బొంబాయికి వచ్చిన క్రొత్తలో ఆజాదుమైదానమున నొక ప్రత్యేకసభ జరుపబడెను. ఆ సభలో పటేలు ఇంగ్లీషులో ఉపన్యసింపగోరుకొనెను. చెంతకూర్చుండియున్న స్నేహితుడొకడు 'పటేల్! ఇది బహిరంగసభ కాని అసెంబ్లీసభ కాదు. గుజరాతీలో మాటలాడుము' అనెను. అందుమీద వెంటనే గుజరాతీభాషలో ఉపన్యసింపనారంభించి పటేలు ఇట్లు చెప్పెను. "బొంబాయిప్రజలు స్వాతంత్ర్యముపొందుటకు అర్హులని నేనింతవఱకు నమ్మలేదు. వారి దౌర్జన్యరాహిత్యమునకు నేడొకచక్కని నిదర్శనము దొరకినది. నేను ఇంగ్లీషులో మాటలాడుచుండగా మీరు శాంతముగా వినిరి. కాని పరభాషలో మాటాడినందుకు బుస్సను ధ్వనులు చేయలేదు. ప్రభుత్వమువారి చేతులనుండి అధికారభవనమును లాగికొనుటకు ప్రజలు సంసిద్ధులైయున్నారను సంగతి వారు గ్రహింతురుగాక!"

"స్వరాజ్యమునకు చేరువపడుదుము."

అధ్యక్షపదవికి రాజీనామాయిచ్చిన క్రొత్తలో ఆతడొకసారి జిన్నాహాలులో ఉపన్యసించెను. ఆఉపన్యాసమునంతను ఒకడు నోట్సుతీసికొని కాంగ్రెసుబులెటినుకు ఆ ఉపన్యాసమొక అనుబంధముగా సైక్లోస్టైయిల్ మెషీనుపై తయారుచేసెను. సభ ముగియులోపల ఆ పత్రిక కాపీయొకటి పటేలున కందీయబడెను. "ఇంతటి శీఘ్రముగ పనులగుచో మనము స్వరాజ్యమునకు చేరువపడినట్లే" అని ఆతడనెను.


హరిజనుల నడుమ.

అది 1916 వ సంవత్సరము. గోధ్రాలో హరిజనసంఘసభ జరుగుచుండెను. మహాత్ముడచటికివచ్చెను. "హరిజనోద్యమము విషయమై మీరు నిజముగా పట్టుదలగానుంచుచో మీరందఱును హరిజనగూడెమునకు రండు" అని గాంధి అనెను. గాంధి హరిజనగూడెమునకు పోయినపుడు ముందు కనిపించినదెవరు! సాధారణమైన దుస్తులతో, సాధువునిటోపీతో పటేలు. అప్పటి కాతడు శాసనసభలో సభ్యుడు.

హస్తసాముద్రికము

3

జూలై మాసపు 'ఆంధ్రభూమి'లో చేతి యందలి వివిధ రేఖలను, గ్రహస్థానములను రూపించి చెప్పుచు హస్తసాముద్రికశాస్త్రమునందలి సాధారణవిషయములను వివరించియుంటిమి. ఆగష్టు మాసపు సంచికలో వివిధస్థానములనుబట్టి చేయదగు స్వభావ నిరూపణమును కూడినంత విపులముగ చర్చించియుంటిమి. ఇక రేఖలు, వాని నిర్మాణము, వానినిబట్టి చేయదగు స్వభావనిరూపణము వివరింపవలసియున్నది. ఈమీద చెప్పబోవు విషయములను సులభముగ గ్రహింపగలుగుటకు మొదటి వ్యాసమును (అనగా జూలై మాసమున ప్రచురింపబడిన దానిని) మఱియొకసారి చదువవలసినదిగా పాఠకులను కోరుచున్నాము. హస్తమునందలి వివిధ రేఖలను, వివిధస్థానములను మఱియొకసారి జ్ఞప్తి కెలయించు కొనుడు. హస్తమునందు వివిధ రేఖలలో ప్రస్తుతము 'శిరోరేఖ' ను గూర్చి విస్తరింతుము.



చిత్రము 1.

శిరోరేఖ

శిరోరేఖ నిర్మాణము

శిరోరేఖ విశాలముగ ఉన్నప్పటికంటె సన్నముగాను, లోతుగాను ఉన్న యెడల మనోద్రఢిమను. ధీశక్తిని సూచించును. ఇట్టి


రేఖ కలిగియుండువారు నిస్సంశయముగా మనస్సుతో పరిశ్రమచేయువారు (బ్రెయిన్ వర్కర్సు) అగుచున్నారు. ఈరేఖ వెడల్పుగాను, మెరకగాను ఉండుచో నిలుకడలేని బుద్ధిని, ఏకాగ్రత లేని మనస్సును తెలుపును. శిరోరేఖ నిర్మాణమున ఖండఖండములై యున్నను, ద్వీపములుకలిగియున్నను స్పష్టముగా లేకున్నను ఆవ్యక్తి శిరోవ్యాధులచే బాధితుడగుటయేగాక అతడు ఎంతమాత్రమును మనస్సుతో పరిశ్రమచేయగలవాడు కాజాలడు.

ఉత్పత్తిస్థానము ౧.

సర్వసాధారణముగ శిరోరేఖ చూపుడువ్రేలిక్రిందిభాగమునకును, బొటనవ్రేలి ఎగువభాగమునకును నడుమను అనగా గురుని స్థానమునకు దిగువను కుజుని దిగువస్థానమునకు మీదుగను ప్రారంభమై అరచేతికి అడ్డముగ చంద్రస్థానమునకుగాని కుజుని పైస్థానమునకుగాని పోవుచుండును. ఇట్లుగాక జీవరేఖకు దిగువభాగమునుండి (చిత్రము ౧. నెంబరు 1.) అనగా కుజుని దిగువస్థానమునుండి ఈరేఖ బయలు వెడలుచున్నచో ఆ వ్యక్తి అతిసున్నితస్వభావుడును, శీఘ్రకోపియునగును. శీఘ్రకోపియగుటచే ఇరుగుపొరుగువారితో పోట్లాడును; స్వల్పవిషయములందు కలహించును. ఈవ్యక్తి సభాకంపము గలిగి ధైర్యహీనుడై యుండును. కంపనశీలుడగుటచే అస్థిరుడును, చపలుడును అగును.

పైవిధముగ బయలువెడలుచు ఈరేఖ అరచేతికి అడ్డముగ తిన్ననిగీటువలె కుజుని లోస్థానమునకు (చిత్రము ౧. నెంబరు 1-4) సాగియున్నయెడల ఆవ్యక్తి తనకు దాదాపు ఇరువది సంవత్సరములు వచ్చువఱకు పైచెప్పిన గుణములనుకలిగి ఆ పిమ్మట మనోనిగ్రహమునుబడసి జీవితమున కృతార్థుడగుచున్నాడు.

పైవిధముగనే ప్రారంభమగుచు ఈరేఖ చంద్రస్థానము మధ్యకుగాని దాని దిగువకుగాని వ్యాపించినచో (చిత్రము ౧. నెంబరు 1-5) ఆవ్యక్తి తనకుపుట్టుకతో కలిగిన అన్ని దోషములు యావజ్జీవము కలిగియుండును, ఆలోచనాశక్తిని తెలుపు ఈదీర్ఘమైనరేఖ తనకున్న దుర్గుణములను పోగొట్టుటకు బదులుగా వానిని మఱింత పెంచును.



చిత్రము 2. 1-1. జీవ, 2-2. శిరో, 3-3. హృదయ, 4-4. అదృష్ట, 5-5. సూర్య, 6-6 కుజ, 7-7. ఆరోగ్య, 8-8. వివాహ, 9-9. శుక్ర వక్రరేఖలు.

పైవిధముగనే బయలువెడలుచు ఈరేఖ (చిత్రము ౧. నెంబరు 1-6) తుదిభాగము హృదయరేఖ వైపునకు వంగినచో ఆవ్యక్తి ఉద్రిక్తభావము దుష్టచేష్టితములను, సాహసములను చేయ ప్రోత్సహింపవచ్చును. చేయిచెడ్డదై యుండుచో ఈ ఫలము నిశ్చయముగనగును.

కోర్టులో కాంతం

౧

ఇంటికి వచ్చాను. కోర్టైనా విడవలేదు. నలుగురు పిల్లలూ కమ్ముకున్నారు. ఒక్కసారిగా, "అమ్మకొట్టింది నాన్నా" అని చిన్నదీ, "అమ్మకొత్తింది" అని దాని తరువాత పుట్టిన నాలుగేండ్ల మొగపిల్లవాడు, "అమ్మ. ఊమ్ - ఊమ్ ము, అ" అని వాడితమ్ముడు రెండేండ్ల వెధవ అనటమేకాకుండ ఆ పనిముందకూడా చేతులెత్తి ఏదో పెద్ద ఫిర్యాదు చేసేదానిలాగ బొబ్బలు పెట్టటం సాగించింది.

నేను గుమ్మంలో కాలుపెట్టటంతోనే ఒక్కపెట్టున అందరూ ఇల్లా కంప్లైంటులు దాఖలుచేసేసరికి నాకు గుండె గుభేలుమన్నది. రోజూ ఈ నాటకం మామూలే అయినా పది నిమిషాలలో పని తెముల్చుకొని పైవుత్తరీయంతో బైటపడటానికి అవకాశం ఉండేది. ఆ రోజున అట్లా వీలులేదు. "ఫైలు ఎక్కువైందిరా భగవంతుడా" అనికొని, బడిపంతులు వేషాన్ని మార్చి, మేడమీదికివెళ్లి జిందుకు జేరగిలబడి చిరిచాపపైన కూర్చున్నాను.

అది మా కోర్టు. నేనే న్యాయమూర్తిని. న్యాయమూర్తినే కాదు. నేను సామ్రాట్టును. చక్రవర్తిని. నా ఆజ్ఞను తిరస్కరించేవాళ్ళు లేరు. నిరంకుశాధికారం చెలాయించే మహాప్రభువును. నారాజ్యము క్షేమరాజ్యము అల్లాంటి. సమయంలో ఇటువంటి భావాలే నాజీవితాన్ని మధురంగా చేసేవి. మిగిలిన జీవితమంతా బానిసజీవితమే. అయితే జీవితంలో అల్లాంటి ఒక్క నిమిషానికి ఇరవైఏండ్ల సామాన్యజీవితానికన్న దానికంటె ఎక్కువ విలువ ఉన్నది.

ఊహాలోకూడిన ఈ మాధుర్యాన్ని వదలిపెట్టి అసలు విషయానికొస్తే ఈ చక్రవర్తి చిరిచాపమీద కూర్చున్నాడేమాఅంటే అనొచ్చు. మొగల్ చక్రవర్తులు అల్లాగే కూర్చునేవారని నా సమాధానం. అయితే వాళ్ళు రత్నకంబళములపైె పట్టుపరుపులపైె కూర్చున్నారు. నేనేమో ఈ చినిగిపోయిన చిరుచాపమీద కూర్చున్నాను.

ఈ న్యాయాధికారివద్ద ఎడపిల్లవాడు కూర్చున్నాడు. ఒకప్రక్కన చిన్నఅమ్మాయి కూర్చున్నది. వెనకాల పాలుతాగేది చేరి ఈ చక్రవర్తి నెత్తిమీద తన చిన్న చేతులతో దరవులాగ కొట్టుకున్నది. చేతులలో వెండి గ్లాసుతో కాఫీ పట్టుకొని ముద్దాయి నిలువబడ్డది కోర్టువారి ఎదుట. గ్లాసు అందుకొని కాఫీతాగేశాను.



చిన్నది ఏడుస్తూనే ఉంది ఇంతసేపూ. "ఏమిటే అమ్మా." అని న్యాయవిచారణకు ఉపక్రమించాను.

ఈమాట విన్నేసరికి అందరికీ ఒక్కసారి మళ్ళీ దుఃఖంవచ్చింది, కాస్త ఊరుకోండని అందరిని ఊరకోబెట్టాను. పెద్దది దుఃఖాన్ని దిగమ్రింగి బుడ్డమూతి పెట్టుకొని కొంచెం దూరంగా కూర్చుంది. చూస్తే ఏదో అందరికీ తలానాలుగూ తగిలినట్లున్నవి. ముద్దాయి శాస్త్రరీతిగానే పాలుతాగేదాన్ని ఎత్తుకొని కోర్టువారిఎదుట నిలువబడి ఉన్నది. "ఎందుకు కొట్టిందే అమ్మనిన్ను" అని అడిగాను చిన్నదాన్ని.

"ఇవ్వాళ ఏంచేసిందో కనుక్కోండి" అన్నది ముద్దాయి.

"నీవు ఇప్పుడు మాట్లాడరాదు. ఫిర్యాది చెప్పేది అంతా ముందువినాలె. తరువాత నీ సంగతి" అని నేనన్నా కోర్టువారికుండే సహజమైన అధికారగర్వంతో.

"అదికాదు నాన్నా, నేనే, మరీ, నేనే మల్లెపూలు కొనమన్నా నాన్నా......" అని కొంచెం ఆగింది దుఃఖంచేత మాటరాక. "చెప్పూ, కొనమనటం ఏమీ తప్పులేదు. అట్లా అనటానికి నీకు సర్వహక్కులూ ఉన్నాయి. ఊ - అంటే" అన్నాను నేను.

"కొనమంటే కొనలేదు నాన్నా" అని అది పూర్తి జేసింది.

ఫిర్యాదు విన్నతరువాత ఇది క్రిమినల్ కేసా, సివిల్ కేసా అని నాకు సందేహం కలిగింది. పూలు ఆస్తి కాబట్టి ఇది ఆస్తికి సంబంధించిన విషయంగా నిశ్చయించి సివిల్ లా ప్రకారం విచారించాలని తేల్చుకొన్నాను. అపళంగా, ముద్దాయి వంకతిరిగి "ఏమి! నీవు పూలు ఎందుకు కొనకపోవాలె? పిల్లల పూలకోసమని జీతంవచ్చినపుడు ప్రత్యేకంగా తీసి ఇచ్చిన రూపాయి ఏంజేశావు?" అని కొంచెము బొంగురుగొంతుకతో తీవిగా అనేశాను.

వాళ్ళమ్మను కోప్పడుతున్నానని మా అమ్మాయి అనుకొంది కామాలు కొంచెం ధైర్యంగా "కొని ఇయ్యకపోతే నేను ఏడ్చాను నాన్నా" అన్నది. "పెర్ఫెక్ట్లీ రైట్, నీ తప్పు ఏమీలేదు." అని అది ఇంకేదో చెప్పకర్తుంటే ఉండమ్మా ఇంతవరకు విచారిస్తాను అన్నాను.

న్యాయవిచారణలో సాక్షులు కావాలె. సాక్ష్యం క్రింద మా పెద్దఅమ్మాయిని తీసుకొన్నా—"ఏమే, అమ్మా! పూలుకొనమంటే అమ్మకొననిమాట నిజమేనుటే" అన్నాను— "కొనలేదు నాన్నా" అని అది గట్టిగా అనేసింది.

అప్పుడు ముద్దాయి వైపుతిరిగి—"విన్నావుగదా, నీ మీద పెట్టబడినకేసు. బలమైన సాక్ష్యంకూడా, చదువుకొన్న (మా పెద్ద అమ్మాయి మూడోక్లాసు) లేడీ వలన నీకు వ్యతిరేకంగా ఉంది. ఏం చెపుతావు"



అన్నాను, ప్రతిమాటాకూడా న్యాయమూర్తికి ఉచితమైన నొక్కుతో ఉచ్చరిస్తూ.

ముద్దాయి జవాబు ఇయ్యక నవ్వింది. "నవ్వటం పనికిరాదు. అట్టే నవ్వితివా అంటే కంటెంప్టు అఫ్ కోర్టు క్రింద నీకు శిక్షను ఎక్కువ చేస్తాను. పూలుకొని పెట్టకపోవటం నిజమా కాదా చెప్పు," అని కొంచెంగర్జించాను.

"కొనిపెట్టకపోతే ఏంజేసిందో కనుక్కోండి" అని పెంకి జవాబు చెప్పింది. "అది వేరేసంగతి. తప్పు నీదని ఒప్పుకుంటావా?" అన్నాను.

"డబ్బులేక కొనలేదు" అని ముద్దాయి జవాబు విని నేను కొంచెం కోపంతెచ్చుకొని "నీకిచ్చిన డబ్బు ఏం జేశావు. ఆ రూపాయిపెట్టి అప్పుడే పూలుకొనేశావా!" అన్నాను, నిజంగా కోపంవచ్చినవాడిలాగే.

“ఏదో చేశాను. పోనీ కొనలేదు. ఇప్పుడేం”—అన్నది ఈ కోర్టులో ముద్దాయిగా నుంచున్న కాంతం—చాల్లే సరిగా జవాబులు చెప్పు. అని కాంతంతో పిల్లలు వినకుండా ప్రైవేట్ కెపాసిటీలో అని, ప్రకాశంగా “నువ్వు అట్టే మాట్లాడకు. పిల్లలు పూలుకొనమంటే కొనకపోవటం తప్పు నీది. నిన్ను కన్విక్టు చేసినాను. అన్నాను.

“ఏడిస్తే కొట్టింది నాన్నా” అని మాఅమ్మాయి తల్లి మీద నేరాలు కుప్పలు కుప్పలుగా పడేయటం సాగించింది.

“ఆ,! ఆ!, తప్పుడుదానా, ఎందుకు కొట్టానో ఆ సంగతి చెప్పవేం” అన్నది కోపంగా కాంతం. పిల్ల మాట్లాడలేదు.

౨

మాకోర్టులో సంగతేమిటంటే మౌనము, నేరము చేసినట్లు అంగీకారసూచకము. కాబట్టి ఇదేదో చేస్తేనే వాళ్ళమ్మ కొట్టినట్లు స్పష్టము. ఇప్పుడు తల్లి ఫిర్యాది, కూతురు ముద్దాయి అయింది.

ఇపుడు నేను ముద్దాయితో, ‘ఏంచేశావే అమ్మా’ అన్నాను. మళ్ళా మాట్లాడలేదు చిన్నది.

“చూశారా! భడవా! మాట్లాడదు! దొంగ,! పరమ దొంగ! మాట్లాడదు!” అన్నది కాంతం.

“నీవు పూరికేతిట్టకు. అది వేరే నేరమవుతుంది. సంగతేమిటో చెప్పు” అన్నాను నేను విసుగుతో.

“ఏముంది? దీన్ని ముందుగదిలో పెట్టి లైటగొళ్ళెం పెట్టాను. తరువాత * * *”

“ఆగు ఆగు. నిన్ను గదిలో పెట్టి గొళ్ళెంపెట్టింది. అమ్మ” అన్నాను, “లైట గొళ్ళెం వేసింది నాన్నా” అని అది ఏడ్చింది.

“ఎందుకట్లా చేశావు?” అని నేను ప్రశ్నించాను.

“ఏం చేయమంటారు? పూలుకొనమని ఎగిరి నానా గోలాచేసి, పీకచంపుతుంటే ఏంచేసేది? అసలు సంగతి వినరేం?” అన్నది కాంతం.

“వింటూ ఉండు. ఒక్కొక్క–పాయింటే విచారించి తీర్పుఇస్తా” నన్నాను.

“తీర్పూ, జడ్జిమెంటూనూ, అవతల పనుంది. వెళ్ళిపోవాలె. మీకేమి?” అన్నది కాంతం.

“పోవటానికి వీలులేదు. కంటెంప్టు ఆఫ్ కోర్టుక్రింద ఛార్జి చేస్తాను. జాగ్రత్త: చివరదాకా అట్లానుండు. అయితే పిల్లను గదిలో పెట్టిగొళ్ళెం ఎందుకు వేశావు? అట్లా వేయటంతప్పు ఈ నేరాన్ని, ఇంగ్లీషులో రాంగుఫుల్ కన్ఫైన్మెంటు అంటారు. దీనికిశిక్ష, జరిమానా ఆనెక చెపుతాను. కానీ నీవు చెప్పేదేమిటో చెప్పు” అన్నాను.

“అట్లా దాన్ని గదిలోపెట్టి గొళ్ళెంవేసి, చిన్నవాడు వంటఇంట్లో ఆడుకొంటూఉంటే వదిలేసి—పసిదానికి నీళ్ళుపోయటానికి దొడ్లోకివెళ్ళాను. కాసేపుండి ఇట్లా వచ్చి చూద్దునుగదా ఆ చిన్నవెధవ ఉడుకుతూ ఉడుకుతూ ఉన్న అన్నంలో బొగ్గులూ కచ్చికలూ పడేస్తున్నాడు. తవ్వెడుబియ్యపు అన్నం దగ్ధమైపోయింది. వాడ్ని నాలుగు బాదాను. ఇంతలో అబ్బాయి కెవ్వని కేకేశాడు. ఇట్లాపోయి చూద్దునుగదా, హాలులో పిల్లలందరూ గంతులేస్తూ గోలచేస్తున్నారు. విడిచి పడేసిపోయిన చీరఒకటి భగ్గుమండిపోతున్నది. ఇల్లు తగలడిపోయేది. ఎంతగోలో చూశారా? ఆపళంగా నేను నలుగురినీ నాలుగేశాను. అదిగో, ఆ చిన్నదే ఇంతపనిచేసింది. దాన్ని వళ్ళు పగలగొట్టాను. కాస్త పెద్దదాన్ని అయినానని అయినా జ్ఞానంలేకుండా వీళ్ళతో కలిసినందుకు ఆ పెద్దదాన్ని రెండు ఉతికాను. బట్టలు ఎందుకు తగలబెట్టిందో కనుక్కోండి ఆ చిన్నదాన్ని” అన్నది కాంతం.

“ఏమే అమ్మాయి” అంటే ఆ చిన్నది బెల్లంకొట్టిన రాయిలాగ ఊరుకొన్నది.

సరే చిన్నది ఏదోచేసిందని తేలింది. అయితే ఇల్లు తగలబెట్టాలని పిల్లల ఉద్దేశంకాదు. కాబట్టి నేరంలో ఉండే సగంబలం తగ్గింది. అమ్మాయిని “అయితే, అసలు నిప్పుపుల్ల ఎక్కడిదే? ఎవరు గీశారు? ఎవరు ముట్టించారు.” అని అడిగాను.

‘తమ్ముడు తెచ్చాడు నాన్నా’ అన్నది అమ్మాయి.

‘నిన్ను లైటకు లేసిందెవరు?”

'అక్కయ్య గొళ్ళెంతీసి, డబ్బివ్వంగానే, అమ్మలేదు' అన్నది.

'నిప్పుపుల్ల గీచిందెవరు?'

'నేనే నాన్న, ఊరికేగీచి అక్కడ పారేశా నాన్నా'

'ఊరికేగీచి ఎక్కడ పారేశావు? చీరమీదా?'

'కాదు నాన్న. అక్కడే పారేశాను.'

'అక్కడ పారేస్తే, చీర ఎట్లా అంటుకుంది?'

'ఏమో నాన్న'

'మరి చీర ఎట్లా అంటుకుందే?'

'ఏమో, అదంతట అదే అంటుకుంది'

3

ఇట్లా ప్రశ్నోత్తరాలు జరిగినయి. ఇప్పుడు చిన్నది నేరస్తురాలా కాదా అని సందేహం. నిప్పుపుల్ల గీచి వేయటం చీర తగులబడటానికి కారణంలాగ కనబడుతున్నా అదేకారణం అని మనం నిశ్చయించకూడదు. కాబట్టి చిన్నది నేరస్తురాలని స్పష్టంగా నిశ్చయించలేము. కాబట్టి పిల్లలు నేరమేమియు చేయలేదనే కోర్టువారి అభిప్రాయం.

ఇక తల్లిసంగతి. నిప్పుపుల్లలపెట్టె చేతిలో ఉండటం మూలాన అదే ఇంత పనిచేసి ఉంటుందని తల్లి అభిప్రాయపడి వాళ్ళను తలానాలుగు కొట్టటం ఎసాల్ట్ నేరము క్రిందికి వస్తుంది. వాళ్ళు ఏడ్చి నానాగోల చేసి ఉంటారు. అపుడు బ్రీచ్ ఆఫ్ డొమెస్టిక్ పీస్ జరిగింది. ఇదివరకే ముద్దాయిలైన నీపై రాంగ్ ఫుల్ కన్‌ఫైన్‌మెంట్ కేసు ఉంది. పిల్లలకు పూలకోసం ఇచ్చిన డబ్బును అపహరించావు. అదీకాక నీవు ఇటువంటి నేరములను తరుచూ చేస్తూఉండే ఓల్డ్ అఫెండర్ కాబట్టిన్నీ, చేసిననేరాలన్నీ కలిపి కన్సాలిడేటెడ్ స్టేట్‌మెంట్ ఒకటి తయారుజేసి తగిన శిక్షను అనుభవించటానికై నిన్ను సెషన్సుకు కమిట్ చేస్తున్నాను. సెషన్సు కోర్టుకు నీవుమాత్రం రావాలె. పిల్లలు రానక్కరలేదు. వారి విషయమై ఉన్న రికార్డు చాలు. అని తీర్పుచెప్పాను,

ఇక మాటలురాని ఇద్దరు పసిపిల్లలకేసులు ఉండిపోయినాయి. అయితే పసిదానికి పాలు, ఎడబిడ్డకు పిప్పరమెంటుబిళ్ళలూ దొరకటంచేత వాళ్ళు రాజీపడి తల్లి దగ్గరచేరారు. కాబట్టి కోర్టువారికి చేసేది ఏమీ లేకపోయింది.

౪

'రండర్రా - అన్నాలు పెడతాను అన్నది కాంతం' అప్పటికే పూర్తిగా చీకటిపడటంచేత. ఆరోజు జీలకర్ర వేసి కందిపచ్చడినూరి ఉంచటంచేత పిల్లలు ఎప్పుడు అన్నంతిందామా అని చూస్తున్నారు. ఈ మాట వినటంతోనే ఒక్క సారిలేచి తల్లివెంట వెళ్ళిపోయినారు.

కోర్టువారు ఒక్కరే మిగిలిపోయినారు. ముందున్న బడిపంతులు తలగుడ్డ వెక్కిరిస్తూ బల్లమీద ఉంది. మాసినలాంగుకోటు వంకెనె వేలాడుతున్నది. కాఫీ తాగినతరువాత అక్కడపెట్టిన వెండిగ్లాసు అక్కడే ఉంది నిర్లక్ష్యంగా దొర్లుతూ. దూరాన మబ్బులలో నుంచి బాలచంద్రుడు వెకిలినవ్వులు నవ్వుతున్నాడు. పిల్లలను ఇంత అన్‌డ్యుఇన్‌ఫ్లూయన్స్‌తో స్వాధీనపరచుకొని ప్రపంచంప్రకృతిఅంతా నన్నువెక్కిరించేట్టు, హాస్యాస్పదమైన స్థితిలోకి నన్నుతీసికొచ్చి వదిలిపెట్టిన కాంతానికి సెషన్సులో కఠినశిక్ష విధించక మానను అని నిశ్చయించుకొన్నాను.

—మునిమాణిక్యం నరసింహారావు





గానలోలత్వము



నాగస్వరసాధన



భీతహారిణములు

నోబెల్ వాఙ్మయ బహుమానములు

(౧) ౧౯౦౧ సంవత్సరము - ఫ్రాంసు.

సుల్లీ ప్రూడ్‌హోం.

ఈ అంతర్జాతీయసాహిత్యమహాగౌరవమునుపొందిన యీ ప్రథముడు ౧౮౩౯ లో జన్మించి ౧౯౦౭ సెప్టెంబరు ౬-౭ తేదిని మరణించెను.

* 'వీరి కృతులందు నిండియున్న అద్భుతప్రతిభకు, ముఖ్యముగ - ఉన్నతాదర్శము, కళాపూర్ణమైన పూర్ణత, ఉపజ్ఞల సమ్మేళనములకుగా' బహుమతి ఒసంగబడినది.

పుస్తకములు:—పరితాపు, లాజస్టిస్ - ఇవి అతివ్యాప్తములైన పెద్ద పుస్తకములు. విక్టర్ హ్యూగోకు ద్వితీయుడుగా ఎన్నబడినాడు.

(౨) ౧౯౦౨—జర్మనీ.

థియోడార్ మొంసెన్.

జననము ౧౮౧౭. మరణము ౧౯౦౩ నవంబరు ౧.

* 'చరిత్రను అభివర్ణించు శిల్పాచార్యులలో ప్రథమగణ్యుడు.' అగుటచే బహుమతిబడసినాడు.

'ప్రతివిద్యార్థియు తనకృషికి అనువైన ప్రత్యేకరంగమును ఎన్నుకొనవలయును కాని, దాని చరయందే బంధితుడు కాడు'—'చరితయొక్క ఐక్యత - క్రీస్తుకు పూర్వము ౧౮౦౦ నుండి ఇంతవరకు మానవప్రకృతియందు ఏకత' అనునవి వీరి నూతనసిద్ధాంతములు.

పుస్తకములు: ౧౦౦ సంపుటముల రోమకచరిత్ర.

(౩) ౧౯౦౩—నార్వే

జోర్న్ స్టైజెన బ్జోర్న్‌సన్.

జననము ౧౮౩౨. మరణము ౧౯౧౦ ఏప్రెలు ౨౬.

* 'ఇతని మహోన్నత విభిన్నశిల్పమున భావావేశవినూత్నతగలిగి, అదే సమయమున అసాధారణముగ ఆత్మనిష్కల్మషత ప్రస్ఫుటముగ దీపించుచుండుటచే.'

నవలారచయిత - నాటకకర్త - వక్త- ప్రచురణకర్త- నాట్యశాలాచార్యుడు - అగు నీతడు 'నార్వేజనకుడు' అను జాతీయగౌరవమును పొందినాడు.

నార్వేమహాకవి హెన్రిక్ ఇబ్‌సన్ యితని సహపాఠియైన ప్రతిపక్షి. వీరిమధ్య వాఙ్మయసమరకోలాహలము మెండుగనుండినది; కుదకు తన కూతురును ఇబ్‌సన్ కుమారునికిచ్చి పెండ్లిచేసినాడు.

పుస్తకములు:—'మానవశక్తికి అవల' 'ఎడిటరు' 'దివాలాకోరు' గొప్ప సమస్యలతోగూడిన నాటకములు; 'శిగోరిమన్' 'డాగ్లనెట్' పెద్ద నాటకములు. 'ఆర్నె' 'తెస్తపకుచు' 'అదృష్టవంతుడైన బాలుడు' లోనైనవి ప్రసిద్ధకథలు.

(౪) ౧౯౦౪—ఫ్రాంసు - స్పెయిను.

[అ] ఫ్రాంసు - ఫ్రెడరిక్ మిస్ట్రైల్.

జననము ౧౮౩౦. మరణము ౨౫-౩-౧౯౧౪.

* 'వీరిది వినూత్నమైన స్వకపోలకల్పనాశక్తి, పారవంతమైన ఉపజ్ఞ. వీరికవితాశిల్పమున ప్రకృతియు, తన స్వజనజీవితమును సంపూర్ణముగ ప్రతిబింబించుచున్నవి. మరి తన వ్యాఖ్యాన జీర్ణముగాకుండ సల్పిన అపారకృషికి.'

పుస్తకములు:—'మిరియో' అను గ్రామ్యజీవనమహాకావ్యము ఉత్తమము. 'క్యాలెండాల్' మరియొక్క ప్రసిద్ధగ్రంథము.

[ఆ] స్పెయిను-జోస్ ఎచెగరి.

జననము ౧౮౩౩. మరణము ౧౪ సెప్టెంబరు ౧౯౧౬.

* 'విశాలమును, విజ్ఞానమయమును, స్వతంత్రమునునైన వీరి రచనాశక్తి ఆత్మీయప్రత్యేకవిధానమున స్పెయిను నాటకకళయొక్క గొప్ప సాంప్రదాయములను మరల ఉజ్జీవింపజేసినందులకు' అభినందనపూర్వకముగ బహూకరింపబడినాడు.

పుస్తకములు:— 'గ్యాలియోటో ఘనుడు' అను బీభత్సవిషాదాంతనాటకము, 'డాన్ జోన్ కుమారుడు' 'మేరియానా' అను నాటకములు సుప్రసిద్ధములు. 'ఎప్పుడో అపహాస్యము' 'వీథిగాయకుడు' అనునవి చిన్న నాటకములు.

(౫) ౧౯౦౫—పోలాండు.

హెన్రిక్ షీన్కీవి.

జననము ౧౮౪౬. మరణము ౧౫ నవంబరు ౧౯౧౬.

* 'చారిత్రకనవలల సృష్టించుటయందు వీరికిగల మహోజ్జ్వలశక్తికి.'

పుస్తకములు:—'ఖడ్గాగ్నులతో' 'జలప్రళయము' అను నవలు ప్రసిద్ధములు. 'భూమిబిడ్డలు' అను విషాదగాథ ముఖ్యమైనది 'క్వోవాడిస్' 'అతనిని అనుసరింతము' 'హానియా' 'జీవితవిషాదము' అనునవి వీరి అత్యుత్తమగ్రంథములు.

(౬) ౧౯౦౬—ఇటలీ.

గియోసోకార్డుకీ.

జన ౧౮౩౫—మర. ౧౬-౨-౧౯౦౭.

* 'వీరివిశాలాగాధవిజ్ఞానము, హేతుపూర్ణపరిశోధనల ప్రతిభకేగాక, వీరి కృతులందు ప్రస్ఫుటముగ దీపించు కోమలసృష్టిశక్తికిని - శయ్యావిమాత్మకతకును, భావోద్దీపనబలమునకును' కానుకగా ఈ గౌరవమును బొందినాడు. విశ్వకళాపరిశుత్తుని ఆచార్యుడైన ఈతడు కర్షకకవి.

పుస్తకములు:—'సైతానుకు గీతము' అనునది ఒక్కదినములో ఈతనిని ప్రసిద్ధునిజేసినది. 'ఆదర్శము' 'తల్లి' అను కావ్యములు నుంచివి.

(౭) ౧౯౦౭—ఇంగ్లండు (?)

రడ్యార్డ్ కిప్లింగ్.

౧౮౬౫ లో బొంబాయిలో జన్మించినాడు. ౧౭-వ ఏడువరకు బొంబాయిలోనే విద్యనభ్యసించి, ఇంగ్లండు నకుబోయి, అచటి విద్యార్థిసంఘమున మెలగలేక మరల జన్మదేశమగు భరతభూమికివచ్చి ౩౫-వ ఏడువరకు పత్రికావిలేఖరిగా, పాయినీరు-పత్రికా సహాయసంపాదకుడుగానుండి ఇచటనే చాలకథల వ్రాసినాడు. వీటియందు జన్మదేశమును పరిహసించి తల్లి ఋణము దీర్చుకొన్నాడు యీ దొర. బహుమతి గౌరవము ఇండియాదా? ఇంగ్లండుదా?

ఈ గౌరవమునకు యీయన అర్హుడుగాదని ఇంగ్లీషువారిలోనే చాలమంది వాదింతురు. అందు సుప్రసిద్ధరచయిత ఎ. జీ. గార్డినర్ ముఖ్యుడు.

* 'వీరికిగల విషయగ్రహణదక్షత, స్వకీయ వినూత్నఊహాశక్తులకేగాక, యీ విఖ్యాతగ్రంథకర్త వ్రాతలందు ద్యోతకమగు దూరదృష్టి, అభివర్ణనశిల్ప సౌష్టవములకుగా' సత్కరింపబడినాడు.

పుస్తకములు:—హితోపదేశమునందలి కథలవలె మృగములకథలు. '౩౦' అను నవల అతివ్యాప్తము. కాని ఇది చాల పేలవముగానుండును.

(౮) ౧౯౦౮—జర్మని.

రుడల్ఫ్ యుకెన్.

జననము—౧౮౪౬.

* "సత్యాన్వేషణమున వీరికిగల అకళంకవిశ్వాసము, విషయభేధకతాశక్తి, మానసికదృశ్యప్రస్ఫుటతలతో సర్వమానవజాతికి ఆదర్శమగు తత్త్వసిద్ధాంతముల నిర్మింపగలిగినందులకు.'

పుస్తకములు:—'ఆత్మజీవము' 'యతయధార్థము' అను తత్త్వగ్రంథములు ప్రసిద్ధములు.

(౯) ౧౯౦౯—స్వీడను.

శ్రీమతి సెల్మా లాగెర్లోఫ్.

జననము ౧౮౫౮ (సజీవ)

ఈ అంతర్జాతీయసాహితీగౌరవమును బొందుటకు ఈమె ప్రథమస్త్రీ.

గృహముపై తనివినొందని ప్రేమానురక్తులే యీమె వ్రాతలందు ప్రధానగుణములు.

* 'ఈమె వ్రాతలందలి మహోన్నతాదర్శములు, భావసంపత్తు, ఆధ్యాత్మికసుగుణముల ప్రత్యేకతకుగా' విమర్శకులలో అవతింపమైనది.

పుస్తకములు:—'నైల్ నదీ సంచారములు' 'గాస్టో కథ' 'అదృశ్యబంధములు' మొదలగుకథలు; 'ఐనక' అను నవల అద్భుతమైనవి. 'జెరుసలెం' 'పోర్చుగల్లి యా సార్వభౌముడు' ఈ రెండు యీమె ఉన్నత (మాస్టర్ పీసులు) గ్రంథములు.

(౧౦) ౧౯౧౦—జర్మని.

పాల్ హీసె.

జననము ౧౮౩౦. మరణము ౨-౪-౧౯౧౪.

* 'భావకవిగా, నాటకరచయితగా, కథకుడుగా, వీరుగావించిన దీర్ఘకృషియందు కనబడు మార్గదర్శికమైన ఊహాపూర్ణశిల్పమునకు.''

వీరు 'నావలె' అను నూతనవిధమైన చిన్నకథల సృష్టికర్త.

పుస్తకములు: — 'సలమాన్యండర్' ప్రఖ్యాతమైన నావలె. 'గ్రుడ్డివాడు' 'స్వర్గములో' 'ప్రపంచశిశువు' ముఖ్యములు.

(౧౧) ౧౯౧౧—బెల్జియం.

మారిస్ మేటర్‌లిక్.

జననము ౧౮౬౨.

* 'వీరి సర్వతోముఖసాహిత్యకృషికిని ముఖ్యముగ నాటకసృష్టికిని సత్కరింపబడినారు. ఈ నాటకములందు ఊహాసంపద, కవితాదర్శములు ప్రదర్శితములై పాఠకుని భావములకును, యోచనలకును ప్రబోధమొసంగును.'

తేనెటీగల పెంపుశాస్త్రమున అతనిఅనుభవమును గణించి రమ్యమైన కథవలె 'తేనెటీగ జీవితము'ను వ్రాసినాడు.

పుస్తకములు:—'నీలిపిట్ట' అను నాటకము బహుమతికి కారణము. 'మొన్నావెన్నా' 'మేరీ మ్యాడలీను' 'స్టెల్‌మాండ్ నగరపాలకాధ్యక్షుడు' 'బెల్జియంయుద్ధము' మొదలగు నాటకములు ప్రసిద్ధములు.

(౧౨) ౧౯౧౨—జర్మని.

జెర్‌హార్ట్ హాప్టుమాన్.

జననము ౧౮౬౨.

* 'సారవంతమై, సత్యమయమైన నాటకకృషికి' గౌరవింపబడినాడు.

పుస్తకములు:—'మునిగినగంట' బహుమతిబడసినది. 'అంతమైన జీవితములు' 'నేతగాడు' కవితాబీజము, భావసంపత్తితో నిండినకావ్యములు. 'మెర్రిక్రీస్తు' 'ఎమాన్యుయల్ క్వింట్' 'సోనాయందలి సన్యాసి' మొదలగునవి కల్పితగాథలలో అగ్రగణ్యములు.

(౧౩) ౧౯౧౩—హిందూదేశము.

శ్రీ రవీంద్రనాథ ఠాకూరు.

జననము ౧౮౬౧.

* 'వీరి కవిత్వమునందు ఇమిడియున్న నిపుణత, ఉన్నతోద్దేశములకును; నిజప్రతీచీభావనవ్యతను మనోజ్ఞతను పశ్చిమవాఙ్మయములోనికి గొనివచ్చిన మహోజ్జ్వలవిధానమునకు' ఈమర్మజ్ఞాని నోబెల్ బహుమతి బడసి భరతఖండనామమును సువర్ణాక్షరములతో వ్రాసినాడు.

చిన్నకథలకు, కవిత్వమునకు పడమట దేశవాసుల మనసు కెక్కినాడు. వీరు మంచి గాయకులు.

తన బహుమతిధనమును తనచే నెలకొల్పబడిన శాంతినికేతనమున కొసంగివేసెను.

౧౯౧౪ లో బహుమతు లొసంగబడలేదు.

(౧౪) ౧౯౧౫—ఫ్రాంసు,

రొమెయిన్ రోలా.

జననము ౧౮౬౬.

* 'వీరి రచనలందలి ఘనతరాదర్శములకును, మానవజాతి ఐక్యతను గూర్చుగలిగిన సానుభూతిసత్యములకును.'

తనమిత్రుడు ఠాకూరువలెనె యీ బహుమతి ధనమును తీసికొనక "యూరపుఖండగరవస్థానివారణము"నకుగా ఇచ్చినాడు.

విద్యలో నియమబద్ధావరోధములు, రాజకీయములందు నిమ్నజాపుట వీరికి నచ్చక వాటిపై ధ్వజమెత్తినారు.

పుస్తకములు:— 'జీన్‌క్రిస్టోఫ్' అను పెద్ద పుస్తకము బహుమతి బడసినది. 'సత్యవిజయము' 'జూలై ౧౪-వ తేది' చాల గొప్ప గ్రంథములు.

గాంధిమహాత్ముడు అనిన వీరికి గొప్ప గౌరవము. భారతదేశము అనిన అభిమానము. వీరి 'గాంధిమహా

త్ముడు - రవీంద్రుడు' అను పుస్తకము ప్రపంచఖ్యాతి వడసినది. ఈపుస్తకమే ప్రాశ్చాత్యుల దృష్టుల మన దేశముపై పునరు మరల్చినది. వీరు 'వివేకానంద', 'రామకృష్ణపరమహంస'ల జీవితముల హృద్యముగ వ్రాసియున్నారు. టాల్‌స్టాయికంటే గాంధీజీయే గొప్పవాడని వీరి విశ్వాసము. మహాత్ముని తెలిసికొనవలయునను ఆసక్తియే వీరిని ఇంగ్లీషు నేర్చుకొనునట్లు చేసినది.

(౧౫) ౧౯౧౬—స్వీడను.

వెర్నర్ వాన్ హేడెన్‌స్టామ్

జననము ౧౮౫౯.

* 'మనవాఙ్మయమునవోదితశకమునకు మూలపురుషుడుగ.'

వీరికి 'స్వీడను ఆస్థానకవి' అను బిరుదము పోటీ పరీక్షలో ఒసంగబడినది.

పుస్తకములు :—'జేవునిజననము' 'ఫాల్కంగుల చెట్టు' ప్రధాననాటకములు. 'ఎకాడివిముక్త' అద్భుతమైనకథ.

(౧౬) ౧౯౧౭—డెన్మార్కులో ఇద్దరికి.

[అ] హెన్రిక్ పాంటోపిడాన్.

జననము ౧౮౫౭.

* 'నేటి డేనిషు జీవనమును విరివిగ వర్ణించుటచే'

పుస్తకములు:—'చర్చికీడ' 'వాగ్దానదేశము' అనునవి మంచివి. 'చచ్చినవారి రాజ్యము' అను యుద్ధవర్ణన ప్రఖ్యాతము.

[ఇ] కారల్ జెల్లరప్.

జననము ౧౮౫౭—మరణము ౧౧. అక్టోబర్ ౧౯౧౯.

* 'కలాలంకమమును, భాగ్యవంతమును అయి ఆవేశము నొసగగలిగిన ఉన్నతాదర్శములకు.'

పుస్తకములు:—'కామనీతయాత్రికుడు' అను బుద్ధభగవానుని చరితయు, 'మిన్నా' అనునవి ప్రఖ్యాతములు.

౧౯౧౮—బహుమతి లేదు.

(౧౭) ౧౯౧౯—స్విట్జర్‌ల్యాండు.

కారల్ స్పిల్‌టేలర్.

జననము ౧౮౪౫—మరణము ౧౯౨౪.

* 'ముఖ్యముగ వీరి 'ఒలింపికు స్ప్రింగు' అను మహాకావ్యమునకు.'

'ఇమాగో' అనునదికూడ ప్రసిద్ధము. 'ఒలింపియా వసంతము 'డాంటేక్ళ్రత 'డివైన్ కమిడీ'కి తుల్యమని ఎన్నబడుచున్నది. ఇంగ్లీషులో షెల్లీ, కీట్సులతో పోల్తురు.

(౧౮) ౧౯౨౦—నార్వే.

నట్ హామ్సన్

జననము ౧౮౫౯.

* 'స్థిరస్థాయియైన 'గ్రోత్ ఆఫ్ ది సాయిల్' అను మహాకావ్యమునకు.'

ఈతడు మొదట నిరుపేదయై దేశదేశముల తిరుగాడినాడు. అమెరికాలో చాల వృత్తుల నవలంబించి వీధులలో తిరుగు గుర్రపుబండి కండక్టరుగా, సేద్యగాడుగా, గుమాస్తాగా, ఉపాధ్యాయుడుగా క్లేశపడినాడు. బహుమతిరాగానే 'గుర్రపుబండికండక్టరుకు నోబెల్ బహుమతి" అని అమెరికాపత్రికలు స్వాగతమొసంగినవి.

పుస్తకములు—'ఆకలి' 'నిగూఢచర్యలు' 'పాన్' 'స్వప్నములగనువారు' 'యువుగపు బిడ్డలు' అతివాశ్యస్తములు.

(౧౯) ౧౯౨౧—ఫ్రాంసు.

అనటోల్ ఫ్రాంసు.

జననము ౧౮౪౪. మరణము ౧౯౨౪.

వీరు ఫ్రాంసులో అత్యంతము గౌరవింపబడినారు. వీరి అపరక్రియలు మహారాజులకువలె (స్టేట్ ఫ్యూనరల్) గావింపబడినవి.

* 'మంజులశైయ్యతోడను, విశాలసహృదయమానవత్వముతోడను, పరానుహాస్యరసముతోడను విరాజిల్లు కృతికర్తగా వీరు గావించిన అద్భుతకృషికి.'

పుస్తకములు:—'సిల్ వెస్త్రె బోనార్ నేరము' విశ్రుతిగూర్చినది. 'శార్ నిన్ వధువు' 'ఎర్రకలువ' మాస్టర్ పీసులు. 'జీవితవికసనము' 'తీయాన్' అనునవి ఉద్గ్రంథములు.

(౨౦) ౧౯౨౨—స్పెయిను.

జాకింటో బెనవెంట్.

జననము మ్యాడ్రిడ్ నగరమున ౧౮౬౬.

* 'పూజ్యమైన స్పెయిన్ నాటకసాంప్రదాయములను అనుసరించుటయందు వీరవలంబించిన హృదయంగమ విధానమునకు.'

పుస్తకములు :—'సంఘములో', మృగములవిందు, అను నాటకములు ముఖ్యములు. 'ఎట్ హెంబ్రెకిటో' అను నాటకము ఇబ్సన్ గారి 'డాల్సుహౌసుకు' సమానముగా ఎన్నబడుచున్నది. 'ప్రణయకుసుమములు' 'శనిరగులాబి' 'ఎర్ మైన్ భూమి', 'వితంతుభర్త' మొదలైనవి విశ్రుతములు.

(౨౧) ౧౯౨౩—ఐర్లండు.

విలియం బట్లర్ యేట్సు.

జననము ౧౮౬౫.

* 'వీరి ఔచితీపూర్ణ, ఆవేశమయ కవితాశిల్పము ప్రజాశక్తిని వెల్లడించుటచే.'

వీరికి రవీంద్రకవీంద్రులు మిత్రులు. గీతాంజలికి అవతరణము వ్రాసియున్నారు.

శీర్ణించిన స్వకీయ 'కెల్టిక్' విజ్ఞాన పునరుద్ధరణ కృషికులలో వీరు ప్రథములు.

పుస్తకములు:—'అపహరింపబడిన శిశువు' 'దిల్యాండ్ ఆఫ్ హార్ట్సుడిజైర్' 'అయిసిన్ ప్రతిధ్వనులు' వీరికీర్తి మూలములు. 'ది అవర్ గ్లాస్' మహోన్నత నైతిక నాటకము.

(౨౨) ౧౯౨౪—పోల్యాండు.

ల్యాడిస్లా రీమాంట్.

జననము ౧౮౬౭. మరణము జనవరి ౧౯౨౫.

* "వీరిగొప్ప ఇతిహాసము 'కర్షకులకు'గా."

పుస్తకములు:—'వాగ్దానభూమి' మంచినవల. 'ప్రజలేమంటారు' 'నల్లమందు త్రాగువాడు' మొదలగు కథలు అభిరుచికరములు.

(౨౩) ౧౯౨౫—ఐర్లండు.

జార్జి బెర్నార్డు షా.

జననము ౧౮౫౬.

* 'ఉదారాశయములతోడను, మానవత్వముతోడను, వింతకవితాసౌందర్యములో విరాజిల్లు సజీవవ్యంగ్యములోడను శోభించు రచనలకు.'

ఇతడు సమాజవాది. విశ్వవిద్యాలయములు విజ్ఞాననిర్మూలనహేతువులనియు, ప్రజాస్వామ్యములకంటె డిక్టేటర్ పాలనాసౌఖ్యమును కలిగించుననియు వీరి విశ్వాసము.

పుస్తకముల వరుసంబడిమీద సూపర్ ట్యాక్సు చెల్లించు కవి లోకమున యితడొక్కడే!

బహుమతిధనమును శాస్త్ర్వ బీదవారికి యిచ్చినాడు. చాల నాటకముల వ్రాసినాడు.

(౨౪) ౧౯౨౬—ఇటలీ. (౧౯౨౭లో ఒసంగబడినది.)

శ్రీమతి గ్రేజియా డెలెడా.

జననము ౧౮౭౧. రోము.

* 'ఈమె కావ్యములు ఉజ్జ్వలాదర్శదీపితములు. తనదేశజీవనమును చిత్రకారునివలె ప్రస్ఫుటముగ అభివర్ణించి, మానవసమస్యల పూర్ణమైన సహానుభూతితో వివరించుటచేత.'

'సంసారైక్యతయొక్క మహోన్నతాదర్శము సంసారము' అని యీయమ విశ్వాసము. స్త్రీలు పుస్తకముల వ్రాయరాదని ఇంటివారు యీమెకు శాస్తిగా నుండినది.

పుస్తకములు:—'అసెమె ఆసెస్టు' 'డీవాటె' 'కెనెరి' మొదలగునవి మంచినవలలు.

(౨౫) ౧౯౨౭—ఫ్రాంసు.

తత్త్వవేత్త - హెన్రీ బెర్గసన్.

జననము ప్యారిస్—౧౮౫౯.

* 'సారవంతమై - జీవనప్రదమైన ఆదర్శములను వర్ణించిన తేజోమయశిల్పమునకు.'

(౨౬) ౧౯౨౮—నార్వే.

శ్రీమతి - సిగ్రిడ్ ఉండ్సెట్.

జననము. ఆస్లో ౧౮౮౨.

ఈ గౌరవమును బొందుటకు ఈమె మూడవ స్త్రీ.

* 'మధ్యమయుగ జీవితమును వర్ణించిన 'గ్రోత్ ఆఫ్ ది సాయిల్' అను మహత్తరకావ్యమునకు.'

(౨౭) ౧౯౨౯—జర్మని.

హెర్ థామస్ మ్యాన్.

జననము. ౬ జూను ౧౮౭౫.

మ్యూనిక్ నగరమున భీమాకంపెనీలో గుమస్తాగా నుండియే సాహిత్యకృషి సలుపుచు 'పతిత' అను కథ వ్రాసినాడు. చిన్నకథలవలననే మొదట ప్రఖ్యాతి నందినాడు.

పుస్తకములు:— 'చిన్న ఫ్రీడ్ మ్యాన్ గారు' అను కథల సంపుటి, 'బడన్ బ్రూక్సు' అను నవల ముఖ్యములు, 'మాంత్రికపర్వతము' 'వెనీసులో మరణము' ఎన్న దగినవి.

(౨౮) ౧౯౩౦—అమెరికా సంయుక్త రాష్ట్రములు

సిన్క్లేర్ లూయి.

మధ్యతరగతుల జీవనమును వర్ణించుటయందు వీరి కళావైదుష్యము కూలంకషమైనది. మొదట పత్రికలకు లేకరి.

పుస్తకములు:—'మెయిన్ స్ట్రీటు' చాల ప్రఖ్యాతము. 'బ్యాబిట్' 'ఆరోస్మిత్తు' నేడు ప్రఖ్యాతములు.

(౨౯) ౧౯౩౧—స్వీడను.

డాక్టర్ ఎరిక్ ఆక్సెల్ కారల్ ఫెల్టు.

వీరు చనిపోయిన తర్వాత యీబహుమతి ఒసంగ బడినది. ఇంతకుముందు గౌరవింపదలచుకొనగా తాను అనర్హుడనని నిరాకరించినాడు.

(౩౦) ౧౯౩౨—ఇంగ్లండు.

జాన్ గాల్సు వర్థీ.

(ఈ సంవత్సరము చనిపోయినారు)

బహుమానద్రవ్యమును తన ఆస్తిని తనచే స్థాపింపబడిన 'పెన్' అను అంతర్జాతీయ కవిసంఘమున కొసంగెను. దీనికి ఆయనే అధ్యక్షుడు. ఇప్పుడు హెచ్. జి. వెల్సు. దీనిశాఖ ఠాకూరుగారి అధ్యక్షతక్రింద భారతదేశమున నెలకొల్పబడినది. సరోజినీదేవి, ఇక్బల్ కార్యదర్శులు.

వీరి నాటకములు, నవలలు చాల ప్రసిద్ధములు:

సింహావలోకనము.

ఈ బహుమానకరణములు 1901 లో ప్రారంభింపబడి నేటివరకు అవిచ్ఛిన్నముగా పెరుగుచు ప్రతిష్ఠవంతము లగుచున్నవి.

1914, 1918 లలో బహుమతు లొసంగబడకుండినను 1904, 1917 లలో యిద్దరిద్దరికి పంచిపెట్టబడుటచే యిప్పటికి 32 మంది గౌరవింపబడినారు.

ఇందు 3 స్త్రీలు గలరు.

దేశములు:— 14.

జర్మని	5	మారులు.
ఫ్రాన్సు	5	,,
నార్వే	3	,,
స్వీడను	3	,,
డెన్మార్కు	2	,,
పోల్యాండు	2	,,
ఇంగ్లండు	2	,,
ఐర్లండు	2	,,
స్పెయిను	2	,,
ఇటలి	2	,,
భారతదేశము	1	,,
బెల్జియం	1	,,
స్విడ్జర్లాండు	1	,,
అమెరికా. సం.రా.	1	,,

* ఈ గుర్తుగల వాక్యములు బహుమతిపత్రమున వ్రాయబడినవి.

—మరుపూరు కోదండరామ రెడ్డి.

[గ్రంథాలయ పతాకమును గూర్చి గతమాసమున శ్రీ ఊటుకూరు వేంకటసుబ్బరాయశ్రేష్ఠిగారు కోరిన దానికి బదులుగా మువ్వురు తమ అభిప్రాయములను తెలిపియున్నారు. ఆమువ్వురి అభిప్రాయముల క్రింద ముద్రించుచున్నారము. —సంపాదకుడు.]

గ్రంథాలయోద్యమము.

గ్రంథాలయపతాకము

౧

వేదకాలమున జ్ఞానాభివృద్ధికి, సర్వభూత దయకు ముందంజ వేసిన హిందూమతము నేడు భిన్నభిన్నశాఖలుగా నేర్పడి పెక్కు దేవుళ్లను, దేవతలను ఆరాధించుచూ వాటికి ప్రత్యేకాలయములు నిర్మించి, పరస్పర కలహములతో పొట్టనింపుకొనుచున్నది. వైష్ణవులంటే శైవులకు గిట్టదు. శైవులంటే వైష్ణవులకు అసహ్యము. అల్లాంటప్పుడు బ్రహ్మకు, ఆయనభార్య సరస్వతమ్మకు కూడా గుళ్లుగోపురాలు ఉంటే అధికముగా ఇంకొక తెగ బయలుదేరేది. మనకు ఇప్పుడున్న దేవుళ్లు, దేవతలు చాలును. పురుషసూక్తములో వర్ణింపబడిన ఏకేశ్వరోపాసన పేరైనా లేకపోయింది. హిందువుడు ప్రతిపనికి వేర్వేరు దేవతులను కొలుస్తున్నాడు. ఒక్కడిమీద నిశ్చలభక్తి నిల్పలేడు. అల్లాంటప్పుడు సరస్వతిని కూడా తెస్తే ఇంకా ఆఅనిశ్చలత్వము వృద్ధిచేయుట మవుతుంది. కనుక సరస్వతికి గుడికట్టించి మనము విచారింపబని లేదు. అయినా సరస్వతి హిందువుల దేవతేగాని మన దేశమందుగల ఇతరమతస్థులగు మహమ్మదీయులు, క్రైస్తవులు మొదలగు అన్యమతస్థుల దేవతగాదు. గ్రంథాలయాలు అన్ని మతములకు అన్నిజాతులకు చెందినవిగాని, కేవలము ఒక్క హిందూసంఘమునకే చెందిన విజ్ఞానవస్తువుగాదు. కనుక సరస్వతిని పతాకముమీద చిత్రిస్తే అన్యమతములు సహింపకపోవచ్చును. ఏమతమువారైనను హిందువులందఱికి కావలసింది భారతమాత. భారతదేశపటమును వేసి, అందు భారతమాత తనబిడ్డలందరికిన్ని పుస్తకాలద్వారా జ్ఞానము పంచిపెట్టుతూవున్నట్లు చిత్రిస్తే బాగావుంటుందేమో! 'బిడ్డలందరు' అనగా పటములో అన్నిజాతులవారును అన్ని మతాలవారును. ఇలా పతాకము తయారుచేస్తే సర్వసమత్వముగా అన్నిమతాలవారికిని గ్రంథాలయాలు స్వాగతమిస్తున్నట్లుగా వుంటుంది.

—వల్లభుదాసు రాజగోపాలరావు, బి. ఏ.

౨

ప్రపంచములోనున్న సర్వదేశస్థులును ఎల్లవిద్యల కధిదేవత స్త్రీగాని పురుషుడుగాడని నిర్ణయించియుండుట యందఱకు తెలిసినవిషయమే. హైందవులు తమ దేశ

మును మాతృభూమియనియు, ఇతర దేశస్థులు తమతమ దేశములను పితృభూములనియు ప్రకటించునట్లు వాగ్దేవతావిషయమున భిన్నాభిప్రాయములు లేవు. కనుక విద్యాస్వరూపిణి లలనామణి యనియే సర్వజన సమ్మతము. రమణీయమగు ఆమె ప్రతిమ పతాకమున నుండవలసినదే. కాని విద్యాదేవి కరములలో వీణెకన్న అజ్ఞానదైత్యమును పారదోలు అర్థమిచ్చువిధమున బల్లెముండిన బాగుండునని నాకు తోచుచున్నది.

—నరహరిశెట్టి శేషగిరిరావు.

3

ఆంధ్ర దేశ గ్రంథాలయోద్యమ నాయకులలో నొకరగు శ్రీ ఊటుకూరు వేంకట సుబ్బారావు శ్రేష్ఠిగారు చెప్పినచొప్పున గ్రంథాలయోద్యమమునకుకూడ పతాకముండుట శుభావహమని ఎల్లరును అంగీకరింతురు. ఈ పతాకముపై పుస్తకమును, జ్యోతియు ప్రదర్శించిన అన్నిమతముల వారికిని అంగీకారమై యుండును. అజ్ఞానమును, అంధకారమును పారద్రోలుటకు పుస్తకము, జ్యోతి పరికరములు. అజ్ఞానాంధకారమును పారద్రోలుట ఉద్దిష్టమైన గ్రంథాలయముల పతాకములపై అజ్ఞానాంధకారమును తొలగించు పరికరములగు పుస్తకము, జ్యోతియు ఉండుట ఎంతయు సముచితముగ నుండునని నా అభిప్రాయము.

—అ వేంకటరామయ్య, బి. ఏ.

గ్రంథాలయముల పూర్వోదంతము.

గ్రంథములు వేదయుగమునుండి మనకు ప్రబుద్ధములై యుండుటచే వాని పుట్టువు కాలమిదియని స్ఫురించెడు. ఆకాలమునఁ బండితసమావేశములున్నట్లు కనఁబడుచున్నవి. అప్పుడు గోష్ఠిస్థలము లున్నట్లును, అందు గ్రంథ థానమును, ఉన్నట్లు ప్రమాణముల వినంబడు. అట్టి పరిషత్తులందు గ్రంథపేటికలుండెను. గ్రంథములు పారిషదులచేఁ దేఁబడుచుండెను. అవి కేంద్రస్థానములనుండి శాఖాస్థానములకు గొనిపోఁబడుచుండెను. ఇప్పు డమెరికాఆస్ట్రేలియాల లోని సంచారగ్రంథాలయములు దీని స్మరణచిహ్నములేమో? కొన్ని పరిషత్తులు నియమితకాలానుకూల్యముగను, మఱికొన్ని నిత్యములై గురుకులాశ్రయములకు దోఁబుట్టువులుగను ఉండెను. స్థిరపరిషత్తులందు స్థిరగ్రంథపేటికలు విరాజమానములు. ఇవియే కోశాగారములు. వీని యధ్యక్షుఁడు కోశాచార్యుడు. ఈతఁడు కోశాగారమందలి గ్రంథరత్నముల విలువ నెఱిఁగిన విశారదుఁడు. కోశాగారమందుఁ గోశాచార్యుడును, లిపింకరణుండు నను నిద్దరు కార్యనిర్వాహకులుండిరి. కోశాచార్యుఁడు కోశస్థగ్రంథములు స్వాంతముగఁ జదివిన చదువరియుఁ బాఠకులగు దర్శకులకు జనించు శాస్త్రసందేహములు తీర్చు వేత్తయునై యుండెను. ఈతఁడు రాజుల యాదరణమును ప్రజల యనురాగమును ఉపార్జించి, కోశాగారములను సర్వవిధముల నున్నతికిఁ దెచ్చుచుండెను. ఆగారమందలి పురాతన ప్రశస్తగ్రంథములను వ్రాయుటయే లిపింకరణుని కార్యము. ఇట్టి యాగారముల కార్యావర్తమే మొదటిచోటు. ఋషుల యజ్ఞశాలలందలి ప్రాగ్వంశములు పవిత్రకోశాగారములయి యుండెనని యూహపొడముచున్నది. గాని శ్రాద్ధ, విశ్వవార, వాక్కుప్రభృతులగు తపస్వినులకు ఆకోశాగారములు విద్యాక్షేత్రంబులై యుండెను. కానఁ గోశాగారముల జననము ప్రాచీనమునులకు సమకాలికముగఁ గన్పట్టుచున్నది. (ఉగాదిసంచిక.)

—సాహిత్యసరస్వతి నారాయణశర్మ.

శ్రీ ఓం

ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.



మహిళా లోకము



నేటి అమెరికను స్త్రీలు

నేటి అమెరికనుస్త్రీల స్వాతంత్ర్యమును తిలకించి గొప్పగొప్ప నాయకులుగూడ భయభ్రాంతులగుచున్నారు. అయితే ఇచట అమెరికనుస్త్రీల స్వాతంత్ర్యపథమును విమర్శించుటగాక పరిచయము చేయుటయే మాయుద్దేశము.

౧. వివాహముఅనిన విముఖత్వము

అమెరికనుస్త్రీల స్వతంత్రభావములు తొలుత దాంపత్యజీవితమున ప్రస్ఫుటములైనవి. భార్యాభర్తల జీవితమున పరివర్తనమేగాదు అసలు వివాహసమస్యయే చిక్కులపాలాయెను. స్త్రీలు ఉన్నతినందుచున్నకొలదియు వివాహపద్ధతిని అసహ్యముగ జూచుచున్నారు. వివాహము తమ్ము పనికిరానివారలగ నొనర్చుచున్నదనియు; పురుషులకువలె తామును అధికవిద్యాసంపత్తినందుటకు వివాహమునకు దూరముగుటయే మార్గమనియు వారిభావన. వైవాహికబంధమునజిక్కి, సంతానమునుబొంది, బిడ్డలపోషణమునను గృహకార్యనిర్వహణమునను దగిలియుండినచో స్త్రీ పేర్కొనదగిన ఏపెద్దకార్యమును చేయజాలదని వారినమ్మకము. ఇందుకు ఫలితముగ అమెరికనుస్త్రీలలో వివాహమును ద్వేషించువారిసంఖ్య క్రమముగా వృద్ధిచెందుచున్నది. విద్యాలయములందు, ప్రభుత్వమువారి కార్యాలయములయందు, ఇతర కంపెనీలయందు, కమ్మరము వడ్రంగము మొదలగు కర్మాగారములయందు నేడు అమెరికనుస్త్రీలు విరివిగ ప్రవేశించి తమ నైపుణ్యమును ప్రదర్శించుచున్నారు. భవననిర్మాణము మొదలగు ఇంజనీరింగుపనులయందును, మోటారునడుపుట విమానచోదనము మున్నగు విద్యలయందును వారు సిద్ధహస్తలైయున్నారు. పెండ్లి కారాగారముగ స్త్రీలు భావించుచుండుటవలన పురుషులును వివాహమును ఒక ఆపదగనే భావింప ప్రారంభించిరి. అమెరికనుస్త్రీల జీవితధ్యేయములు సామాన్యులు భరింపరానంతగ నుండును. అచటిస్త్రీలు వివాహమాడుచో స్వస్థుడు, విద్యావంతుడునగు శ్రీమంతులనే వరింతురు. పురుషులును విద్యావతి, సుందరియగు యువతులనే వివాహమాడుదురు. దీనికి ఫలముగా అమెరికాదేశమున అవివాహితుల సంఖ్య దినదినమునకు పెరిగిపోవుచున్నది. అచట దాంపత్యజీవితమిట్లు విపరీతపరివర్తనమును గాంచినది. మనదేశమునందువలె వివాహముగావించు భారము అచట తలిదండ్రులపై నుండదు. యువతీయువకుల యంగీకారములేక జననీజనకులు వైవాహికసంస్కారము నెరవనేరరు. వధూవరులు ఒండొరులు అంగీకరించినచో ఆ వివాహమును తలిదండ్రులు ఆపలేరు. వివాహమునకు పూర్వము యువతీయువకులు ఒకరిస్వభావాదులొకరు పరిశీలించుకొందురు. ఒకరివలన నొకరు తృప్తిచెందిన యనంతరమే వివాహమునకు గడంగుదురు.

౨. వివాహప్రమాణవాక్యములలో మార్పు

అమెరికాదేశమున వివాహకలాపము అతిసులభమైనది. వివాహనిర్ణయము అయినతోడనే వధూవరులిరువురును తమప్రాంతపురిజిస్ట్రారుకడకు బోయెదరు. అచట ఆజ్ఞాపత్రము పొందవలసియుండును. అనంతరము ఇరువురును ఒక సివిలు సర్వెంటు సమక్షమునగాని, చర్చిలో పాదిరియెదుటగాని వైవాహికసంస్కారమును జరుపుకొందురు. వివాహమునకు నాలుగుకువ సమయమేపట్టును; ఆసమయమున వధూవరులిరువురును

కొన్ని ప్రమాణవాక్యము లుచ్చరింపవలసియుండును. వరుడు "నేడు ఈమె నాకు పత్నియైనది. నేను నా సుఖదుఃఖములలో - ఎట్టిస్థితియందైనను ఈమెను ఆదరమున జూతును. నాజీవితాంతమువరకును ఈమెను విడనాడను. మఱియు ఈమెకు సర్వదా సహాయభూతుడనైయుందు" నని ప్రమాణముచేసిన యనంతరము వధువును అదేవిధముగ పతినిగూర్చి ప్రమాణముచేయును. కాని స్త్రీప్రమాణవాక్యములలో "ఎల్లప్పుడును నేను నాపతిఆజ్ఞకు అనువర్తినినైయుందు" నను వాక్యము మాత్రము అధికముగనుండును. ఈవాక్యము అవమానకరముగనున్నదనియు, ప్రమాణవాక్యములనుండి దీనిని తొలగించివేయవలయుననియు ఆందోళన స్త్రీలలో ప్రారంభమాయెను. స్వతంత్రభావసంపూరితలగు స్త్రీలు ఈ వాక్యమును గర్హింపసాగిరి. పాదిరీలు ప్రమాణవాక్యములనుండి దీనిని తొలగింపక 'ఇది బైబిలులోనిది. తీసివేయుటకు వీలులేదు. అయినను ఆచారము ననుసరించి ఉచ్చరించిన మాత్రమున నష్టమేమి?' అని కాలము వెళ్ళబుచ్చుచుండిరి. అది మొదలు అమెరికను నారీలోకము ఆవాక్యమును నామమాత్రముగ తలంచుచున్నారు. ఈప్రమాణవాక్యములతో వివాహకార్యము తుదముట్టును. పిమ్మట భార్యాభర్తలు వేఱుఇంట కాపురమును ప్రారంభింతురు.

౯. ఇంటిపనులన్నియు ఎలక్ట్రిక్ మీటుతోడనే

అమెరికాలో గృహనిర్వహణభారము స్త్రీలనుండి క్రమముగ తగ్గుచున్నది. అమెరికాదేశమునందలి సుప్రసిద్ధనగరముల విశేషములు ఆశ్చర్యజనకములుగ నుండును. నిరుపేదల ఇండ్లయందుతప్ప మిగిలిన అన్ని తరగతులవారి గృహములందును సమస్తకార్యములును విద్యుచ్ఛక్తివలననే జరుగుచుండును. దుస్తులు కుట్టుట, ఉదుకుట, ఇస్త్రీచేయుట, గృహమును శుభ్రపరచుట, వంట మొదలైన పనులు ఏవియునుగూడ చేతులతో చేయవలసినపనిలేదు. భోజనమును తయారుచేయుటలో పొయ్యిసెగను కాగవలసినగతి యచటిస్త్రీలకు లేదు. అందుకును విద్యుత్ యంత్రములే కలవు. బియ్యము, శాకములు, మాంసము మొదలగునవి శుభ్రపఱచి పొయ్యిపైనిడి విశ్రాంతిమందిరములోనికి పోవచ్చును. విశ్రాంతిమందిరములోనే యుండు ఎలక్ట్రిక్ మీటును భోజనసమయమునకు కొంచెముముందు నొక్కినమాత్రమున వంటయింట నవి ఉడుక ప్రారంభించును. పొయ్యికడనుండి ఈగదిలోనికి ఉన్న థర్మామీటరుద్వారా భోజనమైనదిలేనిది తెలిసికొనవచ్చును. ఆయంత్రమునకు సంబంధించియే ఒక గంటయుండును. భోజనము సిద్ధము అయినతోడనే అది మ్రోగును. ఎప్పుడైనను గృహిణి అన్యత్ర పోవలసియున్నచో తాను తిరిగి వచ్చువరకును సమయమును ఎంచుకొని దానినిబట్టి పొయ్యికి ఇంతవేడి కావలెనను నిర్ణయముతో యంత్రమునందలి ముల్లును త్రిప్పి తనదారిని పోవును. ఆమె వచ్చునప్పటికి భోజనము సిద్ధమై అరిపోక వేడిగ నుండును. ప్రాతఃకాలమున ఉపాహారము చేసికొను నిమిత్తముగూడ అమెరికను స్త్రీ పెందలకడ లేవవలసిన అవశ్యకతయుండదు. మంచముపై పరుండియే ఎలక్ట్రిక్ మీటులనొక్కి యన్ని ఏర్పాటులు చేసికొనును. అవసరమైనపుడు లేచిన తయారుగనున్న ఉపాహారములభించును. అమెరికను స్త్రీలు తమగృహములను ఆఫీసులవలె చక్కగ నలంకరింతురు. ఎంత చిన్నగృహములైనను వారు చేసిన అలంకారములచే శోభాయమానములై ఉల్లాసమును గల్గింపగల్గియుండును.

౯. తమబిడ్డలకు తాము పాలీయరు.

పిల్లలనుగనుట, వారినిపోషించుట అమెరికను స్త్రీలకు చాలవఱకు అసహ్యమైనది. వివాహమాడిన స్త్రీలకు నారీసంఘమున గౌరవ మంతగా లేదు. వివాహితలగు స్త్రీలను అవివాహితలగు స్త్రీలు అపహాస్యమొనరింతురు. వివాహితలగు స్త్రీలు సంఘమునందు అడుగడుగున అపరాధముచేసినవారివలె సంచరింపవలసియుండుట అరుదుగాదు. వివాహమాడుటకంటెను సంతానమును బడయుట మఱింత అసహ్యకార్యముగ పరిగణింపబడుచున్నది. సంతానోత్పత్తివలన స్త్రీ దేహస్వాస్థ్యమును, యౌవనమును, సౌందర్యమును గోల్పోవునని అమెరికను స్త్రీలభావము. అచటి స్త్రీలు తమ బిడ్డలకు తామే పాలీయక పాలదాదులచే నిప్పింతురు.

చాల ఆరోగ్యముగను, శుభ్రముగను ఉండువారే పాల దాదులుగ నియమింపబడుదురు. పిల్లలకు పాలిచ్చుటచే ఆరోగ్యసౌందర్యములు చెడునని అచటి స్త్రీలు వారి పోషణము దాదులచేతులయందే యుంతురు.

౯. సౌందర్యపోషణమే వారి పరమావధి

తమ సౌందర్యమును పరిపోషించుకొనుటకును, వృద్ధినొందించుకొనుటకును విశ్వప్రయత్నములను చేయుదురు. సౌందర్యపోషణమునకై వారు వెచ్చించు కాలము, ధనము సులభముగా లెక్కకట్టరానిది. వారి జీవితములో స్వాస్థ్యరక్షణాగ్రహము ప్రబలమగు నిచ్చ కలుగుటకు కారణము వారి సౌందర్యాభిలాషయే. ఫేషనులలో పాశ్చాత్యదేశములకన్నిటికిని ముందడుగు వేయగలది అమెరికా. అచటి స్త్రీల విలాసప్రియత్వము, సుఖోపభోగేచ్ఛ దినదినమును వృద్ధినందుచున్నవి.

—గద్దె లింగయ్య చౌదరి.

స్త్రీలు : ప్రభుత్వ బాధ్యత

[నవంబరు ౪-వ తేదీని ఏలూరుపురమునగూడిన సప్తమాంధ్రరాష్ట్రీయమహిళాసభకు అధ్యక్షత వహించి శ్రీమతి డాక్టరు ముత్తులక్ష్మిరెడ్డిగారిచ్చిన ఉపన్యాసమునుండి ఈ పంక్తులు గైకొనబడినవి.]

"(ఎ) ఆరోగ్యము అనుకూలవాతావరణము అనగా ముఖ్యముగా మంచిజనావాసములు. (బి) విద్య. (సి) జీవనోపాధి—అనగా మనకు కావలసిన వస్తువులను ఉత్పత్తిచేయుట. లేదా, మనకు కావలసినవానికొరకై బదలీగా ఇతరవస్తువులను తయారుచేసి యిచ్చుట. (డి) పౌరస్వామ్యములు—అనగా వ్యక్తిస్వాతంత్ర్యమున్ను, సర్వసమత్వముగల న్యాయపరిపాలనయున్ను—ఇవన్నియు ఇంటిలోని కుటుంబినియగు తల్లికి ముఖ్యములైన విషయములు. అవి ఆమె జీవితమును కుటుంబజీవితమును తారుమారు జేయగలవు. కనుక శాసననిర్మాణములయందు స్త్రీసౌఖ్యము కలుగచేసికొనవలసియున్నది. అనగా ఎన్నికలలో తను బాధ్యత వహింపవలసియున్నది. అట్లయినచో శాసనసభలకు తగినవారినిపంపి వారిద్వారా న్యాయచట్టములను నిర్మించి తద్వారా తమ సంసారములను పైనచెప్పిన నాలుగు అపాయములనుండి రక్షించుకొనగలరు. కావుననే స్త్రీ వోటరుల సంఖ్య అధికముగనుండవలయుననియు, వారు స్వతంత్రలై, విద్యావివేకవతులై ఓట్లు నీయవలెననియు మా విజ్ఞాపనమునందు మేము ఇంగ్లాండులో మనవిచేసియున్నాము. మన పిల్లలకు చక్కనివిద్య, ఆరోగ్యము, శరీరదార్ఢ్యము, జీవనోపాధి కావలయును. ఇవి లభించుటకనువైన పరిపాలనావిధానములను నిర్ణయించుటలో మనమాట చెల్లుబడియగుటకు మనకు శాసనసభలలో తగిన ప్రాతినిధ్యముండవలెను. మన పిల్లలకు నిర్బంధప్రాథమికవిద్య యుండవలెననియు, పాఠశాలలోని పిల్లల ఆరోగ్యదార్ఢ్యములను వైద్యులు పరీక్షించుచుండవలెననియు, తల్లులకును బిడ్డలకును రక్షణశరణ్యముల నొసంగవలెననియు, బీదలకు ఆరోగ్యకరమైన వసతుల నేర్పరచవలెననియు, వైవాహికపద్ధతులను సంస్కరించవలెననియు, మనవారసత్వపు హక్కులను సంస్కరింపవలెననియు, స్త్రీపురుషుల పరస్పరసంబంధము లుత్తమనీతిదాయకములై యుండవలెననియు, స్త్రీలను బాలికలను వ్యభిచారవృత్తికై యులవరచు వ్యాపార మడుగంటవలెననియు మనము కోరుచున్నాముగదా. ఇవన్నియును మనలను రాజకీయరంగములోని కీడ్చుచున్నవి. దేశమునకు భవిష్యన్నాయకులై పౌరులై వెలయగల మనబిడ్డల యోగక్షేమముల కనువగు రీతిని ప్రభుత్వపరిపాలనాపద్ధతులను నిర్ణయింపజేయుటకై మనము రాజకీయములందు పాల్గొనకతప్పదు. ఇతర దేశములలోని స్త్రీలు రాజకీయవిషయములను చర్చించుచుండగా మనమేల చర్చింపరాదు? పురోభివృద్ధినందుచున్న ఆదేశముల స్త్రీలవలె మనమేల వ్యవహరింపరాదు?"

విడ్డూరములు

§. ఏడాదిబిడ్డ సరస్సులో ఈదుట

కాన్‌టన్ పరిసరమునగల లవ్‌కవ్ సరస్సునందు పడవలవాడొకడు ఒకపడవపై కాపురముండెను. వాని కూతురు—ఏడాది వయస్సుగలది - పడవలో ఆడుకొనుచు ఆడుకొనుచు ప్రమాదవశమున నీటిలో పడిపోయెను. తల్లి మొదలగువారు ఆమె నీటిలో మునిగిపోవునని ఆలజడినొందిరి. కాని ఇంతలో ఆబిడ్డ ఆశ్చర్యకరముగ తానుపడిన తావునుండి ఒడ్డువఱకుగల ఇరువది అడుగులదూరమును ఈదుకొనుచుపోయి గట్టు చేరెను. అచ్చటివారు ఆ శిశువును పైకెత్తిరి. ఇంతకు పూర్వము ఆ శిశువునకు ఈదుటఅలవాటు నేర్పబడియుండలేదు. ఈ అద్భుతకృత్యము చేసినందులకు ఆ బిడ్డకడ ఏదియో గొప్పమహత్తు ఉండియుండునని ఆచెంతగల గ్రామవాసు లందరును నమ్ముచున్నారు.

§. పందొమ్మిదిమాసములనుండి ఒకటే నిద్ర

పెట్రీషియా మాగ్వ్యారి అని ఒక అమెరికనుస్త్రీ. ఆమె ఇరువదియేండ్లది. పందొమ్మిదిమాసములనుండి ఆమె ఒకటేనిద్రలో మునిగియున్నది. నిద్రనుండి ఆమెను లేపుటకు భిషగ్వరులు పలువురు పలుసారులు ప్రయత్నించి విఫలులైరి. ఈ నిద్రలో ఆమెకు రెండు పుట్టినరోజులు గడచిపోయినవి. ఈ నిద్రలో ఆమెకు నిస్సత్తువకలుగుటకు మారుగా ఆమె తూనిక హెచ్చినది; ముఖవర్చస్సు, దేహసౌందర్యము పెంపొందినవి. ఈ నిద్రాసమాధిలోనే ఆమెకు నికటితీతకాలమున న్యుమోనియావ్యాధి సోకి నివారణ అయినది. ఇట్లు నిద్రపోవుటకు కొన్నిదినములకు పూర్వము నిత్యము ఉదయమున ఆమెను నిద్రనుండిలేపుట అతికష్టముగానుండెను. ఒకనాడు ఆమె తానుపనిచేయు ఆఫీసునుండి వచ్చుచు రైలులోనే నిద్రపోయెను. తాను దిగవలసిన స్టేషనులో అతికష్టముమీద దిగి విశేషశ్రమతో ఇంటికి నడచిపోయెను. ఇంటికిపోయి ఆమె పండుకొనెను. అప్పటికి ఇప్పటికి ఆమె పాదచలన మెఱుగదు. ఆమె ఇట్లునిద్రాసమాధిలోపడిన కొలదిదినములలో ఆమెకు నర్సుగానుండిన ఆమె ఇపుడు పెండ్లియాడి పిల్లతల్లియైనది. పెట్రీషియాకు ఈ పందొమ్మిది మాసములుగను కోడిగ్రుడ్లు, పాలు, నారింజరసము ఆహారముగ నిచ్చుచున్నారు. మన పురాణములలో కుంభకర్ణుడు ఆరుమాసములు ఒకటేనిద్రలోనుండుట వర్ణింపబడియున్నది. పెట్రీషియా విషయము దీనినికూడ మించుచున్నది.

§. ఒకేసారిపుట్టి ఒకేసారిచనిపోయిన కవలలు

లీసెస్టరునందు మెగ్రీఫిల్డు కుటుంబమున పాలిన్, లియోనార్డు అను కవల పిల్లలు పుట్టిరి. వారు పదునొకండువారములుమాత్రము జీవించిరి. జీవించిన ఈస్వల్పకాలమునందే వారు తమ ప్రవర్తనమువంకలి సాదృశ్యముచే తలిదండ్రులను, వైద్యులను సంభ్రమాశ్చర్యములకు గుఱిచేసిరి. ఈ శిశువులకు శరీరములు వేరైనను ఆత్మఒక్కటియేనా అను సందేహము పొడమెను. ఒండొరులను స్పృశించుచుగాని వారు నిదురింపరు. ఒక శిశువు నిద్రించుచుండగా రెండవ శిశువునకు పాలు మొదలగునవిపోయుచో నిద్రించుచున్న శిశువుకూడ ఏదియో త్రాగుచున్నటుల పెదవులు కదుపును. ఒకనాటి సాయంకాలము పాలిన్ అను శిశువునకు ఈడ్పురోగము తగిలి మరణచిహ్నములు కనిపించెను. తండ్రి డాక్టరుకడకు పరువెత్తెను. ఈలోగా రెండవ శిశువగు లియోనార్డునకు కూడ పెద్ద జబ్బుతగులుటచే ఆసుపత్రికి గొనిపోవలసి వచ్చెను. శిశువు లిరువురును ఒకేక్షణమున మరణించిరి.

§. ఏడేండ్లు నిండని బాలిక ప్రసవించుట

'బ్రిటిష్ మెడికల్ జర్నలు'లో ఢిల్లీ డాక్టరు ఒకడు

ఇట్లు వ్రాయుచున్నాడు: "ఏడేండ్లు నిండని ఒక మహా మ్మదీయబాలిక ఒక ఆడశిశువును ప్రసవించెను. పుట్టిన పుడు శిశువు నాలుగుపౌనుల మూడు ఔన్సులు తూ నిక ఉండెను. ప్రసవించిన మూడుదినములవఱకు తల్లికి ఈ అపూర్వప్రసవమునుగూర్చిన భయము హెచ్చుగ నుండెను. మఱి యేవ్యాధియులేక ఆమె శీఘ్రముగ ఆరోగ్యమునందెను. ఆమె ప్రసవించి ఇప్పటికి తొమ్మిదిమాసములైనది. ఈ తొమ్మిదిమాసములుగ ఆమె శిశువునకు చాలినన్ని పాలియగలుగుచునే యున్నది. ఇపుడు శిశువు పదునొకండు పౌనుల రెండు ఔన్సుల తూనిక ఉండెను. ఆరోగ్యశాఖాధికారి బాలిక వయస్సును నిర్ధరించుచున్నాడు. ఇంత పసితనమున ప్రసవించిన బాలికల వృత్తాంతములు ఇక నేమైనగలవా?"

§. తల్లికి, కూతురికి, కొడుక్కి ఒకేనాడు పెళ్లి

యార్క్‌షైరు చర్చిలో ఒకేనాడు తల్లికి, కూతురికి, కొడుక్కి వివాహములు జరిగెను. పాశ్చాత్యనాగరికత ఎంతటి అభివృద్ధినందినదో!

§. నేలమీదనడుచు చేపలు

బెరన్‌హార్డు శ్రీమాన్ అను నత జీవకుడు 'శ్రీమాన్ ఆఫ్ స్ట్రాంబక్' అనుగ్రంథమును ప్రచురించెను. అందు తాను ఆస్ట్రేలియాలో నేలమీదనడుచు చేపలను చూచినవిధ మిట్లు వర్ణించుచున్నాడు. "ఎటు చూచినను అరమైలులోపున నీళ్ళులేని ఒకదిబ్బమీది పల్లములో నేను మూడు చేపలను చూచితిని. ఒక్కొక్కటి ఒక అడుగు పొడుగు ఉండెను. అవి సజీవములై ధారాళముగ గాలిని పీల్చుచుండెను. అవి 'సిరాటోడన్' అనుజాతికి చెందిన చేపలు. వానికి ఒక్కటే ఊపిరితిత్తి ఉండును. బయట - అనగా నీటిలోగాక - అవి పెక్కుదినములు ఉండగలవు. అవి అప్పుడపుడు చెట్లపలకలలో నివసించుచుండుటగలదు. ప్రస్తుతము ఆ మూడు చేపలను ఆ దిబ్బమీదికి వరదసమయమున కొనిరాబడియుండు ననియు, అప్పటినుండి అవి అచట ఉండియుండుననియు ఊహింపవలసియున్నది."

§. రెండుతలల తాబేలు

ఈనడుమ అమెరికాఖండమున రెండుతలల తాబేలొకటి కానవచ్చెను. బాగుగా పరీక్షచేసినమీద రెండుతలలు కలిగియున్న విషయమునతప్ప మిగిలిన ఏ విషయమునందును వింతలేదని తెలియవచ్చినది. రెండు తలలుఉన్నను ఈవిద్యారకుజంతువునకు ఒకటే వెన్నెముక ఉండెను. కంఠస్థానమునుండిమాత్రము వేరైన రెండు తలకాయలు ఏర్పడియుండెను.

§. చంద్రలోకమునకు కనిపించు దీపము

ఈనడుమ జర్మనులు ఒక బ్రహ్మాండమగు పొగ ఓడను నిర్మించిరి. అది ఇపుడు బాల్టిక్ సముద్రమున ప్రయాణము సల్పుచున్నది. ఆఓడకుగలదీపము అఖండమైనది. దానికి 8,000,000,000 కొవ్వువత్తుల కాంతి గలదు. చంద్రగోళమున నివసించు జీవికి ఈ అఖండ జ్యోతి ఖగోళమునందలి ఆరవ అర్ధమునుచెందిన నక్షత్రమునుండి వచ్చుచున్నట్లు కనుపించును. ఈ అఖండ జ్యోతి మానవుని బుద్ధిబలమున కొకనిదర్శనము.

§. గానమున కిట్టిశక్తిగలదు

ఆల్‌ఫ్రెడ్ మిహ్నాప్ అని నార్వేదేశపు వ్యాపారస్థుడు. అతను ఇరువదిసంవత్సరములు నిరంతరపరిశ్రమ సల్పి సంగీతమువలన ఆహారపదార్థములనుకూడ నిలువ చేయవచ్చునని కనుగొనినాడు. రోగములను మాన్పుటలో గానము శక్తిమంతమైనదని శాస్త్రజ్ఞులీవఱకు కనుగొనియున్నారు. ఆహారపదార్థములు పాడగునట్లు చేయు క్రిములను నాశనముచేయుటకును సంగీతమునకు శక్తికలదని ఇపుడు కనుగొనియున్నారు. ఈపరిశోధన యొక్క నిజానిజములను తెలిసికొనుటకై హెర్‌బ్రఫ్ అను రసాయనికశాస్త్రవేత్త ఆరుమాంసఖండములను గొని అందు మూడింటికి ముప్పది నిముసముల సంగీతప్రాప్తి కలిగించెను. ఈమూడింటిని ఒక పెట్టెయందును, మిగిలిన మూడింటిని మఱియొక పెట్టెయందును జాగ్రత్తచేసెను. ఒకవారము జరిగినపిమ్మట ఆ రెండు పెట్టెలను తెఱచిచూచిరి. సంగీతప్రాప్తినందిన మూడు మాంసఖండములును చెక్కుచెదరక యథాస్థితియందుండెను. కూరగావండుకొని ఉపయోగించుటకు అర్హములై యుండెను. సంగీతము నందజాలకుండిన మూడు మాంసఖండములును బాగుగా చెడియుండెను.

ఆరోగ్యవిజ్ఞానము

౬. గొంతుక బొంగురుపోయినపుడు

సీటిపల్లటముచే గాని; క్రొత్తచింతకాయ, వాక్కాయ, పచ్చివెలగకాయ మున్నగు కాయలపచ్చళ్లు తినుటచే గాని; ఉపన్యసించుట, పాడుట, పోట్లాడుట మున్నగు కంఠములో చేయుపనులను అధికముగ చేయుటచే గాని అపుడపుడు కొందఱకు గొంతుక బొంగురుపోవుచుండును. గొంతుకలోని కొన్నిపొరలు ఉబ్బి పైకి లేచి కంఠమును మూసివేయుటచేతనే బొంగురుగొంతుక కలుగుచున్నది. బొంగురుగొంతుక కలిగినపుడు అనాసపండురసమును త్రాగవలెను. కంఠములో ఉబ్బి పైకి లేచి స్వరమును వికారముగాచేయు సన్నని పొరలను అనాసపండురసము కోసివేయును. అందుచే కంఠస్వరము వెంటనే స్వాస్థ్యమునందును.

౭. నిమ్మరసము వాడదగు వ్యాధులు

పైన పూయుటచేతను, లోనికి తీసికొనుటచేతను నిమ్మరసము రోగకారకక్రిములను నాశనముచేయుటలో అమోఘముగ పనిచేయును. 'ఐయోడిన్' కంటె నిమ్మరసము ఉపయోగించుట మంచిది. ఐయోడిన్ రోగకారకక్రిములను చంపుటయేగాక చర్మపుపొరలను తినివేయును. నిమ్మరస మట్లుగాక చర్మపుపొరలకు ఎట్టిహానియు చేయక రోగకారకక్రిములను మాత్రము సంహరించును. భోజనాత్పూర్వమును, రాత్రి పండుకొనబోవునపుడును ఒక్కొక్క నిమ్మకాయరసమును తీసికొనుచో ఉబ్బసరోగము శాంతించును. పైత్యవికారములయందు ఆహారమును విడనాడి జీర్ణకోశమునకు పూర్తివిశ్రాంతి నిచ్చుచు దినమునకు ఐదుసారులు నిమ్మరసమునకు సమభాగముగా నీళ్ళు కలిపి తీసికొనుట చాలమంచిది. మొండికురుపులు, నాకలునాకలుగా పోయు కురుపులు, పుళ్లువ్రణములు వీనియందు నిమ్మరసమును ధారాళముగా పూయుచుండవలెను. పెద్దకురుపులకు మొనతేలువఱకు నిమ్మరసమును ఆరారగా పట్టించుచుండవలయును. మొనతేలినతరువాత ఒకనిమ్మకాయను బాగుగా వెచ్చచేసి రెండుబద్దలుగా కోసి ఓర్చుకొనగలిగినంత వెచ్చదనముండగానే కురుపుపై పెట్టి కట్టవలయును. కురుపుచితికిన తరువాత ఒక పైంటు వేడినీళ్ళలో ఒకనిమ్మకాయరసమును పిండి చీము ఓడిపోవునట్లు బాగుగా కడిగి పిమ్మట కట్టుకట్టవలయును. పడిసెములయందు నిమ్మకాయను నిప్పుల పొయ్యిలోవైచి తొక్క కాలి పగిలి రసముకారుటకు ప్రారంభమయినతోడనే తీసి రసముపిండి యుంచుకొని మూడుగంటలకొకసారి ఒకమిల్లిగరిటెడు ఆరసమును పుచ్చుకొనవలెను. శిశువులకైనచో ఈరసమున కొంచెము తేనె కలుపవచ్చును. రొంపభారము పూర్తిగ తగ్గువఱకు ద్రవరూపకమగు ఆహారమును తీసికొనుట మంచిది.

—సైంటిఫిక్ హెల్తు.

౮. పాలు సమగ్రమైన ఆహారము

క్షీరవిషయము ఇపుడు భారతదేశమున నొక పెద్ద సమస్యగానున్నది. ఆరోగ్యబలముల కొఱకు పాలు ఒక్క శిశువులకేగాక పెద్దవారికిగూడ ముఖ్యావసరమైయున్నవి. ఆహారముగా పాలయొక్క ఆధిక్యత ఆరోగ్యశాస్త్రవేత్తలు బహుధా వర్ణించియున్నారు. ఏ ఆహారపదార్థమునందును లేనిమాదిరిని పాలయందు వివిధపదార్థములు సమ్మేళనమునొంది వానిని సమగ్ర

మైన ఆహారపదార్థముగా నొనర్చుచున్నవి. పాలలో చక్కని సున్నపుపాలుగలదు. వీనియందలి ఫోస్ఫరస్ పదార్థముల కూడిక ఎముకల, దంతముల పెంపకమునకును, రక్షణమునకును సమర్థమైయున్నది. పాలయందు ఇనుము తక్కువగానున్నమాట నిజమేకాని ఉన్నకొద్దిపాటి ఇనుమును శీఘ్రముగా రక్తమున మిళితము కాజాలినదైయున్నది. మనము తిను పప్పుదినుసులలోని ప్రోటీనులకు సహాయభూతములు కాజాలి పాలలోని ప్రొటీనులు కండరముల ఆరోగ్యస్థితికి కారణములైయుండును. పాలలో కొవ్వును, పంచదారయు చక్కని పాళ్లగనున్నవి. 'లాక్టోస్' అనబడు పాలలోని ఈ పంచదార పేగులలో కుళ్ళుపదార్థము చేరకుండ చేయును. పాలలోని విటమినులు శరీరపోషణమును గావించును; కొన్ని రోగములనుండి మానవుని కాపాడును; కొన్ని రోగములయందు రోగనిరోధకశక్తిని కలిగించును. వివిధపదార్థములు ఒక్కచో లభించుటచే పాలు సమగ్రమగు ఆహారమై మానవునకు ఉపకరించుచున్నవి.

౬. వెలగపండు

ఈ రోజులలో వెలగపళ్ళు విస్తారముగ లభించును. వెలగపండు సర్వదా అపథ్యకరమైన పదార్థమని మనవారిలో పలువురి అభిప్రాయము. ఇది దురభిప్రాయమనియే చెప్పవలసియున్నది. కొబ్బరికాయకువలె దీనికిని పైన గట్టిపెంకుగలదు. అగుటచే దుమ్ము మొదలగు దుష్టపదార్థములు లోనికి చొచ్చుటకు వీలులేదు. లోపలిగుజ్జు సులభముగా చెడిపోకుండుటకుగాను ప్రకృతిమాత వెలగపండు విషయమున చక్కని కట్టుదిట్టము చేసినది. బాగుగా పండిన వెలగపండు సువాసనగానుండును; పెంకుపై తెల్లని, సన్ననిపొరలులేక వాని దిగువను మాగురంగును చూపును; పండు తేలికగనుండి కొంచము గట్టినేలమీదనైచినచో కొద్దిగా పైకిలేచి తిరిగి క్రిందికిపడును. ఇట్టి లక్షణములుగల పండు ఎన్నటికిని అపథ్యముగాదు. వస్తుగుణసర్వస్వము వెలగపండునుగూర్చి ఇట్లు చెప్పుచున్నది: "వెలగపండు సువాసనగలది, వేడిమిని పోగొట్టునది. బాగుగా పండిన పండులోనిగుజ్జు గడ్డకట్టిన మధురక్షీరముల రుచిగలిగియుండి తినదగియుండును. నోటనీరూరుట, కంఠము నొప్పి, కంఠములోవ్రణము, చిగుళ్లజబ్బు ఈ రోగములందు వెలగపండు చాల పథ్యమైనది. ఉప్పు, చింతపండు, మిరియములు మొదలగునవి వైచి వెలగపండు గుజ్జుతో చేయబడిన పచ్చడిగాని, మరబతుగాని ఇచ్చిన ఎక్కిళ్ళు, అజీర్ణవ్యాధి, పిత్తాధిక్యము, గొంతుక జబ్బులు నయమగును. వెలగపండు గుజ్జులో తేనె, పిప్పళ్ళచూర్ణము కలిపియిచ్చిన ఎక్కిళ్ళు, శ్వాసావరోధము నివారణమగును. విషపుపురుగుల కాట్లకు పైనపట్టించుటచే వెలగపండుగుజ్జు మంచి పనిచేయును." మందాగ్నికలవారు వెలగపండును తినుటలో ఒక మెలుకువను చూపనగును. (జామిపండులోని గింజలవలెనే వెలగపండులోని గింజలుకూడ సులభముగా జీర్ణముకావు. కావున వెలగపండుగుజ్జును తేలికగ తొక్కిపిసికి గింజలను విడదీసి మిగిలినగుజ్జును పచ్చడిగా చేసికొని తినుట హితకరము. వెలగపండు పచ్చడిలో కొంచము పంచదార చేర్చుకొనుట చాలమంచిది. పంచదార వెలగపండును విరుగుడువస్తువు కావున దానితో చేర్చుకొనితినుటచే వెలగపండువలని దోషములు కలుగకుండును.) వెలగపండులోని గింజలలో ఒక్కొక్కదానియందు అమృతముండుననియు, పండుఅంతయు ఒక్కరే తినవలెనుగాని ఇతరులతో పంచుకొని తినరాదనియు పెద్దలు చెప్పుదురు. మలబద్ధరోగము కలవారుమాత్రము వెలగపండును ఉపయోగింపకుండుట మేలు. కంఠదోషములను మొదలంట పోకార్చుటలో వెలగపండు సాటిలేనిది. గ్రంథాంతరమున వెలగపండుగుణములు ఇట్లు చెప్పబడినవి: "వెలగపండ్లు కఫహరములు, పిత్తహరములు మాత్రమేగాక శ్వాసకు సంబంధించిన నొప్పులు (అనగా నూపిరితిత్తుల నొప్పులు మొ.) మూలవ్యాధులు గ్రహణులు వెక్కిళ్ళు ఛర్దిరోగములు కాసరోగములు అరుచి శ్రమము శిరసము వాంతులు విదాహములు మున్నగు పిత్తరోగముల నన్నింటిని పోగొట్టును. త్రిదోషముల(వాతపిత్తకఫముల) ప్రకోపముల హరించును."

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౩౮. అడవిపువ్వులు

ఖండకావ్యముల సంపుటి. కృతికర్త : ఉభయ భాషాప్రవీణ మిన్నికంటి గురునాథశర్మగారు. 'ఈ గ్రంథమునందలి కతిపయాంశములకు మూలము గైర్వాణి. వానిని సంస్కృతప్రాస్తావికములను యథేచ్ఛాపరివర్తనము లనవచ్చును. మఱికొన్ని బహుసంఖ్యాకములు స్వతంత్రము.' విద్యావిభూషణులును, సాహిత్యసరస్వతులును, అమృతవారు సంస్కృతోన్నత పాఠశాలా ప్రధానాధ్యాపకులును అగు విద్వాన్ నా. వేంకటేశ్వరశాస్త్రిగారు ఈ గ్రంథమునకు వ్రాసిన పరిచయవాక్యములలో నిట్లు వ్రాసిరి. "ఇందలి వర్ణనములన్నియు మనకు నిత్యప్రత్యక్షములగు విషయములగూర్చినవి. కోయిల, పద్మము, బంగారము, కాకము, మబ్బు, చందమామ మున్నగు విషయములు కేవల వర్ణనపరములే కాక సుమనోహరధ్వనిసంయుతములును, ఆశ్చర్యద్భుతగీత్యుద్భావితములు నయి కావ్యమున కాత్మస్థైర్యమును సంతరించుచున్నవి. కావున రసికుల కుపాదేయములనుట పునరుక్తప్రాయము." శైలి తెలియుటకై మూడుపద్యముల నిట పొందుపఱచుచున్నారము :

చ. పదములకూర్పు, వాక్యముల
వైఖరి, సద్రసపుష్టి, యర్థ సం
పద, నవభావవిస్ఫురణ,
వ్యంగ్యవిలాసము, పద్యలక్షణం
బెది విడిపోవునో? యనుచు
వెన్నిరమె భంగులఁ జూడఁడా విశా
రదులగు పక్షివీంద్రులకు ;
రాజుల కేవఁ జెల్ల లేవుగా !

శా. లే దర్థంబు, స్వరంబులేదు, శ్రుతియున్
లే, దక్షరాబద్ధముం
గా దక్షస్తము గాదు, లాక్షణికముం
గా, దైన నేమీ? మహా
హ్లాదంబుం గలిగించి, తన్మయులఁ జే
యంజాలు మమ్మార! నీ
కీ దివ్యామృత మెట్లు ప్రాప్త పికమా !
యెట్లబ్బెఁ జైత్రంబునన్.

మ. సలుకంగా నగుఁ దుండెదుండెములుగా
నక్షై స్వరూపంబులన్,
గలకంగానుగనైవఁ గాకలరయ నీ
పారుణ్యతం, గానిచోఁ
కైలకా! బెల్లముపెట్టుమంచు నరుఁడుం
జే సాఁపఁ గాఁ బెట్టుఁడే?
వెలఁపుంగొల్పినఁ గాక సామమున ను
ర్వీం గార్యముల్ సాగునే?

సుందరరచనమున నొప్పుచున్న ఈ గ్రంథము సుందరముద్రణమునంది ఆకర్షణీయముగ నున్నది. విద్యార్థికారుల ఆదరణకు పాత్రమగుగాక ! క్రౌనుసైజున ౧౦౦ పుటలు. వెల రూ ౧-౦-౦. గుంటూరు టవున్ హైస్కూలు ఆంధ్రోపాధ్యాయులగు గ్రంథకర్తకు వ్రాసిన పుస్తకములు బడయవచ్చును.

౩౯. కవిజనరంజనము

పిల్లవసుచరిత్రయను ప్రఖ్యాతి నార్జించిన ప్రబంధములలో నొకటియగు ఈ కవిజనరంజనమునకు అడిదము సూరకవి కర్త. ఈ గ్రంథము మున్నెన్నడో ముద్రితమైనది. ఇపుడు ప్రతులు దొరకుటలేదు. అపరూపము లగు ఆంధ్రశృంగారప్రబంధములను శృంగారముద్రణమున వెలయించి భాషాసతిని సేవించుచున్న శ్రీగంటి సూర్యనారాయణశాస్త్రిగారు ఇపుడు తిరిగి ఆకవిజనరంజనమును ముద్రించి లోకమునకు చేకూర్చియున్నారు.

గ్రంథము మంచి ఫైనయువెయిటు కాగితములమీద ముద్రింపబడినది. ఆంధ్రప్రబంధముల కిట్లు ముద్రణవిషయమున సౌభాగ్యమునుకూర్చుచున్న శ్రీశాస్త్రిగారిని బహుధా ప్రశంసింపవలసియున్నది. కవిజనరంజనమునకు ఆంధ్రకవిత్వచరిత్రకారులును, కవులును, పండితులును అగు భోగరాజు నారాయణమూర్తిగారు సవిమర్శకమగు పీఠికను వ్రాసియున్నారు. అందు వారు కవిజీవితమును, కవితారీతులును వెల్లడించిరి. 'ఈ కవిజనరంజనము మొత్తముపై 260 పద్యములుగల మూఁడాశ్వాసముల గ్రంథము. ఇందలి ప్రధానకథ చంద్రమతీహరిశ్చంద్రుల వివాహమహోత్సవము. ఇందలికథ మిక్కిలి చిన్నదైనను కవి లాక్షణికుఁడగుటచే నష్టాదశవర్ణనములతోఁ గావ్యమునందంతటఁ దనయనల్పకల్పనాశిల్పమును విరివిగాఁ బ్రకటించెను.' గ్రంథము వెల రూ ౧-౦-౦. వలయువారు కళ్యాణిఆఫీసు, విజయనగరము, విశాఖపట్టణము జిల్లా, అను చిరునామాకు వ్రాయునది.

౩౮. త్యాగమహిమ

గ్రంథకర్త దేశసేవకులగు గొల్లపూడి సీతారామశాస్త్రిగారు. శ్రీవారు కడలూరు కారాగృహమునందున్నప్పుడు బౌద్ధసంబంధమైన వినయపిటక గ్రంథములు మూఁడింటిని చదివి వానిలో ముఖ్యములైన పదమూఁడు కథలను తెనుగుచేసి ఇవు దీక్షికలో కూర్చి గ్రంథరూపమున ప్రచురించిరి. శైలి సులభముగనుండి వడిగా సాగిపోవుచున్నది. కథలన్నియు ప్రాయికముగా త్యాగమహిమను రూపించుచున్నవి. బౌద్ధయుగమునాటి సంప్రదాయములు కొన్ని ఈగ్రంథపఠనమువలన తెలియవచ్చుచున్నవి. గ్రంథము క్రౌనుసైజున 80 పుటలు. మూల్యనిర్ణయమునుగూర్చి శాస్త్రిగారు తొలిపలుకులో వ్రాసిన క్రిందిపంక్తులు ఆంధ్రగ్రంథప్రచురణకర్త లందఱును గమనించుటలెస్స: "ఈ గ్రంథము అచ్చువేయుటకు రు 98-8-0 లు ఖర్చులు అయ్యెను. వాడినకాగితము టిటఘుర్ యంత్రశాలలో తయారైన స్వదేశీకాగితము. దీనివెల రు. 0-1-6. అన్నిప్రతులు అమ్మినయెడల రాదగినమొత్తం రు. 187-8-0 ప్రకటనఖర్చులువగైరా రుసుములు పోను మిగిలినది దేశసేవకై వినియోగించబడును. శుద్ధఖద్దరును చౌకచేయుటకు ఎట్లు వీలగునో ప్రజలకు ఉపయోగకరమగు గ్రంథములను గూడ చౌకచేయవచ్చునని దీనివలన బుజావగుచున్నది." రెండణాల తపాలబిళ్ళల నంపిన గుంటూరుజిల్లా ఖద్దరు సంఘము, గుంటూరునుండి బడయగలరు.

౩౯. చంద్రహారము

రాజమహేంద్రవరమునందలి వాణీగ్రంథమాలలో మూఁడవ కుసుమము. శ్రీయుత అరవ వెంకటస్వామిగారిచే రచియింపబడినది. భారతి, గృహలక్ష్మి, సమదర్శిని పత్రికలలో లోగడ గ్రంథకర్త ప్రచురించిన చిన్నకథలకు ఈగ్రంథము సంపుటీకరణము. "సంఘములోయున్న కొన్ని దురాచారాలిన్ని, యీ కథల్లో విమర్శించాను. వేశ్యాపాతుకపోయిన, అస్పృశ్యతా వరశుల్కాది దురాచారాలు సాంఘికాభ్యుదయాభిలాషుల్లో కొంతమందైనా రూపుమాప ప్రయత్నిస్తే నా ప్రయత్నము, ఆశయమూ నెరవేరుతవి. కథలన్ని - ఒక్క చంద్రహారముతప్ప - స్వకల్పితాలే." అని గ్రంథకర్త పీఠికలో తెల్పుకొన్నాడు. ఈ కథలన్నిటిలో 'యీరమ్మ' చాల బాగున్నదని మాయభిప్రాయము. క్రౌనుసైజున 182 పుటలు. వెల 0-4-0 మాత్రమే. కాలక్షేపార్థము చదువుకొనుట కనువైన గ్రంథము. చిరకాలాభ్యాసముచే శ్రీవేంకటరత్నముగారు ఇంకను ప్రశస్తములగు కథలను వ్రాయగలుగుదురని ఆశించుచున్నాము.

౪౦. కవిత్వచింతామణి

గ్రంథకర్త చదలువాడ కోటినరసింహముగారు. ఆంధ్రభాష నభ్యసించుటకు అవసరములైన వ్యాకరణాంశములు, అలంకారములు, ఛందోలక్షణములు ఇందు చక్కని పద్ధతిని వివరింపబడినవి. బంధగర్భకవితాలక్షణములుకూడ ప్రస్తరింపబడినవి. ఉన్నత పాఠశాలలలోని విద్యార్థుల కీగ్రంథము పాయరానిమిత్రము. ముఖ్యముగా సంధిప్రకరణము, సమాసప్రకరణము విద్యార్థులకు ఎక్కువ కరణీయమగుపద్ధతిని రచియింపబడినవి. కావుననే సమకాలికవిద్వాంసులు పలువు రీగ్రంథమును

ప్రశంసించియున్నారు. క్రౌను సైజున 130 పుటలు. వెల 0-12-0. వలయువారు గ్రంథకర్తపేర పరసత్యాశర్మారు, పెద్దకూరపాడు పోష్టు, సత్తెనపల్లి తాలూకా, గుంటూరుజిల్లా అను చిరునామాకు వ్రాయునది.

౪౧. కర్షకుని కాలగతి

ఆదర్శగ్రంథమాలలో నాల్గవపుస్తకము. ప్రపంచ ప్రఖ్యాతి నార్జించిన టాలుస్టాయి మునిసత్తముని రచనకు తెలుగుసేత. అనువాదకులు 'నవయుగ' సంపాదకులగు గద్దె లింగయ్యచౌదరిగారు. రైతుజనమును గూర్చిన ఈమహోత్కృష్టగ్రంథము ధారాళమగు వాడుకభాషలో వ్రాయబడినదగుటచే విశేషప్రచారమునందునని తలంచుచున్నాము. కలిపురుషుని దూతలు కర్షకులను భగవంతునినుండి ఎట్లు దూరముగ గొనిపోదురో ఇందు చక్కగ వివరింపబడినది. ప్రతి తెనుగురైతు దీనిని చదివి అర్థలాభమునందుగాక! క్రౌనుసైజున 48 పుటలు. వెల రెండు అణాలు. దొరకుచోటు ఆదర్శగ్రంథనిలయము, ఎలమర్రు, కృష్ణాజిల్లా.

౪౨. నీతికథానిధి

'నీతికథానిధి' అను ఈసపుకథలు. కర్త: తాడూరి లక్ష్మీనరసింహారావుపంతులుగారు. ఇవి 1892 ప్రాంతమున రచియింపబడి అపుడు భీమవరమునుండి చెన్నాప్రగడ రామమూర్తిగారిచే ప్రచురింపబడుచుండిన 'ధర్మవర్ధని' అను పక్షపత్రికలో ప్రచురింపబడినవి. ప్రత్యేకగ్రంథరూపమున 1910 లో మదరాసు ఆనంద ముద్రణాలయాధిపతులచే ప్రచురింపబడినది. గ్రంథకర్త దీనిని 1932 లో తిరిగి ముద్రించెను. ఆ కూర్పు ప్రతులు వెంటనే అమ్ముడుపోవుటచే ఈసంవత్సరము తిరిగి ముద్రింపబడెను. గ్రంథము విశేషప్రచారము నందియుండుట ఇందువలన తెలిసికొనవగును. ఈ సంవత్సర మిది రెండవ నింగుస్కూళ్ళలో పాఠ్యగ్రంథముగా నుంచబడినది. కథ అంతయు వచనమునను, నీతి పద్యమునను చెప్పుచు పంతులుగారు గ్రంథమును సులభశైలిలో నిర్వహించిరి. క్రౌనుసైజున 56 పుటలు. వెల 0-4-0 అణాలు. వలయువారు గ్రంథకర్తపేర రాజమండ్రి వ్రాయునది.

౪౩. శ్రీకృష్ణాపుష్కరము

కూచిభొట్ల ప్రభాకరశాస్త్రిగారిచే రచియింపబడినది. కృష్ణానదీమాహాత్మ్యము, పుష్కరప్రశంస, పుష్కరదానవిధానము, కృష్ణానదీపూజావిధానము ఇందు వివరింపబడినవి. క్రౌనుసైజున 24 పుటలు. వెల 0-1-0. ప్రకాశకులు: వి. వి. యల్. పంతులుగారు, రేపల్లె, గుంటూరుజిల్లా.

౪౪. కంఠమాల

హాయి; రాజమహేంద్రవరము; కాదు, కాదు; సమ్మెజాల; స్వర్గములో విలాపము; కన్నకడుపు; సుమబాల పాట; చాణక్యునిప్రార్థన—అను శీర్షికలుగల పద్యముల సంపుటి ఈ కంఠమాల. ఇందలి 'రాజమహేంద్రవరము' రాజరాజనరేంద్రపట్టాభిషేకసంచికయందును, 'కాదు, కాదు' మున్నగు కొన్ని ప్రబుద్ధాంధ్రపత్రికయందును ప్రచురితములు. ఛందోవిషయమున కవి ఈ గ్రంథమున తన 'సుమబాల' యందువలెనే స్వతంత్రపథమును దొక్కెను. చూడుడు: 'హాయి', 'రాజమహేంద్రవరము' అను ఖండకావ్యములలో వాడబడినవృత్తము ఉత్పలమాల. ఇందు యతిప్రాసములు మానివైచి కవిభాషాసౌలభ్యసంపాదనార్థము సమ్మతార్హమగు నూతనపథమును దొక్కెను. 'హాయి' అనుకావ్యము 'మహత్తు లన్నట్టి నివాసులయ్యు సంతోషితసర్వమానవసమాజపరాకలితోరుసద్గుణోదారులుగారె?' అను సత్యమును ప్రస్ఫుటము చేయుచున్నది. విశేషలింగమీరుని కార్యక్షేత్రమగు రాజమహేంద్రవరమునందలి ఒక ఉన్నతపాఠశాలకు ప్రధానాచార్యుడైన కవి 'రాజమహేంద్రవరము' అను కావ్యమున ఆపట్టణమును 'ఆంధ్రసరస్వతీభవనమందిరము'గను; నన్నయఆంధ్రవాణిని తల్లి, దాది; తండ్రి, గురుడు; భార్య, తోడు గను వివరించి ఉత్తేజమును కల్గించుచున్నాడు. 'కాదు, కాదు' అను కావ్యమునందలి భావములు గభీరములు. 'కన్నకడుపు' జాలిగొలుపు భావములతో నిండారియున్నది. శైలి తెలియుటకై 'స్వర్గములో విలాపము' అను కావ్యమునుండి కొన్ని చరణములు:

"ధరణీతలంబునకు నరిగి, యచ్చట నొక్క-
యరదిన మెకాదు, యుగమంత మగుదాక నీ
కలదినను, ఏడ్చినను, మఱియభోజనమున్న

మఱియింక నేమన్న, మఱియేమి చేసినను,
కరుణమైయమృతంబు, పరితోషమునవిషము,
కురియించి నప్పటికి కుదర దారోగము."

గ్రంథము క్రౌను సైజున 86 పుటలు. వెల 0-6-0 అణాలు. వలయువారు ఏతద్గ్రంథకర్తలగు శ్రీజయంతి గంగన్నగారికి రాజమండ్రి వ్రాయునగును.

క్రొత్తపత్రికలు

౧. సహకారిమిత్ర

ప్రతిశుక్రవారమున నెల్లూరిలో ప్రకటితమగు సహకారవార వార్తాపత్రిక. సహకారోద్యమాభ్యుదయమే దేశాభ్యుదయము. కాగా సహకారోద్యమప్రచారము నకై ప్రత్యేకము బద్ధకంకణయై ప్రచురింపబడుచున్న 'సహకారిమిత్ర'కు ఆశ్చరాస్యులగు నాంధ్రులెల్లరును ఘన స్వాగత మీయగలరని ఆశింతుము. ఆంధ్రదేశపు సహకారనాయకశిఖామణులగు నరసింహదేవర సత్యనారాయణగారు, ఆంధ్రవిద్యాధికులగు మామిడిపూడి వేంకటరంగయ్యగారు మున్నగువారు ఈ పత్రికయొక్క ఆలోచనసంఘమున సభ్యులై పత్రికాప్రతిష్ఠకు మంచి పునాదినిడిరి. భారతదేశభాషలలో ఇక నెందును సహకారవిషయకమగు వారపత్రిక లేదు. సాహసించి తెనుగువారి కీర్తి దానిని ప్రసాదించిన సహకారిమిత్ర సంపాదకులు మన్నేపల్లి రామకృష్ణరావుగారెంతయు కొనియాడదగియున్నారు. విదేశసహకారవార్తలు, దేశ సహకారవార్తలు మున్నగు శీర్షికలు పత్రికవిలువను పెంచుచున్నవి. సంపాదకీయములు సులభశైలిలో నొప్పుచు విజ్ఞానదాయకములై ఒప్పుచున్నవి. పత్రిక చిరకాలము మని తెనుగుమాగాణిని సేవించుగాక యని మనః పూర్వకముగ ఆశించెదము. సాలు చందా రు 3-0-0.

౨. చిత్రగుప్త

ఈ నూతన సచిత్ర మాసపత్రికకు మాస్వాగతము. 'ప్రజల నిత్యజీవనములో తరుచు ఎదురవుతూవుండే నైతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయాది సమస్యలను ఏడమర్చి సామాన్యజీవికి చేటవ్యాసాల'లో తెలుప ప్రచురింపబడుచున్న ఈ పత్రిక తొలిసంచికలోని వ్యాసములన్నియు సంపాదకుల సంకల్పమును చక్కగ నెరవేర్చుచున్నవి. మార్షల్ పిలుస్డ్‌స్కినిగూర్చి తెలుగువారికి మొదట చెప్పినది ఈ పత్రికయే యగుచున్నది. వెక్కిరిచిత్రములతో నిండారియుండుటచే ఈ పత్రిక అచిరకాలముననే విశేషప్రచారమునంది ప్రయోజనవిద్యావ్యాప్తికి యథాశక్తిని తోడుపడగలదు. వ్యంగ్యచిత్రములను విశేషముగ ప్రచురించు తెనుగుపత్రిక ఇదియొక్కటియే అనవచ్చును. ఇంతకును పత్రిక చాలచవుక. సాలు చందా రు 1-0-0. విడిసంచిక 0-1-6 మాత్రమే. చిరునామా: 6, లాటూర్ చిన్నితంబిమొదలివీధి, సాహుకారుపేట, మదరాసు.

3. సరస్వతి

ప్రతి ఆదివారము విశాఖపట్టణమునుండి పుస్తకరూపమున ప్రచురింపబడు వారపత్రిక. మండలమునకు ఒక్కొక్క వారపత్రికయైనయుండుట అవసరముగలదు విశాఖపట్టణమండలమునకు ఇదియొక్కటియే వారపత్రిక. కావున ఆమండలవాసులు ఈపత్రికను హెచ్చుగ పోషింపగలరని నమ్మెదము. ఈ పత్రిక సంపాదకులగు శ్రీ వెంపటి సత్యనారాయణగారు పట్టభద్రులు గావున పత్రిక నవ్యరీతుల నడుపబడునని ఆశింతుము. సాలు చందా రు 2-8-0. విడిసంచిక 0-1-0.

౪. విశ్వకళ

ప్రతిమాసము 15వ తేదీన గుంటూరునుండి వెలువడు సారస్వతవిషయక మాసపత్రిక. సంపాదకులు యువకవులగు కుందుర్తి నరసింహారావుగారు. అక్టోబరుమాసమున వెలువడిన తొలిసంపుటము రెండవసంచికలో వున్నవ లక్ష్మీనారాయణగారి 'తిరస్కృతి' అను గేయవ్యాసము మనోజ్ఞముగ నున్నది. సాలు చందా రు 1-0-0. విడిసంచిక రు 0-2-0 అణాలు.

౫. శశి

నూత్నకళాప్రపంచమును యథోచితముగ సేవింప విజయనగరమునుండి ప్రచురింపబడు మాసపత్రిక. ఈ తొలిసంచికయందలి పద్యవ్యాసములు ప్రాథమికవితావిలసితములై యున్నవి. 'విడిపత్రిక నో అణా. సాలు చందా పది అణాలు. పై పూర్లకు పోస్టేజి ప్రత్యేకం.'

రాష్ట్రేతరాంధ్రులు

రాజపాళెయమందలి ఆంధ్ర క్షత్రియులు

(తమిళదేశమందలి రామనాథపురం జిల్లా రాజపాళెయ మందలి ఆంధ్ర క్షత్రియ కుటుంబముల సంక్షిప్త వివరములు.)

దక్షిణాంధ్రులు

ఆంధ్రదేశచరిత్రయందు మిక్కిలి ప్రసిద్ధమైన విజయనగరసామ్రాజ్యకాలమున, ఆంధ్రులు దక్షిణదేశమునందంతటను, వలస లేర్పరచుకొని యుండిరి. అఖండ సామ్రాజ్య ధురంధరుడగు శ్రీ కృష్ణదేవరాయలవారు చోళ పాండ్య కేరళాది దేశముల జయించి, అందందు దన ప్రతినిధుల నియమించి పాలించియుండుటయే ఆకాలపు తెలుగు వలసలకు గారణమైయున్నది. నేటికిని అరవదేశమున 26 లక్షల యాంధ్రులు నివసించుచున్నారు. ఆంధ్ర సామ్రాజ్యధ్వజము తమిళదేశమున స్థిరముగ నాటబడి యుండుటచేతనే ఇందరిజనుల కాదేశము తావిచ్చియుండినది. ఆంధ్రులచే నిర్మింపబడిన గ్రామములు వందలకొలదిగా వ్యాపించియున్నవి. అట్టి గ్రామములలో నెల్ల పెద్దదియనదగు మా రాజపాళెయపు బుట్టుకయు, నది రాజులకెట్లు వలసగా నేర్పడినదియు వివరించుటకు ముందు స్థానికవివరముల గొన్నిటి దెలుపవలసియున్నది.

స్థానిక వివరములు

రాజపాళెయ గ్రామము భారతదేశపు దక్షిణాగ్రమున తూర్పు పడమర సముద్రములకు 60 మైళ్ళసమ దూరమునను, కన్యాకుమారి కుత్తరమున నూరుమైళ్ల దూరమునను, రామనాథపురంజిల్లాలో చేరియున్నది. శ్రీ కృష్ణదేవరాయలచే దన విష్ణుచిత్తీయమున వర్ణింపబడిన శ్రీవిల్లిపుత్తూరను వైష్ణవక్షేత్రము ఇచటకు ఉత్తరమున 7 మైళ్ళదూరముననున్నది. మీనాక్షీక్షేత్రమగు మధురనుండి 50 మైళ్ళ మోటారు ప్రయాణమువల్లను, విరుదునగర్ జంక్షనునుండి రైలుమీదను ఈగ్రామము చేరవచ్చును. ఊరికి పడమర 8 మైళ్ళదూరమున అత్యున్నతములగు పశ్చిమ కనుమల వరుసయు, వ్యాఘ్రాది జంతుసమన్విత మగు మహారణ్యమును వ్యాపించియున్నవి. అందుండి వెలువడు సెలయేళ్ళచే నిచటి చెరువులు నిండుచుండును. ఈ యడవులలో కొండల మీదినుండి దుముకుచు పారుచుండు జలధారలు, అచ్చటచ్చట నిర్మింపబడిన వనదేవతా మంటపములు, నాగరికుల నాకర్షించుచుండును. కిలకిల కూయుచు నెగురుచుండు పక్షులును, పరిసరములనున్న పొలములయందలి సస్యముల బాడుజేయు అడవియేనుగులును, పందులును, నిర్భయముగా సంచరించు లేళ్లును, మేతకై వచ్చిన గ్రామపశువుల దమ పొట్టన బెట్టుకొను వ్యాఘ్రాది క్రూరమృగములును, రాచవేటకాండ్ర నాకర్షించును. అడవి నరికియు కట్టెలు కసువుల నమ్ముకొని జీవించు బీదవారికిని, పశువుల మేపుకొను గొల్లలకును, సంవత్సరమునకు సరిపోవు చింతపండు నేరుకొను గ్రామస్థులకును, గుత్తకు దీసికొని కలపవర్తకము జేయు వ్యాపారులకును, తేనె కరక్కాయలు మొదలగు కొండ వస్తువులను నమ్మువారికిని ఈయరణ్య మెంతయో లాభకారిగ నున్నది. ఈయడవిదగ్గిర భూములందు మెట్ట పంటలు పండించబడును. ఈపొలముల కావల మైళ్ళకొలది వ్యాపించియున్న తోపులలో కొబ్బరి, అరటి, మామిడి, పనస, నారింజ మొదలగు ఫలవృక్షములును, బూరుగచెట్లును సమృద్ధిగ నున్నవి. ఊరును చుట్టుకొని అయిదారు చెరువులున్నవి. వాటిక్రిందనున్న

భూముల, వ్యవసాయము చేయుటకై యుపయోగింపబడును. ఇక్కడ మొత్తము 3 వేల ఎకరములు మాగాణీపంటలకును, 80 వేల ఎకరములు మెట్టపంటలకును, 2 వేల ఎకరములు తోఁపులకును ఉపయోగింపబడుచున్నవి. మెట్టపంటలలో ముఖ్యముగా ప్రత్తి, రాగి, మినుములు, జొన్నలు, ఆముదములు, నువ్వులు, మిరప మొదలగునవి ఎక్కువగ పండును. మొత్తము మీద సాగుబడి చేయబడు భూములలోగాని, ఉపయోగింపబడు అడవులు తోఁపులలోగాని సగమునకు పైగ నే ఆంధ్రక్షత్రియసోదరులకు చెందియున్నది. మూఁడు నాలుగు చిన్నపల్లెలుగా నేర్పడియున్న ఈగ్రామము, జనసంఖ్యనుబట్టియు, వైశాల్యమునుబట్టియు గ్రామమనిపించుకొనదు. 1921 నివేదికనుబట్టి ఇందలి జనసంఖ్య 33,184. ఈ చుట్టుప్రక్కలకన్న నిది ఆరోగ్యవంతమగు ప్రదేశమగుటచేతను, కాయకష్టములజేయు జన మధికముగ నుండుటచేతను, ఇందలి జనసంఖ్య పత్వరాభివృద్ధి గాంచుచున్నది. గత 50 సంవత్సరములలో 3 రెట్లధికముగా పెరిగినది. క్షత్రియులు సుమారు 8 వేలును, బ్రాహ్మణులు, భట్రాజులు, కమ్మలు, బలిజ, శెట్టి, కంసాలి, కుమ్మర, దొమ్మర, మాదిగ మొదలగు కులములవారు సుమారు 4 వేలును మొత్తము 12 వేలమంది తెలుగువారును; మిగిలిన 21 వేలు తమిళులును ఉన్నారు.

వలస చరిత్ర

క్షత్రియేతరులగు దక్షిణాంధ్రుల వలసకు గారణమగు విజయనగర సామ్రాజ్యమే క్షత్రియుల వలసకును కారణమని నిశ్చయింపవచ్చును. విజయనగర సైన్యముల మూలముననే ఆంధ్రక్షత్రియకుటుంబములు పాండ్యదేశమున బ్రవేశింప గలిగినవి. ఇది వాస్తవమని నమ్ముటకు గొన్ని యాధారములుగూడ కానవచ్చుచున్నవి.

(1) పాండ్యమండలాధినాథులగు నాయకరాజులలో నెనిమిదవవాఁడును, క్రీ. శ. 1659 మొదలు 1682 వఱకు రాజ్యమేలిన చొక్కనాథనాయకర్ వలన మా పూర్వులు పొందిన దానశాసనమునకు దాళపత్రప్రతియొకటి కానవచ్చుచున్నది. అందు పూసపాటి అప్పలరాజు, చిన్నయరాజు, కృష్ణమరాజు, గోపాలరాజు అనువారలగువారు మధురసంస్థానసైనికపరిపాలనయందు నియమింపబడియుండి రనియు, వారు 36 సంవత్సరము లాపనిని నిర్వహించి ఇంటికిబోవునపుడు వారికేర్పాటైన జీతమిచ్చుటయేకాక, యీరాజుల కోరిక ప్రకారముగా దానధర్మములు చేయునిమిత్తమై కొంత భూమినిగూడ నుచితముగ నొసగినట్లు తెలియుచున్నది.

(2) ఇవిగాక అదిని విజయనగరమునుండి బయలుదేరి వచ్చినటుల ప్రజలమగు జనశ్రుతియొకటి గలదు. ఇది ప్రస్తుతపు విశాఖపట్టణమండలమందలి విజయనగర సంస్థానమనియే కొందరు భావించుచుండిరి. కాని క్రీ. శ. 1700 వఱకు విజయనగరనిర్మాణమే జరిగియుండక పోవుటవలనను, అంతకు చాలపూర్వమే పాండ్యరాజ్యమున క్షత్రియులు ప్రవేశించియుండినందునను, విజయనగరమనిన కర్ణాటకరాజ్యస్థమగు విజయనగరమనియే నిశ్చయమగుచున్నది.

(3) మా పూర్వులచే రచింపబడిన కొన్ని యాంధ్రగ్రంథప్రతులయందు ఇక్కడి గొట్టుముక్కలవారికి మహామండలేశ్వరులను బిరుదు కానవచ్చుచున్నది. విజయనగర సామ్రాజ్యపరిపాలనయందు ఇట్టి పదవులును, ఉద్యోగములును, ఉండియుండుటచేత సామ్రాజ్య పరిపాలనయందు వీరుకూడ చేరియుండిరని యూహింప వీలగుచున్నది.

(4) ఆంధ్రదేశక్షత్రియులలో లేని "ఎఱ్ఱగుంటల" యను గృహనామము మాలో గానవచ్చుచున్నది. ఓరుగంటి యను పేరే యిట్లు మారినదని శ్రీ పొత్తూరి కృష్ణమరాజయోగిగారు సెలవిచ్చియున్నారు. కాని ప్రథమమున వీరింటిపే రదొయొకటిగ నుండినను, కడప జిల్లాయందలి "ఎఱ్ఱగుంటల" గ్రామసంబంధమును బట్టియే వీరి కీపేరు నూతనముగ నాపాదింపబడినట్లూహించుచున్నాము. కనుక నే విజయనగర పరిసరములనుండి మే మీదక్షిణదేశమున బ్రవేశించితిమని చెప్పుటకు కారణమగుచున్నది. —సశేషము.

ఇన్స్యూరెన్సు విషయములు

ఆర్థిక విధానము : ఇన్సూరెన్సు

ఇదివరకు (సెప్టెంబరు సంచికలో) ఆర్థికవిధానమును గూర్చి వివరించితిమి. ఆర్థిక విధానమునకును యిన్సూరెన్సుకును ప్రతి శాఖయందు సంబంధమున్నది. ఆర్థికవిధానమున ఇన్సూరెన్సు ఒక భాగముగనే యెంచబడును. అదెట్లో గమనింతము.

ఇన్సూరెన్సు : వస్తు నిర్మాణము.

వస్తువులను తయారుచేయు ఉత్పత్తిశాఖయందే యిన్సూరెన్సు యొక్క ప్రాముఖ్యత బయలుపడియున్నది. ఉత్పత్తికి ప్రథమోపకరణమైన ప్రకృతితో యిన్సూరెన్సుకు సంబంధములేదు. మానవునిచే వుపయోగింపబడని స్థితిలో ప్రకృతి ప్రసాదించు వస్తువులు, శక్తులు, ప్రకృతి నాబడునని అర్థశాస్త్రవేత్తలు యెంచుచున్నారు. అట్టి వస్తువులను, శక్తులను మానవుడు చేయూతగొని వస్తుచయమును సృష్టించుచున్నాడు. అప్పుడవి పెట్టుబడిగనో లేక ఉపయోగార్హమగు ఐశ్వర్యముక్రిందనో పరిగణింపబడును. వాడబడని స్థితిలో ప్రకృతి యిన్సూరెన్సురక్షణ పొందుటకు నిమిత్తముండదు. మానవునికి వాటిని రక్షింపవలెనను ఉద్దేశమును వుండదు.

> **సుభాషితము**
>
> **౧౩**
>
> “మనదేశమున (అనగా అమెరికాదేశమున) నిత్యజీవనమునందు జీవితభీమా విశ్వవ్యాప్తమైయుండుట అమూల్యమైన విషయమై యున్నది. మనజాతీయసత్రమాభివృద్ధికి అదియొక చక్కని ఫలమని నేను నమ్ముచున్నాను.”
>
> — హెర్బర్టు హూవర్.

పని, లేక కృషి.

ఈపని, లేక, కృషి ఉత్పత్తికి రెండవపరికరము : ముఖ్యసాధనమును. ఇన్సూరెన్సు యీశాఖతో గొప్ప కలయిక గల్గి యున్నది. మన నాగరకతకు పునాది కుటుంబము. కుటుంబపోషణకర్త తన కుటుంబము నందలివారి కుచితరీతి సౌకర్యము లేర్పాటుచేయు నిమిత్తము యేదో ఒకపనిలో ప్రవేశించి, తన శక్తికొలది కృషిచేయుచున్నాడు. ఈపని లాభకరమైనదిగనే యుండును. సాధారణముగ తన బిడ్డలు తనకన్న ఉన్నతస్థితిలో నుండవలెననియే ప్రతితండ్రియుకోరును.

ఇట్లు అతనుచేయు పనులసందర్భములో అతనికి సహచరులతోను, యజమానులతోను, తదితరులతోను పరిచయమేర్పడును. అతనికి ఆకస్మిక ప్రమాదమో, జాడ్యమో, మరణమో, నిరుద్యోగమో, పని చేయుటకు శక్తి చాలకపోవుటయో కలిగి, తనపనినుండి విరమింపవలసిన అవసరము వచ్చును.

ప్రతిదేశమును, ప్రజల సహాయమును కోరుచున్నది. వారు చురుకుగ, నిరాటంకముగ ఉత్పత్తి కుపకరణములగు యితర సాధనముల సహాయముచే వస్తునిర్మాతలగుచున్నారు. వారి కుటుంబము లందువలన రక్షింపబడవలెను. ఈ శాఖయందు యిన్సూరెన్సు, ప్రభుత్వమువారిచే కొంతయు, యిన్సూరెన్సు కంపెనీవారివల్ల కొంతయు ప్రబలినది.

జీవితభీమావలన, పోషణకర్త మరణింపుచో తోడనే అతని కుటుంబము సంఘముపై ఆర్థికభారము వేయ

వకాశములేదు. క్రమముగ కొద్దిగ ప్రీమియములు కట్టుచు వచ్చిన, ఎపుడు మరణించిన అపుడు మొత్తముగ కొంత ద్రవ్యము యిచ్చుటకు కంపెనీలు బాధ్యత వహించును. ఈసొమ్ము, కొన్ని సమయములందు, కొన్ని కుటుంబములకు చాలకపోయినను, కుటుంబములు విడిపోక యుండునట్లు కాపాడి, వారి కొక విధమైన ఆధారమును కల్గించుచున్నది.

ఈ యంత్రయుగమున, మానవుడు ప్రమాదములకు లోనగుచున్నాడు. ఒక యంత్రశాలయందు పనిచేయువాని కెపుడైనను ప్రమాదము సంభవింపవచ్చును. ప్రభుత్వము కార్మికనష్టపరిహారక చట్టము, (వర్కు మెన్సు కంపెన్సేషన్ ఆక్టు), న్యాయచట్టము (కామన్‌లా) మూలకముగ వీరికి వసతు లేర్పరచినది. ఎవనికైనను తనవద్ద పనిచేయుచున్నపుడు, ప్రమాదము కల్గినను, అందువలన మరణము సంభవించినను, యజమానుడు నష్టపరిహార మివ్వవలెను. ఈ భారము కొంత స్వల్పద్రవ్యమునకు ఇన్సూర్యెన్సుకంపెనీలు వహించుచున్నవి. యజమానుడు విచారముతీరి, తన మూలధనమును యితర లాభకరములగు పరిశ్రమలలో పెట్టింపవచ్చును. తనకేదైన జాడ్యముకల్గి అందువలన జీవనోపాధి పోవునేమో యని భయపడువారికి జేశీయారోగ్య భీమాపద్ధతి (నేషనల్ హెల్త్ ఇన్‌సూర్యెన్సు స్కీము) అనుకూలమైనది. ఈపద్ధతి యింగ్లాండులో ప్రభుత్వమువారిచే అమలులో నుంచబడియున్నది. ఏకారణముచేనైనను వీటిలో చేరనివారికి యిన్సూర్యెన్సు కంపెనీలు వసతు లేర్పరచగలవు.

కార్మిక సమస్యలగూర్చి విచారించునపుడు యిన్సూరెన్సు యెంతవరకు వృద్ధికివచ్చినది గమనింపవలెను. సాంఘిక భీమా (గ్రూప్ ఇన్‌సూరెన్సు) యొకవిధము. యజమానుడు తనవద్ద పనిచేయువారికి తోడ్పడి ద్రవ్యసహాయముచేసియో, లేక స్వతంత్రముగనో, పాలిసీ లిప్పించి వారి మరణకాలమున వారి కుటుంబమునకు జీవనోపాధి కల్గించుచున్నాడు. ఇందువలన భీమావలని లాభములు తెలియని కుటుంబీకులు వాటిలాభములు పొందుటయే గాక, పనివారికి యజమానునకు సౌభ్రాతృత్వభావము కలుగుచున్నది. తనపై అభిమానముంచి తన యవంతరము తన కుటుంబపోషణకై తన యజమానుడు శ్రద్ధవహించుటను గమనించిన యేపనివాడు, రెట్టింపు ఉత్సాహముతో పనిచేసి తన యజమాని మేలును కోరడు? అర్థికములగు ఆటంకములు తగ్గుటయే గాక, పని చులకనగ, బాగుగ ఇందువలనే జరుగును. అమెరికాలో ఈ సాంఘికభీమా మిక్కిలిగ అమలులో నున్నది.

పెన్షనుపద్ధతియు ఈవిధముగనే. వ్యాపారి తనవద్ద యుండు మూలధనము విలువ తగ్గుచుండుటచే, ఆలోటును పూడ్చుటకుగాను ప్రతి సంవత్సరము లెక్కలు తయారుచేయుచున్నపుడు, కొంత ద్రవ్యము నిలవ చేయుచున్నాడు. ఇట్లు చేయుటచేత, విలువ యెప్పటికిని ఒక స్థితియందేయుండును. మానవుని విషయమింతియే. మానవుని శక్తులు వయసు కానుకాను తగ్గుచు వచ్చును. అతని సంపాదనలో కొద్దిగ సేకరించుచువచ్చిన, పనినుండి విరమించునపుడు పెన్షను పొందవచ్చును. యంత్రములు విలువతగ్గి నిరుపయోగమైన పారవేయవచ్చును కాని తనకు విశ్వసనీయుడై

సుభాషితము

౧౪

“తన సంతానమునకు చక్కని ఆధారమును చూపనిచో, తనపై ఆధారపడియున్నవారలకు తగిన ఉపపత్తి కల్గింపనిచో, రాగల పరిస్థితులనుగూర్చి దూరపు టాలోచనలేనిచో, రాగల దినములనుగూర్చి ముందుజాగ్రత్త వహింపనిచో అట్టివాడు పొదిమి అను మంచిగుణము లేనివాడనిపించుకొనుటయే గాక మానవజీవితమునందలి ఉద్దేశమును గూర్చిన విశాల పరిజ్ఞానమునకు అంధుడనికూడ అనిపించుకొనును. మన మీప్రపంచమున మన పొట్టలు నింపుకొనుటకు జీవించుట లేదు; ఇతరులను పోషించుటకొరకు జీవించుచున్నాము. ఇది గుర్తించుటయే పొదిమికి మూలము.”

—వుడ్రో విల్సన్.

అతని వయసున బాగుఁ బనిచేసినవానిని ఏ యజమానుఁడు తీసివేయ తలపెట్టఁడు. అందువలననే పెన్షను పద్ధతి అమలులోకి వచ్చినది. కొన్ని కంపెనీలు ఆయా సంవత్సరముల రాబడినుండి పనులనుండి విరమించువారికి పెన్షనులిచ్చుచున్నవి. కాని యీ పద్ధతి తృప్తికరము కాదు. ఒక యంత్రము పూర్తిగ చెడిపోవువరకు ఊరక యుండి, దానికి బదులు మరొకటి కొను ప్రయత్నమే యజమానుఁడు చేయఁడు. మొదటినుండియే కొద్దిగ సేకరించుచున్నాఁడు. పెన్షను పద్ధతియు నంతే. వార్షిక చందా, వసూలయిన ధనరక్షణ, బాధ్యతలు యిన్సూరెన్సు కంపెనీలకు వదలవలెను.

ఋణముచేసియు, ప్రభుత్వమువారి నుండి సహాయముపొందియు, మూలధనము బలపరుపబడినది. అనతికాలములో ఇది భీమాపద్ధతికి రాఁగలదు.

పనికిని, భీమాకును సంబంధమిది. మరణము, వార్ధక్యము, రోగము, ప్రమాదము, లేక నిరుద్యోగము; వీటి వలని అనిశ్చలత్వమును పోఁగొట్టి భీమా రక్షణనొసంగుచున్నది. ఆర్థికముగ ఇది మంచిది. స్థిరత్వములేనిచో నూతనమగు ఊహాలు, స్వతంత్రత, ఆలోచనాశక్తి కలుగుట కవకాశముండక, క్రొత్తదియు మేలైనదియునగు పద్ధతులను అమలులో పెట్టుట కడ్డు తగులుచున్నది.

నిరుద్యోగము.

ఆధునికపరిశ్రమలలో పని చేయువారిని నిరుద్యోగభూతము వెన్నాడుచున్నది. కార్మికసంఘమున నిరుద్యోగు లధికము. మరియు ప్రపంచమంతయు ఆర్థిక దుస్థితిచే పీడింపబడుసమయమున వీరి సంఖ్య మరింత హెచ్చుచున్నది. నిరుద్యోగులు ఆర్థిక భారమును మరింత వృద్ధిచేయుచు, సంఘమునకు కష్టము కలిగించుచున్నారు. అంతే కాక వారికి నిస్పృహపుట్టి, మనోదౌర్బల్యమునకు లోనగుచున్నారు. ఈ కష్టములు తగ్గుటకు దేశీయనిరుద్యోగ యిన్సూరెన్సుపద్ధతి స్థాపింపవలెను. ఇట్టి పద్ధతి 1911-వ సంవత్సరమునుండి యేదో ఒకరూపమున యింగ్లండులో అమలులో ఉన్నది. యజమానుల సహాయముచేతను, భీమాచేయబడిన పనివారిపైనను, ఎక్చెకర్ పైనను యీ పద్ధతి ఆధారపడియున్నది. రాబడి, లాభములుకూడ ముందుగ నిర్ణయింపబడినవి కాన, యేవిధమైన పనిలో ఎట్టి ప్రమాదముకల్గినను ఒక్కటే. నిరుద్యోగులసంఖ్య యెక్కువయినందున ఈ పద్ధతి యిప్పుడంత బాగుఁ బనిచేయుటలేదు. అధికముగ

> **సుభాషితము**
>
> **౧౫**
>
> "ఏదృష్టితో చూచినను ఆధునికజీవితమున జీవితభీమా ముఖ్యావసరమైన దగుచున్నది. జీవితభీమావలని లాభములగూర్చి నాకు గట్టి నమ్మకము గలదు. కావుననే నేను కొన్ని పెద్ద మొత్తములకు సాధారణమైన పాలసీలును, ఎండోమెంటులును తీసికొని యున్నాను."
>
> —సర్ సి. పి. రామస్వామి అయ్యర్.

ఇన్సూరెన్సు: ఋణము

ప్రతి వ్యాపారసంస్థయు ఋణముచేయబడిన మూలధనముతోనే సాగింపబడుచున్నది. ఇట్లు అప్పిచ్చుట, అప్పు తీసుకొనుటవలననే, ఆర్థికవ్యాపారము విరివిగ కొనసాగింపబడుచున్నది. ఎవఁడును తాకట్టులేనిది అప్పివ్వఁడు. సాధారణముగ భవనములును, యంత్రములును తాకట్టుంచబడును. అగ్ని యితర ప్రమాదములవలన ఇవి నశింపవచ్చును. ఇవి యిన్సూరు చేయబడియున్నచో నష్టముండదు. ఋణమిచ్చి, తీసుకోవడము, బ్యాంకులు అప్పును కల్గించడము యివన్నియు స్థిరత్వము, నమ్మకమును వసతు లున్నప్పుడే వీలగును. ఈ స్థిరత్వము యిన్సూరెన్సు యిచ్చుచున్నది. ఏ సంవత్సరమున కెంత విలువయని తెలుసుకొనుటకు వసతిగల భీమాపాలసీనికూడ అప్పిచ్చువారు తాకట్టుగ తీసుకొందురు.

పై మాసమున "ఇన్సూరెన్సు : మార్చుకోలు ; ఇన్సూరెన్సు : ఇతరదేశములతో వ్యాపారము" అను విషయములనుగూర్చి చర్చింపబడును.

—ఆలూరు రామచంద్రయ్య, బి. ఏ.

సన్ పత్రిక శతవార్షిక సంచిక.

డాక్టరు సుధీంద్రుడు అమెరికాలో శతవార్షిక సంచికను ప్రకటించిన 'సన్' పత్రిక విషయమై మనకు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికద్వారా తెలియపరుస్తున్నాడు. ఆ 'సన్' పత్రిక చరిత్ర మనముకూడా నేర్చుకోతగిందిగా ఉంది. 'ఆ దేశములో పెన్నీ కొకపత్రిక చొప్పున అమ్మబడిన మొదటిపత్రిక 'సన్'. అప్పటికి న్యూయార్కులో మూడణాలకు తక్కువ అమ్మే పత్రిక లేదు. అనగా పత్రికలు జనసామాన్యానికి అందుబాటులో లేవు. జనసామాన్యానికి కావలసిన విషయాలూ అందులో లేవు. మూడణాల పత్రికలలో విషయాలు రాజకీయవేత్తలకుమాత్రం అర్థమయ్యే విషయాలు. ఒక్కొక్క రాజకీయపక్షానికి ఒక్కొక్కపత్రిక ఉండేది. పక్షాశయాలు ప్రచారాశయాలను దిగద్రొక్కేవి. జనసామాన్యము, సామాన్యప్రపంచము ఈ పత్రికల దృక్పథంలో ఉండేవికావు. ఈ పరిస్థితులలో అందరికోసం, అన్నివిషయాలు ప్రకటించి కొద్ది ఖరీదులో అందించే పత్రిక 'న్యూయార్కు సన్' అనే పేరుతో బెంజమిన్ డే అనే ఆయన 1833-వ సంవత్సరము సెప్టెంబరు నెలలో ప్రకటించాడు. అప్పటికి వార్తా సంగ్రహణానికి ఇప్పుడున్న వీళ్ళు లేవు. అయినప్పటికి ఆయన మనుష్యులను పంపి గుర్రాలమీద, పడవలమీద రైళ్ళమీద నిజమైనవార్తలు త్వరలో తెప్పించేవాడు. అదేవిధంగా ఖండాంతరవార్తలుకూడ తాను ముందు తెప్పించేవాడు. వీధులలో పత్రికలను అమ్మేబాలురను నియమించిన మొదటివాడు ఆయనే. క్రమేణ సన్ యొక్క చందాదారులసంఖ్య పెరిగి నేటికి మూడు లక్షలు అయింది. 1868 లో ఈ పత్రికను డానా అనే ఆయన కొన్నాడు. ఆయన ఈ పత్రికను నిరుపమానమైన తెలివితేటలతో నిర్వహించాడు. 'డానా అంటే సన్, సన్ అంటే డానా' అనే అభిప్రాయం కలిగించాడు. ఆయన నిర్వహణంక్రింద 'సన్'లో అసంగతి తీవ్రమూస్తే అది అంతే అయి ఉండాలి'' అనుకు నేంత పేరు సంపాదించాడు. నేటికీ ఆపేరు అపత్రికకు ఉన్నది. నేడు అది ఒక గొప్ప రిపబ్లికనుయొక్క గొప్ప పత్రిక. పెన్నీ అంటే షుమారు అణా (18 పెన్నీలమారకం వచ్చినతర్వాత అంతకు తగ్గింది) అణా అంటే ఆ దేశాలలో చాలాస్వల్పం. సన్ పత్రికను చూచి మనదేశపు పత్రికలు చాలా నేర్చుకోవలసి ఉంటవి. అందరికీఅందుబాటులో ఉండే పత్రికలు ఇక్కడచాలా తక్కువ. ఒక శ్రీ ఫెన్సువారుమాత్రము రోజుపత్రిక అర్ధణాకు సప్లై చేస్తున్నారు. ఈ ఆర్థికపరిస్థితుల ననుసరించి దినపత్రికలేగాని, వారపత్రికలేగాని, మాసపత్రికలేగాని సాధ్యమైనంత తక్కువ ఖరీదులో వీలైనంత ఎక్కువవిషయం ఇవ్వదగ్గదిగా ఉండాలె. ధరలు అందుబాటులో ఉంచేనన్నా, ఎక్కువమందికొని ప్రోత్సాహం కలిగించి పత్రికలను ఉన్నతస్థితికి తీసుకురాగలరేమో ఆంధ్రులు చూడవలసి ఉంటుంది.

—కాశ్యపి.

కోరల పున్నమ.

ఆంధ్రభూమిని ప్రాచీనకాలమునుండియు మార్గశిర పూర్ణిమరోజున 'కొక్కెలుకొరికి కుక్కలకు వేయుట' అను ఆచారమొకటి పరంపరగా వచ్చుచున్నది. సకల వైజ్ఞానికరహస్యముల గుర్తెరింగిన భారతసంతతి యిట్లాచరించుటలో ఏదైన గొప్ప విషయము, మంచి ఫలము నుంచియే ఉండవలయును. చూడగా ఈ దినములలో పూర్ణతృప్తిగా భోజన మొనరింపరాదనియు కొంత తక్కువగనే భుజించవలయుననియు మిగిలినను యితర జంతువుల కొసగుటే శ్రేయస్కరముగాని మనమే భుజించకూడదనియు గోచరించుచున్నది. ఈ పున్నమ యముడు పండ్లుకొరుకుతూ యుంటాడు, కోరలు దురదగాయుంటాయట వాటినిండా విషం ఉంటుందట, ఆ విషం పోయేటందుకు యిట్లాకొక్కెలు కొరికేయ్యాలి అనే జనశ్రుతికూడా బలపరుస్తూయున్నది.

ఇట్టి జనశ్రుతి గతానుగతికముగా వచ్చినదేనా లేక శాస్త్రీయమైన ఆధారమేమైనకలదా? యని విమర్శించిన 'కార్తీకమాసమందలి తుది ఎనిమిదిరోజులు మార్గశిరమందలి మొదటి ఎనిమిదిరోజులు యమదంష్ట్రలని ఆరోగ్యశాస్త్రవేత్తలు సెలవిచ్చిరి. ఇట్టిపదునారురోజులను యమదంష్ట్రలని పేర్కొనుటచేతనే ఈ కాలమున మరణమునకును, వ్యాధులపాల్పడుటకును ఎక్కువ అవకాశములున్నవని స్పష్టమగుచున్నది. కావుననే 'స్వల్పభుక్తోహి జీవతి' (శార్ఙ్గధర) అని తన్నివారణోపాయమునుగూడ మనపెద్దలు సెలవిచ్చియే ఉన్నారు. అయితే యమునికోరల్లో ఉండేవిషం మనం రొట్టెలుకొరికితే పోతుందా అని సందేహం కలగటంకూడా న్యాయమే. అది నిజంగా యమునికోరల్లో విషం ఉండటంకాదు. అదోరూపకం. యీ కాలంలో మన పండ్లలోనే విషం ఉంటుంది, కండూతికూడా ఉంటుంది తినాలనే ఆలోచన తినుట కవకాశముకూడా ఎక్కువగానే ఉంటుంది. కావుననే మనకండూతి తీరేట్టు మనంతింటే యముడి కండూతి తీరేట్టు మనవధపడుతాడు. మనకోరల్లో విషం ఎక్కువైన కొద్దీ యముడి కోరలవిషంకూడా ఎక్కువై మన మరణానికి కారణమౌతుంది కాబట్టే కొంచెంకొంచెంగానే పండ్లకండూతి బాగాతీరేటట్టు నమలి, తింటం తక్కువగానే తినాలి. ఎక్కువుంటే పారివెయ్యాలికాని తినగూడదు. అప్పుడు కుక్కలు వగైరాలు తింటాయి. ఈ ఆదర్శాన్నే ఆచరణరూపకంగా చూపటానికి యీ పద్ధతి ఆచరణలోకి తెచ్చారుకాని మరేమిలేదు. ఈ యమదంష్ట్రలు శరద్హేమంతఋతువుల సంధికాలముకూడను. అందుచేతను గూడ ప్రాధాన్యతను గమనించవలసినదే. ఈ కాలమున శరత్తునందలి పిత్తప్రాధాన్యతతగ్గి తన్నిర్హరణార్థమాచరించిన ఆహారవిహారాదికముచే గల్గు వాతకఫచయముల హరించునటులగదా? యుండవలయును యీసంధికాల చర్య. కావుననే అట్టి కఫవాతవికృతిచేగల్గు అజీర్ణ, అగ్నిమాంద్య, అతిసార, జ్వరాదిరోగములు కలుగకుండుటకై యిందు కఫహరమగు లంఘనము (అల్పభోజన ఉపవాసాదికమును) మున్నగువానిని బోధించిరి. అజీర్ణ సంబంధమయిన రోగాలుకూడా యిప్పుడే యెక్కువగా వస్తూయున్నయి. పైగా పొద్దులేనికాలం, మాగుడు కాలం ఒంటిపూటతింటమే మంచిదని జనుల అనుభవం కూడాను. కావుననే యిట్టి అపాయమునుండి తరించుటకు, ఆరోగ్యశాస్త్రమున బోధించుటేకాక ప్రతిమతమువారును మతవిధులను పేరులతో యించుమించుగా ఈ కాలమున వ్రతాచరణమను పేరుతో ఉపవాసముల విధించిరి. హైందవమతమున కార్తీకమాసము శైవులకు నక్తవ్రతములు, వైష్ణవులకు విష్ణుపూజ, కార్తీకదీపవ్రతము మున్నగునవి. మహమ్మదీయమతమున యిప్పుడే యించుమించుగా ఒకమాసము ఉపవాసము రాత్రిభోజనము విధించబడినది. రంజాన్ నెల. క్రైస్తవమతమునకూడ యిట్టి ఉపవాసవ్రతమున్నది. హైందవాచారమున పగలంతయు నిరాహారులై యుండుట ఈ కాలమున ముఖ్యమగు విషయము. ఈ ఉపవాసములచే అజీర్ణాగ్నిమాంద్యాదులు హరింపునొంది అగ్నిదీప్తి, శరీరమున లఘుత్వము, ఇంద్రియప్రసాదము కల్గును. ఈకాలమున మఱియొక ముఖ్యమైన ఆచారము దీపపూజ. దీపారాధన చలిని హరించును; అగ్నివృద్ధిని కల్గించును. కావుననే వ్రతముఖ్యాంగములలో నిది యొకటియై యున్నది. దీనినిగూర్చియే కార్తీకపురాణమంతయు గానముచేయుచున్నది. ఇట్టి విధులనన్నిటిని పూర్తిగా జనసంఘమున ప్రచారముచేసి వ్యాపింపచేయుటకే పురాణశ్రవణాదికముకూడ ఏర్పరుపబడినది. బ్రాహ్మణభోజనాదికముగూడ ఇతరులకు తనకున్నదానిలో కొంత యిచ్చి తృప్తిచేయుటకొరకే విధింపబడినది. పూజాదికము మున్నగునవి అన్నియు పరిశ్రమకొఱకేగాని వేరుగాదు. ఇట్లు నీకాలమంతయు ప్రధానమేయైనను, యింతటి దీర్ఘకాలము యమదంష్ట్రలేయైనను, ఆదర్శకర్మాచరణమును మనమునందుంచుకొనుటకు ననువగు వటుల ఈపూర్ణిమకు ప్రాముఖ్యమిచ్చిరి. ఇంతియేకాక యిది యీకాలమున కంత్యదివసమగుటగూడ ప్రాధాన్యమును చెందుటకు తగియున్నది.

—వి. వి. యస్. ఆరాధ్య.

పాలకోడేటి వేంకటకృష్ణారావు పంతులుగారు

(ఎం. బి. బి. యస్., యఫ్. ఐ. యం)

అక్టోబరు మాసమున తెనాలియందు జయప్రదముగ జరిగిన పంద్రెండవ ఆంధ్రరాష్ట్రీయ ఆయుర్వేద వైద్య సమ్మేళనమునకు అధ్యక్షతవహించిన శ్రీయుత పాలకోడేటి వేంకటకృష్ణారావు పంతులుగారు నేటి ఆంధ్ర వైద్యశిఖామణులలో నొకరైయున్నారు.

శ్రీవారు పశ్చిమగోదావరిజిల్లా కొవ్వూరు తాలూకా దేవరపల్లియందు 1889-వ సంవత్సరమున జననము నొందిరి. తెనాలియందలి బోర్డు ఉన్నతపాఠశాలయందు పంతులుగారు ప్రవేశపరీక్షనిచ్చి రాజమహేంద్రవరమునందలి ప్రభుత్వ కళాశాలయందు చేరి 1909 వ సంవత్సరమున ప్రాథమిక శాస్త్రపరీక్షయందు జయము గాంచిరి. ఆసంవత్సరము నసే అనగా ఎఫ్. ఏ పరీక్షలో నెగ్గిన 1909 లోనే వైద్యకళాశాలలోచేరి వైద్యవిద్యాభ్యాసమునకు దొరకొనిరి. 1913-వ సంవత్సరమున బి. ఏ. ఫిజియాలజీ బ్రాంచిలో రాజధానిలో మొదటివారుగ జయమునందిరి.



అనంతరము మదరాసునందలి రాయపేటలోని గవర్నమెంటు ఆసుపత్రియందు హానరరీ సర్జనుగా నియమింపబడిరి. 1915-వ సంవత్సరమున అచటనే ప్రభుత్వమువారి జనరలు ఆసుపత్రియందు హానరరీ ఫిజీషియనులుగ నియమింపబడిరి. 1916-వ సంవత్సరమున వైద్యకళాశాలయందు ఫిజియాలజీలో జూనియరు సెకండు అసిస్టెంటు ప్రొఫెసరు ఉద్యోగము పొందిరి. 1918-వ సంవత్సరమున ఆకళాశాలయందే ఫిజియాలజీలో జూనియరు ఫస్టు అసిస్టెంటు ప్రొఫెసరు ఉన్నతపదవి నందిరి.

1924-వ సంవత్సరమున శ్రీ పంతులుగారు నూతనముగా స్థాపింపబడిన ప్రభుత్వమువారి ఇండియను మెడికలు స్కూలునందు శారీరారోగ్యశాస్త్రములందు ప్రధానాధ్యాపకులుగ నియమితులైరి. 1926-వ సంవత్సరమునుండియు శ్రీవారు గవర్నమెంటు ఇండియను మెడికలుస్కూలున కంటియున్న భారతవైద్యశాలయందు స్థానిక శస్త్రచికిత్సకులు (ఆర్. యం. వో)గా ఉన్నారు. 1930-వ సంవత్సరమున ఆయుర్వేదమునందలి అత్యున్నతపరీక్షయగు యఫ్. ఐ. యమ్. పరీక్షయందు జయముగాంచిరి.

ఇట్లు వీరు అల్లోపతిక్ వైద్యవిధానమునందును, ఆయుర్వేదవైద్యవిధానమునందును గొప్ప పరీక్షలనిచ్చి రెండు విధానముల లోతుపాతులను గనుగొనియున్నారు. అధ్యాపకులు, చికిత్సకులునై శ్రీవారు ఉభయవైద్యములయందును మంచి శాస్త్రజ్ఞానముతో గూడిన అనుభవమును ఆర్జించియున్నారు. అట్టివారిని ఆంధ్రరాష్ట్రీయ ఆయుర్వేద వైద్యసమ్మేళనమువారు ఈ వత్సరమున తమ అధ్యక్షమహాశయులుగ వరించి తమ ఉచితజ్ఞతను ప్రకటించిరి

శ్రీ వేంకటకృష్ణారావుపంతులుగారికి వైద్యశాస్త్రమునందును, చికిత్సావిధానమునందునుగల పాండిత్యము వారి అధ్యక్షోపన్యాసమునందు ప్రస్ఫుటమగుచున్నది. త్రిదోషసిద్ధాంతమును ఆయుర్వేదవైద్య ప్రశస్తిని బాగుగ వివరించుటతోడు శ్రీవారు ఆయుర్వేదవిద్యాభివృద్ధికి చేయ గావింపవలసిన విశేషకృషిని లెస్సగ చర్చించి చక్కని మార్గములను కొన్నిటిని సూచించిరి.

సంపాదకీయసమాలోచన

శాసనసభాప్రవేశము:—

శాసనసభాప్రవేశము ముఖ్యావసరమని మహారాష్ట్రములోను, మద్రాసు రాష్ట్రములోను నాయకులు కొందరు సభలుచేసి క్రొత్తపార్టీలను లేవదీయుచున్నారు. వీరి హడావుడి అంతయు గమనించినచో కాంగ్రెసు నిర్వచించిన ప్రణాళికను వీరు అనుసరించలేరని తేటతెల్లమగును. జైలుకు పట్టుమని వెళ్ళలేనివాళ్ళే ఈ పార్టీసభ్యులు. చొరవ చేసుకుని ఎవరైన వెళ్ళినను ఏవో కొన్ని వీళ్ళు చేసుకువెళ్ళినవాళ్ళే. జైలుకు వెళ్లుట మొదలగు కార్యకలాపమునందు వీళ్ళనాటికి తగినంతపని లేదు. పైగా వీళ్ళకు తగినంత పేరు లేదు. అదే వీరిని ఈపనికి ప్రోత్సహించి ఉండునని అనుకొనవలసియున్నది. ఈ వాదమునకు మహారాష్ట్రము, చెన్నపట్టణమే పట్టుగొమ్మలు. చూడండి. మహారాష్ట్ర దేశస్థులకు గాంధిమార్గము మొదటినుండియు నచ్చియుండలేదు. అప్పుడప్పుడు ముక్కుచు మూలుగుచు కాంగ్రెసులో చేరిరేగాని వారిలో ఆదినుండి రెస్పాన్సివు కోఆపరేషన్ పార్టీ అనిఒకటి ఉండనే ఉన్నది. వాళ్ల దేశస్థుడైన తిలకు ఆరోజులనుబట్టి వాళ్ళకు ఒకపద్ధతి చెప్పియున్నాడు. వాళ్ళ ఉద్దేశములో ఆ పద్ధతియే ఎల్లకాలము నడపవలెను అందుకు భిన్నముగా నడిచేపద్ధతి గాంధేకాదు భగవంతుడు చెప్పినను వాళ్లు వినరు. వాళ్ళ రాష్ట్రాభిమానము నిజముగా మెచ్చుకొనతగినదే. ఇక మద్రాసురాష్ట్రములో - తమిళప్రాధన్యమైన మదరాసురాష్ట్రములో - పనిచెయ్యడమనిన కొంచెము వెనకంజే. మాట్లాడమనినచో ప్లాటుఫారములను ఊపివేయగలరు. ఈ కబుర్ల పోగులకు శాసనోల్లంఘనమనినను, జైలుకు పోవడమనినను ఎట్లు సరిపడును? పోనీ మానివెయ్యరాదా అనిన మానివేసినచో పేరో? ఏమిచెయ్యకపోయినను పేరురావలెను. అటువంటివారికి వీరు ఏమియుచెయ్యవద్దు మీరు చాల గొప్పవారని ఏకగ్రీవముగా అందుమనినచో నొకవిధముగా రుచించునేమో! ఈ తమిళముతాకుతోడు అక్కడక్కడ పాంబారు అలవాటయిన ఆంధ్రులుకూడ కనబడుచున్నారు శాసనసభాప్రవేశము ఉపయోగమా, నిరుపయోగమా అనునదికూడ కొంచెము విచారింతము ఇదివరలో శాసనసభాప్రవేశము అనిన ఏమో ఎఱుగని కాంగ్రెసు అయినచో ఆలాభాలున్నవి, ఈలాభాలున్నవని బుకాయింపవచ్చును. ప్రస్తుతము శాసనసభాప్రవేశమునుగురించి మాట్లాడుచున్న నాయకులకు తలదన్నినవాళ్ళే ఈ ఉద్యమమును వెనుక మొదలుపెట్టారు. అందరిని తలదన్నిన పటేలుప్రభువు అంతవాడు ప్రెసిడెంటుకూడ అయినాడు. అయితే పర్యవసానమేమిటి? చాలమంది స్వరాజ్యపార్టీ తరఫునవచ్చినవారు మెల్లగాజారి ప్రభుత్వపు యెరలకులోబడి పార్టీకి నామర్దా తెచ్చినారు. కొందరుజారి ఉద్యోగమునకు ఆశపడినారు. మిగిలినవారు జగద్విఖ్యాతముగా ప్రభుత్వముతో పోట్లాడిపోట్లాడి ఇహ అక్కడచేయగలపని లేదని తిరిగి వచ్చినారు. స్థితి అట్టిది కాగా శాసనసభలలోకి వెళ్ళవలెను, వెళ్ళ

వలెను అనువారు "ఇందుకుగాను వెళ్ళు
చున్నాము. ఇదివరలో శాసనసభలు మాని
వేసివచ్చినవారు ఈ తప్పుచేసిరి" అని చెప్ప
లేమి? అదియుగాక వీరిప్పుడు ఏశాసనసభ
లలో ప్రవేశించెదరు? క్రొత్త వైటుపేపరు
సంస్కరణముల క్రిందరాగల శాసనసభల
లోనికి వెళ్లుటకు ఇప్పటినించి హంగామా
ఎందుకు? వైటుపేపరువద్దు. ఆ సంస్కరణ
ములు మాకు పనికిరావని ఘోషించి వాని
క్రింద అమలులోనికి రాగల శాసనసభలకు
మేము వెళ్లెదము అనినచో లోకజ్ఞానముగల
వాళ్లందఱును వీళ్ల కింతఆత్మగౌరవము లేదే
మా అని అంటారని ఆలోచనైనను వీరికి
లేకపోవుటకు ఆశ్చర్యమగుచున్నది.

ఊడిపడే నాయకుడు:—

పెద్దన్న షౌకతాలీగారు ఈమధ్య ఒక
జ్యోతిషంచెప్పారు ఎవరో ఒక నాయకుడు
త్వరలో ఊడిపడతాడని. దాన్నిగురించి విమ
ర్శిస్తూ "పయొనీరు" పత్రిక ఈఅర్థంవచ్చేట్టు
వ్రాసింది: "నూతన నాయకుడుతప్పక అవ
సరమే. ఆయన ఎవరయేది చెప్పలేము, కను
చూపుమేరయందు అలాంటివ్యక్తి కనపడడం
లేదు. అలాంటివ్యక్తి వచ్చేటప్పుడు అకస్మా
త్తుగా ఆవిర్భవిస్తాడనేది నిశ్చయమే కావచ్చు
గాని చూచాయగా విచారించడం తప్పు
కాదు. పెద్దన్న, వెనక కొన్నాళ్లు తమ్ముడు
వెనకా, ఇప్పుడు స్వయంగానూ హంగుచే
శాడుగాని అనేకపాత్రలు ధరించినవ్యక్తి ఇక
మహమ్మదీయులలో చెప్పుకోతగ్గవారు లేరు
వాళ్లయందు ఒకరిమాట ఒకరికి కాదు. ఇహ
హిందువులమాట! కొన్నాళ్లు ఒకరి వేదాం
తంతోనూ, కొన్నాళ్లు మరొకరి వేదాంతం
తోనూ సతమతమవుతూ ఉత్సాహనిరుత్సా
హాలమధ్య ఊగులాడుతున్నారు వీళ్లు. గాం
ధికి మహాత్మత్వమునకు సంబంధించిన కొంత
సరంజాం లేకపోతే ఆయనకూడా కొన్ని
తరాలు తంటాలు పడవలసిందే వీరిని వశం
చేసుకోవడానికి. జవహరిలాల్ మాట అంద
రూ వినడానికి తగిన సావకాశము కనపడదు.
హిందూమహాసభయందు ఉన్నవారియందు
తనసంకుచితాభిప్రాయాలు దాటి బయట
పడగలవాడు లేడు. పోనీ రాష్ట్రాలు వెదుకుదా
మా ఎవరూ కనబడడము లేదు. దాసుగారు
చనిపోయినతర్వాత బెంగాలు ముండమో
సింది నాయకుల విషయంలో. చెన్నపట్లపు
వారు వాగ్వాదపరులుమాత్రమే. బొంబా
యివారు ధనార్జనలో కాలంవినియోగిస్తు
న్నారు. ఇతర రాష్ట్రాలలోనూ పరిస్థితులు
అనుకూలంగా లేవు. అరవిందఘోషుగారు
తమ ఆధ్యాత్మికచింతన మానివేసి వస్తారన
డానికి వీలులేదు సుభాష్‌బోసుగారినిగురిం
చి మాట్లాడ నవసరమే లేదు. ఆయన అవ
కాశం వచ్చినపుడైనా విజృంభించలేదు.
మాటలుమాని కార్యరంగములో దిగగలు
గువారు మితవాదులయందు ఎవరైనా ఉ
న్నారా? వృథాప్రశ్న. పరిస్థితులు ఈలాఉన్న
ప్పటికీ ఎవరైనా నూతననాయకుడు వస్తాడనే
అనుకుంటాము. వస్తేమాత్రం ఆయన, బూ
జుపట్టిన సూత్రాలనూ, మామూలు పంథా
లనూ విడనాడగలడని, ఐక్యజీవనపు సువార్త
వ్యాపింపచేస్తాడని ఆశిద్దాము." పైమాటలు
వ్రాసినవారికి దేశంలో గాంధిగారిమార్గం
నచ్చలేదని, మిగిలినవారిలో దేశాన్ని నడప
గలవారు లేరని తోస్తున్నదని విశదమవుతు
న్నది. పోనీ భారతదేశక్షేమానికి సతతం
పాటుపడే అర్థాంగ్లపత్రికా సంపాదకులలో
ఎవరో ఒకరుగాని, చర్చిల్ మొదలయిన కన్స
ర్వేటివుడై హార్డులయందు ఒకరుగాని, లేక

భారతదేశక్షేమమే పరమావధిగా బెట్టుకుని యున్న పెద్ద ఉత్తరం వ్రాసిన సైనికోద్యోగులయందు ఒకరుగాని ఎందుకు కాగూడదూ ఆ ఊడిపడే నాయకుడు?

దంపుడు బియ్యపు సంఘములు:—

బియ్యపుమరలువచ్చి రోళ్ళూ రోకలి కట్టుకొని జీవించుచున్న పల వురికూటిలో దుమ్ముకొట్టుటయేగాక పోషకపదార్థములను గోల్పోవు తెలబియ్యమునిచ్చి ప్రజారోగ్యమునకు భంగము కల్గించినవి. యంత్రములను ఆరాధించుటవలని హానిని మహాత్ముడు బోధించినపిమ్మట ఈ బియ్యపు మరలవలని హానిని ప్రజలు నెమ్మదిగా గ్రహింప నారంభించిరి. విటమినులనుగూర్చిన ప్రచారము హెచ్చినకొలదియు మరబియ్యముపై ప్రజలకు విముఖత యేర్పడచొచ్చెను. దంపుడు బియ్యమునకు కొంత డిమాండు ఏర్పడినది. గుంటూరు, మదరాసు పట్టణములందు దంపుడుబియ్యపు సంఘములు స్థాపింపబడి దేశభక్త కొండా వేంకటప్పయ్యపంతులు, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుపంతులు గార్ల ఆశీర్వచనములంది కార్యక్రమమునకు గడంగినవి. కాంతలకరములందు కవ్వము, కదురు, రోకలి ఆడినంతకాలము భారతమాత పాడిపంటల మహాలక్ష్మియై వర్ధిల్లినది. వారు వాని నెపుడు విడనాడిరో అపుడే దేశమాతకు దరిద్రదశ ఆరంభమైనది. తొల్లింటి యౌన్నత్యమును తిరిగి పొందుటకు భారత కాంతలు తమ కరములందు తిరిగి కవ్వము, కదురు, రోకలి గీలింపవలయును. కద్దరు, దంపుడుబియ్యముల కొనుగోలు తిరిగి కాంతలు కవ్వము, కదురు, రోకలి కరముల గీలించు యుద్యమమునకు ప్రాణములీయగలదు.

మదరాసుశాసనసభ: ఆంధ్రరాష్ట్ర తీర్మానము

వెనుకటి సభలో వాయిదాపడిన ఆంధ్రరాష్ట్రతీర్మానము ఈసారి సభయందు ఆమోదింపబడినది. ఆమోదింపబడినంతమాత్రమున లాభమేమి? వెనుక నొకసారి ఇట్టి తీర్మానము ఆమోదింపబడియున్నదికదా? దానివలన ఏమి ఫలము కలిగినది? ఇప్పుడును అట్టిఫలమే కలుగునా? ఈ తీర్మానమునందుకొని ఆంధ్రులు తగినంత ఆందోళనము చేసి ప్రభుత్వమునకు ఒత్తిడిని కలిగింపనిచో దీనివలని విశేషలాభమును బడయజాలరు. ఈ విషయమైన ఓటింగుసమయమున తటస్థులుగానున్న ఆంధ్రసోదరులు కొందరుగలరు. వ్యతిరేకింపక వారు తటస్థులుగ నుండుటచేతనే అసలీతీర్మానము అంగీకరింపబడుటకు అవకాశము కలిగినది. శ్రీ పాములపాటి వేంకటకృష్ణయ్యచౌదరిగారు ఈ తీర్మానమునకు అనుకూలముగ ఓట్లు సంపాదించుటలో చూపిన చాకచక్యము బహుధా ప్రశంసనీయమై యున్నది. తీర్మానము మొత్తముమీద చాల కష్టముపైననే నెగ్గినదనుట సులభముగ నిర్ణయింపనగును. ఇంతటి కష్టముపైన నెగ్గించుకొనగలిగిన ఈ తీర్మానమును ఫలోదయాంతముగ చేయుటకు ఆంధ్రులు విశేషకృషి చేయవలసియున్నది. ఇప్పుడైన ఆంధ్రసభను నాయకులు కూడసిత్తురా?

'ఐరావతి' దీపావళి సంచిక:—

బర్మారాష్ట్రమున వలస నెలకొనియున్న ఒకటిన్నర లక్షల ఆంధ్రుల క్షేమాభివృద్ధులకై రంగూనుపురమునుండి ఆఱువత్సరములుగ ప్రచురింపబడుచున్న తెనుగు వారపత్రికయగు 'ఐరావతి' 14-10-38 తేదీని వెలువడిన దీపావళిసంచికను వందనపూర్వకముగనందుకొంటిమి. సంచిక చిత్రపటశోభితమై రంగు

రంగుల సిరాలతో ముద్రితమై ప్రకాశకుల ఉత్సాహాతిశయమును ప్రదర్శించుచున్నది. 'పదభ్రష్టులైన భూపాలురు', 'గోలకొండ వజ్రము' మున్నగు వ్యాసము లీసంచికకు విలువ తెచ్చునవి. బర్మాలోని ఆంధ్రనాయకులలో నొకరగు శ్రీయుత పెమ్మి సోమరాజు గారి జీవితము సచిత్రముగ ప్రచురితము.

<u>ఆంధ్రభూమి : కృష్ణాపత్రిక :—</u>

పత్రికాలోకమున ఏర్పడియున్న మర్యాదననుసరించి మేము 'ఆంధ్రభూమి'ని ప్రారంభమునుండియు కృష్ణాపత్రిక కార్యాలయమునకు పంపుచున్నాము. కాని కృష్ణాపత్రిక సంపాదకులు 'ఆంధ్రభూమి'కి పరటాగా వారి పత్రిక నిచ్చునీతిని ఇంతవఱకు పాటింపలేదు. ఒకవేళ వారికి ఈ పత్రిక సంచికలు అందుటలేదేమో, లేనిచో ఆంధ్రపత్రికాలోకమున చిరప్రతిష్ఠ నార్జించిన కృష్ణాపత్రిక వారిట్టి వ్యతిక్రమము జరుగనిత్తురా అని తొలుత అనుమానించితిమి. కాని సెప్టెంబరు 23-వ తేదీనాటి కృష్ణాపత్రిక చూచుటతోడనే ఆంధ్రభూమి సంచికలు కొన్నియైన వారికి చేరియుండవలయుననుట ధ్రువమైనది. ఆగష్టు మాసపు ఆంధ్రభూమియందు 'ఆరోగ్యవిజ్ఞానము' అనుశీర్షిక క్రింద ౨౧౭-వ పుటయందు ప్రచురింపబడిన 'చంటిబిడ్డల దేహపరిశ్రమకనువైనపద్ధతి' అను వ్యాసశకలము సెప్టెంబరు 23-వ తేదీనాటి కృష్ణాపత్రికయందు 'ఆయురారోగ్యములు' అను శీర్షిక క్రింద ఎత్తి ముద్రింపబడియున్నది. అది ఆంధ్రభూమినుండి గ్రహింపబడినట్లుమాత్రము అచట సూచింపబడలేదు ఇతరపత్రికలనుండి చేకొనిన విషయములను అట్లు చేకొంటిమని సూచించుట పత్రికాలోకమున ఆచారసిద్ధమైననీతి. ఆంధ్రభూమినుండి అపుడపుడు విషయములను గ్రహించుచున్న ఆంధ్రపత్రిక, సమదర్శిని, ఐరావతి, దేశసేవ మున్నగు పత్రికలు ఈ పత్రిక నామమును పేర్కొనుచునేయున్నవి. ఇతర పత్రికలనుండి విషయములను గ్రహించుచున్నప్పుడు మేమును అట్లే గావించుచున్నాము. ఆంధ్రపత్రికలందు వయస్సుచేతను, గౌరవముచేతను తొలుతటి స్థానము నందియున్న కృష్ణాపత్రిక వారు ఇట్లు కావింపకుండుటకు కారణము పొరపాటైయుండునని ఎంచి ఈ విషయమై వారికి లేఖ వ్రాసియుంటిమి. దానికి బదులు కానము. పైగా, జులైమాసపు ఆంధ్రభూమియందు 'ఆరోగ్యవిజ్ఞానము' అను శీర్షిక క్రింద ౧౫౩-వ పుటయందు ప్రచురింపబడిన 'పరుండునపుడు గమనింపదగు మెలకువలు' అనుదానిని నడుమ నడుమ కొన్ని వాక్యములను కత్తిరించి 'నిదుర: పండుకొనుపద్ధతి' అను తలపేరుతో ఎత్తి తమ పత్రికయందు ముద్రించుకొనిరి. 'ప్రకృతి'పత్రిక వారు దీనిని తమ నవంబరుమాసపు సంచికయందు 28-వ పుటయందు ముద్రించి కృష్ణాపత్రికనుండి గ్రహించితిమని సూచించిరి. పత్రికలు పాటింపవలసిన నీతిని, నియమములను ఇతర తెనుగుపత్రికలకు ఉపదేశింపజాలు వయస్సును, అనుభవమును పొందిన కృష్ణాపత్రిక ఈ అక్రమమును బుద్ధిపూర్వకముగగాక పొరపాటుచేతనే గావించియుండునని మేము-ఇంత జరిగినమీదగూడ తలంచుచున్నాము. కాని ఉత్తరము వ్రాసినను పొరపాటును సవరించుకొనకుండుట; పత్రికను అందుకొనుచు, అందుండి వ్యాసములను గ్రహించుచు పరటాగా తమ పత్రికను పంపకుండుట కృష్ణాపత్రికా కార్యాలయము వారి ప్రతిష్ఠకు తగియుండలేదని సవినయముగా మనవి చేయుచున్నాము.



అక్టోబరు, ౧౯33.

౨౮:—గుడివాడ. కేతవరపు లక్ష్మీనరసింహారావు, బి.ఏ. చెరుకువాడ వెంకటనరసింహంపంతులు, కమలాదేవి ఛటోపాధ్యాయిని గార్ల ఎరస్టు.

౨౯:—విశాఖపట్టణము. ఆంధ్రకవుల ఛాయాచిత్ర ప్రదర్శనము. శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రారంభించిరి.

:—తెనుకు. ఆంధ్రరాష్ట్రీయ ఆయుర్వేదసభ, అధ్యక్షులు పి. వి. కృష్ణారావుపంతులు గారు.

:—తెనుకు. యం. జగ్గన్నశాస్త్రిగారి యింటిని సోదాచేసి 'పల్లెటూరి గ్రంథమండలి'కి చెందిన గ్రంథములను స్వాధీనముచేసికొనిరి.

:—గుంటూరు. 7-వ గుంటూరు మండలమహిళామణులసభ, అధ్యక్షురాలు శ్రీమతి తుర్లపాటి రాజేశ్వరమ్మ గారు.

౩౦:—బందరు. డాక్టరు పట్టాభిసీతారామయ్యగారు చేతిలో జాతీయపతాకమునుదాల్చి సీమగుడ్డల దుకాణము ఎదుట విక్రయనిరోధము ప్రారంభింపగ పోలీసువారు ఎరస్టుచేసిరి. కేసు విచారణ. 6 మాసములు కఠినశైదు. రు 500 జరిమానా. ఎ తరగతి. వేలూరు చెరసాలకు గొనిపోబడిరి.

నవంబరు, ౧౯33.

౧:—గుడివాడ. దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారికి 9 నెలలశిక్ష.

౩:—శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు తిరిగి న్యాయవాదవృత్తి స్వీకరించు ప్రకటన.

:—కైకలూరు. సారాదుకాణముచెద్ద పికెటింగు చేయుచుండగా, మాగంటి వెంకటకృష్ణయ్యగారి అరెస్టు.

౪:—ఏలూరు:—సప్తమ ఆంధ్రరాష్ట్రీయమహాసభ. శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి అధ్యక్షురాలు.

౧౧:—మదరాసు. శాసనసభలో ఆంధ్రరాష్ట్రతీర్మానము ఆమోదింపబడెను.

౧౨:—గుడివాడ. అయినంపూడి శ్రీనివాసులుగారు తిరిగి ఎరస్టు చేయబడుట.

౧౩:—నందివాడ. గ్రామములలో కాంగ్రెసు ప్రచారము చేయుచున్నారను కారణమున లోగడ అరెస్టు చేయబడిన శ్రీయుత పూసూరి వెంకారెడ్డిగారు గుడివాడ సబుజైలునుండి విడుదల చేయబడిరి

:—ఆంధ్రవిశ్వవిద్యాలయము సిండికేటువారు ఢిల్లీలో 1931 మార్చిమాసమున జరుగు వివిధవిశ్వవిద్యాలయప్రతినిధుల సంఘమునకు ప్రతినిధులుగ ఎల్. సుబ్బారావు (కాకినాడ), పుల్లారెడ్డిగార్లను ఎన్నుకొనిరి.

౧౫:—బెజవాడ. శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావుపంతులుగారికి క్రిమినల్ ప్రొసీజరుకోడ్డు సెక్షను 108 క్రింద నోటీసు ఇచ్చుట.

౧౬:—బెజవాడ. మ్యునిసిపల్ కౌన్సిలు కొట్లాట కేసులో తీర్పు. శ్రీమతి జి. రంగనాయకమ్మగారు మున్నగువారు అబ్దుల్ ఖాదరుసాహెబుగారిపైని పెట్టిన కేసులలో ముద్దాయికి 2 నెలలు కఠినశిక్ష. రు 50 జరిమానా విధించబడెను.

౧౯:—రాజమండ్రి. ౨వ ఆంధ్రహోమియోపతికు కాన్ఫరెన్సు.

:—కైకలూరు. రిమాండునుండి మాగంటి వెంకటకృష్ణయ్యగారి విడుదల.

౨౧:—పాలకొల్లు. పురపాలకసంఘమురద్దు. శ్రీయుత డి. బి. సి. వెంకటరావుగారు స్పెషలు ఆఫీసరుగా నియమింపబడిరి.



సస్యలక్ష్మి

—చిత్రకారుడు: శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్టు సొసైటి.

మహాత్ముఁడు

తనదృష్టి విశ్వసంతానరక్షణకునై
  సారించు గౌతమచక్రవర్తి
తనమేనికండ సంతసముతో నర్పించు
  పృథువదాన్యుండు శిబిప్రభుండు
తనశత్రుషడ్వర్గమును జయించి ర
  మేశు నర్చనసేయు ప్రహ్లాదసుకృతి
తనలోన నెచటఁజూచిన సత్యమె ధరించి
  శాంతాత్ముఁడైన యజాతశత్రుఁ


డితఁడెపో యని సర్వమహీతలమున
దిశలు శబ్దింప తనదివ్యతేజమునను
వెలుఁగు గాంధీమహాత్మున కలఘుమతికి
నంజలింపని మానవు లవనిఁ గలరె ?

తినఁగూడు లేక రోదించి యల్లల
  నాడు బీదలగమికి నామోదగరిమ
రాత్రింబవళ్లు విరామఁ బెఱుంగక
  కష్టించు రైతుసంఘాల సురభి
పవలెల్ల కష్టించి పనిచేయు కార్మికుల్
  విస్మరింపగరాని వేల్పుభర్త
నిలువనీడయును వీథులఁ బోవుపున్నెంబు
  కొరవడ్డవారల కోర్కెఫలము

నీదురూపంబు; హైందవానీకమెల్ల
అరసి, యోజించి, చిరసముపార్జితంపు
పుణ్యఫలమని గర్వించి పొగడుచుండు
నాత్మనుప్పొంగుహర్షంబు నాపలేక.

—సామవేదం జానకీరామశర్మ.

“ఆంధ్రభూమి”



గాంధీమహాత్ముడు

“మహాత్మా! మీరు మా దేశంబునకు వేంచేయుటంజేసి జన్మాష్టమియు మహానవమియు ననంతచతుర్దశియు దక్షిణాయనపుణ్యకాలంబు నుత్తరాయణసంక్రాంతియు తులా మేషసంక్రాంతియు దశమియు నేకాదశియు ద్వాదశియు నమావాస్యయు లోనగాఁగల పుణ్యదివసంబులు మాకు సమకూరె.”

సంక్రాంతి: ఆంధ్రభూమి

✠

౧

ఇది యపూర్వశుంభచ్ఛోభ పొదలు గొనెడు
ఘటితవైభవామోదసంక్రాంతిదినము;
హేయజీవితభిక్షుకహృదయులతయు
నగణితసుమాళిసుమరాజి సొగయు దినము.

౨

ప్రకటితోత్సవవైభవోల్లాసములకు
గొనబు కాణాచియైన మా తెనుఁగుసీమఁ
గ్రొత్తదనపుమవ్వమ్ములు ప్రోదిసేయు
నిర్వహణశుభసంక్రాంతిపర్వవేళ.

౩

భాసురవిలాససంక్రాంతివాసరమున
సహజదరహాసనూనప్రసవమ్ము తోడ
ప్రకృతిబాలిక భక్తిభావమ్ము లొలుక
నర్చనావిధిఁ గై సేసె నాంధ్రభూమిఁ.

౪

మానితపరస్పరానుషంగానుభూతి
బాలదంపతులకుఁ బూఁప వలఁపుఁబొలుపు
స్వాంతసీమ వెలార్చి సంక్రాంతి తెలుపు
నాంధ్రసన్నుతాచారమర్యాదవృత్తి.

✠

—ఓలేటి సీతారామమూర్తి.



పుస్తకాలు వ్రాసే తీరు

ఉపోద్ఘాతము

ఈమధ్య ఉద్యోగపు బాదరబందీవల్ల యేమి వ్రాయడానికి తీరిక లేకుండావుంది. ఈదినం యేదైనా వ్రాయాలనికూర్చుంటినిగదా యెంతసేపటికీ కలంసాగదు. నాకాశ్చర్యంవేసింది. పత్రికాధిపతులు అంగీకరించేలావున్నా, అంగీకరించకపోయేలావున్నా వ్రాయాలని కూర్చుండేసరికి యిదివరకు వ్రాయగలిగేవాడిని. ఈ జడత్వం నన్నాలోచనలోకి దింపింది. ఇన్ని పత్రికలలో వ్యాసాలు వస్తున్నాయి, యిన్ని పుస్తకాలు అచ్చుపడుతున్నాయి, వారందరు ఏలావ్రాస్తున్నారు, దీని కేదైన కిటుకు వుందా, అది నొక్కేసరికి వ్యాసరచనాని కుపక్రమింపజేసేయంత్రం వడవడమునకు అనేయోచనలో పడ్డాను.

ఉన్నవ లక్ష్మీనారాయణపంతులు

చూడగా చూడగా నాకట్టిత్రోవ తెన్నూ యేమీ గోచరింపలేదు. ఈరచనావిధానం వ్యక్తులనుబట్టి మారుతూవుండేలాగున్నది. త్వరజీవనము గ్రంథరచనకనను కూలమని కొందరిమతము. పాశ్చాత్యదేశాల్లో రచయితలాకారణంచేతనే ఉద్యోగస్వీకరణం చేయకుండా స్వతంత్రజీవనము కోరుతారు. అయినా అనేకవ్యవహారాల్లో జోక్యంకలుగజేసుకుంటూ నిరంతరకార్యలోలురైన వారిలోగూడా కవులు, వ్యాసకర్తలు, నవలారచయితలు వున్నారు. డబ్ల్యు. బి. యీట్సు, సర్ హాల్కేను, బర్కిన్‌హెడ్డు ప్రభువు, రవీంద్రనాథ ఠాకూరు, కజిన్సు మొదలైనవారిట్టివారు. ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారు కిటువంటివారు. ఖయిదులోవున్న సమయంలో, తెలుగుభాషలోని నవలలకెల్లా మకుటమనదగిన మాలపల్లెను వారు రచించడము వల్లరాతిమీద పువ్వులతను పెంచుటవంటిది. జాన్ బనియను అను సుప్రసిద్ధఆంగ్లేయరచయిత 'పిల్‌గ్రిమ్సు ప్రోగ్రెసు' అనే గ్రంథమును చెరసాలలోనే వ్రాశాడు. లోకమాన్య తిలకుమహాశయుడు గీతాభాష్యాన్ని నిర్బంధకాలంలోనే రచించాడు. డిప్యూటీకలెక్టరుగా వుండి బంకించంద్రుడు, జిల్లాకలెక్టరుగావుండి రమేశచంద్రుడు అనేక పుస్తకాలను రచించారు. కనుక దేశకాలాలకు రచనకు సంబంధంవున్నట్లు తోచదు.

కందుకూరి వీరేశలింగముపంతులు

వీరేశలింగంగారి గ్రంథరచనావిధానం కూడా చిత్రమైనదే. పగలల్లా సంస్కరణవిషయాలలో వెళ్ళబుచ్చేవారు. పీనసరోగపీడితులవడంచేత రాత్రులు వీరికి సరిగా నిద్రపట్టేదికాదు. అప్పుడు ఆముదపుదీపందరిని కూర్చుండి కత్తివంటి పదునుగల తమ కలాన్ని సాగనిచ్చేవారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులు

కొందరు తమంతతాము వ్రాయజాలకపోవడముచేత వ్రాయడానికితరులపై ఆధారపడ్డవారున్నారు. మిల్టను ఉత్తరజీవితములో అట్టివాడు. అత డంధుడు, వ్రాయజాలడు. ఆదశలోనే అతడు 'ప్యారడైజ్ లాస్టు' అను ఘనమహాకావ్యాన్ని రచించినది. వొంటరిగా వున్న సమయాల్లో పద్యాలుకూర్చుకుని, కంఠస్థముచేసికొని వ్రాసేవారెవరైనావస్తే యేకధారగా చదివి వ్రాయించేవాడు. మన చిలకమర్తి లక్ష్మీనృసింహంపంతులుగారు కూడా యిట్టివారే. వీరికి వుత్సాహంకలిగిందా ఒకే దమ్మున పదిపది హేను పేజీలవరకు చెప్పేవారు. లేదా ఆరోజున అరపేజీకూడా జరగేదికాదు. వీరినవలల

నీవిధంగానే వ్రాసేవారు. నాటకాలలోని పద్యాలను ముందుగా అల్లుకుని వ్రాయసగాడు వచ్చినపుడు వానిని సంభాషణలో కలిపి చెప్పేవారు. వీరి నరకాసురవిజయాన్ని, యీవిధంగా నెల కొకఅంకముచొప్పున రచించి మనోరమ పత్రికలో ప్రకటించారు. కర్పూరమంజరి రెండవభాగాన్ని రచించుటకు చాలా కాలయాపన చేశారు. పంతులుగారు వృద్ధులైనారు ప్రథమభాగముతో తులతూగునట్లు రెండవభాగమును పూర్తిచేయలేరని పలువురు తలచారు. కాని వీరి కూర్చున్న తరువాత దానిని అచిరకాలంలోనే పూర్తిచేసి కథాసంవిధానంలోను, శైలిలోను యౌవనదింకాన్ని మళ్ళీ చూపగలిగారు.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

మరికొందరి ముఖతః కవిత్వం గ్రామఫోనులోనుంచి వచ్చినట్లుగా ఆశుధారగా వస్తుంది. చికిలింతవలె ఇది చాలవరకు రుచిహీనం, సారహీనం. కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులుగారు ఆశుకవిత్వ వ్యామోహం లేని వారు. కాని వ్రాస్తూ, కొట్టివేస్తూ గుడుబండీ రీతిగా సాగదు వీరిరచన. వ్రాసింది కొట్టివేయరు. వ్రాయాలని యేవేళ కూర్చున్నా, వారిలేఖిని నిరాఘాటంగా సాగుతుంది.

వడ్డాది సుబ్బారాయుడు

వడ్డాది సుబ్బారాయుడుగారుకూడా ఆశుకవిత్వమును బెబ్బులిని నిరసించినవారే. వీరు వ్రాసినదానికి చికిలిపనిచేస్తారు. ఓపిక చాలావుంది. ఉపమానాలు ఉచితంగాను, మనోహరంగాను వుంటవి. ఉచితోపమానాన్వేషణమున ఒక్కొకప్పుడు రాత్రి తొమ్మిది మొదలు తెల్లవారుఝామున మూడుగంటలవరకూ కూడ కూర్కు లేకుండా కూచుని యోచించు ఓపిక, దానిని సేకరించగల ప్రజ్ఞ వీరికి లెస్సగా వుంది.

వేదుల సత్యనారాయణశాస్త్రి

కష్టాలెంతయెక్కువగా వొత్తితే అంత రసవంతమైన కవిత్వం కలుగుతుంది వేదుల సత్యనారాయణశాస్త్రివద్ద — చెఱకు కఱ్ఱ నెంత బలముగ నొక్కితే అంత యెక్కువరసము వచ్చినట్లు. 'నిరుపహతిస్థలంబు, రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడెము, ఆత్మకింపయిన భోజనము, ఉయ్యెల మంచము' మొదలైనవి కావాలనే షరతులు ఈతనివద్ద మాయమైనవి. డొక్క మాడుతూంటే కటికచీకటిలో రత్నముల వంటి పద్యసంచయాన్ని వెలయించే యోగ్యత యితని సొమ్ము.

రాయప్రోలు సుబ్బారావు

ఆదివరకు కోకిలపాటవలె హాయినించిన రాయప్రోలు సుబ్బారాయుని కవిత వుద్యోగంలో చేరిన తర్వాత మూకీభావం వహించింది.

ప్రాచీనకవులు

ఈవిషయాల్లో ప్రాచీనకవులెలావుండేవారో సరిగా తెలియదు. నన్నయభట్టు భారతము నేతీరుగా రచించాడో యింకెన్నటికి తెలియదుగదా! తిక్కన భోజనానంతరం దీక్షావిధిగా కూర్చుని ఆశుధారగా పద్యాలు చెపుతూవుంటే గురవయ్య వ్రాసుకునేవాడట. ఆయనకు వ్రాయడం కొట్టివేయడంలేదు. ప్రమిదల్లో చమురంతా అయేవరకూ వ్రాసి 'యావత్తైలం తావద్వ్యాఖ్యా' అనడానికికూడా వీలులేదేమో. పిల్లలమఱ్ఱి పినవీరన్న తన జైమినిభారతమునంతా ఒకరాత్రిలో ముగించి 'వాణి నారాణి' అన్నాడని జనశ్రుతి. రామరాజభూషణుడు వసుచరిత్ర రచనాసమయమున భోజనాదికములనుకూడా మరచిపోయాడట. ఆకాలంలో కవుల లేఖినులు కృత్యాద్యంతమూ విశ్రాంతి యెఱిగివున్నట్టు కన్పించదు. ఈనాటి శిరోభారాలు, వేళావేళలు (టైములు) మనోవికారాలు (మూడ్సు) ఆనాటివారి కున్నట్లు గోచరించదు. ఇంకా ముందువారి విషయం యేలా వుండబోతుందో!

విధేయుడు. సత్యనారాయణశాస్త్రి

గుసగుసలు

సమయము :

వెన్నెలరాత్రి.

స్థలము :

మైలాపూరునం దొక చక్కని భవనమునకు ముందరనున్న సుందరమగు వనములో, మధ్యభాగమున గుబురుగానున్న గులాబిచెట్టుయొక్క చిట్టచివారుకొమ్మనుయం దార బూసిన పుష్పమునందలి రేకుల మఱుగున.

ప్రవేశము :

రెండు తేనెటీగలు.

ఎల్లడ నిశ్శబ్దము.—అప్పుడప్పుడు మాత్రము మందసమీరుని చక్కలిగింతల కులికి పడుచున్నవి, చిగురుటాకులు.

* * * *

కలువతేని ధవళకిరణములనుండి జాలువారుచున్న మంచుతుంపరలకు సహింప నేరక వెలుపలనుండి కుసుమములోని కొకింత జరిగినది తేనెటీగ—అచ్చట వేరొకనిగాంచి ఆశ్చర్యముతో, 'ఎవరువారు ?' అని ప్రశ్నించినది.

రెండవ తేనెటీగ

నే నొకయభాగ్యుడను.

మొదటి తేనెటీగ

సకలపుష్పముల కాస్పదమగు పెక్కు వనములతో విలాజిల్లుచున్న చెన్నపురియం దు నివసించుచున్న నీవేల యభాగ్యుడ వైతివి?

రెండవ తేనెటీగ

కాలవశమున నే నీపట్టణమునకు రావలసి వచ్చెను.

మొదటి తేనెటీగ

నీ వొకపల్లెటూరివాడవా యేమి! ఇచ్చ ట కెట్లు వచ్చితివి?

రెండవ తేనెటీగ

విద్యుద్దీపముల కాంతికిభ్రమసి, గృహ మనితలచి రైలుపెట్టెలోదూరి, గడచిన రాత్రియంతయు ఆదీపముకడ ప్రదక్షిణములు చేసి, తెల్లవారుసరికి నా కెఱుక లేకయే నేనీ పట్టణము జేరితిని.

మొదటి తేనెటీగ

నీవు ధన్యుడవు.

రెండవ తేనెటీగ

ముమ్మాటికినిగాదు. ఇది నాపూర్వపాప ఫలమనక తప్పదు.

మొదటి తేనెటీగ

ఎందవలన?

రెండవ తేనెటీగ

ఓయి! నీకేమి తెలియగలదు? సర్వసౌభాగ్యముల కాకరమగు ప్రకృతిమాతయొడిలో కాలముగడపుట కిది తావుగాదు.

మొదటి తేనెటీగ

ఇచ్చట వనములు, కొలనులు గలవు.— తక్కువేమి?

రెండవ తేనెటీగ

ఇదియా నీసుఖము? ఇచ్చట ప్రశాంతముగానున్న స్థలము లేనే లేదు. పైకెగురుదమన్న తీగెలు. క్రింద విహరించెదమన్న, మోటారుల వికృతమగు కూతలు, ట్రాముకారుల దడదడలు.—

మొదటి తేనెటీగ

ఇదియు నొక కష్టమా!

రెండవ తేనెటీగ

కాకేమి? దురదృష్టవశమున నేనిచ్చటకు వచ్చిపడితిని; లేనిచో సర్వసౌఖ్యముల ననుభవించుచు మాపల్లెటూరిలో హాయిగానుండెడివాడను. ఇవి సంక్రాంతిపండుగదినములు.... తెల్లని కొత్తిమిరిచేలతో; పచ్చని చామంతి, బంతి, పూలతో పల్లెటూరు లిపుడు కనుల పండువుగనుండును..........చెట్లబోదెల నొఆనికొని ప్రవహించుచున్న సెలయేటియలల కొనలయందుబడుచున్న చంద్రుని ధవళమయూఖముల చక్కదనము; చెట్లకొమ్మలనుండిగాలి, నీటబడుచున్న కుసుమముల చల్లని, చక్కని ధ్వని; మంచుముత్యముల హారములధరించి, పచ్చనిచీరదాల్చి మోదుగుపూవుల చెంగావి రెవికదొడగి కులుకు వసుంధరాదేవియొక్క సహజలావణ్యము; తలనిండ బంతిపూవులదురిమి, కనుల గజ్జలముదీర్చి, గళ్లకంచుకముదొడగి, కర్నాటకపుచీరదాల్చి, మిరపపొలముల కలుపుదీయుచున్న కాపుపడతులబెడంగు; తేగపండ్లకై బడివదలినంతనె, పొలమునకేగి, గట్లకెగ్రబాకు పిల్లలకోలాహలము; ఎచ్చటనో ఆకులమఱుగునదాగియుండి, మవానవల నీనుచున్న అడవిమల్లెగుత్తులను; చూడవలయును, వినవలయును, మూర్కొనవలయును. అప్పుడుగదా నాప్రాణము నిలచునది. సఖుడా! పట్టణమునంతయు ఈరోజు పగటివేళగలయజూచితిని. నాయానందముతో, నీకెట్టి యనుభవము లేదని గ్రహించితిని... ...ఆపొదలమాటున ప్రశాంతమైన స్థలమునందు వికసించి, బోసినవ్వుల జిమ్ము కుసుమముపై నధివసించి, ఎచ్చటనో గానమొనరించుచున్న, కోకిలమధురగానసుధాస్రవంతిలో మునిగిపోవుచు, నిర్భయముగ బాడుకొనుచు పశువుల దోలుకొని పోవుచున్న బాలుని కోమలకంఠరవమునందు యూయలలూగుచు, చిదుగుల నేరికొనుచున్న కాపుకన్నెయొక్క అవ్యక్తగానఝరులయందుద్భవించు తరంగములనీడలయందు దోబూచులాడుచు, సర్వముమరచి, నిలచియున్న కుసుమమునందే రెక్కలు ముడుచుకొని గంటలకొలది నిద్రించుభాగ్యము నీకు లేదుగదా! ... ...బ్రతికి యున్నన్నిదినములు మకరందమును సమకూర్చవలసినదేనా? ఈపరితాపమాజన్మాంతము మనకుండవలయునా? నారుబోసినదేవుడు నీరుబోయడా? బ్రతుకంతయు స్వార్థమునకై వినియోగింపకతప్పదా?- - - - - మనమాట యటులుండనిమ్ము--విజ్ఞానులగు మానవులమాట మదిని విచారింపుము—నేడీపట్టణమునంతయు తిరుగుచున్నకాలమున నాకాశ్చర్యము కలిగినది. ఏమి యీ పరితాపము, ఒకరికడనున్న ధనమును వేరొకరు అపహరించుట కెన్నెన్ని వేషములు వేయుచున్నారు. నిద్రలేచినది మొదలు, మరల రాత్రినిద్రబోవువరకు వీరికిదియే ఆలోచన గాబోలును! ఆహా! పైకి కనుపించురీతి వేరు, లోపల ఆలోచించువిధము వేరు! ఒక్కొక్క మానవునిలో ఇటు

పురుమానవులు గన్పట్టుచున్నారు! కష్టపడి, లోకమునకు, ఉచితమగురీతి సేవయొనర్ప నడుముగట్టినవారిని ప్రోత్సాహించువారేరి? ఉన్నతోద్యోగమునకై ప్రబలప్రయత్నములు జేయుచున్న యొక మానవుడు నాకంటబడెను. ఆత డధికారుల నాశ్రయించుచున్నట్లొకత్రుటికాల మాపరాత్పరుని ఆశ్రయించినచో సద్గతిపొందుననుటలో నాశ్చర్యములేదు....లోకోపకారమునకని యొక పత్రికను స్థాపించి, దానిలో తన పేటెంటు మందుల నన్నిటిని బ్రకటించి, లోకులచే వానినిగొనిపించి ధనము సంపాదింప నూహించుచున్నా డొకపత్రికాసంపాదకుడు. పత్రికలో మొదటి పది కాగితములు, తనమందుల ప్రకటనలె! ఇదియా వాఙ్మయాభివృద్ధికి, దేశకల్యాణమునకు, మానవాభ్యుదయమునకు తోడ్పడువిధము? కేటలాగుమూలమున. లాభము కనుపించలేదా? తనమందులకొనుడని ప్రబోధించుటకా యీపత్రిక! ఎంతమోసము!... సఖుడా! వేరొకని గాంచితిని: రాబోవు శాసనసభకు తానొక సభ్యుడుగా నిలువగోరి, ప్రజలకెంతయో సహాయముజేయు వానివలె, ఒక వెట్టికలవరమును వారిలో గల్గించి, తానొక నాయకునిరీతి ముందడుగు వేయుచున్నాడు. నిలుకడలేని యాదర్శములతో, ఆతడు సాధించినదేది? పత్రికలలో పెద్ద యక్షరములతో తనపేరు ప్రకటించుకొనుట యేనా? లోని యాలోచన నెరిగి, వాని యడుగులవిడచి సంచరించునంతటి ధీశక్తి పరాత్పరు డేల జనసామాన్యమునకు గల్గింపడు? వాఙ్మయముపై ఆదరము గన్పట్టుటలేదు; గుఱ్ఱపుపందెములతో, లండను ప్రయాణములతో, బొజ్జలు పెంచుకొని కాలముగడుపుచున్నారు స్వదేశసంస్థానాధిపతులు. ఏ, విశ్వదాతవంటి మహనీయు లోకింత వాఙ్మయాభివృద్ధికి తోడ్పడుచున్నను, తగులాభము, వెంటనే గలుగుట కష్టముగాదా? ఇట్టివారల నెందరనో దేశము ప్రసవింపవలసియున్నది. అప్పుడు, సర్వతోముఖమగు అభివృద్ధి మానవజాతికి కలుగగలదు. తాలూకాబోర్డు (మెంబరు) పదవి వచ్చినంతనె, వైస్రాయిగారి ఎగ్జిక్యూటివుసభ్యునికన్న మిన్నయని విఱ్ఱవీగు వెట్టివారెందరో నాకంటబడిరి. దేశకల్యాణమునకు తృణకణమంతయేని వీరు సాయపడుచున్నారా? విశ్వాసరాహిత్యతీర్మానముల ప్రతిపాదించుటయందున్న తెలివి వీరికి విశ్వమానవసౌభ్రాతృత్వముపట్ల కానరాదు. మీటింగులో చేతులెత్తి, తమవలన నెగ్గిన తీర్మానము అమలులోనికి వచ్చినపుడు గుడ్లుమిటకరించుమేటి వీరు లెందరో గలరు. నాయనా! నే నిచ్చట నిలువలేను. ఈర్ష్య, ఆశ, దురభిమానము, అశక్తదుర్జనత్వము అనువానికి ఆకర మీప్రదేశము. ఆనందము వెల్లివిరయు, ఆకులమఱుగున సంచరించుటకు నన్ను వెడలిపోనిమ్ము, నాపల్లెకు దారిజూపింపుము ...నీకు నమస్కారములు.

మొదటి తేనెటీగ

నీవు నన్నాలోచనాసంద్రమున ముంచివైచితివి. మీప్రాంతములందలి ప్రజ లింతటి స్వార్థమునకు బాల్పడరా?

రెండవ తేనెటీగ

నాయనా! నాకు దుఃఖముకలుగుచున్నది. పొగమంచువలె, అధికారమునందలి యీపేఱు ప్రశాంతమగు స్థలములనుగూడ ఆక్రమించుచున్నది. తాలూకాబోర్డులు తీసివేయబడి, ప్రతిగ్రామమున నొకపంచాయతీబోర్డు ఏర్పరుపబడునట. ప్రతిపల్లెయం దిప్పటినుండి 'ఎన్నికలు', 'ఓట్లు', 'కాన్వాసు', అను శబ్దములు మారుమ్రోగునట. ప్రతి గ్రామమున కక్షలేర్పడకపోవు, తలలు బ్రద్ద

లుకాకపోవు! ఐకమత్యముతో హాయిగా గడుపుకొనుచున్న దినములు నశించును. అధికారమునకై ద్రవ్యము వెచ్చింపబడును, కుట్రలు ప్రారంభింపబడును, ఆలోచనలు పెచ్చు పెరుగును, మధ్య తిరుగువారు బాగు పడుటకు మంచి రోజులు. ధనికులగునట్టియు, గుట్టుగా కాపురము కడుపుకొనుచున్న రైతులు అధికారవ్యామోహమున, అంతులేని చింతలకు బాలుగా నున్నారు. ఆహా! కాల వైపరీత్యము.

మొదటి తేనెటీగ

ఎందులకంతభయము? అధికారమునకై పెనుగులాడువారే కష్టముల పాలగుదురు. తగ్గినవారు కడిగిన ముత్యములవలెనే యుందురు. ఈ పట్టణమునందుమాత్రము, ప్రశాంతముగ జీవితము గడుపుకొనుచున్న వారు లేరా!

రెండవ తేనెటీగ

ఆలోచించినకొలది మనకు దుఃఖమే గాని, శాంతి కలుగదు ...పుప్పొడిదుమారములందు విహరించుచు, రాత్రులందు చిగురుటాకు మడతలయందు మేనువాల్చి, కాలమునుగడుపుకొను మన కీయాలోచనలెందుకు? ఆర్తరక్షణపరాయణుడగు పరాత్పరునియం దొకింత నమ్మకముంచి, కలియో గంజియో త్రాగుచు, పరుల పలుకుల కులికపడక, హాయిగా కాలముగడుపుకొనవచ్చును. నాతో మాప్రాంతముల కరుదెమ్ము, ఇవి సంక్రాంతిదినములు. అల్లుని గొనిపోవుటకు వచ్చిన మామవలెనే నిచ్చుటకు వచ్చితిననుకొనుము.—తియ్యని తేనె నొసగు పువ్వులెన్నియోగలవు, అవి యిప్పుడు వికసించియుండును. పట్టణమునందున్న నీకచ్చట యానందమును గూర్చు దృశ్యములులేవని భయపడవలదు ...విద్యుద్దీపముల కాంతిని, బల్లలపై సరిగా కడుగని, ఎంగిలి పళ్ళెములలో నేదియోతిని, తుదిని బిల్లుగాంచి, హృదయము ఝల్లుమనగ, బిక్కమొగము వైచి డబ్బు చెల్లించిపోవు సగము మీసముల చక్కనయ్యల కన్న, చెట్టునీడలో, చిదుగులుపేర్చి, మంటజేసి లేత మొక్కజొన్న కంకులనుగాల్చి భక్షించి యానందించు అమాయకపుకాపుజనులు నీకానందమును గూర్తురు. పండ్లు పోసుకొనుటకు సింగారించుకొనిన బాల బాలికలు. గుమ్మముకడ వింత ముగ్గుల పచరించుచున్న యువతులు. చలిమంటలకడ కథలనువినుచు, చేతులను మెల్లగా మంటపైకి జాపి, వెంటనే దీసి కనులకద్దుకొని చలిపోయినదని సంతసించు బాలురను. క్రొత్తబట్టలయంచులకు బసుపుబూసి పళ్ళెములో బెట్టి అల్లుండ్రకర్పించు మామల మందహాసములు నీకానందమును జేకూర్చును. నాకు దారి జూపింపుము, వెడలిపోవుదము.

మొదటి తేనెటీగ

అట్లే చేయుదము. డబులు సెకండు క్లాసు బేటావచ్చినను, మూడవక్లాసుబండిలో ప్రయాణముచేయుచు, తెలసినవారెవరైన చూచెదరని, మనుష్యులను చాటుజేసికొను, ఎం. ఎల్. సీ. ల వలెగాక, మనము నిర్భయముగ స్టేషనుకేగి ఒక చక్కని రైలుపెట్టెలో దూరి, ప్రయాణముచేయుదము. బయలువెడలుదము రమ్ము.

రెండవ తేనెటీగ

అదిగో తెల్లవారినది, అట్లేకానిమ్ము.

(నిష్క్రమించును.)

—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు, బి. ఏ.

గళ్ల చీర

'మాంచి చీరలంటే పాపం పిల్లకు ఉబలాటమే.'

'చీరకొంగు రెండు చేతులాపట్టుకుని తలవంచి.'

'ఆమెకట్టుకున్న చీరమీదిగళ్లు పెద్దపులి మచ్చల్లా గా.'

'గళ్ళచీరలు సింగారించుకోటంతో నే కాలచక్రం తిరిగిపోతున్నది.'

'అందులో మాలీలకు సామాన్యపు చీరలు పనికిరావు.'

'అదేమిటి చీరమీదకూడా పోసుకున్నావు కాఫీ.'

'వాటికయ్యే ఖర్చు చీరలకు పెట్టుదువుగాని.'

'నీవొగలిస్తే నేనేమన్నా చీరముడుపు చెల్లించుకోవాలా ?'

'బయటకువచ్చిచూస్తే అత నొక చీరల వర్తకుడు.'

'కట్టుకున్నచీర చూచుకుంటూ 'ఇదే చీర' అన్నది'

'ఇకనుంచి నాకు నేనెన్నడూ చీరలు కొనను.'

నాకు సిగరెట్టు అలవాటైన వేళావిశేషమేమో కాని అది నన్ను వదలకుండా వచ్చింది. వదలేద్దామన్న అభిప్రాయం నాకేకోశానా లేదులెండి. పూర్తిగా దమ్ముపీల్చి పోకుండా పెదవులచివరనుంచి పొగ వదలి వేయడమంటే నాకు చాలాసరదా. కాని నాభార్యకు మాత్రం కొద్దిగా కొట్టుగా వున్నాది. “మీరు సిగరెట్టు కాలవకపోతే మనకు మామూలు ఆఫీసు గుమాస్తాకిచ్చే జీత మేదా కాగలదు; నాకు నెలకొకటి మంచి చీర అమరుతుంది” అంటూంటుంది అప్పుడప్పుడు. మాంచిచీరలంటే పాపం పిల్లకు ఉబలాటమే. దీనికి తోడు సొమ్ములమీదకూడా ఆపేక్షవుంటే చచ్చిపోయేవాణ్ణి. అదిలేదు. ఒడలునిండా బంగారం దిగవేసుకుని ఒక కోమటిపిల్లలాగా తయారగుదామన్న ఉద్దేశమామెకు లేదు. పచ్చినాగరీకం. అయితేఅయింది. అందుకోసం నేను సిగరెట్టుకాల్చడం మానేయాలట!

అనాడు పొద్దున్నే స్నానం, గీనం చేసుకుని మేజా ముందున్న కుర్చీలో వ్రాలి షేక్స్పియర్ మహాకవి వ్రాసిన నాటకం హేంలెట్ చదువుకుంటున్నాను. ఊరికే కులాసాగా కాలంగడిపేటందుకు కాదు; పరీక్షలు నెత్తిమీద తంతున్నాయి వెనకనుంచి. సరిగ్గా నెలరోజులున్నాయో, లేదో. ఈవరకు మూడుసార్లు తప్పివున్నాను. అయితేఏం? తప్పిన తప్పుమాత్రం నామీద లేకుండాపోయింది. “పెళ్ళైంది. తప్పుతున్నాడు పాప” మనేశారంతా. అపరాధమంతా ఇంతవరకూ నా భార్యే మోస్తున్నది. ఈతఫాఅన్నా ప్యాసై బి. ఏ. డిగ్రీ తెచ్చుకోకపోతే ఆమెకు బరువెక్కువయ్యేలాగున్నది.

ఐదునిముషాలు బుర్రవంచి జాగ్రత్తగా చదివేను చూపుడు, బొటనవ్రేళ్ళతో పట్టుకున్న పెనసలుకొసలో క్రాపింగు పాపట తీసుకుంటూ. ఇంతలో అకస్మాత్తుగా సిగరెట్టు జ్ఞాపకంవచ్చింది. ఈరోజు పక్కమీదనుంచి లేచిన లగాయతు అగ్నిహోత్రం వెలిగించలేదు. అలమారలోవున్న సిగరెట్ పేకట్టు తెచ్చుకుందామని కుర్చీలోనుంచి లేచాను. కుర్చీవెనుక ఎంతసేపటినుంచీ అలా నిల్చివున్నదో లీల చిరునవ్వునవ్వుతున్నది. నేనలాగే చూస్తూ నిలబడిపోయాను “ఏమిటి? అలాచూస్తారు? భయపడ్డారుకాబోలు మీరు చరవనా ?”

“నిజంగాచూస్తే భయంకొలిపే వేషంమీదే వచ్చావుకాని, నేను దడుచుకోలేదు. నవ్వుకుంటున్నాను.”

ఒక్కసారి లీల తన్నుతాను సింహావలోకనం చేసి

కొన్నది. చీరకొంగు రెండుచేతులా పట్టుకుని తలవంచి చూచుకుంటున్నది.

ఆమె కట్టుకున్న చీరమీది గళ్లు పెద్దపులి మచ్చల్లాగా వున్నవి. అందుచేతే మొదలు నేను కొంచెము భయపడవలసి వచ్చింది. చీరలు వర్ణించడం నాకు చేత గాదుగాని నాకాచీర బాగుండలేదనిమాత్రం చెప్ప గలను. 'ఛీ, బాగులేదు చీర' అని ముఖాన అనేసి లీలను వుడికిద్దామనుకున్నానుగాని ఆమాట చదువుకునే ప్రాప్తి వుండదు. ఆమె చేసిన పని ఏదైనా—కూరలో ఉప్పు చాలలేదనిగాని, అన్నం మెత్తపడిందనిగాని, అంటే ఆమెను ఎక్కడలేని కోపంవస్తుంది. ఆమీద ఉపన్యాసము నే జడివాన ఒకటి నేను ఎదుర్కోవాలిసివుంటుంది. జంతువులవలె మూగచేష్టలతోనే భావప్రకటనచేసికో వలసిన దశపోయి మానవుడు భాష కల్పించినప్పుడు నాగరికప్రపంచమున చాలదూరము నడచినాడు. అందు వివేచనాజ్ఞానము తెచ్చినప్పుడు పై మెట్టెక్కినాడు. ఈ ద్వితీయదశవమ్మాత్ర మింకను శ్రీ రాలే కున్నది.

టేబిలుమీద ఓరగా కూర్చోటానికి ప్రయత్నిస్తూ అన్నాను: "నేను పరధ్యానంలో వున్నప్పుడల్లా వెనుక నుంచివచ్చి కళ్ళుమూసేదానివి ఇలేమి టిప్పుడు కిక్కురు మనకుండా వెనుకనిల్చున్నావు దొంగలాగా."

"ఔను. దొంగను గనుకనే" అని ఒక కుయుచ జవాబు.

"నా కోటు జేబులో అయిదురూపాయిల నోటు మాయమయిందా ఏం!" లీల నవ్వుతున్నది.

"అది చీరలుకొంటానికి కాదు ఉంచాను"

"మరి సిగరెట్ కొట్టువాడికివ్వాలనా?"

"అన్నట్లు జ్ఞాపకంచేశావు. అలమారులో సిగరెట్ పాకెట్టువున్నాది తెచ్చిపెట్టు."

"మీ రివ్వాళ కాఫీమానేసే ఆనుకోలేదే ఇంత త్రాగేశా వాను!"

"నీవుచేసిన ప్రతిజ్ఞ! గళ్ళచీరలు సింగారించుకొంటంతోనే కాలచక్రం తిరిగిపోతున్నది."

"కాదే వుంచాను. మీ రేమీ మాట్లాడకపోతే ఈ రోజునుంచి కాఫీమానేస్తారేమో అనుకున్నాను."

"ఓహో. ఇన్నాళ్ళూ సిగరెట్ మానమని, ఇప్పుడు కాఫీమానమనీనా. బాగుంది! నీకేం, రేపు అన్నంకూడా మానేయమంటావు. తనముద్దికాక పోతే కాఫీదాకా దేకేయమన్నాట్ట ఒక ప్రజ్ఞావంతుడు."


నవ్వుకుంటూ కాఫీపట్టుకరాబోయింది లీల. నేను అలమారవైపు నడచేను. అక్కడ తగిలించివున్న కోటు జేబులు వెతికేను ముందర అయిదురూపాయల నోటు వున్నదో మాయమైందో అని. పాపం దాని ఆయుష్యం బాగున్నది కాబోలు: ఇంకా దాని కళ్ళపడ లేదు. పడితే ఏ చీరలమ్మేవాడి దగ్గరకో పోయేదే. నే నేమన్నా అంటానేమోనన్న భయం లేకపోతే లేక పోయింది, వెనుకాముందు ఆలోచనకూడాలేదు లీలకు. పైసా కనుపిస్తే బ్రతుకనీదు. పూర్వార్జితం పూర్తిగా వున్నందున బ్రతికిపోతున్నానుకాని, మామూలుపాటి వాడినే అయితే, మూడోనాటికల్లా చిప్ప కర్రా చేతికివచ్చేదే. పాయిబయ్య సంపాదనంతా బూబు చెవి పోగులకన్నట్టు, వచ్చే ఆదాయమంతా భార్య చీరలకు ఖర్చుచేస్తుంటే, మరేమిటి? అందులో మామూలువి సామాన్యపు చీరలు పనికిరావు. విలువగల పట్టువి పెట్టెలో చాలా వున్నవే అనిలేదు. అధికస్య అధికంఫలం.

సరే, నాభార్యను గురించి చెప్పదలస్తే చాలా వున్నది. ఆమెకు కోపంవస్తుందేమో మానేస్తాను. ఈ రోజుల్లో భార్యకు కోపంవస్తే మగవాడికి నలిపుట్టుతుంది; గజగజ వణికిపోతాడు.

అలమార తెరచిచూస్తే సిగరెట్ పెట్టె లేదక్కడ. ఇంకేం, దాచేసిందన్నమాట. "ఔను దొంగను గనుకనే" అన్నమాటకిదే అర్థం. పొడుముకాయ తీసి దాస్తే రాలేను కోపంవచ్చినట్లు నేను మండి పడతాననుకున్నది కాబోలు. నిన్న తన ఊలు తీసికొని గంటసేపు ఏడిపించినందుకిది ప్రతీకారం. తానంటే అల్లుకున్న జడకొస పట్టుకుని ఊలు కోసరం నన్నే ప్రార్థించవలసి వచ్చింది. నాకేం! బజారువెళ్ళి కొనుక్కుంటాను; పీల్చేస్తాను.

ఏ మెరుగనట్లు గా కుర్చీలోవచ్చి కూర్చున్నాను మళ్ళీ. కుర్చీ చేయిమీద ఓరగాకూర్చొని, నా సాసర్ లో కాఫీపోస్తున్నది లీల. నాకు చిలిపిచేష్టలంటే కాస్త సరదా చెప్పద్దూ ; సాసర్ కొంచె మొకప్రక్కకు వంచి, కొంతకాఫీ ఆమెచీరమీద పడేలాగా చేశాను. చీరమీద ఆస్ట్రేలియా పటములాగా మరకపడింది. నేనే పాపమా తెలియనివాడనుకలె అవతలవైపు కిటికీలోనుంచి చూస్తూ "మన జామచెట్టు ఈ సంవత్సరం కాయలు బాగా కాసినవి సుమా !" అన్నాను.

"ఔను కళ్ళకూ కాసినవికాయలు. ఏమీ కనుపించదు" అన్నది లీల కోపంతో. ఎఱ్ఱెండ కాస్తున్న దామె కటాక్షవీక్షణాల్లో. కండెనిప్పులుచిమ్మే పడమటికొండ గాలి వీస్తున్న దామె నిట్టూర్పులో.



లీలకు కోపంవచ్చినప్పుడు నాకదో ముద్దుగావుంటుంది. ఆమె సౌందర్యమంతా నేనప్పుడే గ్రహింపగలుగుతాను. ఆ భ్రూకటినటనా, ఆధరచలనమూ, ఆ కంటిచూపూ నన్ను ముగ్ధుణ్ణి చేసివేయగలవు. ఆమె నన్ను తదేకదృష్టితో చూస్తున్నది. నే నామెను చూచీ చూడనట్లుండా తత్సౌందర్యమంతా త్రాగేస్తున్నాను ఇంతల గుమ్మముకడ్డకువచ్చి నిల్చుని.

చివరకు పెరటిలో ఏవో మొక్కలు నాటుతూన్న మానౌకరువెధవను పిల్చి, 'సిగరెట్టుపెట్టె ఓటి తీసి కొనిరారా' అని చిల్లరడబ్బులిచ్చి పంపించాను. లీల కుర్చీచేయిమీదనుంచి లేచి ఏమో అస్పష్టముగా గొణుగుకుంటూ చీరమీద కాఫీతుడిచేసికుంటున్నది. నేనన్నాను "అరేమిటి చీరమీదకూడా పోసేసుకున్నావుకాఫీ. అయినా, ఆమరక చంద్రుడికి కళంకం

లాగా చీరను కన్నెత్తుకున్నాదిలే."

'చాల్లెండి కవిత్వం' అని చురచురా లోనికి పోయింది—వంటచెయ్యాలిగా.

* * *

భోజనంచేసి కూర్చున్నాను మాగదిలో క్రింద చాప మీద పరచివున్న పరుపుమీద. ప్రొద్దునవగా సిగరెట్లు కొనితెమ్మని నేనుపంపిన కుఱ్ఱవాడింతవరకూ రాలేదు. ఇక నేనన్నాపోయి కొనితెచ్చుకోవాలి. ఆరోజున ఎండ అతితీవ్రంగాకాస్తున్నదిబైట. ఎలాగాఅని ఆలోచిస్తున్నా. భోజనానంతరం సిగరెట్ కాల్చకపోతే హాయిగా వుండదు.

"ఇంతవరకూ ఎందుకురాలేదబ్బావాడు. నేనిచ్చిన చిల్లరడబ్బులు నాలుగూ తన స్వంతఖర్చుల కుపయోగ పరుచుకోలేదుగదా! ఇంట్లో భార్యకు మల్లేనే నౌకరు కుంకకూడా. అల్లాంటివాడైతే ఇకచెప్పాలి! కాని వాడల్లాంటివాడుకాడు. ఇన్నాళ్ళనుంచీ చాలా నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఆనక వచ్చినప్పుడు నాలుగు చీవాట్లు తగిలిస్తాను. ప్రస్తుతం మా ఆవిడదగ్గరనుంచే లాగాలి ఎలాగైనా తాను దాచినపేకెట్టు"—ఇదే నాలో రేగిన ఆలోచనాపరంపర.

కిటికీలోనుంచి వస్తున్న వెచ్చనిగాలికి గోడకు తగిలించివున్న 'క్యాలెండరు' కాగితాలు అల్లరిచేస్తున్నవి. ఏవో రెండుసాలీళ్ళు అక్కడ 'ఫోటో' చాటుకు పోయినై. అంతా నిశ్శబ్దంగా వున్నది; కాని లీల భోజనంకూడా అయిందికాబోలు, అన్నీ సర్దుతున్న దేమో, చెంబూ తప్పేలల చప్పుడుమాత్రం వినబడుతున్నది.

చేతులు తుడుచుకుంటూ వచ్చి కూర్చున్నది నా దగ్గిరే. ప్రొద్దుటికోపమంతా ఈలోపుగానే పోయింది గా! భార్యాభర్తలకోపం ఎంతసేపుంటుంది!

ఆమె తమలపాకులు మడుపులు చుట్టిఇస్తుంటే నములుతున్నాను చాలనకుండా. నేను నములుతున్న కొద్దీ ఆమె ఇస్తూనేవున్నది. చివరకు విసుగెత్తి అన్నది "ఈ కట్టాకులూ మీరే నములేలాగున్నారే!" అని.

"పోనీ, మాకేయిష్టముంటే తమలపాకులు నేను కొనడం మానేస్తానులే. వాటికయ్యే ఖర్చు సిగరెట్లకు పెట్టుదువుగాని" అన్నాను.

"అబ్బ! చమత్కారం! ఏం మానక్కరలేదులెండి!"

"ఏమో, ఎందుకని? అదిలేకుంటే నీకు పొగదు కనుకనా? అల్లాగే అనుకోరాదూ ఇతరుల సంగతి కూడా. పో, తీసుకొనిరా నీవు దాచిన సిగరెట్ ప్యాకెట్."

"పోనుకానండీ! నిన్న మీరుతెచ్చిన సైకిలెక్కడిది?"

"ఒక స్నేహితుడిది. ఎందుకు నీకు?"

"మరేమీలేదు. మీకు తొక్కడం వచ్చికూడా సైకిల్ లేకపోవడము"—

"మర్యాదహీనంగా వున్నదా? నీవు చీర్లుకొనడం మానేస్తే, ఎప్పుడో డబ్బుదాచుకుని ఒకటి కొనుక్కుంటాను మరి!"

"అదికాదు. వచ్చే సంక్రాంతిపండక్కు మా నాన్నతో చెప్పి మీకు సైకిలిప్పిస్తాను. లేకపోతే దాని కిమ్మత్తైనాసరే. అదీ మీరీఆటలో గెలిస్తేనే" అంటూ అక్కడ ముక్కాలిపీటమీదవున్న చతురంగపు బల్లా, కాయలభరిణా అందుకున్నది.

"నీవే గెలిస్తే నే నేమన్నా చీరముడుపు చెల్లించుకోవాలా?"

"పందేనికి పందెం లేకపోతే ఎలా?"

నాకు చతురంగపాట అంటే సరదా. ఆ ఆట ఆడుతున్నప్పుడు నాకు బాహ్యస్మృతి వుండదు. నిజంగా తన్మయుణ్ణైపోతాను. కాని మాలీలతో ఆడుతున్నప్పుడల్లా ఓడిపోతూనే వుంటాను. ఆమె అద్భుతమైన తెలివితేటలు చూపిస్తుంది ఎత్తులువేయడంలో. 'పూర్వం రణరంగంలో చతురంగబలాలు నడిపిన వీరవనితల రక్తం నీలోకూడా కొంత ప్రవహిస్తున్నది, లీలా!' అని నవ్వుతూ అంటుంటాను అప్పుడప్పుడు. "ఆ తేజస్సు తగ్గిపోవడానికి మగవాళ్ళు మీరేకదా కారణం" అంటూంటుంది తాను.

అలాగా పందెం చరచి ఆటమొదలెట్టేము. ఎలాగైనా సైకిల్ కొట్టాలని తీవ్రంగా బుర్రచించి ఆడుతున్నాను. సిగరెట్టుమాటమాత్రం మరచిపోయాను చెప్పద్దూ. మూడుగంటలాడేమా విధంగా. సిగరెట్ మీద మాత్రం ధ్యాసపోలేదంటే నమ్మండి. అబద్ధం చెప్పటానికి నాకు మించిపోయిందేమీలేదు.

ఆట మొదలెట్టినప్పుడు ఆమె పొడుగాటిజడ కుడి భుజముమీదుగాజారి బల్లమీదపడింది. నారాజు ఆదరి బోర్లపడ్డాడు. "మొదలే అపశకునము. మీరు ఓడిపోవడమే నిజ"మన్నది లీల. చివరకామె అన్నట్లే అయింది. నేనే ఓడిపోయానని చెప్పుకోవడం సిగ్గుగా వేవున్నది. లీలతో ఆడి ఓడటమిది ప్రథమంకాదు గనుక అభిమానపడలేదు. ఎప్పటిమాదిరి నవ్వుతూనే ఉన్నాను.

"ఇంతకూ మీకు సైకిల్ ప్రాప్తి లేనట్లున్నది" అన్నది లీల నాచూపుల్లో ఆమె చూపులు మిళితంచేస్తూ.

"అయితే, సంక్రాంతికి పుట్టింటికిపోయే ప్రాప్తి నీకు లేదన్నమాట" అన్నాను పెదవులమీద ఒక గమత్తు నవ్వు వెలిగిస్తూ.

ఇంతలో బైట 'అయ్యా' అని ఎవరికో పిలుపు. బయటకువచ్చిచూస్తే అతనొకచీరలవర్తకుడు.

"సరిగ్గా సమయానికి వచ్చాడులెండి" అంటున్నది లీల నావెనకాల నిలుచుని. వర్తకుడు "అయ్యా! నిన్న సాయంకాలం, అమ్మగా రొకచీర తీసికొన్నారు; అప్పుడు మీరింట్లో లేనందున మళ్ళీరమ్మన్నారు. ఇప్పుడు వచ్చా" నన్నాడు.

వెనక్కుతిరిగి మా ఆవిడవైపు చూచాను. కొంటెతనమంతా వ్యక్తీభూతమౌతున్న దామె ముఖంలో, నన్ను తృణీకరిస్తున్నట్లు నవ్వుతూన్న తన పెదవుల మీద చీరకొంగు అడ్డంపెట్టుకుని నాముఖంచూడలేకనో ఏమో చూపులు త్రిప్పుకుని, ముఖంవంచి కట్టుకున్న చీర చూచుకుంటూ "ఇదే చీర" అన్నది.

అదే నేను ప్రొద్దున కాఫీపోసిన గళ్ళది. నిన్న తాను కొని ఇవ్వాళ నాచేత డబ్బులిప్పిస్తున్నది. ఇవాళ క్రొత్త దొస్తు. ఇదివరకల్లా ఎక్కడేన్నా వైశమంటే తానే తీసికొని నాకు చెప్పకుండా చీరలు కొనుక్కుంటేది. అలాకాకుండా ఇవాళవిధంగా నాచేతనే కొనిపించడం. నాకు మండిపోయింది ఒళ్ళు. ఆమెదృష్టిలో నేనొక విలువలేనివాడనైనానుగదా అనే భావమొకటి నన్ను కలవరపెట్టింది. అప్పటి నావుద్రేకమంతా చెప్పలేనుగాని నాముఖఫలకంలో ప్రతిఫలించింది. అది గ్రహించలేకపోలేదు లీల.

నేనేమీ మాట్లాడలేదు. వర్తకుడికి డబ్బిచ్చి పంపక తప్పదు. వాడడిగినంతా ఇచ్చాను. ఒకసారి కట్టుకున్నదీ, కాఫీమరక పడ్డదీ, మళ్ళీ వాడికి వాపసుచేయడమెలాగా? అలాచేస్తాననే కాబోలు మొదటే జాగ్రత్త పడింది లీల.

వర్తకుడు వెళ్ళిపోయినతరువాత నాస్నేహితుడొకడువస్తే వాడితో కొన్ని అవసరకార్యాలనుగూర్చి మాట్లాడుతూ డాబామీద కూర్చున్నాం. చివరకతడు వెళ్ళిపోయేటప్పటికి తాలూకాకచ్చేరిలో కొట్టినగంటలు అయిదు వినబడినవి.

డాబామీదనుంచి తిన్నగా మెట్లుదిగివస్తూ ఆనాడు చదువేమీ సాగలేదుకదా అని ఆలోచించుకున్నాను. ఒక్కసారినాటిచర్య అంతా మనస్సులో పరువెత్తింది. చతురంగపాట మూలాన్న, నాస్నేహితుడు వచ్చినందున, అంతవరకూ ఆగివున్న సిగరెట్ మీది కాంక్ష—కసి అంటే బాగుంటుందేమో—రెత్తింది.

మెట్లుదిగి దక్షిణపువైపుగది గుమ్మందాకా వచ్చాను—అది మనోహరసందర్శనము, సౌందర్యదేవతా ప్రత్యక్షము. హాలులో పెరటివైపు కిటికీముందు అద్దం చూసుకుంటూ జడలో పూవులుపెట్టుకుంటున్నది లీల.

నన్ను చూడగానే నావైపునడచివస్తూ, "ఇందాక మీకు కోపంవచ్చినట్లున్నది. మీ మనస్సు నొప్పించినదానైతే క్షమించండి. ఇకనుంచి నాకు నేనెన్నడూ చీరలుకొనను. మీరుకొన్నవే పుచ్చుకుంటాను. క్షమించారా" అన్నది నాముఖభావాలు పరీక్షిస్తూ. నేను ప్రసన్నత్వమే కనబరచేను.

ఇక్కడ నా భార్యలోవున్న ఉత్తమగుణం ఓటి చూపిస్తాను. నాకు కోపంవచ్చినప్పుడెప్పుడూ ఆమె కూడా కోపంతెచ్చుకుని రసాభాసంచేయదు. తానే కొంచెంతగ్గి అనునయవాక్యాలుపల్కటం ఆమెకు అభిమానకరముకాదు. అందుకనే నాజీవిత మొక నందన వనం. అందులో నాలీల సౌందర్యకుసుమం.

నిమిషమాత్రం మేమిద్దరమూ మాట్లాడలేదు. అప్పుడే మాయిద్దరి ఆత్మలూ, ఒకటినొకటి మన్నించుకున్నవి.

చివరకు లీల తనవ్రేళ్ళతో నాగుండీలు త్రిప్పుతూ, 'ఇవ్వాళ సినిమాకు తీసికొనివెళ్ళరూ!'' అంది.

''నన్నుమాత్రం ఈరోజల్లా సిగరెట్టు త్రాగనివ్వవు కావుకదా లీలా'' అన్నా ఆమెబుగ్గ మెల్లిగాతట్టుతూ. ''ఐతే ఉండండి.'' అంటూ లోనికిపోయి రెండు సిగరెట్ ప్యాకెట్లతో ప్రత్యక్షమైంది. నే నాశ్చర్య పోయాను. ''అలా చూస్తారేం. రెండో దెక్కడిదనా? నౌకరువాడిని తెమ్మన్నారుకదూ ఒకటి. అదే ఇది. ఇది ప్రొద్దున నేను దాచింది.''

''నువ్వేలాగు తీసికున్నావు వాడిదగ్గరనుంచి ?''

''వాడు ప్యాకెట్ తీసికొని వీధిగుమ్మందాకా రాగానే నేనందుకుని ఇవ్వాళల్లా మనింటిదాపుకే రావద్దని చెప్పిపంపేను.''

''నీ కిల్లాంటి తెలివితేటలున్నందుకేనే లీలా నే నానందమయ్యింది—మరి ఎంటకేళావా; సినిమాకు మొదటిఆటకే పోదాం పోతే.''

''వంటెంతసేపు నిముషం. మీరుకూడా రండి కూర్చుందురుగాని'' అంటూ కుర్చీతీసికెళ్ళి వంటింట్లో వేసింది.

కుర్చీలోకూర్చొని సిగరెట్లు పీల్చడం మొదలెట్టేను, మా ఆవిడ వంటచేస్తుంటే. ప్రొద్దుటి నుంచీ లేనందున సిగరెట్లు చాల రుచిగావున్నాయి. ఒకదానికోసం మొదటకొంత ఆర్తి అనుభవిస్తేనేగాని తరువాత తదనుభవ మానందదాయకంగా వుండదు.

ఆరాత్రి సినిమాకు వెళ్లేము. అందుమూలాన్న రాత్రి కూడా చదువలేదు. తక్కిన విద్యార్థులంతా అన్నం నీళ్ళు మానేసి రాత్రింబవళ్ళు ఒకటే చదువు చదువు తూంటే నేను నాలీలతో కులాసాగా కాలక్షేపం చేస్తున్నాను. పాఠకుడా! విన్నావుగా నా ఆరోజు చర్య అంతా. ఆదేవిధం అనుకో ప్రతిరోజూను. ఇక నేనెలా ప్యాసౌతానో ఊహించుకుందూ నువ్వే.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

తెలుఁగుసీమ

తెలుగుజనాళి శౌర్యమును తేజము బీజములందె నెప్డు? మా
తెలుగులకత్తిరాపిడి నదే నశియించి రరాతు లెంద రీ
తెలుగుల భాగ్యరేఖ లవి దిద్దిరి ముత్తెపుటచ్చురాల; మా
తెలుగుపతాక మెప్పుడొకొ దీధితి వెల్గిన దంబరస్థలిన్?

తెలుగుల పల్కుతల్లి చిఱుతేనియ బిందుల చిందె నెప్డు? మా
తెలుగుపురంధ్రి తానెపుడు తీరిచికట్టె పసిండికోకలన్?
తెలుగుపొలాల సస్యసుదతీమణి తాండవమాడె నెన్న డీ
తెలుగులు ఆలమందలిడు తీయనిక్షీరము గ్రోలినారలో?

తెలుగువనేందిరారమణి తీవలు పూలు నలంకరించి, తా
మొలకువ సంచరించె వనమే యొకస్వర్గముగాగ నెన్నడో

కొ్క లలితసౌరభంబు గనుగొందని వీచెను తెల్గుగాలి ; మా
తెలుగుకుమారికామణులు తీరిక నాడిరి బొమ్మపెండిలుల్ ?

శిల్పకళావిలాసములు, చిత్రకలాకలనంబు ; వైభవా
నల్పదశాప్రకాశములు, నాట్యకళల్ రమణీయకావ్య సం
కల్పన ముల్లసన్మధురగానవిధానము లిన్ని కట్ట ! ఏ
కల్పము నాటిమాట లటు కన్పడవిప్పుడు తెన్గుసీమలో.

రకరకమై వినూత్నమయి రాణవెలింగిన తెన్గువైభవం
బొకక్షణకాలమందిటుల నొప్పుతొలంగి యిదేమి యీగతిన్
సకలము మారిపోయెను ; దిశల్ వణకించిన తెల్గుదోఃప్రతా
పకలితలక్ష్మియేది ? హానుపద్ధవిపో విజయాంకభావముల్ !

ఆంధ్రవాణీదేవి నతిభక్తి సేవించు రాజరాడ్నరేంద్రుని తేజమేది ?
అరివీరహృదయాలు చిరిగిపోవగజాలు కృష్ణరాణ్ణృపమౌళి యెందుజనియె ?
దేశసంరక్షకై తెగువప్రాణములిచ్చు వెలమశూరత్వంబు వెడలెనెందు ?
పౌరషజ్ఞానంబు వరియించి చరియించు పల్నాటివీరుల పటిమయేది ?

అఖిలదిక్కుల చరియించు నాంధ్రకీర్తి,
దేశదేశాలప్రాకిన తెలుగు ప్రతిభ ;
రాణ చెన్నారు తెలుగుల రాజ్యలక్ష్మి
నేడు నెందుల పన్నుండి నిదురజెందు ?

ఆంధ్రాంగనామధురాననంబునయందు దరహాసకౌముది విరిసె నెపుడు ?
ఆంధ్రాంగనాశ్రీముఖాంభోరుహమునందు చిఱుపల్కు దేనియల్ చిందెనెపుడు ?
ఆంధ్రాంగనాపల్లవాంగుళీధూతతంత్రీస్వనంబులును రాణించె నెపుడు ?
ఆంధ్రాంగనానిపుణాభినయనుకళాశ్రీల దివ్యులు ప్రశంసించిరెపుడు ?

తెలుగు కన్నియ వలపులు మొలకలెత్తి
శీతలేక్షణాంబుపరిపోషితములగుచు
చిఱుత తెలినవ్వు పువ్వుల విరిసి విరిసి
స్నిగ్ధసౌరభలక్ష్మి వాసించె నెపుడు ?

తిమ్మరుసయ్యయేడి ? రణతిక్కను నెందులబోయినాడు ? మా
బమ్మెరపోతడేడి ? కవిబ్రహ్మయు పల్కడిదేమి ? రాజు రా
జ్యమ్మున నుండడేల ? ఇది సర్వము చిత్తువాయె ; నేడు ఏ
రిమ్మయి నెందు మాటువడి రీతెనుఁగుంప్రజ చెప్పదేలొకో ?

—అ. నా. గోపాలరావు.

గ్రామఫోను

గ్రామంలో దేవాలయం ఉండడంలేక పోవడాలను బట్టి ఆగ్రామం ఉచ్చనీచలను నిర్ణయిస్తారు పెద్దలు. ఇది అనుపూర్వికంగా వస్తున్న ఆచారం. దేవాలయంలేని గ్రామం కుగ్రామం. క్రమేణ దేశాచారాలూ, అభిప్రాయాలూ మారుతూన్నకొద్దీ గ్రామం ఉచ్చనీచలను నిర్ణయించడానికి మరొక కొలత బయలుదేరింది.

ఇప్పుడు గ్రామంలో గ్రామఫోను ఉండడం లేక పోవడాలనుబట్టి గ్రామంయొక్క ఉచ్చనీచలు తేలుతున్నవి. పదిండ్లు కలిగిన గ్రామమైనా ఆమహావస్తువు లేని గ్రామం కుగ్రామం అయింది.

గ్రామఫోను కొనే ఆసాములు ఈ మహాజంతువును వేరువేరు కారణాలచేత కొంటూఉంటారు. కొందరు గ్రామంలో తనలాంటివాడికి గ్రామఫోను లేకపోతే పరువేమిటి అని, కొందరు సంగీతంమీద మితంలేని ప్రేమవల్ల, కొందరు తమ విరోధులకే ఉన్నప్పుడు తమకు లేకపోవడంనామర్దాఅని, విష్ణ్వార్చకులు కొందరు శివార్చకులు కొని శివస్వామికి వినిపిస్తూంటే విష్ణుమాత్రం తీసిపోయినాడాఅని, కొందరు గ్రామఫోను ఏజంటు మొహమాటం తీసివేయలేకా, కొందరు సంగీతంమీద ఎక్కువప్రేమ ఉన్నదని ఇతరులు అనుకోవాలెననీ, కొందరు నలుగురూవచ్చి గ్రామఫోను వినిపించమని అడుగుతారు దర్జాగా ఉంటుందనీ, కొందరు అన్నయ్యకున్నది తనకుమాత్రంవద్దా అని ఇత్యాది ఘనానా కారణాలవల్లనే తప్ప అంతకు తక్కువ కారణాలవల్ల ఎవరూ గ్రామఫోను కొనరు.

గ్రామఫోనుజీవితంమాత్రం నిత్యకల్యాణం పచ్చతోరణంగా జరుగుతూఉంటుంది. అది త్యాగానికీ, ఓర్పుకూ, మంచికీ, నిత్యసంతోషానికీ తావైనందువల్ల దాన్ని కొన్నవాళ్లెవళ్ళూ వృథాఖర్చు చేశారని అనడానికి ఎవరికీ ఏవిధమైన హక్కులేదని తెలుసుకునేది.

గ్రామఫోనుకొని దానిత్యాగం, ఓర్పు, మంచీ, నిత్యసంతోషం వగైరా మంచిగుణాలను మనకు ఒరవడిపెట్టడానికి పూనుకున్న మహానుభావులకు తీరిక చేసుకొని అందరూ ప్రణామములు చెయ్యవలెను.

ఎంతపాడినా విసుగులేదు. ఓర్పుకు దాన్నిచెప్పి మరోదాన్ని చెప్పాలి. జీవంలేనివస్తువు ఇంత ఘనమైన గుణాన్ని కలిగిఉండంటే జీవంగల జీవులు ఆత్మపరీక్ష చేసుకోవాలె.

గ్రామఫోను ప్రప్రథమంలో ప్రపంచకంలో అవతరించినప్పుడు దీని ఒకజంతువుగానే చూచారు కొందరు. ఆపెట్టెలోనో, గొట్టంలోనో మనిషి తప్పక ఉండితీరవలసిందేనన్నారు కొందరు. దాని 'దగ్గరకెందుకులెండి ఇక్కడ కూర్చొని విందాంలే అని అన్నారు చాలామంది.

క్రమేపీ భయంతీరిపోయింది. దానివల్ల ప్రమాదం లేదని గ్రహించారు. అడ్డమైనవాళ్ళు గ్రామఫోను కొనడం ఆరంభించారు.

మొదట మొదట గ్రామఫోనుప్లేటిచ్చినవారిని గురించి చాలా గొప్ప అభిప్రాయాలుండేవి. ఆయన ఎంతో పాటగాడయిఉండకపోతే గ్రామఫోను ప్లేటివ్వడానికి ధైర్యంచేస్తాడా అనే అభిప్రాయం ప్రబలంగా ఉండేది. అప్పుడు పాటా అలాగే ఉండేది.

రానురాను అన్నిరకాలవాళ్ళూ ప్లేటివ్వడం ఆరంభించారు—ఎవరుబడితేవారు నటకులు గావడానికి తయారయినట్లు. కొద్దిగా ఒకటిరెండు రాగాల కళలు సంపూర్తిగానో అసంపూర్తిగానో తెలుసుకొని 'ప్లేటివ్వడానికి హాజరయ్యే గాయకులు వెలిశారు. భాగవతులూ, కథకులూ, గాయకులూ, నటకులూ ఈవిధంగా భూమి ఈనినట్లుగా వెలవడం ఆంధ్రమాత అదృష్టంగాక మరేమిటి?

క్రొత్తరోజుల్లో గ్రామఫోనుప్లేట్లు తీసుకున్నప్పుడు గ్రామఫోనురికార్డుకంపెనీవారు పుష్కలంగానే డబ్బిచ్చారు. ఇప్పుడు రైలుచార్జిపెట్టుకుంటే వచ్చి ప్లే

ట్లిచ్చిపోయే గాయకులు వెలిసింతర్వాత దబ్బు యిదివరలాగా వాళ్ళివ్వడంలేదంటే ఏమిలాభం?

గ్రామఫోనులో పాడినవారు లెక్కకు మిగిలి ఉన్నారు. వారినిగురించి విమర్శించేవారూ అంతే.

పుర్రెకోకబుద్ధి. నాలికకోకరుచి. గ్రామఫోను ప్లేట్లిచ్చిన గాయకులెంతరో, ఒక్కొక్క గాయకుణ్ణి గురించిన అభిప్రాయాలు కనీసం అన్నైనా ఉంటవి. రాచప్ప నిద్రపోయినవార్ని లేవగొట్టుతాడని ఆయనంటే కారంకొందరికి. సదరు బుద్ధిమంతులకే ఇందుబాల, బాలగంధర్వాదులు వినబడీ వినబడకుండా పాడుతారని కోపం. ఎవరైనా కపిలవాయిరభ్బాయి తరువాతనే అని కొందరిమతం. కపిలవాయివారి పాట పాతచింతకాయపచ్చడి అని కొందరి అభిప్రాయం. జోన్నవిత్తులాయన అరేరే! ఏమిత్రిప్పుతాడురా గొంతు. ఆకారం ఏంపలుకుతుందిరా సంగీతంఅంటే అదీఅని కొందరు. అరిచి అరిచి మాగాడిద ఈలాగే వచ్చిందన్నట్టుగా ఉంటుం దాసంగీతం అని మరికొందరు. 'రాఘవా' అని అద్దంకివారి పిల్లవాడు అనాలె వినాలెనని కొందరి ఆలోచన. ఎన్నైనా చెప్పండి ఆయనపాటలు ఏమాత్రం బాగుండవు, పాడుంబిల్చినవాడుగొంతూ ఆయనానూ అని కొందరివిచారణ. స్థానంఆయనపాట అసలే ఏడ్చినట్టుగా ఉంటుంది, దానికితోడు ఆయన గ్రామఫోనులో ఏడ్చాడెందుకురా అని కొందరి ఆక్షేపణ. ఏమన్నా స్థానంవారిపాటలో మాధుర్యంఉంది, ఆయన పెద్దపాటకుడు కాకపోయినా ఆయనపాండిత్య, నేర్పు, భావస్ఫురణ ఇత్యాది గుణాలు ఎవరికీరావు, ఆయన ప్రతి పద్యమూ, పాటా, ఆయననాటకంలోవేసిన పాత్రలను జ్ఞప్తికితెస్తవి, ఆయన ఏడ్పుగూడా గొప్పగానే ఉంటదని స్థానంపార్టీవారి సమర్థన. ఈ విధంగా గ్రామఫోను గాయకులమీద అభిప్రాయాలూ, ఆక్షేపణలూ, ఖండనలూ, సమర్థనలూ వింటూంటే వేళ ప్రొద్దుగడవదనే భయం ఉండదు.

గ్రామఫోనుస్థితిమాత్రం నిత్యకల్యాణంగా వెలిగిపోతున్నదన్నాము. గ్రామఫోనుగల ఆసామిస్థితి మరిని. అలగాడితన్న పలుకుబడి కరణం మునసబులకైనా, పెద్ద అధికార్లకన్నా, లక్షాధికార్లకన్నా లేదు. ప్రతివాడూ శ్రీమారు గ్రామఫోను వినిపిస్తారూ అనేవాడే. అంటే విని లోలోపల సంతోషించే గ్రామఫోను యజమానులుగూడా ఉన్నారు.

గ్రామఫోను కొందరికి ఎంతో చెట్టుసరిగూడా చేస్తుంది. కొంచెంసేపు గ్రామఫోను వినిపిస్తారా? అంటే కొందరు గ్రామఫోను ఆసాములు 'ఇప్పుడు కాదులెండి, మరోసారి ఎప్పుడన్నా......?' అని, మరి కొందరు ప్లేటులు మంచివిలేవండీ అని, గ్రామఫోను ఇప్పుడు ఆర్డరులో లేదండీ అని ఏవేవో కారణాలు చెప్తారు. అసలుకారణంమాత్రం అడగంగానే వినిపిస్తే అందులో మజాపోతుందనే. కొందరు కొందరికి గ్రామఫోను పాడయిపోతుంది, ప్లేటులు అరిగిపోతవనే అభిప్రాయంకూడా ఉంటే ఉండవచ్చు.

కొందరు గ్రామఫోను యజమానులకు తమ గ్రామఫోను పతివ్రతఅని, అది పరహస్తస్పర్శమాత్రంఓర్చదని, అభిప్రాయం. ఎవరినీ తాకనివ్వరు. కొందరికి తమ గ్రామఫోను పువ్వులాంటిది మరెవ్వరు మోటుగా తాకినా వాడిపోతుందనీ, మరికొందరికి తన గ్రామఫోను మంచిగయ్యాళి, తామతప్ప దాన్ని ఇతరులెవరూ స్వాధీనపరచుకోలేరు, సముదాయించుకోలేరనీ. ఇత్యాది కారణాలచేత కొందరు, కొందరు వేరు కారణాలచేత ఇతరులకు గ్రామఫోను ఇవ్వవలసివస్తే వెంటవెంటనే వస్తాఉంటారు.

ఇందులో కొందరి అభిప్రాయం గ్రామఫోను పెట్టడం ఇతరులకెవ్వరికీ చేతగాదని, తమకుమాత్రమే చేతనవునని. తాము పెద్దపెద్ద పరీక్షలిచ్చినందువల్లే ఈ లాంటి గొప్పవిషయాలు తమకు తెలిసినవనీ. అలాంటి ఆసామీలే తమ గ్రామఫోను ఉండడంవల్లనే సూర్య చంద్రాదులు గతులుతప్పకుండా నడుస్తున్నారని తలచే వారుగూడా ఉన్నారు.

గ్రామఫోను ఉండీ అప్పుడప్పుడు పెట్టుకొని వినే ఆసామీ—అంటే పెట్టి వినకుండా మూలబెట్టి బూజెక్కించేవారున్నారు. ప్లేటులు పచ్చళ్ళమీదికి మూతలకు పనికివస్తున్నవి.—వినే ఆసామీ అయితే ఆయ

నకు దొంగలభయం ఏమాత్రమూ ఉండదు. ఆయన ఇంటిచుట్టూ జనం హమేషా పడి ఉంటారు. కిటకిటలాడుతూ జనం పెళ్ళింట్లో ఉన్నట్లే ఉంటారు. పల్లెటూరయితే చెప్పనక్కర్లేదు. ఆలాంటప్పుడు ఆ ఆసామి గొప్పవాడుకాడని ఎవరనగలరు.

ఒకాయనఇంట్లో గ్రామఫోను ఒకటిఉన్నది ఉన్నదనిమాత్రం ఎవ్వరికీ తెలియదు. ఎప్పుడైనా గ్రామఫోనుపెట్టి వింటూంటేగా ప్రక్కవాళ్ళకైనా తెలిసేది! దగ్గరబంధువులలో ఎవరైనా గ్రామఫోను ఉన్నదని తెలిసినవారువస్తే వారికి బుద్ధిపుడుతుంది గ్రామఫోనువిందామని. వారుశ్రమపడి ప్లేట్లమీది బూజు, గ్రామఫోనుమీదిబూజు ఒక గంటన్నరసేపు తుడిచిన తర్వాత సౌండుబాక్సుకోసం వెతకడం ఆరంభం చేస్తారు. ఆసమయానికి ఆసౌండుబాక్సుఉన్న ఇనప్పెట్టెతాళంచెవులు ఎవరికీ కనబడవు. భార్యవైపువారు వస్తే భర్త తాళంచెవులు కనపడకుండా చేస్తాడనీ, భర్తవైపువారువస్తే ఆపని భార్య చేస్తుందనీ ఒక అనుమానంఉన్నది కాని నిజానిజాలు తెలియవు. ఇంతకంటె ఆసౌండుబాక్సు పనిచెయ్యని స్థితిలో ఉంచితే వారి గ్రామఫోను ఆచంద్రతారార్కంగా ఆలాగే ఉంటుందని, ఎవరికి దానినిచ్చినా భరవాలేదనితోస్తుంది.

గ్రామఫోనుప్లేటులు ఇవ్వడమనీ, గ్రామఫోను పెట్టడమనీ పరిపాటిగా అంటున్నాము. అసలు పెట్టు అను ధాతువుకు శబ్దార్థచంద్రిక, శబ్దరత్నాకరము వగైరా నిఘంటువులలో ఉన్నఅర్థము ఉండదు అని. "గ్రామఫోనుపెట్టు" అంటే మూలఉన్న గ్రామఫోను నడిమధ్య పెట్టడంగాదు. గ్రామఫోను నలుగురిమధ్యపెట్టి కీయిచ్చి ప్లేటుపెట్టి పాడించడం. ఆలాగే ప్లేటివ్వడం అంటే ప్లేటు మరొకరికివ్వడమనేకాదు. ప్లేటులో ఎక్కించడానికి పాట పాడడం. ఒకాయన మరొకాయనతో "మీరు రెండు ప్లేట్లివ్వండీ" అంటే ఆరెండో ఆయన కల్లమొలినకోపం తెచ్చుకుని "నాకు సంగీతం రాదని మీకు తెలియదా. ఆలా వేళాకోళం ఏంబాగులేదు సుమండీ!" అన్నాడట. కనుక ఇందు మూలంగా పెట్టడానికి పాడించడమనీ, ఇవ్వడానికి పాడడం అనీ నూతనార్థాలు కల్పించి, లోకకారులకు పనికల్పించినా, ఆంధ్రభాషను వృద్ధిపరచినందుకు పదహారణాల ఆంధ్రులందరూ సభలుచేసి గ్రామఫోను కనిపెట్టిన ఆయనకూ, వారు ప్రస్తుతం ప్రపంచకంలో గయురుపోజరయితే (అయితేనే సుమండీ) వారి వారసులకూ (వారసులకిస్తే పిత్రుదేవతలకు చేరుస్తారుగనుక), గ్రామఫోనుకంపెనీలవారికీ, గ్రామఫోను పిచ్చను ప్రపంచకంలో వ్యాపింపజేసినవారికీ, ఆంధ్రదేశంలో అతివ్యాప్తికితెచ్చినవారికీ కృతజ్ఞత తెలుపవలసి ఉంటుంది. మాటలకు నూతనార్థాలనూ, నూతనప్రయోగాలనూ ఆంధ్రసాహిత్యపరిషత్తువారూ ఏమాత్రం ఒప్పుకోరు గనుక ఈ విషయంలో అభినవాంధ్రకవిమండలివారన్నా కొంచెం శ్రమ తీసుకోవలసి ఉంటుంది.

ఏతావతం చెప్పదల్చుకున్నది గ్రామఫోను పెట్టిన చోట చేరిజనాన్నిచూడడం ఒక ఆనందమేనని. పిలవలేదనుకోకుండా, ఇంతమందిచేరితే ఏమనుకుంటారోనని ఆలోచించకుండా, పాటసంగతి తెలిసినా తెలియకపోయినా జనం పుష్కలంగా మూగి కనులపండువ చేస్తారు.

ఇదివరలోనే జనాకర్షణకోసమున్నూ, మొహమాటము ఏర్పఱచుకొని పలుకుబడి సంపాదించుకోవడానికిన్నీ కొన్ని వృత్తులు ఏర్పరచబడ్డవి. శివార్చకులూ, విష్ణ్వర్చకులూ తమ పనులకుతోడు కొంచెం వైద్యం నేర్చుకుని తమతో ఇతరులకు పని కల్పించుకుంటూ వచ్చారు. ధనం రాలినా రాలకపోయినా వైద్యపు మొహమాటాన ఏదైన పనైనా చేయించుకోవచ్చునని. మరికొందరు జ్యోతిషం ఉపవృత్తిగా చేసుకోవడం చూస్తున్నాము. చాలామంది పాడుంకాయ హమేషా దగ్గర ఉంచుకొని తాము పీల్చినా పీల్చకపోయినా శూద్రాదులకు దానంచేసి పలుకుబడి సంపాదించుకుంటున్నారు. ఆలాంటిదే గ్రామఫోనున్నూ. నలుగురిలో పలుకుబడి కలుగజేస్తుంది. ఆ వస్తువుగల ఆసామి తాను పాడించుకొని వింటున్నప్పుడు ఇతరులువచ్చి వింటేనే కొంచెం మొహమాటం ఏర్పడుతుండే ఇహ ఇతరులు వారికై వారువచ్చి అడిగి పాడించి, విని, ఆనందించి,

వెళ్ళితే మొహమాటంసంగతి చెప్పవలెనా? పలుకుబడి, నలుగురిలో ఎన్నిక కోరే అర్భకులు,హోటలు యజమానులు, సానులు, వకీళ్ళు, డాక్టర్లుగూడా హమేషా వారి వాకిట గ్రామఫోను పాడించడంవల్ల ఉండే గుణాగుణాలను వారేనిర్ణయించుకుని కార్యరంగంలోనికి దిగుతారని ఎంచుతాను. హోటలుయజమానులు కార్యశూరులు అనిపించుకున్నారు. ఇతర సోదరులుమాత్రం వారిని అనుకరించలేని భీరులా? అన్నలారా! మేల్కొనుడు!!

అనేకమగు గ్రామఫోను సభల నలంకరించి, అపరిమితమగు అనుభవము గడించిన ఒక శాస్త్రజ్ఞుడు ఈ క్రింది విధముగా ప్రకటన చేస్తున్నాడు. "గ్రామఫోను వినడానికి తయారయ్యే జంతువులకందరికీ (శాస్త్రపరిభాష. జీవంగలవాటిని జంతువులు అంటుంది) ఒకవిధమైన జబ్బుఒకటి సర్వసామాన్యముగా కనిపిస్తున్నది. ఆ జబ్బు గ్రామఫోను వినడానికి వచ్చింతర్వాత గ్రామఫోనుమంచి శ్రోతలకు వ్యాపించే అంటువ్యాధా? అని ప్రశ్నలు కలిగినవి. ఆ జబ్బు అమితంగా మాట్లాడడం. ఏ మంచిపాటపడో పాట వినిపిస్తూంటే వినేవాళ్ళు ఊరుకోలేక మాటలు సాగిస్తారు. కొందరు పాటకుణ్ణి గురించో, గ్రామఫోనుప్లేట్లు తీయడాన్నిగురించో మాట్లాడినా హెచ్చుమంది సందర్భంలేని స్వంతవిషయాలను గురించో, లోకాభిరామాయణమో చెప్పకుంటారు.

కొందరు మానవులలో ఈ జబ్బు స్వతస్సిద్ధంగా ఉంటుందా అనే ప్రశ్నకు ఆ జబ్బుగలవాళ్ళుమాత్రమే గ్రామఫోను వినడానికిరావడ మెలా సంభవిస్తుందనే ప్రశ్న రూపకమైన సమాధానంవచ్చింది. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పి పర్యవసానము తేల్చగలందులకు మానసికశాస్త్రజ్ఞులతో కూడుకొన్న ఒక ఉపసంఘము వారు అహర్నిశాలు పరిశ్రమచేస్తున్నారు.

ఒకరింట్లో గ్రామఫోను తరచుగా పెట్టుతూ ఉంటారు. ఎప్పుడైనా మాటవరసకు "సాయంత్రం మా యింట్లో గ్రామఫోను పెట్టుతాము ఒకసారిరండి" అని అంటాడేమో ఆ గృహయజమాని అని పది పదిహేను రోజులు చూచాను. పోనీ నేనేవెళ్ళుదామా ఈ మాత్రానికి పిలిచేదేమిటి అని నాకు తెలియకుండానే వెళ్ళేవరకు వచ్చేదేగాని వెంటనే వారి ఆడంగులుంటారని జ్ఞాపకమొచ్చి మానివేశేవాణ్ణి.

చివరకు నేనే ఓడిపోయినాను గ్రామఫోనుగల గృహస్థుయింటికి నాకాళ్లు నడదివెళ్ళినవి. వెళ్ళేవి ఊరుకోక బలవంతంగా శరీరాన్ని మనస్సున్నపెట్టెనూలాక్కొనివెళ్ళినవి. అనుకున్నట్టే వారి ఆడంగులు నన్ను చూచి తలుపుచాటుకు వెళ్ళారు.

నేనువెళ్లినతర్వాతనే మరి నలుగురు పెద్దలుగూడా దయచేశారు. ఆ వచ్చినవార్ని ఆహ్వానించడం, చాప చాలకపోతే మరోకచాప వేయించడం ఈ హడావుడిలో జరుగుతున్నప్లేటు అయిపోయింది. తిరిగి మరో ప్లేటుపెట్టారు. ఆ వచ్చినవారిలో ఒకాయన (సంగీత జ్ఞానం తనకున్నదని యితరులు అనుకోగలందులకు ఆయన మాట్లాడినా, మాట్లాడడం పూర్తి అయ్యేలోగా ఆయన సంగీతజ్ఞానం పూజ్యమనితేలింది) తన సంగీత జ్ఞానం ప్రకటిస్తూ "సుబ్బయ్యభాగవతారా! అయనది ఈ ప్లేటు కాదురా. ఆ రోజు మనం విన్నాంచూడూ అది వెయ్యి" అన్నాడు. "అదే ఇది" అనేవరకు "ఆ దేమిటిరా సంబంధం లేనట్టుతోచింది" అని తప్పుకున్నాడు. ఆయన తల ఊపుడూ, తాళవు వేపుడూ చూచి "ఇదేంరాగం అండీ" అన్నాను. ఆ పెద్దమనిషి "కన్నడ" అన్నాడు. ప్లేటు అయింతర్వాత చూస్తే దానిమీద "కమాచి" అని ఉంది. "దానికీ దీనికీ కొంచెందగ్గరే లెండి. ఒక్కొకటేవారు" అని దబాయించాడు. మిగిలినవారంతా వాళ్ళవాడి జ్ఞానానికి ఆనందిస్తున్నారు. నేనూ ఆయన తెలివితక్కువకు చిరునవ్వు నవ్వాను. మొత్తం అందరము ఆయన సంగీత జ్ఞానానికి సంతోషించామన్నమాటే.

ఒక ప్లేటు తర్వాత మరొకటి నడుస్తూనే ఉంది. ప్లేట్లు వేశే ఆయనకూడా శ్రోతల సంభాషణలో పాల్గొన్నట్లయితే ఏ ఏమరుపాటులోనే ప్లేటు పగలవలసిందే. బుద్ధిమంతుడు కావడంచేత తన గ్రామఫోనుగురించిన శ్రద్ధవల్ల ఆయన విరివిగా వీరి సంభాష

ంలో పాల్గొనలేదు. ఆపైన మాట్లాడిన పెద్దమనిషి (స్థూలకాయంలోనన్నా) ప్రక్కవారికి సంగీతాన్ని గురించీ, దాని మెరుగులనుగురించీ, పాటకులనుగురించీ, గ్రామఫోన్నుగురించీ, విడవకుండా ఉపన్యాసం ఆరంభించాడు. మిగిలినవారు తమకుతోచిన సంగతులు పులగంలో పచ్చడిలాగా తగిలిస్తున్నారు.

మూడు నాలుగు ప్లేట్లు ఈవిధంగా నడచినవి. ఒక ప్లేటుకు ఒకప్లేటుకు మధ్య టైములో మాట్లాడవద్దని వారికి చెపుదామనుకుంటే సరిగా అప్పుడే వారు మాట్లాడడం మానివేశేవారు.

కొంతసేపయిన తర్వాత ఒకప్లేటు జరుగుతుండగానే ఆపుకోలేక "బాబూ! విందురూ!!" అన్నాను. "నామొహం ఏమిటీ వినేది? అవి ఆపరా. ఈసంగీతం ఎవరికి తెలియదు? ఆపి పప్పుబ్రాహ్మడుపెట్టి అలాంటివి తగిలించవోయి" అన్నాడు ఆయన. అది పెట్టింతర్వాత ప్లేటులోది వినకుండానే ఒకలేనవ్వు, నవ్వంతా అందుకోసమే నిల్వచేసుకున్నట్లు.

కొసమాట ఆనాడు గ్రామఫోనుప్లేటు ఒకటీ నేను సరిగా వినలేదు. ఆనాడేమిటి? ఏనాడూ, ఎవ్వరూ గ్రామఫోను సరిగా వినడానికి వీలులేని పరిస్థితులు ఏర్పడినవి. గ్రామఫోను వినడానికి కూర్చున్నతర్వాత మాట్లాడగూడదని 144-వ సెక్షను ఉపయోగించడానికి వీలవుతుందేమో, అయితే దీనిని ఎవరు అమలుపరచాలనో అనుభవశాలులైన లాయర్ల సలహోనైనా, లేక అసలు 144-వ సెక్షనును బూజాదులిపి పైకితెచ్చిన ఘరానా మనిషి సలహానైనాపొంది గ్రామఫోను ప్రియులు పనిచెయ్యవలసినస్థితి దేశానికిపట్టింది. ఎంతశ్రమనైనా ఓర్చుకుని వారు ఈ పనికి పూనుకుంటారని తలుస్తాను.

—మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ, బి. ఏ.

వి రా గి

ప్రథమ శకలము : సృష్టికర్త.

అమితతీక్ష్ణాతపంబున నలసి సొలసి
శ్వాసములు పుచ్చు నీబాటసారి యెవఁడో?
పాపము! వ్యథాపరిక్లిష్టభావమూర్తి
యై, కనుంగవ నశ్రువు లవిసి తొలఁగు.

ఎండమావుల నీరము లిచ్చుమెయిని
గ్రోల నెంచిన యట్టి మూర్ఖుండితండు;
అమితతృష్ణాప్రకృష్టాత్ముఁ డల్లనల్లఁ
బాదములు వెట్టుచుం దొట్రుపడుచు వచ్చు.

* * *

రమ్ము పాంథ! నావచ్చు పథమ్మునంటి
పోయెదవు నీకు సంతసంబు ఘటియిల్ల,
మగిడి నీసౌధగేహాళీమధురకాంతి
పూరముల సూర్యదీప్తులు తేరిచూతు.

* * *

అటులు కవిచెప్ప పలుకుల నాలకించి
పథము గమనించి పోయె నా బాటసారి;
జ్ఞానగీతము పాడించు సర్వమయుని
కవివరేణ్యుని హృదయంబు గాంచలేడు!

కష్టసుఖముల నోరువఁగల జనుండె
నిశ్చయము ముక్తివీథికి నేతయగును
బోడి బైరాగి వేసములో పూనినంతఁ
గలుగునాయేమి? మోక్షరంగమున సిద్ధి.

—పెనుమర్తి వేంకటరత్నశర్మ.

ఈ సంక్రాంతికి

ఈ సంక్రాంతికి నోముపండినది తల్లీ! పాలచెక్కిళ్లలో
మోసుల్ దేరిన లేసినవ్వునవుబువ్వుల్ గ్రుచ్చి నిశ్శబ్దపుం
బ్రాసాదమ్ము నలంకరించి కళసంపాదించి యుయ్యాలలో
నూనుల్ జెప్పెడి చిన్నిబొమ్మ కొలువై యుల్లమ్ము బెల్లమ్ముగా.

సెలవుల్ వారెడి పిచ్చినవ్వులను విచ్చీవిచ్చకున్నట్టి చూ
పులకున్ జిత్తము గుత్తగొంచు తరితీపుల్ రేపి తీపారు ప
లుక్కుల గ్రాందేనియ సోనలందడిపి కోర్కెల్ నించు బంగారు ము
ద్దులపాపాయి కతమ్మునన్ మనకు ప్రొద్దుంబ్రొద్దు సంక్రాంతియే!

ఇదిగో నమ్మరొ సౌమ్యలక్ష్మీ! తొలి నీవే తెంచు పబ్బమ్ము నం
దెదురుల్ సూచుచు డెందముల్ గదుర ముందే గాజురా బొమ్మలం
గుదురుంగొల్వు కొటారుదీర్చి వరముం గొన్నాము; నే డింక మా
మదులన్ నిక్కపుబొమ్మ కొల్వుగొను సుమ్మా! చూచిపోవచ్చులే!

ఉయ్యాలం బవళించి దోయిలికి నుద్యోగించు గేల్దమ్మితో
నొయ్యందియ్యని క్రొత్తబాన నిదె నీ కుప్పొంగి సుస్వాగతం
బియ్యన్ మా జనదేవు డెంచుకొనెలే! యీయింటికిన్ వచ్చి 'మా
యయ్యా! మేలగుగాత!' మంచు నొడియందాడించి దీవింపుమా!

ఇరువదిరుయేండ్ల నేస్తమ్ము లెనగు కతన
పాలపాప! తొలియేడు పరిచయమ్ము
నెరుగ గూర్చితి నిదిమొద లేడు నేడు
చూచిపోవమ్మ చుట్టపు చూపుగాను.

—బొడ్డు బాపిరాజు.



తల్లిచాటు పిల్లవాడు

౧

లోకం ఒక పెద్దకొలిమి. అనేకధక్కా ముక్కీలు తిని రాటుతేలిన వాళ్ళు దానివేడికి తట్టుకోవలిసిందే కాని, ప్రసాదరావుబోటి సుకుమారులు ఆగలేరు. అటువంటివాడు కొన్ని కారణాలవల్ల లోకంవాత పడ్డప్పుడు—

పత్నీసమేతుడయ్యేవరకూ ప్రసాదరావు తల్లిచాటున పెరిగాడు. లోకాన్నిగురించి అతనికి గ్రంథపరిచయం వల్ల కలిగిన జ్ఞానమేకాని ప్రత్యక్షానుభవం సున్నా. సుకుమారి. మనసుకూడా అటువంటిదే. ఎక్కువకాలం తనభావప్రపంచంలోనే ఉంటూండేవాడు. ఆదర్శాలు గొప్పవి.

ఒక కొమ్మనువదిలి మరోకొమ్మను పట్టుకోవాలనే టెక్నిక్కు కోతులకే కాక మనుష్యులకూడా ఉంటుంది. భార్య తనదయేరోజు సమీపిస్తున్నకొద్దీ అతను తన భావప్రపంచంలోనించి క్రమక్రమంగా తల్లిని తీసేసి ఆస్థానం భార్యకివ్వటం మొదలుపెట్టాడు. అందులో తప్పేమీలేదు—తల్లి అసూయాగ్రస్తురాలు కాకుండా ఉంటే. వెంకాయమ్మగారు సంతోషించింది.

ప్రసాదరావెంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్న రోజు వచ్చేసింది. గృహస్థాశ్రమంలో ప్రవేశించబోయ్యేవాడు తనభార్య ఈవిధంగా మాట్లాడుతుంది, ఈ విధంగా ప్రవర్తిస్తుంది అని నానారకాలుగా ఊహించుకొనివుండి కాక, తీరాదగ్గిరికొచ్చేటప్పటికి నూట ఒక టోకంగా ఉంటుంది. ప్రసాదరావుసంగతి పెంపుడు పిల్లికి తిండి పెట్టబోతూండగా అది కాస్తా చెయ్యికొరికిన వాడి సామెతయింది! మర్నాడతనిమొహాన కత్తివాటు వేస్తే నెత్తురుచుక్క లేదు. అతను ఇదివరకు రకరకాల ప్రణయకథలు చదివాడు. అనేకమంది స్త్రీలనుగురించి విన్నాడు. ఇ దేరకమూ కాదు. మీదుమిక్కిలి ఆపిల్లకు సుశీలఅని ఎందుకు పేరుపెట్టారో అతనికి అర్థంకాలేదు. గండుపిల్లనికాని కొండముచ్చునికాని నామకరణంచేస్తే ఎంతో సార్థకంగా ఉండేది.

ప్రసాదరావుకు జరిగిన మరోఅపకారమేమిటంటే ఆకిందటిరోజువరకూడా అతను భావప్రపంచంలో భార్యతో అద్భుతంగా సుఖపడుతూ చక్కనికలలుకంటున్నాడు. ఇప్పు డామచ్చట తీరిపోయింది. భావప్రపంచం పటాపంచలయింది, కలలు వికలమైపోయినై.

రాయటానికీ—చదవటానికీ సుశీల విపరీతమైన వ్యక్తి అనిపించవచ్చును కాని ప్రపంచంలో అటువంటి పిల్లలు లెక్కలేనంతమంది ఉన్నారు. పెడకట్టై, మొండిది, మూర్ఖురాలు, ముక్కోపి, నాజూకులేనిది, కట్టెవిరిచినట్టు మాట్లాడేది, మర్యాద తెలీనిది. ఏదైనా లెజిస్లేచరు పెట్టి అటువంటి పిల్లలకు పెళ్ళికాకుండా ఏర్పాటుచేస్తే సంఘం కొంతవరకు తరిస్తుంది.

వెంకాయమ్మగారు కొడుకుదురవస్థ చెప్పినట్టు గ్రహించింది. (తల్లీ పిల్లల మధ్య భాష అవసరంలేదు.) లోపల చింతించి ఊరుకుంది. ఒక్క నెలరోజుల్లో ప్రసాదరావు దేవత్వంనించి దాదాపు రాక్షసత్వానికొచ్చాడు. ఆవిడ అర్థంచేసుకుని ఊరుకుంది.

వెంకాయమ్మగారికి ఒంట్లో అస్వస్థతగా ఉండి సుశీల వంటచేసుకోవలిసొచ్చింది. ఆపిల్ల మొహం మట మటలాడుకుంటూ వంటఇంట్లో చెంబులూ తప్పాలాలూ పగలగొడుతుండగా, ప్రసాదరావు గడ్డంచేసుకోటానికి కాచిన నీళ్ళకోసం లోపలికొచ్చాడు చెంబుపట్టుకుని. అత నింకా అయిదడుగులదూరంలో ఉండగానే సుశీ అతనిపని కనుక్కొని పంపించక "అయ్యో! అట్లా మీదికొస్తారేం?" అంది. అతనికి ఒళ్ళుమండి చేతులో ఉన్న చెంబుతో పెళ్ళాం నెత్తిన లాగి ఒకటికొట్టాడు. దాంతో సుశీల కణతలకు పసుపుకొమ్ము అరగదీసి రాచుకుని ఎవరితోనూ చెప్పకుండా గదిలో ముసుగు పెట్టుకుని పడుకుంది. (ఎవరన్నా మాడుమీద ఒక్కటి పెట్టినప్పుడు కణతలకు పసుపు గంధం పెయ్యమని ఏ వైద్యగ్రంథరాజంలోనైనా చెప్పబడుందేమో నాకు తెలీదు. సుశీల ఒక నేటివుడాక్టరుగారి మేనకోడలు కనక ఆమెకే తెలియాలి.) ఒక పొయ్యిమీద అన్నం మాడిపోయింది. రెండోపొయ్యిమీది గిన్నె ఒరిగి పడి పోయింది. అప్పుడు వెంకాయమ్మగారు మడికట్టుకుంటే పదింటికి కావలసినవంట పన్నెండింటికి తేలింది.

అనాహ్లాదకరమైన ఈ విషయంమీద ఇంతకన్న ఎక్కువ రాయటం తగనిపని. నాలుగు నెలలు కాపరం సుశీల ఇదిగిట్టుపాటుకాని వ్యవహారం అని గ్రహించిందో ఏమో ఎవరితోనూ చెప్పకుండా పుట్టింటికి లేచి పోయింది.

౨

సుశీల క్షేమంకోరి ఆమెను పుట్టింటినించి తిరిగి అత్తవారింటికి తీసుకొచ్చి రాయబారంచేసే పెద్దలు లేక పోయినారు. కాని మనోవర్తికోసం నోటీసు ఇప్పించటానికి కావలసినంతమంది దొరికారు. ఆ విష యమై తగిన ఏర్పాటుచెయ్యటానికి ప్రసాదరావు ఏలూరు వెళ్ళాడు. అత నేవిధమైన పేచీలుపెట్టదలచ లేదు. వెళ్ళినపని వెంటనే అయిపోయింది. తిరిగి రాత్రి బండి అందుకోగలిగాడు. అతను స్టేషనుకు వచ్చేసరికి బండి కింకా చాలావ్యవధిఉంది. అతను స్టేషనులోనే భోజనంచేసి తాంబూలంవేసుకుని పచారుచెయ్యటానికి ప్లాటుఫారంమీది కొచ్చాడు. అక్కడెవరూ లేరు. దూరంగా ఒకస్త్రీ కూర్చునిఉంది. ప్రసాదరావు ఒక్క సారి ముక్కులోనించి చాలా గాలివదిలాడు. కొంత కాలంనించీ తెల్లబట్ట కట్టుకుని ఆడదికనిపిస్తే అసహ్యం జాస్తయింది. అతను మెల్లిగాప్లాటుఫారం రెండోచివరకుపోయి అక్కడే తారట్లాడటం మొదలుపెట్టాడు. ఆలోచన ఎటోపోయింది. భావప్రపంచంలోపడి బాహ్య ప్రపంచాన్ని మరిచాడు.

"ఏమండోయి!"

ప్రసాదం·వు కొట్టినట్టు ఉలికిపడి తలఎత్తి చూశాడు. పలకరించినగొంతు కటువుగా ఉండకపోవటమే కాకుండా చాలా శ్రావ్యంగా కూడా ఉండటంవల్ల అతనికి ఉలికిపడవలసిన అగత్యంలేదుకాని ప్రస్తుతం అతని కీఆడగొంతుల మాటరంసు బాగాలేదు. ఆమాట కొస్తే సుశీలదీ కొంతవరకు శ్రావ్యమైనగొంతే.

అతను తన్నుపలకరించిన మనిషివంక చూసి ప్లాటు ఫారం మరోచివరకు చూపు పరిపాడు. అక్కడ మనిషి లేదు. ఆమనిషే ఈమనిషి. మనిషికూడా ఎక్కడ! పిల్ల. పదహారేళ్ళు దాటని పిల్ల. భోగంది! రూలు ప్రకారం అతనుమళ్ళీ ముక్కులతో బుసకొట్టాడు. తర వాత ఆపిల్లవంక తీవ్రంగా చూశాడు మెస్మరైజు చేస్తున్నవాడల్లే. కాని అతనివెనక దీపంఉండటంచేత ఆపిల్ల కదంతా సరిగా కనిపించి ఉండదు.

"నాకు బెజవాడ కొకటికెట్టు కొనిపెడతారూ?" అన్నదాపిల్ల. ఆపిల్లమూతి ఎంతఅందంగా ఉంది!

"అట్లాగే! డబ్బులు తే!"

ముక్కు! ఏంముక్కు!

"నాదగ్గిరలేవు," అం దా పిల్ల.

"నన్ను పెట్టుకోమంటావా?" కళ్ళు!

ఆ పిల్లకు కొద్దిగా కోపంవచ్చినట్టు కనపడ్డది.

"ఉచితంగా ఇవ్వక్కర్లేదు. బదులివ్వండి."

"అవును! తరవాత మనంమనం లెక్కచూసుకునే టప్పుడు—"

ఆ పిల్ల కీసారి బాగా కోపంవచ్చింది.

"అందాకా ఈ ఉంగరం అట్టే పెట్టుకోండి!" అని ఆపిల్ల వేలిఉంగరం తీసిచ్చింది.

గడ్డం? కనిబొమలు? జుట్టు? వేళ్ళు? అనుకుంటూనే అతను నిర్మొహమాటంగా చెయ్యిచాచి ఉంగరం తీసుకున్నాడు.

"ఈ ఉంగరం ఖరీదెంతఉంటుంది?" అన్నాడతను ఉంగరం అటూ ఇటూ తిప్పిచూసి.

"జైభై అయిదు."

"ఛాస్! ఇదేదో ఇమిటేషన్ రాయి."

"మీరిచ్చేటిక్కెట్టు డబ్బులకు సరిపోతుంది లెండి" అన్నదాపిల్ల.

అత నామాట వినిపించుకోకుండా, "ఇదయితే నీకెట్లా దొరికింది?" అన్నాడు.

ఆపిల్ల చిరునవ్వున్నది. "మీకు మర్యాద తెలీదు. ఉంగరం ఇటు తెండి," అన్నది.

ప్రసాదరావు ఇచ్చేశాడు. ఆపిల్ల తీసుకుని వెళ్ళబోతున్నది.

"ఉండు. నీకిచ్చే రైలు చార్జీకి తాకట్టవసరం లేదు. టికెట్టు కొనిపెడతాను."


అత నీమాట అంటూండగానే పోర్టరు గంటకొట్టి వెళ్ళాడు.

"ఇక్కడే ఉండు. టిక్కెట్టు తెస్తాను."

ఆపిల్ల అక్కడే ఉంది.

ప్రసాదరావు ఆమెచేతికి టిక్కెట్టిచ్చి మళ్ళీ సంభాషణ మొదలు పెట్టాడు.

"నేనిందాక అన్నమాటలు నీకు రుచించినట్టు కనబడదు! మూడు సంగతులు జ్ఞాపకం పెట్టుకో, నేను ఆంటీనాచి, ఆంటీఫెమినైన్. నీచర్యంతా ఫిక్షీగా ఉంది."



"అంటే?"

"ఫూల్."

ఆపిల్ల చిరునవ్వునవ్వి "నాకంతవరకూ అర్థమౌతుంది."

"నీ కింగ్లీషుకూడా వచ్చునా ఏమిటి?"

"నేను స్కూలు ఫైనల్ పాసయినాను."

"వెరీ గుడ్! నీ సంగతంతా ఫిక్సీగా ఉందని నిరూపిస్తాను చూడు. మీ జేపూరు? నువ్వు బెజవాడ డబ్బు లేకుండా ఎందుకు పోతున్నావు? నేను బెజవాడ పోతున్నానని నీకెట్లా తెలిసింది?—"

"నాకు తెలీదు"

"నేను నన్ను ఒంటరిగా ఎందుకుపోతున్నావు?"

"నన్నడంతా అడగకండి! గాయం కెలికినట్టవుతుంది."

ప్రసాదరావు అకస్మాత్తుగా మాట్లాడటం మానేశాడు.

త్వరలోనే రైలొచ్చింది. దాదాపు పెట్టెలన్నీ ఖాళీగానే ఉన్నై. ప్రసాదరావు చిన్నపెట్టెగామాచి ఎక్కాడు. లోగంపిల్లకూడా అతని వెనకనే ఎక్కి, "మీకభ్యంతరం లేకపోతే ఇందులోనే కూర్చుంటాను. చాలామంది మధ్య కూర్చోటానికి నాకు చాలా అసహ్యంగా ఉందిప్పుడు మనస్సు సరిగాలేదు," అన్నది.

"నాకభ్యంతరంలేదు. ఇందులోకూడా చాలామంది ఎక్క వచ్చునన్నేది మరిచిపోకు."

ఆపిల్ల నవ్వి "ఎక్కరు" అంది.

ఆమాట అతనికి దబ్బున అర్థంకాలేదుకాని కాగానే శరీరమంతా ఒక్కసారి ఝల్లుమన్నది. తన బతుక్కూటువంటి పెళ్ళాంకూడానా.

అత నాపిల్లవంక తీక్ష్ణంగా చూశాడు. కాని ఆచూపు వ్యర్థమయింది. ఆ అమ్మాయి రెండో బల్లమీద కంపార్టుమెంటు అవతలివైపు కిటికీదగ్గిర కూర్చుని బయటికి చూస్తున్నది.

ఆపిల్ల అన్నట్టే అయింది. ఒకరిద్దరు ఆపెట్టెలో ఎక్కాలని ప్రయత్నంచేసి ఇద్దర్నీచూచి పక్కకుపోయినారు. రైలు కదిలింది. ఆ పిల్ల బయటికిచూడటం మానేసి అతనివంక చాలాసేపు చూసింది. అత నటువైపు చూడలేదు. చివర కామె లేచి అతనికి దగ్గిరలో కూర్చుని "మీఅనుమానాలకు సమాధానం చెబుతాను," అన్నది.

అతను పరధ్యానంగా "ఎందుకు? నాకవసరంలేదు," అన్నాడు.

'నన్నుగురించి మీరు దురభిప్రాయం పడుతున్నారు. అది నాకిష్టంలేదు."

ప్రసాదరావు కనిబొమలు ముడేశాడు.

"దురభిప్రాయానికి అవకాశంలేదు. నీ అభిప్రాయమేదో స్పష్టంగానే తెలుస్తున్నది."

ఒక్కసారి ఆపిల్లమొహం బాధపడుతున్న లక్షణాలు కనబరిచింది.

'మీరు నిజంగా క్రూరమైన మనిషి కారనుకుంటాను! ఎందుకంత హింసించినట్టు మాట్లాడుతారు?'

'క్రూరమైనమనిషి నెందుక్కాను? కావాలంటే నాపెళ్లాన్ని అడుగు," అన్నాడతను వికటంగా నవ్వి.

ఆపిల్ల దీనంగాచూడటం మొదలుపెట్టింది.

'నీ అభిప్రాయాన్నిగురించి నాకేటువంటి అనుమానంలేదు. మోశావు. కుర్రవాడుగా ఉన్నాడు, అమాయకుడేమో బుట్టలో వేద్దామనుకున్నావు. లేకపోతే స్టేషనులో అంతమంది ఉండగా నన్నే ఎందుకు టిక్కెట్టు అడిగినావు? బెజవాడకే ఎందుకు కావాలి సొచ్చింది? నే ఎక్కినపెట్టిలోనే ఎందుకెక్కావు? నువ్వు చెప్పిన సమాధానమేమిటి ఈపెట్టెలో ఇంకా ఎవరైనా ఎక్కుతారంటే? ఇంకేమైనా నామీద ఆశలుంటే ఇప్పటికైనా వదులుకో! నాకర్థంకాని దల్లా ఒకటే! ఇంత చిన్నదానివి నీకింతధైర్యం ఎట్లావచ్చిందా అని!'

ఆపిల్ల అతననుకున్నట్టు ప్రవర్తించలేదు. మొహానికి చీర అడ్డంపెట్టుకుని ఏడవటం మొదలుపెట్టింది. అంతటితో అతనిధైర్యం యావత్తూ అంతరించింది. పైన ఒక్కసారి ఘనీభవించి చూపటానికి కతని మనస్సు పాషాణమల్లే ఉందికాని అతని మనస్సులోపల బావగా ఉంది. ఆపిల్ల ఏడుపు పైపొరను కొట్టేసింది. అత నామెను సమీపించి మెల్లిగా "చూడు" అన్నాడు ప్రయోజనం లేకపోయింది. ఇంకోసారి కొంచెం గట్టిగా

"చూడు!" అన్నాడు. ఊహుఁ! అతను బలవంతంగా ఆమె మొహంమీదినించి రెండుచేతులూ తీసేశాడు. ఆకళ్ళూ, మూతీ, గడ్డం, ముక్కూ అంత సమీపంలో చూసేటప్పటి కతనికి మతిపోయి ఆ దొండపండంటి మూతిని కాస్తా ముద్దుపెట్టుకున్నాడు.

పెద్దమనిషి చెయ్యవలసినపనికాదు. ఆపిల్ల భోగం దయినా, ఆమె అనుమతిలేకుండా, తన్ను నివారించ లేని స్థితిలో ఉండగా అటువంటి పనిచెయ్యటం చాలా నింద్యమైన సంగతి. ఆ వివేచన అంతా మించిపోయిన తరవాత వచ్చింది. అదేకాదు ఇంకా చాలావిషయాలు తెలిసొచ్చినై. మొదటిసంగతి అత నంతవరకు ఆపిల్ల విషయంలో ఒక్కసారైనా పెద్దమనిషితరహాగా ప్రవర్తించలేదు. మరోసంగతి ఆపిల్లచర్య కింకో కారణం ఉండికూడా ఉండవచ్చును. అప్పుడే ఆపిల్లను బలాత్కారంగా ముద్దుపెట్టుకున్న మొహంతో ఆలోచిస్తే తన చర్యలో ఆపిల్లచర్య నూరోవంతు అనుమానాస్పదంగా లేదు.

ఆ పిల్ల లేచి ఎడంగా పోయింది. అతని కామెవంక చూడటానికి ధైర్యంలేకపోయింది. కాని మొండితనం చేసి ఆమెవంక చూశాడు.

"ఆ గొలుసు లాగితే బండి ఆగుతుంది. లాగు!" అన్నాడు. ఆమె అతనివంక బోనులో సింహంవంక చూస్తున్నట్టుచూస్తూ నిలబడ్డది.

అతను మొహం చేతుల్లో పెట్టుకుని "నాకు మతి చెడిపోయింది. నేను వెనకటి ప్రసాదరావునుకాను!" అని గొణుక్కున్నాడు. అయిదునిమిషాలసేపిద్దరూ కదల్లేదు. ఆ పిల్ల మెల్లిగావచ్చి అతని భుజంమీద మెల్లిగా చెయ్యివేసి "మీరేమీ పశ్చాత్తాప పడక్కర్లేదు. నాకన్న మీకేమోసం ఎక్కువ మీరుచేసిన పని వల్ల. నేను మిమ్మల్ని బుట్టలోవెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నాను కనక నాకు కష్టంగా ఉంటుందని మీర నుకోటాని కవకాశంలేదు," అంది.

ప్రసాదరావు తలఎత్తి "నేనెట్లాగూ పెద్దమనిషిని కానని నిరూపించుకున్నాను. నువ్వింతవరకు చాలా పెద్దమనిషితరహాగా ప్రవర్తిస్తూవచ్చావు. ఆ ఒక్క మాటతో నన్ను వదిలెయ్యి," అన్నాడు.

ఆపిల్ల క్లుప్తంగా "క్షమించండి!" అంది.

ఆమాటతో అతని కాపిల్లను చూస్తే చాలా గౌరవం కలిగింది. ఇద్దరిపరిచయం ఇంతవరకు వచ్చినతరవాత తన మనస్థితంతా ఆమెకు చెప్పేద్దామనుకున్నాడు. తన భార్య గోలంతా చెప్పాడు. తన మనస్సు విరిగిపోయిందన్నాడు. లేకపోతే తనట్లా ప్రవర్తించాలిసింది కాదన్నాడు. ఆపిల్ల అంతా ఓపిగ్గావిని తనకథంతా చెప్పింది.

ఆ పిల్లపేరు కాంతం. ఆమె మేనమామ సంఘసంస్కర్త. అనేకమంది భోగంవాళ్ళకు పెళ్ళిళ్ళు చేయించాడు. ఆపిల్లనాయనే పెంచి చదువు చెప్పించి పెళ్ళికి ప్రయత్నంచేస్తూ చనిపోయినాడు. తరవాత కాంతం తల్లి దగ్గిరికొచ్చింది. తల్లి కూతుర్ని వృత్తిలో దిగమని ప్రోద్బలంచేసింది. కూతురు వినలేదు. తల్లి దొంగకొత్తు వేసి పెళ్ళనే వంకపెట్టి ఒక రొద్దు కంటగట్టింది కాంతాన్ని. కాంతం ఆయన్ను పెళ్ళిచేసుకోనంది. భోగం పిల్లలను పెళ్ళిచేసుకునేందుకు రంభలుంటారని గట్టిగా చెప్పేసింది తల్లి. ఈపని జరిగిన కొద్దిరోజుల కావేశ్య మాతకూడా చచ్చిపోయింది. ఆరొద్దు కాంతం తల్లిదగ్గిర ఉన్న సామానంతా అమ్మి "మా ఊరు ఏలూరు, మా యింటికి పోదాంపద"మని ప్రయాణంచేశాడు. ఏలూరులో ఒక సందులో బండి ఆపి ఇక్కడే ఇల్లు దిగమన్నాడు. కాంతం దిగటంతోటే బండి తిరిగి స్టేషను దారిపట్టింది. ఆ రొద్దుకు దిగినబండే అది ఉంటుంది. కాంతం రైలుకు దారికనుక్కుని స్టేషను చేరేటప్పటికి రైలుపోయి చాలాసేపయింది. కాంతం భోజనంచేసి పన్నెండుగంటలు దాటింది.

ఇదంతా కాంతం చెబుతానన్నప్పు డతను చెప్పనియ్యకపోవటం మేలే అయింది. అప్పుడైతే అతని కిది కూడా పార్టు ఆఫ్ ది గేమ్ అనిపించేది. ఇప్పు డతని గుండె నీరయిపోయింది.

"బెజవాడలో మరి నీకెవరున్నారు?" అన్నాడు ప్రసాదరావు.

"మా స్నేహితులున్నారు. కొంతకాలంవాళ్ళ అండపడి ఉంటే తరవాత ఏమవుతుందో! మా మామయ్య

స్నేహితులున్నారు. వాళ్ళ మొహం ఎట్లా చూడను?"

"నువ్వెప్పటికైనా కులవృత్తి చెయ్యవలిసొస్తుందేమో! నీకిష్టం లేదు కాదూ?"

"నిజం చెప్పటంకన్న నిజమే ఎక్కువ. ఇష్టంలేకపోతే లేదని అనుకోటంవల్ల ఒరిగేదుందా?"

«లేదు. నువ్వు చాలా అద్భుతమైనదానివి."

«నేననేదకే! మీరు నిజంగా అట్లా భావిస్తే పైకనరు."

మనిషికి బుద్ధిలేదు. అతనికి కాంతాన్ని మళ్ళీ ముద్దుపెట్టుకోవా లనిపించింది. ఈ అనిపించటమైనా తప్పయి ఉండాలి, అంతకుపూర్వమే కలిగిన అతని పశ్చాత్తాపమయినా అర్థంలేనిదయి ఉండాలి. ఎట్లాగైనా అతనికి బుద్ధిలేనట్టే.

«నన్ను మాట్లాడనివ్వవు! రోజూ నీకంటిదానితో సంచరించటం బహుకష్టం!"

«ఇంత అద్భుతమైన దాన్నయినా?"

ప్రసాదరావు కాంతం రెండుచేతులూ పట్టుకున్నాడు.

«ఎక్కడికీ వెళ్ళవద్దు! నాదగ్గిరే ఉండు, కాంతం!"

«ఎవరికోసం ఉండను?"

«నీకిష్టమైతే నాకోసం."

«మీరు నాతో సుఖపడరు!"

«పడతాను."

«లోకం మిమ్మల్ని చెండుకు తింటుంది."

«నేను లెక్కచెయ్యను."

«చేస్తారు! ఎవరో ఒప్పుకోకపోతే మీరు లెక్కచెయ్యకపోవచ్చు. మీ అమ్మగారే ఉండనుకోండి."

ప్రసాదరావు నిట్టూర్పు విడిచాడు.

«ఆవిడ ఒప్పుకుంటే మీదగ్గిర ఉంటాను. మీ సుఖం కోసంకాదు, నా తిండికోసంకాదు, మీకోసం ఉంటాను. ఆవిడ ఒప్పుకోకపోతే ఉండను."

3

బెజవాడలో ఇద్దరూదిగారు. ఒకబండీ ఎక్కారు, ఇద్దరుపోవలిసింది ఒకవైపే. మధ్య కాంతం బండిఆపించి దిగింది. ప్రసాదరావు ఇల్లు గుర్తుపెట్టుకున్నాడు.

ఇంట్లో అడుగుపెడుతూనే తల్లితో చెప్పదామని అతని ఉద్దేశం. కాని తల్లి మొహంచూడగానే అతనికి ధైర్యం లేకపోయింది. అతని స్థితి కాలుగాలిన పిల్లిలే ఉంది. ఈ త్రిశరీరసంబంధమయిన అందం మరుపుకొస్తుంది. కాంతాన్ని ఎట్లామరిచిపోతాడు? తను కాంతం విషయంలో చూపించిన అన్యాయం, నిర్దయ, మోటుతనం! తన అహంకారం! తనలో ఏంచూసి కాంతం తన్నుబుట్టలో వేసుకోవాలని ప్రయత్నం చేస్తుందిట? కాంతం అన్న ఒక్కొక్కమాట గంటమోగినట్టు చెవిలో మోగుతుండేను. తనన్నమాటలు తలుచుకుంటే ప్రాణం చచ్చిపోతుండే! అవి ఇంకా నాలుగైదుసార్లు జ్ఞాపకం వస్తే మర్నాడు కాంతం మొహంచూసే ధైర్యంకూడా ఉండదు తనకు.

సుశీలతో పోల్చినా, ఎక్కడి కాంతం, ఎక్కడి సుశీల! కాంతాన్నిచూస్తే ఉన్నగౌరవం తనకింకెవర్నీ చూస్తే లేనప్పుడు ఇంకోళ్ళేమనుకుంటారో అనే ఆలోచనెందుకొస్తుంది? కాని తల్లి?—

అతనికి ఒంటిగంటకుకాని నిద్రపట్టలేదు. మర్నాడు లేచేటప్పటికప్పుడే బాంబు పేలింది. వెంకాయమ్మగారికప్పుడే రిపోర్టువచ్చింది ప్రసాదరావు భోగందానితో రైలుదిగాడని ఓరూ, బండిలో ఎక్కాడని ఓరూ! వెంకాయమ్మగారు లేవగానే కొడుకును ప్రశ్నించింది. పాలిమొహంతో ఒక్క అబద్ధమైనా ఆడకుండా అతనుతల్లికి చెప్పదగినంతవరకు చెప్పాడు.

వెంకాయమ్మగారు నిర్ఘాంతపోయింది.

"కాంతాన్ని ఇంతప్పుడు చూశావురా, అబ్బాయి! వాళ్ళ రామదాసు మీనాన్నకు స్నేహితుడు. జ్ఞాపకం ఉందా? ఎర్రబొట్టు నిలువుగా పెట్టుకుని, తలగుడ్డ చుట్టుకుని, మీసాలూ ఆయనా! మంచివాడు, పాపం! ఆయన పెళ్ళాంతో ఈ పిల్ల ఒకరోజున పేరంటాని కొచ్చింది మనింటికి. దాన్నిమళ్ళీ ఒకసారితీసుకురా," అన్న దావిడ నవ్వుతూ.

«ఇవాళ్ళే తెస్తాను!" అన్నాడు ప్రసాదరావు నిశ్చింతగా.

—కొడవటిగంటి కుటుంబరావు.

అపరాధిని

ఆకలికి కృశియించిన అంటుడొక్క
కటివలను సున్న చినిగిన కట్టుబట్ట
జడలుగట్టిన కెంధూళి నిడివిజుట్టు
కూరుకొనిపోయినట్టి కన్‌గ్రుడ్లుగలిగి
దీనదేవత యిటుల మూర్తీభవించె
ననువిధాన అనాథకృశాంగి యొకర్తు
మండు వేసవిలో తల మాడుచుండ
కాళ్లు వేడిమిబాధకు కనలుచుండ
మండుటెండకు నెమ్మను మంటలెత్త
అరుగుచుండెను మిట్టమధ్యాహ్నమందు.
అన్నమో రామచంద్రాయటంచు, ఆమె
మూపున పరుండినా డొక్క ముద్దుబిడ్డ
ఒక్క చేతిలో కఱ్ఱ, మఱొక్క చేతి
యందు చినిగిపోయిన జోలె అమరియుండె
ఆమె సొమ్మింతకన్న లేదాయె పృథ్వి
పడుచు తూలుచు దొర్లుచు నడచుచుండె
అన్నమో అన్నమో అంచు అరచుచుండె
మరల యింటింటిగడపల దిరుగుచుండె
గడపలన్నియు క్రమముగ గడచి చనియె
గాని పలుకరించెడివారు కనికరించు
వారు చూచెడివారైన లేరు నిజము
పట్టెడన్నంబు నెవ్వరు పెట్టరైరి
ఒక్క గింజైన జోలిలో నుండదయ్యె
అలసటేకాని యిసుమంత ఫలము లేదు
అరచుటేకాని వినెడువారైన లేరు
ఆకలంతకంతకు మండి యధికమాయె
బోరుబోరున నేడ్చెడు ముద్దుబిడ్డ
తనకు శ్రమయు నంతంతకు నినుమడింప
జీవితదురదృష్టమును దూషించుకొనుచు
తిరిగి మార్గము వెంబడి మరలిపోయె
దుఃఖదారిద్ర్యజీవిక దుర్భరమ్ము.

పోయిపోయి యొకానొక భూరుహమ్ము
క్రింద చతికిలబడి జోలె క్రిందబెట్టి
ముద్దుబిడ్డనుగాంచి వాపోవుచుండె.
"పాడుదైవమా! పిడికెడు కూడు లేదు
కట్టుకొనుటకు చింపిరి బట్ట లేదు
అలసటారంగ త్రాగ నీరైన లేదు
పున్నెముల పెన్నిధీ! ననుగన్నతండ్రి!
ఏమినోచితినో కాని యెఱుకపడదు
ఎవరినేడ్పించియుంటినో యెఱుకరాదు
అన్నమునకు నాబిడ్డ అల్లాడుచుండె
కూలిచేసిపెట్టుదమన్న కొంచెమైన
అవయవపటుత్వమేమి లేదాయె తండ్రి!
కనికరించెడివారు లోకాన లేరు
పీరు నాబంధులనువారు లేరు జగతి
లోకమందున నేను నేకాకినయ్య
ఎచటకేగిన నెవరాదరింతురయ్య
ఎవరిఁజూడ నెవరు కరుణింతురయ్య
పాడుబ్రతుకు పుట్టితిని విశ్వంబునందు
ముద్దుబిడ్డను ప్రేముడి బ్రోవుమయ్య
కరుణజూపింపుమా! నను గన్నతండ్రి!"
అంచు దైన్యభావల పలవించుచుండ
నాలుక పిడచకట్టగ బాలు డపుడు
బోరుబోరున నేడ్చుచు మూర్ఛఁజెంద
అమ్మ 'గాభరా' పడుచు నాఅయ్యయనుచు
లేచి నీటికై దిక్కుల జూచుచుండ
కొలదిదూరాన చెరువొండు గలయజూచి
పిల్లతెమ్మెరల్ చల్లగ వీచునట్లు
చిగురుటాకుల సెజ్జను చేర్చియుంచి
పూలతోటను బిడ్డను బొదివిపెట్టి
అమ్మ ముదమంది జలమున కరుగుచుండె
తాళరానిక్షుల్లాన నుద్భవము గనుట

వెఱ్ఱిదైన భిక్షుకురాలు విస్మరించె.
చెరువుదగ్గఱ కేగి హర్షించి తల్లి
ఆత్రమున నీరుగైకొని అరుగుచున్న
శ్రవణములఁజొచ్చె కఠినదుర్భాషలపుడు
"మాలముండ! మాదారువును మైలచేసి
అదురుబెదురు లేకెచ్చటి కరుగుచుంటి
వేమి! ఆగుమాగు మట నీకెంతపొగరు?"
అనిమేపాన స్మరియించె నంటరాని
కులము తనదాట పాపమా నెలఁత, యంత,
ఆక్షణంబున నాగి పాపాత్ము నెదుట
నిశ్చలంబుగ భిక్షుకి నిలిచియుండె
కఠినహృదయుం డనాథపై కఱ్ఱనెత్తె
ఒక్క దెబ్బ కామృత్పాత్ర ముక్కలయ్యె
తలపగిలి బొటబొటని రక్తంబుపారె
బొబ్బగించి భిక్షుకురాలు మూర్ఛజెందె.

—పరుమూరి వెంకటసుబ్బయ్య.



సాతాని జియ్యరు

కోడితో మేలుఁకొని
  కానమాఁడి నుదుట
దిరుమణియుఁ దిరు
  చూర్ణముఁదీర్చిదిద్ది
యొక్క కేలను
  దంబుఱ నొక్క కేలఁ
జిఱుతలంబూని
  నున్నని శిరముపైని
తొలగకుండ నక్షయ
  పాత్ర నిలిపి మేలు
కొలుపులంబాడి
  వీథివీథులను దిరిగి
యనుపదమ్మును
  'రంగరంగా'యటంచుఁ
గడపగడపకునేగి
  భిక్షమ్ముఁ గొనుచుఁ
జేరవచ్చును సాతాని
  జియ్యరదుగో.

—'తొలకరి'నుండి.

శూరఖడ్గము

నెపోలియన్ చక్రవర్తి జర్మనీదేశమును జయించి, ఆస్ట్రియాదేశమును స్వాధీనపరచుకొనుటకై సేనాసమేతముగా 'షాన్ బ్రన్' నగరమందొక రాజభవనమున మకాముచేసియుండెను. ఆస్ట్రియారాజుతో సంధికై రాయబారములు నడుచుచుండెను. రాయబారముల అంతు తేలనందున చక్రవర్తికి ఆత్రము హెచ్చుగానుండెను. ఈ అవస్థలో రాజభవనమందొకమూల చక్రవర్తి ఒంటరిగా దీర్ఘాలోచనాపరుడై కూర్చుండెను.

*　　*　　*

నూనూగుమీసాల నవయువకు డొకడు నెపోలియన్ విడిసియున్న భవనములోపలికి నదురు బెదురు లేకుండా చొచ్చుకొనిపోవుచుండెను. అతని వయస్సు సుమారు పదునెనిమిది సంవత్సరములుండవచ్చును. మహారాజవాను లాయువకుని అటకాయించిరి.

మ. జ:—నీ వెవ్వడవు? ఎచటికిపోవలెనని నీయుద్దేశము?

యువ:—(నిర్లక్ష్యముగా) నాకు మీతో పనిలేదు. నేనెవ్వడనైతే మీకేమి? నేను నెపోలియన్ చక్రవర్తి దగ్గరకు పోతున్నాను. అక్కడికెడితే అన్నిసంగతులు మీకే తెలుస్తాయి.

మహారాజవానులు ఆ యువకుని అరెస్టుచేసి సోదా చేశారు. అతనిదగ్గర పొడుగుపాటి శూరఖడ్గము, ఒక యువతీమణిచిత్రము దొరికినవి. జవాను లాతని చక్రవర్తిదగ్గరకు తీసుకొనిపోయారు. నెపోలియన్ అతని ముఖమును తేరిపారిచూచాడు. యౌవనలాలిత్యము, కార్యదీక్ష ఆయువకునియందు మూర్తీభవించియున్నటుల చక్రవర్తి గుర్తించాడు.

*　　*　　*

చక్రవర్తి:—యువకుడా! నీవెవ్వరవు? నీపేరేమి?

యువకుడు:—(అతిమర్యాదగా) నే నొకజర్మను యువకుడను. నా పేరు ఫ్రెడరిక్ స్టాప్స్. నా తండ్రి హైరోలిస్‌పట్టణమందొకమతప్రచారకుడు.

చక్ర:—అయితే నీ విక్కడికెందుకొచ్చావు?

యువ:—ఎందుకా? నీప్రాణాన్ని తీయడానికి.

చక్ర:—(అదరిపడి)—ఏమిటీ! నాప్రాణాలుతీస్తావా! నీకేమైనా పిచ్చెత్తిందా! లేక వెర్రెత్తిందా! అదీ కాకపోతే ఏమైనాజబ్బా?

యువ:—నాకు పిచ్చిలేదు. వెర్రిలేదు. జబ్బంతకన్నా లేదు. పూర్ణమైన తెలివితేటలతో బుద్ధిపూర్వకంగా నిన్ను చంపడానికే వచ్చాను.

చక్ర:—నన్నెందుకు చంపదలచినావు? నేను నీకేమి అపకారము చేశాను?

యువ:—ఎందుకా? నాదేశాన్ని నాశనం చేస్తున్నావు కనుక. జనాన్ని నాశనంచేసే ఈ యుద్ధాలేమిటి?

చక్ర:—ఏమిటీ. నీదేశాన్ని నాశనంచేస్తున్నానా?

యువ:—ఆ! అవును. నాదేశాన్నే, నాజర్మనీదేశాన్ని, దేశభక్తులగు జర్మనులదేశాన్ని.

చక్ర:—ఓ యౌవనుడా! ఈ బుద్ధి నీకేపుట్టినదా లేక నిన్నెవ్వరైనా ప్రేరేపించినారా?

యువ:—నన్నెవ్వరు ప్రేరేపించలేదు. నాకు పుట్టిన బుద్ధే ఇది. నిన్ను హత్యచేస్తే నాజన్మభూమియైన జర్మనీదేశానికి, యూరోపుఖండానికీ కూడా మహత్తరమైన ఉపకారం చేసినవాడ నవుతానని నా అంతరాత్మ చెపుతోంది.

చక్ర:—(నిశ్చేష్టుడై)—నన్నిదివర కెప్పుడైనా చూశావా?

యువ:—ఆ! చూశాను. ఇర్ ఫర్టుపట్టణంలో. అప్పుడు నీధైర్యసాహసాలకీ, నీ యుద్ధనైపుణ్యానికీ చాలా ఆనందించి నిన్ను ఆరాధిస్తూ ఉండేవాడిని. అప్పట్లో నీ వింక యుద్ధాలు చెయ్యవనుకున్నా.

ఫ్రెడరిక్ సాహసాన్ని, నిష్కపటత్వాన్ని చూచి చక్రవర్తి దిగ్భ్రమచెందేడు. ఆయువకు డున్మాదుడేమోనని సంశయం కలిగింది. రాజు తలుచుకుంటే దెబ్బలకేమి కొదువ? చక్రవర్తివద్ద ఉండే ఘనవైద్యులంతా పరీక్ష చేశారు. కాని ఉన్మాదలక్షణాలేమీ కనుపించలేదు.

అతడు ఉన్మాదుడుకాడని వైద్యులు నిర్ధారణచేశారు. 'వైద్య మెందుకు? నే నాసంగతి ముందే చెప్పానుగా!' అని ఆయువకుడు రెట్టించాడు. చక్రవర్తి మనస్సు కలవరపడడం ఆరంభించింది. ఆ యువకుని ధైర్యసాహసములు, అచంచలత్వము చక్రవర్తికి ఆశ్చర్యమును కలుగచేశాయి. హంతకులయెడల నెపోలియన్ ఎప్పుడూ దయాదాక్షిణ్యాలుచూపి ఎరగడు, కాని ఫ్రెడరిక్ యౌవనము, ధీరత్వము ఆయనయందు గొప్పమార్పును కలుగజేసినాయి. దేశభక్తిప్రేరితుడును, సాహసాంకుడునగు ఆ నవయువకుని ప్రాణములతీయుట కాయన మనసొప్పకుండెను. ఆ యువకునియందు దోషమున్నట్లు కనపడదు. ఒక కక్షలేదు. ఏదేని యొక మహత్తరసిద్ధాంతమును వెలపరచుచున్నాడా యనిన అదీ లేదు. ఆ సందర్భములో తనదేశహితమును కోరేటటువంటి యువకుని తుపాకి కెరవేయడం అంటే చక్రవర్తికి పచ్చివెలక్కాయ గొంతుకపడినటులుండెను. ఎంతసేపాలోచించినా ఈ సమస్యకు సమాధానంరాలేదు. ఆ అవస్థలో సీజరు చక్రవర్తి హత్యకుకారకుడైన బ్రూటస్ నెపోలియన్ కంట్లఎదుట స్వప్నప్రాయముగా కనబడినాడు. ఆనాటి బ్రూటసే నేడు ఫ్రెడరిక్ రూపంలో జర్మనీదేశంలో అవతరించాడా అనే భ్రమ కలిగింది. ఇంతలో ఒక్కసారిగా నెపోలియన్‌యందున్న సహజధైర్యం ప్రకాశించింది. అనామకుడైన ఎవడో ఒక యువకుని బెదరింపులకు అదరడం ఎందుకని మనస్సును చిక్కబట్టుకున్నాడు. ఏలాగైనా ఆ యువకుని ప్రాణమును కాపాడవలెనని అతనితో సంభాషణ మొదలుపెట్టాడు.

చక్ర:—ఓ యువకుడా! నిన్నెవ్వరో ఈ పాడుపనికి ప్రేరేపించినటులు కనబడుతుంది. ఈ హంతకకార్యమువలన నువ్వు, నీకుటుంబంకూడా నాశనమైపోతారు. హంతకులను సామాన్యంగా నేనెప్పుడూ క్షమించను. కాని నీయౌవనకోమలత్వం, నీధైర్యం చూచి నా మనస్సు కరిగింది. క్షమాపణవేడుకో, నీప్రాణాన్ని రక్షిస్తాను. కాస్తంత పశ్చాత్తాపమును సూచిస్తే చాలు. నేను క్షమిస్తాను.

యువ:—ఓహో! క్షమాపణా! ఎందులకా క్షమాపణ? నీదయాదాక్షిణ్యములు నాకక్కరలేదు. నాకణుమాత్రమైనా పశ్చాత్తాపం కలగడంలేదు. కాని నాప్రయత్నం విఫలమైనందుకుమాత్రం చాలా విచారపడుతున్నాను!

చక్రవర్తి తోక త్రొక్కిన త్రాచువలెను ఉగ్రుడైపోయాడు. "ఓ రాక్షసీ! మహాద్రోహము తలపెట్టికూడా నీకు పశ్చాత్తాపము కలుగుటలేదా? సరే" అని హుంకరించాడు.

"ద్రోహమా? నిన్ను చంపితే ద్రోహమా? కాదు. కాదు! ముమ్మాటికి కాదు! అపరాధమేమియులేదు సరిగదా బ్రహ్మాండమైన ప్రజాసేవకూడాను" అని ఠీవిగా, నిష్కర్షగా ఫ్రెడరిక్ జవాబిచ్చాడు.

నెపోలియన్ ఆ యువకునివద్ద దొరికిన యువతి చిత్రాన్ని చేతబట్టి తదేకదీక్షతో చాలాసేపు పరీక్షించి "హూం! హూం! ఈ బొమ్మ ఎవరిది?" అని అడిగాడు.

"నేను ప్రేమించుచున్న యువతి."

"నీదారుణకృత్యాన్ని ఆమె అంగీకరిస్తుందా?"

"ఆహా! పని పూర్తికాలేదని విచారిస్తుంది కూడాను. నాకన్న ఆమెకే నీవంటే పరమసహ్యం."

ఈ సంభాషణ చక్రవర్తికి మరింత సంకటము కలిగించింది. గోరుచుట్టుమీద రోకటిపోటయింది. అయినా ఆచిత్రంలోని యువతీమణి సౌందర్యాన్నిచూచి ఆనందిస్తూ అదివరలో కలిగిన ఆగ్రహాన్ని శాంతపరిచాడు. 'ఆ యువకునికి నామీద ద్వేషముంటే ఉండుగాక! నేనాతని క్షమించకూడదా?' అని తనలో తానే ప్రశ్నించుకున్నాడు. క్షమిస్తేనే మంచిదని నిశ్చయించుకున్నాడు. చిత్రాన్ని చేత్తోపట్టుకుని "ఓ యౌవనుడా! నిన్ను నేను క్షమించినట్లైతే ఈ యువతి చాలా సంతోషిస్తుందనుకుంటాను! ఏమంటావు?" అని అడిగాడు.

ఫ్రెడరిక్ ఆశ్చర్యముతోనూ, సంభ్రమముతోనూ చక్రవర్తికేసి తేరిపారిచూశాడు.

"ఓహో! అయితే చివరకు నిన్ను నేను చంపగలనన్నమాట" అని సంతోషముతో జవాబిచ్చాడు.

నెపోలియన్‌కు కోపం, విసుగు వచ్చింది. ‘నీ కర్మం నీదే పో’ అని ఫ్రెడరిక్‌ను తన ఎదుటినుండి పంపేశాడు.

* * *

ఎదుటలేకపోయినా ఫ్రెడరిక్ మూర్తి నెపోలియన్‌కు ప్రత్యక్షమగుచునే యుండెను. ఏరాజకార్యాని కుపక్రమించినా ఆ యువకుని ధీరవర్తనమే ఆతని స్మృతికి వస్తూవచ్చింది. ఎంత ప్రయత్నించినా మరపు అసంభవమైపోయింది. చక్రవర్తి ఆత్మ పరీక్ష చేసుకున్నాడు. ఆ యువకుడు తనపాలిటి హెచ్చరిక దేవతేమోనని సంశయించడం ప్రారంభించాడు. అపశకునసంబంధమగు నేదో యొక అనుమాన మాతని బాధించుచుండెను. ఆ యువకుని ప్రాణమును కాపాడు నుద్దేశ్యముతో మరల వైద్యపరీక్ష చేయించెను. కాని రోగచిహ్నమావంతయైన కనుపించలేదు పశ్చాత్తాపమసలేలేదు. క్షమాపణకన్న చచ్చిపోతే మేలని ఆ యువకుడు భీష్మించియుండెను.

* * *

యూరోపుఖండము నంతటిని గజగజ లాడించిన నెపోలియన్ సామ్రాట్ ప్రాణముల తీయుటకై ప్రయత్నించినందులకు ఫ్రెడరిక్ స్టాప్సునకు మరణదండన విధింపబడెను. మరునాటి ఉదయమున రాజభవనమున ఆస్ట్రియాసంధిపత్రముపై సంతకములు చేయబడెను. వేరొకచోట ఫిరంగిఎదుట ఫ్రెడరిక్ నిలబడియున్నాడు. అతనిచేతులను సంకెళ్లు బంధించినవి. ఆధీర యువకుని ముఖమునందణుమాత్రమైన విచారచిహ్నము కనుబడుట లేదు. ఫిరంగి ‘ధాం’మని బ్రహ్మాండము బ్రద్దలగునట్లు శబ్దముచేసినది. కాని ఆయువకుని జయధ్వానము ఫిరంగిశబ్దమును ముంచివేసినది. “నిరంకుశత్వ మంతమగుగాక!” అను ఆయువకుని నోటినుండి వెలువడిన శబ్దము మిన్ను ముట్టినది.

* * *

నెపోలియన్ చక్రవర్తి దిగ్విజయయాత్ర ముగిసినది. ఫ్రెడరిక్ స్టాప్సుదగ్గరనుండి గ్రహింపబడిన శూరఖడ్గము ప్యారిస్ రాజభవనము నలంకరించినది. నెపోలియన్ జీవించినంతకాలము ‘నిరంకుశత్వ మంతమగుగాక’ యను మాట లాతనిచెవులలో గింగురుమనుచునేయుండెను.

* * *

నిరంకుశత్వ మంతమైనది. ఫ్రెడరిక్ కోరిక సిద్ధించినది. యూరోపులోని సామ్రాజ్యములను గడగడలాడించిన ‘పురుష’ ఇరువదిసంవత్సరములలో సెంటుహెలీనా దీవియందు బ్రిటిష్‌వారి బందీయై నికృష్టజీవనము గడిపి నిర్భాగ్యుడై మరణించెను.

—శ్రీ వి డి లింగరాజు.



సర్ థామస్ లిప్టన్

[పుట్టుదరిద్రుడు. తేయాకువర్తకముచేసి తనకు ముప్పదివత్సరములు వచ్చుసరికి కోటీశ్వరుడైనాడు.]

లిప్టన్ నామము చెవినిపడినతోడనే మనకు అన్ని దుకాణములందును అమ్మబడు ఎఱుపు, పసుపు, ఆకుపచ్చరంగుల తేయాకుడబ్బాలు కన్నులకుకట్టినట్లు అగపడును. ప్రపంచమునందలి మూలమూలలకు వ్యాపించిన ఈ తేయాకు డబ్బాలతో విడువని సంబంధముగల ఈ లిప్టన్ ఎవరు? లిప్టన్ మార్కు తేయాకు నుపయోగించు పలువురకు లిప్టన్ ప్రపంచమునందలి కోటీశ్వరులగు వణిక్పుంగవులలో నొకడని తెలిసినను అతడు తొలుత కూటికిలేని పేదవాడనిగాని, స్వయంకృషిచే నాతడింతవాడైనాడనిగాని తెలియదు. లిప్టన్ చరిత్ర నిజముగా విచిత్రమైనది. నూరుపౌనులు అప్పుతెచ్చి షాపుపెట్టి పదిసంవత్సరములలో కోటీశ్వరుడైన ఈతని చరిత్ర నవలవలె చదువదగియున్నది.

లిప్టన్ తలిదండ్రులు ఐరిష్ దేశీయులు. ఆ దంపతులు స్వదేశమున గడవక పొట్టలుపట్టుకొని 1846-వ సంవత్సరమున స్కాట్లండుదేశపు పట్టణమగు గ్లాస్గోకు వచ్చి కలసనెలకొనిరి. నానాకష్టములు పడుచు దినములు వెళ్ళబుచ్చుచుండ వారికి 1850-వ సంవత్సరమున ఒకకొడుకుపుట్టెను. అతని నామము థామస్ జాన్స్టన్ లిప్టన్. అతడే మనప్రస్తుతకథానాయకుడు.

కడుపునిండ తిండికే నోచని ఆ బాలునకు విద్యాసౌకర్యము లెట్లు కలుగును? పాఠశాలలోనున్న పదిరోజులలో నాతడు తోడివిద్యార్థులనుండి నేర్చుకొనినది అమెరికాదేశపు రాజధానీనగరమగు న్యూయార్కుపట్టణమున రోడ్లు బంగారముతో వేయబడియుండునని. తొమ్మిదివత్సరములు వచ్చుసరికి - తోడిబాలురు పాఠశాలలో విద్యాసముపార్జనము చేయుచుండ - లిప్టన్ వారమునకు అరక్రౌను జీతముతో ఒక కంపెనీనుండి మఱియొకకంపెనీకి వార్తలు, లేఖలుకొనిపోవు జవాను వృత్తిలో కుదిరియుండెను.

అయితే తన దురదృష్టపరిస్థితులనుగూర్చి లిప్టన్ ఆ సమయమున ఎప్పుడును నిరుత్సాహముపొందలేదు. భావికాలమున తానెట్లో గొప్పవాడను కాగలనను భావము అతనికుండెను. తా నత్యంతపూజ్యభావముతో తిలకించు తనతల్లితో నాతడు ఇప్పటికి డెబ్బదియేండ్లకు పూర్వము - అనగా లిప్టన్కు పండ్రెండేండ్లప్రాయమున-ఇట్లనెను: "అమ్మా! నేను పెద్దవాడనైనపుడు నీకు కట్టుటకు పట్టుబట్టలను, ఉండుటకు ఒక పెద్ద ఇంటిని, నీ ఆజ్ఞలు నెరవేర్చుటకు సేవకులను సమకూర్పగలను." పండ్రెండేండ్ల బాలుని ఈపెదతొక్కు పల్కులకు అతని తల్లి ఒకటి రెండు రెప్పపాట్లకాలముమాత్రమే సంతోషించెను. కాని అంతలో తమ అప్పటి దరిద్రస్థితి జ్ఞప్తికిరాగా తిరిగి ఆమెముఖము చింతాముద్రితమయ్యెను. ఆ బాలుని వాక్యములు అచిరకాలముననే నిజము కానుండుట అప్పు డాతల్లి నమ్మునదా?

పదునొకండవ వత్సరమున లిప్టన్ ఇటికల ఆవముల యజమానివద్ద పనికి కుదిరెను. జీతము మునుపటికంటె ఒకక్రౌను అరుపెన్నీలు అధికము. కొంచెము అనుభవము కలుగగానే తనకాపనియందు హెచ్చుజీతము రావలసియున్నదని అతడు తలంచెను. కనీసము ఒక షిల్లింగు అయినను ఎక్కువచేయవలసినదిగా అతడు యజమానిని కోరెను. యజమాని జీతము హెచ్చుచేయుటకు అంగీకరింపలేదు. అపుడు లిప్టన్దృష్టి అమెరికాపై ప్రసరించెను.

ఇప్పటి కాతనికి పదునాలవ వత్సరము. పాఠశాలలో తోడి విద్యార్థులవలన న్యూయార్కులో రోడ్లు బంగారముతో వేయబడియుండునను కట్టుకథలను వినియున్నాడుగదా! వలసపోవువారిని గొనిపోవు ఒక రోడనీరాద

"ఆంధ్రభూమి"



సర్ థోమస్ లిప్టన్

నెక్కి ఆల డాబంగారుభూమికి ప్రయాణమయ్యెను. ఓడలో తోడిప్రయాణికులకు వారివారి ఇండ్లకు ఉత్తరములు వ్రాయుటయందును, అస్వస్థులైనవారికి పరిచర్య చేయుటయందును పర్యాప్తుడై అతడు వారి ప్రేమను సంపాదించెను. తోడిప్రయాణికులతో నాతడు న్యూయార్కునందలి కాసెల్ గార్డెనునందు దిగెను. తోడనే ఆతనికి దూరపుకొండలు నునుపు అను సామెత సార్థకమైనదనుట తెలియవచ్చెను. కాని ఆతడు నిరుత్సాహపడలేదు.

న్యూయార్కు పట్టణము. ఆకాశమంటు మేడలు. ప్రజలు త్వరజీవనులు. అడావుడి, చప్పుడు. స్వశక్తియందు నమ్మకము, పనులు చేయుటయందు చొరవగల లిప్టన్ జేబులో అప్పటికి వ్రేళ్ళపై లెక్కింపగల కొన్ని షిల్లింగులుమాత్రమే ఉండెను. ఆతని భావికార్యక్రమమున కంతకును అవియే ఆధారము. వానిని ఖర్చు పెట్టకుండ ఆ మహాపట్టణములో భోజనము, బస సమకూర్చుకొనుట యెట్లు?

ఆతడు మిక్కిలి చవకగా తిండిపెట్టు వాషింగ్టన్ స్ట్రీటునందలి ఒక బోర్డింగు హోటలునకు పోయెను. ఆ హోటలు యజమానుని చూచెను. అనంతరకాలమున ఆతనిని కోటికి పడగలెత్తించిన బుద్ధిబల మాతని కిప్పట్టున ఒక చక్కని ఉపాయమును సూచించెను. హోటలు యజమానునితో నిట్లు చెప్పెను: "ఇప్పుడే స్కాట్లండునుంచి ఈదేశమునకువచ్చిన కొందఱు ప్రయాణికులతో నాకు మంచి పరిచయముగలదు. వారు నేను చెప్పినమాట విందురు. వారిలో పది పండ్రెండుగురిచే మీహోటలులో కాతాపెట్టించినచో పనిదొరుకువఱకు నాకు మీ హోటలులో ఉచితభోజనము పెట్టించుచు బస యిత్తురా?" హోటలు యజమానుడు ఈ ప్రశ్నవైచిన యువకుని తేరిపారచూచెను; చిఱచిఱలాడుచు 'సరే' అని అఱచెను.

భోజనవిషయమున, బసవిషయమున ఆతడు తన షిల్లింగులను వెచ్చింప నవసరములేదు. తనతో వచ్చిన వారిలో పదముగ్గురు ప్రయాణికులు ఆ హోటలునందు నివసించునటుల ఆతడు చేయగలిగెను. తాను 'ధర్మపిండము' గుడుచుచుండెను. పని దొరుకుట ఇంత సుకరముకాలేదు. విరామమెఱుగని దీక్షతో ఆతడు పనికొఱకు అన్వేషించుచుండెను. వీధుల మొగలయందు వార్తాపత్రికల నమ్ముటకు మొదలిడెను. కాని ఇది స్థిరమైనవృత్తి కాదు. ఈపనికాదని వేఱొకటి. వర్జీనియాలో, న్యూ ఆర్లీన్సులో పని చేసెను. ఎక్కడ ఉన్నను ఏపనిచేయుచున్నను ఆతడు మిక్కిలి పొదుపుగా జీవించుచుండెను. కూడబెట్ట గలిగినచో చిన్నా చితుకను కూడ నాతడు కూడబెట్టుచుండెను. దక్షిణ కారొలినాయందలి వరిచేలలో పనిచేయుటకు కూలివాండ్రువలయునని ఎవరో చెప్పగా న్యూయార్కునుండి అచటకు కూలివాండ్రను పంపు ఏజెంటువద్దకుపోయి మాటలాడి అందుచేరెను. దక్షిణ కారొలినా పరిస్థితులెట్టివో ఆతనికి తెలియదు. రెండు రోజులు రైలుప్రయాణముచేసి అత డాప్రదేశము చేరినపుడు అది అనభూమియగుట తెలిసికొని ఆతడు పొందినదిగులు మనము సులభముగా ఊహించుకొనవచ్చును. కాని ఆతడు పుయిలోడలేదు. పనిదొరికినది;

కంటి చూపు

మెలకువనుఁబరుండి మిలుకు, మిలుకుచూచు
కనుమూడిచి మదినెంచి తఱిగవిసి చూచు
ఓష్ఠము మునుపంటఁగొరకి దూరజూచు
పైట నవరించి సిగ్గులఁ జాటిచూచు
సందుగొందులఁడాగి కఱనన్నఁ జూచు
ఎదురయినఁ జూచు వెనువెంట బెదరిచూచు
ప్రక్కను నిలచి క్రీగంటఁ బలుచఁజూచు
తొలగిపోవుచు నొకసారి తొంగిచూచు
తరలిపోవుచు భ్రమదోడఁ దిరిగిచూచు
విడచిపోలేక నావంక వెఱ్ఱిఁజూచు
కంటదడివెట్ట హృదయంబుఁ గలచిచూచు
వెఱ్ఱిచూపుల నిన్నట్లు విడచి నిలతు.

—మిత్తింటి నరసింహమూర్తి, బి.యల్.

నిసపైవలీతము వచ్చుచున్నది. అగుటచే నాత డచటి భరింపరాని వేడిని భరించెను; అచటి వాతావరణమునందలి వ్యతిక్రమములకు ఓర్చెను. కాటుతో జ్వరమును ప్రసాదించిపోవుదు రాత్రింబవళ్ళు వీరవిహారములుసల్పు అచటి దోమలతో సరిపెట్టుకొనెను. వారమునకు ఆరురోజులు పని; అయినను విశేషముగా మిగుల్చుకొనుటకు పెద్ద జీతముకాదు. మూడేండ్లు కాలక్షేపము చేసెను. ఈ దినములలో అతని ఆరోగ్యము పూర్తిగా చెడెను. అచటి డాక్టరు అతని యజమానులతో కొద్దిదినములలో లిప్టన్ శవమునుచూచుట వారి కోరికయేని అతని నింకను పనిలో ఉండనీయవచ్చునని చెప్పెను. అందుమీద యజమానులాతనిని పనినుండి తొలగించిరి. తిరిగి యూతడు న్యూయార్కు చేరుకొనెను. జీవముగల అస్థిపంజరమనిమాత్రము చెప్పవచ్చు స్థితిలోనున్న అతని కిప్పటివయస్సు పందొమ్మిదివత్సరములు. జేబులో కొద్ది డాలరునాణెములుమాత్రము గలగల లాడుచుండెను.

కారోలినా అవస్థలలో నాత డారోగ్యము చెడుచుకొనినను విశేషమైన లోకానుభవమును సంపాదించుకొనెను. మానవప్రకృతిని బాగుగా ఆకళించెను. ఇతరులకై శ్రమపడుటకంటె తనకై కష్టపడుట జయశిఖరమందుటకు మార్గమని అతడు గ్రహించెను. గృహమునుండి ఆకలిచిచ్చును తొలగించు ప్రయత్నమున వాడి వత్తలగుచుండు తనతల్లి ముఖమండలము అతనికి పొడగట్టెను. తోడనే యాతడు గ్లాస్గోకు పయనమునకట్టెను. చెమటోడ్చి కూడబెట్టిన నూరుడాలర్లధనము; తనపై నిరంతరము ప్రేమనువర్షించు తనతల్లి ఉపయోగమునకై ఒక ఊగెడు పడకకుర్చీ, ఆమె రొట్టెలు చేసికొనుటకై ఒక బస్తాడుపిండి. వీనితో అతడు ఓడ నెక్కెను.

ప్రయాణావసరమున సముద్రపుగాలి అతనికి మంచి పనిచేసెను. తిరిగి అతడు వెనుకటి ఆరోగ్యమును పొందెను. శక్తి, ఉత్సాహములతో ఉత్తరంగితుడగుచు నాతడు మూడేండ్లకు తిరిగి మాతృవదనమును గాంచెను. తాను గ్లాస్గోలో దుకాణము పెట్టదలచితిననియు, అందుకుగాను నూరుపౌనులు అప్పీయవలసినదనియు నాతడు బంధువుల నడిగెను. అతడు - చూడవచ్చిన - పందొమ్మిదివత్సరములవాడు. బంధువులన్నరో ఏమంత ధనికులుగారు. అయినను అతనిశక్తియందుగల నమ్మకముచే వారు అతడు కోరినధనమును ఎట్లో కష్టపడి తెచ్చియిచ్చిరి.

ఆధనముతో నాతడు గ్లాస్గోయందలి స్టాబ్ క్రాసు వీథియందు ఒక చిన్న తేయాకు దుకాణమును తెఱచెను. దానిని అందముగాను శుభ్రముగాను ఉంచెను. 'చూచుటకు దుకాణము ఆకర్షణీయముగనుంచుట వ్యాపారాభివృద్ధికి పునాది' అని అతడు తలచుచు అనుచుండువాడు. 'దుకాణములోనికి వస్తువులుకొనుటకు వచ్చు ఖాతాదారులవిషయమున మనముచూపు గౌరవాదరములమీదగూడ వ్యాపారాభివృద్ధి చాలవఱకు ఆధారపడియుండు'నని అతడు చెప్పుచుండువాడు. తన దుకాణమున కాతడు లిప్టన్ మార్కెట్టు అని పేరిడెను. అమ్మెడువస్తువులు: తేయాకు, కాఫీవిత్తులు, ఉప్పువేసి పొగలోకట్టిన పందిమాంసము (బేకన్) మొదలగు పలు సరుకులు.

దుకాణములో అతడుగాక ఇక పనివారెవరో? ఒక పిల్లవాడును, ఒక నల్లపిల్లియు. దుకాణము పెట్టిన క్రొత్తలో రాత్రులయందు అతడు దుకాణమునకు వెనుకను నిద్రించువాడు. ప్రకటించి వ్యాపారాభివృద్ధి చేయుటయందు అతనికి గొప్ప నమ్మకముండెను. హాస్యవర్ధకముగా ప్రకటించుటయందు అతనికి ఇష్టముమెండు. అట్టి ప్రకటనలు జనులదృష్టిని విశేషముగ ఆకర్షించుట లిప్టను అనుభవము. వ్యాపారము ప్రారంభించిన క్రొత్తలో లిప్టన్ వార్తాపత్రికలలో ప్రకటనలు చేయజాలకుండెను. కావున నాతడు కరపత్రముల నచ్చువేయించి స్వయముగా రోడ్లమీద వచ్చుచుపోవుచుండు జనులకు పంచిపెట్టెడివాడు. ఆ దినములలో అన్ని పనులు అతడే చేసికొనువాడు. ఇతరులనుపెట్టి పని చేయించుకొనుపాటిస్థితి ఇంకను అతనికి కలుగలేదు. కాని అచిరకాలముననే అతడు వార్తాపత్రికలయందు ప్రకటింపదొరకొనెను. వార్తాపత్రికలో అతని మొదటి ప్రకటనకు ఏడుషిల్లింగుల ఆరుపెన్నీలు చార్జీ అయినదనియు, తాను క్రొత్తగా కొని అమ్మజూపిన 'ఉప్పు

చేసి వ్రేలాకట్టిన పందిమాంసము' మొదలగువాని శ్రేష్ఠత్వమును అది వర్ణించినదనియు అతనికి బాగుగా జ్ఞాపకముండెను.

తన దుకాణపు ప్రదర్శన గవాక్షము నందు తా నమ్మెడు వస్తువులనుగూర్చిన హాస్యరసాత్మకములగు కార్టూనులను ప్రకటించుట కాతడు ఆ తొలిదినములలో పూనుకొనెను. అతని ప్రకటనరీతులు కొన్ని ముచ్చటగానుండును. దుకాణములో అతడు రెండు అద్దములనుంచెను. ఒకదానియందు బక్క-చిక్కిన ఆహారపుష్టిలేని మానవచిత్రము ప్రతిబింబించు చుండెను. రెండవదానియందు ఆహారపుష్టిగల లెస్సగా బలసిన విగ్రహము ప్రతిబింబించుచుండెను. చిక్కిన విగ్రహము లిప్టనుషాపులోనికి పోవుచుండినట్లును, బలసిన విగ్రహము షాపునుండి బయటకు వచ్చుచుండినట్లును ప్రదర్శింపబడెను.

అతని ప్రకటనరీతులలో విచిత్రమైనది మఱియొకటి. చమురుగ్రక్కునట్లు కొవ్వుపట్టి బలిసిన రెండు పందుల పైన—మన దేశపు గంగెద్దుమీదనువలె—గుడ్డలువైచి ఆగుడ్డలమీద 'లిప్టన్‌గారి అనాథశిశువులు' అను అర్థమువచ్చు పదములువ్రాసి, ఆపందుల మెడలలో గులాబిరంగు రిబ్బనులు వ్రేలాడవైచి గ్లాస్గోయందలి జనాకీర్ణములగు వీథులవెంబడిని పాటలవర్ణపు దుస్తులు తొడిగిన ఇద్దఱు ఐరిష్ దేశీయులచే త్రిప్పించువాడు. గుఱ్ఱుగుఱ్ఱుమనుచు, కీచుకీచు మనుచు ఆపందులు వీథులవెంబడిని తిరుగాడుచుండగా గ్లాస్గో ప్రజలు విరగపడి చూచువారు. ఒక్కొక్కప్పుడు ఈపందుల నడుమ మూడవమనిషి ఒకడుండువాడు. అతని చేతిలో ఒక జెండా. ఆజెండాపై 'మేము లిప్టన్‌మార్కెట్టునకు బోవుచున్నాము. మీరుకూడ రండు' అను వాక్యములుండునవి. జనులు కూడవచ్చువారు. ఎల్లవేళల లిప్టన్ దుకాణము ఖాతాదారులతో నెట్టుకొని యుండునది.

ఈక్రొత్తమాదిరి ప్రకటనలతీరు లిప్టన్ అమెరికా నుండి గ్రహించినది. కాని ఈక్రొత్త ప్రకటనలను గ్లాస్గో ప్రజలలో కొందఱు ఈసడింపక పోలేదు. అయిననేమి? ప్రజాదృష్టి నాకర్షింపవలయునను లిప్టన్ వాంఛ పూర్తిగ నెఱవేరెను. ఒకనాడు లిప్టన్‌పందులలో నొకటి ట్రాముకైనను అడ్డముగాపడెను. ట్రాము ఆగిపోయెను. పంది ఓపట్టున ఇవతలకురాలేదు. చుట్టును జనులు మూగిరి, ఈవిషయము వార్తాపత్రికలకు ఎక్కెను. లిప్టన్ దుకాణమునకు కావలసినంత ప్రచారము కలిగెను. వ్యాపార మభివృద్ధి చెందెను. దుకాణము ఆరంభించుటకు తాను గొనివచ్చిన నూరు పౌనుల అప్పును తీర్చివైచెను; గ్లాస్గో పట్టణమందలి పెద్ద వీథిలో పెద్దదుకాణ మొకటి స్థాపించెను.

“వ్యాపారనిర్వహణమున నా ఆదర్శములు రెండు. ఒకటి కొనుటగాని, అమ్ముటగాని రొక్కపుపూర్వకముగానే చేయుట—కొనుటలోగాని, అమ్ముటలోగాని మధ్యస్థునిపై ఆధారపడకుండుట. మధ్యస్థునిపై ఆధారపడకుండుటకై ఐర్లాండుదేశమున నాకొఱకు వెన్న, గ్రుడ్లు మొదలైనవి కొనుటకు ఏజెంటును నియమించితిని. ఒకసారి ఈ యేజెంటు నన్ను విషమస్థితిలో బెట్టెను. నాస్థితికిమించి సరుకును కొనుగోలుచేసెను. బిల్లువచ్చునరికి ఇచ్చుటకు నాకడ డబ్బులేకుండెను. అప్పటి నా ఆస్తిలో విలువయైనది ఒక వెండిగడియారము మాత్రముండెను. దానిని గొనిపోయి తాకట్టుపెట్టితిని. ముప్పది షిల్లింగులు వచ్చెను. ఒడంబడిక నిలుపుకొనుటకు ఆ సొమ్ము బొటాబొటీగా సరిపోయెను. అయితే అచిరకాలములోనే నేనా గడియారమును విడిపించుకొనగలిగితిని.” అని లిప్టన్ అప్పటి తన పరిస్థితులనుగూర్చి ఒకసారి చెప్పెను.

గళ్ళాపెట్టెదగ్గర కూర్చుండి పనిచేయుటకు అతడు చాల యిష్టపడువాడు. తన ఖాతాదారుల విషయములను బాగుగా తెలిసికొని వారివారి జన్మస్థలములను దర్యాప్తుచేసి వారివారి ప్రాంతీయభాషామర్యాదలతో స్కాటిష్‌భాషలోగాని, ఐరిష్‌భాషలోగాని ముచ్చటించువాడు. ఆ తొలిదినములలో లిప్టన్‌కు తన ఖాతాదారులతో—సాధారణముగ దుకాణదారునకు అతని ఖాతాదారులకును ఉండని — సన్నిహితపరిచయముండెను. ప్రతిఖాతాదారుడు లిప్టన్ ఉపయోగించు భాషనుబట్టి తన ప్రాంతములనుండి అతడు వచ్చినట్లు తలంచు

చుండెను. నిరపాయకరమగు మోసముతో కూడిన ఈ ఉపాయము లిప్టన్ జయమున కెంతయో కారణమయ్యెను.

కష్టపడి పనిచేయుటచేతను, సరసమైన ధరలకు విక్రయించుటచేతను అతని వ్యాపారము దినదినాభివృద్ధిగాంచెను. ఒక్క సంవత్సరములో అతడు తన రెండు షాపులలోను సరకులమ్ముటకు చెరియొక పనివానిని బెట్టి తన పూర్తికాలమును ప్రకటనలకై వినియోగింపగలిగెను. యువకుడు లిప్టన్ తనపథమును తొలుతనే నిర్ణయించుకొనెను. సాధారణమైన జయముతో నాతడు తృప్తిపడదలచియుండలేదు. లోకమునందలి వణిక్పుంగవులలో తానొకడు కావలయునని అతని సంకల్పము. పలువత్సరములు అహర్నిశలు కష్టపడి అతడు సంకల్పసిద్ధుడాయెను. గ్లాస్గోలో ప్రథమమున పెట్టిన అతని చిన్నిదుకాణము తరువాత వెలసిన పలుదుకాణములకు మాతృకయయ్యెను. పలుతావులయందలి లిప్టన్ దుకాణములలో అమ్మబడు పలురకముల సరకులను తయారుచేయుటకు లిప్టన్ ఫ్యాక్టరీలు నిర్మించెను; సింహళద్వీపమున తేయాకుతోటలు కొనెను; ఇంగ్లండు దేశమున పండ్లతోటలు విలిచెను. రోడ్లమీద లిప్టన్ మోటారువాన్లు; పలుతకముల ఆహారపదార్థములతో పకిచెక్కుపూనైన లిప్టన్ ఓడలు సముద్రముమీద. లిప్టన్ దుకాణములకు కావలసిన పందిమాంసమును ఐర్లండు దేశమంతయు కలసి సరఫరా చేయజాలకపోయెను; అమెరికాదేశమునుండికూడ విశేషముగ పందిమాంసము లిప్టన్ మార్కెట్టునకు సప్లయి అగుచుండెను. అమెరికాదేశమున చికాగోనగరమునందు లిప్టన్ నిర్మించిన పందిమాంసపు ఫ్యాక్టరీయందు మాంసము తయారుచేయుటకై ఒక్కనాడు మూడువేలపందులు చంపబడెననుటచే అతని వ్యాపారవిస్తృతిని సరిపోల్చుకొనవచ్చును. అమెరికాదేశపు రైల్వేలయందు అతనికి పెక్కుసుద్దుబండ్లుండెను. అతని తేయాకు పాకెటిపెట్టెలపైనుండు సీసపుసీళ్ళు తొలగింపబడినపిమ్మట అమ్ముట వలన ఏటేట ఐదువేలపౌనుల ఆదాయమువచ్చుచుండెననుటచే లిప్టన్ వ్యాపారపరిమితిని సులభముగ నూహించుకొనవచ్చును. లిప్టన్ మార్కెట్టుకుచేర్చి స్వకీయమైన ముద్రణాలయము, సబ్బుల కర్మాగారము, కాగితముల మిల్లు, సీసాలకు తయారుచేయు కార్ఖానా యుండెను. మొదటి షాపుపెట్టిన పదునొకండువత్సరములకు అనగా లిప్టన్ కు ముప్పదియేండ్లువచ్చునరికి అతడు కోటీశ్వరుడయ్యెను.

కోటీశ్వరుడనైతినని అతడు గర్వపడలేదు. చిన్ననాటి తనపేదతనమునుగూర్చి ముచ్చటించుట చిన్నతనముగ నాతడెన్నడును తలంపలేదు. 1897-వ సంవత్సరమున విక్టోరియామహారాణిగారి డైమండు జూబిలీ మహోత్సవసందర్భమున నాతడు లండన్ పట్టణములోని బీదలకు అన్నదానమునకై ఇరువదియైదువేలపౌనులు ధర్మముచేసెను. హిందూదేశములో మహామారివ్యాపించినపుడు వ్యాధిగ్రస్తుల సహాయార్థమై యాతడిట్టిగొప్ప మొత్తమునే యిచ్చియుండెను. స్పెయిను అమెరికాదేశములకు జరిగిన యుద్ధసమయమున నాతడు అమెరికను రెడ్ క్రాసుసొసైటీవారికి గొప్ప ధనసహాయము చేసెను. 1898-వ సంవత్సరమున విక్టోరియామహారాజ్ఞి ఆయనకు 'సర్' బిరుదమిచ్చెను; 1902-వ సంవత్సరమున అతనికి బారనెట్టుహోదా ఈయబడెను. ఒకప్పుడు కూటికిపేదగానుండిన అతడిప్పుడు మేటిధనవంతుడై రారాజులతో మైత్రిగలిగి విఖ్యాతచరిత్రుడాయెను.

తన్ను పెంచి పెద్దవానినిగాచేసిన తల్లిదండ్రులను గూర్చి అతడెల్లవేళలగర్వపడువాడు. తనతల్లి గృహమును దాయీలసంఘమునకు ఇచ్చివేయుచు నాతడు 'నా కీ ప్రపంచమున ఒక్కషిల్లింగుకూడ మిగులకపోయినను ఈ యింటిని విడనాడుటకు నేను అంగీకరింపను' అని చెప్పెను. తన తల్లిదండ్రుల ఛాయాపటములు వెంటలేనిది అతడు కాలు బయలుపెట్టువాడు కాడు. తనతల్లి ఉపయోగించిన బైబిలు అతడు రాత్రులయందు తనప్రక్కమీదపెట్టుకొనిగాని నిద్రించువాడు కాడు. బాల్యమున తనతల్లికి చేసిన వాగ్దానము నాతడు నెఱవేర్చుకొన గలిగెను. ఉండుటకు దివ్యభవనమును, కట్టుటకు పట్టుబట్టలను, షికారువెడలుటకు బండిని, ఆజ్ఞలు నెరవేర్చుటకు సేవకులనుఇచ్చి తల్లికి అతడు అనంతసంతోషము గూర్చెను. దుకాణము పెట్టినక్రొ

త్తలో లిప్టన్‌కు తల్లి ఉపదేశగురాలు. ఆమె ఆనతినందనిది అత డేమియుచేయువాడుకాడు. ఆమె వాక్కు ఆతనికి వేదవాక్కు. సర్ థోమస్ లిప్టన్ భోజనశాలయందు ప్రవేశించుటతోడనే ప్రథమమున కనుపించునవి, లెస్సగా చిత్రితములైన అతని తలిదండ్రుల విగ్రహములు. జీవితమున తన కింతటి ఔన్నత్యమును గూర్చిన తల్లి సాహచర్యమును మరణానంతరమునగూడ నాతడు విడువలేదు. తనతలిదండ్రులను పాతిపెట్టిన మాళిగయందే తన శవమునుగూడ పాతిపెట్టవలసినదిగా నాత డాజ్ఞాపించెను. అతని జీవితమున శక్తి, ఉత్సాహములను గల్గించినది అతనితల్లి.

లిప్టన్ కాలము వృథబుచ్చి యెఱుగడు. ఎనుబది వత్సరముల వృద్ధుడైనపుడుగూడ బ్రహ్మాండమంతటి తన వ్యాపారమును తన ఒడ్డిలోనే ఉంచుకొని కార్యనిర్వాహ మొనర్చుచుండువాడు. అతనివదన మెల్లవేళల మందహాసాంచితమై యుండునది. ఆ మందహాసము జనవశీకరణసమర్థమైయుండెను. అతని నీలికన్నుల మనోహర చలనము, అతని హాస్యప్రియత్వము తుదివఱకుండెను. తుదివఱకు అతడు ఆడంబరరహితుడైయుండెను. సాధారణమైనవి, శుచియైనవి అగు వస్తువులనే అతడు ప్రేమించెను. సముద్రతరంగస్పర్శ, సూర్యాతపప్రసారము, మలయమారుతసేవనము చిన్ననాటివలెనే పెద్దవాడుగూడ నాతడు ప్రేమించెను. కలిగిన జయముచే నాతడు చెడిపోలేదు. వ్యాపారపు తొలిదినములనాటి తనకష్టములు, గ్లాస్గోవీధులలో తిరిగిన ఆనాటి తనపందులు, తన క్షేమాభివృద్ధులకు కారణభూతురాలైన మాతృదేవి వీనినిగూర్చి అతడు తఱచు చెప్పుటకు ముచ్చటపడువాడు.

వివాహవిషయమునమాత్రము లిప్టన్ సంకల్పసిద్ధుడు కాలేకపోయెను. వ్యాపారము క్రమాభివృద్ధినందుచున్న దినములలో నాతని కొకపడుచుతో పరిచయము కలిగెను. వివాహము, గృహము, సంతానము—ఈ వాంఛలతో అతడు వ్యాపారాభివృద్ధివిషయమై మఱింత శ్రద్ధవహించెను. కాని అతడు వివాహమాడ దలచిన పడుచు మద్యపానదురభ్యాసమునకులోనై లిప్టన్ ప్రేమను గోలుపోయెను. అంతతో అతని వివాహవాంఛయు తుదముట్టెను. ఆ జన్మము అతడు అవివాహితుడుగనే యుండిపోయెను. మద్య మిట్లు తలపెట్టిన వివాహమును తారుమారుచేయుటచేతనో, మఱి యెందుచేతనో లిప్టన్ మద్యమనిన భయపడువాడు. జీవితకాలమున అతడు మద్యమును రుచిచూచియైన ఎఱుగడు. అల్పాహారపువిందులసమయమున తోడివారు అన్యథా తలంపకుండుటకై తన పానపాత్రలో మద్యముయొక్కరంగుతో సరిపోవు ఇతరపానీయములు తెచ్చుటకుగాను సేవకులకు లంచమిచ్చువాడట. అతడు జీవితమున ఎట్టి దుబారాఖర్చును లేక పొదుపుగానుండువాడు. చుట్టగాని, సిగరెట్లుగాని కాల్చి ఎఱుగడు. ఒక్కసారి తప్ప మఱియెప్పుడును జీవితకాలమున నాతడు పందెమొడ్డియుండలేదు.

తన పనివారలయెడ నాతడు మిక్కిలి ప్రేమతో వర్తించువాడు. వివిధములైన అతని కర్మాగారములందు 'సమ్మె' అనుపదము ఒక్కసారికూడ ఉచ్చరింపబడలేదు. సంగీతము, ఉద్యానవనకృషి అతని అభిమాన విద్యలు. పది సంవత్సరముల పిన్నటనాటనుండియు నాతడు వీణావాదనమున అభినివేశమును చూపువాడు. ప్రాతఃకాలమున నిద్రలేచి తన యుద్యానవనమున విహరించుటకై తప్పక వెళ్ళుచుండువాడు. కార్యాధిక్యముచే పీడబడిన దినములలోగూడ నాతడు ఒకగంట ముందుగలేచి ఉద్యానవనపుపనులను చేయుచు స్వచ్ఛవాయువులలో సంచరించిగాని కార్యాలయమునకు పోవువాడుకాడు. దినమునకు ఏడుగంటలు నిద్రించువాడు. ఉదయమున పెందలకడనే పడకనుండి లేచువాడు. ఆజన్మము ఇట్టి నియమము అవలంబించియుండుటచేతనే అతడు జీవితాంతమువఱకు ఆరోగ్యవర్ధనుడైయుండెను.

1931-వ సంవత్సరము సెప్టెంబరు తుదివారములో నాతనికి జబ్బుచేసెను. నిద్రించుచుండగా హృదయస్పందన మాగిపోవుటచే నాతడు అక్టోబరు ౧-వ తేదీని మరణించెను. అప్పుడచట నలుగురు డాక్టరులు, పలువురుమిత్రులు ఉండిరి.

❖ గ్రంథాలయోద్యమము ❖

ప్రేక్షకులు రాని పెద్దగ్రంథాలయము

1933 నవంబరు 7-వ తేదీని శ్రీ జార్జి చక్రవర్తి బ్లూమ్సుబరీ యందలి మాలెట్ ప్లేసులోని జాతీయ కేంద్రగ్రంథాలయము వారి నూతనమందిరప్రారంభోత్సవము గావించెను. ఈ గ్రంథాలయము ప్రపంచమునందలి అసాధారణసంస్థలలో నొకటి. ఇందలి బీరువాలు పెద్దపెద్ద గ్రంథసంపుటములతో పిక్కటిల్లియున్నవి; కేటలాగు దాఖలా ఏబదిలక్షల పుస్తకములు - అయినను ఈ గ్రంథాలయమునకు ఒక్కప్రేక్షకుడు కూడ రాడు; గ్రంథాలయసేవకులను ఒక్కడు కూడ చూడడు; గ్రంథాలయము ఎక్కడున్నదో కూడ పలువురకు తెలియదు. ఈ గ్రంథాలయమునుండి పుస్తకములు కొనిపోవుట అంతయు తపాలుద్వారానే జరుపబడును. బ్రిటీషుదీవులయందంతటను వెదజల్లబడియున్న చందాదారులకు పార్సెలుల ద్వారా దినదినము పలుసంపుటములు పంపబడుచుండును. ప్రారంభోత్సవము జరుపుచు ఈ గ్రంథాలయమును చక్రవర్తి జాతీయ విశ్వవిద్యాలయమని పేర్కొనియున్నాడు. ఇది ఉచితగ్రంథభాండాగారము. కార్నెజి ట్రస్టువారీగ్రంథాలయమునకు ఈ నూతన మందిరము నిర్మించియిచ్చిరి. బ్రిటీషు దీవులయందలి ప్రతివ్యక్తియు తనకు అందుబాటులోనున్న పుస్తకభాండాగారము ద్వారా ఇందుండి తన కేవిషయమును గూర్చిన పుస్తకము కావలసినను పొందవచ్చును. స్థానికగ్రంథాలయమున వలసిన పుస్తకము లేనిచో ఆపుస్తకమునకై ఈ కేంద్రగ్రంథాలయమునకు వ్రాయబడును. ఇచట స్టాకులో ఆ పుస్తకము లేనిచో 'సారస్వత పరిశోధక శాఖద్వారా దరియాప్తు చేయబడి అది తెప్పింపబడును. ఈ కేంద్రగ్రంథాలయమునంటియున్న 'సారస్వతపరిశోధకశాఖ' బ్రిటీషు దీవులయందలి నూటముప్పది పెద్ద పెద్ద గ్రంథాలయములతో సంబంధము కలిగియున్నది; దాని అందుబాటున ఏబది లక్షల గ్రంథసంపుటములు గలవు. కేంద్రగ్రంథాలయమున ఒక్కనవల కూడ లేదు. ఉన్న గ్రంథములసంఖ్య ఒకలక్ష. నూతన మందిరమున మఱి పదిలక్షల గ్రంథ సంపుటములకు తావుగలదు. కల్నల్ లక్సు మూర్ న్యూకొంబ్ గ్రంథాలయపు ప్రధాన కార్యనిర్వాహకుడును, పాలకుడును. దినమునకు సగటున ఈ గ్రంథాలయమునకు రిఫరెన్సు పుస్తకములకై నాలుగువందల దరఖాస్తులు వచ్చుచుండును. 1932-వ సంవత్సరమున దరఖాస్తుదారులకు 61,630 పుస్తకములు పంపబడెను; అసంఖ్యాకములగు విజ్ఞప్తులకు సమాధానము లీయబడెను. కైకొనబడిన పుస్తకములలో పెక్కు అమూల్యములైనవి. పుస్తకములు పోయిన కేసులు బొత్తిగా లేవని చెప్పవచ్చును. తాను పుస్తకములు కొనివచ్చు భాండాగారమునకు కేంద్రగ్రంథాలయమును, ఇటనుండి గ్రంథములను కొనిపోవు గ్రంథాలయము కేంద్రగ్రంథాలయమునకును పుస్తకముల జా

శ్రత్త విషయమున బాధ్యతవహించి యుండును. ఈ కేంద్రగ్రంథాలయపు రవానాగది (డిస్పాచ్ రూమ్) చూడ ముచ్చటగనుండును. అచట పనిచేయువారందఱును పడతులు. గోధుమవర్ణపు పాకింగు కాగితములు నిలువు ఎత్తున; పెద్ద పెద్ద దారపు ఉండలు. ఆపడతుల కోమలహస్తములు దినమంతయు పార్సెళ్ళుకట్టుటతో కాయలు కాయుచుండును. ఈ పార్సెళ్ళ పంపుటకు అగు తపాలవ్యయము విశేషమైనదే. కాని దానినంతను గ్రంథగ్రాహకులే భరింతురు. పరిశోధకశాఖ, రవానాశాఖ గాక ఈ కేంద్రగ్రంథాలయమున రిఫరెన్సుశాఖ యొకటి గలదు. ఈశాఖయందు సామ్రాజ్యమునందున్న అన్ని గ్రంథముల కేటలాగు తయారుచేసి యుంచబడుచున్నది. దినదినమును ఈ కేటలాగు పెరుగుచునే యుండును. ఈకేంద్రగ్రంథభాండాగారము 1916 లో విద్యార్థుల కేంద్రగ్రంథాలయముగా స్థాపింపబడినది. అప్పుడది రెండు చిన్నగదులలో పట్టజాలియుండెను. డాక్టరు ఆర్బర్టు మాన్సు బ్రిడ్జి దీనిస్థాపకుడు. కార్నెజిఫండువారిచ్చుచువచ్చిన విరాళములసాయమున ఇది బాగుగా అభివృద్ధి నందెను. 1927 లో పబ్లికులైబ్రెరీకమిటీవారు దేశమునందలి గ్రంథాలయముల నన్నిటిని ఏకసంస్థ యాజమాన్యముక్రిందకు గొనిరా తీర్మానించిరి. ఏటేట కార్నెజిట్రస్టువారు నాలుగువేల పౌనులను, ప్రభుత్వమువారు మూడువేల పౌనులను ఈ గ్రంథాలయమునకు గ్రాంటు నిత్తురు. ఉదారులగు ధనవంతులు కూడ విశేషముగ విరాళము లిచ్చి ఈ గ్రంథాలయమును పోషించుచుందురు. (హిందు)

—ఎడ్యుకేషనల్ అండ్ లిటరరీ సప్లిమెంటు.

గ్రంథాలయాధికారి

గ్రంథాలయానికి ముఖ్యమైన అంగాలు మూడు. అందు లైబ్రేరియన్ ప్రథముడు. కొందరు కేవల గ్రంథ, ధన సంపాదనతో గ్రంథాలయస్థాపన పూర్తియైనదని తలంతురు. కాని యదార్థంగా కొంతమంది అభిమానులు కొన్నిరోజులు కష్టించి కొన్ని పుస్తకాలు, కొంతడబ్బు సంపాదించగలరు గాని ఆ పుస్తకములను సద్వినియోగపఱచి సరియైన ఫలితమును పొందజేయుగల స్వచ్ఛందసేవకుడు కావాలంటే సామాన్యమైన విషయంకాదు. లైబ్రేరియన్ అంటే అచ్చంగా పుస్తకాలు ఇచ్చి పుచ్చుకొనేవాడు అనుటతో పూర్తికాదు ఆపదంయొక్క అర్థం. అతను దేశాభిమానంతో, భాషాభిమానంతో, స్వార్థవిరహితంగా, పరులక్షేమాభిలాషతో పనిచేయవలసి ఉంటుంది. సహనగుణముయొక్క విలువను బాగుగా గ్రహించి ఉండాలి. పాఠకుల నాకర్షించగల తేజస్సు కలిగియుండాలి వదనంలో. తేనెలొలుకు పలుకులతో సగౌరవంగా తనయం దభిమానంగలవారినిగా చేసుకోవాలి పాఠకుల్ని. లైబ్రేరియన్ కుండవలసిన లక్షణాలలో ఇవిగాక గ్రంథపఠనం ముఖ్యమైన విషయం. గ్రంథాలయంలో ఉన్న ప్రతి పుస్తకంలోని యావద్విషయాన్ని గ్రహించి ఉండాలతను. పాఠకుడు ఒక పుస్తకాన్నడిగితే ఆపుస్తకం లేదనో చిరిగిందనో సమాధానంచెప్పి పాఠకుల్ని నిరుత్సాహ పర్చక, అదేవిషయం గలిగిన మరో పుస్తకం పేరుచెప్పి ఆపుస్తకాన్ని చదివించాలి పాఠకుడిచేత. గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచాలతను.

—చావలి కోటీశ్వరరావు.

మణిమాల

జార్జిచక్రవర్తిగారి జమాఖర్చులు

"దేశీయాదాయమునుండి జార్జిచక్రవర్తిగారికి సివిల్ లిస్టు క్రింద 420,000 పౌనులు ఏడాదికీయబడును. 1931 కి పూర్వము ఇంతకంటె 50,000 పౌనులు హెచ్చు ఈయబడుచుండెను. ఆ సంవత్సరమున ఆర్థిక మాంద్యము సంభవించి చక్రవర్తిగారే సదరు మొత్తమును విడనాడుటకు తీర్మానించుకొనిరి. 420,000 పౌనులు పెద్ద మొత్తముగానే కనిపించును. కాని రాజుగారి ఖర్చులకు ఈ మొత్తమెంతమాత్రమును చాలదు. లాంకాస్టరు డచ్చీనుండి రాజుగారికి స్వంతముగా 60,000 పౌనులు రాబడిగలదు. దీనివలననే వారు తమ జమాఖర్చులను సరిపెట్టుకొనగలుగుచున్నారు. రాజుగారి నివాసమందిరములగు బక్కింగుహామ్ పేలెస్‌నందును, శాండ్రింగుహామ్‌నందును మితవ్యయ విధానము నెలకొనియున్నది. రాజగృహమునందలి ఉద్యోగుల జీతబత్తెములఖర్చు ఏడాదికి 130,000 పౌనులు; రాజగృహవ్యయములు ఏడాదికి 200,000 పౌనులు. రాజగృహవ్యయములలో ఆహారము, దీపములు మొదలగునవి హెచ్చుసొమ్మును కబళించుచున్నవి. పశుశాలల పరిరక్షణము, మోటారులజాగ్రత్త, విండర్సువిహారోద్యానవనమువంటి ఉద్యానవనముల కృషి ఇవికూడ హెచ్చుమొత్తముల ఖర్చుకు కారణము అగుచున్నవి. స్పెషలుట్రెయినులలో ప్రయాణము చేయునపుడు రాజుగారు రైలుకంపెనీకి పూర్తి చార్జి నీయవలసియుందురు. వివిధములైన రాజగృహముల మరమ్మతులు, ఇన్సూరెన్సుప్రీమియములు వీనివలన సాలుకు సుమారు 20,000 పౌనుల ఖర్చు, రాజుగారి గుప్తదానములకు ఏటేట 100,000 పౌనులు ప్రత్యేకింపబడును. రాజగృహమునందలి ఉద్యోగములకు విశ్రాంతివేతనములుగలవు. ఒకేకాన్పున ముగ్గురుబిడ్డలను కను తల్లులకిచ్చు విరాళములు మొదలైనవిగలవు. చక్రవర్తిగారివలన ఏటేట ఎలవెన్సులు తీసికొనిజీవించు కందారాజులు దాదాపు రెండువందలమందిగలరు."

—స్టార్ ఆఫ్ ట్రైడన్.

* * *

ముస్సోలినీగారికి ముసలితనమనిన గిట్టదు

"ఇటలీదేశపు నిరంకుశాధికారి ముస్సోలినీకి డాబు దర్పము హెచ్చు. తన జన్మదినమునే అతడు ద్వేషించును. తాను వృద్ధుడగుచుండుటను జ్ఞప్తికి తెచ్చునగావున తనజన్మదినముల నాతడు ద్వేషించును. ఒకప్పుడు యౌవనమే అతని వ్యాపారమైయుండెను. ఆవ్యాపారము సడలిపోవుట ఇపు డాతనికి సరిపడుటలేదు. వృద్ధుడుగా నాతనిని పేర్కొనుటకు ఇటలీదేశపు వార్తాపత్రికలకు హక్కులేదు. వయస్సునుగూర్చి నిర్ధరింపవలసివచ్చినపుడు అతడు 'ముసలివాడనగుటకు నాకు తీరికలేదు' అని చెప్పును. ముసలివాడగుటకు తనకు తీరికలేదని అతడు చెప్పును గాక - అతనితల బట్టకట్టుచున్నది; అతనికణతలమీదివెంట్రుకలు నెరయుచున్నవి. ప్రాయశః, అతడు వృద్ధుడగువఱకును జీవించియుండడేమో! ఏమన అతడు దినమునకు పదిగంటలు పనిచేయును. వేసవిలో నదులయందు ఈదును; సాధారణముగ అడ్డుకడ్డకలు దాటుచు అతడు గుఱ్ఱపుసవారిచేయును; మోటారు సైకిలుపై నెక్కి వాహ్యాళిపెడలును; తనకారులను ఎల్లవేళల అతివేగముగ పోనిచ్చును. అమెరికను అధ్యక్షుడు రూజువెల్టు అంతతిరోడను అంతర్యమున మెలగునని అమెరికనుపత్రికలు చెప్పుచున్నవి. ముస్సోలినీ విషయము అట్లుగాదు. ముస్సోలినీకి అంతరంగిక మిత్రులు లేరు. అతడెవరిని విశ్వసింపడని చెప్పబడుచున్నది. సొసైటీలో అతడు కలసిమెలసియుండడు, ప్రతిదినము అతనిని దర్శించువారుకూడ అతనితో ముక్తసరిగనే ముచ్చటింపవలసియుందురు."

—డెయిలీ ఎక్స్‌ప్రెస్.

* * *

బడితోటలు

ఉదకమండలమునందలి గవర్నమెంటు బొటానిక్ గార్డెన్సు క్యూరేటరు ఎఫ్. హెచ్. బుచ్చర్ గారు ఇట్లు వ్రాయుచున్నారు: "జీవనాధారములకు ప్రధానముగా వ్యవసాయముపై ఆధారపడియుండు ఈ హిందూదేశమున ఉద్యానవనకృషివిషయమై చూపబడవలసినంతశ్రద్ధ చూపబడుటలేదని చెప్పవచ్చును. హిందూదేశమున పలువురివృత్తి వ్యవసాయమే. కాగా ఉద్యానవనకృషివిషయమున ఈ ఉదాసీనతయేమి? దారిచూపి చూపువారు విశేషముగ లేకపోవుటయే ఈ ఉదాసీనతకు కారణమని నానమ్మకము. ఈ ఉదాసీనతనుబాపి ఉద్యానవనకృషివిషయమున ఉత్సాహమును కలిగించుటకు మనము ప్రాథమికపాఠశాలల నాశ్రయింపవలయును. బడితోటలవిషయమై ఇపుడిపుడు కొంతశ్రద్ధ చూపబడుచున్నందులకు ఆనందింపవలసినదే. గ్రామసీమలయందలి పిల్లలకు పిన్నటనాటనే ఈ బడితోటలమూలమున తోటపనులయందు అనుభవమును, అభినివేశమును కలిగించుచో పెద్దతనమునవారు మంచికర్షకులు కాగలరు. తోటపనులయందు పిల్లలకు కలిగించు అనుభవమును, అభినివేశమును ప్రకృతిపరిశీలనతో మేళవింపు నొందింపబడునేని మంచి కార్యకారిగానుండును. తమ బడులలోని ఈ చిన్ని తోటలను చూచి పిల్లలు తమయింటి ఆవరణయందును పూలమొక్కలు మొదలైనవి పెంచుటకు మొదలిడి దొడ్లను శుభ్రముచేసి వానికి క్రొత్త అందమును కలిగింతురు. అపుడపుడు పుష్పప్రదర్శనములుకూడ ఏర్పాటుచేయుచుండుట మంచిది. ఈ ప్రదర్శనములు తోటపనియందలి వారి ఉత్సాహమును ఇనుమడించును. తోటపని అతిప్రాచీనమైన, ఆనందకరమైన, ఉత్తేజకరమైన పని. శ్రద్ధవహించుచో దానిని లాభకరమైనదానిగ కూడ చేయవచ్చును. కావున పాఠశాలాధికారులు తమ పాఠశాలావరణలయందు తోటలను పెంచుటయందు శ్రద్ధపెట్టుదురు గాక!"

—గార్డెనింగు రెవ్యూ.

* * *

లాభకరమైన దీర్ఘాయువు

"పలువత్సరములు ఇండియాప్రభుత్వమువారినుండి పెన్షనుసొమ్ము తీసికొనువారినిగూర్చి ఈ వరుస విచారించుచుంటిని. నిరుడు సెప్టెంబరుమాసమున మిస్ ఫ్రాన్సెస్ కారొలైన్ శేకరు మరణము పత్రికలలో ప్రచురింపబడినది. ఈస్టిండియాకంపెనీవారు ఆమెకు 1839-వ సంవత్సరమున పెన్షను ఈయనారంభించిరి. ఆమె 93 ఏండ్లు పెన్షనుతీసికొని తనకు 101-వ ఏట మొన్న మరణించినది. ఆమెతండ్రి మద్రాసుసేనలో సైనికుడుగ నుండి మైసూరురాష్ట్రమునందలి టుంకూరులో కలరాతగిలి 1839 నవంబరు 30-వ తేదీని చనిపోయెను. అప్పుడాతని కూతురగు కారొలైన్ శేకరుకు కంపెనీవారు పెన్షను గ్రాంటుచేసిరి. 93 సంవత్సరములు పెన్షనుతీసికొనినవారు మఱెవ్వరును లేరని చెప్పవచ్చును. కాలముచేత ఇది అద్వితీయమైనదికాగా పుచ్చుకొనిన మొత్తముచే మఱియొకరిది అద్వితీయమగుచున్నది. పీటర్ ఆబర్ (1777-1866) అనువాడు తన పదునాఱవఏట ఇండియాహౌస్‌లో ఉద్యోగస్థుడుగా చేరి 1829 మొదలు 1836 వఱకు కార్యదర్శియై రిటైరు అయెను. ఏబదియేండ్లు పనిచేసి అతడు 1836 లో పింఛను తీసికొనెను. ఏడాదికి రెండువేలపౌనులు పెన్షను. ముప్పదిసంవత్సరములు గైకొనెను. అతనికిముట్టిన పెన్షను మొత్తము అరువదివేలపౌనులు. ఇంత పెద్దమొత్తము పెన్షనుగా గొనినవాడు మఱియొకడులేడు. సర్ హెచ్. బి. హింటర్ 29 ఏండ్లు పనిచేసినతరువాత 1868 మార్చిలో పింఛను పుచ్చుకొనెను. అతడు తన 103-వ ఏట 1916 మే మాసమున మరణించెను. నలుబది ఎనిమిది ఏండ్లు పెన్షను పుచ్చుకొనెను. ఐ. సి. యస్. ఉద్యోగులలో— హెన్రీలీవరిడ్జి 1892 లో రిటైరై 92-వ ఏట నవంబరు 1929 లో చనిపోయెను; ఆర్. డబ్ల్యు. లాడ్విక్ 1877 లో రిటైరై తన 98-వ ఏట 1929 లో మరణించెను; విలియమ్ నూక్ షా 1879 లో రిటైరై 1930 అక్టోబరు 26-వ తేదీని తన 92-వ ఏట గతించెను; డబ్ల్యు. హెచ్. హెండర్సన్ ఏబది మూడు వత్సరములు పెన్షను తీసికొని మూడుమాసములు తక్కు—

వగా నూరేండ్లుబ్రతికి 1928-వ సంవత్సరము ఫిబ్రవరి 9-వ తేదీని మరణించెను." —స్టేట్సుమెన్.

* * *

ఇవాన్ బునిన్

"ఈ సంవత్సరపు నోబెల్ వాఙ్మయ బహుమానము నందిన కవిగ్రామణి పవిత్రనామము ఇవాన్ బునిన్. ఇతడు రష్యన్ దేశీయుడు. కవి, నవలాకారుడునై ఇతడు నేటి రష్యన్ సారస్వతమును పరిపుష్టినొందించు చున్నాడు. వారొనెజ్ అను ప్రదేశమున నొక ప్రభు కుటుంబమునందు ఈతడు 1870-వ సంవత్సరము అక్టోబరు 10-వ తేదీని జననమొందెను. ఈతని మొదటి పద్యకావ్యము 1880 లో ప్రచురింపబడెను. రష్యాదేశపు సారస్వతబహుమానములలో తొలుతటిది అని చెప్పదగిన పుష్కిన్ బహుమానము ఈతని పద్యములకీయబడెను. ఆంగ్లసారస్వతమునుండి లాంగుఫెల్లో 'హియావాథా'; బైరన్ 'మాన్‌ఫ్రెడ్', 'కెయిన్'; టెనిసన్ 'లేడీగొడివా' ఈతడు రష్యన్ భాషలోనికి అనువదించెను. 1909 లో ఈతడు రష్యన్ సాహిత్య పరిషత్తుకు సభ్యుడుగా ఎన్నుకొనబడెను. బునిన్ కవితయందు భావములకంటె వర్ణనలు మనోహరములై యుండును. ప్రకృతివర్ణన, మానవస్వభావవర్ణన అతి నిశితముగా ఒనర్పబడియుండును. గద్య రచయితగా ఈత డింతకంటెను గొప్ప ప్రతిష్ఠనందియున్నాడు. చిన్న కథలు, కథలు, నవలలు ఈతడు పెక్కు రచించెను. 'విలేజ్', 'ఎ జెంటిల్ మాన్ ఫ్రమ్ శాన్ ఫ్రాంసిస్కో', 'సుఖోడల్', 'యాన్ ఈవెనింగు ఇందిస్ప్రింగు' అనునవి ఈతడు రచించిన కొన్ని కథాగ్రంథములనామములు. ఇందు మొదటి రెండు గ్రంథములును ఆంగ్లభాషలోనికి అనువాదితములై యున్నవి. ఈతనిని సారస్వతవిమర్శకులు తలంచుగా రష్యాదేశపు 'ఫ్లాబర్టు' అందురు. ఈతని వచనశైలి దోషరహితమై, మనోజ్ఞమై యుండును." —బుక్ బులెటిన్.

* * *

డాక్టరుల ఫీజులు

"ఈనడుమ నేపాళరాకుమారికి నాలుకమీది వ్రణమును చికిత్సచేయుటకు ఇండియాకుపోయిన లండను డాక్టరు పోటరుగారికి విమానపుఖర్చులకే రెండువేల పౌనులు ఈయబడెనని ప్రచురింపబడెను. పోటరుగారివంటి సుప్రసిద్ధభిషగ్వరుల విషయమునగూడ ఈ ప్రయాణపుబత్తెము హెచ్చుగనే కనిపించును. కాని చరిత్రకు తెలిసిన డాక్టరుఫీజు మొత్తములలో ఇది ఏమంత పెద్ద మొత్తముగాదు. పదునెనిమిదవ శతాబ్దిలో డాక్టరు థోమస్ డిమ్స్‌డేల్ గారికి రష్యాకు వెళ్ళి రష్యాసామ్రాజ్ఞి కేథరైన్ సెకండుకును, ఆమె కుమారునకును టీకాలువేసినందుకు పదివేలపౌనులఫీజు, ఏడాదికి అయిదువందలపౌనుల పెన్షను, ఒకచిన్న జమీందారీ ఈయబడెను. ముప్పదియేండ్లకు పూర్వము హిందూదేశమునందలి రాంపూర్ నవాబుకువచ్చిన కీళ్ళవాతము కుదిర్చినందుకు ఒక ఇంగ్లీషుసర్జనుకు పండ్రెండువేల పౌనులు ఈయబడెను. జర్మనుచక్రవర్తి ఫ్రెడరిక్‌కు వృద్ధాప్యమున పరిచర్య చేసినందుకు సర్ మోరెల్ మెకంజీ అను డాక్టరు పదమూడువేల పౌనులను బడసెను. జేగౌల్డు అనువాతడు హెలెన్ అను తన కూతురి తీవ్రరోగమును కుదిర్చిన వైద్యునకు పదునెనిమిదివేలపౌనుల చెక్కు నిచ్చెను. ధనికుడగు నొక రోగికి కుంటితనమును కుదిర్చినందులకై బ్రిస్టలునందలి డాక్టరు గేల్ (ఈతడు అంధుడు)నకు ఏబదివేల పౌనులు ఒసంగబడెను. చరిత్రకు తెలిసిన డాక్టరుల ఫీజులలో ఇదియే పెద్దమొత్తమని నిస్సంశయముగ చెప్పవచ్చును." —మాంచెస్టర్ గార్డియన్.

'ఆంధ్రభూమి' ఫిబ్రవరి సంచికలో

౧. 'పెంపుడు కుక్కలు' (వినోదవ్యాసము.)
—తాత కృష్ణమూర్తి గారు, బి.ఏ., యల్.టి.

౨. 'నూరిసిద్ధాంతము' (ఆలోచనరేపు కథావ్యాసము.)
—కొడవటిగంటి కుటుంబరావుగారు.

3. 'జాన్ డి రాక్‌ఫెల్లరు' చరిత్ర.

పుట్టుదరిద్రుడు. కిరసనాయిలు మొదలగు నూనెల వర్తకముచేసి లోకమందలి ధనికులలో రెండవస్థాన మాక్రమించుచున్నవాని విచిత్రచరిత్ర.

సంక్రాంతి

సీ. అభ్యంగింజలబునమంతయుఁ దీఱఁగా గరిసెలునిండఁగాఁ గాఁపుమొఱయు
అల్లుండ్రఁబిల్చి చేనయినంతవఱ కెట్టి మామయుఁ జల్వ సన్మానములను
పితృదేవతలకుఁ దృప్తిగను గూష్మాండదానములతోఁ బిండప్రదానములుజరగు
మఱిఁ బురోహితులకు నిరుకట్ట్యములు నిండి పోవు స్వయంపాకములు లభించు

గీ. రకరకాలపొంగళ్ల తెలుఁగుల సూర్య, నారగింపించు నియతి చెన్నారి "పొంగ"
లనెడి పేరొందె మకరసంక్రాంతికాంతి, కాంతమై భారతక్షితిం గ్రాలు మిగుల.

మ. బలి పాతాళమునందునుండియుఁ బరాస్వాధీనమై యున్న యీ
యిలనుంజూచెడి కోర్కెనాసతికినై శ్రీశుం దగన్ వేఁడి య
ట్టులయీసంక్రమణంపు నాలుగదునాళ్లు గాంచు నీభూమి నం
దులకేకా? బలిపూజ లీదినములం దోరంబుగా నొప్పెడిన్.

ఉ. ఎద్దులకాలకున్ మిగుల నింపుసొంపుతు గల్గునట్లుగన్
ముద్దుతు గొల్పురంగులను బుట్టములన్ ధరియింపఁజేసి, పె
రుద్దుల పందియాంబులికి యుల్లసనంబు భజింతురెల్ల వా
ర్వృద్ధశేఁజూపుదుర్ మకరసంక్రమణంబున దేశమంతటన్.

ఉ చెమ్మట రోాల్చి వర్షమునఁ జెందినపాటునఁ బండినట్టి ధా
న్యమ్ముల నెల్లవండి తిను నా ఫలమిచ్చిన ముఖ్యదాత కా
తమ్ములతేనికిన్ శశికిఁ దద్దయుభక్తిని నర్పనంబు ని
చ్చమ్మెయిఁ జేయువా ర్మకరసంక్రమణంబున నెల్లరీభువిన్.

శా. ఆసంక్రాంతికిఁ దొంటిరోజునను శేషాహీనుడున్ ధాత్రివా
మాసీనంబును శీర్షదక్షిణగ భాగాసీనముం జేయుటన్
వాసిన్ "భోగి" యటంచు దానికి నిలన్ నామంబు చెన్నొందె ని
ట్లాసారంబుగ నొప్పు సంక్రమణదీవ్యన్ముఖ్యతల్ మిక్కిలిన్.

సీ. భూభారభరణయుగ్భోగిభోగాభోగవిన్యాసముఖ్యతావిశ్రుతిగని
హరిభక్తమణిబలీంద్రాగమనంబున నఖిలపావనత నింపారనొంది
నూత్నధాన్యాంబరానూనభోగప్రదానప్రకారంబుల నలువునిడియు
ఎల్లచోటులు శుద్ధి నెనయుటంజేసి యారోగ్యాభివృద్ధికిఁ బ్రోదినిడుచుఁ

గీ. బాఁడిపంటల కతనులై పరఁగుపసుల, కనువువెంచెడి మేలి యభ్యసనమిడుచు
మకరసంక్రాంతి చాలన్ హిమకరసూర్య, పూజలం గడున్ భూమికిన్ బొల్పునిచ్చు.

—దోమా వేంకటస్వామి గుప్త.
(విద్వాన్, కవిభూషణ, శతావధాని).

విడ్డూరములు

౬. సంగీతముపాడు కిటికీలు.

ఉత్తర హిందూదేశమునందలి జయపూర్ మహారాజాగారికి తమ రాజధానీనగరమగు జయపూర్‌నం దొకవిలాసమందిరము గలదు. దానికి 'మారుత మందిరము' అని పేరు. ప్రపంచమునందలి విలాసమందిరములో దీనితో దొరయుపాటిది మరియొకటి లేదు. మందిరమంతయు చలువరాళ్ళతో కట్టబడినది. అది కట్టుటకు 10,000,000 పౌనులు సెలవైనవి. అందు నివసించువారికి సుఖానందములు గూర్పగల సకలసౌకర్యములు అందు గలవు. ఆమందిరమున 8,462 కిటికీలుగలవు. ప్రతి కిటికీకిని ఒక సంగీతయంత్రము కూర్చబడి యున్నది. కిటికీలనుండి గాలి వీచుచుండగా ఆయంత్రములు శ్రావ్యముగ సంగీతమును పాడుచుండును.

౬. పురుషసంపర్కము లేకుండ గర్భోత్పత్తి.

పశ్చిమవర్జీనియాకు చెందిన డాక్టర్ ఎరల్ ఇ. డడ్డింగు అనువాడు-డెబ్బదిరెండేండ్ల వయస్సుగల వృద్ధ సంస్కారి - ఇట్లు ప్రకటించెను : "ఇరువదిరెనిమిది ఏండ్ల వయస్సుగల నాభార్య కొలదికాలములో ప్రసవింపనున్నది. ఆమె ముంజేతులయందు రసాయనికి పదార్థములు (కెమికల్సు) ఇంజెక్టుచేయుట చేతనే ఆమె ఈ గర్భమును ధరించినది." కెమికలుపిల్లలను గనుటను గూర్చిన ఈ ప్రకటన శాస్త్రజ్ఞులలోను, భిషగ్వరులలోను తీవ్రమైన జిజ్ఞాస కలిగించెను.

౬. చెట్లకొమ్మలమీద రైలుబండి నడచుట.

కాలిఫోర్నియాలో నొకచోట చెట్లకొమ్మలమీద నుంచి రైలు నడచుచున్నది. ఆదేశమున సముద్రతీరమునందలి ఒక కొండలోయకు అడ్డముగా రైలుబాట నిర్మింపవలసి వచ్చెను. అచ్చట ఇనుముతో గాని, రాతితో గాని వంతెన నిర్మించుట వ్యయమూలకము కావున ఆలోయలో దట్టముగాను పొడుగుగాను ఎదిగియున్న చెట్ల ఆధారమున రైలువంతెన నిర్మించుటకు తీర్మానింపబడెను. రైలుగట్టుకు సమమైన ఎత్తులో ఆచెట్లపై కొమ్మలన్నియు కొట్టివేయబడి రైలుపట్టాలకు అడుగున ఉండు అడ్డకఱ్ఱలు ఆకొమ్మలపై అమర్చబడి రైలుపట్టాలు సాగింపబడెను. రైళ్ళు చక్కగ సాగిపోవుచున్నవి. ఈవిడ్డూరపువంతెన ఇంతవఱకు తృప్తికరముగనే పనిచేయుచున్నది.

౬. మాటలాడెడు పుస్తకము.

చికాగోనగరమునందలి విద్యాప్రదర్శనములో నొకవింతపుస్తకము ప్రదర్శింపబడినది. ఆపుస్తకము మాటలాడగలదు. ఆపుస్తకమున ఆదేశపుప్రభుత్వమువారు విద్యావ్యాప్తి ఎట్లు గావించుచున్నారో వివరింపబడినది. పుటలనుకూడ మనము త్రిప్పనవసరములేదు. పుటలోని విషయము అయినతోడనే ఆపుస్తకము దానికదియే ఆపుటను త్రిప్పివైచి రెండవపుటలోని విషయములను చెప్ప నారంభించును. వినుట యొక్కటియే మనము చేయవలసినపని. ఈపుస్తకనిర్మాణము మాటలాడెడు ఫిలుముల (టాకీల) నిర్మాణమును బోలియున్నది.


౬. చేతనెత్తురు.

నెబ్రాస్కాయందలి ఓమాహాకు చెందిన డాక్టరు జాన్. ఇ. సమ్మర్సు అనునతడు చేతనెత్తురును గూర్చి తాను గావించిన పరిశోధనలను ప్రచురింపగా శాస్త్రవేత్తలు వానిని మంచి అభిరుచితో పఠించిరి. ఈ చేతనెత్తురు డాక్టరు సమ్మర్సు స్వయముగా కనుగొనినది కాదు. ఇండో చీనాదేశీయులు అనుపూర్వికముగా నెత్తిగి ఉపయోగించుచుండునదే. ఒకజాతి మొక్కయొక్క చిన్ని మొలకల రససారమే ఈచేతనెత్తురు. డాక్టరు సమ్మర్సు ఈమొలకలనుండి పరిశుభ్రమైన రసమును దింపగలుగు విధానమును కనుగొనెను. ఈ చేతనెత్తురు ఇంజెక్టుచేయుటచే అపాయస్థితిలో నున్న పలువురి ప్రాణములు పరిరక్షింపబడియుండుటను అతను నిదర్శనపూర్వకముగా నిరూపించి యున్నాడు.

శిరోరేఖ

ఉత్పత్తిస్థానము ౧.

జీవరేఖతో కలసి ఈరేఖ సాధారణముగ కనిపించుచుండును (చి ౧. నెం. 2) ఇట్టివారు ఆత్మశక్తి గలుగనేరరు. ఇట్లు ఉద్భవించి చంద్రుని దిగువస్థానమునకు పోవుచో (చి ౧. నెం. 2-5) ఆత్మశక్తియందలి అవిశ్వాసము కడకాలమువఱకుండును. వీరు ప్రాయికముగా కవులు, చిత్రకారులు అయియుందురు. కాని ధైర్యము లేకపోవుటచే తమచే వ్రాయబడిన చిత్రములు, పుస్తకములు విలువ కలవి కావని బహిరంగపఱుపకుందురు. ఈ రేఖ అరచేతి నడిమిభాగమువఱకును వంగి ఆ పిమ్మట కొడవలి (చి ౧. నెం. 2-7) వలె నుండినవారు వ్యాధిబాధితులై, ఏకాంతవాసులై, ఆత్మహత్యచే జీవితమును తుదముట్టించుకొన ప్రయత్నింపవచ్చును. పైవిధముగనే ఉత్పత్తియై కుజుని లోస్థానమునకు (చి ౧. నెం. 2-4) పోవుచున్న ఈ రేఖ ఆ వ్యక్తియొక్క ఆత్మశక్తియందలి అవిశ్వాసమును పోద్రోలును. ఇట్లుండి ఈరేఖ ఎంత నిడివిగనున్న అంతటి మనోద్రఢిమను సూచించును. ఈ రేఖ ఏమాత్రమును వంపులేక తిన్నని గీటువలె పోవుచున్నచో ఆవ్యక్తి ఒక ఆదర్శమును గొని దానికై తన జీవమును ధారపోయును. పైవిధముగనే ప్రారంభమై (చి ౧. నెం. 2-4) నందువలెనే యుండి రేఖ చిగురున దిగువకు పలక (ఫోర్కు) నిర్మాణమై యుండుచో (చి ౧. నెం. 2-4-4 ఎ) అట్టివారు చంచలులై, ఏదైన ఒక విషయమును గూర్చి లాభనష్టములను దీర్ఘముగా చింతించువారై యుందురు. అట్టివారు వారికి ప్రథమమున ఏది ఉచితమైన నడవడిగ తోచునో అట్లుచేయుటయే ఉచితమని కైరో ఉపదేశించుచున్నాడు.



చిత్రము ౧.

స్త్రీలు
ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.





మహిళాలోకము

నేటి ఇటలీదేశపు స్త్రీలు

ఫాసిజము: స్త్రీలు

ఇటలీదేశమున ఫాసిజముపద్ధతి 1919 లో ప్రారంభమయ్యెను. ప్రారంభమునుండియు నాపద్ధతి పురుష ధర్మముల అభివృద్ధిపైచూపిన శ్రద్ధ విశేషమైయుండెను. ఫాసిజముక్రింద స్త్రీలు ఎట్లుండినదియు తెలుచు వినబడదు. ఫాసిజము ప్రబలక పూర్వమే ఇటలీదేశపు స్త్రీలకు ఆదేశపు రాజ్యాంగమున హెచ్చుసంబంధము లేకుండెను. ఫాసిజము ప్రబలినతరువాత వారికి రాజకీయములలోగల సంబంధము మఱింత తగ్గిపోయిన దనవచ్చును. స్త్రీజనోద్యమము ఫాసిజమువలన ఇటలీదేశమున అనేకవిషయములందు వెనుకటినుండి ప్రాక్తనపరిస్థితులకు మరలెననుట నిజము.

రాజ్యాంగమున స్థానము లేదు

రాజ్యాంగవిషయములందు ప్రవేశించుటకు ఇతరదేశపుస్త్రీలవలె ఇటలీదేశపుస్త్రీలు విశేషమైన అభిరుచి నెప్పుడును చూపియుండలేదు. అయినను బెనిటోముస్సోలినీగారు మంత్రిత్వము వహించినపిమ్మట ఇతరదేశములందువలె ఇటలీదేశపుస్త్రీలకును పురుషులతో సమముగా ఓటింగు మొదలగు రాజకీయములగు హక్కులను ప్రసాదింప ప్రయత్నపడినట్లు చూపట్టెను. అతడు స్త్రీలకు మునిసిపలు ఎన్నికలలో ఓటింగు హక్కు నొసంగెను. అన్ని ఎన్నికల ఓటింగుహక్కు స్త్రీలకిచ్చుట కిది తొలిమెట్టు అని అపుడు అందఱును భావించిరి. కాని మునిసిపలు ఎన్నికలలో స్త్రీలు ఓటుచేయవచ్చునను హక్కుమునుజారీయైన కొద్దిరోజులకే మునిసిపలు అధ్యక్షుల నెన్నుకొనుహక్కు తీసివేయబడి ఎన్నుకొనబడిన అధ్యక్షులస్థానముల 'పెడస్టాస్' అనబడు ప్రభుత్వపుతాబేదారులు నియమింపబడిరి. ఈ కారణముచే ఇటలీదేశపుస్త్రీలు తాము నూతనముగా పొందిన ఓటింగుహక్కు ఒక్కసారియైన చెలాయించకుండగనే అది బత్తరపు ఆయెను. నాటినుండి నేటివఱకు ఇటలీదేశమున స్త్రీలకు ఓటింగుహక్కు అను వాక్యమే వినిపించుటలేదు.

గృహమే స్త్రీల సర్వస్వము

స్త్రీలకు రాజ్యాంగమున తావులేకుండచేయుట ఫాసిజముదృష్టిలో సముచితమైనదైయున్నది. పిల్లలను కనిపెంచి పెద్దవారినిజేసి విద్యాబుద్ధులు చెప్పి దేశమున భావిసంతతి వెంపొందించుటకొఱకే స్త్రీలను దేవుడు సృష్టించియుండెనని ఫాసిస్టుల గాఢవిశ్వాసము. సంతానోత్పాదనము, తత్పరిపోషణము వారిదృష్టిలో అతి ముఖ్యమైనవృత్తి. ఆవృత్తిలోనుండు వారు ఇతరవృత్తులనుగూర్చి తలపోయుటకు అవకాశముచాలదు. కావున గృహమే స్త్రీయొక్క రాజ్యము. ఆ రాజ్యమునకే ఆమె పూర్తిగ అంకితురాలైయుండుటకు విశేషప్రోత్సాహమొసంగబడవలయును. ఇటాలియనుజాతి ఆరోగ్యవంతమై, తేజస్సంపన్నమై కలకాలము వర్ధిల్లుచుండుటకు స్త్రీలను గృహరాజ్యమునకు అంకితులను చేయుటకంటె మించినసాధనము మఱియొకటిలేదు. ఇట్లని స్త్రీసమస్యాపరిష్కారవిషయమున ఫాసిస్టుల సిద్ధాంతములు.

ప్రభుత్వము: స్త్రీలయభివృద్ధి

ఈ సిద్ధాంతముల ననుసరించి నేటి ఇటలీదేశపు ప్రభుత్వము స్త్రీల యభివృద్ధివిషయమై విశేషశ్రద్ధను చూపుచున్నది. స్త్రీలను ఆదర్శగృహిణులుగను, ఆద

ర్నమాతలుగను చేయువిషయమున నేటి ఇటలీదేశపు ప్రభుత్వము ముస్సోలినీగారి యాజమాన్యమున ప్రజల ప్రయత్నములు సాగించుచున్నది. ఫాసిస్టు పార్టీవారు ఏర్పఱచిన యువకసంఘములందు స్త్రీలు తాము కన్యలుగా నుండినప్పుడే చేరవలయును. అందు వారికి వారు తమదేశవిషయమున గావింపదగు విధ్యుక్తధర్మములన్నియు విపులముగ బోధింపబడును. కన్యాత్వము వీడి గృహిణులై మాతృత్వమువహించు కాలము ప్రాప్తించగా స్త్రీలకు దేశమంతయు అలముకొనియున్న ఫాసిస్టుసంఘములు సమయోచితమగు విజ్ఞానమును, సముచితములగు విధులను ప్రబోధించుటయందు దీక్షవహించును. గృహనిర్వాహకత్వమునుగూర్చియు, శిశుపోషణ విధానమునుగూర్చియు వారికి విపులముగ ఉపన్యసింపబడును.

మాతృత్వముయొక్క ఆధిక్యత


మాతృత్వముయొక్క ఆధిక్యతను, ఆవశ్యకతను నిరూపించి ప్రబోధించుటకు ఫాసిస్టు ప్రభుత్వమువారు ప్రత్యేకదీక్షను వహించుచున్నారు. పూర్వము ఇటలీదేశమున మాతృత్వమొక దేవతారూపమున కొలువబడుచుండునది. ఆ దేవతనామము 'డియామాటూటా' అని. ఆ దేవతపూజ ఇపుడు తిరిగి ప్రభుత్వమువారి ఆజ్ఞచే పునరుద్ధరింపబడినది. ఆ దేవత విగ్రహములు ఇపుడు ఊరూర నెలకొల్పబడుచున్నవి. పావురమును ఒకచేతియందును, దానిమ్మకొమ్మ నొకచేతియందును పట్టుకొనియుండినట్టుల ఆ దేవతరూపము చిత్రింపబడియుండును. దాంపత్యప్రేమకు పావురమును, సంతానోత్పాదనమునకు దానిమ్మయు చిహ్నములు. ఇటలీయందలి మ్యూజియములలోని స్త్రీల శిలావిగ్రహములలో పెక్కింటి చేతులలోను, భుజములమీదను, శిరస్సులపైనను పది పండ్రెండుగురు శిశువుల నెక్కించుకొనియుండినట్లుగలవు. మాతృత్వవిషయము తా మీ విగ్రహములను నేటి ఇటాలియను స్త్రీలు అనుకరింపనగునని ఆ దేశపు వార్తాపత్రికలలో వ్యాసములు పుంఖానుపుంఖములుగ ప్రచురింపబడుచున్నవి. ఇతరదేశములందు జన్మనిరోధ మవలంబింపబడుచుండగా ఇటలీదేశమున సంతానోత్పాదనము విశేషముగా ప్రోత్సహింపబడుచున్నది. ఈప్రోత్సాహమునకు ముస్సోలినీగారే మూలపురుషులు. వారి యాజమాన్యమున ఈ నడుమ ఇటలీదేశమున ఒక్కుమ్మడిగా పలువివాహములు జరిగియుండుట వార్తాపత్రికలవలన మనము తెలిసికొనియేయున్నాము.

ఇటలీదేశపు స్త్రీలు: వ్యాయామక్రీడలు

స్త్రీలను బలమైనసంతానము నుత్పాదించుమాతలుగ చేయు తీవ్రకాంక్షతో ఫాసిస్టు ప్రభుత్వమువారు స్త్రీలకు వ్యాయామక్రీడలు నిర్బంధమొనర్చియున్నారు. మొన్నమొన్నటివఱకు ఇటాలియను స్త్రీలు వ్యాయామక్రీడలయందు పాల్గొని యెఱుగరు. స్త్రీల సుకుమారమైన అవయవములకు సరిపడు సున్నితమైన వ్యాయామక్రీడలయందుమాత్రమే వారు ప్రవేశించి పాల్గొనునట్లు ఫాసిస్టు ప్రభుత్వమువారు మంచి కట్టుబట్టములను చేసియున్నారు. టెన్నిసు ఆట, ఈతకొట్టుట, గుఱ్ఱపుస్వారి, వ్యాయామము ఇవి నేటి ఇటాలియను యువతులు నిర్బంధముగా అభ్యసింపవలసియున్నది. బాలికల పాఠశాలలయందు ఇవి నేర్పబడుటకు సౌకర్యములు సంపాదించువిషయమున విశేషమైన శ్రద్ధ కనుబఱుపబడుచున్నది.

ఇతరదేశీయుల అభిప్రాయము

ఇటలీదేశపుస్త్రీల ఈ స్థితి ప్రాక్తన సాంప్రదాయబద్ధమైయున్నదని అమెరికాసంయుక్తరాష్ట్రములు, బ్రిటను మొదలగుదేశములందు తలంపబడుచున్నది. స్త్రీజనోద్యమము విషయమున ఫాసిస్టులకంటెను రోము నగరమునందుండు క్రైస్తవమతాచార్యుడు పోపు పూర్వాచారముల నెక్కువగ నాదరించి ప్రోత్సహించువాడగుటచేతనే ఇటలీ స్త్రీలలో పూర్వాచారపరాయణత ప్రబలియుండుటకు ముఖ్యకారణమైయుండునని పలువురిచే ఊహింపబడుచున్నది. వ్యాయామక్రీడలవిషయమున ఫాసిస్టులు ఇటాలియను స్త్రీలకొసంగిన కొద్దిపాటి నూతనస్వాతంత్ర్యమునుగూడ పోపు మహాశయుడు స్పష్టవచనములయందు పలుసారులు నిరసించియున్నాడు.



శ్రీ జటప్రోలు మహారాణీగారు

వీరి పుత్రరత్నమగు శ్రీరాజా వేంకటజగన్నాథ రావుబహద్దరువారు మైనరులగుటంజేసి శ్రీ మహారాణీ గారే జటప్రోలు సంస్థానమును పాలించుచున్నారు. వీరు రాజ్యపాలనకళానిపుణులని, అనుభవశీయులగు తత్సంస్థానప్రజలకేగాక, దిగంతవిశ్రాంతకీర్తిఁగడింపఁ జాలు ఘనకార్యము లెన్నియో వీరి పరిపాలనమున జరుపఁబడుటంజేసి, తద్విషయము లోకమునకును విదితమై యున్నది.

ఇఁకఁ బరోపకారము వర్ణించుదమన్న సామాన్య విషయము కాదు. కొల్లాపురరాజధానియందు ప్రజోపకారార్థమై, ప్రజాసౌకర్యార్థమై, విద్యుద్దీపములును, నీటికొళాయిలును నమర్పఁబడినవి. భద్రాచల రామస్వాములవారి ఆలయముచుట్టు నీటికొళాయిల నమరింపఁజేసిన విఖ్యాతధనులు వీరే. సంస్థానమంతయును విద్యావంతము చేయఁదలంచి, అచ్చటచ్చట పెక్కు-విద్యాశాఖలు గల్పించుటయేగాక, యనేకమంది విద్యార్థులను హైదరాబాదు, చెన్నపురి మొదలగుపట్టణములకు బంపి, తలసినంత ధనసహాయమిచ్చి విద్యావిధానమును బ్రోత్సహించుచున్న ఘనులువీరే. నేఁడు హైదరాబాదులో ఘనముగ వెలయు ఉన్నత బాలికాపాఠశాల, రెడ్డిహాస్టల్ మొదలగునవి వీరిసాహాయ్యమును పొందుచున్నవి.

దైవతారాధనతత్పరులని, భక్తశిఖామణులని సురభివంశీయుల కనాదినుండివచ్చుచున్న ప్రఖ్యాతవిషయమగుటంజేసి శ్రీరాణీగారి పట్లను నాఁడునాఁటి కయ్యది వృద్ధియగుచున్నయది. శ్రీరాణీగారికిఁగల తీర్థసేవనాసక్తియు, ధరణీసురభక్తియు, నిత్యపూజానురక్తియు పైవిషయములకు సాక్ష్యములని చెప్పక చెప్పెడిని.

అధికారసంపత్తి శ్రీవారి గాంభీర్యచిత్తమును మార్పలేదు. రాజ్యశ్రీ గర్వరేఖ శ్రీవారియుదారగుణమును చలింపలేదు. ఎట్టిమార్పును లేక పతియడుగుందమ్ముల సేగుచు నిరంతరపతిపాదారవిందధ్యానతత్పరలై రాజ్యపాలనమందును, అంతఃపురమర్యాదలయందును, సదాచారసద్గుణశ్రీవిలసితలై, పతిహితబోధ ననుసరించి నడచుచు పతిసంకల్పించిన కార్యములన్నియు సంపూర్ణముగ నెరవేర్చుచు శ్రీ రాణీగారు ప్రజామోదము నందుచున్నారు.

శ్రీరాణీగారి నిశ్చలతత్వమెట్టిదో చెప్పుటకు పై విషయంబులన్నియుఁ బ్రబల నిదర్శనంబులే. అధికారము వహించుట సామాన్యవిషయముకాదు. అందు రాజ్యాధికారభారము వహించుట కడుంగడుకష్టము. వహించి సర్వజనసమ్మతముగ పరిపాలించుటకును, వివిధమతస్థులను సమముగఁజూచి నాదరించుటకును, ప్రజలను గంటికిరెప్పవలె సంరక్షించుటకును, సంస్థానమందు వెలయు శాఖలనన్నిటిని స్వాధీనమునందుంచుకొని తగు పరీక్షలచేయుటకును;—నెంత పరిజ్ఞానముండవలయునో, యెంత కుశాగ్రబుద్ధియుండవలయునో, బాగుగ పరిశీలించినంత శ్రీవారి నిశ్చలతత్త్వ మిన్ని స్వరూపములను వహించియున్నదని విస్పష్టమగు.

పరమేశ్వరుఁడు శ్రీ రాణీగారికి సంపూర్ణాయురారోగ్యశ్రీలను బ్రసాదించి సంరక్షించుగాత.

—వి. రామసుబ్బారాయఁడు, బి.ఏ.



రాజపాళెయమందలి ఆంధ్రక్షత్రియులు

(తమిళదేశమందలి రామనాథపురం జిల్లా రాజపాళెయ మందలి ఆంధ్రక్షత్రియకుటుంబముల సంక్షిప్తవివరములు.)

గ్రామ నిర్మాణము

రాజపాళెయమున ప్రవేశించుటకు పూర్వము మా క్షత్రియకుటుంబములన్నియు నొకచోటనుండక వేరు వేరు తావులందును, వేరువేరు పనులయందును చీలియున్నట్లు చెప్పుకొనబడుచున్నది. ప్రస్తుతపు రాజపాళెయమున కనతిదూరముననుండు, రాజకులరామమను గ్రామము వీరి మొదటివలసగానుండెను. సమీపమునందలి మహారణ్యములలోనికి పూర్వులు వేటలకు వెళ్ళుచుండిరట. ఇప్పటి గ్రామసీమ యాకాలమున నరణ్యమునందే చేరియుండెను. కాని చుట్టుప్రక్కల కొన్ని చెఱువులును పురాతనదేవాలయములును దోపిడిగాండ్రగూడెములును మఱియు, దూరదూరమున కొన్ని కుగ్రామములును, ఉండినట్లు తెలియుచున్నది. గ్రామనిర్మాణమున కనుకూలమగు ప్రదేశమగుటచేతను, మధురనుండి కన్యాకుమారికి పోవు రహదారి దగ్గరగా నుండుటచేతను, చుట్టుప్రక్కల కొన్నికమ్మవారి వలస లేర్పడియుండుటచేతను, రాజకులరామమునుండి లేచివచ్చి ప్రస్తుతము 'పాతపాళె' మనబడు ప్రదేశములో శంకుస్థాపన మొనర్చి గ్రామమును నిర్మించుకొనిరి. అప్పటినుండియే దీనికి రాజపాళెయ మనుపేరు వాడుకరైనది. దొంగలయొక్కయు, అడవిమృగములయొక్కయు ఉపద్రవమువలన గ్రామముచుట్టును చిన్నప్రాకారమొకటి కట్టి కోటయని పిలువసాగిరి. ప్రథమమున ప్రవేశించినవారు స్వల్పసంఖ్యాకు లయినను, తమకై ప్రత్యేకగ్రామనిర్మాణమయిన తరువాత, పరిసరములందున్న గ్రామములనుండి, మిగిలినవారును క్రమముగా రాసాగిరి. తమకు కావలసిన యాంధ్రబ్రాహ్మణపురోహితులను, భట్రాజులను పనిపాటలకై కమ్మరి మొదలగు నితరకులములవారిని తమగ్రామములో నుంచుకొనిరి. అడవులను నరికి పొలములుగామార్చి తా మాక్రమించుకొనియుండిరి.

ఈగ్రామనిర్మాణకాలమును నిర్ణయించుటకు తగిన ఆధారములు చిక్కకున్నవి. పైనచెప్పిన దానశాసనములోని భూమి రాజపాళెయ గ్రామనిర్మాణమునకు బిమ్మటనే పొందబడియుండుటచేత, క్రీ. శ. 1650 కి పూర్వమే గ్రామనిర్మాణము జరిగియుండవలయును. తిరుమలనాయకునిక్రింద నుండెడు పాళెయగార్లలో రాజపాళెయపు రాజులు గూడనుండినట్లు మెయిలర్సు హిస్టారికల్ మాన్యుస్క్రిప్టులనుబట్టి తెలియవచ్చుచున్నది. తిరుమలనాయకుడు క్రీ. శ. 1623 లో పరిపాలింప నారంభించెను గాన నితని రాజ్యకాలప్రారంభమునకే అనగా క్రీ. శ. 1600 ప్రాంతమునకే మేమీ రాజపాళెయమున నివసించుచుంటిమని తేలుచున్నది. తరముల లెక్కించిచూచిన ప్రథమమున వచ్చినట్లు చెప్పబడువారు 12-వ తరమువా రగుచున్నారు. తరమునకు కనీసము 25 ఏండ్ల చొప్పున జూచినను 300 సంవత్సరములగుచున్నందున పైకాలము సరిగా నుండవచ్చునని యభిప్రాయపడుచున్నాము.

రాజపాళెయమునకు చుట్టునుండు నడవులు చెఱువులు వ్యవసాయయోగ్యములగు భూములు వీరిక్రిందనే యుండుటచేతను, స్థిరముగా నొకగ్రామము ఏర్పడియుండుటచేతను, అంతకుపూర్వమే దూరదూరమున చెదరియుండినక్షత్రియకుటుంబము లనేకములు రాజపాళెమున నిండిపోయినవి. క్రమముగా జనసంఖ్య

పెంచుటచేతను చోటు చాలనందునను సమీపముననే మఱియొక గ్రామము కూడ నిర్మింపవలసివచ్చెను. మొదటి గ్రామమునకు దక్షిణమున ఒక మైలుదూరములో మఱియొక ప్రాకారావృతమగు గ్రామమును కట్టుకొని "సింగరాజుకోట" యనియు, "మిట్టపాలె" మనియు వ్యవహరించుచుండిరి. ఈ నూతన గ్రామనిర్మాణమునకు కారకులైన గొట్టిముక్కలవారిలో సింగరాజు ప్రధానుడై యుండవచ్చును. వీరికే మహామండలేశ్వరులను బిరుదుండినట్లుల వీరు వ్రాసిన తాళపత్రగ్రంథములవలన తెలియవచ్చుచున్నది. 1787 వఱకు రాజ్యమేలిన విజయరంగ చొక్కనాథ భూపాలునివలన ఈ గొట్టిముక్కల దొరలు చెఱువులు, తోటలుకలిగిన కొంతభూమిని 480 బంగారపుకాసులకు కొనియుండిరని వీరివద్దనున్న క్రయశాసనమువలన తెలియుచున్నది. మొదటి గ్రామము కలిగిన 50, 60 సంవత్సరములకెనుకనే ఇది నిర్మింపబడినట్లు చెప్పుకొనబడుచున్నది. క్రమక్రమముగా జనసంఖ్య పెరిగినకొలదియు పై రెండుకోటలకుమధ్య మఱియొక చిన్నగ్రామమును "జగ్గరాజుకోట" యను పేరుతో స్థాపించుకొనిరి. ఈవిధముగ నాంధ్రక్షత్రియులు రాజపాలెమున 300 సంవత్సరములకు పూర్వమే స్థిరపడిపోయిరి.

పూర్వులు

వ్యవసాయయోగ్యములగు భూములను అడవులను స్వాధీనపఱచుకొని, నాయకరాజులకు పాళయగాడ్రుగా నుండి, ఆకాలమున దొంగలు దోపిడిగాండ్రు ఊళ్ళను బాధించుచుండగా వారినంకరి దయనుగొట్టి తమకు విధ్యుక్తమగు శాంతిస్థాపనను క్షత్రియసహజమగు దుష్టనిగ్రహమును జేసియుండిరి. మండలమునందలి చిన్న సంస్థానములలోను జమీన్లలోను ప్రవేశించి సక్రమపరిపాలనయందు తమకుగల సామర్థ్యమును న్యాయబుద్ధిని దయాదాక్షిణ్యాదిసద్గుణముల జూపించి వారిచే నధికముగ గౌరవింపబడుచుండిరి.

మాపూర్వులు సంఘనిర్మాణమునకు చక్కని యేర్పాట్లు గావించియుండిరి. ఊరుచుట్టును చిన్న చిన్న పూదోటలను నిర్మించి సమిష్టి ఉపయోగమునకై అంకోశబావియు, మఠమును కట్టించి "నందవనము' లను పేర ధర్మములు గావించియున్నారు.

ఊరిమధ్యమున చతురశ్రమగు విశాలప్రదేశమును ఇండ్లు కట్టక విడిచియుంచి, తమపశువులమందలు విశ్రాంతి దీసికొనుటకును పిల్లలు ఆడుకొనుటకును ఇదితర గ్రామావసరములకును ఉపయోగించుకొనుచుండిరి. ఊరివారిపశువులు దొంగిలింపబడకుండ పూర్వకాలమున నీ "మంద" మిక్కిలి యుపయోగపడియుండును.

ఒక్కొక్కయింటిపేరుమీద ఒక్కొక్కసావడి కట్టబడి, జ్ఞాతులందరు సమావేశమగుటకును తీఱికకాలమందు విశ్రాంతి దీసికొనుటకును ఉపయోగింపబడుచుండెడివి. ఒక్కొక్కగ్రామమునకును ఒక్కొక్క పెద్దసావడిగూడ కట్టబడియున్నది. ఆగ్రామవాసులందరును అప్పుడప్పుడు సమావేశమై సాంఘికమత రాజకీయాదివిషయముల జర్చించుటకును, ఊరిసమష్టి ఉపయోగమునకు గావలసిన పల్లకి, మేనా మొదలగు సామానులనుంచుకొనుటకును, తమ్ముజూడవచ్చు పెద్దల గలసుకొని మర్యాదచేయుటకును ఉపయోగింపబడుచుండెను.

జాతిచీలిపోకుండ జేయుటకుగాను 'గుంపులు' యేర్పరుపబడినవి. 'గుంపు'నగా సాంఘికసభ. కేవలము వాదవివాదము చేయు సభలవలెగాక అధికారయుతములగు పంచాయతుల వంటివి. కులకట్టుబాట్లను ఆచారములను మార్చుటకుగాని పోట్లాటలు తీర్చుటకుగాని గ్రామపరిపాలనవిషయములోగాని ఈ గుంపులకే పూర్తియైన అధికార ముండెడిది. ఇంటి కింతయని గుంపుకు పన్ను చెల్లించుచు గుంపువారి తీర్మానములను జరిమానాలను, దండనలను ఒప్పుకొనవలెను ఈవిధముగా మాపూర్వులు తమ సంఘమును నియమములతో బంధించుకొనియుండిరి.

ప్రస్తుత మింతతో నాపి పైమాసమున మాపూర్వులు రచియించిన గ్రంథములనుగూర్చి కొంత తెలిపి నేటి మాపరిస్థితులనుగూర్చి వివరింపగలనని మనవి చేయుచున్నాను.

ఇన్స్యూరెన్సు విషయములు

ఆర్థిక విధానము : ఇన్సూరెన్సు

మూలధనము.

పెట్టుబడి విషయములో యిన్సూరెన్సుకు ముఖ్యమైన సంబంధము గలదు. మన కార్ఖానాగారములు, ధాన్యపు కొట్లు, గిడ్డంగులు, మిల్లులు, రైళ్ళు, మోటారులు, నివాసములు, ఉత్పత్తికి కావలసినవస్తువులు, సగముతయారయిన వస్తువులు, పూర్తిగ తయారుకాబడిన వస్తువులు, పాడి పంటలు, ప్రభుత్వపు ఆఫీసులు, పాఠశాలలు, విశ్వవిద్యాలయములు - వీటిపై చేయబడిన యిన్సూరెన్సును గమనింపుడు. ఇవన్నియు మానవుని నిరంతరకృషివలన పొందబడిన వసతులు. అవి ఎల్లప్పుడు మంచిస్థితిలోనుండుట అవసరము. వీటికన్నియు అపాయములు రావచ్చును. కావున అగ్ని పాలిసీలు, నావికా పాలిసీలు, చోరీపాలిసీలు, యంత్రసంబంధమగు పాలిసీలు, మోటారు, మొదలగు పాలసీలను పొంది వాటి సంరక్షణ గావించుకొనవచ్చును. ఇవి నశించినను వాటి పునరుద్ధరణకు కావలసిన మూలద్రవ్యము పొందవచ్చును. అపాయము యీవిధముగ కొలతయిడుటకు వీలగునట్టి స్థితికి తేబడుచున్నది. అంతేకాదు. ఈ మూలద్రవ్యము కూడబెట్టుటచే పొందబడినది. ధనము కూడబెట్టుటకు కారణములు అనేకములు—తనకును తనకుటుంబమునకును రక్షణ; సాంఘికగౌరవము, అధికారము పొందుట; వడ్డీ పొందుట. ఇట్లు సేకరింపబడు ద్రవ్యము వాటి నిర్మూలమునకు కారణభూతమగు అపాయమునకు గురియగుచో, ధనము సేకరింపవలెనను పట్టుదలయుండదు. లాభము పొందువరకు తమ సంపాదనయంతయు వెచ్చింతురు. ఇన్సూరెన్సు ధనమును సేకరించుటకు సహాయకారి. అందువలననే ప్రభుత్వము వారు యిన్సూరెన్సుకు కట్టు ధనముపై రాబడిపన్ను విధింపరు. పూర్తి జీవితము, ఎండోమెంటు భీమాలవలన, తన మరణానంతరము తన ఆప్తులకును, తనకేవుద్యోగమునుండి విరమించు కాలమున తన అవసరమునకును ధనము దొరకును. ఈ విధముగ మూలధనము వృద్ధియగుచున్నది. ఇండస్ట్రియలు పాలిసీలవలన బీదవారు కూడ ద్రవ్యము కూడబెట్టుట తటస్థించుచున్నది. తమ బిడ్డల విద్యాభివృద్ధికో, తమ దినవారపుఖర్చులకో తమ జీవితములోనే ద్రవ్యము సేకరించుటకు వీలున్నది. ఈ భీమాపద్ధతులన్నియు ఆర్థికముగ సమ్మతములైనవి. మూలధనము వృద్ధియగుకొలది దేశస్థితి బాగుపడును గదా?

సుభాషితము

౧౬

“జూదమాడుట అను దుర్గుణమునకు విరుద్ధమైనది పొదుపుచేయుట అను సద్గుణము. పొదుపరియగువానికి పోడిమి అను తన సద్గుణమును లెస్సగ అనుష్ఠించుటకు అవకాశము కల్పించునది జీవితభీమావిధానము. పొదుపు అను మంచిగుణమును ఆచరించుటకు వీలుకల్గించు ఇతర సాధనములగు సేవింగ్సుబ్యాంకు, తాకట్టుపట్టుట, కూడబెట్టుట మొదలగునవి జీవితభీమావిధానముతో సాదృశ్యమునకు నిలువజాలని మోసమైన, వ్యర్థమైన పద్ధతులు.”

—లాయడ్ జార్జి.

క్రీమియములక్రింద వసూలుకాబడు ద్రవ్యములో, క్లెయిములు యితరఖర్చులుపోను మిగత, గవర్నమెంటుకో, మునిసిపాలిటీలకో, కార్మికసంస్థలకో అప్పివ్వబడును. రైళ్ళు, రోడ్లు, యిండ్లు, నీటివసతులు, యంత్రనిర్మాణము, రేవులు, వీటికి యిన్సూరెన్సు ద్రవ్యము యెంతసహాయము చేసియుండునో మనమెట్లు చెప్పగలము? ఈవిధముగ సాంఘికసేవయేగాక ఆర్థిక సంపత్తికిని యిన్సూరెన్సు సహాకారియగుచున్నది.

వ్యవస్థాపన.

వ్యవస్థాపకుని బాధ్యతలన్నియు యిన్సూరెన్సు వహింపజాలదు. ఇన్సూరెన్సుకిచట యెక్కువ సంబంధము లేదు. అతని బాధ్యతలు అనేకవిధములు, గణింపతరము కానివి.

ఋణాభిమానుని క్రొత్తగనొక పద్ధతి యేర్పడినది. వస్తువుకొన్న యాతడు తోడనే దానిఖరీదు నిచ్చుటకు వీలుపడనిచో మూడునెలలు గడువియ్యబడును. నియమిత కాలమున ద్రవ్యమిచ్చుటకు వీలులేనిచో అనష్టము రాకుండుటకు అంతవరకొకపాలిసీ తీసుకొనవచ్చును. ఇన్సూరెన్సు: ఋణము అను విషయమునుగూర్చి గతమాసపు సంచికలో వ్రాసియేయున్నాము.

ఇన్సూరెన్సు : మార్పుకోలు.

ఒక వస్తువునకు విలువకల్గింపదలెనన్న, దాని స్థితిని మార్చి, అది యెదట తక్కువగ ఉపయోగింపబడునో అచటినుండి అది యెక్కువగ కోరబడుచోటికి పంపబడవలెను. మార్పుకోలు ఇదియే. మార్కెట్లు ప్రపంచ వ్యాప్తి చెందియున్నవి. ఎక్కువగ కోరబడు ప్రదేశములకు వస్తువులను యెగుమతిచేయుటకు, రైలు రోడ్డు, సముద్రము, వాయు యంత్రములు వీటి సహాయము కావలెను. ఎక్కువ ద్రవ్యము వెచ్చించి, కృషిచే నిర్మింపబడిన వస్తుచయమును రక్షించుటయేగాక, వాటిని గొంపోవు పరికరములు సైతము రక్షింపబడవలెను. ఈపరికరములను ఉపయోగించునప్పుడు యితరుల హక్కులలో జోక్యము కలుగజేసికొని వారికో వారిఆస్తికో నష్టముకలిగింపవచ్చును. ఈ అపాయములన్నియు యిన్సూరెన్సు కంపెనీలు తీసికొనును.

> **సుభాషితము**
>
> ౧౮
>
> “నీకుగలచింత నీదేహారోగ్యమును గూర్చినదిదైనను, నీవృద్ధాప్యమునందలి సుఖశాంతులను గూర్చినదిదైనను, నీ మరణానంతరము నీ ఆలుబిడ్డల జీవితాధారమును గూర్చినదిదైనను, త్వరలో యౌవనమును పొందనున్న నీకుమారునకు ఆలంబనము ఇచ్చుటనుగూర్చినదిదైనను, నేడు రెండు మూడేండ్ల చిన్నారి బిడ్డయగు నీకూతురు తరయోగ్యరైనపుడు ఆమె కీయగల పెండ్లికట్నమును గూర్చినదిదైనను,— ఇందు యేదైన కానిమ్ము—నీ జీవితమును భీమాచేసికొని యుండుము.”
>
> —ఛార్లెసు డికెన్సు.

ఇన్సూరెన్సు : ఇతరదేశములతో వ్యాపారము.

బ్రిటిషుదేశము ఇతరదేశములతో ఎక్కువ వ్యాపారసంబంధము కల్గియున్నది. కారణము యిన్సూరెన్సు కంపెనీల, బ్యాంకుల సహాయమే. వీటివలన స్థిరత్వమును, ఋణము దొరకుచున్నది. ఒకడు మరొకదేశములకు సరుకులనెగుమతి చేయుననుకొందము. ఆసరకులు గమ్యస్థానము చేరనిది డబ్బురాదు. ఇందులకే మూడునెలలో పట్టును. అంతవరకు వ్యాపారి మూలధనము ఊరకుండవలసినదే. అతని సరకులు సముద్రప్రయాణమునకు సంబంధించిన అపాయములకు లోనగుచుండును. అతను తన బ్యాంకరువద్దకువెళ్ళి, తన సరకులను గొనువారిపేర్లను దెల్పుచు, ఆసరకులపై తీసుకొన్న నావికాభీమాపాలిసీని వారికందిచ్చును. ఆపేర్లు తృప్తిని గల్గించుచో బ్యాంకులు తోడనే ధనమిచ్చివేయును. వ్యాపారి అందువలన ఊరకుండక ఆద్రవ్యమును మరల మారువస్తునిర్మాణముకై వినియోగించును. ఈవిధముగ వ్యాపారము వృద్ధినొందుచునుండును. వ్యాపారమంతయు ఋణముపై నాధారపడియున్నది. ఈ ఋణమునకు

యిన్స్యూరెన్సు యొక్క స్థిరత్వములేనిచో చక్కగ కొనసాగదు.

బ్రిటను తన ఆహారపదార్థములకు యితర దేశములపై నాధారపడవలెను. తయారయిన వస్తువులను ఎగుమతిచేసియు, యితర దేశములలో తమ పెట్టుబడి నుండి వచ్చువడ్డీతోను, యితరదేశీయుల సామాగ్రుల నొకదేశమునుండి యింకొకదేశమునకు తీసికొని పోవుటవలన వచ్చు లాభములతోను, తన వస్తువులను కొనుచున్నది. బ్రిటీషు యిన్స్యూరెన్సు కంపెనీలు యితరదేశములలో సంపాదించు లాభములు - యివన్నియు బ్రిటనుయొక్క సంపదను వృద్ధిపరచుచున్నవి. ఈ విధముగ భీమాకును, యెగుమతికిని సంబంధముకలదు.

ధనము విలువ స్థిరత్వము కల్గియుండవలెను. అవి మారుచెందుచో యిన్స్యూరుచేసినవారికి నష్టమగును.

విభజన.

విభజన. ఇందులో యిన్స్యూరెన్సుకు స్థానములేదు.

వినియోగము.

ఆర్థికశాస్త్రమునకు తుదిది వినియోగము: మానవులు, యితరులు తయారుచేసిన వస్తువులను, భావినిర్మాణమునకైగాక వుపయోగించుటకు కొనెదము. కొన్ని వస్తువులు చాలకాలము ఉపయోగపడును (యిండ్లు మొదలగునవి). కొన్ని శీఘ్రముగ నశించును (ఆహారపదార్థములు).

ఏది యెట్లున్నను, వుపయోగార్హమగు వస్తువులన్నియు ఒకింతకాలము విలువను కల్గియుండును. అవి వాడబడుటకు పూర్వమే ప్రమాదములకు గురియై నశింపవచ్చును. ఇందుల కుదాహరణములు: యిండ్లు, మోటారులు, కుటుంబమునకు కావలసిన యితరసామగ్రి, వస్త్రములు మొదలగునవి. ఇవి త్వరితముగ నశింపకుండుటకై అగ్ని, చోరీ, మోటారుపాలిసీలు తీసుకొనుచున్నాము. అవిగాక, జడివాన, వెల్లువలు, భూకంపము, విమానములు, వీటివల్ల నష్టముగాకుండ యిన్స్యూరు చేయుచున్నాము. ఈవినియోగమున కిటీవల నూతన వసతు లేర్పడినవి. ఉపయోగించువారికి ఋణమివ్వడము. కొలదికాలమును, శాశ్వతముగను ఉండు వస్తువులను కొనుటకు ద్రవ్యమంతయు అప్పుడే యివ్వక, ఆవస్తువులను తాననుభవించుచునే, నిర్ణీతకాలము వరకు కొద్దిగ, క్రమముగ అప్పు చెల్లింపవచ్చును. అప్పుతీరు వరకు ఆస్తి విక్రేతదే. గృహనిర్మాణసంఘములు, మోటారు కంపెనీలు యిట్టి వసతుల నిచ్చుచున్నవి. పూర్తి బాకీ తీరునరకు యీవస్తువులు యిన్స్యూరెన్సుచే రక్షింపబడవలెను. వ్యాపారమునకు సంబంధించిన సాధారణ అపాయములను, అవ్యాపారమునకు ప్రత్యేకింపబడిన ఆర్థికసంస్థతే తొలగింపవలెను. కాని స్థిరత్వము గూర్చిన రక్షణ యిన్స్యూరెన్సుచేసినవారికే పొందును. ఇన్స్యూరెన్సు వసతులుండుటవలననే, వస్తువుల నుపయోగించువారికి ఋణము దొరుకుచున్నది. ఇందువలన వ్యాపారము వృద్ధియగును. సాధారణముగ మోటారుకారు కొననేరనివాడు, వెల కింతయని యిచ్చి కొనవున్న సులభముగ కొనగలడుగదా! అతడు పూర్తిగ డబ్బు చెల్లించువరకు యిన్స్యూరెన్సురక్షణయుండిన నష్టముండదుగదా! ఇందువలన వ్యాపారము అభివృద్ధి చెందుచున్నది.

ఇన్స్యూరెన్సు స్థిరత్వము, నమ్మకము నిచ్చుచున్నది. నష్టమునుండి విముక్తియిచ్చు యీనమ్మకము ఆర్థికవిధానమున చాలముఖ్యమైన అంశము. ఆర్థికవిధానమును ప్రతివిషయమునందును యిన్స్యూరెన్సు బలపరచుచున్నది. పెట్టుబడిదారునికి మూలధనమునకు నష్టమురానీకుండగను; పనివానికి నిరుద్యోగము, రోగము, ప్రమాదముల బ్రతుకుతెరువ చెడకుండగను కాపాడుచున్నది. వ్యాపారమును ఋణముచే (ద్రవ్యసహాయముచే) వృద్ధికి తెచ్చుచున్నది. ధనమును కూడబెట్టు అలవాటును పెంపొందించి, మన జీవితపు స్థితికి ఔన్నత్యము కల్గించుచున్నది. కంపెనీలు అకాలమరణము, అగ్ని, ప్రమాదములవలనకలుగు ఆర్థికములగు ఖర్చును తగ్గించుటకై, రక్షణపరికరములను వాడుకలోనికి తెచ్చుచు, జీవిత పాలసీదారులకు ఆరోగ్యవిషయికమయిన సలహానిచ్చుచున్నవి. ఆర్థికవిధానమున యిన్స్యూరెన్సు యీవిధముగ ఒకభాగమై విరాజిల్లుచున్నది.

—అలూరు రామచంద్రయ్య, బి.ఏ.

ఆరోగ్యవిజ్ఞానము

§. దగ్గుటలో చూపవలసిన మెలకువలు

మానవుని ఊపిరితిత్తులలో అతిసున్నితమైన స్పాంజి వంటి టిశ్యూలుండును. అట్టి టిస్యూలు ఒక్కొక్కప్పుడు రోగ ఉద్రిక్తములు కాగా శ్లేష్మము అడ్డుకొనును. ఈ అడ్డుకొనిన శ్లేష్మమును తొలగించి బైచుటకు చేయు ప్రయత్నమున మనము దగ్గుదుము. ఈ దగ్గుట మనము బిగ్గరగా చేసి బలవంతముగా ఆ శ్లేష్మమును వెలికి ద్రోయ ప్రయత్నింతుమేని ఊపిరితిత్తులలోని అతిసున్నితమైన టిస్యూలకు తప్పక హాని కలిగించుకొందుము. కావున దగ్గవలసివచ్చినపుడు సాధ్యమైనంత నెమ్మదిగ దగ్గుట అభ్యాసము చేసికొనుము. ఇట్లు నెమ్మదిగనే కళ్లె తెగిపడునట్లు చేయవలయును. ఈరీతి దగ్గుగాక గొంతుక ఎండుటచేగూడ దగ్గు రావచ్చును. దీనినే పొడిదగ్గు అని అందురు. ఈ పొడిదగ్గు కలిగినపుడు చెఱకుముక్కలను నమిలి కొద్దికొద్దిగా రసము మింగుటచేగాని, కలకండ ముక్కను బుగ్గని ఉంచుకొని ఊట మింగుటచేగాని మంచి కార్యకారిగా నుండగలదు. ఇట్లు చేయుటచే ఉమ్మినీరు బాగుగా ఊరి గొంతుకకు తడినిచ్చును. అంతలో పొడిదగ్గు తగ్గిపోయి సుఖము కలుగును.

§. నీరుల్లిపాయలు : కలరా

నీరుల్లిపాయలకు గల సుగుణములలో కలరా రోగము నిరోధించుటయందు దానికిగల గొప్పశక్తియొకటి. కలరారోగికలయింట పండుకొనువారు తమ పక్కల క్రింద కొన్ని నీరుల్లిపాయలను వైచికొని పండుకొనుట మంచిది. ఇట్లుచేయుటచే ఆ నీరుల్లిపాయలు కలరా రోగమును కలిగించు క్రిములను దరికి రానీయవు; పరిసరములనుండు కలరాక్రిములను నాశనముచేయును. అర్ధశతాబ్దికి పూర్వము లండను మహానగరమున కలరా జాడ్యము ప్రబలముగా వ్యాపించినపుడు దాని సరికట్టుటకు విశేషముగా అవలంబింపబడిన సాధనములలో పక్కల క్రింద ఉల్లిపాయలుంచుకొనుట యొకటి. ఈ సాధనము చాలబాగుగ పనిచేసినదని అనుభవజ్ఞులు పలువురు చెప్పియున్నారు. పచ్చివిగాని, బాగుగా ఉడకబెట్టినవిగాని, కొంచముగా ఉడకబెట్టినవిగాని, నీరుల్లిపాయలు క్రిమిసంహారకములని వస్తుగుణసర్వస్వము చెప్పుచున్నది.

§. భోజనసమయమున నీరు త్రాగుట.

కొందఱికి భోజనసమయమున ముద్ద నోటిలో పెట్టుకొనుటతోడనే కంఠమునకేదో అడ్డుపడినట్లుండి వెంటనే మంచినీళ్ళు త్రాగవలయునను బుద్ధిపుట్టును. ఇట్లు నీరుత్రాగుటవలన ఏమైన హానికలదా యనినచో అది ఆ మనుష్యుని అలవాటునుబట్టి యుండును. సాధారణముగ భోజనసమయమున మంచినీళ్ళు విస్తరించి త్రాగుట ఆరోగ్యప్రదముకాదని ఆరోగ్యశాస్త్రవేత్తలు చెప్పుదురు. కాని చిన్నతనమునుండియు భోజనసమయమున నీళ్ళుత్రాగుట అలవాటుగలవాని జీర్ణకోశము ఆ పరిస్థితులకు లెస్సగ వాడుకపడును. పలువురు భోజనసమయమున నీళ్ళుతీసికొనకయే యుందురు; అట్టివారు భోజనానంతరము తీసికొందురు. కొంచెము ప్రయత్నించినచో భోజనసమయమున నీరుత్రాగు అలవాటును మాన్పుకొనవచ్చును. భోజనములోగూడ నీరుత్రాగక తప్పని సరియైనచో ఒకటిరెండు గ్రుక్కలతోడనే తృప్తికలిగించుకొనుట మంచిది. భోజనమునకు పూర్వమును, పిమ్మటను ఆచమనముచేయు బ్రాహ్మణుల పద్ధతి ఆరోగ్యశాస్త్రజ్ఞుల దృష్టిలో మహత్తరమైనది. భోజనమునకు పూర్వముచేయు ఆచమనము ఆహారమార్గమును సరిచేసి ఉమ్మినీరు బాగుగా ఊరుటకు వీలు

కల్గించును. భోజనమునకు పిమ్మటచేయు ఆచమనము తోషణమును కల్గించి జీర్ణకోశమున ఆహారము సరుకు కొనుటకు అనువు కల్పించును. మనము తిను ఆహారములో జలము విశేషముగ కలసి దానిని బొత్తిగా ద్రవపదార్థముగ గావించినచో అది బాగుగా జీర్ణమగుట దుస్తరమగును. జీర్ణకోశము లెస్సగ పనిచేయుటకు అది సమశీతోష్ణస్థితియందుండవలయును. ఆహారముతో బాటు చల్లనినీటితో జీర్ణకోశమును నింపితిమేని దాని సమశీతోష్ణస్థితికి భంగము కలుగగలదు. ఉదయమున లేచినతోడను, రాత్రి పరుండబోవునపుడును, భోజనకాలములకు నడుమను జలపానముచేయు అలవాటు చేసికొనుట మంచి ఆరోగ్యనియమము.

౬. దోసకాయ విలువ

తొక్కతీసివైచిన దోసకాయ ముక్కలకంటె తొక్కతోనున్న దోసకాయముక్కలు సులభముగ జీర్ణమగునన్నసంగతి మనమెప్పుడును మఱచిపోరాదు. తినుటకుముందు దోసకాయను బాగుగ కడిగి ఉపయోగింపవలెను. తొక్కతో ఉపయోగించుటకు కిట్టనివారు తొక్కను సాధ్యమగునంత పల్చ తీసివేయవలెను. పసుపు పచ్చని తొక్కకును లోని తెల్లని పదార్థమునకును నడుమ దోసకాయలలో ముదురు ఆకుపచ్చరంగు పొరలు ఉండును. ఈ పొరలు దోసకాయ ముక్క రుచిని, పదార్థపు విలువను హెచ్చించును. నిమ్మకాయరసము, ఆలివ్‌నూనె కలిపి తయారుచేసిన దోసకాయముక్కల పచ్చడి జిహ్వకు ఎంతయో రుచిగా నుండుటయేగాక దేహమున కెంతయో పుష్టి నిచ్చును. దోసకాయలు నిలువయుండుటచే గట్టిపడిపోయినచో వానిని రెండుగాకోసి గింజలు తీసివైచి ఉప్పుచేర్చి మఱగబెట్టిననీటిలో కొద్దికాలముంచినచో అవి ఉపయోగార్హములగురీతిని మెత్తపడును. దోసకాయతో పులుసుకూర మొదలగు వ్యంజనములను సుళువుగా చేయవచ్చునను సంగతి పలువురెఱింగినదే. వండబడకుండ పచ్చిదిగా చేయదగు కూరగాయలలో దోసకాయ యొకటి. దోసకాయ తొక్కలతో ఒడలు రుద్దుకొనుట ఎంతయు మంచిది. చర్మదోషములను పోగొట్టుటలో దోసకాయ సాటిలేనిది. ముఖవర్చస్సును పెంపొందించుటకు చేయబడు లోషనులు, క్రీములు దోసకాయలరసముతోడనే చేయబడుచున్నవని పలువురకు తెలియదు. చర్మమున కెంతయో మేలు చేకూర్చునదగుటచేతనే శాస్త్రజ్ఞులు ముఖసౌందర్యమును పోషించు లోషనులు, క్రీములు చేయుటకు దోసకాయను గైకొనినారు. ఎండచే వాడి వత్తలయిన చర్మమునకు దోసకాయరసము రాచుటవల్ల, దోసకాయ పెచ్చులతో ఒడలంతయు రుద్దుకొనుటవలన మంచి ఉపశాంతి కలుగును. వంటపనుల మూలమున దినదినము నిప్పుసెగకు పాల్పడి సహజకాంతిని, సౌందర్యమును గోల్పోవు తమ ముంజేతులను స్త్రీలు దోసకాయ పెచ్చులతో రుద్దుచు కడుగుకొనుచుందురేని అవి సహజకాంతిని, సౌందర్యమును గోల్పోవక ఎప్పటివలెనే ఒప్పుచుండును.

౭. వృద్ధాప్యమున కలుగు మలబద్ధమునకు

వృద్ధాప్యమున కలుగు మలబద్ధమును నివారించుటకు విరేచనౌషధములను ఎంతమాత్రమును వాడరాదు. అవి నీరసపెట్టును. క్రొత్తగా చిలికిన వెన్నను ధారాళముగ భుజించుట వృద్ధాప్యమునకలుగు మలబద్ధమును నివారించుటకు పరమహంసక్రియ. కొవ్వునొసంగు ఆహారములలో అతిసులభముగా జీర్ణమగు పదార్థము వెన్న. క్రొత్తగాచిలికిన వెన్ననుతినుటవలన అందుండు శరీరపోషక పదార్థములను నూటికి తొంబదిఎనిమిదిపాళ్లవఱకు మన శరీరము గ్రహింపగలదు. వెన్నలో ఎ. డి. విటమినులు నిండారియున్నవి. వెచ్చబెట్టుటచే నేతియందు విటమినులు నశించుచున్నవి. అగుటచేతనే నెయ్యికంటె వెన్న ఆరోగ్యప్రదమనుట. మాంసాహారులు వెన్నను తినుటలో కొంత జాగ్రత్తను చూపవలయును. మాంసము తినినవెంటనే గాని మాంసముతో గాని వెన్నను తినరాదు. తినినచో వెన్ననుండి పొందగలుగు పోషకపదార్థములలో కొంచెమైనను వారు పొందజాలరు. నిలువయుండి పులిసిపోయినవెన్న జీర్ణకోశమునకు చాల చెఱుపు చేయును. పరిశుభ్రమైన చన్నీటిలో పడవైచియుంచుటచే వెన్న చెడిపోకుండును. ఏదినమున కాదినము నిలువనీటిని తీసివైచి క్రొత్తనీటిని చేర్చుచుండవలయును.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౭౫. శ్రీకృష్ణకవి జీవితము.

తెనుగునందు భారతమును ఒక్క చేతిమీద నడిపిన కీర్తినిగొన్న బ్రహ్మశ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి కవిసార్వభౌముల జీవిత మీగ్రంథమున విపులముగ చెప్పబడినది. ఇది గవర్నమెంటు ట్రెయినింగు సూపరింటెండెంటు శ్రీ అనంతపంతుల రామలింగస్వామిగారిచే రచియింపబడినది. విచిత్రచరిత్రగల ఆధునికాంధ్రకవిగ్రామణులలో శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారొకరు. వారు వ్యవసాయముచేసిరి. పత్రికలను ప్రచురించిరి. ముద్రాశాలను నిర్వహించిరి. రాజాస్థానములవెంట కవితావిహారము సల్పిరి. ప్రథమమున తెనుగునందు దినపత్రికను నిర్వహించినకీర్తి శ్రీశాస్త్రిగారి కీయక తప్పదు. విధినిర్వహణమున శ్రీవారికిగల దీక్ష ప్రశంసనీయమైనది. "వీరి దినపత్రికయగు 'గౌతమి'ని ప్రకటించుకాలమునందే వీరితండ్రిగారు కాలధర్మము నొందిరి. ఆనాడుదయమున మామూలుప్రకారము పత్రికను ప్రకటించియే తండ్రిగారి శవమును సంస్కారము చేయుటకుంబోయినారు." 'వందేమాతరమ'ను వారపత్రికను; కళావతి, మానవసేవ, వజ్రాయుధము అను మాసపత్రికలను నిర్వహించి శ్రీశాస్త్రిగారు తెనుగుదేశపు పత్రికాజీవనమున పాల్గొని తమ ప్రజ్ఞాపాండిత్యములను ప్రకటించియున్నారు. ఈకవిగారి సంసారజీవితమున ప్రథమకళత్రవియోగసందర్భమున నడచిన వృత్తాంత మెంతయు దయనీయమై రాతిగుండెను కూడ కరగింపజాలియున్నది. ఒడుదొడుకులకు లోనైన ఈ కవిజీవితము ఒక నవలవలె చదువదగి నేటి సారస్వతసేవకుల పాల్పడు కష్టసుఖముల నన్నిటిని ప్రదర్శించుచున్నది. శ్రీకృష్ణమూర్తిశాస్త్రిగారి జీవితము శ్రీనాథుని జీవితములో కొంతసాదృశ్యమును పొందియున్నదని చెప్పకతీరదు. అయితే శ్రీనాథుడు వ్యవసాయమును కడకాలమునను, శ్రీవారు యౌవనకాలమునను వృత్తిగా గైకొనిరి. ఉభయత్ర వ్యవసాయము శాపనవ్యవసాయమే అనిపించెను. శ్రీనాథుని లంకల వ్యవసాయక్షేత్రమును బొడ్డుపల్లినుండి తిలలు పెసలు కృష్ణవేణి వెల్లువ కొనిపోగా శ్రీశాస్త్రిగారి లంకల వ్యవసాయక్షేత్రమును కాటవరమునుండి పొగాకును మాఘమాసములో నకాలమునవచ్చిన గోదావరివెల్లువ పొట్టబెట్టుకొన్నది. శ్రీనాథుడు, పోతన మొదలగు పూర్వకవులవలె కాడియు, గంటమునుబట్టి జీవితమున సుఖదుఃఖములను చవిచూచి ఒకప్పుడును కవితాసుందరి పూజమాత్రము విడువని ఈసారస్వతార్చకుని జీవితచరిత్రమును తెనుగువారి కర్పించిన శ్రీరామలింగస్వామిగారిని కొనియాడుచున్నాము. ఈగ్రంథ మాంధ్రవిశ్వవిద్యాలయమువారి ఆదరణకు పాత్రమై కళాశాలాంధ్రవిద్యార్థుల కరకమలముల నలంకరించుగాక యని కోరెదము. రాయలుసైజున 182 పుటలు. వెల రు. 1-0-0. గ్రంథము ప్రతులు రాజమహేంద్రవరమున లలితా ప్రెస్సు మేనేజరువద్ద వెలకు దొరకును.

౭౬. గ్రహతారాదర్పణము.

గుంటూరు జిల్లా కేమూరు కాపురస్థులును, జ్యోతిశ్శాస్త్రమునందలి సిద్ధాంతభాగమున సిద్ధహస్తులును అగు శ్రీ చివుకుల వేంకటరమణశాస్త్రిగారిచే రచియింపబడినది. 1934-వ సంవత్సరము మార్చి 16-వ తేదీతో ప్రారంభమై 1934-వ సంవత్సరము ఏప్రియలు మూడవ తేదీతో అంతమయ్యెడు భావసంవత్సరపు గ్రహతారలగతులను చూపు గ్రంథము. పలువుర సహాయముచేతను, గ్రీనిచ్ యందలి యంత్రాదిసహాయముచేతను తయారుచేయబడు నాటికల్ అల్మనక్ పద్ధతివలె ఇందును గ్రహతారలగతులు స్పష్టముచేయబడియున్నవి. యంత్రసాహాయ్యము లేకనే దీనిని తయారుచేసి హిందూ

స్త్రీజ్ఞుల ప్రజ్ఞను ప్రకటించిన వెంకటరమణశాస్త్రిగారిని స్తుతింపవలసియున్నది. డెమ్మిసైజున 36 పుటలు. ఏలూరు వనందలి శ్రీ కుప్పా విశ్వపతిశాస్త్రిగారిచే ప్రచురింపబడినది.

౮౭. గాంధీగారంటే?

ఆదర్శగ్రంథమాలలో ఈ పుస్తక మారవపుష్పము. లోకోత్తరపురుషుడు గాంధీమహాత్ముడు ఆంధ్రదేశ పర్యటనావసరమున ఆతని జీవితరహస్యములను ప్రజా సామాన్యమునందు ప్రచారమునకు తెచ్చుటకై ఈగ్రంథ ముద్దేశింపబడినది. ఇందు మహాత్ముని జీవితపరమార్గము వర్ణితము. శ్రీరామనాథసుమన్ గారు హిందీభాషయందు రచియించిన గ్రంథమున కిది తెనుగుసేత. అనువాద కులు శ్రీపొట్లూరి నాగభూషణముగారు. క్రౌనుసైజున 20 పుటలు. వెల 0-0-6 మాత్రమే. ప్రకాశకులు: ఆదర్శగ్రంథనిలయము, ఎలమఱ్ఱు, కృష్ణాజిల్లా.

౮౮. స్వదేశసంస్థానాలు

శ్రీనార్ల వెంకటేశ్వరరావుగారీగ్రంథమును రచియించిరి కృష్ణాపత్రిక, భారతి మొదలగు పత్రికల యందు ప్రతిభావంతములగు వ్యాసములు వ్రాయుచు నేటి ఆంధ్రవ్యాసరచయితలలో నొక ఉన్నతస్థాన మాక్రమించియున్న శ్రీనార్ల వెంకటేశ్వరరావుగారిని గూర్చి ఆంధ్రలోకమునకు పరిచయముచేయవలసిన ఆవశ్యములేదు. 'అఖిలభారతవర్షవిస్తీర్ణములో మూడవ వంతు స్వదేశసంస్థానములు యావద్భారతసంతతిలో నైదవవంతు సంస్థానప్రజలు' ఇట్టియెడ స్వదేశసంస్థాన సమస్య ప్రాధాన్యము నెవరు కాదనగలరు?' సత్వరస్వ రాజ్యప్రాప్తికి స్వదేశసంస్థానము లెట్లు అడ్డుతగులు చున్నవో ఈ సరికి అందఱకును అవగతమైయుండును. అట్టి సమయమున సంస్థానములందలి పరిపాలనలోని వ్యతిక్రమములు, సంస్థానాధీశుల అనుచితచర్యలు వ్యక్తీకరించి ఈ గ్రంథము వాని లోనిబండారమును వెల్లడించుచున్నది. తనుతు తాము బాగుపడవు, పైగా స్వరాజ్యప్రాప్తికి అడ్డుతగులుచున్నవి. సంస్థానాధీశ్వరులు వ్యభిచరించి ఒంటిని, వ్యయముచేసి ఇంటిని గుల్ల చేసికొనుచున్నవిధ మీగ్రంథమున భావమును ఉత్సాహత బూపు ఉగ్రశైలిలో వర్ణింపబడినది. 'సంస్థానాధిపులు పయికము కాలగతినిస్మరించుట శ్రేయస్కరము. సామ్య సాంఘిక వాదములు ప్రబలుచున్నదినము లివి. ఇట్టియెడ ప్రజాభీష్టమునకు విరుద్ధముగ—నిరంకుశముగ—పరిపా లించుట శ్రేయోదాయకమా?' అని ఈ గ్రంథసందేశము. తెనుగుదేశమునందలి జమీందారులుకూడ ఈ విషయమై దీర్ఘముగ చర్చించి ఆత్మపరీక్షచేసికొనవలసిన ఆవశ్యకతగలదు. ఈ ఉత్తమగ్రంథము ఆంటిక్ కాగితములమీద సుందరముగ ముద్రింపబడియున్నది. క్రౌనుసైజున 120 పుటలు. వెల 8 అణాలు. ప్రకాశకులు: నార్లవారు, కవుతరంపోస్టు, కృష్ణాజిల్లా.

౮౯. బ్యాంకులు అండు మనీమార్కెట్టు

ఆంగ్లభాషలో ప్రచురితమైన గ్రంథము. కలకత్తా విశ్వవిద్యాలయమున ఆర్థిక, వ్యాపారశాఖాధ్యక్షులను, రాష్ట్రేతరాంధ్రప్రముఖులలో నొకరును అగు శ్రీ బసవరసు రామచంద్రరావుగారు (ఎం.ఏ., పి.హెచ్.డి., యల్.టి., యఫ్.ఆర్.ఇ.యస్. లండన్) రచియించినది. కలకత్తా కేంద్రమునకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బాంకర్సువారి సమక్షమున శ్రీవారొసగిన నాలుగు ఉపన్యాసముల సంపుటి ఈ గ్రంథము. మొదటి ఉపన్యాసము ఆదర్శప్రాయమైన మనీమార్కెట్టు: దాని నిర్మాణము అనుదానినిగూర్చి 16-12-30 తేదీని ఒసంగబడినది. రెండవ ఉపన్యాసము 16-1-31 తేదీని నేటి కర్రెన్సీపద్ధతుల సంకోచవ్యాకోచములనుగూర్చి ప్రస్తరింపబడినది. ఇతరమైన మనీమార్కెట్టులనుగూర్చి 30-1-31 తేదీని మూడవ ఉపన్యాసము. ఆదర్శప్రాయమైన మనేటరీ, బ్యాంకింగు స్టాండర్డులనుగూర్చిన 13-2-31 నాటి ఉపన్యాసము నాలగవది. మఱియు అనుబంధమున చేర్చబడిన పలువిషయములు గ్రంథము యొక్క విలువను పెంచుచున్నవి. మొదటి మూడు ఉపన్యాసములును ఆదర్శప్రాయమైన మనీమార్కెట్టును చక్కగ వర్ణించుచు మనీమార్కెట్టుల వైఖరులను వివరించుచున్నవి. ఆర్థికశాస్త్రపరిచయములేనివారుకూడ దీనియందలి విషయములను సులభముగ గ్రహింపగలుగుటకై యిందలి విషయము ప్రదర్శితమైయున్నది. ముద్రి

ఉపన్యాసమున కొన్ని క్రొత్తసూచనలు గావింపబడినవి. విడిగా ఈ ఉపన్యాసమును చదివిన ఏమియు అర్థముకాదు. మొదటి మూడు ఉపన్యాసములను చదివి అందలి విషయములను ఆకళింపునకు తెచ్చికొనిన పిమ్మట ఈ ఉపన్యాసము చదివిన సులభముగ అర్థమై మనీమార్కెట్టునుగూర్చిన అనేక విషమవిషయములు తేటతెల్లమగును. అనుబంధములోని 'ఇండియాగోల్డు స్టాండర్డు నేటి ఆర్థికమాంద్యము' అను ప్రకరణము ముఖ్యముగ చదువదగియున్నది. ఈ ప్రకరణమునకు చివరను రూపాయను పౌనుతో ముడిపెట్టుటయందుగల లాభనష్టములు కూడినంత విపులముగ వివరింపబడినవి. గ్రంథము డెమ్మీసైజున 260 పుటలు. వెల రెండు రూపాయిలు. వలయువారు కలకత్తాయందలి లాల్ చంద్ అండ్ సన్సు వారికి వ్రాయునది.

౫౦. రాయబారము

బేగుంజాక్స్ గ్రంథమాలలో నిది నలుబదియైదవ పుస్తకము. శ్రీయుతులు భాగవతుల నరసింహశర్మగారిచే రచియింపబడినది. భారతోద్యోగపర్వమునందలి శ్రీకృష్ణదౌత్యవృత్తాంతము ఇందు విపులముగ ప్రకరణములక్రింద విభజింపబడి వివరింపబడినది. శ్రీకృష్ణుని రాజకీయధౌరంధర్యమున కీగ్రంథవిషయము ప్రదర్శనశాల. ఇందలి భారతకాలమునాటి భారతదేశపటము, చిత్రపటములు, కౌరవవంశవృక్షము విషయవివరణమునకెంతయు నుపయోగపడుచు గ్రంథప్రయోజనమును అధికరించుచున్నవి. జాతీయములతోడను, సామెతలతోడను నిండారి ఇందలి వచనశైలి ప్రౌఢగ్రాంథికమై ఒప్పుచున్నది. ఈ గ్రంథము 'నవలవలె హృదయము రంజింపఁజేసి, కావ్యమువలె జ్ఞానప్రదమై, నేటి రాజకీయలోకమునకు దర్పణమై తుదిముట్ట చదువనిదే విడువనీయని యౌత్సుక్యోత్పత్తిసంఘటనములచే స్తంభీభూతత్వమును, దిగ్భ్రమను బోధించి తన్మయతఁగలిగించి యలరించు నూతనగ్రంథరత్నము. భారతాంతర్గత పురాతన రాజకీయకథావృత్తాంతము గలిగి శ్రీకృష్ణుని దివ్యప్రతిభావిశేషమున శోభిల్లి విశ్వరూపసందర్శనమునఁ బవిత్రతమైనది.' నేతి సుబ్బరాయశాస్త్రిగారి 'ధర్మజరాజనాటకము'వలె నిదియు భారతవిషయకమగు నొక ఆంధ్రవచనప్రౌఢకావ్యముగాఁగలదని మా నమ్మిక. పద్యకవితను, గద్యకవితను సమముగ శ్రీ శర్మగారు నడుపఁగలుగుటకు ఈ కావ్యము నిదర్శనమిచ్చుచున్నది. ఈ గ్రంథమునందలి నలుబదిమూడు ప్రకరణములకును శిరోభూషణముగా వివిధగ్రంథములనుండి యేర్చికూర్చబడిన పద్యరత్నములు శ్రీనరసింహశర్మగారు బహుగ్రంథద్రష్టలగుట రూపించుచున్నవి. క్రౌనుసైజున 800 పుటలు. వెల రు 1-8-0. దొరుకుచోటు: భాగవతుల నరసింహశర్మ, బేగుంజాక్స్ గ్రంథమాల, బరంపురము, గంజాం జిల్లా.

౫౧ డీవేలరా

'నవయుగ' పత్రికాసంపాదకులును, 'దేవీజోస్' రచయితలును అగు శ్రీయుత గద్దె లింగయ్యచౌదరిగారు ఐరిషుస్వాతంత్ర్యవీరుడగు శ్రీడీవేలరా గారి జీవితమును ఈ గ్రంథమున కీర్తించిరి. 'జెకోస్లావికా ప్రజాస్వామికమునకు అధ్యక్షుడై నేడు ప్రపంచరాజకీయరంగమున అనంతకీర్తి గౌరవములనందుచున్న మాసరిక్ వలెనే ఐరిషు ప్రజాస్వామికమునకు అధ్యక్షుడై ప్రపంచరాజకీయరంగమున అనంతకీర్తి గౌరవములనందుచున్న డీవేలరా కూడ తొలుత ఉపాధ్యాయవృత్తియందు తగిలియున్నవాడే. 'డీవేలరా కార్యదీక్ష, ధైర్యసాహసములు, దృఢనిశ్చయము, త్యాగభావము, రాజకీయపరిజ్ఞానము, బుద్ధిబలయుక్తులు, కార్యకుశలతలు ముఖ్యముగ యువకుల కాదర్శప్రాయములు. ప్రపంచప్రశంసలకు పాత్రుడైన డీవేలరాజీవితము పరాధీనదశయందున్న యువకులుతప్పక చదువవలయునను యుద్దేశముతోడనే ఆంధ్రసోదరులకీ చిన్నిపొత్తమును సమర్పించుచున్నాను' అని గ్రంథకర్త తొలిపలుకులలో తెలిపెను. డీవేలరానుగూర్చిన నాలుగైదు హిందీపుస్తకములను, విశ్వామిత్ర మొదలగు హిందీపత్రికలను ఆధారముగ గైకొని శ్రీ చౌదరిగారీగ్రంథమును రచియించిరి. ఆదరింపదగిన ఉత్తమగ్రంథము. క్రౌనుసైజున 220 పుటలు. వెల ఒక రూపాయి. ప్రకాశకులు: ఆదర్శగ్రంథమండలి, ఎలమర్రు, కృష్ణాజిల్లా.

క్రొత్త పత్రికలు

౬. గార్డెనింగు రెవ్యూ

ఆంగ్ల మాసపత్రిక. వ్యవసాయవిషయములను, ఉద్యానవనకృషి విషయములను చర్చించునది. నవంబరు మాసమున తొలి సంచికయు, డిసెంబరుమాసమున మలి సంచికయు ప్రచురింపబడి యధాకాలమున మా కార్యాలయము నలంకరించినవి. ప్రథమసంచికయందు 'ఉద్యానవనకృషితత్త్వము', 'నేల: వృక్షజీవితము' 'తోటలు: కీటకబాధ' అను విజ్ఞానదాయకములగు వ్యాసములు ఆయావిషయములందు అభినివేశముగలవారిచే వ్రాయబడి విలువైనవై యున్నవి. రెండవ సంచికలోని 'వృక్షవైచిత్ర్యము', 'నేల: దానిని క్రమపఱచుట', 'తోటలలో గులాబీలు', 'ఫలవృక్షముల పెంపకము, వాని జాగ్రత్త' అను వ్యాసములు ప్రత్యేకపఠనార్హములై యున్నవి. ఈ సంచికయందలి 'బడితోటలు' అను వ్యాసమును అనువదించి స్థలాంతరమున ముద్రించితిమి. ఉద్యానవనకృషి మానవుని అవయవములకు వలసినంత పరిశ్రమను, అతని మనమునకు నిత్యతృప్తిని ఇచ్చునది. సాముదాయకముగ విచారించినచో దానివ్యాప్తి దేశకళ్యాణమునకు దోహదము చేయునదగుట సులభముగ నిర్ణయింపనగును. అట్టి ఉద్యానవనకృషిని ప్రత్యేకముగ ప్రస్తరించు ఈ పత్రిక ఎంతయు ప్రోత్సాహింపదగినది. శ్రీయుత పి. వి. కృష్ణస్వామిఅయ్యరు ఈ పత్రికాసంపాదకులు. పత్రిక క్రానుసైజున మేలెరపు కాగితములపై ముద్రింపబడుచున్నది. సాలు చందా మూడు రూపాయిలు. చిరునామా: ది గార్డెనింగు రెవ్యూ, 17, ముక్కర్ నల్లముత్తువీధి, మదరాసు.

౭. ఆదిక్షత్రియపత్రిక

ఇది గాంగవంశ ఆదిక్షత్రియసంఘపక్షమున సాంఘికోత్తేజమునకై ప్రకటింపఁబడు మాసపత్రిక. సంపాదకుడు. డాక్టర్ రాజవైద్య కోలా అప్పలనరసింహదేవు గారు. కార్యస్థానము: రాజమండ్రి. కొంతకాలము ఆగిపోయి తిరిగి ప్రచురణమందుచున్నది గావున దీనిని క్రొత్తపత్రికలలో చేర్చుచున్నాము. వెనుక ప్రచురింపబడునప్పుడు ఈపత్రిక సంపాదకులు తమ సంచికలలో నొకదానియందు అప్పటి తెనుగుమాసపత్రికలలో నొకటియగు ఆంధ్రసర్వస్వమునందలి శ్రీ అరవిల్లి నరసింహాచార్యులుగారి పెద్దాపురదుర్గము అను పద్యవ్యాసమును ఎత్తి ముద్రించుకొనుటలో వ్యాసకర్తనామమును, చేకొనిన పత్రికనామమును జారవిడిచి గ్రంథచౌర్యమునకు పాల్పడియున్నారు. ఈపునర్జన్మమునందైన నట్టిచౌర్యము పొంతపోవక శ్రీదేవుగారు ఈపత్రికను సవ్యముగ నడపి స్వసంఘము నుద్ధరింతురుగాక! సాలు చందా రూ 2-0-0. డబుల్ క్రౌను సైజు. ఆదిక్షత్రియసంఘప్రముఖులు ఈ పత్రికను సుస్థిరమొనర్తురుగాక అని మనఃపూర్వకముగ వాంఛించెదము.

౮. సంస్కారి

ప్రతినెల 5, 20 తేదీలయందు ప్రకటింపబడు పక్షపత్రిక. కార్యస్థానము: ఎలమఱ్ఱు, కృష్ణాజిల్లా. డబుల్ క్రౌనుసైజున 8 పుటలు. విడిసంచిక వెల ఒకకాని. జన్మభూమి, రాజహంస, దేవదత్తము అనుకాసీ పత్రికలవలె నిదియు ప్రజాభిముఖ్యమున విశేషప్రచారమునందగలదని ఆశింతుము. 5-12-33 తేదీన వెలువడిన మొదటి సంచికలో ఆంధ్రవిద్యాసాగరులగు కం. వీరేశలింగము పంతులుగారి చిత్రమును; హరిజనసమస్య, రైతులు: శిస్తులు, జపానుసాగులాట, భావసంవత్సరపంచాంగము, ఈనాందార్ల గల్లంతు మొదలగు వ్యాసములుగలవు.

౯. ప్రజాసంస్థ

'స్వపరిపాలనము, సహకారము, వ్యవసాయము, గ్రామపునర్నిర్మాణము, మఱియు నితరములగు ప్రజోపయోగకరములగు సమస్తవిషయములను ప్రచురించు మాసపత్రిక. సంపాదకులు: గాదె సింహాచలంపంతులు, ఎం.యల్.సి. కార్యస్థానము గుంటూరు. నవంబరు మాసమున వెలువడిన మొదటిసంపుటపు ఐదవ సంచికలో సహకారసంస్థలు, సహకారభీమా, గుంటూరు జిల్లాలో ప్రాథమికవిద్య మొదలగు వ్యాసములుగలవు. వ్యవసాయశాఖ అను పేరుతో శ్రీకర్లపాలెము కుటుంబశాస్త్రిగారు, బి.ఏ. ఒక పద్యవ్యాసమును వ్రాసియున్నారు. పత్రిక డెమ్మీసైజున ప్రచురింపబడుచున్నది. సాలు చందా ఒకరూపాయి,

సంపాదకీయ సమాలోచన

ఉన్నమాట అంటే ఉలుకెక్కువ:—

జవహరలాల్ నెహ్రూపండితుడు హిందూ మహాసభను దూషించాడని హిందూమహాసభానాయకులు అన్నిమూలలనుంచి గగ్గోలు ప్రారంభించారు. కొందరు జవహరలాల్ ఏ మాత్రపుహిందువుకు హిందూమహాసభను నిరసించడానికన్నారు. కొందరు ఆయనకు హిందూమహాసభనుగురించి ఏ మాత్రము తెలియదు, హిందూమహాసభ మాదిరి స్వార్థత్యాగులకూటము మరొకటి లేదు, అందులో ఉన్న దేశసేవాపరాయణులు మరొకసంస్థలో లేరన్నారు. మరికొందరు ఆయన హిందువుల ప్రతిష్ఠ, జాతీయత, గౌరవము కాపాడలేనిభీరువు, పిరికిపంద, ఆయనకు హిందూమహాసభను దూషించడానికిగల హక్కేది అన్నారు. ఇంతకూ ఆయన అన్నమాట ఏమిటి? హిందూమహాసభ జాతీయత బొత్తిగా నశించిన సంఘము. కులతత్వము వీరిని ఆవరించి వీరి విచక్షణాజ్ఞానాన్ని నాశముచేసింది. మహమ్మదీయులను మించిన సాంఘికవాదులు దీని నిండా ఉన్నారు. వీళ్ళ మెదడులు చాలాకుసందు అని. జవహరలాల్ పండితుడు ఉన్నమాట అంటే వీళ్ళకందరికి ఇంత ఉలుకెందుకో అర్థంకావడంలేదు. మహమ్మదీయులు ఏవో కొన్ని తాత్కాలికలాభాలు ఆశించి జాతీయతకు విరుద్ధమైన కార్యాలుచేస్తూ, జాతీయాశయాలకు విరోధులగుతున్నారు. అందుకే వారు సాంఘికతత్వం రాజకీయంలో ప్రవేశపెట్టారు, వారితోపాటు హిందూమహాసభవారుగూడా డీ అంటే డీ అనడం బొత్తిగా సమంజసంగాలేదు. మహమ్మదీయులు ప్రభుత్వంతో చేతులు కల్పినందువల్ల వాళ్ళకు కొన్నిలాభాలు కలిగినవని హిందూ మహాసభవారుకూడా రాబోయే సంస్కరణాలు ఆచరణలో పెట్టుదామని నిర్ణయించడం వారి మెదడు కుసందుగా ఉన్నదనడానికి దాఖలా. చాలరోజులనుంచి హిందూమహాసభవారు చేసేప్రయత్నాలన్నీ అంతకంతకు దేశంలో విభేదాలుకలిగే ప్రయత్నాలే. మహమ్మదీయులు చేయడంలేదా అంటే వాళ్ళుచేశారని మనమూచేస్తే గుడ్డిము గాడిదా ఒకటే అవుతయి. ఆవిషయం గమనించక ఏవేవో తీర్మానలుచేయుడం, వాటిని విమర్శిస్తే కుళ్ళికుళ్ళి విచారించడం ఏమాత్రము బాగాలేదు. దక్షిణాదిన ఒక నాయకుడు హిందువులు చాలామంచివాళ్ళు అని మంచిప్రవర్తనకు ఒక సర్టిఫికెట్టు ఇచ్చుకుంటూ వాళ్ళు ఎప్పుడూ విదేశీయులకు సహాయము చేశారని ఉదాహరణలు ఇచ్చాడు. అయితే ఆమాటకాదనడానికి వీలులేదు. చాలా మంచివాళ్లే. ఆవిదేశీయులు దేశసౌభాగ్యంలో భాగస్వాములు కానంతవరకున్నూ, విదేశీయులు ఉంగరాల చేతులతో మొట్టేవాళ్ళయితేనూ మనవాళ్ళ ప్రవర్తన బాగానే ఉందనాలె. దేశసౌభాగ్యంలో భాగస్వాములయినట్టిన్నీ, స్వదేశీయులయినట్టి హరిజనుల విషయంలో మనవారి మంచితనము ఏమయిందో కొంచెం ఆయన్ను విచారించమనండి. విదేశీయులకు సహాయంచేశే

టంతటి స్వార్థత్యాగులు హిందువులనడంలో స్వదేశీయులయినవారికి సహాయము చేయరనికూడా ధ్వనిస్తున్నది. మహమ్మదీయులు కూడా స్వదేశీయులై చాలావందల సంవత్సరాలయింది. అయినా జవహరలాల్ పండితుడు హిందువులు మంచివారు కాదనడం లేదే! ఇదివరకున్న మంచితనమే ముందు కూడా అవలంబించి సాంఘికవిభేదాలలోనికి దిగక, జాతీయాదర్శము ఏమరవద్దని హిందూమహాసభ వారికి ఆయన హితబోధ చేశాడు. హిందుమహాసభవారు తప్పుదోవల్లో కాలువేశారని ఇదివరలోనే నూటికి తొంభయిమంది హిందువులనుకుంటున్నారు. ఆ అభిప్రాయాన్నే జవహరలాల్ పండితుడు నిర్భయంగా వెలిబుచ్చారు. హిందూమహాసభానాయకులు తమ హిందూమహాసభా ప్రయోజకత్వాన్ని సమర్థించుకుంటే బాగుంటుందిగాని లేనిపోని అర్థము లేనిమాటలు మాట్లాడడం పెద్దమనిషి తరహాగాదు. జవహరలాల్ నెహ్రూగారికి గాంధిమహాత్ముడు ఇచ్చిన గౌరవమేగాని ఆయన నిజంగా గౌరవానికి అర్హుడుగాదని ఒకరు. కాంగ్రెసే ఈ హిందూమహమ్మదీయ విభేదాలను గలిగించింది, ఆమచ్చరూపుమాపడానికే హిందూమహాసభ ప్రయత్నిస్తున్నదని ఒకరు. హిందూసభానాయకులుమాత్రం స్వయంగా కష్టపడి గౌరవం సంపాదించుకున్నవారివలె మాట్లాడుతున్నారు. హిందూమహాసభానాయకుల కెక్కువ గౌరవం ఉందో, జవహరలాల్ పండితున కెక్కువ గౌరవముందో భారతదేశానికి తెలును. కాంగ్రెసు హిందూమహమ్మదీయ విభేదాలను కలిగించిందో, ఆ అవ్యక్తపువని హిందూమహాసభేత్యాది కుసందుబుద్ధిగల సంఘసభలు చేస్తున్నవో ఇంగితజ్ఞానంగల మానవులకందరికీ తెలును. ఈ విధంగా మాట్లాడడంవల్ల ఇదివరకేదైనా గౌరవం ఉంటే ఆ కాస్తకూడా పోగొట్టుకొని నవారైనారు హిందూసభానాయకులు.

మిల్లుయజమానులస్వలాభాపేక్ష :—

బొంబాయిమిల్లు యజమానులు మోడీగారి యాజమాన్యాన లంకాషైర్ ప్రతినిధులతో ఏర్పాటుచేసుకున్న ఒడంబడిక చూస్తే "మన కాయుష్యం మనకారోగ్యం, మాకు ధనం మీకు ఋణం" అనే సామెత జ్ఞాపకమొస్తుంది. వారిదృష్టిపథంలో దేశముయొక్క శ్రేయస్సు ఏమాత్రమూ లేదని మనకు దీనివల్ల నిర్ధారణ అవుతున్నది దీనిని బట్టి విచారిస్తే వారిదివరలో కాంగ్రెసుతో కలియడంగూడా వారిస్వలాభాపేక్ష పురస్కరించుకొనేనని కూడా తెలుస్తుంది. కాంగ్రెసుతో రాజీచేసుకుని ఖద్దరులాంటి ముతకగుడ్డ, దానిమాదిరిగా తయారుచేయమని చెప్పి స్వదేశీని కాంగ్రెసు ఒప్పుకొనేట్టు చేయడంవల్ల వారిగుడ్డకు అమ్మకము ఎక్కువచేసుకున్నారు. వారిజేబులు నింపుకున్నారు. స్వదేశీమిల్లుగుడ్డకు చేయూతనిచ్చి ఖద్దరు పెద్ద దెబ్బతిన్నది. ఈ విషయమైనా గమనించక ఆ మిల్లు యజమానులు దేశద్రోహకరమైన ఒడంబడిక ఒకటిప్పుడు చేసుకున్నారు. వారిస్వలాభాపేక్ష ముందర దేశాన్ని మిల్లు యజమానులు తృణీకరిస్తారని తెలినప్పుడు వారినీ, వారి లాభాలనూ వారికే వదలడం మంచిది. వారిజేబులను నింపవలసిన బాధ్యత ఏభారతీయుని మీద లేదు. వాళ్ళమేలు వారికే వదలి దేశంమేలుకోసం తిరిగి ఖద్దరునే దేశీయులంతా ఆదరించవలెనని ఆంగ్ల దైనిక పత్రిక ఒకటి ఇచ్చిన సలహా గమనించతగ్గది. ఖద్దరు ఖరీదు సాధ్యమైనంతవరకు తగ్గించి అందరూ తిరిగి ఎప్పటివలెనే ఖద్దరు వాడవలసిన

అవసరం ఇప్పుడు మరీ ఎక్కువగా ఉంది. స్వదేశీమిల్లుగుడ్డ ప్రజలు కొనవచ్చునని కాంగ్రెసు సలహాఇచ్చినతరువాత మోసపు స్వదేశీగుడ్డ దేశంలో ఎక్కువైంది. స్వదేశీ అనిగాని విదేశీ అనిగాని నిర్ణయించ వీలు లేక స్వదేశీమాదిరిగా ఉండేగుడ్డను స్వార్థపరులైన వర్తకులు అనేకులు స్వదేశీ పేరున విక్రయించడము ఎక్కువైంది. పర్యవసానము.... తెలియని చాలామంది చివరకు విదేశీయే కొన్నారు. వాళ్ళు దాన్ని స్వదేశీ అనుకున్న మాత్రాన దేశానికి రావలసిన నష్టం రాకుండా ఉండదుగదా! అసలు మిల్లు నూలు వస్త్రములనే కొనడం మానివేసితే ఈవిధంగా మోసపోవడానికే వీలుండదు. మిల్లు యజమానులు, ఇతర వర్తకులు స్వార్థమపేక్షించి దేశద్రోహం చేయడానికి వీలుండదు. ఖద్దరు బీదలపాలిటి కల్పవృక్షమయి విలసిల్లడానికి వీలవుతుంది.

సౌత్ ఇండియా కో ఆపరేటివ్ ఇన్స్యూరెన్సుసొసైటివారి ప్రథమవార్షిక నివేదిక:—

1932-వ సంవత్సరము ఏప్రియలు మాసమునుండి 1933-వ సంవత్సరము జూనుమాసముఆఖరుగల పదునైదుమాసముల ఈ ఇన్స్యూరెన్సు సొసైటివారి ప్రథమవార్షిక నివేదిక విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడినది. నివేదితకాలమున సొసైటీవారు కావించిన పనియెంతయు తృప్తికరముగను, ప్రోత్సాహకరముగను ఉండి సొసైటీయొక్క భావిశుభమును, అభివృద్ధిని సూచించుచున్నది. గతవత్సరపు జూను 30-వ తేదీకి 55 సహకారసంఘములును, 550 గురు వ్యక్తులును సభ్యులైయున్నారు. నివేదితకాలమున 6,33,500 రూపాయిల భీమావ్యాపారమును ఈ సొసైటీవారు చేయగలిగియుండిరి. ఇది శుభారంభమై సొసైటీకార్యనిర్వాహకుల కార్యదక్షత్వమును ప్రదర్శించుచున్నది. సొసైటీవారి ప్రధానసంకల్పములలో పేదతరగతుల,మధ్యమతరగతులవారినుంచి చిన్న మొత్తములకు పట్టాలనుగొనుట ప్రత్యేక ప్రశంసనీయమైయున్నది. ఐదువేలకుమించి ఈ సొసైటీయందు పట్టాలీయబడవు. నూరు రూపాయిలకుకూడ పట్టాలీయబడును. ఇట్టి సొసైటీ బీదలపాలిటి పెన్నిధిగానున్నది. నివేదితవత్సరమున సొసైటీవారు సమకూర్చిన ఆరులక్షలకు మించిన భీమావ్యాపారములో నాలుగులక్షలవరకు చిన్నమొత్తములపట్టాలవలననే సమకూడినదనుటచే సామాన్యజనులకీసొసైటీ ఎట్లు అందుబాటైయున్నదో తెలిసికొనవచ్చును. ఈ సొసైటీవారి ప్రీమియము రేట్లు మిక్కిలితక్కువ. పోస్టలు ఇన్స్యూరెన్సులోతప్ప ఇతరకంపెనీలయందు ఇంతటి తక్కువ ప్రీమియము రేట్లు లేవని చెప్పవచ్చును. ఈ కంపెనీవారి మఱియొక సంకల్పము సహకారభీమావలని లాభములను సౌత్ ఇండియాయందలి అన్నిజిల్లాలయందును, పరిసరమునగల స్వదేశసంస్థానములందును కలిగించుట. నివేదితకాలమున ఒక్క సౌతు ఆర్కాటుజిల్లాయందు తక్క మిగిలిన అన్ని జిల్లాలయందును మైసూరు, కొచ్చిన్, ట్రావెన్కూరు సంస్థానములందును సొసైటీవారు భీమావ్యాపారమును సమకూర్చియుండిరి. ఒక్క తెలుగుజిల్లాలనుండి మూడున్నరలక్షల భీమావ్యాపారము సొసైటీవారు సంపాదింపగలిగిరనుట ఆంధ్రులకు ఆనందమును గూర్చు విషయము. మదరాసు ప్రభుత్వమువారు ఈ సొసయిటీవారి వ్యాపారాభివృద్ధికి

చక్కని చేయూత నొసంగుచున్నారని వినుట కెంతయు సంతోషముగ నున్నది. ఆంధ్రనాయకపుంగవులు శ్రీయుత వేమవరపు రామదాసుపంతులుగారు ఈసొసయిటి అధ్యక్షమహాశయులు. సౌత్ ఇండియాయందు సహకారోద్యమప్రచారమునకు మూలస్తంభములై వారు దేశకళ్యాణమునకు అనంతముగ తోడుపడుచున్నారు. బొంబాయియందును, బెంగాలునందును కో ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసయిటీలుండుటనుగాంచి తమ కార్యక్షేత్రము సౌత్ ఇండియాయందుగూడ నట్టి దొకటియుండుట వాంఛనీయమనియు, ప్రజోపయోగకరమనియు శ్రీ రామదాసు పంతులుగారు తలంచి ఈసౌత్ ఇండియా కో ఆపరేటివు ఇన్సూరెన్సు సొసయిటీని స్థాపించిరి. కార్యదక్షులుగావున వారు ఒక్కసంవత్సరమునందే ఈ సొసయిటీ భీమావ్యాపారము బొంబాయి, బెంగాలు సొసయిటీలు ఇంతవఱకుచేసిన భీమావ్యాపారమును మిగులునట్లు ఒనరింపగలిగిరి. సహకార భీమావ్యాపారమునకు సముచితప్రచారమును గొనివచ్చి ప్రజాక్షేమమునకు ప్రోద్బలమిచ్చుచున్నందులకు శ్రీ పంతులుగారికి సౌత్ ఇండియా యెంతయు ఋణపడియున్నది. సొసయిటి కార్యదర్శులగు వి. వేంకటచలముగారు సొసయిటీ క్షేమమునకై చేయుచున్నకృషియు ప్రత్యేకప్రశంసనీయమైయున్నది. నివేదితవత్సరమున వారుస్వయముగ సొసయిటీకి 5[illegible],500 రూపాయిల విలువగల భీమావ్యాపారమును కాన్వాసుచేసి అందుపై ఎట్టి కమీషనుగాని గైకొనక సొసయిటీ క్రమాభివృద్ధికి మంచి పునాదివైచిరి. ఆంధ్రసహకారోద్యమ ప్రచారకులు నరసింహదేవర సత్యనారాయణగారు మున్నగువారు ఈసొసయిటీడైరక్టరేటు నందుండి సహకారభీమాప్రచారమున కెంతయు తోడుపడుచున్నారు. ప్రథమవార్షికనివేదికయందే ఇంతటి విశేషాభివృద్ధినిచూపి సొసయిటీకి సుస్థిరతప్రసాదించిన అధ్యక్షమహాశయులను, కార్యదర్శులను, డైరక్టరులను మేమెంతయు అభినందించుచున్నాము.

ఆదర్శసంపాదకుడు శ్రీనాగేశ్వరరావు:—

ఆంధ్రపత్రిక ప్రధానసహాయసంపాదకులగు శ్రీ చల్లా శేషగిరిరావుగారి కీనడుమ గలిగిన అనారోగ్యమునుగూర్చియు, వారు పునరారోగ్యమును పొందుటకై శ్రీనాగేశ్వరరావుగారు సలిపిన విశేషకృషి, చేసిన అనంతసహాయము ఆంధ్రపత్రికవలన ఆంధ్రలోకము తెలిసికొనియేయున్నది. తమ పత్రికాకార్యాలయమున పనిచేయువారి క్షేమాభివృద్ధులవిషయమై కంటవత్తిడుకొని శ్రీ నాగేశ్వరరావుపంతులుగారు గుండురనుటకు ఆంధ్రపత్రికసన్మానావసరమున పత్రిక ప్రారంభించినప్పటినుండియు కంపోజిటరుగనున్న ఆతనిని పేర్కొనుటయు, ఇపుడు శ్రీ శేషగిరిరావుగారి విషయమున వారు తీసికొనినశ్రద్ధయు ప్రబల నిదర్శనములు. తమ సహాయసంపాదకుల నిట్లాదరించు సంపాదకులు ఆంధ్రదేశమున నెందరున్నారు? జైలులో కలిగిన కష్టకాలపరిచయమునుగూడ మఱచి బయటకువచ్చినతోడనే ఆసహాయసంపాదకుని ఉద్యోగమునకు ఉద్వాసన చెప్పగలవారును, తనక్రిందిచాకిరిచేయు సహాయసంపాదకునిమాట మిగిలినను మానము ప్రాంకితుడై యుండగలవారును అగు సంపాదకులు శ్రీనాగేశ్వరరావుగారిని చూచియైనను గుణపాఠము నేర్చుకొని మెలగి తము సంపాదకస్థితికి తగిన గౌరవప్రతిష్ఠల నందుదురుగాక! బాధ్యతకు దూరులగుచో వారికి రాగల గౌరవము నామమాత్రముగునని వారు తెలిసికొనవలసియున్నది.



నవంబరు, ౧౯౩౩

౨౨:—రామచంద్రపురం తాలూకా మల్లవరం. ఇంటి చూరులో బాంబువంటిది దొరికినదని చిట్టూరి ప్రకాశరావుగారి అరెస్టు.

:—మదరాసు. కవుతా సీతారామశాస్త్రిగారి సరస్వతీనికేతనప్రారంభోత్సవము శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు జరిపిరి.

౨౩:—బెంగళూరు. సుప్రసిద్ధఆంధ్రనటి మాదపాటి సరోజినిదేవిగారు మరణించిరి.

౨౬:—భీమవరము. 12-వ ఆంధ్ర ఆయుర్వేద వైద్య సమ్మేళనము. వైద్యపంచానన కృష్ణశాస్త్రి దావడెగారి అధ్యక్షత.

౨౭:—నిజాంపట్నము. గుంటూరుజిల్లా గైతుస్త్రీల సభ. శ్రీ గోగినేని భారతీదేవిగారి అధ్యక్షత.

౩౦:—శేషవారపుపేట. కర్నూలు మండల ప్రథమ గ్రంథాలయ మహాసభ. శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు అధ్యక్షులు.

:—ఈదుపుగల్లు. కమ్మప్రముఖులు పర్వతనేని పెద కామయ్యగారి మరణము.

డిసెంబరు, ౧౯౩౩

౨:—హొస్పేట్. ఆంధ్రమహాజనసంఘవార్షికోత్సవము.

:—రామచంద్రపురం. చిట్టూరి ప్రకాశరావుగారి విడుదల.

౪:—కడప. ముద్దనూరు బాంబుకేసులో ముద్దాయి విడుదల.

౫:—బళ్ళారిజయిలునుండి విడుదలనొంది శ్రీ కొండాలి ఆంజనేయులుగారు బందరు చేరిరి.

:—నూజివీడు. శ్రీ కాశేశ్వరరావు, కమలాదేవి గార్లకు సంవత్సరము విధిశైరు.

౬:—రంగూనులో నాటకప్రదర్శనములు గావించి శ్రీ స్థానం నరసింహారావుగారు నటబృందముతో తెనాలి వచ్చిరి.

:—దివాన్‌బహద్దరు బాలసుందరమునాయుడుగారు మదరాసు షెరిఫుగ నియమింపబడిరి.

౭:—విశాఖపట్టణము. ఆంధ్రవిశ్వవిద్యాలయము ఏడవ పట్టప్రదానోత్సవము. న్యాయమూర్తి ముత్తరాజా వెంకటసుబ్బారావుగారి కాన్వకేషను ఉపన్యాసము.

౮:—విశాఖపట్టణము. విక్రమదేవవర్మశాస్త్రకళాశాల భవనప్రవేశోత్సవము గవర్నరుగారుజరుపుట.

:—విశాఖపట్టణము. ఆంధ్రవిశ్వ విద్యాలయ సభామందిరమున శ్రీ రవీంద్రనాథ ఠాకూరుగారి 'మానవుడు' అను విషయమునుగూర్చిన ప్రథమోపన్యాసము.

:—సామర్లకోట. ప్రపంచపర్యటనము సలిపివచ్చిన కిర్లంపూడిరాజా రావు రామకృష్ణరంగారావు బహద్దరు ఎం. ఎల్. సి గారికి స్వాగతము.

౧౦:—విశాఖపట్టణము. కవితాసమితివారు శ్రీరవీంద్రనాథ ఠాకూరుగారికి స్వాగతపత్రమర్పించుట.

౧౫:—అమలాపురము. వాడ్రేవు జగ్గరాజుగారి ఎరస్టు. రాజప్రతినిధి రాక సందర్భమున అయి ఉండునని. 20-వ తేదీవఱకు రిమాండు, అనంతరము విడుదల.

౧౬:—మహాత్ముని ఆంధ్రరాష్ట్ర పర్యటనము. బెజవాడ చేరుట.

:—పొన్నమండ. మహాత్ముని సంచారకార్యక్రమమున పొన్నమండ చేర్పలేదని శ్రీహరిజనాశ్రమ మానేజరుగారైన శ్రీ ఉండ్రు సుబ్బారావుగారు నిరశనవ్రతము ప్రారంభించుట.

౧౯:—విశాఖపట్టణము. వైస్రాయిగారు హార్బరును దర్శించుట

"ఆంధ్రభూమి"



"పొలము కాపరి బోటి"

[శ్రీయుత వరదా వేంకటరత్నముగారి త్రివర్ణ చిత్రమునుండి ఎత్తిన ఛాయాపట చిత్రము.]

ఆమె చూపులు

✤

కలువకన్నెల మొలకనవ్వుల
పిలుపులకు మేనెల్లఁ గ్రమ్మి
పులకలకు తెగిపడ్డ చుక్కల
వలపు తేజస్సో,—

సంజకెంపుల మసకచీఁకటి
చాయలన్ జిగురాకుచాటున
సన్నపాటలఁ బాడు కోయిల
కన్నెవిరహంబో,—

విరిసి విరియని రేకురేకున
మెరుఁగురంగులఁదోఁచు జీరల
మురువు గులికెడి పూవపువ్వుల
జవ్వనపుఁదలఁపో,—

కలసి యామెవిశాలనీలా
కాశసదృశమనోజ్ఞదృష్టుల
వలపుదారులవెంటఁ జిక్కని
కళలతో జారెన్.

ఆమెచూపులఁ బరులకెవ్వరి
కర్థమేకానట్టి వెన్నియొ
యవ్యృతమోహాన నీరవ చ్ఛా
యలు మెలంగినవి.

ఆమె చూపులనైల్యములఁ బ్రణ
యాంబరంబులె వ్రాలిపోయెనొ!
ఆమె చూపులె జారిపోవుట
నభ్యసించినవో!!

✤

—వజ్ఝల కాళిదాసు.

పెంపుడు కుక్కలు

(వినోద వ్యాసము)

నాడు కాలేజీకి సెలవుదినం కదా అని నారాయణరావు, నేను జంతుప్రదర్శనశాల చూడడానికి బయలు దేరినాము. అక్కడ కలిసినాడు మాకు ప్రకాశం. పరిక్షలలో వాడి తెలివితేటలు అట్టే ఉపచరించేవి కావు గాని, నిజంగా ప్రకాశం చాలా చురుకైనవాడు. వాడితో కూచుంటే మా హాస్టల్‌లో ఎవడికీ చదువు, సంధ్య తలపెట్టడానికి మనసు ఉండేదికాదు. తమాషా అయిన కబుర్లు చెప్పి, నవ్వించి, అందరినీ రంజింప జేసేవాడు.

కులాసాగా ముగ్గురం కొంతసేపుతిరిగి, కబుర్లు చెప్పుకుంటూ, ప్రొద్దుగ్రుంకే సమయానికి సముద్రతీరం చేరుకుని, యిసుకలో కూచున్నాం విశ్రాంతికి. మా వలెనే అనేకులు తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు, యువకులు, వృద్ధులు, స్త్రీలు, చిన్నపిల్లలు, అందరూ 'బీచి' వద్ద చల్లగాలికి విహరించడానికి వచ్చారు. మాకు కొంచెం దూరంలో హాయిగా మాట్లాడుకుంటూ, కిలకిల నవ్వుకుంటూ ఒక దొర, దొరసాని నిల్చున్నారు కెరటాల వేపు చూస్తూ. ఆమె ఒక తెల్లని జూలుకుక్క నెత్తుకొని, దానిని రొమ్ముకదుముకుంటూ, దానితో ఏవో కబుర్లుచెబుతూ, దాని కళ్ళలోకి చూస్తూ, ఎంతో ముద్దుగా దాని చెంపను తన చెక్కిలిచేర్చి, ఓరచూపులతో మధ్యమధ్య దొరగారివైపుచూసి నవ్వుతూ ఉంది. ఆదొరసానివైపు రెప్పవాల్చకుండా అట్టే చూస్తూ, మాటామంతీ లేక కూచున్నాడు ప్రకాశం. వాడివైఖరి కనిపెట్టి నారాయణరావు, నేను, ముసిముసిగా నవ్వుకున్నాం.

"నవ్వడ మెందుకు?...నిజం చెప్పండి, ఆమె చక్కదనం మిమ్మల్నిమాత్రం ముగ్ధులను చెయ్యడం లేదా?" అన్నాడు ప్రకాశం.

"...ఆదొరగారు ఆమెప్రియుడు కాబోలు,— అదృష్టవంతుడు!" అన్నాడు నారాయణరావు.

"నే నాలోచిస్తున్నది అతగాడిగూర్చి కాదు,..." అని యేమో చెప్పబోయినాడు ప్రకాశం.

"ఆమెనుగూర్చేలే! నీచూపులే చాటుతున్నాయి ఆసంగతి." అన్నాను నేను వేళాకోళానికి.

"అదికాదోయి! నే నాలోచిస్తున్న దేమంటే, 'ఆ దొర ఆమెకు ప్రియుడైనా, భర్తఅయినా, అతనికంటె వెయ్యిరెట్లు ఆకుక్క అదృష్టవంతురాలు కాదా?' అని. నా ఊహాలన్నీ యిప్పుడు కుక్కలమీదికి పోతున్నాయి అంతేకాని,—" అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

"ప్రకాశం! జ్ఞాపకముందీ నీకు, మనం లోగడ చదివిన టెన్నిసన్ పద్యం? ఎవతెనోగూర్చి వ్రాస్తూ, 'ఆమె రవికనైఉంటే గుండె తాకుతూ ఉందును కదా; ఆమె కాలిజోడునైఉంటే పాదాలు ఒత్తుతూ ఉందును కదా; ఆమె జుట్టునైఉంటే చెంపలు ముద్దాడుతూ ఉందును కదా!' అని విలపిస్తాడు కవి? అట్లా ఉంది కాబోలు నీహృదయారాట మిప్పుడు! దేవుడు నిన్ను మనిషిగా పుట్టించినాడు కాని, ఆకుక్కగా పుట్టించి ఉంటే, ఎంతో సంతోషించి ఉందువనుకుంటా! ఏం?—" అన్నాడు నారాయణరావు.

"నిస్సందేహంగా!" అన్నాడు ప్రకాశం.

ఆమాటకు మేమిద్దరం ఉప్పెనగా నవ్వుకున్నాం. అందుమీద ప్రకాశం మావేపు తిరిగి ముఖం గంభీరంగా పెట్టి కుక్కలమీద చిన్నఉపన్యాసం ప్రారంభించాడు:

"సృష్టిలోకల్లా మానవుడిది ఉత్తమజన్మ అని చెప్తారు పెద్దలు. నిజమే కావచ్చును; నిలవదీసి అడిగితే మాత్రం రుజావుచెయ్యడానికి తటపటాయించ వలసి వస్తుంది. కాని జంతువులలోకల్లా అదృష్టజీవులు పెంపుడుకుక్కలే అన్న సంగతి సులువుగా రూఢిపరచ వచ్చును. ఎద్దు, గాడిద, మేక మొదలైనవి ఎంత దురదృష్టజంతువులో ఆవు, పిల్లి, కుక్క మొదలైనవి అంత అదృష్టజంతువులు. అదృష్టజంతువులలో కల్లా

అదృష్ట జంతువులు పెంపుడు కుక్కలు !

"మానవుడే జంతువునీ ఫలాపేక్ష లేక మచ్చిక చెయ్యడు. ఆవుని పాలకోసం, గుర్రాన్ని స్వారినిమిత్తం, ఎద్దుని నాగలి దున్నడానికి పెంచుకుంటాడు. అట్లే గాడిదచేత బరువులు మోయింపజేస్తాడు. మేకని, గొర్రెని, కోడిని, మాంసంకోసం పెంచి మేపుతాడు. అందుకూ పనికిరాని జంతువును తోలుకోసమో, బొచ్చుకోసమో, ఎముకలకోసమో పెంచి సంహరిస్తాడు. ఇక ఏలాభమూ తలపెట్టక పెంచే జంతువు లొక్క కుక్కలే ! అవి పనిచెయ్య నక్కరలేదు. గ్రుడ్లు పెట్ట నక్కరలేదు. బలిపశువులుగా ఉపయోగపడ నక్కరలేదు. హాయిగా తింటూ, తిరుగుతూ, మహారాజ భోగంతో బ్రతకడానికి నోచుకున్న ధన్యజీవు లవి !

"ఇది కలియుగమన్నమాట మరచిపోయి, పార్వతీ పరమేశ్వరు లెప్పుడైనా భూసంచారానికి బయలుదేరి గ్రహచారవశాత్తూ నాకంట బడడమే తటస్థిస్తే, రాబోవు జన్మలో నన్ను పెంపుడుకుక్కగా పుట్టించమంటాను. ఇట్లాంటి విషయాలలో 'స్వదేశీ' అభిమానాలు పెట్టుకుంటే లాభంలేదు. ఇంగ్లీషుకుక్కగా పుడితే నిజంగా జన్మసార్థక మవుతుంది. పరజన్మలో తీరని హృదయబాధకమైన వాంఛలు కొన్ని అప్పుడు తీర్చుకోవచ్చును. కొందరు దొరసాన్లకు తమ ఆప్త బంధువులమీదకంటె పెంపుడుకుక్కలమీద యెక్కువ అభిమానమట. యజమానురాలితొడమీద కూర్చుని, ప్రేమతో ఒడలంతా రాకుతూ, నిశ్చయంగా నలుగురిలో మూతిముద్దులాడగల మహాభాగ్యం సీమకుక్కలకుగాక ఎవరికి లభ్యమౌతుంది? ఆమె యెడల కన్న బిడ్డలకు లేని చనువు, గృహయజమానికి లేని అధికారం చెలాయించగలవు అవి.

"సీమకుక్కలది నిజంగా దేవేంద్రభోగం. వాటి మీద గృహయజమానికి, యజమానురాలికి, పిల్లలకు, బంధువులకు, నౌకర్లకు, అందరికీ గారాబమే ! వాటికి దుస్తులు, పరుపులు, కుర్చీలు, సోఫాలు, మిఠాయిలు, నౌకర్లు, వైద్యులు, మోటారుకార్లమీద షికార్లు, ఉత్తమజాతి కుక్కలతో సంబంధబాంధవ్యాలు యేర్పరచుకుందుకు తగిన అవకాశాలు, ఒకటేమిటి?— భూలోకంలో అనుభవించతగిన భోగాలన్నీ వాటివే !

"ఈ తెల్లవాళ్ళు కుక్కలమీద ఖర్చుపెట్టే డబ్బు యింత, అంత కాదు. వేలకువేలు పోసి కొంటారు కుక్కల్ని. మన హరిశ్చంద్రుడే తెల్లదొర అయివుంటే, అడవిలో ఉన్నప్పుడు ఓ రెండు కుక్కల్ని సంపాదించి, వాటిని అమ్మేసి విశ్వామిత్రుడి అప్పు సుళువుగా తీర్చగలిగి ఉండును—పెళ్ళాన్ని అమ్ముకోవలసిన అవసరమే లేకపోవును !

"అయితే, పులినిచూసి నక్క వాతలుపెట్టుకున్నట్లు, మనవాళ్ళుకూడా యిప్పుడిప్పుడు కుక్కలమీద మోజుపడడం నేర్చుకుంటున్నారు. మన జమీందార్లకు, ఉన్నతోద్యోగస్థులకు తమ కుక్కలమీద ఉండే అభిమానంలో నూరోవంతు తమ ప్రజలమీద, సేవకులమీద ఉంటే, దేశంలో యింత అశాంతికి కారణమే లేకపోవును. ప్రపంచంలో కుక్కలనిమిత్తం వ్యయమయ్యే ధనం మనుష్యులనిమిత్తం వినియోగపడితే, ఏదేశంలోనూ దరిద్రమనేది ఉండక నేపోవును !

"కుక్కలమీద మానవుడికి యింతమమత ఉండడానికి నిజమైన కారణంకూడా ఏదీకనబడదు. కుక్కలు అందమైన జంతువులనీ; నేర్పితే సర్కస్‌వాళ్ళవలె మొగ్గలువేసి చూపరులను రంజింపజేస్తాయనీ; దొంగలను రానీయకుండా యజమానుడియిల్లు కాపాడతాయనీ; వేటకు ఉపయోగపడతాయనీ; ఇంటో పిల్లులను, ఎలకలను చేరనియ్యకుండా చేయగలవనీ; సమయంవస్తే పాముల్నిగాని, పెద్దపులినిగాని ఎదిరించి, చంపి యజమానిని రక్షిస్తాయనీ; మనుష్యులవలెనే వాటికి బుద్ధిజ్ఞానాలు మెండుగా ఉన్నాయనీ; ధైర్యం, భక్తి, విశ్వాసం, స్నేహం మొదలైన గొప్పగొప్ప గుణాలుగల ఉత్తమజాతి జంతువులనీ, ఏవేవో అసందర్భమైన కారణాలు చెప్పడం తెలివిహీనం! కుక్కలకంటె అందమైనవి, చురుకైనవి, విశ్వాసంగలవి, ధైర్యంగలవి అనేకజంతువులున్నాయి. కాని సమస్త జీవరాసులలోను కుక్కలే నరుడికి ప్రాణస్నేహితులై ఉంటూవుండడం కేవలం భగవంతుడి చిద్విలాసం !

"మనవాళ్ళకంటె తెల్లవాళ్ళకు కుక్కలమీద శ్రద్ధాభిమానాలు అధికం. ఇంగ్లీషుకవులెందరో వ్రాశారు కుక్కల్నిగూర్చి తమ గ్రంథాలలో. నవలలలోను, నాటకాలలోను, పద్యాలలోను కుక్కలను పొగడి, గౌరవించి, వర్ణించి, వాటిచేష్టలను మెచ్చుకొని, గుణాలనెన్ని, వాటికోసం నెత్తినోరూ కొట్టుకొని, గుండెపగిలేటట్లు యేడ్చిన కవులున్నారు వాళ్ళలో! ఇంగ్లీషువార్తాపత్రికలలో కుక్కల ప్రసంగం లేకుండా ఉండదు. ఫలానా ప్రభువు ఆస్ట్రేలియా నుండి ఒకజోడా గొర్రెమూతి కుక్కపిల్లల్ని విమానం మీద తెప్పించారనీ, ఫలానా మిస్సమ్మగారి బొచ్చుకుక్క సుఖప్రసవమై పొవుడజన్ కూనలను కన్నదనీ, ఫలానా పేరుగల పందెపుకుక్కను దొంగిలించిన వారి ఆచోకీ తెలియజేయగలవారికి వెయ్యి బంగారుకాసులు బహుమాన మియ్యబడుననీ, బ్రిటిష్ జంతుప్రదర్శనశాలకు క్రొత్తగా తెప్పించబడిన తోకలేని కుక్క న్యూమోనియా జబ్బువలన అస్వస్థతగా నున్నదనీ, నక్కవేట కొకానొక కోటీశ్వరుడు మూడువందల కుక్కలతో బయలుదేరుచున్నట్లు తెలియవచ్చుచున్నదనీ, కుక్కలనుగూర్చి ఎన్నో ముచ్చట్లు, వ్యాసాలు, ప్రకటనలు అనునిత్యం ప్రకటింపబడుతూ ఉంటాయి పత్రికలలో. కుక్కల్ని పెంచి వాటిని తరిఫీదు చెయ్యడమే కొందరు దొరలకు ముఖ్యవృత్తి. ఇంగ్లీషు జంతువైద్యశాలలు ముఖ్యంగా కుక్కలకోసమే యేర్పరచబడినవి! కుక్కలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన సైకిల్సు ఉన్నాయి. టోపీలు ఉన్నాయి. ఆట వస్తువులున్నాయి. కుక్కలకోసం ఇరూన్నెనేన్నకంపెనీలున్నాయి. బిస్కట్ ఫ్యాక్టరీ లున్నాయి. హోటేళ్ళున్నాయి. రెయిలుబండ్లలో ప్రత్యేకంగా పెట్టెలు యేర్పాటై ఉన్నాయి. తెల్లవాళ్ళ ధర్మమా అని, నేటి మానవసంఘంలో కుక్కకు ప్రత్యేకస్థలం యేర్పడింది.

"మనపూర్వుల కెందుచేతనో కుక్కలపట్ల అట్టి అభిమానం కుదరలేదు. భారతరామాయణాదిగ్రంథాలలో కుక్కల ప్రశంస బహుతక్కువ! కుక్కల్ని స్తుతిస్తూగాని, కుక్కలకు అంకితమిస్తూగాని మన కవులెవరూ పుస్తకాలు వ్రాయలేదు. మన ప్రబంధాలలోని నాయకీమణు లెవరూ పెంపుడుకుక్కల్ని వెంటబెట్టుకొని ఉద్యానవనాలలో విహరించినట్లుగాని, కుక్కలచేత ప్రియులకు రాయబారాలు పంపినట్లుగాని లేదు. ఎంతసేపూ చిలకలు, గోరువంకలు, నెమళ్ళు, లేడిపిల్లలు మొదలైనవాటిమీదనే ముచ్చట పడేవారు. విరహవేదనలో తాము ఒళ్ళుమరచి ఉన్నప్పుడు సహితం ప్రియుడేవచ్చి యెదుట నిల్చున్నట్లు భావించుకొని చిలికత్తెలను, చెట్లను కౌగలించుకునేవారు కాని, కుక్కలనిూదపడి యేడ్చేవారుకారు. మనరాజులు కూడా అశ్వాధిపతులు, గజాధిపతులు అని పేరు పొందడానికి వేలకొలదీ గుర్రాలనో, గోవులనో, ఏనుగులనో, ఒంటెలనో పెంచి ధరించేవారుకాని శునకదళాధిపత్యానికి దేవులాడేవారుకారు. బహుశః, పర్ణశాలలో సీతారాములవద్ద ఒక జత కుక్కలే ఉన్నట్లయితే, రావణాసురుడు ఆపొలిమేరకు రాలేకపోవును. అడవిలో దమయంతివద్ద ఒక కుక్క ఉంటే, నలుడు చెప్పకుండా పారిపోయినప్పుడది పసిపట్టి అతనిజాడ కనిపెట్టి యుండును. ద్రౌపది తనవెంట ఒక కుక్కను తీసికొనిపోయిఉంటే, కీచకుడు పైబడడానికి వచ్చినప్పుడు దానిని ఉసిగొలిపి సులువుగా తప్పించుకొని యుండును. అరణ్యాలమధ్య చిన్న పర్ణకుటీరాలలో నివసించే మహారుషులుకూడా ఎవరూ కుక్కల్ని పెంచుకున్నట్లు లేదు. అహల్యవంటి రూపవతియైన పడుచుపెళ్ళాన్ని యింట్లో ఉంచుకొని కూడా, గౌతమముని కుక్క నొకదానిని పెంచుకోకపోవడం నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే!

"మన దేవుళ్ళలోకూడా ఎద్దువాహనంవాళ్ళు, ఎనుబోతువాహనంవాళ్ళు, గద్దవాహనంవాళ్ళు, నెమలివాహనంవాళ్ళు ఉన్నారేకాని శునకవాహనం వాళ్ళెవరూ లేరు. నానాఅవతారాలు రెత్తిన విష్ణుమూర్తి సహితం నరసింహావతారం రెత్తినాడు కాని, గ్రామసింహావతారం రెత్తడానికి ముచ్చట పడలేదు!

"మన పూర్వులకు కుక్కలంటే మోజులేకపోవడం అటేకదా, మీదు మిక్కిలి వాటియెడల ఒకవిధమైన

తృణీకారభావం, అయిష్టత, ద్వేషం ఉండేవని తో స్తుంది. వాడుకలో ఉన్న సామెతలనుబట్టి చూస్తేఅట్టి అభిప్రాయం ధృవపడుతుంది. నీచంగా ప్రవర్తించే మనిషిని 'కుక్క బుద్ధి' కలవాడనీ, పిరికివాడిని 'కుక్క వలె తోకముడుచుకున్నా'డనీ, కలహించేవాళ్ళను 'కుక్కలవలె కాట్లాడుచున్నా'రనీ, ఉన్నత పదవిలో ఉన్న అల్పుని 'అందలమెక్కి తోక్కొరికెడు కుక్క వంటివా'డనీ, తప్పుచేసినవారిని దండించుట 'కుక్క కాటుకు చెప్పుదెబ్బ' అనీ—ఎన్నో సామెతలున్నాయి వాడుకలో.

హిందూసనాతనులకు కుక్కలు అస్పృశ్యజంతువులు! మహమ్మదీయులకుకూడా కుక్కలంటే గౌరవంలేదు. కాబట్టే క్రమంగా హిందూదేశంలో కుక్కల ప్రభ క్షీణించిపోయి, వాటి బ్రతుకు అధ్వాన్నమై పోయింది. ఎంగిలాకులకు దేవులాడుతూ, అంట్లగిన్నెలు నాకుతూ, దొంగతిళ్ళకు ఆశించి యిళ్ళలో జొరబడి కఱ్ఱదెబ్బలు తింటూ, మానవస్నేహానికి పరితపించి నిరాశ కలన వెఱ్ఱెత్తిపోతూ, దుర్భరమైన క్షుద్రజీవనం గడప వలసిన గతి పట్టింది మన ఆర్యావర్త శునకరాజములకు!

"ఎంత పుచ్చిన మిరియాలైనా జొన్నలపాటి చెయ్యవా అన్నట్లు, కాలచక్రం క్రిందుమీదై ఒక్కొక్కప్పుడు కుక్కలబ్రతుకు అపసవ్యంగా పరిణమించినా, మొత్తంమీద వాటిది అదృష్టజీవనమే అని ఒప్పుకోక తప్పదు. ఈ ఇరవయ్యోశతాబ్దపు నాగరికత దినదినాభివృద్ధియై, మరో వందసంవత్సరాల పిమ్మట కుక్కలను నరుడి స్నేహితులుగా మాత్రమే గాక, యజమానులుగాకూడా చేసివేయగలదు! కుక్కను చంపితే గుడి కట్టిస్తేకాని ఆపాపం పోదని ఉన్నది మన ధర్మశాస్త్రాలలో. ఈ శాస్త్రాలు మారిపోయి, నవీన నాగరికతకు అనుగుణ్యంగా క్రొత్తశాస్త్రాలు నిర్మింపబడినప్పుడు కుక్కను పెంచడమే నరుడికి మోక్షసాధనమనిన్నీ, కుక్కను పూజించనివాడు రౌరవాదినరకానికి పోతాడనిన్నీ, పెంపుడు కుక్కను చంపినవాడికి మరి పుట్టుగతులు ఉండవనిన్నీ వ్రాయవలసి వస్తుంది!"

—తాత కృష్ణమూర్తి, బి.ఏ.,యల్.టి.

నిజరాగము

జనపమోపు నెత్తిని మోసికొనుచు నెక్క
బల్లకట్టును పాలేరు : వాని వెనుక
మేఁకపోతుతో నెక్కెను మేటిగొల్ల
డొక్కఁడు వెంటనే పోతుమెక్కఁదొడఁగె
పసుపురంగు పువ్వులు పసివాడియున్న
మోపు చివురులు మూతిని జాపిసాపి.
కసరెఁ బాలేరు 'ఖామందు'గారు చూచి
కోపపడుదురటంచును. గొల్లఁడువిని
మేఁకఖామందుగారోయి మేయనిమ్ము
రెండుపువ్వులకేమని గండునగియె;
దాఁ గడ్డంబు సవరించి తనవునిమరె.

* * * * *

రోలుతలగడగాఁగను రాలు తనకు
మెత్తనగు పక్కగాఁగను పత్తమిల్లి
నిదురబోయెడు, చెంచువాఁ డదురుబెదురు
లేక చరకుటీరాంతరశ్రీ యొసఁగుడు.
వాని చిన్నబిడ్డ, కొడుకు, వానికూఁతు
రాకసముక్రింద నెంతయు శోకముగను
బూసినట్టి యెఱ్ఱతురాయి పూలచెట్టు
చాయలందు గోడిగరాలు చాలనేరి
యచ్చనలమాట నాడుచు నలరుచుండ్రి.
సాంధ్యరవిరశ్మి మోముపైఁ జక్కనినెఱి
శోభగూర్ప వానియువతి చూచిచూచి
ముంచుచుండెను కాల్వలో మంచినీరు.
అతఁడు నిదురింప నాపిల్లలాడుకొనఁగ
నల్ల యిల్లాలి చూపులు పల్లవింప
నాస్థలం బొక్కహర్మ్యమై యాత్మ మెఱసె.
వానికలనేర్వ నాపిల్ల లాననముల
నుండి యుండి మొలకలెత్తుచుండు నవ్వు
దొంగిలింప నాయిల్లాలి తొంగలికను
ఱెప్పపాటులు లెక్కింపఁ బ్రియపడియెను
నామనంబు నిమేసంబు నన్నుమఱచి.

—కవికొండల వేంకటరావు బి.ఎ.,బి.యల్.

సూరిసిద్ధాంతం

అప్పుడేవచ్చిన ఆంగ్లపత్రిక పేజీలు తిరగేస్తూ 'ఈ హరిజనసమస్య మొత్తంమీద జనాన్ని అల్లకల్లోలం చేస్తున్నదిరా. సూరీ' అన్నాను.

సూరి బద్ధకంగా నవ్వి 'జనానికి అల్లకల్లోలం కావటం చాలా ఇష్టమని నీకు తెలుసునా?' అన్నాడు.

నాకు కోపంవచ్చింది.

'నీకు దేన్నిచూసినా గౌరవంలేదురా, సూరీ' అన్నాను.

'ఒకరికున్నట్టు!'

'మతగురువులంతా చూడు ఎంత ఘోషపెడుతున్నారో!'

'పులివిస్తరాకుదగ్గిర కాకులూ, ఏనుగ దగ్గిర కుక్కలూ, బహిర్దేశంలో పందులూ గోలచేసినట్టు!'

'మతాన్ని వాటితో పోలుస్తావా?'

సూరి బిగ్గిరిగా నవ్వటం మొదలుపెట్టాడు.

'ఇందులో హాస్యం నాకర్థంకాలేదు!' అన్నాను తీక్ష్ణంగా.

సూరి వినిపించుకోకుండా 'పోలిక మతానికి వాటికీ కాదు; మతగురువులకూ వాటికీ!' అని మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

తెలుగులో తిట్టటానికి ఉండదగినన్ని మాటలు లేవు. ఆ ఉన్నవాటినే రెండుమూడు పరసలు ప్రయోగించిన మీదట సూరి దారికి వచ్చాడు.

'ఒరే! నీకున్న మెదడే బహుకొద్ది. ఆకాస్తాకూడా పాయిజనయిపోయింది నువ్వు మెంటల్‌గా చచ్చినవాడి కింద లెక్క.''

'ఎందువల్ల? నీమాదిరిగా పవిత్రమైన విషయాలను హేళనచెయ్యను గనకనా?'

'పవిత్రమేమిట్రా, నీమొహం! ఏదేమతం?'

'అట్లా అడగటంలో నీ అభిప్రాయం ఏమిటి?'

సూరి నావైపు వేలుపెట్టి చూపిస్తూ, 'చూశావా! అంత చిన్నప్రశ్నకు కంగారుపడకుండా సమాధానం చెప్పలేవు. నువ్వు మెంటల్‌గా చచ్చావంటే ఎందుకు ఎగిరి పడతావు'

'నాది హిందూమతం.' అన్నాను గర్వంగా.

'అంటే నీకు ఆమతాన్ని చూస్తే గౌరవమనా? లేక నీకు దాన్నిగురించి ఏమైనా తెలుసునా?'

'కావలిస్తే నాకు హిందూమతాన్నిగురించి ఏమీ తెలీదని ఒప్పుకుంటాను. కాని నాపూర్వులది హిందూ మతం... నాతండ్రులదీ, తాతలదీ, నాదీ ఆమతమే!'

మళ్ళీ సూరి నవ్వటం మొదలుపెట్టాడు.

'ఎందు కావెధవనవ్వు?'

'ఏమిట్రోయ్! మతంకూడా (నవ్వు) ఆస్తల్లే—గుణాలల్లే—రోగాలల్లే (నవ్వు) హెరిడిటరీగా—సారీ!—వంశపారంపర్యంగా (నవ్వు) వస్తుందా ఏమిట్రోయ్! హా! హా! హా! హా!'

'ఏమి టా తెలివితక్కువ ప్రశ్న? ఎందుకు రాకూడదు?'

సూరి తన నవ్వును ఒక్కదెబ్బతో స్విచాఫ్ చేసుకుని పెద్దగుడ్లుచేసి నావంక చిత్రంగా చూడటం మొదలుపెట్టాడు.

'ఏమట్లు చూచెదవు?'

'మరేంలేదు. మనిషి జ్ఞానానికంతుందికాని అజ్ఞానానికి లేదు!'

సూరి ఆమాట అన్నతరవాత నాకు చాలాసిగ్గేసింది. వాడి పద్ధతులూ అభిప్రాయాలూ నాకు విపరీతంగా కనపడవచ్చుగాక; వాడి తెలివెక్కడ నాతెలివెక్కడ! నేను వాడితో ఇంతసేపు నాకేమీ తెలీని విషయాన్ని గురించి వాదించటమేమిటి? వర్ణాశ్రమ ధర్మాలనీ, ఆచారాలనీ, నీతనీ, మతమనీ అందరూ అంటుంటే విని సంభాషణలో వాటిని గురించి ఒకమైలు అటూ ఇటుగా ప్రయోగించటమేకాని వాటినిగురించి నాకేంతెలుసు?

నేను తెల్లజెండాఎత్తి సంధికి జొరబడ్డాను.

'ఇదంతా ఎందుకుగానీ నూరీ మతం, ఆచారాలు మొదలైనవాటిని గురించి నీకుతెలిసింది చెప్పు విం టాను,' అన్నాను.

'విను, చెబుతాను, నీకూ జంతువుకూ భేదం ఏమిటి?'

'అ దెందు కిప్పుడు?'

'ఒరే! ప్రశ్నకు సమాధానం చెప్పటానికి అంత గందరగోళ మెందుకురా! ఆవెధవగుణం మానెయ్యి. చెప్పు?'

'ఏముందీ! మనం నిలువుగా నడవగలం. ఇంకా— ఇంకా—వెధవది ఒక్కటీ జ్ఞాపకంరాదేం!'

సూరి నాకడ్డంవచ్చాడు.

'నిలువుగానడిచి సుళువుందంగా ఉన్నదేంలేదు ఆ భేదాలన్నీ నేనే చెబుతాను. నువ్వు మాట్లాడగలవు. అందువల్ల అబద్ధం ఆడటం ఒకటి నేర్చుకున్నావు. రాయటం చాతవును. దొంగదస్కతులు పెట్టటం కూడా చాతవును—ఎవరో అన్నట్లు. సంగీతం పాడ గలవు, ఎక్కిరించగలవు. అవన్నీ అట్లాఉంచి నీకూ జంతువుకూ కల ముఖ్యమైన భేదంచెప్పు.'

'నాకు తెలీదు.'

'నీకు బుద్ధిఉంది! జంతువుకులేదు!'

'కావచ్చును. కాదనను.'

'అది అట్లాఉంచు. నీదగ్గిరఉన్న వస్తువులన్నీ నువ్వు ఉపయోగిస్తున్నావని ఉందా?'

'లేదు. నాదగ్గిర రేజరుంది ఒకసారి దాంతో చేసు కునేటప్పటికి మొహంనిండా గాట్లు—'

'సరే! సరే! అదంతా తరవాత. నీబుద్ధిని నువ్వెప్పు డయినా ఉపయోగించిన జ్ఞాపకం ఉందా?'

'అయ్యో! ఎందు కుపయోగించను? ప్రతిక్షణం—'

'ఓరి మూర్ఖుడా! నీకు బుద్ధంటే అర్థంకాలేదు. మనస్సనుకుంటున్నావు. మనసు వేరు బుద్ధి వేరు. వాళ్లూ వాళ్లూ అనేకవిషయాలను గురించి అనుకుంటున్న మా టలన్నీ జ్ఞాపకం ఉంచుకుని వాటిని నిజంకింద అంగీక రించి వాటిప్రకారం ఆచరించటం బుద్ధిని ఉపయోగించ టంకాదు. దేన్నిగురించయినా నీ అభిప్రాయం ఒకటి ఏర్పరుచుకున్నావా? నిజంచెప్పటం మంచిదని విన్నావు. బాగా నేఉంది. నిజంచెప్పటం తప్పుకావచ్చు నిజంగా! నువ్వెప్పుడన్నా ఆవిషయం నీబుద్ధికి పని ఇస్తేగా!'

'ఆఁ! ఆఁ! నీ అభిప్రాయం నాకిప్పుడు చక్కగా తెలుస్తున్నది. ఇక పైకివెళ్ళు.'

'ఐనీ! ఇంగ్లీషును తర్జుమాచెయ్యటానికి నీకూ అభ్యంతరం లేదన్నమాట.'

'ఇంతసేపటినించీ మాట్లాడుతున్నాం. మతాన్ని గురించి నువ్వు ఒక్కముక్క చెప్పలేదు.'

'దానికే వస్తున్నాను. నీకు తెలిసినంతలో ఏజంతువు కైనా మోక్షంఉందా?'

'నా కేమతాన్నిగురించీ తెలిసి అఘోరిస్తేగా! జం తువులకు మోక్షంలేదేమో అనుకుంటాను.'

'జంతువులకు మతంకావాలా?'

'బహుశా అవసరంలేదు'

'నీవంటి జంతువులు లోకంలో ఎంతమంది ఉన్నా రంటావు?'

'లక్షలు! కోట్లు! సామాన్యంగా నేను తెలివిగల వాడికింద లెక్క! తెలుసా నీకాసంగతి?'

సూరి నవ్వాడు.

'తెలుసును. వీళ్ళందరికీ మతంతో ఏమీ అవసరం లేదని తెలుసుకో. వాళ్ళంతా ఆహారం, నిద్రా, మై థునం స్టేజి దాటలేదు. అయినాదూ వాళ్ళకిస్తే మతం ఏమైనా వాళ్ళకు తొందరలేదు. సంఘం ఏంచేస్తున్నది? వాళ్ళ కామానా అందకుండా చేస్తున్నది. మతగురువు లేంచేస్తున్నారు? వాళ్ళకు మతం ఇస్తున్నారు. వాళ్ళకు మతం సరయిన ఆహారం కాకపోవటంవల్ల అనేకజా డ్యాలు బయలుదేరుతున్నై. నీ సూపర్ స్టిషన్ అనేది కుతరగతి జాడ్యమే. బలులు, యజ్ఞాలు, సంతర్పణలు, లక్షవత్తుల దీపాలు, లక్షపత్రిపూజ—సందికి రోజుకు అణాడబ్బులు దొరక్క ఒకచెంప కొంతమంది మాడు తుంటే!

'నీమతం ఎంతదరిద్రపుమతమంటే, ఒకచెంప వంశ పారంపర్యంగా వస్తూనూ ఉంటుంది, నువ్వు పిలకకత్తిరించి క్రాపింగుపెట్టినప్పుడూ, బూటూ సూటూ వేసినప్పుడూ, వితంతువును వివాహంచేసినప్పుడూ, నీ స్నేహితులతో భోజనంచేసినప్పుడూ, చివరకు స్టీమరెక్కినప్పుడూ పోయి మళ్ళీ ఎట్లాగో నీదగ్గిరికి తిరిగి వస్తూ ఉంటుంది. ఇవాళ శూద్రవాళ్ళతో అన్నంతింటే మతంపోయింది కదా, రేపు విధవావివాహం చేసుకుంటే ఏమనటానికి వీల్లేదు. ఈలోపల అప్పుడే మతం మళ్ళీ వచ్చిఉంటుంది

'ఇంకో చిత్రం చూడు. నేను మతాలకు ప్రచారం లేదంటాను'

'అది నేను ఒప్పుకోను. బుద్ధుడు, శంకరుడు, క్రీస్తు, వివేకానంద, మహాత్మాగాంధి, అంతా ప్రచారం చేసినవాళ్ళే.'

'అందుచేత నేను నాబుద్ధికితోచినమాట అనకూడదంటావా ?'

'కాకీ నువ్వు తెలివికలవాడివి కావచ్చుగాక శంకరాచార్యులా, క్రీస్తూ, మహమ్మద్—వీళ్ళకంటెనా?'

'ఎందుక్కూడదురా ! స్వరాజ్యం, స్వేచ్ఛ అని గొంతు పొంగుకుపోయేదాకా అరుస్తారే నాబుద్ధిని వాళ్ళబుద్ధులకు దాస్యం చెయ్యమన్నావా ? మతం హిస్టరీ అనుకున్నావా, జాగ్రఫీ అనుకున్నావా బోధ చెయ్యటానికి ? బుద్ధుడిమతం తీసుకున్నవాళ్ళలో మరొక్క బుద్ధుడున్నాడా ? నిజమైనక్రైస్తవుడు క్రీస్తొకడేనా ? ఇంకొకడున్నాడా ? అర్జునుడి తరవాత జీవితంలో భగవద్గీత అర్థంచేసుకున్నవాడి లక్షణాలేవైనా ఉన్నవా ? పైగా ఈమతాలు ప్రచారం కావటానికి ఎంత నెత్తురు ప్రవహించిందో తెలుసునా ? ఇదంతా ఎందుచేత ?'

'మిగిలినవాళ్ళు పశుప్రాయులు కావటంచేత నే నంటావు. కావచ్చును. కాదనను. సరేకాని ఈ విషయం నీకొక్కడికే తట్టటం ఎందుకు ? ఇంకెవ్వరూ ఎందుకు గ్రహించలేదు !'

'ఇంకెవ్వరికీ తట్టలేదని ఎట్లా చెప్పగలవు ? లోకంలో ఉన్న పుస్తకాలన్నీ చదివావా ?'

'మనకు తెలిసినంతలోనే.'

'నిజానికి ఈవిధంగా చెప్పినవాళ్ళెవరూ లేరు. కాని ఎవరికి తట్టదనేది పొరపాటు. నేను నిరుద్యోగిగా ఉన్నాను కనక ఈవిషయం మాట్లాడుతున్నాను నీతో. లేకపోతే నాకేంపట్టింది నీతప్పులు దిద్దేటందుకు ?'

'ఎవడికైనా మతంకావలిస్తే ?'

'ఉన్నమతాలను గురించి చదువుతాడు. తనమతం సృష్టించుకుంటాడు. నాచొక్కాలు నీకెట్లా సరిపోతై ? ఇంకో చిత్రం చూడు. చాలామంది అభిప్రాయం ఆచారాలే మతమని.'

'మతాన్ని తృణీకరించావు. ఆచారాలనుగురించి నీ అభిప్రాయం ఏమిటి ? వాటినిచూస్తే నన్నా నీకు గౌరవం ఉందా !'

'మీతాతగావంచానుచూస్తే నీకు గౌరవంఉందా?'

'ఆ'

'మీతాతగావంచా నువ్వుపయోగిస్తావా ?'

'నాకెట్లా పనికొస్తుంది ?'

'నీ చిరిగి పాడుమాసిపోయిన ఆచారాలు నాకెట్లా పనికొస్తై ? ఆచారమనేది. కేవలం పరిమట్టు. మనిషి ఉపయోగంకోసం ఏర్పడ్డది ఆచారంకాని మనిషి ఆచారంకోసం ఏర్పడ్డవాడుకాడు. అని నువ్వెందుకు గ్రహించవు ? నీకేబుద్ధి ఉంటే. చిన్నతనంలో భర్తపోయిన పిల్లకు తిరిగిపెళ్ళిచెయ్యి, నువ్వెంతవరకు పశువువో ఆపిల్లా అంతేను. ఆమెకూ సంసారసుఖం కావాలి అని నీకింకెవరో చెప్పవలిసిన అవసరం ఏముంది? నువ్వు నిర్బంధంచెయ్యకపోతే ఆపిల్ల ఇంకో భర్తను చూసుకోదా ? నీకు బుద్ధిలేదు కనకా, నీ బుద్ధిలేక పోవటం ఇతరప్రాణులకు అపాయకరంగా ఉంది కనకా నీమీద ప్రచారంచెయ్యాలి. గాంధీమహాత్ముడుచేసే ప్రచారం అదే. నీకు నిజంగా లాభించే ఆచారాలు నువ్వుంచుకో రోజుకు పదిస్నానాలుచెయ్యి. మడికట్టుకో. సంధ్యవార్చు. తద్దినాలుపెట్టు. ఎవ్వరికీ అపకారంలేదు.'

'మాలవాళ్ళను ముట్టుకోవటం విషయం?'

'మాలవాళ్ళను ముట్టుకోకు. బ్రాహ్మణ్ణికూడా ముట్టుకోకు. ముట్టుకోమని ఎవరన్నారు? వాళ్ళతో కలిసిభోజనంచెయ్యకు. ఎవరితోనూ కలిసి భోజనం చెయ్యకు, భోజనంచెయ్యటం చాలారహస్యమైనపని. కాని వాళ్ళను నెట్టివెయ్యటం ఎందుకు? నీబావిలో వాళ్ళు నీళ్ళుతోడితే నీప్రాణం ఏంపోయింది? వాళ్ళు నీయిళ్ళ మధ్య ఎందుకు నడవరాదు! అంత వాడితో సంబంధం లేకుండా ఉన్నవాడివి నీ తెగిన చెప్పులు వాడి మొహాన ఎందుకు పారెయ్యటం? నీ చచ్చినగొడ్లు వాడికెందుకు వప్పగించటం? వాడికూలుడుకు నువ్వెందుకు కన్నుగొట్టటం? వాడే ఎవరిధర్మాన్నో చదువుకుని అధికారిగావస్తే వాడికి షేక్‌హాండు చెయ్యటం ఎందుకు? ఏం ఆచారంగా? నీ మొహం ఆచారం! నీశరీరంలో ఏ మాలవాడి నెత్తురూ లేదని ఏమిటి నిదర్శనం?'

'ఒరే అటువంటి మాటలంటే నే నూరుకోను.'

'మాటవరసకన్నాను రా! నువ్వంటే నువ్వని కాదు. నీ ఆచారాలన్నీ తెగి దాళ్ళుపడి పోయినవని నమ్ముతావా?'

'నమ్ముతాను కాని, నూరీ, కొన్నికొన్ని ఆచారాలకు వ్యతిరేకంగా నడవటం అవినీతి కాదా?'

'హరీ. నీతినిగురించి మాట్లాడుతున్నాడండీ గుంటడు. ఇదినీతి, ఇదినీతి కాదు అని రాసిపెట్టి ఉందా ఏమిటి!'

'ఎందుకులేదు.'

'నీతంటే ఏమిటని నీ అభిప్రాయం?'

'ఈమధ్య ఒకాయన రాసినవ్యాసం చదివాను

ఓ ప్రభూ !

అట మహాదివ్యలోకహర్మ్యాంతరముల
నన్నదియెలుంగు దైన్యంబు జాలువార
ఎవ్వరో పిలుచురీతి విన్పించు నాకు
కలత నిద్దురలోన ఏకాంత మందు
కనుల నశ్రులు ధారలై గార నెవరో
మచ్చిరోభాగ మభిషేకమానితముగ
సేయుచుండునో—
ఇది పురాభూతసంబంధ మేమొకాని
ఎచటివో దుఃఖవేదనాప్రచలితములు
భయదనిశ్వాసములు మనఃపథముకేరి
కలచుచున్నవి ఓప్రభూ! గాఢలీల
ఈవియోగత్రపావ్యథాపృథులమైన
భారసహమైన జీవనవ్యాజమునకు
ఏమి యర్పింతు? తరియింతు నెట్లు? సామి!

—కొటుకూరు సత్యనారాయణరావు.

లేరా. ఆడవాళ్ళఎదుట బూతుమాట్లాడటం అవినీతి. అవునా?'

'అవును. ఆమాటలు ఉప్పరెడవాళ్ళ దగ్గిరా, కొమ్మర ఆడవాళ్ళదగ్గిరా మాట్లాడటం అవినీతేనా?'

'కాకపోవచ్చును.'

'కాకపోవచ్చునేమిటి? కాదు. ఒకదేశంలో మగవాను అయిదునిమిషాలకో భార్యను చేసుకున్నా నీతిబాహ్యం కాదు. ఏమంటావు?'

'అవునులే. మనదేశం ఇంకాఅంత—'

'ఏడిచావులే. పసికూనను పెళ్ళిచేసి వెంటనే మొగుడు పోతే 'అమ్మాయి, నీకర్మం ఇట్లా కాలింది కనక నువ్వు సంసారసుఖం కోరావా నీతిమాలినదాని వవుతావు కనక మాఅందరి తృప్తికోసం నువ్విట్లాగే పడుండు' అంటావా ఏమిటి! కొంత కొంత మంది సంఘసంస్కారులు చూస్తానుకదా, కాపరానికి పోకపూర్వం వైధవ్యం కట్టించిన పిల్లల పునర్వివాహంవిషయమే లెక్చర్లిస్తారు, ఒక సంవత్సరం, పది సంవత్సరాలు, కాపరంచేసిన మనిషికి సంసారసుఖం అక్కర్లేనట్టు.'

'ఎందుచేత?'

'పది సంవత్సరాలు కాపరంచేసిన దానికి మళ్ళీ పెళ్ళిచెయ్యమంటే అంతా తిరగబడి మాడు పగలగొడతారేమోనని. ఎవర్తైనాఏళ్ళదికానీ తిరిగి పెళ్ళిచేసుకుంటానంటే తప్పేమిటంట. ఇష్టమైనవాడే వస్తాడు.'

'ఒరే నూరీ. నువ్వు పడమటికన్నా పడమటవుతున్నావు. సంఘం ఏ స్థితికొస్తుందో ఆలోచించు.'

'వీరంతా కలిసి సంఘాన్ని ఉద్ధరిస్తున్నట్టు, నీకు

ఓపిక ఉంటే ఒక తమాషా సంగతి చెబుతాను విను. నే నెరిగిన ఒక కుర్రవాడుండేవాడు. తల్లిదండ్రులు చిన్న తనంలోనే పోయినారు. దరిద్రుడు. ఎక్కువ తెలివిగల వాడు కాడు. ఒకరిద్దరు పెద్దమనుష్యులు పూనుకుని వాడికి వారాలు ఏర్పాటుచేసి స్కాలర్షిప్పిప్పించి చదువు చెప్పించారు. వాడు కృతఘ్నుడు. చదువుతూ సరిగా పరీక్షలకుముందు చచ్చేటంత జబ్బుపడి ఎట్లాగో బతికాడు కాని పరీక్షపోయింది. హెడ్ మాస్టరు రొకపిగ్ హెడెడ్ రాస్కెల్. స్కాలర్షిప్పివ్వనన్నాడు. వాడికి మొదట్లో సహాయంచేసిన ఒకరిద్దరూ చచ్చిపోయి నారు. ఈ జబ్బులో వారాలు పోయినై. ఇక చదువు కునే ఆశ వదులుకుని వాడు మాతామహుడుగారింటికి పోయినాడు.

'వాడిపినతల్లి ఒకమ్మాయి ఉండేది. పెద్దమనిష యింది. కాపరానికి పోలేదు. వాడూ ఈడొచ్చిన పిల్ల వాడు. అక్కడికిపోయినప్పటినించీ వాడు ఆ పిల్లతో ఫ్లర్టింగ్ మొదలుపెట్టాడు తనకు తెలీకుండానే. ఆపిల్లా వాణ్ణి అసహ్యించలేదు. ఇద్దరూ ఒక్క చోట కూర్చుని ఆ లోచనలు చేసేవాళ్ళు, ఇంకోళ్ళుచూసినా తిట్టటానికి వీలులేనంత దగ్గిరిగా కూర్చునేవాళ్ళు, ఏదో నెపం మీద ఒకళ్ళనొకళ్ళు తాకేవాళ్ళు. ఒకళ్ళవెంట ఒకళ్ళు పరిగెత్తేవాళ్ళు. ఇట్లా కొంతకాలం గడిచిపోయింది. ఒకరోజున ఆకుర్రవాడు కొద్దిగా లిమిట్ దాటాడు. ఆపిల్ల ఎదురుతిరిగి తిట్టింది. అందరితో చెప్పింది. అం దరూ వాణ్ణి తిట్టారు. వాడుకూడా వాణ్ణి తిట్టుకుని, పశ్చాత్తాపపడి—పశ్చాత్తాపమంటూ ఒకటి ఉన్నట్టు —అక్కణ్ణించి లేచి పట్నంవచ్చాడు తిరిగి... వాడు చేసినపనినిగురించి నీవ్యాఖ్యానం ఏమిటి?'

'నావ్యాఖ్యానమేముంది? నేనైతే వాణ్ణి చొక్కా విప్పి చర్మం పొంగేటట్టు తాటిమట్టతీసుకొని కొడుదును.'

నూరి కొంచెంసేపు మౌనంగా కూర్చుని, కథ సాగిం చాడు.

'ఎవరూ వాడికి ఉద్యోగం ఇవ్వలేదు. ఎవరో ప్లీడరుగారు దయదలిచి వాడికి తనదగ్గిర వాలంటీరుపని ఇచ్చాడు. అక్కడ కొంతకాలం పనిచేసినతరవాత వాడి కా మోసం, అబద్ధాలు, దుర్మార్గం చూస్తే అసహ్యం వేసింది. అక్కణ్ణించి చెప్పకుండా లేచిపోయినాడు... దానిమీద నీవ్యాఖ్యానం ఏమిటి?'

'ఫూల్. కావాలంటే ప్లీడరుగుమాస్తాగా ఉండి న్యాయంగా ఉండకూడదా ఏమిటి?'

నూరి చిరునవ్వు నవ్వాడు.

'వాడికి చివరకొక్కటి తోచింది. మనం బ్రాహ్మణ కులంలో పుట్టాం, విధ్యుక్తకర్మచేతా మనుకున్నాడు. బ్రాహ్మణార్థాలు చెయ్యటం మొదలుపెట్టాను, తద్దినం మంత్రాలూ అవీ నేర్చుకుని.'

'భేష్. మంచిపనిచేశాడు.' అన్నాను.

'ఆ కుర్రవాణ్ణిగురించి నాసలో చిందికూడా చెబు తాను. వింటావా?'

'చెప్పు.'

'నేను రెండేవిషయాలు చెప్పదలుచుకున్నాను. మొదటిది. రేపు చెట్లూ చామలూ మనల్నిగురించి తెలుసుకోటం మొదలుపెట్టి అవికూడా మనల్ని అను కరించాలని ప్రయత్నంచేస్తే నేను తప్పకుండా తప్పు పడతాను.'

'రెండోది. మనిషి మూడువిధాలుగా ఉంటు న్నాడు—పశువుగా, మానవుడుగా, దేవతగా. పశు త్వంలోనూ మంచీ చెడూ ఉంది, మానవత్వంలోనూ ఉంది, దేవత్వంలోనూ ఉంది (ఈ చివర విషయం బహుశా నీకు తెలీదేమో!) ఇంతవరకూ అందరికీ తెలిసే ఉండవచ్చును. అందరికీ తెలీని విషయమేమిటంటే పశుత్వంలో చెడు చాలాకొద్ది, మానవత్వంలో మంచీ చెడూ చెరిసగంగా ఉంది, దేవత్వంలో మంచికన్న చెడు చాలాజాస్తి.'

ఈ వేదాంతం నాకేమీ అర్థంకాలేదని వేరే చెప్ప క్కర్లేదు. కాని వాణ్ణి ఎంతవేడుకున్నా నూరి మరైన ఒక్కమాటకూడా మాట్లాడకుండా పేపరు తీసుకుని చదవటం మొదలుపెట్టాడు.

—కొడవటిగంటి కుటుంబరావు.

అర్ధదినాభ్యాస విద్యావిధానము

(గృహమందు వృత్తివిద్య కవకాశమిచ్చు పాఠశాలవిద్య.)

ఆవశ్యకత.

నే నీవ్యాసమందు కొంతమంది విద్యార్థుల కుపయుక్తమగు అర్ధదినాభ్యాసవిద్యావిధానమును సూచించెదను. ఈ నూతన పద్ధతి ప్రస్తుత మనుభవములోనున్న పూర్ణదినాభ్యాసవిద్యావిధానములోని సగభాగముతో చేరియుండును. ఈ కాలమందు సామాన్యజ్ఞానసంపదలు గలిగిన విద్యార్థులు విద్యమూలమున నుద్యోగమార్జించుటయే జీవితాధారమని తలఁచినయెడల వారు అవసరమగు నిత్యకృత్యములకు దక్క వేరు పనుల నేర్చుటకు తావియ్య వీలు లేదు. కాని యెడల మండువేసంగియందు దొరకు యారు వారము లేదయిన పనిని తలపెట్ట గల్గుదురేమో! అంతమాత్రమున సమకూరు లాభ మేమియు లేదు. ఇట్లితరవిషయముల కన్నిటికి విముఖులై, మరొకపని కశక్తులై, నిరంతరము పాఠశాలయందు విద్య నభ్యసించి, స్కూలుఫైనలు వఱకుఁజదివి, యెంతయో యత్నించి, తుద కెక్కడ నుద్యోగముగానక విఫలమనోరథులై దాదాపు షోడశవర్షప్రాయమున దీనావస్థతో కులవృత్తి ననుసరించువారు నూటికి ముప్పదిమంది యైనను నుందురు. ఇట్టివారికి నాల్గు, ఐదు, ఆరు ఫారములందు గఱపు విద్యావిషయములలోఁ గొన్నిమాత్ర మనవసరమనియు, వృథాయాసకరములనియు, కాలధనవ్యయపూరితములనియు జెప్పుటలో నతిశయోక్తి యిసుమంతయునను లేదనవచ్చును. కళాశాలలందు యఫ్.ఏ., బి.యే.లు, ఇంజినీరింగు, మెడికలు విద్యల నభ్యసించువారికిని, ఉద్యోగములకే యత్నించువారికిని పాఠశాలలందు గఱపు విద్యావిషయములన్నియు నావశ్యకమే, కాని పాఠశాలవిద్యలో విద్యాభ్యాసముఁ జాలించి యుద్యోగమార్జించలేనివారి కీ విద్యావిషయములలోఁ గొన్నిటిని దీసివేసినను లోటుండదు.

పరీక్షాఫలితముల నింతకంటెఁ గఠినముగాఁ జేయుటయు, విద్యార్థిరుసుముల హెచ్చించుటయు, ఉద్యోగహీనవిద్యాధికుల సంఖ్య తగ్గించుటకు మార్గములే, కాని యీ కారణములవలన దేశములోని జనుల విజ్ఞానవికాసాభివృద్ధులు తగ్గి బాధ్యతాయుత ప్రజాపరిపాలనాంగము లన్నియు నిస్సారములై కృశించును. వృత్తివిద్యల గఱపు పాఠశాలలస్థాపన మీ యుద్యోగహీనతయను వ్యాధికి రాజౌషధమేగాని సామాన్యస్థితి గల విద్యార్థుల కందుబాటులో నుండునట్టివి స్థాపితములగుట కెన్ని సంవత్సరములుపట్టునో యేరికిం దెలియదు.

నూతనవిధానము.

ప్రతి జిల్లాయందును వృత్తిబోధన పాఠశాల లేర్పడునంతవఱకు, ఉద్యోగ మార్జించుట కవకాశములును, హెచ్చు విద్యాజ్ఞానసంపదయు లేనివారి యుపయోగార్థమై యీ "అర్ధదినవిద్యాభ్యాసవిధానము" సూచింపఁబడినది. పాఠశాలాగ్రకర్తృలలో నీ పద్ధతి ననుసరించు బాలకులు విద్యావిషయములలోఁ గొన్నింటికిమాత్రమే పాఠశాలకు వత్తురు. ఈభాగములను వీలగునట్లుగ నుదయ

మందుగాని, మధ్యాహ్నానంతరమందుగాని, అనగా దినమున నేదోయొకపూటయందే బోధపరుపబడునట్లు టైమ్‌టేబిలులో నేర్పాటు చేయువచ్చును. పాఠశాలకు రానవసరము లేని పూటయందు విద్యార్థులు ప్రభుత్వాంగీకారము వడసిన వృత్తివిద్యలను తమ జనకులయొద్దగాని యితర నిపుణులయొద్దగాని నేర్చుకొనుటకు వీలుండును.

పూర్ణదినాభ్యాస విద్యార్థు లిట్లుగాక రెండుపూటలు పాఠశాలకువచ్చి అర్థదినాభ్యాస విద్యార్థుల సబ్జక్టను వారితో పాటును, మిగిలిన సబ్జక్టను వేరుగా రెండవపూటయందును పఠించుదురు అందువలన పాఠశాలలందు కొందఱకు అర్థదినాభ్యాస విద్యావిధానమున కవకాశము లియ్యబడినను పూర్ణదినాభ్యాసులగు విద్యార్థుల ప్రస్తుత సౌకర్యము లేమాత్రము తొలగింపబడవు అర్థదినవిద్యార్థు లీక్రిందఁ జెప్పబడిన సబ్జక్టకుదక్క మిగిలినవానికి మాత్రము పాఠశాలకు విచ్చేయుదురు.

1. ఇంగ్లీషు టెక్స్టున్ ఆఫ్ నాండిటైల్డు స్టడీ.
2. తెలుగు టెక్స్టున్ ఆఫ్ నాండిటైల్డు స్టడీ.
3. ఆంగ్లేయదేశచరిత్ర లేక హిందూ దేశ చరిత్ర.
4. భాషాంతరీకరణము.
5. అభిమానవిద్యావిషయములు [ఆప్షనల్ సబ్జక్టులు]
6. పదార్థవిజ్ఞానశాస్త్రములో ఆరవ ఫారముకు లోహచుంబకత్వము,ధ్వని ఐదవఫారములో జంతు, వృక్ష శాస్త్రములు. నాల్గవఫారములో రసాయనిక శాస్త్రము లేక భౌతికశాస్త్రము.
7. ప్రాథమికగణితము [ఎలిమెంటరీ మాథమాటిక్సు] లో ఆల్జీబ్రా, జామెట్రీ, గ్రాఫులు.

వీనిని పూర్ణదినాభ్యాసులగు విద్యార్థులు మాత్రమే పఠించెదరు. వీనియందు వారికి వేరుగా పరీక్షాపత్రము లుండును.

అర్థదిన విద్యార్థుల కీ క్రింది సబ్జక్టులోనే బోధన చేయుబడును.

1. ఆంగ్లేయ వచనము	వారములో	2	పీరీడ్లు
2. ఆంగ్లేయ పద్యము	,,	2	,,
3. తెలుగు వచనము	,,	2	,,
4. తెలుగు పద్యము	,,	2	,,
5. వ్యాసరచన	,,	1	,,
6. ఎలిమెంటరీ సైన్సు	,,	2	,,
7. హిందు లేక ఆంగ్ల దేశచరిత్ర	,,	2	,,
8. భూగోళశాస్త్రము	,,	2	,,
9. ప్రాథమిక గణితము	,,	3	,,
10. చిత్రలేఖనము	,,	1	,,
11. నీతిబోధన	,,	1	,,
		20	

ఇవియన్నియుఁ దగినరీతిని టైమ్‌టేబిలులో నైదు దినముల యుదయములలోను జేర్పవచ్చును. వీనియందు పూర్ణదినాభ్యాస విద్యార్థులకు, అర్థదినాభ్యాసవిద్యార్థులకు ప్రశ్నపత్రము లేకముగా నుండును. వృత్తి విద్యలలో పరీక్షలు జిల్లాలోని ముఖ్యపట్టణములలో జరుపఁబడి తరగతియందు తీర్ణతకై అర్థదినవిద్యార్థి వృత్తివిద్య పరీక్షయందు మినిమమ్‌మార్కు పడయునట్లుండవలెను.

తండ్రిబాధ్యత.

వృత్తివిద్యయందు క్రమశిక్ష [రెగ్యులర్ ట్రైనింగు] నొసంగుటకు అర్థదినాభ్యాసవిద్యార్థితండ్రి బాధ్యుడై తన అంగీకారమును వ్రాతపత్రమూలముగా ప్రధానోపాధ్యాయున కొసంగి, ఆ ప్రధానోపాధ్యాయునకైనను. లేక పాఠశాలాధికారులచేగాని, దొరతనమువారిచేగాని నియమింపబడిన నిపుణునకైనను ఆ విద్యార్థి వృత్తివిద్య నభ్యసించువిధమును, అభ్యసించిన భాగమును పరీక్ష చేయుట కవకాశము లిచ్చుటకు నొప్పుకొనవలయును.

రుసుములు.

ఒక యర్థదినాభ్యాసవిద్యార్థిరుసుము ఆతడాతరగతిలో పూర్ణదినాభ్యాస విద్యార్థియయిన యెంతరుసుము గట్టవలయునో దానిలో సగముండును. ఇదిగాక తన వృత్తివిద్యావిధానమును ప్రధానోపాధ్యాయుడుగాని, నిపుణులగు అధికారులుగాని పరీక్ష చేయు నిమిత్తమై నెలకు నాలుగణాలు చెల్లించవలయును.

విద్యార్థులు : విధానమును మార్చుట.

ఒక అర్థదినాభ్యాసవిద్యార్థి తనజ్ఞానసంపద లభివృద్ధిగాంచినవను నమ్మికతో పూర్ణదినవిద్యాభ్యాస మొనరింపవలెనన్న నాతడు అర్థదినాభ్యాస విద్యావిధానము ననుసరించి యుత్తీర్ణుడయిన పెద్ద తరగతిని తిరిగి పూర్ణదినాభ్యాసవిద్యార్థులతో బాటు చదువుటకు వసతులుండవలయును.

ప్రత్యేకగ్రాంటు లనవసరము.

ఇట్టి అర్థదినాభ్యాసవిద్యావిధానము ప్రస్తుత మాచరణలో నున్న పూర్ణదినాభ్యాస విద్యావిధానముతో బాటు ఈ పాఠశాలలందే యాతరగతులందే యీ యుపాధ్యాయులయొద్దనే యీ సబ్జక్టులలో గొన్నిటితోడనే జరుపబడును గాన దీనికై వేరు భవనము లవసరములేదు. దొరతనమువారు దీనికై యేమాత్రము వేరుగ డబ్బునియ్య నవసరము లేదు. పూర్ణదినాభ్యాసవిద్యార్థులేమాత్రము నష్టము నొందరు. వీరికై ప్రత్యేకముగా నుపాధ్యాయులను నియమింప నవసరము లేదు.

ముగింపు.

ఈక్రొత్త విధానము గుంటూరు జిల్లాలో చీరాల [నేతపని] నర్సారావుపేట [వడ్రంగిపని] దుగ్గిరాల, తురుమెళ్ళ [వ్యవసాయము] గుంటూరు, తెనాలి, ఒంగోలు [నగలపని, కమ్మరిపని, కుట్టుపని, సంగీత, సాహిత్య, చిత్రకళలు మొదలగునవి] లలో తృప్తికరమగు ఫలితము లిచ్చునని నాకు నాశ గలదు.

ఈ క్రొత్తవిధానము దీని ననుసరించు విద్యార్థులకు ప్రస్తుతము కఱపబడు విద్యలోని ముఖ్యవిషయముల [సబ్జక్టుల]ను నేర్పును. వారిని 'నిరుద్యోగ' మను విషజంతువు కోఱలనుండి రక్షించుటకు నీ విధానము సహాయపడగలదని విద్యాధికులకు, రాజకీయవేత్తలకు దోచిన యీ విధానము నొక హైస్కూలుయందు ప్రవేశపెట్టి ఫలితముల కనుగొనవచ్చును.

ఏజిల్లాయందైనను వృత్తిబోధనాపాఠశాల [ఇన్డస్ట్రియల్ స్కూలు] లేర్పడిన వెంటనే యాజిల్లాలో నీ అర్థదినాభ్యాసవిద్యావిధానమును రద్దుజేయవచ్చును.

—భా. సోమసుందరరావు, బి. యే. యల్. టి.

కీ. శే. దివాన్ బహద్దరు చిత్రపు వెంకటాచలంపంతులు

గత ముప్పది సంవత్సరములలోను రాజమహేంద్రవరమునకు వన్నెయు వాసియు దెచ్చినవారిలో కీర్తిశేషులగు దివాన్ బహద్దరు చిత్రపు వేంకటాచలము పంతులుగారొకరు. నిరాడంబరజీవితమునకును, న్యాయశాస్త్రపరిజ్ఞానమునకును, ధర్మమార్గప్రవర్తనమునకును పంతులుగారు మార్గదర్శకులనుటలో నతిశయోక్తి లేదు.

వీరి తండ్రిగారగు వరదరాజులుపంతులుగారు ధర్మమూర్తులని కీర్తిగాంచిరి. వారు వాడ్రేవువారివద్ద దివానుపనిచేసి లంచములంచము లనుమాట యెఱుగక పరద్రవ్యాపేక్షలేక నిష్కళంకజీవనమును నెరపిరి. వీరు వేంకటాచలముపంతులుగారు వృత్తిలో స్థిరపడి కీర్తిసోపానముల నెక్కుచుండుట చూచి కొంతకాలమానందించిన యదృష్టశాలి. చివరవరకును జనకుని యాచరణమే కుమారున కాదర్శములై వెలసెను. పంతులుగారు 19-వ యేట పట్టభద్రులైరి. తదుపరి బి.యల్ ప్యాసయి ప్రాక్టీసుచేయ నారంభించి యచిరకాలముననే తమ మేధావిశేషమును వ్యక్తపరుప సాగిరి.

1902 మొదలు నీ రిరువదినాల్గు వత్సరములు ఏకధాటిగా పబ్లిక్‌ప్రాసిక్యూటరు పనిని చేసిరి. అప్పటి నుండియు ఏదో ఒకవైపున వీరు పనిచేయని పెద్ద కేసు రాజమహేంద్రవరమున లేదు. రాజమండ్రి తాలూకా బోర్డునకు వైసుప్రెసిడెంటు పనులను సమర్థముగ నిర్వహించినందుకు రెండువరుసవర్షములలో రావుబహద్దరు, దివాన్ బహద్దరు బిరుదములనందెను. రామారాయణింగారి మంత్రిపదవియొక్క మొదటిరోజులలో రాజమండ్రి మునిసిపాలిటీ సరిగా పనిచేయుటలేదను కారణమున పంతులుగారిని అధ్యక్షునిగా నామినేటు చేసిరి. ఆరునెలల కాలము వీరు మిక్కిలి సమర్థముగను నిష్పక్షపాతముగను పరిపాలించిరి. వృత్తివ్యవహారము లెన్నియున్నను మునిసిపలుకాగితముల నేరోజు వాని నారోజు పూర్తిచేసి మరీ యింటికి వచ్చువారు. కో ఆపరేటివు బ్యాంకునకు ప్రెసిడెంటుగను, ఎలక్ట్రికు కార్పొరేషనుకు డైరెక్టరుగను గూడ పనిచేసి ఖ్యాతి నార్జించిరి. రాజమండ్రిలో జరిగిన ఏసత్కార్యమును వీరి సాయమును పొందనిదిలేదు.

ఒకమారొకకలెక్టరు వీరినిగూర్చి వ్రాయుచు (ది మోస్టు లాయల్ సబ్జక్టు ఆఫ్ ది ఈస్టుకోస్టు)— తూర్పుతీరమునగల మిక్కిలి రాజభక్తిపరాయణుడు— అనెను. అట్లనుటకన్న మిక్కిలి ధర్మమార్గప్రవర్తకుడనుట యెక్కువ సమంజసము. ధర్మనిర్వహణమున పంతులుగారు వెనుకాడి యెరుగరు. వాడపల్లి కాల్పులు జరిగినపుడు వీరిహృదయము కరుణతో కరగిపోయినది. కష్టమును పరకుసేయలేదు; ధనమునాసింపలేదు; అధికారుల యాగ్రహమునకు జంకలేదు. అహోరాత్రములు దీక్షతో పనిచేసి యందు నిందింపబడిన వారిని విడిపించి దేశీయుల కృతజ్ఞతకు పాల్పడిరి. శ్రీయుతులు వెన్నేటి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యముగార్ల కేసులలోగూడ పనిచేసి వారిపై నెంత యన్యాయముగ దౌర్జన్యము ప్రయోగింపబడినదో ఋజువుచేసి తన ధర్మాభిలాషను చూపించెను.

వీరు పబ్లిక్‌ప్రాసిక్యూటరుగా నున్నపుడు రాజమహేంద్రవరమున కూనీకేసొకటి వచ్చెను. అందు ఒక ప్రఖ్యాతపురుషునకు సంబంధమున్నదని వదంతి బయలుదేరెను. కలెక్టరుకు పిటిషన్లుగూడ వెళ్ళెను. ఎట్లయినను అతనిని అవమానపరుపవలెనని వారి యభిలాష. ఆరోజులలో నాతడు రాజమహేంద్రవరమును ఏలెనన అతిశయోక్తికాదు. లెజిస్లేటివు కౌన్సిలు ఎలెక్షనుల సందర్భమున దబ్బరమాటలాడెనను కారణమున పంతులుగారు అతనితో మాట్లాడుటమాని అప్పటికి ఎనిమిదేండ్లయి యుండును. ఈ కూనీవిషయమై వ్రాసి అతనికి అరెస్టు వారంటు ఈయవచ్చునాయని కలెక్టరు పంతులుగారి నడిగెను. 'అతడును నేనును మాట్లాడి యెనిమిదేండ్లయినది. కాని అతడిట్టినీచకార్యమున కొడిగట్టు

వని నేను నమ్మజాలను. సాక్ష్యము గట్టిగానున్న దప్పు అతనిని అరెస్టుచేయుటకు నేను ఒప్పుకొనను' అని పంతులుగారు జవాబిచ్చిరి. ఆహా! అపకారికి నుపకారము నెపమెన్నక చేయగలిగిన యిట్టి ఆంధ్రపుత్రులు మనలో నింకెందరున్నారు?

వీరి న్యాయశాస్త్రపరిజ్ఞాన మపారము. విశాఖపట్టణమున నొకకేసులో వాదించుటకు ప్రభుత్వమువారు వీరిని పంపిరి. ఆకేసు పదిరోజులకు మించి సాగెను. ఆర్గ్యుమెంటుకు ఎదటిపార్టీ ప్లీడరుకు ఒక రోజుపట్టెను. వీరు 15 నిమిషములలో తమ వాదమును ముగించి కూర్చుండిరి. ఆ న్యాయాధిపతి వీరి సూక్ష్మబుద్ధికి అచ్చెరువంది బెంచిమీద కూర్చుండగనే వీరి నభినందించెను.

పేదలయెడ వీరికి దయమెండు. ఎందరెందరివిద్యార్థులకో వీరు తమ జేబులోని ద్రవ్యమునిచ్చి సాయము చేసెడివారు. కీ. శే. కొచ్చర్లకోట బంగారమ్మగారు చనిపోవుటకు ముందు వీరినిపిలచి తన డబ్బు సద్వినియోగమగు మార్గమును సూచింపుమన రాజమండ్రి ఆర్ట్సుకాలేజీలో చదువు ఆరువేల నియోగుల విద్యనిమిత్త ముపయోగపడునట్లు చేయించి, దానిని తరువాత వృద్ధిపరచి యెందరెందరికృతజ్ఞతకో పాలుపడెను.

వీరికి స్నేహితులయెడ నభిమానము గాఢము. వారికనేకవిధముల వీరు సాయముచేయుచు వచ్చిరి. అందులో కొందరికి జామీనువుండుటవల్ల ఆర్థికదుస్థితిగల యారోజులలో దాదాపు ఏబదివేల రూపాయలవరకును పోగొట్టుకొనిరి. వీనినన్నిటిని మిక్కిలి నిర్లిప్తతతో నోర్చియుండిరి. ఒకమారు వీరు ఒక యెస్టేటుకు ట్రస్టీగా వుండి ఆయస్టేటుబాకి తీర్మానముక్రింద తమ అక్కౌంటులోనుంచి రు 18000 లను ఇచ్చిరి. తరువాత ఆ డబ్బు వీరికి తిరిగి రాలేదు. కాని ఆయన కించిత్తు విచారమును చూపక 'పోనీలే. ఒక సంవత్సరం సంపాదన లేదనుకుంటాము' అని నాతో అన్నారు. మొన్న మొన్నటివరకూ రాజమహేంద్రవరం వీథులలో పిచ్చిపాటలు పాడుకుంటూ తిరిగిన వేపారి అప్పన్నపంతులే వీరి యుత్కృష్టస్నేహబుద్ధికి తార్కాణము.

పంతులుగారు నౌకరులను తమకుటుంబములోని వారితో సమముగా చూసుకునేవారు. లచ్చయ్య అని నొక వృద్ధసేవకుడుండేవాడు. అతను రానురాను నీరసించి పనిచేయజాలకుంటే యింటివద్దనే వుండమని అతడు జీవించినంతకాలమూ పూర్తిజీతం యేనెలది ఆ నెల యిచ్చేవారు. వారివద్దనున్న గుఱ్ఱపువాడు—సైసు—గతముప్పది సంవత్సరములనుండి పనిచేస్తున్నాడు. మోటారుకొని గుఱ్ఱపుబండీ తీసివేస్తే వానిని పనిలోనుండి మాన్పింపవలసి వస్తుందని వీరు మోటారు కొనలేదు. ఇప్పటి రోజుల్లో మోటుగాభావింపబడే ఆ గుఱ్ఱపుబండిలోనే కాలమును గడిపినారు. అస్పృశ్యతానివారణము మాట ప్రజలెత్తనిరోజుల్లోనే వీరి యింట గుఱ్ఱపువాడు మొదలగువారు తదితరసేవకులందరివలె మెలగేవారు. సేవకులయెడ దుర్భాషలాడుటగాని, పనిచేయువానిని మాన్పించుటగాని వీరిప్రకృతికి విరుద్ధము.

పంతులుగారు ఎనమండుగురు మగపిల్లలకు పెండ్లి చేసినప్పటికీ ఒకదానికి కూడా కట్నము కానుకల విషయము ప్రస్తావించలేదు. వారుచూచినది మొదటివారి సాంప్రదాయము మాత్రమే. ఏపెండ్లిలోను మాటపట్టింపులుకూడా లేవు. పిలిచినంతనే భోజనమునకు పోవుట, ఇచ్చినదానితో సంతసించుట తాము సుఖముండి యితరులను సుఖపెట్టుట వీరి ప్రధానగుణములు. వీరి అయిదవకుమారునకు ఒక పేరుపోసిన పెద్దమనిషి పిల్లనియ్యవలెనని పోయిమాట్లాడగా ఆయన యిట్లనెను: 'మాపెద్దబావమరది చనిపోయినాడు. అతని కొకకూతురున్నది. వాళ్ళస్థితి నీరసం. అట్లాంటప్పుడు నేను మా అబ్బాయికి ఆపిల్లను చేసికొనడం విధి అయివుంది' కట్నముకొరకు కొట్లాడే యీదినములలో నింతటి విశాలహృదయులు మనకెందరు గోచరింతురు!

వీరి నిరాడంబరత్వమునకు సర్ ప్రఫుల్లచంద్రరాయిగారి నిరాడంబరతగూడ తీసికట్టు. వీరి నింటివద్దచూచిన అపరిచితు లెవరును వారే వెంకటాచలముపంతులుగారనుకొని యుండరు. ఎందరో యిట్టి పొరపాటుచేసిరి.

ఒకమా రొకరువచ్చునపటికి పంతులుగారు చుట్టకాల్చుచు కూర్చుండిరి. ఆతడు వీరినిచూచి 'నాయనా! పంతులుగారు లోపలవున్నారా? నీవు పంతులుగారియింట వున్నావా? వారు చాలమంచివారు' అంటూ ప్రశంసించెను. చివరకు వారే పంతులుగారనివిని యాతడెన్నో క్షమాపణలు చెప్పుకొనె. 'నన్ను మంచివాడని భూషించారుగాని దూషించలేదు గదా. మీకెందుకు భయం?' అని యూరడించిరి. వీరికి మొక్కలను పెంచుట మిక్కిలి ప్రీతికరము. ప్రతిదినము ఉదయాస్తమయములందు విశాలమగు తమ పెరటిలో పనిచేసి కూరలుగాయించి యిరుగునేసులకు పంచిపెట్టెడువారు. బచ్చలకూర, దవానసరిగోంగూర, తోటకూర వీరి కభిమాన శాకములు. దంపుడుబియ్యము, ఉడకబెట్టిన కూరలనే గాని మరబియ్యము, వేపుడుకూరలను వీరు దరికి రానిచ్చెడివారుకారు. నూతినుండి స్వయముగ దోడికొని చన్నీట స్నానముచేసెడివారు.

శిష్టాచారసంపత్తిగలవారు వీరు. శ్రీమద్రామాయణము నెడ వీరి కభిమానమెండు. స్వదేశవస్తువులనెడ ప్రీతిగలదు. పలుకుబడి యెంతయున్నను వీరికి అహంభావముగాని, కోపముగాని యిసుమంతయు లేకుండెను. మృదువును, చమత్కారమును ఒలుక మాటాడగల నేర్పరి. పరద్రవ్యమును విషతుల్యముగ జూచిన నిర్లిప్తుడు. తెలిసి పాపముచేయుటగాని, ఎఱిగి అనృతమాడుటగాని యెఱుగని పుణ్యపురుషుడు. అందుచేతనే మహాత్ములు మనసార వాంఛించు ముక్కోటి యేకాదశీమరణమును, చివరవరకును స్వస్థతయును పొందగలిగిరి. ప్రకటనకొఱకు ప్రాకులాడని కర్మవీరుడగు వేంకటాచలంపంతులుగారి జీవితము ఆంధ్రయువకులకు ఆదర్శపాత్రమును, అనుకరణయోగ్యమునై చిరకాలము వెలయగలదు.

ఈసిద్ధపురుషుని యాత్మ పరమేశ్వరుని కరకమలముల అతిశయమగు శాంతిని, ఆనందమును పొందుచుండుగాక.

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

తీవకన్నె

ఈ యిపురాకుఛత్రముల
　నెత్తినపుష్పితగాత్రి వెవ్వరే
తీయనివాసనల్ గుబులు
　తెమ్మెర కానుకలిచ్చి భృంగక
న్యాయతగీతరాగముల
　నాయెద రంజిలజేయబూనె దీ
మాయలు పన్నిగాని నను
　మన్ననలందగ జేయజాలవో!
ఆ చలినాటి వేగుబల
　నవ్వయి సేవకు బోయి త్రోవలో
తోచినభావనల్ మదిని
　దూపిలజేయగ సోలివచ్చి నీ
పూచిన పందిలిం గదియ
　బోవుచు పోవుచు నాగిపోవు నర్
చాచినబాహువల్లరుల
　సాకితివేలనో చెప్పవే చెలీ!
మున్నొకనాటిరేయి తన
　పూచినపందిటిక్రింద నే సుఖా
సన్నత నిద్రవోవునెడ
　జల్లగజేరి కవుంగలించి లే
గన్నెవికల్ విదిర్చి మరి
　క్రమ్మరిపోవుచు నాసుమాక్షతల్
చిన్నెలుగాగ నిల్పె, తన
　చేసినచిత్రము తేనెరుంగనో!
ఈమెయి నాకయి యెంతో [వరో
నీమముతో తపమునలుపు నెచ్చెలి యె
కామినియే యైనన్ తా
మిమబూనన్ కలఫలమేమో చెపుమీ!

—కొ. శశిశేఖరరావు.

శస్త్రవైద్యుల కరకౌశలం

గాంధిమహాత్మునకు ఉదరములో చేయబడిన ఆపరేషను వివరములు చాలమందికి ఇంకను బాగుగా జ్ఞప్తిలో ఉండియుండును. ముప్పదిరెండు కోట్ల భారతీయులకు ప్రాణాధికుడగు వ్యక్తి—లోకమువారిచే ఏసుక్రీస్తు అపరావతారముగ ఎంచబడుచున్న పురుషోత్తముడు. అట్టివాని ఉదరములో అపరేషనుసాగించుట. ఏమాత్రము ఒడుదొడుకు వచ్చినను ప్రపంచచరిత్రలో ఆశస్త్రవైద్యునకు శాశ్వతమైన అపకీర్తి. ఆయూరపియనుసర్జను మనస్సును గజిబిజిచేయుటకు ఈ పరిస్థితులు చాలనట్లు అపరేషను మధ్యలో ఎలక్ట్రిక్ దీపములు ఆరిపోయినవి. సామాన్యమైన హరికేనులాంతరు ఈయగల వెలుతురులో ఉదరమధ్యమున అపరేషను ముగించవలసివచ్చెను. ఆనిముసములలో ఆయూరపియనుసర్జను శరీరమున రక్తము ఎంతటి వేగమున ప్రవహించినదో! ఆపరేషను జయప్రదముగ ముగిసిన పిమ్మట అతడెంతటి శాంతిని, ఆనందమును పొందెనో! విశ్రాంతివేతనమును గొనుచు ఇపుడు స్వదేశమున నున్న ఆఇంగ్లీషు సర్జనుని రౌండుటేబిలు సభకు పోయినపుడు మహాత్ముడు కలసికొనెను. అప్పుడు తిరిగి వెనుకటి అపరేషన్ సంగతి, లోకాతీతపురుషుడైన అతని ప్రాణము లప్పుడు తనగుప్పెడిలో ఉన్నందుకు తాను పొందిన అదురు ఒకరెప్పపాటులో ఆసర్జను మనమున మెఱుపువలె మెఱసియుండును!

ఆమధ్య విశాఖపట్టణము కింగుజార్జిఆసుపత్రిలో నొక యూరపియనుసర్జను అపరేషను చేయుచుచేయుచు రోగిని వదలివైచి అదేకాలమునకు తాను ఎవరికడకో వత్తుననుటను జ్ఞప్తికి తెచ్చుకొని వెళ్ళిపోయెనన్న సంగతి వార్తాపత్రికలలో చదివియున్నాము. దీనిని బట్టి శస్త్రవైద్యు లందఱు తమరోగుల ప్రాణములను ఇంత చులకనగా చూచెదరనియు, వారికి దయఅనునది ఉండదనియు అనుకొనరాదు. పెద్ద అపరేషనులు చేయవలసియుండినచో సాధారణముగా శస్త్రవైద్యులు తమ రోగులచే వీలునామాలు వ్రాయింతురు. ఎటుబోయి ఎటునచ్చినను తమకు బాధ్యతలేనట్లు మాట్లాడుదురు. కాని మనస్సులో మాత్రము రోగిప్రాణరక్షణకొఱకు వారుపొందు ఆవేదనకు అంతుఅనునది ఉండదు.

ఈవిషయమై 'పాప్యులర్ సైన్సు మంత్లీ' అను అమెరికాదేశపు పత్రికలో ఫ్రెడరిక్ డామ్రష్ (యం.డి) అనువారు ఈక్రింది చమత్కారవృత్తాంతమును తెలుపుచున్నాడు: "నాసోదరశస్త్రవైద్యు డొకడు కొద్ది వారములక్రితము క్లిష్టమైన బ్రెయిన్ అపరేషను ఒకటి చేయుచుండ నేను దగ్గఱఉండుట తటస్థించెను. అపరేషను చేసినచో రోగి బ్రతుకునా బ్రతుకడా అని ప్రబల సందేహముగా నుండెను. అపరేషను జరుగుచున్నంతకాలమును సర్జను పైకి శాంతచిత్తముతో ఉండినట్లు కనిపించెను. అపరేషను జయకరముగానే ముగిసెను. కాని సర్జనుకే కాళ్ళుచేతులాడుటలేదు. మంచముగడ్డపైబడి ఉంచబడిన జలముగల గ్లాసును స్వయముగ నాతడు నోటిదగ్గర పెట్టుకొనలేక పోయెను. నేను గ్లాసుఎత్తిపట్టి త్రాగించవలసి వచ్చెను. తరువాత అతడు తనకు కారునడపుటకు భయముచేయుచున్నది కావున కారునడిపి అతనిని ఇంటికిగొనిపొమ్మని నన్ను వేడెను. శస్త్రవైద్యులు దయలేనివారని భావించువారు గొప్పగా పొరపడిరనియే చెప్పవలసియున్నది. కత్తి వరిముల్లువాసి అటుఇటు అయినను లక్షలు విలువచేయు రోగిప్రాణములు పోవునుగదా అను భయభావము శస్త్రవైద్యుల నరములను సదా ఉద్రేకింపచేయుచుండును. కాగా శస్త్రవైద్యుల ఆయుఃపరిమాణము

అత్యల్పమైయుండుటలో ఆశ్చర్యమేమి !"

ఇదియుగాక శస్త్రవైద్యులు ఒక్కొక్కప్పుడు అకస్మాత్తుగ మరికొన్నికష్టములను ఎదుర్కొనవలసి వచ్చును. ఈమధ్య పారిస్‌నందలి రాత్‌చైల్డుఆసుపత్రికి రక్తము కాలువలుకట్టుచు కారిపోవుచున్న స్థితిలో ఒక స్త్రీరోగి కొనిరాబడెను. వెంటనే కొంత క్రొత్తనెత్తురు ఆమెకు ఇంజెక్టుచేసినగాని ఆమె బ్రతుకుస్థితిలో లేదు. అక్కడఉన్నవారి నెత్తురులన్నియు పరీక్షింపబడెను — ప్రధానశస్త్రవైద్యుని ఒక్కని రక్తముమాత్రము ఉపయోగార్హమైనస్థితిలో ఉండినట్లు కనుగొనబడెను. ఎట్టి తటపటాయింపును లేక తన నాళములనుండి వలసినంత రక్తమును వెలార్చి ప్రధానశస్త్రవైద్యుడు రోగికి ఇంజెక్టుచేసి, అనంతరము జయప్రదముగా తానే ఆపరేషను సాగించి ఆమె ప్రాణములను కాపాడెను.

ఇట్టి అగత్యములకు తాము సంసిద్ధులై యుండుటకును, ఆపరేషనులు సాగించుటలో ముఖ్యావసరమగు తమ కరకౌశలమును నిలుపుకొనుటకును సర్జనులు — మల్లురవలె — శరీరసాధన చేయుచుందురు. ఆహారనిద్రావిహారవిషయమున వారు సంయమము నవలంబింతురు. శస్త్రవైద్యులలో పలువురు మద్యమును ముట్టరు; పొగాకును దరికి చేరనీయరు. కొందరు కాఫీని, తేయాకును రుచియైనను చూడరు. శస్త్రవైద్యులందరును రాత్రిళ్ళు బాగుగ నిద్రపోవుటనుగూర్చి విశేషశ్రద్ధాళువులై యుందురు.

'అలసటచెందిన సర్జను రోగికి యముడు' అని న్యూయార్కులో సుప్రసిద్ధినందిన డాక్టరు అబ్రహామ్ ఊల్బ్రాస్టు నిర్వచనము. ఆపరేషనులు ఎక్కువగ చేయవలసియుండు దినమునకు తొలిదినపు సాయంకాలమునందు నియమముగా అతడు ఉల్లాసముగూర్చు నవలలనుగాని, అపరాధపరిశోధకకథలనుగాని చదివి మనమునకు విశ్రాంతి కల్పించుకొనును. ఆశవదలుకొన్న మాస్టాయిడ్ (చెవిగ్రంథులు) కేసులను ఆపరేటుచేసి కుదుర్చుటలో మాంత్రికుడను లోకఖ్యాతి నార్జించిన డాక్టరు మారిస్ లీవైన్ ప్రతి ఆపరేషను చేయుటకును ముందు మంచముమీద వెల్లకిలబరుండి తనకు ఆ ఆపరేషనులో సాయము చేసి జయము కలిగింపవలసినదిగా భగవంతుని ప్రార్థించును. న్యూయార్కునందలి ప్లాస్టిక్‌సర్జనులలో విఖ్యాతుడగు డాక్టర్ హెచ్. లాయిన్స్ తాను చేయబోవు ప్రతి ఆపరేషనునకును ముందు తనగదిలో ఒంటరిగా కూర్చుండి పదినిముసముల కోడికునకు తీయుచు తేరుకొనుచుండును. శస్త్రవైద్యుల ఇట్టిపద్ధతులన్నిటియందును అతివిచిత్రమైనది న్యూయార్కునందలి మఱియొకస్పెషలిస్టునుగూర్చినదియై యున్నది. ఆపరేషనులు సాగింపవలసినదినమునకు తొలిదినపు సాయంకాలములందు అతడు తప్పక సినిమాకుపోవును-ప్రదర్శనము చూచుటకుగాదు; రోగుల, వారి చుట్టముల ప్రశ్నపరంపరల నుండి తప్పించుకొనుటకు. సినిమామందిరమున అతడొక మూల ఎట్టికలతయులేక నెమ్మదిగ ఒరిగి కూర్చుండి తాను మఱునాడు చేయవలసిన ఆపరేషనులో ఏది ముందుచేయవలయును, ఒక్కొక్కటి ఎట్లుచేయవలయును అని యోజించుకొనును.

శస్త్రచికిత్సచేసి మూర్ఛరోగమును కుదర్పగలుగుటను ప్రదర్శించిన ప్రఖ్యాతశస్త్రవైద్యుడు డాక్టరు కే. విన్‌ఫీల్డునే అనువాడు ఆపరేషనుగదియందలి అతిప్రయాసకు తాళగలిగియుండుటకై తనజీవితమును గడియారముమాదిరిగ త్రిప్పును. అతడు ఎనిమిదిగంటలకు పడకనుండి లేచును — ఆసుపత్రికి ఎన్నడు ఆలస్యముగ పోయియుండడు. ఉదయమువూట ఆపరేషనులు సాగించును; మధ్యాహ్నము రోగులనుచూచును. మధ్యాహ్నభోజనమునకు పూర్వము ఒకగంట నిద్రించును. సాయంకాలము చతురంగమాడును, లేదా బ్రిడ్జియాడును పేకాటయాడును, లేదా గభీరనాటకప్రదర్శనమునకు పోవును. రాత్రి పదునొకండుగంటలు మొదలు మూడుగంటలవఱకు చదువుటయందును, శాస్త్రవిషయకవ్యాసరచనయందును గడుపును. అతనికి రోజుకు ఆరుగంటల నిద్ర సరిపోవును. రాత్రి మూడుగంటలు మొదలు ఉదయము ఎనిమిదిగంటలవఱకును, పగలు ఒకగంటయు — అతడు నిద్రించును. హెచ్చునిద్ర ఏకాగ్రతకు భంగము కలిగించుట అతని అనుభవము.

తనకరాంగుళముల శస్త్రచికిత్సాకౌశల్యము పెంపొందుటకై మట్టిముద్దలతో రూపములను దిద్దుచును, కొయ్యపలకలపై చెక్కడపుపని చేయుచును, విగ్రహాదులు చెక్కు శిల్పవిద్య అభ్యసించుచును డాక్టరు సే తన తీరికసమయములను వెళ్ళబుచ్చును. వడ్రపుపనిముట్లతో పనిచేయుచు అతడు తనవిశ్రాంతిసమయమున చేతివ్రేళ్ళను లాఘవపఱచుటలో పర్యాప్తుడైయుండును.

తమకరకౌశలమును పెంపొందించుకొనుటకును, స్ఫురించు ఆలోచన నందుకొని అవయవములు పనిచేయు శక్తి అతిశయింప జేసికొనుటకును శస్త్రవైద్యు లందఱును తఱచుగా ప్రయత్నములు సాగించుచుందురు. తనవ్రేళ్ళకు హెచ్చులాఘవముకలుగుటకై ఒక డాక్టరు లోహములపైని ద్రావకాదుల సాయమున చిత్రములు చెక్కు (ఎచ్చింగు) పనిని నేర్చుకొనెను. పలువురు సర్జనులు తమచేతులు ఎక్కువ చుఱుకుగా పనిచేయుట కలవడుటకై సారంగియను వాద్యమును, ఫిడేలు వాద్యమును అభ్యసింతురు. మూత్రపిండములను ఆపరేటుచేయుటలో అసాధారణ ప్రజ్ఞ చూపినడాక్టరు ఫార్బిస్ హాక్స్ తన కరాంగుళముల సాధనమునకై పియానోవాద్యమును అభ్యసించెను. ఆపరేషను జరిపిన తరువాత చర్మమును కుట్టుటలో పూర్ణప్రజ్ఞానిపుణుడగుటకు న్యూయార్కు సర్జను బ్రూక్లిన్ అను వాడు ప్రతి సాయంకాలమును పఱుపు అంచులను కుట్టుచు, దారమునకు ముళ్ళువైచుచు విశేషసాధనచేయును. ఆపరేటింగు రూమునందు శరవేగముగ గాయములకు కుట్లు వైచుటయందు అతడు అతిలోకుడై యున్నాడు.

తననేత్రములు, కండరములు శస్త్రకర్మావసరమున తుల్యయోగితనంది పనిచేయుటకు గరిడిసాధన మఱియొక శస్త్రచికిత్సకుడవలంబించిన విధానము. ఈ గరిడి సాధనకు తోడు తనరెండుచేతులను సమముగా ఉపయోగింప నేర్పు సంగీతవాద్యములలో విశేషసాధన అతడు చేకొనెను. సాధారణమైన పనివాడు తనరెండు చేతులలో ఏదోఒక్కదానినే పనితనములో నుపయోగింపగలిగియుండును. కాని శస్త్రచికిత్సకులలో ప్రముఖులు పలువురు కుడిచేతి నుపయోగించిన వాటములో డనే ఎడమచేతినికూడ నుపయోగింపగలరు. కోయుటలోను కుట్టుటలోను మొదట ఒకచేతిని, పిమ్మట మఱియొకచేతిని అప్పటప్పటికి ఏది అనువై ఉండిన దానిని శస్త్రచికిత్సకమహాశయులు ఉపయోగించియుండుట తాను స్వయముగ చూచితినని ఫ్రెడరిక్ డామన్ (యం. డి.) వ్రాయుచున్నాడు.

శాస్త్రపరిశోధనచేయుచు జంతువులపై శస్త్రకర్మ ఆచరించుట అతిసున్నితమైన ఆపరేషనుపనులను చేయుటలో తమచేతులకు తరిఫీతునొసంగుటకై సర్జను అవలంబించు మఱియొకసాధన. శాస్త్రపరిశోధనచేయుటలో తఱచుగా శోధకుడు నూకనుచ్చువంటి అతిసూక్ష్మములైన మాంసగ్రంథులతో (గ్లాండ్లు) పెనగులాడవలసియుండును. కత్తి చిఱునెంట్రుకవాసి చెదరినను చేసిన పరిశోధన అంతయు చెడిపోవును. కెనడాకు చెందిన టొరంటోయందలి డాక్టరు ఫ్రెడరిక్ బాన్టింగు ఇట్టి సూక్ష్మపరిశోధనావసరమునసే ఇన్సులిన్ అను దానిని కనుగొనియున్నాడు. డయబెటీసు అనబడు మధుమేహమువలన తీసికొను రోగులపాలిటి వరప్రసాదముగనున్న ఈ ఇన్సులిన్ కనుగొనుట వైద్యప్రపంచమున నొక గొప్పవిషయమై ప్రకాశిల్లుచున్నది.

ఒక్క అమెరికాసంయుక్తరాష్ట్రములయందే ఒక యేడాదిలో జరుగు ఆపరేషనులసంఖ్య పదిలక్షలనుమించి యున్నది. విశాలవిశ్వము మొత్తముమీద ఈ సంఖ్య ఎంతయుండునో? ప్రపంచమున ప్రస్తుతము శస్త్రచికిత్స వలన మృత్యుముఖమునుండి తప్పింపబడిన ప్రాణుల సంఖ్య దినదినము పెరుగుచున్నది. ఇందులకైన గణ్యతలో విశేషభాగము తమ శస్త్రకౌశలవైదగ్ధ్యమును పెంపొందించుకొనుటకు సర్జనులుచేయు నిరంతరపరిశ్రమకును, శస్త్రచికిత్సాకలాపమును నిర్వర్తింప ప్రయత్నపడుటలో సర్జనులుపొందు అనంతమైన వేదనకును చెందవలసియున్నది.

కోయుట, కుట్టుట నిర్దిష్టకాలములో జరిగిపోవలయును. అరసెకండు ఆలస్యమైనను ప్రాణము దక్కదు. ఎక్కడకోయవలయునో కత్తి సరిగా అక్కడనే పడవలయును. తలవెంట్రుకవాసి అటు ఇటు అయినను ప్రాణ

ములు మఱిలేవు. వాయువువలె వేగముగా పనిచేయుటల యునే కాని దానివలె ప్రసరింపరాదు. విద్యుచ్ఛక్తివలె నిశితమైయుండవలయునే కాని దానివలె అదరుపుట్టింప రాదు. సూదిశరమువలె సూటిగా గ్రుచ్చుకొనవలయు నేకాని దానివలె ప్రాణముతీయరాదు. ఆకాశమునుండి భూమిమీది నలుసంతటి కోడిపిల్లను చూడఁగల గ్రద్ద దృష్టిబలము—భూమిమీదనుండి దమ్మిడీకాసును అల వోకగా ఎత్తగల ఏనుగుతొండపువంటి చాకచక్యము అనిముషములో పూర్ణముచేతులనుండవలయును. అవయవము లకు అతిశీఘ్రచలనము—మనస్సునకు అంతులేని ఆరాటము గల ఆ సమయములో తప్పక గ్రమ్మఁగల ముచ్చెమటలలో ఒక్క బిందువుకూడ జారి రోగి గాయము న పడరాదు. దీనికిమించిన అసిధారావ్రతము ఇక లేమిగలదు? ఆపరేషనుచేయు ఆ రెండు నిమిషముల యందును భగవంతుఁడేవచ్చి ఆ సర్జనులో ప్రవేశించియుం డి—ఊహించుటకే వెఱపుగొలుపు—ఆ శస్త్రకర్మలను గావించునేమో!

—పి. బ్రహ్మాజీరావు, ఎం.బి.బి.యస్.

అనపత్యత

[బిడ్డలలేమినిగూర్చి వర్ణించుట ఆంధ్రప్రబంధలక్షణములలో నొకటి. అగుటచే ఆంధ్రప్రబంధకవులలో పలువురు ఈ విషయమై వర్ణనము సాగించియున్నారు. వానిలో కొన్ని అతిమనోహరములు. అనపత్యతను వర్ణించు నాచనసోమనాథుని ఈ పద్యరత్నమును గమనింపుఁడు:

"తడియొత్తుచీరలోఁ దాదికాఁగిటఁ జేర్చి చూపంగఁ గన్నారఁ జూడనైతిఁ
దడవియాడకమున్న తట్టాడుమునిపట్టి వడఁకంగ పెజ్జపై వ్రాలనైతి
నల్లంతదవ్వుల నప్పలప్పలనంగ నెనుఁగుగాఁ బరతేర నెత్తనైతి
వియ్యాలచే నిచ్చి వేడుక నను వారు తిట్టింప విని దప్పిదేరనైతి

నకట మిథ్యామనోరథుండైతిఁ గాని
కొడుకులంగని దమవారు గొండసేయ
నుండలేదయ్యె సంపద లుబ్బచేని
లేబరముకాదె బిడ్డలు లేని బ్రదుకు."

సంతానసంపదకు నోచనిదంపతులసంసారమును 'ఎన్నులేని సస్యము'అని తెనాలి రామకృష్ణుఁడు పిలుచుచున్నాఁడు. ఈ విషయమై తెనుఁగుప్రబంధములనుండి ఎన్నైన నిదర్శనములు చూపవచ్చును. అయితే మన ప్రబంధకవులందఱును అనపత్యతను వర్ణించునపుడు పైజాతికుటుంబములనే మనమునందుంచుకొనిరి కాని క్రింది జాతి కుటుంబములనుగూర్చి తలపెట్టలేదు. క్రిందిజాతికుటుంబము లందును—కొద్దిగనే కావచ్చు—సంతానము లేని కుటుంబములు కొన్నియుండుట కాంచుచున్నాము. సంతానము పొందనప్పుడు అట్టి కుటుంబములలోని స్త్రీలభావము లెట్లుండును? ఈ క్రింది ఖండకావ్యమునందలి కవితావస్తువు ఈతరగతికి చెందినది. వస్తువు ఇట్లు కొంతవఱకు క్రొత్తదైయున్నది. ఇందు ఒక గొల్లదాని నిస్సంతుసంతాపము ప్రస్తరింపబడినది. —సంపాదకుఁడు.]

చెల్లెను కాలమంతయును చెప్పికొనంగను వ్రేలిడేనియుఁ
బిల్లఁడు నింట లేఁడు సుఖమేటికి? సంపద లేల? వెఱ్ఱిమా
గొల్లఁడు నొక్కగొఱ్ఱకయి కొండలవెంబడి బోయిరాఁడు ఈ
పల్లియకెల్ల నేనొకతె వంధ్యగనుంటిని దిష్టిబొమ్మనాఁ.

చెట్టులు చేమలాది చిరుచీమలదాఁక సమస్తజీవులుం
బుట్టుక సార్థకంబగుడుఁ బొత్తిగ నావలె గొడ్డువోక యే
బెట్టును శక్తిసారముల బిడ్డల నేటికి నొండొ మెండుగా
నిట్టుల బుట్టి, బుట్టినటు లేగెడు మూలవినాశు లుందురే.

పసుపును నూనె గుడ్డలకు పట్టుట చన్నులనిండ పాలుఁ జే
పి సుతుని నడ్డలందునిచి ప్రేమను ముద్దుల నాడుకొంటయుం
బసినయనంబులన్ దనను పాపడు చూచుచు నవ్వుచుంటయుం
బొసగుట లెట్టిపుణ్యములు నోచినయింతికి గల్గునో గదా ?.

ఒక్కఁడు గుండెపైఁ గునుక నొక్కఁడు ఱొమ్ముల నానుచుండ వే
ఱొక్కఁడు లేచి యేడువగ నొక్కనిపై కరముంచి చేతితో
నొక్కని జోగుగొట్టకడు నోర్పునఁ బిల్లలకోడి భంగి నా
ప్రక్కను నిద్రఁజెందగల భామది కాదొకొ భాగ్యమన్నచోన్.

కూరలు కాయలున్ గలిగి కూడును కమ్మగవండి నేను మా
వారలు నొంటిగా తినడి పట్టున పిల్లలు లేని లోపమున్
దీరని శోకవారిధిని దింపగ గుండెలు విచ్చిపోయెడిన్
నోరను నీళ్లుగారు మదినొచ్చి భుజింపగ తోచ దేమియున్.

పగలెల్లన్ బనుమంద మేసికొని నింపాదింపగా రాత్రులం
దు గృహంబందొకకున్కఁ దీసి దినముల్ దొర్లింపగా జేయు మా
మగవారెట్లో సహింత్రుగాని పగలున్ మాపింటిలో నొంటి నే
నెగులుం బొందుచు నెట్టుగా మరతు సీ నిస్తంతుసంతాపమున్.

ఇంపుగ నాదుగర్భమున నింతయు బిడ్డడు పుట్టకున్న బో
పెంపునకైన నా యెడల పిల్లలతల్లులు జాలిబొందగా
నంపగిపూవువంటి సుతు చంకకు జేర్చు నుపాయమెంచి మా
కొంపకు దీపమున్ నిలిపి కొండలరాయడ! తండ్రి! బ్రోవుమా!

కడుపులనింప కూడు తినగాంచని వారి యదృష్టమేమొగా
కడిపెడుబిడ్డలం గనియుఁ గానుకలిచ్చెదనన్న గ్రాసమున్
గడపెదునన్నగాని తను కానుపులం దొక నిచ్చి తీపులన్
గడవరు కన్నయమ్మకును కన్నది వావుగదా తలంపగన్.

ఉపవాసంబులఁ జేతు నిన్ మనసులో నూహించి కొండన్న నే
జపమంత్రవ్రతముల్ జరింతు నిక నా సంకల్పమున్ దీర్చుచో
నపుహాపంబగు పోతు నిత్తు జనులానందింప సంతర్పణా
ద్యుపచారంబుల నల్పెదన్ సుతుడు నాకొక్కండు ప్రాప్తించినన్.

—మిత్తింటి నరసింహమూర్తి, బి.ఏ.,బి.యల్,

పాశ్చాత్యదేశాల్లో ముద్దులు

మన పూర్వులు ఒక్కొక్క విషయాన్ని గురించి చేసిన పరిశోధనచూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. నిదర్శనంగా ఒక్క ముద్దును గురించి చూడండి మన వాళ్ళు ఎంతటి పరిశోధన చేశారో! కామశాస్త్ర గ్రంథాలలో ఋగ్వేదం అనతగ్గ వాత్స్యాయనుని కామసూత్రాల్లో-వ్యాకరణశాస్త్రాల్లో సంధిక్రియలకు వలె-ముద్దులకు ఒక ప్రకరణం ప్రత్యేకింపబడిఉంది. సంస్కృతకావ్యాల్లోదొరికే ముద్దులకు హద్దులేదు. ఇక ఆంధ్రప్రబంధకవులు పద్యపాదానికి ఒకటిరెండు ముద్దుల చొప్పున కల్పించి తమసంతతివారు తలా ఒకటి రెండు పంచుకున్నా తరిగిపోనన్ని ముద్దులను సృష్టించారు. ఇవి చాలనట్లు ఈనడుమ భావకవులుకొందరు ముద్దును గూర్చి ఒక్కొక్కసారి నాలుగైదు పద్యాలను చెపుతున్నారు. కృష్ణశాస్త్రిగారన్న భావకవి ఒకడు ఈమధ్యని ఆటకెలదుల్లో ముద్దులుకురిపించి సీసాలదాకాసాగి అంతటితోనే చెంపకాయలదాకా రావడంచేత చంపకమాలల్ని ఎత్తుకోక పట్టి లేటగీతాలలో నెల్లూరు వచ్చినాడట. గోదావరీతీరాన్ని మధురకవి నాళం కృష్ణారావుగారు 'ముద్దు'అనుపేరుతో ఒక ప్రత్యేకఖండకావ్యమే రచియించారట. ముద్దుగా ముద్రించారట కూడాను.

ఇట్లు కవితాసుందరి మనదేశంలో ఇంటింటా తనతో బుట్టువగు ముద్దులదేవిని అనాదినుండీ నాట్యంచేయిస్తూ ఉండగా పరదేశాలలోను, పాశ్చాత్యదేశాలలోను పాపం ముద్దులదేవికి అసలేస్థానంలేకుండాపోతోంది. పాశ్చాత్యదేశాలలో ముద్దులభవిష్యత్తు— హిందూదేశపు రాజ్యాంగసంస్కరణాలకన్నా— అయోమయంగా వుంది.

ఒకసారి ఫ్రెంచిశాసనసభ గాలరీలో మగవాళ్ళు ఆడవాళ్ళుకలిసి కూర్చున్నారు. ఆనాడు శాసనసభ అట్టే రక్తిగాలేదు. అందుచేత ప్రేక్షకులు ఆగాలరీలో కూర్చున్నవారిలో ఒకస్త్రీ ఒక పురుషుడు ఉబుసుపోకకు ఒకరినొకరు ముద్దుపెట్టుకున్నారు. శాసనసభలో ముద్దులు పనికిరావని వాళ్ళ ఇద్దరినీ భద్రంగా బయటికి పంపేశారు.

ఫ్రాంసుదేశానికి పొరుగునఉన్న విషయాల్లో కూడా ముద్దులపరిస్థితులు ఇంతకంటె బాగుండలేదు. అచటి విద్యార్థి ఒకడు తనతో చదువుకునే ఆడపిల్లను వాళ్ళతలవాకిట వీడ్కోలుముద్దు పెట్టుకున్నాడు. ఆ సమయంలో ఒక కంపెనీగుమాస్తా ఆదారిని పోతూ ఈ అనురాగచేష్ట పరకీయం అవడంచేత అసూయపడ్డాడో ఏమో వెంటనే పోలీసువారికి రిపోర్టుచేశాడు. అలక్ష్యం అయితే ఏ ఆకాశం అంటుకుంటుందో అని పోలీసువారు రిపోర్టువచ్చిన తక్షణం ఆక్షరాజ్ఞి కోర్టుకులాగేరు. పెళ్ళయి మొగుడితో కాపరంచేస్తూ ముద్దులరుచిని ఎఱిగిన స్త్రీ ఒకతె ఈకేసులో ముద్దాయికి ప్రతికూలంగా సాక్ష్యంచెప్పింది! తమజాతివారైనా ఇతరస్త్రీలకు ముద్దులు లభిస్తుంటే స్త్రీలు ఓర్వలేరేమో!

ఈ రెండుకేసులలోను ముద్దులుపెట్టుకున్న స్త్రీపురుషులు భార్యాభర్తలుకారు. ఒకవేళ భార్యాభర్తలు కాకపోవడంచేతనే వీళ్ళముద్దులు కోర్టుకు ఎక్కివుంటాయని ఉపపత్తి కల్పించుకుందామన్నా అచ్చటి భార్యాభర్తల ముద్దులజాతకాలవక్రాలూ ఇదేమో స్తరుగా ఉన్నాయి. అమెరికాదేశంలో కాన్సాసు పట్టణంలో ఒకభర్త ప్రేమపట్టలేక తనభార్యను రోడ్డుమీద ముద్దుపెట్టుకొనగా ఆభర్తపై కేసుపెట్టబడింది. ముద్దులమజా ఎఱుకో, ఎఱిగిఉన్నా పోలీసోఏమో అచటి న్యాయాధిపతి ఆభర్తకు పెద్దజరిమానా విధించాడు. భార్యను ముద్దుపెట్టుకొన్నందుకు భర్తకుపెద్ద జరిమానా? అన్యాయప్పట్టణంలో అలువగలకురంకు ఆనేపామెత ఇక్కడ నిజమైంది. పోనీ అమెరికావారి జీవితం ఏమన్నా గొప్ప నీతినియమాలతోఉందా అంటే అదీలేదు. త్రాగుడు నిషేధము తొలగింపబడిన ఈరోజులలోకూడా అమెరికాదేశంలో ముద్దులు నిరోధింపబడటం చాలా ఆశ్చర్య

మైంకే. గ్రాగుడులో కనిపించినరుచి ముద్దుల్లో వారికి కనిపించలేదేమో! బురదమెచ్చే పందికి పన్నీరుపస ఎక్కనట్లు—

భార్యాభర్తలైనా కేవలం రోడ్డుమీద ముద్దుపెట్టుకోడం ప్రజానీతికి విరుద్ధమేఅని తండ్రితద్దినంకూడా పట్టుపంచిమడితో నిర్వహించే బ్రాహ్మణోత్తములు కొందఱు అనవచ్చును. ఒక భార్యాభర్త ఉంటారు, వారు ఓగుర్రబ్బండిలో ప్రయాణంచేస్తుంటారు, ఉబలాటంపుట్టి ఒకర్నొకరు ముద్దుపెట్టుకుంటారు - ఇది కూడా ప్రజానీతికి విరుద్ధమైందని ఆ బ్రాహ్మణోత్తములంటారా? వీరు అంటారో అనరో కాని చీనాదేశంలో హాంకాంగుపట్టణంలో ఒక మేజిస్ట్రేటు ఈముద్దు కూడా ప్రజానీతికి విరుద్ధమైందేనని నిర్ణయించాడు. ఒట్టి నిర్ణయంతో వదలిపెట్టలేదు. ఆ భార్యాభర్తలకు ఐదు పౌనులు జరిమానా వడ్డించాడు. అనగా భార్యాభర్తలు పెట్టుకునే ఒకముద్దు ఖరీదు ఐదుపౌనులు అయినదన్న మాట. ఐదుపౌనులంటే హిందూదేశపు నాణెములలో ఇప్పటి మారకపురేటుప్రకారం నూరు రూపాయిలు. ముద్దుకి నూరేసిరూపాయిల చొప్పున కోర్టువారికి జరు కట్టవలసినవిధి ఏర్పడితే నలకూబరుడువంటి ధనవంతుడుకూడా తనభార్య రంభవంటి రూపసి అయినా ఆమెను ముద్దుపెట్టుకోడానికి జంకుతాడు. జంకు రాజేమిటి? ముద్దుపెట్టుకోనే పెట్టుకోడు—అసలే ఇవి డబ్బు కాటకపురోజులు.

కోర్టువాళ్ళు ఇల్లాగ ముద్దులమీద దండెత్తడంతోనే ఆయాదేశాలలో రైల్వేవాళ్ళుకూడా ధైర్యంతెచ్చుకొని రైలుస్టేషన్లలోనుంచి ముద్దులను ఉద్వాసన చెప్పి వానిని బహిష్కరించవలసిందిగా ఫర్మానా జారీ చేశారు. పాశ్చాత్యదేశాలలో భార్యాభర్తలు ఎవరైనా ఒకరు రైలుప్రయాణం అయితే రెండోవారు కూడా సాధారణంగా స్టేషనుకి వెడతారు. ప్రయాణముచేసే వారు రైలుపెట్టెలోకి ఎక్కి కిటికీగుండా ముఖం ఈవలకి దూరుస్తారు. రెండోవారు ప్లాటుఫారంమీద నిలబడి వీడ్కోలుముద్దు పెడ్తారు. కొందఱు భార్యలు ఇట్లా ప్రయాణమయ్యే తమభర్తలకు వీడ్కోలుముద్దులు ఇచ్చే సందడిలో మునిగిఉంటూండంమూలాన్ని, మతికొందఱు భార్యలు తమ భర్తలను సకాలంలో రైలు ఎక్కించలేక పోతున్నారు కాబట్టి ఇకముందు స్టేషన్లలో వీడ్కోలుముద్దులు ఉండకూడదని అచ్చటి రైల్వేవాళ్లు శాసిస్తున్నారు.

న్యూయార్కుకు చెందిన బ్రాంక్సువిల్లాలో గడచిన అక్టోబరు 21-వ తేదీని అచటి పోలీసుకమీషనరు ఫిలిప్ ఇట్లు ప్రకటించాడు: "ఇకముందు స్టేషన్ ప్లాటుఫారములమీద భార్యలు భర్తలను ముద్దుపెట్టుకో కూడదు. రేపటి సోమవారము మొదలుకొని స్టేషనులో ఇద్దఱు స్పెషల్ ఆఫీసర్లు నియమింపబడతారు. వారు ఒక వారమురోజులవఱకు 'భార్యలారా! మీ భర్తలను ముద్దుపెట్టుకోకండి' అని వార్నింగులు ఇస్తూఉంటారు. పై మంగళవారంనుంచీ ఇట్టి వార్నింగులు ఇవ్వబడవు. పిమ్మట ఏభార్యఅయినా తనభర్తను ముద్దుపెటుకొనుచుండగా చూడబడితే వెంటనే పోలీసుకోర్టులో ఫిర్యాదు చేయబడి ఆమెకు సమన్లు పంపబడును." ముద్దులతనిఖీకి ఇద్దఱు స్పెషలుఆఫీసర్లు! భార్య భర్తను ముద్దుపెట్టుకుంటే సమను!—

కిరసనాయిలు పెట్రోలు డిపోల్లోను- తుదకు వంటచెఱకుడిపోలలోకూడా - చుట్టతాగకూడదనిన్నీ; పెద్దపెద్ద గ్రంథాలయాలలో బిగ్గరగా మాటలాడకూడదనిన్నీ; ప్రతి పట్టణంలోని కొన్ని వీధులమొగలయందు ఉచ్చపోయకూడదనిన్నీ; నలుగురు జనులుకూడే ప్రతి చోటా—తుదకు సత్రవులలోకూడా—ఉమ్మివేయకూడదనిన్నీ; ప్రతి ఆఫీసులలోను—తుదకు అచ్చుఆఫీసులలోకూడా—అనుజ్ఞ లేనిదే లోనికి రాకూడదనిన్నీ నేటి నాగరికతతోపాటు పెచ్చుపెరిగి ఉన్న వ్యక్తిస్వాతంత్ర్యాన్ని అరికట్టు—నోటీసు బోర్డులు కనిపిస్తూఉన్నవి. కాని వాటికి ఎవరూ వింతపడడం లేదు. స్టేషన్లలో ముద్దుపెట్టుకోకూడదని కేకలువేస్తూన్నారంటేమాత్రం చాలామందికి విచిత్రంగాఉంది. ఈ విచిత్రానికి కారణం అసంగతి నోటీసో చెప్పడంమూలాన్నేమో! నోటీసుబోర్డులు వేయిస్తే సరిపోవచ్చు! ప్రతిరైలుపెట్టెలోను 'దొంగలున్నారు జాగ్రత్త' అని

ఉండనేఉంది కాబట్టి దానిప్రక్కను 'ముద్దుపెట్టుకో వద్దు' అనికూడా నోటీసులుచేరిస్తే బాగావుంటుంది. రెండూ ఒకచోట చేర్చడంవల్ల 'దొంగలున్నారు జాగ్రత్త : ముద్దుపెట్టుకోవద్దు' అని కలిపిచదివి భాషాప్రవీణులుకొందరు అన్వయంచేసినా, వారికి మనం ముద్దుపెట్టుకుంటే పట్టుకునే దొంగలున్నారు జాగ్రత్త అని అర్థంకాగలదని చెప్పి సమాధానపఱచవచ్చును. కాబట్టి ఈవిషయమై నోటీసులు ఏర్పాటుచేయవలసిన అవసరం పాశ్చాత్య దేశపు పోలీసుకమీషనర్లు ఎంత త్వరగా గ్రహిస్తే వారి కంతమంచిది. నోటీసుబోర్డుల కున్నశక్తి నోటిమాటలకు లేదు—

'తెల్లవారవచ్చింది.ఇక మీప్రణయకోపాలను మాని ఒకరిని ఒకరు కౌగలించుకోండి' అని దంపతులనుఉద్దేశించి, ఆంధ్రదేశంలో ప్రబంధకాలంలో కొందఱు కవుల ధర్మమా అని తొలికోళ్ళుకూసేవి. అమెరికాదేశంలో ఈకాలంలో ఒక పోలీసుకమీషనరు పాపమా అని 'ట్రాఫిక్కు'కు అడ్డునిస్తోంది. ఒకరిని ఒకరు ముద్దుపెట్టుకోవద్దు' అని దంపతులను ఉద్దేశించి స్పెషల్ ఆఫీసర్లు అరుస్తున్నారు.


ముద్దులను నిషేధించే ఈజాడ్యం ఒక్క అమెరికాదేశపు రైళ్ళలోనే ప్రబలలేదు. ఆస్ట్రియాలోకూడ వ్యాపించింది. 'ఎవడు ఆదర్శకప్రయాణీకుడు ?' అను ప్రశ్నకు కొందఱు రైలుపెట్టెలో ఉమ్మివేయనివాడనీ, తను ఒకప్రక్కబల్లమీద కూర్చుని రెండవబల్లకు కాలుతన్నిపెట్టని వాడనీ ఇల్లాంటి సమాధానాలు చెపుతారు. ఆస్ట్రియారైల్వేఅధికారులకు ఈసమాధానాలు ఏవీ సరిపడవు.ఎవడైతే రైలుపెట్టెకిటికీలోనుంచి ముఖాన్ని ముందుకుమార్చి భార్యచేత వీడ్కోలుముద్దుపెట్టించుకోకుండా వుంటాడో వాడే వాళ్ళదృష్టిలో ఆదర్శకప్రయాణీకుడు. ఇది వాళ్ళు ప్రకాశంగా అనేమాటే గాని అన్యంకాదు. అల్లాఅని అనడమేకాదు ఆసంగతి పుస్తకాలలో అచ్చువేశారు. రైలుపెట్టెకిటికీలో నుంచి ముఖం ఈవతలికి పెట్టి ముద్దుపెట్టుకోవడంలో పెట్టుకునేవారు పెట్టించుకునేవారుకూడా సమానంగా ప్రమాదానికి లోనవుతారనీ, అప్పటి ప్రమాదాలకు తాము బాధ్యులముకామనీ వారు ప్రయాణీకుల నిబంధనలలో స్పష్టంగా వ్రాశారు.

సరుకును, జనులను మోసుకొనిపోతో మానవులకు చాకరీ చెయ్యడానికి ఏర్పడ్డ రైలువాళ్ళు; దొంగతనాలు, చోరీలు, కూనీలు జరక్కుండా జాగ్రత్తపెట్టి ప్రజలను సేవించడానికి ఏర్పడ్డ పోలీసువాళ్ళు; న్యాయాన్యాయాలు విచారించి తీర్పుచెప్పి ప్రజాసౌఖ్యానికి తోడ్పడడానికి ఏర్పడ్డ కోర్టుఅధికారులు పాశ్చాత్యదేశాలలో ఇట్లు ముద్దులను ద్వేషిస్తున్నారు, బహిష్కరిస్తున్నారు, వానిని బయట ఎక్కడాకనిపించడానికి వీలులేని ఘోషాస్త్రీలనుగాచేసి పారేస్తున్నారు.

నరుడికంటబడితే నల్లరాయిఅయినా పగులుతుంది అంటారు ఏళ్ళుగడచిన పెద్దలు. నల్లరాళ్ళస్థితే అల్లాఉంటే ఇక కేవలం జున్నుముక్కలకంటె మెత్తనైన ముద్దులసంగతి వేఱే చెప్పాలా ? అవి పగిలిపోవడమే కాకుండా ఆగిపోవలసివస్తే కొంచమైనా ఆశ్చర్యపడ నక్కఱలేదు.

నాలుగు పెదవుల ఏకాంతమనీ, వలపురొక్కఱీగమనీ, ప్రేమరాజ్యపు బావుటా అనీ, ప్రేమ అను తాపీపనివాడు ఉపయోగించు సిమెంటు అనీ,నోళ్ళు అనబడు వీణలరొక్క శ్రుతిఅనీ ఇత్యాదిగా కవిపుంగవులచే గొప్పగా వర్ణింపబడిన ముద్దులకు-ఇప్పుడు పాశ్చాత్యదేశాలలో కోర్టుసమన్లతో నలిగిపోయి సాక్షిసంపన్నాలతో తారుమారై పోలీసువారి కళ్ళబడి దృష్టిదోషానికి గురై జరిమానాలతోను, శిక్షలతోను తారెత్తి శాసనసభలలోకాని తలవాకిళ్ళలోగాని, రోడ్లమీదగాని, రైలుస్టేషన్లలోగాని, తుదకు జట్కాబళ్ళలోకాని స్థానంలేక ఉత్తరహిందూదేశపు ఘోషాస్త్రీలవలె పరులకంట బడడానికి వీల్లేక తెనుగుదేశపు కొత్తపెళ్ళికూతురులాగ పడకగదిలోనే ఉండిపోవలసినగతి పట్టేటట్టుంది. 'ఏనాటి కేమిరానున్నదో' అని పాడేవేదాంతులు వెఱ్ఱివాళ్ళుకారు.

—ఎ. శేషాచలపతి, బి.ఏ.



జాన్ డేవిసన్ రాక్ ఫెల్లర్

జాన్ డేవిసన్ రాక్ఫెల్లర్

[దరిద్రుడై పుట్టి కిరసనాయిలు, పెట్రోలియము మొదలగు నూనెల వర్తకముచేసి లోకమునందలి ధనికులలో రెండవస్థాన మాక్రమించుచున్నవాని విచిత్రచరిత్రము.]

రాత్రులయందు చీకటిని పోద్రోలు దీపములను వెలిగించు కిరసనాయిలు—త్వరప్రయాణలాభమును కలిగించు మోటారును నడుపు పెట్రోలియము మొదలగు నూనెల వర్తకమునకు నిరంకుశాధిపతియగు వానిచరిత్ర తెలిసికొనుటకు ఎవనికి కుతూహలముగ నుండదు? తన జీవితకాలములో 150,000,000 పౌనులను దానము చేసిన వ్యక్తి ప్రపంచచరిత్రలో నేటివఱకు ఒక్కడే కలడు. వివిధములైన పండ్రెండుదేశములలో ధర్మసంస్థలకు, ఆసుపత్రులకు, కళాశాలలకు, విద్యాభివృద్ధివేతనములకు కోట్లకొలది పౌనులు, డాలర్లు ఇచ్చి దానకర్తలలోకెల్ల దానకర్త యనిపించుకొనిన ఆవ్యక్తి తనజీవితారంభమున పాలికాపు. అప్పు డాతనికి దినమునకు పదునైదుగంటలచొప్పున పని, ఇరువదియైదుసెంట్ల జీతము.

మనదేశపునాణెములలో ఆ ఇరువదియైదుసెంట్లును దాదాపు పండ్రెండు అణాలు అగును. ఆదేవ్యక్తి ముప్పదివత్సరములకుపిమ్మట ఒక సెకండునకు అరువదినాలుగు సెంట్లచొప్పున ఆర్జించుచుండెను కడచిన ఇరువదివత్సరములలో హెన్రీఫోర్డు తరువాత ప్రపంచమున అతడే అధికధనవంతుడయ్యెను.

కోటికి కోటి పడగలెత్తిన ఆ వణిక్పుంగవునినామము జాన్ డేవిసన్ రాక్ఫెల్లరు. అతని ఎనుబది తొమ్మిదవ ఏట ఆ దానకర్తని ఆస్తి మొత్తపువిలువ 80,000,000 పౌనులుండెను. ఈ మొత్తములో అతడు తనకుమారున కిచ్చిన 60,000,000 ను చేరియుండెను. 150,000,000 పౌనులు దానముచేసినను ఇంకను 80,000,000 పౌనులు మిగిలియుండెను! ఒక్కవ్యక్తి 280,000,000 పౌనులను—యుద్ధమునకు పూర్వము గ్రేటుబ్రిటనుప్రభుత్వమువారి సంవత్సరాదాయములో సగమైన మొత్తము - ఆర్జించెను! ఇది ఎట్లు పొసగెను? ఈ ప్రశ్నకు ఏకపదసమాధానము చెప్పవలెనన్నచో 'నూనె' అనిన చాలును.

నూనెగనులు కనుగొనబడుటతో ఈ పాలికాపు కుబేరుడయ్యెను. రాక్ఫెల్లరు అను అతనినామము ప్రపంచమున ధనవంతుడనుటకు పర్యాయపదమయ్యెను. అట్టి విచిత్రపురుషుని జీవితచరిత్ర ఇచట ఒక్కింత విపులముగ చెప్పబడుచున్నది.

న్యూయార్కురాష్ట్రమునకు చెందిన టియోగాకౌంటీయందలి రిచ్ఫర్డుసెంతగల నొక పాకములో జాన్ డి. రాక్ఫెల్లరు 1839-వ సంవత్సరమున జననమందెను. అప్పటికి అతనికుటుంబము ఆ ప్రాంతమునగల కుటుంబములన్నిటిలోను లోపాసైనది. ఇల్లు మిక్కిలి జీర్ణస్థితిలో నుండెను. ఈరాక్ఫెల్లరు చిన్నతనమున ప్రక్కపై వెల్లకిలపరుండి ఇంటికప్పులోని చిల్లులద్వారా ఆకాశమునందలి చుక్కలను తేఱిపాఱచూచువాడు. సూర్యచంద్రులను కట్టివైచిన ఆ యింటిలో భయంకరదారిద్ర్యము—ఏ పూటకు సరిపడిన ఆహారమును ఆ పూట సంపాదించుట వారికి ప్రతిదినసమస్య—నేడు ప్రపంచమునందలి ధనవంతులలో ద్వితీయస్థాన మాక్రమించుచున్న రాక్ఫెల్లరు ఆయింటియందే పెరిగి పెద్దవాడయ్యెను.

ఆ దినములలో నాతడు వృకోదరుడైయుండెను. కాని ఆ నిరుపేదయింటబుట్టిన అతని ఆకలికి సరిపడిన ఆహారము దొరకదయ్యెను. విచిత్రమేమన కోటీశ్వరుడైనపిమ్మట అతని జీర్ణశక్తి మందమైపోయెను. ఇప్పు డాతనికి ఒక చిన్నరొట్టెముక్క, ఒకదొప్పెడుపాలు కష్టముమీద అరిగించుకొనగల విందుభోజనమైయున్నది.

పొరుగుననున్న పలుకుటుంబములుకూడ దరిద్రములైనవే. కాని రాక్ఫెల్లరు కుటుంబముకంటె ఎన్నిరో

రెట్లు మంచిస్థితిలో నుండినవి. ఆ కుటుంబములందలి వారు పేరియింటి జీర్ణస్థితి, పేదతనమునుజూచి జాలి పడుచు తమకు చేతనైనసాయమును చేయుచుండువారు. జాన్ క్రమముగా శైశవస్థితిని వీడుచుండెను—కాని అతడు తెలివైనవాడుగా, చురుకైనవాడుగా చూపట్టలేదు. ఆ మొద్దబ్బాయినిచూచి వారు తలలూపువారు; భావికాలమున అత డెట్లు బ్రతుకుతెరువు కనుగొనగలడా అని విచారించువారు.

కాని రాక్ ఫెల్లరుమాత్రము భావికాలమున తా నెట్లో గొప్పవాడను కాగలనని ఆ దినములలోకూడ భావించువాడు. ఆ బాలుడు స్నేహితుడగు మఱియొక బాలునితో నదీతీరమున తిరుగుచు ఇట్లు చెప్పెను: "నేను పెద్దవాడినైనప్పుడు నూరువేల డాలర్లుకూడ బెట్టదలచియున్నాను." అప్పటి కాతనియూహలో నూరువేలడాలర్లు ఒక గొప్ప మొత్తముగానుండెను. కాని అనంతరకాలమున తాను ఈ నూరువేలడాలర్లకు నాలుగురెట్లచొప్పున దినమునకే ఆర్జింపగలుగుదునని అతడు అప్పుడు కలనైన భావించియుండడు!

రాక్ ఫెల్లరు సాధారణమైన పొలముపనులుచేయగలపాటి వయస్సువాడయ్యెను. ఆ రోజులలో అమెరికాయందు పేదరైతులబిడ్డలు వేసవిలో పొలముపనులు చేయుచు శీతకాలమున బడికిపోవువారు. మన కథానాయకుని విషయమునకూడ ఇదేపద్ధతి. పొలముపని తెల్లవాఱగట్ల నాలుగున్నరగంటలకు ప్రారంభమై బాగుగా చీకటిపడువఱకుండెను. ఈ పదునైదుగంటల పనికిని అతనికి దినమునకు ఇరువదియైదుసెంట్లచొప్పున ఇచ్చువారు.

పనిని నెమ్మదిగాచేయు రాక్ ఫెల్లరునుచూచి పొలముకాపులు విసవిసపడువారు. ఆ రోజులలో కూడ రాక్ ఫెల్లరు తాను చేయవలసిన పనినిగూర్చి ముందుగా యోజించికొని అది నిర్వహింపవలసిన విధానమును నిర్ణయించుకొనువాడు. 'ఈ విధానమువలన ఏకార్యమునైన చక్కగ చేయగలపద్ధతి లభించునది' అని జాన్ డి. రాక్ ఫెల్లరు చెప్పును. పొలముకాపులుమాత్రము ఈతని దూరపుటాలోచనను గ్రహింపలేకపోయిరి. వట్టి మందుడని కసరికొట్టిరి. ఇతరులు ఇతనికంటె చురుకుగా చేయుచున్నను చిట్టచివరకు ఇతనియంత పొందికగా చేయజాలకుండిరనుసత్యమును తెలిసికొనుపాటి తెలివి ఆ రైతులకు లేకపోయెను.

శైశవమునుండియు ఏపనియున్నను రాక్ ఫెల్లరుకు ఇష్టమైయుండియుండునని అతని నేటిధనసంపదనుబట్టి పలువురు తలంతురు. కాని నిజముచెప్పవలెనన్నచో ఈ తలంపులు నిరాధారములగును. తనకంటె అదృష్టముపెట్టి పుట్టిన తోటిబాలురు పాఠశాలలకు పోవుచుండగా తాను పొలము పనిచేయవలసివచ్చినందులకు అతనికి కష్టముగ నేయుండునది. పొలముపనిలో వెళ్ళబుచ్చిన ఆ దినములనుగూర్చి నేడు స్మరించుచు అతడు అవి తనకు ఇచ్చిన అనుభవసంపదను మెచ్చుకొనును. 'తాళిమి నే నచ్చట నేర్చుకొంటిని' అని అతడు చెప్పును.

రాక్ ఫెల్లరు ఇంకను బాలుడైయుండగ ఈ దినములలోనే అతని తల్లిదండ్రులు ఉన్నతావు విడిచి క్లీవ్ లాండుపట్టణములో స్థిరపడిరి. కుటుంబపుటాదాయమునకు తనశక్తికొలది చేయూతగాను ఏదైనపని సంపాదించుట అచ్చట అతని ప్రథమకృత్యమయ్యెను. హూవిట్ టట్టిల్ అను పేరుబరగు నొక కంపెనీలో అతడు వారమునకు రెండు మూడు డాలర్లజీతముపైని పనికి కుదిరెను.

పొలముపనిలోకంటె ఈపనిలో జీతము హెచ్చు; దానికంటె ఇది తనకు పట్టినది. క్రొద్దిక్రొద్దిగ వ్యాపారానుభవము కలుగుచున్నది; బహురీతుల మనుష్యులను చూచుటకు అవకాశమేర్పడినది, పట్టణములోని జీవితవిధానము అవగతమగుచున్నది—ప్రపంచమున తానును ఒకముఖ్యస్థానము ఆక్రమింపవలయునను వాంఛ అతని కీదినములలోనే కలిగెను. కీర్తిని తేజికమై తన కాలం చుటకు అవకాశము కల్గించు శుభసమయమునకై నిరీక్షించుచు అతడీదినములలో తాను ధనవంతుడగుటకు మనోనిశ్చయము చేసికొనెను.

ఈ తర్ఫీదుకాలములో అతడు నేర్చుకొనిన గొప్ప పాఠము—ధనమును ఆర్జించుట, వ్యయము చేయుటలనుగూర్చి. ధనమును ఆర్జించుటయు, వ్యయము చేయు

టను నొక గొప్పకళయనియు, ఆకళ నేర్చినవారు ప్రపంచమున మిక్కిలి తక్కువగానుందురనియు జాన్ డి. రాక్‌ఫెల్లరు నమ్మకము. అత డొకసారి ఇట్లు చెప్పెను: 'ప్రతి యువకుడును తన ధనవిషయమై విశేషమైన జాగ్రత్త చూపవలయును. తాను ఎంత ఆర్జింపగలడో అంతయు ఆర్జింపవలయును, ఎంత కూడబెట్టగలడో అంతయు కూడబెట్టవలయును, ఎంతదానము చేయగలడో అంతయు దానముచేయవలయును.'

ఈ దినములలో అతి డార్జించిన, వ్యయముచేసిన ప్రతి సెంటునుగూర్చియు జమాఖర్చులను తెల్పు మాసిపోయిన ఎక్కవుంటుపుస్తకము నేటికిగూడ ఈ శైలవని కుప్పంగవునికడగలదు. ఆదాయముకొలదియైనను ఆ దినములలోకూడ నాతడు కూడినంతధనమును దానము చేయువాడు. 1855 సెప్టెంబరు 1856 జనవరి మధ్యమున అతడు ఏబదిడోలర్ల నార్జించెను. బస, భోజనము, చాకలి ఖర్చుపోను ఇందుంచి అతడు కొంత మిగల్చగలిగెను. ఈ మిగిల్చినదానిలో 'ఆదివారపుబడి'కి వారమునకు ఒక సెంటుసొమ్మును, ఇతర మతసంస్థలకు మరికొంత కొద్దిపాటిసొమ్మును ఇచ్చువాడు. ఇచ్చినది కొంచమే. కాని ఆ దినములలో అతడు మిగల్చ కలిగినది అంతియే. కాని తాను సంపాదించినదానిలో కొంతదానముకై ప్రత్యేకించు అతని సుగుణము ఈ దినములయందే అతనియందు స్ఫుటముగా ద్యోతకమై అనంతరకాలమునందు అతనికి దానకర్ణుడను ఖ్యాతి నార్జించెను.

ఒక సంవత్సరమునకుపిమ్మట అదే ఎక్కవుంటు పుస్తకము అతని నెలజీతము ఇరువదియైదుడోలర్లకు పెరుగుటను; ఒక్కనెలలో అతడు న్యూయార్కునందలి ఒక మిషన్‌సొసైటీవారికి పండ్రెండుసెంట్లును, మరియొక విజాతీయ మిషన్‌సొసైటీవారికి పదిసెంట్లును ఇచ్చియుండుటను చూపుచున్నది. అర్థమగువానికి సాయముచేయుటకు ఒకడు గొప్పవాడైయుండనక్కరలేదని ఇతరులకు జాన్ డి. రాక్‌ఫెల్లరు ఆచరణపూర్వకముగా బోధించినాడు. జేబునందిముడు పరిమాణమునుమాత్రము కలిగి పలువత్సరముల నాటిదగుటచే బాగుగా మాసియుండి నేటికిగూడ ఒక నిక్షేపమువలె దాచబడుచున్న ఆదినములయందలి అతని ఎక్కవుంటు పుస్తకము నేడు కోటీశ్వరుడై అతడు ఏ దానగుణమును బోధించుచున్నాడో ఆగుణము నాతడు యౌవన కాలమునగూడ కలిగియుండుటను నిదర్శించుచున్నది.

మరియొక కంపెనీలో గుమాస్తాపని దొరకెను. జమాఖర్చులను వ్రాయుచుండుట అతనిపని. అంకెలు అనిన అతనికి ఎంతచేతనో అతిప్రేమ. ఒక్కొక్కప్పుడు నిముసములకొలది అతడు రెప్పవేయక జమాఖర్చుల అంకెలను తేరి పారచూచుచుండువాడు. పైము అయిపోయి తాను ఇంటికి పోవలసిన సమయమున గూడ తేలుచుగా నాత డిట్లు అంకెలను తేరిచూచుచు ఉండిపోవువాడు. కాలముపనిచేయుటలోగల అతని జనత్వము ఇచట లేకుండెను. ఈకంపెనీలో ఉండగనే అతనికి పెద్దవర్తకుల పలువురితో పరిచయము అగుచుండునది. కొద్ది పెట్టుబడితో వారెట్లు కష్టపడి వ్యాపార ప్రారంభము కావించి నేడు ధనవంతులైరో వినుచుండువాడు. తాను వారివలె ఎందుకు కాగూడదు?

ఇరువదియేండ్లయిన నిండలేదు. అనుకూలము ఏర్పడిన మఱునిముసమునందే స్వంతముగ వ్యాపారము చేయుటకు అతడు ఊహలు చేయుచుండెను. ఉద్యోగరీత్యా అతడు తలిదండ్రులను విడిచి వేఱొకతావున ఉండవలసివచ్చెను. వారమునకు ఐదుడాలర్లు జీతము. ఊరిలో మారుమూల చవకగ దొరకుచోట గది అద్దెకుపుచ్చుకొని అతి కష్టముగ జీవించువాడు. భోజనమునకు బసకు ఒకడాలరు మాత్రము వెచ్చించి మిగిలిన నాలుగుడాలర్లు మిగుల్చువాడు. చిన్న వ్యాపారము పెట్టుటకైనను పెట్టుబడి వలయును. ఆరోజులలో క్లీవ్‌లాండునం దొకకలపవర్తకుడు వర్తకమున గొప్ప నష్టమును పొంది ఒడుదొడుకులలోనుండి తన కలపను మిక్కిలి తక్కువవెలకు అమ్మజూపెను. తానంతవఱకు కూడబెట్టియున్న ధనముఅంతటితో—మనసున విశేషమైన అలజడిపొందుచునే—రాక్‌ఫెల్లరు కొనివైచెను. ఆరోజునవనే దానిని తానుకొన్న దానికి పండ్రెండురెట్లు హెచ్చుధరరాగా అమ్మివైచెను. అది అతని ప్రథమ

స్వతంత్రవ్యాపారము. అది శుభమునే సూచించెను. ఆనాటిరాత్రి ఆతడు నిండారిన సంతోషముతో ఇంటికి నడచివెళ్ళెను. వ్యాపారపురుచి తెలిసివచ్చినది.

గుమాస్తాగిరి వదలి క్లార్కు అనువానితో కలసి వ్యాపారము ప్రారంభించెను. రైతులదగ్గరనుంచి సమస్తము దిగుమతిచేసి అమ్ముట వ్యాపారము. కంపెనీ లాభములు పెంచుటకు ఆతడు ఎద్దువలె పనిచేసెను. జాయింటుయజమానికదా అని ఆతడు కూలివాండ్రతో కలసి పనిచేయుటకు ఎప్పుడును వెనుదీయువాడు కాడు. ఒకసారి ఆతడు గిడ్డంగిలో రాత్రిఅంతయు ఉండి ఒకపెద్దచిక్కుడుకాయలరాశిని రకమువారిగా విడతీసినాడు. పనివానినే ఆరాత్రి ఆపనిని చేయుమనిన అదనపుకూలి అడుగును. అవసరమగుచో తానే కూలివాడుగా పనిచేయుచు రాక్ఫెల్లరు అదనపుకూలి ఈయవలసిన అవసరములేకుండ చేయువాడు.

విలియమ్సు అను ముజేకిసీళ్ళకాలువ గొట్టముల వర్తకు డొకనికడ ఆదినములలో రాక్ఫెల్లరు అక్కౌంటుగుమాస్తాగాచేరెను. సాలుకి వేయిడొలర్లజీతము. —వారమునకు నాలుగుపౌనులు పాలములో గాలి కాపుగా జీవితమును ప్రారంభించిన వానికి ఇది మంచి ఉద్యోగమే. యజమాని రాక్ఫెల్లరును గూర్చి ఆదినములలో ఇట్లు చెప్పెను: "శాంతుడు, శ్రద్ధగలవాడు, యువకుడు, పనికి వెలుపలివాడు, శక్తిసంపన్నుడు; సూక్ష్మగ్రాహి." ఇన్ని గుణములుకలవాడు ఆదర్శోద్యోగి కాక ఎట్లుండును?

విలియమ్సు చెప్పినటుల రాక్ఫెల్లరుకడ సూక్ష్మగ్రాహిత్వము, శక్తిసంపన్నత ఉండెను. ఈరెండు గుణములే అతని భావికాలపు-దిగ్భ్రాంతి గొలుపు-జయమునకు కారణభూతములు. అప్పటికి కొలది కాలమునకు క్రితమే అమెరికాదేశమున నూనెగనులు కనుగొనబడియుండెను. సూక్ష్మగ్రాహియగు రాక్ఫెల్లరు రాగల కాలమున ఆనూనె ప్రజాజీవితమున ఎంతటి ఉపయోగమునొందునో, ఆనూనెల పరిశ్రమకు అధికారిగాగలవానికి ఎంతటిధనము సమకూరనున్నదో గ్రహించెను. ఉద్యోగరీత్యా విలియమ్సుకంపెనీవారి లెక్కడొక్కలకు సంబంధించిన అంకెలతో ఆతడు కట్టుపడియున్నను కాలము వృథచేయక తీరికసమయములందెల్ల వేరెల ఈనూనెగనులనుగూర్చి ఆతడాలోచనానిమగ్నుడగుచుండువాడు. నూనె ఎచ్చటపట్టుకొనబడుచున్నది, ఎచ్చట జాగ్రత్తచేయబడుచున్నది, ఎట్లు ఇతరదేశములకు ఎగుమతిచేయబడుచున్నది మొదలగు విషయములనుగూర్చి ఆతడు కూలంకషముగ చదువువాడు. మనస్సున ధైర్యముకలిగినతోడనే ఆత డొకనాడు తన యజమానికడకు పోయి జాయింటుగా ఈనూనెల వ్యాపారము ప్రారంభించుటను గూర్చి ఉపపాదించెను —విలియమ్సువలసిన పెట్టుబడిపెట్టుటకు, రాక్ఫెల్లరు పనిచేయుటకు. నూనెల వ్యాపారమున విశేషధనమార్జించుటకు అవకాశముకలదని రాక్ఫెల్లరు చెప్పుదానిలోని సత్యమును విలియమ్సు గ్రహించెను; అతని ఉపపాదనను అంగీకరించెను. తన్ను నూనెల రాజుగాచేసి విఖ్యాతిగొనివచ్చిన వ్యాపారమున రాక్ఫెల్లరు అడుగుపెట్టెను.

పెట్రోలియము పరిశ్రమకు అవి ప్రారంభదినములు. వర్తకులలో వర్తకులకు పోటీహెచ్చుగా నుండెను. ఫలానాప్రదేశములలో నూనెగనులు కలవని తెలిసినచో ఆవర్తకులు వానినికొనుటకై విఱుగబడువారు. కాబట్టి ఏప్రదేశమున నూనెగనులుకలవో కనుగొనుటకై రాక్ఫెల్లరు బోరింగులుదింపుట అతిరహస్యముగ చేయవలసియుండెను. అందుచే తన జాయింటుదారగు విలియమ్సు ఇంటియందలి ఒక నేలమాళిగయందు ప్రథమమున బోరింగుదింపుటకు నిశ్చయింపబడెను. ఆ చుట్టుపట్ల పలుతావులయందు నూనెగనులుకలవు—ఈ విలియమ్సు ఇంటిక్రిందమాత్రము ఒక పెట్రోలియము చెలువు ఎందుకుండకూడదు! ఇట్లని రాక్ఫెల్లరు భావించెను. బోరింగు పాతాళలోకమునకు దింపబడెను. —నూనె కనుగొనబడెను—కాని ఎగజిమ్మబడు తైలమునకు అంతులేకుండెను. ఇంటి అడుగుమట్టమంతయు నూనెవఱదలో మునిగిపోయెను. ఇంటిరూపు చెడిపోయెను.

తైలనిక్షేపము దొరకినందులకు రాక్ఫెల్లరు మిన్నందుచుండెను. కాని విలియమ్సు, అతని కుటుంబమువారు ఈ సంతోషమున భాగస్వాములు కాలేదు. శక్తిసంప

న్నుడగు తనభాగస్వామి తనధనమును పచ్చముహాడ్లో నర్చెను విలియమ్సు పేదవాడుకాడు—కనుగొనబడిన తైలనిక్షేపము విశేషధనమును కొనిరాగలదు. అయినను ఇల్లుపోయినందులకే అతడు కించపడి రాక్ఫెల్లరు నూనెవ్యాపారములో తనకు భాగము అక్కరలేదనినాడు. భాగస్థులు విడిపోయినారు. జీవితమున చక్కని ప్రారంభమునుకల్పించి విలియమ్సు రాక్ఫెల్లరును విడనాడినాడు. అనంతరము విలియమ్సు చికాగో నగరమునకుపోయి తన తొలుతటి వ్యాపారముగు ములుగుంటి కాలువగొట్టముల నిర్మాణమునుసాగించి కోటీశ్వరుడయ్యెను. కాని కోటికి కోటి పడగలెత్తిన రాక్ఫెల్లరు విశేషధనముతో పోల్చినపు డది ఏపాటిది?

రాక్ఫెల్లరుమాత్రము నూనెగనులను విడవాడలేదు. అతని కవి ద్రవరూపముననున్న బంగారము. ఒక గని తరువాత మరియొక గని. ఓహియోయందును, ఇతర రాష్ట్రములయందును నూనెగనులు కనుగొనెను. స్టాండర్డు ఆయిల్ ట్రస్టు ఏర్పడెను. అతని ఇప్పటివయస్సు ముప్పదివత్సరములు మాత్రమే. క్రమముగా నూనె ప్రపంచమున అతడు ప్రతిస్పర్థిలేని చక్రవర్తి, ప్రపంచమునందలి కుబేరులలో రెండవవాడు అయెను.

మెషీనులకు; ఇండ్లయందును, వీథులయందును దీపములు పెట్టుటకును; మరికొన్ని ఇతర పరిశ్రమలకు మాత్రమే అప్పుడు ఈ నూనెల నుపయోగించువారు. క్రొత్తమార్కెట్టులను కనుగొనుటలో స్టాండర్డు ఆయిల్ కంపెనీ ప్రతినిధులు ప్రపంచమునంతను చుట్టువారు. 400,000,000 మంది జనాభాగల చీనాదేశమున దీపములకు కిరసనాయిలు ఉపయోగము ఇంకను తెలిసికొనబడకుండెను. ఈ సంగతి వినినతోడనే రాక్ఫెలరు దీపములకు కిరసనాయిలు ఉపయోగింప నిచ్చగించు చీనావారి కందఱకును పారఫిన్ ల్యాంపులు ఉచితముగా ఇచ్చునట్లు ఏర్పాటుచేసెను. ఎన్నివేల ల్యాంపులు ఈయబడినవో లెక్కలేదు. ఇందువలన రాక్ఫెల్లరు అనుకొనినదానికన్న హెచ్చులాభమే వచ్చెను. అచిరకాలముననే చీనాదేశమున ఏడాదికి స్టాండర్డు ఆయిల్ కంపెనీవారి కిరసనాయిలు 5,000,000 గాలనులు ఖర్చు అగుచుండెను.

వర్తకప్రపంచమున ఒక్క ప్రత్యేకవిషయములో ప్రతిస్పర్థిలేని చక్రవర్తియగుట సుకరముకాదు. రాక్ఫెల్లరు వారమునకు ఆరురోజులు పని, రోజుకు పదిగంటల పరిశ్రమ—ఇట్లు ముప్పదివత్సరములు పనిచేసెను. పదియేండ్లలో అతడు లెక్కకు మూడు రోజుల సెలవులైన గైకొనక పాటుపడెను. విశ్రాంతిగొనుసరికి అతడు నియమితకాలములందు పలుసారులు పదిలక్షలడాలర్ల చొప్పున దానముచేసియుండెను. వ్యాపారకార్యనిర్వహణమున అతడు యూరపుఖండమును రెండు సారులు సందర్శించెను—అమెరికాసంయుక్తరాష్ట్రములను మూడుసారులు చుట్టివచ్చెను.

రాక్ఫెల్లరు వ్యాపారవిస్తృతిని కొంతవఱకు ఈ క్రింది అంకెలు చెప్పగలవు: నేడు స్టాండర్డు ఆయిల్ కంపెనీ ఉద్యోగుల, పనివారలసంఖ్య 85,000. వీరందఱికిని ఏడాదికి ఈయబడు జీతములమొత్తము 4,000 000 పౌనులు. 20 000 మైళ్ళు వ్యాపించిన నూనెపంపులు ఈ కంపెనీ స్వాధీనమునగలవు. సముద్రములమీద విదేశములకు నూనెలగొనిపోవుటకు 250 పెద్ద స్టీమరులు, భూమిమీద ఒకతావునుండి ఒకతావునకు నూనెకొనిపోవుటకు 50 000 మోటారుట్యాంకులు. గడచిన ఐదు సంవత్సరములలో ఏడాదికి సగటున 4 000;000 బారెళ్ళల, 400,000,000 కాన్ల నూనెను ఈ కంపెనీవారు ఉత్పత్తిచేసియుండిరి. ఈ కంపెనీ తన అధ్యక్షుడగు రాక్ఫెల్లరునకు ఏడాదికి 30,000,000 పౌనుల ఆదాయమును కలిగించుచున్నది.

ధనమార్జించుట, దానముచేయుట అను కృత్యములతో రాక్ఫెల్లరు జీవితమునందలి ప్రతిక్షణమును నిండారియుండెను. ధనమార్జించుటలో ఎంతశ్రద్ధయో దానముచేయుటయందును అతని కంతశ్రద్ధ. వృద్ధాప్యమున సుఖించుటకుగాని, అనంతరకాలమున విలాసలాలసత్వమున మునుగుటకుగాని, యాత్రలుసాగించి వివిధదేశ దృశ్యసందర్శనముతో వినోదించుటకుగాని ఆర్జింపక దానముచేయుటకొఱకుమాత్రమే ధనమార్జించిన వ్యక్తి ప్రపంచచరిత్రలో అత డొక్కడే.

రాక్ఫెల్లరు తీసికొనిన పెద్ద శెలవులలో మొదటిది అయిదువారముల పరిమితిగలది. తనతో ఒకప్పుడు భాగస్వామిగా ఉన్న విలియమ్సు ఇంట తాను పెట్రోలియమును గనుగొనిన ముప్పదిసంవత్సరములకు పిమ్మట ఆత డీసెలవునుగొని అలాస్కాకుపోయెను. ధనసంపదలో మోటారురాజు హెన్రీఫోర్డు అప్పటికి రాక్ఫెల్లరును మించలేదు. కావున రాక్ ఫెల్లరే అప్పటికి లోకమునందలి కోటీశ్వరులలో మొదటివాడైయుండెను. అట్టివాడు అలాస్కాలో నిరుపేదలతోకూడ సంభాషించుచు, ప్రయాణికులు ఆనందించు అన్నివేడుకలందును పాల్గొనుచు, మంచుదిబ్బలనెక్కుచు వినోదించెను. రైలుమీదనైననేమి, పడవమీదనైననేమి, బండిమీదనైననేమి ఆత డాయాత్రలో పదివేలమైళ్ళప్రయాణము సల్పెను. ఐదువారముల అనంతరము అతడు ఆఫీసుకు తిరిగివచ్చి అందరి [illegible] ఒక్కొక్కరిగాంచెను ఎక్కువదీక్షతో తిరిగి పనిచేయనారంభించెను.

అతని ఎనుబదితొమ్మిదవఏట అతనిదియు, అతని కుటుంబపుదియునగు ఆదాయము ఒక రెప్పపాటుకాలమునకు నాలుగురూపాయిలు. యువకుడగు ఒక ఎక్కౌంటుగుమాస్తా తన లౌకికసమయముల వ్యర్థపుచ్చక నూనె పరిశ్రమనుగూర్చిన సాహిత్యమునంతను సంపాదించి చదివి అవకాశమునందుకొని పరిశ్రమచేయుట చేతనే ఇంతటి ఆదాయము కూర్పబడినది. రాక్ఫెల్లరు మనస్సునపుట్టిన ఆనాటితలంపు, అతనివలెనే రైతుబిడ్డయైపుట్టి మోటారుకారులను కనుగొనిన ఫోర్డు మనస్సునపుట్టిన తలంపు—ఒక్కొక్కటి ఎంతటి ధనమును ఆర్జించినదో! రాక్ఫెల్లరు, ఫోర్డు - రాక్ఫెల్లరు పెట్రోలులేనిదే ఫోర్డు కారు నడవదు. కారులేనిదే పెట్రోలుకు ఖర్చులేదు. ప్రపంచధనవంతులలో ప్రథమ ద్వితీయస్థానము నాక్రమించుచున్న ఫోర్డురాక్ఫెల్లరుల సంపద అంతయు ఇట్లు అన్యోన్యాశ్రితమైయున్నది. ఇరువురి జీవితములును అతివిచిత్రములైనవి.

ప్రస్తుతము రాక్ఫెల్లరు విశ్రాంతిగొనుచున్నాడు. న్యూయార్కుపరిసరముల నతిక్రమించియున్న ఒకానొక గ్రామసీమయందు అతని ఉనికి. చుట్టములను సందర్శించుట అతని ఈ విశ్రాంతిసమయకృత్యములలో నొకటి. తొంబదియేండ్లు నిండినవాడు. అతడిప్పుడు వనములను, పొలములను ప్రేమించు వేదాంతి; ప్రకృతిని మనోహరముగ వర్ణింపగల [illegible]. తన పల్లెటిగృహము, కుటుంబము ఈ రెండునుగాక అతనిదృష్టి నిపుడు ఆకర్షించువానిలో ముఖ్యమైనది ఇపుడిపుడే వ్యాపారజీవితారంభమును గావింప నుంకించుచున్న యువకుల సంగతి. అప్పుతెచ్చి వ్యాపారము ప్రారంభించుట యువకులవిషయమున అనేకులు అంగీకరింపరు. కాని ఇందునుగూర్చి రాక్ఫెల్లరుమాత్రము ఇట్లు చెప్పును: "ఒకడు జీవితమున జయమునందుట కార్యకలాపము నిర్వర్తించుటకు అతనికడగల ధనముపై ఆధారపడియుండును. కాబట్టి ధనవంతుల విశ్వాసమును, నమ్మకమును సంపాదింపుము, అప్పుగొనుము. వలసిన ధనము సమకూరినతరువాత కోటీశ్వరుడగుట గాని, కూటికిపేదయగుట గాని ఆవ్యక్తి పురుషకారము మీదనే ఆధారపడియుండును"

దానకర్ణుడగు ఆ కోటీశ్వరుడు గర్వమునది ఎఱుగడు. ఫొటోతీయించుకొనుటకు అతడెన్నడును అంగీకరింపలేదు. అతనిఫొటో మొదట లోకమునకు చేరినవిధము కొంతవఱకు చమత్కారమైనది. యువకుడగు ఫొటోగ్రాఫరు ఒకడు రాక్ఫెల్లరు చర్చికిపోయిన సమయము కనిపెట్టి అతడు వచ్చుదారిలో తనకెమెరాతో పొంచియుండెను. రాక్ఫెల్లరురాగా అతనికి తెలియకుండ ఫొటోతీసెను. అనంతరము నెగటివ్‌ను డెవలప్‌చేసి—'ఇది మీ ఆమోదమును బడయదేని ఇంటనే నాశనముచేయుదు'—అను విన్నపముతో రాక్ఫెల్లరుకు పంపెను. తనకు తెలియకుండగ తన ఫొటోను ఇంత చక్కగతీసి తన అంగీకారములేకుండ ప్రచురింపబోనని ఆ యువకుని ఉచితజ్ఞతకు రాక్ఫెల్లరు ఎంతయు సంతసించి, అతనికి కబురుపంపి అతడు వాంఛించినపుడెల్ల అతని కెమెరా ఎదుట తాను నిలబడుటకు తనసమ్మతిని తెలిపెను.

రాక్ఫెల్లరున కిప్పుడు తొంబదినాలుగవసంవత్సరము. పనిచేయుటకును అశక్తుడు; అజీర్ణరోగమునకు దాసు

డు. వైద్యకళయందు అసదృశమగు అభివృద్ధిచూపుచున్న యూరపు, అమెరికాఖండముల భిషగ్రత్నములు కూడ అతని అజీర్తిరోగమును మాన్పలేకపోయిరి.

గడించినధనమును, దానముచేసిన మొత్తమును తలంచుకొనుచో రాక్ఫెల్లరు చర్చికిపోవునపుడుగూడ నిర్మలమనమునే కలిగియుండవచ్చును. తండ్రివలెనే జాన్ డేవిసన్ కూడ క్రైస్తవులలో బాప్టిస్టుశాఖనుచెందినవాడు. న్యూయార్కునందు విశేషధనవ్యయముతో అతడే కట్టించిన ఫిఫ్తు ఎవెన్యూ బాప్టిస్టుచర్చి అతని పూజాగృహము. అచటకూడ విశేషజనమధ్యమున నిలబడి బిగ్గరగా ప్రార్థించుట అతని యలవాటు. ప్రార్థనావసరమున ఆ కోటీశ్వరుడు 'స్వామీ! ఈనాటి ఆహారము మాకు ప్రసాదింపుము' అను వాక్యమును ఉచ్చరింపవలసివచ్చినప్పుడు నొక్కి వక్కాణించును. బైబిలులో పేదవారి ధన్యజీవనమును ప్రస్తరించు ఘట్టములు ఆ కుబేరుని అభిమానఘట్టములు!



" మోమువంచినసేమి మొలకనవ్వులకాంతి చెక్కుటద్దములపై జీలువారెం
జూడకుండినసేమి సొబగురెప్పలమించి తేటవాల్మెఱుంగులు దిచ్చరించె "

—చిత్రకారుడు : పి. వి. రామారావు.

విడ్డూరములు

క. ఇద్దరుభర్తలు : ఇరువదియిద్దరు మగపిల్లలు.

క్రాయిడన్ నందలి లాన్సింగురోడ్డునందు ఒక వృద్ధస్త్రీ నివసించుచున్నది. ఆమెపేరు మిసెస్ హార్ట్‌ఫీల్డు. ఆమెవయస్సు ఇపుడు దాదాపు ఎనుబది వత్సరములు. ఆమె ఒకరితరువాత నొకరిని ఇరువురు భర్తలను పెండ్లాడి ఇపుడు వితంతువైయున్నది. మొదటిభర్త నటకుడు. ఆతనివలన ఆమె పదముగ్గురు మగపిల్లలను కనెను. రెండవభర్త కసాయివాడు. ఆతనివలన ఆమె తొమ్మండుగురు తనయులను గాంచెను. ఈరెండవభర్త పదిసంవత్సరముల క్రితము మరణించెను. ఇరువది ఇద్దరు మగపిల్లలలో పదిమంది యుద్ధసేవలో పరమపదించిరి; ముగ్గురు అకస్మాత్తుగ కలిగిన ప్రమాదములచే మరణించిరి; మిగిలినవారు మామూలుగ చనిపోయిరి. ఇప్పుడు ఆమెకు నా అన్నవాడెవడును సజీవుడైలేడు. ఆమె పొట్టిగా సన్నముగానుండును; బుద్ధి శ్రవణము మొదలగువానియందు ఇంకను వృద్ధాప్యచిహ్నములు కలుగలేదు. ఆమె ఇపుడు ముసలితనపు విరత వేతనమును పొందుచున్నది. ఆమెతల్లికి వరుసగా మూడుసారులు కవలలు పుట్టిరి. తల్లికిపుట్టిన పదిమంది బిడ్డలలో ఆమె పెద్దది.

క. పాలబుడ్డికంటె పొగచుట్టను హెచ్చుగ ప్రేమించు బిడ్డ.

చికాగోలో డార్విన్ షాపిరో అను పదునెనిమిది మాసముల మగపిల్లడుగలడు. ఆతడొకసారి పొగచుట్టను రుచిచూచెను. అప్పటినుండియు పాలబుడ్డికంటె పొగచుట్టే ఆతనికి విశేషప్రేమపాత్రమయ్యెను. అప్పటినుండియు దినదినము చుట్టదమ్ము దొరకినగాని ఆబిడ్డ గగ్గోలుపెట్టును. ఇప్పటి కాతనికి రెండుఏండ్లు. శాస్త్రవేత్తలును, వైద్యులును ఈ విచిత్రస్వభావమునకు చాల ఆశ్చర్యపడుచున్నారు.

క. తేనెపట్టులోని ఈగలను లెక్కించు యంత్రము

న్యూయార్కునందలి వ్యవసాయశాఖవారు రేడియోవలన తేనెపట్టులోని ఈగలను లెక్కించు యంత్రమును కనుగొనియున్నారు. తేనెపట్టు ముఖభాగమున ఒక మైక్రోఫోను ఉంచబడును. ఈమైక్రోఫోను మీదుగా ఈగలు ప్రాకిపోవుచుండగా వానికాళ్ళు లెక్కగొను నొకయంత్రసాధనకు పనిచెప్పును.

క. ముప్పదినాలుగు అంగుళముల మీసము

జపానుదేశపు వాయువిమానసంఘపు పూర్వపు అధ్యక్షుడగు జనరల్ నాగొకా మీసము కుదురునుండి కొసవఱకు ఇరువది అంగుళముల పొడవుండెను. లండను నుండి టోకియోకు గాలియోడలో ప్రయాణము సల్పినందులకు ఆహెజాన్నపు కన్యను ఆవీరుడు ఈపొడుగు మీసముతోడనే ముద్దుగొనెను. ప్రపంచమునందలి అన్ని మీసములలోకి ఇదియే పొడుగుపాటిదని అప్పుడు నమ్మబడెను. కాని లండను టైమ్సు హిందూదేశపు విశేషకరి వ్రాతలవలన ప్రపంచమున కంతటికిని పొడుగు మీసముగలకీర్తి జపానునుండి హిందూదేశము లాగుకొనుచున్నది. లాథీరాష్ట్రమునందలి ధూరాకియాలోని అంజనేయాలయమున పనికిగుదిరియున్న దెశ్యార్ అను హావల్దారుని రొయ్యమీసము ముప్పదినాలుగు అంగుళముల నిడివిగలదైయున్నది. ప్రపంచమున కంతటికిని ఎత్తయిన ఎవరెస్టుశిఖరము ఉండుటతోబాటు పొడుగయిన మీసముకూడ ఉండుటవలన మన హిందూదేశపు కీర్తి ఇనుమడించుచున్నది. మన ఎవరెస్టు శిఖరమును ఎక్క ప్రయత్నించుచును, ఇచటి పొడుగుపాటి మీసమును గూర్చి లోకమువారికి తెలుపుచును మన ప్రభువులగు ఆంగ్లేయులు హిందూదేశపుకీర్తినింకా పెంచించుచున్నారు.

§. కలపనుండి కలకండచేయబడుట

డాక్టరు ఫ్రీడ్రిచ్ బెర్జియస్- జర్మనీదేశపు రసాయనికశాస్త్రవేత్త. కలపనుండి కలకండచేయుటను కనుగొనియున్నాడు. కెమికల్ ఇంజనీర్ల సంఘసమక్షమున ఈ తయారుచేయు విధానమును చూపియున్నాడు. ఈవిధానముచే కఱ్ఱనుండి చెఱుకునుండికంటె చవుకగ పంచదారచేయవచ్చును. కలప విస్తరించియుండు దేశములకు ఇది గొప్పలాభమును కలిగించును. రాక్షసి బొగ్గునుండి పెట్రోలుచేయనగుటను, నత్తగుల్లలనుండి తైలము తీయనగుటను కనుగొనిన ఈ విచిత్రప్రపంచము కఱ్ఱనుండి పంచదారతీయుటలో ఆశ్చర్యమేమి? ఈ విధానము విశేషప్రచారమునందినచో కలపవర్తకులందరును కలకండవర్తకులు కాగలరు.

§. బ్రిటీష్ సామ్రాజ్యములో కెల్ల పెద్ద గడియారము

లండనునందలి ట్రెఫాల్గర్ స్క్వేర్ లోని బ్రహ్మాండభవనమున నొక పెద్ద గడియారము నిర్మింపబడినది. బ్రిటిష్ సామ్రాజ్యమున కంతటికిని ఇది పెద్ద గడియారమని చెప్పబడుచున్నది. దీనిముఖవైశాల్యము 759 చతురపుటడుగులు ఇంతకలుకు ప్రపంచములోని గడియారములకెల్ల పెద్దదిగా భావింపబడుచున్న బిగ్ బెన్ ముఖవైశాల్యము 400 చతురపుటడుగులుమాత్రమే. ఈ పెద్ద గడియారమున నిముసములుచూపుముల్లు ఒక బారు దూలమనియే చెప్పదగియున్నది. అది 17 అడుగుల పొడుగుగలదై యున్నది. ఈ గడియారము యంత్రసాహాయ్యమున రాత్రిళ్ళుకూడ గంటలను చాలదూరమువఱకు చూపగలిగియున్నది. ఈ గడియారమునందలి పెద్ద అక్షరము 8 అడుగుల 9 అంగుళములు; మిక్కిలి చిన్న అక్షరము 2 అడుగుల 6 అంగుళములు. దీనికి సంబంధించి దాదాపు నూరుమైళ్ళ నిడివిగల ఎలక్ట్రిక్ తీగెలుగలవు. సదా గ్రీన్‌విచ్ టైముతో సరిపోవునట్లు ఈ గడియారము తిరుగుచుండును. ఈ గడియారము చేయుటలో 14 టన్నులఉక్కు ఉపయోగింపబడెను. విద్యుచ్ఛక్తిచే నడుపబడుచుండుటచే దీనికి ఎప్పుడును కీ ఈయవక్కఱలేదు. లండను మహానగరమునందలి వర్తకులు తమ గడియారములను దీనిని చూచి దిద్దుకొనుచుందురు.

§. మోటారుప్రమాదములు: వాని ఖర్చు

జోషువా బ్రూక్సు అనునతడు ఫాక్ట్సు అండ్ ఫాలసీస్ అను తన పుస్తకములో నిట్లు వ్రాయుచున్నాడు: “మోటారులు ప్రచారములోనికి వచ్చినప్పటినుండియు రోడ్డు ప్రమాదముల సంఖ్య హెచ్చుపెరుగుచున్నది. ఒక్క బ్రిటను దేశమునందే మోటారులవలన దినమునకు పదునార్గురు పాదచారులు చనిపోవుచున్నారు. 1925 లో అమెరికాదేశమున మోటారులవలన 27,000 లకు ఎక్కుడుగనే మనుష్యులు చచ్చిరి. మోటారు ప్రమాదములవలన వికలాంగులైనవారు మొదలగు వారి ఔషధపరిచర్యకు ప్రపంచమునందలి వివిధదేశములలోని ఆసుపత్రులన్నియు కలిసి సంవత్సరమునకు 250,000 పౌనులను వెచ్చించుచున్నవి.

§. మందముగ కొట్టుకొను గుండెకాయ

మామూలుగ ఉన్నప్పుడు మనగుండెపై చేయివైచికొని చూచితిమేని నిముసమునకు అది డెబ్బదిరెండు సారులు కొట్టుకొనుచుండుటను తెలిసికొనగలము. దేహపరిశ్రమచేయునపుడుగాని, ఇతరమైన ఉద్రేకమును పొందినపుడుగాని మనగుండె ఇంతకంటె చుఱుకుగా కొట్టుకొనును. నిముసమునకు ఇరువదిసారులమాత్రమే కొట్టుకొను మిక్కిలి మందమగు గుండెకాయ ఒకనికుండుట ఈనడుమ కనుగొనబడినది యుద్ధభటుడుగానుండి ఇపుడు విశ్రాంతిగొనుచున్న రాయిగ్లిస్ అనునతడు ఈ నడుమ ఆస్ట్రేలియాఖండమునందలి రాండ్విక్ లోని ఆసుపత్రికివచ్చెను. పరీక్షింపగా అతనిగుండె మూడు సెకండులకు ఒకసారి మిక్కిలి మందముగ కొట్టుకొనుచుండుట కనుగొనబడెను.

§. మూడుగంటలు ఒకటే ముద్దు

దీర్ఘకాలము నిలిచియుండు ముద్దుకు న్యూయార్కులో పోటీబహుమానముపెట్టిరి. బెట్టీబరన్సు అను నామెయు, మైకేల్ కాల్ గ్రీన్ అను పురుషుడును 3 గంటల 2 నిముసముల ముద్దుముద్రలోనుండి బహుమానము బడసిరి.

—అ. వెం. శాస్త్రి.

విధి



—చిత్రకారిణి : శ్రీమతి దామెర్ల సత్యవాణి, రామారావు ఆర్టుసొసైటి.

తెలుఁగు దేశాన మొలచిన తెల్లప్రత్తి
తెలుఁగు కన్నియ వడికెను జిలుగు గాఁగ
నేసె మన తెల్గుదేశంపు నేఁతకాఁడు
అభిమతము నీవుఁ గాదొకో యాంధ్రపుత్ర!
క్షాత్రరక్తంబు తొలుదల్త జాలువార
పరమపావనమైన భూభాగమందుఁ
బూర్వ్యులయశస్సులటుఁ దీసిపోసి ప్రత్తి
మొలచె నది నీవు దగదొకో తెలుఁగుబంట!
దీర్ఘ శుష్కోపవాసబంధితులు, తెలుఁగు
నేతకాండ్రొందు దురవస్థ జాలుసేని

కటకయిన నేమి కేళీయకల్పితంబు
వడుకుడునూల్పట్టి చేకేత విడువఁగలవె!
అక్కచెల్లెండ్రె వడకువా రన్నదమ్ము
లే సాఁగు నేఁతకాండ్రు సదాసజనమె
ఫల మనుభవించువారలే తెలుఁగ తల్లి
సమ్మతింపుమి మైదాల్చి నాంధ్రతనయ!
క్షరతవర్ష దరిద్రజీవనము శాప
నిధియ; కర్తవ్యమని యెలుఁగెత్తి పలికె
బ్రహ్మతేజస్వి భారతభాంగ్యవృందు
అతని యానతి తలఁదాల్పు డాంధ్రులార!

—శ్రీ శేషాద్రి రమణ కవులు.



ఛాయామూర్తి ప్రతీకారము

౧

గదిలోవున్న మేజాబల్లపైపెట్టిన లాంతరు ప్రకాశమానంగా వెలుగుతోంది. గోడలపై తగిల్చిన చిత్రపటాలు, చైనా మేపులు, లీల కుట్టినపూలుపటాలు మిలమిలా మెఱయుచున్నవి. ఒక్క గడియారము చేస్తోవున్న సవ్వడితప్ప అంతా ప్రశాంతమయం.

ఆ గదిలోవున్న పేముకుర్చీలో నిశ్చలంగా కూచుంది లీలాదేవి. ఎదురుగుండా బల్లకానుకుని లీలాదేవి విలోలనీరజనేత్రాలలోకి చూస్తోవుంటున్నాడు వెంకట్రావు.

లీల నీరవయై ఆలోచనాముద్రలో మునిగిపోయింది. ఏ భావతరంగమో వైక్లబ్యత కదల్చింది, లలితగాత్రం చిరుగాలికిమల్లే కంపించుట మొదలుపెట్టింది. సుందరసమున్నతవక్షం సముద్రతరంగంవలె లేస్తో పడుతోంది అప్పుడు వెంకట్రావు లీలా, ఏమంటావు త్వరగా చెప్పు మరీ, అన్నాడు; దానికి లీలాదేవి సమాధానం చెప్పలేక వెక్కి వెక్కి ఏడువనారంభించింది. ఎగుపులువచ్చాయి. ఆమె హృదయంలో పెద్దతుపాను రేగింది.

తత్క్షణం వెంకట్రావు ఆమెను దగ్గరకు లాక్కొని గట్టిగా లేవనెత్తుని కదుముకొని ఆమెకళ్ళమీద, కపోలములమీద, ముద్దుమొగముమీద చుంబించి నీలాలకసముదాయము సరిచేస్తో 'ఛా! ఏమిటి లీలా! యీవెఱ్ఱి నీకు,' అన్నాడు.

లీలాదేవి

(కన్నీరు తుడుచుకొంటూ) ఎల్లారాను నీతోటి నన్నే ఆధారంగా పెట్టుకొని జీవిస్తోవున్న తండ్రిగార్ని వదిలేసి, తల్లిపోయినదుఃఖం అసలే ఎఱుగను, సాభర్త ప్రాప్తిత రానప్పుడే పోయాడు కనుక ఆబాధ అసలే లేదు, కాని? ఈయన్ని - మానాన్నే - ఏలా విడవను, ఆ మాటతలచుకొంటేనే ఏడుపొస్తోంది, ఎల్లా-

వెంకట్రావు

లీలా! ఏమిటావెఱ్ఱి, నిన్న ఆయనమాటలు విన్నావు కాదూ. నన్ని గుమ్మంలోకి రావద్దన్నాడా? నిన్ను విడిచి నేను బతగ్గలనా? తప్పదు లీలా! నువ్వు నాతోరాక తప్పదు. నేనే భర్తనైతే వస్తావా రావామరీ. అప్పుడు మీనాన్నమాట వింటావా?

లీలాదేవి

వస్తే నన్నుతప్పకుండా వితంతువివాహం చేసి కొంటావా?

వెంకట్రావు

ఆ? తప్పకుండా!

లీలాదేవి

అల్లా అని చేతిలో చేయివెయ్యి.

వెంకట్రావు 'ఇదిగో దైవంతోడు,' అని చేతిలో చేయి వేసి 'ఇంక రావుఁ తెల్లారుతోంది' అని ఆమె చేయి పట్టుకొని తీసికొని పోవనారంభించాడు. ఇద్దరు వడి వడిగా చీకటిలో లీనంఅయ్యారు.

౨

రామనాథం లీలాదేవి తండ్రి. ఆయన కిప్పుడు స్పృహలేదు. సన్నిపాతజ్వరం, అపస్మారక మెక్కువగా వుంది. కంఠంలో శ్లేష్మం, కళ్ళలో రొంపులు, సర్వాంగాల్లో శైతల్యం వచ్చినవి.

వైద్యుడు వచ్చి చూచి 'నాడి స్థానం తప్పింది. ఆశ లేద'నిచెప్పి వెళ్ళిపోయాడు. విశ్వాసపాత్రుడు ఒక్క నౌఖరుమాత్రమే అక్కడవున్నాడు.

పాపం రామనాథానికి కూతురుసంగతి తెలిసాక ఆ మరునాడునుంచి మతిపోయింది, నిద్రచెడింది, ఆహారం లేదు, జ్వరంపట్టుకుంది, చూచేవాళ్ళు లేరు, చివరకి విషమించింది.

అచుట్టుప్రక్కలవాళ్ళంతా జాలిపడి ప్రతిరోజూ వచ్చి చూచిపోయేవాళ్ళు వైద్యుణ్ణి నియమించారు.అవసానదశకి నౌఖరే గతయ్యాడు.భార్యాపుత్రులు ముందే లేరు. నమ్మి,డబ్బిచ్చి, చదువు చెప్పించి ఆశ్రయమిచ్చినందుకు దూరపుబంధువుడైన వెంకట్రా వల్లా చేసాడు. కన్నకూతురే మోసగించింది.

సాయంకాల మవుసరికి రామనాథానికి శ్లేష్మం తీవ్రంగా లేచింది, దోరాటన. కళ్ళకిమూత లేదు. వైచూపే. మధ్యమధ్య 'లీలా, వెంకట్రావూ' అని భయంకరమైన కేకలు : చుట్టుప్రక్కల వాళ్ళంతా చేరారు. నాభివఱకూ శరీరం కట్టె అయిపోయింది

సమానవాయువు పెద్దశ్వాసతో లేచింది, తల గిరగిర తిరిగిపోయింది. వెంకట్రావుఅని భూలోకంలోంచి పరలోకంవాక చొఱచుకుపోయే ఒక్కపెద్ద వికృతరావంతో ముసలివాడిహంస రెుగిరిపోయింది.

౩

అలసవిలాససుందరవదనంతో లీల కూచుంది. ఆమె పాండుర ముఖంలో శ్రీశీవనంలో మార్పుదశ సూచించే మార్పురేఖలు కనపడుతున్నవి. కాని, అవి విషాద మేఘచ్ఛాయలలో అంతర్హితములైన శశిరేఖాసమూహాలు.

అంతలో వెంకట్రావు అక్కడికివచ్చాడు. అతన్ని చూచి లీల మౌనంగా సమీపించింది, అప్పుడు

వెంకట్రావు

ఏమి లీలా ! ఆల్లావున్నావు?

లీలాదేవి

మీ రిల్లా కాలయాపన చేయడం నాకు చాలా అనుమానంగావుంది. నా తండ్రికి దూరంచేసి యింతదూరం తీసికొనివచ్చారు. నన్ను వివాహంచేసికొంటానని నమ్మించి ఎన్నిసార్లు చెప్పినా ఆమాటకి తగిన సమాధానం చెప్పరు. ఇది బాగాలేదు. మీరేదోఒకటి యీవేళ తేల్చివేయాలి. ఇప్పుడు నేను పట్టిమనిషినికాను.

వెంకట్రావు

ఓహో, అల్లాగా (అని నవ్వుకొన్నాడు.)

లీలాదేవి (కోపంతో)

నా కీవెకిలినవ్వుతో పనిలేదు. ఇంక మోసము పనికిరాదు, నిష్కర్షగా చెప్పండి.

వెంకట్రావు

లీలా! నా కిదివరకే వివాహం అయిపోయింది.ఆపిల్ల కొలదిరోజులలోనే కాపురానికి వస్తుంది. నీవు నా ప్రణయినివి. నీవుకూడా ఆపాడువివాహబంధంలో తగులుకొనడం మంచిదికాదు, లీలా !

లీలాదేవి (కోపోద్రేకంతో)

ఛీ దొంగా? నన్నెంత ద్రోహంచేసావు. ఇహపరాలు రెంటికిచెడగొట్టావే? నన్నేపూతకట్టిగా నమ్మన వృద్ధుని విడచివచ్చానే?

వెంకట్రావు

పోనీ మరలపోరాదా? ఆయన దగ్గరికి.

లీలాదేవి (కన్నీళ్ళతో)

ఓ మూర్ఖుడా! నిన్నునమ్మి ప్రేమించుటచేత యింత పని జరిగింది. నిన్ను స్వేచ్ఛగా పునర్వివాహం గావించుకొని తర్వాత తండ్రిగారిని కలిసికొని క్షమాభిక్ష లేడుకొందామనుకొన్నాను. దీనికి తగినఫల మాపరలోకంలో అనుభవిస్తావు. నా తండ్రి గతించినట్లుగా నాకు

తోస్తోంది. ఒక్కసారి ఆయన కాళ్ళమీదపడి యీ పాపపంకిలదేహం విడుస్తా.'

ఇట్లని ఆమె విసవిస నడచిపోయింది.

౪

రాత్రి రెండవయామము జరుగుతోంది. వెంకట్రావు పరున్న దోమతెఱమంచ మల్లలాడిపోయింది. అతడు మెలకువవచ్చి కనులు తెఱచిచూచాడు.

ఎదురుగుండా నిలబడ్డాడు రామనాథము. నేత్రగోళాలు అగ్నిజ్వాలలు కురుస్తున్నాయి, పాపం వెంకట్రావు స్తంభించిపోయాడు.

అప్పు డాముసలి రామనాథము తలవూపుచు 'ఓరి పశువా? స్వామిద్రోహీ, నేను చనిపోయి యిప్పుడు ఛాయామూర్తినై వచ్చాను నీమీద పగతీర్చుకోడానికి, రేపుసాయంకాలము సరిగా ఆరుగంటలకి నిన్ను చంపుకుపోతాను జాగ్రత్త.'

వెంకటరావు భయప్రచలితగాత్రుడైపోయాడు నోటమాటవచ్చుటలేదు. అప్పు డాఛాయామూర్తి, మరల తల భయావహంగా వూపుచూ 'రేపే నాలుగైదయ్యేటప్పటికే నీకు కలరా ప్రారంభిస్తుంది, చూచుకో' అని చెప్పి, మాయమయిపోయింది.

అట్టి విచిత్రసంఘటన మెప్పుడూ చూడలేదు వెంకటరావు. కలా కాదు. తను కన్నులారా చూచాడు. తెల్లవాఱగానే ముసలివాని మరణవార్త టెలిగ్రాముద్వారా ముందు స్థిరపరచుకోవా లనుకొన్నాడు.

౫

అప్పటికి తెల్లవాఱి పదిగంటలైనది. చక్కని ప్రశాంతసూర్యకిరణ సుశోభితమైన ఉదయకాలం, పిల్ల తెమ్మెరవీచుతోంది.

వెంకట్రావుకళ్ళు గుంటలుపట్టాయి, ముఖం తేజోవిహీనమైవుంది. ముసలి రామనాథంపోయినమాట నిజమని ధ్రువపర్చేరిప్లయి పెయిడు టెలిగ్రామువచ్చింది.

సరిగా ఆసమయమున కాపూరిలోవున్న ఒక స్నేహితుడు రంగారావను మిత్రు డక్కడికి వచ్చాడు. అతడు బహుద్రష్ట, థియాసఫీకి చెందినవాడు.

వానితో వెంకట్రావు రాత్రిజరిగినదంతా చెప్పి 'మీరు పిశాచములుంటవని నమ్ముతారా?' అని దీనంగా అడిగాడు. దానికి,

రంగారావు

నేను నమ్ముతాను హిందువుల పురాణేతిహాసాలు శాస్త్రాలూ యీవిషయం యిదివఱకే స్థిరపర్చాయి. ఇప్పుడు పాశ్చాత్యతత్వవేత్తలంతా యీవిషయాన్ని నిరూపించి వప్పుకుంటున్నారు.

వెంకట్రావు

అది వట్టిపిచ్చిభ్రమ, ఈప్రాణిపోగానే యీశరీరం మట్టిలో కలిసిపోతోంది. ప్రాణం వాయురూపంగా పోయి గాలిలో కలిసి పోతోంది. ఇంక మిగిలేదేమి వుంది?

రంగారావు

అల్లాకాదు యీప్రపంచమంతా శక్తిమయం. అచైతన్యం స్థావరజంగమంగావుంది అదే భగవంతుని మహిమ. ఒకేసముద్రము అనేకఅలలు వేస్తున్నరీతిగా, విశ్వాత్మ వివిధాత్మలుగా కనపడుతోంది. జీవము క్రింద నుంచి క్రమశావచ్చి మానవుడిలో ప్రత్యేకత్వంపొందుతోంది. నిత్యుడైన ఆ జీవుడే మలినవస్త్రం విడిచినట్లు యీబొంది వదిలేసి పైకిపోతుంది.

వెంకట్రావు

అంటే పరలోకంవుందనా? నే నమ్మను. పిశాచాలు ఎల్లావచ్చాయి?

రంగారావు

విను మరి, పైకిపోయిన యీజీవుడు సూక్ష్మదేహంతో పైలోకంలోవుంటాడు, జ్ఞానిఅయిన జీవుడైతే ఏమమకారాలు లేక స్వర్గానికెళ్ళి దేవత్వంపొందుతాడు, లేకపోతే సూక్ష్మశరీరధారియై పరిచితస్థలాలు వదలకుండా తిరుగుతో శాంతులకులోనైవుంటాడు. అవే పిశాచాలు. అవి యీకంటితో కనిపెట్టలేము.

వెంకట్రావు (సంశయంతో)

ఛా! నే నమ్మనోయి!

రంగారావు

చచ్చినట్టు నమ్ముతావు. నీకెక్కడమిటి? యిక సెలవు. పనివుంది.

౬

శీలాదేవి స్వగృహము చేరుకొన్నది. తండ్రిలేని ఆ శూన్యగృహము పాడుగావున్నది. ప్రజలకంట పడ చాల కందే తలదాచుకుంటోంది.

అది సాయంతనసమయం, స్వదేశమాతకై నిజరక్తం ధారపోసి స్వగాత్రంకానుకగా సమర్పించెడు భారత వీరునివలె లోకబాంధవుడస్తంగతుడయ్యాడు, మబ్బువ పడిపోయే, గత వృత్తాంతంవలె, సంధ్యారాగంకూడా చీకటిలో లీనం అవుతోంది.

ధ్యానమగ్నమానసయై లీల కూచుంది. ఆమె విలాస లాలసదేహం యిప్పుడు బూడిదరేగింది. ఆ కాటుకకళ్ళలోని తళతళా, ఆపచ్చని గుండ్రనివంపులుతీరిన, నిమ్నోన్నతసుందరశరీరనిర్మాణంలోనిలావణ్యం అంతరించి పోయాయి ఇప్పుడామె ఒక జీర్ణశిథిలగాత్రి.

అంతలో ద్వారం చెంత ఏదో టక్కుటిక్కుమని ధ్వని వినవచ్చింది. మొట్టమొదట శీలాదేవి పాటింపలేదు. ఆ ధ్వని మరలమరల వినవచ్చుటచే విసుగెత్తి తలుపుతెఱచి చూచినది. తక్షణం వెంకట్రావు లోనికి ప్రవేశించాడు. శరీరం తూలిపోతోంది, మనిషి వట్టి అస్థిపంజరం. కళ్ళు చాలా లోతుకిదించుకుపోయాయి. ఆయాకృతి చూచేసరికి లీల భయవిహ్వల అయింది.

అప్పుడు వెంకట్రావు 'శీలా! నేను కలరాజాడ్యంవల్ల మరణించినాను. దానికి నీ తండ్రిగారి ఛాయామూర్తియే కారణం. నీకు నేను చాలా అపకారంచేసాను. నేను చేసినతప్పు క్షమించాలి. పరలోకంలేదనీ, భగవంతుడు లేడనీ సంచరించాను. నీవు ఆత్మహత్యచేసికోవాలని అప్పుడప్పుడు తలపోస్తున్నావు. అది చాలాతప్పు. కర్మ అనుభవించితీరాలి. నీ విప్పుడు గర్భిణివి. ఆత్మహత్య చేసికొనుటవల్ల మరల పాపము మూటకట్టుకొనెదవు.

శీలాదేవి దిగ్భ్రమచెంది తెల్లనివ్వెఱపడిపోయి చూస్తూ ఆలకిస్తోంది. మరల వెంకట్రావు ఛాయామూర్తి చెపుతోంది మాకు మనుష్యలోకం విడువగానే అద్భుతశక్తులు కలుగుతాయి. భవిష్యత్తు చెప్తాను విను. నీకొక కుమారుడు పుడతాడు. వానికి నీ తండ్రిగారి పేరుపెట్టు. నేను నాలుగువేలరూపాయిలకి ఎండోమెంటు చేసాను. అది నీకు వచ్చునట్లుగా వ్రాసి మరీ మరణించాను. ఇవిగో కాగితాలు పట్టుకొచ్చి నీకిస్తున్నాను పుచ్చుకో' అని చేతికిచ్చాడు.

శీలాదేవి అప్రయత్నంగా ఆ కాగితాలు పుచ్చుకొనేటప్పుడు మంచుకంటె చల్లనైన వానిచెయ్యి తగిలి శరీరం గగుర్పొడిచి అచేతనయయి పడిపోయింది.

మరల కొంతసేపటికి శీలాదేవికన్నులు విప్పేసరికి వెంకట్రావుఛాయామూర్తి మాయమైనది. అతడిచ్చిన ఎండోమెంటుకాగితాలుమాత్రము మిగిలినవి.

అది కలగాదు, భ్రాంతికాదు, కాగితాలు ప్రబలనిదర్శనంగా వున్నవి. అందుచేత శీల ఆత్మ్యాశ్చర్యంతో మునిగితేలుతూ పరమేశ్వరుని ప్రార్థించింది.

—పెమ్మరాజు రాజగోపాలము, బి.ఏ



శివరాత్రి : జంగముదేవర.

భూకంపములు

జనవరి 15-వ తేదీ మధ్యాహ్నము 2-30 గంటల వేళకలిగిన భూకంపము హిందూ దేశమున ఒక శతాబ్దిలోపున సంభవించిన భూకంపములలో ప్రచండమైనది. ఈభూకంపము సంభవించినపుడు వైస్రాయి దంపతులు ఢాకాస్టేషనులో నుండిరి. అపుడు వెల్లింగ్డను ప్రభ్వి ఇట్లు చెప్పెను: 'మదరాసును మేము తుపానులో వదలితిమి. కలకత్తాను భూకంపములో వీడుచున్నాము.' ఈ భూకంపము కొద్దిగనో గొప్పగనో హిందూదేశమునంతటిని కదలించినది. అటు లక్నోనుండి ఇటు కలకత్తావఱకును, అట డార్జిలింగునుండి ఇట కన్యాకుమారివఱకును కంపము కనిపించినది. ఉత్తరహిందూదేశమున దీనివలని నష్టము అపారముగనున్నది, ముజఫర్ పూర్ శ్మశానవాటికయై వఱదలలో మునిగియున్నదని వాయువిమానముపై తిరిగి తెలిసికొన్నారు. పాట్నానగరము ధ్వంసమయ్యెను. జమాల్ పూరుస్టేషను విరిగి రైలుబండి మీదపడెను. కాశీలో చీమలు, ఎలుకలు కూడ ఆసమయమున ఇండ్లువదలెను. కూచ్ బీహార్ లో ధరాకంపమునకు ఏనుగు ఒకటి మతిచెడి ఇండ్లపైబడెను. ఆర్యావర్తమున కలిగిన నష్టమునకు అంతులేదు. మన ఆంధ్రదేశమునకూడ ఈ ధరాకంపము బాగుగా కానవచ్చినది. రేపల్లె చెఱువులోని నీళ్లు లాంతరు స్తంభము ఎత్తున లేచెను. బెజవాడ కోర్టుమునసబు ప్లీడర్లు తన్ను కదలించుచున్నారని భయపడెను. గోదావరికాలువలోని నీళ్లు వఱదరోజులలోవలె బురదలయ్యెను. కనుముపండుగ ఇట్లు భూకంపముతో కడచెను.

జపానువారికివలె మనకు భూకంపములతో ఎక్కువ పరిచయము లేదు. 1897 జూను 12-వ తేదీని అస్సాములోను; 1900 ఫిబ్రవరి 8-వ తేదీని కోయంబత్తూరు ప్రాంతమునను; 1905 ఏప్రియలు 4-వ తేదీని కాంగ్రాలోయయందును గడచిన నలుబదివత్సరములలో హిందూదేశమున ధరాకంపములు సంభవించినవి. కాంగ్రాలోయయందు కంపము తెల్లవాఱకట్ల ప్రజలు జాగ్రతవస్థలో లేని సమయమున కలుగుటచే ఇరువదివేలకుపైగా జననష్టము కలిగెను. ఈధరాకంపములనుండి తప్పించుకొనుటకు మార్గమేమి అని భూగర్భశాస్త్రజ్ఞులను ప్రశ్నింపగా వెదురుగుడిసెలలో నివసించుటయే అని చెప్పుదురు. ధరాకంపములతో ప్రతిదిన పరిచయముగల జపానీయులు ఇందుచేతనే వెదురు ఇండ్లయందు నివసింతురు. మానవుడు తనప్రజ్ఞనుపయోగించి నిర్మించు బ్రహ్మాండభవనములు ఈ కంపములధాటికి ఆగజాలవు.

అయితే ఈ కంపములు ఎందుకు కలుగును? జనవరి కంపము సప్తగ్రహకూటము వలననే కలిగినదని పలువురి నమ్మకమైనట్లు పత్రికలలోని వ్రాతలవలన స్పష్టమగుచున్నది. పురాణములలో భూకంపకారణము వేఱుగ వివరింపబడినది. దేవతలకోటయగు ఆకాశము గాలిమీద, ఆగాలి భూమిమీద, ఆధరణి సముద్రములమీద నిలిచియున్నది. ఆసముద్రములను ఒకపెద్దతాబేలు మోయుచున్నది. ఆతాబేటిని వాసుకి అను మహానాగము తన సహస్రశీర్షములలో నొకదానిపై నిలుపుకొనుచున్నది. భారము ఎక్కువైనపుడు దానిని ఒకతలనుండి మఱియొకతలకు

మార్చుకొనును. ఆ మార్చుకొనుటలో ధర ణికి కంపముకలుగును.

భూగర్భశాస్త్రజ్ఞులు దీనికి అంగీకరింపరు. వారి అభిప్రాయమున భూకంపములకును అగ్నిపర్వతములకును సన్నిహిత సంబంధము కలదు. తనచుట్టు తానుతిరుగుట, సూర్యుని చుట్టు తిరుగుట అనుచలనములకుతోడు భూమికి మతియొకవిధమైన చలనముగలదు. ఈ చలనము కొన్నికొన్ని ప్రదేశములందుమాత్రమే యుండును. ఈ చలనమును చెట్లు చేమలు మొదలగునవి కదులుటచే కంటి తోడను; నేలలో గలుగు ధ్వనిచే చెవివలనను పోల్చుకొనవచ్చును. దీనినే భూకంపమందురు. అగ్నిపర్వతముల విజృంభణావసరమున ధరాకంపములు సంభవించును.

నేలమీదిభాగము చల్లబడి లోనికిదించుకుపోవుటవలనను, ధరణీగర్భమున నీటియావిరి విశేషముగాబుట్టి విస్తరించి వ్యాపించుట వలనను ధరణియందు చలనముజనించి అది యొక అలవలె వ్యాపించును. ఇదియే ధరాకంపము. ఇట్లు సంకోచవ్యాకోచములు రెండును ధరాకంపమునకు కారణములే. కొన్ని కంపములు తేలికగ తేలిపోవును. ఇట్టివి ఈ విశాలవిశ్వమునందు ఏదో యొకమూల దిన దినమును కలుగుచునేయుండును. కొన్ని భూకంపములు ప్రచండములై యుండును. ఇవి సాధారణముగ అగ్నిపర్వతప్రాంతము లందుమాత్రమే కలుగుచుండును.

జపానునందు, ఆసియామైనరునందు, దక్షిణ అమెరికాపశ్చిమతీరమునందు, మెడిటరేనియన్ సముద్రపు ఉత్తరతీరమునందు తఱుచు భూకంపములు కలుగుచుండుటను భూగోళశాస్త్రము చెప్పుచున్నది. భూకంపములవలన కొన్నితావులయందు కొండలు ఎత్తుఅగును; కొన్నితావులయందు వానికి స్థానచ్యుతికలుగును; బ్రహ్మాండభవనములు నేలమట్టమగును; నేలపగిలి సూతులు ఏర్పడును; ఇసుకమేటలు వేయును; నదులు సన్నగిల్లును; రైలుపట్టాలు కొంకరులువోవును; వంతెనలు క్రుంగిపోవును. చెట్లు భూమిలో దించుకుపోవును. తుదకు గడియారముల పెండ్యులమ్ చలనముకూడ అరికట్టబడును.

శాస్త్రవిజ్ఞానము విచిత్రపరిణామమందిన ఈ దినములలోకూడ మానవుడు భూకంపములను అరికట్టలేకపోవుచున్నాడు. పంచభూతములను లోగొంటినను అతని ప్రజ్ఞ ఉత్తరకుమారప్రజ్ఞయే యైనది. భూకంపములు ఇన్నిమైళ్ళలో కలిగినవి అని రికార్డు చేయుటకుమాత్ర ముపయోగించు సీస్మొగ్రాఫ్ అను యంత్రము నొకదానినిమాత్రము మానవుడు కనుగొనియున్నాడు. పోర్చుగిల్ దేశపు రాజధానినగరమగు లిజ్బన్ నగరము 1775 లో భూకంపముచే సర్వనాశనమైనది. 1775 నుండి నేటికి శాస్త్రమెన్నియోమడుంగుల అభివృద్ధినిగాంచినది. కాని ఆ నాడు లిజ్బన్‌లో జరిగిన సర్వనాశనమువంటిదే నేడుపాట్నా, ముజఫర్‌పూర్ మున్నగు తావులయందును జరిగినది. 1775 లో కంటె నేడు వాయువిమానము లోకటి యెక్కుడైన కతనమున మానవుడు పైకి ఎగిరి కలిగిన నష్టమును అవలోకించి ఆవార్తను లోకమువారికి త్వరగ అందింపగలిగినాడు.

లండనునందలి భూగర్భశాస్త్రజ్ఞుడు షా గారు ఈ ధరాకంపమునుగూర్చి ఇట్లు ప్రచురించినారు: "నాయంత్రము గంటను ప్రమోగించి ఈధరాకంపమును రికార్డుచేసెను. అది ఒకగంట కాలముండెను. లండను మహానగరమునకు అది 4600 మైళ్ళదూరమున సంభవించెనని సూచించెను."

—ఆర్. శ్రీరామమూర్తి, బి.ఏ.

రాష్ట్రేతరాంధ్రులు

రాజపాళెయమందలి ఆంధ్రక్షత్రియులు

(తమిళదేశమందలి రామనాథపురం జిల్లా రాజపాళెయ మందలి ఆంధ్రక్షత్రియకుటుంబముల సంక్షిప్తవివరములు.)

విద్యావిషయములందుగూడ మాపూర్వులు విశేషమైన శ్రద్ధవహించియుండిరి. ఆంధ్రదేశమునకు వందల మైళ్ళదూరమున నున్నను యాంధ్రవాణిని తమగృహములందు ప్రతిష్ఠించుకొని పూజలు సల్పియుండిరి. వారు రచించిన యాంధ్రగ్రంథముల నిచట దెలుపుటకు సంతసమగుచున్నది.

శ్రీమన్మహామండలేశ్వర గొట్టిముక్కల కృష్ణరాజుగారు (1) దశావతారచరిత్ర యను పదియాశ్వాసముల పద్యకావ్యమును; (2) సీతాకల్యాణమను యక్షగానమును—శ్రీమన్మహామండలేశ్వర గొట్టిముక్కల కుమార పెద్దిరాజుగారు (3) సావిత్రీయక్షగానమును—శ్రీమన్మహామండలేశ్వర గొట్టిముక్కల సింగరాజుగారు (4) పారిజాతాపహరణమను యక్షగానమును—రచించియుండిరి.

దేవగురుబ్రాహ్మణభక్తిగలిగి వినయసౌశీల్యాది సద్గుణములతో అసామాన్యమగు దేహపటుత్వముతో సుఖముగ కాలము గడుపుచుండిన క్షత్రియసంఘము నేడెట్లున్నదో తెలుపుకొందును.

విద్య

మా గ్రామమున నొక బోర్డుహైస్కూలు, ఒక మాధ్యమిక పాఠశాల, ముప్పది ప్రాథమిక పాఠశాలలును పనిచేయుచున్నవి. ఇందులో మాధ్యమిక పాఠశాలయు, నాలుగైదు ప్రాథమిక పాఠశాలలును రాజులచే నడిపింపబడుచు క్షత్రియబాలురతో నిండియున్నవి. మొత్తముమీద సుమారొకవెయ్యివిద్యార్థులు మాత్రమే మాసంఘమునకు జెందియున్నారు. పాశ్చాత్యులకన్న భారతీయులం దేవిధమున నిరక్షరత వ్యాపించియున్నదో ఆదేవిధమున మారాజులుకూడ విద్యావిషయములందు వెనుకబడియున్నారు. చేవ్రాలుచేయ దెలియనివారు లెక్కకుమించి యున్నారు. వ్రాయ జదువ నేర్వనందున ఇంటివ్యవహారములందు వారనుభవించు కష్టములు, పొందు అమర్యాదలు చెప్ప నలవిగాదు. నిరక్షరత వ్యాపించియున్న సంఘము, ప్రస్తుతయుగమునందు ముందున కడుగిడలేక, తెలివితేటలతో మెలగుట కవకాశములేక నాగరిక ప్రపంచమునకు దూరమైపోవును. మనపూర్వుల యభిప్రాయములో విద్యయన అక్షరజ్ఞానముమాత్రము కాదని చెప్పవచ్చును. అక్షరముల స్వరూపముతో పనిలేకనే మనపూర్వులు వేదపురాణాది సమస్తవిద్యలను సాధించియుండిరి. కట్టి అక్షరజ్ఞానమున కంతప్రాముఖ్యత లేదు. కాని ఆకాలము, ఆ ఉద్దేశ్యములు ఆపరిస్థితులు మారినందున ప్రతికులమునందును నూటికి నూరుగురు వ్రాయ జదువ నేర్చియుండుటయే అవసరముగా గన్పట్టుచున్నది. ఐనను, కట్టి పుస్తకముల జదువు చదివి, పరీక్షలనిచ్చియు సాహసించి ఒకకార్యమైనను చేయలేక, కాయకష్టములుచేసి జీవించుశక్తిలేక, సంసారమందలి దుఃఖములనోర్పుతో నెదుర్కొనలేక, సంతోషమనసెట్టిదియో యెఱుంగక, జీవచ్ఛవములవలెనుండు ఇక్కాలపు విద్యార్థులను మన సంఘమువా రనుసరింపబనిలేదు. ఇంగ్లీషువిద్య వ్యాపించి చాలకాలమైనను మా రాజపాళెపుక్షత్రియులలో నుండి ఇంతవఱకు ఐదారుగురు బియ్యేలు మాత్రమే వెలసియున్నారు. ఇంక కొందరు వెలయ సిద్ధముగ

నున్నారు, పలువురు మెట్రిక్యులేట్లును తయారై యుండిరి. ఇట్టి స్వల్పసంఖ్యనుజూచి వగవ బనిలేదని మా తలంపు. రాజపాళెయపురాజులు వ్యవసాయముజేసి బ్రతుకవలసినవారగుటచేతనే వారిలో ఉన్నతవిద్య నభ్యసించువారుగాని ప్రభుత్వోద్యోగములకై పరితపించువారుగాని లేకున్నారు. దీనినిబట్టియే ప్రస్తుతపు విద్యావిధానము మా అక్కఱలకును పరిస్థితులకును తగియుండలేదని నిశ్చయముగా జెప్పవచ్చును. వ్యవసాయమునందు మావారికున్న ఉత్సాహమును ఎక్కువజేసి, అందులోనే అభివృద్ధిమార్గముల దెలుపునట్టివిద్య వారికి నేర్పుట అవసరము. అదియు విశేషవ్యయప్రయాససాధ్యమైనదిగా నుండగూడదు. అందఱికిని అందుబాటులో నుండవలయును. మాక్షత్రియయువకులలో నుండునియమబద్ధతను, వినయవిధేయతలను విశాలభావమును వృద్ధిజేసి పరోపకారజాతి దేశసేవాదులకు ఉపయోగపడునట్లు వారిని తయారుచేయువిద్య అవసరమై యున్నది. అంతేకాని విశృంఖలతకును, అవిధేయతకును సంకుచితస్వార్థదృష్టికిని ఎడమిచ్చు విద్యాపద్ధతులు, అనుసరింపదగినవి కావు. సెకండరీవిద్యగూడ లాభించ నందుననే మనవిద్యార్థులుగాని, వారి తలిదండ్రులుగాని దానియెడల సుముఖతను జూపుటలేదు. ఐనను నిరక్షరతను వృద్ధిజేయక, మన జాత్యభివృద్ధికి అనుకూలమగు మార్గముల దెలుసుకొని అందుకు తగిన విద్యావిధానము నేర్పరచుకొనుట సంఘనాయకుల కర్తవ్యమగుచున్నది.

స్త్రీవిద్య

పురుషులస్థితియే యిట్లుండ స్త్రీవిద్యనుగుఱించి చెప్ప బనియుండదు. దేశభాషయగు తమిళము క్షత్రియస్త్రీలకు తెలిసియుండుట కొంతవఱ కవసరముగానే యున్నది. సామాన్యముగా కావలసిన స్వల్పపుతమిళజ్ఞానమును నేర్పించుటకై, ఇప్పుడు చేయుచున్నటుల క్షత్రియబాలికల నారంభమునుండియు తమిళపాఠశాలలకంపి అరవమునే నేర్పించినచో శీఘ్రకాలములోనే మాతృభాష యంతరించకమానదు. మొత్తముమీద ప్రస్తుతపు విద్యావిధానము పురుషులతోబాటు స్త్రీలకుగూడ నిరుపయోగముగనే యున్నది. మాతృభాష తెలుగయ్యు, చిన్నప్పుడే యది వారికి నేర్పకపోవుట వలన, అరవము నేర్చుకొనుట కష్టమగుటయేగాక దెలిసిన కొంచెము తెలుగుగూడ మఱచిపోవలసివచ్చుచున్నది. విదేశములలోనున్నను, మాతృభాషను ఇంకను మఱచిపోక నిలిచియుండుటకు మాస్త్రీలే కారకులై యున్నారు. ఇకముందుకూడ దానినుద్ధరించవలసినవారు స్త్రీలే యైనందున, మాతృభాషాభివృద్ధియగు నటులును, దేశభాషాజ్ఞానము కలుగునటులును తగిన విద్యావిధానముతో, క్షత్రియస్త్రీలకుగాను ప్రత్యేకమైన పాఠశాలలను నిర్మింపవలసియున్నది. దక్షిణదేశమునందును, ముఖ్యముగా మాగ్రామమునందును ఆంధ్రభాషాప్రచారముచేయు చెన్నపురి దక్షిణాంధ్రభాషాభివర్ధినీసభవారలోగ కొంతప్రయత్నించియుండిరిగాని ఇపు డట్టిప్రయత్నములు బొత్తిగా కానము.

ఆర్థికము

మాక్షత్రియసంఘపు ఆర్థికస్థితిని గుఱించికూడ కొంచెము మనవి జేయవలసియున్నది. మాలో కొన్ని ధనవంతములైన కుటుంబములున్నను మొత్తముమీద చూచిన, రాజులందరును ఆర్థికముగ వెనుకబడియున్నారనియే చెప్పవలయును. సాధారణముగ దేశమందలి దారిద్ర్యమునకు పరిపాలనాలోపమే కారణముగ నుండును. అట్టిది ప్రస్తుతము మన భారతదేశమునంతను ఆవరించియే యున్నది. ఇదిగాక సోమరితనమును, భోగలాలసత్వమునుగూడ దరిద్రమును దెచ్చిపెట్టును. మా సంఘములో నున్న బీదతనమునకు ఇదెంతమాత్రము కారణముకాదని చెప్పవచ్చును. ఈ ప్రాంతమందలి ఇతరజాతులతో పోల్చిచూచిన మావలె కాయకష్టముచేయువారు లేరనియే చెప్పవలెను. చీకటిలో 8 గంటలకే మేల్కొని ఏడెనిమిది మైళ్ళదూరమునను పొలములలోను అడవులలోను కష్టపడి పనిజేసి రాత్రి పదిగంటలపైననే ఇల్లు చేరుకొనువారు, మాలో ఎందరో యున్నారు. ప్రతిదినము ఇంతదూరము నడచి వ్యవసాయము చేయుచుండువారిలో సోమరితనము వచ్చునదైన నుండదనిన అతిశయోక్తిగాదు. కాన సోమరితనముగాక వేరుకారణము లుండితీరవలయును. —సశేషము.

ఆరోగ్య విజ్ఞానము

§. తేనెయొక్క ఆహారపు విలువ

శక్తిని ఉత్పాదించు ఆహారపదార్థములలో తేనె ఉత్కృష్టమైనది. సులభముగా జీర్ణమై శరీరమున శీఘ్రముగ వ్యాప్తినొందు చక్కెరపదార్థములతో తేనె నిండాతీరియున్నది. ఇతరవిధములయిన చక్కెరలు తేనెలో నుండు సాధారణమైనచక్కెరపదార్థములుగా మారుటకు ఆమాశయమునందును, పేగులయందును స్రవించు ద్రవములతో మేళవింపు నొందవలసిన యక్కఱగలదు. రోగమువలనగాని, వృద్ధాప్యమువలనగాని జీర్ణకోశముయొక్కస్థితి చెడియున్నప్పుడు తేనె —సులభముగా జీర్ణమగునదగుట— విలువరైన ఆహారపదార్థమగుచున్నది. జీర్ణకోశమునకు విశేషము పని కల్పించకయే శరీరమున జీరణమగునదగుట తేనె శిశువులకు, పిల్లలకు మంచిఆహారమగునని అమెరికను డాక్టరొకడు చెప్పుచున్నాడు. కసరత్తుచేయువారి ఆహారపదార్థములందు తేనె తప్పక చేర్పబడవలయును. పుల్లులుగావించు విశేషమైన దేహపరిశ్రమవలన వారి కండరములందును, రక్తమునందునుగల చక్కెరలు త్వరత్వరగా విలుప్తమగుచుండును. వాని స్థానమున క్రొత్తగా చక్కెరపదార్థములు కలిగించుటకు తేనెకు మించిన ఆహారపదార్థము మఱియొకటి లేదని రూఢిగచెప్పవచ్చును.

§. మేకపాలు సౌందర్యవర్ధకములు

బ్రిటిష్‌గోట్ సొసైటీవారి జర్నలులో ఆ పత్రికాసంపాదకులగు ఎ. జె. ఫామరుగారు ఇట్లు వ్రాయుచున్నారు: "బ్రిటనుదేశమున ఇప్పుడు మేకపాలు విశేషముగ త్రాగు ఆచారము ఏర్పడియున్నది. ఈ దేశమున ఇరువది యేండ్లకు క్రితము ఏడాదికి 2,000,000 గాలనుల మేకపాలు ఉత్పత్తిచేయబడుచుండెను. ఆ రేండ్లక్రితము ఈ ఉత్పత్తి 12 000,000 గాలనులకు పెరిగెను. నేడు 20,000,000 గాలనుల మేకపాలు ఉత్పత్తి చేయబడుచున్నవి. ఆవుపాలకంటె మేకపాలు సులభముగా జీర్ణమగునవియగుట—వెన్న సంబంధమైన కొవ్వు వీనియందు విశేషముగానుండుట—క్షయకారకక్రిములకు ఇవి దూరమైనవగుట—ఆవును పెంచుటకంటె మేకనుపెంచుట చవుకయగుట—ఆవు మొదలగువాని దూడలు, గొఱ్ఱెపిల్లలు, గుఱ్ఱము మొదలగువానిపిల్లలు, పందిపిల్లలు మున్నగువానికి పాలదాదిగా మేక పనికిరాగలిగియుండుట—ఈ కారణములతోడు మేకపాలు సౌందర్యవర్ధకములగుట ఈ దేశమున మేకలను పెంచుటకు ప్రత్యేకహేతువగుచున్నది. దినమునకు మూడునాలుగుసారులు తమ మొగములను, కంఠములను, ముంజేతులను మేకపాలతో తడుపుకొనుచు కొంచముసేపుండి కడిగివైచికొనుచుండవలయును. ఇట్లుచేయుటచే చర్మము ననుపుదేరి మంచి కాంతిని పొందుచున్నది. సౌందర్యపోషణము నిమిత్తము స్త్రీలు ముఖ్యముగా మేకపాల నాశ్రయించుట వాంఛనీయమని ఇచటి డాక్టరులు పలువురు పత్రికలలో వ్రాయుచుండుట పత్రికాపాఠకులెల్లరును గమనించియే యుందురు."

§. రోగులకు ఆహారమిచ్చుటలో చూపవలసిన మెలుకువలు

'నీబలమును నిలుపుకొనుటకు నీవు ఆహారమును గొనవలయును' అనునది ఎల్లరెఱింగిన సత్యము. 'నీవు నీరసముగామన్నచో' పలువురు నీవు తగినంత ఆహారమును తీసికొనుటలేదని తలంతురు. బలమును పొందు

టకు నీవు ఎక్కువగా తినవలయును' అనునది పలువురి అభిప్రాయమైయున్నది. కాని ఆరోగ్యశాస్త్రవేత్తల అభిప్రాయమున ఇదియొక దురభిప్రాయమైయున్నది. ఈదురభిప్రాయము ననుసరించి వర్తించుచుండుటచేతనే పలువురు ఆజన్మము బలహీనులై యుండుచున్నారు. తినుటకును, జీర్ణించుకొనుటకును సన్నిహిత సంబంధము కలదని ప్రాయకముగా గుర్తింపబడదు. జీర్ణకోశమును ఆహారముతో నింపినమాత్రమున అది బాగుగా అరగి శరీరమునకు శక్తినొసంగు పదార్థముగా మారునను కొనుటకు వీలుచాలదు. ఆహారమును లోగొనుటకు అవశ్యకత, దానిని జీర్ణముచేసికొనజాలుటకు శక్తి ఉండవలయును. జీర్ణించుకొనుటకు శక్తి చాలనిస్థితిలో అన్నాశయమును ఆహారముతో నింపుట విషము ఉత్పత్తి అగుటకు అవకాశము కల్పించుటయే. అది శరీరమునకు అనవసరపదార్థము. దానిని శరీరమునుండి పూర్తిగ వెలిక్రోసివైవవలయును. కాని అది తఱుచు పేగులలో చేరి నిలవయుండి కుళ్ళి విషముల నుత్పన్నముచేయును. ఆవిషములు శరీరమున విపులముగా వ్యాపించి దుస్సాధ్యరోగములను పుట్టించుటకు కారణభూతములగుచున్నవి. ఇట్టిపరిస్థితులలో రక్తము చెడిపోవును. ఈ విషము ఆహారకోశమునుండి వెలువడును. ముసిడిసత్తు విసముకంటె కూడ నిది తీవ్రతరమైయుండును. రోగి ఉదరమున ఇట్టి విషము ఉత్పన్నమగుట ఎంతటి ప్రాణాంతకమో సులభముగ నిర్ణయించుకొనవచ్చును. ఇట్టి విషముల పుట్టుకచే రోగి మఱింత నీరసించుచున్నాడు; శక్తి మఱింత చెదరుచున్నది; ఆకలి బొత్తిగా కొఱవడుచున్నది; ఆహారముపై ఏమాత్రము తలంపు పోవుట లేదు. ఇట్టిస్థితిలోకూడ రోగికి ఏదైన ఆహార మీయవలయునను ప్రయత్నము వైద్యుడును, రోగి బంధువులును కూడ చేయుచున్నారు. రోగికి ఆహారమిచ్చుట ఒక గొప్ప విషమపరీక్ష. ఆహారముయొక్క ప్రధానతత్వమును ఏమఱిన వైద్యుడు తన అవ్యక్తతచే ఒక్కొక్కప్పుడు రోగి ప్రాణములను పోగొట్టును. ఇట్టి ప్రమాదములచేతనే రోగులలో పలువురి మరణములు సంభవించుచుండునని నా అభిప్రాయము. అమయస్థితిలోగాని నిరామయస్థితిలోగాని ఆకలిలేకనే ఆహారము నెవ్వడును గైకొనరాదు; తిని అరగించుకొని అనుభవించ గలుగుదునను ధైర్యములేనిదే ఆహారము చేకొనరాదు. ఆరోగ్యస్థితిలో నున్నవాడు ఆకలిలేనప్పుడు ఆహారము గైకొనుటచే తోడనే ప్రమాదము కలుగక పోవచ్చును. రోగస్థితిలో నున్నవాడుమాత్రము ఆకలిలేనప్పుడు ఆహారమును బొత్తిగా దరికి చేరనీయకుండుటను మఱవరాదు. బలమును నిలుపుకొనుటకు అవశ్యము ఆహారమును గైకొనవలసినదే. కాని అగ్గైకొనుటలో విశేషమైన మెలకువను చూపవలయును. తినిన ఆహారము తప్పక జీర్ణమగునని ధైర్యము చిక్కినప్పుడును, శరీరము ఎక్కువ పోషణపదార్థమును కోరుచున్నదని తోచినప్పుడును అగ్నిబలము ననుసరించి అధికాహారమును గొనవలయును. మిగిలినసమయములందు ఆహారమును గొనుట విషమును మెక్కుటయే. రోగులకు ఆహారమొసంగునపుడు ఆహారపదార్థముల విపుల విజ్ఞానమును కలిగియుండుట అతిముఖ్యము. బలముకాని నీరసముకాని ఆహారపదార్థములవలననే కలుగుననియు, బ్రతుకుట గాని మరణించుటగాని ఆహారపదార్థములవలననే సంభవించుననియు జ్ఞప్తియందుంచుకొనవలయును. హితమైన ఆహారమును మాత్రమే ఈయవలయుననియు, హితముకాని ఆహారమును ప్రయత్నపూర్వకముగా విడనాడవలయుననియు ఎన్నడును మఱచిపోగూడదు."

—బెర్నార్డు మాక్ ఫేడెన్.

౬. చర్మరోగులు : సి. విటమిను

విటమినులలో సి. విటమిను రక్తశుద్ధిచేసి రక్తమును ఆరోగ్యస్థితిలోనుంచును; శరీరమును అంటురోగములనుండి కాపాడును. చర్మరోగములు, సెగగడ్డలు, కురుపులు సి. విటమినుగల పదార్థములను భుజించుటచే తప్పక కుదురును. సీమవంకాయలు, నీరుల్లిపాయలు, నిమ్మకాయలు, నారింజకాయలు, కాబేజి వీనియందు సి. విటమినులు విశేషించియున్నవి. పెసలు మొదలగు పప్పుగింజలయందు మొక్కలు మొలుచుస్థితిలో సి. విటమినులు విస్తరించియుండును. సి. విటమిను చర్మరోగుల పాలిటి వరప్రసాదము.

వాటికన్ గ్రంథాలయ పునర్నిర్మాణము

వాటికన్, అందలి గ్రంథాలయము

'వాటికన్' అనునది ఒక నగరనామము. అది రోము దేశమునగలదు. రోమన్ కాథోలిక్ మతస్థుల పీఠాధిపతియగు పోప్ కాపురపుకాణాచి. ఆనగరరాజ్యమున పోప్‌నకు నిరంకుశాధికారము గలదు దాని వైశాల్యము 108 యకరములు. జనాభా 800 మంది. ప్రపంచమునందలి ప్రాచీనగ్రంథాలయములలో వాటికన్ గ్రంథాలయ మొకటి. ఆగ్రంథాలయము ఈనడుమ పునర్నిర్మాణముగావింపబడినది. గ్లాస్గోనగరమునుండి ప్రచురింపబడుచున్న 'ఈవినింగున్యూస్' పత్రిక ఆపునర్నిర్మాణవిధానమునుగూర్చి విపులముగ నిట్లు ప్రచురించుచున్నది.

పునర్నిర్మాణావశ్యకత

"వాటికన్ గ్రంథాలయమున అతి ప్రాచీనమైనవి, అమూల్యములైనవినగు పలు గ్రంథములుగలవు. కట్టడము మిక్కిలి పురాతనమైనది. గతవత్సరప్రారంభమున గోడలు కూలునను భయముతోచెను. అమెరికా దేశమునుండి వాస్తుశాస్త్రజ్ఞుని ఒకనిని రప్పించి నూతన భవననిర్మాణమునకు మదింపులు తయారుచేయించుచుండిరి. ఇంతలో గతవత్సరపు క్రిస్టమసు పండుగుల ముందు ఆగ్రంథాలయభవనకుడ్యములు కూలిపోయెను. అప్పుడు లిఖితపుస్తకములన్నియు పరిరక్షింపబడినవి కాని అచ్చుపుస్తకములు కొన్నియు, పింగాణీసామగ్రికొంతయు పాడయ్యెను.

గ్రంథాలయాధికారి

పోప్ పదునొకండవ పయస్ గ్రంథాలయాధికారి. ఆతడు వెనుక మిలాన్ నందలి యాంబ్రోషియన్ గ్రంథాలయమున పాలకుడుగానుండెను. 'పోప్' అధికారమునుపొందకపూర్వము ఆతడు ఈవాటికన్ గ్రంథాలయమునగూడ కొంతకాలము పనిచేసియుండెను. పుస్తకపఠనము ఆతని అభిమానవిద్య. పోప్ అధికారమును పొందినపిమ్మట కూడ తన తీరికసమయములందెల్ల నాత డీగ్రంథాలయమున గడుపుచుండును. వాటికన్ గ్రంథాలయమునందలి గ్రంథనిక్షేపముయొక్క భవిష్యత్తును గూర్చి పోప్ ఆలోచనాపరుడై యుండెను.

అమెరికన్ నిపుణుల సాహాయ్యము

గ్రంథాలయోద్యమము అమెరికాదేశమున విశేషమైన అభివృద్ధినొంది ప్రత్యేకకళయై విరాజిల్లుచుండుటచే ఈవాటికన్ గ్రంథాలయపునర్నిర్మాణవిషయమున పోప్ అమెరికన్ నిపుణుల సాహాయ్యము నర్థించెను. పుస్తకములు వాతావరణమునందలి వేడికి, శీతలమునకు చెడిపోకుండునట్లు అమెరికాదేశమునందలి నగరరాజములలో నొకటియగు చికాగోగ్రంథాలయమున శాస్త్రసమ్మతమైన ఏర్పాటులుగావింపబడినవి. ఇట్టి ఏర్పాటులు ఈగ్రంథాలయమునందును సమకూర్ప సంకల్పించియున్న కారణముచేతగూడ పోప్ ఈ విషయమున అమెరికన్

నిపుణులసాహాయ్యము నర్థించెను.

వాటికన్ గ్రంథాలయపునర్నిర్మాణ పర్యాలోచనవిషయమున రప్పింపబడిన అమెరికన్ నిపుణులలో ఆంగస్ మేక్డొనాల్డు మేటి. అతడు న్యూయార్కు నగరవాసి. గ్రంథాలయపునర్నిర్మాణపర్యాలోచనము ముగిసినపిమ్మట ఆత డిట్లు ప్రకటించెను:

విద్యుచ్ఛక్తిచే సమశీతోష్ణస్థితి కలిగించుట

'తన పరిపాలనమునకు, ఖ్యాతికి తగినట్లు క్రొత్తగ్రంథాలయము నిర్మింపబడవలయునని పోప్ సంకల్పము. అమూల్యములును, అపూర్వములును అగు తన గ్రంథసముదాయము వాతావరణమునందలి శీతోష్ణములకు చెడిపోకుండ కాపాడు ఏర్పాటుగావించుట ఆతని ప్రధానవాంఛితము. ఇటలీదేశమున తఱుచుగా గాలి ఇవతాళించుచుండును. అట్టి సమయములందు ఇవముచే గ్రంథములు ముడుచుకుపోవుట, వంకరపోవుట సంభవించుచుండును. ఆ దేశమున ఉన్నట్టుండి అప్పుడప్పుడు గాలి వేంద్రముగా వీచుచుండును. అట్టి సమయములందు పుస్తకముల బైండింగు పెట్లిపోయి, రూపుచెడి, విడిపోవుచుండును. ఇవమువలన, వేంద్రమువలన పుస్తకములు చెడిపోకుండ అరలలో సమశీతోష్ణము నిలచియుండుటకు యంత్రములు నిర్మింపబడినవి. ఈయంత్రములు విద్యుచ్ఛక్తివలన నడుపబడుచున్నవి. వాతావరణమున ఇవము హెచ్చుచో ఆయంత్రము విద్యుచ్ఛక్తిసహాయమున వేడిని కలిగించును. వాతావరణమున వేంద్రము అధికమగుచో ఆయంత్రము విద్యుచ్ఛక్తి సహాయమున నీటిఆవిరిని విరజిమ్మును. దానితో వేడితగ్గి సమశీతోష్ణము ఏర్పడును.

తమంతటతామే ఆరిపోవు దీపములు

ఈ భాండాగారమున మఱియొక క్రొత్త ఏర్పాటు ఎలక్ట్రిక్ దీపములను నియమిత కాలమున ఆర్పువిధానము. అరలయందు పుస్తకము తెచ్చుకొనుటకు పోయినపుడు ఎలక్ట్రిక్ మీటు నొక్కి దీపము వెలిగించి మరలివచ్చునపుడు దీప మార్పు మీటు నొక్కుట తఱుచు మఱచిపోవుచుందురు. మఱి ఒకరుపోయి దానినిచూచి ఆర్పువఱకును అది అట్లు వెలుగుచునేయుండునది. అందుచే విద్యుచ్ఛక్తి చాలగ ఖర్చు అగుచుండునది. ప్రస్తుతనిర్మాణమున ఇది తొలగింపబడినది. మీటునొక్కి దీపమువెలిగించి అరలోని పుస్తకము గైకొని పాఠకులు వెడలిపోవచ్చును. వెలిగించిన తరువాత ఏడు నిముసములు మాత్రము వెలిగి ఆదీపము దానియంతట అదియే ఆరిపోవును. ఈ ఏడునిముసములలో వలసిన పుస్తకమును ఎన్నుకొని తీసికొనిపోవుటకు తగిన సావకాశముండును.

పుస్తకములుంచుటకు ఏడుమైళ్ళ ఉక్కుఅరలు

సమశీతోష్ణస్థితిని కలిగించుట, దీపముల విషయమున క్రొత్తఏర్పాటు చేయుట అను రెండు విషయములందుమాత్రమేగాక పుస్తకము లుంచు తీరునందును క్రొత్త విధానమువలంబింపబడుచున్నది. విడివిడి కొయ్యబీరువాలయందు పుస్తకములుంచు విధానము విడనాడబడి, ఉక్కుతో ప్రత్యేకము అరలుగల మందిరము నిర్మింపబడినది. ఈ మందిరమున ఒకదానిపైనొకటి మూడు అంతస్థులుగలవు. ఈమూడు అంతస్థులలో ఇమిడియున్న ఉక్కుఅరల నిడివికొలత ఏడు మైళ్లు అనుటచే ఈభాండాగారము ఎంత పెద్దదిగానుండునో ఊహించుకొనవచ్చును."



స్త్రీలు
ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.



మహిళాలోకము

నేటి యుగోస్లావియా స్త్రీలు

స్త్రీలు అతిలోకసుందరులు—అత్తలు చాలమంచివారు.

యుగోస్లావియా యూరపుఖండమునందలి ప్రత్యేక రాజ్యములలో నొకటి. విస్తీర్ణము 248,050 చతురపు మైళ్ళు. జనాభా 18,000,000. బెల్‌గ్రేడ్ పట్టణము రాజధాని. దాని జనాభా 240,000.

యుగోస్లావియాస్త్రీలు ప్రపంచమునందలి వివిధ దేశపు స్త్రీలందరికంటెను గొప్ప సుందరులను ప్రఖ్యాతినార్జించియున్నారు. సూర్యాతపమున నిరంతరము పరిశ్రమించువారగుట కించిత్తు నల్లని వింతసోయగము వెలార్చు బుగ్గలతో, కళ్ళను మిలుమిట్లు గొలుపు వివిధములైన ముదురురంగు బట్టలతో బజారువెచ్చమునకై దుకాణములను చుట్టుచుండు యుగోస్లావియా సుందరులనుజూడ చాలముచ్చటగ నుండును.

యుగోస్లావియాస్త్రీల నిజస్థితిని తెలిసికొనుటకు ఆదేశపు పట్టణములనుచూచి లాభములేదు. పల్లెటిసీమలకు పోవలయును. పల్లెటిపట్టులయందు మనకు అన్ని తరగతుల స్త్రీలతోడను పరిచితి కలుగుటకు అవకాశములు విరళముగానున్నవి. గ్రామసీమలయందు ఇంకను వృద్ధాచారములే అవలంబింపబడుచున్నవి. యుగోస్లావియాస్త్రీలకు అతిథిపూజ ప్రీతికరమైనది.

ఇతర యూరోపియనుదేశములందువలె యుగోస్లావియాయందు కుటుంబజీవితము ఇంకను భ్రష్టము కాలేదు. ఆదేశమునందలి కుటుంబములలోని వివిధవ్యక్తులు అన్యోన్యవిశ్వాసము అను సూత్రముచే బంధింపబడియున్నారు. వ్యష్టికుటుంబములు ఆదేశమున అరుదు. పలుకుటుంబములు సమష్టిగా ఒక్క ఇంటనే తలుచు నివసించుచుండును. ఈసమష్టికుటుంబజీవనపద్ధతిని వారు వారిభాషలో 'జాద్రుగా' అని పిలుచుచుందురు. ఈసమష్టికుటుంబము సాధారణముగా ఒకనాయకురాలి అధికారమునకు లోగియుండును. ఈఅధికారము ఒక్కొక్కప్పుడు పురుషునిహస్తములందుండుటయుగలదు. కాని అట్లున్న నిదర్శనములు మిక్కిలి తక్కువ. శాఖోపశాఖలు ఒక్క కాండమునాశ్రయించి యున్నట్లు పలుకుటుంబములు ఒక్క గృహము నాశ్రయించి యుండును. ఇట్టి సమష్టికుటుంబములలో ఒక్కొక్కయింట నలుబదిమంది వ్యక్తులు కూడియుండుటకు పలు నిదర్శనములుగలవు.

ఈ విశేషసంఖ్య వ్యక్తులపై ఆగృహయజమానురాలికి నిరంకుశాధికారముగలదు. యజమానురాండ్రు సాధారణముగ నడివయస్సుగల విధవరాండ్రై యుందురు. సర్వవిషయములను ఆమెయే చర్చించి నిర్ణయించును. పొలములో పనిచేయుటకు ఎవరుపోవలయును, ఇంటిదగ్గరనుండి ఎవరు పనిచేయవలయును మున్నగు స్వల్పవిషయములుకూడ ఆమెయే నిర్ధరించును. ఎట్టి చిర్రుబుర్రులును లేక ఈపద్ధతి సుఖముగ సాగి పోవుచుండును. ఏమన ఆమెచెప్పినదానికి ఎదురుచెప్పు తలంపు ఆవ్యక్తులకు కలలోగూడ నుండదు.

యూరపుఖండమునందలి వివిధదేశములలోని గృహములందు అలుమగల తగవులనుగూర్చి మనము తలుచు వినుచుందుము. యుగోస్లావియాదేశమున గృహములందు అలుమగల తగవులు చాలఅరుదు. భార్యవాంఛలు భర్తవాంఛలతో జతపడక పోయినచో ఇతర దేశములందు ఆవిషయము రచ్చకెక్కును. యుగోస్లావి

యలో ఆవిషయము యజమానురాలికి నివేదింపబడును. ఆమె వెంటనే దానినిగూర్చి పూర్తి పర్యాలోచనము సల్పి పరిష్కరించును. ఆమాతృశ్రీనిర్ణయమునకు ఆ ఆలుమగలు మాటలాడక తలయొగ్గుదురు.

పెద్దయింటినుండి విడివడిన ప్రత్యేకమందిర మొకటి భార్యకు ప్రత్యేకింపబడును. ఏకాంతవాసమును గోరు సమయములందు ఆమె నిరభ్యంతరముగ ఆ మందిరమునకు పోయి విశ్రాంతిగొనవచ్చును. కాని యుగోస్లావియా స్త్రీలు ఏకాంతవాసమును గోరరు. ఎల్ల వేళల చుట్టపక్కములతో కలిసిమెలిసి యుండుటకే వారు ముచ్చటపడుదురు. సాధారణముగ వారికి తీరిక యుండదు. అగుటచే ఏకాంతవాసముపై వారికి మనసు పోదు. పొలముపనినిగాని, ఇంటిపనినిగాని వారు వతములప్రకారముగా చేసికొందురు. ఆపెద్దయింట వారివారి అభిరుచులకు సరిపోవు వివిధములైన పనులు అన్ని సమయములందును ఏర్పడియుండును.

ఒకయింట రెండుకొప్పులు ఇముడవను సామెత తెనుగునందు గలదు. ఆ అర్థమును తెలుపు సామెతలు ఇతరభాషలందును గలవు. స్త్రీలలో అన్యోన్యసామరస్యము లేకుండుట ఇట్టి ప్రతిదేశపువాఙ్మయమును సాక్ష్యమిచ్చుచున్నది. ప్రతిదేశపువాఙ్మయమునందును అత్తల చెడ్డతనమునుగూర్చిన ప్రస్తావనలు విశేషముగానే యున్నవి. ప్రపంచమునందలి వివిధదేశములలో అత్తలు మంచివారైయున్న దేశము ఈ యుగోస్లావియా దేశము ఒక్కటియే. వివిధదేశములందలి జనపదములందు వ్యాప్తములైయున్న పాటలను, పదములను సేకరించు పనిమీద వివిధదేశసంచారమును గావించిన జూలియా ఘాటర్‌టన్ యుగోస్లావియాదేశమున ప్రయాణము సల్పుచు ఒకరియింటవిడిసి వారికి ఆంగ్లనాటకము నొకటి చదివి వినిపించెను. అందు అత్తల చెడ్డతనమును గూర్చి ప్రస్తావనగలదు. దానికి ఆయుగోస్లావియా కుటుంబమునందలి వ్యక్తులు అత్యాశ్చర్యమును జూపిరి. తమ జాద్రుగా కుటుంబములయందు అత్తలు ఎట్లు మంచివారైయున్నారో వారు విసుగెఱుంగక ఆతనికి వర్ణించిరి. అత డీవిషయమునుగూర్చి 'ఈవినింగున్యూస్' పత్రికలో ప్రత్యేకవ్యాసమును వ్రాసెను.

వారు అరుణోదయమగుటతోడనే పడకనుండి లేతురు. అవసరమగుచో మగవారితో కలిసి పొలములకు ముంతబాళ్ళతో చేరుదురు. ప్రాతఃకాలమునకు, మధ్యాహ్నమునకు కలిపి వారికి ఒక్కటే భోజనము. ఆ భోజనము తఱచుగా మేకపాలు, రొట్టె, అపుడపుడు వెన్న వీనితోగూడియుండును. రాత్రిభోజనము ఇంటికడ్డ. పందిమాంసము, గ్రుడ్లు మొదలైనవి అప్పటి ఆహారపదార్థములు. చిన్నపిల్లలు సయితము బ్రాందిత్రాగుదురు. వృథాకాలక్షేపము యుగోస్లావియా స్త్రీలకు సరిపడదు. గొఱ్ఱెలను కాచునపుడు పడుచులు, పాఠశాలకుపోవు బాలికలు కాలము వ్యర్థపడకుండుటకై చిన్నచిన్న పంటికోలలకు నూలుచుట్టుచుందురు.

అచట పెళ్ళిళ్ళు పెద్దలే నిర్ణయింతురు. వధూవరులతో నెట్టి సంప్రదింపునులేదు. కన్య వివాహయోగ్య కాగా ఇంటి వీధికిటికీయందు ఒక బొమ్మను వ్రేలాడదీతురు. తమకొమారులకు వివాహము చేయదలచియున్న తండ్రివచ్చి ఇచట సంప్రదింపవచ్చుననుట కది గుఱుతు. పెండ్లిదినమున చర్చికిపోవుటకుముందు మామయింట వధూవరులు కలసికొందురు. పాశ్చాత్యపద్ధతికి విరుద్ధముగా చర్చికి వధువే ముందుపోవును. చర్చికిపోవుటకు ముందు వధువునకు ఆమెతోబుట్టువు ఒక నాణెము నిచ్చును. అది ఆమె నాలుకక్రింద పెట్టుకొని యుంచుకొనవలయును. వివాహకాండపూర్తియగువఱకు అది పాయరాని తారుతు ఇంటిదడిలో తనస్నేహితుడు గావించిన కంతకుండ పెండ్లికుమారుడు అందఱికి అఖరున చర్చికి ప్రయాణమగును.

చర్చినుండి తిరిగివచ్చునపుడు పెండ్లికూతురు ఒకదారిని, పెండ్లికుమారుడు వేఱొకదారిని ఇంటికి వత్తురు. ఎముక అచట దుశ్శకునము. వధూవరులు కలిసివచ్చుచో దారిలో ఎవరైన ఎముకపెట్టిన వారికి మరణము కలుగునని యుగోస్లావియా దేశీయుల నమ్మకము. భార్యాభర్తల మొదటిభోజనము ఏకాంతమున. అంతయు మధురపదార్థమే. వారిజీవితమంతయు ఇట్లు మధురమై యుండగల వాంఛను సూచించుటకైన దీయేర్పాటు.

ఆరోగ్యవిజ్ఞానము

క. తేనెయొక్క ఆహారపు విలువ

శక్తిని ఉత్పాదించు ఆహారపదార్థములలో తేనె ఉత్కృష్టమైనది. సులభముగా జీర్ణమై శరీరమున శీఘ్రముగ వ్యాపించు చక్కెరపదార్థములతో తేనె నిండారియున్నది. ఇతరవిధములయిన చక్కెరలు తేనెలో నుండు సాధారణమైన చక్కెరపదార్థములుగా మారుటకు ఆమాశయమునందును, ప్రేగులయందును స్రవించు ద్రవములతో మేళవింపు నొందవలసిన యక్కఱగలదు. రోగమువలన గాని, వృద్ధాప్యమువలన గాని జీర్ణకోశముయొక్కస్థితి చెడియున్నప్పుడు తేనె—సులభముగా జీర్ణమగునదగుట—విలువదైన ఆహారపదార్థమగుచున్నది. జీర్ణకోశమునకు విశేషము పని కల్పించకయే శరీరమున జీరణమగునదగుట తేనె శిశువులకు, పిల్లలకు మంచిఆహారమగునని అమెరికను డాక్టరొకడు చెప్పుచున్నాడు. కసరత్తుచేయువారి ఆహారపదార్థములందు తేనె తప్పక చేర్పబడవలయును. మల్లులుగావించు విశేషమైన దేహపరిశ్రమవలన వారి కండరములందును, రక్తమునందునుగల చక్కెరలు త్వరత్వరగా విలుప్తమగుచుండును. వాని స్థానమున క్రొత్తగా చక్కెరపదార్థములు కలిగించుటకు తేనెకు మించిన ఆహారపదార్థము మఱియొకటి లేదని రూఢిగ చెప్పవచ్చును.

క. మేకపాలు సౌందర్యవర్ధకములు

బ్రిటిష్‌గోట్ సొసైటీవారి జర్నలులో ఆ పత్రికా సంపాదకులగు ఎ. జె. ఫామరుగారు ఇట్లు వ్రాయుచున్నారు: "బ్రిటనుదేశమున ఇప్పుడు మేకపాలు విశేషముగ త్రాగు ఆచారము ఏర్పడియున్నది. ఈ దేశమున ఇరువది యేండ్లకు క్రితము ఏడాదికి 2,000,000 గాలనుల మేకపాలు ఉత్పత్తిచేయబడు చుండెను. ఆరేండ్లక్రితము ఈ ఉత్పత్తి 12 000,000 గాలనులకు పెరిగెను. నేడు 20,000,000 గాలనుల మేకపాలు ఉత్పత్తి చేయబడుచున్నవి. ఆవుపాలకంటె మేకపాలు సులభముగా జీర్ణమగునవియగుట—వెన్న సంబంధమైన కొవ్వు వీనియందు విశేషముగానుండుట—క్షయకారకక్రిములకు ఇవి దూరమైనవగుట—ఆవును పెంచుటకంటె మేకను పెంచుట చవుకయగుట—ఆవు మొదలగువాని దూడలు, గొఱ్ఱెపిల్లలు, గుఱ్ఱము మొదలగువానిపిల్లలు, పందిపిల్లలు మున్నగువానికి పాలదాదిగా మేక పనికిరాగలిగియుండుట—ఈ కారణములకు తోడు మేకపాలు సౌందర్యవర్ధకములగుట ఈ దేశమున మేకలను పెంచుటకు ప్రత్యేకహేతువగుచున్నది. దినమునకు మూడునాలుగుసారులు తమ మొగములను, కంఠములను, ముంజేతులను మేకపాలతో తడుపు కొనుచు కొంచముసేపుండి కడిగివైచికొనుచుండ వలయును. ఇట్లుచేయుటచే చర్మము నునుపుదేరి మంచి కాంతిని పొందుచున్నది. సౌందర్యపోషణము నిమిత్తము స్త్రీలు ముఖ్యముగా మేకపాల నాశ్రయించుట వాంఛనీయమని ఇచటి డాక్టరులు పలువురు పత్రికలలో వ్రాయుచుండుట పత్రికాపాఠకులెల్లరును గమనించియే యుందురు."

క. రోగులకు ఆహారమిచ్చుటలో చూపవలసిన మెలకువలు

'నీబలమును నిలుపుకొనుటకు నీవు ఆహారమును గొనవలయును' అనునది ఎల్లరెఱింగిన సత్యము. 'నీవు నీరసముగానున్నచో పలువురు నీవు తగినంత ఆహారమును తీసికొనుటలేదని తలంతురు. బలమును పొందు

టకు నీవు ఎక్కువగా తినవలయును' అనునది పలువురి అభిప్రాయమైయున్నది. కాని ఆరోగ్యశాస్త్రవేత్తల అభిప్రాయమున ఇదియొక దురభిప్రాయమైయున్నది. ఈదురభిప్రాయము ననుసరించి వర్తించుచుండుటచేతనే పలువురు ఆజన్మము బలహీనులై యుండుచున్నారు. తినుటకును, జీర్ణించుకొనుటకును సన్నిహిత సంబంధము కలదని ప్రాయికముగా గుర్తింపబడదు. జీర్ణకోశమును ఆహారముతో నింపినమాత్రమున అది బాగుగా అరిగి శరీరమునకు శక్తినొసంగు పదార్థముగా మారుననుకొనుటకు వీలుచాలదు. ఆహారమును లోగొనుటకు ఆవశ్యకత, దానిని జీర్ణముచేసికొనజాలుటకు శక్తి ఉండవలయును. జీర్ణించుకొనుటకు శక్తి చాలనిస్థితిలో అన్నాశయమును ఆహారముతో నింపుట విషము ఉత్పత్తి అగుటకు అవకాశము కల్పించుటయే. అది శరీరమునకు అనవసరపదార్థము. దానిని శరీరమునుండి పూర్తిగ వెలిక్రోసివేయవలయును. కాని అది తరుచు ప్రేగులలో చేరి నిలవయుండి కుళ్ళి విషముల నుత్పన్నముచేయును. ఆవిషములు శరీరమున విపులముగా వ్యాపించి దుస్సాధ్యరోగములను పుట్టించుటకు కారణభూతములగుచున్నవి. ఇట్టిపరిస్థితులలో రక్తము చెడిపోవును. ఈ విషము ఆహారకోశమునుండి వెలువడును. ముసిడిసత్తు విషముకంటె కూడ నిది తీవ్రతరమైయుండును.రోగి ఉదరమున ఇట్టి విషము ఉత్పన్నమగుట ఎంతటి ప్రాణాంతకమో సులభముగ నిర్ణయించుకొనవచ్చును. ఇట్టి విషముల పుట్టుకచే రోగి మరింత నీరసించుచున్నాడు; శక్తి మరింత చెదరుచున్నది; ఆకలి బొత్తిగా కొఱవడుచున్నది; ఆహారముపై ఏమాత్రము తలంపు పోవుట లేదు. ఇట్టిస్థితిలోకూడ రోగికి ఏదైన ఆహార మీయవలయునను ప్రయత్నము వైద్యుడును, రోగి బంధువులును కూడ చేయుచున్నారు.రోగికి ఆహారమిచ్చుట ఒక గొప్ప విషమపరీక్ష. ఆహారముయొక్క ప్రధానతత్త్వమును ఏమఱిన వైద్యుడు తన అవ్యక్తతచే ఒక్కొక్కప్పుడు రోగి ప్రాణములను పోగొట్టును. ఇట్టి ప్రమాదములచేతనే రోగులలో పలువురి మరణములు సంభవించుచుండునని నా అభిప్రాయము. ఆమయస్థితిలోగాని నిరామయస్థితిలోగాని ఆకలిలేకనే ఆహారము నెన్నడును గైకొనరాదు; తిని అరగించుకొని అనుభవించగలుగుదునను ధైర్యములేనిదే ఆహారము చేకొనరాదు. ఆరోగ్యస్థితిలో నున్నవాడు ఆకలిలేనప్పుడు ఆహారము గైకొనుటచే తోడనే ప్రమాదము కలుగక పోవచ్చును. రోగస్థితిలో నున్నవాడుమాత్రము ఆకలిలేనప్పుడు ఆహారమును బొత్తిగా దరికి చేరనీయకుండుటను మఱువరాదు. బలమును నిలుపుకొనుటకు అవశ్యము ఆహారమును గైకొనవలసినదే. కాని ఆగైకొనుటలో విశేషమైన మెలకువను చూపవలయును. తినిన ఆహారము తప్పక జీర్ణమగునని ధైర్యము చిక్కినప్పుడును, శరీరము ఎక్కువ పోషణపదార్థమును కోరుచున్నదని తోచినప్పుడును అగ్నిబలము ననుసరించి అధికాహారమును గొనవలయును. మిగిలినసమయములందు ఆహారమును గొనుట విషమును మెక్కుటయే. రోగులకు ఆహారమొసంగునపుడు ఆహారపదార్థముల విపుల విజ్ఞానమును కలిగియుండుట అతిముఖ్యము. బలముకాని నీరసముకాని ఆహారపదార్థములవలననే కలుగుననియు, బ్రతుకుట గాని మరణించుటగాని ఆహారపదార్థములవలననే సంభవించుననియు జ్ఞప్తియందుంచుకొనవలయును. హితమైన ఆహారమును మాత్రమే ఈయవలయుననియు, హితముకాని ఆహారమును ప్రయత్నపూర్వకముగా విడనాడవలయుననియు ఎన్నడును మఱచిపోగూడదు."

—బెర్నార్డు మాక్ ఫేడెన్.

౯. చర్మరోగులు : సి. విటమిను

విటమినులలో సి. విటమిను రక్తశుద్ధిచేసి రక్తమును ఆరోగ్యస్థితిలోనుంచును; శరీరమును అంటురోగములనుండి కాపాడును. చర్మరోగములు, సెగగడ్డలు, కురుపులు సి. విటమినుగల పదార్థములను భుజించుటచే తప్పక కుదురును. సీమవంకాయలు, నీరుల్లిపాయలు, నిమ్మకాయలు, నారింజకాయలు, కాబేజీ వీనియందు సి. విటమినులు విశేషించియున్నవి. పెసలు మొదలగు పప్పుగింజలయందు మొక్కలు మొలచుస్థితిలో సి. విటమినులు విస్తరించియుండును. సి. విటమిను చర్మరోగుల పాలిటి వరప్రసాదము.

వాటికన్ గ్రంథాలయ పునర్నిర్మాణము

వాటికన్, అందలి గ్రంథాలయము

'వాటికన్' అనునది ఒక నగరనామము. అది రోము దేశమునగలదు. రోమన్ కాథొలిక్ మతస్థుల పీఠాధిపతియగు పోప్ కాపురపుకాణాచి. ఆనగరరాజ్యమున పోప్‌నకు నిరంకుశాధికారము గలదు దాని వైశాల్యము 108 యకరములు. జనాభా 900 మంది. ప్రపంచమునందలి ప్రాచీనగ్రంథాలయములలో వాటికన్ గ్రంథాలయ మొకటి. ఆగ్రంథాలయము ఈనడుమ పునర్నిర్మాణముగావింపబడినది. గ్లాస్గోనగరమునుండి ప్రచురింపబడుచున్న 'ఈవినింగున్యూస్' పత్రిక ఆపునర్నిర్మాణవిధానమునుగూర్చి విపులముగ నిట్లు ప్రచురించుచున్నది.

పునర్నిర్మాణావశ్యకత

"వాటికన్ గ్రంథాలయమున అతి ప్రాచీనమైనవి, అమూల్యములైనవినగు పలు గ్రంథములుగలవు. కట్టడము మిక్కిలి పురాతనమైనది. గతవత్సరప్రారంభమున గోడలు కూలుననుభయముతోచెను. అమెరికా దేశమునుండి వాస్తుశాస్త్రజ్ఞుని ఒకనిని రప్పించి నూతన భవన నిర్మాణమునకు మదింపులు తయారుచేయించుచుండిరి. ఇంతలో గతవత్సరపు క్రిస్టమసు పండుగుల ముందు ఆగ్రంథాలయభవనకుడ్యములు కూలిపోయెను. అప్పుడు లిఖితపుస్తకములన్నియు పరిరక్షింపబడినవి కాని అచ్చుపుస్తకములు కొన్నియు, పింగాణీసామగ్రికొంతయు పాడయ్యెను.

గ్రంథాలయాధికారి

పోప్ పదునొకండవ పయస్ గ్రంథాలయాధికారి. అతడు వెనుక మిలాన్ నందలి యాంబ్రోషియన్ గ్రంథాలయమున పాలకుడుగానుండెను. 'పోప్'అధికారమునుపొందకపూర్వము అతడు ఈవాటికన్ గ్రంథాలయమునగూడ కొంతకాలము పనిచేసియుండెను. పుస్తకపఠనము అతని అభిమానవిద్య. పోప్ అధికారమును పొందినపిమ్మట కూడ తన తీరికసమయములందెల్ల నాతఁడీగ్రంథాలయమున గడుపుచుండును. వాటికన్ గ్రంథాలయమునందలి గ్రంథనిక్షేపముయొక్క భవిష్యత్తును గూర్చి పోప్ ఆలోచనాపరుడైయుండెను.

అమెరికన్ నిపుణుల సాహాయ్యము

గ్రంథాలయోద్యమము అమెరికాదేశమున విశేషమైన అభివృద్ధినొంది ప్రత్యేకకళదై విరాజిల్లుచుండుటచే ఈవాటికన్ గ్రంథాలయపునర్నిర్మాణవిషయమున పోప్ అమెరికన్ నిపుణుల సాహాయ్యము నర్థించెను. పుస్తకములు వాతావరణమునందలి వేడికి, శీతలమునకు చెడిపోకుండునట్లు అమెరికాదేశమునందలి నగరరాజములలో నొకటియగు చికాగోగ్రంథాలయమున శాస్త్రసమున్నతమైన ఏర్పాటులుగావింపబడినవి. ఇట్టి ఏర్పాటులు ఈగ్రంథాలయమునందును సమకూర్ప సంకల్పించియున్న కారణముచేతగూడ పోప్ ఈ విషయమున అమెరికన్

నిపుణులసాహాయ్యము నర్థించెను.

వాటికన్ గ్రంథాలయ పునర్నిర్మాణ పర్యాలోచనవిషయమున రప్పింపబడిన అమెరికన్ నిపుణులలో ఆంగస్ మేక్డొనాల్డు మేటి. ఆతడు న్యూయార్కు నగర వాసి. గ్రంథాలయపునర్నిర్మాణపర్యాలోచనము ముగిసినపిమ్మట ఆత డిట్లు ప్రకటించెను :

విద్యుచ్ఛక్తిచే సమశీతోష్ణస్థితి కలిగించుట

'తన పరిపాలనమునకు, పాయికి తగినట్లు క్రొత్తగ్రంథాలయము నిర్మింపబడవలయు నని పోప్ సంకల్పము. అమూల్యములును, అపూర్వములును అగు తన గ్రంథసముదాయము వాతావరణమునందలి శీతోష్ణములకు చెడిపోకుండ కాపాడు ఏర్పాటుగావించుట ఆతని ప్రధానవాంఛితము. ఇటలీదేశమున తఱుచుగా గాలి ఇవతాళించుచుండును. అట్టి సమయములందు ఇవముచే గ్రంథములు ముడుచుకుపోవుట, వంకరపోవుట సంభవించుచుండును. ఆదేశమున ఉన్నట్టుండి అప్పుడప్పుడు గాలి వేంద్రముగా వీచుచుండును. అట్టి సమయములందు పుస్తకముల బైండింగు పెట్లిపోయి, రూపుచెడి, విడిపోవుచుండును. ఇవమువలన, వేంద్రమువలన పుస్తకములు చెడిపోకుండ అరలలో సమశీతోష్ణము నిలచియుండుటకు యంత్రములు నిర్మింపబడినవి. ఈయంత్రములు విద్యుచ్ఛక్తివలన నడుపబడుచున్నవి. వాతావరణమున ఇవము హెచ్చుచో ఆయంత్రము విద్యుచ్ఛక్తిసహాయమున వేడిని కలిగించును. వాతావరణమున వేంద్రము అధికమగుచో ఆయంత్రము విద్యుచ్ఛక్తి సహాయమున నీటిఆవిరిని విరజిమ్మును. దానితో వేడితగ్గి సమశీతోష్ణము ఏర్పడును.

తమంతటతాము ఆరిపోవు దీపములు

ఈ భాండాగారమున మఱియొక క్రొత్త ఏర్పాటు ఎలక్ట్రిక్ దీపములను నియమిత కాలమున ఆర్పువిధానము. అరలయందు పుస్తకము తెచ్చుకొనుటకు పోయినపుడు ఎలక్ట్రిక్ మీటు నొక్కి దీపము వెలిగించి మరలివచ్చునపుడు దీప మార్పు మీటు నొక్కుట తఱుచు మఱచిపోవుచుందురు. మఱి ఒకరుపోయి దానినిచూచి ఆర్పువఱకును అది అట్లు వెలుగుచుశేయుండునది. అందుచే విద్యుచ్ఛక్తి చాలగ ఖర్చు అగుచుండునది. ప్రస్తుతనిర్మాణమున ఇది తొలగింపబడినది. మీటునొక్కి దీపమువెలిగించి అరలోని పుస్తకము గైకొని పాఠకులు వెడలిపోవచ్చును. వెలిగించిన తరువాత ఏడు నిముసములు మాత్రము వెలిగి ఆదీపము దానియంతట అదియే ఆరిపోవును. ఈ ఏడునిముసములలో వలసిన పుస్తకమును ఎన్నుకొని తీసికొనిపోవుటకు తగిన సావకాశముండును.

పుస్తకములుంచుటకు ఏడుమైళ్ళ ఉక్కుఅరలు

సమశీతోష్ణస్థితిని కలిగించుట, దీపముల విషయమున క్రొత్తఏర్పాటు చేయుట అను రెండు విషయములందుమాత్రమేగాక పుస్తకము లుంచు తీరునందును క్రొత్త విధానమవలంబింపబడుచున్నది. విడివిడి కొయ్యబీరువాలయందు పుస్తకములుంచు విధానము విడనాడబడి, ఉక్కుతో ప్రత్యేకము అరలుగల మందిరము నిర్మింపబడినది. ఈ మందిరమున ఒకదానిపై నొకటి మూడు అంతస్థులుగలవు. ఈమూడు అంతస్థులలో ఇమిడియున్న ఉక్కుఅరల నిడివికొలత ఏడు మైళ్లు అనుటచే ఈభాండాగారము ఎంత పెద్దదిగానుండునో ఊహించుకొనవచ్చును."





మహిళాలోకము

నేటి యుగోస్లావియా స్త్రీలు

స్త్రీలు అతిలోకసుందరులు—అత్తలు చాలమంచివారు.

యుగోస్లావియా యూరపుఖండమునందలి ప్రత్యేక రాజ్యములలో నొకటి. విస్తీర్ణము 248,050 చతురపు మైళ్ళు. జనాభా 18,000,000. బెల్‌గ్రేడ్ పట్టణము రాజధాని. దాని జనాభా 240,000.

యుగోస్లావియాస్త్రీలు ప్రపంచమునందలి వివిధ దేశపు స్త్రీలందరికంటెను గొప్ప సుందరులను ప్రఖ్యాతి నార్జించియున్నారు. సూర్యాతపమున నిరంతరము పరిశ్రమించువారగుట కించిత్తు కమిలి వింతసోయగము వెలార్చు బుగ్గలతో, కళ్ళను మిఱుమిట్లు గొలుపు వివిధములైన ముదురురంగు బట్టలతో బజారువెచ్చమునకై దుకాణములను చుట్టుచుండు యుగోస్లావియా సుందరులను చూడ చాలముచ్చటగ నుండును.

యుగోస్లావియాస్త్రీల నిజస్థితిని తెలిసికొనుటకు ఆదేశపు పట్టణములనుచూచి లాభములేదు. పల్లెటి సీమలకు బోవలయును. పల్లెటిపట్టులయందు మనకు అన్ని తరగతుల స్త్రీలతోడను పరిచితి కలుగుటకు అవకాశములు విరళముగానున్నవి. గ్రామసీమలయందు ఇంకను వృద్ధాచారములే అవలంబింపబడుచున్నవి. యుగోస్లావియాస్త్రీలకు అతిథిపూజ ప్రీతికరమైనది.

ఇతర యూరోపియను దేశములందువలె యుగోస్లావియాయందు కుటుంబజీవితము ఇంకను భ్రష్టము కాలేదు. ఆదేశమునందలి కుటుంబములలోని వివిధవ్యక్తులు అన్యోన్యవిశ్వాసము అను సూత్రముచే బంధింపబడియున్నారు. వ్యష్టికుటుంబములు ఆదేశమున అరుదు. పలుకుటుంబములు సమష్టిగా ఒక్క ఇంటనే తఱుచు నివసించుచుండును. ఈసమష్టికుటుంబజీవనపద్ధతిని వారు వారిభాషలో 'జాడ్రుగా' అని పిలుచుచుందురు. ఈసమష్టికుటుంబము సాధారణముగా ఒకనాయకురాలి అధికారమునకు లోగియుండును. ఈఅధికారము ఒక్కొక్కప్పుడు పురుషునిహస్తములందుండుటయుగలదు. కాని అట్లున్న నిదర్శనములు మిక్కిలి తక్కువ. శాఖోపశాఖలు ఒక్క కాండము నాశ్రయించి యున్నట్లు పలుకుటుంబములు ఒక్కగృహము నాశ్రయించి యుండును. ఇట్టి సమష్టికుటుంబములలో ఒక్కొక్క యింట నలుబదిమంది వ్యక్తులు కూడియుండుటకు పలు నిదర్శనములుకలవు.

ఈ విశేషసంఖ్య వ్యక్తులపై ఆగృహయజమానురాలికి నిరంకుశాధికారముగలదు. యజమానురాండ్రు సాధారణముగ నడివయస్సుగల విధవరాండ్రై యుందురు. సర్వవిషయములను ఆమెయే చర్చించి నిర్ణయించును. పొలములో పనిచేయుటకు ఎవరుపోవలయును, ఇంటిదగ్గరనుండి ఎవరు పనిచేయవలయును మున్నగు స్వల్పవిషయములుకూడ ఆమెయే నిర్ధరించును. ఎట్టి చిఱుబుస్సలును లేక ఈపద్ధతి సక్రమముగ సాగి పోవుచుండును. ఏమన ఆమెచెప్పినదానికి ఎదురుచెప్పు తలంపు ఆవ్యక్తులకు కలలోగూడ నుండదు.

యూరపుఖండమునందలి వివిధదేశములలోని గృహములందు ఆలుమగల తగవులనుగూర్చి మనము తఱుచు వినుచుందుము. యుగోస్లావియాదేశమున గృహములందు ఆలుమగల తగవులు చాలఅరుదు. భార్యవాంఛలు భర్తవాంఛలతో జతపడక పోయినచో ఇతర దేశములందు ఆవిషయము రచ్చకెక్కును. యుగోస్లావి

యలో ఆవిషయము యజమానురాలికి నివేదింపబడును. ఆమె వెంటనే దానినిగూర్చి పూర్తి పర్యాలోచనము సల్పి పరిష్కరించును. ఆమాతృశ్రీనిర్ణయమునకు ఆ ఆలుమగలు మాటలాడక తలయొగ్గుదురు.

పెద్దయింటినుండి విడివడిన ప్రత్యేకమందిర మొకటి భార్యకు ప్రత్యేకింపబడును. ఏకాంతవాసమును గోరు సమయములందు ఆమె నిరభ్యంతరముగ ఆ మందిరమునకు పోయి విశ్రాంతిగొనవచ్చును. కాని యుగోస్లావియా స్త్రీలు ఏకాంతవాసమును కోరరు. ఎల్లవేళల చుట్టుపక్కములలో కలసిమెలసి యుండుటకే వారు ముచ్చటపడుదురు. సాధారణముగ వారికి తీరిక యుండదు. అగుటచే ఏకాంతవాసముపై వారికి మనసు పోదు. పొలముపనినిగాని, ఇంటిపనినిగాని వారు వతనులప్రకారముగా చేసికొందురు. ఆపెద్దయింట వారివారి అభిరుచులకు సరిపోవు వివిధములైన పనులు అన్ని సమయములందును ఏర్పడియుండును.

ఒకయింట రెండుకొప్పులు ఇముడవను సామెత తెనుగునందు గలదు. ఆ అర్థమును తెలుపు సామెతలు ఇతరభాషలందును గలవు. స్త్రీలలో అన్యోన్యసామరస్యము లేకుండుట ఇట్లు ప్రతిదేశపువాఙ్మయమును సాక్ష్యమిచ్చుచున్నది. ప్రతిదేశపువాఙ్మయమునందును అత్తల చెడ్డతనమునుగూర్చిన ప్రస్తావనలు విశేషముగానే యున్నవి. ప్రపంచమునందలి వివిధదేశములలో అత్తలు మంచివారైయున్న దేశము ఈ యుగోస్లావియా దేశము ఒక్కటియే. వివిధదేశములందలి జనపదములందు వ్యాప్తములైయున్న పాటలను, పదములను సేకరించు పనిమీద వివిధదేశసంచారమును గావించిన జూలియా ఛాటర్టన్ యుగోస్లావియాదేశమున ప్రయాణము సల్పుచు ఒకరియింటవిడిసి వారికి ఆంగ్లనాటకము నొకటి చదివి వినిపించెను. అందు అత్తల చెడ్డతనమును గూర్చి ప్రస్తావనగలదు. దానికి ఆయుగోస్లావియా కుటుంబమునందలి వ్యక్తులు ఆశ్చర్యమును జూపిరి. తమ జాగ్రముగా కుటుంబములయందు అత్తలు ఎట్లు మంచివారైయున్నారో వారు విసువెఱుంగక అతనికి వర్ణించిరి. ఆత డీవిషయమునుగూర్చి 'ఈవినింగున్యూస్' పత్రికలో ప్రత్యేకవ్యాసమును వ్రాసెను.

వారు అరుణోదయమగుటతోడనే పడకనుండి లేతురు. అవసరమగుచో మగవారితోకలసి పొలములకు ముంతలరాళ్ళతో చేరుదురు. ప్రాతఃకాలమునకు, మధ్యాహ్నమునకు కలిసి వారికి ఒక్కటే భోజనము. ఆ భోజనము తరుచుగా మేకపాలు, రొట్టె, అపుడపుడు వెన్న వీనితోగూడియుండును. రాత్రిభోజనము ఇంటివద్ద. పందిమాంసము, గ్రుడ్లు మొదలైనవి అప్పటి ఆహారపదార్థములు. చిన్నపిల్లలు సయితము బ్రాందిత్రాగుదురు. వృథాకాలాక్షేపము యుగోస్లావియా స్త్రీలకు సరిపడదు. గొర్రెలను కాచునపుడు పడుచులు, పాఠశాలకుపోవు బాలికలు కాలము వ్యర్థపడకుండుటకై చిన్నచిన్న పంటికోలలకు నూలుచుట్టుచుందురు.

అచట పెళ్ళిళ్ళు పెద్దలే నిర్ణయింతురు. వధూవరులతో నెట్టి సంప్రదింపునులేదు. కన్య వివాహయోగ్య కాగా ఇంటి వీధికిటికీయందు ఒక బొమ్మను వ్రేలాడదీతురు. తమకొమారులకు వివాహము చేయదలచియున్న తండ్రివచ్చి ఇచట సంప్రదింపవచ్చుననుట కిది గుఱుతు. పెండ్లిదినమున చర్చికిపోవుటకుముందు మామయింట వధూవరులు కలసికొందురు. పాశ్చాత్యపద్ధతికి విరుద్ధముగా చర్చికి వధువే ముందుపోవును. చర్చికిపోవుటకు ముందు వధువునకు ఆమెతోబుట్టువు ఒక నాణెము నిచ్చును. అది ఆమె నాలుకక్రింద పెట్టుకొని యుంచుకొనవలయును. వివాహకాండపూర్తియగువఱకు అది పాయరాని తాయెతు. ఇంటిదడిలో తనస్నేహితుడు గావించిన కంతకుండ పెండ్లికుమారుడు అందఱికి ఆఖరున చర్చికి ప్రయాణమగును.

చర్చినుండి తిరిగివచ్చునపుడు పెండ్లికూతురు ఒకదారిని, పెండ్లికుమారుడు వేఱొకదారిని ఇంటికి వత్తురు. ఎముక అచట దుశ్శకునము. వధూవరులు కలిసివచ్చుచో దారిలో ఎవరైన ఎముకపెట్టిన వారికి మరణము కలుగునని యుగోస్లావియా దేశీయుల నమ్మకము. భార్యాభర్తల మొదటిభోజనము ఏకాంతమున. అంతయు మధురపదార్థమే. వారిజీవితమంతయు ఇట్లు మధురమై యుండగల వాంఛను సూచించుటకైన దీయేర్పాటు.

ఆంధ్రభూమి ఈ ప్రయత్నం చేయగలదని తలంచుచున్నాను."

—విదమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

* * *

పాశ్చాత్యనవలాకారులు :
పుస్తకములు వ్రాసేతీరు.

"ఆంగ్లమహాకవి జాన్సనువలె మిద్దెమీదిగదిలో కూర్చుని ఆకుపచ్చని తేయాకు, నల్లటికాఫీ త్రాగుచు నిరంతరము పనిచేసి వారము దినములలో 'రాసిలాస్' వంటి ఒక పుస్తకమునువ్రాసి మఱియొక పుస్తకము వ్రాయుటకు పదిఏండ్లు కష్టపడు కవులు ఇప్పుడులేరు. నేటి గ్రంథకర్తలు ఇతరవృత్తులయందలివారు పనిచేయునట్లే నియమక్రమమున సమర్థతతో పనిచేయుచున్నారు. నవీనగ్రంథకర్తలలో—కీర్తిశేషుడైన ఆర్నాల్డు బెన్నెట్టువలె—తమ మనస్సులు యంత్రమువలెనే నిరంతరము పనిచేయునని గర్వపడువారు నారొఅుకలో కనీసము పండ్రెండుగురు కలరు. రాబోవు మాసములందలి తమ సారస్వతవ్యాసంగమును వారు ముందుగనే నిర్ణయించుకొని పెట్టుకుందురు. నవలారచనకు ఇంతకాలము, పత్రికలకు వ్యాసములు వ్రాయుటకు ఇంతకాలము, నాటకరచనకు ఇంతకాలము అని ఏర్పఱచుకొందురు. కలముకంటె టైపురైటరును ప్రేమింతురు. వీలుపడినపుడెల్ల సాధారణముగ తమ కార్యదర్శులకు తాము రచించుదానిని ఉపన్యసింతురు. కొందఱు ఎట్టిచిత్తుకాపీయు లేకయే టైపురైటరు మెషిను దగ్గరకూర్చుండి తమరచనములను ఆలోచించుచు టైపు చేయుదురు. ఈపద్ధతివలన శక్తి, కాలము కూడివచ్చునని వారితలంపు. బహుళగ్రంథకర్త ఎడ్గారువేలస్ ఇదే పద్ధతి నవలంబించి రోజు ఒక్కంటికి ఇరువదివేల పదముల చొప్పున రచింపగలిగెను. హెచ్. జి. వెల్సు కొంతసేపు పెనసలు, కొంతసేపు కలము ఉపయోగించును. సాధారణముగ అతడు దినమునకు అయిదు గంటలు పనిచేయుచుండును. కాని ఒక్కొక్క రచనమున పర్యాప్తుడైయున్నపుడు ఒకేదమ్మున ఎనిమిది తొమ్మిది గంటలు పనిచేయును. అర్ధరాత్రములందు లేచి మంచిమంచి భావములను కాగితముముక్కలపై వ్రాసికొనుచుండును. గాల్సీయంవలి తనపల్లెటిగృహమున అతడు అప్పుడప్పుడు ఒక్కటాకేని పదునెనిమిది గంటలు పనిచేయును. చిన్నచిన్న కాగితముముక్కలపై తనరచనములను టైపుచేసి ఉంచుకొని పూర్తియైన తరువాత అతడు వానినన్నిటిని గుదిగ్రుచ్చును. ఓపెన్ హీమ్ అను గ్రంథకర్త దినమునకు మూడువేలు మొదలు నాలుగువేల మాటలవఱకు రచియించును. ఇందు చాలభాగము ప్రొద్దుటిపూటయందే రచింపబడును. తాను రచింపవలసినదానిని ఈతడెప్పుడును నిర్ణయించుకొనడు. ప్రథమప్రకరణమును ప్రారంభించును. తన కల్పనాశక్తి ఎట్లు గొనిపోయిన అట్లు పోవును. ఉద్రేకము కలిగినపుడుమాత్రమే పలుపుటలను వ్రాయగలవారు ఇప్పుడునుగలరు. అట్టివారిని టైపురైటరుతో తమరచనమును సాగింపమనిన వారికి సాధ్యము కాదు. ప్రఖ్యాతిగల నేటి అమెరికను రచయితలలో పలువురు కలముపట్టుటకు కక్కసించెదరు. ఎక్కడికిపోయినను ఒక పోర్టబుల్ టైపురైటరును గొనిపోవుదురు. వనసీమలయందును, నదీతీరములందును కూర్చుండి వారు తమభావములను ఆ టైపుమెషినుసాయమున లిఖితమొనర్తురు. సింక్లరులూయి అను అమెరికను గ్రంథకర్త చిత్తువ్రాసికొని పిమ్మట సాఫువ్రాసికొనును. ఒకనవల రచించుట పూర్తియైనతరువాత మఱియొక నవల రచించుటకు పూనుకొను మధ్యకాలమున స్టీఫెన్ మెక్కన్నా అను గ్రంథకర్త తన మనస్సు శాంతిపడుటకై పెక్కుదినములు శెలవులు గొనును. మఱియొక గ్రంథమునకై తానువైచిన కథయొక్క అస్థిపంజరము పూర్తియైనతోడనే తలుపువైచుకొని తనగదిలో కూర్చుండును, ఎవరికిని దర్శనమీయడు, నిరంతరము పనిచేయును, దినమునకు ఒకగంటమాత్రము షికారుపోవును. గిల్బర్టుఫ్రాంకా అత్యాశ్చర్యకరమైన త్వరరచయిత. అలసటవచ్చునంతవఱకు నాతడు ఉపన్యసించును. ఆ ఉపన్యాసము టైపుచేయబడి పిమ్మట అతని కందీయబడును. దాని నాతడు చదివి రివైజుచేయును. కొన్నికొన్ని భాగములను తిరిగి వ్రాయును, అక్కడక్కడ మెఱుగులు

దిద్దును; పిమ్మట దానిని ఒకచోట పడవైచి యుంచును. తనకు తృప్తికలుగువఱకు మెఱుగులు దిద్దుచుండును. ఫ్లాబర్టు నెమ్మదిగాను, విశేషపరిశ్రమతోడను వ్రాయువాడు. వేయిమాటలు వ్రాయగలిగినచో ఒకదినమును బాగుగా పనిచేసినట్లు అతడెంచువాడు. కిప్లింగును విడిచినచో నేటిగ్రంథకర్తలలో నెవడును ఇంతటి కొద్దిపాటి రచనమును చేసినవాడు మఱియొకడు లేడు. ఇంతమాత్రముచే పూర్వగ్రంథకారులందఱును తక్కువ పుటల రచనమును చేసినవారని అనుకొనుటకు వీలులేదు. అధునికులగు వెలెస్, ఓపెన్‌హీమ్‌లకంటె ప్రాచీనులగు డికెన్సు, ట్రాల్యమాన్, డీఫో మొదలగువారు త్వరరచయితలై యుండిరి. నవ్యపుట్టించు నవలలు రచించుటలో ప్రఖ్యాతినార్జించిన ఐరిష్ గ్రంథకర్త లీవర్ ఉదయము ఐదింటికి లేచి ఏడుగంటలవఱకు గ్రంథరచనము సాగించువాడు. ఈ రెండుగంటలకాలమును అతడు ఒక్కొక్క పావుగంటకు 250 మాటల చొప్పున రచించువాడు."

—రాల్ఫ్ డర్.

* * *

పంజాబులో ఉర్దూ పత్రికలు

ఢిల్లియందలి హిందుకాలేజిలో అధ్యాపకులగు శ్రీ ఖూల్‌చందు అనువారు పంజాబు యూనివర్సిటీ యొక్క హిస్టారికల్ సొసైటీవారి జర్నలులో ఇట్లు వ్రాయుచున్నారు: 'ఢిల్లీయందు 1887 లో స్థాపింపబడిన 'సయ్యద్ ఉల్ అక్బర్' అనునది మొదటి ఉర్దూపత్రిక. 1838 లో ఢిల్లీనుండి వెలువడనారంభించిన 'ఢిల్లీఅక్బర్' అను పత్రిక విశేషజనామోదము నందెను. ఈ పత్రికలోని సంపాదకీయములందలి వాక్యములు కొన్ని నేటికిని సామెతలుగా నిలిచియున్నవి. సిపాయీల తిరుగుబాటుకాలమున ఇది ఆగిపోయెను. పంజాబు ఉర్దూ వార్తాపత్రికల చరిత్రలలో 1850 జనవరి 14-వ తేది అతిముఖ్యమైనది.అప్పుడు లాహోరులో 'కోహినూరు' అను వారపత్రిక ప్రారంభింపబడెను. అది 1888 లో దినపత్రికయయ్యెను. 1890లో దాని సంపాదకుడు చనిపోయెను. అప్పటినుండి 1904వఱకు వారపత్రికగా నడచి ఆగిపోయెను. 'కోహినూరు' సమకాలికపత్రికలలో 'అక్బరు-ఐ-ఖాన్‌నా-ఐ పంజాబ్' ఒకటి.ఇది 1853లో లాహోరులో ప్రారంభింపబడెను. 1857 లో దీని ప్రచురణ నిరోధింపబడెను.సిపాయిల తిరుగుబాటునకుపిమ్మట ఇది సియాల్‌కోట్లులో 'విక్టోరియా' అను నామముతో తిరిగి ప్రారంభింపబడి నేటికిని సాగుచున్నది. 1870లో 'అక్బరిఆమ్' వెలువడెను. సాలు చందా రూ 2-8-0 మాత్రమే. పోస్టల్ కన్సెషన్ లేని ఆదినములలో ఇంతచవుకగ పత్రికనిచ్చుట విశేషమైనది. 1878 లో 'పైసా అక్బర్' ప్రారంభింపబడెను. కాపీఒక్కంటికి పైసా. అగుటచే దాని కాపేరు. సంపాదకునకు మంచి ఆదాయమువచ్చెను. వ్యాపారదృష్టిలో జయమునందిన ప్రథమ ఉర్దూపత్రిక ఇదియే. చాలప్రకటనలు వచ్చెను. దేశభాషాపత్రికలలో విశేషగౌరవమునందెను. 1900లో ఈపత్రికాసంపాదకుడు పాశ్చాత్యవార్తాపత్రికల నిర్వహణపద్ధతినిగూర్చి తెలిసికొనుటకు యూరపునకేగెను. 1882 లో వర్నాక్యులర్‌ప్రెస్సుఆక్టు రద్దుఅయ్యెను, దేశభాషాపత్రికలకు కూడ పోస్టల్‌కన్సెషన్ ఇచ్చిరి. యుద్ధమునకు పూర్వము ఉర్దూపత్రికలలో పేరు ప్రోసిన- వాతన్, హిందూస్థాన్, జమీందార్- అను మూడును ముఖ్యమైనవి. 1908 లో వార్తాపత్రికల శాసనమును, 1910 లో ముద్రణాశాసనమును గావింపబడెను యుద్ధకాలమున వార్తాపత్రికల ప్రచారము హెచ్చెను. పంజాబుప్రభుత్వము వారు యుద్ధవార్తలు తెలుపుటకు 'హక్' అను పేరుతో నొక దినపత్రికను ప్రారంభించిరి. దినమునకు డెబ్బదివేల కాపీలు పెలవగునవి. ప్రత్యేకసంచికలు అంతకంటె హెచ్చు సంఖ్య ఖర్చుఅగునవి. యుద్ధానంతరము ఉర్దూవార్తాపత్రికల అన్నిటి ప్రచారము అతిశయించెను. పంజాబునందలి అన్ని ఉర్దూవార్తాపత్రికల మొత్తపుగ్రాహకుల సంఖ్య 1917 లో 246,000 మంది; 1918 లో 320,000 మంది, 1919 లో 342,000 మంది; 1920 లో 358,000 మంది; నేడు దానికి రాదాపురెట్టింపు—594,000 మంది."

మణిమాల

సోమరులు చిరకాలము జీవింతురా ?

బ్రూసుబార్టన్ ఇట్లు వ్రాయుచున్నాడు : "ఈ యుగమున దేహపరిశ్రమ ఒక దేవతవలె ఆరాధింపబడుచున్నది. మనపూర్వుల మితిమీరిన దైవభక్తిని ఇప్పుడు మనలో కొందరు ఎట్లు ఈసడింతురో మనసంతతివారు మన ఇప్పటి దేహపరిశ్రమయను దేవతఆరాధనము నట్లు ఈసడింపవచ్చును. ఈ ఆరాధకులు తలుచుగా 'జంతువులను చూడుడు. అవి ఎట్లు విశేషమైన దేహపరిశ్రమను గొనుచున్నవో గమనింపుడు' అనుచుందురు. ఈ వాక్యమునందలి నిజానిజములు తెలిసికొనుటకై జార్జి జీన్‌నాథన్ అను నతడు జంతువుల దేహపరిశ్రమ విషయమున పరిశోధనలు గావించి ఇట్లు ప్రకటించుచున్నాడు. 'జంతువులలో విశేషభాగము ఎట్టి దేహపరిశ్రమను గొనవు. వానిలో దేహపరిశ్రమ విశేషించి గొను వాని జీవితకాలపరిమితి మిక్కిలి తక్కువగా ఉంటున్నది. జీవులలో తాబేలునుమించిన సోమరులు లేరు. అట్టి తాబేలు సాధారణముగ 200 మొదలు 300 ఏండ్లవరకు జీవించుచున్నది. ఏనుగు మఱియొక సోమరిజంతువు. దాని జీవితకాలపరిమితి 150 మొదలు 200 ఏండ్లవరకు. పక్షులలో హంస సోమరియగుట ప్రసిద్ధి. జంతు ప్రదర్శనశాలలయందు ఉంచబడినవే హంసలు 102 వత్సరములదాక జీవించుచున్నవి. విశేషదేహపరిశ్రమగొను చురుకుజంతువులగు కుక్కలు పదిపదిహేను ఏండ్లకంటెను, ఉడుతలు పది పండ్రెండు సంవత్సరములకంటెను, కుందేళ్ళు ఏడెనిమిది వర్షములకంటెను, ఎలుకలు మూడునాలుగు వత్సరములకంటెను హెచ్చుకాలము జీవింపవు."

—హెరాల్డు ట్రిబ్యూన్ మేగజైన్.

* * *

ఒక న్యూయార్కుపత్రిక చేసిన తమాషా

రాల్ఫు డి. బ్లూమెన్ ఫీల్డు అనునతడిట్లు లిఖించుచున్నాడు : "న్యూయార్కు-హెరాల్డు పత్రికాప్రచురణకర్తయగు జేమ్సుగార్డన్ బెన్నెట్టు తాను అభిలషించిన దానిని ప్రజలచే చేయింపగలనని నమ్మియుండెను. అరువదిఏండ్లకు పూర్వము ఒకనాటిరాత్రి తన స్నేహితులతో నాతడు తన ఈనమ్మిక నిజమైనదని రుజువుచేయుటకుగాను మఱునాడు న్యూయార్కు-పట్టణమునందలి ఒక్క వ్యక్తికూడ తనగడపదాటి రాకుండ చేయుదునని చెప్పెను. మఱునాటి ఉదయము హెరాల్డు పత్రికలో స్థానికజంతుప్రదర్శనశాలలోని క్రూరమృగములన్నియు తప్పించుకొనివచ్చి ఊరిమీద పడినవను ఘోరవార్త ప్రచురింపబడెను. పెద్దపెద్ద శీర్షికలలో 'ఎచ్చటచూచిన వికలాంగులు' 'మాంసభక్షక జంతువుల రూపమున మృత్యుదేవత వీరవిహారము' ఇత్యాది అర్థమును సూచించు తలపేరులతో ఆ పత్రిక పిక్కటిల్లియుండెను. పత్రికతోపాటు ఈవార్త జలశైలబిందువై క్షణములో ఇంటింట వ్యాపించెను. వీధులలో ఒక్కపిట్టకూడ కానరాలేదు. గడపదాటి కాలు బయటపెట్టుటకు ప్రతివారును భయపడిరి. పట్టణమునందలి ప్రతియింటి వీధితలుపు మూయబడెను. పాఠశాలలన్నియు మూసివేయునట్లు అర్డరుపుట్టెను. కొన్నిగంటలవఱకు న్యూయార్కున ప్రాణులు లేనట్లే యుండెను. బయటకుపోకతప్పనిసరియైనవారు తమ ప్రాణములపై ఆశవదలుకొనియే బయట కాలుపెట్టిరి. కుక్కయొకటి సింహగర్జనయయ్యెను. దొంగతనముగా దాగి గోడమీదనుండి జాఱిపోవు పిల్లి మానవరక్తమున గ్రోలనుంకించుచున్న చిఱుతపులియయ్యెను. హెరాల్డు అధిపతి బెన్నెట్టు న్యూయార్కునంతటిని భయసముద్రమున ముంచి తేలించెను. కాని కొలదిగంటలలో నిజము వెల్లడియయ్యెను ; పట్టణప్రజలు చలివిడిచిరి ; అంతయు తిరిగి యథాస్థితినొందెను."

—నాష్ మేగజైన్.

* * *

జాతిసమితి ; దాని కార్యవిధానము

"ప్రస్తుతము జాతిసమితిలో 54 ప్రభుత్వములు సభ్యత్వము వహించియున్నవి. అనగా ప్రపంచమున నాలుగింట మూడుభాగములు జాతిసమితికి అనుబంధమైయున్నవన్నమాట. బ్రిటిష్ సామ్రాజ్యాంతర్భాగము లగు ఐరిష్ ఫ్రీస్టేటు, ఇండియా మొదలగునవి ప్రత్యేక సభ్యత్వార్హతను, ఓటింగు హక్కును కలిగియున్నవి. జాతిసమితి ఎజంబ్లీ ప్రతిసంవత్సరమును సెప్టెంబరు 10-వ తేదీని జనీవాలో కూడును. సభ్యత్వము వహించిన ప్రతిదేశము ముగ్గురు ప్రతినిధులను పంపవచ్చును. దేశము ఒకటింటికి ఒకవోటు. కార్యనిర్వాహకవర్గము ఏడాదికి మూడుసారులు సమావేశమగును. గ్రేటు బ్రిటను, ఫ్రాంసు, ఇటలీమాత్రమే ఇపుడు శాశ్వత సభ్యత్వముగలవి. జపాను, జర్మనీలు విరమించుకొన్నవి. ఏటేట మరి తొమ్మిదిదేశములు తాత్కాలిక సభ్యత్వమునకు ఎన్నుకొనబడుచుండును. ఈ తొమ్మిది ఏవిఅనగా: పోలెండు, యుగోస్లావియా, పెరూ, స్వియిస్, వెనిజులా, పెర్షియా, గాటిమేలా, నార్వే, ఐరిష్ ఫ్రీస్టేటు. జాతిసమితి చేయవలసినపని పలుతెఱగులది. అది దినదినము పెరుగుచున్నది. సమరనిరోధము; యుద్ధములులేకుండ తగాదాలు పరిష్కరించుకొనుటకు హేగ్‌నందొక శాశ్వతన్యాయస్థాననిర్మాణము; వివిధ జాతీయపునర్నిర్మాణము; ప్రపంచారోగ్యపరిరక్షణము, అభివృద్ధి; వ్యభిచారనిర్మూలనము; శిశుసంరక్షణవిధానము—ఇత్యాదులు జాతిసమితి చేకొనిన బహుకార్యములలో కొన్ని."

—సండేక్రానికలు.

• * *

బడి తోటలు

"జనవరిమాసపు సంచికలోని మణిమాలయనే శీర్షిక క్రింద ప్రచురితమైన 'బడితోటలు' అను వ్యాసభాగమును చూచాను. ఆంధ్రులు బడితోటలు, గృహారామములు, చెట్టుకూరపాదులు మొదలగువాని విషయమున చూపే అశ్రద్ధ మిక్కిలి శోచనీయమైవుంది. ఆంధ్రావని సుజలపూరితమనీ, సుఫలభరితమనీ, సస్యశ్యామల అనీ భావపుత్రులు కీర్తిస్తూంటే ఏవూళ్ళోనూ ఎన్నివాడల తిరిగినా దేవపూజకుకూడా గుప్పెడుపూలు సమకూరడము కష్టంగావుంది. దొడ్లోవున్న పాదుని పట్టుమని పదికాయలు కోసుకుని కూరవండుకుని భుజించే సంసారులుకూడా లెక్కకు మిక్కిలి అల్పం. రాజమండ్రి కళాశాలకు అధ్యాపకుడై కళోపాసకుడై కవితాకుమారుడై ఆంధ్రావనియెడల అమితానురాగం చూపి 'థేమ్సు—గౌతమి' అను ఖండకావ్యసంపుటమును ఆంగ్లములో ప్రచురించిన కూల్డ్రిదొర ఒక సంధర్భములో అన్నమాట లివి: "మీదేశం ఫలపుష్పశోభితమని మాదేశస్థులు చెప్పుకుంటారు. ఇప్పుడు రెండూకూడా క్షీణించివున్నాయి. కారణమేమి?" మనదేశం ఫలవంతమైనదే, మనసూర్యభగవానుడు వనస్పతులను ఎల్లకాలము పోషింపగలవాడే. అయితేయేమి? దానికి కావలసిన పురుషకారములేదు. తీరికసమయాల్లో పురుషులు విలాసలాలసులై యే చీట్లపేకలో ఆడతారు; స్త్రీలు యే గచ్చకాయలో ఆడుకుంటారు; పెద్దలను అనుకరిస్తారు చిన్నలు. కనుక మనతెనుగుసీమలో గృహారామములు నెలకొనడంలేదు. పచ్చతోరణము నిత్యకల్యాణంగా ప్రతి ఆంధ్రునియిల్లూ వుండే మంచిరోజులు యెప్పుడు వస్తాయోగదా! బడితోటలవిషయం యింతకన్నా అన్యాయం. నూటికి 90 స్కూళ్ళకు ఆవరణవుండదు. వున్నా తోటవేయడానికి కావలసిన సౌకర్యాలుండవు. మాస్టర్లు నిస్సహాయులు; ప్రెసిడెంట్లు నిష్కాములు; ఇన్స్పెక్టర్లు నిర్లిప్తులు. ఇంక తోటలెలా వెలుస్తాయి? కనుక 'ఆంధ్రభూమి'లో 'తోటపని' అనే శీర్షిక క్రింద ప్రతినెల ఒకపేజీ ప్రత్యేకించి యేదైనా వ్యాసం ప్రకటిస్తే బాగుంటుంది. భోజ్యములగు పొట్ల, కాకర, రామములగ, మట్టుబచ్చలి, తోటకూర, మెంతికూర మొదలగు కాయగూరలనుగూర్చి ముందు వ్రాయించండి. ఇవి తెలియనివారుండరని అనుకోవద్దు. వానిని శాస్త్రీయముగ పాతిపెట్టి వన్నెగలిగేతీరుగా పెంచి, కాయించుట అందరకును తెలియదు కనుక

ఇన్స్యూరెన్సు విషయములు

జీవితభీమా : ప్రజాసేవ

భీమాశాస్త్రపారంగతులగు శ్రీ సిరిల్ జేమ్సు ఫాస్సు క. సి. గారి రేడియో ఉపన్యాసమున కిది తెనుగు సేత.

జీవితభీమానుగూర్చి మనము మాటలాడునపుడు భావికాలమున నిర్మింపబడగల నొక సంస్థను ప్రస్తావించుటలేదు; రెండువందల సంవత్సరములనుండి పరంపరాగతమైయున్న సంప్రదాయము, అనుభవము, నిపుణుల కార్యదక్షత వీనిచే పరిపుష్టి నొందియున్న ఒక గొప్పసంస్థను ప్రస్తావించుచున్నాము.

ఈ రెండువందల సంవత్సరములలో ప్రపంచమున అనేకవిపత్తులు సంభవించినవి. యుద్ధములు, అధివ్యాధులు లోకులను పీడించుచు వచ్చినవి. ఆర్థికమాంద్యములు, ఆర్థికవిపత్తులు అపుడపుడు కలుగుచువచ్చినవి. కాని జీవితభీమాఉద్యమముమాత్రము వీనిఅన్నిటి దాడిని తట్టుకొని ప్రశంసాపాత్రముగ బయటపడుచువచ్చుచున్నది. ఒక్కొక్కదాడిని తట్టుకొని బయటపడిన ప్రతిపర్యాయమును జీవితభీమా నూత్నశక్తిని, నవ్యోత్సాహమును పొంది ప్రజాబాహుళ్యమున తనస్థిరత్వమును గూర్చిన విశ్వాసమును పెంపొందించుచు క్రమముగా అధికవ్యాపారానుభవమును, స్వానుభవముతో గూడిన అధికవిజ్ఞానమును సంపాదించుచున్నది. ఈ విజ్ఞానానుభవసంపాదనచే జీవితభీమా భావికాలమున ఎట్టి గొప్పవిపత్తులు వచ్చినను తట్టుకొనగలుగు శక్తిని, రెండువందల వత్సరములుగ తాను కాపాడుచున్న విశేష సంఖ్య మానవుల అక్కఱలను ప్రయోజనములను ఇకముందు కూడ నిరర్థ్యంతరముగ కాపాడగలనను ధీమాను పొందుచున్నది.

1929-వ సంవత్సరమునుండియు తనభారమును లోకముపై మోపి దానిని క్రుంగదీయుచు ఇప్పుడుకూడ లోకమున మూగియున్న ఆర్థికమాంద్యము ప్రపంచచరిత్రలో అశ్రుతపూర్వమని పలువురు చెప్పుచున్నారు. అట్టి బృహత్పరిమాణమందిన ఆర్థికమాంద్యమునకు కూడ ఎదురొడ్డి నిలిచి దానిని గెలిచిన గొప్ప సత్వము జీవితభీమా.

జీవితభీమా—దాని నామము సూచించునట్లు—జీవుల క్షేమలాభములకొఱకు. ఒకానొకడు చనిపోవునను భావములో జీవితభీమా కొనబడుటలేదు. భీమాదారునిపై ఆధారపడియుండు కొందఱు వ్యక్తులు అతని మరణానంతరముకూడ జీవించి ఆర్థికరక్షణావశ్యకతను కలిగియుండనగుటచేతనే జీవితభీమాచే కొనబడుచున్నది. పోషణకు, అభివృద్ధికి మనపై ఆధారపడియుండు వారి జీవితాధారములను జీవితభీమా సంశయస్థితినుండి తప్పించి నిశ్చితస్థితిలో నిలుపుచున్నది. అంతియగాక జీవితభీమా ప్రాణుల భద్రతకై ఉద్దేశింపబడినదిగావున భీమాదారుని స్వప్రయోజనమును గూడ రక్షించుటకది పూటకాపై యున్నది. అది తృప్తిపఱుపగల మానవుని అక్కఱ లెట్లు వివిధములై యున్నవో దాని ఉద్దేశములును అట్లు వివిధములై యున్నవి. జీవితభీమా సంచిత ధననిధి; పటిమ గోలుపోవని రక్షణ; ఒడుదొడుకులులేని పెట్టుబడి: ఉన్నతమైన అంతస్థును చెందిన వ్యాపారపుటాస్తి.జీవితభీమా విధులను గౌరవముతో నిర్వహింప సాయపడును, బాధ్యతలను తృప్తికరముగ నెఱవేర్పతోడుపడును. రాగల దుస్సంఘటనములనుండి జాగ్రత్త

పెట్టి జీవితమునందలి ఆర్థికసంబంధమైన చిక్కులను ఎడలించి జీవితభీమా భీమాదారుని సేవించుచున్నది. అది అత్యవసరము గూర్చి జాగ్రతగొనును; గడించిన ధనమును కూడ భద్రముచేయును; నిరుద్యోగముచేత గాని, వృద్ధాప్యముచేత గాని, అంగవైకల్యము పొందలగు ప్రతిబంధములచేత గాని జీవితసౌకర్యము తగ్గినప్పుడు జీవితభీమా సహజమైన రాబడియొక్క స్థానమును ఆక్రమింపగలుగుచున్నది. పేదవారును, ధనవంతులును సమముగా గురికాగల ఆర్థికసంబంధమైన విపత్తులను జీవితభీమా తప్పించుచున్నది. అది పొదుపుఅను గుణమును అలవఱచుచున్నది గృహములను కాపాడుచున్నది, కుటుంబములను రక్షించుచున్నది, విద్యాసముపార్జనమునకు అవకాశమిచ్చుచున్నది, చోఱవను కలిగించుచున్నది, ఏదైన నొక కార్యమును ప్రారంభింప ఉత్సాహమును పుట్టించుచున్నది, పాటుపడుట యందు అభిముఖులను చేయుచున్నది, వ్యాపారమున తగిన కాలమున అర్హమగు డబ్బు నుపాయము లేకపోవుటచే జాఱవిడువబడు నదవకాశముల లాభమును పొందగలుగుటకు సమర్థత నిచ్చుచున్నది. క్రమాభివృద్ధిని కలిగించుటకు జీవితభీమా వ్యక్తికి ఎంతలాభకరమైన దగుచున్నదో రాష్ట్రమునకుకూడ అంతటి లాభప్రదమైనదై యున్నది.

సమమైన ఆలోచనగల ఏమానవుడును తాను బీద వాడై యుండుటకుగాని, తానొకరిపై ఆధారపడియుండుటకుగాని అంగీకరింపడు; తన పోషణపై ఆధారపడియున్నవారిని ఇతరులపోషణకు పోవలసినవారుగా గాని, క్రమజీవితపథమునుండి తప్పిపోయినవారుగా గాని అగుటకును అంగీకరింపడు. ప్రతి సాధారణవ్యక్తి హృదయమునందును తన జీవితపథమును తానే నిర్ణయించుకొని తనబ్రతుకుతెఱువుతానే కల్పించుకొనవలెనను వాంఛ దృఢముగ పాతుకొనియుండును. ఈవాంఛ మెచ్చదగినది, పెంచదగినది, ప్రోత్సహింపదగినది. ఇట్టి వాంఛగలవారిలో ఉత్తమజాతివారు ఇతరుల అనుగ్రహమును ఆశింపరు, తమకుగల పలుకుబడిని గాని ఉద్యోగమునుగాని దుర్వినియోగ మొనర్చి స్వప్రయోజనమునకై ఉపయోగింప నిరాకరింతురు, తమ బుద్ధిబలముచేతను శక్తిసంపదచేతను జీవించ ఆశింతురు. తాను జయశీలి అగుటకే అతడు గాఢముగ కోరును. శిఖరములను ఆతడు అందుకొనలేక పోవచ్చును. అయితే అంతమాత్రమున అట్టడుగుపడియుండ నక్కఱలేదు. ప్రయోజకుడు, మర్యాదస్థుడునగు పౌరుడై; భగవంతునకు భయపడుచు; రాజును గౌరవించుచు; జీవితసారస్యమును గ్రహించి ఆనందింపగల సమర్థుడగుచు, గృహమునుపొంది దానివలన రాగల ఆనందములను అనుభవించి బాధ్యతలను నిర్వహింపగలవాడై యున్న చాలును.

సుభాషితము

౧౮

"వ్యక్తుల ఆర్థికసౌఖ్యమును గూర్చి విశేషముగా శ్రద్ధగొనుటకై మానవునిచే నిర్మింపబడిన ఏకైకసంస్థ జీవితభీమా. మానవుని వృద్ధాప్యమును శాంతమయముగాను, సుఖమయముగాను చేయుటకై అది కల్పింపబడినది. దానిరక్షణము కోరువారి అందఱకును అది శుభాశీర్వాదముల నొసంగి వరలాభములను కలిగించును. వ్యక్తులను కాపాడి వారిని సన్మార్గముల నడపించుటకు ఉద్దేశింపబడినదగుట అది దూరపుటాలోచనను కలిగించి అనుకొననిసంభవములను తగ్గించుచున్నది. ప్రజాసేవ గావించుట సద్దిష్టమైనదగుట అది నాగరికతాభివృద్ధికి గావించిన సాహాయ్యము అంకెలతో మాత్రమే కొలబెట్టరానిది. ప్రజాక్షేమము, మానవసౌఖ్యము హెచ్చుగ ఆధారపడియుండు చక్కని ఉపదేశము, అన్యోన్యసహకారము, క్రమమైన ఏర్పాటు వీనిసాముదాయకసంపత్తితో జీవితభీమా నాగరికతాభివృద్ధికి గావించిన సాయమును కొంతవఱకు కొలబెట్టవచ్చును."

—పీస్ గార్డియన్.

ఈ వాంఛలను ఈడేర్చుకొనుటకును, ఈ స్వప్నములను నిజము లొనర్చుకొనుటకును అతడు తప్పక పాటుపడవలసియున్నది. ఆ పాటుపడుట ఉద్దేశపూర్వకమైయుండవలయును. ఇక ఆఉద్దేశము ఎట్టిదై యుండవలయును? తాను ఏర్పఱచుకొనిన పద్ధతులను నిర్వహింప తనకు శక్తినిచ్చుటకై తన ఆదాయమునుండి కొంత మిగుల్చుకొను మనోనిశ్చయమై యుండనగును. ఈమనోనిశ్చయము ఫలోదయమంత మగుటకు సహకారియైనవానిలో జీవితభీమా ఆదర్శప్రాయమైనది, నిరుపమానమయినది అగుచున్నది. యౌవన కాలముననే—అనగా తనజీవితమును భీమాచేయగల తరుణము దాటిపోకుండగనే—భీమాను కొని దానివలన పొందగల పూర్తి లాభములను పొందుట ఈవాంఛాపరిపూర్తికి సవ్యమయిన మార్గము.

జీవితభీమా ఆర్థికరక్షణకు రాచబాట. అది ఒక జాతి వారి ప్రత్యేకహక్కు కాదు. అది అందఱికిని స్వాగతము చేయును. పేదవారు, ధనికులు దాని ఆహ్వానము నందుదురు.

రాబడి తక్కువగా నున్నవానికి జీవితభీమా అత్యవసరమగుచున్నది. భావికాలమున రక్షణపొందుటకును, తనపై ఆధారపడియున్న వారిని పరిరక్షించుటకును అది అతనికి కావలసియున్నది. కొద్దిరో గొప్పరో ఆర్జించువారిలో తమ ఆర్జనలో కొద్ది మొత్తమునైన మిగిల్చి దానితో భీమాను కొనజాలనివారు చాలతక్కువగనుందురు. ఇక తనఅక్కఱనుమీఱిన రాబడిగల వ్యక్తికి జీవితభీమా ఒక గొప్ప స్నేహితుడే. కొంత మూలధనము కూర్చుటకును, దానిని ఉపయోగించుకొనుటలో ఆర్థస్వాతంత్ర్యమును పొందుటకును ఆతని ఆర్థికస్థితిని సునిశ్చయమొనర్చుటకును అతనికి జీవితభీమా ఎంతయో అక్కఱకు వచ్చును.

సుభాషితము

౧౯

అనిశ్చయములను నిశ్చయములుగాను, అసమములను సమములుగాను చేయుటకు నేడు మానవుడవలంబించు క్రొత్తపద్ధతికే భీమా అని పేరు. ప్రతిభీమాపట్టాయు నొక స్వాతంత్ర్యప్రకటనము; ఆర్థికస్వేచ్ఛాపత్రము. భీమాపట్టాకలవాడు దారిద్ర్యమును జయించినవాడు. పోడిమి అను పునాదియే భీమాయొక్క ఆశయమునకు జనిస్థానము. సంయమముపై కూడబెట్టు శక్తి ప్రధానముగా ఆధారపడియుండును. కూడబెట్టుశక్తి మానవుని సద్గుణములలో అతిముఖ్యమైనది. ప్రతి పౌరుడును తాను ఆదర్శకుడు అగుటకు అభిలషించుచో ఈ శక్తిని బాగుగా కలిగియుండవలయును. జీవితభీమాపట్టాను అమ్ము ప్రతివాడును మానవస్వభావవిమర్శకముగు నొక యోగ్యతాపత్రమును అమ్ముచున్నాడన్నమాట. భీమాపట్టాకలిగియుండుట మంచిపౌరుడనుటకు గుఱుతు, స్వపరిపాలనస్వత్వము నందుటకు నిరాక్షేపణీయమైన హక్కుగలదనుటకు చిహ్నము —

— కాల్విన్ కూలిడ్జి.

ఆర్థికముగ ఎట్టి చిక్కులను పడకుండగనే ఇప్పటికంటె ఇంకను హెచ్చుమంది భీమాలను కొనుటకును, ఇదివఱకే భీమాచేసియున్నవారు ఇంకను పెద్ద మొత్తములకు భీమాచేయుటకును అవకాశముగలదని నిరభ్యంతరముగ చెప్పవచ్చును. ఇట్లు భీమా చేయించుట ఆచరణసాధ్యమైనదే. భీమాయొక్క విలువను మనము పూర్తిగ గ్రహించినపుడిది సులభముగ తెలియును. జారీచేయబడిన ప్రతి పట్టాయు, చెల్లింపబడిన ప్రతి క్లెయిమును ఒక్క వ్యక్తిని మాత్రమే కాపాడి అతనికి మాత్రమే లాభము కలిగింపదనియు అది దేశమున కంతటికిని లాభకరమైనదనియు, వ్యక్తి సంపదను పెంపొందించుటతోబాటు దేశసంపదను గూడ పెంపొందించుననియు, ఆర్థికక్లేశములకు దూరముచేసి ధనవిషయమున మానవునకు స్వాతంత్ర్యమును ప్రసాదించుచున్నదనియు మనము తెలిసికొనవలసియున్నది. తెలిసికొని దాని లాభమును పొందుటకు ప్రజలు విశేషముగా ప్రయత్నించుచో దేశము త్వరలో ముందుకు రాగలదు.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౫౧. తురుష్క ప్రజాస్వామికము

ఫ్రెంచి స్వాతంత్ర్యవిజయమును, అమెరికా సంయుక్త రాష్ట్ర స్వాతంత్ర్య విజయమును రచించి ప్రచురించి ఆంధ్ర వాఙ్మయమును రాజకీయశాఖలో పరిపుష్టి నొందించుచున్న దేశసేవాతత్పరులు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు రచియించిన గ్రంథ మీ తురుష్క ప్రజాస్వామికము. 'మనప్రక్క దేశముల వారు తమజాతీయసమస్యల నెట్లు పరిష్కరించుకొనుచున్నారో తెలిసికొనుట చాల లాభకారి. అట్టి యుద్దేశ్యములో మహమ్మదీయజాతులలో మిగుల ప్రఖ్యాత మగు తురక (తురుష్క) జాతిచరిత్ర వ్రాసినాను' అని శ్రీరావుగారు తొలిపలుకులలో తెలుపుచున్నారు. సుప్రసిద్ధప్రతిభాశాలురగు శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు ఈగ్రంథమున కొక చక్కని పీఠికను వ్రాసినారు. 'అత్యంతప్రతిభాశాలియగు ముస్తఫా కెమాల్ పాషా యొక్క ఉత్తేజకనాయకత్వమున తురుష్కు లెంత శౌర్యములోను, ఎంత పట్టుదలలోను, తమజన్మభూమి స్వాతంత్ర్యమును, పారతంత్ర్యదంష్ట్రలనుండి కాపాడుకొనిరో, తరువాత నాస్వాతంత్ర్యమును నిలువబెట్టుకొనుటకును-తమజాతీయ రాష్ట్రమునకును ప్రపంచమునందు శాశ్వతగౌరవమును ప్రతిష్ఠించి దానిని నిలుపుకొనుటకును రాజకీయ సాంఘిక ఆర్థిక విషయములందు ప్రజాజీవనములో అన్నివిషయములందును, నవీనపద్ధతుల నెట్లవలంబించిరో ఆచరిత్ర మిందుకలదు. పాశ్చాత్య సామ్రాజ్యతత్వమునకును, తురుష్క జాతీయోద్యమమునకును జరిగిన గొప్పపోరాట మిందు విపులముగ వర్ణింపబడినది.' అని పీఠికాకారులు. పలుగ్రంథములు పరిశోధించి వ్రాసిన ఈ అమూల్యగ్రంథరత్నమును ఆంధ్రులెల్లరును శ్రద్ధలో జదివి తమ విజ్ఞానమును పెంపొందింపుకొనగలరని నమ్ముచున్నాము. క్రౌను సైజున 360 పుటలుగల ఈ గ్రంథమూల్యము ఒక రూపాయి మాత్రమే. ఈ 'తురుష్క ప్రజాస్వామికము' విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో 39-వ పుష్పముగ ప్రచురితమైనది. క్యాలికో బైండు. ప్రతి చందాదారులకు రు 1-8-0; ఇతరులకు 1-12-0. ప్రతులు వలయువారు బెజవాడయందలి విజ్ఞానచంద్రికా గ్రంథమండలి కార్యస్థానమునకు వ్రాయునది.

౫3. వ్యాసభాషాంతరీకరణచంద్రిక

ఆంధ్రవిశ్వవిద్యాలయమునందును, మదరాసు విశ్వవిద్యాలయమునందును స్కూలుఫైనలు పరీక్షకు చదువు ఆంధ్రవిద్యార్థుల ఉపయోగార్థము ఈ వ్యాసభాషాంతరీకరణచంద్రిక రచియింపబడినది. మదరాసునందలి యస్. యస్. వెస్ లీ హైస్కూలునందు నీనియరు తెలుగుపండితులుగానున్న విద్వాన్ యమ్. శ్రీపతి శాస్త్రిగారు దీనిరచయితలు. ఈగ్రంథమున రెండు ప్రకరణములు కలవు. ప్రథమప్రకరణమున భాషాంతరీకరణమును గావించునపుడు గమనింపవలసిన కొన్ని ముఖ్యాంశములు వివరింపబడి దృష్టాంతమునకై పదునైదు తర్జుమాలు ఈయబడినవి. ద్వితీయప్రకరణమున వ్యాసములు వ్రాయబడునపుడు గమనింపవలసిన ముఖ్య విషయములు వివరింపబడి దృష్టాంతముగా ఏనుగు, నేల బొగ్గు, కలరా, ఆకాశవిమానములు, వార్తాపత్రికలు మొదలగు పలువిషయములనుగూర్చి వ్యాసములు ప్రస్తరింపబడినవి. దీనిని చదువు స్కూలుఫైనలు విద్యార్థులకు వ్యాసభాషాంతరీకరణ విషయమున జయము సులభము. క్రౌనుసైజున 72 పుటలు. వెల రు. 0-5-0 అణాలు. దొరకుచోటు : ది లిటిల్ ఫ్లవర్ కో, 317, లింగిశెట్టివీధి, జి. టి, మదరాసు.

౫౪. కరుణలేని కమతము

కార్మికసంఘ ప్రచురణము ౧. శ్రీ స్వామి తత్త్వానంద ప్రణీతము. ప్రకాశకులు ధూళిపాళ్ళ కోటయ్య

గారు, అనంతవరము, తెనాలి తాలూకా, జానకయ్య, సుందరమ్మ, లక్ష్మి, కోటడు పాత్రలమూలమున 'కరుణలేనికమతము'లో చూపబడిన నీతిపాఠము ఎంతయు గ్రహింపదగినదైయున్నది. ఇట్టి యుత్తమగ్రంథమును ప్రచురించి దానిని పాఠకులకు ఉచితముగానిచ్చుచున్న భూశీపాళ్ళ కోటయ్యగారి దేశసేవ యెంతయు కొనియాడదగియున్నది. ఆంధ్రులు శీఘ్రప్రచురణమును అర్థప్రచారము నకుతెచ్చి శ్రీ కోటయ్యగారి కృషిని సఫలమొనర్తురుగాక యని కోరెదము. క్రౌనుసైజున 16 పుటలు.

౫౫. భక్తరామోపాఖ్యానము

రచయిత బాలకవి పొన్నూరు బాపయ్యగారు. కోలాటకీర్తనలు. 'సంసంసంసారని సందిత-చరితానందభరితులైన'వలెనను పల్లవి. ఇది బాలుర కభీష్టమైనదగుట సులభశైలిలో ఒప్పుచున్నది. ఈ బాలకవి భావికాలమున ఉత్కృష్టగ్రంథరచనముచే ఆంధ్రభాషాభగవతిని భవ్యరీతిని సేవించుగాక యని కోరెదము. చిన్నసైజు చక్కని అచ్చు. 16 పుటలు. వెల రు. 0—1—0.

౫౬. భక్తజీవనము

పరీక్షిద్విలాసము, భక్తహృదయము అను ఉత్తమగ్రంథములను తెనుగుతల్లి పాదపంకేరుహములకు సమర్పించిన సారస్వతార్చకులు శ్రీయుత పుటుంబాక శ్రీకృష్ణయ్యగారిచే రచియింపబడిన ఈ గ్రంథము ఆమూలాగ్రముగ చదివి అమితానందము నందితిమి. వెంకటేశ్వరవచనములు, భవానీశంకరవిన్నపములు మొదలగువానిని రచియించిన కవులవలె 'భక్తజీవన' గ్రంథకారులుకూడ భగవదానందములో తన్మయులై పరవశులగుచుండుటను ఈ గ్రంథమునందలి ప్రతియక్షరమును ప్రస్ఫుటముచేయుచున్నది. భక్తుడగు ఈకవి ఈ గ్రంథమున భక్తిరసపిచ్ఛిలమగు ప్రౌఢగద్యకవితను జాలువార్చియున్నాడు. ప్రార్థనావసరమున నిత్యము పారాయణచేయదగి ఈ గ్రంథము ప్రకాశించుచున్నది. నిదర్శనముగా ఒక ఘట్టమును ఎత్తిచూపుచున్నాము... "బంధవిహామా! పాదములబట్టి బహుభంగుల ప్రార్థించితిని. దీనుడనై ప్రొక్కితిని; దీనజనబాంధవుడవని నమ్మితిని; పతితపావనుడవని పజ్జను జేర్చుకొనుమంటిని; అనాథనాథుడవని యాశ్రయించితిని; సకల సౌఖ్యదాయివని సాష్టాంగపడితిని; కరుణాస్వరూపుడవగు నీవు నావాడవని నమ్మితిని: నిన్ను ప్రార్థించుటకు నాహృదయము నుండి వెలువడగల భావముల నన్నియు నుపయోగించితిని; నాచేతనైన భావనంతయు వినియోగపరచితిని. ఇంక నేజేయగలిగినదేమున్నది? కింకర్తవ్యతామూఢుడనై యూరకుండుటేగదా? అక్కటా! ప్రొక్కిన నాడు లేనిమురిపెము, యాచించిననాడు లేనియాతురత, ప్రతిమాలిననాడు లేనిపరమదయ, హతాశుడనై చేతులు ముడిచికొని మూగవలె కూర్చుండినవాడు కలుగునా? దేవా! యెట్లు చేసెదవో? నీ లీలలను నేనెట్లు గుర్తింపగలను? నమో నమశ్శ్రీమన్నారాయణా!" గ్రంథముద్రణముకూడ చాల ఆకర్షణీయముగనున్నది. జేబునందిముడు చిన్నసైజు. దళసరి తెల్లకాగితములు. ఆంటిక్ సైపు. 74 పుటలు. వెల 0—6—0 అణాలు. పబ్లిషర్సు: సేవాశ్రయము, పెదపాలెము. ప్రతి ఒక్కరి దగ్గరను ఉండదగిన భగవద్గీతవంటి ఉత్తమగ్రంథము.

౫౭. వరోజనవిద్య

పశ్చిమగోదావరిజిల్లా, కొవ్వూరునందలి వరోజన విజ్ఞాన గ్రంథమాలలో రెండవకుసుమము. దేశసేవకులగు కనివారపు సుబ్బారావుగారిచే రచియింపబడినది. వరోజనవిద్యాప్రాధాన్యము గుర్తింపబడుచున్న ఈ దినములలో ఈ ఈగ్రంథ మెంతయు వరణీయమైనది.

క్రొత్త పత్రికలు

౧౦. ఆంధ్రవిశ్వకళాపరిషత్ కళాశాల తెనుగు సంఘపత్రిక

తెనుగు కైతకు క్రొత్త తెన్నులుచూపిన తొలకరి కవులలో నొకరగు శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారు, ఎమ్.ఏ, ఈ పత్రిక సంపాదకులు. దసరా సంచికగ వెలువడిన రెండవసంపుటపు ఈ తొలిసంచికలో శ్రీ దివాకర్ల వెంకటావధానిగారి 'రసములెన్ని? శాంతము నకు స్థాయిరేది?' అనునది పూజ్యస్థానమునందియున్నది. శాంతమునుగూర్చి వివిధరసవేత్తల నిర్ణయమును వివరించి పిమ్మట శ్రీ అవధానిగారు ఈ వ్యాసమున శాంతరసు

మునకు తత్త్వజ్ఞానపర్యాయమైనశమమే స్థాయిభావ మగుట నిరూపించియున్నారు. ప్రతాపరుద్రీయము కాకతీయాంధ్రసామ్రాజ్యచరిత్రను పరిశోధింపతలంచువారికి ఎట్లుపకరించునో శ్రీవడ్లాది శ్రీరామచంద్రమూర్తిగారు 'ప్రతాపరుద్రీయచారిత్రకప్రాధాన్యము' అను వ్యాసమున వివరించిరి. శ్రీ గొడవర్తి సూర్యనారాయణరావు గారి 'తెనుఁగు చాటువులు' చదువఁదగియున్నది. శ్రీ పాటిబండ మాధవశర్మగారి 'ఏష్యః సోముఁడు' అను నది చక్కని విమర్శకవ్యాసము. ఆఙ్గ్లేయ దేశపు షేక్స్పియరు మేతరలింకు నాటకములనుగూర్చి 'శాస్త్రి' అనువారు దిఙ్మాత్రముగ వ్రాసిరి. శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి షష్టిపూర్తినిగూర్చి సంపాదకీయము. శ్రీ దేవరాజు వెంకటసత్యనారాయణమూర్తి గారి 'విషాదాంతనాటకములు' అను వ్యాసము పఠనార్హమైయున్నది. ఆంధ్రవిశ్వవిద్యాలయమువారిచే స్వయముగ నడుపబడుచున్న కళాశాలలో ఆంధ్రశాఖకు చెందిన ఆంధ్రయువకుల నవనవోన్మేషమగు మేధ వివిధసారస్వతశాఖలలో నెట్లు పరుగులువాఱుచున్నదో ఈ సంచిక నిదర్శనమిచ్చుచున్నది. సంవత్సరమునకు మూడు సంచికలు. సాలు చందా ఒకరూపాయి. విడిపత్రిక 0—6—0.

౧౧. ప్రబుద్ధాంధ్ర

రాజమండ్రి కలాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక. రాయల్ సైజు. 40 పుటలు. సంవత్సరపుచందా రూపాయి. విడిసంచిక అణావర. సంపాదకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. రూపాయి పత్రికకు తెనుగున శ్రీ శాస్త్రిగారే ఆద్యబ్రహ్మలు. తరువాత అట్టి రూపాయిపత్రికలు తెనుగున పదిండికి పైగా వెలసినవి. రెండు మూడు నేఁడును జీవించియున్నవి. దాదాపు పదిసంవత్సరములకు పూర్వము ప్రబుద్ధాంధ్ర సంపాదకులఅనారోగ్యకారణమున నిలిచిపోయినది. నిలిచిపోవునరికి దాని చందాదారులసంఖ్య 2700. నేఁడు 'వినోదిని'ని తప్పించినచో అందఱు చందాదారులుగల మాసపత్రిక మఱియొకటిలేదు. అట్టి ప్రబుద్ధాంధ్ర పునరుద్ధరింపబడి తెలుగువారి అదృష్టము అనదగిన రాజమహేంద్రవరపుకీర్తిని విస్తరింపజేయుచుండుట యెంతయు సంతోషింపదగినది. రచయిత, వ్యాసకారుడు ఒక్కఁడే అయిన సంపాదకునకు నోచిపుట్టిన తెనుగు మాసపత్రికలలో ప్రబుద్ధాంధ్రయొకటి. జనవరి మాసమున వెలువడిన ఐదవసంపుటపు తొలిసంచికలో 'జాగ్రత్తపడవలసిన ఘట్టాలు' అను సంపాదకులు వ్రాసిన సాంసారికకథావ్యాసము గొప్పనీతిని బోధించుచున్నది. ప్రఖ్యాతాంధ్రకథకులగు శ్రీ చింతాదీక్షితులుగారు వ్రాసిన 'ఈ మాటనిజం' చమత్కారముగ నున్నది. శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారి 'సుస్వాగతం' అను కథావ్యాసమున ప్రతి అక్షరమును పాత్రపోషణగుణసంపన్నమై తెలుగువారి స్వతంత్రకథావ్యాసములలో అత్యున్నతస్థానమందఁజాలియున్నది. డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు, (ఎం.ఏ.) జయంతి రామయ్యపంతులుగారి ఉత్తరరామచరిత్రముపై విమర్శకవ్యాసమును; శ్రీ శేషమళ్ళ కామేశ్వరరావుగారు, బి.ఏ., 1872 లో ప్రచురింపబడిన నరహరి గోపాలకృష్ణమసెట్టిగారి 'శ్రీరంగరాజుచరిత్ర' అను నవల 1878 లో ప్రచురింపబడిన వీరేశలింగముపంతులుగారి 'రాజశేఖరచరిత్ర' రచనకు ఎంతవఱకు తోడుపడినదో చూపు పరిశోధకవ్యాసమును, శ్రీ మారేమండ రామారావుగారు (ఎం.ఏ.) 'ప్రాచీనకాలపు జనాభాలెఖ్ఖలు' అను విజ్ఞానవ్యాసమును రచించి ఈ సంచిక విలువను పెంచియున్నారు.

౧౨ పశుసంరక్షణ

ద్వైమాసపత్రిక. సంవత్సరపుచందా ఒకరూపాయి. సంపాదకులు డాక్టర్ యేలెళ్ల శ్రీరాములుచౌదరిగారు జనవరిమాసమున వెలువడిన రెండవసంపుటపు తొలి సంచికలో 'ఎటువంటి వృషభములు మంచివి కావు', 'గోసంరక్షణోద్బోధము', 'పాలలోని వాసనలు', 'పశుపోషణ', 'కాలుగొట్టు', 'పశువ్యాధి: గర్భపాతము', 'భారతదేశము: పశువులు', 'కాలుమాడ' మొదలగు మంచి వ్యాసములుగలవు. రైతులకెంతయు నుపయోగకారిగనుండగల దీపత్రిక. చిరునామా : పశుసంరక్షణ, అంగలూరు, కృష్ణాజిల్లా.

సంపాదకీయ సమాలోచన

పులిగడ్డ అక్విడక్టు:—

గోదావరిపాయలలో రెండింటిపై అక్విడక్టులుకట్టబడి తూర్పుగోదావరిమండలమున మాగాణిభూముల విస్తీర్ణమును పెంచినవి. ఇపుడు కృష్ణానదిపాయలలో నొకదానిపై అక్విడక్టుకట్టుటకు కాంబెల్ దొరవారు శంకుస్థాపనగావించిరి. దివిచెంతగల పంపింగు విధానము దివియందలి వల్లపుసాగుకు సరిపోవు నీటిని సరఫరా చేయజాలకుండెను. నీటి సరఫరా తృప్తికరముగ చేయుటకు అక్విడక్టు నిర్మాణముతప్ప గత్యంతరము లేకపోయెను. బందరుకాలువనుండి ఒక బ్రాంచికాలువ ఈ అక్విడక్టుద్వారా కొనిపోవడి దివిసీమకు నూతనచైతన్యమును ప్రసాదించును. పంపింగు ప్రాజెక్టువలన ఈపటికి నలుబదిరెండు వేల యకరములు మాగాణిసాగు అగుచున్నది. ఈ అక్విడక్టు నిర్మాణమువలన మాగాణిసాగు అగు ఈ విస్తీర్ణము రెండింతలు కాగలదు. క్రొత్తగా త్రవ్వింపబడు కాలువ నలుబదిమైళ్ళ పొడవుండును. దీనినుండి పలుముఖముల పంటకాలువలు సాగగలవు. పెద్ద కాలువగట్టువనే చక్కని కంకరరోడ్డు నిర్మింపబడును. వ్యాపారసౌకర్యము, ప్రయాణ సౌలభ్యము కలిగించు రహదారీపడవల, మోటారుకారుల సౌభాగ్యము దివిసీమకు పట్టగలదు. జలసమృద్ధి, సస్యసమృద్ధి పెంపొందగా దివిసీమ కృష్ణామండలపుకోనసీమ కాగలదు. ధాన్యముధర మూడువంతులు పడిపోయియున్న ఈ దినములలో ఈ ఆయకట్టు పెరుగుదల అనుకున్నంత ఉత్సాహమును రైతుజనులలో కలిగింపకున్నను రాగలకాలము దీనిలాభమును ప్రజలకు చూపగలదు. అక్విడక్టుతోబాటు ఇచట కృష్ణపాయపై వంతెన నిర్మింపదలచిన కృష్ణాజిల్లా బోర్డువారి ప్రజాసేవాభిలాష ప్రస్తుతింపదగియున్నది. తెలుగువారి జీవనదులగు గోదావరి కృష్ణానదులపాయలపై ఇంతవఱకు ఒక్కదానిమీదకూడ వంతెనలు నిర్మింపబడలేదు. పులిగడ్డపాయమీది వంతెనయే అట్టి వంతెనలకు తొలుతటిదికాగలదు. ఈవంతెన నిర్మాణవిషయమున విశేషశ్రద్ధ చూపుచున్న కృష్ణాజిల్లాబోర్డు అధ్యక్షులు శ్రీ చల్లపల్లి రాజాగారు కృష్ణాజిల్లావాసుల కృతజ్ఞతకు విశేషముగ పాత్రులుకాదగియున్నారు.

కీ. శే. ప్రొఫెసరు దేవులపల్లి అప్పల నరసింహముగారు:—

కుంభకోణమునందలి ప్రభుత్వకళాశాలలో ఆంగ్లశాఖాధికారిగానుండి ఆంధ్రకీర్తిని వెలయించుచున్న శ్రీ దేవులపల్లి అప్పలనరసింహముగారు (ఎం.ఏ.) జనవరి 15-వ తేది మధ్యాహ్నము రెండుగంటలకు దివంగతులైరని తెలుపుటకు విచారించుచున్నాము. చనిపోవునరికి వారికి ఏబదిరెండువత్సరములు. రాజమహేంద్రవరమునందలి ప్రభుత్వకళాశాలలో వీరు పలువత్సరములు-ఆంగ్లభాషోపన్యాసకులుగ నుండిరి. కోడితో మేల్కొని గోదావరిలంకభూములకు షికారుపోయి స్నానముచేసి సూర్యోదయముకాకుండ తిరిగి ఇంటికివచ్చువారు. గొప్ప ఆస్తికులు. రాజమండ్రియందుండగా జామాతను గోలుపో

యిరి. పదివత్సరములుగ కుంభకోణమున ఉద్యోగరీత్యా ఉండుచుండిరి. తెలుగుదేశమునను న్నను, అరవదేశమునను న్నను ఈ అధ్యాపకుడు విద్యార్థుల విశేషాభిమానమును చూఱగొనుచుండెను. ఆంగ్లవిద్యాధికులగు ఆంధ్రుల కొందఱివలె వీరు ఆంధ్రభాషను ఈసడింపలేదు. అందు కుశలప్రవేశమును సంపాదించిరి. సంస్కృతమున పెక్కు కావ్యనాటకములను పఠించిరి. 'భారతి' తొలి సంపుటమున ఆంధ్రమునందు వీరు రచియించిన కొన్ని విమర్శకవ్యాసములు ప్రచురితములై యున్నవి. ఆంధ్రభక్తకవిశిఖామణి పోతనామాత్యునిగూర్చి వీరు ఆంగ్లమున నొక చక్కని విమర్శకగ్రంథమును రచియించి ప్రచురించిరి. ఆంధ్రమునగల భక్తికవితను గూర్చి తెలిసికొనగోరు ఆంధ్రేతరుల కది యెంతయు నుపకరింపగలదు. ఇట్లు తమ ఆంగ్లభాషాపాండిత్యమును ఆంధ్రసారస్వతప్రతిభను వ్యక్తీకరింప నుపయోగించి ధన్యజీవనులైన ఈ ఆంధ్రపుత్రుని పవిత్రాత్మ శాంతిధామమున నెలకొనునుగాక!

కీ శే. చల్లా శేషగిరిరావుపంతులుగారు బి.ఏ.

ఆంధ్రుల ఏకైకదినపత్రికయగు ఆంధ్రపత్రికకు 1918 నుండి 1938 నవంబరు 14-వ తేదీవఱకు ప్రధానసంపాదకులుగనుండిన శ్రీ చల్లా శేషగిరిరావుపంతులుగారు జనవరి 16-వ తేది తెల్లవారుజామున నరసారావుపేటలో దివంగతులైరి. చనిపోవునరికి వారికి నలుబదియారు వత్సరములు. ప్రధానసంపాదకులుగనున్న పదునైదువత్సరములును ఆంధ్రపత్రికయే వారిలోకము. ఫిలాడెల్ఫియానుండి ప్రచురింపబడు 'లేడీస్ హోమ్ జర్నలు'నకు సంపాదకుడై దాని విశేషప్రచారమునకు తోడుపడిన సుప్రసిద్ధుడు ఎడ్వర్డు బాక్ వలెనే శ్రీ శేషగిరిరావుగారును సంపాదకకార్యనిర్వహణమున ఎన్నడును గడియారమును చూడలేదు. ప్రతిదినమును కార్యాలయమునకు వచ్చుటలో వారు ప్రథములు; వీడుటలో వారు కడపటివారు. చెప్పిచేయించుకొను నేర్పు లేకపోవచ్చును కాని సర్వము తానే చేసికొనగల ఓర్పు ఉండినది. సంపాదకకార్యనిర్వహణమున వీరు పూర్తిగ ఐక్యమైయుండిరని చెప్పుటకు ఎంతమాత్రమును సందేహము లేదు. లండనులో డెయిలీమెయిలుపత్రిక పెట్టినప్పుడు దాని స్థాపనుదారుడు లార్డునార్తుక్లిఫ్ మొదటి రెండు రోజులును రెండురాత్రులును ఆఫీసువదలి బయటకురాలేదు, రాత్రులయందు నిద్రించలేదు. విధినిర్వహణమున సంపాదకుల కట్టిదీక్షయుండిననే పత్రికలుసాగును. శ్రీ శేషగిరిరావుగారి విధినిర్వహణబుద్ధియు అట్టి ఉత్తమశ్రేణికి చెందినదేయని చెప్పితీరవలయును. వీరికిపూర్వము ఆంధ్రపత్రికకు ప్రధానసంపాదకులుగనుండిన శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి భావములకుగల ఉద్రేకము, భాషకుగల ఉత్తేజము వీరిభావములకు, భాషకు లేకపోవచ్చును. కాని—శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు చెప్పినటుల—"శేషగిరిరావుగారి కర్ణధారత్వమైపుణ్య మేమి యోకాని ఆంధ్రపత్రికానౌక గడ్డపట్టలేదు. కయ్యలలో మునగలేదు. ఒడ్డుకొట్టుకోలేదు. ఒడుదుడుకులు లేనిభావములు, మృదువైనశైలి. మెల్లగ వెన్నెలవలె ప్రవహించి అమృతప్రాయముగ ఆంధ్రులకు ఆమెత లొసంగినది." ఆరోగ్యమును తుదకు ఆయుర్దాయమును ఆంధ్రపత్రికకు ధారపోసి ఆంధ్రులను సేవించిన ఈ ఆంధ్రసంపాదకమహాశయుని పవిత్రాత్మ ఈశ్వరసాయుజ్యము నందుగాక!

మహాత్ముని హరిజనయాత్ర : ఆంధ్ర దేశము

హరిజనయాత్ర సందర్భమున మహాత్ముడు ఆంధ్ర దేశమున 1708 మైళ్ళు సంచరించెనని తెలుపబడినది. ఈమైళ్లలో పోయిన మార్గముననే పోవుటచేత పెరిగిన మైళ్ళు ఎన్నిగలవు? మహాత్ముని ఆంధ్ర దేశ సంచారకార్యక్రమమును ఎవరు నిర్ణయించిరో కాని వారు ఆంధ్ర దేశభూగోళమును మనస్సునందుంచుకొని మాత్రము నిర్ణయించలేదని నిస్సందేహముగ చెప్పవచ్చును. అసలు మహాత్ముడు ముందెప్పుడో కలకత్తా మీదుగ ఆంధ్ర దేశసంచారమునకు వత్తునని తెలిపెనట. కాని మదరాసు వారు మహాత్ముడు క్రిష్టమసులోపుననే వచ్చి ఖాదీ ప్రదర్శనమును జరుప పట్టుబట్టుటచే 'సింగి పెళ్ళిలో పోలిగానికి ఒకపోచ' అను సామెతగ వారి మదరాసురాక ననుసరించి ఆంధ్ర దేశయాత్ర నిర్ణయింపబడినది. ఇట్లు నిర్ణయింపబడిన తరువాతనైనను వారి సంచార కార్యక్రమము భూగోళశాస్త్రము ననుసరించి ఏర్పరుపబడినదా? ఏలూరువారు ముక్కోటినాడు వచ్చినగాని మహాత్ముని చూచుటకు అంగీకరింప లేదు. వారి అభిలాష ఈడేర్చుటకుగాను మహాత్మునిచే తెలుగు జిల్లాలు రెండుమూడింటిపై కప్పదాట్లు వేయించిరి. విలువగల మహాత్ముని కాలమును ఎంతయో వ్యర్థపఱచిరి. ప్రయాణావసరమున కలిగిన ఇంతటి అసౌకర్యమునకు, కాలము వ్యర్థమైపోవుటకు నైనను సహించి మహాత్ముని సరిగా ముక్కోటినాటికి ఏలూరు తీసికొనివచ్చుటకు అతిశ్రద్ధచూపిన ఆంధ్రమహానీయులు పొన్నమండ హరిజన సేవకుడు నిరశనవ్రతదీక్షఁ పూనినను కోనసీమకు మహాత్ముని పాదస్పర్శ లేకుండ చేసిరి. ఈ ఆంధ్ర దేశ సంచారమున మహాత్ముడు కర్నూలు గంజాము జిల్లాలు చూడలేదు కర్నూలు, చూడకపోవుటచే గలుగగల ప్రత్యేకనష్ట మేమియు లేదుగాని గంజాము విడనాడుటచే మాత్రము ప్రస్తుత స్థితిలో ఆంధ్రులకు గొప్ప అన్యాయము జరిగినదని అనకతప్పదు. గంజాముజిల్లా ఆంధ్రులదా? ఉత్కళులదా అను సమస్య నేడు తీవ్రతరమై యున్నది. ప్రభుత్వమువారి దృష్టిలో అది ఉత్కళులదిగానే లెక్కింపబడు సూచనలు గాన్పించుచున్నవి. ప్రభుత్వము వారు ఇట్లు లెక్కింపకుండ చేయుటకు గంజాంజిల్లా ఆంధ్రులు చేసిన విశేషాందోళనమునకు ఉత్తరసర్కారుల ఆంధ్రులు వీసమంతేని సాయము చేయ లేదు. ప్రభుత్వములో పలుకుబడి లేదు కావున సాయము చేయు లేక పోతిమని వారు చెప్పవచ్చును. కాని కాంగ్రెసులో మాకెంతయో పలుకుబడిగలదని చెప్పుకొనుచు ఇవు డిట్లు కాంగ్రెసువారి చేతనే గంజాంజిల్లా ఉత్కళములో జమకట్టించిన ఈ ఉత్తరసర్కారుల కాంగ్రెసు నాయకుల నేమనవలయునో తెలియకున్నది. గంజాంజిల్లానుకూడ ఈ ఆంధ్ర దేశ యాత్రలో చేర్పింప అచటి ఆంధ్రనాయకులు చేసిన విశేషకృషికి ఇతరఆంధ్రనాయకులు తోడుపడకపోగా ఉత్కళయాత్రలో మహాత్ముడు దీజిల్లాను చూడగలడని చెప్పివైచిరి. ఉత్కళయాత్రలో కలిపిచూచిన కాంగ్రెసు దృష్టిలోకూడ గంజాముజిల్లా ఉత్కళులదైనట్లే అని చెప్పికొని ఉత్కళులు గంజాము ఆంధ్రులను ఉడికించుట కెంతేని అవకాశ మేర్పడినదికదా! గంజాము ఆంధ్రులకు గలిగిన ఈ ఘోరమైన అన్యాయము ఇంతటంతట తొలగునదికాదు. ఇన్నిరీతుల ఆంధ్రుల అన

మర్థత గాంధిగారి ఈ హరిజనయాత్రలో ప్రస్ఫుటమైనది

అభినవాంధ్రకవిపండిత సభ .—

అభినవాంధ్రకవిపండితసభవారి ద్వితీయసమావేశము రాజమహేంద్రవరమున జయప్రదముగ జరిగినందుల కెంతయు సంతోషముగనున్నది. సభలో కొందఱు కవులు తమరచనములను పఠించిరి. అందు కొన్ని ఈవఱకు ప్రచురింపబడినవే. సమావేశమైన వారు చదువెఱిగిన పెద్దలు. అందును వారు అభినవాంధ్రకవిపండితులు. క్రొత్త రచనములను మక్కువతో చదువు సారస్వతప్రియులు. అట్టివారి సమక్షమున ఈవఱకు ప్రచురణభాగ్యమునందుటచే ప్రాబడిన రచనములను చదివి వినిపించుటలో గల సారస్యము మాకు బోధపడుట లేదు. ఆంధ్రుల వర్డ్సువర్తు అని కూల్డ్రిదొరచే ప్రశంసింపబడిన శ్రీకవికొండల వెంకటరావుగారి కవిత్వములోని మంజులభావములను వారి పదములను, పాటలను పఠించువిధానము తెలియకపోవుటచే గ్రహింపజాలకున్నారమని అభినవాంధ్రకవులే పలువురు చెప్పుచుండగా మేము వినియున్నాము. అట్టి సందర్భమున ఈ అభినవాంధ్రకవిపండిత సమావేశమున శ్రీవెంకటరావుగారిచే వారి పదములను, పాటలను పాడించుటకు ఏర్పాటు గావించిన దెంతయు సముచితముగను, సంస్తవనీయముగను ఉన్నది. కాని శ్రీవారు పాడుటకిచ్చిన గడువు మధ్యమున చాలింపుడను మాటలు అభినవాంధ్రపండిత సమావేశమునుండి వెడలుట ఆ సమావేశమున కెంతమాత్రమును గౌరవప్రదమై యుండ లేదని మనవిచేయుచున్నాము. పాడిన వినరు - పాడవలసిన పద్ధతిమాత్రము తెలియుదని చెప్పుదురు. ఈ అభినవాంధ్రకవిపండితసభలో శ్రీమతి దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు ఉపన్యసించి పాల్గొనిరి. ఈ దేశబాంధవి భాషాబాంధవికూడ ఎప్పుడైనది? ఈ పూర్వనువాసిని అభినవాంధ్రకవయిత్రికూడ ఎపుడైనది? అభినవాంధ్రకవిపండితసభ వారి తృతీయసమావేశమున ఇట్టి చిల్లరలోపము లుండకుండ సమావేశకర్తలు జాగరూకులై యుందురని నమ్ముచున్నాము.

నరసాపురము తాలూకాభివృద్ధి సంఘము :

ఆంధ్రస్త్రీల పోటీపరీక్షా ఫలితములు: —

నరసాపురము తాలూకాభివృద్ధిసంఘము వారు ఆంధ్రస్త్రీలకు పోటీపరీక్షలు జరిపి వారిలో విశేషవిద్యావ్యాప్తికి ఎట్లు తోడుపడుచున్నారో ఆంధ్రభూమి పాఠకులకు తెలిసినవిషయమే. 1933 డిసెంబరులో జరిగిన స్త్రీల పోటీపరీక్ష ఫలితములు ఇపుడు ప్రచురితములైనవి. శ్రీమతి కిళాంబి సీతమ్మగారు (భీమవరము) పరీక్షయందు మొదటివారుగ కృతార్థత నొంది శ్రీయుత యఱ్ఱమిల్లి నారాయణమూర్తిగారు తమభార్య కీ. శే. శకుంతలాబాయ్‌గారి జ్ఞాపకార్థమై ఇచ్చుచున్న బంగారుపతకమును; శ్రీమతి నముయమంత్రి రాజ్యలక్ష్మమ్మగారు (నర్సాపురము) రెండవవారుగ జయముగాంచి మొగల్తుర్రు భూస్వాములు శ్రీయుత తివారీ యజ్ఞప్రసాదుగారు తమసతీమణి శ్రీమతి దేవకీ బాయ్‌గారి పేర ఈయ నంగీకరించిన బంగారు పతకమును పొందిరని తెలుపుటకు ఆనందముగనున్నది. ఈసంఘమునకు కార్యద్రష్టలై యథాశక్తిని దేశసేవ గావించుచున్న ఆంధ్రపుత్రులు శ్రీ అద్దంకి బిందు మాధవరావుగారికి మా అభివాదములు.



డిసెంబరు, ౧౯౩౩.

౨౦:—మదరాసు. మహాత్ముని రాక.

౨౨:—చెన్నపురి. ఆంధ్రమహాసభయందు శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారి చిత్రపటము గాంధిమహాత్మునిచే ప్రతిష్ఠింపబడుట.

౨౩:—బరంపురము. ఆంధ్రవిద్యార్థి మహాసభ 12-వ సమావేశము డాక్టరు లంక సుందరంగారి అధ్యక్షతను జరిగెను.

౨౪:—రాజమండ్రి. ఆంధ్రా స్తిక మహాసభ.

:—చెన్నపురి. తృతీయ ఆంధ్రనాటక కళాపరిషత్తు. శ్రీ టి. రాఘవాచారిగారి అధ్యక్షత.

౨౫:—ఎలమంచిలి. ఆంధ్రావళి సమాజమువారు సభచేసి శ్రీగిడుగు వేంకటరామమూర్తి పంతులుగారిని పౌరులపక్షమున సన్మానించిరి.

౨౬:—రాజమండ్రి. శ్రీ చిత్రపు వేంకటాచలంపంతులుగారు దివంగతులయిరి.

:—రాజమండ్రి. రావుసాహెబు మహోపాధ్యాయ గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారి డెబ్బదవ జన్మదినోత్సవము. శ్రీ జయంతి గంగన్నగారు అధ్యక్షులు.

౨౭:—బెజవాడ. 6-వ రాష్ట్రీయ మునిసిపల్ ఉద్యోగుల సభ.

:—రాజమండ్రి. అభినవాంధ్రకవిపండితసభ ద్వితీయసమావేశము. ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షులు.

౨౯:—విజయనగరము. టి. ప్రకాశంపంతులుగారు స్వదేశవస్తు ప్రదర్శనమును తెరచిరి.

జనవరి, ౧౯౩౪.

౧:—గుంటూరు. సుప్రసిద్ధ న్యాయవాది దమ్మవళం వెంకటేశ్వరరావుగారి మరణము.

౩:—నూజవీడు. కీ. శే. రాజా శోభనాద్రి అప్పారావు బహద్దరు నూజవీడు రాజాగారి ఏకపుత్రిక శ్రీరంగాయమ్మరావుబహద్దరు గారు మరణించిరి.

౪:—కాకినాడ. పవిత్రాల సుబ్రహ్మణ్యంగారు, ఎం.ఏ.,బి.ఎల్. (వకీలు) మరణించిరి.

:—శ్రీకాకుళము. రావుసాహేబు కత్తిరిశెట్టి వెంకటనరసయ్య నాయుడుగారి మరణము.

౫:—తాలూకాబోర్డులను ఎత్తివేయుటను గూర్చి ప్రభుత్వమువారి సూచనలు గెజెట్టులో ప్రచురింపబడుట.

౯:—కలకత్తా. ఆంధ్రవిద్యార్థులు మేజరు నాయుడు గారికి ఆతిథ్యమొసంగుట.

౧౦:—సుప్రసిద్ధ ఆంధ్రచిత్రకారులు శ్రీ కవుతా ఆనందమోహనశాస్త్రిగారి చిత్రకళా కౌశలమును ఫ్రాంసుపత్రిక ప్రశంసించుట.

౧౧:—గుంటూరు. మధ్వ శ్రీ అవధానశిరోమణి శ్రీ పండిత కాశీ కృష్ణాచార్యులవారు వ్రాసిన సంస్కృతగ్రంథములను జర్మనుభాషలోని కను వదించుటకు అనుమతినియ్యవలెనని జర్మను పండితులు కోరుట.

౧౨:—కృష్ణానది పాయను పులిగడ్డవద్ద కట్టనున్న ఆక్విడక్టుకును, వంతెనకును సర్ ఆర్చిబాల్డు కాంబెలుగారు పునాది రాయివైచిరి.

౧౪:—పగలు 2-30 గంటలవేళ హిందూదేశమునందంతటను ప్రచండభూకంపము.

:—కుంభకోణము. ప్రొఫెసర్ దేవులపల్లి అప్పల నరసింహాంగారు కాలేజీ ఆంగ్లశాఖాధికారులు, ఆంధ్రులు మరణించిరి.

౧౫:—నరసారావుపేట. ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ చల్లా శేషగిరిరావు పంతులుగారి మరణము.

తగ్గింపు వెలలు

త్వరపడుడు

1934 జనవరి 20-వ తేదీ మొదలు 1934 మార్చి 20-వ తేదీవఱకు.

కవికొండల వేంకటరాయ విరచితములు.

పాత్రముపేరు	ప్రతి 1-కి	అసలుధర రు. అ. పై.	తగ్గింపుధర రు. అ. పై.
1. జనపదములు	,,	0 4 0	0 1 0
2. మాతృకేళసంకీర్తనము	,,	0 4 0	0 1 0
3. కలరుతము	,,	0 4 0	0 1 0
4. కుమారకంఠము	,,	0 4 0	0 2 0
5. చదువులదుత్త	,,	0 4 0	0 2 0
6. కోసేరు	,,	0 4 0	0 2 0
7. చిట్టికైత	,,	0 6 0	0 3 0
8. ఆగడపులు	,,	0 8 0	0 4 0

షరా:— పై పాత్రములు విడివిడిగ వలసినను ఆయా తగ్గింపుధరలకు ఈయబడును గాని తపాలఖర్చులు విశేషమగును. ఒక రూపాయకు తక్కువకాని ఆర్డరుతో రూపాయ ముందుగ మనియార్డరు చేసినయెడ తపాలఖర్చులు ప్రకాశకులే భరించి బుక్కుపోస్టుగ పాత్రము లంపగలవారు.

* ఏతత్కవికృతము లింకను అచ్చుపడి వెలకు సిద్ధముగ నున్నవి.

		రు. అ. పై.	
1. త్రయి	ప్రతి 1-కి	0 14 0	రెండునుగలిపి
2. ప్రకృతిచందనము	,,	0 4 0	రు. 1 0 0
3. ఆత్మవ్యక్తి	,,	0 8 0	రెండునుగలిపి
4. నెలబాలుడు	,,	0 12 0	రు. 1 0 0
5. జంటలు	,,	1 0 0	రెండునుగలిపి
6. పొట్టికత	,,	0 8 0	రు. 1 0 0
7. విబుధకుసుమావళి	,,	0 8 0	రెండునుకలిపి
8. విప్రసందేశము	,,	1 0 0	రు. 1 0 0

వలసినచో:— కవికొండల వేంకటరావుగారు, బి.ఏ, బి.ఎల్.
ఇన్నీసుపేట, రాజమండ్రి. అని వ్రాయనగు.

గతమాసపు పోటీపరీక్ష సమాధానము

1. తవుడు. 2. అవుసు. 3. గోవులు. 4. లవుడు. 5. నివులు. 6. శావులు. 7. చవుక. 8. నావుడు. 9. పూవులు. 10. మూవురు. 11. మావులు. 12 కవులు. 13. చెవుడు. 14. శావురు. 15. ప్రోవులు. 16. దేవుడు.

బహుమానము పొందినవారు

పోటీచేసిన ఏబదియిద్దరిలో 16 టికిని ఒకరే సరియైన పైసమాధానము నిచ్చిరి. బహుమానమునకు తగిన వారి నామము: జి. యల్. నరసింహశాస్త్రిగారు, సేలము.

రత్నపురుష

శుక్లనష్టమును మాటిగ కుదుర్చు తియ్యని మందు.

మేహరోగులపాలిటివరప్రసాదము.

పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధి కలిగించు మూలికలకు రాజా అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి, కంఠపుష్టి నొంది బలారోగ్యములను పొందుదురు. డబ్బీ రూ. 3-0-0.

చరకనిలయము, ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి.



"విరహిణి"

[శ్రీయుత వై. సుబ్బారావుగారి త్రివర్ణచిత్రమునుండి ఎత్తిన ఛాయాపట చిత్రము.]

పురాణపురుషా!

దీనబంధూ! ప్రతిక్షణమును
మహాయుగముగా దోచుచున్నది.

ప్రతిదినమును దుర్దినముగా నగపడుచున్నది. ప్రతిరాత్రియు కాళరాత్రివలె భయపెట్టుచున్నది. ఇట్లెన్నెన్నియో సూర్యోదయసూర్యాస్తమయముల క్రమియింప జేసితివి. అక్కటా! యీదీనహృదయమున నింక సౌఖ్యబీజమును నాటుటకు తావే లేదా? స్వామీ! బీజావాపనకు నేడే మంచిముహూర్తము....పుణ్యాలయా! కాల మనంతవేగమున నడచిపోవుచున్నది. దినములు, మాసములు, సంవత్సరములు ఒకదాని వెంట నొకటి పరుగెత్తుచున్నవి.నిత్యమును, రేపురేపని నీకృపావృష్టికై యెదురుజూచుచుంటిని. ఇంక నిట్లెన్నిదినములు గడుపగలను? నేను మాటిమాటికి 'భిక్షాం దేహి' యని యాచించుటదక్క నీనోట బ్రత్యుత్తరము వినజాలకున్నాను. అబ్బా! నీవెంతటి మానివైనను ఒక్కమాట నుడువగూడదా?... జగచ్చక్షూ! ప్రతిదినమును, ప్రతిక్షణమును నీకు మొఱ్ఱవెట్టుకొనుచుంటిని; కాలచక్రము గిఱ్ఱున దిరుగుచున్నది; ఒక్కొక్క దినమే జఱ్ఱున జారిపోవుచున్నది; సంవత్సరములు చుట్టివచ్చుచున్నవి; సంతోషదినములు స్వప్నవృత్తాంతములైనవి; నన్ను తులుమాత్రము చేయించుకొనుచున్నావు, మన్ననలకు సున్న జుట్టుచున్నావు. అక్కటా! యీయవధిలేని యాందోళన, వినుగులేని విన్నపము, విరామములేని విచారము, నే నెంత కాలము కొనసాగింపగలను? నీపాదసేవ చేసిచేసి చేతులగడికి కొనవలసినదేనా? అన్యాయ మన్యాయము.

—పుతుంబాక శ్రీకృష్ణయ్య.

పలనాడు

కలనాడుల కూటువ పెం
దలమానికమయి శశాంకు తలమానిన కీ
ర్తుల తీవకందమై తగు
పలనాడూ! నీదుకడుపు ఫలవంతముగన్.

నీ వీరత్వము నీమహత్త్వమును నిర్నిద్రప్రతాపంబు కృ
ష్ణా వేణీతిలకంబు నిర్మలజలస్నాతప్రపూతాత్మనై
యే వేళం గలనాదగీతకలనా హేలావిలాసంబులం
గై వారించునుగాఁ బ్రదక్షిణపురస్కారంబు సద్భక్తితో.

రణరంగంబను పల్కు వీనులను జేరన్వచ్చునో లేదొ యూ
పున సౌవర్ణిక కేళికా భ్రమరకంబు ల్గాలితోఁ దన్ని క్రూ
రనిశాతాసినికృత్తవైరిగళవిద్రావన్నవీనోష్ణలా
రుణరక్తప్లుతి నిన్నుఁ దేల్చెడి కుమారుం గంట నీకే తగున్.

వీరారాతుల గుండెగాలములఁ బృథ్వీకన్యకారత్నముల్
సారోదారత జోలవాడు సరసీజాతాక్షులం గాంచమో
యేరీ దుష్కరమంత్రఖడ్గకృతి నూయేలంబలేరే జోపు దు
ర్వారప్రాభవ నాగమాంబకడఁ జెప్పంజాలువా రిమ్మహిన్.

జగములఁగల శూరత్వం
బిగిరి కరుడుగట్టి నీవ యేర్పడితో? లే
కగణితపుణ్యఫలంబున
మగటిమి నీ గర్భజననమహిమం గనెనో?

దినదినమంతరించు నటిదీనుఁ జిరంతన జీవిఁ జేయు నీ
కనదభిధానమంత్రమణి గండరగండనిఁగా నొనర్చు నీ
వినుతపయస్సుధారసము పేదరిగుండెను నీ మహత్త్వపుం
దనువు దలంపనౌనె? పలనాడు! గ్రహింపుము మన్నమస్సులన్.

—వడ్లమూడి వేంకటరత్నము.

సూరిసిద్ధాంతం. ౨.

'డ్రాస్టిక్ స్టెప్స్! స్ట్రాంగ్ మెజర్స్!—' అన్నాడు సూరి.

'తెలుగు ఏడవ్వోయ్! ప్రతిదానికి వెధవ ఇంగ్లీషు!'

'రైటో! అఘాయిత్యమైన మెట్లు! బలమైన కొలతలు!—'

'వద్దు! వద్దు! ఇంగ్లీషులోనే కానియ్యి.'

'నాకు తెలుగురాదంటే వింటావామవ్వ? నాసిద్ధాంత మేమిటంటే, ఎవరైనా కానీ కొంత అఘాయిత్యం, మొండితనం చెయ్యకుండా లోకాన్ని జయించలేదు!'

అది నిజంకూడాను. అసలు సూరి వాకింగ్ ఎన్సైక్లోపీడియా. (నాకూ సూరిదుర్గుణం అలవాటుపడ్డది. అట్లాఅని 'నడుస్తున్న విజ్ఞానసర్వస్వం' అంటేమాత్రం ఏమంతబాగుంది?) ఏవిషయమైనా అడగండి సూరి చెపుతాడు. సూరికి తెలుసు, ఆడవాళ్ళు తల్లోపెట్టుకునే సూదులదగ్గిర్నించి కాస్మిక్ రేస్, మాదరస్ స్పిరిచువలిజం వరకూ వాడికి తెలీని విషయంలేదు. అయితే వాడి స్ట్రాంగ్ పాయింటేమిటంటే 'గృహచ్ఛిద్రాలు.' ఆ పేరుతో వా డొకపెద్దగ్రంథం రాయటం ప్రారంభించాడు. అది పూర్తిఅయిన తరవాత అన్నిసంసారాలూ చక్కపడగలవు. అంతదాకా మీరంతా ఇదివిని తృప్తి పడవలిసిందే. (సూరిసిద్ధాంతం నిజంగా పనిచేస్తుందా అని అనుమానించేవారి కిప్పుడే ఒకముక్క చెప్పేస్తాను. నా పైసంపాదనవిషయం ఇంట్లోవాళ్ళకు అంతుపట్టనివ్వవద్దని సలహాఇచ్చి మాకొంపలో కాస్త శాంతి నెలకొల్పింది వీడే!)

'లోకంలో అనేకరకాల పశువులున్నారు. వాళ్ళను గురించి కథల్లోనూ, నాటకాలలోనూ చదువుతునే ఉన్నాంకాని ఎదురుగావచ్చినప్పుడు చూసీచూడనట్టు ప్రవర్తిస్తున్నాం. ఎందుకు? చిన్నసంగతి చెబుతాను విను. నాస్నేహితుడిచెల్లె లొకపిల్ల ఉంది. ఆపిల్లభర్త మంచివాడేకాని దేబె. ఉత్తకొబయ్య. కాపరానికి పోయిందిమొదలు ఆఅమ్మాయిని కుక్కకన్న నీచంగా చూశారంటే నమ్ము. ఆపిల్లవెధవఆడబిడ్డ పనిమనిషిని చూసినట్టు చూసేది. బావగారు భార్యనుచూసినట్టు చూసేవాడు. మామగారు—అమితదురహంకారి—మీదపడి కొట్టేవాడు. మొగుడంతాచూస్తూ ఊరుకునేవాడురా! వాడిసైకాలజీ ఎటువంటిదో మరి! ఆపిల్లకు సహజంగా ఒళ్ళుకుండేది. కాని ఏంచేస్తుంది. ముచ్చటగా మొగుడిచేత సింహాసనం ఎక్కించుకోవలిసిన రోజులలో చీవాట్లూ, చెప్పుదెబ్బలూ!

'చుట్టుపక్కలవాళ్ళంతా చూస్తూ ఊరుకున్నారా అంటావా? ఆయనకు ప్రోత్సాహంకూడా ఇచ్చారేమోనని నా అనుమానం. ఆయన చాలాధనికుడు!

'ఆపిల్ల చాలాపౌరుషంకలది. అందుకని ఎవరితోనూ చెప్పుకోలేదు. మొగుడ్నిచూస్తే ఉన్నగౌరవం పోత్తిగా పోయింది; కాలానిక్కట్టుపడి ఉంటున్నది. ఇట్లా జరుగుతుండగా ఆపిల్ల గర్భిణిగాఉండి ఆడపిల్లను ప్రసవించింది. అంతటితో ఆపిల్లకష్టాలు రొండింతలయినై. ఒరే! నే ఒక్కటేచెబుతున్నాచూడు! ఆడపిల్లపుడితే ఏడిచేవాళ్ళకుంటే ఒక్కటేశిక్ష! అటువంటివాణ్ణి ఆడవాళ్ళంతా బహిష్కరించి దగ్గిరికి రానివ్వకూడదంటేసరి! ముష్టి ఆచారలను అతిక్రమించలేక, ఆడపిల్లపెళ్ళి గొంతుకుఉరల్లే చేసుకుని ఆడపిల్ల పుట్టిందని వలవలా ఏడుస్తారు.

'ఇట్లా కొంతకాలం గడిచిందమ్మా! మాస్నేహితుడిచెల్లెలు మరోఆడపిల్లను కన్నది! శిక్ష! ఏమంటావు? ఆరోజునించీ ఆపిల్ల పడ్డపాట్లు చెప్పటానికి వీలులేదు. ఈలోపల మాస్నేహితుడివైపువాళ్ళు చూచాయగా పిల్లకష్టాలనుగురించి విన్నారుకాని పిల్లనడిగితే నిర్లక్ష్యంగా ఏమీలేదు పొమ్మన్నది. కాని మాస్నేహితుడు మాత్రం కోపంవస్తే మనిషికాడు. వాడు చాలారోజులు కోపం ఆపుకున్నాడు. మళ్ళీ చెల్లెలు మూడోసారి

ప్రసవించటానికి వచ్చినప్పుడు ఆపిల్లను నిలబెట్టి సంగతి యావత్తూ కనుక్కున్నాడు. ఇంకేముంది?—అప్పుడు నువ్వయితే ఏంచేస్తావురా?'

'ఇంకా ఏంచేసేదేమిటి? ఆముసలాణ్ణీ కొడుకుల్నీ చిత్రవధ చేసేస్తాను!'

'తప్పకుండా! నీతెలివితేటలు నాకుతెలుసును... సమయానికి నేను దేవుడల్లే వచ్చాను. (మామూరికి మాడెస్టీ అనేది ఏకోశానాలేదని ఇప్పుడే తెలుసుకోండి!) మా స్నేహితుడు కత్తులూ కటారులూ తీసుకుని ప్రయాణమౌతున్నాడు. వాడి ప్రయాణం ఆపి, వాణ్ణి మెల్లిగా సమదాయించి, వాడిచెల్లెలితో మాట్లాడాను. ఆపిల్లకు మొగుణ్ణిచూస్తే బొత్తిగా అభిమానం పోయింది. కాని మొగుడికి తన్నుచూస్తే ఒకవిధమయిన పిచ్చిప్రేమ లేకపోలేదన్నది. అంతే నాకు కావలిసింది. అప్పుడే మాస్నేహితుడిచేత బావమరిదికి ఒక ఉత్తరం రాయించాను. నీభార్య, మాచెల్లెలు, తిరిగి ఆడపిల్లను కని అప్రతిష్టపడలేక విషంతీసుకుని ఆత్మహత్య చేసుకోటానికి ప్రయత్నంచేసింది. కనుక్కున్నాం. డాక్టరు వచ్చి ఏదోమందిచ్చాడు. పిల్ల అపాయకరమైన స్థితిలో ఉంది' అని.

'ఆఉత్తరం అందినతరవాత ఆపిల్లమొగుడి అవస్థ వర్ణనాతీతం. అది చదువుతూనే మత్తువదిలిన తాచల్లే లేచాట్ట. తల్లినీ తండ్రినీ తిట్టాడు. అన్నమొహాన చేతులోఉన్న పుస్తకం విసిరేశాడు. తనభార్య బతక్కపోవాలి ఒక్కొక్కరి నెత్తురూ తాగి పేగులు మెళ్ళోవేసుకోకపోతే ఛీ! మాదిగాణ్ణేనని ప్రతిజ్ఞచేసి అత్తవారింటికి పరిగెత్తుకొచ్చాడు. తరవాత చెప్పేదేముంది! ఆ కాపరం కుదటపడ్డది అతనిప్రతిజ్ఞ మళ్ళీమళ్ళీ విన్నతరవాత మాస్నేహితుడిచెల్లెలు భర్తమీద అభిప్రాయం మార్చుకుని చాలాప్రేమగా ఉండటం మొదలుపెట్టింది. ఇప్పుడాపిల్ల ఆరుగురాడపిల్లలనుకన్న దింతవరకు. అత్తగారూ మామగారూ తమ కసలు మగపిల్లలే అక్కర్లేదన్నట్టు నటిస్తారు, చిన్నకొడుకు చెవిలేటుమారంలో ఉన్నంతకాలం.'

'నువ్వు చాలా తెలివికలవాడివిరా, సూరీ! అందరికి అంత అఘాయిత్యంగా ఉత్తరం రాయటానికి దమ్ముంటుందంటావా?'

'నన్నేం చూశావు! నాతల్లోనింది దూరిపోయిన వాడున్నాడు అఘాయిత్యానికి. (ఇంకోడికొప్ప ఒప్పుకునేగుణంకూడా ఉంది సూరిదగ్గిర. ఏమాటకామాటే!) పార్వతీశమని. మహాఅందంగా ఉండేవాడు. అతనికి వేలువిడిచిన మేనమామ ఒకడుండేవాడు. ఆయన్ను పార్వతీశంతాత దగ్గిరికి తీసి పెంచటంవల్ల వేలువిడిచిన లక్షణాలేమీ కనిపించకుండా పోయినై. ఆయన కో కూతురున్నది, శారద అని. అందరూ వద్దువద్దంటుంటే ఆపిల్లకు తండ్రి ఎనిమిదోఏట పెళ్ళిచేశాడు, నాకింకా సంవత్సరానికి మారకంఉంది కన్యాదానఫలం దక్కాలి అట్లాఅని. ఆయన కొంచెం చాదస్తమ్మొగుడులే మొదటి నించీ! కన్యాదానఫల మాబాగాదక్కింది! శారద మొగుడు పెళ్ళయిన ఆరునెలల్లోనే చచ్చి ఊరుకున్నాడు. అబ్బాయిలూ, దిబ్బాయిలూ! అందరూఆయన్ను అడ్డమైనతిట్లూ తిట్టారు.


'మొగుడుపోయిన తరవాత మూడునాలుగేళ్ళ కా పిల్ల రజస్వల అయింది. తనతోటివాళ్ళంతా ఒకరొకరే కాపరానికి పోతుంటే ఆపిల్లకు చాలాదుఃఖంగా ఉండి, తనకూడా తిరిగి ఎందుకు పెళ్ళిచెయ్యరని తండ్రినీ తల్లినీ అడగటం మొదలుపెట్టింది. అటువంటి పనిచేస్తే తనకు కొరవాదినరకాలు రావటమేకాకుండా తన్ను యావన్మందీ బహిష్కరించి వెలిపెడతారు కనక తను అటువంటి పనిచెయ్యటం కల్లోవార్తఅని తండ్రి ఖచ్చితంగా చెప్పేశాడు.

'శారద కిదంతా ఉన్మత్త ప్రేలాపనల్లేనూ సంధిమాటల్లేనూ ఉండి తనబావ కో ఉత్తరంరాసింది. నేను చూశాను కూడాను.

'ఏం, బావా! నన్ను పెళ్ళిచేసుకున్నవాళ్ళూ, చేసినవాళ్ళూ రవరవనరకానికిపోతారా? మానాన్న అంటున్నాడు. ఇదంతా నిజమేనా? నీకు రవరవనరకమంటే భయమేనా? ఎందుకంటే నాకేం భయంలేదు. నువ్వెప్పుడూ ఇక్కడికి రావేం? ఈసారి శలవలకు వస్తావా? తప్పకుండా రా బావా. చాలారోజులుందిగాని. ఏం?

నేను పూలు పెట్టుకుంటే ఎంతబాగుంటుందనుకున్నావు. మరి మాఅమ్మ పెట్టుకోనీదుగా. అందుచేత మా అమ్మ చూడకుండా పెట్టుకుంటాను. తప్పక రా బావా. ఇట్లు, నీ ప్రియురాలు, శారద.'

'ఇదంతా తెలిసి రాసిందనటానికీ వీల్లేదు; అజ్ఞానంలో రాసిందనటానికీ వీలులేదు. మొత్తానికి ఆ ఉత్తరంచూసి పార్వతీశం ముగ్ధుడైనాడు. ఎట్లాగైనా శారదను చేసుకోవలసిందే ననుకున్నాడు. అతనికి వేలు విడిచిన మేనమామగారింట్లో తనకు కలిగే ఇబ్బందులు స్పష్టంగా తెలుసును. వాటన్నిటికి సిద్ధమై మరీ బయలు దేరాడు.



'వాకిట్లో బావనుచూడగానే శారద 'ఓ! బావొచ్చాడే, అమ్మా!' అంటూ కేకలుపెట్టి నాట్యం చెయ్యటం మొదలుపెట్టింది. అయితే అంత సంతోషంలోకూడా తనురాసిన ఉత్తరంచూసి వచ్చాడన్నమాట బయటపెట్టలేదు. ఆసంగతి గమనించాడు పార్వతీశం. కాని అతను శారదవంక కఠినంగా చూశాడు. శారద నిర్ఘాంతపోయింది. ఈచర్య ఆపిల్లకర్థంకాలేదు. అతను తనతో మాట్లాడినప్పుడల్లా కసురుకుంటూ మాటలాడటం చూసి ఇంకా ఆశ్చర్యపడ్డది. ఆమధ్యాహ్నం అతను అత్తతోను, మామతోనూ రహస్యంగా 'శారదాం మరీ మితిమీరుతున్నది. దాని కలుసిచ్చి పాడుచేస్తున్నారు. ఈడొచ్చిన మొగాళ్ళతో అది అట్లా పూసుకుపూసుకు తిరగటం ఎంత అప్రతిష్ట!' అన్న మాటలు వింటే శారదకు గుండెపగలవలసిందే. తనతో బావ సరిగా మాట్లాడకపొయ్యేటప్పటికి శారద మొహం ఇంతచేసుకునిదిగులుగా ఒక మూల కూర్చున్నది. బావకు కోపంవచ్చిందనుకున్నది.

'రెండుగంటలకు శారదతండ్రి స్కూలుకు వెళ్ళాడు. మూడుగంటలకు తల్లి పురాణంచదివేచోట కూర్చుని నిద్రపోబోయింది. శారదా, బావా మిగిలారు. శారద కోపంగా బావదగ్గిరకొచ్చి, 'ఏం, బావా! నా మీద అంతకోపం వచ్చింది. నాతో మాట్లాడవా?' అంది. పాపం పార్వతీశానికి కళ్ళనీళ్ళపర్యంతమయింది.

'ఓసి, పిచ్చిదానా! నాతో అట్లామాటలాడితే మీఅమ్మ కోప్పడదుటే?' అన్నాడు పార్వతీశం.

'అయితే నన్నుచూస్తే నీకు కోపంలేదన్నమాటే!' అంది శారద మొహం అంతచేసుకుని.

'ఏంతమాత్రంలేదు. నువ్వువెంటనే వెళ్ళి తల్లో పూలుపెట్టుకురా!' శారద దొడ్లోకి పరిగెత్తుకుపోయి తలలోపూలు అడ్డదిడ్డంగా కుక్కుకొచ్చింది..! 'మొహాన కుంకంబొట్టు పెట్టుకో!'. శారద బొట్టు పెట్టుకుంది.

'నాకో చిన్నముద్దుపెట్టూ!...బావనుకాదూ?' శారద ముద్దుపెట్టుకోనిచ్చింది. పార్వతీశం కొసరుకింద గట్టిగా శారదను కౌగిలించుకున్నాడు.

'నన్ను పెళ్ళిచేసుకుంటావా, శారదాం?'

'ఎట్లా? నాన్న ఒప్పుకోడు!'

'మాబాగా ఒప్పుకుంటాడు. నీకు మట్టునెల ఎప్పుడు? పిచ్చిసిగ్గులుపడి నాప్రయత్నం పాడుచెయ్యి!

విదియ నాటికా? అయితే ఆనాటికి బయటఉండను!'

'ఎట్లా?' అంది శారద రహస్యంగా.

'ఎవరితోనూ—మీ అమ్మతో చెప్పకుండా గడిపెయ్యలేవూ మూడురోజులూ?'

'ఇంట్లో కలవనా?'

'మరేమీ ఫరవాలేదు ఒక్కసారికి. నేనావిషయం బాగాచదివాను. డాక్టర్ల నడిగాను. ఏమీతప్పులేదు.'

'తరవాత?'

'నేను చేస్తాను. మనంపెళ్ళిచేసుకుంటే అంతా మన నోట్లో ఉమ్మేస్తారు. ఇష్టమేనా? నేను నిన్ను ఎప్పుడూ ఇంత ఆపేక్షగా చూడకపోవచ్చును. అది కూడా ఇష్టమేనా? నేను నిన్ను కొట్టవచ్చును. ఏం? ఛీష్!'

మళ్ళీ ఇంకోముద్దుపెట్టుకుని శారద మొహంమీద కుంకంతుడిచి తలలోపూలు లాగేసి, 'నేను మళ్ళీచెప్పేవరకూ నాతో మాటలాడకు. సరేనా?'

'సరేకాని, నేను పూలుపెట్టుకుంటే బాగాలేను, బావా?'

'చిలకల్లే ఉన్నావు! లేకపోతే నేను ముద్దుపెట్టుకుంటానా? నాతో మాట్లాడకు, మరిమరుపుదానా!'

'చెప్పేదేముంది? పార్వతీశంచేసిన అస్త్రం అమోఘంగా పనిచేసింది. ఏకాదశి గడిచింది, ద్వాదశి గడిచింది. శారద వాకిటఉండలేదు. తల్లీ దండ్రీ రహస్యంగా మథనపట్టం మొదలుపెట్టారు. చాటుగా శారదను పరీక్షచేశారు. ఆపిల్ల ఏప్రశ్నకూ సమాధానం చెప్పలేదు. భ్రూణహత్యామహాపాతకం చెయ్యవలసివస్తుందా ఏమిట్రా భగవంతుడా! ఈ అపవాద భరించట మెట్లాగని శారదతండ్రి వాపోవటం మొదలుపెట్టాడు.

'సనాతనధర్మాన్నిగురించీ, మతాచారాలనుగురించీ, విధవావివాహాలుచెయ్యటంయొక్క బుద్ధితక్కువను గురించీ ఇన్నిరోజులనించీ పార్వతీశం ఇస్తున్న ఉపన్యాసాలు మేనమామమనసున నాటి ఆయన కతన్ని చూస్తే మంచిగురి ఏర్పడ్డది. ఈవిషయం అతని సలహా అడగ వలసిందే ననుకున్నా డాయన.

'చాలాసేపు విషయం అర్థంకానట్టు నటించాడు పార్వతీశం. తరవాత మండిపడి మామను తిట్టటం మొదలు పెట్టాడు.

'మీచనువులూ, ఆపేక్షలూ నాకర్థంకావు. మీ మూర్ఖులుపిల్లల కళ్ళన్నీ ఈ ఇంటిమీదనే ఉంటున్నై. అటువంటప్పుడు ఎంతజాగ్రత్తగా ఉండాలి? అయ్యయ్యో! ఎంత అపకీర్తి! ఎంతపాపం! శిశుహత్యచేసి నరకానికి పోతావా? చెయ్యక అపవాదుపడతావా! రౌరవాదిమహానరకాలు—'

'మామగారిశరీరం కంపించి ముచ్చెమటలు పొయ్యటం మొదలుపెట్టింది. 'ఉండరా! నాయనా! నాకీ ఆపదతప్పే ఉపాయంచెప్పు! నీయింట కుక్కనైపుట్టి నీరుణం తీర్చుకుంటాను!'

'అటకతవక పనులన్నీచేసి ఉపాయంఅడిగితే ఏం చెప్పను. నావల్లకాదు" అన్నాడు పార్వతీశం.

'శారద తల్లిదండ్రుల అవస్థ వర్ణనాతీతం. పార్వతీశం వాళ్ళను కొంతబాధపడనిచ్చి 'ఒక్కఉపాయం లేకపోలేదు,' అన్నాడు.

'ఏమిటది? ఏమిటది?' అన్నారు శారద తల్లిదండ్రులు ఏకగ్రీవంగా.

'ఎవరికైనాఇచ్చి వెంటనే పెళ్ళిచేస్తేసరి! అపవాదు తప్పుతుంది. నరకంఎట్లాగూ తప్పదు.'

'ఎవరు చేసుకుంటారు?'

'దాన్ని గుంటూరు తీసికెళ్ళి ఎవరికైనాచూసి అంటగడతాను.' ఈ ఏర్పాటుకు అంతా ఒప్పుకున్నారు. శారదకూడా.

'శారదనుతీసుకుని పార్వతీశం గుంటూరువెళ్ళాడు. పదిహేనురోజుల కతనిదగ్గిర్నించి ఉత్తరంవచ్చింది.

'మామగారికీ, అత్తగారికీ నమస్కారములు. ఎంత వెతికినా శారదకు మొగుడు దొరకలేదు. ఇక తప్పక నేనే చేసుకున్నాను. అందుకోరకు మీరు నాకు చాలా కృతజ్ఞులై ఉండవలెను...చెప్పటం మరచిపోయినాను. ఇవాళే శారద వాకిటఉంది. రౌరవనరకంవిషయం మీకు ఏమాత్రం భయం అవసరంలేదు.'

'ఒక్కసంగతిమాత్రం చెప్పాలి. వాళ్ళిద్దరూ ఈ నాటికీ చాలా అన్యోన్యంగా ఉంటున్నారు—మనలో చాలామందికి చాతకానివిద్య!'

'కనక ఉంటారు!' అన్నాను.

'అవును! లేకపోరు!' అన్నాడు సూరి.

—కొడవటిగంటి కుటుంబరావు.

వలపుటలుక

[సత్యాకృష్ణుల నడుమ నడచిన 'నెయ్యపుఁగిన్క' వృత్తాంతమును ముక్కుతిమ్మనార్యుడు తన ముద్దు పల్కులతో తెలుగువారికి తెలిపియున్నాడు. ఒకానొక ప్రణయినీప్రణయుల నడుమ నడచిన 'వలపుటలుక' 'యైహికానందప్రవాహపూరకమైన శృంగారరసము' చిప్పిలునట్లు క్రిందికావ్యమున ప్రస్తరింపబడినది.

మ. కలుషింగుబ్బలు పొంగ కన్నుఁగవ తళ్కుం జెక్కులన్ మోవి సొం
పులుఁ జూపింపక నేఁగ మవ్వలికి మోమున్ ద్రిప్ప నేమాయె ని
న్వలశేనే నెత్తిగుంపులుం బిఱుదులున్ వామాక్షి! చాల్ మాను రో
ష్టైలకున్ రేపున, సున్నకున్ మొదలుం గంటే! వింటివే! రొచ్చటన్.

మ. కరబింబాధరమున్ బయోధరములున్ వక్త్రాలకంబుల్ మనో
హరలోలాక్షులు జూసి కవ్వలి మొగంబైనంత నేమాయె నీ
గురుభాస్వజ్జఘనంబు గ్రొమ్ముడియు మోహం బాలదే గంగ క
ద్దరి మే లిద్దరి కీడునుం గలదె? యుద్యద్రాజబింబాననా!

అను చాటువులలోఁగల పచ్చితన మిందు గానము. కాని ఆచాటువులందలి నాయకులవలె ఇందలి నాయకుడును నాయికను ప్రార్థనామృదూక్తులతో ననునయించుచున్నాడు. అక్కడ కల్పించిన 'అల్పకోపసుందరంబైన మోము' అను పదమువలెనే ఈకవి కల్పించిన 'కుపితవృత్తివిలాసము' అను పదము ప్రసాదభావనివ్యంజిని యైయున్నది. కృష్ణశాస్త్రిగారిచే సృష్టింపబడిన ఒక నాయిక నేత్రములు 'అర్థముకాని భావగీతములు'—ఇందలి నాయిక దృఙ్మాలిక 'మాటలకూరుపు లేని మంజుభావాల మనోహరమ్మయిన పద్యము.' ప్రార్థించియు, బ్రతిమాలియు ఇందలి నాయకుడు 'అన్యోన్యచుంబనాశ్లేషణముల బావళిక' నొందియున్న జంటను జూపియు నాయికను ప్రలోభపెట్టుచున్నాడు. —సంపాదకుడు.]

కాటుకరేకలం బెళుకుఁగన్గొనలన్, దిలకమ్ము మోమునన్
నీటుగ సంతరించి రమణీయములైన వినీలకేశముల్
పాటననేసి నాదరి కలంకృతవై యరుదెంచి నిల్చి నీ
వేటికి మాటిమాటికి సఖీ! కనుఁగొందువు నాకనుంగవన్?

మృదుపాదమ్ములపై నటించు వసనోర్మిశ్రేణులన్ సర్ది పే
రెదపై జాఱిన పయ్యెదన్ గరములన్ శృంగారమేపారఁ దీ
ర్చెద వేలా, కరభూషణావళులుఁ, గాంచీకింకిణీమాలికల్,
పదమంజీరము, లుజ్జ్వలద్యుతిమయప్రాలంబికల్ మ్రోఁగఁగన్.

వాలినతెప్పలన్ మఱలఁ బైకొకయించుకయెత్తి యొక్కదృ
ఙ్మాలిక నర్థవంతముగ మాటలకూరుపు లేని మంజుభా
వాల మనోహరమ్మయిన పద్యముగా విరచించి నాదు నే
త్రాల హృదంతరాళముల వ్రాసెదవేటికి ముగ్ధబాలికా!

నావదనమ్ముఁ జూచి తెలినవ్వులు నింపెదవేల నీదుకె
మ్మోవిపయిన్ లతాంగి! నవముగ్ధముగా, జఘనమ్ములంటి సొం

పై వదులై రహించు జడయల్లిక పొందికలోనఁ గమ్మనె
త్తావులు జల్లు మల్లెలు వితతస్ఫురణన్ ననుఁబల్కరింపఁగన్.

నీకనుదోయిచూపులకు నీచిఱునవ్వులకున్ మదీయవీ
క్షాకమనీయహాసములు కాంతులు సేసితి వేమొ కాన్కగాఁ
గైకొన; యత్నపూర్వకముగాఁ గనుఱెప్పల, మోవి, దాటఁగా
నీ కవి·యేనదాఁపఁగఁ జెలీ! వహియించితి వేమొ కోపమున్ ?

ఏమికతమ్మొ యల్కవహియించి గిరుక్కున నొక్కమాఱు నె
మ్మోము మటు త్రిప్పివై చెదవు, భ్రూయుగభంగము, నవ్వులేని యా
కోమలకంపితాధరము, కొంచెమురాగముఁబూను నేత్రముల్,
ప్రేమవతీ! యొకానొక నవీనవిలాసము నీకుఁ గూర్పఁగన్.

వంచిన నెమ్మొగమ్ము సతివా! పయికెత్తవు, వాలుఁజూపు నొ
క్కించుకయున్ మఱల్పఁజన వీడెన; వ్రేళులతోడఁ గేలఁగీ
లించినగాజు లట్టె కదలించెదు, బొట్టనవ్రేలు నేల నా
డించెదు, శ్రోత్రయుందము ఘటించె దలంకృతరమ్యమూర్తికిన్.

కమ్మనిపూవులన్ వదులుగా విరచించిన నీలవేణి యం
దమ్ములదాన! నీయధరితమ్మగు మోమిటు త్రిప్పవద్దు, నె
య్యమ్మున మీఁదికెత్తి నయనాంచలవీక్షల నట్టె యొక్కమా
ఱిమ్మొయి నిల్పి నీకుపితవృత్తివిలాసము నాకుఁ జూపుమా.

రాగవతీ! యొకింత యపరాధ మొనర్చినవాఁడ నేమొ కే
ళీగతి, నీ వినోదకృతలీలకు నీదుహృదంతరంబునం
దాఁగని కోప మూనఁదగునా? కరుణన్ సయిరించి యియ్యెడన్
రాఁగదె యొక్కమాఱు కనరాదె విలోలవిలోకసంబులన్ ?

అపరాధంబొనరించినందులకు శిక్షార్హుం డితండౌట వీ
నిపయిన్ నీ నిశితావలోకనశరానీకంబు వర్షించి యీ
వపువున్ దావకబాహుశృంఖలలచే బంధించినం జాలదే?
కుపితాంగీ! యటు మోము పెట్టుకొన నీకుం గూడునే యుత్తఱిన్?

* * *

యువతి! యాదెసఁ గనుఁగొను మొక్కసారి;
యొక్కప్రియురాలు నొక్కప్రియుండుఁ, బ్రేమ
లీల నన్యోన్యచుంబనాశ్లేషణములఁ
బరవశత నెట్లు మోదముం బడయువారొ?

—వఝ్ఝల వేంకటేశ్వరకవి, బి.ఏ.

ఎద్దడి నీళ్లు

వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనే భయం వేస్తోంది.
వ్రాస్తే వ్రాత సౌభాగ్యం అనుకుంటే ఒకముక్క వ్రాయవచ్చును.
కళ్ళల్లోకంటా ఏటుచూచినా, చెవుల్లోకల్లా ఎటువిన్నా వేడిగాడుపే.
"నీ కలా యుండాలని నాకోరికే. నీ వలా యుండాలని నాకోరికే."
ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వాని యూహ.
"ఏం తిరిగి పట్టుకొచ్చేవు? పెట్టిముండాకొడకా!" అంది యువతి.
"నీ యవ్వనం తగులబెట్ట చావలేకపోయేవు అవాడు" అన్నాడు లోపలికెళ్ళి.
"ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు" అంది ఆమె అతినిబ్బరంగా.
ఊరంతా నుయ్యి బలికోరిందనుకొన్నారు.

ఒక ధర్మచావడి - ఒక యేఱు - అనే మన యీ కథకు గావలసినవి. మిగతాయూరెంతున్నా యెక్కడున్నా మనకక్కర్లేదు. ఆ రెండూ మీ గ్రామాల పట్టగలిగినారా అంటే ఊరేదో తెలిసిపోయిందన్నమాటే. ఊరెంతుందో బోధపడ్డాదన్నమాటే. ఏమాఅంటే మన యీకథకు నాయికానాయకులు ముష్టివాళ్ళు. వాళ్ళకు చేటే ఇల్లూవాకిలీ లేదు. ధర్మచావడిలోనే బస. వాళ్ళకు మంచినీళ్ళకు ఆదరువు చేటే నుయ్యీ, చెరువూ ఏమీలేవు. దూరాన్నే ఓపుంతమ్మటే పోగా తగిలే పోల్నాటి సెలయేటే ఆధారం. ఆయేటికీ యీచావడికీ మధ్యజరిగిన కథయిది. రెండోకంటివాడెఱుగనిది.

పుంతలో ఒక వేపచెట్టు, ఆవేపచెట్టుదాటి ఓ మలుపుతిరిగితే మరో వేపచెట్టు. అంతే చెట్లు. ఎక్కడున్నా బ్రహ్మదండిపొదలు. పుంతంతా గులకరాయీ, గండ్రిసుకా, కాలం మండువేసంగి. వేళ మట్ట మధ్యాహ్నం.

వాళ్ళిద్దరలా పుంతమ్మట పోతూవున్నారు. వాళ్ళనగా చిచ్చుగాడూ, చిచ్చుకత్తే. వాళ్ళకు పేర్లు లేవా అంటారేమో? చిచ్చుగాళ్ళను చిచ్చంపేసే వెయ్యడంలో పొమ్మనమనడమే గాని నీపేరేమిటి నీయూరేమిటి అనే వాకబు నాకెప్పుడూలేదు. నాకేకాదు. ఎవరికీవుండదనే నాయూహ. మన సౌభాగ్యవంతులైనా కలిగివున్నామా అంటే వాని పుట్టుపూర్వోత్తరమంతా వాళ్ళవల్లా వాళ్ళవెనకాతలే నడిచేవాళ్ళవల్లా తెలిసికొంటేనే కాని తోచదు. ముష్టివాళ్ళనుగురించి అలా తెలిసికుందామని వుండదు. ఎంచేతో? అది లోకప్రకృతి అనుకోవాలి అంతే. లేకపోతే మనుష్యతత్వం అనుకోవాలి.

చిచ్చుగాడూ చిచ్చుకత్తే పుంతమ్మటే పోతూవున్నారు. చిచ్చుకత్తె బుజాన్ని ఒకకుండవుంది చిచ్చుగానిబుజాన్ని ఒక గడ్డపాఱవుంది. చిచ్చుకత్తెకాళ్ళను తాటిమట్టలువిడిచికట్టిన ఒక అకజోడు ఆకారంలాంటి జోడువుంది. చిచ్చుగాడికాళ్ళని ఎవరికాళ్ళనో అరిగిపోయి పారేయగా దొరికిన పాతచెప్పులజోడొకటి వుంది. మిగిలిన వస్తువాహనాలు, వస్త్రాలంకరణాలూ దాన్నిబట్టి యూహిస్తేనే మంచిది. వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనే భయం వేస్తోంది.—

వాళ్ళ నలావిడిచిపెట్టి ఒకడుగు ముందుకుపోదాం—ఒక అయినింటియువతి. పచ్చని శరీరచ్ఛాయ. పదారువన్నెకడాని ననుకరిస్తూవుంది. ఒంటిమీద ఒల్లె పీపుయొక్క సౌష్ఠవం చూపిస్తూవుంది. చేతుల కంక

ణాలు, పోచీలు. కాళ్ళను కడియాలు, అందెలు. మెళ్ళో కంటె, నాను, పుస్తెలు. బుజాన్నోయి తడిబిందె. ఇత్తడి బిందెలో ఒక ఇనపగరిటె. ఇనపగరిటె వల్లగా పైకి తనయొక్క మొన చూపిస్తూవుంది. ఆమె కాళ్ళని జోడూలేదు. ఆమెనెత్తిని గొడుగూలేదు. వెనుక చూపులేదు. వెడుతూవుంది ఏటివంకకే. ఈ పెనుగతించి వ్రాయనక్కరలేకుండానే చెప్పవచ్చును భాగ్యశీల అని. వ్రాస్తే వ్రాతలో భాగ్యం అనుకుంటే ఒక ముక్క వ్రాయవచ్చును. ఆమె యౌవనం బరాబరికి అప్పుడే వచ్చియుంటుందని వ్రాస్తే వ్రాయవచ్చును. తీండ్రపు యెండనే తియ్యనిచూపులు. వడగాడుపునే చల్లని యూరుపు. ఆమె కనక ఆమార్గాన్ని ముందునడుస్తూవుండక పోతే బిచ్చగాడూ బిచ్చకత్తె దారిలో ఆపాటికే శోషిల్లిపోయియుందురనుకోవాలి.

బిచ్చగాడామెను చూస్తూ అన్నాడు తనపెళ్ళాం తో 'ఓ లేవు పోలీ! నీళ్ళుంటాయె, యేటిలో నీళ్ళుంటాయే. నేను తవ్వక్కరలేదనుకుంటానే' అన్నాడు. బిచ్చకత్తెఅంది 'ఏం?' అని. 'ముందు మనలాగే వెడుతున్నారుకదా జనం. నీళ్ళు లేకపోతే వెడతారనా నీయూహ!' అన్నాడు బిచ్చగాడు. 'అందాకా చేతకి ఉండొద్దు? మనకు ఉండొద్దు మనకు!' అంది బిచ్చకత్తె.

ఇంకా కొంచెందగ్గిరానడుస్తున్నారు పేదజంపతులు. 'మన ముసిలిబాపనయ్యగారి పడుచుభార్యగారల్లే వున్నారే. మంచినీళ్ళుకావాలంటే సర్వం గొల్లకండా గొల్లకిటమ్మసేత పోయించుకోరాదంటే. ఇందాకా యీయెండలో నడచిరావడం ఎందుకే.—అలాఅమాటి కొస్తే మనమేనయం. కాళ్ళ కేసినుగుళ్ళోడో. ఏనాటి పీచో అధారంచేసుకొని నడుస్తున్నాము. ఆవిడ చిందులు తొక్కవలసివస్తోందే. ఇసకలో గండ్రిసకలో అయ్యో పాపం! నిలవనైనా లేదే. మనిద్దఱం ఏదన్నా ఉల్లభంలాగపడితే బాగుండిపోనే. నాకు చాలాజాలేసి పోతూందే, పోలీ! నాకు చాలాజాలేసిపోతూంది.' అన్నాడు బిచ్చగాడు.

పోలికాళ్ళను తాటిమట్టజోడు వడవ తెగిపోయింది. పోలికి వడకొట్టింది. పోలి క్రిందపడిపోయింది. పోలి యొక్క బుజాన్నివున్నకుండ నేలబడి చితికిపోయింది. బిచ్చగాని కేమి చేయడానికి తోచలేదు. కేకవేసిముందు పొయ్యేమనిషిని వెనక్కిపిలిస్తేమాత్రం లాభం ఏమిటి? ఆవిడబుజాన్ని వున్నది ఉత్తబిందే. ఆవిడ పోయేది ఏటికే. పోనీ తిరిగి ఆవిడవచ్చేదాకా కనిపెట్టుకున్నచుంటాడా బిచ్చగాడు? కూర్చుంటే ఆలోపునే వాలి కార్చుకుపోయి పోలి ప్రాణంపోతుందేమో. పోనీ పఱుగెట్టుకెడతాడనుకుందాం. దేనిలో నీళ్ళు పట్టుకు వస్తాడు? కుండ పగిలిపోయింది. కళ్ళల్లో కంటూ ఎటు చూచినా, చెవుల్లో కళ్ళు ఎటువిన్నా వేడిగాడుపే— ముందుకు రెండడుగులువెళ్ళి రెండడుగులు వెనక్కివచ్చి పోలికేసి ఓమాటు చూచి మళ్ళీ ముందుకుసాగినాడు, ఎండిన సెలయేటి యిసక మిలమిలామంటూ ఇక బారెడులెక్కలో అనేటట్టుంది.

బ్రాహ్మణయువతి, యెండిపోయిన యేటియిసుకలో ఆయుదయంతీసిన చలమ మధ్యాహ్నానికెండిపోయిన కారణంచేత గరిటెతో యింకా తవ్వుతూ నీళ్ళయూట కోసం ఎదురుచూస్తూవుంది. చాలా వేడిగావుంది. చెమ్మటతోపాటు అదోవిధమైన మైకంకూడా కప్పికేస్తూ వుంది ప్రతీజీవరాశిని.

'పోలీ!' అని ఒక ఏసతో ఒకగట్టికేక వేసినాడు పిలిచినట్టుగా బిచ్చగాడు. బిచ్చగాడి బుజాన్నివున్న గునపం వాడిబుజాన్ని అలాగేవుంది. 'పోలీ' అని ప్రతిధ్వనించింది అంతరాళం. బ్రాహ్మణయువతి! ప్రాణాలు పైకెగిరిపోయాయి. బిచ్చగాడనుకొన్నాడు— పైకి నాటకరంగస్థలంమీద స్వగతమంత గొంతెత్తి— 'నీ కలాయుండాలనినాకోరికే-నీవలాయుండాలని నా కోరికే - అలావస్తువుపెట్టుకుని అలావయస్సు గలిగి అలా యౌవనం వెల్లగక్కుతూ అలా నివ్వుండాలని నాకోరికే - కాని నీజీవితం నాజీవితం భగ్నములైపోయినాయి. యీనాడు నీకు మంచినీరం మోసికొని పోవడానికి కుండకూడా లేకపోయెనే?' అని పెద్ద

పెట్టున నేడ్చినాడు.

బ్రాహ్మణయువతి గుండెలో రాయిపడింది. 'భగవానుడా! ఇంట ముసలిభర్త కొసయూపిరితో నున్నాడు. బిందెడు మంచినీళ్ళు వుదయం తెచ్చిన వుదయమే అయిపోయినవి సగంనీళ్ళు బిందెలోనే ఆర్చుకొనిపోయినవనవచ్చును. దాహము దాహమనువాని కింత దాహమిచ్చుటకైనా నోచకుండ నీ డీబిందె నెత్తుకొని పోడుగదా!' అని నోమేమె మాకోచి నిలువునా నిశ్చేష్టురాలై నిలుచుండిపోయింది. కొంతసేపు బిచ్చగాడు నిశ్శబ్దంలో లీనమైనట్టుండిపోయినాడు. అలోపున బ్రాహ్మణయువతి ఊటిన నీటిలో తన బిందెముంచి, పైకితీసి గట్టున పెట్టుకొన్నది.

'ఆ భిక్షా ఆబిందె, నే నెత్తుకొనిపోయి నాభార్యను రక్షించుకొందు. నాభార్యను రక్షించుకొందు. నాభార్యను రక్షించుకొందు. తల్లీ!' అన్నాడు. 'తీసికోమంది' ఇల్లాలు. 'ఆవస్తువులుం కావా' లన్నాడు బిచ్చగాడు. వలిచి అక్కడపెట్టింది ఆవిడ. లేకపోతే చంపేస్తాడనే భయం—ఆమెకు.—ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వానియూహ. వాడు వాటిని తీసికొంటూ ఒకచూపుమాత్రంగా ఆయువతికేసిచూసి ఆపిల్ల బెదరిపోతూవుంటే వెఱ్ఱినవ్వు నవ్వుకుంటూ వెళ్ళిపోయినాడు.

ఖైతుకదంపతులూ ఆబిందే ఆవస్తువులూ తిరిగి ఎవరికీ ఎక్కడా పట్టుపడలేదు. కాని దొంగఎవడో ఆవిడ వస్తువులూ బిందే బలాత్కారంగా తీసికొనిపోయినాడని వెల్లడైంది.

....

కొన్నాళ్ళకు ముసలిబెంగుడు అరుగుమీద కూర్చునియుండగా బిచ్చగాడువచ్చి 'స్వామీ! మీ ఆవిడ ఆనాడు నాకిచ్చిన బిందే, వస్తువులు' అన్నాడు. 'ఏం తిరిగి పట్టుకొచ్చేవు. వెఱ్ఱిముండాకొడకా!' అంది యువతి అప్పటికి కొంచెం అరితేరిన గొంతుకవబట్టో ఇంటనుండబట్టో—'నాపోలి చచ్చిపోయింది. నాపోలి చచ్చిపోయింది. ఇంకెవరికి?' అని ఏడుస్తూపోయినాడు బిచ్చగాడు.

వృద్ధభర్త కేమనడానికీ పాలిపోలేదు. 'నీ దుర్వ్యసనం



తగులబెట్ట చావలేకపోయేవు ఆనాడు.' అన్నాడు లోపలకువెళ్ళి. 'ఎద్దడినీళ్ళవసంచేత చావలేదు' అంది ఆమె అతినిబ్బరంగా.—

ముసలిబాపనయ్య కుళ్ళికుళ్ళి చనిపోయినాడు. కాని ఆమెకు వర్చస్సు మారలేదు.—

కొన్నాళ్ళకు నడువీధిలో మంచినీళ్ళనుయ్యి తీయించేరు సర్కారువారు. నూతిప్రతిష్ఠయిననాటిరాత్రే ఆ బాపనవితంతువు అందులోపడి మృతిజెందింది. ఊరంతా నుయ్యి బలికోరిందనుకొన్నారు.

—కవికొండల వెంకటరావు, బి.ఏ. బి.ఎల్.

బమ్మెర పోతరాజు

ఘోరతరాధిబాధలకుఁ గుందక చిత్తము రామచంద్రుపైఁ
జేరిచి, యాంధ్రవాఙ్మయవిశేషము లన్నిఁటినేర్చి వాక్సుధా
ధారలచేత; నీశ్వరకథామహిమంబుల విన్నఁబెట్టు నీ
పారకవిత్వవైఖరి ప్రశంస నొనర్చెదఁ బోతనాగ్రణీ!

ఒకయెడ దైవభక్తి, మఱియొక్కెడ సవ్యకవిత్వరక్తి, యిం
కొకయెడ భావయుక్తి, యిఁకనొక్కెడ మంజులపద్యసూక్తి అ
త్యకలుషలీలఁ జెన్నలర నానొకా భాగవతంబు వ్రాయ నీ
కొకనికెగాక యన్యులకు నుర్విని పోతన సత్కవీశ్వరా!

తెలుఁగుంగైతలఁ బ్రోత్తపోకడల నుద్దీపింపఁగాఁ జేసి ప
ల్కులఁ దేనెల్ చిలికించి కబ్బపుమెఱుంగుల్ చక్కఁగా దీర్చి నీ
వలె నెవ్వండు రచింప శక్తుఁడగు నద్వైతార్థసందర్భసూ
క్తిలతాబంధురమైన భాగవతముం దెల్గించి వెల్గింపఁగన్.

లలితవసంతర్తుకలకంఠకామినీ
మధురగానంబుల మచ్చరించి
సాంద్రశరత్కాలచంద్రాతపస్విన్న
కైరవగంధంబు చూఱలాడి
తరుణీమనోహరతరశరాపాంగ
శితసాయకములతోఁ జెలిమిచేసి
సంధ్యాసమారంభసంఫుల్లదంభోజ
మకరందధారల మాటుపఱచి

శ్రావ్యము, ప్రసన్నగరిమ, భాషాపటుత్వ
మతులితస్వాదుభావంబునను పదమున
వెలయఁగాఁ జేసి కబ్బముల్ సలుపునేర్పు
తనరు నిన్నెన్నవశమె? పోతనకవీంద్ర!

కృతి నిమ్మటంచుఁ బ్రార్థించు భూపాలుర వైరాగ్యదృష్టితో వదలివైచి
ఘోరదారిద్ర్యసంకులజీవితాంభోధి నెవలేనిముదమున నీదివైచి
భాగవతంబను పాయసపాత్రంబు సోదరాంధ్రులకయి చూఱవిడచి
జీవితంబంతయు శ్రీరామసేవకై పరమార్థముగ సమర్పణమొనర్చి

వాఙ్మయక్షేత్రమునఁ గావ్యఫలము లమృత
సదృశము లొసంగినట్టి కర్షకుఁడ వీవు

సుకవివా ? నీవు సజ్జనస్తుతచరిత్ర
అమలసద్గుణసాంద్ర ! పోతనకవీంద్ర !

నిను నాస్థానకవీశ్వరుండని కడుంబ్రేమించె రాముండు, పా
వనవాత్సల్యపయోధి భారతి నినుం బ్రార్థించె బాష్పాప్లుతయై,
వనజాతాక్షుఁడు కృష్ణమూర్తి నిను సంభావించె నీభాగ్య మే
మనవచ్చుఁ గవిసార్వభౌమ! గుణగణ్యా! పోతరాజాగ్రణీ!

చూచినపాల్కు నెచ్చె దైవరూపంబు
లభివర్ణనము సేయునట్టి నేర్పు
ముక్తపదగ్రస్తములు యమకంబులు
సహజంబుగాఁ గూర్చుశక్తిగరిమ
భక్తిరసంబునఁ బరమావధిస్థాన
మంచితంబుగను బాలించుశక్తి
దారిద్ర్యమయజీవితంబున నానంద
సామ్రాజ్య మేలు నుత్సాహగరిమ
లలితకవితావిలాసైకలక్ష్యమైన
మధురసుకవిత్వతత్త్వనిర్మాణకలనఁ
బోలుచు నిన్నెద నాదర్శముగఁ దలంచు
ననఘుఁడే ధన్యతరుఁడు పోతనకవీంద్ర !

నీదు జితేంద్రియత్వమును నీకవితాకలనంబు నీ ప్రభా
వోదితశాంతవృత్తియును నున్నతి నీకు ఘటించె సద్రసా
పాదితతావకీననిరవద్యకవిత్వసుధాభిషిక్తులై
మోదమునొందు మానవులు ముట్టుదురొక్కొ తదన్యకావ్యముల్.

అరుదుగ నాంధ్రవాఙ్మయమహాచరితంబున స్వర్ణవర్ణవి
స్ఫురితమొనర్పఁగాఁదగును పోతన ! తావకదివ్యనామ మా
దరమున నీదు భాగవతదామక మాంధ్రసరస్వతీగళాం
తరమున గంధబంధురసుధల్ చిలికించుత సర్వకాలముఁ.

తెలుఁగుం జదివినదానికి
ఫలమేమనఁ బోతరాజు భాగవతంబుఁ
దెలిసికొని చదువుటొక్కటె
ఫల మన్యము వేఱు లేదు పరిశోధింపఁ.

—శేషాద్రిరమణకవులు.

పఠనాలయాలనుగురించి

పఠనమందిరాలు స్థాపించడం, పఠనమందిరాలకు జనంపోవడం చాలా ఎక్కువయింది. కొన్ని సంవత్సరాలక్రింద పఠనమందిరాలు అరుదుగాగల మనదేశంలో నేడు ప్రతిగ్రామానికి ఒక పఠనాలయము, అక్కడికి పఠనమందిరంకోసం పైకం ఖర్చుచేసి తెప్పించినవో లేక ఏయిద్దరు ముగ్గురు దాతలు తెప్పించి దానంచేసినవో కొన్ని పత్రికలురావడం ఏర్పాటయింది. దానితో అక్కడ ప్రతిరోజూ కొందరుచేరడం, ప్రస్తుతరాజకీయాలమీద, సాహిత్యంమీద విమర్శలు చేయడం అలవాటయింది. ఈ నూతనమైన మార్పువల్ల దేశానికి లాభమేమైనా ఉన్నదా? అని ప్రశ్నిస్తే ఎక్కువ లాభమేమీ కనపడదు. బొత్తిగా లేదనడానికీ వీలుండదు. అభిమానమైనపత్రికలు, అంటే కులపత్రికలు కమ్మకులపత్రిక అనీ, బ్రాహ్మణపత్రికఅనీ, వైష్ణవపత్రికఅనీ, పూజారిపత్రికఅనీ ఉంటే అలాంటివాటికి రాజపోషకులగానో, పోషకులగానో చేరి వాటికి చేయూతఇచ్చే పఠనాలయాలు ఉన్నవి. అంతేగాని పత్రికల్లో ఉన్నది చదివి ఆచరణలో పెట్టుదామనే వాళ్ళు ఈయుగంలో చాలాతక్కువ. మహాత్ముడి "ఎంగుఇండియా" చదువుతూకూడా "ఇంగ్లీషు ఎంత బాగుంది? ఆయనమాట ఎంత తూచివేస్తాడు? అక్కడ ఆమాటకుబదులు మరోమాటవేసి అంతఅర్థం, అంత శక్తి తెప్పించడానికి వీలులేదుగదా!" అని మెచ్చుకోవడమేగాని, కట్టుకునే గ్లాస్గోమల్లులు, ట్విల్లుషర్టులు, జపానుగుడ్డలు మానేసి ఖద్దరుకట్టుకుందామనే ఆలోచనలేని పెద్దమనుష్యులు చాలామందిఉన్నారు పేపర్లు చదవడం, వెంటనే- యూడిదగుంటలో తక్కువతు- ధర్మపన్నాలు ఉచ్చరించడం, ఇల్లుచేరగానే ఆమాటలు మరచిపోవడమూను. ఇది చాలామంది నిత్యకృత్యం.

ఈవిషయం ఏలాఉన్నా, పఠనాలయాల్లోకి వచ్చే జనం నానాటికి ఎక్కువైపోతున్నది. ఆవిషయం ఒప్పుకోక తప్పదు. ఈసంగతి గమనించే పట్నాలలో పెద్దలు చేరి ఉచితపఠనాలయాలుకూడా స్థాపించారు.

పట్నాలలో ఉండే పఠనాలయాల్లో రెండురకాలున్నాయి. కొన్నిటిలోకి మెంబర్లుమాత్రమే రావచ్చు. "ఇతరులు లోనికిరాకూడదు." మెంబర్లుమాత్రం సాయంత్రం 8 గంటలకువచ్చి రాత్రి పదకొండుగంటలదాకా కూర్చుని చీట్లపేక, బిల్లియర్డ్సు, చదరంగం ఆడుకుంటారు. పేపర్లజోలికిమాత్రం పోరు. కాని మెంబర్లుకానిఇతరులు ఆపేపర్లు చదవకూడదు. అసలు లోపలికే రాకూడదు. తెలియక ఏపల్లెటూరిపంతులన్నా పట్నంవచ్చాంగదా పేపరుచూద్దామని లోపలికి వస్తే ఏబంట్రోతో కనబడి "అయ్యా మీరెవరి గెస్టండీ" అంటాడు. ఎవరిగెస్టూ కాదంటే "అయ్యా! దయచేయండి" అని మర్యాదగా చెప్తాడు. వెళ్ళితేనే సరి. లేక పత్రికచూడాలెననే అదుర్దాకొద్దీ, వచ్చాంగదా పత్రిక హెడ్డింగులన్నా చూసిపోదామని నుంచుంటే వాడు—కాదు కాదు-ఆయన "ఏమయ్యా! వెళ్ళు. చెప్పితే జ్ఞానంలేదూ" అంటాడు.

అదృష్టంబాగుండి ఏబంట్రోతూ కనబడకుండా ఉంటే బల్లదగ్గరకువెళ్ళి పత్రికకోసం వెతకడానికి వీలవుతుంది. పత్రికమాత్రం కనపడదు. నిరాశచెంది ఇటూ అటూచూస్తే ఏమెంబరుకాళ్ళక్రిందో ఉంటుంది ఆంధ్రపత్రిక అని పెద్దఅక్షరాలు బయటికి కనబడుతూ. ఆయన ఈపేపరుసంగతే తెలియకుండా "వర్కనోప్" అనో "టుహార్ట్స" అనో అరుస్తుంటాడు. పోయి అడిగితే బాగుండదని తిరిగి రావలసిందే.

ఈలాంటి పఠనాలయాలలో మెంబర్లు—అందరూ చక్రవర్తులలాగా ఉండడానికి వీలులేదుగనుక—ఏ ప్రభుత్వానికో శాసనకర్తల మనుకుంటారు. బంట్రోతు సాయిబుమీదా, గుమాస్తాఉన్నచోట గుమాస్తామీదా కిరి అథార్టీ చెప్పడానికి వీలులేదు. ఏమంటే వాళ్ళు పోషిస్తున్నారు వాళ్ళని. ఇందులో ఏమెంబరుకుకోపం వచ్చినా వాళ్ళపని మున్నే. క్లబ్బుప్యూనుచేతనే తమ

యింట్లో పనిచేయించుకునే మెంబర్లుకూడా ఉంటారు. ఆపఠనాలయము నాలుగుగోడలమధ్యనే వాళ్ళ ప్రభుత్వము గనుక ప్రొద్దున 8 గంటలు లగాయతు 11 గంటలవరకు, సాయంత్రం 3 మొదలు 6వరకు గుమాస్తానూ, బంట్రోతునూ వేధించుకు తినేవారు కొంతమంది. సమయానికి మెంబరు కేక వేయగానే వీళ్ళిద్దరిలో ఎవరైనా హాజరుకాకపోతే "వీళ్ళకు తీరనిపని ఉంటే ఇంకోగుమాస్తానూ, బంట్రోతునూ వేయించరాదుటయ్యా!" అని పురమాయింపు. తానిచ్చే రూపాయకు ఎంతమంది జవాన్లు, ఎంతమంది గుమాస్తాలు వస్తారనో?

కర్మంజాలక ఈమెంబర్లలో ఎవరికైనా ఉద్యోగం లేక, పోనీ కనీసం గౌరవోద్యోగమైనా లేక, డబ్బు పుష్కలంగా ఉన్నట్లయితే, ఆయనకు క్లబ్బులోనే తప్ప తోచేపోదు. ఆయన ఉన్నంతసేపూ ఇంటిదగ్గర పెళ్ళాంబిడ్డలమాట మరచిపోయి గుమాస్తా, బంట్రోతు కూర్చోవలసిందే. అందులో ఎప్పుడైనా తోచినప్పుడు పండుగమామూలు ఇచ్చే స్వామికూడానూ. ఆయన్ను గురించి వాళ్ళిద్దరూ ఏమన్నా అనుకుంటే ఎవరూ లేనప్పుడు మాత్రమే.

కొంతమందికి క్లబ్బుసొమ్ము సొంతసొమ్ము. "అరే ప్రొద్దుగూకంగానే హిందూ మాయింట్లోపడెయ్యి." ఆయన కోర్టుమునసబు. మిగతా ప్లీడరు మెంబర్లు నోరెత్తలేరు. మరికొందరు పేపర్లు కావాలెనని తీసుకొనిపోయి దేనికో ఉపయోగించుకుంటారు. ఒకాయన అలాగే పేపరు కావాలెనని తీసుకుపోయినాడు. రెండవరోజున ఆ పేపరు మరెవరికో కావలసివచ్చి కబురుచేస్తే వెళ్ళి వచ్చిన జవాను "అయ్యా! వారి అబ్బాయి పుస్తకాలకు అట్టవేసుకున్నారటండి" అని కబురు తెచ్చాడు.

రెండవరకం ఉచితపఠనాలయాలు. వాటిలో గుమాస్తాఉండేవి కొన్ని, లేనివి కొన్ని. గుమాస్తా లేకపోతే పత్రికలేఉండవు. అంతా చీకాకు. వారంరోజుల నాటి పత్రికలన్నీ బూజుపట్టి పడిఉంటవి. గుమాస్తా ఉన్నచోట ఆయనే ప్రభువు, ఆయనపైవారి తనిఖీ అంటూ సహజంగాఉండదు గనుక. పేపరున్నదంటానికి, లేదంటానికి ఆయనే దిక్కు. ఆయన ఎంతచెప్పితేఅంత. విస్సన్న చెప్పింది వేదం. ఒక్కొక్కప్పుడు ఆయన్ను పిలిచిన పిలుపులుగూడా ఆయనకందవు. ఏ ఆత్మీయులతోనో, స్నేహితులతోనో వినోదంగా మాట్లాడుతూ ఉంటాడు. ప్రక్కన్న నిలుచున్నమనిషి కనపడడు ఆయనకు. నిలుచున్న పెద్దమనిషి నిలుచోని, నిలుచోని కాళ్ళనొప్పెత్తి తిరిగి రావలసిందే.

కొన్ని ఉచితపఠనాలయాలలో ఉచితగ్రంథాలయాలు ఉంటవి. అడిగినపుస్తకంమాత్రం ఉండదు. ఎవరో పట్టుకొనివెళ్ళిఉంటారు. ఓపట్నంలో గొప్ప ఉచితగ్రంథాలయమే ఉంది, మునిసిపాలిటీవారి అజమాయిషీలో. దానిలోకి వెళ్ళి కేటలాగు తిరగవేస్తుంటే మంచి పుస్తకంపేరు కనబడ్డది. దాన్ని తీసుకుందామని గుమాస్తాగారికోసం చూస్తే ఆయనకుర్చీలో లేరు. ఆ హాలంతా చాలాసేపు కలెవెతికాను. కనబడలేదు. బయటికివచ్చిచూశాను, కాంపౌండు అవతల షికారుచేస్తూ స్నేహితుడితో మాట్లాడుతున్నాడు. వీధిలోకి వెళ్ళి అడగడం బాగుండదని చాలసేపు అలాగే కూర్చొని ఈపత్రిక ఆపత్రిక తిరగవేస్తూ ప్రతినిముషమూ ఆయనగారు లోపలికి వస్తాడేమోనని చూచాను. అరగంట అయింది. రాలేదు. పోనీ మనంఅడిగితే రాకపోతాడా? మళ్ళీ పఠనాలయము మూసేవేళయింది అని ఆయన దగ్గరకువెళ్ళి "పుస్తకం కావలెనండీ" అన్నాను.

"బజారులో ఉన్నాయా?" అన్నాడా ప్రభువు.

"తమరులోపలికి దయచేయకూడదూ?"

"వస్తారులే వెళ్ళండి" అని ఆప్రభువు అక్కడే నుంచున్నాడు మాట్లాడేవాడు లేకపోయినా. నాకు కొంచెం ఒళ్ళుమండింది. వచ్చేది మీరు ఎంతమంది అండీ? అని అడుగుదామని నోటిదాకా వచ్చిందిగాని ఆయనకూ నాకూ తగాదాఅయితే ఆయనకువచ్చే మర్యాదలోపంలేదు (మర్యాదఉంటేగా లోపించడానికి) గాని నాకుమాత్రం మర్యాదలోపంకలుగుతుందని మానివేశాను. మళ్ళీలోపలికి వెళ్ళి ఆయనగారికోసం కాచుకుని కూర్చున్నాను. ఆయన అలాగే సిగరెట్టుకాలుస్తుంటూ షికారుచేస్తున్నాడు. అరగంట అయినా ఆ

ప్రభువుకు దయరాలేదు. ఒకంతకు ఆయన కనుగ్రహం వచ్చిందేమో లోపలికి వచ్చాడు. వచ్చి "పుస్తకం గావలసింది ఎవరికండీ" అన్నాడు కోపంగా. నేను వెళ్ళి నెంబరు, షెల్ఫు చెప్పాను. పుస్తకంకోసం గుమాస్తా వెతుకుతూనే ఉన్నాడు "టయిమయిందయ్యా ఇప్పుడేమి చదువుతావు!" అంటూ. ఇంతలోనే బంట్రోతు వచ్చి "తలుపులు వేస్తాను. అయ్యా! అందరూ లేవండి" అన్నాడు. "పుస్తకం అక్కర్లేదు లెండి" అని నేనూ బయటికివచ్చాను "ఈగుమాస్తాగారు చదువుకోవడానికి వచ్చేవాళ్ళను తనకు పరమశత్రువులుగా ఎందుకు ఎంచుకుంటాడా!" అని ఆలోచించుకుంటూ.

కొన్ని పఠనాలయాలలో, అవి మెంబర్లవల్ల నడపబడుతున్నా, ఇతరులనుకూడా నియమితసమయాలలో రానిస్తారు. అటువంటివి కొద్ది. అవి మొదట ఉచితపఠనాలయాలగా ఉండి తరువాత అభివృద్ధిచెంది, బిల్డింగులు అవీ సంపాదించుకుని, అందువల్ల మెంబర్లు, అట్టహాసము, గుమాస్తాలు అవసరమయి, పూర్వపు వాసన పోగొట్టుకో లేక ఇతరులనుగూడా రానిస్తూఉంటవి.

ఇతరులను రానీయడం బలవంతబ్రాహ్మణార్థం కావడంచేత అక్కడజరిగే చర్య మాత్రం చాలావిచిత్రం. మెంబర్లు గుమాస్తామీద అథార్టీచేయడం అంతటా మామూలే. ఆగుమాస్తా ఈమెంబర్లక్రింద అణిగిఉండి, ఇతరులు సాయంత్రం ఎప్పుడువస్తారా? అని కాచుకొని ఉంటాడు వాళ్ళమీద తన అథార్టీ చూపించడానికి. ఏమాత్రం అవకాశంవచ్చినా "అక్కడ కూర్చోకూడదండీ, ఇక్కడ నుంచోకూడదు. టైముఅయింది. ఉండకూడదు" అని జబర్దస్తీ చేస్తుంటాడు.

చదవాలెనని ఆదుర్దాలో అప్పుడే స్వరాజ్యపత్రిక తీసుకుంటాము చేతులోకి. ఇంతలోకే ఏమెంబరో బిల్లియర్డ్సు రూములోనుంచి కేకవేస్తాడు "సాహెబ్! స్వరాజ్య పట్టుకు రావోయి" అని.అప్పుడే మనచేతులోనించి సగంజారుతుంది పేపరు. సాయిబు దాన్ని సాంతంగా తీసుకుపోతాడు.

ఈవిధంగా ముఖ్యమైనవీ, ఆరోజువచ్చినవీ, అన్నీ తలాఒక మెంబరుదగ్గరా ఉంటవి - చదివినా, చదవక పోయినా. సాధ్యమైనంతవరకూ, అనగా వారి శక్తిలో ఉన్నంతవరకూ చదవరు. ఆపత్రికలు చీట్లపేకా, బిల్లియర్డ్సూ చూస్తూఉంటవి. ఇక ఇతరులు కూర్చోవడానికి నిర్ణయింపబడ్డ బల్లమీద నెలరోజుల క్రిందటి కృష్ణాపత్రిక; రెండురోజులనాటి దినపత్రికలూ; అహింస, సెట్టిబలిజ, నెలరోజులనాటి కాంగ్రెసు, చినిగి ఏకాగితానికి ఆకాగితం విడిపోయిన తాతలనాటి టైమ్సు ఆఫ్ ఇండియా ఉంటవి. ఏరోజువచ్చినా అవే మనకు కనబడతవి.

నిజానికి మెంబర్లు డబ్బు ఖర్చుపెట్టుకుంటూ పత్రికలు ఇతరులకు చదువుకోవడానికి ఇవ్వడమంటే కష్టమే. వాటిని చదివినా, చదవకపోయినా, అవి వాళ్ళకు ఉపయోగపడకపోయినా అవి వాళ్ళదగ్గర ఉండడమే న్యాయం. "లా" తున్నంగా తెలిపిన ఈ రోజుల్లో అసంగతికాదని ఎవరూ అనరు. అలాంటి పఠనాలయాల్లోకి ఇతరులువచ్చే ఏర్పాటు మానివేస్తే బాగుంటుందేమో? వాళ్ళు రావచ్చునని, వాళ్ళని వేధించడం కంటె?

ఒకగొప్ప పఠనాలయంలో కొన్నిపత్రికలు మెంబరేతరుల దృష్టిపథంలో పడవు. కృష్ణాపత్రిక, జన్మభూమి, ఎంగుఇండియా, భారతి మొదలయినవి గుమాస్తాగారి డ్రాయరులో ఉంటవి. మెంబర్లు అడిగితే ఏలాగు ఇవ్వకతప్పదు గనుక అవి దాచిపెట్టింది మెంబర్లుకానివారికోసమే అయిఉంటుంది. చదువవలసినవీ, చదువతగినవీ గుమాస్తాగారి డ్రాయరులోనూ, ఆరోజు వచ్చినవి మెంబర్లకుర్చీలక్రిందనూ ఉంటే ఇతరులను లోపలికి రానీయడంలో అర్థంలేదు. ఆఫార్సు ఎంతత్వరగా మానేస్తే అంతమంచిది.

అక్కడికి సామాన్యంగా వచ్చేవారి కెవరికీ ఎంగు ఇండియా అవీ వస్తాయనితెలియదు. ఒకానొకరి కెవరికయినా తెలిసిఉండి గుమాస్తాదగ్గరకువెళ్ళి "ఎంగు ఇండియా ఇస్తారా?" అంటే "పత్రికలన్నీ పోతున్నాయండీ. ఇవ్వడానికి వీల్లే"దంటాడు ఆయన. అవ్వి ఇవ్వడానికి వీల్లేకపోతే, ఇతరులు చదువుకోవలసింది నెలరోజులనాటి పత్రికలా? పోతవని భయముంటే

దస్కతు చేయించుకుని పేపర్లు ఇవ్వరాదా? వాళ్ళు ఆహాలులోనే కూర్చొని చదువుకుంటూంటే జాగ్రత్తగా చూస్తుండకూడదా? ఆపేరు చెప్పి పేపర్లు దాచుకుంటే వచ్చే ఉపయోగం బోధపడకుండా ఉంది. దాచుకుంటే పేపర్లు పోకుండాఉంటవనా? అసలు తెప్పించకుండా ఉంటే ఎడిటరుగారి ఆఫీసులో చెక్కుచెదరకుండా ఉంటవే? అయినా చదువుకోవచ్చే ఇతరులంతా పేపర్లు దొంగిలించనే వస్తారా?

ఈఇతరులు గుమాస్తాగారి అగ్రహానుగ్రహాలకు పాత్రులు కావాలె. అడిగినపేపరు ఆయన సంతోషంగా ఉంటే ఇస్తాడు. ఏమెంబరో ఆయనమీద కేకలువేస్తున్నప్పుడు అడిగితే "ఫైల్లేదండి" అని కసురుతాడు. పేపర్లు ఆయన స్వార్జితమనే ఆయన అభిప్రాయం పాపం! ఇవ్వవలసివచ్చినప్పుడు ఎందు కివ్వవలసివచ్చిందాఅని ముక్కుతూ, మూలుగుతూ ఇవతల పడేస్తాడు.

చదువుకోడానికి వచ్చేమనుష్యుల్లోకూడా చాలా రకాలుంటారు. ప్రతివాళ్ళకూ ఇతరులచేతిలో పేపరు తనచేతిలోకి వెంటనే రావలెననేకోరికే. కొంతమంది పత్రికలో కాగితాలు విడివిడిగాఉంటే పత్రిక చదవలేరు. 24 పుటలూ వాళ్ళచేతిలో ఉంటేనే పత్రికాపఠనం నడుస్తుంది. ఒకసారి ఒకపాటిఉద్యోగస్థుడు పత్రికాపఠనం చేస్తున్నాడు. చేతిలోది "హిందూ." "ఒక కాగితం ఇస్తారా?" అన్నాను. "చదవడం కానీయండి" అన్నాడు. పేపరంతా ఇవ్వమని అడిగానను కున్నాడేమోనని "కాదండీ! ఒక కాగితం చాలు ఇవ్వండీ" అన్నాను "వీలులేదండి,. చదవడం కానీయండి" అన్నాడు. "మీరు చదువుతున్న కాగితం అయ్యేలోగా చూచి ఇస్తాను. ఆకాగితమన్నా ఇవ్వండి." అని అన్నాను తిరిగి నేను.

అంతటితో ఆయనకు అగ్గెత్తికొచ్చింది కాబోలు "పత్రికఅంతా మీరే చదవండి.తరువాతనే నేను చదువుతాను" అని సత్యాగ్రహసూచనలు కనబఱచి అమాంతంగా పేపరు నావైపు విసిరి పారవేశాడు. ఈతగాదా నాకెందుకని "మీరే చదవండి" అన్నాను,సత్యాగ్రహానికి వెఱచి.

కొంతమంది పేపరు మొదలుపెట్టితే ఆంధ్రపత్రిక మొదలుకొని కా. నాగేశ్వరరావుచే ముద్రింపబడి ప్రకటింపబడినది వరకు ప్రత్యక్షరం చదివితేగాని పత్రిక వదలరు. కాగితాలు విడిగాఉండి, కాగితా లితరులకు ఇచ్చేవాళ్ళయితే ఇబ్బందిలేదుగాని పత్రిక అంతా కట్టి ఉంటేమాత్రం చాలాయిబ్బంది. ఆచదివేవాళ్ళకు ప్రక్కన మనుష్యులు వేచిఉన్నారనేసంగతే బుర్రకెక్కదు ఎంతమాత్రం. ఉమ్మిడి రామయ్యసెట్టి నగల ప్రకటన, అమృతాంజనం ప్రకటన చూస్తూ కూర్చుంటారు. అచ్చంగా పేపరుచదవడానికి అంత ఆలస్యమెందుకూ? ప్రకటనలసహితంగా కంఠస్తంకావలెనాయను.

ఒక పఠనాలయంలో సాయంత్రం నాలుగుగంటల తరువాత "ఇతరులు" రాకూడదు. నాలుగులోగా రావచ్చు. కాని నాలుగుగంటలవరకు ఆంధ్రపత్రిక గుమాస్తాగారిదగ్గరే ఉంటుంది. ఆయన పాపం! అట్టే చదువుకున్నవాడుకాదు. అందువల్ల ఆపేపరు చదవడానికి చాలా కాలంకావలె. అందులోనూ ప్రతికాలమూ చదివితేనేగాని తృప్తిపడనిఘటం. ఆయన ఓర్పుకూ, ఉత్సాహానికీ వగైరాలకు మెచ్చుకోవలసిందేగాని ఎవ్వరు లేనప్పుడు చదువుకోవచ్చుననే ఆలోచన ఆయన బుర్రలో ఏమూలగానైనా ఎందుకు ప్రవేశించలేదా అనిమాత్రం విచారించవలసి ఉంటుంది. ఆయన ప్రత్యక్షరమూ కళేబలుక్కుని చదివి ఆపత్రిక పూర్తిచేసేసరికి పత్రికకోసం కూర్చున్న మనుష్యులు నాటుకొని మొక్కలు మొలవవలసిందే. అందువ ఒప్పుకున్నా నాలుగు కొట్టంగానే ఆ "ఇతరులను" బయటికి తోలుతారు.

ఒకసారి ఓ ఊరువెళ్ళాను. ఆసెలవుల్లో పల్లెటూళ్ళలో ఉండడంచేత కృష్ణాపత్రిక చూడడమే పడలేదు. అక్కడ పఠనాలయముంది. దానికి నాస్నేహితుడే కార్యదర్శి. ఇద్దరమూ అక్కడికి వెళ్ళేసరికి ఒక వైదిక బ్రాహ్మడు - బొర్రా ఆయనా చూడ ముచ్చటగా ఉంటాడు - కృష్ణాపత్రిక చూస్తున్నాడు. కొంచెంసేపు కాచుకొని కూర్చొని పత్రిక అయ్యేటట్టు లేకపోతే షికారుకని మేమిద్దరమూ నాస్నేహితుడిపొలాలకు వెళ్ళాము. ప్రొద్దుగూకి మేంతిరిగి పఠనాలయందగ్గరకు

8

వచ్చేసరికి ఆశాస్త్రిగారు కృష్ణాపత్రిక సగంమాత్రం చదివారు. పేపరు రేపిస్తారే అని నాస్నేహితుడంటే ఇంటికి చేరాము. దోవలో నాస్నేహితుడు ఆశాస్త్రిగారు ప్రతిపేపరూ శ్రద్ధగా చదువుతాడనీ, పత్రిక రోజులో సగం ఆయన అధీనంలో ఉంటుందనీ, ఆమాత్రం చదివేవాళ్ళయినా లేకపోవడంచేత అదే గొంచెం నయమనీ అన్నాడు.

మరోసారి మరోపఠనాలయంలోకి వెళ్ళాను. అప్పుడే టైమ్సు ఆఫ్ ఇండియాపత్రిక వచ్చింది. ఇంతలో ఒకమెంబరు ఆపత్రికఇటు తేనోయి అన్నాడు జవాన్ను. ఆయనచుట్టూ చాలామంది గుటకలుమింగుతూ కూర్చున్నారు. ఆయన ఎకాయెకి ప్రకటనలుతీశాడు. అందులో క్రాస్‌వర్డుపజిలు, దాని ప్రకటన చదవడం మొదలుపెట్టాడు. లోపలబొమ్మలు పనికిరాలేదు ఆయనకు. చదవడంమాత్రం మాటమాటకలిపి మెల్లిగా చదువుతున్నాడు. ఆయనకు కావలసిన ప్రకటనలన్నీ చదివి ఆయన మనకు పత్రికఇచ్చేసరికి తిరిగి పత్రికవచ్చేరోజు అవుతుందని అనిపించింది నాకు. అదయినా ఆయన ఈ వారంరోజులూ నిద్రాహారాలుమాని ఆప్రకటనలు మాత్రం చదివితే. ఆయన్నుమాస్తే నాకు నవ్వు ఆగింది కాదు. ఎరిగిఉన్న గుమాస్తాఉంటే ఆయనదగ్గరకు వెళ్ళి "ఆయన ఏంచదువుతున్నాడు? ఏంఉద్యోగం?" అన్నాను. ఆయన "ఉద్యోగంలేదు, పాడూలేదు. థర్డుఫారం తప్పాడు. డబ్బుంది. మమ్మల్ని వేపుకుతింటున్నాడు. పగలురాత్రిభేదం లేదు. ఎప్పుడూ ఈక్లబ్బులోనే మకాంచేస్తానంటాడు. పేపరుచదవడం మొదలుపెట్టితే కాచుకొనికూర్చున్నవాళ్ళు కూర్చున్నబల్లలకు అంటుకొని పోవలసిందే. ఏమిచెప్పను భాగోతం!" అన్నాడు.

ఈ అన్నిరకాల మనుష్యులలోనూ ఏమాత్రమో మార్పుజరిగితేతప్ప స్థితిగతులు అధ్వాన్నంగా ఉండక తప్పదు. ఈవిషయమై పనిచేసే పెద్దలూ, చిన్నలూ, పాఠకులూ, పఠనాలయస్థాపకులూ, మెంబర్లూ, ఇతరులూ, జాగ్రత్తవహించవలెనని హెచ్చరిస్తున్నాను.

— మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, బి.ఏ.

గ్రంథరచనవలన రాబడి

శేషాద్రిరమణకవుల పేరు వినని వారుండరు. వారు వయసున నలుబదిరెండు వత్సరములకు మించియుండక పోయినను ఇప్పటికి దాదాపు ముప్పదివత్సరములనుండి ఆంధ్రసారస్వతమున కమూల్యమగు సేవ చేయుచున్నారు. అంత చిన్నతనమునుండి పనిచేయుచున్నను స్వతంత్రజీవనమును గడుప వీలగురాబడి వారికి పుస్తకరచనవలన గలుగకుండుటచే అన్నదమ్ము లిరువురును ఉపాధ్యాయవృత్తి నవలంబింపవలసిన వారైరి. ఇట్టిది పాశ్చాత్యదేశములందేగాక భారతదేశమునందలి సంయుక్తపరగణాలలోను, వంగదేశమునను గూడ జరుగు ననుటకు వీలులేదు.

మిల్టన్

పొరుగింటి పుల్లకూర రుచియన్నట్లు ఉదాహరణములకుగూడ ఆంగ్లసారస్వతస్థ విషయములు చదువరులలో కొక్కరమందికి అభిమానకలితములగుచో నచ్చెరువుండ జాలదు. ఆంగ్లసారస్వతమునకు షేక్స్పియరు భాస్కరతుల్యుడు; మిల్టను సోమనిభుడు. మిల్టను రచితములలో 'స్వర్గభ్రష్టత' (పేరడైస్ లాస్టు) ఉత్తమకావ్యము. ఆంగ్లేయులు తమవలసరాజ్యములను చివరకు భారతదేశమును విడువనొల్లుదురుగాని మిల్టను రచితములను విడువ నిచ్చగింపరు. అట్టియుత్కృష్ట కావ్యమును అంధుడగు మిల్టను సంవత్సరములకొలది కష్టించి రచించెను. దాని నచ్చువేయించుటకు శక్తిచాలక కాపీరైటువిక్రయింప యత్నించి బేరమురాకపోవుటచే విసికి వేసారి రొట్టెకేలకు అయిదుపౌనులకమ్మెను. కష్టించి పనిచేసిన మిల్టను దారిద్ర్యమున జచ్చెను. ఆకావ్యామృతమును చవిచూచి ప్రజలు నేటికిగూడ పరవశులగుచున్నారు.

ఫిరదాసీ

పారశీకకవివర్యుడగు ఫిరదాసీ చరిత్రముగూడ నిట్టిదే. దండయాత్రలచే ప్రసిద్ధికివచ్చిన గజినీమహమ్మదు ఫిరదాసీకవిని పిలిపించి షానామాయను గ్రంథమును లిఖింపజేసెను. ఆతనికిత్తునన్న మొత్తమును సుల్తానీయకుండుటచే కవి విరక్తుడై యేలికను నిందించెను. సుల్తానాగ్ర

హించి యతనినిపట్టి చంప ననుజ్ఞయిచ్చెను. కాని ఫిరదౌసీ రహస్యముగ పారిపోయి తనచివరరోజులను దుఃఖపూరితముగ గడపెను. సుల్తాను తనతప్పును గ్రహించి ఫిరదౌసీకి వాగ్దానముచేసిన ధనమునంతయు బంపెను. కాని కవి యాసమయమునందే మరణించెను. సదుద్దేశములు సకాలమున గార్యరూపమును దాల్చినచో నీ విశాలప్రపంచమున ననుదినము సంభవించు దుఃఖము లెన్ని నివారింపబడగలవో గదా!

జొనాథన్ డెక్వుడ్

మొన్నమొన్ననే చనిపోయినాడు 'జొనాథన్ డెక్వుడ్.' అతనిరచనలను మొదటలో లోక మాదరింపలేదు. దారిద్ర్యముచేతను, ఆకలిచేతను, అవమానముచేతను అతనిశరీరము చివికిపోయెను. ఇపు డతని పుస్తకములకు గిరాకీవచ్చెను. అందువలన నతనిరాబడి హెచ్చినది. కాని అడబ్బు అతని కారోగ్యమునుగాని, ఆనందమునుగాని ఈజాలకపోయెను. చదువరులుమాత్ర మనుదినము నానందపూరితులగుచున్నారు.

బెర్నార్డుషా మున్నగువారు

నోబెలు బహుమానము నేబేటి పేరుగాంచిన కవిపుంగవుల కిచ్చుచున్నారు. ఈమొత్తము పెద్దదే. కాని ఆకవులు అజ్ఞాతవాసమునబడి కట్టుగుడ్డయును, తినదిండియును లేక రచనాకుతూహలాయత్తచిత్తతతో పనిచేసిన కష్టపుదినములలో వారిని దిలకించినవారు లేరు. ప్రజలు మెచ్చుకొని గ్రంథస్వీకారముచే రచయితలను ధనవంతులను జేయునపుడే యీ బహుమాన మీయబడుచున్నది. ఇందుమూలమున వారికి పేరుహెచ్చుటేగాని అవసరములను దీర్చుట జరుగుటలేదు. ఈవిషయమునే ఊది చెప్పుచు జార్జి బెర్నార్డుషా నోబెలు బహుమానము నందుకొన నిరాకరించెను. "నాకు డబ్బవసరమైనపుడు మీరాదరింపలేదు. ఇపుడు మీడబ్బు నాకవసరములేదుగాన మీ బహుమానమును స్వీకరింపజాలను" అని యతడనెను.

అవును. అతనికి నోబెలు బహుమానపు 10,000 ల పౌనులు నేల? అతనికి పుస్తకములవలన సాలునకు 50,000 ల పౌనుల రాబడిగలదు. ఇది ఆంధ్రులకు నమ్ముటకు వీలుగా దోపదేమో! హెచ్. జి. వెల్సుకుకూడ సాలునకు 30,000 పౌనులకు మించినరాబడి గలదట. మొన్నమొన్ననే చనిపోయిన ఎడ్గారువాలేసు కూడ అగణితధనార్జనాపరుడే. థోమస్‌హార్డీ, సర్ హాల్‌కేను, మేరీకొరెలీ, ఆర్నాల్డు బెన్నెటు, జాన్ గాల్సువర్దీ మొదలగు నవలారచయితలందరును ఏటేట వేలకొలది పౌనుల నార్జింపగలవారే. కాని వీరందరి జీవితారంభమును సుగమమని యెంచరాదు. ఆర్నాల్డు బెన్నెటు తాను రచించిన (ఇఫ్ వింటర్ కమ్సు) అను నవలను చంకనుబెట్టుకొని పెక్కుమంది గ్రంథప్రకాశకుల యొద్దకు గొంపోయెను. వారందరును దానిని ప్రచురింప నిరాకరించిరి. కాని యతడు హతాశుడు గాలేదు. అదే ప్రజ్ఞావంతుని లక్షణము. చివరకతడు నేటి యాంగ్ల నవలారచయితలలో మేటియని ఖ్యాతిగాంచెను.

చిలకమర్తి లక్ష్మీనరసింహము

ఆంధ్రు లీవిషయమున వెనుకబడియున్నారు. నేటికన్న పాతికసంవత్సరముల క్రిందట తెలుగుకవులకు ప్రోత్సాహ మెక్కువగనుండెడిది. శ్రీయుత చిలకమర్తి లక్ష్మీనృసింహముగారు మొదట రచించిన రామచంద్రవిజయము సాంఘికనవల. శ్రీయుతులు ఆంధ్రభీష్ములనగు న్యాయపతి సుబ్బారావు పంతులుగారు ఆరోజులలో నవలారచనకు పోటీబహుమానము నేర్పరచిరి. దానికి రామచంద్రవిజయముకూడ బంపబడెను. పరీక్షాధికారులు దాని నుత్తమగ్రంథముగ నెంచి పారితోషికమునిచ్చిరి. కావున శ్రీ లక్ష్మీనృసింహముపంతులుగా రారంభముననే జయపతాకమునెత్తి బయలుదేరిరి. అయినను వీరికి గూడ సాలునకు రు 8000 లకు మించి రాబడి యుండుటలేదు. వారి గయోపాఖ్యానముమాత్రము దాదాపు లక్షప్రతు లమ్ముడుపోయి యుండును. గాల్సువర్దీ, బెర్నార్డుషా, మేరీకొరెలి మొదలగు వారి గ్రంథములు కోట్లకొలదిగ నమ్ముడుపోవుచున్నవన్నచో మనలోగల నీరసభావము వ్యక్తముకాగలదు.

వీరేశలింగముపంతులు

వీరేశలింగముపంతులుగారు మొదటినుండియు జయపథమున బోయిరి. నేటికిగూడ వారి సంపుటములపై

ప్రతిపాలన రు 1500 లకు తక్కువగాని రాబడియుం డును. తిరుపతివెంకటకవులుగూడ పలువురు పాఠకు లను సేకరించినారు. వారి భారతనాటకములను తెనుగు వారు నిత్యనవత్వముతో పఠించుచున్నారు.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి

వ్యాసభారతము నాంధ్రీకరింప నడుముగట్టినవిఖ్యాత పండితవర్యుడు కవిసార్వభౌముడు శ్రీపాద కృష్ణ మూర్తిశాస్త్రిగారు పదునైదువత్సరములపాటు దరిద్ర దేవతతో హోరాహోరీని పెనగులాడవలసి వచ్చెను. ఇది యేతరదేశములోనైన నగుచో నతడు ప్రభుత్వ బిరుదముచే సన్మానింపబడుటేగాక ప్రజలచే బ్రహ్మ రథము బట్టించుకొని యుండుననుటలో నత్యుక్తిలేదు. 1920-25 ప్రాంతములలో శాస్త్రిగారు సూర్యచంద్రుల కాటపట్టగు జీర్ణగృహమున పుత్రశోకాతురులై డబ్బుకొ రకు తడుముకొనుచు చీమవలె నెమ్మదిగ నిశ్చయముగ తమ భాషాంతరీకరణకార్యమును సాగించుట చూచి నపుడు వారిపట్టుదలకు, ఓర్మికి నాశ్చర్యము జనించెడిది. కృష్ణదేవరాయాది మహారాజుల ప్రాపున హేమపాత్రా న్న మారగించిన తెనుగుకవ్య శ్రీశాస్త్రిగారి జీర్ణపత్ర మున మెతుకులకై చేయిచాచుట వారి పూర్వ పుణ్యఫలము.

మంగిపూడి వెంకటశర్మగారుగూడ పేరొందినవారే. కాని రాబడి పేరుకలిగినంతలేదు. ఇటీవల వైద్యము చేయుటగూడ ప్రారంభించిరి.

మొక్కపాటి నరసింహశాస్త్రి

'బారిస్టరు పార్వతీశము'ను రచించిన మొక్కపాటి నరసింహశాస్త్రిగారు హాస్యరసప్రధానుడు. వీరిగ్రంథము రసపూరితము. కాని ప్రథమభాగము సరిగా నమ్ముడు పోకనికి ద్వితీయభాగమును ముద్రించుటకు జంకిరి. చేతిచమురు భాగవతమా! గుణముగల గ్రంథముల నాదరించు చదువరులు లేనపుడు వాఙ్మయ మభివృద్ధి గాంచు టెట్లు?

పానుగంటి లక్ష్మీనరసింహారావు

కాళ్ళకూరి నారాయణరాయని గ్రంథములకు చలా మణికలిగినది. కాని వాఙ్మయమున వానికిగల విలువ విచార్యము. అవి పామరులను రంజింపగలవిగాన నమ్ముడు వోవుచున్నవి. శ్రీయుత పానుగంటి లక్ష్మీనృసింహా రావుగారి నాటకములు మిక్కిలి సమర్థములయ్యును తగినంత యమ్మకమును కలిగియుండలేదు. అయినను వారికిగల రాజాశ్రయముచే కడుపులో నీరు కదలకుండ గూర్చుని సాక్షివ్యాసములచే ఆంధ్రావని నలరింపు చున్నారు.

వడ్డాది సుబ్బారాయుడు మున్నగువారు

వడ్డాది సుబ్బారాయుడుగారు గూడ గ్రంథరచనచే కష్టనష్టము లొందలేదు. వార్ధక్యమున మనశ్శాంతితో గడుపుట కనువగు పరిస్థితులను కలిగించుకొను నవకా శమును తెనుగుపాఠకులు వారికి చాలకాలముక్రిందటనే కల్పించిరి. వారి భక్తచింతామణి దాదాపు నలుబదిపున ర్ముద్రణములనొంది వన్నెకెక్కినది.

లలితకవితావిలసితుడగు శ్రీరాయప్రోలు సుబ్బా రాయని కావ్యములలో నెద్దియునుగూడ పునర్ముద్ర ణము నొందినట్లు కన్పింపదు. వేదుల సత్యనారాయణ శాస్త్రికి తన పద్యములను పుస్తకరూపమున వెలువరిం చుటకు ధైర్యమైనను లేకపోయినది. దేవులపల్లి కృష్ణ శాస్త్రి 'కృష్ణపక్షము'గాని, 'ఊర్వశి—ప్రవాసము' గాని మొదటిముద్రణపు ప్రతులైనను పూర్తిగ నమ్ముడు వోయినట్లు, కన్పింపదు.

కొందరు తాము రచించిన గ్రంథముల నచ్చొత్తింప లేక—వానిపై పెట్టుబడిడబ్బులైనను వచ్చునను నాశ లేక - చమటలోడ్చి రచించిన తమపుస్తకముల నితరు లకు సమస్తమైన హక్కులతో నిచ్చివేసి ప్రతిఫలముగ నూరు నూటయేబది ప్రతులను మాత్రము గొనుచున్నారు. ఇది రచయితకు ప్రోత్సాహకరమును గాదు, పాఠకునకు గౌరవప్రదమును గాదు.

తెనుగున పుస్తకరచనమువలన గలుగు రాబడిచే గ్రంథకర్త జీవయాత్ర గడుపగలుగు శుభదినములు వచ్చినగాని ఆంధ్రసారస్వతము సర్వతోముఖముగు వికా సమునొందజాలదు. అట్టి శుభదినము లెపుడు వచ్చునో కదా!

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

చిత్రకారుడు :

శ్రీపాద దుర్గారావు,

రామారావు ఆర్టు సొసైటీ.



పాదపూజ

ఉ. ....దపస్విపదాబ్జయుగంబు మీఁద నీ

లాలకజాలముల్సెరయ నాయలికంబుల మ్రొక్కి—...

పది పెద్ద గ్రంథాలయములు

౧ లెనిన్‌గ్రేడ్ గ్రంథాలయము

లెనిన్‌గ్రేడ్ రష్యా దేశపు రాజధాని. జనాభా 16 లక్షలు. ఇచ్చటి గ్రంథభాండారమున 4,832,948 పుస్తకములు; 331,000 కరపత్రములు గలవు.

౨. పారిస్ గ్రంథాలయము.

పారిస్ ఫ్రాన్సుదేశపు రాజధాని. జనాభా 60 లక్షలు. ఇచ్చటి పుస్తకాలయమున 40 లక్షల అచ్చుపుస్తకములు; 20 వేల చీనాభాషా గ్రంథములు; 125 వేల వ్రాతపుస్తకములు; 205,000 ప్రాచీన నాణెములు; 30 లక్షల శాసనములముద్రలు.

3. లండన్ గ్రంథాలయము

లండను ఆంగ్లదేశపురాజధాని. జనాభా 80 లక్షలు. ఇచ్చటి గ్రంథభాండారమున 32 లక్షల అచ్చుపుస్తకములు; 53,650 వ్రాతవి; 85 వేలు ఛార్టులు; 18 వేలు సీలుముద్రలు; 120 వేల ప్రాచ్యదేశపు అచ్చుపుస్తకములు; 16,400 ప్రాచ్యలిఖితపుస్తకములు.

౪. బెర్లిన్ గ్రంథాలయము

బెర్లిన్ జర్మనుదేశపు రాజధాని. జనాభా 40 లక్షలు. ఇచ్చటి గ్రంథాలయమున 2,287,281 అచ్చుపుస్తకములు; 59,147 లిఖితపుస్తకములు; 416,415 గ్రంథకర్తల హస్తములతో వ్రాయబడినవి; 371,821 మాప్‌లు; 210,000 చిత్రపటములు మొదలగునవి.

౫. వియన్నా గ్రంథాలయము

వియన్నా అస్ట్రియాదేశపు రాజధాని. జనాభా 1,890,000. ఇచ్చటి గ్రంథాలయమున 1,250,000 పుస్తకములు; ఒకలక్ష కరపత్రములు; 110,000 దేశపటములు; 2 లక్షలు చిత్రపటములు.

౬. ఆక్సుఫర్డు: గ్రంథాలయము

ప్రపంచప్రఖ్యాతినందిన విశ్వవిద్యాలయముగల ఆంగ్లదేశపు పట్టణము. ఇచటి పుస్తకాలయమున 1,250 వేల పుస్తకములు 15 లక్షల సారస్వతవిషయకగ్రంథములు; 40 వేల వ్రాతపుస్తకములు గలవు.

౭. మాడ్రిడ్ గ్రంథాలయము.

మాడ్రిడ్ స్పెయిన్ దేశపు రాజధాని. జనాభా 825 వేలు. ఇచటి పుస్తకాలయమున 1 210,520 గ్రంథములు; 30,172 వ్రాతవి; 20,470 డాక్యుమెంట్లు.

౮. కోపెన్‌హేగన్ గ్రంథాలయము

కోపెన్‌హేగన్ డెన్మార్కు దేశపు రాజధాని జనాభా 772 వేలు. ఇచటి గ్రంధాలయమున 850 వేల అచ్చుపుస్తకములు; 30 వేల వ్రాత పుస్తకములు గలవు.

౯. ఆమ్‌స్టర్‌డామ్ గ్రంథాలయము.

ఆమ్‌స్టర్‌డామ్ హాలెండుదేశపు రాజధాని. జనాభా 760 వేలు. ఇచ్చటిపుస్తకభాండాగారమున 8 లక్షల పుస్తకములుగలవు.

౧౦. బ్రుసెల్సు గ్రంథాలయము

బ్రుసెల్సు బెల్జియము రాజధాని. జనాభా 892 వేలు. ఇచటి గ్రంథభాండాగారమున 8 లక్షల పుస్తకములు; 34,610 ప్లానులు; 31,200 వ్రాతవి; 267,700 ప్రింట్లు; 54 వేల ప్రాతనాణెములు, ముద్రలు.

* నేనూ, మా కాంతం

(గ్రంథవిమర్శనము)

ఆంగ్లనవలారచయితలలో అతిప్రసిద్ధులు థామస్‌హార్డీ 'వెసెక్సు' అను ప్రదేశమును, హాల్‌కెయిన్ తాను పలువత్సరములు నివాసస్థానముగా చేకొనిన 'అయిలెండు ఆఫ్ మాన్' అను ప్రదేశమును తమనవలలలో పెక్కింటికి రంగస్థలములుగా నొనర్చియున్నారు. అధునికాంధ్రకథకులలో ఉన్నతస్థానము నాక్రమించుచున్న మునిమాణిక్యం నరసింహారావుగారు 'కాంతం' అను పేరు గల ఒక గృహిణికుటుంబమును తమ రచించిన పెక్కు కథలకు మూలస్తంభముగ నొనర్చిరి.

వా రీవఆకు ప్రచురించిన 'కాంతంకథలు' తెలుగువారికి బాగుగా పరిచయమైయున్నది. ఇపు డీ 'నేనూ, మా కాంతం' ఆంధ్రుల కందింపబడుచున్నది.

ఇందు ఏడుచిన్నకథలు కలవు. అన్నికథలకును కాంతము నాయకురాలని చెప్పుటకు వీలు లేదు 'నవ్వుటాలకు' అనుకథలో ఆమె చిట్టచివరకున కాని మనకు కనిపింపదు. 'సీత మొగుడు' అను కథయందు కాంతము నమీరుడు కథచెప్పుచుండగా వినుచు కథాప్రారంభమున, కథాంతమున ఒకటి రెండు సారులు మాత్రము పెదవివిప్పును. 'కీలి కొండలు' అను కథయందు 'కాంతం' మగనికి కమల అను నామెవృత్తాంతము చెప్పు కథకురాలై కానవచ్చుచున్నది. మిగిలిన కథలయందు ఆమె నాయకురాలై ప్రత్యక్షముగనే పాఠకులకు పొడగట్టును.

కాంతము మగనిపేరు వెంకటరావు. ఉద్యోగము ఉపాధ్యాయత్వము. 'మీరు కూడా, కవులు కామూలే?' అని తన భార్య చేత అనిపించుకొన్నవాడు. అతని దృష్టిలో ఆమె 'మహా మొండి. సాహసి.' కాబట్టి అతడు కాంపొజిషన్ పుస్తకాలు దిద్దుటమాని ఆమెచెప్పుకథ వినును; ఆమె పిలవగా 'ఎందుకు పనిమీదఉన్నా' అనుచునే పోవును; తాను వండమనిన గారెలు వండక కాంతము ఆమె వండ సంకల్పించిన జిలేబీ లే వండినను అతడు సరిపెట్టుకొనును. 'కులమింటికోతి' అను కథయందు హాస్యచతురుడై కనుపట్టు ఈ వెంకటరావు - పలుగురు పిల్లలతండ్రి - 'ఇంట్లో విరహం' అను కథయందు పట్టి చేద స్వపుమగనివలె చూపట్టును. నాటకమును చూపి సంతానవతియైన తనభార్యకు విరహవేదన నేర్పచూచిన ఈ ఉపాధ్యాయుని ఉపన్యాసమును 'కాంతం బడికుర్రవాడిలాగ' ఊకొట్టినది. భర్తగను, ఉపాధ్యాయుడుగను అత డింతటివాడేనా?

వెంకటరావు ఎంతటివాడైనను అతని భార్య కాంతం తెలివైనది, చురుకైనది. కావుననే పాఠకులను ఆమె ఎక్కువగ ఆకర్షించుచున్నది. నాటకమును చూపి తనకు విరహవ్యథలో ప్రథమపాఠములు నేర్ప జూచిన మగని విశేషప్రయత్నమును కేవలము

* ఏడు చిన్న కథల సంపుటి. గౌతమీపుత్రగ్రంథమాలలో రెండవపుస్తకము. గ్రంథకర్త మునిమాణిక్యం నరసింహారావు. క్రౌనుసైజున 72 పుటలు. వెల రు. 0-8-0. వలయువారు గ్రంథకర్తపేర హిందూహైస్కూలు బందరు అని వ్రాయునది.

పైత్యముక్రింద జమకట్టి దానికి పిసుగుడుగా అల్లపుపచ్చడిచేసి తినిపించిన ఆమె తెలివి మెచ్చదగినది. సమీరుడు చెప్పినట్లు ఆమె 'దొడ్డ ఇల్లాలు'. పరస్త్రీతో ఏరకపు సంబంధమైనను ఉండుట మగవానికి కూడదని కాంతము అభిప్రాయము. స్త్రీవిషయకమగు కళంకశంక కలుగగా నమ్మకమైన సేవకుడగు రాముని పనిలోనుండి తీసివేయు మగనిని తొందలు విడిపించినది; అలవాటును కూడదని సమీరుని సంవత్సరాదికి విందుభోజనమునకు ఆహ్వానింపవద్దని శాసించినది. ఇతరుల విషయములోనే ఇట్లుండ ఆమె మగని విషయమున ఇట్టిశంక కలిగినచో ఎట్లుండునో యోజించుకొనుడు. ఈర్ష్యాకషాయితయై 'దీనివిషయమై నిజంఏమిటో మీరు చెపుతారా? నన్ను ఎందులోనన్నా పడి చావమంటారా?' అని ఆమె మగనితో నన్నది. ఆంగ్లమున ఆమెకుగలజ్ఞానము మిడిమిడిదే కాని కవిభార్యయగుటచే ఆమె నేటి తెలుగుకవిత్వముతో కొంత పరిచయము కలిగియున్నది. చురుకైన దగుటచే ఆపరిచయమును ఆమె అవకాశము కలిగినపుడెల్ల ఉపయోగింపగలుగునది. నేటి ఏడుపుకవిత్వపుటునికి ఆమెకు తెలియును. 'కిన్నెరసాని గోదావరి కలిసినయ్యే' అని సారస్యముగ అనగలుగు రీతిని నేటి తెలుగు ఖండకావ్యములను ఆమె చదివినది. 'మీ యిష్టము, మీయిష్టము' అనుచునే బిడ్డకు తానుచెప్పినపేరు మగనిచే పెట్టించిన గడుసు ఇల్లాలు కాంతము.

ఇన్నివిధముల పాఠకులను ఆకర్షించుచున్న కాంతమునకు ప్రధానమైన ఆకర్షణ ఆమెపిల్లలు. దంపతులకు 'సుతాకారపు ముళ్ళు ముళ్ళుట యఖండసుఖోదయమూలకందముల్' అని ఆమెభావన. 'భార్యాభర్తల ప్రేమకు ఉనికిపట్టు సంతానం. వారిఇద్దరి ప్రేమ నశించకుండా నిరంతరం పోషించేది సంతానం.' అని 'కాంతం' నిర్వచనము. పిల్లలను పోషించు శ్రద్ధలో ఆమెకు ఒకనాడైన నాటకముచూడ ముచ్చటపుట్టదు. 'నాకు ఇంట్లో నాటకంచాలు. మనకు వేఱెనాటకం ఎందుకు?' ఆమెదృష్టిలో విరహిణి సత్యభామ 'పిల్లా జెల్లా లేనిముండ.' సంతానముపొందని కమల, రామకృష్ణుల దాంపత్యము ఆమె పెదవివిఱుపుకు గురియైనది. 'ఇంతలు నంతలునగు తన సంతానము చంట వెంట నందడిసేయన్' కాంతము మనకు కనిపించు ఈగ్రంథమునందలి తుది రెండు కథలును అతిమనోహరములని చెప్పవచ్చును. 'కులమింటికోతి' అను కథయందు పిల్లలకొఱకు జిలేబీలువండే కాంతమును, 'నామకరణం' అను కథలో పురిటాలు కాంతమును దర్శింపవలసినదే!

ఈకథలలో మొదటినుండి తుదివఱకు తెలుగుతనము - నేటి మనచిన్నకథలలో చాలవఱకు కానరానిది - నిండారియున్నది. ఇందలి ఒకటిరెండుఘట్టములు అపారమని వేదాంతులు పేర్కొను సంసారమును సారమైనది అనిపింపజాలియున్నవి. గ్రంథకారుని ఉపజ్ఞ విశదముగను, ఉపదేశము విరళముగను ఈకుటుంబవినోదకథలయందు కానవచ్చుచున్నది. ఈకథకుడు తనభావిరచనములయందు ఫొటోగ్రాఫరుకు కొంచము దూరముగను, ఆర్టిస్టుకు మఱికొంత చేరువుగను పోయి 'కాంతం' అను పాత్ర అవలంబనమున ఆంధ్రస్త్రీహృదయమునకు అక్షరరమ్యరూపమును ఇచ్చునుగాక!

—ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.

గాలి విమానాలు

తెలుగుదేశం : విమానపుటపా.

గన్నవరంలోను, విశాఖపట్టణంలోను ఆగుతూ మదరాసునుంచి కలకత్తాకు, కలకత్తానుంచి మదరాసుకు టపా కొనిపోవడానికి ఇపుడు గాలివిమానాలు ఏర్పడ్డంతో తెలుగుదేశానికి కూడా విమానపు టపాభాగ్యం కలిగింది. 1890-వ సంవత్సరం ప్రాంతాలలో రైలు ఇంజనుకూతను కోకిలకూతకంటే ఆప్యాయంగా వినేవారు తెలుగువారు. ఇపుడు వారికి అదే ఇంజనుకూత గాడిద ఓండ్రకంటె కఠోరంగా ఉంది 1910 ప్రాంతాలలో మోటారునుచూస్తే తెలుగువారు బెల్లమ్ముక్కకు ఈగలు ముసిరినట్లు దానిచుట్టూ మూగేవారు; పడుచు పెళ్ళాం పాలబుగ్గలను నిమిరేజాగ్రత్తతో దానిరంగు రేకులను నిమిరి చూచేవారు. ఇపుడు— కయ్యాలగొడ్లమనే ఆమోటారులను ఆంధ్రదేశంలో మనుషులు పక్కనుంచి తోకత్రొక్కించుకుంటూపోయే కుక్కలకంటె నీచంగా చూస్తూవున్నారు. మనుష్యులా కాఎందుకు? ఎర్రబట్టను చూచి బెదిరే ఆంధ్రదేశపు సంతపశువులుకూడా ఇపుడు మోటారుకార్లను ఖాతరుచెయ్యటంలేదు. 1930 ప్రాంతాలలో గాలివిమానపుసవ్వడి కొంచెం వినిపించిందా అంటే గడ్డంగీసుకొంటూవున్న కాలేజీవిద్యార్థులు, పరికించి ప్రాణాయాములుగొంటూవున్న పరమశ్రోత్రియోత్తములు నీళ్ళగదిలో తలంటుకుంటూవున్న పడుచు పిల్లలు, వట్టింటకూర్చుని జడలు అల్లుకుంటూన్న ప్రౌఢ స్త్రీలు, వసారాలోకూర్చుని వత్తులుచేసుకుంటూన్న ముసలమ్మలు, పావిట్లో కొత్తగానూరిన పొడుంలో సున్నము, నెయ్యి కలుపుకుంటూఉన్న తాతలు, ఉల్లిపాయ పులుసుతో అన్నంతింటూన్న కుర్రాళ్ళుకూడా ఇల్లు వదలి బయటికివచ్చి ఊర్ధ్వదృష్టులు బఱపేవారు. ఇపుడిపుడు గాలివిమానాలు మనవారికి బాగా పరిచయమగుతున్నాయి. విలాసార్థము విమానాలు ఎక్కిన ఆంధ్రులుకూడా—తగ్గిపోయిన తాలూకాబోర్డు మెంబర్లవలె— చాలామంది లెక్కకొస్తున్నారు. ఒకరిద్దరు తెలుగుదేశపు జమీందార్లకు సొంతగాలివిమానాలుకూడా ఉన్నాయి. కొలదికాలంలో గాలివిమానాలు ఆంధ్రదేశంలో కారులకంటె కనాకష్టమై పోతవని రైళ్ళ, మోటార్ల చరిత్రలనుబట్టి సులభంగాచెప్పవచ్చు.

పురాణాలలో విమానాలు

కళ్లతో చూడ్డంఅంటే కొత్తగా ఉందికాని చెవులతో వినడానికి విమానాలంటే మనవారికి క్రొత్తకాదనే చెప్పాలి. మనపురాణాలలో కావలసినన్ని విమానాలు ఉన్నాయి. పురాణకథలలో విమానాల ఉపయోగము మనపూర్వులు ఎంతవఱకు కొనిపోయినారో తెలుస్తుంది. రావణుడు సీతను విమానంమీదనే ఎత్తుకుపోయినాడు. దమయంతీస్వయంవరానికి ఇంద్రాదిదేవతలు విమానంమీదనే భూలోకానికి వచ్చారు. ఇట్లు స్త్రీలను అపహరించడానికి, స్త్రీలను వరించడానికి మాత్రమేగాక పురాణవ్యక్తులు తమకు ఒండొరులయెడ ఉన్న ప్రేమను గౌరవాన్ని తెలుపుకోడానికి కూడా విమానాలు ఇచ్చి పుచ్చుకోవడాలు వుండేవి. ఇప్పుడు పట్టణాలలోని గొప్పవారు తమయింటికి ఎవరేనా చుట్టాలుగాని, చుట్టాలవంటి స్నేహితులుగాని వస్తే వారికి స్వాగతంచేయడానికి స్టేషనుకు మోటారుకారు పంపినట్లు పూర్వంకూడా గొప్పవారు తమకు నచ్చిన వారికి తమవిమానాల్ని పంపుతూ ఉండేవారు. రావణుణ్ణిచంపినతరువాత రాముణ్ణి అయోధ్యకు కొనిరావడానికి కుబేరుడు తన పుష్పకవిమానాన్ని పంపాడు. లంకాపురంనుంచి అయోధ్యకు పుష్పకవిమానంమీద పోయేటప్పుడు రాములవారు, సీతామ్మవారు ఇప్పుడు ఆంధ్రదేశంలో విమానాశ్రయస్థానములుగా ఉన్న బళ్ళారి, గన్నవరము, విశాఖపట్టణములలో ఎక్కడేనా ఒకతావున ఆగినారో లేక ఎకాఎకీని వెళ్లిపోయారో ఆంధ్రచరిత్రపరిశోధకులు ఇంకా నిర్ణయించలేదు. తెలుగు దేశానికి తిరిగి విమానదర్శనము ఇపుడిపుడే కలుగుచున్నది కాబట్టి ఇకముందైనా ఈవిషయమై తీవ్రపరిశో

ధన జరుగుతుందని అనుకుంటాను. సరే దీనికేమి అసలు విషయానికి వద్దాము. భూలోకంలోంచి బొందితో కైలాసానికి తీసుకునిపోవలసిన వ్యక్తులకోసం పూర్వకాలపు పుణ్యపురుషులలో దేవతలు విమానాలు పంపేవారు. పోలి అనేఆమె ఇట్లా పంపబడిన విమానంలోనే స్వర్గానికి పోయివుందని మనదేశంలో ముసలమ్మలకుకూడా తెలిసినముచ్చటే. ఇట్లు స్త్రీలను అపహరించడానికి, స్త్రీలను వరించడానికి, ఒండొరులయెడ ప్రేమ గౌరవములను తెలుపుకోవడానికి, కొందఱుమనుష్యుల్ని బొందితో కైలాసానికి తీసుకొనిపోవడానికి మాత్రమేకాక యుద్ధముచేయడానికికూడా పురాణవ్యక్తులు విమానాలను ఉపయోగించియున్నారు. దీనికి నిదర్శనాలు ఎన్నైనా చూపవచ్చు కాబట్టి అవలే మానివేస్తాను.

విమానాలు : ఇప్పటి ఉపయోగాలు

మొన్నటి భూకంపమప్పుడు కలిగిన నష్టము అంచనాకట్టుటకు విమానాలు ఉపయోగపడ్డ విషయం పత్రికాపాఠకులకు తెలిసేవుంది. నాలుగైదు ఏళ్లక్రిందట అమెరికాదేశంలో వరదలువొంగి కొంతదేశం జలమయం అయింది. పల్లెలచుట్టూ నీళ్లు - మోటార్లు పోవడానికి మోకాలిలోతు బురద. పడవలువెళ్ళడానికి తగినలోతు నీళ్లులేవు. అప్పుడు పాలడబ్బాలు, ఆహారపదార్థాల పొట్లాలు విమానాలమీదుగా పైకితీసుకొనిపోయి పైనుంచే విచ్చలవిడిగా విరజిమ్మేవారు. వరదలమధ్యపడి వనటబొందే క్రింది మనుష్యులు అల్లా పైనుంచిపడ్డ పాలడబ్బాలను, ఆహారపదార్థాలమూట్లను దొరికినన్ని తీసికొనేవారు. మొన్న రంగూనులో ఎలక్షను ప్రచారంలో పైనుండి కరపత్రాలు పడవేయడానికి విమానాలు ఉపయోగింపబడ్డాయి. గున్నిజపాలాలలో విత్తనాలు చల్లేటందుకు రష్యాలో విమానాలు ఉపయోగిస్తున్నారు. విమానాల ఈ ఉపయోగాలు ఏవీ పురాణపురుషులకు తెలిసినట్లు కనబడదు. వారు ఎంతసేపు విమానాలను ఎగరడానికిమాత్రమే ఉపయోగించి ఉన్నారని చెప్పవచ్చును. పాలడబ్బాలను పడవైచి క్రిందవారికి సాయపడ్డం - కరపత్రాలురాల్చి క్రిందవారిలో ఎలక్షను ప్రచారంకావించటం-దున్నినపొలాలలో విత్తనాలు చల్లడం - మొదలగు పనులు చేయకపోయినా మరిఒక విధముగానైనా పౌరాణికవైమానికులు క్రిందివారితో సంబంధము పెట్టుకొని ఉండలేదని నిష్కర్షగా నిర్ణయించడానికి ఇంకవలసిన అవసరంఏమీ లేదు. కాని ఈనిర్ణయానికి ఒకటి, రెండు మినహాయింపులుమాత్రం ఉన్నాయని కొందరు అనవచ్చు. పౌరాణికవైమానికులలో ఒకడైన గయుడు తనవిమానాన్ని కృష్ణుడి అర్ఘ్యంపట్టిన చేతిలో ఉమ్మివేయడానికి ఉపయోగించినమాట నిజమే. కాని గయుడు తెలిసి తన విమానాన్ని బుద్ధిపూర్వకంగా అందుకు ఉపయోగించలేదు. కేవలం అది ప్రమాదవశాత్తు జరిగింది. కాబట్టి మన నిర్ణయానికి ఈమినహాయింపు ఏమాత్రమున్నూ అడ్డురాలేదు. మనుష్యుల్ని బొందితో కైలాసంకొనిపోవడానికి విమానాలు రావడంలో క్రిందివారితో సంబంధముండితీరాలి. కాని అవి రావడంవల్ల కొందఱు వ్యక్తులకు క్రిందివారితో అసలే సంబంధంలేకుండాపోయింది. తమ శవాన్నైనా క్రిందివారికి వదలకపోవడంచేత— అందుచే పౌరాణికవైమానికులు క్రిందివారితో సంబంధం పెట్టుకొనిఉండలేదనటం ఎట్టి మినహాయింపులుగాని లేనిమాట. విమానాలను పలురీతులగాను, క్రొత్త రీతులగాను ఉపయోగించడంలో నేటివారు పురాణపురుషులను తలతన్నినారని చెప్పవలసిఉంది.

నేటివిమానాలు మోసే వింతసామగ్రి

ఉపయోగింపబడే రీతిలోనేగాక మోసేసామగ్రిలోకూడా పూర్వపు విమానాలకి ఇప్పటి విమానాలకి చాలాభేదా కనిపిస్తోంది. పూర్వపు విమానాలు స్త్రీపురుషులను అన్యమైన వస్తువులను మోసి యెరగవు. ఆకాశంలో టపటపలాడ్డమేకాని పూర్వపు విమానాలకు ఇప్పటి విమానాలవలె టపాలుమోయవలసిన యోగం లేదు. కలికాలమహిమచేత కాబోలు ఇప్పటి విమానాలకు టపామోయటంతో తీరడంలేదు. కోతుల్ని, నత్తల్ని, ఈగల్ని, ఎండ్రకాయల్ని, ఆవుల్ని, కోళ్లని, ఒంటెల్ని, కుక్కల్ని, పందుల్నికూడా నేటివిమానాలు మోయవలసివస్తోంది. ఎండ్రకాయలు చెడిపోకుండా ప్రత్యేకమైన తొట్లలో పెట్టబడి వివిధదేశాలకి కాలం

కూడివచ్చేటందుకు గాలివిమానాలమీద పంపబడుతూ ఉన్నవి. దిగుమతిఅయినతోటే వంటపాత్రలోకెక్కి- ఉడకబెట్టబడనున్న ఈ ఎండ్రకాయలు గాలివిమానాలలో ఉన్నంతసేపు అగ్నిప్రమాదాలకు, భూపతనప్రమాదాలకు లోనుగాకుండా ఉండుటకు ఇన్సూరుచేయబడుతూ ఉండడం విచిత్రమైందే. ఎల్లాలేదన్నా ఏడాదికి ప్రపంచమందలి అన్ని గాలివిమానాలలోను ఇరవై లక్షల నర్తలు మానవుని ఉపయోగార్థం ప్రయాణం చేస్తున్నారని మహాశయులు కొందరు మదింపుచేసి ఉన్నారు. హిందూదేశంలోఉన్న యూరపియన్లకొరకు ఈదేశంలో దొరకనికూరలుకూడా గాలివిమానాలు మోసుకొస్తూఉన్నాయి. విమానాలలో ఒకదేశంనుండి మరిఒకదేశానికి తేనెటీగల్ని పంపడం ఇప్పుడు బాగా ఆచారమైఉంది. క్రాయిడన్‌నందలి విమానాశ్రయస్థానమునకు ఈమధ్య ఓవర్‌కోటు తొడుక్కున్న వికృతమానవస్వరూపం ఒకటి ప్యాసెంజరు టిక్కెట్టుతో వచ్చింది. దాన్నిచూచి అచటి బుక్కింగుక్లార్కు కాగితంమీదకలంపెట్టి ఎరుగని సంపాదకుడి తీండ్రింపులతోను, ఆదరణపొందని క్రొత్త వ్యాసకర్తల తిట్లతోను, అక్షరాభ్యాసానికినోచని కంపోజిటర్లు అనుగ్రహించిన ప్రూఫులతోను నలిగి చివికిన ఒకపత్రికా సంపాదకుడో—లేక మస్తిఘుకీయలు లైబ్రెరీలో పుస్తకాలతో కుమ్ములాడ్డంలో నవకంగోల్పోయిన కాలేజీ ప్రొఫెసరో-లేక దీపం నిద్రపోయినా తాను నిద్రపోక రాగిరేకులలోపడి కొట్టుకొనే ప్రాచ్యదేశపు శాసన పరిశోధకుడో అనుకున్నాడు. కాని దగ్గరకుపోయి చూచునుగదా ఆస్వరూపం లండను జంతుప్రదర్శనశాలలో క్రొత్తగా చేర్చుకోబడడానికి వచ్చిన 'చింపాంజీ' అను ఒకజాతికోతి అని తేలింది. ప్రూఫులు దిద్దుకుంటూకూడా తన బొంగురు గొంతుకతో కూనిరాగాలు తీసే ఒకానొక సచిత్రమాసపత్రిక సంపాదకుడిలాగ అప్పుడాబుక్కింగు క్లార్కుకూడ 'వందనంబు వందనంబు వానరేంద్ర!' అని కూనిరాగంతీసి ఉంటాడు.

విమానాలలో జరిగిన కొన్ని విడ్డూరాలు.

ఒకసారి ఒకడు ఉబలాటంపుట్టి కోడిపెట్టను విమానంఎక్కించాడు. విమానంఎగరడం ప్రారంభించింది. విమానం ఎక్కించినందుకు తనకృతజ్ఞత క్రియారూపకంగా తెలపడానికో ఏమో ఆకోడిపెట్ట ఆవిమానంలోనే గుడ్డునుపెట్టింది. విమానంలో కోడిగుడ్డుపెట్టిందనే ఈసమాచారం ఆమధ్య మనదేశంలో విమానంలో జరిగిన అట్లాంటిదే మరిఒక సంగతిని జ్ఞాపకంచేస్తోంది. పదేళ్ళక్రితం రాజమండ్రికి రెండువిమానాలు వచ్చి గోదావరిమధ్యను తిప్పలమీద విడిసాయి. పదిరూపాయిలు ఇస్తే మనిషిని ఎక్కించుకొని ఒకసారి ఊరిమీద ఎగిరించేవారు. డబ్బుగల పాలకొల్లు షాహుకారొకడు ధైర్యంచేసి ఎక్కాడు. ఎక్కేటప్పుడున్నధైర్యం విమానంఎగరడం ప్రారంభించేసరికి పాపం షాహుకారికి జారిపోయి లోజార్లు ప్రారంభించాయి. విమానం బాగా ఊర్ధ్వప్రదేశంలోకి వెళ్ళేసరికి షాహుకారుగారికి బహిర్దేశం అయిపోయింది. విమానంలో ఒకపక్షి గుడ్డుపెట్టింది! ఒకపురుషుడు ఇంతపనిచేసి తనపురుషకారాన్ని చూపాడు! ఒక పాశ్చాత్యస్త్రీ గాలివిమానం ఎగురుతూంటే అందులో ప్రసవించింది. గాలివిమానంలోపుట్టిన శిశువులలో మొదటిదైన ఆశిశువుకు ప్రపంచం పది దిక్కులనుండి ఆశీర్వచనపరంపరలు వచ్చాయి. దేనికో ఓదానికి మొదటివాడు అవడంవల్ల ఇట్టి ఆశీర్వచనాలు రావడం నేటినాగరికతలక్షణం.

విమానాలు : పక్షులు

ఇంతవరకు ఆకాశం పక్షులరాజ్యంగా ఉంది. ఆ రాజ్యాన్ని వాటిని సుఖంగా అనుభవించనీయకుండా ఇప్పుడు ఈ గాలివిమానాలు వచ్చాయి. కాబట్టే పక్షులు విమానాల్ని అసూయాదృష్టులతో చూస్తున్నాయి. ఒక శీతాకాలంలో ఆస్ట్రియా, స్విట్జర్లాండులనుండి వేడిప్రదేశాలకు వలసపోతూ పిచికలు కొన్ని చలిచే ఒకచోట పడిపోగా ఓ గాలివిమానం వాటిని తనమీద ఎక్కించుకుని దూరదేశంలో విడిచిపెట్టింది. పక్షులకు ఈ విధంగాకాని, మరోవిధంగాకాని సాయపడిన గాలివిమానాలు మతియేవిన్నలేవు. పక్షిలోకానికి మొత్తంమీద అవి ఎక్కువ హానినే చేస్తున్నాయి అని చెప్పాలి. పైన గాలివిమానం ఎగురుతున్నదా

అంటే క్రింద చిన్నపక్షులు కిక్కురుమనకుండా ఉంటాయి. ఒకదేశంలో కాకులు సస్యాలను నాశనంచేస్తుండగా రైతులు వాటినిచంపడానికి ప్రయత్నాలు సాగించారు. ఒకచెట్టుమీద కాకులుకూడి ఉన్నాయి. అదే సమయంలో ఆచెట్టుకుపైన గాలివిమానాన్ని తిప్పే ఏర్పాటు చేశారు. భయంతో గజగజలాడిపోతూ ఒక్కపిట్టకూడా రెక్క విదల్పలేదు. కీలెరిగి వాతపెట్టనేర్చిన ఆరైతులు క్రిందనుంచి తుపాకిగుండ్లతో అప్పుడు ఆ పిట్టలను పేల్చి చంపారు.

పక్షుల ఇట్టి నాశనానికి హేతుభూతాలు కావడంచేతనే పక్షులను ప్రజలకు రాజులగు రాబందులు—ప్రజారక్షణ రాజులకు పరమధర్మం కాబట్టి—వీలైనప్పుడల్లా గాలివిమానాల్ని ఢీకొంటూఉన్నాయి. పారిస్‌నుంచి స్పెయిన్‌లోని మాడ్రిడ్‌కు 1911-వ సంవత్సరంలో గాలివిమానపు పందాలు జరిగాయి. ఆ పందెపుగాలివిమానాల్లో ఒకదాన్ని రాబందొకటి ఎదుర్కొంది. ఆవిమానచోదకుడు తెలివైన వాడవడంచేత ఉన్నట్టుగ క్రిందికి మీదికి విమానాన్ని ఉయ్యాలలూపి ఆరాబందుని వానాలప్పతిప్పించి గడుసుతనంగా తప్పించుకుని ఈవలపడ్డాడు. ఆరాబందు ఆనాడు ఇంటికిపోయి తనబంధుజనులతో తమ ఆకాశరాజ్యంమీద పేరులేని ఒక పెద్ద శత్రురాజు దండెత్తివచ్చాడని, అతన్ని తాను ఎదుర్కొని హోరాహోరీగా పోట్లాడానని, తనతో అతడు పోట్లాడలేక తోకముడిచి దక్షిణానికి పోయినాడని చెప్పి ఉంటుంది. సాధారణంగా రాబందులు విమానాల్ని ఎదటబడే ఎదిరిస్తాయి. కాని జర్మనీదేశపు రాబందు ఒకటి తాను అన్నిటికంటె ఎక్కువ తెలివిగలదాన్ని అనుకుని అహంభావంతో విమానాన్ని వెనుకవైపునుంచి ఢీకొంది. ఇట్లు యుద్ధప్రక్రియమార్చడంలో ఈ పక్షియోధుడు పొరపడ్డాడనే చెప్పాలి. ఏమంటే తెగిపోయిన ముక్కుతో అతడు భూమిమీద పడ్డాడు.

గాలివిమానాలంటే ఈ పక్షులకు కిట్టకపోవడం ఈనాటిదికాదు. రామాయణకాలంనుంచి వస్తోంది. సీతను ఎత్తుకొనిపోయే రావణాసురుడి విమానాన్ని జటాయువు అనేపక్షి ఎదిర్చింది. ఆపక్షి విమానాలంటే తనకుగల ద్వేషంచేతనే అప్పుడాయుద్ధానికి దొరకొంది గాని కేవలం రాముడిమీద ప్రేమచేతగాని సీత ఏడుపు విని కాని కాదని చెప్పాలి. అసలుకారణం కప్పిపెట్టి కవి కావడంచేత వాల్మీకి తనకు మల్లేనే తానుసృష్టించిన రాముడంటే జటాయువుకు కూడా అభిమానం ఉందని చెప్పేడు. వివేచనాజ్ఞానం బాగాప్రబలిన ఈదినాల్లో వాల్మీకిచేసిన మోసం వెల్లడైపోకమానదు. నిజం నిలకడమీద తేలుతుందిగదా!

విమానాలు: జంతువులు

జంతువులవిషయంలోకూడా విమానాలు దౌర్జన్యంగానే ఉన్నాయని చెప్పాలి. అజ్ఞాతఖండమని పేరు పొందిన ఆఫ్రికా ఖండపు ఘోరారణ్యములమధ్యను ఉన్న సింహాల్ని వేటాడ్డానికి వాయువిమానాలు ఉపయోగింపబడ్డాయి. ప్రభుత్వంవారు నిషేధించారుగాని లేకపోతే ఈ సరికి పక్షిరాజ్యాన్ని ఆక్రమించిన ఈ విమానాలు ఆఫ్రికాఖండమునందలి మృగరాజుల్ని అందరినీ మారణహోమంచేసి ఉండును. ఎగిరే గాలివిమానాల చప్పుడికి గుర్రాలు బెదిరిన నిదర్శనాలు చాలా ఉన్నాయి. డబ్లిన్‌లో ఒకసారి గాలివిమానంవచ్చి ప్రక్కను వాలడంచేత బెదిరిన ఒక నల్లగుర్రం నల్లతోక వెంట్రుకలన్నీ హఠాత్తుగ తెల్లపడిపోయినాయి. ఇట్టి అశ్వవిమానసంఘటనములందు ఒక్కొక్కప్పుడు గుర్రాలికూడా పైచెయ్యి అవడంకద్దు. ఒకపొలంలో ఒకసారి ఒక వాయువిమానం విడిసిఉంది. అశ్వరత్నమొకటి దాన్ని చూచింది. నెమ్మదిగా సమీపించింది. గాలివిమానపు తోకగుడ్డమీద వెనకకాళ్ళతో సత్తువకొద్దీ తన్నింది. సరదాగా ఉండడంచేత కాబోలు అట్లే మరికొంతసేపు జన్మాష్టిష్టుచేసింది. గుడ్డతో చేయబడిన వాయువిమానపుతోక ఊడివచ్చింది. ఇక కాళ్ళు పని చేయకపోవడం మూలాన్ని—కొట్టలేక తిట్టినట్లు—ఆ గుడ్డను నమిలివేయడానికి ప్రారంభించింది. ఒకవిమానం వచ్చివ్రాలి తనజాతికిచెందిన ఒకగుర్రం నల్లతోకవెంట్రుకలు తెల్లబడచినందుకు కసితీర్చేటట్లు ఈగుఱ్ఱం ఒక గాలివిమానంతోకని ఎగిరి తన్ని ఊడలాగి గుటకాయస్వాహాచేసింది. జాత్యభిమానం అంటే ఇల్లాఉండాలి.

గాలివిమానాలు: ఆంధ్రుల ప్రస్తుతకర్తవ్యం

ఒకగుజ్జు గాలివిమానాన్ని తన్నింది, ఒకపక్షి ముక్కుతో పొడిచింది, పూర్వులకు విమానాల పూర్తిరూపయోగం తెలియదు మొదలగువిషయాలు ఎన్ని తెలుసుకున్నా ఆంధ్రులు గాలివిమానాల విషయంలో తమ ప్రస్తుతకర్తవ్యం తెలిసికొని పనిచేస్తేనేగాని తోడిసోదరలోకంలో అపహాసపాత్రమవుతారు. దొరలను చూడండి—విమానాలను ఎంతగా ఉపయోగిస్తున్నారో. ఆఫ్రికాఅడవులలో మోటారుకారుమీద ఆ మధ్య ప్రయాణంచేస్తూ కారుయంత్రంలో ఏదో విరిగిపోగా ఐదువేలమైళ్ళదూరంలో ఉన్న లండనుకంపెనీకి కేబిల్ చేసి గాలివిమానంమీద ఆపార్టును తెప్పించుకున్నారు. ఏదైన ఒక క్రొత్తవిషయమై ఉత్సాహంతో పనిచేయడానికి మన ఆంధ్రులతరువాతనే మరి ఒకరనేపేరు మనకు ఈమధ్యవచ్చి ఉంది. ఈ విషయంలోకూడా ఆ పేరు నిలుపుకోవాలి. నిలుపుకొంటారనే సూచనలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 10 వ తేదీని మొట్టమొదటి మద్రాసు కలకత్తా రహదారీటపావిమానము గన్నవరంలో దింపినది 14 ఉత్తరాలే అయినా నైకొన్నది 128 ఉత్తరాలదాకా ఉన్నాయని పత్రికలలో తెలుపబడ్డది. ఇది శుభసూచన. అయితే విమానపు టపాలో ఎక్కువ ఉత్తరాలు వెయ్యడంతో తృప్తిపడకూడదు. విశాఖపట్టణంజిల్లాలో పేరుపోసిన రేగ్రామపు పెరుగుతోటకూరను, తూర్పుగోదావరిజిల్లాలో ప్రసిద్ధికెక్కిన పెద్దాపురపు మట్టుబచ్చలికూరను, పశ్చిమగోదావరిజిల్లా తణుకుతాలూకాలో ఖ్యాతిగాంచిన కొత్తిమిరిని, కృష్ణాజిల్లాలో వినుతినొందిన కర్పూరపు వంకాయలను, గుంటూరుజిల్లాలో ఖ్యాతిపొందిన గోంగూరను ఏనాటికానాడు గాలివిమానాల్లో మద్రాసు కలకత్తాలకు రవాణాచేసి ఆంధ్రులవ్యాపారనైపుణ్యాన్ని బాగా ప్రదర్శించాలి. గన్నవరంప్రాంతాల్లో ప్రొద్దుట పిండినపాలు ఏనాటికానాడు మదరాసులో ఉదయపు కాఫీకి సరఫరాచేయుటకు వీళ్ళు ఎంతవఱకుగలవో పరిశీలించవలసిఉంది. ముఖ్యంగా ఈగాలి విమానాలవల్ల తెనుగు దేశస్థులలో చాలామందిని బాధిస్తూఉన్న సమస్యఒకటి తీరుటకు అవకాశంఉందని అనుకుంటాను. మనదేశంలో విశేషంగా పొగాకుపండుతున్నా దాన్ని కమ్మటినశ్యంగా చేయగలనేర్పు మనలోఎవరికీ పట్టుబడలేదు. ఇప్పుడు మద్రాసునుంచే మనకు నశ్యంరావలసి ఉంటూంది. కాని ఆరావడంలో కొన్నిరోజుల కాలము గడిచిపోవుటచే ఆనశ్యం తన కమ్మదనాన్ని కొంత, ఘాటునికొంత, సువాసన్నికొంత గోల్పోతూ ఉంది. దీన్ని తప్పించుకోటానికని కొందఱు ఆంధ్రదేశపు పెద్దలు ఆయా పట్టణాలకు మదరాసునుంచి పొడుంచేసేవాళ్ళని రప్పించి తమపట్టణాల్లో స్థిరవసతులు కల్పించారు. ఇట్లా కేవలం పొడుంచేయడంకోసం మద్రాసునుంచి వచ్చినవాళ్ళు ఒక్క హైస్కూలు మాత్రంఉన్న మాతెనాలిలోనే ఇద్దరున్నారు. హైస్కూళ్ళుకాక రెండు మూడు కాలేజీలుకల విశాఖపట్టణం, రాజమండ్రి, బందరు, గుంటూరు మొదలైన తావుల్లో ఇట్టివారు ఎందరెందరున్నారో! పొడుంచేసుకోలేక ఇతర ప్రదేశాలనుంచి మనుష్యుల్ని తెప్పించుకుంటున్నారంటే సాటివారిలో ఆంధ్రుల కెంతనామోషీ? అదీకాక పొడుంకోసం—పాలకోసం రాయబోసినట్లు—దాన్ని తయారుచేసే మనుషుల్నికూడా మనం ఎందుకు ఇల్లిచ్చి, వాకలిచ్చి పోషించడం! విధిలేక ఇన్నాళ్లు వాళ్ళని ఉంచుకున్నాము. ఇక మద్రాసునుంచే మనం గాలివిమానాల్లో నేరుగా పొడుం తెప్పించుకోవచ్చు. మదరాసులో తయారుచేయబడిన ఒకటి రెండు గంటల్లోనే ఆపొడుం మనకు అందుతుంది గనక అప్పుడు కాచిన ఆవునేతి కమ్మదనంవంటి దానికమ్మదనం, బాగావిచ్చిన తరువాత కోయబడిన సంపంగిపువ్వుల పరిమళంవంటిదాని పరిమళం, మినపబద్దలు హెచ్చు పాలుగల కొద్ది మిరపకాయల తాళింపుఘాటువంటి దాని ఘాటు చెక్కుచెదరకుండా వుంటాయి. కాబట్టి క్రొత్త సంవత్సరాది నాటినుంచి గాలివిమానాల్లో మదరాసు నశ్యం విరివిగా దిగుమతిచేసే ఏర్పాట్లు చేసుకోవడం వాంఛనీయమని మనవిచేస్తున్నాను. భావసంవత్సరప్రభావం ఈవిషయంలో ఆంధ్రులకు సహాయమగును గాక!

—ఎ. శేషాచలపతి, బి. ఏ.

సంసారము

౧

కాపరానికివచ్చినక్రొత్తలో.

'ఇదిగో తాంబూలం'

'......... ....'

'నింపాదిగా వేసుకువెళ్ళుదురూ'

'పదిమ్మున్నావు అయింది, కమలా!'

'ఒక్క అయిదునిముషాలు వుందురూ'

భార్య అందించుచుండగా గిరి ఒకటి తరువాత ఒకటి నములుచూ 'అప్పుడే నెల రోజులైంది. నిన్నవచ్చినట్లు వుందికదూ?'

'అవును. నిముషాలలాగ వెళ్ళిపోతున్నాయి రోజులు. ఆఫీసే లేకపోతే ఎలాగ వుండునో?'

'సాయంత్రము నేను వచ్చేదాక మా చెడ్డ కష్టంగావుంటుందనుకొంటాను నీకు.'

'అసలు వస్తారా అనిపిస్తుంది—లేచారేమిటి?. అయిదునిముషాలు అయిపోయాయా? ఉండండి. ఫ్లాస్కులో యింకా కాస్త కాఫీ పోసియిస్తాను.'

'చాల్లెద్దూ. వేళయిందిమరి.'

'టిఫిన్ కారియరు సైకిలుకు కట్టినాను. ఏకలొండ రయిపోయింది. బాగుంటుందో లేదో?'

'బాగుండక పోవటము కూడానా?'

'ఒక్కక్షణము వుండండి. నేనుకూడా గేటువరకూ వస్తాను.'

'రా, మరి.'

గేటుదగ్గిర సైకిలుఎక్కిపోవుచూ మాటి మాటికి వెనుకకుతిరిగి చెయ్యి ఆడించుచూ మలుపుతిరిగి వెళ్ళిపోయెను. కమల అతడు అదృశ్యుడగువరకూ చూచుచూ, కన్నులలో నిలచిన రెండు అశ్రుబిందువులను పమిటతో తుడిచికొని సూర్యాస్తమయముకై వేచియుండెను.

౨

పిల్లలు పుట్టినతరువాత

'ష్, ...ఇదిగో ...ఓసేయి ... మాట.'

'ఎందుకండీ!'

'పదిమ్మున్నావు అయింది తెలుసునా?'

'అయితే'

'పంచ ఏదీ'

'అదేం. ఎదురుగుండాపెట్టుకొని'

'ఇది కట్టుకుపోనా?'

'దాని కేమండీ?'

'మొఖంతుడుచుకోటానికి ముక్కుతుడుచుకోటానికి నాపంచలే కావాలి కాబోలు అందరికి?'

'ఇప్పు డెవరు ముట్టుకున్నారు ఈపంచ?'

'యిదేమిటిది?'

'కిష్టకు జిడ్డుచెయ్యి దీనికి తుడిచాడు కాబోలు!'

'యింకొకటి తెచ్చిపెట్టటము వుందా? లేదా?'

'కాస్త చూసుకొందురూ, చిట్టిని అన్నానికి కూర్చోపెట్టి వచ్చాను. విస్తరిలో కాలు పెట్టుతుంది.'

'ఆఫీసుకువెళ్ళేటప్పుడే వస్తాయి అన్ని పనులూ నీకు.'

'యిప్పుడేమిచెయ్యాలేమిటి నేను?'

'పెట్టెతీసి పంచతీసి యివ్వాలి.'

'అంటుచెయ్యి. కొత్త పెట్టెమూతతీసి తీసుకోలేరు'

గిరి పెట్టెతెరచెను. అందు చీరలు, జాకెట్లు, పిల్లల చొక్కాలు, అక్కడక్కడ తన పాతకోట్లు కనిపించెను.

'అలా కలిపెయ్యకండి. పంచ లేదు కాబోలు.'

చటాలున లేచి గిరి భార్యబుగ్గ పట్టుకొనెను.

'వూరుకోండురూ. ఏదో ఒకదానికి ఎప్పుడూ కోపమే.'

గిరి కోటుతొడుగుకొంటూ 'ఎలాగవుందో యిల్లు. సాయంత్రానికి సర్దివుంచు.'

'అలాగేలెండి.తలుపు వెనుకు వెళ్ళండి.'

...తలుపుదభాలునమూసిన చప్పుడయ్యెను.

3

ముసలితనములో

'ఏమేవు - నీకు జ్ఞాపకమువుందా మన పెళ్ళి?'

'సరిసరి. అది జ్ఞాపకమువుండక పోవాలీ. రేపటికి సరిగ్గా 50 ఏండ్లవుతుంది.'

'అప్పుడెలాగవుండేదాన వనుకొన్నావు?'

'ఎలాగవుండేదాన్ని ?' అని దగ్గరకు జరుగును.

'చక్కాని బొమ్మ. సుఖమంటే అదీ సుఖము. ఒకరోజైనా పోట్లాడుకొన్నామా ?'

'చలిగాలి వేస్తూంది. పైబొత్తాముకూడా పెట్టుకోండి' గిరి గుండీపెట్టుకొనబోగా వ్రేళ్ళు వణకును. భార్య పెట్టును.

'యాభై ఏళ్ళు - యాభై నిముషాలుకదా. ఒకరోజైనా ఎందుకొచ్చిన పెళ్ళాముర అని అనుకోలేదు.'

'ఆ ఎర్రఫ్లేనలు గుడ్డ ఏదీ- దానిమీద కూర్చున్నారా. చెవులకు చలిగాలి తగులుతుంది.'

కమల ఫ్లేనలుగుడ్డ తలకు కట్టెను. గిరి ఆమెచేతులను తడుముచూ, మెల్లిగా, గొణుగుచూ, 'యాభై ఏళ్ళు -ఒకటికాదు. రెండు కాదు. యాభై ఏళ్ళు. ఒకనాడైనా విచారించలేదు కదా.'

'జాగ్రత్తసుమండీ. వెలుతురువుండగానే తిరిగిరండి పశువులువచ్చే సమయము కూడాను. బంగాళాదగ్గిర రోడ్డు బాగుచేస్తున్నారు. రాళ్ళు అవి వుంటాయి. చూసుకొంటూ వెళ్లండి... (గేటుదగ్గిర) మీరు వచ్చేదాక యిక్కడే వుంటాను.'

—ఇరువంటి విష్ణురావు, బి.ఏ.,బి.ఎల్.



మ. "పటపమ్మార్జనగీత...ప్రష్ఠోనశబ్దంబు లొక్కట నోరన్వెడలంగ బట్ట లుతుకన్..."

సినీవాలీ

౧

'నాథా!...

నన్ను ఒంటరిగా విడిచి వెళ్ళిపోతారా...మీరు! మన వివాహవేళ,—మాతండ్రి జనకరాజు మీచేతిలో చేయి వేసి నన్ను ఎప్పుడూ ఎడబాయవద్దని తోడునీడగా మెలగమని అప్పగించలేదూ? అవిఅన్నీ మరచిపోతారా? పోనీ, మన చిన్ననాటి చెలిమినైనా...'

... ...

సత్యానికి, ఏదో వెనుకటివన్నీ తలపుకువచ్చి ఉలిక్కి పడ్డాడు. కాని అంతలో మళ్ళా తెలివితెచ్చుకుని తన తొట్రుపాటును ఎవరన్నా గమనించారేమోనని అటూ ఇటూ చూశాడు.

...నాటకం నడిచిపోతూన్నది. సీత, రాముని అనేకవిధాల బ్రతిమాలుకుంటూంది, తన్నుకూడా వెంట అడవికిరానీయమని మధ్యమధ్య ఆరసుకులతిలకుడు, ఆ అమ్మాయి మాటలకు అడ్డమువస్తూ పాటలతోనూ, పద్యాలతోనూ, రావడానికి వీలులేదని, ఉన్న సాధక బాధకాలన్నీ వివరించి చెపుతున్నాడు. ప్రేక్షక మహాశయులందరూ, ఎవరికి వీలయినచోటులలో వారు కూర్చుని,—నాటకం చూస్తున్నారు.

—మనసంతా చెదిరిపోయింది; లేచి వెళ్ళిపోదామనుకున్నాడు, లేవబోయినాడు; మళ్ళా, ఏమనుకున్నాడో, ఏమో, కూర్చుని, జేబులోనుంచి కేసు వెదకి తీసుకుని, పావకాశంగా సిగరెట్టు ముట్టించాడు. కూర్చుని, అలాగే నాటకం చూస్తున్నాడు. కాని ఏమీ తెలియడంలేదు ఏమో అంతా అయోమయంగా ఉన్నది.

'డ్రింక్ తీసుకోరూ?'

సత్యం చప్పున తెలివితెచ్చుకుని ప్రక్కకు తిరిగి చూశాడు. మంజరి నవ్వుమొగంతో అతన్ని పలుకరిస్తూంది. అతడు ఏమీ అర్థంకాక, ఆమె చేతిలో గ్లాసు వంక,...తరువాత మెల్లిగా తలఎత్తుతూ చివరికి ఆమెవంక తేరిపార చూశాడు. మంజరి సాహసంగా అతన్ని వీక్షిస్తూన్నది. సత్యం ఆచూపుకు నిలువలేక తల తిప్పేసుకున్నాడు.

'కొంచెంసేపు బయట తిరిగివద్దాము రారూ!'

నాటకం అతనికి తెలియకుండానే సగం అయిపోయింది. ఇంటర్వల్‌లో, అందరూ, బయటికి వచ్చేస్తున్నారు. తమిళసోదరులందరూ, ఆ అవకాశాన్ని వ్యర్థం చేయకుండా, పాండానులు బయటికితీసి కరువుదీరా, కసితీరా వెత్తిల్ కన్నులకు దంతక్షతాలు చేస్తున్నారు.

మంజరి లేచినిలుచున్నది. సత్యంరానని తలతిప్పాడు.

'రారూ అబ్బ! మళ్ళా ఇప్పుడే వద్దాంకాదూ. నాకు చాక్‌లెట్‌లు కావాలి'- సత్యం ఆమెమాటకు జవాబు చెప్పకుండానే అక్కడ తిరుగుతూన్న ఒకపిల్లవాడిని పిలిచి వానిచేత కావాలిసినవి తెప్పించి ఆమెకు యిప్పించాడు. తానుమళ్ళా తన ఆలోచనలోపడి పోయినాడు. మంజరిమాటే మరచిపోయినాడు. ఆమె అక్కడకూర్చున్నదో లేదో, ఆధ్యాసేలేదు అతనికి.

ఎంతసేపు నాటకమాడారో, ఎప్పుడు అయిపోయిందో సత్యానికి తెలియనే తెలియదు. మంజరి అతన్ని బలవంతాన మేలుకొలిపి బయటికి తీసుకువచ్చింది.

అప్పటికప్పుడే చాలామందివెళ్ళిపోయినారు. సత్యం తిన్నగా తలవంచుకుని నిదురమబ్బుతోనే, మంజరివెంట వచ్చేశాడు. ఒకరిద్దరు ఎవరో పలుకరించినా వినిపించుకోలేదు. వారివంక చూడనైనాలేదు ఏలాగో బయటపడి కారులో ఎక్కికూర్చున్నాడు మంజరి తనంతతానే ఎక్కి అతని సరసనకూర్చున్నది.

'నిద్దా! అప్పుడే.'

మంజరి అతనికి దగ్గరగాజరిగి ఆనుకుని కూర్చున్నది- చాలా దగ్గరగా.

సత్యం ఏమీ జవాబు చెప్పకుండా కొంచెంసేపు మళ్ళా యథాప్రకారం మౌనముద్ర వహించాడు.

'ఎందుకూ మాట్లాడరు? కోపమా....'

సత్యం బలవంతాన మెలుకువ తెప్పించుకుని మనసు

లో వేదనంతా మాటునుడేమకుంటూ చిరునవ్వుతో 'కోపమా నీమీద' అని మంజరిని మరీదగ్గరకు లాగుకు న్నాడు. ఆమె ప్రసన్నవదనంతో తన బాహులతను అతనికి పెనవేసి మోవి అందించింది.

'చూడండి ఎంత వెన్నెలగా ఉందో, అప్పుడే యిం టికా? వద్దు. బీచికి వెళ్ళుదాము.'

'నాకు నిదురవస్తూన్నది.' అని మత్తులోనే అన్నా డు సత్యం.

'మరి, నాకు రావడంలేదు. మీరు...మీరుకూడా నిద్రపోకూడదు.'

'చాలా పొద్దుపోయింది. ఇంటికి వెళ్ళవద్దూ? మీ వాళ్ళు ఏమనుకుంటారు?'

'ఏమీ అనుకోరు, వాళ్ళకి తెలియదూ మనమిద్దర మూ ఎక్కడో షికార్లు కొడుకూంటామని!—'

'తప్పు కాదూ ?'

ఇంకోమాట రాకుండా, మంజరి తనపెదవి అడ్డుపె ట్టింది. సత్యమూ అది గ్రహించి అంతటితో ఊరు కున్నాడు.

ఇంటికి వచ్చేశారు. మంజరి దిగి మెట్లమీద నిలుచు న్నది. సత్యం ఒక గంటులో ఆమెదగ్గరకు ఉరికి 'వెను వెళతాను' అన్నాడు.

మంజరి తెల్లబోయింది వణుకుతూ గాద్గదికంతో— 'ఇప్పుడా! వెళ్ళిపోతారా?' అన్నది.

సత్యం, ఆమెవంక ఉన్మత్తుడిలాగా చూసి వెనుకకు నడిచి వెళ్ళిపోయినాడు. మంజరి చేష్టలుడిగి, అతడు పోయినవైపే చూస్తూ నిశ్చలంగా నిలుబడిపోయింది.

'సత్యం...సత్యం'

అతన్ననుసరించి వెళ్ళబోయింది. తెలివితప్పి క్రింద పడబోతూంది.

—ఎవరో తలుపుతెరిచారు.

౨

ఉదయిస్తున్న సూర్యుడివంకచూస్తూ సత్యం మేడ మీద కిటికీవద్దనిలుచుని ఉన్నాడు, షేవ్ చేసుకుని, చక్కగా స్నానంచేసి ఎప్పుడెప్పుడంటూ, కాఫీకోసం ఎదురుచూస్తూ. ఉబుసుపోవడానికి, అపరధ్యానంలోనే ఏవో ఈలలో పాడుకుంటూ నిరీక్షిస్తున్నాడు.

మెట్లచప్పుడయింది.అతిసావధానంగా వింటున్నాడు. ఎప్పుడా దేవీమూర్తి ఎదుటపడుతుందా అని తహతహ లాడుతున్నాడు. రావడంతోనే, తనివితీరా కనితీరా.

'బావా.'

సత్యం చాలా విసుపుతోనూ, చిరాకుతోనూ వెను దిరిగి చూశాడు. మోహినికాదు. చిన్నమరదలు. అల్లరి పిల్ల రమణ. కాఫీ ట్రేబల్లమీద పెడుతూ అతనివంక కొంటెగా నవ్వుతూన్నది.

మాటాడకుండా, బల్లదగ్గరకువచ్చి కూర్చుని కప్పు లోది కాఫీయో, కషాయమో గమనించకుండానే రుచి కోసమైనా నిదానించకుండా, ఒక గ్రుక్కలో అఖరు చేసేశాడు. ఆకులు వేసుకోనని, కొంచెం వక్కమాత్రం తీసుకుని, అలవాటుచొప్పున అనుకోకుండానే, సిగ రెట్టు అందుకుని ముట్టించాడు. ఊతంగా పొందటిదమ్ము లాగి అల్లరికి రమణమీద ఊదాడు.

'చాల్లే బావా! నీవు ఎప్పుడూ ఇంతేను. ఏంపనీ లేమా? ఎప్పుడూ సిగరెట్టు కాల్చడమేనా? ఉండు. అక్కయ్యతో చెప్పి నిస్నేంచేయిస్తాను?'

—సత్యం, తప్పించుకోనిపోవాలని చూస్తూన్న రమణను ఒడిసిపట్టుకున్నాడు - గులాబీరేకులలాటి బుగ్గలుముద్దిడుకుంటూ.

'ఈమాటకూడా చెపుతావుకాదూ మీ అక్కయ్య తో?' అన్నాడు నవ్వుతూ.

'అబ్బ! వదులు. ఏమిటీ ఊరికే. ఇదిగో వదలవేం.'

రమణ ఏలాగైనా వదిలించుకోవాలని పెనుగులాడు తూంది. సత్యం నవ్వుతూ విడువకుండా ముద్దిడుకుంటు న్నాడు.

'...రమణా!...'

గుమ్మంలో నిలుచుని, ఈ అల్లరంతా చూస్తున్నది మోహిని—ఎప్పుడు వచ్చిందో సత్యం గమనించనేలేదు. —రమణవంక చురచురచూస్తు

'ఏమిటీ అల్లరి!' అన్నది.

రమణ ఏమి మాటాడకుండా ఊరుకున్నది. సత్యం భార్యను క్రీగంట వీక్షిస్తున్నాడు, తనవైపుచూస్తే కను

సైగతోనే పలుకరించాలని అప్పవాల్చకుండా ఆఅమ్మాయి వంకే చూస్తున్నాడు. కాని, ఆపిల్ల ఆతన్ని తలఎత్తి చూడలేదు. ఆతనికి పెడముఖముగానే రమణ చేయి పుచ్చుకుని 'క్రిందికి వెళుదామురా, అమ్మ పిలుస్తున్నది.' అని వెనుదిరిగింది. సత్యం మోహిని పైటచెంగు లాగాడు. రమణ ఇది గమనించి తప్పించుకుని నవ్వుకుంటూ క్రిందికి పారిపోయింది.

మోహిని ఏమీ మాటలాడలేదు. సత్యం ఆ అమ్మాయిని సమీపించి కౌగలించుకున్నాడు.

'ఎందుకూ కోపం!'

మోహిని మాటాడలేదు. ఆతనివంక సరిగా చూడనైనాలేదు.

'మాటాడవూ?'

'... ... ...'

'నీవు వస్తావని ఇందాకటినుంచీ కనిపెట్టుకుని కూర్చున్నాను.'

'పోనీ కాఫీ అయినా నీవు తెచ్చి పెట్టకూడదూ!'

—ఎన్నివిధాల పలుకరించినా మోహిని మాటాడలేదు. కోపమేమో అనుకుని అనేక సాంత్వనోపాయాలు ఆలోచించాడు. సిగ్గేమోనని చనవుచేసుకోవలెననిచూశాడు. కాని మోహిని మాటాడలేదు.

'సరే క్రిందికివెళ్ళు' అని చాలావిసువుతో ఆమెను వదిలాడు సత్యం. మోహిని సావకాశంగా మెట్లుదిగి వెళుతూ మలుపుతిరుగుతూ సత్యం వంక తమాషాగా చూసి చకచకా క్రిందికి వెళ్ళిపోయింది.

ఆ చూపుతో సత్యానికి మత్తెక్కిపోయింది. ఆకపటాభినయాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయినందుకు తన్నుతాను నిందించుకున్నాడు. మోహినికి తనమీద చాలాప్రేమ ఉన్నదని తెలుసునుకాని ఇంకా చిన్నపిల్ల గనుక ప్రౌఢలాగా నాయకుణ్ణి అలయించే సత్తాఉన్నదని గ్రహించలేకపోయినాడు. ఈమారుకనబడినప్పుడు -మళ్ళా మధ్యాహ్నం కాఫీతెచ్చి పెడుతుందికామూ-కసితీరా...

...కాని రోజల్లా మోహిని కనబడనేలేదు. భోజనంచేసి పైకివచ్చేశాడు. బల్లమీద పక్కవేసి తమలపాకు చిలకలు పెట్టి ఉన్నాయి. మోహిని చాలా చక్కగా చిలకలు చుడుతుందని ఆతనికి తెలుసును. కాని, ఆ అమ్మాయి తానై తీసుకునివచ్చి ఇచ్చేభాగ్యం లభిస్తుందేమోననుకున్నాడు. ఆమె రాలేదు, కాఫీవేళకు కూడా ఆతను నిద్రలో ఉండగానే ఎవరో అన్నీబల్ల మీద అమర్చి ఆతన్ని మేలుకొల్పి కనబడకుండా వెళ్ళిపోయినారు. మోహినిరో, రమణో సత్యం చూడలేదు.

—సాయంకాలముకూడా మోహిని కనబడలేదు. రాత్రిభోజనంచేసేటప్పుడు ఆతని మామగారు భార్యతో మాటలాడేధోరణిలో సత్యం— మోహినీ, రమణా సినిమాకు వెళ్ళారని గ్రహించాడు. చాలా కోపంవచ్చింది. అపాళాన, ఏదో సాకుచెప్పి భోజనం చేయకుండానే లేచి వెళ్ళిపోయినాడు.

మేలుకుందామనుకున్నాడు. కాని తెలియకుండానే నిద్రపోయినాడు. మెళుకువ వచ్చేటప్పటికి చాలా ప్రొద్దెక్కింది. మళ్ళా కొంచెంసేపటికి కాఫీ అందించడానికి రమణ ప్రత్యక్షం.

మామగారిని సమాధానపరచి, అపూటే బయలుదేరినాడు సత్యం అక్కడనుంచి. పండుగకని వచ్చినవాడు ఎందుకు వెళ్ళిపోతున్నాడో అత్తమామలు గ్రహించలేకపోయినారు. ఎంత బ్రతిమాలినా ప్రయోజనంలేదని తెలిసి మామగారు అనుమతించాడు ఆతని ప్రయాణానికి.

సత్యం మోహినికోసం ఎంతోసేపు నిరీక్షించాడు, రాలేదు. చివరికి బండిలో ఎక్కుతూ ఏ కిటికీలో నించైనా చూస్తున్నదేమోనని అంతటా కలయ జూశాడు. లేదు.

3

మన్మథుడివిజయపతాకలాగా ఆ అమ్మాయిపైట చెరగు గాలికి ఎగురుతూన్నది.

—కారు చాలావేగంగా పోతున్నది, ఠీవిఒడ్డున ఆ అమ్మాయి ఏలాఉందో చూడటానికి, అవకాశం లేకపోయింది సత్యానికి. కాని, జరీపనిచేసిన చీరచెరగు మాత్రం విస్పష్టంగా కనపడుతూన్నది. ఎంతదూరాన్నుంచైనా ఇంకా ఎగురుతూనే ఉన్నది. పిలుస్తూనే ఉన్నది; రమ్మని...!

సత్యం పరవశుడైపోయినాడు. ఆమె, కారూ కనుచూపుమేర దాటిపోయేదాకా, అలాగే నిలువబడి పోయినాడు. తరువాత ఆఅమ్మాయి ఎవరో తెలుసుకోవాలని ఆమెను చూడాలనే ఆవేశంలో, చీకటిపడేదాకా వీధిఅంతా వెదికాడు. కాని కనుబడలేదు. పోయే ప్రతి కారువంకా ఆఅమ్మాయి ఉంటుందేమోనని, చూశాడు. చివరకు నిరాశతో పారీస్ కార్నరుదగ్గర బస్సుఎక్కి ఏమీతోచక అప్పుడే ఇంటికిపోడానికి మనసుఒప్పక వెల్లింగ్టన్ దగ్గర దిగాడు.

—లోపలకువెళ్ళి కూర్చున్నాడు. చీకటిలో మెల్లిగా దోవచూసుకుంటూ. ఏదోకథ నడుస్తూంది. సత్యం ఏదో ఆలోచించుకుంటూ, తనధోరణిలో తానున్నాడు.

...అయిపోయింది కాబోలు ఉన్నట్లుండి దీపాలు వెలిగినాయి. సత్యంకూడా ఊహాజగత్తులోంచి బయటపడి లేవబోతున్నాడు.

...ఆచీరచెరగు !...

సత్యం ఆశ్చర్యంతోనూ సంభ్రమంతోనూ పక్కకు తిరిగిచూశాడు. ఆఅమ్మాయి అతనిచెంతనే, అతన్ని తాకుతూ కూర్చునిఉన్నది. దిగ్భ్రమతో నిలుచున్నవాడు అలాగేఉండిపోయినాడు.

ఆఅమ్మాయి...ఎంతోబాగుంది !

—సత్యంవంక తేరిపారచూసి అతనిముందునుంచే నడచిపోయింది. అతడు ఆమె వెళ్ళిపోయేదాకా అలాగే నిలుచుని కదలలేక పోయినాడు.

అందరూ బయటికివెళ్ళిపోతున్నారని స్పృహ తెచ్చుకుని సత్యంకూడా బయలుదేరబోయినాడు. స్టాలుదగ్గర దాహంతీర్చుకుని పోవాలని వెనుదిరిగి అంతలో ఆగిపోయినాడు.

ఆఅమ్మాయికూర్చున్న కుర్చీపక్క కుర్చీమీదను పర్సూ, పుస్తకమూ అతన్ని ఆకర్షించి గమనవిరోధము కలుగచేసినాయి.

సంశయించవన్నాలేదు. అవి ఆమెవేనని ఏలాగో వాటిని చూడగానే తోచింది. చేయాలని చేసిందో నిజంగానే మరచిపోయి వదలిపెట్టిందో అని అయినా ఆలోచించలేదు. వాటిని పుచ్చుకుని ముందుకు దుమికేశాడు. డ్రింక్ సంగతే తలపెట్టలేదు. రెండు రెండుగ రెండుమూడు అడుగులలో బయటికివచ్చేసి ఆమెకోసం అంతటా కలయచూశాడు.

ఉప్పొంగిపోయాడు. ఆమె వెళ్ళిపోయిందేమో అన్నభయం మాయమైంది. ఆఅమ్మాయి. అప్పుడే కారులోకి ఎక్కబోతున్నది.

సంశయించకుండా సమీపించాడు. అంతలో సిగ్గు అడ్డపడ్డది. ఏలాపలుకరించాలో తోచక అక్కడే నిలుచున్నాడు.

ఆఅమ్మాయి అతనివైపుచూసింది. నవ్వుతూపలుకరించి అవి అందుకున్నది.

ఆమెవంక చాలాసేపుచూశాడు. ఆమెచూపుల ఆ కటాక్షవీక్షణాలకి ఆగలేక తలవంచుకున్నాడు. అప్రయత్నంగానే పుస్తకంమీద 'మంజరి' అన్న పేరు గమనించాడు. తరువాత ఆపుస్తకం టీనాకెల్మారు రచించిన 'అల్లరిపిల్ల' అని గుర్తించాడు. ఆవేళ చూసిన ఫిలిమ్ ఆ కథే !

చిరునవ్వు చిందకుండానే కనుసైగతో ఒకచూపులో అతన్నిముగ్ధునిచేసి సెలవొసగి ఆఅమ్మాయివెళ్ళిపోయింది. సత్యం తన తెలివితక్కువను నిందించుకుంటూ నడచిపోయినాడు.

చాలారోజులయిపోయినాయి. 'మంజరి' మళ్ళా కనబడనేలేదు సత్యానికి. కాని కనబడదనే నిరీహ మాత్రంకలగలేదు అతనికి. మొదటిసారిచూసినప్పటినుంచీ కూడా ఎందుకనోగాని ఆమె, తన జీవితకుసుమాన్ని ఆమధుసారభాన్ని గ్రోలుకొని వర్తిల్లే మధుపాంగనగా అవుతుందని ఆశకలిగింది. ఎంతకాలము కనబడక పోయినా ఆమెను మరువలేకపోయినాడు. ఆఉత్సాహమూ పోలేదు.

—సర్కసు ఆవరణలో అనేకవినోదలీలలు జరుగుతున్నాయి. సత్యం అందరితోబాటు తానుకూడా మెర్రీగోరౌండులో ఎక్కాడు. అన్ని సీట్లలోను చాలావరకూ దంపతులు కూర్చున్నారు. సత్యం ఒక్కడే రతీవిరహామనుభవిస్తున్న రమాకుమారుడిలాగా ఒంటరిగా ఉన్నాడు.

—కనబడుతుందనుకోలేదు. ఆవేళ అంతభాగ్య మబ్బుతుందని ఆశపడలేదు. కాని మంజరి అచక్రభ్రమణంలో అతనికి కొంచెముక్రిందుగా అతనిలాగే ఒంటరిగా కానిపించింది.

ఆగకపోతే ఆ ఆవేశంలో దుమికేవాడేమో తెలియదు. దిగగానే జనాన్ని తోసుకుంటూ ముందుకుపోయినాడు. మంజరిని సమీపంలోనే కలుసుకున్నాడు.

ఆమెకూడా ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లు అక్కడనే నిలుచున్నది. సత్యం ఆమెనుచూడగానే మంజరిని తప్ప మిగతా అక్కడున్న అందరినీ తానస లెక్కడున్నదీ మరచిపోయినాడు. తనివితీరా ఆమెవంక చూస్తు ఆమె కోమలకరపల్లవాన్ని అందుకుని చాలా నాజూకుగా 'మంజరీ' అని పలుకరించాడు.

ఆ అమ్మాయి అతన్నిచూచి ఆశ్చర్యపడలేదు. అతని చేయి వదలించుకోలేదు. ఏమీ మాటపలుకలేదు. కాని ఆచూపులో ఆమె ఆహ్వానాన్ని సత్యం అందుకున్నాడు.

అదీ వారిద్దరి మొదటి ప్రణయయామిని!

౪

'సత్యం!'

—అప్పటికి మూడురోజులయింది అతడు మంజరిని చూసి. రోజూ ఎన్నిసార్లు ఫోనుచేసినా జవాబు చెప్పకుండా తప్పించుకుంటున్నాడు. ఒకటి రెండు మార్లు, ఆమె చూడడానికివచ్చినా నౌకరుచేత లేనని పించి ఆమె సందర్శనభాగ్యంకూడా—చేయలేక చేయలేక ఎంతో వేదనపడుతూనే—లేకుండాచేసుకున్నాడు. మధ్యమధ్య మనసు చలించేది. మంజరిమీది ప్రణయావేశంలో మోహినిని సాఫుగా మరచిపోయేవాడు. కాని మనసు దిటవుపరచుకుని మంజరినివదలి తన భార్యను మోహినిని చూడవలెనని పోవ సంకల్పించుకున్నాడు.

ఆరుగంటలుదాటింది.సత్యం ఆవేళ మెయిలుకుబయలుదేరవలెననే నిశ్చయంతో సామానుసర్దుకునిసిద్ధంగా ఉన్నాడు. భోజనానికి వెళ్ళిరాబోతూ ఎదురుగా బల్లమీద ఉన్న మంజరి ఫోటోను చూడకూడదని పెనుగులాడుతూనే చూస్తూ నిలుచబడినాడు. తెలియకుండానే సమీపించి దాన్ని అందుకుని ముద్దిడబోతున్నాడు.

మంజరి సాక్షాత్కరించింది.

ఆమె పిలుపువిని సంతోషంగా తిరిగి చూశాడు. మంజరి నవ్వుతూ గుమ్మంలో నిలుచుని ఉన్నది.

సత్యాన్ని కదిపి కౌగలించుకున్నది బాహులతను అలా పెనవేసి. అతని వంక చూస్తూ 'సత్యం.' అనిమళ్ళా పలుకరించింది.

అతడు ఆమె కౌగిలివదలించుకోబోయినాడు. కాని మంజరి ఆ ప్రయత్నాన్ని గమనించి మరీ పెనవేసింది.

'ఎందుకూ సత్యం!' అన్నది.

మంజరివైపైనా చూడకుండా బలవంతాన ఆమెను విడిలించుకుని బిరబిర నడచిపోయి సోఫాలో కూలపడ్డాడు. ఆమె ఒకనిమిషం అతని వంకచూసి తాను కూడా అతని సరసనచేరి మీదచేయివేసి సత్యం ముఖం తనవైపు తిప్పుకుంటూ, 'ఎందుకూ అంతకోపం' అని లాలనతో అడిగింది. సత్యం బదులు చెప్పలేదు.

కొంచెంసేపటివరకూ ఇద్దరూ మాటాడలేదు.

ఆమె 'భోజనంచేయవూ?' అని మరల కదిపింది.

సత్యం 'ఊహూ' అని తలఊగించి మళ్ళా మౌనముద్ర వహించాడు. మంజరి ఊరుకోలేదు.

'నేనుకూడా నీతో భోజనం చేస్తాను. ఎంతకాలమైందో కులాసాగా ఇద్దరమూ ఒకచోట కలిసితిని. ఫోనుచెయ్యి హోటలుకు' అన్నది. సత్యం ఏమనుకున్నాడో ఫోను దగ్గరికివెళ్ళి గర్జిస్తూ హోటలువానికి ఆజ్ఞాపించాడు. మళ్ళా తిరిగివచ్చి మామూలుచోట కూర్చున్నాడు.

మంజరి అతనికి సిగరెట్టు అందించింది. ఆమె ప్రసాదించిన వెలుగులోనే అంటించుకున్నాడు. సగంవరకూ ధూమపానం ఆస్వాదించాడు. అంతలో తటాలున ఆమెవైపు తిరిగి 'మంజరీ.' అన్నాడు.

ఆమె తల ఊపింది ఔనని.

'నేను వెళుతున్నాను.' అని తడబడుతూ, ఇంకా ఏమో చెప్పబోయి మళ్ళా ఊరుకున్నాడు.

ఆమె ఈ విభ్రమాన్ని గమనించినా ఏమీ చూడనట్లుగానే—'ఎక్కడికి?' అని సరసంగా, సావకాశంగా అడిగింది. సత్యం ఊరుకున్నాడు. కాని ఆమె గ్రహిం

చింది 'మోహిని దగ్గరకా' అని మళ్ళా అడిగింది.

'అవును!'

'ఎప్పుడు వెళతావు'

'ఈవాళే'

మంజరి ఓ క్షణం ఏమీ అనకుండా ఊరుకున్నది. తరువాత 'పోనీ రేపు బయలుదేరరాదూ' అని అందు కున్నది.

'ఊహుఁ'

'వల్లకాదు.'

'నీ యిష్టమా?'

'కాదాఁ'

మంజరి మళ్ళా అతన్ని కౌగిలితో తనవద్దకులాక్కుని 'చూడు సత్యం! నేను ఆమాత్రం కోరతగనా?'

'నేను వెళతాను'

'ఈ ఒక్కరోజు'

'ఊహుఁ'

మంజరి అతన్నివదలి దూరంగా నిలుచుని 'సరే' అని వెళ్ళిపో ప్రయత్నంచేసింది. సత్యం ఒకదాటున ఆమెకు అడ్డమై పరిష్వంగంలో ఉక్కిరి బిక్కిరిచేస్తూ 'మంజరీ! నిన్ను వదలలేను' అన్నాడు.

ఆమె అతన్నిచూడకుండానే 'వద్దు వెళ్ళు' అని వద లించుకున్నది.

'వెళ్ళను.'

'తప్పకు వెళ్ళాలి.'

'మంజరీ! నీకు న్యాయమేనా?'

'ఆ!

'ఉండవూ'

'ఏం!'

మంజరి అతన్ని తేరిచూస్తూ 'మోహిని వస్తుంది కాదూ' అని, నవ్వి, ఇక అక్కడ ఆగకుండా క్రిందికి దిగిపోయింది.

కారు చప్పుడయింది.

సత్యం భోజనంమాటే మరచిపోయి స్టేషనుకుబయ లుదేరాడు.

౫

మెయిలు ఆవేళ కొంచెం ఆలస్యమయింది.

మంజరి కారులోకూర్చుని సత్యం ఎప్పుడువస్తాడా అని ఎదురు చూస్తూంది. క్రిందటిరాత్రే, వస్తున్నానని టెలిగ్రాం యిచ్చాడు. బయలుదేరుతాడని తెలుసు. ఒక్కడే తయారవుతాడనికూడా తెలుసును.

మెయిలు ఆగింది. రైలులో ఉండగానే సత్యం, మంజరిని చూశాడు. దిగి తిన్నగావచ్చి ఆమెప్రక్క కూర్చున్నాడు. పోర్టరు సామాను తెచ్చి వెనుక వేశాడు. మంజరి కారు స్టార్టుచేసింది.

ఇంటికి చేరుకున్నారు. త్రోవలో సత్యం ఏమీ మాటాడనూలేదు. మంజరి అతన్ని పలుకరించనూలేదు.

'ఏమోయ్ సత్యం! ఎప్పుడురావడం!' అని మంజరి అన్న హాలులో ఎదురై పలకరించినా ఆమాట విని పించుకోకుండా తిన్నగా లోపలికి వెళ్ళిపోయినాడు. మంజరీ, ఆమె అన్నా ఒకరినొకరు చూసి సాభిప్రాయం గా నవ్వుకున్నారు.

స్నానాదికములు ఆచరించి సత్యం కాఫీ పుచ్చుకుం టున్నాడు. మంజరి అతని సరసను నిలుచుని ఉన్నది. కొంచెం త్రాగినతరువాత సత్యంవారిస్తున్నా లెక్కచే యకుండా కప్పు మరల నింపుతూ 'సత్యం!' అన్నది. అతడు ఆమెవైపు చూశాడు.

'మోహిని ఏదీ?'

'రాలేదు'

'ఏం?'

'ఏమో. ఇదుగో మంజరీ నీవు ఇక ఆమాట ఎత్తవద్దు.'

'ఎందుచేతనో'

'మోహిని నా భార్యకాదు.'

మంజరి నవ్వింది. సత్యం అది గమనించకుండానే 'నామీద ఆ అమ్మాయికి ప్రేమలేదు. యిష్టంలేదు.'

'నీకు ఏలా తెలుసూ?'

'ఆమాత్రం తెలియని పసిపాపనా! నాతో మాటా డితే మాటాడటానికే ఇష్టంలేదు మోహినికి.'

'సిగ్గుపడిందేమో.'

'సిగ్గు అయితే హద్దు ఉంటుంది. మరి వైముఖ్యానికి'

'నీతో అసలు మాటాడనేలేదా?'

'ఊహుఁ'

'పోనీ కనపడిందా'

'మొదటి రోజున.'

'తరువాత'—

'అంతర్ధానమయింది'

'వెతకలేక పోయినావా? ఎవరినీ కనుక్కోలేక పోయినావా?'

'ఎందుకులేస్తు, మంజరీ! అంత ఇష్టంలేని ఆ అమ్మాయి మీద హక్కు ఉన్నదికదా అని అధికారం చెలాయిద్దామనిలేదు. కులాసాగా ఉండనీ!'

'చాలా సరసంగా ఉన్నది.'

'మరి ఏంచేయను?

'నీ భార్యకాదూ.'

'అవును. అగ్నిసాక్షిగా కాని మనసు.'

'నీమీదనే ఉన్నదేమో.'

'పాపం! నామీద మనసుతోనే నేను కనబడగానే కంటికికూడా కనబడకుండాపోయింది.'

'అయితే ఆ అమ్మాయి సంగతేమిటి!'

'ఆమె యిష్టం.'

'నీ అభీష్టమో?'

సత్యం జవాబు చెప్పకుండా ఆమెవంక చూశాడు. ఆమె నవ్వింది.

...సాయంకాలందాకా ఏలాగో వేగిరించారు ఇద్దరూను. తిరిగి తిరిగి యింటికి మంజరి యింటికే చేరుకున్నారు.

—వెన్నెల బాగావచ్చింది.మంజరీ, సత్యం తాంబూలాలేసుకుంటూ కూర్చున్నారు.

'చూడు సత్యం మరి మోహినిమాట...'

'నీ కెందుకూ?'

'ఎందుకోలే. నీకు మోహినిమీద ప్రేమఉన్నదా?'

'నీమీద,'

'సరేలే. మోహినిని చూడాలని లేదూ?'

'ఊహుఁ'

'అబ్బ ఇదిగో ఈలాచూడు నిజంగా...'

'చూడాలనే ఉంది...కాని'

మంజరి నవ్వింది. సత్యం ఏమీ అర్థంకాక ఆమె వైపూ...తరువాత క్రమంగా ఆశ్చర్యపడిపోయినాడు! మోహిని ఎదురుగా తలవంచుకుని నిలుచుని ఉన్నది!

మంజరి నవ్వు ఆపకుండానే 'చూడు. ఎంత బాగున్నదో. మోహినీ! ఇంకా కొంచెం ముందుకురద్దూ అమ్మా! ఈ పెళ్ళికొడుకు సరిగా చూస్తాడు.' అన్నది. సత్యం తెల్లబోయినాడు. మంజరి మోహినిని దగ్గరకు రమ్మని సైగచేసింది. ఆ అమ్మాయి లజ్జాభరంతోనే నెమ్మదిగా అడుగులిడుతూ వచ్చి మంజరి ప్రక్కను నిలుచుని ఆమె బలవంతానా ఒదిగి కూర్చున్నది.

'మోహిని మాచెల్లెలు' అన్నది మంజరి. సత్యం అర్థంకాక ఆమెవంక చూశాడు.

'అవును చెల్లెలే. మా అమ్మ చెల్లెలి—మా పిన తల్లి—కూతురు...'

'నీవు మరి...'

'మరిలేదు గిరిలేదు. నాకన్న ఎంతచక్కందో చూడు. పాపం పలుకరించలేదట. నీవు పలుకరించావు కాదూ?'

'మంజరీ!'

'వారు తెలుసుకునే పలుకరించలేదని పారిపోయి యిక్కడికి వచ్చేశావు. మోహినికోసం నిన్ను నావాడినిగా చేసుకున్నాను. మళ్ళా ఆమెకోసం పెళ్ళి. ఈ మారైనా పలుకరించలేవూ...కనబడలేదేం! ఎక్కడికక్కడ నీవు వచ్చావుకదా అని కాళ్ళకు అడ్డంతగులాలేం. అంత ప్రేమఉన్న భార్యకోసం అక్కడ వెదుకాలో తెలియదూ.'

మోహిని తలయెత్తిచూసి నవ్వింది. మంజరి 'మరలా మోహినీ! అని పిలు వింటాను. ఎంత చక్కగా పిలువగలవో?' అని నవ్వింది.

సత్యం ఎటూ చూడకుండాలేది ఎక్కడకో పోయినాడు. ఏమో!

మరోక్షణంలో తెలివితెచ్చుకుని చూసి మోహిని కౌగిటనున్నానని తెలుసుకున్నాడు. ఆమె అతని పెదవికోసం వెదకుతూ 'సత్యం!' అని కోమలంగా పలుకరించింది. సత్యం పరవశుడైపోయినాడు.

—మంజరి యెక్కడనుంచో నవ్వుతూంది.

—మల్లాది రామకృష్ణశాస్త్రి.

విడ్డూరములు

§. గొఱ్ఱె ఒంటిమీదిబొచ్చులో పక్షిగూడు

ఆస్ట్రేలియాఖండమునందలి పెలంగా అను ప్రదేశమున ఎ. బర్జర్ అనువానికి చెందిన ఒకగొఱ్ఱె ఒంటెమీది బొచ్చును కత్తిరించుచుండగా ఆ బొచ్చులో పార్లింగు అనబడు ఆదేశపుపక్షిగూడు ఒకటి కానవచ్చెను. అపక్షి గూటిలో ఒకగుడ్డుకూడ ఉండెను. ఈవార్తను లోకమునకందించిన 'ఫీల్డు' అను పత్రిక కేవ్‌కాలనీలో ఒక గుఱ్ఱపుతోకలో ఒక చిన్నపిట్టగూడు కానవచ్చెననుటను చదువరులకు జ్ఞాపకము చేయుచున్నది.

§. నల్లటిమంచుగడ్డ

'మంచుగడ్డ' అనుటతోడనే మనకు తెల్లందనము జ్ఞప్తికివచ్చును. అట్టిచో నల్లటిమంచుగడ్డ కలదనుచో చాలమందికి ఆశ్చర్యముగనుండవచ్చును. స్విట్జర్లాండు దేశమున ఈనడుమ ఆకాశమునుండిపడిన మంచుగడ్డ నల్లగనుండెను. ఇట్లు నల్లటిమంచుగడ్డపడుట ఆదేశమున తఱుచు జరుగువిషయమే. వాతావరణమునందలి శైత్యమునకు మంచుగడ్డ ఏర్పడునుగదా. అట్లు ఏర్పడునప్పుడు పరిసరమున ఎగురుచుండు నల్లటిపురుగులు ఆ మంచులో ఇఱుకుకొనిపోవుటచే దానికి ఈనల్లటిరంగు కలుగుచున్నదని శాస్త్రవేత్తలు పరిశోధించి చెప్పుచున్నారు.

§. పావురములు వార్తల త్వరప్రచురణమునకు తోడుపడుట

ఈ నడుమ జపానునుంచివచ్చిన బెల్జియము యాత్రికులు జపానుపత్రికల రిపోర్టరులు చుఱుకుదనమునందును, తెలివితేటలయందును ప్రపంచమునందలి ఇతర పత్రికల రిపోర్టరుల మించియున్నవిధమును ఇట్లు చెప్పుచున్నారు. హార్బరులోనికి ఓడలువచ్చినతోడనే పోర్టు డాక్టరుతోగూడ పత్రికల రిపోర్టరుగూడ ఓడనెక్కును. రిపోర్టరు కూడ నొక కెమెరాను కొనిపోవును. వచ్చినవారిలో ప్రఖ్యాతపురుషుల ఫొటోలు తీసికొనును; వారితో సంభాషించును; సంభాషించిన విషయములను టైపుచేయును, దానికి ఫొటో ఎత్తును, అంతటిని పోస్టు స్టాంపు అంతమడతలోనికి తెచ్చును. దానిని తన పావురమున కొకదానికికట్టును. ఆ పావురము వెంటనే పత్రికాకార్యాలయమునకు ఎగిరిపోవును. కార్యాలయమున వారు దానిని గైకొని వెంటనే చిత్రపటసహితముగా ఆవ్యాసమును ప్రచురించి పత్రికను హార్బరులోనికి అమ్మకమునకు పంపుదురు. అప్పటి కింకను ప్రయాణికులు పోర్టుడాక్టరుపరీక్ష, కస్టమ్సుఆఫీసరుల తనిఖీ తీరి బయటపడరు. తమ ఛాయాచిత్రము, తమతో రిపోర్టరుచేసిన సంభాషణము అప్పటికప్పుడే ముద్రితమై అమ్మకమునకు సిద్ధముగానుండుటకు వారు సంభ్రమాశ్చర్యముల నొందుదురు.

§. ఏడువేలరకముల తేనెటీగల భాండారము

ప్రపంచమునందలి తేనెటీగల భాండారముల కన్నిటిలోనికి మిక్కిలి పెద్దదగు భాండారము ఇపుడు పారిస్‌నందలి జంతుప్రదర్శనశాలలో చూపబడుచున్నది. ఈ భాండారమున 100 000 సంఖ్యగల తేనెటీగలు గలవు. ఇవి ఏడువేలరకములవి. ఇన్నిరకములకు చెందిన ఇంత పెద్దసంఖ్యగల తేనెటీగలనుగూర్చిన మహనీయుని నామము హాన్సుప్రూహిబెర్‌ఫర్. వివిధములగు తేనెటీగలను సమకూర్చుట కితడు ఇండియా, మలేషియా, ఆఫ్రికా, చైనా, జపాన్, సయామ్, ఉత్తరఅమెరికా, దక్షిణఅమెరికా దేశములందు సంచరించెను.

ఆంధ్రరాష్ట్రము: హరిశ్చంద్రుడు

అది ౧౯౨౧-వ సంవత్సరము. హరిశ్చంద్రుడుగారప్పటికప్పుడే వివిధవ్యాపారపరిస్థితులు వయస్సు ఇరువదెనిమిది. అప్పుడు ఈ వ్యాసరచయిత కళాపరిషత్తున విద్యాపిపాసువు, పదునాలేండ్ల బాలకుడు: విజ్ఞానసంపత్తికోసము హరిశ్చంద్రుడుగారి ఆశ్రయమున, ఆదరానురాగముల బడయుచున్న విద్యార్థి. ఒక్కపరి ఆయానందప్లావితములైన దివసములు స్మృతికి తెచ్చుకొనిన హృదయము ఆనందోత్తేజితము, భక్తిపులకితము అగును. వారి సమ్ముఖమున విజ్ఞానామృతమును గ్రోలి జీవితాదర్శముల ఉద్దీపింపచేసికొనిన మంచికాలమది. పండువలచి చేతసిడినట్లు హరిశ్చంద్రుడుగారు 'క్విట్ ఇ లైక్ మాన్' 'గోల్డుస్మిత్ వ్యాసములు' మొదలైన ఉద్గ్రంథములలోని సద్భావములు సులలితములైన మాచిన్ని హృదయముల నాటిన రోజులవి.

మరల ౧౯౩౭ లో వారు శాసనసభాభవనమున భావోద్రిక్తులై, ధర్మసాధకులై పేదరైతుల ఇక్కట్టులగూర్చి గర్జించుచున్నపుడు, చిననాడు లేతహృదయముల భక్తిభావముల నెట్లు చూఱగొనిరో, ఆ దేశీరున ఈనాడు మొరటు లోకపు అనుభవము కొంతవఱకు నందిన హృదయమున మానవసేవాభిలాషను ఉద్దీపింపజేసి, దేశమంకను గొడ్డుపోవలేదను మేల్కొలుపు వినిపించిరి.

హరిశ్చంద్రుడుగారి హృదయము సున్నితమైనది, కంఠము మధురమైనది; వారి నేత్రాంచలముల నొకానొక తేజస్సు కలదు. వారు కళోపాసకులు: విజ్ఞాన తేజస్వి.

ఎందఱెందరో బీదపిల్లలు వారి పోషణమున అభ్యుదయముగాంచి నేడు తహసీల్దారు పదవులు సయితము నందుకొని యున్నారు. ఎన్నియో సంఘములు, మండలులు గోప్యముగ వారిసాయము నందుకొని యున్నవి. ఎన్నెన్నియో పిపాసావిలమైన నిరాశాహృదయములు వారి మధురలాలనమున, కరుణామయదృష్టులందు ఆశాప్రకాశమును బడసినవి. కళాపోషకులగు వారి అభయహస్తములనుండి నటకులు, కవులు, చిత్రకారులు బాసట చేకొన్నారు.

విజ్ఞాన తేజస్వి: వారి చిన్న ముచ్చటగూర్పు గ్రంథాలయము నీక్షించినచో, వారి సద్గ్రంథావలోకనాతన్మయీభావము పరికించినచో ఆసుహృదయమందలి విజ్ఞానసంపత్తి గోచరించును. ఆంగ్లమున మిల్టను మొదలుకొని రోమరోలెండు, మాగ్జిమ్ గోర్కి వఱకును, ఆంధ్రమున భారతము, సీతారామాంజనేయము మొదలిడి కృష్ణపక్షము, కుంకుమభరణి ఇత్యాదులు ఆకావ్యవీధియందు కలవు. కవిశేఖరుడు ఆంగ్లమున జీవనస్మృతిలో 'విశ్వదాతయగు ఈశ్వరుడు ఒక్కచిన్నసందుగుండ విశాలవిశ్వమునంతటిని మనదృష్టి కందించగలడు' అన్నాడు. స్వంతమైన సద్గ్రంథములమూలమున కూడా ఆయావ్యక్తి మానసికలోకము నెఱుంగనగునని నా అభిప్రాయమే కాదు, పెక్కుఱు నుడివియున్నారు.

జీవనపథమున మ్యునిసిపల్ గౌరవోద్యోగి పదవినుండి శాసనసభా సభ్యత్వము, రైల్వేబోర్డు మెంబరుషిప్పు నందుకొని యుం

"ఆంధ్రభూమి"



శ్రీ అద్దేపల్లి హరిశ్చంద్రుడుగారు

ఆంధ్రసాహిత్య పరిషత్తు
కాకినాడ
TELUGU ACADEMY, COCANADA

డవచ్చును. లక్షల విలువయైన వ్యాపారము, వ్యవసాయము చేసియుండనగును. గొప్ప గొప్ప స్త్రీమరులపై నధికారము నందియుండ వచ్చును.

లోకులు హర్షించునదేమి? సుశీలత్వము, విశాలభావములు, దయాధర్మసుగుణములు, సత్యసాధన. అట్టి లోకోత్తరపురుషులను గూర్చియే కదా 'భవోహిలోకాభ్యుదయాయతాదృశాం' అన్నారు పెద్దలు.

బీదసాదలకు అనేకులకు విద్యాభ్యసనమున, ఉద్వాహసమయముల సాయముచేసియుండవచ్చును. ఇతరములైన పరోపకారకములైన కార్యములనుకూడా చేసియుండనగును. తెనుగుసీమకు వారొనర్చిన సేవయేమి! అదియెట్టిది?

ఆంధ్రరాష్ట్రము ప్రత్యేకముగా కావలెనని తెలుగువారికి ఆకాంక్ష చాలనాళ్ళనుండి కలదు. ఆవాంఛ దినదినప్రవర్ధమానమగుచున్నమాట నిజమే, కాని విశిష్టులైన శాసనసభాసభ్యుల నడుమ అనైకమత్యభావము ప్రబలియున్నది. ఆంధ్రరాష్ట్రము కావలెనను ఆంధ్రుల ఆశయమును తెలుపు తీర్మానము అట్టి సభామధ్యమున ఏ పంథపట్టునోయని అందఱు ఆత్రముతో నిరీక్షించుచున్నారు.

హరిశ్చంద్రుడుగారు దృఢసంకల్పులై పరమేశ్వరుని ఆశీస్సు బలముతో ఆ తీర్మానమును సభాస్థలి ప్రవేశపెట్టినారు. నేడు మనము ఫలసిద్ధితన్నాలమున కొంతవఱకైనా అందుకొనగలిగినాము. ఆత్రమువదలి మనస్సులు శాంతినందినవి: హరిశ్చంద్రుడుగారిని గూర్చి 'క్రియాసిద్ధిః సత్త్వేభవతి మహతాం నోపకరణే' అనుకొని ఆనందించినాము.

ఒక్కొక్క సమయాన మల్లెపూవు తనకు అంతటి మహత్తరమైన సుధురపరిమళము న్నట్లు ఎరుగునాయని అనిపించును. ఆవిరుల వలపు నానందించునది ఇతరులే కదా! అట్టి సులలితప్రసూనముల ప్రసాదించిన భగవానునకు అభివందనములు.

"సుచింత్య చోక్తం సువిచార్య యత్కృతం
సుదీర్ఘకాలేపి నయాతి విక్రియాం."

—సత్యసాధకుడు.



"పొచ్చెంబింతయులేని హంసనడతోఁ
బాలొప్పెందు లేనవ్వుతో
కొమరుంబ్రాయపునాతి వచ్చె నదిగో
కోనేటికిన్ నీటికిన్."

జార్జిచక్రవర్తిగారి తాళముచెవులు

"జార్జిచక్రవర్తిగారి సొంతకాగితము లుంచుకొనుటకు రెండు బీరువాలుగలవు. వీరి తండ్రిగారగు ఎడ్వర్డు చక్రవర్తిగారి వీలునామా మొదలగు కాగితములుగల మూడవబీరువాకూడ వీరి ఒద్దియుండేయుండును. ఈ మూడు బీరువాలవి, మిగిలినవానివి జార్జిచక్రవర్తిగారికి పెక్కు తాళముచెవులుగలవు. ఈ మూడు బీరువాలును ఉక్కు రేకులతో తాపడము చేయబడియుండుటచే వీనికి అగ్ని ప్రమాదముండజాలదు. ఒక్కొక్క బీరువాకు మూడేసి తాళము కప్పలు వేయబడును. ఒక్కొక్క తాళము కప్పకు రెండేసి తాళముచెవులు. ఈ తాళము చెవులు జార్జిచక్రవర్తిగారియొక్క అంతఃపురమున వారిప్రాత గదిలో భద్రముగనుంచబడును. ఈ తాళముచెవులతో ఆతాళములను తీయవలసిన విధానము ఒక్క జార్జిచక్రవర్తిగారికిని, వారి అంతరంగిక కార్యదర్శికిని మాత్రము తెలియును. ఎడ్వర్డు చక్రవర్తిగారి కాగితములుగల బీరువా తాళముచెవులు ఒక చిన్న ఇనుపపెట్టెలో జాగ్రత్తపఱుపబడును. ఈ ఇనుపపెట్టె తాళముచెవి ఎల్లవేళల జార్జిచక్రవర్తిగారి స్వాధీనములో నుండును. చక్రవర్తిగారి జేబుగడియారపు గొలుసుకుచేరియున్న ఒక బంగారపుఉంగరములో ఈ తాళముచెవి మఱి కొన్నిముఖ్యమైన తాళముచెవులతో వ్రేలాడుచుండును. 1911-వ సంవత్సరమున పట్టాభిషేకసమయమున ఈ బీరువాలు తఱచు తెఱవవలసిన అవసరముకల్పుచుండునది. అప్పుడు ఈ బీరువాలను జార్జి చక్రవర్తిగారు స్వయముగా తెఱచుచుండువారు. ఆ తెఱచునపుడు వారి అంతరంగిక కార్యదర్శి, వారి సొలిసిటరు, వారి తండ్రిగారి సొలిసిటరుమాత్రమే ఉండుటకు అనుజ్ఞ కలదు. కావలసిన కాగితములు శ్రీచక్రవర్తిగారి సమక్షముననే చదువబడవలయును. ఏ కాగితమునకైన నకలు తయారుచేయబడవలసియుండునో అది సొలిసిటరు స్వయముగ అక్కడకూర్చుండియే చక్రవర్తిగారియెదుట చేయవలయును. పనితీరిన వెంటనే ఆ కాగితములను చక్రవర్తిగారు స్వహస్తములతో యథాస్థానమున ఉంచి బీరువాకు తాళమువైతురు."

—టైమ్సు ఆఫ్ ఇండియా.

* * *

చక్కిలిగింత: కామవికారము

"చక్కిలిగింత చంటిపిల్లలకు ఆనందమును పుట్టించును. సమర్త ఈడువచ్చిన ఆడపిల్లలకును, యౌవన ప్రాదుర్భావకాలముననున్న మగపిల్లలకునుకూడ చక్కిలిగింత ఆనందమును కలిగించును. చంటిపిల్లల విషయమున ఉండజాలని ఒకవిధమైన కామవికారము పసుచు పిల్లలకు చక్కిలిగింతవలన కలుగును. 28 ఏండ్లవయస్సుగల ఒకస్త్రీ చక్కిలిగింత విషయమున ఇట్లు చెప్పినది: 'నాకు పది పండ్రెండువత్సరములమధ్య చక్కిలిగింత అమితమైన ఆనందము నిచ్చునది. ఆ దినములలో నేను నా చిన్నచెల్లెలిచే తఱచుగా కితకితలు పెట్టించుకొనుదానిని. ఇప్పటికికూడ చక్కిలిగింత అనిన నాకిష్టమే. కాని అప్పటియంత ఆనందమును అది నాకిప్పుడిచ్చుట లేదు.' స్టాన్లీహాల్, ఆలిన్ అనువారలు చక్కిలిగింత తత్త్వమునుగూర్చి పలువురి యువతుల అభిప్రాయములను క్రోడీకరించి ఇట్లు తెలుపుచున్నారు: 'యువతులలో ఒక్కొక్క కాలమున కితకితలగుణము హెచ్చుగనుండును. కొందరికి కడుపులో నున్నపుడును, కొందఱికి పెక్కు దినములుగ సంభోగములేనప్పుడును, కొందఱికి కడుపునిండ అన్నము తినినప్పుడును; కొందఱికి అనారోగ్యముగనున్నప్పుడును; కొందరికి ఆరోగ్యసమయమునను, కొందఱికి తమకు ఇష్టమైన వారితో కలసియున్నపుడును కితకితలగుణము హెచ్చుగా నుండును. ఈ కాలములలో పెక్కులు సంభోగవాంఛ పుట్టించుటకు అనుకూలములైనవని సులభముగనే తెలిసికొనవచ్చును. సంభోగవాంఛ అతిశయించియున్న సమయ

మున ముఖ్యముగ స్త్రీల అరచేతులకు కితకితల గుణము హెచ్చుగనుండును. వీపుమీద, అరికాళ్ళయందు, నడుటియందు కితకితలు పెట్టుటచే మొదట సంభోగమునకు విముఖులుగానున్న పురుషులు తోడనే సంభోగమునకు సుముఖులైన నిదర్శనములు కొన్ని తెలియవచ్చినవని మోల్ అను నతడు తెలుపుచున్నాడు.'

—అమెరికన్ జర్నల్ ఆఫ్ సైకాలజీ.

• • •

రూజువెల్టుగారి ఉత్తరములు

“అమెరికాసంయుక్తరాష్ట్రముల అధ్యక్షుడు రూజువెల్టునకువచ్చు ఉత్తరములు దినదినము హెచ్చుచున్నవి. అమెరికాసంయుక్తరాష్ట్రములు స్వాతంత్ర్యమును సంపాదించి వైటుహౌసు ఏర్పడినపిమ్మట దానిచరిత్రలో ఎన్నడును ఇంతటి హెచ్చుసంఖ్య ఉత్తరముల, తంతివార్తలరాకను అది యెఱుఁగదు. ఈ ఉత్తరములపరవడు తావుమాపుటకుగాను కార్యదర్శులకు అదనపు మేజాబల్లలు ఈయబడినవి. వైటుహౌసు ఇపుడొక పోస్టాఫీసు అయి ఉన్నదని చెప్పవచ్చును. రూజువెల్టు 1933-వ సంవత్సరము మార్చినాలగవ తేదీని అధికారము స్వీకరించినాడు. నాటినుండి మాసములవారీగా అతనికి వచ్చిన ఉత్తరములసంఖ్య ఇచట తెలుపబడుచున్నది:

మార్చి :	180,000		
ఏప్రియల్ :	185,000	సెప్టెంబరు :	60,000
మే :	105,000	అక్టోబరు :	150,000
జూలై :	60,000	నవంబరు :	240,000
ఆగస్టు :	45,000	డిసెంబరు :	540,000

ఈ ఉత్తరములుగాక ఉద్యోగస్వీకరణానంతరము అతనికి ఇప్పటివఱకు రెండు లక్షల ఇరువదివేల తంతివార్తలు వచ్చినవి. చిన్నచిన్న బహుమానములుగల పార్సెలులుకూడ విశేషముగనే వచ్చినవి. రూజువెల్టు ఆర్థికచట్టముక్రింద పలువురకు తిరిగి ఉద్యోగములు దొరకుచున్నవి. చిరకాలముగ ఉద్యోగములేక చికాకుపడుచు రూజువెల్టు ఆర్థికచట్టముయొక్క సత్ఫలితముగ ఉద్యోగమునుపొందిన కొందఱు పురుషులభార్యలు తమ కృతజ్ఞతను తెలుపుటకుగాను అతనికి కుట్టిన బెడ్డుస్టాపులు, చెమటతుడుచుకొను చేతిగుడ్డలు, అప్పచ్చులు, ఫవుంటెన్ పెన్‌లు మొదలగునవి పంపియున్నారు. వచ్చు ఉత్తరములలో పెక్కు రూజువెల్టు ప్రభుత్వచాకచక్యమును ప్రశంసించును. కొందఱు తమయింట్ల తనఖాను గూర్చి శ్రద్ధవహింపఁగోరుచు లేఖలు వ్రాయుదురు. కొందరు తమకు ఉద్యోగము ఈయవలసినదనియు, కొందరుస్త్రీలు జీతమువచ్చినచోజూన ఇంటివద్ద ఉండని తమమగలకు ఉపదేశము చేయవలసినదనియు జాబులయందు కోరుదురు. కన్యలు కొందరు తమ వివాహముల విషయమున లేఖాముఖమున అతని ఆలోచనను అర్థింతురు. కొందరు భార్యలు తమ భర్తలతో తాము విడాకుపొందవలసిన అవశ్యకతనుగూర్చి లేఖలు నింపి పంపుదురు. ఎంతటి విశేషకార్యనిమగ్నుఁడైయున్నను రూజువెల్టు దినమునకు రెండువందల ఉత్తరములను చదివి స్వయముగా వానికి ప్రత్యుత్తరములు వ్రాయును. మిగిలిన వేలకొలది ఉత్తరముల నన్నిటిని వారలుతీరి కూర్చుండు అతని కార్యదర్శులు పరిశీలించి ప్రత్యుత్తరములు వ్రాయుదురు. అన్ని ఉత్తరములకంటె రూజువెల్టు అభిమానమునకు పాత్రమైన ఉత్తరమొకటిగలదు. అది దక్షిణమునుండి ఒక నీగ్రోవంటలవాడు వ్రాసినది. రూజువెల్టు ఆర్థికచట్టమువలన తనకు తిరిగి ఉద్యోగము లభించినదనియు, అందుల కాతనికి తన హృదయపూర్వక నమస్కారము లర్పించుచుంటిననియు, వాషింగ్టన్ పట్టణమువచ్చి రూజువెల్టుగారికి కోడిపిల్లలకూరవండి పెట్టి తన కృతజ్ఞత తెలుపుకొనవలెనను వాంఛ తనకు గాఢముగ కలదనియు ఆ నీగ్రోవంటలవాడు వ్రాసెను. ఒకానొక మంగళవారమున రూజువెల్టుకు పదకొండువేల ఉత్తరములువచ్చెను. అతని పేరవచ్చు ఉత్తరముల సగటుసంఖ్య దినమునకు ఆరువేలు. భూమి ఖామందులను, గృహయజమానులను వారివారికిగల తనఖాలవిషయమై రక్షణ అవసరమైనచో నేరుగా తనకు ఉత్తరములు వ్రాయవలసినదని రూజువెల్టు దేశప్రజలకందఱకును తెలిపియున్నాడు. అప్పటినుండియు అతనికివచ్చు ఉత్తరములసంఖ్య (వింధ్యపర్వతమునకువలె) పెచ్చు

పెరిగిపోవుచున్నది. ఈ శాపతు ఉత్తరములను పర్యాలోచించి ప్రత్యుత్తరములు వ్రాసి అవసరమైన కార్యకలాపము నిర్వర్తించుటకు ప్రత్యేకప్రభుత్వశాఖ యొకటి ఏర్పఱుపబడియున్నది. ప్రతి ఒక్క ఉత్తరమును ప్రభుత్వమువారి ప్రత్యేకపరిశీలన నొందితీరవలసినదే. ఒక్క దినమున పదునొకండువేల ఉత్తరములు! ఇది యేమి చెప్పును? అధ్యక్షుడు రూజువెల్టును, అమెరికాసంయుక్తరాష్ట్రములందలి ప్రతివ్యక్తియు సోదరులై ప్రభుత్వమున భాగస్వాములై యున్నారనియే కద! దినమునకు పదునొకండువేల ఉత్తరములు!!! ప్రపంచచరిత్రలో ఇట్టిది ఈవఱకు కనబడలేదు, వినబడలేదు. రూజువెల్టు దయార్ద్రమైన మానవహృదయమే కని విని యెఱుఁగని ఈ విశేషమును ప్రపంచచరిత్రలో కలిగించినది.

—క్రిస్టియన్ సైన్సు మానిటర్.

* * *

బెర్నార్డుషాగారి వ్రాతగది.

"థేమ్సునదిగట్టున ఉన్న వైట్ హాల్ కోర్టు అను భవనమునందలి ఒకపెద్ద పొడుగుపాటి గదిని బెర్నార్డుషా తన ఆఫీసుగదిక్రిందను, వ్రాతగదిక్రిందను ఉపయోగించుకొనును. ఈ గది గవాక్షములనుండి థేమ్సు స్రవంతి, దానిమీది పలువంతెనలు చక్కగా చూడనగుచుండును. షా స్వంతగ్రంథభాండాగారము మిక్కిలి పెద్దది. ఆగదియందలి బీరువాలన్నియు షా స్వయముగ ఎంచుకొని కొనుక్కొన్న గ్రంథములతో పిక్కటిల్లియున్నవి. పారచిత్రగ్రంథములయొక్క పెక్కు కూర్పులు అందున్నవి. ఆగదియందలి చిత్రములలో షా యొక్క ముత్తాతయగు సాండ్ పిట్సునకు చెందిన రాబర్టుషాయొక్క నూనెరంగుల చిత్రమొకటిగలదు. ఆరు శైలింగుకాలిబెల్లు; షాగారి కార్యదర్శి—శ్రీ—బల్ల, టైపురైటరు; సొంపుగ అలంకరింపబడి పరిశుభ్రముగ నుంచబడిన చ్చనువైన షా ఉపయోగమునకు ప్రత్యేకింపబడిన ఒక పెద్ద వ్రాతబల్ల ఆగదియందలి ఇతరసామగ్రి."

—హేడన్ చర్చి.

సాక్షాత్కృతి

౧

తల్లీ ! ఆంధ్రపురంధ్రి ! ఇప్పటికి
మూతల్ వడ్డ నేత్రమ్ము లు
త్ఫుల్లాంభోజము లయ్యె, నీ వనగ
నేమో యెంచుకోలేని యీ
యుల్లమ్మింతకు తల్లడిల్లినది; నీ
యూహాతిపాతాకృతుల్
తెల్లంబైనవి నేటి కీజడుని బుద్ధిన్
ప్రేమవారాన్నిధీ !

౨

తెనుగుం దేశము పుట్టినిల్లు, గురులుం
దిద్దించి నా రోనమాల్
తెనుగుంబాసను; యీశరీర మిది తల్లీ!
పుష్టి చేకొన్న దీ
తెనుగుంబంటల, జుట్టపక్కములు నీ
తెన్గుల్; నమస్తంబు నీ
తెనుగేయుంచు నెరింగితిన్ ధనమదాం
ధీభూతచిత్తమ్మునన్

౩

నిలువన్ నీడయు కూడుగూడ కరవౌ
నిర్భాగ్య దేశీయు లా
ర్తుల కంఠమ్మున నీదు వేదనః వెతల్
దోగాడు నామాపులన్
చెలువుం బాసిన నీ ముఖమ్ము కను
పించెన్ సత్య మిన్నాళ్ళకుం
దెలిసెన్ నీ కలరూపమెల్లయు నమస్తే
అన్నదాంధ్రావనీ!

—బోడ్డు బాపిరాజు.

సర్ హెన్రీ రాయిస్

[కూటికొఱకు టెలిగ్రాముల బంట్రోతుగపనిచేసిన యాతడు లక్షలకొలది రాబడిగలవారికికూడ విలాసవస్తువుగనున్న రోల్సురాయిస్ కారును నిర్మించిన విచిత్ర వృత్తాంతకథనము.]

శ్రీపిఠాపురముమహారాజావారు మొన్నటి వత్సరము తనకుమారుని జన్మదినోత్సవసందర్భమున శ్రీవారికి రోల్సు రాయిస్ కారును బహుమానముగ ఇచ్చియుండిరని ఆంధ్రపత్రికలో చదివియున్నాము. సంవత్సరమునకు పదమూడులక్షల రాబడిగల యొక మహారాజు తనకుమారునకు జన్మదినబహుమానముగ ఈయదగిన ఆ రోల్సు రాయిస్ కారు విలువ ఎంత? నలుబదివేలు. ఒక్క కారు నలుబదివేలు! కోటీశ్వరులకుకూడ అది విలాసవస్తువే. మోటారులలో కోహినూరు అనదగిన ఆ రోల్సురాయిస్ కారు నిర్మాత ఎవడో, అతని జీవితచరిత్ర యేమిటో తెలిసికొనుటకు పలువురకు ముచ్చటగ నుండక మానదు.

ప్రపంచము ఎందరో గొప్పవారిని చూచినది. ఆ గొప్పవారిలో ఏ ఒక్కరుగూడ తమజీవితకాలమునందే తమకు శిలావిగ్రహము ప్రతిష్ఠింపబడి గౌరవింపబడుట చూచియుండలేదు. అట్లు చూచినవాడు ప్రపంచ చరిత్రలో ఒక్కడే ఆంగ్లేయుడుగలడు. ఆ అతిలోకుని నామము హెన్రీరాయిస్. శిలావిగ్రహము 1924-లో డెర్బీపట్టణమున ప్రతిష్ఠింపబడి బహిరంగపఱుపబడెను.

ఇట్టి అతిలోకగౌరవమునందిన హెన్రీరాయిస్ 1863 లో పీటర్‌బరో చెంతగల ఆల్టువాల్టన్ నందు పుట్టెను. అతడు పుట్టినఇల్లు దారిద్ర్యశార్దూలమునకు విడిదిపట్టు. తండ్రి ఒకపిండిమరకు యజమాని. ఊరిలోని వారికందఱకును రొట్టెలకై పిండియాడించి ఇచ్చుచుండిన రాయిస్‌తండ్రి తనఇంటిలో అందఱికి కడుపునిండ రొట్టెలుకూర్చుటకు తలంచు చాల కష్టపడుచుండువాడు.

ఎట్లో సగమాకలిదైన తీర్చుకలుగుచున్న రాయిస్ తండ్రి రాయిస్ బాల్యముననే చనిపోయెను. ఇక పూట బత్తెముమాత్రమైనలేదు పూటబత్తెమునకే కఱవుఏర్పడినప్పుడు చదువుసంధ్యల కవకాశమేది? చదువుమానెను. 1878 లో తనపదవఏట రాయిస్ వీధులలో వార్తాపత్రికలమ్మి నాలుగుపైసలు సంపాదించుటకు దొరకొనెను. అది అతని మొదటిఉద్యోగము. ఇంగ్లండులో సుప్రసిద్ధమైన న్యూసు ఏజంటులగు వి. హెచ్. స్మిత్ అండ్ సన్ అనువారు యజమానులు. అయితే రాయిస్ గాడిద, గంధపుబస్తాలమోతవలె న్యూసుపేపర్ల అమ్మకము సాగించలేదు. దినములో అమ్మకము మందముగనుండుసమయములందు అతడు తనకడనుండు న్యూసుపేపర్లు చదువువాడు, క్రొత్తమాటలకు అర్థము చేర్చుకొనువాడు.

విద్యాకాంక్ష ఉండినది. పదమూడు వత్సరములు నిండులోపల అతడెట్లో ఒకసంవత్సరము పాఠశాలకు బోయి విద్యాభివృద్ధి కావించుకొనగలిగెను. న్యూసుపేపర్ల అమ్మకముమాని అతడు పోస్టాఫీసులో ఉద్యోగమునకు కుదిరెను. పనిచేయుటయందు ఇష్టము, హుషారు, చురుకుదనము చూపువాడు. ఇంటింటికి తంతివార్తలుగొనిపోవుటలో అతడు ఆఫీసులోని తనతోడివారలకంటె తృప్తికరముగా పనిచేయువాడు. ఆచిన్నతనమున అతనికి ఎప్పటికైన తానొక ఇంజనీరును గావలయునని యుండునది. తంతివార్తలుబట్వాడాచేయు పనిలో మూడువందల అరువదియారు దినములు అతడు వెళ్ళద్రోయుసరికి అతని అదృష్టరేఖ బయలుపడెను. గ్రేట్ నార్తరన్ రైల్వేవారి డన్‌కాస్టరునందలి వర్కుషాపులో అప్రెంటిస్ ఉద్యోగమును సంపాదింపగలిగెను.

ఒకనాటి ఉదయమున అతడు టెలిగ్రాములు బట్వాడాచేయుచుండెను. మరునాటి ఉదయమున అతడు ఆఫీసుకువచ్చినది తనకు పోస్టాఫీసువారిచ్చిన

యూనిఫారముదుస్తులను ఇచ్చివేయుటకును, లోడిపని వారుగానుండినవారి సెలవుగొనుటకును. పెద్దపెద్ద మెషీనులతో నిండియున్న ఒక విచిత్రప్రపంచమనదగిన రైల్వేవర్క్‌షాపులో అతడిపుడు కోర్కెతీరగలను కొనసాగించుచున్నవాడు.

తాను కాంక్షించినపని ఈకేబిది. కావున అతడీ పనిలో తనకున్నశక్తిని, ఉత్సాహమును సమగ్రముగ ఉపయోగించి జయమునందుటకు దృఢనిశ్చయుడయ్యెను. ఆ ఇంజనీరింగు వర్క్‌షాపులో అతడు మితభాషియైయుండి నేర్చుకొనగలదంతయును నేర్చుకొనువాడు. పనిముట్లు మోయువాడు; స్క్రూలువిప్పి తీయువాడు; వానిని తిరిగి బిగించువాడు. ఇంజనులక్రిందదూరి పని చేయువాడు. ఇంజనులమీదకును ఎక్కువాడు. వానిలో దూరువాడు. రాడ్డులనువిప్పి విడదీయువాడు. సమ్మెటతో పనిచేయువాడు. ఆకురాయి ఉపయోగించువాడు. మెషీనులకు తైలాభ్యంగనము గావించువాడు. ఇంజెనులనిన అతనికి ప్రాణములకంటె ప్రియతరములు. వానినిగూర్చిన జ్ఞానము దినదినమును అతనికి అతిశయించుచుండెను. డన్‌కాస్టరు వర్క్‌షాపులో నాలుగు సంవత్సరములుండి ఆర్జించిన అనుభవజ్ఞానమే అతని భావిజయమునకు పునాదియయ్యెను.

అప్రెంటిసుగా నుండినంతకాలమును అతడు విశేషముగ నేర్చుకొనుచుండెనే గాని విశేషముగ ఆర్జించుటలేదు. ధనము కావలసియుండెను. కావున అప్రెంటిస్‌షిప్పు ముగియకపూర్వమే అతడావర్క్‌షాపును వదలి విశాలవిశ్వమున ఉద్యోగాన్వేషణమునకు దొరకొనెను. వర్క్‌షాపులోని అతని పైఅధికారి అతనికి ఒక మంచి యోగ్యతాపత్రమునిచ్చి, కరస్పర్శ గావించి, శుభమగుగాకయని దీవించి పంపెను. రాయిస్ అభివృద్ధి చరిత్రలో మఱియొకప్రకరణము ముగిసెను.

రైలు అతనిని లీడ్సుపట్టణమునకు గొనిపోయెను. పదునెనిమిదేండ్ల యువకుడు. ఉద్యోగము దొరకునని కొండంత ఉత్సాహము. చెంతగల వర్క్‌షాపులోనికి అఉద్యోగాన్వేషి వెళ్లెను. కాని ఖాళీలులేవు. డన్‌కాస్టరు అధికారి తనకిచ్చిన యోగ్యతాపత్రమువలన తనకు ఉద్యోగము దొరకకపోవదను ధైర్యముతో అతడు మఱియొకవర్క్‌షాపులోనికి వెళ్ళెను. ఇచ్చటను నాస్తిశబ్దమే. ఎన్నియో వర్క్‌షాపులలోనికి వెళ్ళెను. సున్నపుపిడతలే ఎదురయ్యెను. ఉదయమున ఉన్నఉత్సాహము ఇప్పుడులేదు. సాయంకాలము అగుసరికి అలసట మిగిలెను. ఉద్యోగముదొరకునను ఆశ అడగారెను. కొద్దిపాటి ధనమునకు రాగల ఆహారము - విశేషధనవ్యయమునకు అక్కరలేని వసతి. అయ్యు అతనికడనున్న మొత్తము తగ్గిపోయెను. లీడ్సుపట్టణమున అప్రథమరాత్రి అతడు దట్టికరిస్థితులలో నిద్రపోయెను.

మఱునాడును అదృష్టములో మార్పులేదు. ఆమఱునాడును అంతే. ఆశాశేషమునైన చూపకుండ రోజులిట్లే గడచిపోవుచుండెను. కాళ్ళతీత - హృదయభారము. పక్షముదినములు అతడు పట్టణమంతయు గాలించెను. ఒక్కచోటకూడ అతనికి స్వాగతములేకపోయెను. అతడు తిరిగి ఇంటికిపోయి యుండును. కాని ఇంటిదగ్గర పొయ్యిలో పిల్లిని లేవకొట్టుటకే గదా అతడు లీడ్సువచ్చినది? ఇంటికిపోయి ఏమిచేయును? అంతవఱకు అతడు లీడ్సుపట్టణమునందు చేసినదేమి! తనతో తెచ్చిన కొద్దిపాటి ధనములో చాలభాగమును వెచ్చించుట. అవ్యయమే ఆయువకునకు హృదయవిదారకముగ నుండెను.

పదునాలుగవనాటి ఉదయమున అతడు ఉద్యోగముకొఱకు ఒక ఆయుధశాలకుపోయెను. అచటి మేస్త్రీ అతని యోగ్యతాపత్రమును చూచెను. 'సరే. మెషీను వాడుముల్లపనిలో చేరుము.' అనెను. ఆమేస్త్రీని అతడు హృదయపూర్వకముగ నమస్కరించి పనిలో ప్రవేశించెను. అది 1881-వ సంవత్సరమున. గడియారము ఉదయమున ఆరుగంటలుకొట్టు సరికి ఇతర పనివారలతో అతడు మెషీనుకడనుండువాడు. పగలంతయుపని. గడియారము చిన్నముల్లు తిరిగి ఆరు అంకె మీదకువచ్చునది. అయినను పనివారలకు విడుమరలేదు. రాత్రి పదికొట్టువఱకు పనిచేయుచుండవలసినదే. పైగా ప్రతి శుక్రవారము రాత్రిఅంతయు అతడు పనిచేయవలసియుండెను. వారమునకు ఒకరాత్రిఅంతయును, దిన

మునకు పదునారుగంటలును పని. ఇట్లే అతడు పలుమాసములు శ్రమపడెను.

ఎలక్ట్రిక్ దీపముల కవి ప్రారంభదినములు. ఎలక్ట్రిక్ దీపములను వ్యాప్తిలోకి తెచ్చుటకై ప్రారంభింపబడిన ఒకకంపెనీలో నతనికప్పుడు ఉద్యోగము దొరకెను. ఆయుద్యోగసందర్భమున అతడు లండను వచ్చెను. ఇద్దరుచేయుపనిని తానొక్కడే చేయుచు శ్రమపడుటకుతోడు అతడు ఒక అధ్యాపకుని అభిమానమును చూఱగొని అతనివద్ద సాయంకాలములందువిద్యాసముపార్జనము గావించువాడు. బాల్యమున విద్యకు నోచుకొనలేదు. ఆలోపము నాతడు పెద్దవాడై తీర్చుకొనెను. ఏడాదిలో అతడు అద్భుతమైన విద్యాభివృద్ధి నందెను. కంపెనీఅధికారులు అతని తెలివితేటలు గుర్తించి ఎలక్ట్రిక్ లైట్ అండ్ పవర్ కంపెనీవారి లివర్‌పూల్ బ్రాంచికి ఛీఫ్ ఎలక్ట్రీషియన్‌గా నియమించిరి.

దారిద్ర్యమనిన ఏమియో తెలిసినవాడగుట అతడు ఎప్పుడును పోడిమిగానుండువాడు. కారణాంతరములచే లివర్‌పూల్ కంపెనీ దివాలాయయ్యెను. అప్పుడు రాయిస్ తాను స్వయముగ వ్యాపారము ప్రారంభించుటకు నిశ్చయముచేసికొనెను. మాంచెస్టరుపట్టణమును ప్రధానకార్యస్థానముగ చేకొని అచట 'రాయిస్ లిమిటెడ్' అను నామముతో కంపెనీ స్థాపించెను. డైనమోలు, ఆర్కులాంపులు చేయుట. ఇట్లు అతడు వీధులలో విద్యుద్దీపముల నేర్పాటుచేసినవారిలో నొకడయ్యెను.

ఆ యువకుడు ఎంజనీరింగు, మెషినరీశాఖలయందు తనకుగల విశేషవిజ్ఞానమునకు మెఱుగుపెట్టునట్లు విద్యుచ్ఛక్తివిషయమున విశేషానుభవమును సంపాదించెను. ఇట్లు మూడుశాఖలయందు మంచి అభినివేశముగలవారు ఆ రోజులలో పెద్దవాండ్రయందే కానరాకుండిరి. ప్రజలీవిషయమును గుర్తించిరి. రాయిస్ లిమిటెడ్ కంపెనీకి వచ్చు ఆర్డర్లకు మితిలేకుండెను. ఒక్క ఆర్డరుకూడ తొందరలో నిర్వర్తింపబడదు. ఏ మాత్రము అసంతృప్తిగనున్నను తిరిగి చేయవలసినదే. ప్రతిఒక్కపనియు అతనిపూర్తిశక్తినియోగమునకు నోచుకొనుచుండెను.

ఏదైన ఒక్కదానియందు స్పెషలైజ్ చేయుటకు అతడు తలంపుగొని పెద్ద ఆకారమున ఎలక్ట్రిక్ క్రేను (కప్పీలయంత్రము)ల నిర్మాణమునకు గడంగెను. అప్పటికి చేయబడుచున్న ఎలక్ట్రిక్ క్రేనుల కనికిని లేని క్రొత్తసౌకర్యములు రాయిస్ నిర్మించిన క్రేనులకుండెను. అగుటచే ఆ క్రేనులకు ఆర్డర్లు అపరిమితముగ వచ్చునవి. నేటికిని రాయిస్ కంపెనీవారు ఆక్రేనులను చేయుచునే యున్నారు. వాని నుపయోగించినవారు అవి కారులలో రాయిస్ కారువలెనే క్రేనులలో రాయిస్ క్రేనులు ఉత్తమములైయున్నవని చెప్పుదురు.

ఈ ఇంగ్లీషుఇంజనీరుదృష్టి కారులవైపు మరలిన విషయము విచిత్రమైనది. విఱిగిపోయి రోడ్లప్రక్కన పడియుండు—మోటారులకు ప్రారంభదినము లనదగిన ఆనాటి—మోటారులు కొన్ని అతనిదృష్టి నాకర్షించినవి. అత డొకకారును విలిచెను. నడచుచుండ భరింపరానిశబ్దము. మెషీను తఱుచు చెడుటగలదు. వాని యంత్రనిర్మాణమునందలి లోతుపాతుల అవగాహనమునకు దొరకొనినాడు. దొరకొనినచో ఏదైన పూర్తిగ చేయువఱకు అతడు తృప్తిపడువాడుకాడు. ప్రపంచమునందలి ఏదేశమునగాని చేయబడనిరీతిని అతిసుందరమును, అతిబలిష్ఠమును అగు కారును నిర్మించుటకు అతడు సంకల్పించెను. నడచునపుడు శబ్దముండరాదు. మెషీను తఱుచు చెడరాదు. రాయిస్ వంటి ప్రఖ్యాతుడగు ఇంజనీరు విషయమునకూడ అది స్వప్నలోకమున బుట్టిన తలంపే అని చెప్పవలసియుండును. కాని ప్రజ్ఞాధురీణుడగు రాయిస్ దానిని నిజమొనర్చెను. తన పనివారలు క్రేనుల చేయుచుండగా తాను రెండు సిలిండరులుగల మొండటి రాయిస్ కారును చేయుటకు పూనుకొనెను.

కారులు తయారుచేయుటకు ప్రారంభించిన ఆక్రొత్త దినములలో రాయిస్ చేత సమ్మెటపట్టుకొని ఫ్యాక్టరీ అంతయు కలయదిరుగువాడు. తనపేరుకు ఏదైన ఒకటి తగియుండలేదని తలంచునో దానిని సమ్మెటదెబ్బలలో

భిన్నాభిన్నముచేయువాడు. నేటికికూడ ఆపద్ధతి అమలునందున్నది. అందుమూలమున కంపెనీకి ఏడాదికి ఎన్నియోవేలపౌనులు వ్యయమగుచున్నది. అగుగాక! ప్రతిఅంశమునందును శ్రేష్ఠత్వమునకు నోచుకొనియే కారు ఫ్యాక్టరీనుండి విక్రయశాలకు పోవుచుండెను.

గౌరవనీయుడు హెచ్. ఎస్. రోల్సు అను మఱియొక యువకుడు, మోటారువిషయములందు విశేషాభిరుచిగలవాడు - ఒక ప్రదర్శనమున రాయిస్ మోటారు నొకదానిని చూచెను. ఎంజనీరింగు శిల్పమునకు రూపమనదగిన ఆ రాయిస్‌కారున కాతడు ముగ్ధుడైనాడు. రాయిస్ నిర్మించు అన్నికారులను అమ్మిపెట్టుటకు పూనుకొనినాడు. రాయిస్ మోటారులు చేయుచుకొనువారికొఱకు చూచుచుండెను. మోటారువర్తకుడు రోల్సు ఫ్రెంచిమోటారులు అమ్ముచు ఇంగ్లండుదేశమున వానితో పోటీకితాళగల కారులు తయారగుటను వాంఛించుచుండెను. ఫలముగా 1904 లో రోల్సు రాయిస్ లిమిటెడ్ కంపెనీ స్థాపింపబడెను. కార్లు వారిద్దరి నామములతోడను చెలామణియగుచుండెను. ఒకడు గొప్ప శిల్పి, పేరుగాంచిన ఇంజనీరు రెండవయతడు మోటారు వర్తకప్రపంచమున చిరప్రతిష్ఠనార్జించినవాడు. ఈ భాగస్వాము లిద్దరును కలిసి నేటికి ముప్పదివత్సరములుగ రోడ్లపరాజై ప్రాలుచున్న రోల్సు రాయిస్ కారును లోకమునకు ప్రసాదించిరి.

ఏ ఒక్కరికంటెను తాను చేసినది ప్రశస్తతరముగా చేయుచుండుటచేతనే రాయిస్ జయమునందెను. శ్రేష్ఠమైనదికాని అతనికి తృప్తినీయకుండెను. కావుననే గత విరోధమహాసంగ్రామసమయమున ప్రతి ఎనిమిది ఇంగ్లీషు గాలివిమానములందును ఐదు రాయిస్ ఇంజనులతో —చిన్నతనమున స్వగ్రామమునందు పొట్టకొఱకు వీథులలో వార్తాపత్రికలమ్మినవాడు నిర్మించిన ఇంజనులతో —కూర్చబడెను. అట్లాంటిక్ మహాసముద్రమును పదునారుగంటలలో నతిక్రమించిన గాలివిమానమును నడపినది రాయిస్ ఇంజనే. మఱియొక రాయిస్ ఇంజను ఇంగ్లండునుండి నేరుగా ఆస్ట్రేలియాకు ఎగిరివెళ్ళిన యొకటి గాలివిమానమును నడపెను. రాయిస్ 1907 లో నిర్మించిన ఆరు సిలిండరులకారు ఎడతెగక ఒక్కదమ్మున పదునైదువేల మైళ్ళు పరుగెత్తి నేటికికూడ అతిక్రమింపబడని రికార్డును సంపాదించెను. తన దగ్గర ఉన్న కొద్దిపాటిధనము చెలవైపోవు లోపల ఏదైన నొక ఉద్యోగమును సంపాదించుటకు లీడ్సుపట్టణపు వీథులలో కాళ్ళు అరిగిపోవునట్లు తిరిగిన యువకుడే ఈ అద్భుతకార్యములు జరుగుటకు అవకాశము కల్పించెననుట ఆశ్చర్యములలో కెల్ల ఆశ్చర్యమైనది.

రోల్సు రాయిస్‌కారులు చేయబడు కర్మాగారము డెర్బీపట్టణమునగలదు. అందుపనిచేయువారిసంఖ్య ఆరువేలు. రాయిస్ విచిత్రచరిత్ర ఇతర ప్రదేశములకంటె డెర్బీలో బాగుగా తెలియబడియుండుట డెర్బీ పౌరులు హెన్రీ రాయిస్ గౌరవార్థము ఒక శిలావిగ్రహమును ప్రతిష్ఠించిరి. 1980 లో అతనికి బారొనెట్టుహోదా ఈయబడెను. 'చేయదగుపనిని ప్రశస్తతమముగ చేయుట లెస్స' అను నీతిని రాయిస్ జీవితము ప్రదర్శించుచున్నది. మోటారు నిర్మాతలలో రాయిస్ సాటిమేటిలేనిరాజు. ఏపనిచేసినను సర్వోత్కృష్టముగా నుండునట్లుచేయుట అతని ఆశయము. లోపరహితత్వము కలిగినగాని అతనికి తృప్తిలేకుండెను. పరిపూర్ణతకొఱకు ప్రయత్నించి అతడు ఫలసిద్ధినొందెను.

అతని జీవితము బాలురకును, యువకులకును ఆదర్శముగ చేకొనదగినదియున్నది. చిన్నతనమున అతనికంటె పేదవారుగనుండువారును, బాల్యమున లీడ్సుపట్టణమున ఆయుధాగారమున అతడుపడిన శ్రమకంటె హెచ్చు శ్రమపడవలసినవారును, లండనులో విద్యకొఱకు ఒక్కసంవత్సరము అతడుచేసిన పరిశ్రమకంటె హెచ్చు పరిశ్రమ చేయవలసినవారును చాల తక్కువగనుందురు. అయినను ఆ యువకుడు పెరిగి పెద్దవాడై మోటారు ఇంజనీరులలో అతిలోకుడయ్యెను; మోటారు ప్రపంచమున, విమానప్రపంచమున శ్రేష్ఠత్వమునకు అతని శిల్పము అవధియాయెను.

1988-వ సంవత్సరము ఏప్రిలు 28-వ తేదీని రాయిస్ దివంగతుడయ్యెను.



రాజపాళైయమండలి ఆంధ్రక్షత్రియులు

(తమిళదేశమందలి రామనాథపురం జిల్లా రాజపాళైయ మండలి ఆంధ్రక్షత్రియకుటుంబముల సంక్షిప్తవివరములు.)

దారిద్ర్యమునుండి ఇతరజాతులు సులభముగా తప్పించుకొను మార్గములు కొన్ని మా రాజులకు మూయబడియున్నవి. సాగుబడిచేయు భూమి నానాటికిని విభాగింపబడి సన్నగిల్లుచున్నది. జనసంఖ్య అపరిమితముగా పెరిగిపోవుటయు అప్పు లెక్కువగుటయు ఇందుకు కారణములు. అట్టివారి దారిద్ర్యము తొలగవలెనన్న క్రొత్తభూములుండవలెను. కాని సాగుబడికొదగు భూము లన్నియు ముందుగనే ఇతరులచే నాక్రమింపబడి యుండుటచేత, ఇతర గ్రామములలో నున్న భూముల గొనవలసియుండును. అట్లు చేయజాలనివారు దరిద్రదేవతచే పీడింపబడి కష్టములపాలగుచున్నారు. పెద్ద చేప చిన్నచేపలను మ్రింగి పెద్దదగు విధమున పెద్దరాజు చిన్నరాజుల మ్రింగి పెద్దవాడగుట తటస్థించుచున్నది. వ్యాపారాదుల కలవాటుపడియుండనివారును వ్యాపారపోటీవలన లాభము గడించలేనివారును, తమకున్న స్వల్పభూమినే వ్యవసాయముచేసి జీవింప ప్రయత్నించి అట్లు చేయజాలక అప్పులపాలగుచున్నారు విదేశముల కేగినగాని బ్రతుకు దోవ కాన్పించుట లేదు.

భూవసతి యెట్లున్నదో గృహవసతియు నట్లేయున్నది. పూర్వము తనకై తాత, కట్టించుకొనిన ఇంటిలో నేడు అయిదారుగురు భాగముల బంచుకొనవలసియుండును. అది విడిచి వేరొకతావు సంపాదించుకొనుట వ్యయప్రయాససాధ్యమైనది. ఇనప్పటికిని రాజులరీతిని విడిచిపెట్టి ఇతరజాతులతో చేరియుండుట కొప్పుకొనిన గాని అట్టి ప్రత్యేకమైనతావు లభింపదు. అందుల కంగీకరింపక ఆ యైదారు కుటుంబములవారును, ఆచిన్న యింటియందే కాపురముండవలసి వచ్చుచున్నది. వసతి గలిగిన యిండ్లు లేకపోవుటవలన ఎన్నియో అనర్థకములు సంభవించుచున్నవి.

బీదతనమును తప్పించుకొనుటకై యితరజాతులవారు గ్రామాంతరములలో బ్రవేశించి జీవనోపాయము చూచుకొనగలరు. కాని మా గ్రామమందలి రాజుల కాయవకాశముకూడ లేకుండనున్నది. తనబంధుమిత్రులనందరిని వదలిపెట్టిపోవుటయందలి కష్టములేగాక దానిని మించిన ప్రతిబంధకముకూడ ఒకటి గలదు. అది కులకట్టునకు సంబంధించినది. ఈ గ్రామముగాక వేరొకచోట తమకులస్థులు లేనందున, అన్యగ్రామములలో బ్రవేశించగనే వేషభాషాదులును గుణస్వభావములును మారి క్రమముగా వారియందలి క్షత్రియత్వమే లోపించిపోవును. దీనికి సంసిద్ధులైయుండి అన్యగ్రామమున స్థిరపడువా రెవరైననుందురా? కనుక దారిద్ర్యమునే తలపై మోసికొని తమయూరియందే యిడుముల గుడుచుచుందురు.

అందువలన కుటుంబసహితముగ త్రోవ సాహసింపక ఒంటరిగనే అన్యగ్రామములకును, దేశములకును పోయియున్నవా రెందరో యున్నారు. వీరు అన్యుల భూమిని కౌలుకు తీసికొనియు, అడవులను గుత్తకు గొనియు, ఇతర వాణిజ్యములలో బ్రవేశించియు జీవనోపాయము జాచుకొనుచు, అప్పుడప్పుడు ఇండ్లకువచ్చిపోవుచుందురు.

మా గ్రామపు రాజులకు సంబంధించినంతవఱకు గ్రామాంతరపరిశ్రమలలో రేవారమను గ్రామమున యాలకుల తోటలు ముఖ్యముగా చెప్పదగినవి. తిరువాన్కూరు రాజ్యమందలి యేలకకొండలలో మాలోని ధనికులు కొందరు రెండువేలఎకరములవఱకు తోటలనుకొని, వ్యవసాయము చేసి సహకారసంఘములపద్ధతిని వ్యాపారము చేయుచున్నారు. కాని ఇవన్ని ధనికులుచేయుచున్న పరిశ్రమలైనందున బీదల కీవిధమునను లాభించకున్నవి.

మా గ్రామములో మొత్తము 6 సహకారసంఘము లున్నను, రాజులకుగాను ప్రత్యేకింపబడిన "భూపతిరాజు సహకారసంఘము" అను పేరుతో నొకసంఘము అత్యుత్సాహముతో పనిచేయుచున్నది. ఎందరో బీద క్షత్రియులు దీనివలన ఉపకారమును బొందుచుండుటయు, క్షత్రియులయొక్క వ్యావసాయిక పారిశ్రామిక విద్యాభివృద్ధులకుగాను ఈసంఘము గట్టికృషి చేయసంకల్పించుకొనియుండుటయు సంతసించదగిన విషయము.

సాంఘిక దురాచారములు

ఆర్థికపతనమునకు కారణములైన దురాచారములు కొన్నియు, ఆర్థికపతనమువలన జనించు దురాచారములు కొన్నియు, వాటియంతటయవియే కొన్నియు మాసంఘమున వ్యాపించియున్నవి. వివాహపద్ధతియందుండులోపములుముఖ్యముగా చెప్పదగియున్నవి. తల్లిదండ్రులకు బిడ్డలందరిమీదను ప్రేమయుండినను, అంత్యదశయందు పోషించువాడును, చనిపోయినతరువాత దహనశ్రాద్ధాదికర్మల నాచరించి, నరకమునుండి తప్పించువాడును అగు పుత్రునిమీదనే అధికప్రేమవాత్సల్యములజూపుట లోకమునందు సహజమై యున్నది. కాని మాక్షత్రియమాతలదృష్టిలో, కొడుకుకన్న కూతురే ముఖ్యమైనదిగా నున్నది. ఇట్టి విపరీతభావమునకు కారణము అల్లునిమీది ప్రేమ మితిమీఱిపోవుటయే. ఆడబిడ్డ పుట్టినప్పటినుండియు తల్లి అమితసంతోషముతో కన్నులకద్దుకొనుచు పెంచి పెద్దదానిని జేయును. కొడుకులు చినిగినబట్టలు కట్టుకొనుచుండినను చూచి యూరకుండగలదు. కాని కూతురిని బంగారునగలతో యలంకరించకపోయిన తల్లి కొకక్షణమైనను నిద్రపట్టదు. శరీరదార్ఢ్యము, బుద్ధికుశలత, విద్యాసంపత్తి మొదలగునవి కుటుంబపోషణమును జేయవలసిన పుత్రునికి ముఖ్యముగ గావలసియున్నను తల్లి వీటిని గమనించక నిర్లక్ష్యము చేయుచున్నది. పెండ్లిచేయుటయే తడవుగా ఇంటిలోని ధనధాన్యాదులు కూతునింటికి ప్రవహింప నారంభించును. కనీసము వెయ్యిరూపాయలైనను స్త్రీధనముగా నివ్వనిదే యే పేదయిల్లాలును, తనకూతురికి పెండ్లిచేయ నంగీకరింపదు. పెండ్లిదినములలోచేయు మర్యాదలు చాలక అల్లుని తనయింటనే యుంచుకొనును. మిక్కిలి పేదకుటుంబమైనచో 3 మాసములును, సాధారణమైనదగుచో 6 మాసములును, ఈవిధముగా ఒకసంవత్సరము మొదలు అయిదారు సంవత్సరములవఱకును, ఒక్కొక్కచోట వధూవరులకు బిడ్డలుపుట్టువఱకునుగూడ మామగారియింటియందే అల్లుడు పెండ్లికొడుకుభోగముల ననుభవించుచుండును. ఒకవేళకూతురిని అత్తింటికిబంపినను పేరునకుమాత్ర మొకటిరెండువారము లుండి తిరిగి భర్తతో సహితముగా పుట్టినింటికిరావలసినదే. అత్త, గారవమునకు లోపమువచ్చునేమోయని భయపడి, చాటుచాటుగా నల్లునికిచ్చు ద్రవ్యమునకు లెక్కయేయుండదు. అన్నదమ్ము లెక్కువగా ఉండుకుటుంబమయినప్పటికి, ముందు కూతురికిని, అల్లునకు ఖర్చుచేసి, పోగా మిగిలిన ఆస్తితోనే కొడుకులు తృప్తిపొందవలయును.

అవయస్కవివాహములు, తలుపాలిస్థానము నాక్రమించుచున్నవి. ఒక్కొక్కప్పుడు వరునికన్న వధువే చాలయేండ్లు పెద్దదిగానుండును. ధనమునకును, బాంధవ్యమునకును ఆశపడుటవలన యిట్టి వివాహములు కొంతకాలమునుండి తలయెత్తుచున్నవి. అరువదియేండ్లు నిండిన పిమ్మట, రెండవ లేక మూడవవివాహము చేసుకొనుట, మాలో పూర్వమునుండి వాడుకలో నున్నను ప్రస్తుతము బహిష్కరించవలసినవానిలో దీనినికూడ చేర్పదగును.

ఇంతతో మాచరిత్ర ముగింపునొందుచున్నది. అన్యరాష్ట్రముననున్నను జాతి, భాష ఏకమగుటవలన ఆంధ్రులు మమ్ము తమలో నొకరిగ భావించుకొందురని నమ్ముచున్నాను.

ఆరోగ్యవిజ్ఞానము

౪. ఎండవేడిమివలన కమలిన చర్మమునకు

మనది వేడిదేశము. అందుచే వేసవికాలమున వేడి దుర్భరముగానుండును. వడగాడ్పులలోకూడ కార్యార్థులమై మనము బయటికి పోకతీరదు. ఎండలో నడచి నడచి వచ్చి నీడపట్టున చేరుటతోడనే చర్మము దిమ దిమలాడును, చిఱుమంటలుపెట్టును. అట్టి సమయము అందు మన మేమిచేయవలయును? కొందరు చన్నీళ్ళ స్నానముచేయుదురు. ఇది తాత్కాలికముగ కొంతశాంతి ఇచ్చునట్లు కనిపించినను దేహారోగ్యమునకు భంగము కలిగించునదియని గుర్తింపవలసియున్నది. ఎండలో నడచినడచి వచ్చినవెంటనే చన్నీళ్ళస్నానము చేయుటచే దుర్బలదేహులకు తప్పక పడిసెముపట్టును. వేసవిలో ఎండవేళ చన్నీళ్ళస్నానముచేయుటచే ఒడలు ప్రేలును. ఎండ వేడివలన కమలి మంటలుపెట్టు చర్మమునకు క్షీరస్నానము ఎంతయు ఉత్తమమైనది. చిన్న పళ్ళెరమున కొద్దిగ పాలుపోసి ఆపాలను స్పాంజితో గాని, మెత్తనిగుడ్డతో గాని కమలిన, మంటపెట్టుచున్న భాగములమీద నెమ్మదిగ అద్దవలయును. వెంటనే మంట తగ్గిపోవును; కమలిన శరీరము తిరిగి యథాస్థితినొందును. శరీరమునందలి వేడిని తగ్గించుటలో పాలను మించినదిలేదు. సన్నిపాతజ్వరములందు శరీరమునందలి ఉష్ణమును తగ్గించుటకై రోగి చెంపలమీద పాలపొత్తులువేయ డాక్టరులు ఆదేశించుచుండుటను పలువురు గుర్తించియుందురు. వేడిచేసి కళ్ళుమంటలు పుట్టుట మొదలగు బాధలప్పుడు కళ్ళపై చనుపాల పొత్తులువేయుట ప్రతిహిందూగృహిణికిని తెలిసిన వైద్యప్రక్రియయే. ఎండలో వడివాళ్ళాడిన చర్మమునకు పాలు రసాయనమని వైద్యవేత్త లంగీకరించియున్నారు. పాలుదొరకనిచో దోసకాయబద్దలను కమలిన చర్మభాగమును రుద్దుట కుపయోగించుట మంచిది. దోసకాయబద్దలచే నెమ్మదిగ రుద్దుటవలనగూడ మంటలు తగ్గి చర్మము పదునొందును. తాటిముంజెలలోనినీళ్ళు చర్మమునకు పట్టించుటకూడ ఇట్టి సమయములందు చాల ప్రయోజనకారిగ నుండును. తాటిముంజెలలోని నీళ్ళు పట్టించుటవలన శరీరము పేలకుండకూడనుండును. కాని ఇవి అనుకున్న అన్నిసమయములయందును దొరకుట దుర్లభము.

౫. సీమరేగుపండ్ల ఆహారపువిలువ

ఆరోగ్యసంరక్షణమునకు అనుకూలించు ఫలములలో సీమరేగుపండును మించిన ఫలము మఱియొకటి లేదని నిస్సందేహముగ చెప్పవచ్చును. అన్నితత్త్వములవారును సీమరేగుపండ్లను తినవచ్చును. దినమునకు ఒక్కొక్క రేగుపండు తినుటచే డాక్టరుచెంతకు పోవలసినయక్కఱ ఎప్పుడును కలుగదను అర్థమువచ్చు సామెత ఇంగ్లీషులో కలదు. కాని దినమునకు ఒక్కొక్క రేగుపండు తినిన చాలదు. ఆహారపదార్థముగా సీమరేగుపండు రెండువిధములైన సుగుణములు కలిగియున్నది. సీమరేగుపండు మెతకగుజ్జుకలది. మెత్తని ఆహారపదార్థములు పోజాలని కొన్ని భాగములు మనకడుపులో కలవు. అట్టి భాగములకు చొఱబాఱుటకు సీమరేగుపండులోని మెతుకగుజ్జు సమర్థమైయున్నది. సీమరేగుపండ్లలో సి. విటమినులు విస్తరించియున్నవి. శిరోజములకు, చర్మములకుకలుగు అనారోగ్యమునుండి మానవుని కాపాడు సి. విటమిను విస్తారము కలిగియుండుటచే సీమరేగుపండు ఉత్తమమైన ఆహారపదార్థమైయున్నది.

౬. మధ్యాహ్నకాలభోజనము

డాక్టరు ఇ. మేబెల్ హాక్‌వుడ్ అను వారు

'వ్యాపారస్థుల ఆరోగ్యము' అను తమ గ్రంథమున 'మధ్యాహ్నకాలభోజనము' అను విషయమును గూర్చి ఇట్లు వ్రాయుచున్నారు "మధ్యాహ్న భోజనము చేసినప్పుడు కష్టము ఒకింత విశ్రాంతి తీసికొన గలవారికే ఆ భోజనము ఆరోగ్యప్రదమైయుండును. మధ్యాహ్నకాలభోజనమైన వెంటనే తిరిగి పనిచేయవలసి యుండువారు అందు ముఖ్యముగ మనస్సుతో పరిశ్రమ చేయువారు తమ ఆభోజనమును తేలికగ ముగించుకొని పని నంతటిని తీర్చుకొని సాయంకాలములయందే పుష్టాన్నభోజనమును చేయుట మంచిది. మనస్సు బాగుగా పనిచేయవలయుననుచో పనిచేయునంత కాలమును అది పుష్కలమైన రక్తప్రసారమును కలిగియుండవలయును. జీర్ణకోశమును దానికి సంబంధించిన ప్రేగులును లెస్సగ వానివానికి విధింపబడిన కృత్యములను నిర్వర్తింపవలయుననుచో వానికిని పుష్కలముగ రక్తము సరఫరా చేయబడవలయును. ఎంతటి ఆరోగ్యవర్ధకుని శరీరమునగాని ఒకేసారి మనస్సునకును, జీర్ణకోశమునకును అవి లెస్సగ పనిచేయుటకు వలసినంత పుష్కల రక్తమును సప్లయిచేయగల సామర్థ్యము, రక్తపుష్టి ఉండజాలదని సుప్రసిద్ధ శరీరశాస్త్రవేత్తలందరును ఎలుగెత్తి చాటుచున్నారు. కాబట్టి జీర్ణకోశమునకును, మనస్సునకును ఒకేసారి మనము పనికల్పించుచో రెంటికిని పుష్కలముగా రక్తప్రసారము దొరకక ఆరెండు అవయవములయందును ఏఒక్కటికూడ తనవిధికృత్యమును తృప్తికరముగా నెరవేర్పజాలకపోవును."

౯. అకాలమున తలవెంట్రుకలు తెల్లబడుచున్నచో

వయోవృద్ధులమైతి మనుభావము కలుగుదనుక రెండు మూడుతరముల పూర్వమువరకును మానవుల తలవెంట్రుకలు తెఱుచుగా నెఱయుచుండినవి. కాని ఇప్పుడన్ననో పలువురి తలవెంట్రుకలు బాల్యముననే నెఱయుటకు ప్రారంభించుచున్నవి. దీనికి కారణము ఇప్పటివారికి వలసినంత నిద్ర లేకపోవుటయేనని డాక్టర్లచే కనుగొనబడినది. సినిమాలు నాటకములు మున్నగు వినోదములకు తిరుగుచు పోవుచుండుటవలనను; పరీక్షలకుగాను రాత్రులయందు చాలసేపు మేల్కొని చదువుచుండుట వలనను నేటివారికి వలసినంత నిద్ర లేకపోవుటచే వారి తలవెంట్రుకలు అకాలమున తెల్లబడుచున్నవి. ఈ దోషము ఆంగ్లవిద్య నభ్యసించు మనవిద్యార్థులయందు విస్తారముగ కనుపించుచున్నది. తలవెంట్రుకలు తెల్లబాఱుచుండుట గమనించినతోడనే అట్టివారు తమ నిద్రాకాలపరిమితిని హెచ్చింపవలయును. సాధారణముగ తాము నిద్రపోవు కాలమునకు ఒకటి రెండు గంటలు ముందుగనే పడకను చేరుచుండవలయును. నిద్రాకాలపరిమితిని హెచ్చించుటతోడు పుష్టిగల ఆహారమును గొనుటయందును విశేషశ్రద్ధ వహింపవలయును. అజీర్తి కలిగించు ఆహారములు విశేషమైనమధుర పదార్థములు, మసాలాదినుసులు, ఉద్రేకమును కలిగించు అనుపానములు పూర్తిగా దరికి చేర్పకుండనుండవలయును. బిరుసువెంట్రుకలకంటె మెత్తనివెంట్రుకలు చిరకాలము నల్లగనుండుననిశిరోజములవైద్యమున లోకప్రఖ్యాతిగడించిన ఒకలండనుడాక్టరు చెప్పుచున్నాడు. దీనివలన బిరుసువెంట్రుకలు కలవారు తమ వెంట్రుకలు అకాలమున నెరయకుండుటకై ప్రత్యేకమైన జాగ్రత్తను వహింపవలసియుండుననుట సులభముగ ఊహింపనగుచున్నది. దీర్ఘకాలము ఏదైన ఒక రోగముచే తీసికొనుట మొదలగు అనారోగ్యస్థితులకు తావలమగుటచే గూడ తలవెంట్రుకలు తెల్లబాఱుట, రాలిపోవుట కలుగుచున్నది. ఇట్టి సమయములందు డాక్టరులసలహా గైకొనుచో వారు లోహమిశ్రితములైన మాత్రలు, ఆసవములు, అరిష్టములు తినమని చెప్పుదురు. ఈమందులతోడు ఇపుడిపుడు డాక్టరులు తలను మంచుగడ్డచే చల్లబఱచుట కూడ ఈవిధమున ప్రయోజనకారిగానుండుటను కనుగొని తమతమ రోగులకు ఉపదేశించుచున్నారు. శిరోజములు తెల్లబడిపోవుచుండుటను మందుగొనుచున్న తమరోగులు ఉత్తరములు వ్రాయుట మొదలగు మనస్సుయొక్క పరిశ్రమను గోరు పనులు చేయునప్పుడు తలపై మంచుగడ్డతో నింపబడిన టోపీని (ఐస్ కాప్) పెట్టుకొనునట్లు డాక్టర్లు ఆజ్ఞాపించుచున్నారు.

ఇన్స్యూరెన్సు విషయములు

జీవిత భీమా : కొన్ని దురభిప్రాయములు

ఇదివరకు ప్రజలకు 'యిన్స్యూరెన్సు' అనగేమో అవగాహనము కాకుండెడిది. అనేకులు యిన్స్యూరెన్సు నొక వస్తువుగ నెంచుచుండిరి కాని యిటీవల యిన్స్యూరెన్సు ప్రచార మతితీవ్రముగ జరుగుచుండుటచేత, యిన్స్యూరెన్సుతత్వము తెలియుటయే గాక, యిన్స్యూరెన్సుకంపెనీల ఆశయములును, స్థిరకీర్తిని గడించిన కొన్ని కంపెనీల పేర్లను సైతము, జనసామాన్యము తెలుసుకొనియున్నది. ఇట్టి యిన్స్యూరెన్సు వ్యాపకమునకు కంపెనీలు తయారు చేయు ప్రకటనపత్రములకంటెను, ప్రతినిధులయొక్క పంతతపరిశ్రమయే యెక్కువ చేయూత నొసగుచున్నదని చెప్పవచ్చును.

ప్రచారముజరిగినది, జరుగుచున్నది. కాని యిన్స్యూరెన్సు వ్యాపారమున అనుభవము పొందినవారికి తప్ప, యితరులమనసులలో ఇంకను ఇన్స్యూరెన్సునుగూర్చి సరియగు అభిప్రాయములు చిత్రింపబడలేదు. ఇన్స్యూరు చేయదలచినవ్యక్తి, కంపెనియొక్క మంచిపేరును, ఆర్థిక స్థిరత్వమును, వ్యవహారములు చక్కగ జరుపబడుచున్న కారణము విషయములను విచారించి సంతృప్తుడై భీమా చేయుచున్నాడు. అప్పటినుండి ఆకంపెనియందలి తన అభిమానమును పోషించుబాధ్యతను కంపెనిపైననే వదలుచున్నాడుగాని, ఇన్స్యూరెన్సుసూత్రములేవి, కంపెనీలు యెట్లు పనిచేయుచున్నవి, వాటి స్థిరత్వమెట్లు నిశ్చయింపబడినది, అను యిన్స్యూరెన్సుశాస్త్రవిషయములను గూర్చి చర్చింపడు. చర్చించుటకు వీలును లేదు. ప్రతివ్యక్తియు తనబ్రతుకు తెరువునే గమనించుచుండును. వ్యవహారవిషయములలో అతని కెక్కువ జ్ఞానముండును. పాలిసీఅవులలోనున్నపుడు కొన్ని సందేహములు కలుగుచున్నవి. వాటినిగూర్చి పాలిసీదారుని మనసులో ఒకవిధమైన అభిప్రాయముండును, కంపెనిచట్టము వేరువిధముగ నుండును. పాలిసీదారుడు ఆశ్చర్యవిచారములకు లోనగుచున్నాడు. ఒక కంపెనీ గూర్చి, దానికి విరుద్ధమగు అభిప్రాయముల పొందియుండుట విచారణీయము. సామాన్యముగ ప్రజలచే నమ్మబడు విరుద్ధాభిప్రాయములేవి అని విచారించి, వాటిని పోగొట్టుట యిన్స్యూరెన్సుప్రచారకుల విధియై యున్నది.

ప్రజాసామాన్యముయొక్క అభిప్రాయములు విచిత్రముగనున్నవి. చక్కగ ఇన్స్యూరెన్సువ్యాపారముచేసి, వృద్ధిపొందిన భీమాకంపెనీలచే నిర్మింపబడిన భవనములను చూచి, 'యెంతద్రవ్యము వృథాఖర్చైనది?' అనికొందరు విస్మయపడెదరు. కొందరు, వారికివచ్చు గొప్పలాభము లను ఏదోయొకవిధముగ ఖర్చుపెట్టవలెగదా ?' యని సమాధానమిడెదరు. ఒకసారి పాలిసీదారుడుకాగానే, మరల యెపుడు భీమా హెచ్చుచేయదలచినను, మొదటి దఫా కట్టిన ప్రీమియముయెంతో, అంతే కంపెనీలు తీసుకొనవలెనని కొందరి అభిప్రాయము. పదివేల రూపాయలకు భీమాచేయదలచినవారు, వెయ్యిరూపాయలకు చేయదలచినవారికంటె పదింతలు హెచ్చు ప్రీమియము కట్టవలెననినచో ఆశ్చర్యపడెదరు. "ఏమి! ఇంతగొప్ప మొత్తమునకు యిన్స్యూరుచేయునపుడు తక్కువ ప్రీమియముకదా చెల్లింపవలెను?" హెచ్చు కొనుగోలునకు తక్కువధర యివ్వవలెనని వీరిమతము. భీమాకంపెనీలు

సాధారణముగ, 6 నెలలు, 3 నెలలు, ప్రతి నెల కొక సారి ప్రీమియములు కట్టువారివద్దనుండి వార్షికప్రీమియములు చెల్లించువారికంటెను కొద్దిగ హెచ్చు ప్రీమియములు వసూలుచేయును. ఇది కొందరికి అర్థముకానేరదు. మరికొందరికి యిన్సూరెన్సు నచ్చదు. 30 దినములు గడువులోపల ప్రీమియము చెల్లింపనిచో కట్టిన ధనమంతయు నష్టమగునని వీరిభయము. ఇదియొక విపరీతపుటాలోచన. మరికొందరి విపరీతము యింకొకతరహా గలది. తనమరణము సంభవింపక కంపెనీకి నష్టము కలుగనందున, తాను ప్రీమియములు కట్టుట మానుకొన్నచో తానిదివరకు కట్టిన కిస్తీలు వాపసుచేయవలెనని కోరుట. ఇట్టి విరుద్ధాభిప్రాయములన్నియు సామాన్యములు. ఏయేజంటయినను తగిన సమాధానమివ్వగలడు. కాని మరికొన్ని సందేహములు అంతశీఘ్రముగ ఓడింపదగినవి గావు. అట్టిసందేహములను తీర్చుటకు యిన్సూరెన్సు పరిచయము యెక్కువగ కావలెను. వానిలో కొన్నిటిని పరిశీలింతము.

గొప్పకోశములకు (రిజర్వ్స్) నిమిత్తమేమి? మొదటి పొరపాటు అభిప్రాయమేమనగా: యిన్సూరెన్సు కంపెనీలు పాలిసీదారులకు కలుగకేయు లాభములకుగాను యెక్కువ వసూలుచేయుచున్నది, లేక, యిన్సూరెన్సుకంపెనీల రాబడిసొమ్మంతయు వారికి నిజముగ అక్కరలేదు. సుమారు 40 సం॥లకు పూర్వము (అసెస్మెంటు కంపెనీస్) అను కంపెనీలుండినవి. అవి (నేచురల్ ప్రీమియం సిస్టం) అనగా స్వాభావిక కిస్తీ పద్ధతి ప్రకారము ప్రీమియములను వసూలుచేయుచుండెడివి. ఈపద్ధతి చాలాకాలమువరకు పనిచేయజాలదు. ఆకంపెనీలే యిపుడులేవు. ఈ (అసెస్మెంట్) కంపెనీలు (లెవెల్ ప్రీమియం) (సమానకిస్తీలు) కంపెనీలపై పై వ్యతిరేకప్రచారము కొనసాగించినవి. స్వాభావిక కిస్తీపద్ధతిక్రింద మొదటి సంవత్సరపుకిస్తీ, ఆసంవత్సరపు అపాయమునుమాత్రమే వహించుటకు చాలినదైయుండును. ప్రతిసంవత్సరము గడుచుకొలది, పట్టాదారుని జీవితమునకు అపాయము హెచ్చు, (అనగా మరణమాసన్నమగుచుండునుగాన). అందువలన ప్రతి సం॥పు ప్రీమియము మునుపటి ప్రీమియముకంటె హెచ్చుగనుండును. ఈవిధముగ ఒక వ్యక్తియొక్క 27 సం॥లో నూటికి రూ. 10 కట్టిన, మరి 20 సం॥లకంతయు రెట్టింపును, 80 సం॥ముల వయసువేళకు నూటికి 210 కంటె హెచ్చుగ కట్టవలసివచ్చును. చేతులుకాళ్ళాడుచు సంపాదనశక్తి కలిగినపుడే ప్రీమియములు చెల్లించుట కష్టమయిన, వయసు కామకాను, శక్తిలేని సమయమున, అంత హెచ్చయిన ప్రీమియములు కట్టవలెనన్న, మిక్కిలి కష్టముకదా? (నేచురల్ ప్రీమియం) పద్ధతిక్రింద రిజర్వ్ లక్కరలేదు.

(లెవెల్ ప్రీమియం) లేక సమానకిస్తీ పద్ధతివివరము లెవిధమో గమనింతము. ఈపద్ధతిక్రింద భీమాచేసినవ్యక్తి భీమాచేసిన మొదటిసంవత్సరములోనే మరణించినచో భీమామొత్తము నిచ్చివేయుటకు యిపుడెంతసొమ్ము కావలెను అని తీర్మానించబడును. ఇదేవిధముగ రెండవ సం॥లో మరణించిన యిచ్చుటకు కావలసిన సొమ్ముకు, యిపుడెంతవసూలు చేయవలెను. 3 సం॥ 4 సం॥ యీ విధముగ మరణపట్టీ (మార్టాలిటీ టేబిల్) లో తెలుపబడిన కాలపరిమితివరకు గణించబడును. ఈ మొత్తములన్నియు కూర్చినచో, మరణకాల మెప్పుడువచ్చినను, భీమామొత్తమును యిచ్చివేయుటకు కావలసిన సొమ్ముయొక్క ప్రస్తుతపువిలువ తెలియుచున్నది. అనగా పూర్తి జీవితపు భీమాకు, ఒకేదఫాకట్టు కిస్తీయన్నమాట. కాని వార్షికప్రీమియములే కట్టుటకు సులభముగాన, ఒకే దఫాకట్టు కిస్తీకి సమానమగు వార్షికకిస్తీ యేదో జీవితపర్యంతము 'సమానము'గ నుండు కిస్తీయేదో, దానిని కనిపెట్టవలెను. 27-వ సం॥న, నూటికి 17 కంటున ఏర్పడుచున్నది. (స్వాభావికప్రీమియం పద్ధతి ప్రకారం నూటికి పదిమాత్రమే అయినపుడు). సుమారు 24 సం॥దాటినవెనుక గాని, 'సమాన'ప్రీమియము 'స్వాభావిక' ప్రీమియమునకు సరిపోదు. దాని కవతల స్వాభావిక ప్రీమియము త్వరితముగ పెరిగిపోవును. (లెవెల్ ప్రీమియం) లేక 'సమాన' కిస్తీపద్ధతి రెండుభాగములు గలది. (1) రాబోవు ప్రతిసంవత్సరపు అపాయము నెదుర్కొనుటకు కావలసిన ద్రవ్యము (2) అంత్య సంవత్సర

ములలో ప్రతి సం॥ అపాయమునకు తగినంత ద్రవ్యము లేనందున కలుగు నష్టమును ఉపసంహరించుటకు ప్రథమసంవత్సరములలో చేర్చి, నిలువయుంచు ద్రవ్యము, ఈ రెండును చేర్చిన, మొత్తపుధనము వచ్చుచున్నది. ఈ సూత్రము ప్రాచీనకాలమునుండి వాడుకలోనున్నది. పుష్కలకాలమున ఐశ్వర్యమును దాచి క్షామకాలమున వాడుకరణి యున్నది యీపద్ధతి.

రిజర్వునిధి అవశ్యకతను మరియొక దెసనుండి విచారింతము. జీవితపు కంపెనిబాధ్యత, ఖర్చులు అప్పుడప్పుడు తనిఖీ చేయబడుచున్నవి. పాలిసీయిచ్చునపుడు పాలిసీ కంట్రాక్టును సంబంధించిన యిరువురి (కంపెనియు, పాలిసీదారుడును) బాధ్యతలును సమముగనే యుండును. అనగా మరణకాలమున యిచ్చుటకు కంపెని ఒప్పుకొన్న సొమ్ముయొక్క ప్రస్తుతపు విలువయు, పాలిసీదారుడు చెల్లించుటకు ఒప్పుకొన్న ప్రీమియముల ప్రస్తుతపు విలువయు, సమముగానుండును. కాని ఒక్కొకసంవత్సరము గడుచుకొలది భీమా మొత్తము యివ్వవలసిన కాలము సమీపించుటచే కంపెని బాధ్యత హెచ్చుగుచుండుటయు, కట్టవలసిన ప్రీమియములు తగ్గుటచే పాలిసీదారుని బాధ్యత తగ్గుచుండుటయు సంభవించుచున్నది. పిటికిగల తేడాయేదో అదే ఆపాలిసీక్రింద కంపెని నిలువయుంచవలసిన సొమ్ము. ఈప్రకారము ప్రతి తరగతి పాలిసీల విషయములో గణించిన, కంపెనీ బాధ్యతలను నిర్వహించుటకుగాను కావలసిన మూలధనము యింతయని తెలియుచున్నది.

రిజర్వులకు సంబంధించిన యీ ప్రశ్ననే మరొక విధముగ కొందరు అడుగుచున్నారు. "హక్కుల పరిష్కారమునకు (క్లెయిమ్సు) ప్రతిసంవత్సరము వచ్చు ప్రీమియముల రాబడి చాలినపుడు, ధనము నేల కూడబెట్టుచురావలెను ?" అనేకకంపెనీలు రాబడికన్న హెచ్చుగ క్లెయిము లివ్వవలసిన స్థితికి రాలేదు. రాబడికిని, క్లెయిములకునుగల సంబంధము ఆకస్మికమైనదని గట్టిగ చెప్ప నవసరములేదు పాలిసీలు తీసుకొను కాలమున పాలిసీదారుల వయసు, తీసుకొన్న భీమాతరగతులు, కాలపరిమితి, మొదలగు అనిశ్చయములను, కంపెని స్వాధీనమున లేనట్టియు నగు కారణములపై ఇది ఆధారపడియున్నది. తనిఖీజరుగు సంవత్సరములో అమలులోనున్న పాలిసీలవిషయమున, అదివరకు పెరిగిన రిజర్వులేగాక, రాబోవు ప్రీమియముల మొత్తముగూడ (వడ్డీసహా) కలిపినగాని, మరణముచేగాని, భీమాకాలపరిమితి పూర్తియగుటచేగాని యివ్వవలసిన క్లెయిములకు చాలదని యిదివరకే తెలుపబడినది. ఒక కంపెనీలో పాలసీలన్నియు బాల్యావస్థలోనుండవచ్చును. అపుడు ప్రీమియములనుండి రిజర్వులు నిలవబెట్టబడుటచే, కంపెని మూలకోశము వృద్ధియగుచుండును. మరియొక కంపెనీలో పాలిసీలు చాలకాలముగ నుండియుండవచ్చును. అపుడు వాటి రిజర్వులు పూర్తిగ పెరిగియుండును. తదుపరి ప్రీమియములలోగల నష్టమును సరిపుచ్చుటకు రిసర్వులనుండి ద్రవ్యము తీయవలసివచ్చును. మూలకోశము యిట్టిస్థితిలో వృద్ధికానేరదు. ఏవిధముగ భీమా మొత్తము సమకూర్చబడినను, అనతికాలములోనో, నిదానముగనో క్లెయిములిచ్చుటకు రిజర్వుధనమును కంపెనీలు వాడవలసియున్నది. క్రొత్తవ్యాపారము కొనసాగుచుండుకొలది, ప్రతిపాలిసీక్రింద ప్రత్యేకముగు రిజర్వు పెరుగుచుండును గాన ఎంతవ్యాపారము హెచ్చిన అంతే రిజర్వు పెరుగును.

రాబడినుండి క్లెయిములిచ్చుటకు చాలనిస్థితి వచ్చుటకు చాలకాలముపట్టునని దీనిరహస్యము. అందువలననే నిజముగ దివాలాతీయుస్థితిలోనుండు కంపెనీలు, చూపరులకు మిక్కిలి ఉన్నతస్థితిలో నుండునట్లగుపడును. రాబడిద్రవ్యమునకును క్లెయిములకును సంబంధమేర్పరచి వాటివలన కంపెనీ మంచిచెడ్డల నెన్నుటయెంత పొరపాటో యిందువలన తెలియుచున్నది అట్టివారినుండి రక్షించుట కంపెనీలవిధియైయున్నది. వెనుకటి తరమువారికి కీడుకల్గించునట్లు యీతరమువారికి లాభము నొనగూర్చుటకు యత్నించి, మన ఆర్థికస్థితిని బలహీనముగచేసికొనుటకు మనము ఒప్పుకొనరాదు.

—సశేషము.

—అలూరు రామచంద్రయ్య, బి. ఏ.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౫౮. కార్మిక సంఘం

కార్మికసంఘప్రచురణము. నెం. 2. రైతు అగు వెంకటసుబ్బయ్యకు అతనికొడుకు రామకృష్ణయ్య జీతగాళ్ళ 'వాదాల' విషయంలో గల అన్యాయమును చూపి కార్మికసంఘములో సంచలనము, సంస్కారము కలిగించి వారికష్టసుఖాలుచూచి రైతులుకూడ 'సిగ్గుపడేటట్లుచేసి, తమదగ్గర పనిచేసేవాళ్ళని తమవాళ్ళవలె చూడడమే ధర్మమనుకొనేటట్లు' రైతులోకమును మార్చుట ఇందు చమత్కారముగ వర్ణింపబడినది. ప్రస్తుత దేశస్థితికి అవసరమైన గ్రంథము. క్రౌనుసైజున 18 పుటలు. దొరకుచోటు: కార్మికసంఘము, అనంతవరము, గుంటూరు జిల్లా.

౫౯. వేదకాలపు స్త్రీలు

పశ్చిమగోదావరిజిల్లా కొవ్వూరునందలి ఆంధ్రగీర్వాణవిద్యాపీఠాధ్యక్షులగు శ్రీజటావల్లభుల పురుషోత్తము గారు, బి. ఏ. రచియించినది. వేదకాలపు స్త్రీలనుగూర్చి ఈగ్రంథమున—స్త్రీసంతతి : పురుషసంతతి ; వివాహము ; సవతులు ; వితంతువులు ; దాంపత్యము ; స్త్రీలు : గృహకృత్యములు ; స్త్రీలు : బాహ్యప్రపంచము ; స్త్రీలు : విద్యలు, వృత్తులు ; స్త్రీలు : కర్మకాండ ; స్త్రీలు : ధనము ; స్త్రీలప్రకృతి : స్త్రీలస్థానము ; వివిధవిషయములు—అను శీర్షికలక్రింద వేదవాక్యప్రమాణములతో వ్రాయబడినది. వివాహము కాకుండ కొందఱుస్త్రీలుండిపోవుట ; సంతతిలేని వితంతువు మఱదివలన సంతానము బడయుట ; కొంతమంది స్త్రీలకు ఘోషాయుండుట ; స్త్రీలు ప్రత్యేకసభలను చేసికొనుట ; సత్యభామవలె యుద్ధముచేసిన స్త్రీలును సుభద్రవలె యుద్ధములో రథమునడపిన స్త్రీలును ఉండుట మొదలగు విషయముల తెలియుట కెంతయు చిత్రముగనుండును. స్త్రీవిద్యాభిమానులెల్లరును అభిమానింపదగిన ఉత్తమగ్రంథము. లెస్సగ పరిశోధించి విషయమును చక్కగ ప్రస్తరింపగలుగుటను ఈగ్రంథరచనముచే ప్రస్ఫుటముచేసిన శ్రీపురుషోత్తముగారు సూత్రకాలపుస్త్రీలనుగూర్చియు, పౌరాణికయుగ స్త్రీలనుగూర్చియు గ్రంథములను రచియించుట వాంఛనీయము. ఈ గ్రంథముద్రణము సుందరముగనున్నది. క్రౌనుసైజున 200 పుటలు వెల పది అణాలు. వలయువారు గ్రంథకర్తకు వ్రాయునది. సుప్రసిద్ధులు శ్రీవల్లూరి సూర్యనారాయణరావుగారు ఈగ్రంథమునకు పీఠిక వ్రాసియున్నారు.

౬౦. హౌ టు సెలక్టు ఎ లైఫ్ ఆఫీస్

ఇన్సూరెన్సువ్యాపారవిషయకములగు గ్రంథములను ప్రచురించుచున్న భారతీయులలో నొకరగు శ్రీ యస్. యన్. గుప్తాగారు ఈగ్రంథరచయితలు. జీవితమును భీమాచేయదలచినవ్యక్తి ఇన్సూరెన్సు కంపెనీలయందు ఏయే మంచిగుణములు ఉన్నవో లేవో చూచికొనవలయునో ఈగ్రంథము చక్కగ బోధించుచున్నది. హిందూదేశమునందలి అయిదు పెద్ద భీమాకంపెనీలను చెందిన వ్యాపారము ఇందు అంకెలలో నిరూపింపబడినది. ఆంగ్లమున వ్రాయబడిన ఈగ్రంథమునందలి విషయములు దేశభాషలలో కూడ ప్రచురింపబడుట లెస్స. ఈగ్రంథమూల్యము 8 అణాలు. వలయువారు గ్రంథకర్త పేర 47-1, హజ్రారోడ్డు, కలకత్తా అని వ్రాయునది.

౬౧. శృంగారగాథేయోపాఖ్యానము

లింగనకవితనూభవ అనంతశాస్త్రిప్రణీతమైన 'శృంగారగాథేయోపాఖ్యానము' అను విశ్వామిత్రచరిత్రరూపకమగు అయిదాశ్వాసముల ప్రబంధములోని

ఖండమాహాత్మ్యమిది. అంబరీషుని యజ్ఞ్వరమునకు నరపశువుగాబోవు శునశ్శేఫుని విశ్వామిత్రుడు రక్షించుట, బ్రహ్మర్షిత్వముకొఱకు విశ్వామిత్రుడు 'కలశశైలంబున' 'ఏకాగ్రసమగ్రమతిని' తపము సాగించియు మేనకకు దగుల్కొనుట, తెలివితెచ్చుకొని తిరిగి ఘోరవీరతపమునకు దొరకొని ఈసారి చిత్తము చెరుపవచ్చిన రంభను శపించి బ్రహ్మను ప్రత్యక్షముచేసికొని బ్రహ్మర్షిత్వము బడయుట ఇందు వర్ణింపబడినవి. విశ్వామిత్రునికడకు రంభను పంపుటకుముందు రంభకును, ఇంద్రునకును జరిగిన సంభాషణ కొంత ముచ్చటగనున్నది. గ్రంథము మంచి ఫెదరువెయిటు కాగితములమీద చక్కగ ముద్రింపబడియున్నది. క్రౌనుసైజు 64 పుటలు. వెల ఒక రూపాయి. వలయువారు విజయనగరమునందలి కళ్యాణీకార్యాలయమునకు వ్రాయనగును.

౬౨. పూర్వగాథాలహరి

ఇది పురాణగాథల అకారాది నిఘంటువు అని చెప్పవచ్చును. యనమండ్ర వేంకటరామయ్యగారిచే వ్రాయబడిన 'పురాణనామచంద్రిక' అను గ్రంథమును, 1917 లో పి. సూర్యనారాయణ అను వారిచే ప్రచురింపబడిన 'పురాణకథలు' అను గ్రంథమును, 1922 లో ప్రకటితమైన 'పురాణమణిమంజరి'యు దీనికి సాదృశ్యముగల తెలుగు గ్రంథములు. ఇది 1928 లో ప్రచురింపబడెను. ఆ మూడు గ్రంథములకంటె ఇది చాల విపులమైనదిగను, ఉపయోగకరమైనదిగను ఉన్నది. ఈ గ్రంథమును కూర్చిన శ్రీ వేమూరి శ్రీనివాసరావుగారు దీని రచనకు 1917 లో పూనుకొని దాదాపు నలుబది పురాణములను చదివి అందలి సారమును గ్రహించి తొమ్మిదియేండ్ల పరిశ్రమఫలముగ ఈ గ్రంథమును తెలుగువారికి ప్రసాదించిరి. ఒక్కొక్క విషయమునుగూర్చి వివిధపురాణములలో ఏమేమి చెప్పబడినదో ఒక్కచోట చేర్చి ఆ విషయములనన్నిటిని అకారాదిగ కూర్చి ఇందు అందీయబడియున్నది. విద్యార్థులకు ఇది నిఘంటువువలె పాయరానిమిత్రముగ నున్నది. దీనిని కలిగియుండువానికి అష్టాదశపురాణములందలి కథలును కరతలామలకమై యుండును. ఏదైన నొక పౌరాణికవ్యక్తినిగూర్చి తెలిసికొనదలచినచో పెద్దపెద్ద పురాణములకో అరుపోయి ఆ విషయమును వెదుకుకొనుటలో విశేషకాలమును వెచ్చింపవలసియుండును; అదియునుగాక పలుపురాణముల సంపాదించుటయు విశేషవ్యయమూలకము. ఈ గ్రంథము అట్టి వృథాకాలహరణమును, విశేషవ్యయమును తొలగించి విద్యార్థులకెంతయో సుపకరించును. ప్రతి గ్రంథాలయమునందును, ప్రతి విద్యాలయమునందును వినియోగముగా నుండదగిన రిఫరెన్సు పుస్తకములలో నిది యొకటి. ఈ గ్రంథము రాయలుసైజున మంచి దళసరి తెల్లకాగితములమీద ముద్రింపబడియున్నది. ఆరువందలపుటలు. దిట్టమైన కాలికో అట్టవైండు. వెల ప్రతి ఒక్కంటికి రు. 7-8-0. గ్రంథములు దొరకుచోటు: శ్రీకనుపర్తి మార్కండేయశర్మగారు, 82 పూనమల్లీహైరోడ్డు, కీల్పాక్ పోస్టు, మదరాసు. ఆంధ్రభూమి చందాదారులకు కొంతకాల మీ ఉత్తమగ్రంథమును తగ్గింపుధర కీయవలసినదిగా శ్రీ శర్మగారిని కోరియుంటిమి. 'ఆంధ్రభూమి'యందలి అభిమానముచే వారు దయతో అందులకు అంగీకరించిరి. 1934 ఏప్రియలు నెలాఖరులోపున ఈ పుస్తకమునకు దరఖాస్తు చేయు ఆంధ్రభూమి చందాదారులకు ప్రతి ఒక్కంటికి రు 6-0-0 కే ఈయబడును. మా చందాదారులలో పలువురు ఈ సదవకాశమును జారవిడువకుందురని నమ్ముచున్నాము.

౬౩. హరిజననాయకుడు

రైతుగ్రంథమండలిలో ప్రథమగ్రంథము. గ్రంథకర్త ప్రొఫెసరు రంగనాయకులుగారు, బి.లిట్ (ఆక్సుఫర్డు) నేటి తెలుగువారి సాంఘికజీవితమునకు ఈ గ్రంథము కొంతవఱకు దర్పణమని చెప్పవచ్చును. మొన్నమొన్నటివఱకును ఆంధ్రకర్షకస్త్రీలు వ్యవసాయపుపనుల నెట్లు సమర్థతతో నిర్వహించుచుండిరో ఈ గ్రంథమున చక్కగ వర్ణింపబడినది. ఆ ఘట్టములు 'చదువునపుడు శ్రీరంగనాయకులుగారు కవులుగ మనకు అగుపడుదురు. వారు రాజకీయనాయకులేగాక గొప్ప సంఘసంస్కర్తలనుటకు ఈ గ్రంథమునందలి పెక్కు ప్రకరణములు నిదర్శనములైయున్నవి. గ్రంథమున ప్రవాహ

లేఖముగల వాడుకభాష ఉపయోగింపబడినది. నిరంతర కార్యనిమగ్నులైయుండియు శ్రీరంగనాయకులుగారిట్టిగ్రంథరచనముచే ఆంధ్రభాషారామమును సేవించుట స్తుతింపదగియున్నది. క్రౌనుసైజున 176 పుటలు. వెల రు 0-8-0. వలయువారు మేనేజరు, రైతుగ్రంథమండలి, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా, అని వ్రాయునది.

౭౪. పూలమాల

'గృహలక్ష్మి' పత్రికామతల్లిమూలమున నేటితెలుగు మాగాణికి ఎఱుకపడిన శ్రీమతులు పదమంచి అనంతమ్మ, తుమ్మల వసంతాదేవి, కొల్లూరి రాజేశ్వరి, ఓలేటి నిత్యకళ్యాణమ్మ మున్నగు కవయిత్రులలో ఈ పూలమాల రచయిత్రి శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారొకరు. ఆమె లేఖినినుండి జాలువాఱిన పసువాలుగు ఖండకావ్యకణముల సంపుటి ఈ గ్రంథము. పతిపందర్శనము; సుమన: కాండిలి; కృష్ణునితో పాంచాలి; కుంతీసందేశము మొదలగు పూలు స్త్రీహృదయమును గుబాళించుచున్నవి. 'సుమ్మఁడు' ఒక ప్రశస్తపుష్పము.

“మొల్ల తతిగొండ వెంగమ్మ ముద్దుపళని
అచ్చమాంబయు మొదలుగా నాంధ్రమహిళ
లమిత విఖ్యాతిఁ గాంచు టీకవనిలోన
కమ్రకవితామృతాస్వాదకలనఁగాదె!”

అని నమ్మిన ఈ మాసోదరి శారదము వెదజల్లుభావములుగల ఇట్టి పూవులను పెక్కింటిని తెలుగు తల్లికి అర్పించునుగాక యని కోరెదము. గ్రంథముద్రణము సుందరముగనున్నది. వలయువారు స్థానాపతి రుక్మిణమ్మ, మెయిన్ రోడ్, విశాఖపట్నం అని వ్రాయవలెను.

౭౫ జీవరసాయనచికిత్సావిధానము

'జీవరసాయన చికిత్సావిధానము' డా. విల్హెల్మ్ హెన్‌రిచ్ షూస్లర్‌గారిచే 1873 లో కనిపెట్టబడినది. 'మానవశరీరము పండ్రెండు విధములైన లవణములతో కూడుకొనియుండుననియు, ఈ లవణములలో దేనియొక్క భాగముతగ్గినను శరీరమున కస్వస్థతచేకూరుచున్నదనియు జీవరసాయనశాస్త్రజ్ఞులమతము... జీవరసాయన చికిత్సావిధానము ప్రపంచమంతయును అల్లుకొనిపోవుచున్నది. కారణము దురూహ్యముకాదు. ఏవైద్యమువలన రోగములు నివారణయగుచున్నవో ఆ వైద్యమునే జనులు కోరెదరు. జీవరసాయన చికిత్సావిధానము లోకమున విస్తరించుటకు ఇదియే కారణమనిన సత్యమునకు దూరముకాదు.' అని శ్రీ టంగుటూరి జానికిరాంగారు ఈ గ్రంథపీఠికలో వ్రాసియున్నారు. గ్రంథరచయిత డాక్టరు తోలేటి పేరాజుగారు. శ్రీవారికి 1929 లో చాల జబ్బుచేసెను. అల్లోపతిక్ వైద్యులు పెదవి విరచిరి. అప్పటికే జీవరసాయనశాస్త్రమునందు పరిచయముండుటచే పేరాజుగారు సాహసించి ఈ మందుల వాడకమునకు గడంగి అద్భుతముగా రోగవిముక్తులయిరి. నాటినుండియు ఇట్టి అమూల్యచికిత్సావిధానము వెల్లడిచేయ కుతూహలురై ఇప్పుడీగ్రంథమును ప్రచురించిరి. ఇది ప్రథమభాగము. ద్వాదశలవణలక్షణదీపిక. ఇందు ఒక్కొక్క లవణము లోపించుటచే శరీరమునందలి వివిధావయవములయందు ఎట్టి మార్పులు గలుగునో వివరింపబడినది. పెక్కు అమూల్యగ్రంథములు పఠించి అందలి అంశములను గ్రహించి వ్రాయబడిన ఈ గ్రంథమును విరివిగకొని మిగిలిన భాగములనుకూడ త్వరలో ప్రచురింప గ్రంథకర్తకు ప్రోత్సాహమీయ ఆంధ్రమహాజనులను కోరెదము. క్రౌనుసైజున 160 పుటలు. వెల 1 రూపాయి. వలయువారు పశ్చిమగోదావరిజిల్లా నరసాపురమునందున్న గ్రంథకర్తకు వ్రాయవలెను.

౭౬. శ్రీ కుముదవల్లి

రాయలసీమ నేటి తెలుగు కవులలో నొకరగు శ్రీయుత సీరిపి ఆంజనేయులుగారు రచించిన మూడు అంకములుగల చక్కని చిన్న దృశ్యకావ్యము. తమ శిష్యురాలు ఒకతె తమ పాఠశాలాపత్రికలో ప్రచురించిన అభినవకుంకోపసుందులు అను కథను ఆధారముగగొని ఒక గంటలో ప్రదర్శింపబడుటకు అనువగునట్లు రచియింపబడిన నాటకమిది. ఈ నాటకమునకు పీఠిక వ్రాయుచు విద్యారసికులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు ఇందలి ప్రధానపాత్రమునుగూర్చి ఇట్లు వ్రాసిరి: “ఆమె శీలమును దిద్దుటయందు కవి గొప్ప ప్రతిభను కనుపరచినాడు. విద్యావతి, స్వతంత్ర వివాహవిధవో

పేతయగు శీలవతి, పతిపదము సార్థకపరచునుగాని వ్యర్థపరుపదని నిరూపించుటయందితడు చేసినకృషి, నేటి స్త్రీలసభ్యజీవనమును పోషనము గావించు ఛాందస కవులకు, దగిన ప్రతికృతిగ నెలుంగుచున్నది. 'కరుణ' శిలపోషణము నిశ్చయముగా శ్లాఘాపాత్రము." నీతి దాయకమగు ఈ నాటకము స్త్రీలును, స్త్రీవిద్యాభి మానులును చదువతగియున్నదని మా అభిప్రాయము. ఆంటిక్ కాగితములు క్రౌనుసైజు. 104 పుటలు. కృష్ణ దేవరాయగ్రంథమాలలో తొమ్మిదవ పుస్తకము. ప్రతు లకు అనంతపురమునందలి గ్రంథకర్తకు వ్రాయునది.

౭౭. గోపాలకృష్ణుని చాటువులు

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు ఒక అద్భుతమైనవ్యక్తి. చమత్కారసంభాషణవిషయమున వారితో దొరయుపాటి నాయకులు నేడు తెలుగు వారిలో మరి రొవ్వరును లేరనుట అతిశయోక్తిగాదు. అట్టివారి చాటూక్తులు గ్రంథరూపమునందు ప్రచురణ యగుట ఎంతయు సముచితముగనున్నది. 'చదువు పెూసైనచానలు' అను శీర్షికగల వారి చాటువును చదువుడు:

సీ. ప్రక్కలుపాసిన్న నిక్కిన ముక్కులు
వాడిపోయినమోము బీకుకళ్ళు
ఎండిపోయినచన్ను పండిపోయినముళ్ళు
కాళ్ళకు మేజోళ్ళు కళ్ళజోళ్ళు
ముళ్ళుగట్టినజుట్టు ముళ్ళుపెట్టినకట్టు
నక్కుకట్టినబట్ట నడుముతట్ట
సందుచేసినచంక కందిపోయినడొంక
పలుచంబాతినతొడ పలకలమెడ
గీ. నూనిరెక్కలు చుక్కాని లేనివాడి
పనీడి పళ్ళను కుళ్ళిన ముసలి పెదవి
చదువుపెూసైన చానల చందమౌర
రామ నగరీనరేంద్ర! శ్రీరామచంద్ర!

ఇట్లే తక్కిన పద్యములును మృదుమధురమగు శైలితో చెప్పిలు హాస్యరసముతో ఒప్పుచున్నవి. వెల 3 అణా లు. బెజవాడలోని శ్రీమదాంధ్రవిద్యాపీఠగోష్ఠివారిచే ప్రకటితము.

౭౯. దూదేకుడు

అనే వ్యాసాలు. గ్రంథకర్త: ఏ. కే. రాయకవి అను పేరుగల ఆలపాటి కామేశ్వరరాయకవి. 1. పరమానందయ్య భావకవిత్వం, 2. భావకవి మండలి వార్షికసభ, 3. ఉద్దండకవిచంద్రుడి ఉపన్యాసం, 4. భావకవిత్వం ప్రదర్శనం, 5. గీతపద్యాలు, 6. పద్య వ్యాసం, 7. శీర్షిక, 8. ఉపాయాలు, 9. కులమింటి కోతి మీాద విమర్శనం, 10. బస్తీమేనవాల్, 11. దూదేకుడు, 12. ఆఖరు అను తలపేరులతో వ్రాయ బడిన హాస్యరసవిషయకములగు వ్యాసముల సంపుటి. అనేకవిషయములనుగూర్చి హాస్యద్యోతకమగు విమర్శ గలదు. క్రౌనుసైజు 92 పుటలు. వెల ౧ రూ. విజయ నగరమున సుబ్రహ్మణ్యపేటలోనున్న గ్రంథకర్తకు వ్రాసి ప్రతులను బడయవచ్చును.

క్రొత్త పత్రికలు

౧౩. ప్రజామిత్ర

తెలుగువారి తిలకనగరమగు బెజవాడలో పుట్టువొ గన్నది. మండలప్రజలను మహానీయముగ సేవించినది. రాజధాని తిలకనగరమగు చెన్నపురి చేరినది. ఆకృతిని విస్తరించినది; ఆశయములను విశాలపరచినది. రాజా గారిధనమునను; రామబ్రహ్మముగారి సామర్థ్యమునను; ఆంగ్లవిద్యాధికులు, జర్నలిజములో జాసైన అనుభవ మును సంపాదించిన ఆంధ్రయువకులగు లక్ష్మీనరసు య్యగారి ఆలోచనాబలమును తోడుచేసికొని ప్రజా మిత్ర పరిపుష్టినొంది ఆంధ్రులకు సచిత్రవారపత్రికలేని లోపమును దీర్చివైచినది. అంతర్జాతీయవిషయములకు ప్రాధాన్యమిచ్చుచు ఈపత్రిక తెలుగువారిలో విశేష విజ్ఞానవ్యాప్తికి తోడుపడుచున్నది వయస్సునచిన్నదై యయ్యును ప్రజామిత్రతో దొరయుపాటి వారపత్రిక తెలుగున మఱియొకటి లేదనుట పొగడిచెప్పుటగాదు. రుచివిస్తృతిగల ఇట్టి పత్రికలవలన తెలుగువారిలో పత్రికాపఠనాభిలాష పెంపొందగలదు. మహారాష్ట్రు లకు 'కేసరి'వలె, అరవవారికి 'ఆనందబోధిని'వలె ఆంధ్రు

లకు ‘ప్రజామిత్ర’ గర్వింపదగిన పత్రిక కాగలదనుటకు ఇంతవఱకు ప్రచురితములైన ఐదు సంచికలు సమర్థములై యున్నవి. సాలు చందా మూడురూపాయలు మాత్రమే. కార్యస్థానము : 1-4 ఉడ్సురోడ్డు, మౌంటురోడ్డు పోస్టు, మదరాసు. ప్రజామిత్ర చిరంజీవియై వర్ధిల్లును గాక!

౧౪. రంధ్రాన్వేషి

ప్రతి బుధవారము నెల్లూరునుండి ప్రచురింపబడు సంచిక ఒక్కటే కానీ వెలగల పత్రిక. సమర్థత ఉండియు పత్రికాసంపాదకవర్గమునుండి కారణాంతరములచే తప్పుకొనియున్న నేటి ఆంధ్రయువకులలో శ్రీ యమ్. కోదండరామరెడ్డిగారొకరు. వారు తమ సామర్థ్యమును నిరుపయోగ మొనర్పక తిరిగి సంపాదక కార్యమునకు గడంగి ఇపుడీ ‘రంధ్రాన్వేషి’ని ప్రచురించుచున్నందులకు మేమెంతయు ఆనందపడుచున్నాము. పత్రికలో గొప్ప విలక్షణత గలదు. ‘ముల్లు : మొగ్గ’ అను వ్యాసశకలములు ముల్లువలె నిశితముగా గుచ్చుకొనుచున్నను మొగ్గవలె నిసర్గముగా సువాసనను ఈనుచున్నవి. వెల స్వల్పముగావునను, విషయములు హాస్యరసమిళితములై చవుల నింపుగా నున్నవి గావునను ఈ పత్రిక విశేషప్రచారము నందు ననుటకు సందేహము లేదు. సంవత్సరపు చందా నెల్లూరులో 0-12-0 అణాలు; బయటఊళ్ళలో 1-8 0.

౧౫. దక్కన్ కేసరి

సికిందరాబాదునుండి వెలువడు సచిత్రాంధ్రాంగ్లేయ మాసపత్రిక మొదటిసంపుటపు రెండవసంచిక 1933 డిసెంబరుమాసమున వెలువడినది. సంపాదకుడు : ఎ. వి. దత్తాత్రేయశర్మ. నిజామురాష్ట్రమున ‘ఆంధ్రాభ్యుదయము,’ ‘సుజాత’ మొదలగు పత్రికలు ఈవఱకు ప్రచురింపబడి తెనుగును సేవించినవి. ఇపుడా రాష్ట్రమున తెనుగుమాసపత్రిక ఒక్కటియు లేదు. దక్కన్ కేసరి ఆలోటును తీర్చునని నమ్మెదము. సురవరము ప్రతాపరెడ్డి (బి.ఏ.,బి.ఎల్.); విద్వాన్ సరిపల్లె విశ్వనాథశాస్త్రి యం.ఏ. మున్నగు విద్యాధికుల వ్యాసములతో ఈ సంచిక ఒప్పుచున్నది. క్రౌను క్వార్టో సైజు. 42పుటలు. సాలు చందా రు. 3-0-0.

౧౬. గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రప్రజాలోకమునకు బాగుగా పరిచయమైన పత్రిక. గ్రంథాలయోద్యమప్రచారము గావించుటకు తోడు శారద, భారతి మున్నగు సచిత్రమాసపత్రికలు ఉదయించుటకు పూర్వము తెలుగువారి సచిత్రమాసపత్రికయై వరలిన, రాచప్రోలు సుబ్బారావు మున్నగు తెలుగు భావకవులకు ఆశ్రయభూమియై వ్రాలిన గ్రంథాలయసర్వస్వము పునరుద్ధరింపబడి తిరిగి తన ప్రచారము సాగింపనుండుట సంతోషకరవిషయము. తొమ్మిదవ సంపుటపు తొలిసంచిక ఈజనవరిమాసమున వెలువడినది. ఆంధ్రదేశపు గ్రంథాలయోద్యమాచార్యులు అయ్యంకి వేంకటరమణయ్యగారు ఈపత్రికకు ప్రధానసంపాదకులు. గ్రంథాలయోద్యమప్రచారవిషయమున ఆంధ్రులు తిరిగి మేల్కొన్నారు. ఈప్రబోధసమయమున ఈపత్రిక చేయవలసినపని అనంతముగ గలదు. క్రౌను క్వార్టో సైజు. 50 పుటలు. వార్షికమూల్యము ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ సభ్యులకు రు. 3-0-0; ఇతరులకు రు. 5-0 0. విడిసంచిక రు. 0-8 0. కార్యస్థానము బెజవాడ.

౧౭. అనంతపుర బాలికాపాఠశాలాపత్రిక

రాయలసీమలోని అనంతపురమునందలి బాలికా పాఠశాలాపత్రిక వార్షిక సంచిక. 1933-వ సంవత్సరము జూనుమాసమున ప్రచురితము. విద్యార్థినులు వ్రాసిన ఆంధ్రాంగ్ల వ్యాసములు, పాఠశాలకు సంబంధించిన చిత్రపటములుగలవు. ఇట్టి పత్రికలవలన విద్యార్థినులలో చిన్ననాటనే రచనావ్యాసంగము కలుగును. ఈ పాఠశాలలో తెలుగుపండితులుగానున్న సీరిపి ఆంజనేయులుగారు విద్యార్థినులలో తెనుగు వ్యాసరచనావ్యాసంగమును కలిగించి వారిచే చక్కని వ్యాసములు వ్రాయించి ఈసంచికకు సారస్వతపుష్టి కూర్చియున్నారు. ఇందులకు వారెంతయు అభినందింపదగియున్నారు.

సంపాదకీయ సమాలోచన

భూకంపము : బీహారు రాష్ట్రపు బడ్జెట్టు :—

విశ్వప్రయత్నములు చేసినాడు. బీహారు రాష్ట్రపు ఆర్థిక సభ్యుడు నారాయణ సిన్హా బడ్జెట్టులో ఆయవ్యయములను సరిపెట్టుటకు విశ్వప్రయత్నములు చేసినాడు. తుదకు సరిపెట్టినాడు. జనవరి 15-వ తేదీ సోమవారము ఉదయమున శాసనసభవారిచే దానిని ఆమోదింపజేసినాడు. ఆమోదింపబడిన పిమ్మట నూటముప్పదియైదు నిముసములకు భూకంపమువచ్చినది. అనుకున్న ఆదాయమునకు విఘాతము వచ్చినది. అనుకొనని వ్యయములు విఱుచుకొని మీదబడినవి. ఋణము మనదికాదనుటకు మఱియొక నిదర్శనము. సాధారణవ్యయములకు తట్టుకొనుటకే తల్లక్రిందులగుచున్న బీహారు ఈ అసాధారణ వ్యయములనెట్లు ఎదుర్కొనగలదు? భారత శాసనసభలో కేంద్రప్రభుత్వమువారు బీహారుకు ఆర్థికసాహాయ్యము చేయవలయునను తీర్మానము ఏకగ్రీవముగ ఆమోదింపబడినది; దేశజులు యథాశక్తిని ధనసాహాయ్యము చేయుచున్నారు ఎందఱు ఎంతగ సాయము చేసినను ఇప్పటిభూకంపము వత్సరములుగ బీహారురాష్ట్రపు బడ్జెట్టు సరిపెట్టుటలో అడ్డుతగులుచునే యుండునని ఒప్పుకొనక తీరదు.

జపానుకు తోడు సయాము :—

మదరాసు రాజధాని ముఖ్యమైన పంటలలో వరియొకటి. ఈ రాజధానియందలి ప్రజల వినియోగమునకు సరిపోగా ఇంకను ఎంతయోధాన్యమును ఇతరప్రదేశములకు పంపుటకు వీలుకలదు. తక్కువధాన్యపుగింజలైనను ఇతర ప్రదేశములనుండి తెచ్చుకొనవలసిన అవసరము ఈ రాజధానికి లేదు. అవసరము లేకపోయినను జపానుండి బియ్యము వచ్చిపడుచున్నవి : జపాను బియ్యమునకు ఇపుడు సయాముబియ్యముతోడైనవి. ఈ రాష్ట్రమునందలి బియ్యముకంటె జపాను సయాము దేశములనుండి దిగుమతియగుచున్న బియ్యము చౌకగానున్నవని మద్రాసు మెయిలు వ్రాయుచున్నది. తాజాస్థితియందే తన బియ్యమునకు డిమాండు లేకున్నదని వగచుచున్న ఈ రాష్ట్రపురైతు ఈ పులిమీద పుట్రనెట్లు ఎదుర్కొనును? సయాము దేశమున ఈ నడుమ సంఘటిల్లిన అశాంతికి అచ్చటిధాన్యముధర పడిపోవుట యొక్క కారణమని తెలిసికొనియున్నాము. ఇక్కడి ధాన్యపు ధరను ఇంకను పడిపోనిచ్చుట ఇచ్చట అశాంతి నాహ్వానించుటయగునుగదా? ప్రభుత్వమువారేమి చేసెదరు?

టోలుగేట్లు తిరిగి పుట్టుచున్నవి:—

స్థానికస్వపరిపాలనమన నేమి? ఇతర రాష్ట్రములందు స్థానికస్వపరిపాలనమన ఎట్టి అర్థము ఉన్నదో మనము సూటిగ చెప్పజాలము గాని మన మదరాసురాష్ట్రమున స్థానికస్వపరిపాలన మన ఆ శాఖలో ఒకడు చేసినపనిని వాని తరువాత వచ్చినయతడు మార్చివైచుటయేయని నిస్సందేహముగ అర్థము చెప్పవచ్చును. వెనుకటి మదరాసు స్థానికపరిపాలనశాఖ మంత్రి శ్రీ మునిస్వామినాయుడు గారు రివెన్యూ తాలూకాకు ఒక్కొక్క

బోర్డును ప్రసాదించిరి; టోలుగేట్లను ఎత్తివైచిరి. వారియనంతరము బొబ్బిలిరాజావారు మదరాసు స్థానికస్వపరిపాలనశాఖకు మంత్రులైరి మనరాజధానియందు స్థానికస్వపరిపాలన మనగ వెనుకటివారు చేసినదానిని తరువాత వచ్చినవారు మార్చివేయుటయేగదా! కావున బొబ్బిలిరాజావారు తాలూకాబోర్డులకు స్వస్తిచెప్పిరి; టోలుగేట్లను తిరిగి ప్రతిష్ఠింప ప్రయత్నించుచున్నారు. ధాన్యము మొదలగు పంటసరుకులకు ధరలపడిపోగా కూరగాయలు, ఫలములు బండ్లమీద సంతలకుగొనిపోయి విక్రయించుకొని రైతులు నేడు తెచ్చుకొనుచున్న నాలుగు డబ్బులలో ఒకటి రెండు డబ్బులను ఈ టోలుగేట్లు మ్రింగగలవు టోలుగేట్ల పునరుద్ధరణము రైతునోట మరియొక కరక్కాయకొట్టుటయే. రైతుసరకులకు సంతమార్కెట్టు సౌకర్యములైన లేకుండజేయుట ఈ రోజులలో బొత్తిగా అన్యాయమనకతీరదు. టోలుగేట్ల పునరుద్ధరణము ఇతరుల నెవ్వరిని బాధించనంతటి తీవ్రముగా రైతుజనులను బాధించుననుట నిజము. రైతుల ప్రతినిధుల మనుచు చెప్పుకొని గర్వించు మనశాసనసభ్యులు ఈయవసరమున ఎట్లుమెలంగెదరో?

కీ. శే. ఎ. రంగస్వామి అయ్యంగారు:—

ఎంతటి స్థిరస్థితినందియున్నను పది వత్సరములలోపల ముగ్గురు సంపాదకులను గోల్పోవుచో ఆ పత్రికకు కలుగునష్టము అపారమని చెప్పుట స్వభావోక్తికి సమీపమగును. సంపాదకుడు, స్వామిదారుడు కస్తూరి రంగయ్యంగారు మరణించిన లోటులేకుండ ఎస్. రంగస్వామి అయ్యంగారు హిందూపత్రికను సమర్థతతో సంపాదించిరి. వృద్ధుడగు కస్తూరి రంగయ్యంగారి లోకానుభవము, సమర్థత యువకులగు రంగస్వామిఅయ్యంగారికి రాజాల దని పలువురు భయపడిరి. కాని యస్. రంగస్వామి అయ్యంగారు పత్రికను అద్భుతముగ నడపి లోకమువారిచే ఆహా అనిపించుకొనిరి. క్షయరోగమువారిని కబళింపగా ఎ. రంగస్వామిఅయ్యంగారు హిందూపత్రికాసంపాదకులైరి. యువకులుగారు, 'స్వదేశమిత్రన్' సంపాదకులుగా దేశమున పేరుగడించినవారు. కాని వీరి హయాములో హిందూ పత్రిక జ్యోతివలె వెలుగలేదు. దేశమును ముంచెత్తిన శాసనోల్లంఘనోద్యమును వీరు తీవ్రముగ పాటించినట్లు వీరువ్రాసిన ఒక్క సంపాదకీయముకూడ చెప్పుటలేదు. కేవలము మితవాదపత్రికయగు 'లీడరు' ప్రతిఘటించినపాటియైన హిందూపత్రిక ప్రభుత్వమును ప్రతిఘటించలేదు. యస్. రంగస్వామి అయ్యంగారి శైలికిగల ఆకర్షణగాని, మార్దవముగాని వీరిశైలికిలేదు. మరణించినపిమ్మట ఆంధ్రుల విశేషసానుభూతినిపొందిన ఈ అయ్యంగారు బ్రతికియుండి ఆంధ్రసమస్యలయెడ సానుభూతిచూపలేదు. ఈయన గొప్ప మేధావియేకాని గొప్ప సంపాదకుడు మాత్రముకాడని చెప్పవలసియున్నది. సి వై. చింతామణి, కోటంరాజు పున్నయ్య మొదలగు సంపాదకమహాశయులను ప్రసవించిన జాతికిచెందిన మన ఆంధ్రులు ఈ మేధావిని గొప్పసంపాదకుడుగా పరిగణించుటచూడ మాకు చాల ఆశ్చర్యముగనున్నది వీరి మరణమువలన హిందూపత్రికకుకంటె హిందూదేశమునకే ఎక్కువనష్టము. కాన్‌స్టిట్యూషనల్ లాయందు వీరితో దొరయుపాటివారు నేటి హిందూదేశమున మఱియొకరు లేరు. రాజ్యాంగసంస్కరణములు రానున్న ఈ సమయమున వీరిమరణము మఱింత విషాదమునకు కారణమగుచున్నది. శ్రీ అయ్యంగారి పవిత్రాత్మ శాంతిధామమున నెలకొనునుగాక!

ఆంధ్రయూనివర్సిటీ : పాస్ కోర్సులు:—

ఆంధ్రయూనివర్సిటీవారు పాస్ కోర్సులకు ప్రత్యేకకళాశాలలను స్థాపింప ప్రయత్నములు సాగించుచున్నారని తెలియవచ్చుచున్నది. సాశ్రమవిశ్వవిద్యాలయములు తమ పోషణక్రింద పాస్ కోర్సులకు కళాశాలలను నిర్వహించుటకలదుగాని ఆంధ్రవిశ్వవిద్యాలయమువంటి అఫీలియేటింగు యూనివర్సిటి పాసుకోర్సులను ప్రత్యేకకళాశాలను నడుపుట ఇదివఱకు ఆచారముగనుండలేదు. అనేకవిషయములందువలెనే ఈ విషయమునందును ఆంధ్రవిశ్వవిద్యాలయము విలక్షణతను సంపాదింప కాంక్షించుచున్నదేమో! తాను ప్రత్యేకము స్థాపించిన కళాశాలపై విశ్వవిద్యాలయము ప్రత్యేకాభిమానమును చూపుట సహజము. అపుడు ఇతరకళాశాల విద్యార్థులకు అనేకవిషయములలో నష్టము కలుగును. కావుననే ఆంధ్రవిశ్వవిద్యాలయమువారి ఈతలంపునకు విశాఖపట్టణము, విజయనగరము, రాజమండ్రి మున్నగు ప్రదేశములందు ప్రతికూలతీర్మానములు చేయబడినవి. పాసుకోర్సులకు కళాశాలలున్నవి; దానివిషయమై విశ్వవిద్యాలయము విశేషశ్రద్ధను చూపవలసిన అవసరములేదు. అవసరముగల ఇతర పోస్టుగ్రాడ్యుయేటుకోర్సుల విషయమున శ్రద్ధవహించుటలెస్స.

రాయలసీమ: ఆంధ్రవిశ్వవిద్యాలయము:—

రాయలసీమపౌరులలో కొందఱు ఆంధ్రవిశ్వవిద్యాలయమున చేరక మదరాసు విశ్వవిద్యాలయమునకే తగులుకొనియుండుటకు అభిలషించుచుండిరనుట వెల్లడికి వచ్చినది. పూర్తి సాంబారుమూర్తియైన సత్యమూర్తిగారు ఈ విషయమున వారికి ఉపదేష్ట. పెదవికి బెల్లమురాచుకొని ఆసాంబారుమూర్తి తనకు రాయలసీమ ఆంధ్రులయెడగల అభిమానమును పెద్దపెట్టున వాక్రుచ్చినాడు. కాని ఆతనిహృదయమును బయలుచేసి ఆతని ఆంధ్రాభిమానమును, ఆతడు ఆంధ్రులకు చేయగలసాయమును లోకమునకు తెలిపిన విషయమొకటి ఈనడుమ జరిగినది. మద్రాసు ఆంధ్రవైశ్యప్రముఖులలో నొకరును, కార్పొరేషను ఇరువదియైదువత్సరములు సేవించుచున్నవారును అగు శ్రీ సుంకు సుబ్రహ్మణ్యశ్రేష్ఠిగారికి కార్పొరేషను రెవెన్యూఆఫీసరు ఉద్యోగమునిచ్చుటకు సభవారు సంకల్పింపగా సత్యమూర్తిగారు ప్రతిఘటించిరి. సత్యమూర్తిగారి సాంబారునందు తాలింపులోనైన ఆంధ్రాభిమానము లేదనుటకు ఈఒక్కనిదర్శనమునుచాలును. సత్యమూర్తిగారి సత్యస్వభావమును ఇపుడైన తెలిసికొని వారిప్రక్కచేరి ఆంధ్రుల ఐక్యతకు అడ్డుతగులుచున్న రాయలసీమ ఆంధ్రసోదరులు కర్తవ్య మాలోచింతురుగాక!

గ్రంథాలయోద్యమము : ఆంధ్రభూమి :—

గ్రంథాలయోద్యమప్రచారవ్యాప్తికి ఆంధ్రభూమి ఇంతదనుక చేసిన స్వల్పసేవకే అల్పసంతోషులగు విశాలాశయులు పలువురు ప్రశంసలనంపుచున్నారు. రేపల్లె తాలూకా గ్రంథాలయసంఘమువారు ఆంధ్రభూమిని ఆశీర్వదించుచు ప్రత్యేకతీర్మానమునుగావించి ఆ తీర్మానమును మా కార్యాలయమునకు బంపియున్నారు. పెక్కుగ్రంథాలయములు తమ చందాధనమును పంపి ఆంధ్రభూమి ఆర్థికపుష్టికి తోడుపడుచున్నవి. అవకాశము కలిగినతోడనే ఆంధ్రభూమి పుటలను పెంచి గ్రంథాలయోద్యమవిషయములకు ప్రతిసంచికయందును కనీసము నాలుగు పుటలను ప్రత్యేకింప సంకల్పించియున్నాము



జనవరి, ౧౯౩౮.

౧౭:—కర్నూలు. శ్రీమతి వై. సీతమ్మగారు గౌరవ మేజిస్ట్రేటుగ నియమింపబడిరి.

౨౦:—కాకినాడ ఆంధ్రదేశ గ్రంథాలయ మహా సభ. శ్రీ వేమవరపు రామదాసుపంతులుగారు అధ్యక్షత వహించిరి.

౨౨:—గవర్నరు సర్ స్టాన్లీగారి గంజాంమండల సంచారము.

౨౫:—పెదపల్లి. రాజా పటేల్ ఖానా వెంకటరామ స్వామి జమీందారువారి మరణము.

౨౬:—బరంపురము. రావుసాహెబు ఉన్నవ బుచ్చి రామలింగంపంతులుగారి మరణము.

౨౭:—అనంతపురము. జిల్లాబోర్డువారొసంగిన సన్మాన పత్రి సందర్భమున రాయలసీమ విద్యాభివృద్ధి పట్ల ఆంధ్ర విశ్వవిద్యాలయముయొక్క శ్రద్ధను గూర్చి సర్. యస్. రాధాకృష్ణన్ గారు వివరించి ఉపన్యసించిరి.

:—మదరాసు. రాయలసీమ మహాసభ. ఆంధ్ర విశ్వవిద్యాలయమునందు చేరుటకు ప్రాతికూల్యము.

౨౮:—మదనపల్లి. కళాశాలలో సర్. యస్. రాధాకృష్ణన్ గారు ఆంధ్రవిశ్వవిద్యాలయ సమస్యలనుగూర్చి ఉపన్యసించిరి.

౨౯:—రాజమండ్రి. పి. వెంకటచలపతిరావు, కందుల జగన్నాథం, పి. సుబ్రహ్మణ్యంగార్ల అరెస్టు.

౩౦:—పెద్దాపురము మునిసిపాలిటీకి కమీషనరు నియామకము.

ఫిబ్రవరి, ౧౯౩౮.

౧:—మదరాసు శాసనసభలో రైతువారీభూముల ప్రాంతములందు భూమిశిస్తును నూటికి 25 వంతున తగ్గించవలయుననుతీర్మానము.

౨:—మదరాసు శాసనసభలో తాలూకాబోర్డుల రెత్తివేయు ప్రతిపాదన సెలక్టుకమిటీకి పంపబడెను.

౬:—గోవాడ. గొల్లపూడి సీతారామశాస్త్రిగారి నిరాహారదీక్ష ప్రారంభము.

౧౦:—నెల్లూరు. మాక్మిలన్ కంపెనీ ఛీఫ్ ఏజెంటు రేబాల శేషగిరిరావుగారి మరణము.

:—కలకత్తా మదరాసు గాలివిమానపు టపా పారంభము.

౧౪:—రాజమండ్రి. తాలూకాబోర్డు ప్రెసిడెంటు, పల్లిస ప్రాసిక్యూటరుపనుల నిర్వహించిన చేబి సోమయాజులుగారు (85 ఏండ్లు) మరణించిరి.

౧౫:—మదరాసు. ఆంధ్రవైశ్యప్రముఖులు శ్రీ సుంకు సుబ్రహ్మణ్యచెట్టిగారు కార్పొరేషను రివిన్యూ ఆఫీసరుగ నియమింపబడిరి.

:—గోవాడ. గొల్లపూడి సీతారామశాస్త్రిగారు నిరాహారదీక్షను విరమించిరి.

౧౬:—బెజవాడనుండి కాకినాడమీదుగా విశాఖపట్టణమునకు టెలిఫోనులైను ఏర్పాటుచేయబడెను.

౧౯:—నంద్యాల. మదరాసు రెవెన్యూబోర్డువారు కర్నూలు జిల్లాయందు పర్వేయు, రీసెటిల్ మెంటు వెంటనే చేయించవలెనని ఉత్తరువు చేసిరి. ఆయాప్రాంతములందలి రాసిల్దారు లందరును యథోచితకార్యములను ప్రారంభించిరి.

:—మదరాసు. ఆంధ్రమహాసభ. దత్తమండలములను, చిత్తూరుజిల్లాను ఆంధ్రవిశ్వవిద్యాలయ యాజమాన్యముక్రింద తిరిగి చేర్చుటకు అంగీకరించుచు తీర్మానము.

అభ్యర్చన

క్షీరాబ్ధిశయనా! కమలంబులు సూర్యుని కెదురుమోచిన యట్లు నాహృదయపద్మంబు రవిమండలమధ్యవర్తియైన నీకెదురు చూచుచున్నది. మయూరంబులు మేఘాగమనంబునకుం జెలంగినట్లు నామనోమయూరంబు నీలమేఘవర్ణంబైన నీతిరుమేను దలంచి యానందించుచున్నది. ముత్యపుఁజిప్పలు స్వాతిచినుకులకు నోరు దెఱచినట్లు నావదనశుక్తి మీపాదతీర్థంబునకు వికసించుచున్నది. సర్పంబులు గానంబులుగోరి చొక్కి పడగలెత్తి యాడినట్లు నావీనులు నీకథల నాలకించుచున్నవి. నీవు పరాత్పరమూర్తివి. నేను ప్రకృతిసంబంధంబులైన యంగంబులు ధరియించినవాఁడ. అదియెట్లు గూడునవలదు. ఆప్రకృతికి నీవు చైతన్యమవు. ఈచుట్టఱికము తొల్లి కలుగఁగానే దీనికి ననురాగముం గలిగియున్నది. కన్నెఱుఁగకున్నఁ గడుపెఱుఁగునండ్రు లోకులు. ఇంతియకాని మిమ్ము నెఱుంగ నేమెంతటివారము. నాయానవిన్నవించితి నింతియకాని నిన్ను నేఁగక్కసించినవాఁడగానునుమీ. నమోనమ శ్రీవేంకటేశ్వరా!

గోవిందా! పక్షులకుఁ బుట్టినయపుడే యేయేజాతి యాయావిధంబులం గూఁతలువెట్ట నేర్పినవారెవ్వరు? మృగంబుల గర్భంబులలోనుండి వెడలి తల్లుల చన్నులంగుడువఁగణంగుడెట్లు? పశువుల కసువు మెసంగెడి చందంబెట్టిది? నానావిధవృక్షంబులు మొలచినయపుడు తమతమ యాకారములు పువ్వుదళములుగలిగి తత్తత్కాలంబెఱింగి చెలంగుటెట్లు? అన్నియును మీయాజ్ఞారూపంబులైన ప్రకృతిభావంబునలె నేమును నీరీతినే మీకల్పితములైన దేహంబులు మోచుచున్నవారము; మానేర్పు నేరములు, మాస్వభావంబులు, మాసంసారకృత్యంబులు మీకల్పితములైన, మీప్రభావంబులైన మమ్ముఁదప్పులెంచఁబనిలేదు. నమోనమ శ్రీవేంకటేశ్వరా!

ప్రియునితో

౧

కానుక నాకొసంగు తమకంబునఁ గోసినపూల మార్దవం
బో, నునురాగమో, కలశముంగొని చెట్లకు నీరువోయుచోఁ
బ్రాణసఖుండ! యొత్తికొనురాయిడి నెఱ్ఱఁదనంపుఁగెంపు పెం
పూనిన క్లేశమో నిలిచియున్నది చూడుము నీకరంబులన్.

౨

తమకపుఁ బారవశ్య మెడఁదన్ ముకుళించినకన్నులందు, నా
ట్యము లొనరించునప్పుడు, రహస్యవనాంతరసీమలందు సం
భ్రమమున నన్నుఁ గైకొని భవద్గళమానుకొనంగ నాదుహ
స్తములకొసంగవో, యిఁట నొసంగవా మామకకంకణాంకముల్?

౩

ప్రియసఖ! యేనొకర్తె వనవీధివసింపఁగఁ గాంతునేమొ యన్
భయమున మెల్లగా వెనుకపాటున వచ్చి మదీయలోచన
ద్వయమును గొల్చునట్టిడిన తావకహస్తములందు నీవిగు
ళ్ళయెడపుమీఁది నీలికళలంగనుచుండెలినవ్వు నింపవో?

౪

నాయకుఁడు నాయికయు మనమై యొసంగఁ
జిత్రముఁగ రచించిన యీ చరిత్రమునకు
నేమియర్థముఁ గూర్చెదో యేవిధమునఁ
జెప్పెదో యన్వయము చిరస్నేహశీలి!

౫

నీయెడ వీణతీవియలు నెమ్మి స్పృశించి మనోహరశ్రుతిన్
నాయనురాగమే సరియొనర్చు బలుంగుదు నాత్మలోన; నే
మోయిసఖుండ! నవ్వెదువనొల్లకు! కీర్తిసుఖంబొసంగునే?
యీయెడ నుండి పొమ్ము రచియింతము ప్రేమరహస్యగీతముల్.

—వఝ్ఝల వేంకటేశ్వరకవి, బి.ఏ.

సూరి సిద్ధాంతం. 3.

"బ్రాహ్మణులసంగతి ఏమయిందిచెప్పు! ఒకప్పుడు వాళ్ళలో ఈజీవశక్తి ఉండదగినంతఉండే ఉండాలి. అప్పుడు వాళ్ళు తమచేతులలోఉన్న కర్మయోగాన్ని పట్టుకు ఏడవక, లక్షమందిలో ఒకడికికూడా అందని జ్ఞాన యోగంకోసం పోయినారు. అమితిమీరిన తిండిలో జీవశక్తి మందగించిపోయింది. తద్దినాలుపెట్టించే దేవతాస్వరూప బ్రాహ్మణుడిమొహం చూస్తే నీకు జఠరాగ్నిమందగించిన లక్షణాలే కనబడతై; నాకు జీవశక్తి మందగించిన చిహ్నాలుకూడా కనబడతై. ఈకాలపు బ్రాహ్మణుడు కర్మచెయ్యలేడు. ఆకలిలేనివాడికి ఏపదార్థం రుచించనట్టు ఈబ్రాహ్మడికి ప్రతీపనీ తప్పుగా కనబడుతుంది. మడికట్టుకునివస్తుంటే శాస్త్రపోగు తాలికింపబడగానే వెళ్ళి మళ్ళీ స్నానంచేసివస్తాడు. తనలో జీవశక్తి చచ్చిపోయిందికనక, తన ఆటలు సాగుతున్నైకనక., ఇంకాజీవశక్తి చావని ఇతరకులాలవాళ్ళను ఏపనీ చెయ్యవద్దంటాడు—ఆకలికానివాడు మాడుతున్నవాణ్ణి అన్నంతిననివ్వక పక్కనచేరి అన్నంలో వట్టిగడ్డలు చూపించి అన్నంపారెయ్యమన్నట్టు! ఇతరులుచేసేకర్మకు తనెట్లా బాధ్యుడో?—తనశాస్త్రంప్రకారమే చూసినా!...సనాతనమతంఅన్నవాడినల్లా జైలులో పారెయ్యి! ఒక్క సంవత్సరంలోపల ఈహరిజనుల్లోనుంచి మూపక్‌మాన్ రాకపోతే నాపేరు సూరికాదు!...ఈసారి గాంధి వాళ్ళలోపుడితే ఆశ్చర్యంఏముంది?"

ఒకప్పుడు నేను మనుష్యులంతా మంచివాళ్ళూ చెడ్డవాళ్ళూ రెండురకాలుగా ఉంటారనుకునేవాణ్ణి. కాని మనుష్యులతో నాకు సంపర్కం ఎక్కువయినకొద్దీ ప్రతివాడిలోనూ మంచీచెడూ ఉన్నదని గ్రహించాను. ఇ వొక పెద్ద డిస్కవరీకాదు కాని దీనిమీద కొంత బుద్ధిని ప్రయోగించి నిజమైనడిస్కవరీ ఒకటి చేశాను. మొత్తానికి బుద్ధిని ఉపయోగించటాన్ని గురించి సూరి చెప్పినదాన్లో కొంతలేకపోలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా ఈడిస్కవరీనిగురించి సూరితో ఎప్పుడు చర్చించుదామా అని ఆరాటపడ్డం మొదలుపెట్టాను.

మర్నాడుదయం మొదటికిత్తా పడ్డ తరవాత ఇద్దరం తీరిగ్గా కూర్చున్నాం.

"ఒరే సూరీ! నే నొకొత్తవిషయం కనిపెట్టాను!" అన్నాను.

"ఏమిట్రా అది?" అన్నాడు సూరి పరధ్యానంగా.

'కృతయుగంలో ధర్మం ఒంటికాలిమీద నడుస్తుందనీ రానురాను కలియుగంలో ఒకపాదంతోనే నడుస్తుందనీ నువ్వు నమ్ముతావా?'

'ఒక్కకాలితో నడవటం ఎట్లాఉంటుంది? గెంతుతుందను.'

'ఏడిచావులే! నామాటకు సమాధానంచెప్పు. నీకటువంటి నమ్మకంఉన్నదా?'

'ఆ! ఏం?'

'మరేంలేదు! నే నదిశుద్ధ అబద్ధమని నిరూపిస్తాను.'

'నిరూపించు!' అన్నాడు సూరి ఆశ్చర్యంతో. ప్రతిరోజూ వాడి ఉపన్యాసాలకు గురిఅయే నేను వాడికి లెక్చరివ్వటానికి చాలాగర్వపడ్డాను—కొద్దిగా భయపడ్డాను. మరేంలేదు. దొంగవెధవ! ఏదోవాదన పెట్టి మనడిస్కవరీలు డిస్కవరీలుకావని నిరూపిస్తాడు! మరోవిషయ మేమిటంటే వాడు పురాణాదులతో ఏకీభవిస్తున్నాడంటే ఏదోదొంగఎత్తు ఎత్తాడన్నమాటే! ఎందుకు? ఒకసారినేను మనపురాణాలంటే నమ్మదగినట్టుండవన్నాను. వాడిట్లాగే కళ్ళుపెద్దవిచేసి అమాయకుడల్లే 'ఏం?' అన్నాడు. నేను ప్రహ్లాదచరిత్ర తీసుకుని, ప్రహ్లాదుడు చావకపోవటం, భగవంతుణ్ణి ఎక్కడపడితే అక్కడ చూపిస్తానని చూపించగలగటం, హిరణ్యకశ్యపుడు శాస్త్రోక్తంగా చచ్చిపోవటం మొదలైనదంతా సింబాలిక్ కాని కథ ఎంత మాత్రం నమ్మటానికి వీల్లేదన్నాను. ఇక సూరి తగిలాడు బాబూ! ప్రహ్లాదచరిత్రలో ప్రతి అక్షరం ట్రూ టు

లైఫ్ అన్నాడు. ప్రహ్లాదుడు క్లియర్‌గా సైకిక్ మీడియమ్ అన్నాడు. ప్రహ్లాదుడు చేసిన పనులలో మామూలు క్లేర్ వాయంట్లు చెయ్యలేనివేవీ లేవన్నాడు. నరసింహమూర్తి ప్రత్యక్షం కావటం ఆన్ ది వెరీ ఫేస్ ఆఫ్ ఇట్ మెటీరియలైజేషన్ అన్నాడు. తండ్రిని చంపేటందుకు కావలిసొచ్చిన మెటీరియల్ ఎనర్జీ యావత్తూ ప్రహ్లాదుడే సప్లయి చేశాడన్నాడు. ప్రహ్లాదుడే మళ్ళీ డీమెటీరియలైజేషన్ కూడా చెయ్యగలిగాడు చూడమన్నాడు. ఈ ప్రవాహానికి ఏమడ్డు వెయ్యను? అసలే నాకీ స్పిరిచువలిజం అంటే అమిత అనుమానం. తరవాత దాన్ని గురించి నాకు ఏమీ తెలీదు. ఇప్పుడు కూడా ఇటువంటి దొంగ ఎత్తు ఎత్తి కలియుగంలో ధర్మం నెంటుతున్నది కాని నడవటం లేదని నిరూపిస్తాడని నాకు ఒక చెంప అనుమానం ఉండనే ఉంది... నా ఉపన్యాసం ప్రారంభించాను.

'వెనకటి యుగాల్లో అంతా సజ్జనులయినప్పటికీ, అందరి మంచితనాన్ని కప్పిపుచ్చగల ఒక దుర్మార్గుడుండేవాడు. ఆరోజుల్లో అయితే రాముడూ లేకపోతే రావణుడూ! ఒక్కొక కంటకుడు అనేక వేలసంవత్సరాలు భూమిమీద ధర్మం అన్నమాట వినపడకుండా చేసేవాడు. ఇప్పుడో? ఇప్పుడు రావణుడూ లేడు. రాముడూ లేడు. ప్రతివాడులోనూ కొంత రాముడూ కొంత రావణుడూ ఉన్నాడు. నీ కృతయుగం కంటె ఈ కలియుగమే బాగుంది—నన్నడిగితే!' అన్నాను.

నూరి 'హో! హో!' అంటూ వాడి వెధవనవ్వు నవ్వటం మొదలుపెట్టాడు.

నాకు ఒళ్ళుమండి 'ఎందుకురా ఆ వెధవనవ్వు? చాతయితే నేను ఏం పొరపాటుపడ్డానో చెప్పు!' అన్నాను.

వాడు యథాప్రకారం 'సారీ!' అని నన్ను ఖండించటం మొదలుపెట్టాడు.

'ఓరి పిచ్చిసాయనా! నువ్వు రావణుడివైనా రాముడివైనా నీకు సృష్టిలో స్థానం ఉంది. ఆ రెండు శక్తులూ నీలో ఏకమైపోగానే నీలో లైఫ్‌ఫోర్సు చచ్చిపోయింది. నిన్ను మళ్ళీ కరగవెయ్యవలిసిందే. ఇబ్సెన్ రాసిన పీర్ జెయింట్ చదువు.'

నేను కష్టపడి అర్ధరాత్రివేళ నిద్రలేకుండా చేసిన రిసర్చి యావత్తూ నూరి ఒక్కముక్కలో తేల్చివెయ్యటం నాకిష్టం లేకపోయింది. నేను వాడితో లడాయి వేసుకున్నాను.

'ఒరే నూరీ! నీ పెడతర్కం నాదగ్గిర పనికిరాదు. సృష్టియొక్క ఆదర్శమేమిటి? మంచితనమా, దుర్మార్గమా?'

'నే నావిషయం ఇంకా స్పష్టపడిగా తెలుసుకోలేదు. సృష్టిలో వెలుతురూ ఉన్నది, చీకటీ ఉన్నది. ప్రకృతికి వెలుతురును చూస్తే ప్రేమ గాని, చీకటిని చూస్తే కోపం గాని ఉన్నట్టు తోచదు.

'జయవిజయులను దుర్మార్గులుగా పుడతారా సన్మార్గులుగా పుడతారా అని అడిగితే తడుముకోకుండా దుర్మార్గులుగా పుడతామన్నారు. ఒక్కజన్మలో భగవంతుణ్ణి చేరుకోటానికైనా సరే నీవంటివాడుగా పుట్టటానికంగీకరించి ఉండరు. నామాట నమ్ము. స్వర్గానికీ నరకానికీ దారి ఒకటేనని వాళ్ళకు తెలుసు.'

నేను కాస్సేపు ఆలోచించాను.

'అయితే స్వర్గం నరకం ఒకటేనంటావా? పుణ్యం పాపం ఒకటేనంటావా?'

'మంచీచెడూ ఒకటేనన్నానా? కాదు! నేనన్నదల్లా త్రిశంకుస్వర్గంకన్న నరకమైనా మంచిదేనన్నాను. నీకన్న ఒక రావణుడికెక్కువపదవి ఉందన్నాను ప్రపంచంలో. ఏదో కర్మ చెయ్యి, అజగరవ్రతం మంచిది కాదన్నాను.'

'అట్లా అయితే నువ్వెవర్నీ ఒప్పించలేవు. ఏపనీ చెయ్యకుండా ఉండటం మంచిదంటాను పాడు పని చేసేకన్న!'

'నువ్వు పాడనగానే సరా? నీకు మంచిచెడ్డలను గురించి ఏం తెలుసో చెప్పు. నీకిష్టమైనదంతా మంచీ నీకిష్టంకానిది చెడూ అనుకునేవాడివి మంచిచెడ్డలతో ఏంపనిరా?... నాకు అడ్డంరాకు! అట్లా కాకుండా, నీకు మంచి చెడ్డల్లో స్వర్గనరకాల్లో నమ్మకం ఉందా? నీకు మంచిని చూస్తే ఇష్టమెందుకు? చెడును చూస్తే అసహ్యమెందుకు?'

'దుష్టుడికి దూరంగా ఉండమన్నారు.'

'నీకర్మ అంటూ ఒకటి ఏడిస్తే ఏ దుష్టుడు నీకక్క-

ఉన్నా నిన్నేమీచెయ్యదు. నీకు నీకర్మ అంటూ లేదు. నువ్వు దుష్టుడివి! దూరంగాపోయి నిర్వ్యగ్రపారత్వం వాతపడి త్రిశంకుస్వర్గం చేరతావు.

'ఒక్క ఉపమానంచూడు నీలో ఆకలంటూ ఒకటి పుట్టినప్పుడు ఏదోతింటావు. అది మంచిపదార్థమయితే నీకు సహాయంచేసి బలంఇస్తుంది. అది అరగనిపదార్థమయితే కడుపులో నెప్పివస్తుంది. దానికి మందు పడవలిసివస్తుంది. అది డాక్టరుచేతిమీదిగా ఇవ్వబడటం ప్యూర్ ఆక్సిడెంట్. నీకే చికిత్స చాతయిఉండవచ్చును. అప్పు డామందు నువ్వేపుచ్చుకుని బాగుపడతావు. ఆవిధంగానే నీలో జీవశక్తి, లైఫ్‌ఫోర్స్ ఉంది, జఠరాగ్నిమాదిరిగానే. అది లోపల ప్రజ్వరిల్లుతూంటే ఏదోకర్మ చెయ్యకుండా ఊరుకోలేవు. నువ్వు అన్నంతినేటప్పుడు తెలివిగలవాడివైతే నీకరిగే పదార్థాలుచూసి మరీతింటావు. నీకరిగేపదార్థాలు— గమనించు! ఇంకొకడితో సంబంధంలేదు! అవిచిత్తుగ లేకపోతే కడుపులో నెప్పి వచ్చినట్టుగానే నువ్వు నరకం అనుభవిస్తావు. (ఆనరకంయొక్క తత్వం తరవాత విచారిద్దాం.) దానికూడా మందు కావలిసివస్తుంది. అది నువ్వేతీసుకోవచ్చును లేదా తెలిసినవాళ్ళు నీకామందివ్వవచ్చును. నీలో ఆలైఫ్‌ఫోర్సు—ఆజఠరాగ్ని లేకపోతే నువ్వెందుకు పనికొస్తావు?

'ఇక ఒక్కక్షణం మనవాళ్ళుచెప్పే నరకాన్ని గురించి ఆలోచిద్దాం. మనవాళ్ళు చెప్పేనరకం ఖయిదు హెస్తరుగా ఉన్నది. నువ్వు అరగనిపదార్థాలుతిని కడుపునెప్పితో బాధపడుతున్న వాడల్లేలేవు. దొంగతనంచేసి విచారింపబడి ఖయిదు అనుభవిస్తున్నవాడల్లే ఉన్నావు. ఒక్కటాలోచించు. ఈజైళ్ళు ఏక్షణం పోయినాపోవచ్చును. అది శాశ్వతసంస్థకాదు. మనం పెట్టుకున్నది. మనంతీసేసేది. ఈకడుపులో నెప్పి? ఇది శాశ్వతం. డాక్టరు శాశ్వతం. మందు శాశ్వతం. పైగా మనిషినిపట్టి రోగం. రోగింపట్టి మందు. డాక్టరు నామమాత్రం. వరసగా నూరుమంది దొంగలను తీసుకురా. అందరూ ఒక్కొక్కరూపాయి దొంగతనంచేసినవాళ్ళనుకో మాటవరసకు. నీకు న్యాయం ఏమాత్రమైన తెలిసుంటే అందరికీ ఒకటేశిక్ష ఇస్తావా? ఎప్పుడూ ఇవ్వవు. తల కొకపదిజామకాయలచొప్పున ఒక వంద మందికివ్వు. అందరికీ కడుపునెప్పి వస్తుందా? రాదు. అరిగించుకునేశక్తి ఉన్నవాడు పదిజామకాయలు తీసుకున్నందుకు ఎందుకు శిక్షపడాలి? నేను అరగని పదార్థమే తిన్నాననుకో. ప్రకృతినాకు కడుపునెప్పి ఇవ్వటం సహజంకాని; దొంగలుపడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్టు, తిన్న యాభైసంవత్సరాలకు నేను చచ్చి యమధర్మరాజుదగ్గిర నన్నువిచారించి "అబ్బాయి, మాచిత్రగుప్తుడి లెక్కప్రకారం నువ్వు యాభైసంవత్సరాల ఆరునెల్ల పదిరోజులకింద ఉదయం నాలుగు ఘడియలవేళ పదిజామకాయలు తిన్నావుట! అట్లా నరకంలోకి వెళ్ళి కాస్తకడుపునెప్పి అనుభవించిరా!" అంటే! నాకు కావలిసింది. డాక్టరు! ఆసుపత్రి!—'

'మనవాళ్ళు చెప్పేనరకం నీఆసుపత్రేనేమో?'

'అట్లాఅయితే ఆరోగ్యాలు నయంచేసే పంపిణీఉండవలిసినట్టు ఉండక మనఆసుపత్రుల్లో ఉన్నట్టే ఉందన్నమాట, ఆడాక్టర్లు మనడాక్టర్లకంటే రొండాకులెక్కువ చదివినవాళ్ళన్నమాట!...అటువంటి ఆసుపత్రిలోకి పొమ్మేకన్న రోగమే అనుభవిస్తాను. నాకు మందిచ్చే డాక్టరుకు నన్నుచూస్తే జాలిలేకపోతే, నేను పడుతున్నబాధయందు సానుభూతి లేకపోతే నాకు రోగం నయంకానక్కరలేదు.'

నేను కొంత కంగారుపడ్డాను. సూరి కడుపునెప్పి నొకదాన్ని లాక్కొచ్చి మాట్లాడే మాటలన్నీ ఆముదం కంపు చేశాడు.

'ఆకలయితే అన్నంతినటానికీ, నువ్వుచెప్పే పుణ్యపాపాలకీ నువ్వనుకున్నంత సంబంధంలేదేమో?' అన్నాను.

'మళ్ళీ జాగ్రత్తగావిను! మట్టిబుర్ర! నీలో జఠరాగ్ని ఉన్నట్టుగానే లైఫ్‌ఫోర్స్— తెలుగు లేదు! జీవశక్తి అందాం—కూడాఉంది. ఏమీబాదగ్గిరనించీ రకరకాల జీవకోట్లన్నీ చూస్తూవస్తే ఈజీవశక్తి మనిషిలో ఎక్కువగాఉంది. రేపు మనిషిలోఉన్న జీవశక్తికంటె ఎక్కువ జీవశక్తిగల కొత్తప్రాణి ప్రపంచంలో

రావచ్చును. వాణ్ణి సూపర్ మాన్ అను, దేవతను. వాడి భావాన్ని దేవత్వంఅను. మొత్తానికి ఈఆదిమానవుడి ఛాయలు అప్పుడప్పుడూ కనిపించకపోవటం లేదు. నీ కన్న తక్కువలైఫ్ ఫోర్స్ గల జంతువుయొక్క మంచి చెడ్డలు నీకెట్లాచాలవో, నువ్వు ప్రపంచంలో అడుగు పెట్టగానే ఇతరప్రాణికోటిని నీలైఫ్ ఫోర్సుతో ఎట్లా పక్కకు నెట్టేశావో, అట్లాగే రాబొయ్యే సూపర్ మాన్ నిన్ను అట్లాగే నెట్టేస్తాడు. నువ్వు అసంభవ మనుకుంటున్న పనులన్నీ చేస్తాడు. ప్రపంచకంలో అందరూ సుఖంగా బతకదగినన్ని పదార్థాలున్నాకూడా కొందరు కూడబెట్టుకుంటే నువ్వు వాళ్ళకు భోజనసదుపాయం చెయ్యలేక గుడ్లు పెట్టుకు చూస్తున్నావు. రాబొయ్యేవాడి కది చాలాసులభం. ప్రపంచంయావత్తూ ఒక్కచేసంజ్ఞ చెయ్యగలశక్తి వాడికుంటుంది. వాడిలోనూ చెడుఉంటుంది. అదిఎట్లాఉంటుందో వాడి పోటివాళ్ళు చెప్పవలసిందే. నీలోచెడు నీకన్న తక్కువ లైఫ్ ఫోర్స్ గల జంతువులకేం తెలుస్తుంది. వాణ్ణి చూడగానే నీఒక దేవుడితయారీ మర్చిపోయి వాడికాళ్ళమీద పడతావు—ఇప్పుడు వాడి ఛాయలకాళ్ళమీద పడుతునే ఉన్నావు!

'ఇకతిన్నది అరక్కపోవటం విషయం మాట్లాడదాం. నీకాకలిగాఉన్నప్పుడు తినదగిన దానికన్న ఎక్కువ తింటూవస్తే నీలోఉన్న జఠరాగ్ని చచ్చి మాంద్యం ఏర్పడుతుంది. బ్రాహ్మణుల సంగతి ఏమయిందిచెప్పు! ఒకప్పుడు వాళ్ళలో ఈజీవశక్తి ఉండదగినంత ఉండేఉండాలి. అప్పుడు వాళ్ళు తమచేతుల్లో ఉన్న కర్మయోగాన్ని పట్టుకు ఏడవక, లక్షమందిలో ఒకడికికూడా అందని జ్ఞానయోగంకోసం పోయినారు. అమితిమీరిన తిండిలో జీవశక్తి మందగించిపోయింది. తద్దినాలుపెట్టించే దేవతాస్వరూపబ్రాహ్మణుడి మొహంచూస్తే నీకు జఠరాగ్ని మందగించిన లక్షణాలే కనపడతై; నాకు జీవశక్తి మందగించిన చిహ్నములుకూడా కనపడతై. ఈకాలపు బ్రాహ్మణుడు కర్మచెయ్యలేడు. ఆకలిలేనివాడికి ఏపదార్థం రుచించనట్టు ఈ బ్రాహ్మడికి ప్రతిపనీ తప్పుగా కనపడుతుంది. మడికట్టుకుని వస్తుంటే కాస్తపోగు కాలికిందపడగానే వెళ్ళి మళ్ళీ స్నానంచేసివస్తాడు. తనలో జీవశక్తి చచ్చిపోయింది కనక, తనఆటలు సాగకున్నైకనక, ఇంకా జీవశక్తి చావని ఇతరకులాలవాళ్ళను ఏపనీచెయ్యవద్దంటాడు—ఆకలికానివాడు మాడుతున్నవాణ్ణి అన్నంతిననివ్వక పక్కనచేరి అన్నంలో మట్టిగడ్డలు చూపించి అన్నం పారెయ్యమన్నట్టు! ఇతరులుచేసే కర్మకు తనెట్లా బాధ్యుడో?—తనశాస్త్రంప్రకారమే చూపినా!

'ఇక రోడ్డుపక్కన కూర్చుని దీనంగా చెప్పులు కుట్టేవాడి గతిచూడు. వాడిమొహంలో ఆకలితీరే అన్నంతిననివాడి లక్షణాలున్నై. పాపం, మానవుడు నిర్మించిన యాభైఅంతస్తుల మేడల్లో, డెబ్బైమైళ్ళ వేగంతో పొయ్యే రైళ్ళలో, మూడొందలు గంటకు పొయ్యే కార్లలో, విమానాల్లో, వేదాంతగ్రంథాల్లో, దాన్లో, దీన్లో, వాడి కేం భాగంఉంది? వాడిలో జీవశక్తిని చూస్తే ఎవరికీ గౌరవంలేదూ? వాడిమొహాన మనపాదధూళేనా! వాడిఆకలిని సారాయితోనూ కల్లుతోనూ తృప్తిపరిచి, ఏకొలంబులో జరిగినప్పుడు వోటలు సరికి సంతోషించవలసిందేనా? వాడాస్తితిలో ఉండటానికి సమ్మతిస్తే బాగానేఉండును. అట్లా జరుగుతున్నదా? అన్నం తిననివ్వమన్నామా అని అంటే ఏం లాభం, కంచంకూడా ముట్టుకోనివ్వకుండా! వాణ్ణి నీకు ఆరడుగులదూరంలో పోనివ్వవు! వాడిలో లైఫ్ ఫోర్సు ఇంకా ఎట్లాచంపాలి!'

సూరి ఉద్రేకంపట్టలేక లేచి అటూఇటూ పచారు చెయ్యటం మొదలుపెట్టాడు. వాడిమొహం క్రోధంతో భయంకరమైపోయింది.

'మై-గాడ్! సనాతనమతం అన్నవాడినల్లా జైలులోపారెయ్య! ఒక్కసంవత్సరంలోపల ఈహరిజనుల్లో నుంచి సూపర్ మాన్ రాకపోతే నాపేరు సూరికాదు! బంగారంకావాలంటే పాడుపడ్డ గనులే మళ్ళీమళ్ళీ వెతికితే ఏంప్రయోజనం? కొత్తచోట వెతుకు. వాళ్ళ పాసిబిలిటీస్ పరీక్షించినవాడేడీ! ఈసారి గాంధీ వాళ్ళలో పుడితే ఆశ్చర్యంఏముంది!'

—కొడవటిగంటి కుటుంబరావు.

నిజమైన ఘన కార్యాలు

అలెగ్జాండరు

అలెగ్జాండరు పాంచాలమును జయించాలని వచ్చినపుడు పురుషోత్తము డతన్ని మోహాటించినాడు. ఖండాంతర దేశములను జయించి చీమలపుట్టవంటి అసంఖ్యాక సైన్యము కలిగిన అలెగ్జాండ రెక్కడ? పాంచాలమును దాటియెఱుగని పురుషోత్తము డెక్కడ? కాని అతడు ప్రాణమునకును స్వాతంత్ర్యమునకును ముడివేసికొన్నాడు; తెగించి పోరునలిపి పరమవిరోధిఅయిన అలెగ్జాండరుమన్నన వడసినాడు. నేటికిని గూడ పురుషోత్తముని శౌర్యమును మెచ్చుకొని గౌరవించిన కీర్తి అలగ్జాండరునకు మిగిలినది.

నెపోలియను

నెపోలియనుకూడ ఇట్టి ఘనకార్యా లనేకము చేసినాడు. అతనిచేత ఖైదుచేయబడిన యింగ్లీషు నావికయువకుడొకడు వృద్ధమాతృ సందర్శనమునందు లగ్నమై నమనసుతో రహస్యముగ ఇంగ్లీషుఛానల్ దాటుటకు తెప్పగట్టుచుండెను, అతనిని పరాసువారు పట్టుకొని నెపోలియనుచక్రవర్తిపద్ద పెట్టిరి. చక్రవర్తి యతని వృత్తాంతము యావత్తువిని అతని మాతృభక్తికిమెచ్చి బహూకరించి యింటికిపంపినాడు. నెపోలియను ధరించిన కిరీటాదులు నశించినవి; యేలిన రాజ్యములు విచ్ఛిన్నమైనవి. కాని అతని యీచిన్నకార్యము సువర్ణాక్షరములతో లిఖింపబడి తరతరములవారిచేతను స్మరింపబడుతూన్నది.

ఇట్టిపనులు కరుణతోడను, ధర్మశీలము తోడను నిండినవి; పేరుతెచ్చుకోవలెననే ఆశతో ప్రేరేపబడినవి కావు. క్రియాపర్యవసానమును చూడగానే ప్రేక్షకుని మనసులో ఉదయించిన హఠాత్సంకల్పజనితము లీకార్యములు.ఇవి నిష్కామకర్మలు. చేసినవారికిని, వాని ఫలితము లనుభవించువారికిని గూడ ఇవి సంతతానందప్రదములై వెలయును

గొప్పవారుచేస్తే యిట్టికార్యాలకు గ్రంథాలలో స్థానం సులభంగా దొరుకును. కొలదులుచేస్తే కీర్తింపబడకపోతే సరిపోదు గుర్తింపబడవుకూడా. "గొప్పవారికుక్క చస్తే పదిమందీ వారిని వోదార్చి వారికి కలిగిన తీర్పరానిలోటుకు విచారిస్తారు" అని గోల్డుస్మిత్తు వ్రాస్తే చదువుకుని యింతవిపరీతమా అనుకున్నాను. కాని నాలుగేండ్ల క్రిందట యిండియాకు సహాయమంత్రిగా పని చేసిన రస్సెలు ప్రభువుగారు హిందూదేశవు భావిసంస్కరణాలనుగూర్చి అపందర్భంగా వుపన్యసించారు. కారణమేమా అని నాయకోత్తములు యోచిస్తే ఆరోజునసే శ్రీప్రభువుగారికి అభిమానపాత్రమైన భైరవమూర్తిగారొకరు కీర్తిశేషులైనారనీ, ఆమహావిచారమునమునిగి వారావిధంగా మాట్లాడారనీ సర్దిచెప్పారు. నిజమే. అయితే అయివుంటుందని పదిమందీ అంగీకరించి "పాపం: యెంత కష్టం!" అన్నారు. అది ప్రపంచలక్షణం: కలవారిని కీర్తించుట; లేనివారిని లెక్కసేయకుండా వుండడము.

ఇట్టి వుదారగుణసంపద గొప్పవారి కొకరికిమాత్రమేయిచ్చి తక్కువవారికి భగవంతుడు నిరాకరింపలేదు. అందరికి యిచ్చి ఇష్టమున్నవారు తీసుకోవలసిందన్నాడనుకుంటా.

నండూరి రామారావు పేదవాడు. చిన్ననాడు పెద్దపెద్దవారిస్నేహం చేశాడు. వారి దయావల్ల యిల్లు వొళ్ళూ గుల్లచేసుకున్నాడు.

ఒకనాటి వుదయం ఒకముసలిది రోగిష్ఠి వారియింటికి ముష్టికివచ్చింది. ఏకళని వున్నాడో దాన్నితిట్టి పొమ్మన్నాడు. కాని కొలదిసేపటికే అతనికి తీరని పశ్చాత్తాపం కలిగింది. ప్రతిష్ఠకొరకైనా చూసుకోకుండా వెంటనే వీధులవెంట వెళ్ళి, ఆముసలిని వెదకి తీసికొనివచ్చి ఒకసేరుబియ్యము ఒక అర్ధణాడబ్బులు యిచ్చి పంపినాడు.

కుందూరి వెంకటరత్నంపంతులు

కుందూరి వెంకటరత్నం పంతులు చిన్నప్పుడు మిక్కిలి కష్టపడి చదువుకున్నాడు. ఎఱిగి అనృతమాడనివాడని నిశ్చయముగ చెప్పవచ్చును. ఒకనాటిరాత్రి అతను స్నేహితులు కొందరు గలసి కూర్చుండిరి. అచటికింకొకడువచ్చి అందున్నవారిలో ఒకనిని పిలచి రహస్యముగ పదినిముషాలపాటు మాట్లాడి వెళ్ళెను. వెళ్ళిన కొలది కాలమునకే అతడు హత్యచేశాడనీ దానికి సలహా వెంకట్రత్నంగారిస్నేహితు డిచ్చాడనీ వదంతి బయలుదేరింది. కేసుపెడతారనుకుని ఆసంభాషణ జరగనేలేదని చెప్పమన్నారు వెంకట్రత్నాన్ని. కాని ఆసూనృతవాది ప్రాణత్యాగమునకైనా వొప్పుకున్నాడుగాని అనత్యముపలుకుటకు ఇయ్యకొనలేదు.

వేదుల సత్యనారాయణశాస్త్రి

వేదుల సత్యనారాయణశాస్త్రియెడ లక్ష్మికి మిక్కిలి విముఖత. ఒకమాటీతడు రెండు రోజులు తిండిలేకుండా గడిపాడు. చేతులో అర్ధణావుంటే సాయంకాలము వేళ రెండు మినపరొట్టెలు కొనుక్కొని తిందామని బజారుకువెళ్ళి రొట్టెలతో వస్తూంటే అతన్ని మించిన దీనురాలొకతె చేయిచాచింది. ఆ భావుకుడు ఆనీరసస్థితిలోకూడా కరగి నీరయి ఒకరొట్టె దానిచేతిలోపెట్టి రెండవది తాను తిని నీళ్ళుత్రాగుదామని గోదావరికివెళ్ళాడు.

వీరేశలింగంపంతులు

వీరేశలింగంపంతులుకిన్నీ కొక్కొండ వెంకటరత్నంపంతులుకిన్నీ సంఘసంస్కరణం విషయములో యెప్పుడూ షష్ఠాష్టకమే. కాని అంతమాత్రంచేత వీరేశలింగం పంతులు వెంకట్రత్నంపంతులుతో ప్రతివిషయంలోనుకూడా వేర్పాటుగావుండి గృహస్థమార్గోచితమైన సహాయసంపత్తులను నిరాకరించే లఘుమతిగాడు. వెంకటరత్నంపంతులు వృద్ధాప్యంలో డబ్బుకు చాలా కటకటపడ్డాడు. యూనివర్సిటీపేపర్లు వచ్చేవి దిద్దుబాటుకొరకు. కాని వానిని దిద్దే వోపిక లేకుంటే వీరేశలింగంపంతులు దిద్దిపెట్టి వెంకట్రత్నంపంతులుకు సాయంచేసేవాడు. ఇది యెందరకు తెలుసును?

సర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు

కొందరు తాముతాముచేసే పనులన్నీ గుప్తముగా వుంచుతారు. సర్ రఘుపతి వెంకటరత్నంనాయుడుగారిట్టివారే. ఆయన వుద్యోగంలోవున్నప్పుడూ రిటైరయిన తర్వాతాకూడా యెంతరాబడివుంటే అంతా ఖర్చుపెట్టడమేగాని నిలవచేసుకొనడము నెరగరు. అనాథలు, దుఃఖితులు తమకష్టాలను గూర్చి వుత్తరాలువ్రాస్తే వీరిహృదయం వెన్నవలె కరగిపోతుంది. ఒకటవతేదీవరకు వచ్చిన వుత్తరాల వరవడిని తనకువచ్చిన డబ్బంతా పంచిపెట్టడమే. అర్థులు పరిచితులా అపరిచితులా అనే విచారణలేదు. కష్టంలో వున్నారంటే ఆయనదయావృష్టి వారిమీద కురియవలసినదే.

వాకిటిలోనికి కుక్కవచ్చినంతమాత్రాన దానికాలు విరగవేస్తాము; చేనుగట్టువంక మోరయెత్తి పశువుచూస్తే దానికి దండతాడనం తప్పదు; వృద్ధాప్యంవచ్చిన ఆవునుగాని యెద్దునుగాని రైతు తనవద్ద వుంచు

కోడు. యౌవనమంతా తమబండిని లాగుటతో గడపిన యెద్దునుగాని, గుఱ్ఱాన్నిగాని వృద్ధాప్యంలో పనిమాన్పించి పోషించిన వివేకులెందరున్నారు? వీరేశలింగంపంతు లొకడు, చిత్రపు వెంకటాచలంపంతు లొకడు. వీరేశలింగంపంతులు తనముసలియెద్దును, వెంకటాచలంపంతులు తనముసలిగుఱ్ఱాన్ని చివరకూ జాగ్రత్తతో మేపి మన్నుచేశారు. వెంకటాచలంపంతులువద్ద పాతికముప్పైయేళ్ళనుంచి పనిచేస్తున్న గుఱ్ఱపువాడున్నాడు. గుఱ్ఱపుబండి తీసివేసి మోటారు పెడితే వాడిని మాన్పింపవలసి వస్తుందని మోటారు కొనకుండా గుఱ్ఱపుబండితోనే తనకాలముగడపి ధన్యుడైనాడు. ఒక సేవకుని క్షేమముకొరకు తనవిలాసతృష్ణను అడచిపెట్టుకొనిన యజమాని మందుకైనా దొరక డీరోజులలో.

ఘనకార్యాలు చూచుటకు మఱ్ఱివిత్తనాలవలె మిక్కిలి సూక్ష్మములు. అవి మొలకలెత్తిన అనంతరగఫలితాలు మిక్కిలి సుఖకరములు; ఉభయలోకతారకములు. మహావృక్షములయి ఎందరికో చల్లనినీడ నిస్తవి, ఎన్నిజీవరాసులకో నివాసమై రాణిస్తవి. అటులే యిట్టి ఘనకార్యాలు మిక్కిలి చిన్నవైనప్పటికి—మనస్థూలదృష్టికి చిన్నవిగా కన్పిస్తవిగాని అణువులలో అణువును, స్థూలములలో స్థూలమును అయిన వాను దేవుని దృష్టిలో మిక్కిలి ఘనముగానే చూపట్టుతవి—ఐహికాముష్మికములను సాధింపగలవిగా వున్నవి. జీవితమునందలి స్వల్పవిషయములలోగూడ దయాసత్యశౌచములను స్థిరముగ ప్రతిష్ఠించుకొని నడువగలిగినవారే ధన్యాత్ములు. వారే ఆదర్శపురుషులు, అనుకరణీయులు, చిరస్మరణీయులు.

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

విముక్తి

ఆమె యేడేండ్ల బాలిక.

ఆమె చికురములలో మల్లెపూవులు కిలకిల నవ్వుచుండెను. ఆమె చెక్కులలో గులాబిరేకుల శోభ. ఆమె కనులలోఁ కలువరేకుల నిగనిగ, హారిద్రవర్ణభూషితమైన యామెనుదుట నుదయభానునిఁ బోలిన కుంకుమబొట్టు తళతళ, ఆమె మెడలో మాంగళ్యంపు మిలమిల, ఆ యమాయిక బాలికా సౌందర్యమునకు మనోహరత కూర్చుచుండెను.

విద్యుత్ప్రవాహమున వచ్చిన వార్త యాయింట నశనిపాతము. ... ...

ఆమె కన్నులలో బెదురు. ఆమె చేతులు వడకుచుండెను. అద్దముముందు కూర్చుండి యామెతలలో గబగబ పూవులు ముడుచుకొనెను. నుదుట పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొనెను.

నీటికైపోయిన ముసలమ్మ యప్పుడే తిరిగివచ్చినది. 'ఏమో యాదారుణపుపని. పువ్వులతీసి పారవేయుము. బొట్టు చెరుపుకొనుము, ఊఁ' అని గర్జన. 'పెట్టుకుంటేయేమీ?' అని యాబాల బిక్కవోయిన మోముతో ప్రశ్నించినది.

అవశ్యకతానిగళబంధితమును దురాచారకఠినశిలాకుడ్యపరివేష్టితంబును అగు నిమ్నహావిశ్వసాంఘికదేవతావిముక్తికై 'పెట్టుకుంటేయేమి?' అను ప్రశ్నతో ప్రయత్నించిన యాముగ్ధబాలికావాక్యములకు నా హృదయము స్పందించినది.

—వజ్ఝల కాళిదాసు.

బీహారము

మారవుదీవు లెయ్యెవియొ దూఁగునటంచును విరిదుమార! యీ
భారతధారుణీరమణి బంధురకంఠవిహారహారి బీ
హారము బ్రహ్మవేత్తజనకావనిభుక్కృతశస్త్రమోక్షుల
శ్రీరమణీయరంగతలి గీడ్పడు నిట్లని యెంతుమే? యహో!

మహితపతివ్రతాజనము మన్ననఁగన్నులఁగొన్న జానకీ
మహిళ భవత్సమాయుతసమస్తశుభంబుల పంటగాదె! త
త్తుహినకరాస్య కూరుములు దోఁగెడుపుట్టిలుగాదె యిద్ది! యి
ట్లహితముగూర్పఁగాఁ దలఁచి తంతశివంబకొ నీకు ధారుణీ?

తనరాజన్నవయౌవనంబు గని మందాక్షాలసేక్షాతతిన్
మనమించించుక దెల్పు భూరమణి నాత్మప్రేమబింబంబు మో
హనమూర్తిం గనుగందునందనుఁ దృణప్రాయంబుగావీడు ధ
న్యుని బోధామృతమాని త్రేనిచిన నీకో యీవగల్ మాగధీ?

చంద్రికాతపముల చనుపకాగుడిసెలతోఁ భర్మహర్మ్యముల్ సుడిచిపెట్టి
కనులనూపిరిదాల్చు కటికిపేదలతోడ విత్తాధిపుల నొక్క వేదిఁగూల్చి
పొడచూడఁగారాని కడపటిజాతితోఁ భూసురాన్వయమును బొదివిమెదిపి
వా యెఱుంగని నరవ్రాతంబుతోఁ గనుల్దలఁగల యధిపులఁగలిపి మట్టి
తెప్పపాటునఁ బురములు గుప్పఁగూల్చి చెరువుమరువులు తలక్రిందు చేసి యిట్లు
వీరవిహరణ నెఱప మానేరమేమి? పరమకరుణాసమేత! ఓ ప్రకృతిమాత!

నేఁటికిటు లూగెలలనూఁగ నీకు బుద్ధిపొడమెనో ధాత్రి! మొన్నటి బొట్టెవోలె,
నంకతలి పుత్రకుల నింత యదరవలదె యీవె యిటులైన మాకు దిక్కెది? తల్లి!

కడచినదానికి వగచినఁ గడచనునే యడలుకడలి కానున్నది యేఁ
గడమవడునె? బీహారమ! యుడుగుము వలవంత దిటవునూనుము యింతన్.

తనజననీమణీస్తనసుధారసమాని సంబరంపడుచున్న చంటిపాప
తనభావిసుఖపరంబునుగోరి బొమ్మలఁగొలిచి యూలాడించి కులుకుఁగన్నె
తనవలపులరూపుఁగని యూలమున నేత్రముల మేలమాడెడు ముద్దరాలు
తననోముపంట బిడ్డను గుస్తరించుచు బిగియఁగౌఁగిటనొత్తు మగువమిన్న
ఏఁడుఁగాలంపుఁ దనశ్రమ యిటుపండె ననుకొనుచుఁ బైరుపచ్చలఁ గనెడు రైతు
నట్టె లిలకించులోపల నిట్టె పొట్టఁబెట్టుకొంటి వదేమి పాపిష్ఠిభూమి!.

—వడ్లమూడి వేంకటరత్నము.

'తప్పేమున్నది?'

ఆయన పేరు హనుమయ్య. చాలమంచి బ్రాహ్మడు. అట్టేచదువుకున్నవాడు కాడు. చదువంటే ఇంగ్లీషని కాదు. తెలుగుకూడ నట్టులేకుండా చదువలేడు. అక్షరాలుగుణింతపట్టి మెల్లగా వెళ్ళదీసినా చదివినదాని అర్థమసలే తెలియదు. మంచిబలశాలి. కాయకష్టమెంతైనా పడగలవాడు. కొద్ది భూవసతి ఉన్నది.

ఆయన భార్యపేరు మహాలక్ష్మమ్మ. ఆమె హనుమయ్యగారికంటె ఉదాసీనగా అవుపడుతుంది. ఏదైనా వస్తువు ఇంట్లోకి కావాలని హనుమయ్యగారికి తోచి తీసికొనివచ్చినతర్వాత ఇరుగుపొరుగమ్మలక్కలతో "ఏమేవ్! కావమ్మ!! ఫలానివస్తువలేక ఇంట్లో మహా అవస్థపడుతున్నాము. నిన్న కంచరవాళ్ళొచ్చారు. అప్పుడు మీఅన్నయ్యతో చెప్పి ఇది కొనిపించానే." అని లేనిపోని పెత్తనం నెత్తినవేసుకొనేది. నిజానికి ఆవస్తువు కొనేవిషయంలో ఆవిడ అభిప్రాయమైనా పుచ్చుకునేవాడు కాదు హనుమయ్యగారు. ఆమె ప్రతివిషయంలోనూ ఇంతే.

ఈదంపతులకు ముగ్గురు మగపిల్లలు, ఏడుగురు ఆడపిల్లలు—వెరసి పదిమంది.

కాపురం పెద్దదైంది. ఉన్నభూవసతితో ఎనిమిది నెలల గ్రాసం గడుస్తుంది. తక్కిన నాలుగు నెలలకు సరిపోను సంపాయించాలి. అందుకుగాను స్వంతవ్యవసాయం మొదలుపెట్టాడు హనుమయ్యగారు. శక్తికిమించి కష్టపడేవాడు. కాని అదృష్టము చిన్నచూపు చూచింది. కాలివస్తే గొప్ప. అదీ చేతిదిపడితే లంగు. ఇతరులకంటె ఎక్కువకష్టమే పడేవాడు. గ్రహవీక్షణ సరిగా లేకపోతే కష్టానికి తగినఫలితమురాదు. బ్రాహ్మణవ్యవసాయమన్నమాట సార్థకమైంది. దెబ్బతిన్నాడు బ్రాహ్మడు.

మొదటిముగ్గురికూతుళ్ళ పెళ్ళిళ్ళుచేశాడు. తాను దమ్మిడీకట్నము ఇవ్వలేదు దమ్మిడీపుచ్చుకోలేదు. సాలంకృతకన్యాదానాలు చేశాడు. బ్రాహ్మడు బీదతనంలో ఉన్నా శాస్త్రోక్తంగా చేశాడన్నారంతా. తరువాత ముగ్గురికూతుళ్ళపెళ్ళి ఎదురుకొదురిచ్చి ముగ్గురికొడుకులపెళ్ళిళ్ళుకూడా పూర్తిచేశాడు. శాస్త్రోక్తముగాకపోయినా ఇంతకంటె చేయతగ్గది లేదన్నారంతా.

దానాదీనా రెండువేలపైకి దాకొన్నది అప్పు. ఏ సంవత్సరం రాబడి ఆసంవత్సరం తిండికి చాలక అప్పు తీసుకురావలసివస్తున్నది. పెద్దపత్రంలోకి ఏమాత్రం చెల్లులేకపోగా కొత్తఅప్పులు బలమౌతున్నవి. అప్పులకు వడ్డీలు పెరుగుతున్నవి. కొద్దిరోజులలో ఉరుము మునిగేట్టు తోస్తున్నది. బడిత్తొట్లోపడ్డ ఎలుకలాగా కొట్టుకుంటున్నాడు హనుమయ్యగారు. ఏమీతోచక కొట్టుకోటమే నిలిచిందిగాని మార్గమేమీ అవుపడలేదు. కాని మహాఆవేదన పడుతున్నాడు.

• • •

శేషగిరిరావుగారు యఫ్. ఏ పరీక్షలో ఉత్తీర్ణులై కోర్టుయిలాకా ఉద్యోగముచేశాడు. మంచిదైవభక్తిగలవాడు. వేదాంతంలో కొంతవరకు పరిశ్రమచేశాడు. ఉద్యోగరీత్యా బాగాడబ్బుసంపాదించి బెజవాడలో చక్కని మేడగట్టాడు. మేడగాక పైగా పది పదిహేనువేల రూపాయలు కిమ్మతుగల ఆస్తి సంపాదించాడు. చనిపోయినా, జ్ఞాపకమువచ్చినప్పుడు "మహా దొడ్డమహారాజు. చల్లనివేళ తలపుకువచ్చాడు, చెయ్యెత్తిదణ్ణంపెట్టొచ్చు" నంటూ రాయననుగురించి.

ఆయనభార్య కామమ్మ గయ్యాళిగచ్చపొద. ఆమెనుచూస్తే ఆయన హడలిపోయేవాడు. ఆమహాతల్లి కన్నకన్నవాళ్ళకాళ్ళు పట్టుకొని, అవుపడ్డ రాయిరప్పకల్లా మ్రొక్కి కన్న దొకసుపుత్రుణ్ణి.

వాడికి ఇరవయ్యేండ్లనాటి సంగతిది.

మనిషియావత్తూ నాలుగున్నరడుగుల పొడవుంటాడు. తలకాయ పసిపిల్లవాడి తలకాయంత లావుంటుంది. మొహం కోతిని గెలిచి తెచ్చుకున్నాడు. కళ్ళు,

ముక్కు, నోరు, అన్నీ ఉన్నవి ఊరుములు. నోరు చక్కగా అన్నంతినడానికి పనికివస్తుంది. మాట్లాడబోతే గంటకోమాట బయటపడుతుంది. అదైనా సాంతంగా మూగిగాక, సాంతంగా రాగగాక సంగిమాటలు. చేతులు మెలికిపోయి మధ్యకు వంకరపోయిన మిల్లిగరిటెల్లా ఉంటవి. కాళ్ళు మోకాళ్ళదగ్గర వంకర. సాఫీగానిలబడలేడు. అడుగుపెడితే అడుగడుగుకు పడిపోతాడేమో ననిపిస్తుంది. కాని పడిపోకుండా నడవడం చాలామంది చూశారుట. కామమ్మ చెప్పడంమాత్రం "మా అబ్బాయి ఇవ్వాళ పాలెంవెళ్ళి పెరుగు తెచ్చా"డంటుంది. ఆ పిల్లవాడికి మొత్తంమీద ప్రపంచధోరణి ఏమీలేదు. కాకపోతే "అబ్బాయి! ఇదిగో సెయ్యి" అంటే చెయ్యిపట్టి "సెయ్యి" అంటాడుగనుక మనిషి అనుకోవాలె.

ఈసుపుత్రుడివల్ల తనభర్తకోవ సాగవలెనని కామమ్మగారి ఆశయం. అందువల్ల అనేకవిధాల ప్రయత్నంచేసింది పెళ్ళిచేద్దామని. ఎవ్వరూ ఇచ్చారుకారు.

విచారణవల్ల హనుమయ్యగారి దగ్గర ఒకపిల్ల ఉన్నట్టు తెలిసికొన్నది. పనిపడా వాళ్ళ వూరువెళ్ళి హనుమయ్యగారిని కలుసుకొని మాట్లాడి "మాఅబ్బాయికి పిల్లనిస్తే రెండువేలరూపాయలిస్తా"నన్నది.

పిల్లవాడిసంగతంతా తెలుసు హనుమయ్యగారికి. ఇల్లాంటిపని ఇదివరకెప్పుడూ చేసినవాడుకాడాయన. ఇదివరకు చేసినవన్నీ సాలంకృత కన్యాదానాలు. దమ్మిడీపుచ్చుకోలేదు, దమ్మిడీయివ్వలేదు. ఇప్పుడీగడ్డి ఎట్లాతినేదా అనిపించింది. "ఇదివరకెన్నివేలు నా కుటుంబానికి ఖర్చుకాలేదు! ఇంకా ఎన్నివేలుకావు!! వెధవ ఈరెండువేలూవచ్చి నన్ను ఉద్ధరిస్తవా? ఉద్ధరిస్తేమాత్రం నాకుగాను ఒకచిన్నపిల్లగొంతు అజన్మాంతం కోయ్యనా? ఛీ! ఈపని నేను చెయ్య"ననుకొన్నాడు. ఈవిషయం వినగానే కలిగిన భావాలివి.

తిరిగి ఆలోచించాడు. "రెండువేలిస్తానంటున్నది కామమ్మగారు. రెండువేలతో అప్పు చాలావరకు తీరిపోతుంది. చాలాభారము తగ్గుతుంది. ఎల్లకాలం ఆడపిల్లలు నాయింట్లోఉండరు. వాళ్ళయిళ్ళకు వాళ్ళు కాపురాలకు వెళ్ళుతారు. ఖర్చుతగ్గడానికి అవకాశమున్నది. అప్పుడు సంవత్సరానికింతని మిగిలిన అప్పు తీర్చ-కాని కూతుళ్ళు వెళ్ళితే కోడళ్ళు కాపురాలకువస్తారు. సంవత్సరానికొకసారి ఏకూతురినో ఒక కూతురుని పురుడుకో పుణ్యానికో తీసుకురావలసి ఉంటుంది. కనుక ఖర్చుతగ్గడానికి అవకాశంలేదు. కామమ్మగారి కొడుక్కు పిల్లనిస్తే వా రాస్తిపరులుకావడంచేత తన కాపురంఖర్చులు, పైయితరఖర్చులు వాళ్ళింట్లోజరుపుకుంటూ అప్పుపోయిగా తీర్చుకోవచ్చు. పైగా కామమ్మగారు ఎట్లాఅయినా ఆడది. తా నజమాయిషీ చేయవచ్చు." ఈ అభిప్రాయాలు ఆయనమనస్సుకెంతో ఉత్సాహమిచ్చినయి. దానినుండి తప్పించుకోలేకపోయినాడు.

ఈ అభిప్రాయానికి అనుకూలంగా ఆలోచించడానికి మొదలుపెట్టాడు. 'పిల్లకుమాత్రంఏమి? పెద్దమేడ. ఇల్లంతాగచ్చు. దొడ్లోబావి. కాలుబయటికి కదపాలిసిన అవసరంలేదు. కావలసినన్ని సొమ్ములుపెట్టుకోవచ్చు. ఎండకాలంలో మేడమీద హాయిగా పడుకోవచ్చు. సంవత్సరానికి పదిపుట్ల గింజలొస్తవి. తానింత తిని ఇతరులకింత పెట్టవచ్చు.'

"సరే" నన్నాడు హనుమయ్యగారు. లలితకు—హనుమయ్యగారి కనిష్ఠపుత్రిక——కామమ్మగారి కుమారుడికి మహావైభవంగా వివాహమైంది. బ్రాహ్మడు చెయ్యరానిపని చేశాడన్నారంతా.

* * *

తరువాత ఆరుసంవత్సరములనాటికథ.

లలితకు తల్లిపోలికవచ్చింది. చాలతెలివిగలపిల్ల. సంస్కృతం, తెలుగుసాహిత్యాలలో చక్కని ప్రవేశం కలిగించుకున్నది. రెండుభాషలలోనూ గొప్పగొప్ప గ్రంథాలుచదివి లలితభావాల నలవరుచుకుంది. "పతే దైవమని, పాతివ్రత్యమే సతికి భూషణమని" ఉత్తమ గ్రంథాలుద్ఘాటిస్తున్నవి.

లలిత కిప్పుడు పదిహేనోయేడు. అత్తవారింట్లో కాపురంచేస్తున్నది.

కామమ్మగారు వంటచేసి రాత్రి ఏడుగంటలకు కుమా

రుడికి భోజనం పెట్టారు. అలితభర్తను చేయికడుక్కోనున్నీళ్ళు, తుడుచుకోను తుండుగుడ్డయిచ్చి అవి స్వట్లోనే కూర్చొని భోజనంచేసింది. తరువాత ఇంట్లో పనిపూర్తిచేసి బయటికి వచ్చింది.

సాయంత్రం అయిదుగంటలకు తలదువ్వుకొని జారుకొడవేసుకున్నది. కాని యిప్పుడుమళ్ళీ అద్దంముందుకు వెళ్ళి చెంపలుదిద్దుకున్నది. పమిటకొంగులో నుదురు, కళ్ళక్రింద, ముక్కుమీద గట్టిగాతుడుచుకుని మళ్ళీ అద్దంలో చూచుకున్నది. కాటుకపెట్టుకోనిలోపముస్పష్టముగా అవుపడది. వెంటనే భొట్టుపెట్టెలోనుంచి కాటుకకాయతీసి చక్కగా తీర్చినట్లు కాటుకపెట్టింది. మళ్ళీ చూచుకున్నది తననుతాను అద్దంలో. బయటికిపోయి పూలతీగనున్న ఎర్రనిపూలు ఆకులతోకూడకలిపి పట్టెడైతే జడలో తురుముకున్నది. లోపలికివచ్చి పెట్టె తీసి అదికాదని ఇది, ఇదికాదని అది నాలుగుచీరలుకాదని బ్లు ఆగ్రాచీర బాగున్నదని కట్టుకున్నది. తననుతాను అద్దంలో నాలుగోసారిచూచుకున్నది. తనఅందానికి తానే ముగ్ధురాలైపోయింది ఏవేవో భావాలు ఒక్కసారిగా ముసురుకొని వచ్చిన దామెకు. ఆగలేక ముందు కొకఅడుగు వేసింది. కాని చీరకట్టుకుంటున్నప్పుడు తల



కుదిగిలి తలచెరిగినట్లు తోచింది. మళ్ళీ వెనుకకువచ్చి తలచక్కగా దువ్వుకున్నది. దువ్వుకుంటూతన ప్రతిబింబాన్ని చూచినప్పుడు ఏగింత భావాలువచ్చినవో, కంటివెంట ఒకనీటిబొట్టు జారింది ఆమెకు. కొలకుల నుంచి చెక్కిళ్ళమీదికి జారిన కన్నీరు తుడుచుకుని బయలుదేరింది తనదైవాన్ని సంతోష పెట్టడానికి.

మంచముమీద ఒకప్రక్కకుఒదిగి పడుకొని నిద్రపోతున్నాడు భర్త. మెల్లగా తట్టిలేపింది. అందరకువలెనే కళ్ళునలుపుకుంటూ, ఒళ్ళువిరుచుకొని, ఆవులించి నిద్ర లేచాడు. "తనభర్తకూడ మనిషే. అట్టేభయపడవలసిన అవసరములే"దనుకున్నది. తమలపాకులు సేవింపనిచ్చింది. మేకమాదిరి నములుతున్నాడు. తానూ సేవించింది అధరోష్ఠము ఎర్రగా దొండపండులాగు పండి తన అందాన్ని ద్విగుణీకృతముచేసింది. మంచముదిగి ఊదుకడ్డీలు వెలిగించింది. అవి గదంతా కమ్మనివాసనలు వెదజల్లుతున్నవి. అత్తరుబుడ్డితెచ్చి అతనిమీద తుమ్మరించింది. తాంబూలసేవనముకాని, వాటిసౌరభాలుకాని అతనిలో ఏమీకదలిక కలిగించలేదు. ఈకమ్మనివాస

నలు లలిత తలకెక్కినవి. తాంబూలసేవనం వాటికి తోడైనది. దీనా, దానా ఆమెకు పిచ్చెక్కుతున్నది. మంచముమీదికివచ్చి అతనినిగట్టిగా ఆనుకుని కూర్చొని తన మృదులహస్తముతో అతనిదేహాన్ని వివిధప్రదేశాల తాకింది. అస్పర్శాసుఖానికి ఆమెఒళ్ళు జలదరించింది. కనులు విశాలములైనవి. ముక్కుపుటము లదురుతున్నవి. హృదయముతటతట కొట్టుకుంటున్నది. కాళ్ళు వణుకుతున్నవి. అతనిలో ఏమికదలికలేదు. ప్రాపంచికసౌఖ్యాలు తననుకదపజాలని బుద్ధీశ్వరుడులాగున్నాడు. తనచేత్తో ఆమె అతనిప్రక్కను తాకీతాకకుండా అతనికి గిలిగింతపెట్టింది.

“ఏమిటీ చక్కిలిగిలి పెడతావు” అన్నాడు అతను నంగిమాటలతో కోపంగా.

తాను ప్రేమించేది చెక్కగాని, రాయిగానిగాదు. పైకగపడకుండా లోనదాగిఉన్న యౌవనాని కుద్వేగం కలిగించగలనేమోనని ఆశకలిగింది. తనహృదయోద్వేగాన్నాపుకోలేక పైబడి ముద్దుమీదముద్దుగా వేయి ముద్దులు పెట్టుకున్నట్టు పెట్టుకున్నది. పెట్టుకుంటున్న కొద్దీ తన్నుతాను మరచిపోతున్నది. తల దిమ్మెక్కినది. ముచ్చెమటలు పోసినవి. ఒళ్ళంత గజగజ వణికిపోతున్నది. ఒళ్ళువేడెక్కింది. అతన్ని కౌగిటిలోకి తీసుకొని ఎదురురొమ్మునకు గట్టిగా అదుముకొన్నది. కళ్ళు వాటంతటవి మూసుకుపోయినవి. పెదవులు కదలుతున్నవి. ఒకక్షణమాత్రం అతనికౌగిటిలో చైతన్యములేని ఒక పదార్థములాగుండిపోయింది. అతనిలో మాత్రమేమీ కదలికలేదు.

కౌగిలివిడిచి, ప్రక్కకుతిరిగి కళ్ళుతెరిచేటప్పటికి జలజలాజారింది కన్నీరు.

“నన్ను ఇలాంటివాడి కెందుకివ్వాలి తనతండ్రి ఎరిగి రెరిగి? తనమీదతీసుకున్న రెండువేల రూపాయలు ఆయన్నేమి బాగుచేసినవి? ఆయనస్థితి ఇప్పటికీ అప్పటికీ ఏమీలేదాలేదే? ఉండేమాత్రం తన్నిలా అన్యాయంగా గొంతుకోయడాని కాయన కేమధికారమున్నది? ఆయన్ననడమెందుకు? పాపము! నాపూర్వకర్మ ఫలితమిది. క్రిందటిజన్మలో ఎవరికాపురానికి ఏంచేటు తెచ్చానో? ఈజన్మలో ఇది అనుభవించకతప్పదు. ఈ జన్మ కిక యింతే.” ఈతుది అభిప్రాయాన్ని సహించలేకపోయింది. తనయౌవనోద్రేకాన్ని ఎట్లా అణుకుంటుంది. ఎన్నాళ్ళని ఇట్లా ఉండగలుగుతుంది. ఏక్షణానికి ఏమితప్పుచేస్తుందో, ఏంపాపము మూటగట్టుకుంటుందో. హృదయం పగిలిపోతున్నది. ఒకపావుగంట మంచంమీద బోర్లపడుకుని వెక్కివెక్కి ఏడ్చింది. తల క్రింద తలగడ తడిముద్దయింది.

పైకి ఏడ్చినందువల్ల మేఘంలేని ఆకాశములాగయింది తనహృదయము. అక్కడ అప్పుడేవిధమైన భావాలులేవు. హృదయానికి శూన్యత్వమావేశించింది. ప్రపంచంలో శూన్యప్రదేశ మెక్కడనేవుండడానికి వీల్లేదు. క్రొత్తభావాలు తరుముకొస్తున్నవి. వాటిని తోసివేయడానికి మంచందిగి బీరువాలోనుంచి చేతికొచ్చిన పుస్తకంతీసింది. మహాభారతము ఆదిపర్వము చేతికొచ్చింది. కళ్ళుమూసుకుని పుస్తకంతెరిచిచదివింది.

పాండురాజు తనకుగాను ఏదేవుణ్ణయినా ఉపాసించి కుమారులను కనమని ప్రతిమాలుతున్నాడు కుంతిని. ఆమె తప్పని అనుమానించింది. పాండురాజు, భర్త ఆజ్ఞప్రకారం చేస్తే తప్పుగాదని సప్రమాణంగా నిరూపిస్తున్నాడు. కుంతి చాలసేపు పరపురుషుణ్ణి సంతానమివ్వమని కోరడానికి ఒప్పుకోలేదు. పాండునృపతి ఉదాహరణలమీద ఉదాహరణ లిస్తున్నాడు. ఒకంతకు కుంతి ఒప్పుకున్నది. తనకు దూర్వాసమహాముని యిచ్చిన మహామంత్రంయొక్క ఉపాసనాఫలితంగా ఏదేవుడి దయనైనా పొంది కుమారుల్ని కంటానని వాగ్దానము చేసింది పాండురాజుకు.

అసహాయులకు దేవుడే సహాయం. లలిత కాకథలో దేవుడుతనకు చూపించినదారి కనుపడ్డది. కన్నుని ఆమె పెదవులమీద చిరునవ్వు తాండవమాడింది. ఉషారుగా లేచి మంచము సమీపించింది. నిద్రపోతున్న భర్తను గట్టిగా తట్టిలేపి “నీకు కొడుకులు కావలెనా!” అన్నది ఆవేశంతో. అతని కేంఅర్థమైందో, ఏంకాలేదో “ఆ” అన్నాడు. “ఆ అంటే కావలెనా” అంది. “కావలె” నన్నాడు. ఆమెమోహం తేజోవంతమైంది.

* * *

వీరింటిప్రక్కనే నివసిస్తున్నాడు కృష్ణమూర్తి. కలెక్టరాఫీసులో గుమాస్తా. పచ్చగా, పన్నగా ఉంటాడు. అతనిక్రాపింగు మొహంమీదికి వాలిఉంటుంది. వెంట్రుకలలోనుండి అతనుపెట్టుకున్న ఎర్రనిసిందూరపుబొట్టు అవుపడుతూఉంటుంది. అతనిముదురు వెంట్రుకల చాటున దోబూచులాడుతూ ఉంటుంది. అతని మొహానికి అందం అతనికళ్ళు. మనిషిచాలా నాజూకుగా ఉంటాడు. అతనుండే ఇల్లు కామమ్మగారి వసారాలోకి కనబడుతూఉంటుంది.

సాయంత్రం ౫ గంటలయింది. లలిత చక్కగా సింగారించుకొని వరాండాలో బెంచిమీద కూర్చొని ఏదోపుస్తకంచదువుతున్నది. కృష్ణమూర్తి ఆఫీసునుంచి వచ్చి కోటువిప్పకుండానే తనవాకిట్లోనిలుచుని లలిత వైపు చూస్తున్నాడు. "చాలాచక్కనిపిల్ల. అన్యాయం జరిగిం"దనుకున్నాడు. లలిత చదువుతున్న పుస్తకం మీదినుంచి కళ్ళుఎత్తి చూచింది. ఇద్దరిదృష్టులు కలిసినయి. వెంటనే తలవాల్చింది లలిత. మరల ఎత్తేటప్పటికి కృష్ణమూర్తి తనవైపే చూస్తున్నాడని గ్రహించింది. ఆమెకు తెలియకుండానే ఆమెకన్ను చలించింది, ఓరచూపు చూచింది. మరుక్షణమే తననుగురించి అతడేమి దురభిప్రాయపడతాడోనని భయపడ్డది. ఆమె కనుసైగచూచిన కృష్ణమూర్తి తను భ్రమపడ్డానేమోనను కున్నాడు. అయినా తెలుస్తుందిగదా అని తన్నామె చూచినప్పుడు చిరునవ్వునవ్వాడు. ఆమె ముద్దులొలికేటట్లు నవ్వింది.

మరునాడే కృష్ణమూర్తి భార్య నేదోసాకుమీద పుట్టింటికి పంపాడు. అదిమొదలు రెండునెలలు లలితా కృష్ణమూర్తులు స్వర్గసౌఖ్యాలనుభవించారు. లలిత తన సాహిత్యజ్ఞానంతో ప్రేమను అలంకరించింది. రసజ్ఞుడై కృష్ణమూర్తి దాని ఉత్కృష్టతను మనసార గ్రోలినాడు. లలిత గర్భవతియైనది. నవమాసపూర్తై శుభలగ్నాన చక్కనికుమార్తెనుకన్నది. పిల్ల అచ్చంగా కృష్ణమూర్తిపోలిక. లలిత ముచ్చటపడి "కృష్ణ" అని నామకరణం చేయించింది పిల్లకు.

తనభర్త అనుజ్ఞప్రకారం ఆయనకోవ కొనసాగే ఏర్పాటు జరుగలేదు.

కృష్ణమూర్తికి రేపల్లె తాలూకాఫీసుకు బదిలీ అయింది. ఆయనవున్నయింట్లోకి ఆనందరావని బి.ఎ. యల్.టీ., స్కూలుమేష్టరు వచ్చాడు. ఆయనభార్యను, కనడానికి పుట్టింటికి పంపించి ఒక్కడూ ఆయింటిలో ఉంటున్నాడు. సామాను వెనుకగదులలో పెట్టి, ముందు రెండుగదులు తానుపయోగించుకుంటున్నాడు. ఆనందరావుగారు స్ఫురద్రూపి. కొంచెం బొద్దుగాను, పొట్టిగాను ఉంటాడు. చక్కని తీరైన మీసాలు ఆయన అందాన్ని ఎక్కువచేస్తున్నవి.

ఒకవారంరోజులలోనే లలిత, ఆమెభర్తల మధ్యనున్న సంబంధాన్ని పూర్తిగా గ్రహించాడాయన. కాని లలితకు సమాప్తికలిగింది. 'అవును, పాపం! ఎవరైతే మాత్రం ఎన్నాళ్ళని ఊరుకుంటారు. తప్పేమున్నది గనుక' అనుకున్నాడు. ఆనందరావుగారిభార్య అక్కడ లేకపోవడంమూలాన లలితాఆనందరావులకు స్నేహం కావడం ఎక్కువరోజులు పట్టలేదు. భార్యప్రసవమై పిల్లవాడికి ఐదోనెలవచ్చి తీసికొనివచ్చేదాకా వారిద్దరూ మేఘాలమీద ఆడిపోయినారు. పరిచయంవల్ల లలిత తెలివితేటలను ఆనందరావు గ్రహించాడు. భగవంతుని ఎదుట తనేమైనా తప్పుచేస్తున్నానేమోనని ఆనందరావుకు తోచినప్పుడు లలితమాటాడి "ఇంత చదువుకున్నదానివి కదా! ఈపనిచేయడం తప్పుకాదా? దీనికి దేవునిదగ్గర ఏంప్రత్యుత్తరం చెబుతా"వంటే ఆమె తన స్థితిని తెలియజేసి తనయిప్పటిస్థితి తనభర్త అనుజ్ఞాప్రకారమే కాని ఇతరముకాదని సమాధానముచెప్పింది.

లలితకు రెండోసారి గర్భమై, పదినెలలు నిండిన పిదప ఒకకుమారుడు కలిగినాడు. చిదానందం అని నామకరణం చేయించింది లలిత. ఆనందరావు కుమారుడిని, లలితకుమారుడిని ఒకేబళ్ళోకి పంపారు. చిదానందం తెలివితేటలుచూచి పరవశుడైపోయేవాడు ఉపాధ్యాయుడు.

కామమ్మగారు మనుమడినిచూచి ఉప్పొంగిపోయేది.

— మొదలి సీతారామస్వామి, బి.ఏ.

కరిబసవస్వామి

[ఆంధ్రదేశ స్థానికచరిత్రకు చెందిన ఒక చిన్న కథ.]

హాం డేయనంతపురాఖ్యలక్ష్మిని, పవా
డప్పనాయఁడు కయినందినపుడు
స్వామివిద్రోహియై రామాజి నృపుని సం
స్థానంబుఁ గోల్పెట్టఁ బూనినపుడు
కడపసేనానులు కడుకొని, దారసేమ
రించి, యొంటరిగ బంధించినపుడు
కోటతల్పులు మిత్రకోటి గుఱినిమీఱి
తురకమూఁకలతోడ బెరసినపుడు
తనమహామంత్రశక్తి నేర్పునఁ, దదీయ
యవనసేనను దునిమి, నాయకునిఁ బ్రోచి,
లలిని రాజభక్తికిఁ బూన్నలక్ష్యమగుచు
మొనరె, కరిబసవస్వామి మోక్షకామి.

—సీరిపి ఆంజనేయులు.

అనంతపురపుఁ గోట యందు రెండువందల సంవత్సరములకు ముందు 'పవాడప్పనాయఁడు' అనువాఁడు రాజ్యము చేయుచుండెను. అతఁడు 'కడప' పట్టణమున రాజ్యముచేయుచుండిన ఒక తురకనవాబునకు లోఁబడి ప్రతిసంవత్సరము కప్పముకట్టుచుండెను. ఆ నవాబు 'రామాజీ' అను బ్రాహ్మణుని తనపక్షమునఁ గార్యములు చక్కఁబెట్టుటకు పవాడప్పనాయని దగ్గఱ యుంచెను.

కడపనవాబు కొలువున మహమ్మదుఖాను, అలీఖాను, సర్దారుఖాను అను ముగ్గురు సరదారు లుండిరి. వారు ముగ్గురును తమసేనతో నొకసారి యెక్కడికో పోవుచు అనంతపురమున కొక మైలుదూరముననున్న జూటూరువంకదగ్గఱ డేరాలువేసికొనిరి. ఈసంగతి పవాడప్పనాయనికిఁ దెలిసెను. తాను కడపనవాబునకు సామంతరాజు. వచ్చిన ముగ్గురును నవాబువద్ద కొలువునందున్నవారు. కావున నాయఁడు వారిని గౌరవించుట మర్యాద. అందుకని పవాడప్పనాయఁడు వారికిఁ గొన్ని కానుకలుపెట్టి రామాజీని వారివద్దకుఁ బంపించెను.

రామాజీ మంచివాఁడుకాఁడు. కుయుక్తులమారి. అటుచే నాతఁడు కడపసరదారులవద్దకుఁ బోయినప్పుడిట్లుచెప్పెను: "పవాడప్పనాయఁడు త్రాగుబోతు. అందుచేత అనంతపురసంస్థానముస్థితిగతు లిప్పుడు చాల చెడియున్నవి. కోటలో సేనలేదు. బొక్కసమున ద్రవ్యములేదు. కొంచము ధైర్యముతో మీరీసమయమున పవాడప్పనాయని బెదిరించిన అనంతపురము మీచేతులలోఁ జిక్కును. ఇతఁడు నాలుగుసంవత్సరములనుండి మననవాబునకుఁ గప్పముకట్టుటలేదు. ఈమిషతో మీరీసంస్థానమును సులభముగా లాగుకొనవచ్చును. కడపనవాబువారి సరదారులు తమదర్శనానికి వచ్చుచున్నారని నేను పవాడప్పనాయనితోఁ జెప్పెదను. అప్పుడాతఁడు మిమ్ములను లోనికిఁ బిలిపించును. మీరువచ్చి దర్శనముచేసినతరువాత బాకీయున్న కప్పముకొఱకు నిక్కచ్చియొనర్చి బెదిరింపుఁడు. వెంటనే అనంతపురము మీస్వాధీనమగును."

ఇట్లు రామాజీచెప్పినమాటలు విని కడపనవాబు సరదారులు చాలసంతోషించిరి. పిమ్మట వారు రామాజీతో "నీవుపోయి మేముచూచుటకు వచ్చుచున్నామని పవాడప్పతోఁ జెప్పుము. మాపక్షమున మాసేవకులను కొందఱిని తీసికొనిపొమ్ము." అని చెప్పిరి.

అందుమీఁద వారివద్ద సెలవుతీసికొని రామాజీ కోటలోనికివచ్చి పవాడప్పనాయనితో నిట్లు చెప్పెను: "నవాబువారిసరదారులు తమదర్శనముకొఱకు వేచియున్నారు. దర్శనమిప్పించుమని మిమ్ములనకోరుటకు నావెంట వారిమనుష్యులను పంపించినారు. కావున సరదారులను పిలిపించి దర్శనమిచ్చి వస్త్రతాంబూలములు బహుమానముచేసి పంపించిన గౌరవముగనుండును. మన

కార్యములను ముందుముందుఉపకారిగా నుండును."

రామాజీచెప్పిన దానికి పవాడప్పనాయఁడు సమ్మతించి వారిని తోడ్కొని రమ్మని ఆజ్ఞాపించెను. అప్పుడాబ్రాహ్మణుఁడు వారిని పిలుచుకొని వచ్చి యొక మేడమీఁద విడియించెను. పిమ్మట నతఁడా వృత్తాంతము పవాడప్పనాయనితోఁ జెప్పెను.


అప్పుడు పవాడప్ప కొలువుకూటమునకు వచ్చెను. కడపనవాబు సరదారులుముగ్గురు నచ్చటికివచ్చి యతని దర్శనముచేసిరి. నాయఁడు వారిని కుశలప్రశ్నముచేసెను. "మీకుఁగావలసిన వస్తువులు సమస్తము నగరిలోనుంచి పంపించెదను. రెండురోజు లిక్కడనుండి నన్ను సంతోషపెట్టుఁడు" అని నాయఁడు సరదారులను కోరెను. వారందులకొప్పుకొని తమ విడిదిమేడలోనికిఁ బోయిరి. తురకసరదారులకుఁ గావలసిన సమస్తపరికరములు, సకలపదార్థములు నొసంగుటకు పవాడప్పనాయఁడు రామాజీని నియమించెను.

వెంటనే రామాజీవారివద్దకుఁ బోయెను. వారికి వలసిన ఉపచారములు చేయించెను. పిమ్మట నాతఁడు వారితో "రేపు మీరు పవాడప్పను దర్శించినప్పుడు నేనుచెప్పినప్రకారము కప్పము కొఱకు నిక్కచ్చిచేయుఁడు" అని వచించెను.

మఱునాఁడు సరదారులు పవాడప్పనాయని దర్శనముకొఱకుఁ గొలువుకూటమునకు వచ్చిరి. రామాజీ ఈ సంగతి యంతఃపురముననున్న పవాడప్పకుఁ దెలియఁజేసెను. వెంటనే నాయఁడువచ్చి దర్శనమై కూర్చుండెను. అప్పుడు సరదారులు పవాడప్పనాయనితో నిట్లు చెప్పిరి: "నవాబు వారికి నీవు నాలుగు సంవత్సరములనుండి కప్పము బాకీపడియున్నావు. ఇప్పుడాముత్తము చెల్లించవలెను. లేదా మావెంట కడపకువచ్చి నవాబువారికిఁ దగిన సమజాయిషీ చెప్పుకొనవలెను."

ఇట్లు ఖండితముచేసి సరదారులు చెప్పగా పవాడప్పనాయఁడు "ఇప్పుడు సొమ్మిచ్చుటకు వీలులేదు. నవాబుసాహేబులవారి సన్నదు ఉండినచో నీయుండి. అది చూచుకొని మీవెంట కడపకువచ్చెదను." అని బదులు చెప్పెను.

ఆ మాటకుఁ గోపమువచ్చి తురకసరదారు లీవిధముగఁ బలికిరి: "మేము న్యాయముగా వచ్చియుండ నింకను సన్నదు కావలెనా? మామాటలయందు నీకు నమ్మకములేకపోయినను మాకుఁ జింతలేదు. నీవు మావెంట



రానక్కఱలేదు. నవాబుగారికి నాలుగు సంవత్సరములకు నీ వీయవలసిన అచ్చుబడిరూక లిచ్చివేయుము. అది యిచ్చువఱకు నీ విచ్చటినుండి లేచివెళ్ళుటకు వీలులేదు. అన్నమునకు నీళ్ళకుఁగూడ వెళ్ళరాదు."

ఇట్లు చెప్పి యా సరదారులు పవాడప్పను అక్క-

డనే ఖైదుచేసిరి. వారికి దయపుట్టినప్పుడు గుప్పెడు మెతుకులు, దొప్పెడు నీళ్ళుమాత్ర మిచ్చుచుండిరి. నాయఁడు తనస్థితికిఁ జాలదుఃఖపడుచుండెను. తంత్రగాఁడైన రామాజీచేసిన ద్రోహమువలన పవాడప్ప తన నగరిలోనే ఈ విధముగ ఖైదుచేయఁబడెను.

పవాడప్పనాయనికి 'నిడుమామిడి కరిబసవస్వామి' అని యొక స్నేహితుఁడుండెను. కరిబసవస్వామి మతగురువు. కావున నతనిని 'స్వాములవారు' అని జనులు పిలుచుచుండిరి. అతనికి కొత్తచెఱువు అను గ్రామములో నొకమఠము, అనంతపురములో నొకమఠము నుండెను. అనంతపురములోని స్వామివారిమఠము పవాడప్పనాయని నగరివంటి పడమటిదిక్కున నుండెను. పవాడప్ప తన నగరిలో బంధింపఁబడిన సమయమున నతని స్నేహితుఁడు కరిబసవస్వాములవారు కొత్తచెఱువుమఠములో నుండెను. అతఁ డీసమాచార మెట్లో తెలిసికొనెను. ఇహలోకచింతలేని మతగురువైనను స్వామికిఁ జాల రాజభక్తి కలదు. అగుటచే నాతఁ డేవిధముననైన పవాడప్పను ఖైదునుండి విడిపించవలయునని నిశ్చయించుకొనెను. కావున నాతఁడు కొత్తచెఱువునందలి తనవారినందఱిని తీసికొనివచ్చి అనంతపురమునఁ దన మఠములో దిగెను.

పవాడప్పనాయనికి చెన్నబసవన్న అని బావమఱఁది యుండెను. కరిబసవస్వామి యాతనికి వర్తమానించెను. అందుమీఁద చెన్నబసవన్న స్వామిదగ్గఱకు వచ్చెను. అప్పుడు స్వామి శివపూజకుఁ బూవులుకోసి పెట్టుదువు కాని రమ్మని చెన్నబసవన్నను పూలతోటలోనికిఁ దీసికొనివెళ్ళెను. అచ్చట రహస్యముగ నాతనితో స్వామి యిట్లు చెప్పెను: "మీ బావగారిసంస్థానము నడిసముద్రములో మునుఁగునట్లున్నది. రామాజీ ద్రోహముచేసి యింతపని యొనర్చినాఁడు. మనమేవిధముననైనను తురకసరదారులను పాఱఁద్రోలి పవాడప్పను చెఱవిడిపించవలయును. అతని సంస్థానము తిరిగి నిలుపవలెను."

కరిబసవస్వామి యిట్లు చెప్పగా చెన్నబసవప్ప వినెను. పవాడప్ప చెఱవిడిపించుటకు మార్గమేమున్నదాయని వారిద్దఱును చాలసేపాలోచనచేసిరి. పిమ్మట వారు గ్రామములోని కట్టుబడివాండ్రలోఁ బలుకుబడి కలవారిని పిలిచి యిట్లు చెప్పిరి: "మనసంస్థానము మునిఁగిపోవు స్థితిలో నున్నది. పవాడప్పనాయనివారిని అన్నమునకు, నీళ్ళకుఁ బోనీయక తురకసరదారులు ఖైదు చేసినారు. దయపుట్టిన కాసిని మెతుకులు, కాసినినీళ్ళు నిచ్చుచున్నారు. మనమిందఱము బలగముండియు మన రాజు ఈప్రకారము శ్రమపడుచుండగాఁ జూచుచు నూరకుండుట న్యాయము కాదు. అతని చెఱవిడిపించుటకు మనమాహారనిద్రలుమాని ప్రయత్నింపవలసియున్నది."

అప్పుడు వారిమాటలకుఁ గట్టుబడివాండ్రిట్లు చెప్పిరి: "అయ్యా! మేము మనుష్యమాత్రులము. మే మేమి చేయఁగలము? కోటగుమ్మములలో రెండు తురకసరదారుల స్వాధీనమైయున్నవి. పాతవాళ్ళమని మమ్ముల కోటలోపలికి రానీయరు. తురకసరదారులు కోటలోనికి వచ్చినప్పుడు చాలమంది భటులతోఁ గలసి వచ్చిరి. పిమ్మట వారిసేనయంతయువచ్చి కోటలోఁ బ్రవేశించెను. మేము తొందరపడి దౌర్జన్యముచేసిన వారి చేతులలోఁ జిక్కియున్న పవాడప్పనాయనివారి కేమి యుపద్రవము కలిగింతురోయని సంశయించుచున్నాము. మీ మఠము రాజుగారి నగరివంటియున్నది. కావున మీ రేదియైన యుక్తిచేత నాయనివారిని మీ మఠములోనికి రప్పింపుఁడు. పిమ్మట మీ మాటప్రకారము మేము ప్రాణములకు తెగించి యెంతపనియైన చేయుదుము."

కట్టుబడివాండ్రిట్లు మాటయిచ్చినమీఁదట కరిబసవస్వామి యిట్లు చెప్పెను: "మీరు చెప్పినట్లు కోటగుమ్మములలో రెండు తురకవారిచేతులలో నున్నమాట నిజమే. కాని మా మఠము దిక్కుననున్న దిడ్డివాకిలి మట్టుకు వారి స్వాధీనమున లేదు. మా స్వంత కమతగాండ్లు ఆ దిడ్డివాకిలిగుండా పశువులకు గడ్డి, నగరికిఁ గట్టెలు తెచ్చుచున్నారు. వారు తెచ్చెడిగడ్డి మాపశువులమేఁత బీళ్ళలోనిదే. కావున మీరాబీళ్ళదగ్గఱకు వెళ్ళుఁడు. మీ కత్తులను గడ్డిమోపులలోఁ గట్టుకొని కోటకుఁ బది, యిరువదిమంది మాకమతగాండ్లతోఁ గలసి మా పశువులదొడ్డిలోనికి వచ్చుచుండుఁడు. ఇక్కడ మీకు నేను అన్నోదకములిచ్చెదను. మిమ్ములను రహ

స్యముగ నుంచెదను. సమయముకనిపెట్టి మనముపవాడప్పనాయని విడిపించుకొందము."

స్వామిచెప్పిన ఈ ఆలోచనకుఁ గట్టుబడివాండ్రు సమ్మతించిరి. అట్లే చేయుదమనిచెప్పి వారు వెడలిపోయిరి. పిమ్మట కరిబసవస్వామి యూరిలోనున్న యొక కమ్మరివానికిఁ గబురుపంపి మంచి యాకురాయి యొకటి తెప్పించెను. తన మఠమునకును రాజనగరికిని నడుమనున్న తలుపు నాగవాస మాయాకురాయిలో తెగగోసి స్వామి మార్గము చేసియుంచెను. ఇంతలోఁ గట్టుబడివాండ్రు స్వామిచెప్పినవిధమున దినములవెంట రెండువందలమంది కత్తులతోడను, కటారులతోడను వచ్చి మఠములో దాగియుండిరి. చెన్నబసవన్న వీరి యందఱకు నాయకుఁడైయుండెను.

ఒకనాఁడురాత్రి నాలుగుగడియలమీఁద తురకసరదారులు భోజనముచేయుటకు వెళ్ళిరి. పవాడప్పదగ్గఱ తురకవారిబంటులు ముగ్గురుమాత్రము కావలియుండిరి. కరిబసవస్వామి యిది కనిపెట్టెను. అప్పుడాతఁడు పవాడప్పనాయనికి అన్నము నీళ్లు తీసికొని వెళ్ళియిచ్చు సేవకురాలిని పిలిచి మఠములోనికిఁ బోవుమార్గము తీసియున్నసంగతి రహస్యముగఁ జెప్పెను. ఆ సేవకురాలు మామూలుప్రకారముగ నన్నము, నీళ్ళు తీసికొనివెళ్ళి రాజుముందఱనుంచెను. అతఁడు తినుటకుఁ గూర్చుండెను. కావలియున్న సిపాయిలు కొంచముదూరమున నుండిరి. అప్పుడామె రాజుతో మెల్లగా "మఠములోనికిఁబోవు తలుపుతీసియున్నది. ఆమార్గమున మీరు పోవచ్చును. మీపక్షమున సేనకూడియున్నది. కరిబసవస్వామివారు సర్వము సిద్ధముచేసియున్నారు" అని చెప్పెను. పిమ్మట నామె పవాడప్పను మఠములోనికిఁ బిలుచుకొనిపోయి లోనగడియవైచెను.

కావలియున్న సిపాయిలు జరిగినమోసమును తెలిసికొనిరి. పవాడప్ప తప్పించుకొనిపోయెనని వారు పెద్దగోలచేసిరి. తురకసరదారు లిదివిని కత్తులుధరించి పవాడప్పను తిరిగి పట్టుకొనుటకుఁ బరుగెత్తుకొనివచ్చుచుండిరి. కరిబసవస్వామి మఠములో దాగియున్న పవాడప్ప తరఫువా రప్పు డాసరదారుల ముగ్గురిని చంపివేసిరి. తమ్మునడుపునాయకులు చనిపోవుటతోడనే తురకసైనికులు చెల్లాచెదరై పాఱిపోయిరి.

అప్పుడు పవాడప్ప పోయినరాజ్యమును తిరిగి పొందెను. తనకింతటికష్టము కల్గించినది ద్రోహియగు రామాజీయని నాయఁడు తెలిసికొనెను. అప్పుడాతనికిఁ బట్టరానికోపము వచ్చెను. వెంటనే సేవకులనుపంపి నాయఁడు రామాజీనిపట్టి తెప్పించెను; అతని నాలుక కోయించెను.

"స్వామివిద్రోహు లీసరణి యెఱింగి,
నాపాటు గుర్తించి, నయమార్గమంద
చరియింత్రుగాక! నిచ్చలు భూతలమునఁ
జెలువారుఁగాక యుంచితరాజభక్తి."

అనితలచి మూఁగబ్రతుకు బ్రతుకలేక రామాజీ ఆత్మహత్య చేసికొనెను. రాజద్రోహముచేసిన రామాజీ యిట్లు కనాకష్టపుఁ జావు చచ్చెను.

తనకుఁ బోయినసంస్థానము నిర్వాహకముచేసిన కరిబసవస్వాములవారికి పవాడప్పనాయఁడు సాష్టాంగపడి మ్రొక్కెను. నిజముగా కరిబసవస్వామి రాజభక్తి మెచ్చదగినది. అతఁ డిహలోకచింతలుమాని 'కృష్ణ రామా' అనుకొనుచు నెల్లవేళల మతవిషయములను గూర్చి చింతించుచుండువాఁడు. అట్టివాఁ డవసరము వచ్చినది కావునఁ దనబుద్ధిని, శక్తిని ఇహలోకవిషయములం దుపయోగించి పవాడప్పరాజ్యమును నిలిపెను. ప్రజలసుఖమునకును, దేశమున శాంతికిని రాజే యాధారము. కావున నట్టిరాజునకుఁ గష్టముకల్గినప్పుడు కరిబసవస్వామివంటి మతగురువులు సయితము మతచింతలు మాని రాజునకొఱకుఁ బనిచేయుట మనదేశమున అనాదినుండియున్న యాచారము. కూలిపోయిన మిత్రుని రాజ్యమునుకూడఁ దీసి ఈరాజభక్తుఁడు లోకపూజ్యుఁడైనాఁడు.

"ఒనరు ననంతవిశ్వోద్యానసీమఁ
బూవు లనెన్ని యోపూచి నశించు;
నందుఁ గమ్మనితావు లంతటఁ గ్రమ్మ
వఱలినసుమమె యీశ్వరమోదకరము."

—సీ౦పి ఆంజనేయులు.



'కృషితో నాస్తి దుర్భిక్షమ్'

సీ. ఈలోక మింతయు నాలుగుపాళు లిందొకటభిక్షుకులు సోమకులు నొక్క-
పాలు, సేవావృత్తి బ్రతికెడువారు విద్యోపజీవికులును నొక్కపాలు,
వ్యవహారమాడెడువారుఁ దస్కరులును నొకపాలు, కర్షకు లొక్కపాలు
మొదలిపాళ్ళు మూఁడుఁ బిదపటిపాలిన యనవరతంబును నపహరించు
గీ. నపహరించియు నంతంత కవి నశించు, నపహృతం బయ్యు నదివృద్ధినందుచుండుఁ
గానఁ దగురాజు గలిగినఁ గరిసనంపు, జీవనముఁ బోల దొండొకజీవనంబు.

—మంచన మహాకవి.

చెప్పుదెబ్బలు తిన్న పెద్దలు

చెప్పుదెబ్బలతత్త్వం

పెట్టి పెట్టలేదంటే ప్రాణసంకటం, తిని తినలేదంటే దీర్ఘసంకటం, పెట్టకుండా పెట్టేనంటే పెద్దసంకటం అని తెలుగులో ఒక సామెతఉంది. పెట్టడం, తినడం అనే రెండుధర్మాలు కలిగిఉన్న చెప్పుదెబ్బలవిషయంలో ఈ సామెత ఎంతవఱకు వర్తిస్తుందో కొంచం విచారిద్దాం. పెట్టకుండా పెట్టానంటే ప్రాణసంకటం అని ఉన్నప్పటికీ కొందరు కోతలరాయుళ్ళు తమ పాదాలుపుట్టిన తరువాత చెప్పులు ఎల్లావుంటాయో ఎఱక్కపోయినా తమ విరోధులకిమాత్రం చెప్పుదెబ్బలు బహుళంగా ప్రసాదించామని ప్రజ్ఞలుకొట్టుతారు. తిని తినలేదంటే దీర్ఘసంకటం అని ఉన్నప్పటికీ చెప్పుదెబ్బలు తిన్నవాళ్లు ఎవళ్ళూ తాము వానిని తిన్నామని మతిచెడిపోయిఅయినా, మనసిచ్చిన మిత్రులతోకూడా చెప్పుకోరు. పెట్టి పెట్టలేదంటే పెద్దసంకటం కాబట్టి చెప్పుదెబ్బలను పెట్టినవాళ్ళుమాత్రం ఆవిషయం గొప్పగా నలుగురిలో అవకాశం కల్పించుకొని కూడినంతవిపులంగా ఉపన్యసిస్తారు. తిన్నవాళ్ళు చెప్పుకోనివి, తినిపించినవాళ్ళు గొప్పగా చెప్పుకునేవి అయినవస్తువుల్లో చెప్పుదెబ్బలు అగ్రస్థానంవహిస్తాయని అంగీకరించకతప్పదు. ఒకడికి మఱిఒకడుచేయగల అవమానాల్లోను, ఒకడు మఱి ఒకనిచేపొందగల అవమానాల్లోను చెప్పుదెబ్బలు సాటిలేనివి. ఇట్టి సాటిలేని చెప్పుదెబ్బలకు పురాణాల్లోను, సారస్వతంలోను, రాజకీయంలోను గల స్థానాన్నిగురించి ఇంతవఱకు ఎవరూ తెలుగులో చర్చించినట్లు కనబడదు. ఈ క్రొత్తవిషయాన్ని నేను తెలుగులో ప్రథమంలో వ్రాయగలిగినందులకు చాలా ఆనందిస్తున్నాను.

శ్రీకృష్ణుడు, యమధర్మరాజు

పురాణాలు పురాణమైనవి కాబట్టి వానిలోని చెప్పుదెబ్బలవిషయం తోలుతనే ప్రస్తరించడంన్యాయం. సమ్మోహనాస్త్రం, ప్రభంజనాస్త్రం, పావకాస్త్రం మొదలైనవి యుద్ధసామగ్రిగా ఉపయోగించిన పురాణపురుషులు చెప్పులను ఈ కాలమునందువలె అప్పుడు యుద్ధసామగ్రిగా వాడియున్నారని చెప్పడానికి నిదర్శనాలేవీ కనిపించవు. పౌరాణికయుగంలో చెప్పులవాడకం అంత తఱుచుకాదని చెప్పాలి. నేడు హైస్కూళ్లలోను, కాలేజీలల్లోను చదువుకునే ఆడపిల్లలకందఱకు ఏవో ఒకమాదిరిచెప్పులు విధిగా ఉంటున్నాయి. పురాణాల్లో రేణుకాదేవికోసం ఆదిలో చెప్పులు సృష్టింపబడ్డట్టుఉన్నా పురాణస్త్రీలు చెప్పులను ఉపయోగించిన ఉదాహరణలు ఏవీ నాకు దొరకలేదు. పదునాలుగుఏళ్ళ అరణ్యవాసానికిపోతూ శ్రీరాముడు పాదుకల్ని భరతుడికి ఇచ్చిపోయాడు. రాళ్ళరప్పల వెంట మగనితో సీతామ్మవారు నడుస్తూకూడా చెప్పులతొడుక్కుందని వాల్మీకి ఎక్కడా వర్ణించలేదు. స్త్రీలు చెప్పులుతొడుక్కోటం ఆరోజులలో నేటికి వలె ఆచారంకాదేమో! యుద్ధకౌశల్యమును ప్రదర్శించిన సత్యభామకూడా చెప్పులు తొడుక్కున్నట్లుచెప్పబడలేదు. పారిజాతాపహరణంలో అలిగి సత్యభామ చీకటింటి చివరమంచంమీద పడుకున్నప్పుడు మాసిన చీరతోబాటు ఏపాతచెప్పుల జోడో తొడుక్కుని ఉండి ఉంటే శ్రీకృష్ణభగవాన్లుగారికి తనభార్య ఎడమకాలి చెప్పుతాపులు లభించి భగవద్గీత అనుభవంలోకి వచ్చి ఉండును. మార్కండేయస్వామివారి ఆయుర్దాయవిషయంలో శివుడు డాకాలిమడమతాపుకి గుఱియైన యమధర్మరాజుకి ఆసమయంలో శివుడికాలికి చెప్పులులేకపోవడంవల్ల అవమానంయొక్కవాడి కొంచంతగ్గింది. శివుడు వీభూదిరాయుడు కాబట్టి తోలుతుట్టుకోడను కోవడానికి వీల్లేదు. పచ్చిఏనికతోలు పచ్చడము ధరించు పరమబ్రాహ్మణోత్తముడు అతడు. మార్కండేయుణ్ణి యమపాశాలనుండి రక్షిద్దామనే ఆదుర్దాలో శివుడు తోలుచెప్పులు తొడుక్కురావనం మఱచి ఉం

టాడు. మఱుపనేది ఎట్టివారికైనా ఉండేదే. గజేంద్రుణ్ణి రక్షించబోతూ విష్ణుమూర్తి శంఖచక్రాలే మఱచిపోయాట్ట. శ్రీకృష్ణుడికి, యమధర్మరాజుకీ ఇట్లు కొంచంలో చెప్పుదెబ్బలుతప్పినాయి. సూటిగా చెప్పుదెబ్బలుతిన్న పురాణపుపెద్దలు ఎవరూ మనకి దొరకడం లేదు కాబట్టి ఇంతతో వీళ్ళని వదిలేయవలసి ఉంటుంది.

పిండిప్రోలు లక్ష్మణకవి

ఇక సారస్వతంలో చెప్పుదెబ్బలనుగూర్చి విచారిద్దాము. ఇతరసారస్వతాలకంటె మనసారస్వతంసంగతి మనకు ముఖ్యంకాబట్టి ఆంధ్రసారస్వతంలో చెప్పుదెబ్బలుతిన్న పెద్దలుఎవరేనా ఉన్నారేమో చూద్దాము. రాజమండ్రిలో చారిత్రకవేత్త ఒకడు శాసనపరిశోధన మాని శ్రీరామనవమిదినాలలో స్త్రీపరిశోధనకు కడంగగా చెప్పురావన్ని చెప్పుదెబ్బలు తిన్నాడని తెల్లవైంది. ఆయనపేరు నాలికమీద ఆడుతోందికాని సమయానికి జ్ఞాపకం రావటంలేదు. తెలకులదాన్ని, దూదేకులదాన్ని, తమలపాకులు అమ్మేదాన్ని, పూజారివారి కోడల్ని, సాతానిదాన్ని, అగసాలిదాన్ని, బోందిలిదాన్ని, చాకలిదాన్ని, వడ్లుదంపుతోన్నదాన్ని, పిండి రుబ్బుతోన్నదాన్ని, పేడచేస్తోన్నదాన్ని తెలుగుస్త్రీలను ఎందరినో వర్ణించిన శ్రీనాథుడికి ఒక్కసారి కూడ చెప్పుదెబ్బలు తగిలినట్లు తెలియరాదు. 'గండము దప్పె నాంధ్రకవిగానికి' అన్నపద్యం ఈకారణంచేతనే పుట్టిందేమో! పదాలతో తిట్టుకోవడమేకాని ఆంధ్రకవులు ఒండొరులను చెప్పులతో కొట్టుకొన్న నిదర్శనాలాట్టే కనిపించవు. ఒకసారిమాత్రం శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారు పిండిప్రోలు లక్ష్మణకవిగారికి పైజార్లతో కొడతానని కబురుపంపారట. దానిమీద లక్ష్మణకవిగారు పైజారులదాకా ఎందుకు లోజారుల సంగతి ఆలోచించమని చమత్కారంగా అని చెప్పుదెబ్బలు తప్పించుకున్నారు. మొత్తంమీద సరస్వతి అందెళ్ళచప్పుళ్ళే చప్పబఱచే చెప్పుదెబ్బల చప్పుడు తెనుగుసారస్వతానికి లేదని చెప్పాలి.

సురేంద్రనాథబెనర్జీ

రాజకీయాల్లో ఏ విషయమైనాసరే తీవ్రరూపం తాలుస్తుంది. సూరతుకాంగ్రెసులో అతివాదులకు మితవాదులకు రాజకీయాభిప్రాయాలు తీవ్రతరమై కాట్లాట్లకు కారణమయ్యాయి. ఆ కాంగ్రెసులో చెప్పుల జోళ్ళు తమతమ నెలవుల్ని వదలి సభాధ్యక్షులు కూర్చున్న వేదికవైపు—అధ్యక్షస్థానం అర్థించి కాబోలు—పూలచెండ్లలా పరుగులెత్తాయి. అందులో ఒకటి సూటిగా వచ్చి సురేంద్రనాథబెనర్జీగారికి తగిలింది. ఆ చెప్పును ఆమహనీయుడు తాను చచ్చిపోయేవఱకు తనవద్ద భద్రంగా దాచుకున్నాడు. మహాసభలో తిన్న చెప్పుదెబ్బ కాబట్టి దీనివిషయం దాచుకోవడానికి వీల్లేక బెనర్జీగారు అవకాశం ఉన్నప్పుడల్లా దాన్నిగూర్చి నలుగురితో చెప్పుతూ వీలుపడితే ఆచెప్పునుకూడా ప్రదర్శిస్తూ ఉండేవారు. బహిరంగంగా చెప్పుదెబ్బలు తిన్న భారతనాయకులు మఱెవరూ లేరనుకుంటాను. గాంధిమహాత్ముడు దక్షిణాఫ్రికాలో తిన్నది చెంపకాయమాత్రమే.

రామ్సేమాక్డొనాల్డు

సూరతులో కాంగ్రెసుకి చెప్పుదెబ్బలతో సంపర్కం కలిగింది. 1911 లో కాంగ్రెసుకి నేడు బ్రిటిష్‌సామ్రాజ్యానికి మంత్రిమాణిక్యమైఉన్న రామ్సేమాక్డొనాల్డుగారిని అధ్యక్షునిగా చేయడానికి కొంతప్రయత్నం సాగింది. మన కాంగ్రెసుకి చెప్పుదెబ్బలసంపర్కం కలగడంమూలాన్నికాబోలు కాంగ్రెసు అధ్యక్షుడుగా సూచింపబడ్డ మేక్డొనాల్డుకికూడా చెప్పుదెబ్బలు తగిలాయి. అసలు చెప్పుదెబ్బతినడమే అవమానకరమైనవిషయం. అందులో ఆడదానిచేత అది తినడంకంటె అవమానకరమైంది మఱి ఒకటి ఉండబోదు. అఖండబ్రిటిషుసామ్రాజ్యాన్ని నేడు నిర్వక్రపరాక్రమమున ఏలుతూఉన్న రామ్సేమేక్డొనాల్డు ఒకప్పుడు ఒక ఆడదానిచేత చెప్పుదెబ్బతిన్నాడు. పెట్టిపెట్టలేదంటే ప్రాణసంకటం కాబట్టి చెప్పుదెబ్బలను పెట్టినవాళ్ళు మాత్రం ఆవిషయం గొప్పగా నలుగురిలో అవకాశం కల్పించుకొని కూడినంత విపులంగా ఉపన్యసిస్తారని మొదట్లోనే మనవిచేశాను. మేక్డొనాల్డుకి చెప్పుదెబ్బ ప్రసాదించినస్త్రీ అట్లు ఉపన్యసించడంతో తృప్తిపడక ఆవిషయం పత్రికలో వ్రాసి అచ్చువేసి దానికి అక్షర

రూపం ఇచ్చింది. ఆస్త్రీ నామము పోలానెగ్రి. లోక ప్రఖ్యాతిగాంచిన సినీమానటకురాలు. చెప్పుదెబ్బల విషయం తినిపించినవారు చెపుతేనే రక్తిగా ఉంటుంది కాబట్టి ఆమె మాటల్లోనే ఈవిషయం ఇక్కడ ప్రదర్శిస్తాను. "రామ్సేమేక్డొనాల్డుతో నాకైన ప్రథమసందర్శనం నేను ఎప్పుడూ మఱచిపోను. అది అసమయంలో సంభవించింది. నేను అప్పుడు యాత్రచేస్తూ బర్మింగుహామ్‌లో ఉన్నాను. అచ్చటి ఒక పెద్దహోటల్లో మకాంచేశాను. నాడువచ్చిన సినీమా వేషగాళ్ళుఅయిన మిత్రులతో పల్లాపగోష్ఠి అయింతరువాత రాత్రిపొద్దుపోయి గదికివెళ్ళాను. పరుండని పదినిమిషాలు కాలేదు. అంతలో నాజన్మంలో నేను వినవంతటి పెద్దగుఱ్ఱు వినిపించింది. నిదానంమీద అది పక్కగదిలోనుంచి వస్తోన్నట్లు కనిపెట్టాను. అడ్డగోడ సన్నమైంది కాబట్టి ఇక నామట్టుకి ఆరాత్రికి నిద్రప్రాప్తి లేదనుకున్నాను. ఓర్పు కలిగినంతసేపు ఆగుఱ్ఱు ఓర్చాను. ఇక భరించలేకపోయాను. గోడనుతట్టి శబ్దంచేశాను. ప్రయోజనంలేకపోయింది. గోడమీద చాలాసార్లు అల్లాగే చప్పుడు చేశాను. కఱ్ఱపిడికిటితో పెద్దశబ్దంచేశాను. నిష్ఫలం. ఆపెద్దగుఱ్ఱు ఏమాత్రం తగ్గలేదు. ఉశ్చైత్తుగా నాలో ఆలోచన తోచింది. ఆనాడువచ్చిన నాస్నేహితుల్లో సినీమా వేషగాళ్ళల్లో హాస్యపాత్రధారిఅయిన యువకుడొకడు ఈగుఱ్ఱుకి కారణంఅయి ఉంటాడనితోచింది. సామాన్యడెవరూ అంతబిగ్గరగాను, దీర్ఘంగాను గుఱ్ఱు పట్టలేడని అభిప్రాయంపడ్డాను. హాస్యగాడికి తగినశాస్తి చేయాలని బయలుదేరాను. గౌనుతొడుక్కుని చేతులో రబ్బర్‌బూటు ఒకటిపట్టుకుని వెళ్ళి నెమ్మదిగా పక్కగది తలుపుతోశాను. అది లోపల గడియవేయబడి యుండలేదు. తలుపు తెరచాను. కవాటాలోంచి వస్తూన్నదీపపు వెలుతురులో నిద్రితుడు స్పష్టంగా కనిపిస్తూ ఉన్నాడు. నిదానంగా గుఱిచూచి ఆవిగ్రహంమీదికి నా రబ్బర్‌బూట్ విశిరాను. తోడనే జ్వాలాగ ఆతడు లేచికూర్చుండి మీటునొక్కి గదిఅంతా వెలుగు వెల్లువలో ముంచివాడు. నేను ఆశ్చర్యసముద్రంలో మునిగిపోయాను. నేను అనుకున్న హాస్యగాడు కాదు. వింతవాడు. వింతవాడుకూడాకాదు. అతనిముఖం నాకు బాగా పరిచయం అయిందే. క్షమాపణవచనాలు అస్పష్టంగా గొణుక్కుంటూ గది ఈవతలికివచ్చేను. నేను ఆముఖం ఎక్కడ చూశిఉంటానా అని ఆలోచించాను —వార్తాపత్రికల్లో తఱచు ప్రచురింపబడే చిత్రపటాల పరంపర నామనోనేత్రాలఎదుట పాదగట్టింది. అప్పుడు నాకు తెలిసింది—ఆంగ్లమంత్రిమాణిక్యునిపై నేను చెప్పు విశిరానని. ఉదయాన్నే లేచి హోటల్లో విజిటర్సు పుస్తకంచూశాను. నా ఎంచిక నిజమైందేనని తేలింది. కొన్నాళ్ళు అయినతరువాత రామ్సేమాక్డొనాల్డు గారికి రాజకీయంగా అనుకూలంగా జరిగిన ఒక స్వాగతోత్సవసందర్భంలో నేను పరిచయంచేయబడ్డాను. అప్పుడు ఈసంగతి అతనితో ప్రస్తావించాను. అతడు కడుపుబ్బనవ్వి ఇట్లు చెప్పేడు: "నాకు తగినశిక్ష అయింది అనుకుంటాను. నేను ఎల్లప్పుడూ గుఱ్ఱుపడతావని మా అమ్మాయి చెప్తుంది. ఏమైనాసరే ఈకథమాత్రం మళ్ళీ చెపితే తప్ప నేనైమాత్రం ఎవరితోనూ చెప్పను."

చెప్పుదెబ్బలవిషయంలో ఒకరహస్యం

ఈవ్యాసం చదివేవాళ్ళలో ఎవళ్ళైనా రాజకీయ నాయకులు చెప్పుదెబ్బలు తిన్నవాళ్ళు ఉంటే వాళ్ళ చెవిలో నేను ఒకరహస్యం చెప్పదలచుకొన్నాను. ఇతరులు ఎవరితోటీ ఈరహస్యం చెప్పకుండా ఉంటారనే నమ్మకంతోటే దీన్ని వాళ్ళకు నేను చెప్తున్నాను. చెప్పుదెబ్బలుతిన్న సమయంలో తాత్కాలికంగా కొంత అవమానభారం కలిగినా దాన్నిగురించి రాజకీయాలలో పనిచేసేవారు నిరుత్సాహపడవలసిన అవసరం ఏమీలేదని మనవిచేస్తున్నాను. చెప్పుదెబ్బతిన్నతరువాతనే సురేంద్రనాథ బెనర్జీ హిందూదేశానికి తలమానికం అనదగ్గ వంగరాష్ట్రానికి మంత్రిపుంగవుడు అయాడు. చెప్పుదెబ్బ తిన్నతరువాతనే రామ్సేమేక్డొనాల్డు రవిఅస్తమించని విశాలాంగ్లమహాసామ్రాజ్యానికి మంత్రిమాణిక్యుడయ్యాడు. రాజకీయాల్లో పనిచేసేవారిలో తమ్ము ఎవరుతిందురో వారిని మంత్రులుగాచేయుగల గొప్ప గుణం చెప్పుదెబ్బలకు ఉందని పైనివర్ణనాలు రెండూ చెప్తూఉన్నవి. మనం ఆకళించిన ఈఫలశ్రుతివిషయం

కూడినంత రహస్యంగా ఉంచవలసిందిగా రాజకీయాల్లో తిరుగుతూ చెప్పుదెబ్బలు తినిఉన్న ఈ వ్యాసపాఠకుల్ని మరిఒకసారి కోరుతున్నాను. మనదేశంలో కొద్దిరోజులలో ఫెడరల్ రాజ్యాంగం ఏర్పడబోతోంది. అప్పుడు ఒక్కొక్కరాష్ట్రంలో కనీసం అయిదుగురేసి మంత్రులు ఉండగలరని తెలియవస్తోంది. ప్రభుత్వంలో ఉద్యోగాలు సాధారణంగా ఆచారాన్నిబట్టి, సాంప్రదాయాన్నిబట్టి లభిస్తాయి. చెప్పుదెబ్బతిని ఉండడం మంత్రిత్వంపొందడానికి అర్హతను ప్రసాదిస్తున్నదని సురేంద్రనాథబెనర్జీవిషయం చెప్పకచెప్తోంది. ఫెడరలురాజ్యాంగంలో వివిధరాష్ట్రాల్లో నియమింపబడే మంత్రులలో చెప్పుదెబ్బతిన్న అర్హతగల రాజకీయవేత్తలకు ఎక్కువ ఛాన్సులు ఉండగలవు. ఇంతవరకు చెప్పుదెబ్బతినకుండా ఉండి ఫెడరల్ రాజ్యాంగంలో మంత్రిత్వంసంపాదించాలని ఎదురుచూస్తూఉన్న రాజ్యాంగవేత్తలు త్వరగా ఏకోవిధంగా చెప్పుదెబ్బతిని జీర్ణించుకోవడానికి ప్రయత్నించడం మంచిది. మంత్రిత్వానికి అర్హతలు సంపాదించడంలో పురుషప్రయత్నానికిలోపం ఎంతమాత్రం రానీయకుండా ఉండడం నాయకలక్షణం. రాజకీయాల్లో పనిచేస్తూన్న వారివిషయంలోనే చెప్పుదెబ్బలు వారు మంత్రిత్వంపొందడాన్ని సూచిస్తాయి కాబట్టి కేవలం కుటుంబవిషయాల్లో ఆస్తిపంపకం సందర్భంలో కోర్టులో కొడుకుచేత చెప్పుదెబ్బతిన్న పశ్చిమగోదావరిజిల్లా నరసాపురంకాపురస్థుడగు లాయరు మహాశయుడుగాని, విచారణసమయంలో ముద్దాయిచేత చెప్పుదెబ్బతిన్న మీరటుమేజిస్ట్రేటుగాని, పెళ్ళినాడిస్తానని కార్యంఅయిన నాలుగుఏళ్ళవుతూ కట్నం ఇవ్వలేకపోయిన కారణంవల్ల అల్లుడిచేత విజయేశ్వరాలయం దగ్గర చెప్పుదెబ్బతిన్న బెజవాడనివాసిఅయిన మామగారుగాని—చెప్పుదెబ్బతిన్న కారణంచేతనే—తాము తమతమరాష్ట్రాలికి మంత్రులము కాగలమనుకోవడానికి ఎంతమాత్రం అవకాశంలేదు. అవకాశంలేకపోయినా వాళ్లు మంత్రులముకాగలమనిభావిస్తే ఆభావానికి నేనుగాని, నా ఈ వ్యాసంగాని బాధ్యులముకామని మనవి.

—ఎ. శేషాచలపతి, బి.ఏ.

దయ్యం

పొగబండి 'రంయి'మనిపోతున్నది. గాఢాంధకారం. మబ్బుపట్టింది. నక్షత్రాలుకూడాలేవు. బయటికిచూస్తే భయంవేస్తున్నది. కాని రైలుబండిమాత్రం, ప్రక్కనున్న విషయాలను గమనించకుండా, నిశ్చలచిత్తంతో తపస్సుచేస్తున్నప్పుడు పరమాత్మానుసంధానంకొరకుపారే యతియొక్క జీవాత్మవలె, వెళ్ళిపోతున్నది.

ఉన్నట్టుండి నేను,

'ప్రభూ!' అనిపిలచి 'ఆ కనబడుతున్న కొరివులేమిటో తెలుసునా?' అన్నాను.

'మిణుగురుపురుగులో లేకపోతే దగ్గరసావున్న పల్లెటూళ్ళలో దీపాలో' నన్నాడు ప్రభూ.

'కాదు. కాదు. కొరివిదయ్యాలు' అన్నాను.

'దయ్యాలులేవు. భూతాలులేవు' అన్నాడు ప్రభూ వింతనవ్వుతో.

'అయితే దయ్యాలులేవనేనా నీ అభిప్రాయం' అన్నాను నేను కొంచెం కోపంతో.

'నిశ్చయంగా' నన్నాడు ప్రభూ బల్లగుద్దినట్లు.

వెనకటి పెద్దమనిషికి సందుదొరికింది మాట్లాడటానికి. 'దయ్యాలులేవని చెప్పటానికి వీల్లే'దన్నాడు తలకాయతిప్పుతూ.

'నిజమే. దయ్యాలున్నవనిచెప్పిన మనపూర్వులందరు తెలివితక్కువవాళ్ళు కాదు. పైపెచ్చు నాగరికత బలిసిన పాశ్చాత్యులుకూడా దయ్యాలున్నవని ఒప్పుకుంటున్నారు' అని అంటూ ప్రభూవైపుచూసి ఒక్కచిరునవ్వునవ్వాను. ఆ చిరునవ్వులో విజయసూచన కనుబడుతున్నది.

ప్రభూకు కోపంవచ్చింది. అన్నాడుకదా పెద్దమనిషితో 'మీరు మీజీవితంలో యెన్నిదయ్యాలను చూశారో చెప్పగలరా. అప్పుడుగాని నమ్మను' అని.

పెద్దమనిషి సిగరెట్టుతీసి వెలిగిస్తూ 'అట్లా అడుగు. చెపుతాను' అంటూ ప్రారంభించాడుకథ.

'మైసూరుసంస్థానంలోని ఒకానొక చిన్నపట్టణంలో ఒకపాదిరీ వుండేవాడు. ఆయనది ఫరాసుదేశమనీ, దా

ళాపు ఒకఅర్ధశతాబ్దంనుంచి ఆయన మతప్రచారం చేస్తున్నాడనీ వాడుక. స్వార్థత్యాగం ఆయనలో మూర్తీభవించిందని చెప్పటానికి, ఆయన స్వదేశాన్నివదలి, ఆరు, ఏడు వేలమైళ్ళదూరం వచ్చి,తిండికి గుడ్డకు సరిపోయేజీతంమాత్రం తీసుకుంటూ మానవసేవచెయ్యడమే తార్కాణం. పరోపకారపారీణతను ఆయన్ను చెప్పి మరొకరిని చెప్పాలి. ఆయనమొహం యెప్పుడూ నవ్వుతూవుండేది. దయారసం పొంగిపొరలిపోతూవుండేది. కోపమనేది ప్రపంచంలో వున్నవిషయం ఆయనకు తెలియదేమోననిపించేది చూసినవారికి. ఆయన ఆవూళ్ళో ఒక మేడకిందిగదె అద్దెకుతీసికొని నివాసంచేస్తున్నాడు. ఆయనకు కావలసిన చిన్నగ్రంథాలయంకూడా దాంట్లోనే ఏర్పాటు చేసుకున్నాడు. ఎప్పుడు చూచినా ఒకే యేకోపనిమీదనే వుండేవాడేకాని, సోమరితనంగా వున్నట్లుచూచి యెరగనేయెరగమని ఆయనను యెరిగిన వాళ్ళు చాలామంది చెప్పారు.'

ఇక్కడికి వచ్చేటప్పటికి ఆయనకు సిగరెట్టు అయిపోయింది. వెంటనే యింకొక సిగరెట్టుతీసి, వెలిగించి గుప్పున పొగవిడుస్తూ, 'మిస్——పేరేదో జ్ఞాపకం లేదు మాస్నేహితుడు చెప్పాడుకాని.......' 'అయితే మొదటి ఫాదిరీగారికథ అయిపోయిందన్నమాట. ఇది రెండవది కాబోలు' నన్నాడు మా ప్రభూ.

'కాదు. కాదు. విను. తొందరపడతావేం బాబూ' అంటూ, 'ఆ! అన్నట్టు యెంతవరకుచెప్పాను? మిస్——ఆంగ్లోయిండియనులపిల్ల. సౌందర్యవతి. చదువుకున్నదికూడాను. యౌవనవతి అయింది. వాళ్ళలో తగిన కట్టుబాట్లు వుండవన్నవిషయం జగద్విదితమేకదా! అందువల్ల యౌవనవతులకు సహజంగా కలిగేవికారాలు ఆమెకుగూడా కలిగినై. ఆ రోజుల్లో, యువకులలో ఆమె తెలియనివారు,— అంతేకాదు,— పరిచయంలేనివారు, సామాన్యంగా లేరనేచెప్పవచ్చు.

కాలంగడిచింది. దానితోపాటు ఆమె సౌందర్యం కూడా గతించింది. వెనుక ఆమె సౌందర్యానికి ముగ్ధులయినవాళ్ళెవరూ ఆమె నిప్పుడు కన్నెత్తివినా చూడటంలేదు. పాపం ఆమె యౌవనంలో విచ్చలవిడిగా సంచరించినందుకు ఫలితంగా, వ్యాధులు చుట్టుకున్నై. మంచం పట్టింది.

వ్యాధిగ్రస్తులను పరామర్శచేసి, వారికి తగిన ఔషధసేవచేయించి, దేహస్వాస్థ్యం కలుగచేయటం మన ఫాదిరీగారి దినచర్యలో ముఖ్యమయినవిషయం. ఆంగ్లోయిండియను వనితయొక్క కష్టాలు, ఫాదిరీగారి హృదయాన్ని ద్రవింపచేసినై. ఆమెకు తనగదిలోనేచోటిచ్చి తనే ఔషధసేవ చేయిస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు అవనిత 'అయ్యా! నేను మహాపాపిని. భగవంతుడు నన్ను రక్షిస్తాడా? వట్టిది. నావంటి మహాపాపులు భగవంతుని కరుణకు పాత్రులా? కల్ల.' అని నిరుత్సాహంతో ఫాదిరీని అడిగేది. 'బిడ్డా! భగవంతుడు కరుణాసముద్రుడు. హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడితే చాలు భగవంతునికి. కాని నీకు దేహస్వాస్థ్యంకలగనీ. లేనిపోని విషయాలతో మనస్సు కలవరపెట్టుకోకు' మని ఫాదిరీ ఓదారుస్తూవుండే వాడామెను.

రోజులుజరిగినకొద్దీ పాపంపెరిగినట్లు పెరిగిపోయింది వ్యాధి. తనచేతికి తప్పిందనుకొన్నాడు ఫాదిరీ. ఆవూళ్ళోవుండే డాక్టరును పిలిచి చూపించాడు. 'నిశ్చయం మాత్రం చెప్పలే'నని ముందరేచెప్పి డాక్టరు మందులిస్తూనేవున్నాడు.

ఒకరోజున వ్యాధి యెక్కువయింది. యౌవనంలో తాను చేసిన మహాపరాధాలన్నీకూడా బ్రహ్మరాక్షసుల రూపంతో మింగటానికివస్తున్నవి కాబోలు ఆమె పెద్దపెట్టున కెవ్వుమని కేకలువేసింది. ఫాదిరీగారికి భయంవేసింది. డాక్టరును పిలిపించాడు. ఆయన లాభంలేదని పెదిమలువిరిచాడు. 'కాని, నేనొక యింజక్షను యిస్తాను. దానివల్ల ఒకగంటకాలం తెలివికలిగివుంటుంది. లేకపోతే యిప్పుడే ప్రాణం పోతుం'దన్నాడు డాక్టరుగారు. ఫాదిరీగారు దానికి సమ్మతించాడు.

మిస్——కు తెలివివచ్చింది. అన్నదిగదా ఫాదిరీతో 'అయ్యా! నా అవసానదశ యేమో దగ్గరకు వచ్చింది. యౌవనమదోన్మత్తతచేత చేయరానికార్యాలు చేశాను. ఘోరపాపిని. కాబట్టి నాకు మారుగా మీరు నాతప్పులను మన్నించేటట్లు యేసును ప్రార్థింపకోరు

తాను. ఇదే నా అంత్యప్రార్థన' అని. ఫాదిరీ కన్నీళ్ళు కార్చాడు. మిస్——'అయ్యో! త్వరగా' నన్నది. ఫాదిరీ కలం, కాగితం తీసుకొని ఆమె తప్పిదాలన్నిటినీ వరుసగా వ్రాసుకున్నాడు. 'మిమ్మల్ని ఆ లోకంలో కలుసుకుంటా'నన్నది ఆమె. 'బిడ్డా! నీ హృదయపూర్వక పశ్చాత్తాపమే నిన్ను స్వర్గధామానికి చేరుస్తుంది. నీవు సుఖంగా ప్రాణం విడువవలసింది' అంటూ ఆయన ఆశీర్వదించడానికి ఎత్తినచేయి ఎత్తినట్టుగానే వున్నది. ఆమె ప్రాణం విడిచింది.

* * *

ఆరోజు ఆదివారం క్రైస్తవాలయానికి వెళ్ళి, కాగితంలో వ్రాసివున్న తప్పిదాలన్నిటిని యేసును నివేదించి, ఆమెను రక్షించమని అనేకవిధాల ప్రార్థించాడు ఫాదిరీగారు. మనస్సు మనస్సులో లేదు. ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నభోజనం చేశాడు. తలకాయ నొప్పిగా వున్నట్టు కనబడ్డది. ఆశ్చర్యపడ్డాడు ఫాదిరీగారు. తనజీవితంలో యింతవరకు ఒక్కతలనొప్పి కాదు, యేవిధమయిన శరీరబాధా ఎరుగడు. అనేక ఆలోచనలుపోయినై మనస్సులో. 'మృత్యువు ఎప్పుడూ తప్పు తనమీదవుంచుకోదు' అనుకున్నాడు పడుకుని. ఆమాట పెదిమలు దాటివచ్చింది. కళ్ళు తిరిగిపోతున్నై. ఎవరో ఒకవ్యక్తి కనిపించి 'అవసానదశ సమీపించింది. రమ్మ'న్నట్లు సంజ్ఞచేసింది. 'వస్తున్నా' నన్నాడు ఫాదిరీగారు కొంచెం బిగ్గరగా, చేతిలో తాళకం తిప్పుకుంటూ. 'వస్తున్నా'నన్నమాట యింట్లో వున్న బొట్లరుకు వినపడ్డది. వాడు పరుగెత్తుకుంటూ వచ్చి 'అయ్యో! అయ్యో!' అంటూ మంచంచుట్టూ తిరగటం ప్రారంభించాడు పాపం. ఫాదిరీ మనస్సు ఇహలోలేదు. వెర్రిచూపు చూస్తున్నాడు. అంత అవస్థలో వుండికూడా, దేనికొరకో పాపం ఫాదిరీ చెయ్యిచాపి బీర్వావైపు చూపాడు. అదేమిటో అర్థంకాలేదా అమాయకపుబొట్లరుకు. కళవళపడ్డాడు. 'అయ్యో! ఏమిటి! ఏమిటి!! అయ్యో! అయ్యో! మాటలేదే! ఇంతలోకే ముంచుకువచ్చిందా.' అని తలబాదుకున్నాడా బొట్లరు. ఫాదిరీ కళ్ళవెంబడి నీరుకారుతూ ప్రాణంవదిలాడు. అశ్రువులు చెంపలనుండిజారి పక్కను తడిపినై. దానికి కారణం ఎవరికీ తెలియలేదు మొట్టమొదటలో.

పాపం ఆయన మరణాన్నిగురించి చుట్టుప్రక్కల గ్రామాదులలో విచారించనివారులేరు. సీమలోని క్రైస్తవసంఘంవారుకూడా చాలా విచారించారు. ఇతర ప్రాంతాల్లో మతప్రచారంచేస్తున్న ఒకఫాదిరీగారిని చనిపోయిన ఫాదిరీగారిస్థానంలో నియమించారు. ఆఫాదరీగారు వచ్చాడు వుద్యోగం స్వీకరించటానికి. వచ్చి ఆఫీసులోకి అడుగుపెట్టాడో లేదో గుండెపగిలిపోయింది. వెనకటిఫాదిరీగారు యథాప్రకారంగా కుర్చీలో కూర్చున్నాడు. చచ్చిపోయిన ఫాదిరీ మళ్ళీ ఎట్లావచ్చాడు చెప్మా అని నిర్ఘాంతపోయినాడు కొత్త ఫాదిరీగారు, కాళ్ళు నిలువలేదు. తాను కలకంటున్నాడా? లేకపోతే మతిభ్రమించిందా? కాదు. కాదు. నిజంగానే. సాక్షాత్తు ఆ నెరసినగడ్డం, తెల్లటిగౌనూ, చిరునవ్వు నవ్వుతూన్న మొహం, అన్నీచూస్తే మూడుమూర్తులా ఆఫాదిరీగారే. సందేహంలేదు. పాపం కొత్తఫాదిరీగారికి వళ్ళు ముచ్చెమటలుపోసినై. జీవితంలో తానింతవరకు యిటువంటి దృశ్యం చూడలేదు. చూడకపోవుటయేకాదు, విని కూడా ఎరుగడు. తడబడేకాళ్ళతో గబగబా తలుపు మూశాడు. ఈవింతవిషయం సీమలోని 'సంఘం' వారికి తెలియబరిచాడు. వారీవిషయం వినటంతోనే ఫక్కున నవ్వారు. కొత్త ఫాదిరీగారికి మతిభ్రమించిందనుకున్నారు. ఇంకొక ఫాదిరీగారిని నియమించారా స్థానంలో. ఆయనకూ వెనకటివాని అవస్థేపాపం. తనవల్లకాదని చెప్పుకున్నాడు సీమలోవారితో. వారు ఇంకొకరిని నియమించారు. ఇదే అవస్థ మళ్ళీను. 'సంఘం' వారికి విసుకుపుట్టింది. పర్యవసానాన్ని కాలానికి వదిలిపెట్టి 'గప్ చిప్'గా వూరుకున్నారు.'

ఈ మాటలు చెపుతూనే ఆ పెద్దమనిషి జేబులో చేయిపెట్టాడు సిగరెట్టు తీసికోడానికి.

ప్రభూ అన్నాడుగదా ఆయనతో 'క్రైస్తవసంఘమువారనుకున్నదే నిజం. బహుశః ఈఫాదిరీలకు మతిభ్రమించి వుండొచ్చు'అని. 'ఒక్కరికి మతిభ్రమించిందంటే అర్థంవుంది. కాని ప్రతివాడికీనా? అసంభవం'అన్నా నేను.

మా పెద్దమనిషి చిరునవ్వునవ్వుతూ 'తొందరపడకండి. ఈసంగతంతా మాస్నేహితుడు అసలు విషయం జరిగినతర్వాత చెప్పినది. ఇంతకూ నా అనుభవంసంగతి చెప్పనేలేదు. మొట్టమొదట నేనదేకాదు మీకు చెప్తానన్నది? అప్పుడే మరచిపోయినారా?' అన్నాడు.

నేను కుతూహలంతో ముందుకు జరిగాను. ఆయన మళ్ళీ ప్రారంభించాడు.

'నేను కొన్నాళ్ళు మైసూరుసంస్థానంలో వుద్యోగం చేశాను. మాస్నేహితుడొకాయన దగ్గరగానున్న ఒక వూళ్ళో వుద్యోగంచేస్తున్నాడు. వాళ్ళవూరికి రమ్మనమని బలవంతపెట్టాడు నన్ను చాలాసార్లు. ఏదో ఉద్యోగపు పనులలో తీరికలేకపోవడంవల్ల 'వస్తాలే, వస్తాలే' అంటూ కాలాయిస్తూవచ్చాను.

ఒకసారి శనిఆదివారాల శెలవలుకలిసి రావడంవల్ల, మాస్నేహితుడిని చూసివద్దామని బయలుదేరాను శుక్రవారంనాడు సాయంత్రం నేను మా స్నేహితుడి వూరు చేరేటప్పటికి దాదాపు తొమ్మిదిగంటలయింది. మా స్నేహితుడు వుంటున్నది పెద్దమేడ. కిందిభాగమంతా యెందువల్లనో శూన్యంగావున్నది. పైభాగం అద్దెకు తీసికొని మాస్నేహితుడుంటున్నాడు. క్రిందిభాగంలో పెద్దవసారావున్నది. దాంట్లో ఒకవైపు మేడమీదికి వెళ్ళటానికి మెట్లున్నూ, రెండోవైపు ఒకగదిన్నీ. ఆగది తలుపు తెరచివుంది. మేడమీదికి వెళ్ళటానికి నేను మొదటిగెట్టుమీద కాలుపెట్టి వెనక్కు తిరిగిచూశాను. గదిలో ఒక తెల్లటిమనిషి కూర్చున్నాడు కుర్చీలో. వంటినిండా తెల్లటిగౌను, నెరసినగడ్డం, మెళ్ళో క్రాసు చూసి యీయన ఒక క్రైస్తవమతప్రచారకు డనుకున్నాను. ఆయన నన్ను రమ్మని చేతితో సంజ్ఞచేశాడు. నేనువెళ్ళి పక్కనున్న బల్లమీదకూర్చున్నాను. ఆయన నాతో యేమీ మాట్లాడలేదు. నేనూ మౌనంగానే కూర్చున్నాను. ఆవిధంగా రెండు మూడు నిమిషాలు గడచినై తరువాత ఆయన లేచినుంచొని తనతో రమ్మని నాకు సంజ్ఞచేశాడు.

ఆయనముందర నడుస్తున్నాడు. ఆయనవెనుక నేను గొర్రెవలె తలకాయవంచుకొని నడుస్తున్నాను. కొంత దూరం నడిచేటప్పటికి, గుండె ఝల్లుమన్నది. పైప్రాణాలు పైనే పోయినై. నాకళ్ళు అప్రయత్నంగా ఆయన పాదాలమీదపడ్డై. ఆవ్యక్తిపాదాలు మనపాదాలకు మల్లేలేవు. ఆయన ముందరకు నడుస్తున్నా పాదాలు వెనక్కున్నై. నాకు వళ్ళంతా చెమటపోసింది. లోపల దడ పుట్టింది. కాళ్ళు గజగజ వణికిపోతున్నై. నిదానించి చూశాను. చేతులూ అట్లాగేవున్నై. ఆవిషయం యిప్పుడైనాసరే తలచుకుంటే అదృశ్యం కళ్ళముందర కట్టినట్లుపడుతుంది. (అంటూ భయం అభినయించాడా పెద్దమనిషి) పెద్దగా అరుద్దామనుకున్నా, కాని గొంతు కదలేదు. ఎట్లాగయినా సరే గొంతు పెకలించుకొని అరుద్దామా అంటే, యిక్కడివాణ్ణి యిక్కడనే మాయ్చేస్తుందేమో దయ్యం అన్నభయం. ఆ భయంలోనే ఆ దడదడతోనే, నా చెయ్యి వెనక్కుపోనిచ్చి మెల్లగా, చప్పుడు కాకుండా, వీపు తట్టుకున్నాను. ఆబుద్ధి నాకెట్లా తోచిందో తలుచుకుంటే నాకిప్పుడూ నవ్వువస్తుంది (అంటూ ఒక్క చిరునవ్వు నవ్వాడు). నిస్పృహతో కూడిన ధైర్యం తెచ్చుకున్నాను. ముందుకు సాగాను అవ్యక్తిని కలుసుకోటానికి. చప్పుడుగాకుండానే అడుగులు వేస్తూ, చప్పుడుచేస్తే దయ్యం యేంచేస్తుందో నన్నభయమే.

అవ్యక్తి బీరువాదగ్గర ఆగింది. బీరువా తలుపు తెరవమన్నట్టుగా సంజ్ఞచేశాడావ్యక్తి. అక్కడనేవున్న తాళపుగుత్తి సహాయంతో తలుపుతీశాను. వేలుపెట్టి చూపుతూ దాంట్లోవున్న బైబిలుగ్రంథాన్ని పైకితీయమన్నట్టు సంజ్ఞచేశాడావ్యక్తి. పుస్తకం బైటికితీశాను. తెరవమన్నట్టుగా సంజ్ఞవచ్చింది మళ్ళీ. పుస్తకం తెరవగానే దాంట్లో ఒకకాగితం అగుపడ్డది. ఆ కాగితం అగుపడగానే అవ్యక్తిముఖాన సంతోషం తాండవమాడింది. ఆ కాగితాన్ని తగులపెట్టమన్నట్టుగా సంజ్ఞవచ్చిందావ్యక్తి దగ్గరనుంచి. ఈ ఆఖరిసంజ్ఞ మాత్రం నేనతి కష్టంమీదగాని అర్థంచేసికోలేకపోయినాను. జేబులోనుంచి నిప్పుపెట్టెతీసి కాగితాన్ని తగలేశాను. ఆకాగితం తగులబడటం పూర్తిఅయిందో, లేదో దయ్యం మాయమైంది. నేను కవ్వునకేక వేసి క్రిందబడిపోయాను. తరువాత యేమిజరిగిందో నాకు తెలియదు. కళ్ళుతెరిచి

చూసేటప్పటికి, నేను పేడమీదవున్నాను. మా స్నేహితుడు నాకు వుపచారాలు చేస్తున్నాడు. తిరిగి అరగంటలకు గాని నేను మనిషిని కాలేదు.

ఇంతలోకే బెజవాడస్టేషనువచ్చింది. ప్రభూ, నేను 'వెళ్ళివస్తా'మని పెద్దమనిషితో చెప్పి రైలుదిగి వచ్చేశాం. దిగి ఇంటికివెళ్ళుతూ 'పెద్దవాళ్ళు చెప్పేది అబద్ధమా? ఏదైనా ప్రాణంతో సమానమయిన కోరికలుంటే మనిషి చచ్చిపోయినప్పటికీ పిశాచంగా జన్మించి కోరిక తీర్చుకుంటాడుగదా' అన్నాను. 'ఈయన దెవరో బలేవాడులాగున్నాడు. మనలను పిచ్చివాళ్ళనుచేసి యేదో కథ చెప్పాడు. లేకపోతే యీయనస్నేహితుడేమిటి? ఎక్కడనో దయ్యాలకొంపలో వుండటమేమిటి? ఎవరన్నా అటువంటి పనిచేస్తాడా? ఇదంతా శుద్ధఅబద్ధం' అన్నాడు ప్రభూ.

—క. సాంబమూర్తి.



"అలరెడురెప్ప లల్లార్చినయందాక
అనిమిషకన్య గాదనగ వచ్చె!"

ఓ నాథ!

కారుచీకటి పొగల మేఘములు క్రమ్మ
ప్రకృతి భీభత్సగంభీరమయ్యె నవుడు,
ఆ వికృత మేఘ మేలొకో యశ్రువులను
రాల్చి పయనమ్ము సాగించె, రాత్రి సాము
గడచిచనె, హోరుమనుచును గాలి సాగె.
ఆక్రమవ్యాప్త శైతల్య—మందు శీత
పవను సాహాయ్య మకట! ఎవ్వండుమాన్పు;
మరణబాధాప్రభుగ్నుడై పొరలు నతని
చల్లనై పోవుచున్న నిశ్వాసములకు
దీపికలు నారిపోయె, సందీప్త మరణ
మసితరకోమలమ్మగు నధర మయ్యె!
వాడుచున్న దిదేమి దుష్ప్రాప్తి నాథ!
క్రమ్ముకొనివచ్చు దుఃఖాశ్రు కణములకును
తడియు భూతలమున స్మృతితప్పిపోయె,
వింటికొనదూసి వెడలి ఉవ్వెత్తుగాగ
వచ్చుశర వేగమున నీదు స్వామిరథము
అదియె! చేరువ కేవచ్చె ననుట నాదు
హృదయకుహరాంతరమున ధ్వనించెనయ్యె!
కాలుసేతులు గదుప శక్యమ్ముగాదు.
సంధిసంధియువిరిగె; నిశ్చలత గుదిరె
నదియు మద్హృదయనాథరథాంగపటువి
ఘట్టనప్రాప్తినాట, నుత్కంఠ, లేవ
గా బెనగి, నీల్గి, యుబికి, ఎక్కడకొ ఆని
శానమయమున తూలుచు శ్వాసలెగయ
తడబడుచు పరువులెత్త రథమ్ముగంటి.
నాల్కతడియార, నాథ! ఓ—నాథ! యనుటె
గాని, రావయ్యె భావముల్ ...కదలిపోయె
రథము, నాతోంటిచోట సర్వము శూన్య
మై చనియె, కంటిలోపాప యంతరించె.
ఈమహారక్తపాతమే హితవా నాథ!
నాథ!.... ... .ఓ—— నాథ!

—ఊటుకూరు సత్యనారాయణరావు.



మ. ....

.........................ముక్తాహారకర్పూరసాం

ద్రపరాగప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్త్రిగా

శ్లేషవ్యంగమునట్లు జీవులకు హృద్యంబే? కడున్ శీతమే?

ఉ. తనయుని మొఁగంబుపై మొఁగము దార్చి తళ్తళ లీను చెక్కు మూ

ర్కొని సకలాంగముల్ తడిగ గుర్పొడువన్ననుఁ గన్న యన్న ర

మ్మని పలుమాఱుఁ బిల్చుచును హర్షపయోనిధి నోలలాడఁ జా

లని యతిమందభాగ్యుల కిలాస్థలియందున జన్మ మేటికిన్ ?

తేటిబోటి

ఏమే భ్రమరాంగన! ఇట్లేమొయి దిరుగాడుచుంటి వేటికి? ప్రణయ
శ్రీమహితుడు ప్రాణేశ్వరు, డేమే! పెడబాసి చనియనే? నుడువగదే!
ఎక్కడివాడె యింత బులిపింపుల బుచ్చెడి మాయకాడు? ప్రా
ద్దెక్కక మున్న లేచి పను లేమొ మునింగినకీలి పూవుట
మ్మక్కలచేరి ఇచ్చకము లాడుచు కాలము ద్రోసిపుచ్చు ఈ
టక్కరి మాయదారుల తఃటారిని నీవెటు గట్టుకొంటివే?
అన్వా! వచింప సిగ్గు; అదియూ మరియాద? కులాని కంశయున్
రవ్వను దెచ్చుపోకిళులె? రాతిరియుం పవలంచు లేదె! ఇ
ట్లివ్విధి.—రామరామ!! చరియించుట ఇంచునె నీకుగూడ? ఆ
పువ్వులు రాలిపోను! తలపుంగొనడేమి రవంత నీయెడన్?
ఏటికి! ముద్దరాల వతడే తనమాటలు నిల్పజాల డీ
పాటికి చాలులే! వెదకి వానికి వేసరిపోయినావు ఆ
లాటి సుహానురూపసువిలాసి లభింపక పోడు! తేటిబో
టీ! టకటొంకు కూరిమి నటించెడి వారలతో పనేమిటే!
తూగుపు తెల్లవారినది దొట్టి చెలీ! మునిమాపుదన్క సం
చారములు, ఇంటి మాబిడ విచారము దూరము; వాడవాడ సిం
గారపు టుత్సవమ్ములు బికారిమగండిక చాలు! ఏలక
న్నీరొలికింతు వింతయు గణింపని యీ వెడచెల్మి నేతకున్?
ఓపిక ఏది కాల్ నిలిపియుంచి సుఖింపగ ఇంటిపట్టునందు?
ఈపరువంపు నీవయసు కేదిసమానము! నిన్నవిచ్చి ఈ
మాపున వాడిపోవుచు దుమారముదోగెడి రాలుపూవు లే
తీవులు గూర్చువానికి సతీ! అతడీవలపే యెరుంగడే!
ఇంటనె కాదు పో; నిముసమెచ్చట పాదము మోపడు. ఒక్కవా
ల్గంటియె కాదు, రోజునకు లక్షలు - కోటులు - అర్బుదాలు - మి
న్నంటులు;—చూడ మీమమత లామొనగానికి జెల్లగాని! ఇ
ట్లంటియు నంటకుండ తిరుగాడుటయే మతమేమొ వానికిన్?
ఇంతకు నీవెరుంగవనియే తలపోసెద. వీధిబడ్డ నీ
మంతిను లిందగుండ మతిమాలినవాడగుగాక పద్మినిన్
చెంతకు నేరునే! బ్రదికె నీదగు తాళిబలాన; భూమిపై
నింతకు నూకలున్నవి మహోగ్రుడు దాని సకుం డెరింగినన్.
పాయని ఈ వియోగమున పాపము! పాముయి నావు నీవు మీ
ఆయన తోడిచెల్మి మలయానిల నందను దవ్వుదవ్వు డా
ప్యాయన మేర్పడం దిరుగువాడు, అగుపించిన వానిజాడలన్
దీయనువచ్చు కష్టపడి. తెల్పితి నా ఎరుగున్న సంగతుల్.

ప్రతివచనము:—

అమ్మకచెల్ల! ఆత డెడకైనవు డాత్మను పట్టరాని కో
పమ్మున కక్షబూని కలబంధము తెంపులు సేసుకొందు గా
నిమ్ము, హఠాత్తుగా ఎదుట నిల్చినవేళల నే నెరుంగ కే
సొమ్మసిలున్ మనమ్ము, ఒడిచొచ్చును మేను; ముఖమ్ము ముద్దిడున్.
అతనిదై పోయె ఈ హృదయమ్ము నమ్ము, ఒక్కగడియ ఎడాటమే ఓర్వజాల
సన్నిధిని నున్న లేకున్న జాలువారు. ఏటిమమతలో ఎరుగ! —కన్నీటివరద.

—బొడ్డు బాపిరాజు.

ఉత్తరములు

కల మనసిచ్చినట్టి జతగాడనుచున్ దలపుంచి రాకరా
కలకయి చిన్నికల్పవులు కన్నులు కాయలు గాయచూచి ఊ
ర్పులసెగ ద్రోసిపుచ్చె; నెనరుంగలవాడె హితుండుకాని, లో
కులతరహా లెరుంగ నదిగోల, అమాస స్మరింపదయ్యెగా!
'క్రమ్మరవత్తు' నంచు చెలికాడు మధుప్రియు డానగొన్నమా
త్రమున నమ్మి చేతికిని దక్కిన యాతని—మాతమిద్ది కా
ని—మ్మని పోవనిచ్చితివి; నెన్నుది నీదరినున్న మేలి కా
లమ్మున రేకులన్ విచికిలా! బలవంతమునన్ బిగింపవు, ఆ
త్రిమ్మరి కేటిబాస? పలుతీరులు ప్రొద్దొగవింతచెయ్దముల్!
అతిపిపాసాకులాత్మ కృశాంగియయ్యు, తొలకరితలంపులాగ మిన్నులనుగాంచు
అకట! చాతకి తనదప్పి యార్పుకొనగ, నీళ్ళు కరవయ్యెనే ధరణీతలాన?..'రాజు'

ఏమని నిందమోపి సహించును పద్మిని? లోకబాంధవుం
డా మగడొక్కచోట దనయానతిపై నిముసమ్ము నిల్చి, ప్రే
మామృతధారజిల్క మనసారగ బల్కడటంచు; లోన దా
నేమి యెఱుంగదే? పతి యహీనమనఃప్రియతానురాగముల్.
ఆమనిరాకగోరి హృదయంబున తల్లడమందనేల నీ
వీమెయి కోకిలా! మనను నించుక నిశ్యమొనర్చుకొమ్ము. రా
కేమి ప్రియమ్ము కల్గినపు డింతట నంతట, నీదు స్వాగతం
బేమని రిత్తపుచ్చగల దీమధుమాసము? గుండెలున్న వే!
"చని. మలు సంజవేళ కిటుసాగుము; చీకటివడ్డ ద్వారముల్
మునుపటివోలె మూయబడ మోనమొనర్చితి నందు"వంచు ప
ద్మినియనుపల్కు లో హతవిధీ! నిజమాయెనటంచుగుండు దే
మనెద? మధువ్రతా! మఱల నామలుసంజయె రాకపోవునా?

—'శర్మ'

మణిమాల

హిందూదేశములో పోస్టుకార్డుచరిత్ర

1854 వ సంవత్సరమునకు పూర్వము హిందూదేశమున పోస్టాఫీసులకు ఒక క్రమనిర్మాణముగాని, ఒక నీతినియమముగాని లేదు. ఒకరాష్ట్రమునమున్న నియమములు మఱియొకరాష్ట్రమున లేవు. ఒక జిల్లాలో పోస్టు ఆఫీసుల నిర్వహణమునకు ఆ జిల్లాకలక్టరు బాధ్యుడై యుండెను. కెయిన్‌రైన్‌ల టపా బట్వాడా నేటి వలె నాడు ఏర్పడియుండలేదు. స్టాంపులులేవు. దూరమునుబట్టి రేట్లనిర్ణయము జరుగునది. ఒకతావునుండి మఱియొకతావునకు దూరమెంతో సరిగా నిర్ణయింపబడియుండలేదు. కావున దూరనిర్ణయము పోస్టల్ క్లార్కు చేతిలోనుండెను. అతని చేతిలో నాలుగుడబ్బులుపెట్టిన వాడివిషయమున దూరస్థలములు కొంచము చేరువవుచుండెను. పెద్దపెద్ద పోస్టాఫీసులలోని ఆనాటిక్లార్కులకు 'సైడుదొరకడం' చాల ఎక్కువగానుండెను. 1854-వ సంవత్సరములో పోస్టుఆఫీసు ఆక్టు ఆమోదింపబడెను. అప్పటినుండియు పోస్టుఆఫీసులపరిపాలన కేంద్రప్రభుత్వమునకు లోబడెను. హిందూదేశమున పోస్టుకార్డులు 1879-వ సంవత్సరమున మొదటిసారి ప్రవేశపెట్టబడెను. నేడు పోస్టుఆఫీసులద్వారా బట్వాడాఅగు వస్తువులలో దరిదాపు సగము కార్డులే. ఈ కార్డులప్రవేశము తొలుత ప్రజలచే మిక్కిలి అనుమానముతో చూడబడెను. కాని మిక్కిలి చౌకయగుటచే అచిరకాలముననే అవి విశేష ప్రచారమునందెను. హిందూదేశపు దినపత్రికలలో చిర ప్రతిష్ఠ నార్జించిన అమృతబజారుపత్రిక 1879-వ సంవత్సరము జూలై 18-వ తేదీనాటి సంచికలో ఈ పోస్టుకార్డుల ప్రవేశమునుగూర్చి ఇట్లు సంపాదకీయము వ్రాసెను: "ప్రస్తుతము పోస్టుకార్డులు హిందూదేశమునంతటను ప్రాకిపోవుచున్నవి. ప్రభుత్వమువారు ప్రజలరహస్యములను కనుగొనుటకు వీనిని ప్రవేశపెట్టిరనువారు కలరు. కార్డులోని విషయములు ఇతరులకు తెలియకుండుటకై తమవ్రాతను ప్రయత్నపూర్వకముగ జిలుగు కత్తులలోనికి కొందఱు దింపుచున్నారు. కొందఱు వట్టి పొడి అక్షరములను వ్రాయుచున్నారు. ఆపొడి అక్షరములు పోస్టల్ క్లార్కులకేగాక చిరునామాదారునకు కూడ తెలియరానిస్థితిలో ఉంటున్నవి. పోస్టులోగాని, సొంతమనుష్యులచేతగాని పంపు ఉత్తరములన్నియు ఈ కార్డులమీదనే వ్రాయవలయునని ప్రభుత్వమువారి ఆజ్ఞఅయినట్లు కొందఱు అభిప్రాయపడుచున్నారు. ఒక కార్డుమీద పరిపోవని విషయములు కవరువల్ల పంపవచ్చుననుట కొందఱికి తెలియదు. రాజభక్తుడగు ఒకలావుపాటి జమీందారు ఈనడుమ ఈకారణముచే తాను తన తాబేదారునకు వ్రాయవలసిన విషయములను పదికార్డులమీద వరుసగావ్రాసి తన అజ్ఞానమును వెల్లడించెను. మఱికొందరు తాము వ్రాయవలసిన విషయములను కార్డులమీదవ్రాసి వానిని కవరులోపెట్టి కవరు అంటించి దానికి అర్ధణాబిళ్ళ అతికించి పోస్టుచేయుచున్నారు. పైగా ఇంతటి వ్యయమునకు మమ్ము ఏల పాల్పఱచెదరని ప్రభుత్వమునుగూర్చి వారు ఆందోళన చేయుచున్నారు. రాజద్రోహము పురికొల్పు కంకణము కట్టుకొన్న దేశభాషాపత్రికలు ఈ విషయమును జార విడువవని నమ్ముచున్నాము. ఈ పోస్టుకార్డుల విషయమైన ఒక పెద్దకష్టమేదియన ఏ ప్రక్కను చిరునామా వ్రాయవలయునో అనునది నేర్పుట. ఇది అందఱికి నేర్పుటకు కొద్ది సంవత్సరములుపట్టునని తలంతుము. కావున ఒక్కసంగతి. చిరునామా ఏ ప్రక్కను వ్రాసినను అభ్యంతరముండకుండుట మంచిది. బ్రిటీషువారి చల్లనిప్రభుత్వముక్రింద బ్రతుకుచున్న ఈహిందూదేశపు ప్రజలకు వారి ఇష్టమువచ్చినట్లు కార్డులమీద ఏప్రక్కనైనను చిరునామా వ్రాయుటకు హక్కు ఉండవలయునని మేము అభిప్రాయపడుచున్నాము." ఆనాటి అమృతబజారుపత్రికవారి అభిప్రాయము ప్రకారము పోస్టు

కార్డుమీద ఏ దిక్కునైన, ఏ ప్రక్కనైన చిరునామా వ్రాయు హక్కు ప్రజలకు ఈయబడియుండినచో పోస్టాఫీసులో పార్సర్లపని ఏనాటికానాడే చావుతప్పి కన్ను లొట్టపోవుచుండియుండును. ఇంతేకాను నేడు ఆ అమృతబజారుపత్రికయే ఆనాటి తన సంపాదకీయముతో ఏకీభవింపదని నిస్సంశయముగ చెప్పవలసియుండును. 1879 మొదలు పదియేండ్లక్రితమువరకు కానీ విలువలో నుండిన పోస్టుకార్డు నేడు మూడుకానులమ్ముచున్నది. అన్నివస్తువులకు ధరలుతగ్గిన ఈ కలియుగపు రోజులలోకూడ పోస్టుకార్డుధర మన ప్రభుత్వమువారి దయవలన తగ్గలేదు. తోకలేకుండ తొంబదిఆమడ పోగల పిట్ట అని పొడుపుకథలలో వర్ణింపబడు పోస్టుకార్డువెల తొమ్మిది పైసాలు ఉండడం ప్రభుత్వంవారికి వింతగ నుండకపోవచ్చును. కాని ప్రజలకు...ప్రజలమాట ఎవరికికావలెను?

— ఆర్. శ్రీరామమూర్తి, బి.ఏ.

* * *

ఆయుర్వేదవైద్యుల శస్త్రకర్మాభ్యాసము

'ఆంధ్రభూమి' ఫిబ్రవరి సంచికయందు ప్రకటింపబడిన విపులవిజ్ఞానదమును, విశేషవినోదకరమును అగు "శస్త్రవైద్యుల కరకౌశలము" అను వ్యాసరాజమును చూచిన తదుపరి పాఠకలోకమునకు ఆధునికశస్త్రవైద్యవిధానమునకంతటికిని మూలాధారమనదగు ప్రాచీనకాలమందు హైందవశస్త్రవైద్యశేఖరుల కరకౌశలవిద్యావిధానమునుకూడా విన్నవించుకొన బుద్ధిపడమటచే ఈపంక్తులు వ్రాయుచున్నాను. పూర్వకాలమందు శస్త్రవైద్యశేఖరులలో అగ్రగణ్యులనదగు శుశ్రుతాచార్యాదులు ప్రపంచమందలి దుఃఖపరంపరలకు కారణభూతములగు శారీరక మానసిక ఆగంతు అభిఘాతము లనువాని యుపద్రవములను, వానివలన ప్రజలకు గల్గుబాధలను చూచి సహింపలేనివారై భగవంతుడగు ధన్వంతరియొద్దకు జని ప్రజాహితార్థము రోగనివారణోపాయయుక్తమగు ఆయుర్వేదమహాశాస్త్రమును నేర్చుకొని మానవసేవకు గడంగియుండిరి. అందువలన అట్టి మహనీయులు ఎంతటి దయార్ద్రహృదయులో, ఎంతటి పరోపకారపారీణులో పాఠకమహాశయులకు విదితమేకదా! మరియు పూర్వము శస్త్రవైద్యము, (వైద్యవృత్తిని) శీలవంతులుమాత్రమే అభ్యసించుటకును ఆతురులను రక్షించుటకును, యశోవంతులగుటకును, అర్హతకలవారైయుండిరి. ఇదియునుగాక ప్రాచీనకాలమందు వైద్యవిద్యార్థులను సేకరించునప్పుడే యున్నతకుటుంబములందు జన్మించినట్టివారిని శీలశౌచఆచారవినయశక్తిబలమేధాధృతిస్మృతిసంపన్నులగువారిని, మతిమంతులగువారిని పరీక్షించి అర్హతవిచారించి వైద్యశాస్త్రమును అభ్యసింపచేయుచుండిరి. ఇతరులకు వైద్యవిద్య నేర్పుటకు కూడా సాహసించకుండిరి. ఇట్టి గుణగణవిరాజితులగు శిష్యవర్యులను కామక్రోధలోభమోహ అహంకార ఈర్ష్యాపారుష్యములకు వశ్యులనుకానీక సత్యవ్రతాచరణులుగను, బ్రహ్మచర్యతత్పరులుగను, మానవసేవకు అర్హులుగను ఒనర్చి క్రమశిక్షణొసంగి వైద్యపట్టము నొసంగుచుండిరి. అందువలన ఆకాలమందలి శస్త్రవైద్యులు ప్రజాసేవయే ప్రధానోద్దేశముగ నెంచి లోకమునకు వైద్యసహాయము నొనర్చుచుండిరి. మరియు శస్త్రవైద్యమునందు సమర్థులుకాగోరు వైద్యశేఖరులు శౌర్యము, అనుక్రియ, అస్వేదము, వణుకులేకయుండుట యీ మొదలగు గుణవిరాజితులుగ నుండవలయును. శస్త్రవైద్యునకు ప్రధానముగనుండవలసిన గుణములలో ప్రసన్నచిత్తము అత్యుత్తమమయినది. అట్లు ఉండుటకు సంతోషకరములగు పనులుచేయుట, వినోదములు దర్శించుట, యుల్లాసముగ మిత్రులతో సంభాషించుట అనునవి చేయుచుండవలయును. అందువలననే శుశ్రుతాచార్యుడు "ప్రసన్నచిత్తవాన్" అని చెప్పియున్నాడు. అందునను ముఖ్యముగ శస్త్రకర్మ చేయబోవుదినమునను దానిక్రిందటి దినమునకూడా ప్రసన్నచిత్తుడయి అనగా నిర్మలచిత్తముతో ఉండవలయును. అందువలన తాను చేయబోవు శస్త్రకర్మను గురించి బాగుగా ఆలోచించి దానిని ఎట్లు చేయవలయునో, ఏదిముందు చేయవలయునో అనువిషయమును బాగుగా తెలుసుకొనగలుగుచున్నాడు. అట్లుకాక చింతానిమగ్నుడయి రోగిని యుపచరించుటయందు అశ్రద్ధ, ఆయాసము, విముఖతచూపినయెడల అతడు

'శస్త్రవైద్యుల కరకౌశలము' అను వ్యాసమునందు డాక్టరు అబ్రహామ్ ఊల్ఫారాష్ట్ర చెప్పినటుల లోగికి యముడగునటుకు సందేహములేదు. పూర్వకాలమందు శస్త్రవైద్యులు వారి కరకౌశలమును వృద్ధిపొందించుటకు 8 విధములగు శస్త్రకర్మలను వారివారి అభిరుచి ననుసరించి యీ క్రింద చెప్పునటులచేసి వారి హస్తములకు నిపుణత అలవరచుకొనుచుండెడివారు.

(1) ఛేదనం:— ఇందు అత్యంతసమర్థులుకాగోరు శస్త్రవైద్యశేఖరులు వారివారికిసమయములందు బూడిద గుమ్మడికాయ, దోసకాయ మొదలగు వానిని పుష్పములను తీసిని ఛేదించి తమ కరకౌశలమును వృద్ధిచేసికొనుచుండిరి.

(2) లేఖనం:— (స్క్రైబింగు) ఈ కర్మయందు రోమములతోకూడిన చర్మములమీద వారు పరిశ్రమ చేయుచుండెడివారు.

(3) వేధనకర్మ:—(టాపింగు : రంధ్రముచేయుట) దీనియందు మృతపశువుయొక్క రక్తనాళములు గాని, ఉత్పలనాళములనుగాని గ్రహించి వానిమీద పరిశ్రమ చేయుచుండెడివారు.

4. ఏషణకర్మ:—(ప్రాబింగు : పుండు మొదలగు వానిని శోధించుట) ఇందు తామరతూడులు మొదలగు వానియందు పరిశ్రమచేసి అలవరచుకొనుచుండిరి.

(5) ఆహరణం:—(ఎక్స్ట్రాక్షన్ : ఊడదీయుట) ఇందు మృతపశుదంతములను మొదలగువానిని పెకలించి ఆకర్మయందు ప్రవీణతనందుచుండిరి.

(6) విస్రావణం:—(చీము మొదలగునవి వెలార్చుట) ఇందు లేతమైనయినమును బూరుగ చెక్కమీద ఒత్తుక పట్టించి దానిని కరిగించి స్రవింపచేసి అందు పరిపూర్ణత నందుచుండిరి.

(7) సీవనం:—(గాయమైనచోట చర్మమును చేర్చి కుట్టుట) ఇందు మృదుచర్మములను, వస్త్రములను మొదలగువానినికుట్టి ఆకర్మయందు ప్రవీణత నందుచుండిరి.

(8) బంధనం:—(గాయమునకుగాని పుంటికిగాని వస్త్రములో కట్టుకట్టుట) ఇందు వస్త్రములతోను తదితరమగు వానితోను తయారుచేయబడిన బొమ్మలయందు కట్టుకట్టి దానియందు సమర్థత సంపాదించుచుండిరి.

ఈ విధముగా శస్త్రకర్మలన్నిటియందును సమర్థత సంపాదించి బుజువర్తనులై పూర్వకాలమందు భారతశస్త్రవైద్యశేఖరులు ప్రస్తుత వైద్యశేఖరులకు మార్గదర్శకులై, శస్త్రవిద్యాభివృద్ధికి ప్రధానబీజములై సహస్రవత్సరములకు పూర్వమే ప్రజాసేవయొనర్చియుండిరి. కనుక ప్రస్తుత భారతవైద్యశేఖరులును ఆమార్గ మనుసరించి అభివృద్ధిపొంది ప్రాచీనగౌరవమును నిలబెట్టగలందులకు ఆశించుచున్నాము.

—ములుగు రాజలింగ ఆరాధ్య.

* * *

స్త్రీలు: గర్భధారణకాలము

గర్భవతులైన స్త్రీలను పలువురనడిగి తెలిసికొనిన విషయముల నాధారముచేసికొని జర్మనుశాస్త్రజ్ఞ డొకడు 'స్త్రీలు: గర్భధారణకాలము' అను విషయమును గూర్చి ఇట్లు తెలుపుచున్నాడు: "బుతుస్నానమైన పిమ్మట రజస్సు పూర్తిగకట్టుబడిన యనంతరము తొలి దినములలో గర్భములు నిలిచిన నిదర్శనములు పెక్కుగలవు. నేను పరీక్షించిన వారిలో ముట్టునెల ముందు దినములందు గర్భము ధరించినవారు ఒక్కరుకూడలేరు. ఆకాలము గర్భధారణకు కాలము కాదనియే చెప్పవలసియున్నది. బుతుస్నానమైన పిమ్మట గర్భధారణకాలమును సూక్ష్మదృష్టిలో మూడు భాగములుగ విభజింపవచ్చును. రజస్సు కనిపించిన మొదటి తొమ్మిదిరోజులు ఒకభాగము, పదియవదినము మొదలు పదునాలుగవ దినమువఱకు ఒకభాగము, పదునాలుగవదినము మొదలు ఇరువదిరెండవ దినము వఱకు ఒకభాగము. తరువాత ఆరుదినములు గర్భధారణకు అననుకూలము లని నా భావము. ఈ విషయమై నేను ఎనుబదిమంది గర్భవతులగు స్త్రీలలో సంప్రదించితిని. వారిగర్భధారణకాలమును గుర్తించి నోటుచేసికొంటిని. ఇందు మొదటి తొమ్మిది రోజులలోను గర్భముధరించిన కాంతలు నలుబదినలుగురు. అందు ముప్పదియేడుగురు మగబిడ్డలను, ఏడుగురు ఆడబిడ్డలను ప్రసవించిరి. తొమ్మిదిరోజులు దాటి పదునాలుగురోజులలోపు కాలమున గర్భము ధరించిన

కాంతలు పండ్రెండుగురు. అందు నలుగురు మగబిడ్డలను ఎనమండుగురు ఆడబిడ్డలను ప్రసవించిరి. పదునాలుగు దినములుదాటి ఇరువది రెండు రోజుల లోపల గర్భము దాల్చిన కాంతలు ఇరువదిముగ్గురు. అందుముగ్గురుబాలురను, ఇరువదిమంది బాలికలను ప్రసవించిరి. ఋతుస్నానమైనక్రొత్తలో గర్భముధరించిన వారు మగబిడ్డలను హెచ్చుగను, దినములు అతిక్రమించినకొలది గర్భము ధరించినవారు ఆడుబిడ్డలను హెచ్చుగను ప్రసవించుట గమనింపదగినది."

—మాత్రిమోనియల్ రెవ్యూ.

* * *

రూజువెల్టుసతి

అమెరికన్ అధ్యక్షుడు రూజువెల్టుగారిసతి ప్రజ్ఞాధురీణ, శక్తిసంపన్న. అపూర్వసామర్థ్యముగల అతివ. ఎంత క్లిష్టవిషయమునైనను సూక్ష్మముగ గ్రహింపగలది. అధ్యక్షమహాశయుని అర్ధాంగినిగదా యనుగర్వమామెకులేదు. ఆడంబరమనిన ఆమెకు గిట్టదు. తనభర్త నిర్వహించుచున్న ప్రభుత్వవిధానమున ఇతరులు అనుకొననియంత హెచ్చుపాలే ఆమెకు గలదని చెప్ప వలసియున్నది. నీలవర్ణపు ట్వీడ్ దుస్తులు ఆమెకు ప్రియతమములు. ప్రతిశనివారమునాడును ఆమె తనకు ప్రియతమమైన బ్లూట్వీడ్ దుస్తులను ధరించి, 'పెగ్గీ' అను పేరుగల తనపెంపుడుకుక్కవెంటనంటి గానుకుచ్చెళ్లను జీరాడుచుండగా మగని కార్యనిర్వాహకశాఖాకార్యాలయమందిరము నతిక్రమించి తన మందిరమునకుపోవును. అచ్చట ఆమె వార్తాపత్రికలప్రతినిధులతో ముచ్చటించును. అమెరికాదేశమున అధ్యక్షుడనగా ప్రధమ పౌరుడు. అట్టిప్రధమపౌరుని అర్ధాంగలక్ష్మి వార్తాపత్రికల ప్రతినిధులతో కలసి ముచ్చటించుట ప్రజాస్వామికమునకు ప్రారంభసీమ యనదగిన ఆదేశమునకూడ ఆశ్చర్యకరవిషయమే. మఱియు, నామె వారమునకు ఒకసారి వాషింగ్టన్ నందలి వార్తాపత్రికానిర్వాహకురాండ్ర నెల్లర రప్పించి వైట్ హౌసునందు ఒకప్రత్యేకమందిరమున సమావేశము గావించును."

—ది అమెరికన్ మాగజీన్.

కన్యలు: చక్కిలిగింత

అమెరికన్ జర్నలు అఫ్ సైకాలజీనుండి అనువదింపబడి మార్చిమాసపు ఈపత్రిక మణిమాలలో ప్రచురింపబడిన 'చక్కిలిగింత: కామవికారము' అను వ్యాసశకలమును చూచిన పిమ్మట మాక్సు వార్టెల్సు అను వారు 'మెడికల్ మాన్' అను పత్రికలో 'కన్యలు: చక్కిలిగింత' అను విషయమును గూర్చివ్రాసిన ఈ పంక్తులు ప్రచురింపకుతూహలముకలిగినది. "వివాహితలగుస్త్రీలు పలువురు నాతో తమకు చంకలయందును, స్తనప్రదేశములందును ఉండిన చక్కిలిగింతలు వివాహానంతరము తగ్గిపోయిన వని చెప్పియున్నారు. అదియేప్రదేశములను వివాహమునకు పూర్వము ఇతరులు ముఖ్యముగ పురుషులంటౌకచో తాళరానంత చక్కిలిగిలి యుండెడిదని వారుచెప్పియున్నారు. కన్యలు చక్కిలిగింత కలిగియుండుట ప్రకృతి వారికి అభిజాత్యము నిలుపుకొన అనుగ్రహించిన సాధనవిశేష మనవచ్చును. కన్యలు అన్యులచే ముట్టుకొనబడనొల్లరు. వారికి చంకలు మొదలగు ప్రదేశములందు నిశితమైన చక్కిలిగింతయుండును. తాకుడు చేతనే వారు గిచకొట్టుదురు. మానపరిరక్షణమున వారికిగల గొప్పఆయుధ మిది. వివాహిత యగు స్త్రీ తానొకపురుషుని ప్రేమించుటచే చక్కిలిగింత ఆమెకంత యావసరములేదు. అదియును గాక స్పర్శకు పరిచితినొంది నారి చర్మము చక్కిలిగింత యందలి నైశిత్యమును గోల్పోవును. ఐస్లాండునందు యువకులయు, యువతులయు పారిశుద్ధ్యమును వారివారికిగల చక్కిలిగింతయొక్క నైశిత్యమునుబట్టి నిర్ణయించుట నేటికి కూడ ఆచారమైయున్నది. చక్కిలిగింతయొక్క నైశిత్యములేని యువకులయు, యువతులయు శీలవిషయమున ఐస్లాండుదేశస్థులు గాఢముగ శంకించుటయే గాక వారివారి భావిజీవితమునకు అదియొక దుశ్శకునముగగూడ భావింతురు." 'గిలిగింతపేఁటకుఁ గినుకయు సిగ్గును మొలకంగఁ గన్నులు మోడ్చుకొనును' అని కన్యల చక్కిలిగింత విషయమున శృంగారశ్రీనాథుడొకచో నుడివియున్నాడు.

—రేపాక జగన్నాధము.

పెండ్లి ప్రసంగము

పెళ్ళిఅంటే పసిపిల్లలకు కూడా తెలుసు--ఆడదీ, మగవాడు చేస్తేకట్టుకొని పిల్లల్నికంటారని. పశువుల లోను, జంతువులలోనుకూడా యీ అలవాటు ఉంది. అయితే, వాటికంటె తను దాంపత్యాన్ని కొంత సౌఖ్య ప్రదంగాను, నీతివంతంగాను చేసుకుందామని మానవుడి ఆశయం. మానవసంఘంలోగల పెళ్లిఅనే బాంధవ్యాన్ని అతడు అట్టి సదుద్దేశంతోనే నిర్మించుకున్నాడు. కాని తన శ్రేయంకోసం తాను పన్నుకున్న వలత్రాళ్లలో అప్పు డప్పు డతడు ఉక్కిరిబిక్కిరై విలవిల తన్నుకోవడం కూడాకద్దు. ఒక్కొక్కప్పు డతడు పెళ్ళిఅంటే బలే ముచ్చటపడి, చంకలు గుద్దుకుంటాడు; ఒక్కొక్కప్పుడు ఎంతో విసుగుకొని, గుండెపగిలేటట్టు యేడుస్తాడు!

పెళ్ళినిగూర్చి పెద్దపెద్దవాళ్ళకు కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. పెళ్ళిఅనేది జీవితానికి శోభగూర్చే మహామంత్రమనీ, గృహస్థాశ్రమమే స్వర్గమనీ కొందరి నమ్మకం. మానవసంఘానికి పెళ్ళి పునాదివంటిదని శాస్త్రవేత్తలతీర్పు. వయసు, ఆరోగ్యంగల ప్రతిమనిషీ పెండ్లాడి తీరవలసిందే అని బోధిస్తుంది కొరాన్. ముక్తికి గృహస్థాశ్రమంకంటె ఉత్తమాశ్రమం మరొకటి లేదంటారు మనఋషులు. పెళ్ళిచేసుకోని మనిషి దానంయిచ్చినా ఎవరూ పుచ్చుకోకూడదన్నాడు అత్రి మహాముని! చైనావాళ్ళు తాము పెళ్ళిచేసుకోకుండా ఉండడం పితృదేవతలపట్ల ద్రోహంచేసినట్లని భావిస్తారు, పూర్వం గ్రీసుదేశంలో యుక్తవయస్సువచ్చి పెళ్ళాడకుండా ఉన్నవాళ్ళను పాలకులు శిక్షించేవారట! నేటి ఇటలీలో బ్రహ్మచార్లకు పన్నువిధించాడు ముస్సోలినీ ప్రభువు. జర్మనీలో వధూవరులకు పెండ్లికట్నా లిస్తున్నాడు హిట్లర్ మహాశయుడు! ఇక, వివాహమనేది ఒక ప్రకృతివిరుద్ధమైన వ్యసనమనీ, అనవసరబంధనమనీ, అసందర్భాచారమనీ తలచేవాళ్ళు లేకపోలేదు. పెండ్లాడడమంటే కొరివితో నెత్తిగోకుకోవడమనీ, పెళ్ళిఅనే పాడుఆచారం మనిషియొక్క స్వాతంత్ర్యాన్ని చంపేసి సకలబాధలూ పెడుతూఉందనీ, అంటువ్యాధివలె మానవసంఘాన్ని పీడించి పిప్పిచేస్తూఉందనీ, పెళ్ళిఅంటే దాస్యం అనేమాటకు నాజూకైన పర్యాయపదమనీ ఘోషపెడతారు కొందరు నవనాగరికులు. ప్రత్యేకవ్యక్తులపై సంఘంచేస్తూ ఉన్న దౌర్జన్యాలలో పెళ్ళి మొదటిదని వారిభావం. పూర్వం సెయింట్ పాల్ అనే క్రైస్తవమతగురువొకడు, 'పెళ్ళిచేసుకోవడంకంటె, చేసుకోకపోవడమే గొప్ప!' అని ఉపదేశించాడు భక్తులకు. వివాహమాడడం, పిల్లల్ని కనడం, ఆడదానికి అవమానకరములైన సంగతులని భావిస్తూఉంది నేటి అమెరికాస్త్రీ. పెళ్ళికి ఉండవలసిన సాంప్రదాయాలు, కట్టుదిట్టాలు, అన్నీనశించాయి సోవియట్ రష్యాలో. పెండ్లాడడం అక్కడ ఎంతసులువో, పెళ్ళి తెగదెంపులు చేసుకోవడంకూడా అంతసులువు. పెళ్ళిచేసుకోకుండా బిడ్డల్ని కనుక్కున్నా, నేటి రష్యాలో మరేమీ ఆక్షేపణలేదు. వావివరసల పట్టింపుకూడా అక్కరలేదు. కాని తల్లిని కొడుకు, తండ్రిని కూతురు, అన్నను చెల్లెలు,... మొదలైనవిమాత్రం నిషేధములు! 'లోకో భిన్నరుచిః', అన్నారు పెద్దలు. పెళ్ళియెడల మానవుడి అభిప్రాయాలు, అనుభవాలు, ఎప్పటికప్పుడు మారిపోతూ ఉండడంలో అసహజం యేమీలేదు.

సంఘం ఒప్పుకునేవిధంగా ఒక పురుషుడు ఒక స్త్రీతో కలసి ఉండడమే పెళ్ళి. సంఘామతిపైని ఒక పురుషు డనేకస్త్రీలను, ఒకస్త్రీ అనేకపురుషులను కూడ పెండ్లాడవచ్చును. సంఘం యిష్టపడనిబాంధవ్యం ఎట్టి న్యాయమైనదైనా, ఎంత సౌఖ్యప్రదమైనదైనా వివాహ మనిపించుకోదు. వివాహమనిపించుకునే స్త్రీపురుష బాంధవ్యానికి దేశం, మతం, 'లా', మొదలైన వాటినిపట్టి యేర్పడిన కొన్ని నిబంధన లుండకతప్పదు. ఏమంటే, దాంపత్యంయొక్క ముఖ్యఫలితం సంతానం. పెళ్లిఅనే నిబంధనలేనప్పుడు సంతానపోషణకు యిబ్బంది

కలుగవచ్చును. కాబట్టి, పుట్టడానికీ, పెరగడానికీ, బిడ్డలకు హక్కునిచ్చే మాత్రమే పెళ్ళి. పెండ్లాడుకున్న స్త్రీపురుషులకు బిడ్డలమూలాన కొన్నివిధాయకకర్తవ్యాలు, హక్కులు యేర్పడుతవి. అప్పుడు సంతానసంరక్షణను గూర్చి తల్లిదండ్రులకు తగిన ఉత్సాహం, బాధ్యత కలగకతీరదు. సాధారణంగా భార్యను, పిల్లలను పోషించి రక్షించేభారం పురుషునిది. బిడ్డలనుపెంచి, యిల్లు చక్కబెట్టుకొని, భర్తకు పరిచర్య చెయ్యవలసిన విధి భార్యది.

పెళ్ళి విధాయకములైన ధర్మశాస్త్రాలు, న్యాయ చట్టాలు, సంఘాచారాలు, మతనియమాలు దేశాలను, దేశకాలపరిస్థితులనుబట్టి అనేకరకాలుగా ఉండవచ్చును. కాని, ఏదేశంలోనైనా, ఎట్టిపెళ్ళిఅయినా, ఏదో ఒక కట్టుదిట్టంలేనిదే జరగదు. పెళ్ళికి వధూవరుల సమ్మతి ముఖ్యంకావచ్చు; లేదా తల్లిదండ్రుల అనుమతి అవసరంకావచ్చు. కట్నాలు, కానుకలు విధింపబడవచ్చు. కులం, మతం, దేశంమొదలైనవాటి ననుసరించి వివాహకాండ నిశ్చయింపబడవచ్చు. స్త్రీపురుషులిద్దరు భార్యాభర్తలనిపించుకుందుకు సంఘము, 'లా', విధించే నియమాలను పాటించకతీరదు.

ఆదిని యీ వివాహాచారం శరీరప్రకృతి ననుసరించి మానవసంఘంలో యేర్పడిన ఒక అలవాటని తోస్తుంది. ఏమంటే, పెళ్ళియొక్క సారాంశం ఆడది, మగవాడు కలసి పిల్లల్నికని, పెంచడమే! ఒక పురుషు డొకస్త్రీతోనో, పలువురు స్త్రీలతోనో కలసి ఒకచోట నివసించడం, శరీరవాంఛలను తీర్చుకొని పిల్లల్నికనడం, వాళ్ల సంరక్షణకోసం తాపత్రయపడడం, అనాదినుండి వస్తూ ఉన్న అలవాటే. పశుపక్ష్యాదులలోకూడా కొంతవరకు యిదే పరిపాటు. పెద్దజాతిపక్షులలో సంభోగఋతువులలోనేగాక, పిల్లలు పుట్టినపిమ్మటకూడా మగపక్షిఆడ పక్షినుండి విడిపోదు. డాక్టర్ బ్రేహమ్ అనే పక్షిశాస్త్రిజ్ఞుడు, 'నిజమైన పెళ్ళిఅంటే పిట్టలలోనే ఉంది!' అని వ్రాశాడు. చక్రవాకాల ఐకమత్యాన్ని మనపురాణకవులు ఆదర్శదాంపత్యంగా నిరూపించారు. పెద్దజాతి జంతువులలో యిట్టి సఖ్యత బహు అరుదు. వాటిలో పిల్లలపట్ల శ్రద్ధాభిమానాలు ఎక్కువకాలం తల్లికేకాని, తండ్రికి ఉండవు. కాని 'చింపాంజీ', 'గొరిల్లా' మొదలైన కోతులలో దాంపత్యమర్యాదలు కొంతకాలం స్థిరంగా నిలుస్తాయి; పిల్లలంటే తండ్రికికూడా ఎంతో అభిమానం. అనాగరికజాతులైన అడవి మనుష్యులలో సహితం, కుటుంబానికి తండ్రి యజమానిగా ఉండి సంతానపోషణకు పాటుపడతాడు. పెళ్ళిఅనే ఆచారం మానవసంఘంలో నెలకొల్పబడక పూర్వమే, అప్రయత్నంగా, స్వభావసిద్ధంగా కొన్నికొన్ని వివాహధర్మాలను పాటిస్తూ ఉండేవాడు నరుడు!

సృష్టిలోని యితర జీవరాసులవలె కట్టుబాట్లులేని ప్రేమసుఖాల ననుభవించడానికి మానవుడు నోచుకోలేదు. ఇందుకు ముఖ్యకారణం వాని అసాధారణ యీర్ష్యాస్వభావమే! మానవునిబుద్ధిబలం, యీర్ష్యగుణం, స్వార్థపరత్వం కలసి వివాహమనే ఆచారాన్ని నిర్మించు తున్నాయి. జంతువులలోకూడా యీ గుణాలున్నాయి కాని, మనకున్నంత దారుణంగాలేవు. కనుకనే వాటికి అగత్యంలేని పెళ్ళినియమాలన్నీ మానవుడికి అవసరమవుతున్నాయి.

నాగరికత అభివృద్ధి అవుతున్నకొలదీ, మారిపోతూ ఉన్నకొలదీ, వివాహాచారాలలోను, ధర్మాలలోను మార్పులొస్తూ ఉండడం సహజం. కాబట్టే ఒకానొక సంఘానికి సరిపడేశాస్త్రాలు మరొకసంఘానికి పనికిరావు. ఒక యుగమునందు ప్రశస్త్యంగాఉన్నధర్మాలు వేరొకయుగమునందు వెగటుగా ఉంటాయి.

ప్రపంచంలో ఏదేశంలోను, యిప్పుడు అమలులో ఉన్న వివాహాచారాలు సర్వజనామోదకరములుకావు. ఎవరివెర్రి వారికానందమన్నట్లు, ఎవరి దేశాచారాలను వాళ్ళు గొప్పగా చెప్పుకుంటూ, మీదుమిక్కిలి సైవాళ్ళను ఆక్షేపిస్తారు. హిందూబాల్యవివాహాలంటే తెల్లవాళ్ళు వెక్కిరిస్తారు. వాళ్ళ ముసలిపెళ్ళిళ్ళు చూస్తే మనకునవ్వు! విడాకులంటే కొందరికి మెచ్చుకు; విధవ వివాహమంటే కొందరికి పట్టింపు. సాయిబులలోవలె బహుభార్యత్వం కొందరికి శాస్త్రసమ్మతం; టిబెట్‌లో వలె ద్రౌపది మాస్తరుగా బహుభర్తృత్వం కొందరికి పాతి

ప్రత్యధర్మం! ఈడుమీరి, వలపెరిగితేనేగాని పెండ్లి మాట తలపెట్టరాదని కొందరి అభిప్రాయం; వయసు రాక పూర్వమే పెళ్ళిజరిగిపోతే, అటుపైని తప్పుచేయ డానికి అట్టేఅవకాశం ఉండదు కనుక, బాల్యవివాహాలే సర్వోత్కృష్టములని కొందరి నమ్మకం.

పెళ్ళివిషయమై శాస్త్రాలు, కర్మలు, లాంఛనాలు ఎవరి కెట్లా ఉన్నా, ముఖ్యోద్దేశంమాత్రం అందరిదీ ఒక్క టే—శరీరసౌఖ్యా లనుభవిస్తూ, సృష్టికి తోడ్పడడం! ఇట్టి ఉద్దేశంతో వ్యక్తిస్వాతంత్ర్యం, సంఘశ్రేయం, రెండూ పొసగేటట్లు చేసుకున్న యేర్పాటే పెళ్ళికనుక, మానవసంఘంలోనుండి దానిని కేవలం తరిమివేయడా నికి సాధ్యంకాదు. స్త్రీపురుషబాంధవ్యానికి అట్టే నిర్బంధాలులేని 'బోల్షివిక్కు'లలోకూడా పెళ్ళి అనే ఆచారం యింకా నిలచి ఉండడమే యిందుకు గట్టినిద ర్శనం!

హిందూధర్మశాస్త్రకారుడు మనువు ఎనిమిదిరకాల పెళ్ళిళ్ళు వర్ణించాడు. ఈ అన్నిరకాలూ ఎప్పుడో ఒక ప్పుడు మానవసంఘంలో అవసరపడినవే. పరిస్థితులను బట్టి ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క సంఘంలో ఒక్కొ క్కరకం ఆచరణలో ఉండేది—ఉంటుంది. ఇప్పుడు కొన్ని నాగరికజాతులలో ఉన్న 'కాంట్రాక్ట్' వివా హాలు, 'కంపానియన్‌షిప్' పెళ్ళిళ్లు మొదలైనవికూడా యీ రకాలలోనే చేర్చవచ్చును. పాశ్చాత్యులకు పరి పాటైన వలపుపెళ్ళిళ్ళన్నీ మనువుచెప్పిన గాంధర్వ వివాహతరగతిలోనే చేరుతవి. వేదం ఎంతో బాగున్న వివాహాచారం రేపు బొత్తిగా పరిపడకపోవడంలో విప రీతమేమీలేదు. పూర్వులు విధించారుకదా అని ఎప్పు డూ ఒకేఆచారాన్నిపట్టుకొని దేవులాడడం బుద్ధిహీనం! సంఘాచారాలలో యితరదేశస్థులను మనమనుకున్నంత జలగ పట్టులేదు; సమయానుకూలంగా సర్దుకుంటారు.

మానవప్రకృతి, నీతి, ఆవేవి అందరికీ, అన్నియుగా లలోను సమానమే. మూఢత్వం, నాగరికత, మతం, మొదలైనవిమాత్రం దేశదేశానికీ, జాతిజాతికీ భిన్నంగా ఉండవచ్చును. కాబట్టి అన్యదేశాచారాలు మనకెంత విపరీతంగా, వెగటుగా, వెర్రిగా కనబడినా, వాటి యందుకూడా నీతి, నిజాయతి ఆవేవి ఉంటాయన్న సంగతి మరచిపోకూడదు. అన్నివిధాలా తృప్తికరమైన పెళ్ళిళ్ళు భూలోకంలో ఎక్కడాలేవన్నమాట సత్య మేకాని, యితరదేశాల పెళ్ళిళ్ళలోఉండే మంచిని మాత్రమే అవసరమనుకున్నంతవరకు గ్రహించి, హిందువు లేల తమ వివాహాచారాలను దిద్దుకోరాదో తెలియదు!

—తాత కృష్ణమూర్తి, బి ఏ., యల్ టి.

గత సంచికనుగూర్చి 'సరస్వతి' ప్రశంస

"ముఖపత్రముపై విశాఖపట్టణసముద్రతీరదృశ్యము. ఆంధ్రదేశమునందలి ప్రకృతిదృశ్యముల నేర్చి యాంధ్ర మహాజనులకు బరిచయముగలిగింప సంపాదకుల యుద్దే శ్యమును జూపుచున్నది. సంస్కృతము, తెనుఁగు అనక బమ్మెర పోతరాజు "ఆంధ్రవాఙ్మయ విశేషము లన్నిఁటి నేర్చె" ననుట సరసముగనున్నది. "నిను నాస్థానకవీశ్వరుండని" యను పద్యమున పోతనసార్వ భౌమత్వము జూపునో శ్రీ శేషాద్రిరమణకవుల యుత్కృష్టభావసరళి, కబ్బము సలుపు నేర్పును గాన వగును. "తెలుఁగుం జదివినదానికి ఫలమేమనె" యను పద్యమునందలి యర్థముగూఢము; ఊహాజనకము. "పడ వాలయాలు, గాలివిమానాలు"ను చదువదగిన వ్యాస ములు. గ్రంథరచనలవలన పాశ్చాత్యకవిపుంగవుల కున్నరాబడియు, రాజ్యాస్థానములకుం డాదరణము నాంధ్రకవుల కిప్పుడెక్కడిది? అసలు ప్రజలకును విద్యా పీఠములకే యాదరణలేదాయె. అట్టియెడ పుస్తకరచ నలవలన జీవయాత్ర గడపుట యింకెంత కష్టము? సర్ హెన్రీరాయిన్‌గారి విచిత్రవృత్తాంతము పనినేర్చుకొను నభిలాష, పట్టుదల, ధైర్యము, శ్రేష్ఠతమగు వస్తువునే చేయుట, యెల్లరకును ఆదర్శప్రాయము. అర్థికపుష్టి యున్నగ్రంథాలయోద్యమవిషయముల నింకను కొన్ని పుటల నిత్తుమని సంపాదకులు చెప్పుచున్నారు. ఆంధ్ర మహాజను లెల్లరును దోడ్పడినచో నీ యాంధ్రభూమి యింకను పెక్కు విషయములలో, పెక్కు పుటలలో, పుష్టిఁగలిగి వన్నెకెక్కునని యెంచుచున్నాము."

జెకోస్లావాకియా రాజ్య నిర్మాణము

యుద్ధమునకు పూర్వము ఐరోపాఖండపు పటముపై 'జెకోస్లావాకియా' అను ప్రత్యేకరాజ్యనామములేదు. సరిగా నేటికి పదునైదువత్సరముల క్రితము 1918 అక్టోబరు 28-వ తేదీని జెకోస్లావాకియా రాజ్యము స్థాపింపబడెను. 54,600 చదరపుమైళ్ళ విస్తీర్ణము గల దేశము. జనాభా 14,800,000 మంది. ప్రేగ్ పట్టణము రాజధాని నగరము దాని జనాభా 677,000 మంది.

ఏర్పడినప్పటి నుండియు నీ రాజ్యము పరరాజ్యముల జోలికి పోవక స్వకీయాభివృద్ధి యందు పూర్తిగ నిమగ్నమై యుండెను. ప్రజలును, ప్రజానాయకులును రాజ్యసౌఖ్యమును మంచిపునాదులపై నేర్పఱచి పెంపొందించుచున్నారు. జాతీయాభివృద్ధికి అడ్డుతగులు దేశమునందలి పార్టీని పాటింపక, శత్రుదేశముల కన్నెఱ్ఱను గుర్తింపక జెకోస్లావాకియా ప్రజాస్వామికము స్థిరత్వము నందినది. ఈ స్థిరత్వమునకు కారణములు మూడు:— ఒకటి: నాయకులప్రతిభ; రెండు: ప్రజలదేశాభిమానము; మూడు: ఆదేశముయొక్క సహజసంపద. సహజసంపద యందు ఆదేశమును మించు ప్రపంచమునందలి మఱికొన్ని దేశములు నేడు తమ్ము నడుపుటకు సరియైన నాయకుడు లేక అటమటించుచున్నవి. మఱికొన్ని దేశములు పాటుపడుప్రజలను, వారిని సక్రమముగ నడుపు నాయకులను గలిగియుండియు సహజసంపద కొఱవడుటచే వెనుబాటునసే క్రుంగుచున్నవి. జెకోస్లావాకియాదేశము సహజసంపదను, పాటుపడుప్రజలను, వారిని నడుపు నాయకులను గలిగి ఏర్పడిన పదునైదువత్సరములలో విశేషాభివృద్ధిని గాంచినది.

మిత్రమండలి వారిచే జెకోస్లావాకియా 1918 లో ప్రత్యేకరాజ్యముగా అంగీకరింపబడినపుడు దాని అధ్యక్షుడు టి. జి. మాసరిక్ అట్లాంటిక్ మహాసముద్రమునకు అవతలయుండెను; దాని ప్రభుత్వకార్యాలయము ప్యారిస్‌నందుండెను; దాని సేనాబలము సైబీరియాలో నుండెను. దానిరాజధానీనగరము ప్రేగ్ పట్టణమున అధ్యక్షుడు మాసరిక్ కాలుపెట్టుసరికి అంతకు పూర్వము అచట ప్రభుత్వము చేయుచుండిన ఆస్ట్రియనులు తొలగియుండిరి. ప్రజలకు రైలు, పోస్టు సౌకర్యములు లేవు. ఒక ప్రభుత్వవిధానములేదు; సేన లేదు. నేడు జెకోస్లావాకియా దిగుమతులు 110 మిలియనుల పౌనుల వెల గలవి. ఎగుమతులు 130 మిలియనుల పౌనుల వెల గలవి; ఆదేశమున చేయబడిన వస్తువులు నేడు ప్రపంచమునందలి అన్నిదేశముల బజారుల యందును చొఱబాఱియున్నవి. యూరపునందలి మిగుల ఫలవంతములగు దేశములలో నిది యొకటి. పరిశ్రమలతో బాటు వ్యవసాయమును లెస్సగ పెంపొందింపబడుచున్నది. బట్టల నేత, గాజుసామగ్రి, యంత్రములు, పనిముట్లు, కాగితములు, రసాయనికవస్తువులు మొదలగు వానిని చేయుటకు పండ్రెండువేల ఫ్యాక్టరీలు. పంటలలో పప్పుదినుసులు, దుంపలు, ఫలములు ముఖ్యములైనవి. పశుసంపద విశేషమైనది. హాంబర్గ్, స్టెటిన్ హార్బరులలో కొన్ని వార్ఫులు ఉపయోగించుకొనుటకును, ఎల్బ్‌నదీతీరమున కొంత స్థలము 99 సంవత్సరముల కౌలుకు ఈదేశము పొంది యుండెను. ఎనిమిదివేలమైళ్లు వ్యాపించిన రైలుబాటలు. అంతర్జాతీయవిమానపథములు పదునైదును, దేశీయ విమానపథములు ఐదును గలవు. ఇంతకును ఆరాజ్యము మనదేశమునందలి అస్సాము రాష్ట్రమంత విస్తీర్ణముగలది. జనాభావిషయమున బొంబాయి రాష్ట్రముతో సరితూగును. అట్టిరాజ్యము ఏర్పడిన పదునైదు వత్సరములలో అవ్యవస్థితినుండి ఇంతటిఅభివృద్ధికివచ్చుట ఆశ్చర్యకరమైన విషయములలో నొకటి.

థామస్ మాసరిక్ మొదటి నుండియు ఈ రాజ్యమునకు అధ్యక్షుడు. స్థానికముగనే గాక అంతర్జాతీయముగ కూడ నీతడధ్యక్షుడగుట అతిముఖ్యమైన విషయము. అంతర్జాతీయసంస్థ తనకురూపసిద్ధినిచ్చినదిగావున జెకోస్లావాకియా ఆసంస్థకు యథాశక్తిని తోడ్పడ వలయు ననుట ప్రెసిడెంటు మాసరిక్ రాజనీతి.

హిందూదేశీయులకు ఈ పదునైదువత్సరముల జెకోస్లొవాకియాచరిత్రయు అవశ్య పఠనీయ మైనది. ఆదేశ చరిత్రనుండి వారు నేర్చుకొనవలసినవిషయములు విశేషముగ గలవు. ఆదేశపు జనులు మనదేశము నందు వలెనే వివిధజాతులకు చెందినవారు, వివిధభాషల మాటలాడువారు. మాసరిక్ తన ప్రతిభావిశేషముచే వీరిని ఒక్కత్రాటిమీద నడిపి ఒక్కరాజ్యమునకు అంకితులగునట్లు చేసినాడు. జాతులలో జెక్కులు, స్లొవాక్కులు, రుథేనియనులు, జర్మనులు, జ్యూలు, హంగేరియనులు, రష్యనులు, పోలులుగలరు. ప్రాథమికవిద్యావిధానమున ఈ వివిధభాషలకు అర్హప్రాతినిధ్య మిచ్చు విషయమునందు మేసరిక్ బుద్ధికి అనన్యమైనబుద్ధి రాజ్యవిచ్ఛిత్తికి ఎడమిచ్చియుండును. రోమను కాథలిక్, గ్రీకు కాథలిక్, ఆర్మీనియను కాథలిక్, ప్రొటెస్టెంటు, జ్యూమతములకు మాసరిక్ వైమనస్యము కలుగకుండ నైదర్థ్యము ప్రదర్శించెను. జాతిచేగాని, మతముచేగాని, భాషచేగాని ఒకనికి ఆదేశప్రభుత్వమున స్థానము లేకుండనుండదు. అన్ని జాతులవారు, అన్నిమతములవారు, అన్నిభాషలవారు, అన్నివృత్తులవారు సినేటునందును, శాసనసభయందును సభ్యులై యున్నారు.

ఈ రాజ్యనిర్మాణమున ప్రెసిడెంటు మాసరిక్‌నకు కుడిభుజములై యున్నవారు ముగ్గురు—బెనెస్, స్టెఫానిక్, రాశిన్. వీరిముగ్గురిలో స్టెఫానిక్ రాజ్యనిర్మాణపు ప్రారంభదినములలో ప్రమాదమునకు లోనై చనిపోయెను. రాశిన్ 1926 లో రాజకీయవిద్రోహులచే చంపబడెను. జెకోస్లొవాకియా ఈ పదునైదు వత్సరముల చరిత్రను కలుషితమొనర్చిన రాజకీయహత్య ఇది యొక్కటియే. బెనెస్‌నకిప్పుడు ఏబదిరెండు వత్సరములు. విదేశాంగమంత్రియై ఆతడిప్పటికిని మాసరిక్‌ను సేవించుచున్నాడు.

అసలు మాసరిక్‌నకు జెకోస్లొవాకియా రాజ్యనిర్మాణవిషయమై పురి ఎక్కించినది ఈ బెనెస్ అని చెప్పుదురు. మాసరిక్ వలె ఈతడును యూనివర్సిటీ ప్రొఫెసరే. వీరి ఇరువురి అధ్యక్షతను 'మాఫియా' అను రహస్య విప్లవోద్యమము ప్రారంభింపబడెను. ఆదినములలో ఈ అధ్యాపకులు తమ ప్రాణములను గుప్పిటిలో నుంచుకొనియే సంచరించుచుండిరి. యుద్ధమునకు పూర్వము మాసరిక్ దేశమును వీడి విదేశసంచారమునకు దొరకొనెను. 'మాఫియా' ఈతనికిని దేశమునకును నడుమ కొక్కెముగా నుండెను. కొంతకాలమునకు బెనెస్ కూడ రహస్యముగ దేశాంతరమునకు పోవలసివచ్చెను. బెనెస్ అమెరికన్ అధ్యక్షుడు విల్సనుతో సంప్రదించియు మాసరిక్ ఫ్రెంచిఅధ్యక్షుడు బ్రియాండుతో సంప్రదించియు తమదేశమునకు యుద్ధానంతరము ప్రత్యేకస్థానమును సంపాదించుకొనిరి. జెకోస్లొవాకియారాజ్యము నిర్మింపబడెను. దేశమునందలి మాసరిక్ స్నేహితులు విదేశములందు వీరిరువురు కావించుచున్న కృషినందుకొని యథాకాలమున మెలకువతో పనిచేయుచువచ్చి దేశమాతకు దాస్యవిమోచనము కల్గించుకొనిరి. జెకోస్లొవాకియాప్రజల స్వాతంత్ర్యవాంఛను శతాబ్దములుగ అణచిపెట్టియున్న హాప్సుబర్గుల సామ్రాజ్యమంతమయ్యెను.

మాసరిక్‌నకిప్పుడు ఎనుబదిరైదువత్సరములు. ప్రెసిడెంటు కాకపూర్వము ఆతడు ప్రేగ్ విశ్వవిద్యాలయమున వేదాంతశాఖోపాధ్యాయుడు. ఈ అధ్యాపకుడు తనదేశమునకు స్వాతంత్ర్యసంపాదనము గావించి ప్రపంచము ఎఱిగిన జాతీయనిర్మాతలలో ప్రఖ్యాతుడై యున్నాడు. రాజ్యాంగవిషయములను గూర్చి ఈతడు బహుళగ్రంథములు రచియించెను. పుస్తకములలో వ్రాసినంతే ఈతడు తనరాజ్య నిర్మాణమున, నిర్వహణమున చేసి చూపెను. డాన్యూబ్‌నదికి ఇరుప్రక్కలయందును ఈతనికి శత్రువులుగలరు. అయితే ఈతనికి, ఈతని దేశమునకు ప్రపంచమునందంతటను స్నేహితబృందము విశేషించి ఉన్నది. వృద్ధాప్యము మాసరిక్‌నందు దేశప్రేమను, దేశసేవాభిలాషను డిందుపాటొందింపలేదు. ఇట్లన్ని విధముల అతిలోకుడైయున్న ఈతని తలిదండ్రులు సామాన్యులు. తండ్రి బండితోలువాడు, తల్లి వంటలక్క. అట్టివారలకుబుట్టి తన బుద్ధిబలముచే ఆత్మదేశము నభ్యుద్ధరించిన ఈ మహనీయుని పవిత్రచరిత్ర త్రైమాసపు ఆంధ్రభూమిలో నివేదించుకొందును.

—వి. జగన్నాథస్వామి, బి.ఏ.

ప్రగల్భ

౧

అతఁ డీట కేగుదెంచి హృదయంబు గుబుల్కొన నన్నుఁ బల్కె 'నో
యతివ, భవత్సుఖామృతము నానగఁ గోరిన భృంగమేను న
న్నతి దయ సేయుదే' యనుచు మారిడ కేను దృగంచలంబులన్
జతఁబడు నీరుటెండలఁ బ్రసాదమొసంగితిఁ జోపఁ డాతఁడున్.

౨

అతఁడు మదీయహస్తయుగళాశ్రయుఁడై నిజవక్షమందు నే
కతలనొ పన్నినన్ వలపుకావ్యము కిమ్మనకుండ వ్రాయ, నే
నతని మనఃప్రదేశమును హస్తముల న్దిగఁద్రోచి 'యేటికీ
నుతిమరపైన మాయల'ని మన్ననఁ జేసితిఁ బోవఁ డాతఁడున్.

౩

అతఁడు శిరీషకోమలముఖాంబుజ మంతకునంత దాపునన్
జతఁగొన కేలుదమ్ములను చక్కని చెక్కిలి కౌగలించి తా
ధృతమతి ముద్దువెట్టఁజన 'తియ్యని పల్కులు పుల్ల చేతలో
పతితుఁడ, చాలు! చాలు!!' నని ప్రౌఢిమ తెల్పితి నేగ నాతఁడున్.

౪

అతఁ డెట కేగునో తెలియ దాతని తోఁడనె నాదుపాదముల్
మతిజెడిపోయె యెటియపమార్గముఁ బట్టెనొ నేరనైతి నా
కతకును గాళ్లులాగ; తెలికన్నులజార్చితి బాష్పవార్నిధిన్
వితమిదియంచుఁ గన్గొనమి వెఱ్ఱినిగా నతఁ డేగ నాతఁడై.

౫

అతఁ డోకపూవుఁదోట హృదయంబునఁ గూర్చొని పూవుకన్నెలం
జతురతఁ బ్రోవుసేసి సరసంబుల నాడఁదొడంగె నామనం
బతనిపదంబులంబడియె నాతఁడుఁ దోఁబ్రబలపింపసాగె 'నో
యతిసుకుమారి, నీప్రణయ మానఁగనిమ్మ'నిః సిగ్గునొందితిన్.

—హరి రాధాకృష్ణమూర్తి.

హారీ గార్డాన్ సెల్‌ఫ్రిడ్జి

[చిన్నతనమున చీపురుపట్టి కొట్టుతుడుచువాడుగా పనిచేసిన యాతడు పెద్దయై ప్రపంచమునందలి నగరములలో ప్రథమగణ్యమైన లండను మహానగరమున రెండవదియగు గణ్యతగల కొట్టుకు స్వాముదారుడైన అద్భుతవృత్తాంతకథనము.]

అమెరికా సంయుక్తరాష్ట్రములయందు నావిక శాఖలో ఉద్యోగమును సంపాదింపప్రయత్నపడు ప్రతి పిల్లవాడును డార్ట్‌మౌత్‌నందలి నావికశాఖా ప్రవేశపరీక్షకు పోవుటకుముందు అచటి ఒకానొక శాసన సభ్యుని సిఫారసునందవలసియుండెను. ఏబదివత్సరముల పూర్వము హారీగార్డాన్ సెల్ఫ్రిడ్జి అను బాలుడు అపురూపమైన అట్టిసిఫారసు నొకటిపొందెను. నావిక శాఖా ప్రవేశ పరీక్షకు వెళ్ళెను. పరీక్షలో జయము నందెను. అనంతరము డాక్టరుచే పరీక్షింపబడుటకు వెడలెను. ఉండవలసిన పొడుగుకంటె పావుఅంగుళము పొట్టిగ నుండుటచే నాబాలుడు నావికశాఖలో ప్రవేశించుటకు అర్హుడుకాడని ఆ డాక్టరు నిర్ణయించెను.

నావికశాఖలో ప్రవేశింపదలచిన బాలుడొకడు నేడు తాను కొద్ది అంగుళములు పొట్టిగనుండుట తెలిసికొనెనేని నేరుగా వ్యాయామప్రవీణుల కడకుపోయి వారు చెప్పినట్లుచేసి అచిరకాలముననే వలసినపొడుగుకు ఎదిగియుండును. ఏబదియేండ్లకు పూర్వము నాగరికత అంతటి అభివృద్ధినందలేదు. అభివృద్ధినందియున్నను సెల్‌ఫ్రిడ్జి తలిదండ్రులు తమతనయుడట్లు పొడుగగుటకు వలయు ధనవ్యయమునకు ఓర్వలేని పేదవారు. సివిల్ యుద్ధమున సెల్ఫ్రిడ్జి తండ్రి ఉత్తరభాగముపక్షము వహించి పోరెను. అతడు సెల్ఫ్రిడ్జిబాల్యముననే చనిపోయెను. అతని భార్య-సెల్‌ఫ్రిడ్జి తల్లి - నిస్సహాయయగు నిఱుపేదరాలయ్యెను. ఆమె స్కాటిష్ జాతికి చెందినది. స్కాటిష్‌జాతిస్త్రీల పలువురివలె విద్యావతి అగుట ఆమె భర్తమరణానంతరము పూర్వపు కాపురస్థలమును విడిచి మిచిగన్ స్టేటునందలి జాక్సనుకు తరలివెళ్ళి అచటి ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా కుదిరెను. తాను, తన ఏకైకపుత్రుడు ఉసురులు నిలుపుకొనియుండ గలుగుపాటి ధనమును మాత్రమే ఆమె సంపాదింపగలిగియుండెను. అనంతరకాలమున విశేషధనసంపాదకులైన పలువురివలెనే సెల్‌ఫ్రిడ్జియు బాల్యమున ఒక్క విలాస వస్తువుకూడ ఉపయోగించి యెఱుగడు.

యుక్తవయస్సు రాగా సెల్‌ఫ్రిడ్జి జాక్సనునందలి పబ్లికుపాఠశాలకు పోయెను. హారీ సెల్‌ఫ్రిడ్జి మిక్కిలి చిన్నతనముననే అర్జనకుగడంగెను. పదిహేనవయేట వేసవి శెలవులయందు అతడు బట్టలు కిరాణాసరుకులు అమ్ము దుకాణమున పనివాడుగ చేరెను. తొలుత అతని పని చీపురుపట్టి దుకాణమంతయు తుడుచుట. తరువాత శైలులు తయారు చేయుట. పిమ్మట అతనిపని బిల్లులు కాషియరు దగ్గరకు కొనిపోవుట, గుమాస్తాదగ్గరకు చిల్లర కొనివచ్చుట, ఇతర విధముల ఉపయోగించుట. వారమునకు ఒకటిన్నర డాలర్లకు దినమునకు సం॥ రెండుఅణాలు. సెల్‌ఫ్రిడ్జి చాల కష్టపడి పనిచేయువాడు. ఒక్కనిముసమూరకుండువాడుకాడు. అగుటచే సెల్‌ఫ్రిడ్జి మొదటి వేసవిశెలవులు ముగియులోపల పార్శెల్లు కట్టు పెద్ద ఉద్యోగమునకు మార్చబడెను.

ఆ దుకాణమునందలి పలువురు, ఒడలు దాచికొనక యుండ నిర్దిష్టకార్యములను తృప్తికరముగ నిర్వహించుచున్న సెల్‌ఫ్రిడ్జిని అత్యాదరముతో చూచుచు మంచి మాటలతో పలుకరించువారు. కాని ఒకరిద్దరు శీఘ్రకోపులు అతని చిన్నతప్పిదములను కూడ చిట్టువూని చీదరించుకొని తిట్టువారు. ఈతిట్టుల నాతడు ఇంతవఱకు మఱచిపోలేదు. మంచిమాటలు తనకు ఎల్లు

ఉత్సాహము కలిగించునవో, తిట్లు తన్ను ఎట్లు క్రుంగ దీయునవో అతడు ఎల్లవేళల జ్ఞప్తియందుంచు కొని యుండును. ఆకారణమున తనకొలను చేయు పని చేయుచున్న వారియెడ నాతడు మిక్కిలి మెలకువతో వర్తించును. అభినందింపదగు దానికి అభినందింపకుండుట అత డెఱుంగడు. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము పొందుటకు అట్టి అభినందనము లవసరమని అతనితలంపు. చిన్నతనమునకూడ సెల్ ఫ్రిడ్జి జ్ఞాపకశక్తి అత్యద్భుత మైనదై యుండెను. నేడుకూడ ఆచిన్నదుకాణము అతని మనోనేత్రములకు కనుపట్టుననియు, అందు పనిచేసిన వారును, ఖాతాదారులును కండ్లఎదుట కనుపట్టు దురనియు అతడు చెప్పును. తన నేత్రములు ఒక్క నిముసము మూసికొనుచో వారివారి కంఠధ్వనులు ఇప్పటికికూడ స్పష్టముగ తనకు వినుపించునని అతడు వచించును.

పాఠశాలకు వీడుపులగును ఏటేట అతడు ఇట్లే వేసవిశెలవులయందు ఇట్టి దుకాణములయందు పనిచేయు వాడు. అగుటచే బాల్యముననే అతనికి వ్యాపారానుభవము విశేషముగ తెలిసి వచ్చినది. ఒకనాడు సెల్ ఫ్రిడ్జికడకు అతనిస్నేహితు డొకడు వచ్చెను. సెల్ ఫ్రిడ్జి కంటె అతడు వయస్సున కొంచముపెద్ద. అతడు పిల్లల కొఱకు ఒక పత్రికను సంపాదించుచుండెను. కాని దానిని ఆర్థికముగ లాభదాయకమగునట్లు అత డొనర్ప జాలకుండెను. సెల్ఫ్రిడ్జితో నాతడు పత్రికకు వలసినన్ని ప్రకటనలు కొనిరాలేకుండుట చెప్పుకొనెను. అందు మీద గార్డన్ "ప్రకటనలు నేను కొనివత్తును. ప్రకటనలరూపమున నేనుకూర్చిన సొమ్ములో నాకు నూటికి పదిరూపాయిల వంతున కమీషను ఇత్తువా?' అని అడిగెను. సంపాదకమిత్రుడు సమ్మతించెను. సంవత్సరము నిండు లోపల పత్రిక దాని జీవితములో తొలి సారి లాభము చూపెను. వచ్చిన లాభము కొద్దిపాటిదే. అరవైడాలర్లు (పంద్రెండు పౌనులు). కాని అది సరి పోయినది: ఆ ఇరువురుమిత్రులును కలిసి ఆ సొమ్ముతో నయగరా జలపాతమునకు యాత్రసాగించి రాగల్గిరి.

కొంతకాలము ఈ దినములలో అతడు స్వయముగ నొక మాసపత్రికను నడపెను. అతడే సంపాదకుడు, అతడే ముద్రాపకుడు, అతడే ప్రకాశకుడు, పత్రికకు ప్రకటనలు కాన్వాసుచేయువాడును అతడే. అన్నిపనులును ఒక్కచేతిమీదనడుపుచు అత డాపత్రికను లాభసాటిగ నిర్వహించి తన ప్రజ్ఞాబలమును ప్రదర్శించెను.

సెల్ఫ్రిడ్జికి పదునాలుగు వత్సరములు వచ్చెను. ఒక నాడు అతడు తల్లిని సమీపించి తానింక పాఠశాలను పూర్తిగ వదలివైచి పనిలో ప్రవేశింప నిశ్చయించితినని చెప్పెను. మాతృదేవి అంగీకరింపలేదు. పాఠశాలవిద్యను ముగించి అనంతరము కళాశాలలో ప్రవేశింపవలసినదని ఆమె నిర్బంధించెను. కాని హారీ నిశ్చితార్థమును వీడ లేదు. తల్లి అంగీకరింపక తప్పినదికాదు. జాక్సను పట్టణము నందలి ఒక బ్యాంకులో పనికి కుదిరెను. జీతము నెలకు ఇరువదిడాలర్లే (నాలుగు పౌనులు). అనుగాక. కలిగిన అనుభవము గొప్పది. 'జమాఖర్చుల రహస్యము, నేను అచ్చటనే నేర్చుకొంటిని' అని గార్డన్ చెప్పును. అచటి కాషియరు మంచివాడు, స్నేహశీలి. బాలుడగు గార్డన్ మంచిపనిచేసినపుడెల్ల అతని మనోభీష్టము నెఱవేర్చుచుండువాడు. ఆదినములలో గార్డన్ మనోభీష్ట మేమనగా లెడ్జరు (అవర్జా) పోస్టుచేయుట. ఒక నెల అంతయు ఒకతప్పుకూడలేకుండ పనిచేయుచో గార్డన్ను లెడ్జరు పోస్టుచేయనిత్తునని ఆకాషియరు చేరమాడువాడు.

బ్యాంకులో అతడు రెండు సంవత్సరములు పని చేసెను. అనంతరము ఒక ఫ్యాక్టరీలో ఎక్కవుంటు గుమాస్తాగా చేరెను. జీతము కొంచము పెద్దదయినది. కాని భావియభివృద్ధికి అవకాశములు తక్కువగ నున్నట్లు తోచెను.

జీతమువిషయమై అంత పట్టింపులేదు. పనిచేసి భావి కాలమున అభివృద్ధికి రాగలుగుటకు అవకాశముండుట ముఖ్యము. కావున పెద్దనగరమునకు పోవుట లెస్స. చికాగోపట్టణము నందలి మెయర్సుఫీల్డురీటరు కంపెనీవారితో ఒకమిత్రుడు గార్డన్కు పరిచయము కల్గించెను. ఆకంపెనీ వారి స్టోరులో ప్రధాన విక్రయవస్తువులు బట్టలు. మెయిలు ఆర్డర్లమూలకముగ విస్తారమైన బట్టలవర్తకము గావించెడి నాటి[illegible]ములలో ఫీల్డుకంపెనీ ఒకటి.

హారీకి అందు పనిదొరకెను. జీతము వారమునకు పది డాలర్లు (రెండు పౌనులు). చికాగోవంటి పెద్ద పట్టణమున సెల్ఫ్రిడ్జి వంటి బాలుడు కాలము త్రోయుటకు కూడ అది చాలీచాలనిదే. పని స్టోరులో కూర్చుండి స్టాకుసరిచూచుట, స్టాకు బుక్కును ఎప్పటికప్పుడు సరియైన స్థితిలోనుంచుట. వ్యాపారమునందలి సర్వవిషయములను ఆకళించుటకు సదవకాశము కలిగెను. తెలివైనవాడగుటచే నాతడాసదవకాశమును జారవిడువలేదు. రెండుసంవత్సరములు జరిగిపోయినవి. సెల్ఫ్రిడ్జి తెలివితేటలు పలువురకు తెలియవచ్చెను. వేల్రోక పట్టణమున నూతనముగా స్థాపింపబడుచున్న చిల్లర స్టోరు మేనేజరు ఉద్యోగము అతనికీయజూపిరి. జీతము పెద్దది. అయినను దానికి అంగీకరించు లోపల తాను ప్రస్తుతము పనిచేయుచున్న కంపెనీ ప్రొప్రయిటరగు ఫీల్డుతో సంప్రదింప నాతడు నిశ్చయించెను.

"నీవు ఇక్కడనే ఉండిపొమ్ము. ఇక్కడనే నీకు భావి అభివృద్ధికలుగును" అని ఫీల్డు తెలివైన ఆసేవకుని వదలలేక చెప్పెను. యజమాని ఇట్లు చెప్పినంత మాత్రమున హారీకి ఒలికినదేమియు లేదు. ఈ అవకాశమును పురస్కరించుకొని తాను ఈ కంపెనీయందే మఱియొక పెద్ద ఉద్యోగమును సంపాదించుటకు అతడు కృతనిశ్చయుండయ్యెను. "ఇచట నేను పనిచేయుచున్న డిపార్టుమెంటు డిప్యూటీ మేనేజరు వెళ్ళిపోవుచున్నాడు. నా కాపోస్టునిత్తురా?" అని హారీఅడిగెను. ఫీల్డు కొలది నిమిషములు ఆలోచించెను. 'ఇత్తును' అని చెప్పెను. అప్పుడు సెల్ఫ్రిడ్జికి కలిగిన ఆనందమునకు అవధిలేకుండెను.

యువకుడగు ఆడిప్యూటీమేనేజరు ఇక అఫరమును వదలు ప్రశ్నయే ఉదయింపలేదు. మఱియొక సంవత్సరము జరుగు సరికి అతడు 'జనరల్ సేల్సుమాన్'గా మార్చబడెను. ఈ కాలముననే ఫీల్డులీటరు అండ్ కో మార్షల్ ఫీల్డు అండ్ కంపెనీగా మారెను. న్యూయార్కునకు పశ్చిమమున అవర్తకమునందు ఆస్టోరు అద్వితీయమైనదయ్యెను. దాని నిర్వహణము సక్రమమును, ఆదర్శప్రాయమును అయి ఉండెను. అందు పనిచేయు వారికొఱకైన నియమావళి దేశముల వెంట ప్రఖ్యాతి నార్జించెను. ఆ నియమముల పుస్తకము తొంబది తొమ్మిది పుటలు గలది. అందు పనిచేయువారు తమకు తారసపడు వివిధపరిస్థితులలో ఎట్లు మెలగవలయునో మూటిగ మాపింపబడియుండెను. ఒకనిదర్శనము:

"ఖాతాదారులపై అనవసరముగ పరుకురుద్దుట వాంఛనీయముకాదని అనుభవముచే ఈ స్టోరులో కనుగొనబడినది. అయితే ఇంతమాత్రమున ఖాతాదారులయెడ ఉపేక్షాభావము వహింపవలెనమట మాతలంపు కాదు. వస్తువులమ్ముటకై ఏర్పాటుపబడినవారు ఖాతాదారులవిషయమున ఉపేక్షవహించుట ఏవ్యాపారమునకైనను గొప్పనష్టమును కలిగించునదియే. ఖాతాదారులయెడ ఉపేక్షవహించిన మావద్ద కంపెనీ పనివారలవద్ద ఏమాత్ర మగుపించినను వారిని వెంటనే పనినుండి తొలగించుటకు అర్హకారణము లభించినట్లుగ భావింపబడునని ఎల్లరు గుర్తింపవలసియున్నది"

ఆదుకాణమునందలి పనివాండ్రు మర్యాదకు మూర్తులును, సౌజన్యమునకు రాశులును అయియుండిరి. ఏదైన వస్తువు కొనదలచి వచ్చినవాడు ఆ స్టోరులో ఆ వస్తువు ఎచ్చటదొరుకునని ఎవరినైన అడుగుచో వారు చేయి విసరుటచేగాని, ముఖము ఊపుటచేగాని ఆస్థలమును చూపరాదు. కావలివానిని పిలచి వానితో వారిని వారు కోరుస్థలమునకు కొనిపొమ్మని చెప్పవలయును.

సెల్ఫ్రిడ్జి ఇంకను యువకుడే. ఐనను తన కంపెనీ వ్యాపారాభివృద్ధి కావించుటకు దేశసంచారమునకు కడంగెను. ఒకప్రదేశమునుండి మఱియొకప్రదేశమునకు పోవుచు ప్రముఖులగు ఖాతాదార్లతో నాతడు సంప్రదించుచుండెను. ఈ ప్రయాణములలో అత డొకసారి యొక హోటలులనుండగా న్యూయార్కునందలి ఒకానొక పెద్ద చిల్లరదుకాణపు సచిత్రమగు కేటలాగును చూచుట తటస్థించెను. అందలి కొన్ని విషయములు అతని మనస్సునకు బాగుగ పట్టెను. న్యూయార్కునకు పోవలెనని అతనికి అభిలాష కొడమెను. ఒకసారి శెలవులలో తనసొంతఖర్చున అతడు న్యూయార్కుపోయెను. న్యూయార్కుమహానగరమున చిల్లర వ్యాపారవిష

యమై అతఁడెన్నియో క్రొత్తసంగతులను నేర్చుకొనెను. తిరిగివచ్చి తాను గ్రహించిన క్రొత్తవిషయములను తన యజమానియగు ఫీల్డు ఎదుటఁబెట్టి ఆ కంపెనీయందలి చిల్లరవ్యాపారశాఖలో పెద్ద ఉద్యోగియయ్యెను. అప్పటినుండి అతఁడు వెనుబాటు అనునది ఎఱుంగఁడు. క్రమాభివృద్ధినందెను. మఱి పదునెనిమిది మాసములయనంతరము అతఁడాకంపెనీలో చిల్లరవ్యాపారశాఖకు అధ్యక్షుఁడయ్యెను. మఱియొక పదునెనిమిదిమాసములు తిరిగి వచ్చుసరికి అతనికి ఆ కంపెనీలో వాటా ఈయబడెను. తరువాతి ఇరువదివత్సరములును వ్యాపారము బహుళమై సెల్ఫ్రిడ్జిని అధికధనవంతునిగా నొనర్చెను. మంచి వయస్సులో ఉన్నను 1903 లో సెల్ఫ్రిడ్జి విశ్రాంతి గొనుటకు నిశ్చయుఁడయ్యెను. పుస్తకకాలక్షేపము చేయుటకు, వింతవస్తువులు కూర్చుటకు, విశ్రాంతిగొనుటకు—

ఒక్క సంవత్సరము అగుసరికి విశ్రాంతి అతనికి దుర్భరమనిపించెను. "వ్యాపారమే విలాసమునుగూర్చును, దానిని దొరయుపాటిక్రీడ మఱియొకటిలేదు" అని అతనికి తోఁచెను. తిరిగి వ్యాపారములో దిగెను. ష్లీసింగర్ అండ్ మేయర్ అను చికాగో కంపెనీ అమ్ముడుపోవుచుండగా దానిని సెల్ఫ్రిడ్జి 1904 లో కొని దానిపేరు గార్డాన్ సెల్ఫ్రిడ్జి అండ్ కో అని మార్చి వ్యాపారము ప్రారంభించెను. క్రొత్త అధ్యక్షుని పరిశీలనమున వ్యాపారము శతగుణితమై కంపెనీ విశేషాభివృద్ధిగాంచెను. ఇది ఇతరకంపెనీవారల కన్నెఱ్ఱను గుఱియయ్యెను. సెల్ఫ్రిడ్జి నెట్లైన ఈ వ్యాపారమునుండి మరలించుటకు వారు కృతనిశ్చయులైరి. అగుట విశేషమైన లాభమునిచ్చి గార్డాన్ సెల్ఫ్రిడ్జికంపెనీని వారు కొనివైచిరి. ఫలితముగా గార్డాన్ బ్యాంకుఎక్కవుంటు ఎన్నియో రెట్లు పెద్దదయ్యెను.

సెల్ఫ్రిడ్జి పలుసారులు ఇంగ్లండునకు పోయి యుండెను. లండను మహాపట్టణము అతని మనసునకు ఎక్కెను. ఆంగ్లావని తిలకనగరములో క్రొత్తదియు, పెద్దదియునగు ఒక షాపుపెట్టుటకు అవకాశము కలదని అతఁడు నిజమారసెను. 1906లో అతఁడు లండనువచ్చెను. పరిస్థితులుపరిశీలించుటకు దొరకొనెను. తన ఉద్దేశమును కొద్దిమందితో చెప్పెను. ఆ కొద్ది మందిలో పలువురు పెదవివిఱిచిరి. 'మఱియొక స్టోరుపెట్టుటకు లండనునందు అవకాశములేదు. పెట్టుచో అది పురిటిలోనే సందుకొట్టి పోవుటనిశ్చయము' అని వారనిరి.

లండనునగరమునందలి పరిస్థితుల అంతర్యమును గూర్చి తాను నేర్చుకొనవలసినది అనంతముగ నున్న మాట నిశ్చయమే. కాని సెల్ఫ్రిడ్జి తన ఉద్దేశమును విడనాడలేదు. రెండుసంవత్సరములు దీర్ఘమైన ఆలోచన సాగించెను. తుదకు పదిలక్షలపౌనుల మూలధనముతో ఆక్స్ఫర్డు వీధియందు క్రొత్తషాపు నెలకొల్పెను. లండను దుకాణపు మందిరముల అన్నిటిలోనికి తనది గట్టిగను, సుందరముగను ఉండవలెనని అతఁడాశించెను. లండనునగరమున మఱేమందిరమునకు లేని లోతైన పునాదులు-డెబ్బది అడుగులలోతు. అడుగున గోడలు ఇరువదిమూడు అడుగుల మందముననుండెను. అగ్నిభయములేకుండునట్లు నేల అంతయు కాంక్రీటు మయము చేయబడెను. ఆమందిరనిర్మాణమున మూడువేలటన్నుల ఉక్కు ఉపయోగింపబడెను.

ఈక్రొత్త దుకాణము 1909 వ సంవత్సరము మార్చి మాసమున 15-వ తేదీని ప్రారంభింపబడెను. నూట ముప్పది వివిధశాఖలు. 400,000 పౌనుల విలువ గల సరుకు ఆదుకాణమున నిలువ చేయబడెను. ఆదుకాణములో పనిచేయుటకు పదివేలమంది దరఖాస్తులంపిరి. అందు ఎన్నుకొనబడిన వారికి-ఖాతాదారుఁడు ఒక్కఁడు కూడ అతృప్తుడై దుకాణమును వీడకుండునట్లు జాగ్రత్త పెట్టవలెనని అతఁడు ఉపదేశించెను. వివిధశాఖల అధ్యక్షులకు ఇట్లు చెప్పెను: "పనివారలకు మీరు చేయగలయంత సాయమును చేయుఁడు. అపుడు వారు మనకు తాము చేయగలయంతయు నొనర్తురు."

ముప్పదిఏండ్లకు క్రితము ఇంగ్లండునందును, వేల్సునందును బట్టలవర్తకమును ఆ దుకాణములలో పని చేయువారు ద్వేషించుచుండిరి. పనివారల కేర్పఱచిన భోజనశాలలందే వారు భోజనము చేయవలసియుండెను, భోజనము ఉండవలసినంత అధ్వాన్నముగ నుండును,

రాత్రులయందు ఒక్కొక్క గదిలో పలువురు నిద్రింప వలసియుండెను. జీతము మిక్కిలి తక్కువ. రెక్కలు ముక్కలు అగునట్లు పని. చిన్నచిన్న తప్పిదములకు కూడ జరిమానాలు బహుళములై యుండెను. ఖాతాదారుడు వచ్చి ఏదైన కొనకుండ వెళ్ళిపోయినచో వస్తువులమ్ముటకు ఏర్పఱుపబడిన పడుచుకు అరక్రౌను వంతు జరిమానా విధింపబడుచుండెను.

ఈ శోచనీయస్థితి సెల్ఫ్రిడ్జి ప్రవేశముతో విచ్చిపోయెను. "పనివారలను వారు నీకొరకు పనిచేయుచుండిరనుకొనుటకంటె వారు నీతో పనిచేయుచున్నారనుకొనుట మంచిది. నీవు ఒకరికడ పనిచేయుచుండినచో ఆ యజమాని నిన్నెట్లు చూడవలయునని నీవు తలంతువో నీక్రింద పనిచేయువారలను నీవు అట్లుచూచుట నీవ్యాపారాభివృద్ధికి మంచిపునాది. వ్యాపారము మందగించినచో తప్పు సాధారణముగ యజమానియందే కలదని చెప్పవలసియుండును. నావ్యాపారము నందు నాకే అభిరుచిలేనిచో నాకులేని అభిరుచి నాపనివారల కుండజాలదు." పనివారలు ఇందుచే సెల్ఫ్రిడ్జి అనిన పడి చత్తురు. ఎప్పుడును అతడు పనివారలకు దూరమైయుండడు. పనివాళ్ళు నిరభ్యంతరముగ నాతనికడకు పోవచ్చును. ఎట్టి ఎబ్బెట్టును లేక అతడు వారలతో సంభాషించును. వ్యాపారాభివృద్ధికి వారు ఇచ్చు సలహాలను తప్పకవినును. విని వివరించి అర్హములగుచో వెంటనే ఆచరణలో పెట్టును. ప్రపంచమున విశేషముగ కోరబడునది న్యాయము. ముద్దాయివాదము వినకుండ అతడు తనపనివారలలో ఒక్కనికూడ శిక్షింపలేదు.

ఏదైన దుకాణములోనికి ఖాతాదారుడు కొంచము ఆలస్యముగ వెళ్ళుచో అతనికి తప్పక అసంతృప్తి కలుగును. దుకాణము మూయబడనున్న సమయమునవచ్చుట తప్పిదమైనట్లు ఖాతాదారుడు గ్రహింప వలసిన రీతిని దుకాణపు పనివారలు ప్రవర్తింతురు. గడియారము చూచి పనిచేయు ఈ పద్ధతిని సెల్ఫ్రిడ్జి తీవ్రముగ నిరసించును. ఆపద్ధతికి అతడు వీడ్కోలు ఇచ్చెననవచ్చును. ఏదైన సొంతపనియున్నచో సేవకుడు ఆసంగతి చెప్పి వెడలిపోవచ్చును. అంతియేగాని దుకాణమునందే ఉండి బ్రొద్దుపోవు చున్నదని విసవిసలాడుట సెల్ఫ్రిడ్జి సహింపడు.

తనక్రింద పనిచేయువారందరును క్రమాభివృద్ధి నంద వలయునని అతని ఆశయము. 'మాకంపెనీయందు ప్రవేశించిన మూడుసంవత్సరములలోపల ఎవడైన యువకుడు ప్రొమోషను పొందనిచో అది అతని దోషమైన కావలయును, లేదా మాదోషమైన కావలయును'. అని అతడు చెప్పును.

బ్రాంచి కార్యస్థానములు గాక ప్రధాన కార్యస్థానమునందలి వివిధశాఖలలో సెల్ఫ్రిడ్జి కంపెనీయందు పనిచేయువారి సంఖ్య 1928 లో ఐదువేల మంది. తన పనివాండ్రు క్రికెట్టు, ఫుట్ బాల్, హాకీ, టెన్నిసు, నెట్ బాల్ మొదలగు ఆటల నాడుకొనుటకు వెంబ్లీలో పదునేడు యకరముల ఆటస్థలము నేర్పఱచెను. ప్రత్యేకముగ నాటకశాల, సంగీతశాల కలవు. విదేశయానము గొప్పవిద్యనొసగునని అతని నమ్మకము. కావున ఏటేట స్విట్జర్లాండు, అమెరికా, కెనడా మొదలగు ప్రదేశములకు పనివాండ్రకు యాత్రలు ఏర్పఱుపబడును.

వ్యాపారవిషయమున సెల్ఫ్రిడ్జి ఒడలుదాచక కష్టపడును. కాని ఆఫీసు తలుపులు మూయబడిన తరువాత ఇక ఆనాటికి అత డావిషయమై తలపెట్టడు. 'ఆఫీసు పనులు ఇంటికి కొనిపోవుట నాకు గిట్టదు. ఆఫీసులో ఉన్నంతకాలమును ప్రతిఒక్క నిముసమును నేనువ్యాపారమున వెచ్చింతును. వ్యాపార మనునది అద్భుతమైన సాహసకృత్యము—ప్రపంచమున దానికి మించిన వినోదము మఱియొకటిలేదు.' అని అతడు చెప్పును.

1909 లో లండనులో దుకాణము పెట్టుసరికి అతని వయస్సు ఏబదిరొక్కవత్సరములు. అంగడిపెట్టిన క్రొత్తలో మొదటి రెండువారములందును వార్తాపత్రికలలో ప్రకటించుటకు అతడు లక్షడాలర్లు వెచ్చబెట్టెను. దినపత్రికలలో పూర్తిపుట ప్రకటనలు. ఆంగ్లదేశస్థులకు అసలు అంగడిదారులని పేరు. అట్టివారి దేశమునకుపోయి వారి రాజధానీనగరమున దుకాణము పెట్టుట సాహసకార్యములలోనికెల్ల సాహసకార్యము.

మఱియు అప్పటికి లండనులోని బట్టలదుకాణములు వార్తాపత్రికలలో ప్రకటించుట ఎఱుగవు. కాని క్రొత్తగావచ్చిన సెల్ఫ్రిడ్జి లండనునందలి ప్రతివార్తాపత్రికాపాఠకునకును తన దుకాణమును పరిచయముచేసెను.

సెల్ఫ్రిడ్జి మఱియొకమార్పు కొనివచ్చెను. ఆరోజులలో లండను దుకాణములందు కొందఱు సేవకులు ప్రత్యేకించి—ఏదైన సరుకుకొనకుండువారిని బయటకు పంపివేయుటకు—నియమింపబడుచుండిరి. సెల్ఫ్రిడ్జి తన దుకాణములో ఇట్టి ప్రత్యేకసేవకులను నియమింపలేదు. మీదుమిక్కిలి కొనినను, కొనకున్నను అందఱిని ఆహ్వానింపదొడంగెను. ఎవరైన రావచ్చును. ఎంతసేపైన ఉండవచ్చును. ఏదియైన చూడవచ్చును. కొనితీరవలయునను నిర్బంధములేదు. ఇష్టమైననే కొనవచ్చును. పైగా అవచ్చినవారు సేదతీర్చికొనుటకు పడకకుర్చీలు, ప్రమాదములు సంభవించుచో జాగ్రత్తతీసికొనుటకు చిన్న ఆసుపత్రి, ఒక పుస్తకభాండాగారము, విశ్రాంతి మందిరము, ఒకబ్యాంకు, చిన్నతోట.

దుకాణముల గవాక్షముల నలంకరించుటలోగూడ నాతడు క్రొత్తపద్ధతి నవలంబించెను. ఆ దినములలో లండను దుకాణపు గవాక్షములన్నియు ఆ దుకాణమున దొరుకుసరుకుల నమూనాలతో పిక్కటిల్లియుండునవి. సెల్ఫ్రిడ్జి ఈ పద్ధతిని విడనాడెను. ముక్తసరిగ మూడు నాలుగు వస్తువులుమాత్రమే గవాక్షములందుంపబడుచుండెను. మిగిలిన వస్తువులు ప్రదర్శనపు బీరువాలయందు కపాటాలలో ఉంచబడుచుండెను.

పనివాండ్రవిషయమున ఆతడు కల్పించిన సౌకర్యములనుగూర్చి ఇదివఱకే కొంత చెప్పబడియున్నది. నేడు ప్రపంచప్రఖ్యాతి గాంచిన గ్రంథకర్తయై వ్రాలుచున్న హెచ్. జి. వెల్సు తన జీవితారంభమున నాలుగేండ్లు ఇట్టి స్టోరులలో ఒకదానియందు ఎప్రెంటిస్ గా నుండెను. ఆ రోజులలో తాను భూలోకనరకమనుభవించితినని వెల్సు పండితుడు చెప్పుచున్నాడు. ఈ భూలోకనరకమునకు విముక్తితెచ్చినవాడు సెల్ఫ్రిడ్జి. ఆ రోజులలో ఆతని వద్ద పండ్రెండువందలమంది పనివాండ్రుండిరి. విపణిమందిరమునకు బయట వారు సుఖముగ జీవించుటకు అనువైన మంచిజీతములు వారి కీయబడుచుండెను. సెల్ఫ్రిడ్జిదుకాణమున ఉద్యోగము సంపాదింప పలువురకు కాంక్షకలిగెను. లండనునందలి ఇతర అంగడివాండ్రు తమపద్ధతులను కొన్నిమార్చుకొనక తప్పినదికాదు. లేనిచో వారిపనివాండ్రు పనిమానుకొని వెడలిపోవజొచ్చిరి.

ఆశ్చర్యములేదు: లండను వర్తకులు కళ్ళుతెఱచిరి. ఈ సెల్ఫ్రిడ్జి ఎవరు? ఇచ్చటికి ఎందుకు వచ్చినాడు! ఎంతకాలము ఉండును? అమెరికాదేశమున చేయబడిన విలాసవస్తువులతో లండనును ముంచెత్తుచు పత్రికలు గొలచేయుచుండుటకై ప్రకటనధనరూపమున వానికి లంచమిచ్చుచున్నాడని సెల్ఫ్రిడ్జినిగూర్చి ఆ రోజులలో ఆంగ్లోకాంటినెంటల్ పత్రిక సంపాదకీయవ్యాసము వ్రాసెను.

లండనులో దుకాణముపెట్టుట ఒకఎత్తు. పెట్టి నిలనిలబడుట మఱియొకఎత్తు. నిలబడుటకు లండను ప్రజలను నిరంతరము తన దుకాణమునకు ఆకర్షించుచుండవలయును. ఈ ఆకర్షణవిద్య సెల్ఫ్రిడ్జికి బాగుగా పట్టువడెను. దినపత్రికలలో తన దుకాణమునుగూర్చి ఆతడు ప్రకటించుచునే యుండెను. ఇతర దుకాణదారులు దీనికి ఎంతయు కంటగించుకొనుచుండిరి.

వాయువిమానయానమున కవి ప్రారంభదినములు. వాయువిమానముపై ఇంగ్లీషు ఛానలును అతిక్రమించినవానికి డెయిలీమెయిలుపత్రిక బహుమానము ఏర్పఱచెను. బ్లేరియట్ అనువాడు ఆ బహుమానముపొందిన వార్త సకుటుంబముగ మోటారుప్రయాణము గావించుచు ఒకనాటి మధ్యాహ్నమున సెల్ఫ్రిడ్జి వినెను. వెంటనే ఆతడు డెయిలీమెయిలు కార్యాలయమునకు టెలిఫోను చేసెను: "మీ కార్యాలయమునకు నేను వేయి పౌనుల నిత్తును. బ్లేరియట్ విమానమును మా దుకాణమున ప్రదర్శింపనిండు. ఎల్లరువచ్చి ఉచితముగ చూచిపోవుటకు నేను ఏర్పాటు గావింతును." డెయిలీమెయిలు నిర్వాహకులు దీనికి అంగీకరించిరి. 1909 లో వేసవికాలమున ఒక సోమవారమునాటి యుదయమున ఆ గాలివిమానము సెల్ఫ్రిడ్జిదుకాణమున ప్రదర్శింపబడెను. చూడవచ్చినజనమునకు లెక్కలేదు. ట్రాఫిక్

కంట్రోలుచేయుటకు స్పెషలు పోలీసులు వీథులలో ఏర్పఱుపబడిరి. ఆంగ్లమహారాజ్ఞి వచ్చి వాయువిమానముతో పాటు సెల్ఫ్రిడ్జి దుకాణమునుకూడ [illegible] చుట్టి చూచెను. బ్లెరియట్ విమానము తరువాత మఱియొక బహుమానమునందిన హాకర్ విమానముకూడ అచట ప్రదర్శింపబడెను.

జార్జిసార్వభౌముని పట్టాభిషేకసమయమున రాజదంపతుల యూరేగింపుటుత్సవము జరిగెను. అప్పుడు సెల్ఫ్రిడ్జి జార్జిసార్వభౌముని బంధువులగు డ్యూక్ ఆఫ్ టెక్ యొక్క బిడ్డలనుగొనివచ్చి తన దుకాణపు మేడ ముందరిభాగమున కూర్చుండచేసెను. ఆ కారణమున ఊరేగింపు అచ్చటికివచ్చినపుడు ఆంగ్లసార్వభౌముడు ఆ అమెరికను షాపుదగ్గర శాల్యూట్ చేయవలసినవాడయ్యెను.

తొలిదినములలో దుకాణము విశేషనష్టమునకు గుఱి కాకపోలేదు. కాని కాలక్రమమున విశేషలాభప్రదమయ్యెను. పెట్టిన పదియేండ్లలో అనగా 1919-వ సంవత్సరమున అది అమ్మకము విషయమునందు లండను నందలి దుకాణములలో ద్వితీయస్థానము నందెను. ధనముకూడబెట్టుటయే ప్రధానముగ సెల్ఫ్రిడ్జి ఎంచి యుండినచో ఈపరికి అతడు జగమెఱిగిన కోటీశ్వరులలో నొకడై యుండెను. అతని సంపాదన భోగము ననుభవించెను, దివ్యభవంతులందు ఉనికి. లెక్కలేనంత మంది నౌకర్లు. తన ముగ్గురు కూతుండ్రకు పెద్దపెద్ద సంబంధములు తెచ్చెను. అల్లుళ్ళకు విశేషధన మిచ్చెను. మోటారు కారులు బాగుగ వాడుకలోనికిరాక పూర్వమే అతనికి పెక్కు మోటారుకారు లుండెను. ప్రభుత్వముల సైనిక విధానమునకూడ వాయువిమానములు విలాసవస్తువులుగనుండినప్పుడే అతడు విమానయాన మొనర్చువాడు, విమానములపై విదేశయాత్రలు గావించువాడు, వానిని కొనువాడు, దానముచేయువాడు. ఫలముగా 1926లో అతడు అప్పుచేయ వలసి వచ్చెను. ఇప్పుడాతడు తన కంపెనీకే పదిలక్షల డాలర్లవఱకు అప్పుపడియున్నాడు.

మఱియొకడైనచో ఈపరిస్థితులలో మిక్కిలి నిరుత్సాహపడును. వర్తకుల విషయమునకూడ డెబ్బదియైదవయేట అప్పులుండుట విషమమైనదే. కాని సెల్ఫ్రిడ్జి విషయమున ఇది చెల్లదు. అతడు ధనమును వ్యయము చేయు దృష్టితోడనెగాని కూడబెట్టు దృష్టితో ఎప్పుడును చూడడు. యుద్ధప్రారంభ దినములలో సెల్ఫ్రిడ్జి అందుకొక విశేషలాభము రానారంభించెను. భూవసతి సంపాదింప బుద్ధిపొడమెను. రాజభవన మాత్రముతో నాతనికి తృప్తికలుగదు. సముద్రతీరమున హెంగిస్టుబరీ అను అగ్రమునుగొని అందు పెక్కుయెకరముల తోటలు పెంచుటకు, ప్రత్యేక మొకనాటకశాల నేర్పఱచుటకు, వివిధవృత్తులవారిని అచట నెలకొల్పుటకు ముప్పదిలక్షల పౌనులు వ్యయముగాగల విధానము నాతడు సంకల్పించెను. తన కుటుంబము వివిధప్రదేశములందు విడివడియుండవలసిన అగత్యము కలుగకుండినచో అతడు దానిని ఈపరికి నెఱవేర్చియుండును.

అతని కుమారుడు గార్డన్ న కిప్పుడు ముప్పదివత్సరములు. కేంబ్రిడ్జి యందలి ట్రినిటీకాలేజిలో పట్టభద్రుడైనాడు. విమానచోదనమున దిట్ట, రూపసి. ఇప్పుడాతడు తండ్రివ్యాపారమున ప్రవేశించి తండ్రికి చేదోడు వాదోడునగుచు సెల్ఫ్రిడ్జిస్ లిమిటెడ్ ను అభివృద్ధిపఱచుచున్నాడు.

నవ్విన ఊళ్ళే పట్టణములగును. లండను నందలి హాస్యవిషయికపత్రికయగు 'పంచ్' సెల్ఫ్రిడ్జి లండను నగరమున దుకాణముపెట్టిన క్రొత్తలో అతని క్రొత్త విధానములను వెక్కిరించెను. సెల్ఫ్రిడ్జి దుకాణములో వస్తువులమ్ము స్త్రీపురుషులు - వచ్చిన ఖాతాదారులను చుట్టుముట్టి బహుమతులపై బహుమతులు కురియించు నట్లు ప్రదర్శించు ఒకపూర్తిపుట కార్టూనును (వ్యంగ్య చిత్రమును)—'మేము నిన్ను ప్రేమింతుము గావున నిట్లు చేయుచున్నాము'—అను శీర్షికతో ప్రచురించెను. అట్టి సెల్ఫ్రిడ్జి యిపుడు కాబినేటుమంత్రులతో, ప్రభువులతో, కవిపుంగవులతో, సంపాదకమహాశయులతో చెలిమిగలిగి మెలగుచున్నాడు. తనంత తాను అభివృద్ధికివచ్చి వణిక్పుంగవుడైన సెల్ఫ్రిడ్జిచరిత్ర యువకులకు ఆదర్శప్రాయమైనది, మనదేశపు దుకాణదారులు ఇందుండి గ్రహింపదగినవి అనేకవిషయములు గలవు.

ఇన్స్యూరెన్సు విషయములు

జీవిత భీమా : కొన్ని దురభిప్రాయములు

రిజర్వులను అధమపక్షము తగ్గించుటకు రెండు మార్గములున్నవి. (1) మరియొట్టిమార్గము చూపక బోనసు (లాభములను) రొక్కరూపకముగ నిచ్చుట లేక (2) బోనసుపద్ధతినే పాలిసీలనుండి పూర్తిగ తొలగించుట. ఇట్లు తొలగించినయెడల బోనసులకుగాను ప్రత్యేక రిజర్వు లక్కరలేదు. రొక్కపు బోనసు లివ్వటము ప్రజలకు నచ్చలేదు. పాలసీదారులు వీటిని రివర్షనరీ మొత్తములుగ మార్చుకొనగోరెదరు. (రివర్షనరీపద్ధతి అనగా నేమో తెలిసికొనుట మంచిది. ఈపద్ధతిక్రింద లాభములు నూటికింత నిర్ణయించి ఆసొమ్మును భీమా మొత్తములో చేర్చి క్లెయిముతో యివ్వబడును. వయసు కానుకాను, మరణకాలమున యివ్వవలసిన మొత్తము యొక్క విలువ హెచ్చుచుండును, గాన యీపద్ధతి రివర్షనరీ బోనసునిచ్చుచున్నది. ఈరివర్షనరీబోనసుల రొక్కపువిలువ వయసుతో పెరుగుచున్నది. రొక్కపు విలువ తీసుకొన్నచో, రివర్షనరీ మొత్తముకంటెను చాల తక్కువగనుండును. అందువలన ప్రజలకు 'రివర్షనరీ బోనసు' అన్న యిష్టము.) మరణసంఖ్య వయసుతో పెరుగుటవలన, అదే రొక్కపుబోనసు, వయసు కాను కాను తక్కువరివర్షనరీబోనసు నిచ్చుచున్నది. జార్జి కింగు అను గణితశాస్త్రవేత్త (అక్చుయరీ) బోనసులులేని జీవితభీమాలుండి, అపాయభారము వహించుటకు, కొంతఖర్చులకుమాత్రము, ప్రీమియములు వసూలు చేసిన చాల ఉత్తమము." అని తన అభిప్రాయమును సూచించుచున్నాడు. అయినను ప్రజలకు లాభములు గల పాలిసీలపైననో మోజాగలదు. లాభములులేని పాలిసీలు అంతగ ప్రజలకిష్టములేదు. 1908-8 సంll పాలిసీలను పరిశీలింపగా నూటికి 80 పాలిసీలు లాభములతో కూడిన పద్ధతిక్రిందను, 20 పాలిసీలుమాత్రమే లాభములులేని పద్ధతిక్రిందను, జారీచేయబడినట్లు తేలినది.

ఆపివేయబడిన పాలిసీలవలన తక్కువలాభము.

రెండవపొరపాటు అభిప్రాయమేమనగా, రద్దుకాబడిన పాలిసీలనుండి కంపెనీలు యెక్కువలాభము పొందుచున్నవి. సాధారణము పాలిసీలను యెవరును సరెండరుచేయరు. అనగా కొంత మొత్తమునకు (కట్టిన ప్రీమియములో తక్కువగనే) పాలిసీని కంపెనికి వాపసుచేయుట. ఏదో ఆపత్తుసంభవించినగాని, తొందరవలనగాని పాలిసీలు సరెండరు చేయబడవు. ఈ కారణము వలననైనను పాలిసీని సరెండరుచేయు వ్యక్తిని మనము ఆదరభావముతో చూడవలెను.

అయితే సందేహించువ్యక్తికి, కంపెనీయిచ్చు సరెండరువిలువ న్యాయమైనదని యెట్లునమ్మ చెప్పవలెను? రిజర్వుమూల్యముగురించి తెలిసిన అతనికి కొంతగ్రాహ్యము కావచ్చును. మరియొకవిధముగలదు. రాబడు ప్రీమియములనుండియే క్లెయిములివ్వవలెననియు, పిమ్మట నిలువయైన సొమ్మే రిజర్వుఫండు అనియు చెప్పుట. ఉదా: 80 సంll వయసుగలవారు కొందరు, ఒకే మొత్తమునకు మరణకాలమున యిచ్చుపట్టీక్రింద పాలిసీలు తీసుకొనిరని అనుకొందము. 10 సంllలు దాటినపిమ్మట, ఒక్కొక్క పాలిసీరిజర్వు విలువయెంతయని తెలుసుకొనవలసినయెడల, ఆపది సంllల ప్రీమియము మొత్తమునుండి, ఆపది సంllల కాలము యివ్వబడిన క్లెయిము మొత్తముపోగా, మిగిలినసొమ్మును వడ్డితోచేర్చి మరణింపగా మిగిలినవారితో భాగింపగా వచ్చునదే ప్రతిపాలిసీయొక్క రిజర్వువిలువ. ఈవిలువమాత్రమే విత

మింపగోరు పాలిసీదారునికి కంపెనీ యివ్వగల్గినది.

సరెండరువిలువ, రిజర్వువిలువకంటె తక్కువగనే యుండును. రిజర్వుమూల్యము మొత్తమును కంపెనీ యివ్వజాలదు ఇందుకు రెండుకారణములు (1) ఆరోగ్యజీవులు విరమించుటచే కంపెనీకి నష్టముకలుగును. ఆనష్టపరిహారార్థము కొంతత్రోసివేత. (2) ముందటి ఖర్చులకు వచ్చుసహాయము అపుదల అయినందున కొంతత్రోసివేత. ఏదైన సదుపాయము కలుగజేసినపుడు, సందేహముకల్గిన, ఆసదుపాయము కంపెనీకి విరుద్ధముగనే తీర్మానింపబడును. ఉదాహరణము: బోనసు యేవిధముగ పొందవచ్చుననుయిష్టము పాలిసీదారునికి వదలబడునది. పరిశీలింపగా రొక్కపువిలువ తీసుకొన్న జీవితము అత్యుత్తమముగను, ముందు కట్టవలసిన ప్రీమియములలో త్రోసివేత కోరిన జీవితములు, ఉత్తమమైనవనియు, రివర్షనరీ బోనసు కోరిన జీవితములు అంతమంచివికావని తెలిసినది. సరెండరులో ఇట్టిసదుపాయములేదు. ఏకష్టముచేనైనను సరెండరుచేయుటకు యిష్టానిష్టములతో పనిలేదు. కాని మరియొక విధముగకూడ ఆలోచింపవలసియున్నది. మరణశయ్యపైనుండు పాలిసీదారుడు, లేక తీవ్రజాడ్యముచే మరణమే శరణనియెంచు వాడును, పాలిసీని సరెండరు చేయడు. పాలిసీపై ఋణమైనచేయును ; లేక బంధుమిత్రాదుల సహాయమునైనకోరును. అనేక తరగతులుగ గల యీజీవితసమూహమునుండి (కొందరికి చక్కని ఆరోగ్యము, కొందరికి సాధారణ ఆరోగ్యము, కొందరికి చెడుఆరోగ్యము) ఆరోగ్యజీవములను తీసివేసినచో, యేమిఫలమో, అనారోగ్యజీవితములను భీమాచేసిన అంతఫలితము కలుగును. మరణసంఖ్య హెచ్చగును. కాబట్టి యీనష్టపరిహారార్థము రిజర్వు విలువనుండి కొంత తీసివేయుట సమంజసము.

రెండవది : పాలిసీలు అమలులోనున్నచో కంపెనీ ఖర్చులకు కొంతసొమ్ము వచ్చును. పాలిసీలు రద్దయినచో, వారు భరించుచువచ్చిన ఖర్చులు. సైతము మిగిలినవారిపై పడునుగదా? క్రొత్తవ్యాపారము జరిగిన యీ నష్టముపశమించునుకదా అని యడుగవచ్చును. కాని క్రొత్తవ్యాపారమునకు తగినఖర్చు వుండనేవున్నది. కాబట్టి యీనష్టమునకుగాను కొంత త్రోసివేయుట సమంజసము. కంపెనీలు సరెండరుకాబడిన పాలిసీలనుండి యెక్కువలాభము పొందుటలేదు. పాలిసీల సరెండరు విలువ ధారాళముగనగు సూచన లగుపడుచున్నవి. సరెండరువిలువ పూచీచేయబడు కాలముకూడ రావచ్చును.

జీవితభీమా : దీర్ఘజీవులు.

మరియొక పొరపాటు అభిప్రాయమేమనగా: మంచి జీవితుని నిరూపింపబడిన వ్యక్తికి ప్రత్యేక ఆదరణ చూపబడుటలేదని. నిర్ణయింపబడిన కాలముకంటె యెక్కువకాలముబ్రతికి, పిమ్మట మరణించిన కంపెనీకి నష్టముండదుకదా? అట్టిసమయమున, చాలాకాలము బ్రతుకనివారికంటె వీరికి ప్రత్యేకమైనఉపకారము చేయవలదా? జీవితభీమాసూత్రముల నెరిగినవారెవరును యీప్రకారము తలపరు. ఈ పొరపాటుకు చాలవరకు బోనసు పద్ధతి కారణముగ నుండవచ్చును. తమ మరణముచే కంపెనీకి నష్టమురానీక చాలకాలము బ్రతుకువారు, అట్లు బ్రతుకనివారికంటె హెచ్చుగ ద్రవ్యము పొందవలెనన్న, న్యాయముగ యీపద్ధతి అన్నిపాలిసీలకును సంబంధపడునట్లు చేయవలెను. పాలిసీదారుడు ఎంత దీర్ఘకాలముబ్రతికి, యెంత హెచ్చు ప్రీమియములు కట్టిన, అంత హెచ్చుగ మరణకాలమున ద్రవ్యము పొందును. అనగా ప్రతిపాలిసీదారుని వారసులు సాధారణనిధినుండి అతను కట్టిన ప్రీమియములను వడ్డీతో సహా పొందుదురు. కంపెనీపాలిసీదారునికి రక్షణయొసగుటకు బదులు, కంపెనీని పాలిసీదారుడు నష్టమునుండి తొలగించుచున్నాడు. దీనిని "జీవితభీమా" అని యనలేము. కొందరికి లాభములొనగూర్చిన, కొందరికి నష్టము కల్గించినట్లే. ఇన్సూరెన్సు కంపెనీల ప్రధానోద్దేశము, శీఘ్రముగ మరణించువారికి సహాయముచేయుటయే. వారి మరణమువలన కంపెనీలకు కలుగు నష్టము యితరులు భరించుచున్నారు. దీర్ఘజీవులు భీమాసొమ్ముకంటె ఒకవేళ యెక్కువగనే ప్రీమియములు కట్టియుండవచ్చును. అయితేవారు ముందుగ మరణించియుండిన, -ఒకకిస్తీకట్టి మరణించినను సరే- కంపెనీ భీమామొత్తము నిచ్చియుండెడిదే కదాయని విచారిం

చుచో తృప్తిపడగలరు. ఇదేవిధముగ, కొంత ప్రీమియమునకు బదులు, జీవితపర్యంతము పాలిసీదారునికి వార్షికపెన్షను యిచ్చుటకు కంపెనీ ఒప్పుకొన్నదని అనుకొందము. పాలిసీదారుడు చాలకాలము బ్రతుకుచో, అతను కట్టినసొమ్ముకంటె యెక్కువ ప్రతిఫలము పొందుచున్నాడు. అపుడు కంపెనీ పెన్షనులను ఆపివేయదలచిన పాలిసీదారుడు ఒప్పుకొనునా? ముమ్మాటికి ఒప్పుకొనడు. కంపెనీ కంట్రాక్టును జ్ఞాపకమునకు దెచ్చును.

బోనసుపద్ధతి దురభిప్రాయములకు కారణమని యిదివరకు సూచింపబడినది. 'దీర్ఘజీవులు అల్పజీవుల మేలుకుగాను కొంతద్రవ్యమీయవలసినదే. కాని, వారికి భీమామొత్తమే గాక బోనసులేల యివ్వవలెను?' అని కొందరిప్రశ్న. సమాధానమేమనగా అందుకుగాను ప్రీమియములో కొంతవసూలుచేయబడియున్నది అని. బోనసుపద్ధతి 1762 సం॥న ఓల్డు ఎక్విటబుల్ సొసైటీచే స్థాపింపబడినది. ఆ కాలమున సరియైన మరణపట్టీలు లేనందున ఎక్కువ ప్రీమియము వసూలుచేయబడుచు వచ్చెను. మూలధనము అత్యధికముగ పెరిగినందున వాటిని లాభములుగ ఆకంపెనీ పంచిపెట్టెను. అప్పటినుండి లాభయుతములగు పాలిసీలు (విత్ ప్రాఫిట్ పాలిసీస్) అన్న ప్రజలకు సంతోషము. తదుపరి సరియైన మరణపట్టీ దొరికినను, ప్రజానుకూలమునకుగాను, లాభములులేని పాలిసీల ప్రీమియము ఏర్పరచి, లాభములకింతయని చేర్చుచుండిరి. ఈపద్ధతే యిప్పుడును అమలులోనున్నది.

ప్రత్యేకప్రీమియములతత్వము.

జీవితభీమా విషయములందు సరియగు అభిప్రాయము పొందవలెనన్న ఒక వ్యక్తిజీవితమును మాత్రమే పరకుగొనక, భీమాచేసిన జనసమూహము నాధారముగ తీసుకొనవలెను. ఈ "సగటు" ఫలితములే ముఖ్యములైనవి. లేనిచో అనేకములగు పొరపాటు అభిప్రాయములు కలుగును. ఒకపాలిసీదారుని కిస్తీ, అతని కుటుంబములో క్షయవుండినందున, 5 సం॥ హెచ్చుగ వసూలు చేయబడినదనుకొందము. అతను ముసలియగువరకు బ్రతికినచో, ప్రత్యేకప్రీమియమును తీసివేయమని కోరును. కాని ప్రత్యేకప్రీమియములు, జనసమూహము ననుసరించి యోచింపవలసియున్నది. మొదట వారివారి ఆరోగ్యము ననుసరించి, కంపెనీడాక్టరు సలహాపై హెచ్చు ప్రీమియములు వసూలుచేయబడును. అప్పటినుండి కాలముగడుచుకొలది కొందరు వ్యాధిపీడితులగుదురు. కొందరు మరణింపవచ్చును. కొందరు ఏరోగములేక ఆరోగ్యవంతులుగ నుండవచ్చును. 'సగటున' హెచ్చుకాలము బ్రతికినవారు 'సగటు' కాలముకంటె ముందుగ మరణించినవారికి సహాయముచేయవలెను. వైద్యుడే పొరపాటుపడియుండవచ్చును, కాని ఒకవ్యక్తి యేరోగము లేక దీర్ఘకాలము జీవించినందునే అతని అభిప్రాయము తప్పనుట పొరపాటు.

క్షయవలన మరణము 50 సం॥ దాటిన తగ్గును కాబట్టి, హెచ్చుప్రీమియమును తగ్గింపవలెనని కొందరు కోరుదురు. కాని ప్రసవమువలె, ఫలానపుడు రోగము నశించునని గట్టిగ చెప్పలేము. రెండవది జీవితపర్యంతము హెచ్చుగ కట్టవలసిన ప్రీమియముకంటె, 50 సం॥ వరకు కట్టవలసిన ప్రీమియము చాల హెచ్చుగనుండును. అందువలన ఆహెచ్చు ప్రీమియమును కట్టలేరు.

జీవితభీమా ముఖ్యావసరము.

'జీవితభీమా ముఖ్యావసరము కాదు, అది ఒక ఐశ్వర్యసూచకము' అని మరికొందరు తలచెదరు. లోకులకు జీవితభీమా చాల ముఖ్యావసరము. ఐశ్వర్యమని ఎంచుటకుబదులు అనేకులకు అది అవసరమనియే యెంచవలసియున్నది. ఏకొలదిమాత్రులకో మాత్రము ఇది ఐశ్వర్యకారణము. లోకములో ఏయిరువురు ఒకతీరుననుండరు. ఒకవిధముగ తలపరు. కాబట్టి వారివారికి తగినట్లు, వెంటవెంటనే ప్రజల సందేహములను తీర్పవలెను. సందేహముకల్గుటకు అవకాశమివ్వకూడదు. సరియగు సమాధానమిచ్చుటకు, కంపెనీప్రతినిధి యిన్స్యూరెన్సువిషయములనెల్ల చక్కగ గ్రహించియుండవలెను. పాండిత్యము, సమయోచితప్రవర్తన, ఓపిక, ధైర్యము, మొదలగు సద్గుణములుగల ప్రతినిధి విజయలక్ష్మినిచేపట్టగలడు.

—ఆలూరు రామచంద్రయ్య, బి.ఏ.

ఆరోగ్యవిజ్ఞానము

౬. అరటిపండ్ల ఆహారము విలువ

బాగుగాపండనిస్థితిలో అరటిపండు తినుచో అది పేగులకుపట్టి కడుపునొప్పి కల్గించును. కాని అరముగ్గిన అరటిపండు సులభముగా జీర్ణమగుటయే గాక గొప్ప ఆహారపు విలువనుకూడ కలిగియున్నది. ఆరోగ్య భంగము కలుగకుండ అరటిపండును చిన్నతనమునుండియు తినుటకు అలవాటుచేసికొనవచ్చును. అరటిపండు ఇష్టములేనివారు సకృత్తుగనుందురు. ఆహారపు విలువలోగాని, సులభముగా జీర్ణమై శరీరమున చేరుటలోగాని అరటిపండుతో మఱి ఇతరఫలములు దొరయజాలవనుట నిశ్చయము. ఇంతకును అరటిపండ్లు ఇతర ఫలములవెలలతో పోల్చిచూచినపుడు కారు చౌక అనియే చెప్పవలసియున్నది. మెసాచుసెట్సునందలి ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ యస్. జి. ప్రెస్కాట్ అరటిపండునుగూర్చి ఇట్లు చెప్పుచున్నాడు: 'బాగుగాముగ్గిన అరటిపండులో మానవశరీరమునకు కావలసిన సర్వవిధములైన ఆహారపదార్థములును కలిసియున్నవి. క్రొవ్వుపదార్థములు, ప్రొటీనులు కొంచము కొఱవడియున్నమాట సత్యమేగాని అరటిపండ్లు పాలతో కలిపి తీసికొనుచో ఆరెండింటి మేళవింపును సమగ్రమైన ఆహారమును కలిగింపగలదు.'

౭. నారింజపండ్లు : ఆరోగ్యము

ఉత్తమమైన ఫలజాతులలో నారింజపండు ఒకటి. జీర్ణశక్తిని కలిగించి దేహపుష్టిని పెంపొందించి మంచి ఆరోగ్యమును నిలుపుటలో నారింజకు సాటియగు ఫలము వేఱొకటిలేదు. నారింజపండ్లయందు మంచి మధురపదార్థముగలదు. అది జీర్ణకోశమున విశేషకాలము ఉండనక్కఱలేకనే దేహమునందంతటను వ్యాపించగలదు. జీర్ణకోశమునకు విశేషశ్రమ కల్పింపకయే దేహపుష్టికరమైన ఆహారపదార్థమును ప్రసాదించువానిలో నారింజ అత్యుత్తమమైనది. క్రొవ్వుపట్టి విశేషమైన బలుపు పుట్టింపకయే పుష్టిచేయుగుణము నారింజ పండ్లలో విశేషముగలదు కావున దీనిని ఎల్లరును నిరభ్యంతరముగ వాడవచ్చును. నారింజపండ్లు చిన్న పిల్లలకు ప్రత్యేకముగా వరణీయమైనవి. ఏమన అందు ఎముకలు, దంతములు మున్నగునవి వర్థిల్లుటకు వలసిన లోహసంబంధమైన లవణములు విస్తరించియున్నవి. ఎదిగెడు కాలమున పిల్లలకు వారిఎముకలను, దంతములను వర్థిల్లజేయు ఆహారపదార్థములుగల నారింజపండ్లను విరివిగా ఈయవలెను. కొద్దిరో గొప్పరో అన్నిరకముల విటమినులు నారింజపండ్లలో కలవుగాని ముఖ్యముగా సి. విటమిను విశేషముగగలదు. సి. విటమిను ఆరోగ్యమును పెంపొందించి స్కర్వీవ్యాధిని నివారించును. రోగముగా ఎదుగక మందకొడిగానుండు పిల్లలకు నారింజపండ్లను ఆహారముగా ఇచ్చుచో వారు త్వరత్వరగా కండపట్టి చుఱుకుదనమును కలిగి ఒప్పుదురు. సి. విటమిను శరీరమున విశేషకాలము నిలిచియుండదు. తేలుచు క్రొత్తగా శరీరమునకు సి. విటమిను సరఫరా కావలసియుండుచుండును. వండినచో సి. విటమిను విలుప్తమైపోవును కావున వంటపదార్థములవలన సి. విటమిను శరీరమునకు కలుగజాలదు. పచ్చి ఆహారమును తినియే శరీరమునకు వలయు సి. విటమినును మనము కలిగించుకొనవలసియున్నది. అట్టి పచ్చి ఆహారములలో నారింజపండ్లు మేలైనవి. నారింజపండ్లు మలబద్ధమును తొలగించి ప్రేగులు వానిధర్మము నవి చేయునట్లు చేయగలవు. నారింజపండ్లలో కొంత మురికపదార్థము కూడగలదు. మలకోశమును శుద్ధముచేయుటకు అది సమర్థమైనది. నారింజపండ్లు రుచికి పుల్లగానున్నను

జీర్ణకోశమున క్షారగుణమును అందుచున్నవి. తమ రక్తమునకు క్షారగుణమును సంపాదించుకొనదలచువారు ముఖ్యముగా ఈపండ్లను తినవలసియుండును. భోజనమునకు భోజనమునకు నడుమ చేకొనదగు పానీయములలో నారింజపండ్లరసము శ్రేష్ఠమైనది. నారింజరసము ద్రవపదార్థమైనను ఆహారపువిలువగలది. అయితే ఇతర ఆహారపదార్థములవలె ఇది జీర్ణకోశమునకు విశేష పరిశ్రమను కల్పించుటగాని, ఆకలిని మందగింపచేయుటగాని గావింపదు. దినక్రమమున నారింజఫలములను సేవించువారి నేత్రములు తేజమును గ్రక్కును, వారి వదనము ఆకర్షణీయమై యుండును, విశేషపరిశ్రమకు వారు తట్టుకొనజాలియుందురు, ఎల్లవేళలవారు విలాసవంతులై యుందురు. రోగస్థితిలోనున్నవారికిని, తిరిగి ఆరోగ్యమును పొందుచున్నస్థితిలో నున్నవారికిని ఇది ప్రత్యేకవరణీయములు. నారింజపండ్లు జీర్ణకోశమునకు పనికల్పింపకయే శరీరపుష్టి నొసగి దేహమునందలి జలభాగమును పెంచి మలమూత్రముల విసర్జనమునకు సాయపడి ఆరోగ్యభాగ్యమును కల్గించును.

౬. దంతములు : ఆహారము : ఆరోగ్యము

సుప్రసిద్ధదంతవైద్యుడగు డాక్టరు జె. మెన్సీస్ కాంప్‌బెల్ మాట్లాక్ నందలి న్యూహెల్త్ సొసైటీవారి వేసవిపాఠశాలయందు 'దంతములు : ఆహారము : ఆరోగ్యము' ఈమూడును ఎట్లు అన్యోన్యాశ్రితములై ఉన్నవో వివరించుచు ఇట్లు ఉపన్యసించినాడు : "ప్రపంచములోని వివిధదేశములందు ఆహారవిషయకపరిశోధనలవలన దంతములను పరిరక్షించు పదార్థములను కొన్నిటిని ఏర్పుటకు వీలుకలిగినది. ఫలములు, పచ్చిఆహారము, సమముగవండబడిన ఆహారము, పాలు, వెన్న, గ్రుడ్లు దంతములను అమోఘముగ పరిరక్షించును. ఈ పదార్థములు జీర్ణమైనతరువాత క్షారసంబంధమైన బూడిదను కల్పించును; మాంసము, పప్పుదినుసులు పులుపు సంబంధమైన బూడిదను ఏర్పరచును. మనశరీరములందు పులుపుపాలు హెచ్చినచో ప్రకృతి మన ఎముకలనుండియు దంతములనుండియు లోహసంబంధములైన లవణములను లాగికొనును, అందుచే ఎముకలు, దంతములు తమఆరోగ్యమును గోలుపోవును. మనము దినదినము తిను ఆహారములో విశేషభాగము దంతములకు అంటుకొను మెత్తదనమును కలిగియున్నది. దినదినము బ్రష్షుతో దంతములు తోముకొనుట అత్యవసరమైయున్నది. శరీరమున కలుగుచుండు మార్పులను నోరు భారమితియంత్రమువలె చూపగలదు. రోగము శరీరము నిరోధింపగలిగినదో లేక శరీరమే రోగమునకు లొంగినదో చెప్పగలుగుటకు దంతముల కంటియుండు చిగుళ్ళస్థితి కూడ ఒక సాధనమని మనము తెలిసికొనుచో దంతముల విలువను మనము సులభముగ ఊహించుకొనవచ్చును."

౭. నీరుల్లిపాయలు దీర్ఘాయువునిచ్చును

ఆజన్మము ప్రతిదినము భోజనములో కలిపి పచ్చి నీరుల్లిపాయలను తినుటకలవడిన ఒకానొకస్త్రీ నూట ఇరువది వత్సరములు జీవించి ఈనడుమ చనిపోయినది. మెక్సికో నగరమునకు ఏడువందల మైళ్ళదూరమునందున్న కోహూలారాష్ట్రమునందలి టోరియాన్ నగరమున ఆమె నివసించుచుండెను. ఆమెనామము సీనోరా తోమసగార్జా. చనిపోవువఱకును ఆమె మంచి ఆరోగ్యవంతురాలై యుండెను. తుదివఱకును ఆమె సర్వాంగకములును తృప్తికరముగా వానివిధులను నిర్వర్తించుచుండెను. చనిపోయినఆమెయొక్క చుట్టములు పురపాలకోద్యోగులయెదుటపెట్టిన కాగితములవలన ఆమె 1812 లో టోరియాన్ చెంతగల ఒకపల్లెలో జననమొందినటుల తెలియుచున్నది. ముగ్గురభర్తల క్రమమరణానంతరము ఆమె నాలగవభర్తను చేపట్టినది. అతడు ఇప్పటికిని జీవించియున్నాడు. చనిపోవుదినమువఱకును ఆమె రోజుకు మూడుపూటలయందును ఆహారమును గొనునది. ప్రతిభోజనములోను ఆమె పచ్చినీరుల్లిపాయలను విరివిగా తినునది. ఆమె దీర్ఘాయువునకు ఈ నీరుల్లిపాయలు తినుటయే కారణమైయుండునని ఆమె బంధువులు పలువురు చెప్పుచున్నారు. నీరుల్లిపాయల మంచిగుణములనుగూర్చి లోగడ ఆంధ్రభూమిలో ఈ శీర్షికక్రింద వివరించియున్నాము. క్రిమిసంహారకములగుటయేకాదు నీరుల్లిపాయలు ఆయుర్వృద్ధికరములు కూడ నైయున్నవి.

శ్రీ



ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.



మహిళాలోకము

బర్మాదేశపు స్త్రీలు

[లండనునుండి ప్రచురింపబడు డెయిలీ హెరాల్డు పత్రికలో బర్మాదేశపుస్త్రీ శ్రీమతి మేయూంగుకన్య వ్రాసిన వ్యాసమున కనువాదము]

ప్రపంచమునందలి మఱియే దేశమునందును బర్మాదేశమునందువలె భార్యాభర్తలు అన్యోన్యములగు హక్కులయందు సమానత్వమునందియున్నారని చెప్పుటకు వీలుచాలదు. మాదేశమున వివాహమనిన ప్రతివిషయమునందును భార్యాభర్తలు సమానభాగస్వాములనియే యర్థము. వివాహము మాదృష్టిలో కేవలము సివిల్ కంట్రాక్టు, అన్యోన్యము సమ్మతినంది చేసికొనిన ఏర్పాటు. ఒకస్త్రీయు, ఒకపురుషుడును ఒండొరులను ప్రేమించుకొనుచున్నట్లు తెలిసికొనిగాని; ఒండొరుల కూడికవలన దక్కు దంపతులుగాగుట గ్రహించిగాని వారుభార్యాభర్తలుగ ఒకచోట నివసించుటకు అంగీకరింతురు. అంగీకరించి ప్రత్యేకగృహమును ఏర్పఱచుకొందురు.

ప్రత్యేకగృహమును ఏర్పఱచుకొనుట అనగా బర్మాదేశమున ప్రత్యేకబాధ్యతను వహించుటయే. పూర్వకాలమున బర్మాదేశమున సర్కారువారు పన్నులను విధించుటకు కుటుంబమును ఒకయూనిట్టుగ చేకొనియుండిరి. ప్రత్యేకగృహమును ఏర్పఱచుటయనగా పన్ను ఇచ్చుకొనుటకు మఱియొకయూనిట్టును కల్పించుటయన్నమాట. అగుటచే బర్మాదేశమున వివాహమై ప్రత్యేకముగా గృహమును ఏర్పఱచుటయనగా వ్యక్తిపరముగాను, ప్రభుత్వపరముగాను ఒక ముఖ్యవిషయమగుచున్నది.

బర్మాదేశమున ప్రతివిషయమునందును దంపతులు భాగస్వాములు. వివాహానంతరము భర్త ఆర్జించుదానియందుకాని, పొందువారసత్వమునందుకాని భార్యకు సమానభాగముకలదు. అట్లే వివాహానంతరము భార్య ఆర్జించుదానియందుకాని, పొందు వారసత్వమునందుకాని భర్తకు సమభాగముకలదు. వివాహమునకు పూర్వము వారివారికి ఉండుచున్న ఆస్తి వారివారి సొంతమైయుండును. వివాహితస్త్రీల ఆస్తి హక్కుచట్టమనునది మీదేశమున ఇపుడుగలదు. మాకట్టి చట్టము లేకపోయినను చట్టముకంటె బలవత్తరమైన ఆచారము అట్టి ఆస్తి, హక్కువిషయమై మాకు సకలసౌకర్యములను కలిగించుచున్నది. భార్యాభర్తలలో ఏ ఒక్కరు చేసిన వ్యాపారమైనను ఇరువురిపేరుమీదుగ జరుగవలసినదే. ఒక ఇల్లుకొనుటకాని, ఒక తనఖాదస్తావేజు వ్రాయుటకాని చేయవలసియున్నచో భార్యాభర్తలిరువురును దానిమీద సంతకము చేయవలసియుండును.

ఎట్టి రహస్యములనైనను భార్యాభర్తలు ఒకరినుండి ఒకరు దాచుకొనరు. ఈకారణమున ఇల్లుఅనిన ఇల్లాలికి ఎక్కువప్రేమ యుండును. భార్యాభర్తలకు గృహజీవితమున అభిమానము హెచ్చుగనుండును. భార్యగను, మాతగను గృహమున స్త్రీ మగనితో సమానమైన హక్కులను, బాధ్యతలను, గౌరవమును కలిగియుండును. పంటలుచెడి కుటుంబపుటాదాయము తగ్గిపోయినపుడు స్త్రీలు ఆర్థికపుచిక్కు కొంతవఱకు ఎడ

లించుటకై ఏదైన చిన్నవర్తకమును చేయుదురు. అట్టి సమయములందు మాదేశపుస్త్రీలు చిన్నదుకాణములను పెట్టుదురు. లేదా తాము అమ్మదలచిన వస్తువులను తమ పరిచితులకు, స్నేహితులకు విక్రయింతురు. ఎటులైన నేమి అవసరమువచ్చినపుడు కుటుంబపుటాదాయము యొక్క అభివృద్ధికి భర్తతోపాటు తానుకూడ సాయపడుట తనవిధియని బర్మాదేశపుస్త్రీ తలంచును. కావున మగని ఆర్జనయొక్క యథాస్థితి భార్యకు సర్వదా తెలిసియుండును. భార్యాభర్తల స్థితిలోగల ఈ సమానత్వము వారి అన్యోన్యతకు చాలవఱకు తోడ్పడుచున్నదని నా అభిప్రాయము. భార్యాభర్తలలో హెచ్చుతక్కువలులేవు, అనుమానములులేవు. వ్యాపారము, కష్టము, సుఖము, ఆనందము—వీని అన్నిటియందును భార్యాభర్తలు సమానభాగస్వాములు. మాదేశమున దాంపత్యసుఖమునకు దోహదముచేయు మతియొక విషయమునుగూర్చి చెప్పవలసియున్నది. బౌద్ధమతస్థుడగు బర్మీయుడు వీలునామావ్రాయుట తన మతమునకు ఎదురుతిరుగుట. తనమరణానంతరము తనఆస్తిని గూర్చిన ఏర్పాటులు గావించుకొనుట కాతనికి హక్కులేదు. వారసత్వవిషయమై ప్రత్యేకచట్టములుగలవు. సొంతముగా ఆస్తిగలభార్య ముందుగా చనిపోవుచో ఆ ఆస్తిఅంతయు భర్తకు సంక్రమించును. భర్తముందుగా చనిపోవుచో అతనిసొంతఆస్తిఅంతయు భార్యకు సంక్రమించును. తల్లిదండ్రుల మరణానంతరము ఆస్తి బిడ్డలకుచేరును. బిడ్డలులేనియెడల వారసులకుచెందును.

దంపతులలో ఎప్పుడును భేదములుండనే ఉండవని నేను చెప్పుటలేదు. భేదములుకలుగుటకలదు. కలుగుట లేకుండుమాత్రముకాదు. సాధారణముగ వివాహములు సుఖవంతములైయుండు బర్మాదేశమునుకూడ వివాహస్వర్గమనుటకు వీలులేదు. భార్యాభర్తలు అన్యోన్యము కలహించుచో ఏమిజరుగును? ఒండొరులు సమ్మతించి ఎట్లు వివాహము గావించుకొనిరో అట్లే ఒండొరులు సమ్మతించి విడాకులు ఇచ్చుకొనవచ్చును. భార్యాభర్తలలో ఏఒక్కరి తప్పువలననైన విడాకు అవసరమైనచో తప్పుచేసినవారు తమఆస్తిలో కొంత నష్టపోవలసియుందురు. మాదేశమున విడాకులు విశేషము అవలంబింపబడవు. పైన నేను పేర్కొనిన కారణములవలన మాదేశమున ఎందఱో ఆలుమగలు ఒండొరులను నమ్మి తలంగని ప్రేమతో, తొలగని అభిమానముతో సంసారసుఖముల నందుచున్నారు. విడాకు పొందుట సులభమేయైనను దానినిపొందుట ప్రజాభిప్రాయమున విపరీతమును, విరుద్ధమును అయియున్నది.

మగవానికంటె తాను లొచ్చుఅను అభిప్రాయము బర్మాస్త్రీకి ఎప్పుడును ఉండదు. మగవానితో సరిసమానమైనదానను భావము ఆమె కుండుటచే ఆమె జీవితానుభవమున విశేషవిజ్ఞానమును, పొందుటకును నిరభ్యంతరముగ బయటతిరుగుటకును, అవసరమగుచో తనబ్రతుకు తాను బ్రతుకుటకును అవకాశములు గలవు. ఇట్టి అవకాశములుండినను ఉండుటచే బర్మాస్త్రీలు గృహప్రేమనుండి విచ్యుతులై యుందురనుటకు బొత్తిగా వీలులేదు. ఇచట ఇంగ్లండునందుకంటె మాసంసారములు పెద్దవి. మాఇండ్లయందు దాయాదులు, మేనత్తలు మున్నగు బంధువులుకలసి నివసించుటకలదు. ఇంటిపనులలో చేదోడగు ఇతరస్త్రీలుండుటచే గృహయజమానురాలగు తల్లి గృహేతరకార్యములందు జోక్యముకలిగించుకొని కార్యనిర్వహణదక్షత్వము సంపాదించుటకు చక్కనివీలు కలుగుచున్నది.

స్త్రీపురుషుల సమానత ఒక్క భార్యాభర్తల విషయమునసే కాదు. మాదేశమున మగపిల్లలను ఎక్కువగను ఆడపిల్లలను తక్కువగను చూడము. పర్వదినములందు మేమందరము పెగోడాకు వెళ్ళుదుము. స్త్రీలు, బాలికలు ఆఉత్సవములందు పురుషులు,బాలురు వీరితో సమానముగ పాల్గొందురు.

బర్మాయందు స్త్రీ ప్రత్యేకవ్యక్తి. ఆమె చేయు కృత్యములకు ఆమెయే బాధ్యురాలు. కాబట్టి వివాహమైనతోడనే ఆమె ఒకనికి బానిసకాదు. ఆమె ఆమెయే. మాదేశమున వివాహపుటుంగరములు ధరించు ఆచారములేదు. వివాహపుటుంగరములధారణ వ్యక్తిత్వమునకు లోపమనియు, సమానత్వమునకు కొఱతయనియు మాతలంపు.

తంజావూరు సరస్వతిమహాల్ గ్రంథాలయము

మదరాసు ప్రభుత్వమువారి పుష్కలధనమునకు నోచిపుట్టి, బ్రౌనుదొర మొదలగు మహనీయుల సేవా సౌభాగ్యమునంది పరిపుష్టిని గాంచిన మదరాసు ప్రాచ్య లిఖితపుస్తకభాండాగారమున సంస్కృతమునందు 22 270 తాళపత్ర గ్రంథములుగలవు. ఇన్ని సంస్కృత తాళపత్రగ్రంథములుగల లిఖితపుస్తక గ్రంథాలయము ప్రపంచమునందు మఱియొచ్చటనులేదు. దీనిని ఈ విషయమున మించిన గ్రంథాలయము మనదేశమునందే మఱియొకటిగలదు. దీనికంటె అది వయస్సున మూడు నాలుగుశతాబ్దులు పెద్దది. అందలి సంస్కృత లిఖితపుస్తకముల సంఖ్య 24,432. గ్రంథముల బహుళసంఖ్యయందే గాక వాని అమూల్యతయందును ఈభాండాగారము ప్రపంచమునందలి సంస్కృతలిఖితపుస్తకభాండాగారములకు తలమానికమగుచున్నది. అది కావేరీతీరమున తంజాపురమునందు మహారాజ శరభోజి సరస్వతి మహాల్ గ్రంథాలయము అను నామముతో విలసిల్లుచున్నది.

అపూర్వములును అమూల్యములును బహుళములును అగు తాళపత్రగ్రంథములుగల గ్రంథాలయములలో ప్రపంచమున అద్వితీయమైన తంజావూరునందలి మహారాజ శరభోజి సరస్వతిమహాల్ గ్రంథాలయమునకు పదునారవ శతాబ్దియందు తంజావూరు రాజధానిగా చోళదేశమును మహనీయముగ పాలించిన ఆంధ్రనాయకరాజులే సంస్థాపకులని చెప్పవచ్చును. తెలుగులిపి యందును, గ్రంథలిపియందును వ్రాయబడియున్న సంస్కృతాంధ్రతాళపత్రగ్రంథములను కూర్చి ఆనాయక రాజు లీగ్రంథాలయమును పెంపొందించిరి. పదునెనిమిదవశతాబ్దిలో మహారాష్ట్రు లీదేశమును జయించిరి. ఆమహారాష్ట్రరాజులు ఈగ్రంథాలయాభివృద్ధి విషయమున శ్రద్ధధానులై క్రొత్తగ్రంథములను చేర్చుచువచ్చిరి. ఆ మహారాష్ట్రరాజులలో నొకడగు శరభోజి 1820-30 సంవత్సరములనడుమ కాశీపట్టణమును సందర్శించినప్పుడు ఈగ్రంథాలయమునకు పెక్కుపుస్తకములను చేర్చెను. శరభోజితరువాత రాజ్యమునకువచ్చిన శివాజి మఱికొన్ని గ్రంథములను చేర్చెను. అప్పటినుండి మొన్నమొన్నటివఱకును ఈ గ్రంథాలయమునకు క్రొత్త గ్రంథమేమియు చేర్పబడలేదని చెప్పవచ్చును.

1868-వ సంవత్సరమున ఇండియాప్రభుత్వమువారు హిందూదేశమునందలి వివిధగ్రంథాలయములందుగల సంస్కృతగ్రంథములకు ప్రతులు వ్రాయించుట మున్నగు విషయములందు శ్రద్ధవహించి సంస్కృతగ్రంథముల కేటలాగు తయారుచేయుటకు దొరకొనిరి. ఇండియా ప్రభుత్వమువారిట్లు దొరకొనుటవలన మదరాసు ప్రభుత్వమువారి దృష్టి ఈ గ్రంథాలయముపై ప్రసరించెను. వివిధవిషయములకు చెందినవి, వివిధభాషలకు చెందినవి అగు పెక్కుగ్రంథము లీ గ్రంథాలయమున నుండుట తెలియవచ్చెను.

ఇండియాప్రభుత్వమువారి ఆదేశానుసారము మదరాసు ప్రభుత్వమువారు తమకళాశాలలో సంస్కృతాధ్యాపకుడుగనున్న పిక్‌ఫర్డును తంజావూరు వెళ్ళి అచటి గ్రంథములకు కేటలాగు తయారుచేయుటకు నియమించిరి. అతడు రెండుసంవత్సరములు పనిచేసి రోగగ్రస్తుడై 1870 లో మాతృదేశమగు ఇంగ్లండునకు వెడలిపోయెను.

అందుమీద 1871 లో ప్రభుత్వమువారు జిల్లా జడ్జిగానున్న డాక్టరు బర్నెల్‌ను తంజావూరు గ్రంథాలయమునందలి సంస్కృతగ్రంథములకు కేటలాగు తయారుచేయ నియమించిరి. విశేషమైన పరిశ్రమగావించి యాతడు అచటి సంస్కృతగ్రంథముల కేటలాగును తయారుచేసెను. ఆకేటలాగు 1880 ప్రాంతమున లండనులో మూడు సంపుటములుగ ప్రచురింపబడెను.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౭౦ తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయమునందలి ఆంధ్రగ్రంథవివరణపట్టిక.

ఇట్టిగ్రంథము ఒకటి ప్రచురింపబడుట ఆంధ్రులు చిరకాలమునుండి వాంఛించుచున్నారు. ఉదకు ఆంధ్రవిశ్వవిద్యాలయము వారు మాటదక్కించుకొనిరి. తంజాపూరు సరస్వతీమహల్ గ్రంథాలయములోని సంస్కృత గ్రంథములకు వివరణపట్టికను తయారుచేసినవిద్యాసాగర ప్రొఫెసర్ పి. పి. యస్. శాస్త్రిగారే ఈ ఆంధ్రగ్రంథ వివరణపట్టికను కూడ తయారుచేసిరి. ఈ పట్టికయందు 816 వ్రాతగ్రంథములను గూర్చిన వివరణగలదు. పద్యకావ్యములు, ద్విపదకావ్యములు, శతకములు, దండకములు, యక్షగానములు, నాటకములు, వచనకావ్యములు, శాస్త్రగ్రంథములు. ఇట్లు సారస్వతము నందలి వివిధశాఖలకుచెందిన అమూల్యగ్రంథముల వివరణములతో ఈపట్టిక విలువగలదిగాయున్నది. ఇందు ముద్రితగ్రంథములను పేర్కొనునవసరమున వావిళ్ళవారి కేటలాగును, బ్రిటీషుమ్యూజియము వారి తెలుగు అచ్చుపుస్తకములపట్టికను మాత్రమే ఆధారముగ గొంటిమని సంపాదకులు చెప్పుచున్నారు. ఈ విషయమున మీరు ఆంధ్రపత్రికా కార్యాలయమునుండి ప్రచురింపబడిన ఆంధ్రవాఙ్మయసూచికను చూడకుండుట శోచనీయమని చెప్పవలసియున్నది. రఘునాథనాయకుని వాల్మీకిచరిత్రయు, గోపప్రధానుని కృష్ణార్జునసంవాదమును అముద్రితములుగా ఈ పట్టికయందు పేర్కొనబడినవి. వాల్మీకిచరిత్ర చిత్రాడ అముద్రితాంధ్రగ్రంథసర్వస్వము వారిచేతను, కృష్ణార్జునసంవాదము హైదరాబాదు గోల్కొండ పత్రికా కార్యాలయమువారిచేతను ముద్రితములై యున్నవి. సుగ్రీవవిజయమును రచియించినయతడు 'గుణరుద్రకవి' అని ఈపట్టికయందు చెప్పబడినది. నిరంకుశోపాఖ్యానకర్తయగు కందుకూరి రుద్రకవియే ఈతడు. 'శోవిద స్తవనీయగుణ రుద్రధీరవిరచిత సుగ్రీవవిజయాభిధాన' అని గద్యమునందుండుటచే సంపాదకులు 'శోవిద స్తవనీయ-గుణరుద్రధీర' అని విపరీతముగ విఱిచి చదివిరి. వావిళ్ళవారి కేటలాగులో నిరంకుశోపాఖ్యానముగలదు. దానికవి రుద్రకవి అని అందు ప్రస్ఫుటముగగలదు. అయినను ఈ ప్రమాదము కలుగుట శోచనీయమైనదే. గ్రంథవిస్తరభీతిచే ఇంకను పలుప్రమాదములుచూపక విడనాడుచున్నాము. విశ్వవిద్యాలయమువారి విశిష్టపరిశీలనమున ప్రచురింపబడిన గ్రంథమున ఇట్టి ప్రమాదములు దొరలుట ప్రతిష్ఠాకరముగానిది. గ్రంథము రాయలుసైజున 400 పుటలు. వెల రు. 2-0-0. ఆంధ్రవిశ్వవిద్యాలయప్రచురణములలో నిది పదునొకండవది.

౭౧. బసవరాజు అప్పారావుగీతములు

బెజవాడ అప్పారావు మెమోరియలు కమిటీ వారిచే ప్రకటితము. నేటిభావకవులలో అప్పారావు చిరప్రతిష్ఠ నార్జించినవాడు. ఈతని కవితావస్తువులందు వివిధత్వముగలదు. కవి దేశాటనప్రియుడనుటకును, పుణ్యక్షేత్ర సందర్శనోత్సుకుడనుటకును ఈగ్రంథమునందలి పెక్కు ఖండకావ్యములు అమోఘనిదర్శనములై యున్నవి. ఈతడు దేశమునుఱుకని కవియనుటకు గాంధినిగూర్చి వ్రాసినగీతములు దృష్టాంతములు. నోము, స్వరాజ్యలక్ష్మి పెండ్లి, ఆంధ్రవీధి, గోపికాగీతలు మున్నగునవి సారస్వతమున శాశ్వతముగ నిలచియుండగలవని మానమ్మకము. బ్రతికియుండగా ఈకవిని మనము ఆదరింపలేకపోయితిమి. అతనిస్మృతిముద్రణముగా ప్రచురింపబడిన ఈగ్రంథమునైన విరివిగాకొలకుతీసి ఆలోపము నిపుడైన ఒకభంగి నీగికొన ఆంధ్రమహాజనులు ప్రయత్నింతురుగాక. గ్రంథముద్రణము సుందరముగనున్నది.

కాగితముపైజున ౨౦౦ పుటలు. వెల అణాలు ఎనిమిది మాత్రమే. అప్పారావు కవిత్వమును గూర్చి మేము లోగడ ప్రస్తావించియుంటిమి. గావున ఇచట విస్తరింప లేము. ప్రతులకు: గోవిందరాజు వేంకటరామారావు, గవర్నరుపేట, బెజవాడ అని వ్రాయవలెను.

22. సౌందర్యమంజరి

అభినవభావకావ్యము. కవిశేఖర కాశ్యకూరిగోపాలరాయప్రణీతము. ప్రకాశకులు: విశాలాంధ్రదీపోవారు; 4, ఆచారప్పన్ సందు, జార్జిటవును, మదరాసు. 1. సంకల్పము, 2. శక్త్యుపాసన, 3. భావోపాసన, 4. రసోపాసన, 5. మన్మథోపాసన, 6. కుమారీస్వయంవరము, 7. కృతిసమర్పణము అను ఏడువిభాగములు గలవు. ఈకావ్యమునకు గుణవిశిష్టమైన ఉపోద్ఘాతమును వ్రాయుచు శ్రీశేశోద్ధారక విశ్వదాత నాగేశ్వరరావు పంతులుగారు 'సౌందర్యమంజరి గంభీరమైన భావకావ్యము. విశ్వసౌందర్యధ్వని గుణబద్ధమైన కావ్యము. సౌందర్యమంజరిలో పాదపాదమునందును ధ్వనియుక్తమైన భావభావారససయోగానందము ప్రతిధ్వనించుచున్నది. గోపాలరావుగారు ప్రాచ్యపాశ్చాత్య సంస్కారమును రూపభావదాంపత్యమును దేహాత్మకల్యాణమును బాహ్యభావతంత్రయోగమును శక్తిపరమేశ్వర సంయోగమును ప్రకృతిపురుషవిలాసమును శృంగారాసంతయోగరూపమైన సౌందర్యమంజరీకావ్యమునందు సార్థకముచేయుటకు చేసిన సంకల్పోపాసనములు సరసములు. కావ్యరచనయందు వేదాంత మంత్రయోగశాస్త్రములు కావ్యాలంకారికశాస్త్రములు ప్రకృతిశాస్త్రములు కొందలగు శాస్త్రార్థములు రససమ్మేళనమునుబొందిన విధము ప్రశంసనీయము' అని నుడివియున్నారు. సాహిత్యప్రియులు శ్రీవిక్రమదేవవర్మ మహారాజులుంగారు సభాముఖమున ఈకృతిని ప్రతిగ్రహించియుండుట యొకవిశేషము. గ్రంథముద్రణము సుందరముగను, బైండింగు ఆకర్షణీయముగను ఉన్నది. అంటిక్ కాగితములు. క్రౌనుసైజున 64 పుటలు.

23. అమరావతి.

శిల్పకళాసరస్వతికి నాట్యమందిరమై ప్రాతికి చెల్లయాంధ్రుల పూర్వవైభవమును నేటికిగూడ ఆంధ్రులకు చాటు చూరగొమ్మ అయియున్న అమరావతీనగరమును వర్ణించుతేటగీతముల శతకము. జాతీయపునరుద్ధారణదీక్షాదినములనదగిన ఈ దినములలో ప్రాక్తనవైభవమును స్మృతికెలయించు ఇట్టి గ్రంథములరచనమును, ప్రచురణమును వాంఛనీయమైనది. కావున ఏతద్గ్రంథకర్తలగు శ్రీకర్లపాలెం కుటుంబశాస్త్రి బి. ఏ. గారిని మేము అభినందించుచున్నాము. ఈ గీతపద్యకదంబము పలువురు ఆంధ్రులచే పఠింపబడునని నమ్మెదము. వెల 0-2-0. ప్రతులకు తెనాలియందలి శ్రీ కొమ్మూరి కాశీవిశ్వనాథముగారికి వ్రాయవలయును.

24. సహకారిమిత్ర. తెలుగు సంవత్సరాది పండుగ సంచిక. (నెల్లూరు)

తెలుగువారి సహకారవారవార్తాపత్రికయగు సహకారిమిత్ర తెలుగు సంవత్సరాది పండుగకు ప్రత్యేక సంచికప్రచురించుట ఎంతయు ప్రస్తుతింపదగి యున్నది. మదరాసు ప్రావిన్షియలు కో ఆపరేటివ్ బ్యాంకి భవనచిత్రము, సహకారనాయకశేఖరులు శ్రీయుత వేమవరపు రామదాసుపంతులుగారు మున్నగువారి ఛాయాచిత్రములతో సంచిక పరిపుష్టినొంది ఎంతయు ఒప్పిదమైయున్నది. ఆంధ్రసహకారపత్రికల చరిత్ర; జపాన్ దేశ సహకారోద్యమము, సహకారోద్యమము: కొన్నిసూచనలు, బకాయిబాకీవసూళ్ళు, కొన్నిసలహాలు, రష్యాదేశమునందలి సహకారోద్యమము, సహకారసంఘపరిస్థితులు అను విషయగౌరవముగల వ్యాసములతో ఈ సంచిక నిండారియున్నది.

25. ఐరావతిపత్రిక ఏడవ వత్సరాది సంచిక.

రంగూను ఆంధ్రులవారపత్రికయగు ఐరావతిపత్రికను 1928-వ సంవత్సరమున స్థాపించి నిర్వహించుచున్న వెలగల వెంకటరెడ్డిగారు రంగూనువీడి స్వదేశమునకు వచ్చుసందర్భమున ఐరావతిపత్రిక చేతులుమారినది. పత్రికను రంగూనునందలి రెడ్డియువజనసంఘమువారు చేకొనిరి. ఫిబ్రవరి 24-వ తేది శనివారమున ప్రచురితమైన ఐరావతిపత్రిక ఏడవసంపుటపు తొలిసంచిక పరిశీలనముక్రింద నే ప్రచురింపబడి పూర్వమార్జించిన తన

ప్రతిష్ఠకు ఏమాత్రమును కొఱవడనీకిని అలరారుచున్నది. వివాకతి పలువత్సరములు మని రంగూనాంధ్రులను మహోన్నతముగ సేవించుగాక యనికోరెదము.

౭౬-౭౭-౭౮. నూతనవత్సరపంచాంగములు

మదరాసు ఆంధ్రపత్రికాకార్యాలయము వారును, తెనాలినివాసులు శ్రీకొమ్మూరి కాశీ విశ్వనాథము గారును, బెజవాడ ఆంధ్రప్రావిడెంటు కంపెనీ వారును ఆంధ్రభూమియందు నెవరుంచి వారువారు ప్రచురించిన నూతనవత్సరపంచాంగములను అనుగ్రహించిరి. ఇందులకు మేము వారి కెంతయు కృతజ్ఞులము. ఆంధ్రపత్రికా కార్యాలయము వారి పంచాంగము చివుకుల వెంకటరమణశాస్త్రి, కుప్పా విశ్వపతిశాస్త్రిగార్లచే గుణింపబడినది. మాసము మాసమునకు గ్రహస్ఫుటములు చెప్పబడినవి. ఆంధ్రప్రావిడెంటు కంపెనీ వారు ప్రచురించిన పంచాంగము శ్రీ గొట్టిముక్కల సుందరరామశాస్త్రి సిద్ధాంతి గారిచే గుణింపబడినది. ఇందు విశేష విషయములు గలవు. శ్రీ కాశీవిశ్వనాథము గారు ప్రకటించిన పంచాంగమున కాలవివరణము గంటలలో గలదు. ఈ రెండు పంచాంగములది జేబునందిముడుచిన్న సైజు.

క్రొత్త పత్రికలు

౧౮. విశాఖపత్రిక

ఆంగ్లాంధ్రభాషలలో ప్రతిబుధవారము విశాఖపట్టణమునుండి ప్రకటింపబడు వారపత్రిక తొలిసంపుటవు తొలిసంచిక భావసంవత్సరాదినాడు (మార్చి 16-వ తేదీని) వెలువడెను. స్వవిషయమున ఇట్లు తెలుపబడెను: "విశాఖపట్టణము భరతఖండముననే గాక ఖండాంతరమునగూడ దినదినప్రవర్ధమానమగు ప్రాముఖ్యము సముపార్జించుచున్నది. వివిధకక్షలు స్వార్థపరత్వకళంకితములగుటచేత ఆంధ్రరాష్ట్రనిర్మాణ మింతవఱకు శాఖాచంక్రమణముగనున్నను, తన్నిర్మాణ మెంతయు యావశ్యకమైయున్నది. విశాఖపత్రిక యిట్టి సమయమున ప్రభవించినది." విశాఖపట్టణము కొలదికాలములో ఆంధ్ర మహానగరము కాగలదు. ఆంధ్రవిశ్వవిద్యాలయ మచట నెలకొనినకారణమున విద్యార్థులకు పలువురకు అది కాపురపుకాణాచి యగుచున్నది. వారివిజ్ఞానము దేశజాలకందించుటకు 'విశాఖ' చక్కని వాహిక కాగలదు. మా పత్రికాలీల మలంకరించుచున్న తొలి, మలి సంచికలలో మునిసిపల్ సెల్ఫుగవర్నమెంటును గూర్చియు, గ్రామపునరుద్ధరణమును గూర్చియు మంచి వ్యాసములు గలవు. పలువత్సరములు జీవించి విశాఖపత్రిక ప్రజాసేవ చేయునుగాక యనికోరెదము. సాలుచందా రూ 4-0-0.

౧౯. వైద్యప్రదీపిక

ది హెరిడిటరీ ఆయుర్వేదిక్ డాక్టర్సులీగు పక్షమున గుంటూరునుండి వెలువడు మాసపత్రిక. ప్రధాన సంపాదకులు ప్రొఫెసర్ డి. రంగాచార్యులు గారు. ఇంకను పలువురు ఆయుర్వేదవిశారదులు పత్రికానిర్వహణమున శ్రీ ఆచార్యులవారికి తోడ్పడుచున్నారు. వైద్యమునకు విజ్ఞానమునకుతోడు అనుభవము కూడ ప్రధానమైనది. అనుభవవైద్యమున సిద్ధహస్తులగు అనువంశికాయుర్వేదవైద్యుల విజ్ఞానమునకు ఈ వైద్యప్రదీపిక ప్రదర్శనశాలగానుండగలదు. విమర్శనార్థము మాకు పంపబడిన తొలి సంపుటవు మూడవసంచికలో ఆయుర్వేదము యొక్క నిజస్థితిని గూర్చి డీవి రంగనాథాచార్యులుగారు వ్రాసిన వ్యాసము చదువదగినది. అనుభూతప్రక్రియలు, హితాహితములు బాగున్నవి. వైద్యలోకవాగ్గులు విజ్ఞానదములు. సాలుచందా రూ. 2-0-0

౨౦. తెలుగు ప్రేమప్రచారక్.

ఆంధ్రసత్సంగసంఘపక్షమున వి. రామబ్రహ్మము బి. ఏ. గారిచే .భీమవరమునుండి ప్రచురింపబడుచున్న మాసపత్రిక. మార్చిమాసమున వెలువడిన మొదటి సంపుటవు ఏడవసంచిక విమర్శనార్థము మాకు పంపబడినది. ఇందు సత్యమగు సత్సంగమువలన కలుగు లాభమేమి? భక్తిమార్గము: తపస్సు; భక్తిస్వభావము; వాస్తవమగు మతమొక్కటియే; మానవసేవ చేయుటకు ముందంజ వేయుడు అను వ్యాసములుగలవు. చిత్తమునకు సంస్కారమును, హృదయమునకు ఉత్తేజమును కలిగించు వ్యాసములతో ఒప్పారుచున్న ఈ పత్రిక ఆంధ్రమహాజనుల ఆదరణకు పాత్రమగుగాక. సాలు చందా రూ. 1 4-0

సంపాదకీయ సమాలోచన

స్టార్ ఆఫ్ ఇండియా అస్స్యూరెన్సు కంపెనీ:-

ఆంధ్రులయాజమాన్యమున విశేషాభివృద్ధికివచ్చిన వ్యాపారసంస్థలలో స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియలు అండు జనరల్ అస్స్యూరెన్సుకంపెనీ ఒకటియని నిరాఘాటముగ చెప్పవచ్చును. ఈకంపెనీ మానేజింగు ఏజంట్లు శ్రీయుత యం. యస్. ఆర్. ఏ. గుప్త అనువారు. వీరు వైశ్యులు, యువకులు. వైశ్యులనుటచే వీరి వ్యాపారకౌశల్యమును, యువకులనుటచే వీరి కార్యదీక్షను పోల్చుకొననగును. విద్యాపూర్తియైనతోడనే వీరు ఆంధ్రయువకులు పలువురివలె ఉద్యోగమునకై అన్వేషింప దొరకొనలేదు. దేశముయొక్క ఆర్థికసంపత్తికి తోడుపడు భీమావ్యాపారముపై దృష్టినిలిపిరి. ఫలముగా 1928-వ సంవత్సరమున స్టార్ ఆఫ్ యిండియా అస్స్యూరెన్సు కంపెనీ పుట్టువు నొందినది. అప్పటికి గుప్తగారు ఇరువదియెనిమిదేండ్ల యువకులు. ఉత్సాహకార్యశక్తులకు అవధి లేకుండెను. అప్పుడు ఈ కంపెనీలో బీదసాదలకు ఎల్లరకు అందుబాటుననుండు ప్రావిడెంటుభీమావ్యాపారమే చేయబడుచుండెను. 1933-వ సంవత్సరము జనవరి మాసమున జీవితభీమావ్యాపారము కూడ ప్రారంభింపబడెను. దేశము ఆర్థికమాంద్యమను భల్లూకపు పిడికిటిలో కిటకిటమనుచున్న ఆసంవత్సరమున పదునారులక్షల రూపాయలకు ప్రొపోజలుల్సు సంగ్రహింపగలిగిరనినచో ప్రజాలోకమున ఈసంస్థయందును, దీని నిర్వాహకులయందును ఎంతటి నమ్మకము, అభిమానముగలదో సువ్యక్తమగును. సంగ్రహింపబడిన ప్రొపోజల్సునందు సుమారు నాలుగులక్షలరూపాయల విలువగల ప్రొపోజల్సు అంగీకరింపబడినవి. అందు సుమారు పదునొకండులక్షల రూపాయిల విలువగలవి పోలసీలై పట్టాలనుపొందినవి. ఆర్థికమాంద్యవు వీరవిహారమునకు ఉక్కిరిబిక్కిరి యగుచున్నకాలమున ఒక్కసంవత్సరములో సుమారు పదునొకండులక్షల రూపాయిల విలువగల పోలసీలను కూర్చగలుగుట కంపెనీ నిజముగా గర్వింపదగిన విషయము. భారతభీమావ్యాపారమున నిది యొక గొప్పవిషయమని చెప్పవచ్చును. ఈ కంపెనీయొక్క ఇట్టి విశేషాభివృద్ధికి ప్రధానకారణము శ్రీగుప్తగారి వ్యాపారనైపుణ్యమును, విశాలహృదయమునని మాతలంపు. ఈ సంచికయందు వేఱొకతావున కీర్తింపబడిన వణిక్పుంగవుడు గార్డాన్ సెల్ఫ్రిడ్జి తనపనివారలకు సౌకర్యములుకూర్చ శ్రద్ధాళువై యుండినరీతినే శ్రీగుప్తగారును తమ కార్యాలయోద్యోగుల ఉపయోగార్థము ప్రత్యేకమొక క్లబ్బును స్థాపించి నిర్వహించుచున్నారు. తమ కంపెనీ ఏజంట్లయెడ వీరు కనుపఱచు సౌజన్యము, వారికష్టసుఖములందు వీరికిగల సానుభూతి వెల్లడిలోనికివచ్చియేయున్నవి. ప్రారంభముననే ఇంతటి విశేషవ్యాపారమునుగూర్చి కంపెనీ భావియభివృద్ధికి మంచి పునాదివైచిన శ్రీగుప్తగారి యాజమాన్యమున 'స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరలు అస్స్యూరెన్సు

కంపెనీ' హుటాహుటి నడలతో అభివృద్ధి నందిఆంధ్రులు చూచుకొని సంతోషింప గల పెద్ద సంస్థలలో నొకటియై వెలయుగల దని విశ్వసించుచున్నాము.

ఆర్యబాలసమాజము: పెదపాలెము:—

తెనాలి తాలూకా పెదపాలెమునందలి ఆర్యబాలసమాజమువారి ఇరువదియెనిమిది సంవత్సరములచరిత్ర - నివేదిక మాకార్యాలయమునకు పంపబడినది. గ్రంథాలయోద్యమము తలయెత్తని దినములలో 4-7-1౯05 లో శ్రీయుత పుతుంబాక సీతారామయ్య గారిచే ప్రారంభింపబడి వాగ్వర్ధినీసభలు, భజనలు, పురాణపఠనము, ఉపన్యాసములు, పత్రికాపఠనము, రాత్రిపాఠశాల, గ్రంథాలయము మున్నగువానిచే గ్రామవాసులను సేవింపుచు ఆర్యబాలసమాజము విజ్ఞానవ్యాప్తికి తోడ్పడుచున్నది. ఆంధ్రదేశమునందలి ప్రతియొక్క గ్రామమున ఇట్టిసమాజ మొకటియుండినచో దేశమున మూగియున్న విజ్ఞానము విచ్చిపోగలదు. ఈ సమాజమునకు ప్రాణమనదగిన శ్రీయుత పుతుంబాక సీతారామయ్యగారు దేశీయుల కృతజ్ఞతకు పాత్రులు కాదగినవారు

సేవాశ్రమము: పెదపాలెము:—

'గ్రామపునర్నిర్మాణము, గ్రామపునర్నిర్మాణము' అను కేకలేగాని దానికి తగుమైన ఆచరణసాధ్యమైన విధానమును ఉపదేశించు వారు లేకున్నారు. పెదపాలెమునందలి పుతుంబాక శ్రీకృష్ణయ్యగారు మొదలగు యువకులుకూడి నడుపుచున్న సేవాశ్రమముయొక్క కార్యవిధానమును గమనించితిమేని గ్రామపునర్నిర్మాణము నడుపవలసిన మార్గములు సువ్యక్తమగును. స్వదేశవస్తువిక్రయశాల, వ్యవసాయశాఖ, విద్యాలయము, సేవాదళము, గ్రంథాలయము, మున్నగువానిని ప్రసాదించి సేవాశ్రమము వారు పెదపాలెము యొక్క వాససౌకర్యమును పెంచుచున్నారు. ఇట్టిసంస్థల ఉనికి పెదపాలెమును ఆదర్శగ్రామముగ నొనర్చుచున్నది.

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సుకంపెనీ:

భీమావిషయిక సారస్వతసృష్టి:—

మదరాసురాష్ట్రమునందలి భీమాకంపెనీలలో వయస్సుచేతను, వ్యాపారము చేతను పెద్దదైన వానిలో యునైటెడ్ ఇండియా లైఫ్ అస్యూరెన్సుకంపెనీ ఒకటి ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావుపంతులు, ఆంధ్రకేసరి టంగుటూరిప్రకాశముపంతులు మొదలగు ఆంధ్రమహాశయుల సేవాసౌభాగ్యము ఈకంపెనీహొందియున్నదనుటచే దీని ప్రతిష్ఠయందు ఆంధ్రులుకూడ భాగస్వాములైయున్నారనుట తెలిసికొనవచ్చును. చిరప్రతిష్ఠితమగు ఈకంపెనీ ఇపుడు భీమావిషయికసారస్వతసృష్టికి దోహదమీయ సంకల్పించుట సముచితముగనున్నది. భారతదేశమున భీమావిషయికసారస్వతము విశేషముగ లేదు. ఉన్నకొద్దిపాటి సారస్వతమును ఆంగ్లమున గలదు. దేశభాషలలో అది లేనేలేదని చెప్పవచ్చును. తెలుగున భీమాసారస్వతమును పెంపొందింప 'ఆంధ్రభూమి' యందు మాసముమాసము కొన్ని పుటలను ప్రత్యేకించుచున్నాము. యథోచితములగు వ్యాసములు సంపాదించుట చాలకష్టముగనున్నది. భీమావిషయములను ఆంగ్లమున వ్రాయునంత సులువుగ తెలుగున వ్రాయుటకు వీలులేదు. పారిభాషికపదములు లేవు. తెనుగునందును, ఆంగ్లమునందును సమానమైన పాండిత్యముగలిగి భీమావ్యాపారానుభవము గల

వారు పూనుకొనుచో ఈవిషమస్థితి కొంత తొలగునని చెప్పవచ్చును. విజయాంధ్ర జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ మేనేజింగు డైరక్టరులును, ఆంగ్లాంధ్రభాషాకోవిదులును అగు శ్రీయుత దరిశి చెంచయ్యగారు లోగడ 'వాసవి' పత్రికలో ఇన్సూరెన్సును గూర్చి కొన్ని చక్కని వ్యాసములు సులభగ్రాహ్యబోధకములైనవి ఆంధ్రమున వ్రాసియున్నారు. ఇపుడు వారికి అట్టివ్యాసరచనావ్యాసంగమునకు పూర్తిగా తీరికచాలకున్నదని మాతో చెప్పియున్నారు. భీమావ్యాపారమున నున్నవారికి తీరికయుండనిమాట నిజమే. ఇతరులు వ్రాసిన వ్యాసములలో అనుభవవిజ్ఞానము మేళవింపునొందదు. ఇట్టి స్థితిలో - ఆంగ్లమున నేయగుగాక - యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీవారు భీమావిషయికసారస్వతసృష్టికి దోహదముచేయుచు భీమావిషయక వ్యాసములకు ఏటేట బహుమానము లీయ నిశ్చయించినది యెంతయు శ్లాఘాపాత్రముగనున్నది. విద్య, ఉత్సాహము భీమావ్యాపారానుభవముగల ఆంధ్ర యువతులును ఆంధ్ర యువకులును మదరాసు నందలి యునైటెడ్ ఇండియాలైఫ్ ఇన్సూరెన్సు కార్యాలయము వారికి వ్రాసి ఈ వ్యాసరచనయందలి నియమములను తెలిసికొని అందు పాల్గొందురుగాక అనికోరెదము. బహుమానముపొందిన ఈ వ్యాసములను వివిధదేశభాషలలోనికి అనువదించుటవలన వానియందు భీమావిషయికసారస్వతము పుష్టినొందును.

ఆంధ్రఇన్సూరెన్సుకంపెనీ స్వగృహప్రవేశం:

భావసంవత్సరప్రభావము ఆంధ్రులకు శుభప్రదముగనుండు సూచన లగుపడుచున్నవి. భావసంవత్సరాదినాడు ఆంధ్రునిఆంగ్ల దినపత్రికయగు స్వరాజ్యపత్రిక మదరాసునందు స్వగృహమును సంపాదించుకొని అందు ప్రవేశించినది. అనంతరము ఆంధ్రమహాశయులగు సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు మదరాసురాష్ట్రపు లామెంబరుగ నియమింపబడిన శుభవర్తమానము వింటిమి. పిమ్మట ఉన్నతోద్యోగభాగ్యము నందిన నేటి ఆంధ్రపుత్రులలో నొకరగు శ్రీ శొంఠి రామమూర్తిగారి సోదరులగు కామేశముపంతులుగారికి కలప పరిశోధనకై వైస్రాయి బహుమానము ఒసంగబడిన వార్త వినవచ్చినది. శుభము వెంటశుభము. ఆంధ్రుని వ్యాపారసైపుణ్యమునకు అమోఘనిదర్శనమైయున్న ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ స్వగృహమున ప్రవేశించినదనుశుభవార్త. ఆంధ్రుని వ్యాపారచరిత్ర ఆంధ్ర ఇన్సూరెన్సుకంపెనీ స్వగృహమున ప్రవేశించిన మార్చి 30-వ తేది ఒక ముఖ్యమైన తేదీకాగలదు ప్రారంభింపబడి పట్టుమని పదియేండ్లయినను కాక పూర్వమే స్వగృహమును సంపాదించుకొనిన భీమా కంపెనీలు హిందూదేశమున మిక్కిలి తక్కువగాగలవు. అటిచో తొమ్మిదేండ్లవయస్సుగల ఆంధ్ర ఇన్సూరెన్సుకంపెనీ స్వగృహమును సంపాదించుకొనినదనుట దాని కార్యనిర్వాహకుల ప్రజ్ఞకు, ప్రతిభకు మానదండము కాగలదు.

దాగుకొనుమాటల పజిల్ సమాధానము

1. వారణాసి. 2. నాగరము. 3 అభిమన్యుడు. 4. చిలుక. 5. వరూధిని. 6. త్రయోదశి. 7. నన్నయ. 8. గౌతముడు. 9. వల్లభాయి. 10. పరమాన్నము.

పోటీచేసిన పలువురిలో ఈ క్రింది మువ్వురే సరియైన సమాధానము పంపిరి. నిర్ణీతబహుమానము వారికి పంచిపెట్టబడును.

1. వెలువోలు సీతారామయ్యచౌదరిగారు, అమృతలూరు.
2. దామరాజు సుబ్బారావుగారు, మునిపల్లె.
3. టి. యస్. రాములుగారు, బి.ఏ., పూనా.



ఫిబ్రవరి, ౧౯౩౪

౨౦:—బొబ్బిలి రాజాగారి 34-వ వర్ధంత్యుత్సవము.

౨౩:—వేలూరు. జబ్బుగా నుంట వలన పూచీకత్తునిచ్చి అయ్యదేవర కాళేశ్వరరావుగారు విడుదలైరి.

౨౫:—విశాఖపట్టణము. బి.ఏ.—బి.యస్. సి ప్యాస్ కోర్సులను పెట్టుటకు ఆంధ్రసిండికేటు తీర్మానము.

మార్చి, ౧౯౩౪

౧:—నెల్లూరు. వ్యవసాయికపరిశ్రామిక వస్తుప్రదర్శనము.

౪:—విశాఖపట్టణము. స్వదేశవస్తుప్రదర్శనము మహర్షి బులుసు సాంబమూర్తిగారు తెరచిరి.

౬:—శ్రీబొబ్బిలి రాజాగారు మరి మూడేండ్లు ఆంధ్ర విశ్వవిద్యాలయముయొక్క ప్రోఛాన్సెలరుగ నామినేటు చేయబడిరి.

౧౦:—నెల్లూరు. దివానుబహదరు జె. వెంకటనారాయణనాయుడుగారు వెంకటగిరి దివానుపదవికి రాజీనామానిచ్చినపిమ్మట దివానుగా నియమింపబడిన శ్రీయుత ఎస్. శేషగిరిరావు నాయుడుగారు రాజీనామానిచ్చిరి.

౧౧:—నెల్లూరు. తిక్కన జయంతి సందర్భమున డాక్టర్ కే. యస్. కేసరిగారు శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారిని వేయిన్నూటపదార్లతో సన్మానించిరి.

౧౩:—మదరాసు. తాలూకా బోర్డుల రద్దుబిల్లును మద్రాసు గవర్నరుగారు ఆమోదించిరి.

౧౪:—రాజమండ్రి. చెలికానివాడ వెంకటనరసింహం, కేతవరపు లక్ష్మీనరసింహారావుగార్లకు చెరినాలుగు నెలలు శిక్ష.

౧౫:—ఢిల్లీ. కొండి శామేశంగారు బి. ఇ. ఎం. ఇ. ఐ. ఎం. ఇ. డేరడూను అడవిశాఖ పరిశోధనాలయమున కలప సంరక్షణశాఖ ఉద్యోగిగ నున్నవారికి 1932-33 సంవత్సరపు వైస్రాయి బహుమతి ఈయబడెను.

:—మదరాసు. స్వరాజ్య పత్రికా నూతన గృహప్రవేశము.

౧౬:—నాగపూరు. ఆంధ్రులు శ్రీ. కె. ఎస్. నాయుడుగారు మధ్యరాష్ట్రమున మంత్రులయిరి.

౧౭:—విశాఖపట్టణము. రావు సాహేబు జయంతి రామమూర్తి పంతులుగారు మరణించిరి.

౧౯:—మదరాసు. సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు లా మెంబరుగ నియమింపబడిరి.

౨౦:—ఆంధ్రవిశ్వవిద్యాలయములో భౌతిక శాస్త్ర పండితులుగానున్న శ్రీయుత డాక్టరు ఇచ్ఛాపురపు రామకృష్ణారావుగారు ఎం. ఏ; పి. హెచ్. డి. లండన్ విశ్వవిద్యాలయము వారిచే డి. ఎస్. సి. డిగ్రీని నూతనముగా బడసిరి.

౨౧:—మదరాసు. శాసనసభలో పి. వి. కృష్ణయ్య చౌదరిగారు ఓడరేవును రేవుపట్టణముగ నిర్ణయింప కోరిరిగాని ప్రభుత్వము సమ్మతింపలేదు.

౨౨:—బొంబాయి. డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యగారిపై తేబడిన కేసు బందరు మేజస్ట్రేటుకోర్టులో విచారణజరుగుచుండగా పట్టాభిసీతారామయ్యగారిచ్చిన స్టేటుమెంటును ప్రకటించినందులకు బొంబాయిక్రానికలు ముద్రాపకునకు 9 నెలల కఠినశిక్ష, 2000 జుర్మానా విధింపబడి యుండెను. అపీలులో హైకోర్టువారు 9 నెలల కఠినశిక్షను ఒక నెల విడి ఖయిదుగా మార్చిరి.

పుస్తక పజ్‌ల్. పోటీబహుమానము —రూ. 10—



ఇందు 16 బొమ్మలును, కొన్ని పుస్తకముల పేర్లును కలవు. ఏబొమ్మకు ఏపేరు వర్తించునో కనిపెట్టి, కూపనులో వ్రాయవలెను. ఉదాహరణము: 11. శాకుంతల. కూపను కత్తిరించి 20-4 34 తేదీలోపుని 2 అణాల తపాబిళ్ళలతో ఆంధ్రభూమికి పంపవలెను. సరియైన సమాధానములు సంపాదకుని వద్ద ఒకసీలు కవరులో ఉంచబడినవి. మై మాసపు సంచికలో అవి ప్రచురించబడును. వాటితో సరిపోవునట్లు పంపిన వారికి 10...రు. బహుమాన మీయబడును. షరా:—సమాధానములు యీ అచ్చు కూపన్ల మీదనే వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు పనికిరావు. ఒక్కొక్కరు ఎన్ని కూపన్లయినను పంపవచ్చును. ఒక్కొక్క అచ్చు కూపనుకు ప్రవేశరుసుము 2 అణాలు. అదనపు కూపనులు వ్రాతవి పంపు నప్పుడు, ఒక్కొక్క దానికి 4 అణాల చొప్పున ప్రవేశరుసుము పంపవలెను.

పుస్తకముల పేర్లు.

(సమాధానములన్నియు యీ పేర్లలోనే ఉన్నవి.)

శాకుంతల—కుమారసంభవము—తులాభారము—చిత్రాంగి—మృచ్ఛకటిక—వలపు—శంకరవిజయము—లీలావతీసులోచన—కపాలకుండల—తొలిబిడ్డ—కమలినీకలహంస—వరూధిని—కంఠాభరణము—జాగిలము—వేణీసంహారము—దమయంతి—మేఘసందేశము—మణిమాల—తారాశశాంక—ఉషఃకాలము—చంద్రగుప్త—మధుసేవ—కుముదిని—పద్మినీపరిణయము—

కూపను

1	2	3	4
5	6	7	8
9	10	11 శాకుంతల	12
13	14	15	16

సంపాదకుని తీర్పును అంగీకరింతును.

పేరు.................................. విలాసము..................................

అమృతాంజనము



వారు యేమిచెప్పుచున్నారో చదువుడు!

"ది ఇండియన్ మెడికల్ వరల్డు"

(ఇండియన్ మెడికల్ అసోసియేషనువారి జర్నలు)

ప్రధానసంపాదకుడు : సర్ నీల్‌రతన్ సర్కార్, యం.ఏ.,యం.డి.

సం. 1. ఏప్రిల్, 1926 నం. 2.

అమృతాంజనము శాంపిల్సు మాకందినవి.

ఈమందునందలి వివిధవస్తు సమ్మేళనము మాకు తెలియదుగాని దీనిని వాడిన వారివలన మేము వినిన పెక్కు-క్లినికల్ రిపోర్టులనుబట్టి దీనిని నొప్పుల నివారణమునకు విదేశములనుండి తెప్పింపబడు మందులకు ప్రత్యామ్నాయముగా నిరభ్యంతరముగ వాడవచ్చునని మేము నమ్ముచున్నాము.

కోట్లకొలది విక్రయము. అన్నిచోటులయందు అమ్మబడును.

సోల్ ఏజెంటు :
ఎ. బి. ఫెరెఖు,
మదరాసు.

అమృతాంజనండిపో,
బొంబాయి, మద్రాసు, కలకత్తా.

[టెలిగ్రాము : లీవర్ మద్రాసు] [టెలిఫోను నెం. 8139]

ఈ ట్రేడుమార్కును గుర్తింపుడు.

డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి ప్రసిద్ధిచెందిన లీవర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్.



అద్వితీయము !

అసమానము !

నకిలీమందులను విసర్జింపుడు.

"చికిత్సావిధానమున ఒక క్రొత్తమందు."

"మృత్యుముఖమునుండి వేలకొలది శిశువులను రక్షించినది."

"రోగనిరోధమునకు కూడ సాటిలేని మందు."

పిల్లలకు

కడుపులో బల్ల, గడ్డ, గుల్మం, వాయువు మొదలగు లీవర్ అండు స్ప్లీను (యకృత్ ప్లీహ) అన్నివిధములైన వ్యాధులకు లోకప్రఖ్యాతిచెందిన డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి దివ్యౌషధమును ఉపయోగింపుడు. పిల్లలకు లీవర్ అండ్ స్ప్లీను వ్యాధులు రాకుండా చేయుటయే కాక ఆకలి, జీర్ణశక్తులను వృద్ధిపరచి మలబద్ధము లేకుండా కాలవిరేచనము సరిగా అవుటకును, రక్తమును శుభ్రపరచుటకును కూడ తగిన ఔషధరాజము.

హెడ్ ఆఫీసు : 8, సాలై వీధి, మైలాపూర్, మదరాసు.

బ్రాంచి ఆఫీసు : 128, హారిసాన్ రోడ్డు, కలకత్తా.



If your Children *suffer from* LIVER & SPLEEN COMPLAINTS *start giving them to-day*

JAMMI VENKATARAMANAYYA'S

FAMOUS LIVER & SPLEEN SPECIFICS

8, SALAI STREET, MYLAPORE, MADRAS.